# కథ 2023 - 2024

## ముల్కనూరు సాహితీ పీఠం – నమస్తే తెలంగాణ కథల పోటీ

# కథ 2023 – 24

**ముల్కనూరు సాహితీ పీఠం – నమస్తే తెలంగాణ కథల పోటీ**

**KATHA**

Mulkanooru Sahithee PeetamNamaste Telangana

Kathala poti


**Published : 2025**

**Cover Art : Mallibhat Vasu**

**8555 905 965**

Book Design : Vinod.M, Hyd

For Copies : Amazon.in

All leading Book stores in TG, AP

**PRICE : Rs 450/-**

www.mulkanoorlibrary.in

# మన కథాక్షరం.. అక్షరం..


**శ్రీనివాసులు వేముల**

**ముఖ్య సలహాదారు**

**ప్రజా గ్రంథాలయం, ముల్కనూరు సాహితీ పీఠం.**




***ఐదు వసంతాల పవిత్ర క్రతువు..***

***కలకాలం సుగంధించే సృజనాత్మకతకు నెలవు..***

*మనం అనుకున్న గమ్యానికి ఒక్క సంవత్సరమైనా చేరుతామా? లేదా? అనే మీమాంస నుంచి ఐదు సంవత్సరాలు సాగిన అందమైన కథా ప్రయాణం మాకు గొప్ప సంతృప్తినిస్తుంది. ముల్కనూరు సాహితీ పీఠం - నమస్తే తెలంగాణ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ క్రతువుకు రచయితలే యాగ్నికులు. పాఠకులే యజమానులు. తెలుగు కథ తల్లికి మకుటాన్ని తొడగడం మాకు దక్కిన అదృష్టం. ఇది మాకెళ్లప్పుడూ చెప్పలేని ఆనందం.*

*ఈ ఐదేండ్లలో సుమారు నాలుగు వేల కథలు వచ్చాయి. వాటిలో నుంచి మా న్యాయ నిర్ణేతలు సుమారు 300 కథలకు బహుమతుల ద్వారా పట్టం కట్టారు. ఈ యజ్ఞంలో సుమారు ఎంతో మంది లబ్ధప్రతిష్టులైన కథకులే కాకుండా.. మొదటి సారి రాసిన కథకే బహుమతి పొందిన యువ కథకులు కూడా పాలుపంచుకున్నారు. సమాజ బాగులో కీలకంగా మారే సాహిత్యపు పాత్ర చెప్పాల్సిన అవసరం లేదు. నేటి తెలుగు సాహిత్య ప్రపంచంలో కథకే పెద్ద పీట. పదినిమిషాల్లో కథను చదివిన పాఠకుడు పది కాలాల పాటు కథావస్తువును, శైలిని గుర్తుంచుకుంటే ఆ కథకు, కథకునికి సార్థకత. కథ 2023 - 24లో అలాంటి కథలు అనేకం.*

*మొదటి బహుమతి పొందిన 'అమ్మచిరునామా' అమ్మగొప్పతనాన్ని ఎవరెస్ట్ శిఖరానికి చేర్చింది. ఎముకల గూడు లాంటి బిడ్డను కంటికి రెప్పకంటే ఎక్కువగా కాపాడుకుంటున్న ఆ పేద తల్లి ఆర్తి పాఠకుల్ని కదిలించే కథ. రెండో బహుమతి పొందిన 'ఇసుక తైలం'.. ఓ*

ఆటో డ్రైవర్ జీవితాన్ని అక్షరీకరిస్తూ.. గల్ఫ్ లో ఉన్న తన భార్య కష్టాలను, ఒక పేద కుటుంబ పరిస్థితులను ఆవిష్కరించింది. ఒక మిలంతి కలలో రచయిత మల్లీపురం జగదీశ్ చక్కటి రచనాశైలిలో మిలంతి అందమైన మనసును ఆవిష్కరించారు. ఒకేదేశంలో రెండు దేశాలు ఉన్నట్టుగా కనిపిస్తుంది. ఆమె కన్న చిన్న కలను, అదిసాకారం కాకపోవడంతో జరిగిన సంఘటనలను మిలంతి కల ద్వారా పాఠకుల కళ్లముందుంచింది. పందెం కోళ్లను ప్రాణానికి ప్రాణంగా, కన్నబిడ్డల కన్నా మక్కువగా చూసుకునే యజమానికి తన కోడి తనకు దక్కినప్పుడు రెక్కలమాటున దాచిన తల్లికోడిలా ఆ కోడిని ఇంటికి తీసుకెళ్లిన తీరు 'దేగ' కథలో మనసును మెలిపెడుతుంది. ప్రేమకు, అనుబంధాలకు కులాలు, మతాలు అడ్డుకాదనీ చాటి చెప్పే కథ 'రిశ్తే'. డబ్బుతో సంబంధ బాంధవ్యాలను బలపర్చలేమని సమాజానికి చాటారు రచయిత సయ్యద్గఫార్. రవీంధ్రనాథ్ రాసిన 'చేజారి పోనీకు'.. ఇంక గబ్బిలం, అలౌకికం.. ఇలా ఎన్నో కథలు!. దేని ప్రత్యేకత దానికే, దేని వైవిధ్యత దానికే. సామాజిక కోణంలో ప్రత్యేక కథా వస్తువులతో రచయితలు పాఠకులను ఆలోచింపజేస్తారు.

ఇంతటి అమూల్యమైన, సృజనాత్మకమైనకథా రచయితలు, పాఠకులు ఈ ప్రయాణంలో తోడవడం మాకు బలాన్ని, సాహితీ సేవపై నమ్మకాన్ని చేకూర్చింది. పోటీలో విశిష్టంగా నిలిచిన 'సమాధానం లేని ప్రశ్న' (నామని సుజనాదేవి), సంతకం (జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, 'మేరాబాప్ ఖయ్యూం' (హుమాయూన్ సంఘీర్), లచ్చిమి (ఆనందాచారి) కథలు.. సమాజంలోని వైవిధ్యాన్ని, సంస్కృతిని, జీవన సౌందర్యాన్ని అవిష్కరిస్తున్నాయి. మా దివ్య సాహితీ క్షేత్రం ద్వారా పాఠకుల హృదయాల్లో జ్ఞాన దీప్తిని వెలిగించేందుకు, సమాజంలో మానవత్వం, సమైక్యతను పెంచేందుకు చేస్తున్న సృజనాత్మక యాత్రలో మాతో పాటు సరిసాగే కథలు అవి.

**సామూహిక సంకల్పం..**

యజ్ఞ కార్యం సమైక్యతను, సమృద్ధిని కాంక్షించి, రుగ్మతలను తొలగించినట్టు.. ఈ సాహితీ యజ్ఞంతో సమతుల్యతను, సామరస్యాన్ని పెంపొందించే కథలను పాఠకుల ముందుంచుతున్నాం. లోతైన ఈ కథలు రచయిత అంతరంగాన్ని ఆవిష్కరించడమే కాక.. హోమ ధూమంలా పాఠకులందరి మనసునూ చేరుతాయి. మాకు కథలు రాస్తున్న ప్రతి రచయితా.. సరస్వతీ సన్నిధిలో అక్షర హవిస్సును సమర్పించే సాహితీ సాధకుడని చెప్పవచ్చు. పోటీలో నిలిచిన కథలు చదివి, ప్రేరణ పొంది తామూ కథలు రాయాలనే కంకణం కట్టుకుని విజేతగా నిలిచిన రచయితలున్నారు. ఇందులో పాల్గొంటున్న కొందరు రచయితలు.. పాఠకుడిగా మారి కథ చదవగలరు, విమర్శకునిగా తమ కోణాన్ని పంచుకోగలరు. విశ్లేషకునిగా కథలను విశ్లేశించనూగలరు. ఇలాంటి బహుముఖ సాహిత్య

చర్చలకు, వారం వారం సమీక్షలకు, ఇష్టాగోష్టికి ముల్కనూరు కథా డిజిటల్ వేదిక అయిన వాట్సాప్ గ్రూప్ నాణ్యంగా నడుస్తోంది.

**సార్వత్రిక లక్షణం..**

యజ్ఞ విశిష్టత దాని సార్వత్రిక లక్షణంలో ఇమిడి ఉంటుంది. అది కులమత, ప్రాంత బేధాలకు అతీతంగా అందరినీ ఒక తాటిపైకి తెస్తుంది. అచ్చు అలాగే ముల్కనూరు కథల పోటీ కూడా సామాజిక వైవిధ్యాన్ని గౌరవిస్తూ, సమస్త జీవరాశుల మధ్య ఐక్యతను స్థాపించడంలో తన వంతు పాత్ర పోషిస్తోంది. ఈ మహత్తర పని సామాజిక నిధిలా ఉండేందుకు ఏటా కథలను సంకలనంగా తేవడం మేము మర్చిపోవడంలేదు. ఈ మా ప్రయత్నం.. పాఠకులకు ఆనందాన్ని, స్ఫూర్తిని అందిస్తూ తెలుగు సాహిత్య లోకంలో కొత్త కుసుమాలు వికసించేలా ప్రేరణనిస్తుందని ఆశిస్తున్నాం.

యాగంతో మేఘుడు కరుణించి వానజల్లు కురిపించినట్టే.. సర్వసమాజ సభ్యులైన పాఠకుల ఆదరణతో ముల్కనూరు, నమస్తే తెలంగాణ కథల చిరుజల్లు మరింత కురిసి.. సాహిత్య వనంలో సృజన జలధారలు పరవళ్ళు తొక్కాలని ఆకాంక్షిస్తున్నాం.. ఈ సంకల్పానికి మీ బలం మరింత చేకూరాలని కోరుతూ... సాహితీ యజ్ఞంలో పాలుపంచుకున్న న్యాయ నిర్ణేతలకు, ముల్కనూరు సాహితీ పీఠం మిత్రులకు, ఆర్థిక సాయం అందించిన గంగిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

***

# వేల్పుబువ్వలాంటి మేల్కొలుపులు



**తిగుళ్ల కృష్ణమూర్తి,**

**ఎడిటర్, నమస్తే తెలంగాణ**

అందమైన పదంలో ఇమిడినప్పుడే అక్షరానికి సార్థకత లభిస్తుంది. ఆ పదాలు హృద్యమైన భావుకతను వ్యక్తపరిచే వాక్యంగా మారితే అక్షరానికి అమరత్వం సిద్ధిస్తుంది. అలాంటి వాక్యాలు ఓ అద్భుతమైన కల్పననో, ఓ ఉదాత్తమైన యాదార్థాన్నో కండ్లముందు ఉంచితే అప్పుడది నమస్తే తెలంగాణ ముల్కనూరు సాహితీ పీఠం మథనంలో నుంచి ఉద్భవించిన కథామృతం అవుతుంది.

ఈ వేల్పుబువ్వలాంటి కథల్లో తారసపడే అచ్చతెనుగు నుడికారాలు.. మల్లెమొగ్గల్లాంటి అన్నంలో ఆవకాయ కలుపుకొని ఆరగించినంత ఆనందాన్నిస్తాయి. యాస పరిమళాలు.. ముద్దపప్పులోకి పచ్చిపులుసు నంజుకున్నంత తృప్తినిస్తాయి. కథకుడి మస్తిష్కంలోంచి పుట్టుకొచ్చిన కొసమెరుపులు గడ్డపెరుగు వాయంత హాయిగా ఉంటాయి. ముల్కనూరు సాహితీ పీఠం భాగస్వామ్యంలో.. 'నమస్తే తెలంగాణ' చేపట్టిన కథల పోటీలో వండి, వడ్డించిన కథలు.. మేల్కొలుపు వీచికలు, తెలుగు కథా కుటుంబంలో మేలైన చేరికలు.

ఈ దఫా వచ్చిన కథలన్నీ... ముచ్చటైనవే! వాటిలో మదిని తట్టేవి కొన్ని. మస్తిష్కాన్ని తొలిచేవి ఇంకొన్ని. 'ఒక మిలంతి కల'.. ఆదివాసీ ఆడకూతురు అలజడిని ఆవిష్కరిస్తే, 'ఇసుక తైలం' కథ ఎడారిలో తడారదన్న సత్యాన్ని తెలియజేస్తుంది. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్న 'అమ్మ చిరునామా..' మాతృత్వపు మాధుర్యాన్ని

చాటిచెబుతుంది. ఒకటేమిటి పదుల సంఖ్యలో కథలు.. వేల సంఖ్యలో భావాలు.. లక్షలాది మంది పాఠకులను అలరించాయి! డిజిటల్ మీడియాలో గిగాబైట్ల కొద్దీ మొబైల్‌డేటాను, నిమిషాల్లెక్కన గంటలను వృథా చేస్తున్న నేటి తరం.. ఈ కథలపై పది నిమిషాలు వెచ్చిస్తే జీవితకాలం జ్ఞాపకాలు పొందడం ఖాయం. అంతేనా, భాష తెలుస్తుంది. భావుకత వ్యక్తపర్చడం అవగతం అవుతుంది. అన్నిటినీ మించి మృగ్యమవుతున్న మానవత్వం జాడ మన మనసు పొరల్లోనే ఉందన్న సత్యమూ బోధపడుతుంది. ఇవి చదవాల్సిన కథలు.. పది మందికీ చదివి వినిపించాల్సిన కథలు.

ఏటా నిర్వహించే ఈ సాహితీ సమరానికి పోటాపోటీగా కథలు వెల్లువెత్తాయి. సాగరమంత సాహితీ సంపదలోంచి కొన్ని కథలను ఏరడం అంటే.. జాబిలి నుంచి వెన్నెలను వేరుచేయడమన్నంత సాహసమే! అక్షర తూణీరాల్లో అక్షయ భావాలను నింపుకొన్న కథకుల గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే! ప్రతిపాదిత అంశాన్ని బహుముఖీన కోణంలో రచయితలు ఆవిష్కరించిన తీరుకు తెలుగు కథ పొంగిపోయింది. వెరసి 'నమస్తే తెలంగాణ' ముల్కనూరు సాహితీ పీఠం సాగు.. పసందైన ఫలసాయాన్ని దిగుబడిగా సాధించింది. ప్రతి ఆదివారం 'బతుకమ్మ'ల్లో కోరి కోరి, కొసరి కొసరి ఒక్కో కథాసుధను అందిస్తున్న సంగతి 'నమస్తే తెలంగాణ' పాఠకులకు తెలిసిందే! దాదాపు ఏడాదిగా అందరి మన్ననలు పొందిన కథలన్నిటినీ గుదిగుచ్చి షడ్రసోపేతమైన భోజనంగా ముస్తాబైన ఈ కథా సంకలనం.. మన తెలుగు సాహితీ చరిత్రలో మరో సంచలనం అవుతుందని ఆశిస్తూ.

***



# న్యాయ నిర్ణేతలు



కె. అనంత కుమార్



ఆర్. శశిధరచారి



దాసరి వెంకటరమణ



జి. మధుసూదన్ రెడ్డి



డి విష్ణువర్ధన్ రాజు



కె. విజయ్ కుమార్

| క్ర. సం. | కథ పేరు | రచయిత పేరు |
|---|---|---|
| **మొదటి బహుమతి (1) రూ॥ 50,000** | | |
| 1 | అమ్మ చిరునామా | డా. ఎం. కోటేశ్వర రావు |
| **ద్వితీయ బహుమతులు (2) రూ॥ 25,000** | | |
| 2 | ఇసుక తైలం | సమ్మెట ఉమాదేవి |
| 3 | ఒక మిలంతి కల | మల్లిపురం జగదీశ్ |
| **తృతీయ బహుమతులు (3) రూ॥ 10,000** | | |
| 4 | డేగ | బొడ్డేడ బలరామ స్వామి |
| 5 | రిశ్తే | సయ్యద్ గఫార్ |
| 6 | చేజారి పోనీకు | గుమ్మడి రవీంద్రనాథ్ |
| **విశిష్ట కథకుల గుర్తింపు (8)** | | |
| 7 | ఈ దేవుళ్ల దారుల్లో | వేణు మరీదు |
| 8 | గబ్బిలం.. ది అన్‌టచబుల్ | డా. ఎం. సుగుణ రావు |
| 9 | అలౌకికం | తులసి బాలకృష్ణ |
| 10 | సమాధానం లేని ప్రశ్న | నామని సుజనా దేవి |
| 11 | సంతకం | జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి |
| 12 | మేరా బాప్ ఖయ్యూం | హుమాయూన్ సంఘీర్ |
| 13 | లచ్చిమి | కె. ఆనందా చారి |
| 14 | కిష్కింధ కాండ | చందు తులసి (చంద్రశేఖర్) |
| **రూ॥లు 5,000 బహుమతులు (10)** | | |
| 15 | పోటెత్తిన అల | సూర్య గండ్రకోట |
| 16 | కిస్మత్ | స్ఫూర్తి కందివనం |
| 17 | కుల కస్పి | డా. కాలువ మల్లయ్య |
| 18 | ఆశ బరువు తూయగలమా? | కె.వి. సుమలత |
| 19 | అమ్మ పుట్టిల్లు | నెల్లుట్ల రమాదేవి |
| 20 | రూపాంతరం | చింతకింది శివశంకర్ |
| 21 | వెన్ యూ రియలైజ్ దట్ | అరుణ్ కుమార్ ఆలూరి |
| 22 | అనుకోకుండా అలా | మాచిరాజు కామేశ్వర రావు |
| 23 | జెట్ట రోగం | క్రాంతి శివరాత్రి |
| 24 | అక్రోధేన జయేత్ క్రోధం | ఉమా మహేశ్ ఆచాళ్ల |
| **రూ॥లు 3,000 బహుమతులు (20)** | | |
| 25 | సహజం | ఆకెళ్ల సూర్యనారాయణ మూర్తి |
| 26 | షీరో | డా. చెళ్లపిళ్ల సూర్య లక్ష్మి |
| 27 | ఒకరికొకరు | పట్ల యాదగిరి (గిరిపట్ల) |
| 28 | దైవం మనుష్య రూపేణా! | సూరిశెట్టి వసంత కుమార్ |
| 29 | తడబడిన జ్ఞాపకం | సలీం |
| 30 | చిరంజీవి | సౌందర్య తేజ కోరా |
| 31 | మొ'గే'డు | పి. చంద్రశేఖర ఆజాద్ |
| 32 | నాన్న టికెట్ | మంజీత కుమార్ |
| 33 | అంతర్నేత్రం | ఎస్వీ కృష్ణ |
| 34 | తప్పిపోయిన కూతురు | జి. లక్ష్మి |
| 35 | ఒక దీపం వెలిగింది | గాజోజు నాగభూషణం |
| 36 | ఆకలి | సుజల గంటి |

| | | |
|---|---|---|
| 37 | దేవర | ఎస్. నాగేందర్‌నాథ్ రావు |
| 38 | రీసైక్లింగ్ | డా. ఎ. సంతోష్ రెడ్డి |
| 39 | కొండెక్కని దీపం | ఎస్. మౌనిక |
| 40 | మనసా ఎటులోర్తునే.. | పి.ఎస్. నారాయణ |
| 41 | చేజారిన జ్ఞాపకం | శ్రీ మానస (జన్ను లక్ష్మి) |
| 42 | సావాసం | నెల్లుట్ల రుక్మిణి |
| 43 | సోగణ్ | బి. కళాగోపాల్ |
| 44 | ఆర్తి | అనిసెట్టి శ్రీధర్ |

రూ॥లు 2,000 బహుమతులు (24)

| | | |
|---|---|---|
| 45 | అమ్మ ఒడికి | ఇ. కోటేశ్వర రావు |
| 46 | జాతర | పి.వి. అన్నాజీ రావు |
| 47 | మనసున మనసై | లక్ష్మి గాయత్రి |
| 49 | కరిగిన మేఘం | కడెం లక్ష్మి ప్రశాంతి |
| 49 | నా బలగం | డా. శ్రీదేవి శ్రీకాంత్ |
| 50 | వాడు వెళ్లిపోయాడు | కాంచనపల్లి గోవర్ధన్ రాజు |
| 51 | అంతర్యామి | కె.వి.వి. సత్యనారాయణ |
| 52 | తా(ఆ)ళి బంధం | ఉరిమల్ల సునంద |
| 53 | తెలుగు మాస్టారు | లక్ష్మి మదన్ |
| 54 | ఈశ్వర్ అల్లా తేరో నామ్ | డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి |
| 55 | మార్పు | గీత కురుగంటి (హంసగీతి) |
| 56 | పస్తిని | కె.వి. మేఘనాథ్ రెడ్డి |
| 57 | ఖట్నా | పిన్నంశెట్టి కిషన్ |
| 58 | సిగ్గు! సిగ్గు! సిగగ్గు!! | సింహ ప్రసాద్ |
| 59 | రక్తసంబంధం | ఎం. సూర్యప్రసాదరావు |
| 60 | పర్ణశాల | పంతంగి శ్రీనివాస రావు |
| 61 | మంచి మనసుకు మంచి రోజులు | సి.ఎన్. చంద్రశేఖర్ |
| 62 | మనస్విని | విజయార్కె |
| 63 | వేద శృతి | శ్రీవల్లి భాస్కర్ |
| 64 | పీరియడ్ టైం | నల్లపాటి సురేంద్ర (స్వీట్ సురేంద్ర) |
| 65 | సమ్మెట దెబ్బల చప్పడు | రవి తేజ సిరిపురం |
| 66 | మైదాకు | ఝాన్సీ లక్ష్మి జాష్టి |
| 67 | కన్నీటి కత్తులు | కొండపల్లి నీహారిణి |
| 68 | యావజ్జీవం హో ష్యామి | గంటి రమాదేవి (జి. ఎస్. శర్మ) |

In loving memory of



# గంగిశెట్టి
# ధనుష్య రుత్విక్



ఉన్నత చదువుల కోసం మాకు దూరంగా వెళ్లినప్పుడు.. మంచి భవిష్యత్తుతో
తిరిగివస్తావని కలలు కన్నాం. కానీ, చిన్నవయసులోనే మాకు కనబడని తీరాలకు
వెళ్లి పోయావు. ఇప్పుడు నీ జ్ఞాపకాల్లోనే నిన్ను చూసుకుంటున్నాం. నువ్వు ఎక్కడ
ఉన్నా నీ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ..
మేము చేసే ప్రతీ కార్యంలో నిన్ను తలుస్తూ..

– ***గంగిశెట్టి కుటుంబ సభ్యులు.***



# అమ్మ చిరునామా

డా.ఎం. కోటేశ్వర రావు

06.02.2014. రాత్రి గం. 7.15 ని.

'దయచేసి వినండి. కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లవలసిన ట్రెయిన్ నెంబర్ 12762 తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు, ఒకటవ నెంబర్ ప్లాట్‌ఫాం నుంచి బయలుదేరుటకు సిద్ధముగా ఉన్నది..'

ప్రకటన పూర్తి కాకముందే.. నిద్రపోతున్న నాగుపాము, ఎలుక అలికిడికి ఉలిక్కిపడ్డట్టు, ఒక్క కుదుపుతో ట్రైన్ కదిలింది.

దూరంగా ఉన్న ఎలుకను పట్టుకోడానికి, నిశ్శబంగా కదులుతున్న పాములా.. మెల్లగా బయల్దేరిన ట్రైన్, క్రమంగా వేగం పుంజుకుంది.

బన్నూ.. కిటికీ పక్క సీట్‌లో కూర్చుంది. పక్కన డా.రావు. మిగిలిన సీట్ అంతా ఖాళీ. డా.రావు చిన్నమ్మాయి శర్వాణి. బన్నూ.. ఆమె ముద్దుపేరు. వాళ్ల ముందు సీట్లో వాళ్లకంటే ముందే ఒక కుటుంబం వచ్చి కూర్చున్నారు. ముప్పై ఏళ్లుండే వివాహిత. ఆమెకు ఒకపక్క మూడేళ్ల పాప. మరోపక్క బెర్త్ మీద పడుకోబెట్టిన చిన్న బిడ్డ. అటుపక్క సింగిల్ సీట్‌లో కాస్త వయసు మళ్లిన మగ మనిషి. అదీ ఆ కుటుంబం. డా.రావు ఆ నలుగుర్నీ ఒకసారి తేరిపార చూశాడు.

ఉన్న పాత చీరల్లో కాస్త పరవాలేదు అనదగ్గ చీర కట్టుకున్నట్టుగా ఉందామె. కట్టు, బొట్టు, మాట, చూపు.. ఒద్దికగా, హుందాగా ఉన్నాయి. బెర్త్ పైన పడుకున్నది పాపో, బాబో తెలీదు. పాత లుంగీ కప్పిఉంది. మూడేళ్ల పాప ఒంటిమీద దారపు పోగులు వేలాడుతూ, సాగిపోయిన పాత ఫ్రాక్. నడి వయసు వ్యక్తి పంచె, చొక్కా, భుజం మీద కండువా వేసుకున్నాడు. చొక్కా భుజాల కింద చిరిగింది. పంచెకకు అక్కడక్కడా రంధ్రాలు. కండువా బాగా మాసిపోయింది. పట్టించుకోవడం మానేసి చాలాకాలం అయిన జుట్టు. పాత బ్యాగులు, గోనె మూటలు. అందరి నుంచీ ఒకలాంటి మాడిపోయిన నూనె వాసన. ఇవన్నీ ఆ కుటుంబం మధ్య తరగతి కంటే దిగువస్థాయిలో ఉందని చెప్పడానికి పోటీపడుతున్నాయి.

ఇటుపక్క విషయానికొస్తే.. బన్నూ కొత్త ఫ్యాన్సీ డ్రెస్ వేసుకుంది. డా.రావు ఒంటిమీద ఇస్త్రీ మడత నలగని మంచి ప్యాంట్, షర్ట్. టక్ చేసుకున్నాడు. వాళ్లు వాడిన ఫేష్ వాష్‌లు, బాడీలోషన్స్, వైటనింగ్ క్రీమ్స్, పౌడర్లు, స్ప్రేలు.. వాళ్ల ఉనికిని

ఘుమఘుమలతో చాటుతున్నాయి. ఆ తండ్రీ కూతురు వచ్చి కూర్చోగానే.. వాళ్లేదో దారితప్పి వచ్చినట్టు అనుమానంగా చూసింది అవతలి కుటుంబం. చూడటమేకాదు.. నడి వయసు వ్యక్తి అడిగాడు కూడా.

'సారూ గిదెక్కిన్రు! గిది మామూలు డబ్బా.. జూసిన్రా?' అని.

డా.రావు చిన్నగా నవ్వాడు.

'ఆ.. చూశాను. మా జర్నీ జస్ట్ ఫైవ్ అవర్స్ ముందు ఫిక్స్ అయింది. తత్కాల్ టిక్కెట్స్‌కు కూడా చాన్స్ లేదు. జర్నీ కంపల్సరీ.. అర్జంట్! సో.. జనరల్ కంపార్ట్‌మెంట్'..

డా.రావు మాట్లాడిన పదాలు పెద్దాయనకు తెలీకపోయినా.. గత్యంతరం లేక, కావాలనే ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కారనే విషయాన్ని మాత్రం అర్థం చేసుకున్నాడు. తన మాటలకు ఎదురుగా కూర్చున్న ఆమె కాస్త ఇబ్బందిగా కదలడం డా.రావు గమనించాడు.

రైల్వేట్రాక్‌కు దగ్గరలో ఉన్న చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీ భవనాలను ఆసక్తిగా చూస్తున్నది బన్ను. మరో అయిదేళ్లల్లో తాను కూడా అలాంటి మెడికల్ కాలేజీలో చేరబోతున్నాననే ఆలోచనతో ముసిముసిగా నవ్వుకుంది.

డా.రావుకు తనముందు కూర్చున్న కుటుంబం గురించి తెలుసుకోవాలని అనిపించింది. ఎలా మొదలు పెట్టాలో తెలీక ఆలోచిస్తున్నాడు. మూడేళ్ల పాపను లక్ష్యంగా చేసుకుని..

'హాయ్!' అని పలకరించాడు.

ఆ పాప ఒకసారి అతనివైపు చూసి, అంతలోనే బిడియంగా తల దించేసుకుంది.

'స్కూల్‌కు వెళ్తున్నావా?'..

పాప నేల చూపులు. సమాధానం లేదు.

'ఏ ఊరికి వెళ్తున్నావ్?'..

మళ్లీ మౌనమే సమాధానం.

ఇంక లాభం లేదని డా.రావు పథకం మార్చాడు.

'మనం ఒక ఆట ఆడుకుందామా? నీకు ఇష్టమైన వాళ్ల పేర్లు నువ్ చెప్పాలంట. నువ్వు ఎన్ని పేర్లు చెప్తే నేను నీకు అన్ని చాక్లెట్స్ ఇస్తానంట. రెడీనా మరి?'.

పాప ఒకసారి తలెత్తి చూసి అంతలోనే తల దించేసుకుంది.

'ముందు చాక్లెట్స్ చూపించు' అన్నట్టుగా ఉన్నాయి పాప చూపులు.

'ఏంటీ! నమ్మకం లేదా? అయితే చూడు..' అంటూ డా.రావు తన ప్యాంట్ పాకెట్‌లోంచి మూడు చాక్లెట్స్ బయటికి తీశాడు.

చాక్లెట్స్‌ను చూడగానే పాప మౌనాన్ని వదిలేసింది. బన్నూ ఆసక్తిగా గమనిస్తున్నది.

'సిట్టి.. సుజాత.. పోష.. య!'.

మూడు చాక్లెట్స్ బయటికి తీసినందుకో ఏమో.. పాప సరిగ్గా మూడు పేర్లు చెప్పి ఆగిపోయింది.

'ఎవరు వీళ్లంతా? నీ ఫ్రెండ్సా?'.. డా.రావు కూపీలాగే ప్రయత్నం చేశాడు.

పాప ఒకసారి తల అడ్డంగా ఊపి..

'నేను.. అమ్మ.. తాతయ్య!' అని చెప్పి, కొంత సమాచారం ఇచ్చింది.

'హమ్మయ్య!' అనుకున్నాడు డా.రావు. మూడు పేర్లు తెలుసుకున్నాడు.

'వెరీ నైస్ చిట్టి. మీ ముగ్గురి పేర్లు చెప్పావ్. మరి అమ్మ పక్కన..' అతని మాట పూర్తికాకముందే సుజాత కల్పించుకుంది.

'సిట్టీ.. గీ దుప్పటి తాతయ్య కియ్యవే! సలైతాంది. ఇగో.. తీస్కపో. నువ్ ఆడ్నే కూసో. సీట్ పోతే పరేషాన్ అయితది'.

ఆమె మాటలు డా.రావుకు అసహజంగా అనిపించాయి. తాతయ్యకు నిజంగా దుప్పటి ఇవ్వడానికి కాకుండా.. సంభాషణను మరల్చడానికి అలా అన్నట్టుగా అనిపించింది అతనికి.

ట్రైన్ పెద్దపల్లి స్టేషన్‌లో ఆగింది. డా.రావు క్యాంటిన్‌కు వెళ్లి, పది నిమిషాల్లో తిరిగొచ్చాడు. అతని చేతిలో ఐదు ఇడ్లీ ప్యాకెట్స్, మూడు వాటర్ బాటిల్స్, రెండు కూల్ డ్రింక్స్ ఉన్నాయి.

'ఇవన్నీ ఎందుకు?' అన్నట్టుగా చూసింది బన్ను.

'చెప్తా ఆగు!' అన్నట్టు రెప్పలాడించాడు అతను.

'పోచయ్యా.. తీస్కో!' అంటూ పోచయ్యకూ, చిట్టీకీ, సుజాతకూ ఒక్కో ఇడ్లీ ప్యాకెట్ ఇచ్చాడు డా.రావు.

వాటితోపాటే రెండు వాటర్ బాటిల్స్, ఒక కూల్ డ్రింక్ బాటిల్ కూడా ఇచ్చాడు. చిట్టీ, పోచయ్య మారు మాట్లాడకుండా తీసుకున్నారు. సుజాత మాత్రం ఆశ్చర్యంగా చూస్తుండి పోయింది. అంతలోనే తేరుకొని..

'గిదేంది సార్? మీ కొరకు దెచ్చుకున్నవి మాకు ఇస్తున్రు? అద్దు సార్.. మీరే తీస్కోండ్రి. బండిల అమ్మేటోళ్లు అచ్చినంక మేం గూడ దీస్కుంటం!' అంటూ, తిరిగి ఇవ్వబోయింది.

'ఒక్క నిమిషం! ఈ రోజు మా బన్నూ బర్త్‌డే. ఇంట్లో ఉంటే అందరికీ చాక్లెట్స్, కేకులు, స్వీట్స్ పంచడం.. అన్నీ ఉంటాయ్. కానీ, అర్జెంట్ ప్రయాణమని చెప్పాను కదా. మా పాప సంతోషం కోసం కేకు, స్వీట్స్ బదులు ఇవి ఇస్తున్నాను. మీరు తీసుకోకపోతే మేం ఇద్దరం బాధ పడతాం'.. నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు డా.రావు.

ట్రైన్ పెద్దపల్లి నుంచి బయల్దేరింది. సుజాత ఇంకా తటపటాయిస్తూనే ఉంది.

'ఇక్కడ మీరు, మేం తప్ప ఇంకెవరూ లేరు కదమ్మా! ఇంకో విషయం చెప్పనా?

ఇది సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్. పైగా రాత్రి. ఈ బండిలో అమ్మేవాళ్లు రారు. ఇంకేం ఆలోచించకు.. తీస్కో!' అన్నాడు డా.రావు.

అతని మాటలకు సుజాత సమాధాన పడింది. అన్యమనస్కంగానే అతనిచ్చినవి తీసుకుంది. బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పాలో చెప్పకూడదో.. ఎలా చెప్పాలో తెలీక, బన్నూవైపు ప్రేమగా నవ్వుతూ చూసింది సుజాత.

'నాన్నా.. నా బర్త్‌డే జులై 9 అని ఇన్ని రోజులూ అనుకున్నాను. సరే.. ఇంక ఇప్పటి నుంచి ఫిబ్రవరి 6కే చేసుకుంటాలే!'.. రావు చెవిలో మెల్లగా అన్నది బన్ను.

ఆమె సూక్ష్మం గ్రహించినందుకు చిన్నగా నవ్వుకున్నాడు అతను.

డా.రావు, బన్నూ ఇడ్లీలు తిన్నారు. వారితోపాటే చిట్టి, పోచయ్య కూడా తిన్నారు. బన్నూ కూల్‌డ్రింక్ నోట్లో పెట్టుకోగానే.. చిట్టి కూడా తాగడం మొదలుపెట్టింది. పోచయ్య, చిట్టి పోటీపడుతూ కొంచెంకొంచెం తాగుతున్నారు. సుజాత గిల్టీగా ఫీలవుతున్నట్టు గ్రహించాడు రావు. ఆమె తన ప్యాకెట్ తినకుండా పక్కన పెట్టుకుంది.

'మా అందరిదీ అయిపోయింది. చల్లగా అవ్వకముందే టిఫిన్ తింటే బాగుంటుంది కదా!'.. సుజాతతో అన్నాడు డా.రావు.

'అలాగే సార్.. తింటాను' అన్నది సుజాత.

'దర్శనానికి వెళ్తున్నారా తిరుపతికి?'.

'లేదు సార్. మా ఆయన దగ్గరికి పోతున్నం!'.

'అవునా! ఎక్కడ ఉంటాడు మీ ఆయన?'.

'సింతామనిలో సార్'.

'ఏం పని చేస్తాడు అక్కడ?'.

'రాళ్లు కొట్టేడిది. గ్రానైట్‌లో సార్'.

'మదనపల్లి నుంచి బెంగుళూర్ వెళ్లే దారిలో వస్తుంది.. ఆ చింతామణేనా?'.

'అవును సార్.. గదే! మీకు దెల్సా సార్?'.

'మదనపల్లి మా అత్తగారి ఊరు. అలా తెలుసు. చూసి రావడానికి అందరూ కలిసి వెళ్తున్నారా?'.

'లేదు సార్.. ఆడ్నే ఉండేటందుకు పోతున్నం. ఆయన అచ్చిపోయేటందుకు తిప్పలైతాంది. మస్తు కిరాయిలైతున్నయ్. గిట్ల కాదని ఆడ్నే రూము జూసిండు. పోతన్నం!'.

'అదే మంచిది. బయటి తిండి తినాలన్నా ఖర్చు ఎక్కువే అవుతుంది. దానికి తోడు ఆరోగ్యాలు పాడవుతాయి. ఇప్పుడైతే మంచైనా చెడైనా ఒకరికొకరు తోడుంటారు. ఉన్నదేదో కలిసి తింటారు!'.

'అవును సార్.. గందుకే పోతన్నం!'.

సుజాతలో ఏదో తెలీని ప్రత్యేకత కనిపిస్తున్నది డా.రావుకు. ముప్పై ఏళ్లలోపు వయసున్న పేద యువతి. చామన ఛాయ. నుదుట కుంకుమ. కళ్లకు కాటుక. చేతులకు మట్టి గాజులు. కాళ్లకు పట్టీలు. మెడలో పసుపు తాడు. తలలో పూలు. కట్టింది పాత చీరే అయినా.. ఆ కట్టూబొట్టు ఎంతో హుందాగా, సంప్రదాయంగా ఉన్నాయి. నడకలో అణకువ. మాటలో ఒద్దిక. కళ్లల్లో ఆత్మవిశ్వాసం. ప్రతి కదలికలో ఆత్మీయత. ఆమె అణువణువులో ఆత్మాభిమానం. వెరసి సంపూర్ణమైన ఓ తెలుగు పల్లె పడుచు. నిండైన ఓ అమ్మ. అయిదోతనానికి అసలైన చిరునామా. డా.రావుకు చాలా ముచ్చటేసింది. సుజాతను చూస్తుంటే ఆమెపైన ఒక గొప్ప అభిమానం, గౌరవభావం ఏర్పడ్డాయి అతనిలో.

* * *

డా.రావు ఆమెను నిశితంగా పరిశీలించాడు. ఆమె తనమీద కానీ, కూతురు మీద కానీ, మామగారి మీద కానీ, లగేజీ మీద కానీ అంతగా దృష్టి పెట్టడం లేదు. ఆమె ధ్యాసంతా బెర్త్‌పైన పడుకోబెట్టిన చిన్నారి మీదనే ఉంది. చీమ చిటుక్కుమన్నా క్షణాల్లో స్పందిస్తున్నది. ఆ బిడ్డపై ఈగను కూడా వాలనివ్వడం లేదు. డా.రావు సుజాత గురించి తెలుసుకొనే మరో సంఘటన అప్పుడే మొదలయ్యింది. అది జనరల్ కంపార్ట్‌మెంట్ కావడంతో ఈగలు ఎక్కువగా ఉన్నాయి. అవన్నీ మూకుమ్మడిగా కంకణం కట్టుకొని.. ఆ అమ్మ అమ్మతనాన్నే పరీక్షిస్తున్నట్టు ఆ బిడ్డపైన వాలడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. పాత న్యూస్ పేపర్‌తో గాలి వీస్తూ, చిన్నారి మీద ఈగలు వాలకుండా చూస్తున్నది సుజాత.

మంద గమనంతో తిరుగుతున్న ఒక పంఖాలా, ఒక యంత్రంలా ఆమె చెయ్యి అలుపులేకుండా అలా పేపర్‌ను ఊపుతూనే ఉన్నది. ఆ ప్రయత్నంలో అనుకోకుండా ఆమె చేతిలోని పేపర్ కొన.. చిన్నారి మీద కప్పిన లుంగీకి తగిలింది. చిన్న శబ్దం. బిడ్డలో లిప్తపాటు చిన్న కదలిక. అంతే.. సుజాత ఉలిక్కి పడింది. ఆమె కళ్లలో ఆందోళన. తాను ఏదో తప్పు చేసినట్టు, తనను తాను నిందించుకుంటున్నట్టు ఆమె ముఖ కవళికలు చెప్పకనే చెప్తున్నాయి. తన ముద్దుల బిడ్డ ఉలిక్కి పడేలా చేసిన పేపర్‌ను క్షమించలేక.. అలా అని శిక్షిస్తే వచ్చే గరగర శబ్దంతో తన గారాల పట్టికి నిద్రాభంగం కలిగించలేక.. చేష్టలుడిగి అలా పేపర్ వైపు చూస్తుండి పోయింది సుజాత. పేపర్‌ను సీట్ కిందికి నెట్టేసింది.

సుజాత క్షణకాలం తత్తరపాటుకు లోనుకావటాన్ని ఈగలు అవకాశంగా తీసుకున్నాయి. తమ దాడికి అదునుగా మార్చుకున్నాయి. కొన్ని ఈగలు చిన్నారి పైన కప్పిన పాత లుంగీ సందుల్లోంచి లోపలికి దూరడానికి ప్రయత్నిస్తున్నాయి. మరికొన్ని లుంగీపైన వాలుతున్నాయి. మరికొన్ని విశ్వామిత్రుడి యజ్ఞాన్ని భగ్నం చేస్తున్న రాక్షసుల్లా, బట్ట పైభాగంలో ఎగురుతూ, చిన్నారికి ఇబ్బంది కలిగించడానికి ఝుమ్మని

రొద చేస్తూ, ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

ఈగల ఆధిపత్యాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలీక తికమకపడింది సుజాత. వాన చినుకుల కోసం ఆశగా ఆకాశం వైపు చూసే రైతన్నలా, నిస్సహాయంగా తల పైకెత్తి ఫ్యాన్ వైపు చూసింది. కుమ్మక్కయిన కాంట్రాక్టర్, ప్రజా ప్రతినిధిలా.. ఈగలకూ ఫ్యాన్‌కూ ఏం ఒప్పందం కుదిరిందో కానీ.. అది సుజాత వైపు వెక్కిరింతగా చూసింది.

కానీ, సుజాత తన ప్రయత్నం ఆపలేదు. పేపర్ ఆయుధం విఫలం కావడంతో ఇప్పుడు తన కుడి అరచేతినే ఆయుధంగా చేసుకుంది. కుడి అరచేతిని విసనకర్రలా ఊపుతూ, ఈగలు వాలకుండా బిడ్డను కాపాడుతున్నది. ఇప్పుడు ఈగల ముందు సుజాత కుడి చేతిదే పైచెయ్యి అయ్యింది.

అయితే ఈగలు కూడా తక్కువ తినలేదు. ఎప్పటికైనా అధికారం రాకపోతుందా.. అని నిత్యం కొట్లాడే ప్రతిపక్షంలా ఈగలు మళ్లీ యుద్ధం మొదలు పెట్టాయి. మరింత కక్ష కట్టాయి. సుజాత దీక్ష పట్టింది.

హరిశ్చంద్రుణ్ని, లోహితాశ్యుణ్ని బాధపెట్టడమే పనిగా పెట్టుకున్న నక్షత్రకుడిలా.. ఈగలు ఒక్కసారిగా జోరు పెంచాయి. సుజాత హస్త వింజామర కూడా వేగం పెరిగింది. ఆ వేగంలో సుజాత చెయ్యి మళ్లీ చిన్నారికి తాకింది. మరోసారి బిడ్డలో కదలిక. సుజాత విలవిల్లాడింది. తన చేతి కాఠిన్యాన్ని చూసుకుంటూ పశ్చాత్తాప్పడింది. ఇంక చేతి ఆయుధాన్ని కూడా విసర్జించి, తన పైట చెంగు చివరి భాగంతో ఈగలను తోలడం మొదలుపెట్టింది. ఆ అమ్మ ప్రేమ పైటచెంగు రూపంలో పాశు పతాస్త్రం అయ్యిందో ఏమో కానీ.. ఈగలు తోకముడిచాయి.

రాత్రి పది గంటలైంది. ట్రైన్ అప్పుడే వరంగల్ దాటింది. ఆ కంపార్ట్‌మెంట్‌లోకి కొత్తగా ఎవరూ రాలేదు. డా.రావు కిటికీ దగ్గర కూర్చొని, మిగిలిన సీట్‌లో బన్నీను పడుకోబెట్టాడు. ఎదురు సీట్ మీద పసిబిడ్డ, సుజాత. పోచయ్య సింగిల్ సీట్లో అలాగే నిద్రపోయాడు. అతని ఎదురు సీట్లో చిట్టి ముడుచుకొని పడుకున్నది.

'బిడ్డను అటువైపు జరిపి నువ్వు కూడా పడుకోవచ్చు కదమ్మా!'.. సుజాతకు సలహా ఇచ్చాడు డా.రావు.

'అయ్యో.. అద్దు సార్. జాగా సరిపోదు. బిడ్డ నలిగి పోతది. పోనీ కింద బట్టపరిసి పండ బెడుదామంటే.. అందరు నడిసిన్రు గదా. మంచిగ ఉండది. బీమార్ అయితది!' చెప్పింది సుజాత.

'పోనీ.. వేరే చీరతో ఉయ్యాల కట్టి పడుకోబెట్టవచ్చు కదా?' మరో సలహా ఇచ్చాడు అతను.

'అమ్మో.. గాలికి ఒక్కోసారి ఉయ్యాల చెక్కలకు గుద్దుకుంటాది సార్. గదింకా పరేషాన్!'.

డా.రావు ఇంక ఏమీ అనలేకపోయాడు.

సుజాత గురించే ఆలోచిస్తున్నాడు డా.రావు.

'ఎంత మంచి అమ్మ! అసలు అమ్మ అంటేనే మంచిది. కానీ ఈమె మంచి అమ్మల్లోనే మరీ మరీ మంచి అమ్మలా ఉంది!' అనుకున్నాడు.

సుజాత ప్రేమను ఇంతగా పొందుతున్న ఆ పసిబిడ్డ అదృష్టానికి ముచ్చటేసింది. ఆ చిన్నారి భాగ్యశాలిని, అదృష్టవంతుణ్ని ఒకసారి చూడాలనిపించింది అతనికి. ఇప్పుడు కాదు.. సుజాత ఈగలతో యుద్ధం చేసిన తీరు చూసినప్పుడే అతనికి ఆ ఆశ కలిగింది. కానీ, చూసే అవకాశం రాలేదు. అతన్ని ఊరిస్తూ, వేచి ఉండమని చెప్తున్నట్టు.. వటపత్ర శాయిలా, అమ్మ సంరక్షణలో హాయిగా బజ్జున్నాడు ఆ బిడ్డ. ఆ బిడ్డ గురించి ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు అతను.

* * *

ఉదయం ఆరు గంటలు. డా.రావుకు మెలకువ వచ్చింది. కళ్లు తెరవగానే, అరచేతులు చూసుకుంటూ..

'కరాగ్రే వసతే లక్ష్మీ..' శ్లోకం చదువుకొని, తర్వాత భూదేవికి క్షమాపణలు చెప్పుకొని, ఆ తర్వాత దేవుడి గదిలోని చిత్ర పటాలకు నమస్కరించడం అతని రోజువారీ అలవాటు. ఈరోజు మాత్రం ముందుగా సుజాత ముఖాన్ని చూడాలనిపించింది అతనికి. మెల్లగా కళ్లు తెరిచి సుజాత ముఖాన్ని చూశాడు. తృప్తిగా, హాయిగా అనిపించింది అతనికి. ఆ సమయంలో ఆమె చేస్తున్న పనికి మరింత ముగ్ధుడయ్యాడు అతను. సుజాత చేతిలో ఇడ్లీ పొట్లం. అందులోంచి పోచయ్య ఒకటి తింటున్నాడు. మరో ఇడ్లీని చిట్టికి తినిపిస్తున్నది. ఆ ప్యాకెట్ నిన్న రాత్రి పెద్దపల్లి స్టేషన్‌లో డా.రావు ఇచ్చిందే. రాత్రి చిట్టి, పోచయ్య ఎవరి ప్యాకెట్ వాళ్లు తినేస్తే.. సుజాత తన పొట్లాన్ని సీట్ మీద పెట్టుకుంది. తర్వాత తింటుందేమో అనుకున్నాడు డా.రావు. కానీ, సుజాత దానిని రాత్రి తినకుండా తన వాళ్లకోసం దాచి పెట్టిందని ఇప్పుడు అర్థమైంది.

'దటీజ్ అమ్మ!' తనలో తానే అనుకున్నాడు డా.రావు. క్షణక్షణానికీ సుజాత మీద అభిమానం, గౌరవం ఎక్కువ అవుతున్నాయి అతనిలో.

సుజాత కళ్లు ఎర్రగా ఉన్నాయి. ఆమెకు రాత్రంతా నిద్రలేదు. కంటిమీద కునుకు లేకుండా, బిడ్డను కంటికి రెప్పలా చూసుకుంటూ కూర్చుంది. డా.రావు నిన్న రాత్రి పడుకున్న తర్వాత మధ్యలో మూడుసార్లు లేచాడు. ఆ మూడుసార్లూ అతనికి కనిపించిన దృశ్యం ఒక్కటే!

అతను నిద్రపోయే ముందు, బిడ్డ పక్కన సీట్‌మీద కూర్చున్న సుజాత.. ఆ తర్వాత అక్కడ లేదు. రెండు సీట్లకు మధ్యలో న్యూస్‌పేపర్ పరుచుకొని, బిడ్డవైపు తిరిగి కూర్చుంది. ఒక చేతిని బిడ్డ తల దగ్గర, మరో చేతిని కాళ్ల దగ్గర పెట్టి.. బిడ్డనే చూస్తూ కనిపించింది రాత్రంతా. రైలు కుదుపులకు, నిద్ర వల్ల బిడ్డ జారి

పడిపోకూడదని సుజాత ఆరాటం. ఆ చిన్నారి నిద్రా సామ్రాజ్యంలోకి ఏ శత్రువూ రాకుండా స్వయంగా కాపలా కాసింది. ఆమె తల్లి ప్రేమ పక్వానికొచ్చి, పండి, కళ్లల్లో రాలినట్టు సుజాత కళ్లు ఎరుపెక్కాయి.

ట్రైన్ గూడూరు సమీపంలో సిగ్నల్ కోసం ఒక చోట ఆగింది. అప్పటికి ట్రైన్ గంటన్నర ఆలస్యంగా నడుస్తున్నది.

సుజాత మొహంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తున్నది. తిరుపతిలో రైలు దిగిన తర్వాత బిడ్డకోసం పాలు తీసుకోవాలనుకుంది ఆమె. కానీ బండి గంటన్నర ఆలస్యంగా నడుస్తున్నది. పాలు తప్పనిసరి. ఒకసారి బయటికి చూసి చటుక్కున పైకి లేచింది. వెంటనే కిందికి దిగిపోయింది. పోచయ్యతోపాటు డా.రావు కూడా ఆమె ఏం చెయ్యబోతున్నదా అని చూస్తున్నారు.

అవతలి వైపు ప్లాట్‌ఫామ్ మీద ఒక పుష్‌పుల్ ప్యాసింజర్ ఆగివుంది. ఆ బండికి తిరుపతి బండి ఆగిన ట్రాక్‌కూ మధ్యలో మరో ట్రాక్ ఉంది. ఆ ట్రాక్ దాటుకొని వెళ్లి, పుష్‌పుల్ బండిలో టీ-కాఫీ అమ్ముకునే వాళ్ల దగ్గర పాలు తీసుకోవాలన్నది సుజాత ఆలోచన. నిజానికి ఆ ఆలోచన అంతకుముందే డా.రావుకు వచ్చింది. అతను ఆమెకు ఆ సహాయం చేయాలని అనుకుంటూ ఉండగానే.. సుజాత బండి దిగిపోయింది. మధ్యలో ఉన్న ట్రాక్‌ను దాటి ప్యాసింజర్‌లోని ఒక్కో బోగీలో టీ అమ్మేవాళ్లు ఉన్నారేమో చూసుకుంటూ ట్రాక్ పక్కన నడుస్తున్నది. అలా నడుస్తూ ప్యాసింజర్ చివరి బోగీ వరకూ వెళ్లిపోయింది. అక్కడ ఆమెకు పాలు దొరికాయి. అదంతా గమనిస్తున్న డా.రావుకు గుండె దడ పట్టుకుంది. తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో వాళ్లు కూర్చున్న బోగీ ఇంజిన్ పక్కన ఉంది. ప్రస్తుతం సుజాత ప్యాసింజర్ బండి చివరి బోగీ దగ్గర.. అంటే తిరుపతి బండి గార్డ్ కోచ్ దగ్గర ఉంది. పైగా మధ్యలో ఒక ట్రాక్ కూడా ఉంది. ఇప్పుడు బండి కదిలితే పరిస్థితి ఏంటి? దానికి తోడు అదే సమయంలో మధ్యలో ఉన్న ఖాళీ ట్రాక్ మీద వేరే ట్రైన్ వస్తే? డా.రావుకు చెమటలు పట్టేశాయి. అతను భయపడ్డట్టే తిరుపతి బండికి రెడ్ సిగ్నల్ నుంచి ఎల్లో సిగ్నల్ వచ్చింది. చూస్తూ ఉండగానే ఎల్లో సిగ్నల్ గ్రీన్ అయ్యింది. అక్కడ సుజాత ఇంకా చిల్లర తీసుకుంటూ ఉన్నది. గార్డ్ విజిల్ ఊదాడు. ఇంజిన్ నుంచి హార్న్. వాటన్నిటి గురించి ఏ మాత్రం అవగాహన లేని చిట్టి, పోచయ్య హాయిగా కబుర్లు చెప్పుకొంటున్నారు.

డోర్ దగ్గర నిలబడి చూస్తున్న డా.రావు క్షణంలో ఒక ఆలోచనకొచ్చాడు. సుజాత తమ కోచ్ దగ్గరికి చేరుకోవడం జరిగేపని కాదు. ట్రైన్ కదిలేవరకు ఆగి.. కదలగానే చైన్ లాగి బండిని ఆపాలనీ, తర్వాత ఫైన్ తానే కట్టాలనే నిర్ణయానికి వచ్చాడు. గార్డ్ మళ్లీ విజిల్ వేశాడు. ఇంజిన్ నుంచి మళ్లీ హార్న్. డా.రావు కళ్లు మూసుకున్నాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంటున్నది. క్షణాలు గడుస్తున్నాయి. అలా ఎంత సేపు గడిచిందో తెలీదు.

'సార్.. జర తొవ్వ ఇయ్యురి!'..

ఆ మాటలకు డా.రావు ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. ఎదురుగా పాల సీసాతో సుజాత. వెంటనే పక్కకు జరిగాడు. సుజాత లోపలికి ఎక్కిన మరుక్షణం బండి బయల్దేరింది.

'గార్డ్ రెండుసార్లు విజిల్ వేసినా, రెండుసార్లు హార్న్ కొట్టినా.. సుజాత అక్కడికొచ్చేవరకు తిరుపతి బండి ఎందుకు కదల్లేదో ఆ తిరుపతి వేంకటేశ్వరుడికే తెలియాలి!' అని మనసులో అనుకున్నాడు రావు.

'అంతదూరం వెళ్లిపోయావు. గార్డ్ విజిల్, బండి హార్న్ ఏమీ పట్టించుకోలేదు నువ్వు. వేరే బండి మధ్యలో అడ్డం వచ్చి, మన బండి కదిలిపోతే ఏం చేసేదానివి? ఏంటీ ఆ మొండితనం? కాస్త చూసుకోవాలి కదా. నేను ఎంత భయపడ్డానో తెలుసా?'.. కాస్త చనువు తీసుకొని సున్నితంగా మందలించాడు రావు.

అందులో మందలింపు కంటే ఆత్మీయత, అభిమానమే వినిపించాయి సుజాతకు.

'అవునా సార్! అయ్యో మాఫ్ జేయుండ్రి! మీరు మా గురించి ఇంతగా అర్సుకుంటరని అనుకోలే. నేను బండి గురించి, దేని గురించి ఆలోసించలే. బిడ్డకు పాలు ఎట్ల దేవాల్ననే ఆలోచన ఒక్కటే ఉండె!'.

'మనిషి ఒక మంచి కోరికను మనస్ఫూర్తిగా, బలంగా కోరుకున్నప్పుడు దానిని నెరవేర్చడానికి, నిజం చేయడానికి ప్రకృతి తనలో సర్దుబాట్లు చేసుకుంటుంది. విశ్వం తనను తాను పునర్మించుకుంటుంది'.. యోగా సెషన్స్‌లో భాగంగా వరంగల్ కిట్స్ ప్రొఫెసర్ డా.నరేందర్ రెడ్డి పదేపదే చెప్పిన మాటలు గుర్తొచ్చాయి డా.రావుకు. ఆ మాటలు నిజమేననే నమ్మకం ఇప్పుడు కలిగింది.

'సుజాత దూరంగా ఉంది. ట్రైన్ కదులుతుంది. ఆమె ఎక్క లేదు.. చైన్ లాగాలి, ఫైన్ కట్టాలి!' ఇలాంటి ప్రతికూల అలోచనలే చేశాడు రావు. కానీ సుజాత తన బిడ్డకు తప్పకుండా పాలు కావాలనే నిస్వార్థ కోరికను, పరిసరాలను కూడా మర్చిపోయేటంత బలంగా కోరుకుంది. ఆ తల్లి ప్రేమ ముందు, కోరిక ముందు ప్రకృతి పులకించి, విశ్వం ఆనందంగా తనను తాను పునర్నిర్మించుకుంది. ట్రైన్ కదలకపోడానికి కారణాన్ని తనలో తానే విశ్లేషించుకున్నాడు డా.రావు.

ట్రైన్ శ్రీకాళహస్తి దాటింది. తిరుపతి చేరుకోడానికి ఇంకో 45 నిమిషాలే ఉన్నాయి. ఈలోగా సుజాత గారాల పట్టిని మనసారా చూడాలనే కోరిక డా.రావులో క్షణక్షణానికీ బలపడుతున్నది. కొని తెచ్చిన పాలు పట్టించాలంటే.. ఇప్పుడు ముసుగు తొలగించాలి కదా. ఆ క్షణం కోసం కాచుకున్నాడు అతను.

'మామా.. బిడ్డకు పాలు తాపిస్తా. సిట్టి అటుయిటూ పోకుండా చూస్కో!'..

సుజాత మాటలు విన్న డా.రావుకు ఎగిరి గంతేసినట్టయ్యింది. నిన్న రాత్రి

నుంచి ఎదురు చూసిన క్షణం ఇప్పుడు రాబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది అతనికి. కళ్లు పెద్దవి చేసుకొని, రెప్ప వెయ్యకుండా పాతబట్ట కింద పవ్వళిస్తున్న చిన్నారి దర్శనం కోసం ఎదురు చూస్తున్నాడు అతను. సుజాత బయట ఉన్న చిన్న చిన్న వస్తువులను బ్యాగుల్లో సర్దుకుంటున్నది తప్ప.. పాలు పట్టించే ప్రక్రియ మొదలుపెట్టలేదు.

'ఇగో మామా.. ఇంటున్నావా? బిడ్డకు పాలు తాపిస్తా.. సిట్టి అటుయిటూ పోకుండా చూస్కో!'..

సుజాత మాటకు ఆలోచనలో పడ్డాడు డా.రావు. ఆ మాట రెండుసార్లు చెప్పడంతో.. అది పోచయ్యకు కాకుండా పరోక్షంగా తనకే చెబుతున్న భావన కలిగింది అతనిలో.

'బహుశా ఇప్పుడు తెచ్చిన పాలు కాకుండా.. తల్లిపాలే పడుతుందేమో!? ఎదురుగా నేనుంటే.. ఆ అసౌకర్యాన్ని, ఇబ్బందిని ఆమె ఆ రకంగా తెలియచేస్తున్నట్టు ఉంది!' అనుకున్నాడు డా.రావు. ఒకింత సిగ్గు పడ్డాడు. లేచి యథాలాపంగా వెళ్తున్నట్టు డోర్ దగ్గరికి వెళ్లి నిలబడ్డాడు. బన్నూ అతన్ని అనుసరించింది.

పావు గంట గడిచింది. బన్నూని పంపి.. పాలు తాగించడం పూర్తయ్యిందో లేదు చూసి రమ్మన్నాడు డా.రావు. పూర్తి అయ్యిందని సైగ చేశాక వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. బిడ్డవైపు చూశాడు. పైన కప్పిన బట్ట మారింది. లోపల కదులుతున్న అలికిడి. అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారి పోవడంతో డా.రావు నిరాశ పడ్డాడు. ఈసారి డా. నరేందర్ రెడ్డి మాటల్ని మళ్లీ గుర్తు చేసుకుంటూ.. బిడ్డను చూడాలనే కోరికను మరింత బలంగా కోరుకొని, విశ్వం ఇచ్చే సమాధానం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు.

కానీ, విశ్వం అంత త్వరగా స్పందిస్తుందని అతను ఊహించలేదు. చిట్టి రూపంలో ప్రకృతి తన సమాధానాన్ని పంపింది. చాలా సేపట్నుంచి తాతయ్య ముందు కూర్చొని ఉన్న చిట్టి, మార్పు కోసం సుజాత సీట్ దగ్గరికి వచ్చి కూర్చుంది. చిన్నారి పక్కన కూర్చొని, తల ఆనించి, కప్పి ఉన్న బట్ట పైనుంచే బిడ్డను ముద్దు చేస్తున్నది. అలా రెండుసార్లు చేసింది. మూడోసారి మళ్లీ బిడ్డ మీద తల ఆనించింది.

'ఏయ్ సిట్టీ. ఏం జేస్తున్నవే? నిద్ర లేపి పరేషాన్ జేయకు బిడ్డా! ఈడ కూసోక.. నువ్ గాడెందుకు పోయినవ్? గిట్రా'.. పోచయ్య హుకుంతో చిట్టి వేగంగా తల ఎత్తి లేచి నిల్చుంది. చిట్టి తలలోని పాపిట పిన్ను బిడ్డ మీద కప్పిన పాత బట్ట చిరుగుల్లో ఎక్కడో ఇరికింది. చిట్టితోపాటే బట్ట మొత్తం పైకి లేచి వచ్చేసింది.

లోపల నగ్నంగా బిడ్డ. ఊహించని ఆ హఠాత్ సంఘటనకు సుజాత నివ్వెరపోయింది. బన్నూ.. భయంతో కళ్లు మూసుకుంది. డా.రావు బిగుసుకు పోయాడు. బ్రహ్మాండం బద్ధలైనట్టు.. బ్రహ్మ రహస్యం బట్టబయలైనట్టు రావు

చేష్టలుడిగి చూస్తుండిపోయాడు.

అక్కడ.. సీట్ మీద..

దాదాపు ఒక చిన్న సజీవ ఎముకల గూడు. ఏ మాత్రం కండలేని కాళ్లు చేతులు. వాటి ఎముకలకు బలవంతంగా చుట్టినట్టున్న చర్మం. పుర్రెకు చర్మం పూత పూసినట్టున్న తల. లోతైన కళ్లు. దాదాపు అరచేయి వెడల్పులో ఉన్న పొట్ట.. ఆడ శిశువు. డా.రావుకు కడుపులో తిప్పినట్టు అయ్యింది. 'అలాంటి గొప్పతల్లికి దేవుడు ఇలాంటి బిడ్డనిచ్చాడా?' అనుకున్నాడు. అతను తేరుకోడానికి చాలా సమయం పట్టింది.

'ఏంటమ్మా ఇది?'.. ఏం అడగాలో, ఎలా అడగాలో తెలీక ఆగిపోయాడు డా.రావు.

సుజాత పాప మీద బట్ట కప్పుతూ మౌనంగా తలవంచుకుంది.

'ఎప్పట్నుంచి ఇలా?' మళ్లీ అతనే అడిగాడు.

'పుట్టిన రెండు నెలలసంది సార్!'.

'మరి డాక్టర్స్ ఏమన్నారు?'.

'మంచిగ తిండి పెట్టి అర్సుకుంటే.. కొంతకాలానికి మంచిగైతే కావచ్చు. లేకపోతే గిట్లే ఉండొచ్చన్నరు!'.

'మరి ఇప్పటికి ఎన్ని నెలలైంది?'.

సుజాత ఓసారి అతనివైపు చూసి తల దించుకుంది.

'చెప్పకూడదా?' రెట్టించాడు రావు.

'మూడున్నర సంవత్సరాలు'.

సుజాత సమాధానానికి హతాశుడయ్యాడు రావు. తన చెవులను తానే నమ్మలేనట్టు.. మరోసారి కొయ్యబారి పోయాడు.

'మూడున్నర సంవత్సరాలా?' అతని మాట అతనికే వినిపించనంత చిన్న స్వరంతో అన్నాడు రావు.

అవునన్నట్టు తలూపింది సుజాత.

'మరి.. చిట్టి వయసెంత?' అడిగాడు రావు.

'మూడు సంవత్సరాలు'.

'అంటే..? ఈ పాప చిట్టి కంటే పెద్దదా?'.. రావులో అయోమయం.

మరోసారి అవునన్నట్టు తలూపింది సుజాత. రావు అవాక్కయ్యాడు.

'మరి ఆహారం ఏం ఇస్తున్నావు సుజాత?'.. సమాధానం తెలిసినా యథాలాపంగా అడిగేశాడు రావు.

'గరీబోల్లం. ఏమిస్తం సర్? మేం ఏం దింటే గదే కదా!'.

'కాన్పు ఇంటి దగ్గర అయ్యిందా? హాస్పిటల్‌లోనా?'.

‘ హాస్పిటల్‌లో’.

‘ఆపరేషన్ చేశారా ?’.

‘హా.. జేసిన్రు’.

‘ఆపరేషన్ అయ్యాక కళ్లు తెరిచి బిడ్డను చూడగానే నీకు ఏం అనిపించింది ?’.

సుజాత మళ్లీ మౌనంగా ఉండిపోయింది. కొన్ని క్షణాల తర్వాత నెమ్మదిగా బదులిచ్చింది..

‘ఈ బిడ్డ నాకు పుట్టలేదు సార్’.

‘మరి!!!?’.

‘మేం సాక్కుంటున్న బిడ్డ!’.

రావుపైన పిడుగుల మీద పిడుగులు పడుతున్నాయి.

‘మీరు సాదుకుంటున్న బిడ్డా!!!?’.

‘అవును సార్’.

‘ఏమీ అనుకోకపోతే కాస్త వివరంగా చెప్తావా?’ అభ్యర్థించినట్లే అడిగాడు డా.రావు.

సుజాత చెప్పడం మొదలు పెట్టింది..

‘మాకు చిన్న వయసులోనే లగ్గమైంది. మూడేళ్లయినా బిడ్డలు కాలే. ఎవ్వలనైనా సాక్కోవాలని అనుకున్నం. గరీబోల్లకు బిడ్డల్ను ఎవలిస్తరు సార్? మా అసుంటి గరీబోల్లనే అడిగినం. వాల్లకిది మూడో కాన్పు. ఆడ బిడ్డని ఆల్లకు ముందే దెల్సు. మాకు సుతం సెప్పిన్రు.. ఏం దాసలే! మేం ఇట్టపడే ఒప్పుకొన్నం. బిడ్డను దీసుకున్నం!’.

‘మరి ఈ బిడ్డ ఆరోగ్యం గురించి తెలిసిన తర్వాత.. బిడ్డనిచ్చిన తల్లితండ్రులకు అసలు విషయం చెప్పి, బిడ్డను తిరిగి ఇచ్చేసే ప్రయత్నం చేయలేదా ?’.

‘జెయ్యలే సార్! గీ బిడ్డకు గిట్లయితదని ఆల్లకు డాక్టర్లు ఆరో నెలలోనే జెప్పింద్రంట. ఆల్లకు అన్నీ దెలిసి.. బిడ్డను ఒదిలించుకునేటందుకే మాకు ఇచ్చిన్రు కావొచ్చు. అసంటోల్లకు మల్ల బిడ్డను తిరిగిస్తే ఏం జేస్తరు సార్? బిడ్డను ఏమైనా జేస్తే? పాపం కదా సార్.. ఆల్లు అద్దనుకున్నరు. మేం గావాలె అనుకున్నం. బస్.. గియన్నీ కాదు సార్.. నేను ఒక్కటే అనుకున్నా. ఈ బిడ్డ నా కడుపునే పుట్టుంటే? వదులుకుంటనా? లేదు కదా. గిప్పుడూ అంతే. ఆల్లు ఈ బిడ్డను నా సేతిలో పెట్టినప్పటిసంది ఇది నా బిడ్డే!’..

రావు కళ్లు చెమ్మగిల్లి మసకబారాయి.

‘నిండా ముప్పై ఏళ్లు లేని ఈ అమ్మ ఇంత పెద్ద అమ్మ ఎలా అయ్యింది?’ అని ఆలోచిస్తున్నాడు.

‘ఇంత పెద్ద మనసు ఎలా వచ్చింది?’ అని ఆశ్చర్యపోతున్నాడు.

'చిట్టి పుట్టిన తర్వాత ఈ పాపను ఏదైనా ప్రభుత్వ కేంద్రంలో అప్పగించాలన్న ఆలోచన రాలేదా?' అడిగాడు డా.రావు.

'శానామంది పెద్దోల్లు, డాక్టర్లు గదే సలహా యిచ్చిన్రు. కానీ మేం ఆ పని జెయ్యలే!'.

'ఎందుకని?'.

'మేం ఇంకా బతికే ఉన్నం గదా సార్. మీరు సెప్పిన సెంటర్ల మంచి మందులు, వైద్యం ఇస్తరు కావొచ్చు. కానీ, అమ్మానాయనల్ని ఇయ్యలేరు కదా సార్. బిడ్డలకు ముందుగాల కావల్సింది అమ్మానాయనలు. ఆ తర్వాతే ఇంకేమైనా. గిది.. నా పెద్ద బిడ్డ! సిట్టి నా సిన్న బిడ్డ. సిట్టి నాకు ఈ బిడ్డ తర్వాతనే. పెద్ద బిడ్డ వైద్యం కోసం మా రెక్కలున్నంత వరకు పోరాడ్తం సార్. మా పుట్టింటోల్లు ఇచ్చిన భూమిని అమ్మినం. అత్తింటోల్ల ఇల్లు అమ్మినం. నా పుస్తెల తాడు సుత అమ్మిన. ఇంకా.. అమ్మను నేను బతికే ఉన్నా. పైన దేవుడున్నడు, మీలాంటి మంచోల్ల దీవెనలు ఉంటయ్. బతకడానికి ఇవ్వి సరిపోవా సార్?'.

పదివేల మంది ముందు ప్రేమ గురించి మాట్లాడుతున్న మదర్ థెరిస్సాలా కనిపిస్తున్నది సుజాత.. డా.రావు కంటికి. పదివేల మంది హర్షాతిరేకంతో చేస్తున్న చప్పట్ల ధ్వని అతని చెవుల్లో మారుమోగుతున్నది.

డా.రావు కళ్లు జలపాతాల్లా వర్షిస్తున్నాయి. అతని అణువణువూ భావావేశంతో ప్రకంపిస్తున్నది. ప్రేమ పరిమళాలతో కంపార్ట్‌మెంట్ నిండిపోయినట్టు అనిపించింది డా.రావుకు. ఇప్పుడు అతనికి మాడిపోయిన నూనె వాసన రావడం లేదు ఆమె దగ్గర. అమ్మదనపు కమ్మని పరిమళాలు ఆస్వాదిస్తున్నాడు. అతను ఆమె కళ్లలోకి చూస్తూ ఉండిపోయాడు. అలా చూడటం సంస్కారం కాదని అతనికి తెలుసు. అయినా అతను చూపు తిప్పుకోలేకపోయాడు. ఆమె అమ్మతనం ముందు, ఆమె మాతృసౌందర్యం ముందు.. అతని సంస్కారం ఓడిపోయింది. ఓడిపోయి గెలిచింది. పునీతమయ్యింది. ఎవరు పెట్టారోకానీ.. ఆమె నిజంగా సార్థక నామధేయురాలు. మంచి స్త్రీ. అష్టావక్రుడి తల్లి పేరు సుజాత. యాదృచ్ఛికంగా ఇక్కడ ఈ సుజాత బిడ్డ కూడా దాదాపు అలాగే ఉంది.

ఆడపిల్ల అనే ఒకే ఒక్క కారణంతో కడుపులోని శిశువును కళ్లు తెరవకముందే కడతేరుస్తున్న ఈ కలికాలంలో.. పుట్టింది ఆడ పిల్ల అని తెలియగానే ముళ్ల కంచెల్లో, కుప్ప తొట్టిలో, డ్రైనేజీల్లో పారేస్తున్న ఈ అనాగరిక సమాజంలో.. డబ్బులకోసం ఆడపిల్లలను తెగనమ్ముకుంటున్న ఈ పాపిష్టి రోజుల్లో.. పేగు తెంచుకుని సలక్షణంగా పుట్టిన బిడ్డ కళ్లముందు కనిపిస్తున్నా.. ఎవరికో పుట్టిన బిడ్డను.. ఆడబిడ్డను.. అంగవైకల్యంతో ఉన్న బిడ్డను.. కోలుకుంటుందో లేదో తెలీని బిడ్డను.. మూడున్నర ఏళ్లుగా జీవచ్ఛవంలా ఉన్న బిడ్డను.. అక్కున చేర్చుకొని, అమ్మ అయ్యి, సహనంలో

భూమాత అయ్యి, సేవలు చేస్తూ.. కన్న కూతురికంటే ఎక్కువ ప్రేమను పంచుతూ, కంటికి రెప్పలా కాపాడుతున్న సు.. జాత. సుజాతను ప్రత్యక్షంగా చూస్తున్నందుకు, ఆమెతో మాట్లాడుతున్నందుకు ఎంతో గర్వంగా అనిపించింది డా.రావుకు. నమ్మలేని ఓ గొప్ప నిజం కళ్లముందు సాక్షాత్కరించినట్టు, ఓ పరమాద్భుతం ప్రత్యక్షమైనట్టు అలౌకిక ఆనందంతో స్థాణువులా ఉండిపోయాడు.

* * *

ట్రైన్ తిరుపతి స్టేషన్‌లో ఆగింది. ఎవరి లగేజీలతో వాళ్లు కిందికి దిగారు. ప్లాట్‌ఫామ్ పైన ఉన్న వాటర్ ట్యాప్ దగ్గర చిట్టి, పోచయ్య, సుజాత మొహాలు కడుక్కుంటున్నారు. డా.రావు పక్కనే ఉన్న స్టాల్‌లో రెండు వాటర్ బాటిల్స్, కొన్ని పళ్లు, బిస్కెట్స్ కొన్నాడు. బన్నూతో కలిసి సుజాత కుటుంబం ఫ్రెష్ అప్ అవుతున్న చోటికి వచ్చాడు. అప్పటికే వాళ్లు పని ముగించుకొని స్టేషన్ బయటికి వెళ్లడానికి ప్లాట్‌ఫామ్ మీద నడుస్తున్నారు.

'ఒక్క నిమిషం సుజాత.. గారు!'.. యాదృచ్ఛికంగా డా.రావు పిలుపు మారిపోయింది.

ఆమె ఆగి వెనక్కి తిరిగింది. డా.రావు మోకాళ్ల మీద కూర్చొని, రెండు చేతులెత్తి ఆమెకు నమస్కరించాడు. అదంతా అతని అంతరంగంలో.. బాహ్య ప్రపంచంలో అతను నిలబడే ఉన్నాడు. డా.రావు తన షర్ట్ పాకెట్లో చెయ్యి పెట్టి.. రూ.1000 నోట్ పట్టుకున్నాడు. కానీ, పైకి తీసే ధైర్యం చేయలేకపోయాడు. తాను చేసే సహాయం దేనికో అతనికే ఒక స్పష్టత లేదు.

వ్యక్తిత్వంలో, మాతృత్వంలో, మానవత్వంలో ఎవరెస్ట్ శిఖరం పైన మరో వెయ్యి శిఖరాలను పేర్చి.. అక్కడ నిలబడి, ఇంకా పైకే చూస్తున్న ఆ మహా సాధ్వికి, ఆ మహోన్నత స్త్రీమూర్తికి, ఆ మహాతల్లికి, ఆ గొప్ప అమ్మకు వెయ్యి రూపాయలిచ్చి, ఆమె ఆత్మాభిమానాన్ని కించపరచే సాహసం చేయలేక.. అలా అని ఏమీ చెయ్యకుండా ఉండలేక తటపటాయిస్తున్నాడు డా.రావు.

'సార్! పిలిసిను.. మల్లా సప్పుడు జెయ్యలే!'.. విషయమేంటో చెప్పమనే ధోరణిలో అన్నది సుజాత.

డా.రావు అప్రయత్నంగా జేబులోని వెయ్యి రూపాయల నోట్‌ను జేబులోనే వదిలేసి.. ఆ నోట్ పక్కనే ఉన్న విజిటింగ్ కార్డ్‌ను బయటికి తీశాడు.

'ఇది మీ దగ్గర ఉంచండి. నేను డాక్టర్ని. ఎప్పుడైనా, ఏ విషయంలోనైనా, ఏదైనా సలహా కానీ, సహాయం కానీ అవసరమైతే.. ఒక అన్నయ్యగా అనుకొని నాకు ఫోన్ చేయవచ్చు' అన్నాడు.

సుజాత తన ఒడిలోని బిడ్డను, మామ చేతికిచ్చి.. డా.రావు నుంచి కార్డ్ తీసుకుంది. రెండు చేతులతో మొక్కింది.

'మీరు శానా మంచోల్లు సార్! మీరు సల్లగుండాలె!'.

'బస్‌లో పనికొస్తాయ్. ఇవి ఉంచండి!' అంటూ, వాటర్ బాటిల్స్, పళ్లు, బిస్కెట్స్ ఉన్న కవర్‌ను చిట్టి చేతికి అందించాడు రావు.

సుజాత చిరునవ్వుతో కృతజ్ఞతగా చూసింది. డా.రావు సుజాతతో మాట్లాడుతున్నప్పుడు.. బన్నూ తన పాకెట్ మనీలోంచి ఐదువేలు తీసి పోచయ్య చూస్తూ ఉండగా, చిట్టి చేతికి ఇచ్చిన సంగతి సుజాతకు, రావుకూ ఇద్దరికీ తెలీదు.

పోచయ్య, చిట్టి, సుజాత ముగ్గురూ ప్లాట్‌ఫామ్ మీద నడుస్తూ ముందుకు కదిలారు. ఒక మహిళా మణిదీపం, మాతృత్వపు మేరు పర్వతాన్ని అధిరోహించి అలవోకగా అలా కదిలిపోతున్నట్టు సంభ్రమాశ్చర్యాలతో చేష్టలుడిగి చూస్తుండి పోయాడు డా.రావు.

దూరంగా గోవిందరాజస్వామి గుడి గోపురం నుంచి కాబోలు.. పోతనామాత్యుడి పద్యం గాలివాటానికి లీలగా వినిపిస్తున్నది.

అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ
చాల పెద్దమ్మ, సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ
దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ
దుర్గ, మాయమ్మ...

అనుకోకుండా అతని అంతరంగంలో ఆ పద్యంలోని ఒక పదం పదేపదే ప్రతిధ్వనించింది. చాల పెద్దమ్మ.. చాల పెద్దమ్మ.. చాల పెద్దమ్మ.

'అవును.. సుజాత చాలా పెద్ద అమ్మ. అమ్మలందరికీ అమ్మ. అమ్మలందరికీ చిరునామా!' అనుకున్నాడు అతను.

* * *

ఆ సంఘటన జరిగి కొన్ని ఏళ్లు గడిచిపోయాయి. బన్నూ (శర్వాణి) వైజాగ్ లో ఎంబీబీఎస్‌లో చేరింది. ఇంతవరకూ డా.రావుకు సుజాత నుంచి ఫోన్ రాలేదు. రాదు కూడా.. ఎందుకంటే ఆమె అమ్మ. అమ్మకు ప్రేమను పంచడమే తెలుసు. తీసుకోవడం తెలియదు.

* * *

**డా.ఎం. కోటేశ్వర రావు**

వాస్తవ సంఘటనల్లోంచి పురుడు పోసుకున్నదే.. 'అమ్మ చిరునామా'. ఒక పేద యువతి గొప్ప మనసును, మాతృత్వాన్ని కళ్లారా చూసి.. ఆ తల్లి గొప్ప గాథను లక్షల మందికి అందించాలనే ఆశయంతో ఈ కథను రాశారు రచయిత డా.ఎం. కోటేశ్వర రావు. ఈయన స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు. ఉద్యోగరీత్యా 26 ఏళ్లుగా కరీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. తిరుపతి పశువైద్య కళాశాల నుంచి పశువైద్య

శాస్త్రంలో పట్టా అందుకున్నారు. ప్రస్తుతం కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రంలో పశువైద్యాధికారిగా, మాస్టర్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తొమ్మిదేళ్ల వయసు నుంచే కథలు రాయడం మొదలుపెట్టారు. 4వ తరగతి చదువుతున్నప్పుడే తొలి కథను రాశారు. పెళ్లి చూపులు, వజ్రాల వేట.. ఈయన మొదటి కథలు. మంచు తడిపిన వెన్నెల, ఇక్కడ నేరస్థులు తయారు చేయబడును, లవర్స్ పార్క్, అమృత బిందువులు, నువ్వే రావాలి, అతను? కథలు పాఠకుల్లో గుర్తింపు తీసుకొచ్చాయి. 'సూడో ఆపరేషన్' పేరుతో ఒక నవల రాశారు. చదువుకునే రోజుల్లో.. ఇదీ మన దేశం, బాబోయ్! తిరుపతి, స్వయంవరం తదితర నాటికలు రాసి.. దర్శకత్వం వహించడంతోపాటు నటించారు కూడా! చందమామ, బాలమిత్ర, బాల జ్యోతి, బుజ్జాయి లాంటి పిల్లల మాస పత్రికలతోపాటు దాదాపు అన్ని ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో వీరి కథలు, కవితలు, పాటలు, హాస్య శీర్షికలు, వ్యాసాలు, విమర్శనాత్మక రచనలు ప్రచురితమయ్యాయి. సుమారు ఏడేళ్ల కిందే ఈ కథ రాసుకొని.. తగిన సమయం కోసం ఎదురు చూశాననీ, 'నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం' కథల పోటీనే సరైన వేదికగా ఎంచుకొని, పోటీకి పంపినట్లు రచయిత తెలిపారు. అలాంటి కథకు మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉన్నదని చెబుతున్నారు.

**85558 81512**



# ఇసుక తైలం

## సమ్మెట ఉమాదేవి

మనుష్య సంచారం పెద్దగా లేని డొంకదారి గుండా.. అనుపమ ఆటో ప్రయాణం సాగుతున్నది.

లేచిన దగ్గరనుంచీ ఇంట్లో అందరికీ అన్నీ సమకూర్చి, డ్యూటీకి సిద్ధమై వచ్చిన అలసట తీరేలా, పచ్చనాకులు ఇచ్చే ప్రాణవాయువును గుండె నిండుగా పీల్చుకున్నది. సరిహద్దు సైనికుల్లా నిలిచిన కొండలను, ఆకాశపు ఒడిలో ఆడుకునే మేఘబాలలను, పంట పొలాలలో శ్రమిస్తున్న రైతు నేస్తాలను, ప్రశాంతంగా మేత మేస్తున్న పశువులను, అక్కడక్కడా విరసిన రకరకాల పూలను ఆసక్తిగా గమనిస్తూ ఆ అడవి దారిలో చేసే పదిమైళ్ల ప్రయాణం.. అనుపమను ఎంతో ఆహ్లాదపరుస్తుంటుంది.

కాస్త జోరుగా ఆటోను నడిపిస్తున్న రాజుతో..

'ఏంటి రాజూ.. వసంత ఫోన్ చేసిందా ఏంటి?' అని అడిగింది.

'అవును మేడమ్. ఫస్ట్ వచ్చింది గదా! సహారా కన్సల్టెన్సీకి బోయిన. జీతం పైసలు బంపిన్రు. వసంతతో మాట్లాడిపించిండ్రు. నెలరోజులకు నా భార్యతో మాట్లాడిన్నని సంతోషపడుదునా.. దాని ఏడ్పు జూసి నేను సుత ఏడుద్దునా సమజైతలే మేడమ్!' బాధపడ్తూ అన్నాడు రాజు.

నిత్యం ఆ దారిలో.. అనుపమతో తన కుటుంబపు సంగతులెన్నో పంచుకుంటుంటాడు రాజు. ఆర్థిక సమస్యల వల్ల వసంతను కువైట్‌కు పంపించాడేగానీ.. ఆమెను విడిచి ఉండలేకపోతున్న బెంగ, అంతదూరం పంపించి తప్పు చేశానేమోనన్న అపరాధ భావపు సంఘర్షణను అనుపమతో వెళ్లబోసుకుంటూనే ఉంటాడతను.

'ఒకసారి మా తమ్మునికి జబ్బు జేసిందని బొజ్జాయి గూడెంల సమ్మక్క సారలక్క గద్దెల కాడ.. వానెత్తు బంగారం (బెల్లం) తూస్తనని మా అమ్మ మొక్కుకున్నది మేడమ్. మా తమ్ముని మొక్కు చెల్లించుకుంటాంటే.. ఆడ, వాళ్ల దోస్తులకు కొబ్బరి ముక్కలు, బంగారం బంచుతున్న వసంతను జూసిన. బంగారమోలే ఉన్నదనుకున్న. ఇగ లవ్వు గిట్ల ఏమీ లేదుగానీ మేడమ్. అనుకోకుంట ఆ పక్కూర్లో పిల్లను జూస్తానికి బోయి స్టన్ అయిన. ఎందుకంటే.. ఆడ గా పెండ్లిపిల్ల గా వసంతనే. వాళ్లు మా దోస్త్ నారాయణకు చుట్టాలేనంట. నేను వసంతను మొదాలే సమ్మక్క జాతరల జూసిన్నని, ఆమె నాకు మస్తు నచ్చిందని వాళ్ల పెద్దోళ్లకు చెప్పులే. మొదాలు వాళ్లు నా గురించి ఏమంటారా అని

మస్త్ టెన్షన్ వద్దు మేడమ్.

అనుకున్నట్టే.. 'రాజూ! మీది పెద్ద కుటుంబమని వసంత వాళ్ల అమ్మానాయినలు నీతో పెండ్లి వొద్దని అనుకుంటున్నరురా.. వాళ్లు గా పిల్లను నీకిచ్చి పెండ్లి జేసేటట్టేం గనిపిస్తలేదురా' అని నారాయణ జెప్పిండు. గా మాటలకు మస్తు పరేషానైన. ఇగ గిట్ల గాదని వాణ్నే బతిలాడుకుని, వసంత ఇంటికి బంపి.. వాని ఫోన్లనించి నేనే వసంతతో మాట్లాడిన. 'వసంతా! నాకిద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడున్నది నిజమే. ఉన్న చిన్న ఇల్లుదప్ప భూమి, బంగారం ఏమీ లేదు. లేనివి ఉన్నట్టు నేనేమీ అబద్ధం జెప్పుతలే. గరీబ్ గాళ్లమని, పెద్ద కుటుంబమని మీవోళ్లు పిల్లను ఇయ్యనీకి భయపడ్తున్నరని దెల్సింది. నువ్వు ఎట్లన్నజేసి మీ వోళ్లను ఒప్పిస్తే.. నేనైతే నిన్ను మంచిగ జూసుకుంటా. గంతవరకైతే మాటిస్తున్నా. నువ్వేం పారేషన్ గాకు. మీరు కూడా నాకు కట్నం గిట్నం ఇచ్చుడు అవుసరమే లేదు. జర మావోళ్లకు బట్టలు బెట్టి పెండ్లి మంచిగ జేయుండ్రి. మా వోళ్లకు నేను జెప్పుకొనేది నేను జెప్పుకొంటా. మీ వోళ్లకు నువ్వు జెప్పుకో! ఇగ నేను గిట్ట.. నీకు సుత నచ్చకుంటే జేసేదేం లేదు. గీ జన్మకి గింతే అనుకుంటా' అన్న మేడమ్. ఆమె ఏమీ బదలు జెప్పలేదు. వారం దినాలు పిచ్చోడి తీరుగా ఎదురుజూసిన. తరువాత దెల్సింది. బువ్వ గూడ దినకుండ.. కుద్దుగా రాజునే జేసుకుంటనని జిద్దుజేసి వాళ్లను ఒప్పించిందని. ఎంత మురిసిపోయిన్నో!'..

రాజు తన గుండెల్లో వసంత పట్ల ఉన్న ప్రేమనంతా చెప్పుకొన్నాడు.

'అస్సలు నాకూ గట్ల కుయ్యట్ బంపనీకి ఇష్టమే లేకుండే మేడమ్. వచ్చిన పైసల్ కిరాయికి దెచ్చుకున్న ఆటోకి గట్టనీకి, ఇంట్లోకి తిండిగింజలకే సరపోతాంటే.. ఇగ చెల్లెళ్ల పెండ్లిళ్లు ఎట్లా జేస్తా.. తమ్ముణ్ని, మా పిల్లగాల్లను ఎట్ల సదివిపిస్తనన్న రంది వట్టుకున్నది నాకు. ఇగ ఎనకనుంచి మా అమ్మేమో.. 'కుయ్యట్‌ల సుత.. ఇంటిపని జేసుడే గదా! మస్తు పైసలొస్తయంట. నీ పెండ్లాన్ని కుయ్యటుకు బంపు!' అని సతాయించవట్టె. నేనైతే బంగ్లాలూ, బిల్డింగ్‌లు కట్టకున్నా.. మా చెల్లెళ్ల పెండ్లిళ్లు జేయాల్ననీ, తమ్ముణ్ని, నా బిడ్డలను మంచిగ చదివించాల్ననీ జర పైసలకు ఆశవడిన. వసంత సుత పాపం.. 'రెండేండ్లు కండ్లు మూసుకుంటే అన్నీ సక్కబడ్తయి గదా!' అనుకున్నది. గుండెను బండ జేసుకుని బండ చాకిరీ జేసేటందుకు బయలెల్లింది'..

ఆర్థిక పరిస్థితులు, ఆశలూ వాళ్ల జీవితాన్ని ఎట్లా మలుపు తిప్పినాయో.. రాజు చేప్తుంటే మౌనంగా వింటుండేది అనుపమ.

'ఆడీడ దెచ్చి ఏజెంట్‌కు లక్ష రూపాయలు గట్టి.. జర ధైర్నంజేసి వసంతను బంపిన. 'ఊకె రందివడకు రాజూ! ఇసుక నుంచి తైలందీసే పైసల్‌గల్ల మారాజులు ఆళ్లు. ఆళ్లకు పనులు జేసేటోళ్లు గావాల. జరంత కష్టబడ్తే ముట్టే తైలం మనకు గావాల. అందుకే మనోళ్లు మస్తుమంది ఆడికి బోతున్నారు. నువ్విచ్చిన సొమ్ము.. నీ భార్య నీకు మూడునెలల్లో సంపాదించి పంపుతది' అన్నడు ఏజెంట్. వసంతను ఆడ ఎవ్వళ్లకో

అప్పుజెప్పిండు. ఆళ్లు నెలరోజులు పిల్లి పిల్లను దిప్పినట్టు ఆ ఇంటికి ఈ ఇంటికి దిప్పి.. మొత్తానికి ఒగకాడ పనికిబెట్టింద్రు. కుయ్యేట్‌కు బోయిన కొత్తలో ఫోన్ల మాట్లాడిన పావుగంటల.. పిల్లలు ఎట్లున్నరని అడుగుకుంట.. ఆడి సంగతులన్నీ హుషారుగ జెప్పేది. ఆళ్ల బాష నేర్సుకుంటున్ననని, రెండుమూడు తీర్ల చాయ్ వెట్టుడు నేర్సుకున్నననీ, పిల్లగాండ్లకు గదేందో ఓవెన్ డబ్బాల నాస్తాలు జేస్తున్ననని జెప్పేది. గది గూడా ఐదారున్నెల్లే. ఆడినుంచి పిల్లలమీద బెంగబెట్టుకొని వసంత ఏడ్వని నెల లేదు మేడమ్. వసంతను కుయ్యేట్‌కు బంపవట్కే ఆటోగొన్న. పిల్లల్ను మంచి బడిల ఏసిన. చెల్లెళ్లు జర మంచి బట్ట గడతాంద్రు.. కానీ, ఏందో పెద్ద తప్పుజేసిన్నని మస్తు బాధనిపిస్తాంటది.. ఏం జెయ్యాల్నో సమజైతలేదు మేడమ్!'..

రాజు ఇలా రోజూ వసంత గురించిన కబుర్లు చెప్తుంటే.. అనుపమ చాలా కదిలిపోతుంటుంది. ఉదయం ఏడున్నరకు ఇంట్లోనుంచి బయల్దేరి మళ్లీ ఏడింటికి ఇల్లు చేరుతుంటేనే.. ఏమిటీ ఈ బతుకు అనిపిస్తుంటుంది. అట్లాంటిది పిల్లలను, కుటుంబాన్ని వదిలి, దేశంకాని దేశంలో వసంతలాంటి వాళ్లు ఎన్నిపాట్లు పడ్తున్నారో కదా! అనిపిస్తుంటుంది. ఈ అడవి దారులగుండా రోజూ తనను సురక్షితంగా తీసుకెళ్తూ, సమయానికి ఆఫీస్‌కు చేరుస్తున్న రాజు అన్నా, అతని నిష్కల్మషమైన వ్యక్తిత్వమన్నా ఎంతో అభినమానం ఏర్పడిందామెకు. ఎలాగైనా రాజుకు ఏదన్నా సహాయం చేయాలనిపించేది.

అలా అనుకున్న కొన్నాళ్లకు అనుపమ కోసం ఆమె తమ్ముడు అమెరికా నుంచి ఒక మంచి ఫోన్ పంపించాడు. తను వాడుతున్న ఫోన్ అమ్మేసే బదులు రాజుకిస్తే అప్పుడప్పుడూ తన భార్యను చూసుకుంటాడు. ఈ రకంగానైనా ఆ జంటకు కాస్త సాంత్వన దొరుకుతుంది కదా! అనిపించి.. ఆ ఫోన్‌ను రాజుకు ఇచ్చేసింది. ఇక అతని ఆనందానికి అవధులు లేవు.

* * *

ఇప్పుడు రాజు నెలకోసారి తన భార్యను వీడియో కాల్‌లో చూసుకుంటున్నాడు. అక్కడి దివాణంలోని పిల్లలకు రోజూ సాయంత్రం పూట ఖురాన్ బోధలు చేసే ఫాతిమా ఆపాకు.. వసంతంటే మంచి అభిమానం ఏర్పడింది. ఒకసారి ఆమె బరువు తూచుకునేందుకు లోపలికి వచ్చి..

'జరా వజన్ కా మెషీన్ దేవ్' అని అడిగిందట. అప్పుడే పిల్లలు గుర్తుకొచ్చి కన్నీళ్లతో కూర్చున్న వసంతను చూసి కదిలిపోయి..

'రోనా మత్ అమ్మా..' ఓదార్చిందట.

వసంత తన పిల్లల గురించి బెంగపెట్టుకున్నదని తెలిసి అప్పుడప్పుడూ ఆమె వసంతకు రహస్యంగా తన ఫోన్ ఇవ్వసాగింది.

అక్కడ ప్రతీ శుక్రవారం ఉదయం ఆ ఇంట్లో అన్నదమ్ములు, బంధుమిత్రులతో..

వచ్చీ పోయేవారితో ఆ దివాణం చాలా సందడిగా ఉంటుందట. ఆ సమయంలో వాళ్లందరికీ కావాల్సిన నాస్తాలు, రెండుమూడు రకాల చాయ్‌లు ఏర్పాటు చేసి.. వాళ్లందరూ మాట్లాడుకుంటుండగా వసంతకు ఫోన్ ఇస్తుందట ఫాతిమా.. ఆ కాసేపు వసంతకు పండగే.

అనుపమను ఆఫీసుకు చేర్చే సమయంలోనే వచ్చే వసంత ఫోన్లవల్ల.. కువైట్ సంగతులు కొన్ని తెలిశాయి అనుపమకు. అక్కడ ఆర్థికంగా ఉన్నత వర్గానికి చెందినవాళ్లే ఎక్కువ. చాలావరకు ఇళ్లన్నీ పెద్ద మహల్లలాగా, దివాణంలాగా ఉంటాయి. పైన గదులన్నీ ఆఫీసులకు, మగవారి ఇతర కార్యకలాపాలకు ఉపయోగిస్తారు. లోపల నివాస గదులు.. అండర్ గ్రౌండ్‌లో ఉన్నట్టు దిగువగా ఉంటాయట. వివిధ ప్రాంతాల నుంచి పనులకోసం వచ్చే ఆడవాళ్లకు, మెట్లకింద కట్టినవో మరో రకానివో.. ఐదారుగురికి కలిపి ఐదారు మంచాలున్న చిన్నచిన్న గదులు ఇస్తారు. కొందరికి బియ్యం, పప్పు, నూనె ఇస్తారు. మిగితావన్నీ ఎవరివి వారే కొనుక్కోవాలి. మంచీచెడూ అంతటా ఉన్నట్టే.. అక్కడి యాజమానుల్లోనూ దయామయులు ఉంటారు. రాక్షసంగా ప్రవర్తించే వాళ్లూ ఉంటారు. వేరే దేశాలనుంచి వచ్చిన మగవాళ్లు భవన నిర్మాణ పనులల్లోనూ, వ్యవసాయ పనుల్లోనూ, డ్రైవర్లుగానూ పనిచేస్తున్నారు. ఒక దినార్ సుమారు రెండువందల డెబ్బై రూపాయలు ఉంటుంది. వీళ్లకిచ్చే జీతాలు మాత్రం డెబ్బై నుంచీ వందా, నూటిరవై దినార్లు.. అలా ఉంటాయి. ఆ కాస్త జీతంలో వాళ్ల ఖర్చులకు ఉంచుకుని, కుటుంబానికి పంపుకోవడానికి ఆడా, మగా నిరంతరం శ్రమిస్తుంటారు. ఒక్కోసారి వేరేప్రాంతం వాళ్లు వీళ్ల సొమ్ము కాజేయడం కూడా జరుగుతుందట. ఇక ప్రపంచంలోని ఏ ప్రాంతం ఆడవాళ్లకైనా.. లైంగిక రక్షణ అనేది ఎప్పుడూ ప్రశ్నార్థకమే..' అని వసంత మాటల్లో విన్నప్పుడు.. అనుపమకు చాలా బాధనిపించింది.

* * *

సమయం ఎనిమిది కావొస్తున్నది. అనుపమ ఆటోలో ఆఫీస్‌కు ప్రయణమయ్యింది.

'మనకు, కుయ్యటోళ్లకు రెండున్నర గంటలు తేడా అంట మేడమ్. ఇప్పుడు వసంత వాళ్లకు పదిన్నర ఐతదేమో. ఆళ్లయితే జీతమిచ్చిన ఒక్కరోజే వసంతతో మాట్లాడిపిస్తరు. మీరు నాకు మంచి ఫోన్ ఇచ్చుడు, ఆ తల్లి ఫాతిమా ఆపా పుణ్యమా అని శుక్లారం శుక్లారం మాట్లాడిపిస్తాంది. అంతా అమ్మతల్లి దయ. కానీ, వసంత సంతోషంగా లేదు మేడమ్. వచ్చేస్తనని మస్తు ఏడుస్తున్నది'.. ఆటో నడుపుతున్న రాజు దిగులుగా అన్నాడు.

'మేడమ్.. ఎప్పటితీరు ఆ సింతచెట్టుకాడ ఆపుత. ఆడ మీరు టిపినీ తిందురుగానీ' అన్నాడు.

పెద్దగా అలికిడి లేని దారిలో ఉన్న చింతచెట్టు దగ్గర ఆటో ఆపాడు రాజు.

అనుపమ రాజుకొక అరటిపండు ఇచ్చి, తాను బాక్స్ తీసుకుని తినడం ఆరంభించి..

'ఏంటి రాజూ! ఇవ్వాళ శుక్రవారమనా అంత హడావుడి పడుతున్నావు' అని అడిగింది.

'అంతేకదా మేడమ్!' అన్నాడో లేదో రాజు ఫోన్ మోగింది.

ఆటో పక్కన నిలిచి మాట్లాడసాగాడు. అంతటి నిశ్శబ్ద వాతావరణంలో.. ఆమె మాటలు స్పష్టంగా బయటికి వినపడసాగాయి.

'ఎట్లున్నవు వసంతా?' అని రాజు అడిగాడో లేదో.. కస్సుమన్నది వసంత.

'ఎట్లుంట!? నేనేమన్న జాగీర్దారీ కొలువుకు బోయిన్నా? పనిమనిషిగ బోయిన. వంటమనిషిగ బోయిన. నా బిడ్డలకు ఒక్కబుక్క బువ్వ దినిపించకున్నా.. దేశంగానీ దేశంల ఎవ్వళ్ల బిడ్డలకో చాకిరీ జేస్తున్న. బాసన్లు దోముడు, ఇల్లు తుడ్సుడూ, బట్టలుతికి ఇస్త్రీలు జేసుడు, వొండుడు వొడ్డించుడూ.. అన్నీ నా పనులేనాయేనని సంబురపడ్తున్న..' గట్టిగా అరిచింది.

అంతలోనే బోరుమని ఏడుస్తూ..

'నేనీడ ఉండ.. రాజూ! ఏమన్నజేసి ఏజెంట్ రాందాసును బతిమ్లాడి నన్ను ఎన్కకు బిలిపియ్యి. నేను అచ్చేస్తా రాజూ! పిల్లలను సూడాల్నని పాణం తన్నుకలాడుతాందయ్యా..' వసంత వెక్కిళ్లు పెడ్తున్నది.

'గట్లేడ్వకు వసంతా. మాకు మాత్రం నిన్ను సూడాల్నని లేదా? చిన్నపోరడైతే.. 'అమ్మను దీస్కరా!' అని ఒక్కతీరు లొల్లివెడ్తలేడు. ఊకో వసంత! నువ్వు గట్లేడిస్తే ఈడ నేను ఎట్లుంట జెప్పు!?' రాజు కూడా కన్నీళ్లు పెట్టుకున్నాడు.

అనుపమ ఇక తినలేక బాక్స్ మూసేసి మౌనంగా కూర్చున్నది.

'ఒగల తోడు లేకుంట, పుట్టింటికి సుత ఏనాడూ బంపలేదు. గసొంటిది ఒంటరిగా నన్ను ఎడారికే బంపినవ్. ఈడ సుత పిల్లలున్నరు. వాళ్లు నా పిల్లలు గారు. మనుసులున్నరు కానీ, వాళ్లు నా వోళ్లుగారు. తిన్నా తినకున్నా ఎవరికి పట్టదు. రోగమొచ్చినా, బాధొచ్చినా జరంతసేపు కాళ్లు ముడుసుకుని పండనీకి లేదు. ఛీ.. ఏం బతుకిది!?' మాట్లాడుతూనే ఎవరో వచ్చిన అలికిడికి ఫోన్ కట్ చేసింది.

అనుపమకు ఆఫీస్ టైమ్ అవుతున్నా.. ఆటో పక్కకు వెళ్లి నిశ్శబ్దంగా ఏడ్చుకుంటున్న రాజును తొందరపెట్టి పిలవలేదు. వారంవారం రాజు ఫోన్ కోసం ఆత్రంగా ఎదురుచూడటం.. వసంత ఏడుస్తూ మాట్లాడటం.. రాజు బాధపడటం.. ఇలా కొన్నివారాలుగా జరుగుతూనే ఉన్నది.

* * *

మరో నెల గడిచిపోయింది. ఒక శుక్రవారం వసంత చెప్పిన మాటలకు

రాజుతోపాటు అనుపమ కూడా అమితంగా కదిలిపోయింది. అది ఓ ఆడదాని వేదన అనాలో, ఒక కన్నతల్లి ఆక్రోశం అనుకోవాలో అర్థం కాలేదామెకు.

'నేను ఈడ ఉండను రాజూ! వెంటనే ఏజెంట్ రాందాసుకు చెప్పి టికెట్ తీపియ్యి' అని ఏడ్చింది.

'ఏజెంట్‌కు, మా అమ్మకు ఏం జెప్పాలే?'.. ఒకింత అయోమయంగా అన్నాడు.

'సచ్చిపోయిన అని జెప్పు. నేను బతికున్నాననే కదా! సంపాదించి పోస్తనని జూస్తున్నరు.. నేను సచ్చిపోతే సంపాదన ఆగిపోతది కదా! సచ్చిపోయిన అనుకోండ్రి.. నా పిల్లలను నాకిస్తే చాలు. మీకు దూరంగా యాడకన్నా బోయి బతుకుతా. ఈ కట్టమేదో నా సొంతగడ్డ మీద జేసుకుంటా! మనిషినని మర్శిపోయి గానుగెద్దు తీరు పనిజేస్తున్న రాజూ! మనిషినని మర్సిపోతున్నగానీ.. ఆడిదాన్నని మర్సిపోలేకపోతున్న! ఛీ.. ఈల్లసలు మనుసులేనా!? ఒక్కొక్కళ్లకు ఇద్దరు ముగ్గురు పెండ్లాలున్నా కుతిదీరదు ఈళ్లకు. గా పెద్దసారు తమ్మునికి నా మీద కన్నువడ్డది రాజూ.. ఎట్లెట్లనో జేస్తున్నడు. ఇగ నేనీడ ఉండనంటె ఉండ! ఈ ఇల్లొదిలి ఇంకో ఇంట్ల పనికి కుదిరినా.. ఆడ మంచోల్లే ఉంటరని గ్యారంటీ లేదు. కుయ్యేట్‌కు బోవుడంటే.. పిల్లగాళ్లకు కడుపునిండా కూడు బెట్టుడు అనుకున్న గానీ, నా కుతికకు నేనే ఉరి బోసుకునుడని అనుకోలేదు రాజూ!'.. వసంత ఏడుస్తున్నది. రాజు ఒక్కక్షణం మౌనం వహించగానే..

'రాజూ! ఇగ ఆడిదాన్నని కూడా మర్సిపొమ్మంటవా!? గట్లయితే.. మర్సిపోతగానీ.. అమ్మనని మాత్రం మర్శిపోలేను. పిల్లలను సూడకుండ ఉండలేకపోతున్న రాజూ!'..

ఫోన్ కట్టయ్యింది. బరువుగా అడుగులేస్తూ ఆటో ఎక్కిన రాజు..

'కుయ్యేట్ వంపే ఏజెంటు.. 'మీ ఆడోళ్లకు పిల్లలు వుట్టకుంట ఆపరేషనైందా!?' అని అందర్ని ఊకె అడుగుతాంటే.. ఆపరేషన్ అయినంక కూడా మంచిగ పనీపాటలు జేస్తున్నరా లేదా తెలుసుకోనీకి అడుగుతున్నడు కావచ్చు అనుకున్నం మేడమ్. 'గస్వంటివి ఏం ఉండయి! ఇంటి పనులే జేపించుకుంటరు.. గంతే!' అని నమ్మిచ్చిండు. అసల్కే పిల్లలను, తల్లిని దూరంజేసిన పాపం నాకొద్దని బాధపడ్తాన్న! ఇప్పుడసలు ఆ మనిషి నాకు దక్కుతదో లేదోనని భయమేస్తాంది మేడమ్!'.. ఏడుస్తూనే ఆటోను ముందుకు పోనిచ్చాడు.

* * *

మర్నాడు అనుపమను తీసుకెళ్లడానికి ఆటో తీసుకుని మధు వచ్చాడు. ఎప్పుడైనా రాజుకు రావడం వీలుకానప్పుడు అతని దోస్త్ మధును పంపుతుంటాడు.

'రాజు నిన్న రాత్రే ఆటోను అమ్మేశాడు మేడమ్. ఆ పైసలతోని ఏజెంట్‌కున్న బాకీ కట్టి, వసంతకు టిక్కెట్ దీస్తడంట!' అని చెప్పాడు.

ఓ కన్నతల్లి తన బిడ్డలను చేరుతున్నందుకు అనుపమ చాలా హాయిగా ఊపిరి

పీల్చుకున్నది.

పదిరోజుల తరువాత అనుపమను ఆఫీస్‌కు తీసుకెళ్లడానికి కిరాయి ఆటో తీసుకుని వచ్చిన రాజు.. ఓ ఐదు కేజీల బెల్లం తెచ్చి అనుపమకు ఇచ్చాడు.

'ఏంటి రాజు ఇదీ?' అని ఆశ్చర్యంగా అడిగారు అనుపమ దంపతులు.

'సమ్మక్క గద్దెలకాడ వసంత ఎత్తు బెల్లం తూకం ఇద్దమని అనుకున్న మేడమ్. 'నా తీరు బాధపడ్తున్న ఇంకొక నలుగురిని సుత సొంత దేశానికి పంపనీకీ సాయం జేసిన ఫాతీమా ఆపా అరవైఎనిమిది కేజీల బరువుంటది. ఆమెత్తు బంగారం మొక్కు దీర్సుకుందం రాజు..!' అన్నది వసంత. ఆ తల్లి కడుపు సల్లగ.. ఆ ప్రసాదమే దెచ్చిన మేడమ్..!' అని చెప్తున్న రాజు ముఖంలో.. పున్నమి చంద్రుని కళలు వెల్లివిరిసాయి.

***

## సమ్మెట ఉమాదేవి

తను చూసిన ఓ ఆటో డ్రైవర్ – గల్ఫ్ దేశంలో ఉండే అతని భార్య కష్టాలు, వారి నిస్సహాయ జీవన సారాంశాన్నే 'ఇసుక తైలం'గా మలిచారు రచయిత్రి సమ్మెట ఉమాదేవి. వీరి స్వస్థలం ఖమ్మం. ప్రస్తుత నివాసం హైదరాబాద్. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసి, విరమణ పొందారు. ఇప్పటివరకూ దాదాపు 150 కథలు రాశారు. అమ్మ కథలు, రేలపూలు – తండావాసుల కథలు, జమ్మి పూలు, సమ్మెట ఉమాదేవి కథానికలు పేరుతో కథా సంపుటాలను వెలువరించారు. ఇక బాలసాహిత్యంలోనూ.. అల్లరి కావ్య, పిల్లల దండు, నిజాయతీ, పిల్లి ముసుగు, ఏమి చేస్తారు? ఏమేమి చేస్తారు? ఏక కథా పుస్తకాలుగా, మా పిల్లల ముచ్చట్లు – ఒక టీచర్ అనుభవాలు, చిలుక పలుకులు, నిక్ అంటే ప్రేరణ – నిక్ వుయిచిచ్ విజయ గాథ.. పుస్తకాలను వెలువరించారు. కావలి సాహితీ వారధి, మాడభూషి రంగాచార్య, గోవిందరాజు సీతాదేవి, నందివాడ శ్యామల, ఎమ్మెస్సార్ స్మారక సాహితీ పురస్కారాలను అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి ప్రతిభా పురస్కారం, తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సాహితీ పురస్కారం, తెలంగాణా పరిషత్ ధర్మనిది పురస్కారం, మహాకవి సినారె కళాపీఠం పురస్కారం, అపురూప విద్యా పురస్కారాలు, కవితా విద్యా సాంస్కృతిక, మంగాదేవి.. బాల సాహితీ పురస్కారాలను పొందారు. బాల సాహిత్యంలో విశేష కృషిని కొనసాగిస్తున్నారు.

–98494 06722

# ఒక మిలంతి కల



## మల్లిపురం జగదీశ్

'మిలంతి' మా ఊరి కోడలు పిల్ల.

మోహనగాడు రెక్కపట్టి తెస్తే.. (రెక్కపట్టడం = ఎత్తుకువచ్చి పెళ్లాడటం, గాంధర్వ వివాహం) మా ఊరొచ్చిన ఇల్లాలు. వచ్చిన కొద్దిరోజుల్లోనే ఆ పిల్ల అందరి తల్లో నాలుక అయిపోయింది. ఎలాగంటే.. పనంటే చాలు పరిగెడుతుంది. అది 'మనదా, పక్కింటోళ్లదా!?' అని చూడదు. బొరిగో.. కంకో (కంక = బొరిగి లాంటి ఒక పని ముట్టు) చేత బట్టుకుని బయల్దేరిపోతుంది. గొప్పు తవ్వడమో.. కొండ తువ్వడమో.. (రెండు పనులూ ఒకటే కానీ.. నేల చేస్తే 'తవ్వడం'. అది బొరిగితో చేస్తారు. కొండపైన చేస్తే 'తువ్వడం'. అది కంకతో చేస్తారు).. తుప్ప నరకడమో.. గాబు తియ్యడమో.. చింత బొట్టలేరడమో.. చీపుళ్లు కట్టడమో.. పనసకాయ చెట్టు దించడమో.. కందులు గింజ కొట్టడమో.. ఏదో ఒక పనిలోనే ఉంటుంది పొద్దల్లా. దాన్ని పలకరించాలంటే మనమూ ఆ పనిలో ఉండాలి.

ఓ రోజు..

ఆరికోల చింత బొట్టలు ఒలిచి ఎండలో ఆరేస్తున్నది.

'అది మన పని కాదు గదే?' అని అడిగితే..

'సెయ్యడానికి పని మనదే అవ్వాలేటి బావా? ఆ పని సేసేస్తే ఆళ్లు మనోల్లైపోరా?' అని తిరిగి ప్రశ్నించింది.

అందుకే..

అది అందమైన పిల్ల...

ఎంత అందగత్తె అంటే.. ఎప్పుడు చూడూ చెమటతోనే మెరుస్తుంటుంది.

అది అందమైన పిల్ల...

ఎంత అందగత్తె అంటే.. దాని చేతిలో ఏదోఒక పని ముట్టు కదులుతూనే ఉంటుంది.

అది అందమైన పిల్ల...

ఎంత అందమైన పిల్ల అంటే.. పనితో మనుషుల్ని ముడేస్తూనే ఉంటుంది.

అలాంటి అందగత్తె నీళ్లోసుకుంది. మోహన గాడికే కాదు.. మా ఊరోళ్లందరి కళ్లల్లో వనాలు మొలిచేయి. ఒక్కొక్కరూ ఒక్కోలా పలకరించేరు.

'ఏటే మనవరాలా! పుల్ల మామిడి బెల్లం కూర తేవాలేటే?' అని కురమ తాత దాని తల మీద చెయ్యేసి ప్రేమగా నిమిరేడు.

'ఓలె ఒదినే! జిలేబి పొట్లం తెప్పిస్తానైతే మీ యన్నకి సెప్పి?' అని పక్కింటి గయారి పలకరించింది.

మిలంతి మాత్రం నవ్వుతూనే సిగ్గుపడింది. లోలోపల బిడ్డను తలుచుకుంది. మోహన గాడి కౌగిలిని తలచుకుని తన్మయత్వంతో గెడ్డలో స్నానానికి దిగింది.

ఆ గెడ్డ మా ఊరి దారికి కింద పారుతుంటుంది. ఆ దారి కింద ఊర్లతో మమ్మల్ని కలుపుతుంటుంది. మరో ఊరికి చేరాలంటే ఆ దారిలో గెడ్డ దాటాల్సిందే. ఆ గెడ్డ నిరంతరమూ పారుతుంటుంది. ఇంకడమెరగని ఇరుకు గెడ్డ. ఇరుకవడం వల్లే దానిని 'దొంగ గెడ్డ' అని కూడా అంటాం. ఎండా కాలంలో ఎంత మంచిదో.. వానా కాలంలో అంత ప్రమాదకరమైనది. ఎగువన ఏ కొండ మీద మేఘం కరిగినా దీని ప్రవాహం ఉధృతమవుతుంది. ఎప్పుడు ఎలా పారుతుందో మా ఊరోళ్లే కాదు.. ఆ గెడ్డ దాటిన ఏ ఊరోళ్లూ అంచనా వెయ్యలేరు. ఎగువున ఏ కొండ మీద వాన కురిసినా.. మా రాకపోకలు ఆగిపోతాయి. మబ్బు చూసి గెడ్డ దాటాల. చినుకు పసిగట్టి దారి నడాల. తేడా వచ్చిందో ఊరితోనే కాదు.. ఈ లోకంతోనే సంబంధాలు తెగిపోతాయి. ఇది తెలియక గెడ్డ దాటుతున్న పశువులు ఎన్నో కిందికి కొట్టుకుపోయాయి. ఆ ప్రవాహ వేగానికి జారి కింద రాళ్లకు గుద్దుకుని ప్రాణాలొదిలేయి. అప్పుడెప్పుడో ఇద్దరు మనుషుల్ని కూడా కోల్పోయింది కొండ. అది గెడ్డ తప్పు కాదు. ఏ కొండల మీంచి పారిన నీరో.. ఇక్కడ ఇలా గెడ్డగా పారుతుంది. రెండు కొండలు కలిసే చోటు. దాని మీంచి మా ఊరి దారి.

అక్కడ ఒక సిమెంట్ చప్టా కట్టాలని ఎగువూర్లన్నీ డిమాండ్ చేసేయి. ఎగువూర్లేటి.. మా ఊరికి దారవుద్దంటే మీమూ కలిసేము ఆళ్లతోటి. సర్పంచ్ ఎన్నికల్లో ఆ సిమెంట్ చప్టా ఒక వాగ్ధానమయింది. సర్పంచులు మారేరు గానీ అక్కడ సిమెంట్ చప్టా నిర్మాణం మాత్రం జరగలేదు. అక్కడికి సిమెంటు బస్తాలు మొయ్యడం సాధ్యం కాదని ఒకడూ.. సిమెంటు తెచ్చినా ఇసుక బస్తాలు నప్పడం అసాధ్యమని మరొకడూ.. అనీ అనీ వాళ్ల పదవీకాలాన్ని దాటించేసారు కానీ, ఆ దారికి ఒక సిమెంట్ నిర్మాణాన్ని ఇవ్వలేకపోయేరు.

అక్కడ ఖానా కట్టాలంటే ఆ గెడ్డకి ఇవతల దారి చదును చెయ్యాలని తీర్మానించేరు కొన్నాళ్లకి. కొండ మీద దారి ఖర్చుతో కూడుకున్నది. మేము ఓటర్లుగా తప్ప మరే లెక్కల్లోనూ దొరకని వాళ్లం. అందుకే ఆ దారి సర్పంచ్ ఎన్నికల్లో వాగ్దానంగా మాత్రమే మిగిలిపోయింది.

కానీ మాకు..!?

ఆ దారి.. సంత దారి! ఈ ప్రపంచానికి మేమున్నామని తెలిపే మసక మసక చిరునామా! ఆ దారి.. కొండంత చీకటిలో కిరసనాయిలు బుడ్డీ. అదీ లేకపోతే మిట్ట మధ్యాహ్నమైనా చీకట్లో అడుగులేస్తున్నట్టు ఉంటుంది. అందుకే.. ఆ దారి మీద చప్టా కొన్నాళ్లు వాగ్ధానంగా నడిచింది. నడిచి నడిచి అలిసిపోయిందేమో! మరి కొన్నాళ్లకి వానలో కొట్టుకుపోయింది. కొన్నాళ్లు అప్లికేషన్లలో అర్జీగా నడిచింది. గ్రీవెన్స్ హాల్లో అధికారుల ముందు దర్జాగా నిలబడి మా ఊరికి పేరుందని గుర్తుచేసి కలలకు అలవాటు

చేసింది. మా ఊరోళ్లందరి సగటు కలేమిటో తెలుసా? హాయిగా నడవడం. భూజాన బరువెంతున్నా.. కాళ్లు స్వేచ్ఛగా కదిపి హాయిగా నడవడం. అంతే! అంతకు మించి మా ఊరి వాళ్లెవరూ పెద్దగా ఏ కలా కనరు.

మా ఊరు డెవలప్పైపోయిందని మా తుఫాను గాడు అన్నాడో రోజు! అందరూ కళ్లెర్రగించి ఆడివైపు చూస్తే అన్నాడూ..

'ఖానా కావాలన్నాము.. రోడ్డు వేస్తామన్నారు. ఒకప్పుడు మన ఊరి గురించి సర్పంచులే మాట్లాడోళ్లు. ఇప్పుడు.. ఎమ్మెల్యేలూ మాట్లాడుతున్నారు. సర్పంచుల నుంచి ఎమ్మెల్యేల స్థాయికి ఎదగడం అభివృద్ధి కాదేటి?' అని ఎటకారంగా కళ్లెగరేసి అందరికీ ఒకటే సమాధానం ఇచ్చేడు.

నీళ్లోసుకున్న మిలంతి అందరిలాంటి కలలే కన్నాది గానీ.. కొద్దిగా.. వేరుగా!

చప్టా కట్టాల్సిన చోటునానుకునే ఆమె కన్నోరు పోడు కొండ ఉంది. ఆ పోడు పనుల్లోనే మోహనని తొలిసారి చూసింది. అక్కడే వాడితో తొలి ముచ్చటలాడింది. ఊసులాడింది. పాటలు పాడింది, పదం కట్టింది. కంక పట్టి కొండ తువ్వింది. కందికాయల్ని గొడ్డలమ్మకు కట్టి మొక్కులు మొక్కుకుంది. అందుకే ఆ పోడు కొండంటే ముచ్చట పడింది. పోడు కింది నుంచి సాగుతున్న దారి మీద, దారి పక్కన కాగు చెట్టు మీదా ఎక్కడ లేని మక్కువ పెంచుకుంది. ఆ దారి నడిచిన చుట్టుపక్కల ఊరివాళ్లు పలకరిస్తుంటే.. పలవరించింది. ఆ దారి దాటాల్సిన గెడ్డతో కూడా నిర్వచించలేని అనుబంధాన్ని ఏర్పర్చుకుంది.

ఆ కాగుచెట్టు నీడన ఎన్నిసార్లు సేదతీరిందో!

మిట్టమధ్యాన్నం.. కాగు నీడన సల్దిగిన్నెలో గెంజన్నం తినడం ఆమెకున్న అపురూప దృశ్యాల్లో ఒకటి. కొండనానుకొని పారుతున్న గెడ్డకి చప్టా కడితే.. కాగు చెట్టు నీడ దాని మీద పడతాది. ఆ నీడ కింద అంటే చప్టా గట్టు మీద కూర్చుని గెంజిమెతుకులు తినొచ్చు అనుకుంది. అప్పుడు గెడ్డ దాటుతున్నోళ్లందరూ అక్కడాగి పని చేసుకుంటున్న తనని పలకరించే దృశ్యం ఆమె కళ్లలో మెదలాడింది.

అప్పుడెప్పుడో ఓ రోజు ఆ కాగు చెట్టుకి వేలాడుతున్న ఉట్టి దించుతున్నప్పుడు మరో కల కనింది. ఆ కొమ్మకు ఉట్టికట్టినట్టే ఉయ్యాల కట్టాలని. ఉయ్యాట్లో బిడ్డకి జోలపాడాలని.

అప్పుడే.. కొండ గాలి వీధుల్లోంచి.. గగన శిగల శిఖరాల మీంచి.. తేలియాడుతూ వస్తున్నదో పాట.

వనగానం..!

వనమై.. పవనమై.. బృందగానమై!

గెడ్డ పక్కన ఒరకట్టిన పొలంలో పాటలు పాడుతున్నారు దిగువూరోలు. ఆ పాటలు కొండల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. కొండదేవతలెవరో ఈ కొండ కొసకీ, ఆ కొండ కొసకీ రాగాల తాళ్లు కట్టి, పాటల ఉయ్యాల ఊగుతున్నట్టు వినపడింది.

ఆ పాటలేవో తన పూర్వీకుల జ్ఞాపకాలను మోసుకొస్తున్నట్టు.. తాత ముత్తాతల నెరవేరని ఆశలింకా సజీవంగా ఊగిసలాడుతున్నట్టు..

ఆ పాట ధ్వనిస్తున్నది...

ఆ ధ్వని స్వప్నిస్తున్నది...

అదింకా మెలకువగానే ఉంది.

ఎప్పటిదో ఆ పాట! ఎన్ని తరాలు ధ్వనించిందో ఆ గానం! ఏ కలలు కని ఏ గొంతు తొలిసారి సవరించిందో! అనాదిగా వినపడుతూ.. అనంతమై.. కొనసాగుతూ!

'ఆకు పాడిందో పొద్దు.. ఆలకించిందో గెడ్డ

నడిమద్దినున్నాము వొదినే.. పనికి పరిగెట్టమ్మ వొదినే' అని.

ఈ పాట ఎన్నిసార్లు విన్నదో? ఎన్నిసార్లు దాని అర్థం ఆలోచించిందో? ఆకు పొద్దును పాడటమేటీ? గెడ్డ ఆలకించడమేటీ? నడిమద్దిన ఉన్నదెవరు? పనికి పరిగెట్టడమంటే?

గెడ్డొడ్డున.. సెలమలో నీరు తోడుతున్నపుడు తోయికి ముసిల్ది ఇలాంటివెన్నో పాడింది. పెళ్లికో? రోజుల తరబడి పాటలు పరిగెడతాయి. తను లేచిపోయి వచ్చేసింది గాబట్టి ఇవేవీ లేవు గానీ, సంప్రదాయంగా జరిగుంటే.. ఎన్ని పాటలో ఇరువైపుల నుంచి!

అసలిలాంటి పాటలు ఎన్నున్నాయి? ఇవెవరు రాసేరు? ఎప్పుడు రాసేరు? ఈ పాటల ద్వారా ఏమి చెప్పాలనుకున్నారు? ఈ పాటలు ఎప్పటినుంచో పాడుతున్నామని తాత చెప్పేడు. తాతకి ముత్తాత కూడా అదే చెప్పాడట. అంటే.. ఒక తరం తర్వాతి తరంతో ఏదో మాట్లాడుతున్నది. ఏ సందేశమో అందిస్తున్నది. ఏమిటది?

తెలుసుకోవాలి. ముందు తానందుకోవాలి ఆ పాటల్ని. తర్వాత తన పిల్లలకి అందించాలి. అదిగో ఆ దారిలోనే కల కన్నది.. కొండ వాలు కానగ కొమ్మకి ఉయ్యాల కట్టాలని. ఉయ్యాట్లో తన బిడ్డకు ఆ పాటలే జోల పాడాలని.

కాలీజీ రోజుల్లో హైస్కూల్ మాష్టారు ఎదురైతే.. చేతులు జోడించింది ఓ రోజు.

'బాగున్నావా? ఏం చేస్తున్నావ్?' అని అడగకుండా..

'పాటలు పాడుతున్నావా?' అని అడిగారు.

'ఔ' అన్నట్టు తలూపింది గానీ, లేదని తన మనసుకు తెలుసు. ఉరుకుల పరుగుల తొందర్లో ఆ పాటల్ని మర్చిపోయింది. పదో తరగతిలో ఉన్నప్పుడు తనని దగ్గరికి తీసుకుని దేశభక్తి గీతాలు రాసి పాడించేవారు మాష్టారు. బృందగానాలకి నాయకత్వం వహించేది తను. పాటని ఇట్టే పట్టేసేది. అమ్మ నేర్పిన పాటల్ని పాడి వినిపించేది.

'నీ గొంతులో అడవి పలుకుతుంది' అనేవారు.

ఆ మాటకి అర్థం అప్పుడు తెలిసి రాలేదు. అప్పుడే మరో కల కన్నది.. ఆ పాటల మీద పరిశోధన చెయ్యాలని. బడి చదువుల కోసమే ఊరు దాటలేని తాను.. విశ్వవిద్యాలయమెలా చేరగలదు? తాను చేరలేని గమ్యమేదో తనవద్దకే వస్తే?

ఆ విశ్వవిద్యాలయమేదో ఇక్కడికే.. ఈ కొండల్లోకే.. తన ధరికే వస్తే? ఆగిపోని

చదువులు ఎన్ని కొనసాగుతాయో! కొత్త చదువులు ఎన్నెన్ని కళ్ల చూస్తుందో కొండ!

వస్తుందా?

వస్తే.. ఇక్కడే.. ఈ పాటల మధ్యే పరిశోధన చేస్తే?

..మరో కల!

నిజానికి అలాంటి కలలు ఎన్నో కన్నది. జీడి పిక్కలు తట్టలు తట్టలు తలమీద ఉంచి కొండ మీంచి కిందికి దించుతుంటే.. బరువు మొయ్యనవసరం లేకుండా.. మధ్యవర్తులు లేకుండా.. మార్కెట్ ఇక్కడికే తన వద్దకే వస్తే?

తను ఒలిచిన చింతబొట్టలు మోసం లేకుండా ఇక్కడే నేరుగా అమ్ముకోగలిగితే..?

ఏ జబ్బొచ్చినా టక్కున మాత్ర అందించగల ఆసుపత్రి ఇక్కడే ఉంటే?

తమ వాళ్లు సేకరించిన ఇప్ప మొగ్గలకి అమెజాన్, ఫ్లిప్‌కార్టుల్లో మంచి గిరాకీ ఉండగల రోజులొస్తే?

కలల బరువుకి కనులు అలిసిపోయాయేమో! రాతిరి ఆమెకు నిదురపుచ్చింది.

ఆ తెల్లవారే.. ఫైనల్ ఇయర్ ఎగ్జామ్. ఉదయం పదిగంటలకి చేరుకోవాల్సి ఉంది. ఎప్పటిలాగే బయల్దేరింది. కానీ, ఆ రోజూ వర్షం కురిసి గెడ్డ పెద్దదయ్యింది. దాటడం అవలేదు. పరీక్ష సమయం మించిపోయింది. ఆ పోవడం పోవడం. మళ్లీ చదువు గడపెక్కలేదు. మొత్తంగా తన చదువు మధ్యలో ఆగిపోవడానికి కారణం ఆ గెడ్డే. కాదు కాదు.. అక్కడ చప్టా కట్టకపోవడమే.

ఓ రోజు సాయంత్రం..

ఊరోళ్లందరూ కిందకి దిగాలని కబురొచ్చింది.

'ఏమిదానికట?' అని ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

'ఎమ్మెల్యమ్మ మీటింగెడతాదట. కింద ఊరి దాక బస్సేసినారట!'..

బస్సెక్కడమంటే సర్దా మా ఊరోళ్లకి. అదీ సీటు దొరికిన బస్సంటే ఇంకా సర్దా. ఎప్పుడు సూడు.. కొండ దిగడం.. నడ్డం! నడిసినా బరువుతో నడ్డం. నడిసినడిసి అలిసిపోతే.. ఆటోలకి ఏలబడ్డం. ఒక ఆటోకి ముప్పై మందిదాక ఏలబడుతూ సంతలకి వెళ్లడం. అలాంటి ప్రయాణాలు మాత్రమే తెలిసిన మా ఊరి జనానికి బస్సులో కిటికీ పక్కన సీటులో కూర్చుని ప్రయాణించడమంటే.. కుర్రాళ్లేటి ముసిలోళ్లూ సరదా పడిపోతారు. బస్సుల్లో కూర్చునోళ్లకి ఒక బిర్యానీ పేకెట్టు, తాగినోళ్లకి సారా సీసా ఇప్పించడమే సర్పంచి పని. అవి అందరికీ అందితే గొప్పోడు, మంచోడు. అంతే!

పరుగు పరుగున కొండ దిగుతున్న నాకు మిలంతి ఎదురయ్యింది. తలమీద ఆరితేగల కట్ట, చేతిలో కంక. ఒళ్లంతా మట్టి నిండిన బట్టతో.. మట్టి తవ్వకాల్లో దొరికిన అపురూప వనమూలికలా కనిపించింది. దిగుతున్న తూగుకి దారివ్వని మిలంతిని గుద్దుకున్నంత పనైంది నాకు.

'ఏట్రా గాబరా?' అని నిలదీసింది.

'మీటింగటే! బస్సెలిపోతాది..' అని తప్పించుకుని వెళ్లబోయేను.

దారివ్వలేదు సరికదా..

'సిగ్గులేదురా నీకు?' అని అడ్డం నిలబడింది.

'సిగ్గా? నీనెందుకు సిగ్గ పడాల?' అని నా అసహనాన్ని ప్రకటించేను.. ఇదేదో అప్రస్తుతాన్ని మాట్లాడుతున్నదని.

'మీటింగంతే పారిపోతా్రరా! ఆ మీటింగులో ఒక్కనాడైనా మనూరు రోడ్డు గురించి, ఈ ఖానా గురించి అడిగినా్రరా?'..

అది నా కళ్లలోకి సూటిగా చూస్తున్నది. దాని తల మీద తేగలకట్ట తూలడం లేదు. చేతిలో కంక నిశ్చలంగా ఉంది. అది నన్ను ప్రశ్నిస్తున్నదా? ఇంకెవరినైనా హెచ్చరిస్తున్నదా? ఒక్క క్షణం దాని కళ్లలో తీవ్రతకి నేరుగా చూడలేకపోయాను. వాటి గురించి చాలాసార్లు ఊర్లో మీటింగు పెట్టుకున్నాం. చాలా దరఖాస్తులూ రాసేం. అధికార్ల చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరిగాం. ఆ సంగతి దానికీ తెలుసు. అయినా అడుగుతున్నది. అంటే...? ఇంకేదో చెప్తున్నది.

నిశ్శబ్దంగా..

మౌనాన్ని మోసుకుంటూ..

పక్కకు తప్పుకొని..

దారి పక్క రాయి మీద అడుగేసి కిందికి దిగిపోయేను.

దారిపొడుగునా దాని కళ్లు నన్ను వెంటాడుతూనే ఉన్నాయారోజు. దారిలో నడుస్తుంటే అడ్డమొచ్చిన ప్రతి రాయీ దాని చూపుల్ని తలపించింది. ఎదురైన ప్రతి డొంకా ఆ చూపుల తీవ్రతని గుర్తు చేసింది. గెడ్డ దాటుతుంటే.. దాని కల ఏమిటో మెల్లమెల్లగా స్పష్టమవడం ఆరంభించింది.

దిగువూరు చేరేసరికి బస్సు జనాల్ని ఎక్కించుకుని దుమ్ము రేపుకొంటూ వెళ్లిపోవడం కనిపించింది. ఆకుపచ్చని కొండ మొదుల్లో బస్సు రేపిన దుమ్ము నా ముఖమ్మీదా పడింది. దులుపుకొంటూ.. కళ్లు నులుముకుంటూ.. వెనుతిరిగాను.

మిలంతితో మాట్లాడాలి. దాని కల గురించి మాట్లాడాలి. నిజానికి ఆ కల దానిది మాత్రమే కాదు. అది ఊరందరి కల. కొండ ఎక్కి ఇల్లు చేరేసరికి మిలంతికి నొప్పులు ఆరంభమయ్యేయి. ఏ కొండ మీదో మేఘం గర్జించింది. చీకటి పడింది. బిడ్డ అడ్డం తిరిగింది.

ఏ చీకటి లోకాల్లోంచో రాలింది ఒక్క చినుకు.. 'టప్...!' మని.

ఊరు ఉలిక్కి పడింది. అందరి గుండెల్లో రాయి పడింది. పురుడు పోసే మండింగి ముసిలమ్మకి కబురు చేసేరు. ప్రయత్నమంతా చేసి చేతులెత్తేసింది ముసిల్దాయి. ఎలాగైనా మిలంతిని కిందకి దించాలని నిర్ణయించేం.

అప్పుడు కనిపించింది మా ఊరోళ్లందరికీ దారి! నరకానికి నడుస్తున్నట్టుగా.. దెయ్యాలు భూతాలకీ జడవని ఊరి పెద్ద కూడా ఆ దారిని తలచుకొని నిలువెల్లా వణికిపోయేడు.

అప్పుడు కట్టేం డోలీ! వెదురు కర్రకి దుప్పటి కొసల్ని కట్టి సిద్ధం చేసేం డోలీ!

డోలీ దిగుతుంటే మిలంతి కాన్పు బాధ కన్నా ఊరోళ్ల ఏడుపులే కొండల్లో ప్రతిధ్వనించేయి. మా ఊర్లో డోలీ ఎత్తడమంటే.. శవయాత్ర చేస్తున్నట్టే! ఎందుకంటే డోలీలో కొండ దిగిన ఏ రోగీ తిరిగి రాలేదు.

నాకు దుఃఖమాగడం లేదు. గొంతు నుంచి ఒక్క మాటా పెగలడం లేదు. ఎందుకో మిలంతి చూపులు మళ్లీ కదలాడేయి. వాటి అర్థమేదో క్రమక్రమంగా స్ఫురిస్తున్నట్లు అవుతున్నది. డోలీలు మా బతుకులనొదలవా? డోలీల్లేని జీవితాలు మేము చూడలేమా?

ఒక్కసారైనా మా ఎమ్మెల్యేను జుట్టు పట్టుకునైనా మా ఊరు లాక్కు రావాలని. ఆ కుర్చీ మీద కూకుండబెట్టడానికి మేము కిందకి దిగి ఓట్లెయ్యాలా? మాకు కష్టమొస్తే ఆ కుర్చీ కొండెక్కదెందుకని ఒక్కసారైనా అడగాల. పిలక పట్టుకుని.. 'మా ఊరుకి రోడ్డేస్తావా లేదా!?' అని నిలదీయాలని ఉంది.

నడుస్తున్న దారి సన్నగా రోదిస్తూ తనను తాను చీల్చుకుని మమ్మల్ని నడిపిస్తున్నది.

గుండెలు దిటవు చేసుకొని.. మొండి ధైర్యంతో..

ఎలాగైనా మిలంతిని బతికించుకోవాలని డోలీ ఎత్తేం.

చీకట్లో.. చినుకులు రాలుతున్న దారిలో..

తరాల మా కల! ఎప్పటికప్పుడు కరిగిపోతూ!

బయల్దేరేం.

వాన పెరిగింది. ఎక్కడో మొదలైన వాన మా మీదా కురిసింది. మిలంతి మీదా కురిసింది. మిలంతి కడుపులోని బిడ్డపైనా కురిసింది. మేము నడవాల్సిన దారి పైనా కురిసింది.

వాన! మా పైనా! లోలోన!

ఇలాంటప్పుడే కొండ జారిపోతూ ఉంటుంది. రాళ్లు మెత్తబడిపోతాయి. దారి రోజూలా ఉండదు. అడుగు అడుగూ ఆచి తూచి వెయ్యాలి. తేడా వచ్చిందో.. నడకలో ఉన్నపుడే జారిపోతాం. మరి డోలీ మోస్తున్నపుడో! అదీ చీకట్లో?

నడుస్తున్నాం. అంతే! కానీ సందేహం అందరిలో. ఏడు కిలోమీటర్ల కొండ దిగి, మూడు కిలోమీటర్ల నడక ప్రయాణం. ఈలోగ సిగ్నల్ దొరకపుచ్చుకోవాలి. అంబులెన్స్‌ని అందుకోవాలి. ఆసుపత్రి చేరాలి. మాలో ఎవరికీ నమ్మకం చాలడం లేదు. అయినా..

మొండిగా..

గుడ్డిగా..

చీకట్లో..

అక్కడికి చేరుకున్నాం. గెడ్డ హోరు దాని ప్రవాహ వేగాన్ని తెలుపుతున్నది. దాటడం అసాధ్యమని చెప్పకనే చెబుతున్నది. చీకట్లో గెడ్డ మాకు వినిపిస్తున్నది. చెవుల్తో గెడ్డని చూస్తున్నాం.

చెట్టు కింద చినుకులు పడవని ఆశతో ఆగేం.

గెడ్డకవతల.. మీటింగు నుంచి తిరిగొచ్చిన మా ఊరి జనం. చేతుల్లో పాలిథీన్ బేగుల్లో బిర్యానీ పొట్లాలూ, మందు సీసాలు!

పగలైతే ప్రవాహం ఎక్కువైనపుడు ఎప్పటిలాగే ఆ చెట్టుకిందే ఆగుతాం. ప్రవాహం తగ్గి గెడ్డ చల్లబడితే తల్లి కనికరిస్తే గెడ్డ దాటడం అలవాటు మాకు.

ఆగిపోయేం.

అక్కడే. గెడ్డ దాట లేక.. వేరే దారి లేక. ఆగిపోయాం. గెడ్డకి ఇవతల! వాన తగ్గదు. గెడ్డ ఆగదు. చీకటి కరగదు. వెలుతురు కానరాదు. ఎదురు చూస్తూ ఆగిపోయాం అక్కడే. తర తరాలుగా ఆ చెట్టు కిందే.

మా ముందు ఎన్ని తరాలు ఆగాయో అక్కడ. మా ముందు ఎన్ని ఆర్తనాదాలు ఆ చీకట్లో ప్రతిధ్వనించాయో.. అక్కడ! ఎన్ని డోలీలు శవాలుగా మారేయో.. అక్కడ!

ఎదురు చూస్తునే ఉన్నాం.. వాన ఆగుతుందనీ! వాగు తగ్గుతుందనీ.. దారి దొరుకుతుందనీ!

ఎదురు చూస్తునే ఉన్నాం.. తర తరాలుగా.. నిండు చూలాలి ఆర్తనాదాల్తో!

నిస్సహాయంగా.. అక్కడే నిలబడిపోయాం. ఎప్పుడో ఆగిపోయాం.

నా చేతిలో సెల్‌ఫోన్‌కి సిగ్నల్ దొరికిందేమో.. వెలిగి ఆరింది. భారతదేశం చంద్రుడి దక్షిణ ధృవం మీదకి విజయవంతంగా అడుగుపెట్టిందట.. బ్రేకింగ్ న్యూస్! దేశం వెలిగిపోతున్నది. మేమింకా గెడ్డకివతల ఒడ్డునే ఎదురుచూస్తున్నాం దాటడానికి.. ప్రాణాలు డోలీల్లో పెట్టుకుని!

డోలీలో.. మిలంతి కనుకొసల్లో ద్రవించిన కలలన్నీ నేలరాలిపోగా..

ఒకే ఒక్క బిందువు మాత్రం కన్ను జారడం లేదు.. పంటి కింది పెదవిపై భరిస్తున్న నొప్పిలా.. ఎలాగైనా గెడ్డ దాటాలన్న చిన్న కలలా.

* * *

**మల్లిపురం జగదీశ్**

'మల్లిపురం జగదీశ్'గా రచనలు చేస్తున్న వీరి పూర్తిపేరు.. మల్లిపురం జగదీశ్వర రావు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలోని పి. ఆమిటి అనే ఆదివాసీ గ్రామం.. ఈయన స్వస్థలం. ఎం.ఏ (ఆంగ్లం), ఎం.ఏ (తెలుగు), బీ.ఈడీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖలోని కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల సహోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆదివాసీల అస్థిత్వమే నేపథ్యంగా కథలు రాస్తున్నారు. ఈయన మొదటి కథ.. 'అక్షరాల దారిలో'. ప్రజాశక్తి దినపత్రికలో అచ్చయ్యింది. 'శిలకోల', 'గురి', 'అడవి పూల దారిలో'.. కథా సంపుటాలను, 'దుర్ల' కవితా సంకలనాన్ని వెలువరించారు. ఆంధ్రా యూనివర్సిటీ తెలుగు విద్యార్థులకు 'శిలకోల' కథలు, 'దుర్ల' కవితలు పాఠ్యాంశాలుగా తీసుకున్నారు. 'ఉరులు' కథ.. తొమ్మిదో తరగది విద్యార్థులకు తెలుగు పాఠంగా ఎంపికయ్యింది. -94401 04737

# డేగ



## బొడ్డేడ బలరామస్వామి

'కొక్కొరోకో..' మెడ సాగతీసి, రెక్కలను టపటపలాడిస్తూ హుషారుగా కూసింది కోడిపుంజు అలియాస్ డేగ.

దాని అరుపుతో.. పెరట్లో పట్టిమంచమ్మీద కునుకు తీస్తున్న పడమటయ్య దిగ్గునలేచి కూర్చున్నాడు. కొయ్యకు కట్టేసున్న డేగ మహా హుషారుగా ఉంది. ఓ రెండు కోడిపెట్టలు దాన్ని కవ్విస్తున్నాయి. అది చూసి అతను గాబరా పడిపోయాడు. జరగరాని ఘోరం జరిగిపోయిందేమోనని భయపడిపోయి.. తువ్వాలతో అదిలిస్తూ కోడిపెట్టలను అక్కణ్నుంచి దూరంగా తరిమేశాడు.

'కూస్త ఆదమరిస్తే సాలు.. పక్కింటోల్ల పెట్టలు నా డేగతో సరసాలాడ్డనికి వొచ్చేతున్నయి!' అంటూ గొణుక్కున్నాడు పడమటయ్య.

దీపాలవేళ కావడంతో డేగకాలుకు కట్టిన తాడును విప్పాడు. దాన్ని గోముగా చేతుల్లోకి తీసుకుని, మెడను మృదువుగా నిమురుతూ..

'పెట్టలను తరిమేసినానని నా మీద కోపంగుందా? ఇంకెంత కాలమీ ఉపాసమని గునుగుతున్నవా? ఇంకెన్ని దినాల్లే! పందెం గెల్సిగానే.. నిన్ను నీ ఇస్టానికొదిలేత్తను. సరేనా?' అన్నాడు. దానికి ఏమర్థమయ్యిందో మరి.. 'కొక్కొరోకో' అని కూసింది. దాంతో అతను మురిసిపోతూ..

'అయితే పందెం గెలిసేత్తవన్నమాట! నాయమ్మే!' అన్నాడు.

డేగకి గంట్లు, ఉడకబెట్టిన గుడ్డు తినిపించి వరండాలో కోళ్లగంప కింద భద్రంగా మూశాడు.

పడమటయ్యకు ఎనభైయేళ్లు ఉంటాయనడానికి ఒడలిన దేహం, నెరిసిన తలే నిదర్శనాలు! ముక్కు పోగు, ముతక పంచె, మాసిన లాల్చీ, భుజంమ్మీద తువ్వాలు.. శ్రమజీవి అనడానికి తార్కాణాలు! భార్య అనారోగ్యంతో కాలంచేసి ఐదేళ్లయింది. కొడుకులిద్దరూ విశాఖపట్నంలో ఉద్యోగాలు చేస్తూ అక్కడే ఉంటున్నారు. వాళ్లు రమ్మంటున్నా వెళ్లక.. ఇల్లే తీర్థం – పొలమే వారణాసి – ఆ ఊరే కైలాసంలా తన అరెకరాన్ని సాగుచేసుకుంటూ ఒంటరిగా ఉంటున్నాడు.

అనకాపల్లి జిల్లాలో శారదానదిని ఆనుకుని పచ్చని పొలాలమధ్య ఉంది ఆ పల్లె! సంక్రాంతికి ఆ పల్లెలో కోడిపందేలవుతాయి. ఏనాడూ వాటి జోలికిపోని పడమటయ్య.. రెండేళ్లక్రితం తన మిత్రుడు దుర్గయ్య బలవంతం చేస్తే అయిష్టంగానే

వెళ్లాడు. అక్కడ పదుల సంఖ్యలో ఉన్న కోడిపుంజులను చూసి ముచ్చటపడ్డాడు. వాటి రంగులను బట్టి డేగ, కాకి, సేతువ, నెమలి, కొక్కిరాయి, పచ్చకాకి, రసంగి, కౌజు, పర్ల వంటి పేర్లతో పిలుస్తారని దుర్గయ్య చెబుతుంటే కుతూహలంగా విన్నాడు. కోడిపందేలలో ఎత్తుడు దింపుడు పందెం, ముసుగు పందెం, డింకీ పందెం, చూపుడు పందెం ఉంటాయని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు.

అంతలో పల్లపు వీధి సూరిబాబు నెమలి, మెరకవీధి గంగరాజు కాకి పందేనికి సిద్ధమయ్యాయి. దుర్గయ్య పుంజులను పరిశీలించి..

'గంగరాజు కాకి మాంచి ఏపుమీదుంది. దానిమీద పందెంగట్టు. గెలుత్తవు!' అని పడమటయ్యను ఎగదోశాడు.

'సూసెల్లిపోతేగాదు.. పందెం గెలిస్తే ఆనందముంటది!' అంటూ ఉసిగొల్పాడు.

ఏ కలనున్నాడో పడమటయ్య.. పందెంకట్టి సూరిబాబుకు మూడువేలు సమర్పించుకున్నాడు.

పుట్టి బుద్ధెరిగిన దగ్గర్నుంచి అతను పరాయిసొమ్ము ఆశించిందీ లేదు, తన సొమ్ము వట్టినే ఎవ్వరికీ ఇచ్చిందీ లేదు. అలాంటి పడమటయ్య తొలిసారిగా పందెంకాసి మూడువేలు పోగొట్టుకోవడంతో కుడితి కుండలో పడ్డ ఎలుకలాగ యేడాదిపాటు గింజుకున్నాడు. బుద్ధిలేక కోడిపందేలు చూడ్డానికి వెళ్లానని ఎన్నోమార్లు గొణుక్కున్నాడు. ఓడినచోటే తిరిగి తన సొమ్మురాబట్టుకుని, ఆ తర్వాత కోడిపందేల ముఖం చూడకూడదనుకున్నాడు. సంక్రాంతివరకూ కాసుక్కూర్చొని మరీ సూరిబాబుతో పందెంకట్టాడు. మళ్లీ మూడువేలు పోగొట్టుకున్నాడు.

సూరిబాబు మీసం మెలేస్తూ..

'ఒరే ముసలి నక్క! కాటికి కాలు సాపుకొని ఇంటికాడ కూకోక పందెం గెలుద్దామనొచ్చవు! బొక్కబోర్ల పడ్డవు. నన్ను గెల్సేడం నీతరం గాదుగానీ, ఇంటికెల్లి ముసుగేసుకుని తొంగో!' అంటూ అందరి ముందూ ఎగతాళి చేశాడు. అది విని అంతా నవ్వుకున్నారు. ఆ అవమానభారంతో ఇంటిదారి పట్టాడు పడమటయ్య.

'కుర్రకుంక ఎంత మాటనేసినడు!? కాటికి కాలు సాపుకొని కూకోమంతడా? నాను ముసలి నక్కనని ఎటకారం సేత్తడా? నలుగుర్లోనూ అవుమానిత్తడా? వొచ్చే సంకురాత్రికి ఆడి పుంజునోడించి.. ఈ ముసలోడి దెబ్బేటో ఆడికి రుసి సూపిత్తను. నా దెగ్గిర గెల్సిన డొబ్బులను కక్కిత్తను' అని పంతం పట్టాడు.

స్వతహాగానే పట్టుదలగల మనిషి పడమటయ్య. ఇక వేరేవాళ్ల కోడిపుంజుల మీద పందెం కాయకూడదని అనుకున్నాడు. తనే కోడిపుంజును పెంచి, బరిలో నిలవాలనుకున్నాడు. అందుకోసం తలపండిన పందెం రాయుళ్లను కలిశాడు. పందెం కోడిని ఎలా పెంచాలో, ఎటువంటి ఆహారం పెట్టాలో తెలుసుకున్నాడు. పోరాట పటిమలో డేగను మించిందిలేదని విని.. ఎర్ర ఈకలు గల డేగకోసం రెండుమూడు

కోళ్లసంతలు తిరిగి ఐదునెలల వయసున్న డేగను కొన్నాడు. దాని సంరక్షణకోసం తన పొలాన్ని బీడుపెట్టేశాడు. తన వ్యాపకాలన్నిటినీ పక్కన పెట్టేశాడు. పందెం గెల్చి సూరిబాబు పొగరణచి, పోగొట్టుకున్న డబ్బూ.. పరువూ నిలుపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడు.

అతని దినచర్య డేగతోనే ఆరంభవుతుంది. దానితోనే పూర్తవుతుంది. తెల్లవారుతూనే దాన్ని నదికి తీసుకెళ్లి, కాసేపు ఈత కొట్టిస్తూ వ్యాయామం చేయిస్తాడు. పనిలో పనిగా అక్కడే తన కాలకృత్యాలూ స్నానమూ కానిచ్చేస్తాడు. అటు తర్వాత ఇంటికి తీసుకొచ్చి బాదంపప్పు, నల్లద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్లనువ్వులు, తాటిబెల్లం కలిపి గుండ్రంగా తయారుచేసిన ఉండలను.. గంటకొక్కటి చొప్పున దాని నోటికందిస్తాడు. మధ్యాహ్నం కైమా, జీడిపప్పు తినిపిస్తాడు. సాయంత్రం గంట్లు, సోళ్లు, ఉడకబెట్టిన గుడ్డుతో మేపుతాడు. దాని శరీరం గట్టిపడటం కోసం ముప్పూటలా చల్లని నీళ్లను నోట్లోకి తీసుకుని.. దాని శరీరం తడిసేలా గట్టిగా ఊస్తాడు. దానికి చిన్న సుస్తీ చేసినా.. జాగు చేయకుండా పశువుల ఆసుపత్రికి తీసుకెళ్తాడు.

క్రమక్రమంగా పడమటయ్యకు డేగతో మంచి అనుబంధం ఏర్పడింది. దాన్ని విడిచిపెట్టి క్షణంకూడా ఉండలేక పోతున్నాడు. డేగకూడా అతను కాసేపు కనిపించకపోతే చాలు.. గోలగోల చేస్తుంది. అతను కనిపించగానే.. రెక్కలు టపటపలాడిస్తూ తన ఆనందాన్ని వ్యక్తపరుస్తుంది.

సంక్రాంతి దగ్గర పడుతున్నకొద్దీ పడమటయ్యను కోడికత్తి భయపెడుతున్నది. కత్తి తగిలి తన డేగ గాయపడ్డమో, చావడమో జరిగితే.. అన్న ఊహే అతనికి నిద్రలేకుండా చేస్తున్నది.

'డింకీ పందెమైతే కత్తులు కట్టరంట. సూరిబాబుతో డింకీ పందెం కడదామని అడగాల!' అని అప్పటికి చాలాసార్లు అనుకున్నాడు.

* * *

ఆ రోజు భోగి పండుగ. ఆ మర్నాడే కోడిపందేలు!

పడమటయ్య తన డేగను ఎప్పటిలాగే నదికి తీసుకెళ్లి వ్యాయామం చేయించాడు. ఎప్పుడూ లేనిది షాంపుతో దాన్ని బాగా రుద్ది స్నానం చేయించాడు. కాసేపు దాన్ని ఎండలో చలికాయించి తిరిగొస్తుంటే.. ఏటిగట్టుమీద సూరిబాబు బైక్ మీదొస్తూ ఎదురైతే ఆపాడు.

సూరిబాబు వెటకారంగా నవ్వి..

'నీ పుంజును తెగ మేపుతున్నవంట! భలేగా టయినింగిత్తున్నవంట! ఏటీ.. నా పుంజునోడించేద్దామనే?! నామీద గెలిసేద్దామనే?! ముసలి నక్కవి నీకంత కలేజా ఉందా?' అన్నాడు.

'ఉందో.. నేదో రేపు తెలుత్తది గానీ.. డింకీ పందెం ఏద్దం! పుంజుల పేనాలకు

ఏటిగాదు. ఏటంతవు?'.

'ఏటీ.. డింకీ పందెమా? పుంజులు పూటల్లా కొట్టుకున్నా.. ఆ పందెం తేల్దు! రేపు జెరిగేవన్నీ ఎత్తుడు దింపుడు పందేలే! బేగొచ్చి నీ పుంజును నా పుంజుకత్తికి బలిచ్చేద్దువు గానీ' అంటూ బైక్‌ను ముందుకు పోనిచ్చాడు.

సూరిబాబు మాటలతో తన ఆశ ఆవిరైనందుకు చింతిస్తూ..

'సూసినవురా ఆడి పొగరు? ఆ పొగరు నువ్వు అనిసీయాల! ఆడి దగ్గిరోడిన దొబ్బులను నువ్వే కక్కించాల! ఆడి పుంజుక్కట్టిన కత్తినుంచి ఒడుపుగా తప్పించుకొని గెలవాల!' అంటూ, డేగతో చెబుతూనే ఇంటికి చేరుకున్నాడు పడమటయ్య.

పొద్దుగుంకే వరకూ డేగ ఆలనాపాలనా చూసుకుంటూ, పందేనికి సిద్ధంచేస్తూ గడిపాడు. చీకటిపడ్డాక దాన్ని కోళ్ల గంపకింద మూసి, ఏదో తిన్నాననిపించి తన గదిలోకెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. ఎంత ప్రయత్నించినా నిద్రరాలేదు.

'పందెమేమవుద్దో.. డేగకేమవుతుందో!'.. ఇవే ఆలోచనలు! అర్ధరాత్రి తర్వాత గాఢంగా నిద్రపట్టేసింది.

* * *

పొద్దుపొడిచాక మెలకువొచ్చి దిగ్గునలేచాడు పడమటయ్య.

'ఇదేటి సిత్రం! ఏటీ మొద్దునిద్ర! సీకటితోటే నిద్రలేపేసే డేగకీ నిద్రట్టీసిందా?' అనుకుంటూ వరండాలోకెళ్లి, గంపెత్తాడు. గంప కింద డేగలేదు. పడమటయ్య గుండె ఆగినంతపనైంది. కంగారుగా పెరట్లోనూ, ఆ పక్కింటోళ్ల కోడిపెట్టల దగ్గర వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. పిచ్చోడిలా ఊరంతా వెతుకుతూ.. 'దా.. దా..' అని పిలుస్తూనే ఉన్నాడు. కనిపించినవారినల్లా..

'నా పుంజేమన్నా అగుపించిందా?' అని అడుగుతూనే ఉన్నాడు.

బారెడు పొద్దెక్కాక నిరాశగా ఇంటికి చేరుకుని, విచారంగా మంచమ్మీద కూలబడ్డాడు.

'డేగెలాగ మాయిమైపోనది? ఒకేల ఆ సూరిబాబుగోడు దొంగతనంగొచ్చి అట్టుకుపోనడా?' అని అనుమానిస్తుండగా దుర్గయ్య వచ్చాడు. ఏట్రా పుంజు అగుపడ్డంనేదని ఎతుకుతున్నవంట. ఏటైంది?' అంటూ పరామర్శించాడు.

'ఏటిసెప్పమంటవురా... తెల్లారిలేసి సూత్తే గంపకింద డేగనేదు' అని చెప్పి, తన అనుమానాన్ని వెలిబుచ్చాడు.

ఆడైయుండడు, ఆడికాడే బోల్డు పుంజులు! ఇదెవడో దొంగనాయాల కోడిపందేలాడీడానికి ఎత్తికెల్లుంటండు. పందేలప్పుడు ఇట్టాంటివి జెరుగుతుంటయి, కనిపెట్టుకునుండల! బేగెల్లి బరిదెగ్గిర ఎతుకు... దొరికితే దొరకొచ్చు'.

అతడలా చెప్పడమే ఆలస్యం దిగ్గునలేచి బయలుదేరాడు పడమటయ్య. ఊరికి దూరంగా గుబురు చెట్లమధ్య నున్న ఖాళీ ప్రదేశంలో జరుగుతున్న కోడిపందేల

దగ్గరకు ఆయాసపడుతూ చేరుకున్నాడు. అప్పటికే అక్కడ కోడి పుంజులమధ్య సంక్రాంతి సంకుల సమరం మహాజోరుగా సాగుతోంది. మరోపక్క గుండాటలూ జరుగుతున్నాయి. పందెంరాయుళ్ల మధ్య డబ్బు వేలల్లో చేతులు మారుతోంది. అక్కడి కోలాహలం, సందడి మధ్య పటమటయ్య తన డేగను వెతకడం మొదలెట్టాడు. తుప్పలకు, కొమ్మలకు కట్టేసివుంచిన కోడిపుంజులలో తన డేగుందేమోనని గాలిస్తున్నాడు. యేడాదిపాటు తనుపడ్డ శ్రమంతా వృథా అయిందని ఆక్రోశిస్తున్నాడు.

కోడిపందేలాడుతున్న సూరిబాబు పడమటయ్యను చూసి..

'ఒరే ముసలినక్క! ఏదిరా నీ పుంజు? ఓడిపోతానన్న బయంతో పుంజు అగుపించనేదని నాటకాలడుతున్నవంట' అన్నాడు పళ్లికిలిస్తూ.

పడమటయ్య ఏమీ బదులుచెప్పలేదు. ఇంకా అక్కడేవుంటే అందరూ తనను లోకువచేసి మాట్లాడతారని అక్కన్నుంచి బయలుదేరారు. అతడికి సూరిబాబును దెబ్బకుదెబ్బ తీయలేకపోతున్నందుకు కోపంగా వుంది. ఓడిపోయిన డబ్బు తిరిగి గెల్చే అవకాశంలేనందుకు దిగులుగా వుంది. తన డేగ ఏమయ్యిందోనని బాధగా వుంది.

అడుగులో అడుగేస్తూ విచారంగా నడుస్తున్నాడు. అంతలో 'కొక్కొరోకో' అన్న కూత వినిపించింది. అతడు నడకాపి వెనక్కి తిరిగి చూశాడు. ఆశ్చర్యంగా రెక్కల టపటపలాడిస్తూ పరుగెత్తుకొచ్చి అతడి చేతుల్లో వాలిపోయింది డేగ! దాన్ని చూడగానే అతడి దిగులెగిరిపోయి, హృదయం ఉప్పొంగిపోయింది. దాన్ని కాలుకు వ్రేలాడుతున్న తాడును చూసి..

'అదునుసూసి నిన్ను బరిలో దించీడానికి దొంగోడు దొంకలో కట్టేత్తే ఇడిపించుకునొచ్చేసినవా? నానంతే నీకెంత పేమ!' అంటూ డేగను ఆప్యాయంగా నిమిరాడు.

అదేమన్నా తిన్నాదో లేదోనని ఇంటికి తీస్కెళ్లి కాసిన్ని గంట్లు తినిపించాడు. డేగను పందేనికి తీస్కెళ్లడానికి పడమటయ్యకు మనసొప్పడంలేదు. కాని సూరిబాబు మాటలు పుండుమీద కారంలా సల్పుతుంటే మనసు చంపుకుని దాన్ని పందేనికి సిద్ధంచేశాడు. కాసిన్ని గంజినీళ్లు తాగి, పందెం డబ్బును డేగను పట్టుకుని బరి దగ్గరకెళ్లాడు.

సూరిబాబు పడమటయ్య చేతిలోని డేగను చూసి..

'నాటకాలు కట్టేసి నీ పుంజును అట్టుకొచ్చేసినావన్నమాట. ఇంకేటాలిస్యెం? నీ డేగను సికెను పలావు వొండించీడానికి నా నెమలి, సేతువ, కౌజు సిద్ధంగున్నాయి. దేనితో పందెమేత్తవో ఎయ్యిరా!' అన్నాడు.

'తెగ మిడిసిపడతన్నవు. కట్టెవొంకర పొయ్యి తీరిసినట్టు నీ పొగర్ను నా డేగ తీరుస్తది! ఈ ముసలోడి తడాక ఏటో సూపిత్తది! ఏ పుంజును పందేనికి ఎడతవో ఎట్టుకో!' రోషంగా అన్నాడు పడమటయ్య.

‘అబ్బో... పవురుసం తన్నుకొచ్చేసిందే... మరి పందెమెంత ఏద్దమేటి!’.

‘ఆ రోజేదో మాయికమ్మేసి నీతో పందేనికి దిగానుగాని నేనొకడి సొమ్ముకు ఆసపడేవోడిని గాదు. నీ దెగ్గిర రెండుతూర్లు పందేమేసి ఆరేలు పోగొట్టుకున్నను. అయి తిరిగొస్తే సాలు!’.

ఇద్దరి మధ్య పందెం కుదిరింది. కత్తి కట్టేవాడు మూడొందలు తీసుకుని డేగ కుడికాలుకు కాటన్ గుడ్డ చుట్టి, దానిమీద కత్తిపెట్టి తాడుతో కడుతుంటే పడమటయ్య బాధగా మూలిగాడు.

సూరిబాబు తెల్ల ఈకలు గల తన సేతువతో బరిలోకొచ్చాడు. పటమటయ్య గుండెరాయి చేసుకుని తన డేగతో బరిలోకి దిగాడు. పుంజులు రెండూ మంచి కండపుష్టితో వున్నాయి. వాటి కాలి గోళ్లూ, ముక్కూ బలంగా మొన దేలున్నాయి. కోడిపందేలు చూడ్డానికొచ్చినవారు వాటి బలాబలాలు అంచనావేసి వేలల్లో పందేలు కాసారు.

సూరిబాబు, పడమటయ్య పుంజుల తలలను వాటిముక్కుతో పొడిపించి, వాటిలో క్రోధాన్ని రగిలించారు. వాటిని దువ్వి బరిలో వదిలి పక్కకు తప్పుకున్నారు. సేతువ, డేగ ఎదురెదురుగా నిల్చుని కాళ్లూంచి, మెడమీద ఈకలు రిక్కించి కాసేపు కోపంగా చూసుకున్నాయి. ఒక్కసారిగా గాల్లోకెగిరి తున్నుకున్నాయి. ముక్కులతో పొడుచుకున్నాయి. సేతువ ఎగుతున్నప్పుడు డేగ ఒడుపుగా తప్పించుకుంటోంది. జనం వాటి పోరును ఆసక్తిగా తిలకిస్తున్నారు. పడమటయ్య అయితే ఊపిరి బిగబట్టి చూస్తున్నాడు.

‘బగవొంతుడా... పుంజలకేటవ్వకుండ నా డేగ గెల్సీలాగ సూడు!’ అంటూ ప్రార్థిస్తున్నాడు. డేగ కళ్లు చురుగ్గా కదులుతున్నాయి. ప్రత్యర్థి కదలికలను కనిపెడుతూ ఒక్కసారిగా గాల్లోకి లేచి సేతువను కుడికాలుతో తన్నింది. సేతువ మెడకు కత్తి తగిలి అది నేలకూలింది. మరి లేవలేదు.

డేగ గెలవడంతో పడమటయ్యను అక్కడున్నవారంతా పొగడ్తలతో ముచ్చెత్తారు. దాంతో అతడికి ప్రపంచాన్ని జయించినంత ఆనందమేసింది. ఉద్వేగంతో బరిలోకి దూకి డేగను ప్రేమగా చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టాడు. గోళ్లరక్కులు తప్ప కత్తి గాయాలేనందుకు సంతోషించాడు. చచ్చి పడున్న సేతువను చూడగానే అతడి మనసు చివుక్కుమంది.

‘సూసిరమ్మంటే కాల్సొచ్చేసిన అనుమంతులోరిలాగ ఓడించమంతే ఏకంగ సంపేసినవు, అదేమన్న నీ సెత్రువా? నీ జాతి తన అసలు సెత్రువును కానుకోనేకపోతున్నదిగాబట్టే అనాదిగ కోడిపందేలు ఇలాగ సాగుతున్నయి’ అన్నాడు డేగతో.

అతడివైపు ‘అవునా?!’ అన్నట్టుగా మెడ తిప్పి చూసింది డేగ.

సూరిబాబు పందెం డబ్బులను పడమటయ్యా చేతిలో పెట్టి..

'ఏటో అనుకున్నను, గట్టి ముసలోడివే! గెలుపుకు వొయస్సడ్డంగాదు, ఓపిగ్గ సెమిత్తే ఓర్పినైన ఇజియం వరిత్తదని నిరూపించినవు! నిన్ను సులకన సేసి మాట్లాడినాను. నన్ను సెమించు' అంటూ తలొంచాడు.

పడమటయ్యా పోయిన తనడబ్బు మళ్లా తిరుగొచ్చినందుకు సంతోషపడిపోయాడు. తన పంతం నెగ్గినందుకు మురిసిపోయాడు.

'తప్పు తెలిసికొని తలొంచవు. అది సాలు!' అన్నాడు సూరిబాబుతో.

'కోడిపందేలు మడుసులలో పగలూ, కచ్చలూ పుట్టిత్తయి! అందువొల్లే పల్నాడిద్దం, బొబ్బిలిద్దం జెరిగాయంట. ఇల్లు ఒల్లు గుల్లసేసే ఇట్టాంటి పందేలు నానింకెప్పుడు ఆడనుగాక ఆడను' అంటూ ఒట్టుపెట్టాడు.

అంతలో..

'పోలీసోలొత్తున్నరు... పారిపొండి... పారిపొండి' అంటూ ఎవరో అరిచారు. అంతే, జనం చెట్టుకొకరుగా పుట్టకొకరుగా పరుగులుదీశారు.

పటమటయ్యాకు పందెం గెల్చానన్న ఆనందం ఆవిరైపోయింది. భయం నిలువెల్లా ఆవహించింది. పోలీసోళ్లకు దొరికితే స్టేషన్కు తీసుకుపోయి, కోర్టుకు కట్టేస్తారన్న భయంతో అడ్డదారిలో డేగను పట్టుకుని కొంతదూరం పరుగు తీశాడుగాని వయస్సు సహకరించక ఆగిపోయాడు. దారి పక్కన పశువులపాక వుంటే అందులోకి దూరాడు. అతడిని చూడగానే పడుకున్న గేద దిగ్గునలేచి నిల్చుంది.

'నానేనే.. దొంగోడ్ని గాదు'.. అంటూ ఆ పక్కనేవున్న కుక్కిమంచం వాల్చి, దానిమీద డేగనుంచి తువ్వాలతో పూర్తిగా కప్పేశాడు. కీడెంచి జేబులోని డబ్బును ముంజూరులో దోపాడు. మంచమ్మీద ఓ వారగా పడుకున్నాడు.

హెడ్ కానిస్టేబుల్, ఓ కుర్ర కానిస్టేబుల్ను వెంటబెట్టుకుని వేగంగా బైక్ మీదొచ్చి బరిదగ్గరాపాడు. బరిలో రాలిన ఈకలూ, చిందిన నెత్తురూ తప్ప అక్కడెవ్వరూ కనిపించలేదు. ఇద్దరూ తమ డేగకళ్లతో ఆ చుట్టుపక్కలంతా గాలించారు గాని లాభంలేకపోయింది.

'మనమొస్తున్నట్టు ఏనాకొడుకో ఉప్పందించేశాడు. వచ్చినందుకు కనీసం పెట్రోల్ చార్జీలకన్నా గిట్టుబాటు కాలేదు' అసహనంగా అన్నాడు హెడ్ కానిస్టేబుల్. వేరే రహదారి కనిపిస్తే అటెళ్తే గిట్టుబాటు అవుతుందేమోనని బైక్ ను అటు పోనిచ్చాడు.

బిక్కుబిక్కుమని పాకలోవున్న పడమటయ్యాకు బైక్ శబ్దం వినగానే ఒళ్లంతా ముచ్చెమటలుపోశాయి. ఊపిరి బిగబెట్టి పడుకున్నాడు. బైక్ పాకను దాటి ముందుకు పోయింది. దాంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. అంతలోనే బైక్ మళ్లీ వెనక్కి తిరుగొచ్చి సడన్ బ్రేక్ తో పాకముందాగింది.

ఆ శబ్దానికి పడమటయ్యా హడలిపోయాడు. గురకపెట్టి నిద్రపోతున్నట్టు నటిస్తూ

గట్టిగా కళ్లు మూసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్, కుర్ర కానిస్టేబులుతో కలిసి పాకలోకి దూరాడు. పడమటయ్యను లాఠీతో తట్టి లేపాడు. బద్ధకం నటిస్తూ లేచాడు పడమటయ్య.

'ఏటి బాబు... ఇలా వొచ్చరు?' అని అడిగాడు ఏమీ తెలీనట్టు.

'తాతా కోడిపందేలు ఆడేవారు ఎటెల్లారో చూశావా?'.

'సూన్నేదు బాబు... పొలం పన్జేసి నిద్రోననా... మత్తుగ నిద్రట్టేసింది'.

హెడ్ కానిస్టేబుల్ కు పడమటయ్య మీద ఏ మాత్రం అనుమానం రాలేదు. ఇద్దరూ నిరాశగా పాకలోంచి బయటకొచ్చారు. పడమటయ్య మళ్లీ మరోసారి ఊపిరిపీల్చుకున్నాడు. అంతలో అంతవరకూ కిక్కురుమనని డేగ 'కొక్కొరోకో' అని కూసింది. పడమటయ్య గుండె గుభేలుమంది. 'ఎంత పన్జేసినవే డేగ... పోలీసు డేగలకు నన్నప్పగించేసినవుగదే' అంటూ గొణిగాడు.

హెడ్ కానిస్టేబుల్ తిరిగి పాకలోకి పరుగునొచ్చి, తువ్వాలు క్రింద కదులుతున్న డేగను పట్టుకుని చంకలో ఇరికించుకున్నాడు.

'అమ్మ ముసలినాయాల... ఎంత నాటకమాడావురా?' అన్నాడు కళ్లెర్రజేసి. పడమటయ్య జేబులను, అక్కడి పరిసరాలను కుర్ర కానిస్టేబుల్ చేత వెతికించాడుగాని ఏమీ దొరకలేదు.

'కోడిపుంజుంటే డబ్బులు కూడా వుంటాయి. ఎక్కడ దాచావో తియ్యరా... లేకపోతే మక్కలిరగొట్టీగలను' కోపంగా లాఠీ ఎత్తాడు హెడ్ కానిస్టేబుల్. దాంతో పటమటయ్యతో పాటు గేదకూడా బెదిరిపోయింది. కన్నె తెంపుకుని పాకలోంచి బయటకు పరుగుతీసింది.

పటమటయ్య హెడ్ కానిస్టేబుల్ కాళ్లమీద పడిపోయాడు.

'పుంజు ఓడిపోనది బాబు. డొబ్బులు పోనయి' అని అబద్ధం చెప్పాడు.

'ఈతూరికి సెమించి వదీలయండి' అంటూ బతిమిలాడాడు.

హెడ్ కానిస్టేబుల్ ఎత్తిన లాఠీదించి..

'పండగపూట హింసెందుకని వదిలేస్తున్నాను. ఇంకెప్పుడూ కోడిపందేలాడకు!' అన్నాడు. డేగనుచూసి పళ్లు చప్పరిస్తూ వచ్చినందుకు కోడిపుంజు గిట్టుబాటయ్యింది. పండక్కొచ్చిన అల్లుళ్లకు ఎంచక్కా పుంజు మాంసంతో భోజనమెట్టొచ్చు' అంటూ డేగను పట్టుకుని హుషారుగా పాకలోంచి బయటకొచ్చాడు.

డేగను పట్టుకుపోతుంటే విలవిల్లాడిపోయాడు పడమటయ్య.

'డేగనిడిసి నానుండగలనా?' అనుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. తనను గెలిపించిన డేగ, ఓడిందని అబద్దం చెప్పినందుకు తనను తను అసహ్యించుకున్నాడు. బైక్ స్టార్ట్ చేసిన శబ్దం వినగానే ఒక నిశ్చయానికొచ్చి, ముంజూరులో దాచిన డబ్బును గాబరాగా తీసి, ఒక్కుదుటున బయటకొచ్చాడు.

'నాను అబద్దం సెప్పినను బాబు. నా డేగ ఓడిపోనేదు.. గెల్సినాది! పోగొట్టుకున్న నా పరువును, డొబ్బును గెల్సినాది! నన్ను ఎటకారం సేసినోడ్ని తలొంచుకునేల గెల్సినాది! ఆ డబ్బేబాబు ఇది. పన్నెండేలు! తీస్కోని గొర్రిపోతిని కొని తమరి అల్లుల్లకు ఏటమాసంతో బోజనం ఎట్టండి. నా డేగను నాకొగ్గియండి బాబు.. మీకు పున్నెముంటది' అంటూ బోరున ఏడ్చాడు.

హెడ్ కానిస్టేబుల్ తన పంట పండిందని ఉప్పొంగిపోయాడు. మారోమాటలేకుండా డేగను పటమటయ్య చేతిలో పెట్టి, డబ్బును జేబులో కుక్కుకున్నాడు. ఆ వెంటనే బైక్‌ను ముందుకురికించాడు.

పటమటయ్యకు డబ్బుపోయిందన్న బాధ కాస్తకూడాలేదు! తన డేగ తనకు దక్కినందుకు సంతోషంగుంది! గద్దతో పోరాడి రక్షించిన కోడిపిల్లను రెక్కలమాటున దాచిన తల్లికోడిలా డేగను ప్రేమగా అక్కునచేర్చుకున్నాడు.

'అందరి కండ్లూ నా డేగమీదే అడిపోనయి. బేగ ఇంటికెల్లి దిస్టి తీసియాలి' అనుకుంటూ గేదను తిరిగి పాకలో కట్టేసి, నడక మొదలుపెట్టాడు.

* * *

**బొడ్డేడ బలరామస్వామి**

అనకాపల్లి జిల్లా కశింకోట గ్రామం. ప్రైవేట్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇప్పటివరకూ ముప్పైకి పైగా కథలు, కొన్ని కవితలు రాశారు. 'ఆకుపచ్చని చంద్రుడు' నవల.. చతురలో ప్రచురితమైంది. 'సముద్రం' కథకు.. 2017లో స్వాతి మాసపత్రిక నుంచి 'అనిల్ అవార్డు' అందుకున్నారు. అనకాపల్లి గౌరీ గ్రంథాలయం నిర్వహించిన కథలపోటీలో 'ఆడపిల్ల' కథకు ద్వితీయ బహుమతి దక్కగా.. డా. సి. నారాయణరెడ్డి గారి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. 'కళింగ పౌరుషం' చారిత్రక కథకు జాగృతి వార పత్రిక నుంచి ప్రోత్సాహక బహుమతి దక్కింది. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహించిన కథల పోటీ – 2021లో 'కీడు గుడెసె' కథకు, హాస్యానందం పత్రిక నిర్వహించిన కథల పోటీలో 'పట్టుచీర' కథకు ప్రత్యేక బహుమతులను అందుకున్నారు. వీరి 'సముద్రం' కథ హిందీలోకి, 'ఒక ప్రయాణం' కథ కన్నడంలోకి అనువాదమయ్యాయి. 'గజకేసరి' చారిత్రక కథ.. కాలయంత్రం కథా సంకలనంలో చోటు దక్కించుకున్నది.

– 89197 07141

# రిశ్తే



## సయ్యద్ గఫార్

'ఉమేర్.. పొద్దు శానెక్కింది! ఉఠో బేటా! గీ దినం జుబేర్ మామ వస్తాడన్నవ్ కదా! లేవు మరి!' నిద్ర లేపుతున్నది అమ్మి.

జుబేర్ మామ పేరు ఇనంగనే.. గూడు ఇడ్సిన కాకి లెక్క ఎగిరివోయింది నిద్ర. నిన్న శివరాత్రి.. దోస్తులతో కల్సి తెల్లార్లూ జాగారం జేసిన. కండ్లు మంటగున్నయి.

'జరసేపాగి లేస్తతీ అమ్మీ!' అన్చెప్పిన.

కొన్ని రక్త సంబంధాలు ఉన్నా లేనట్టే ఉంటయి. జుబేర్ మామ ఆ బాబతోడే. అమ్మమ్మ వాళ్లకు జుబేర్ మామ, అమ్మీ.. ఇద్దరే సంతానం. మా తాత ఊరి చౌరస్తల సైకిల్ పంచర్లు ఏసే పనిచేసేటోడంట. ఆ పని చేస్కుంటనే మామను డిగ్రీ దాకా సద్వించినడంట. ఆరు సదివిన అమ్మిని దూరపు సుట్టమైన మా అబ్బుకిచ్చి పెళ్లి జేసినడంట.

ఖాళీగా ఉన్న జుబేర్ మామ జాబ్ ప్రయత్నం చేస్తున్నడంట. ఆ టైంలనే నల్గొండ జిల్లాస్థాయి 'ఇస్తెమా' జరుగుతుంటే..

'ఇస్తెమాకు వోయి నల్గొండలనే ఏదన్న పని సూస్కుంట!' అన్చెప్పి నల్గొండకు వోయిన మామ.. బాయిలేసిన రాయిలెక్క గాయబ్ అయినడంట. చేతికొచ్చిన కొడుక్కు ఏం జరిగిందో తెల్వక అమ్మమ్మ – తాత శాన గుబులువడ్డరంట. చాన్నాళ్ల తర్వాత మామ నల్గొండల ఎవరో ఆస్తిపరుల ఇంటికి ఇల్లటం అల్లుడుగ వోయిండని ఎర్కయింది. అత్తగారోల్లే గవర్నమెంటు కొలువుగుడా ఇప్పించినరంట. కొన్నాళ్ల తర్వాత అడపాదడపా వచ్చివోయేటోడంట గనీ, తల్లితండ్రిని బాధ్యతగా సూస్కున్న పాపాన వోలేదంట. కొడుకు మనాదిలనే నౌశి మంచానవడి ఏడాది తేడాతో తాత – అమ్మమ్మ సచ్చివోయినరంట.

ఐదు పూటల నమాజ్ సద్వే మామ ఎందుకిలా మారిండో ఎవల్లకర్థం కాలే. అమ్మమ్మ – తాత వాళ్లు సచ్చిపొయినప్పుడు వచ్చిపొయిన మామ.. తిరిగి ఊరి ముఖం సూల్లే.

* * *

మా అమ్మికి నేను, చెల్లెలు నాజియా ఇద్దరమే పిల్లలం. నాజియా పది చదివింది. నేను డిగ్రీ ఫస్ట్ ఇయర్లో ఉన్నప్పుడే నాజియా పెళ్లయి అత్తారింటికి వొయింది.

పేదోల్ల సంతోషాలు సూసి కాలం గుడా ఓర్వదేమో అన్పిస్తది. చెల్లె పెళ్లయి ఏడాది గడవకముందే అబ్బు నడిపే ఆటోను లారీ గుద్ది, విధి అబ్బును మానుంచి దూరం చేసింది. పుట్టెడు దుఃఖంల మునిగివొయింది మా కుటుంబం.

మా పక్కింటి నర్సమ్మ పెద్దమ్మనే మాకు పెద్ద దిక్కయింది. అబ్బు అంతిమ కార్యక్రమాలైందాక అమ్మకు దగ్గరుండి ధైర్యం చెప్తుండింది నర్సమ్మ పెద్దమ్మనే. మామ దూరపోనిలెక్కనే వచ్చివొయిండు. యాక్సిడెంట్ చేసిన లారి పత్తా దొరకలేదు.

అబ్బులేని బాధ ఒక దిక్కయితే.. అసలు బతుకుడెట్లా అనే గుబులు ఇంకో దిక్కు.

'నూ పెద్ద సద్వులు సదివి గవర్నమెంటు కొలువు చేయాలె బేటా!' అనేటోడు అబ్బు. అందుకే నాకు ఆటో డ్రైవింగ్ నేర్పలే. చెల్లె పెళ్లికి అబ్బు చేసిన అప్పుంటే.. ఆటో అమ్మి తీర్చినం. ఇల్లు గడవడం కష్టమైంది. నేను కాలేజీ మానేసిన. అది తెల్సిన నా దోస్తులు మహేశ్, జార్జి ఇంటికొచ్చి..

'ఉమేర్! మాకు సదువబ్బక ఆటోలు నడ్పుకొంటున్నం! నూ మంచిగ సదూతవ్ గదారా! కాలేజీ మానెయ్యమాకు! నీకు డ్రైవింగ్ నేర్పించి లైసెన్స్ ఇప్పిస్తం! పార్ట్ టైం మా ఆటోలు నడుపుకొంట డిగ్రీ కంప్లీట్ జేస్కో!' అన్నరు.

నాకు కొండంత ధైర్యమొచ్చింది. వాళ్ల ఆటోలనే కాలేజీకి పోతూ వస్తూ డ్రైవింగ్ నేర్చుకున్న. డ్రైవింగ్ లైసెన్స్ వాళ్లే ఇప్పిచ్చింరు. బతుకు భయం వోయింది. నేనిప్పుడు డిగ్రీ ఫైనల్ యియర్.

* * *

ఈ ఏడుగుడా నల్గొండ జిల్లాల సాలానా ఇస్తెమా జరుగుతుంటే నేను వోయిన. ఆడ జుబేర్ మామ అగువడ్డడు.

'సలాం!' చేసిన.

'అమ్మి బాగుందా?' అనడిగిండు.

'మంచిగనే ఉంది మామ!' అన్చెప్పిన.

'ఏం పని చేస్తున్నవ్?' అనడిగిండు.

'డిగ్రీ ఫైనలియర్!' అన్చెప్పిన.

'చదువుకుంటున్నవా.. ఏ సబ్జెక్ట్?' అనడిగిండు.

'బీఎస్సీ కంప్యూటర్స్!' అన్చెప్పిన.

నమ్మకం కుదరక పక్కకు తీస్కవొయి..

'డిగ్రీ కంప్లీట్ చేసినాక ఏం చేయాలనుకుంటున్నవ్?' అనడిగిండు.

'లా చేయాలనుకుంటున్న మామ!' అన్న.

'ఎమ్మెస్సీ రిలెవెంట్ సబ్జెక్ట్ కదా?' అన్నడు.

'కరెక్టే మామా! కానీ, నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వాలనుకుంటున్న!' అన్న.

మామనోట ఇంకో ప్రశ్న రాలే.

మూడోరోజు ఇస్తెమా ముగిసినంక మామ కల్సి తన కార్‌ల వాళ్లింటికి విల్సకవోయిండు. అది రెండంతస్తుల బిల్డింగ్. గేటు లోపట ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లున్నయి. ఇంట్లెకు వోయినం. కూకోమని సోఫా సూపించి లోపలికి వోయిండు మామ. కొద్ది సేపట్లనే అత్తమ్మ హాల్లోకొచ్చింది.

'సలాం!' చెప్పిన.

'అమ్మి ఆరోగ్యం బాగుంటుందా?' అనడిగింది.

'బాగానే ఉంది మామి!' అన్చెప్పిన.

మామగుడా వచ్చి నా పక్కనే కూకుండు. కొద్దిసేపటి తర్వాత టీ, స్నాక్స్ ట్రే వట్కొని ఓ అమ్మాయి వచ్చి..

'సలాం!' చెప్పి.. టీపాయ్ మీద ట్రే వెట్టి నిలవడింది.

నేను జవాబిస్తూ ఆమె వైపు చూసిన. నా కళ్లు చెదిరి వోయినయి. ఎంత అందంగా ఉందో! వీనస్ అంటే ఇలాగే ఉంటుందేమో! ఆమె తిరిగి లోపలికెళ్లింది. ఆమె తన రెండో కూతురని, నీట్ కోచింగ్‌కు వెళ్తున్నదని, పెద్దమ్మాయి – అల్లుడు ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులని చెప్పిండు మామ. ఆయినె చెప్తుంది వింటూ.. రెండు బిస్కెట్లు తిని టీ తాగిన. టైం ఐదయితున్నది. కొద్దిసేపు గడిచినాంక..

'నేను బయలుదేర్తా మామ!' అన్న.

'పోయొస్తా!' అని అత్తమ్మకు చెప్పిన.

తన కార్‌లనే నల్గొండ బస్టాండ్‌ల దింపిండు మామ. మిర్యాలగూడ బస్సు రెడీగ ఉంది. ఎక్కి కూకున్న.

'అమ్మికి సలాం చెప్పు! వీలు చూసుకొని వస్తానని చెప్పు!' అన్నడు.

'చెప్త మామ!' అన్న.

నా సెల్ నెంబర్ తీస్కొని నా ఫోన్‌కు రింగ్ ఇచ్చి, ఫీడ్ చేసుకోమన్నడు. చేస్కున్న. బస్సు కదిలింది. మామలో ఏదో మార్పు కన్పడుతున్నది. అదేందో అర్థంకాలే. ఇంటికొచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటింది.

పొద్దున లేసినాంక అమ్మితో నల్గొండలో జుబేర్ మామ కల్సి వాళ్లింటికి విల్సుకవోయిండని, వీలు సూస్కొని వస్తానన్నాడని చెప్పిన. అమ్మి బవు ఖుషీ

అయింది. ఇది జరిగి మూడు నెలలైతున్నది.

నిన్న మామ ఫోన్ చేసి.. ఈ దినం వస్తున్నానని చెప్పిండు. గా ముచ్చట అమ్మికి చెప్పిన. తన అన్న ఎప్పుడొస్తడా!? అని ఎదురు చూస్తున్నట్లుంది అమ్మి.

* * *

'ఉమేర్.. ఉఠోనా బేటా!' అంటూ.. లేపుతున్నది మల్ల.

లేసి ఫ్రెషప్పయి వచ్చి టిఫిన్ చేసి కూకున్న. టైం పదకొండైతంది. ఇంతల్నే బయటి దర్వాజ తట్టింరెవరో. దర్వాజ కాడ ఏ సప్పుడైనా మామ వచ్చినట్లే ఫీలయితున్నది అమ్మి. వోయి దర్వాజ తీసిన. నన్ను నెట్టుకుంటూ మహేష్గాడు లోపలికొచ్చి..

'ఇగో చిన్నమ్మా! అమ్మ శివరాత్రి పండక్కు చేసిన పిండి వంటలు పంపింది!' అన్నడు చేతిలో సంచి అమ్మికందిస్తూ.

అమ్మి సంచి తీస్కోని లోనికివోయింది.

'ఉమేర్.. నాకో చిన్న హెల్ప్ చేయాల్రా!' అనడిగిండు మహేష్.

'చెప్పు!' అన్న.

'మా పక్కింట్ల ఉండే జగదీశ్ సార్ ఎర్కే కదా? వాళ్ల మామకు బాగ లేదంట. వాళ్లది హుజూర్నగర్ పక్కన ఏదో పల్లెటూరంట! పండగకు ఇంటినిండా సుట్టాలొచ్చి ఉన్నరు! నేను ఆటోకు వోతే బాగుండదు! అందుకే నూ అర్జెంటుగ సార్ వాళ్లనక్కడ డ్రాప్ చేసి రావాల్రా!' అన్నడు మహేష్.

నేను సరేనని నిన్న పండక్కు కుంకుమ సల్లుకున్న ప్యాంటు షర్టే ఏస్కోని, అమ్మికి చెప్పి బయటవడ్డ.

జగదీశ్ సార్ వాళ్లను డ్రాప్ చేసి తిరిగొచ్చేసరికి రాత్రి ఎనిమిదైంది. జుబేర్ మామ వచ్చి ఇంట్లె ఉన్నడు.

సలాం చేసి..

'ఎంత సేపైంది మామా.. వచ్చి?' అనడిగిన.

'వాఅలైకుం సలామ్! గంటైతుంది వచ్చి!' అన్నడు.

స్నానం చేద్దమని షర్ట్ ఇప్పుతుంటే షర్ట్ పైనున్న మరకల్ని సూసి..

'ఏంటా కుంకుమ మరకలు? కాలేజీలో ఎన్నికలేమైనా జరిగినయా?' అనడిగిండు మామ.

'లేదు! శివరాత్రి నాడు దేవుని ఊరేగింపులో దోస్తులతో కల్సి సల్లుకున్న కుంకుమ మరకలయ్యి!' అన్నది అమ్మి.

జరగరాని ఘోరమేదో జరిగినట్టు అసహనంగా తల ఊపి..

'మన ముస్లిం పిల్లలకు పట్టుకున్న దరిద్రం ఇదే! కొంతైనా 'దీన్' గురించి

తెలుసుకోవాలే! ఆచరించాలే! అప్పుడే చేసే పనిల బర్కత్ ఉంటది!' అన్నడు మామ.

అయి ఉత్త కుంకుమ మరకలు కావని, నా ప్రియ నేస్తాల తీపి గురుతులని, అయి ఏ మత డిటర్జెంట్ బిళ్లతో ఉతికినా చెరిగిపోవని జుబేర్ మామకు తెలిసే అవకాశమే లేదు.

స్నానం చేసొచ్చిన. రాత్రి తొమ్మిదైతుంది. నర్సమ్మ పెద్దమ్మ దావత్ క్యారేజి తెచ్చిచ్చిపొయింది. ప్రతి ఏటా శివరాత్రి ఎల్లిన మరుసటి రోజు నర్సమ్మ పెద్దమ్మనే దావత్ ఇస్తది. ఘుమఘుమలాడ్తున్న బగార అన్నం, యాటకూర వాసనకు నా ఆకలి రెట్టింపైంది.

చాలా సేపట్కెల్లి ఎందుకో అమ్మి కిచెన్లనే ఉంది. నేను పొయి..

'ఆకలి దంచేస్తంది అమ్మి!' అన్న.

'మామ కోసం అన్నం ఖాగినా వండుతున్న బేటా! జరసేపాగు!' అన్నది అమ్మి.

నేను ఆశ్చర్యపొయి..

'అదేందీ.. నర్సమ్మ పెద్దమ్మ క్యారేజి తెచ్చిచ్చింది కదా?' అన్న.

'ష్.. గట్టిగ అనకు! గుర్వయ్య పెద్దయ్య గప్పుడెప్పుడో ముడ్దార్ యాటకూర తీస్కవోతుంటే మామ సూసినడంట. అప్పటికెల్లి ఆ ఇంట్లె నుంచి ఏది తెచ్చిచ్చినా తినడు!' చెప్పింది అమ్మి.

'గుర్వయ్య పెద్దయ్య గప్పుడు ఎవల్లకోసం తీస్కవోయిండో ఏమో! నర్సమ్మ పెద్దమ్మ దర్గాలకు వోతది. ప్రతి జుమ్మాకు ఫాతెహాలిప్పిస్తది. వాళ్లు ముడ్దార్ తినరని నీకెర్కే కదా అమ్మీ! మామకు చెప్పకపొయినవా? పెద్దమ్మ వాళ్లకు సర్దార్ మామ మటన్ షాప్ల నేనే మటన్ తెచ్చిచ్చిన!' అన్న. 'ఇంగవోని! వండిన గదా!' అన్నది అమ్మి.

నా మనసెందుకో ఏదోలా అయింది. ఆటవిక దశలో జంతువులను వేటాడి తిన్న మనిషి, కులాలుగా మతాలుగా విభజించుకొని, వేష భాషలు మార్చుకొని, తోటి మనిషి ఆహార అలవాట్లను నిరసిస్తూ ద్వేషిస్తూ.. శెత్! ఏ శాశ్వత సుఖాలకోసం ఈ వెర్రి? ఇలా ఏవో ఆలోచిస్తూ ఉండిపోయా.

అమ్మి కిచెన్లోంచి వచ్చి ముందుగా మామకు వడ్డించింది. మామ తిని లేచాక నేను, అమ్మి తిన్నం. కొద్దిసేపటి తర్వాత..

'సాబెరా! మీతో ఓ మాట మాట్లాడి పోదమని వచ్చిన!' అన్నడు మామ.

'బోలో భయ్యా!' అన్నది అమ్మి.

'మాకు ఇద్దరు ఆడ పిల్లలు.. మీకు తెలుసు కదా! పెద్దమ్మాయికి మీ వదిన

తరపు చుట్టాల సంబంధం చేసినం. చిన్నమ్మాయిని మన ఉమేర్‌కు ఇద్దామనుకుంటున్నం! ఈ విషయమే మీతో మాట్లాడి పోదమని వచ్చిన!' అన్నడు మామ.

మామ నోట ఊహించని మాట విన్న అమ్మి నా వైపు సూసింది. ఆ చూపులు తన లేగను ఎత్తుకపోటానికొచ్చిన పులిని చూసిన గంగిగోవు చూపుల్లెక్కున్నాయి. అమ్మి ఏం మాట్లాడకుండా ఉండిపొయింది.

'ఏం మాట్లాడ్తలేవు సాబేరా?' అడిగిండు మామ.

'నేనేం మాట్లాడ్త భయ్యా! మేము మీ తాహతుకు తగినోల్లం కాదు! మీరే ఇంకోపాలి ఆలోచించుకోంరి!' అన్నది అమ్మి.

'బాగా ఆలోచించుకునే ఈ నిర్ణయం తీసుకున్నం సాబెరా! ఉమేర్ ఉన్నత చదువులు చదవుతానంటున్నడు. దానికి బోలెడు ఖర్చు వస్తది. మీకంత ఆర్థిక స్తోమత లేదు! ఉమేర్ చదువుకయ్యే ఖర్చులు మేమే భరిస్తం! మా అమ్మాయి మెడిసిన్ చదువు పూర్తిచేస్తది. మన రెండు కుటుంబాల మంచి కోరే ఈ నిర్ణయం తీసుకున్నం!' అన్నడు మామ.

'నీ అల్లున్నే అడుగు భయ్యా! పిల్లనిచ్చేది నువ్వు. చేసుకునేది వాడు! వాని ఇష్టమే నా ఇష్టం!' లౌక్యంగా తప్పుకొన్నది అమ్మి.

మామ నా వైపు సూసిండు.

'ఇంత అదృష్టం కలిసి వస్తూంటే కాలదన్నుకుంటవా!?' అన్నట్లున్నయి ఆ చూపులు.

'ఇప్పుడే కదా మామా.. నువ్వు చెప్పింది! కొంత టైమివ్వు. ఆలోచించుకొని చెప్తం! పన్నెండు కావస్తున్నది మామ! నిద్రొస్తున్నది.. పడుకుందాం!' అన్న.

'నల్గొండకు పొద్దున్నే బస్సు ఏటైంల ఉంటది?' అనడిగిండు మామ.

'ఏడింటికి ఉంటది!' అన్చెప్పిన.

'ఆ బస్సుకే పోత!' అన్నడు.

మాది సిమెంటు రేకుల చిన్న ఇల్లు. రెండు గదులు, ఒక వంట గది, కొంత ఖాళీ జాగ ఉంటది. లోపట గదిలో ఒకటే మంచముంటది. ఆ గదిలో మామను పడుకోమని చెప్పి, ముంగటి గదిలో అమ్మి, నేను పడుకున్నం.

మామతో నిద్రొస్తున్నదని చెప్పిన గని.. పడుకున్నాంక నిద్రొస్తలేదు. మామ కూతురే కండ్లళ్ల తిరుగుతున్నది. ఎవరో గొప్ప శిల్పి చెక్కిన శిల్పంలా ఎంత అందంగా ఉందో! ఒకటే ఆలోచనలు. నిద్ర – మెలుకువ కాని స్థితి. అమ్మి వైపు చూసిన. మాటి మాటికీ పక్క మారుతున్నది. అమ్మి గుడా ఏదో ఆలోచిస్తున్నట్లున్నది. కంటికి కునుకు పట్టకుండానే తెల్లారింది.

మామ ఐదింటికే నిద్ర లేసిండు. ఫజర్ నమాజ్ సదువుకున్నడు. నేనూ లేసిన. అమ్మిగుడా లేసి ఫ్రెషప్ అయి వచ్చి..

'నాష్ట చేస్తవా భయ్యా?' అనడిగింది.

'వద్దులే.. టీ ఇవ్వు!' అన్నడు.

నేను ఫ్రెషప్ అయి వచ్చిన.

ఇద్దరం టీ తాగినం.

'సాబెరా! మీరు ఎంత తొందరగా మీ నిర్ణయం చెప్తే అంత మంచిది! రెండు నెలల్లో పెళ్లి పెట్టుకుందాం! రెండువైపుల ఖర్చులు మేమే పెట్టుకుంటం! పెళ్లి గ్రాండ్‌గ చేద్దాం!' అన్నడు.

అమ్మి తలొంచుకొని..

'సరే.. అట్టనే చెప్తంలే భయ్యా!' అన్నది.

నేను, మామ ఇంట్లె నుంచి బయటవడి బస్టాండ్ చేరుకున్నం. బస్సు గంట లేటుగ వస్తదని తెల్సింది.

కొద్దిసేపటి తర్వాత..

'ఉమేర్! నువ్వు కష్టపడి చదుదువుకుంటున్నవ్ బాగనేవుంది గని, ఈ నాన్ ముస్లిం దోస్తానా జర తగ్గిస్తె మంచిగుంటది!' అన్నడు మామ.

మామ మాటల్లోని తత్వం నాకర్థమైంది. నేనింకా మేనల్లున్నే. ఇంటి అల్లున్ని కాకముందే మామ నాపై ఆంక్షలు విధిస్తున్నట్లు అన్పించింది. నేను విన్న ఇస్తెమాల్లో మౌల్వీలు, ముఫ్తీలు గుడా అన్ని మతస్తుల వారితో మమేకమై.. గంగా జమున తహెజీబ్ లెక్కనే కలిసిమెలిసే ఉండాలంటరు. కానీ, మామ ఎందుకిలా మాట్లాడుతున్నడో అర్థమైతలేదు.

'హిందు దోస్తులెంట తిరిగితే అల్లా నారాజ్ అయితడా మామ?' అనడిగిన.

'అలా అని కాదు! హిందూ దేవుళ్ల ఊరేగింపులకు కుంకుమ జల్లుకొని ఊరేగడం మన ముస్లిం ధర్మం ఒప్పుకోదు!' అన్నడు మల్ల.

'సారీ మామ! మనమున్న సమాజంలో గిరిగీసుకొని బతకడం కుదరదు! మనది కలివిడి సమాజం మామ! ఒకరి ధర్మాన్ని ఒకరు గౌరవించుకుంటూ, కలిసిమెలిసే బతకాలి! ఓ మాట చెప్త విను మామ! చెల్లెలికి పెళ్లి చేసినాంక మాకు అప్పులైనయి! ఇంట్లె పూట గడవడమే కష్టమైంది! అప్పుడే కరోనా మహమ్మారి వచ్చింది! మా పక్కింటి నర్సమ్మ పెద్దమ్మ మమ్ముల ఒక్కపూట గుడా పస్తులు పడుకోకుండ ఆదుకుంది! మా అబ్బు హిందు దోస్తులు కూడా ఎంతో సహాయం చేసింరు! ఒకవేల వాళ్లు మనకెందుకులే అనుకొని ఉంటే.. మా పరిస్థితి ఏమయ్యేదో ఓసారి ఆలోచించు!' అన్న.

'కావచ్చు ఉమేర్! నేను కాదనను! కానీ, నీకు తెలీని దైవిక సత్యం ఒకటుంది! అదేంటంటే మనకు అవసరమైన రిజఖ్‌ను అల్లాయే నిర్ణయిస్తాడు. అది ఎవరి ద్వారా మనకు చేరవేయాలో అల్లానే చేరవేస్తాడు! మీ అబ్బు నాన్ ముస్లిం దోస్తుల ద్వారా, నర్సమ్మ ద్వారా అల్లా మీ రిజఖ్ మీకు చేర వేసిండు అంతే! ఇందులో వాళ్ల గొప్పతనమో.. త్యాగమో ఏమీ లేదు!' అన్నడు మామ.

'ఒప్పుకొంట మామ! వాళ్లు వాళ్ల దేవుళ్లకు, దేవతలకు పెట్టుకొని.. యాటలు, కోళ్లు బలిస్తరు! ముర్దార్ తింటరు! మా రిజఖ్‌ను ముర్దార్ తినేటోళ్ల ద్వారా అల్లా ఎందుకు పంపినట్టూ? మీలాంటి పవిత్ర నమాజీల ద్వారా ఎందుకు పంపలేదు?' అనడిగిన.

మామ ఖంగుతిని వెంటనే సమాధానం చెప్పలేకపొయిండు.

'రాత్రి నర్సమ్మ పెద్దమ్మ తెచ్చిచ్చిన దావత్ అన్నం నువ్వు తినలేదు! నాకు బాధేసింది మామ! మన నమ్మకాలు మనవే.. కాదనను. ఒకటడుగుతా చెప్పు! నీ తలకు పెట్టుకున్న టోపి, కాళ్లకేసుకున్న చెప్పుల వరకు ఎవరి చేతి ఉత్పత్తులో నీకెర్కేనా? మన దేశ జనాభాలో హలాల్ తినేవాళ్లు పద్దెనమిది శాతం మంది ఉంటే, ఎనబై శాతం పైచిలుకు ముర్దార్ తినే వాళ్లే ఉంటరు! మనం తినే ఆహార పదార్థాల ఉత్పత్తిలో, ఔషధాల ఉత్పత్తిలో, సేవల రంగంలో.. ఇట్లా చెప్పుకొంటూ పోతే ప్రతి రంగంలోనూ ఎనబైశాతం మంది ముర్దార్ తినేవాళ్ల శ్రమ, నైపుణ్యమే ఉంటది. వాటి వినియోగం మానేయగలమా? ముప్పయి శాతంమంది హలాల్ తినేవారి శ్రమ, ఉత్పత్తులను వినియోగించకుండా.. సోకాల్డ్ హిందూ వేర్పాటువాద భావాజాలం కలవారు మనగలుగుతారా? ఎవరు తినేదైనా ఆహారమే మామ! సమష్టి శ్రమ, ఉత్పత్తి, వినియోగంతోనే సమాజం మనగలుగుతుంది! ఇదే ప్రాపంచిక సత్యం! పరమత సహనం లేనివారు, సాటి మనిషి ఆహారపు అలవాట్లను ద్వేషించేవారు నా దృష్టిలో అజ్ఞానులు మామా!' అన్న.

మామ విస్మయంగా నా వైపే చూస్తుండు.

ఇంతల్నే బస్సు వచ్చి ఆగింది. మామ ఎక్కి కూకుండు. పెళ్లి విషయంలో నా అభిప్రాయాన్ని రాసి పెట్టుకున్న చీటి. బస్సు కదిలేటప్పుడు మామ చేతికిచ్చిన. బస్సెళ్లిపోయింది.

తిరిగి ఇంటికొచ్చిన.

'మామ ఎలివోయిండా బేటా?' అనడిగింది అమ్మి.

ఆ మాటల్లో ఏదో దుఃఖ జీర.

'ఆ.. ఎలివోయిండు!' అని అమ్మి కండ్లవైపు చూసిన.

ఉబికి ఉబికి వస్తున్న కన్నీళ్లను దాచే ప్రయత్నం చేస్తున్నది అమ్మి. కొడుకు

నిర్లక్ష్యానికి గురై.. నానా గోసపడి చచ్చిన అమ్మమ్మ – తాత యాదికొచ్చి ఉంటరేమో? నేను దగ్గిరకుపొయి అమ్మి ఒళ్లో చిన్న పిల్లాడిలా పడుకొని ఆమె కళ్లు తుడిచి..

'అమ్మీ! నాకు మేనమామ సాలు రాలే! మామ మన పేదరికంతో రిశ్తే ఎప్పుడో తెంపుకొన్నడు! అనుబంధాలనేవి డబ్బుతో కొనేవి కావని మామకు తెలుస్త లేదు! నా చదువుకు పెళ్లి ఆటంకం కాకూడదనుకొన్న. అందుకే మామకు తన కూతురితో పెళ్లికి 'సారీ' చెప్పి వచ్చిన!' అనేసరికి అమ్మి ఆశ్చర్యపొయింది.

బస్సు కదిలేటప్పుడు నేను మామ చేతికిచ్చిన చీటి అదే.

సౌదికి పోయి జుబేర్ మామ రెండుసార్లు 'హజ్' చేసి వచ్చినడంట. కానీ, నేను ప్రతిరోజూ అమ్మి రెండు కండ్లల్లో.. 'మక్కా – మదీన' లను చూస్తుంట.

* * *

ఇస్తెమా = ఇస్లాం ధార్మిక సభ, రిజఖ్ = భృతి, నారాజ్ = అయిష్టత

ఖాగినా = కోడిగుడ్ల కూర, దీన్ = ఇస్లాం గురించిన, రిశ్తే = అనుబంధాలు

## సయ్యద్ గఫార్

1973 నుంచీ కథలు రాస్తున్నారు. ఈయన స్వస్థలం నల్లగొండ జిల్లా వాడపల్లి. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఎనిమిదేళ్లపాటు 'పంచాయతీ రాజ్ లీడర్' స్థానిక సంస్థల విశ్లేషణ మాస పత్రికను నడిపించారు. స్టేజీ నాటకాల్లో నటన, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం ఇప్పటివరకూ నిర్వహించిన అన్ని కథల పోటీలలోనూ బహుమతులు గెలుచుకున్నారు. రెండుసార్లు కన్సొలేషన్ బహుమతులు, ఒకసారి విశిష్ట, మరోసారి ప్రత్యేక బహుమతి పొందగా.. ఇప్పుడు 'రిశ్తే' కథకు తృతీయ బహుమతి దక్కించుకున్నారు. 2017లో 'జనన వాంగ్మూలం' అనే కవితా సంపుటిని తెచ్చారు. ప్రస్తుతం 'ఖుర్బాని' కథల సంపుటి ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నది.

–81432 53116

# చేజారిపోనీకు..!



## గుమ్మడి రవీంద్రనాథ్

స్పర్శ హార్ట్ ఇన్‌స్టిట్యూట్. దేశంలోని అత్యాధునిక ఆసుపత్రులలో ఒకటి. ఆ ఇన్‌స్టిట్యూట్ భవంతి నాలుగో అంతస్తులో ఉంది రీసెర్చ్ ల్యాబ్. కృత్రిమ గుండెకు రూపకల్పన జరుగుతున్నదా ల్యాబ్‌లో. ఒక ప్రత్యేక నిపుణుల బృందం ఆ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్నది. డా.దీపిక కూడా ఆ బృందంలో ఉన్నది. ఆమె హృద్రోగ నిపుణురాలు. కార్డియోథొరాసిక్ శస్త్ర చికిత్సల్లో 'రోబోటిక్' నైపుణ్యం కూడా ఉన్నది. అక్కడ తయారవుతున్న 'హృదయంత్రం' అని పిలిచే ఆ 'ఎల్‌వీఏడీ' పరికరం వైపు నిశితంగా చూస్తున్నది డా.దీపిక. సరిగ్గా అప్పుడే ఆమె ఫోన్ వైబ్రేట్ అయింది.

'ఒక ఎమెర్జెన్సీ సర్జరీ దీపికా! ఓటీకి రాగలవా?'.. అదే హాస్పిటల్‌లో పనిచేస్తున్న డా.స్వాతి చెప్పింది ఫోన్‌లో.

* * *

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఒక యువకుణ్ని 108 వాహనం ఆ ఆసుపత్రికి తీసుకొచ్చింది.

'టిప్పర్ గుద్దేసింది. బతికే ఉన్నాడు. పల్స్ ఉంది' అంబులెన్స్ సిబ్బంది ఒకతను చెప్పాడు.. ముప్పై ఐదేళ్ల ఆ యువకుణ్ని స్ట్రెచర్ మీదికి మారుస్తూ, ఎమర్జెన్సీ రూమ్‌లో ఉన్న డా.స్వాతితో.

'సీటీ'లో తెలిసింది.. అతనికి మల్టిపుల్ రిబ్ ఫ్రాక్చర్స్‌తోపాటు ఛాతీ ఎముక కూడా విరిగిపోయింది! 'న్యుమో పెరికార్డియమ్'! వెంటనే ఆపరేషన్ చేయకపోతే బతకడు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న అతని తల్లితండ్రులు వచ్చారు.

'వాడు నా ఒక్కగానొక్క బిడ్డమ్మా! పేరు శరత్. కలలో కూడా ఎవ్వరికీ హాని తలపెట్టని సున్నిత హృదయం వాడిది. సొంత తెలివితేటలతో చిన్న వయసులోనే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీకి అధిపతి కాగలిగాడు. వాడినెలాగైనా బతికించమ్మా!'.. అతని తల్లి కన్నీళ్లతో డా.స్వాతికి చేతులు జోడించింది. వెంటనే దీపికకి ఫోన్ చేసింది స్వాతి.

* * *

ఆపరేషన్ థియేటర్‌లో డా.దీపికతోపాటు మరొక సర్జన్ కూడా ఉన్నారు. శరత్ అనే ఆ రోగి ముఖంలోకి చూసింది దీపిక. అతని తలకూ, ముఖానికీ ఏ గాయాలూ

లేవు. అందరూ 'సర్జరీ మోడ్'కి వచ్చేసారు. 'యాంటెరో లేటరల్ తొరెక్టమీ'కి సిద్ధమయ్యారు. కుడివైపు పెరికార్డియం చిట్లిపోవడం గుర్తించింది దీపిక. పెరికార్డియల్ సేక్ నిండా రక్తం! ఆ రక్తాన్ని 'తోడితే' కనిపించింది.. కుడి వెంట్రికిల్ ముందు భాగంలో సెంటీమీటర్ మేర ఉన్న మయోకార్డియల్ ల్యాసిరేషన్! దాన్ని 'మరమ్మతు' చేయాలిప్పుడు. పెరికార్డియల్ ప్యాచ్‌తో 2/0 ప్రోపిలీన్ కుట్లువేసాక మరమ్మతు పూర్తయింది. అక్కడే ఉన్న స్వాతి చిరునవ్వుతో దీపికని చూసి..

'యూ సేవ్డ్ అనదర్ లైఫ్ దీపికా!' అన్నది అభినందనగా!

మర్నాడు మౌర్య అనే పోలీస్ అధికారి హాస్పిటల్‌కి వచ్చాడు. డా.దీపికకు మౌర్య తెలుసు.

'నిన్నటి యాక్సిడెంట్ కేస్ గురించి వచ్చాను డాక్టర్!' చెప్పాడు మౌర్య.

'తాగి నడుపుతున్నాడా.. ఆ ట్రక్ డ్రైవర్?' అడిగింది డా.దీపిక.

'ట్రక్ డ్రైవర్ తప్పేమీ లేదు మేడం. ఈ శరత్ అనేవాడే కావాలని ట్రక్‌కి ఎదురెళ్లాడు!'.

'వ్వాట్?'.

'సీసీ టీవీలో స్పష్టంగా రికార్డ్ అయింది!' అంటూ మొబైల్‌లో ఆ పుటేజ్‌ని ఆమెకి చూపించాడు.

ట్రక్ వేగంగా వస్తున్నది. రోడ్డు పక్కనే నిలబడి ఉన్నాడు శరత్. ఉన్నట్టుండి హఠాత్తుగా రోడ్డు మధ్యకి నడచి.. ఆ ట్రక్‌కి ఎదురెవెళ్లి పోతున్నాడు! డ్రైవర్ అరుస్తూ బ్రేక్‌వేసి స్టీరింగ్ పక్కకు తిప్పినా.. ట్రక్ శరత్‌ని గుద్దేసింది!

'హీ ట్రైడ్ టు కిల్ హిమ్‌సెల్ఫ్ డాక్టర్!'.. నిర్ఘాంతపోయి చూస్తున్న దీపికతో చెప్పాడు మౌర్య.

సాయంత్రం రౌండ్స్‌కి వెళ్లినప్పుడు ఐసీయూలో ఉన్న శరత్ బెడ్ దగ్గరికి వెళ్లింది డా.దీపిక.

'ఎలా ఉన్నారు?' అని అడిగింది.

అతను బదులేమీ ఇవ్వలేదు. ఆమెవైపు కన్నెత్తి చూడనుకూడా చూట్టంలేదు.

'బలవంతంగా మిమ్మల్ని మీరు చంపుకోవాలనుకునేంత కష్టం ఏమొచ్చింది శరత్?'..

ఆ ప్రశ్నకి తలెత్తాడు.

'మీ రక్తంలో 'యాంటీయాన్డ్రోజెన్' ఆనవాళ్లు ఉండటం నేను చూసాను!' అని దీపిక అనగానే.. అప్పుడు శరత్ నోరు విప్పాడు.

'ఆ భగవంతుడు నా మెదడులో రెండు పరస్పర వైరుధ్య భావాలను ఉంచి నన్నొక శాపగ్రస్థుణ్ని చేసాడు డాక్టర్! మాట ద్వారా, చూపు ద్వారా కూడా ఇతరులకి ఏ చిన్ని 'బాధ' కలిగించినా.. అదీ హింసే అని నమ్మేవాణ్ని. అలాంటి నాకు 'హింస',

'బాధ'లతో ముడిపడి ఉండే ఒక ప్రమాదకర ప్రవృత్తి (ప్రొపెన్సిటీ)ని ఇచ్చాడు ఆ భగవంతుడు! మై బ్రైన్ ఈజ్ నాట్ 'వైర్డ్ కరెక్ట్‌లీ!'. నా సెక్సువల్ ఓరియంటేషన్‌లో 'అపసవ్యత' ఉంది. సాటి మనిషికేకాదు.. సృష్టిలో ఏ ప్రాణికీ హాని కలిగించకూడదని త్రికరణశుద్ధితో నమ్మే నన్ను.. ప్రీ-ప్యుబెర్టిక్ పిల్లల పట్ల 'ఆకర్షణ' కలిగిఉండే పీడోఫిలిక్ డిజార్డర్‌తో పుట్టించిన ఆ దేవుణ్ని ఏం చేయగలను నేను!? నావల్ల ఏ చిట్టిపాపకూ హాని జరగకుండా ముందుజాగ్రత్త కోసమే యాంటీయాన్డ్రోజన్ మందులు తీసుకుంటున్నాను. ఇంతదాకా ఏ 'తప్పూ' జరగకుండా జాగ్రత్త పడగలిగాను. కానీ, ఎప్పుడు విస్ఫోటిస్తానో తెలీని భయంకరమైన పేలుడు పదార్థం లాంటివాణ్ని నేను. ఒక 'అపసవ్యత' కారణంగా ఏ చిన్నారి కంటి నుంచీ ఒక్క అశ్రుబిందువూ జారకూడదంటే, నాలాంటి వాడు బతికి ఉండకూడదు. సమాజం పట్ల నా బాధ్యతది. ట్రక్‌కి ఎదురువెళ్లినా చావు రాలేదు. అసంపూర్తిగా మిగిలిపోయిన ఆ 'బాధ్యత'ని పూర్తిచేసే వీలు కల్పించండి డాక్టర్! నాకేదైనా విషమివ్వండి ప్లీజ్!'..

మానవత్వపు పరిమళంతో నిండిన అతనిలోని ఆ ఆర్ద్రతకు కదిలిపోయింది డా.దీపిక.

'శరత్! మీలోని ఆ 'అపసవ్యత' కారణంగా ఎక్కడో ఎవరికో కీడు జరుగుతుందేమో అన్న భయంతో ఆత్మాహుతికే సిద్ధమయ్యారంటే మీదెంత మంచి మనసో నాకు అర్థం అవుతున్నది. ఆ 'మంచిమనసు' బతకాలి. అయినా, ఎంతటి సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ జీవితాన్ని 'చేజారి' పోనీకూడదు. నేనెదుర్కొన్న కష్టం ఏంటో తెలిస్తే.. మీ 'సమస్య' చిన్నదిగా కనిపిస్తుందేమో! దాన్ని అధిగ మించవచ్చనే నమ్మకమూ కలుగుతుందేమో వినండి!'.. అంటూ తన కథ చెప్పడం మొదలుపెట్టింది.

* * *

తండాలో సంచారజాతుల కుటుంబంలో నిరుపేద జన్మ నాది. పగటి బాగోతుల కులవృత్తిని నమ్ముకుని బతికేవాళ్లం! నన్నూ ఆ కులవృత్తిలోకే తేవాలనుకున్నాడు మా నాన్న. అమ్మకు మాత్రం నన్ను బాగా చదివించాలని ఉండేది. నాకూ చదువుపైనే ధ్యాస. ఐదవ తరగతి తర్వాత నన్ను సంక్షేమ వసతిగృహంలో ఉంచేసారు. బాగా చదువుతానని నన్ను ఆప్యాయంగా చూసుకునేవాడు అక్కడి వార్డెన్ రామయ్య సార్. ఆంగ్లంలో ఆయనకు మంచి పట్టుంది. నేను పదవ తరగతిలో ఉండగా ఓరోజు ఆంగ్ల వ్యాకరణం నేర్పించడానికి తనవద్దకు రప్పించుకుని నాపైన అఘాయిత్యం చేసాడు! అమ్మా నాన్నకు ఆ విషయం చెబితే నమ్మలేదు. 'రామయ్య సారు దేవుడులాటోరు' అన్నారు. పైనున్న దేవుడికి తెలుసు కదా నిజమేంటో! అందుకే.. రెండో రోజునే రామయ్యని తన వద్దకు 'తీసుకుపోయాడు'! స్కూటర్‌పై వెళ్తున్న రామయ్య బండి హఠాత్తుగా అదుపుతప్పింది. ట్రాక్టర్‌ని గుద్దేసింది. దాంతో ఆయన అక్కడికక్కడే

చనిపోయాడు. అమ్మా నాన్నా నమ్మలేదు కానీ, నాపై జరిగిన పైశాచికత్వాన్ని ఒక వ్యక్తి నమ్మారు. 'నమ్మడం' కాదు. ఆ వ్యక్తికి 'తెలుసు' కూడా! ఆ వ్యక్తి.. సీతక్క. వార్డెన్ సార్ భార్య. తనూ డిగ్రీ చదివింది. ఉద్యోగాలకోసం చూడకుండా సేంద్రియ వ్యవసాయం చేసేది. భర్త వికృత లైంగికత్వం గురించి ఆవిడకు తెలుసు. వార్డెన్ ముసుగులో నాలాంటి చాలామంది పసిమొగ్గల్ని చిదిమేసాడు ఆ 'రావణాసురుడు'! రోడ్డు ప్రమాదంలో భర్త చనిపోయినప్పుడు ఒక్క కన్నీటి చుక్కా ఆవిడ కళ్లనుంచి రాలేదు.

'చదివి ఏమవ్వాలని అనుకుంటున్నావు?' అనడిగింది సీతక్క నన్ను.

'డాక్టర్ అవుతానమ్మా!' అని చెప్పా! నన్ను గుండెకు హత్తుకుంది.

'నువ్వు డాక్టర్‌వి అయ్యేందుకు నేను అండగా ఉంటాను' అన్నది. అప్పటినుంచి సీతక్క నాకు 'సీతమ్మ' అయిపోయింది. ఆ 'అమ్మ' ఆసరాతో డాక్టర్‌ను అయిపోతా అనుకున్నాను. కానీ, విధి నాకోసం మరింత 'కఠిన' పరీక్షను సిద్ధం చేస్తున్నదని అప్పుడు తెలీలేదు!'..

* * *

నేను వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న రోజులవి. ఆనందంగానే ఉండేదాన్ని.. ఆ 'చేదు జ్ఞాపకాల'ను మనసు పొరల్లో సమాధి చేసుకుంటూ.

సంక్రాంతి పండగకి కళాశాలకి సెలవులు ఇచ్చారు. అమ్మానాన్న, సీతక్కను చూడటానికి మా ఊరుకి బయల్దేరాను రైల్లో. ఎస్-8 బోగీలో పైబెర్త్ మీద పడుకున్నాను. సమయం.. అర్ధరాత్రి పన్నెండు. చీకటిని చీల్చుకుంటూ 130 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నది ఆ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు. కొన్ని క్షణాల ముందే ఒక చిన్ని స్టేషన్‌ని దాటిందది. డ్రైవర్‌కి మెయిన్ లైన్‌లో ఆకుపచ్చ సిగ్నల్ కనిపిస్తున్నది. కానీ అనూహ్యంగా బండి లూప్‌లైన్‌కి మారిపోయింది. ఆ లూప్ లైన్‌లో ఇనుప ధాతువు నిండి ఉన్న గూడ్స్ బండి ఆగిఉంది. అంతే.. మరుక్షణం జరిగిపోయింది ఆ ఘోరం! ఇంజిన్‌తోపాటు నాలుగు కోచ్‌లు ఆ గూడ్స్ బండి మీదికి ఎక్కేసాయి. పన్నెండు కోచ్‌లు పట్టాలు తప్పి చెల్లాచెదురుగా పడిపోయాయి. నాకు మెలకువ వచ్చి చూసాను. చుట్టూ గాఢమైన చీకటి. రైలు పట్టాల పక్కన వెల్లకిలా పడిఉన్నానని తెలుస్తున్నది. చలిగాలి ముఖాన్ని తాకింది. ఎక్కడా నొప్పి తెలియడంలేదు.

'నాకేం కాలేదు!' అనుకుంటూ, అమ్మకి ఫోన్ చేయాలని కుడి చేతిని పైకి లేపాను. కానీ అది లేవలేదు. లేవలేకపోవడం కాదు.. అది అసలు లేదు! నా కుడి అరచేయీ, ముంజేయి అక్కడ లేవు. మోచేతి కింది వరకూ తెగిపోయి ఉంది! భయంతో కంపించిపోతూ పక్కకు చూసాను. ఎవరో గొడ్డలితో నరికినట్టు ఎడమ చేయి కూడా తెగిపోయి ఉంది. ఆ 'మొండి' చేతుల్లోంచి ధారాపాతంగా నెత్తురు కారిపోతున్నది. అప్పుడు తెలిసింది నొ..ప్పి! వేసుకున్న గులాబీ రంగు చుడీదార్

ఎర్రగా తడిసిపోతున్నది. వైద్య విద్యార్థినిగా నాకు తెలుస్తున్నది.. రక్తస్రావం ఎక్కువై పోతున్నదని. నా శరీరంలో రెండు 'లింబ్స్' తెగిపోయాయన్న షాక్! ఇరవై నిమిషాలకి అక్కడికి ఎమెర్జెన్సీ వైద్య బృందాలు చేరుకున్నాయి. ఒక మెడికల్ టెక్నీషియన్ నన్ను చూసి శవం అనుకుని ఆ 'గుట్టల' వైపు తరలించబోతుంటే..

'నేను బతికే ఉన్నాను. బ్లీడింగ్ ఆగేలా ఏదైనా చేయండి ప్లీజ్!' అన్నాను.

అతను ఆశ్చర్యపోయాడు నేను మాట్లాడటం చూసి. నాలో ఒక ఆశ.. 'నేను బతుకుతాను'. 'బ.త.కా.లి!'

'సిగ్నలింగ్ వైఫల్యంతో ఘోర రైలు ప్రమాదం. వందల మంది దుర్మరణం' అన్న వార్త చూసి ఉలిక్కిపడింది సీతక్క.

ఒక ఆసుపత్రిలో నాకు చికిత్స చేస్తున్నారు. ఆపరేషన్ థియేటర్‌కి నన్ను తరలిస్తుంటే.. గౌన్ వేసుకున్న ఒక డాక్టర్ని అడిగా..

'నేను బతుకుతానా డాక్టర్?' అని.

'తప్పకుండా!'.. అన్నాడు ఆ డాక్టర్.

ఒక నిశ్చింతతో ఇక అప్పుడు కళ్లు మూసుకున్నాను.

* * *

కాలం పరిగెడుతున్నది. హఠాత్తుగా రెండు చేతులూ పోవడంతో నా మెదడులో సర్క్యూట్లు ఇంకా 'సర్దుబాటు' చేసుకోలేక పోతున్నాయి. ఆ అవయవాలు ఇంకా 'ఉన్నట్లే' అనిపిస్తూ ఒక భ్రాంతి! అమ్మా నాన్నల కంటే సీతక్కే నా పక్కన ఎక్కువగా ఉంటున్నది. సీతక్క అలా నా పక్కన 'ఉండటమే' ఒక ఓదార్పు, ఒక ధైర్యం నాకు. ప్రోస్తేటిక్ నిపుణుల దగ్గర కృత్రిమ అవయవాల గురించి తెలుసుకుంటూ వాటితో దైనందిన జీవితంలో పనులెలా చేయాలో నేర్చుకుంటున్నాను. ఒకరోజు నాకు కృత్రిమ చేతుల్ని అమర్చారు. శిల్పి చేతుల్లో మలచబడ్డట్టున్న ఆ ప్లాస్టిక్కూ, లోహమే నాకా క్షణంలో ఏంతో అందమైనవిగా, అపురూపంగా అనిపించాయి. కుడి చేతికి అమర్చిన ప్రోస్తెసిస్‌తో మొదటిసారి కలం పట్టుకోగానే.. నాలో ఒక సంతోషం! నా కళ్లు నీటితో నిండిపోయాయి. పసిపిల్లాడు మొదటిసారి ఒక్కొక్కటీ నేర్చుకుంటూ అనుభవించే సంతోషంలాంటిది అది. ఎందుకో ప్రతి చిన్ని అనుభవమూ గొప్ప ఆనందాన్నిస్తున్నది. క్రమంగా నాకు కృత్రిమ అవయవాల్ని ఉపయోగించే నైపుణ్యం వచ్చేసింది. 'హుక్స్'తోనే పుస్తకాన్ని తెరవడం, టీ కప్పు పట్టుకోవడం ఆఖరికి నా దుస్తుల మీది తల వెంట్రుకని కూడా 'చేత్తో' పట్టుకో గలుగుతున్నాను. బైక్ కూడా నడిపేసాను ఒకరోజు. రైలు ప్రమాదం జరిగిన ఏడాది తర్వాత తిరిగి కళాశాలలో ప్రవేశించాను. అంతకు ముందుకంటే కూడా ఎక్కువ మార్కులు సాధిస్తూ, పట్టుదలతో వైద్యురాలినయ్యాను. ఈ కృత్రిమ అవయవాలతో రోగి శరీరంలోని ట్యూమర్‌ని గుర్తించ గలుగుతున్నాను ఇప్పుడు! ఈ కృత్రిమ చేతులతోనే కృత్రిమ గుండె తయారీలో సేవలు అందివ్వ

గలుగుతున్నాను. ఈ 'చేతులతోనే' మీకు శస్త్రచికిత్సా చేయగలిగాను!'.. అంటూ తన 'రెండు చేతుల్నీ' శరత్ ముందుకు చాపింది డా. దీపిక!

శరత్ దిగ్భ్రాంతితో ఆ ప్రోస్తేటిక్ చేతుల్ని చూస్తూ అచేతనావస్థలో ఉండిపోయాడు.

'శరత్.. మీకున్న ఆ 'పీడోఫిలిక్ డిజార్డర్' కంటే తీవ్రమైనది 'సైకోపతిక్ కండిషన్'. అత్యంత ప్రమాదకరమైన యాంటీ సోషల్ పర్సనల్ డిజార్డర్ అది. ఇప్పుడున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైకోపతిక్ కండిషన్‌ని కూడా నయం చేసే మార్గాలు ఉన్నాయి. అంతేకాదు 'సైకోపాత్స్'ని ముందే కనిపెట్టి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆపగలగడం కూడా సాధ్యమే. అలాంటప్పుడు మీకున్న 'పరిస్థితిని' నయం చేయలేమా?! మీ సమస్యను తొలగించే 'బాధ్యత' నాది. కానీ, ఇంకెప్పుడూ ఆత్మహత్యాయత్న యోచన మాత్రం చేయనని నాకు మాటివ్వండి ప్లీజ్'.. డా.దీపిక చేతిలో చేయి వేసాడు శరత్. ఎందుకో.. అది అతనికి కృత్రిమ చేతిలా అనిపించలేదు. మానవత్వపు పరిమళాలతో కూడిన సజీవ స్పర్శలానే ఉంది!

'ఎందరో మృగాళ్లు ఎన్నో పసి జీవితాల్ని చిదిమేస్తున్నారు. నేనూ ఒక 'ప్రిడేటర్' చేతిలో బలైనదాన్నే! అయినా మిమ్మల్ని నేను కాపాడతాను. ఎందుకంటే.. మీలోని ఆ 'ప్రమాదకర సెక్సువల్ ఓరియంటేషన్' కారణంగా ఎవరికైనా కీడు జరగుతుందేమోనన్న సామజిక బాధ్యత ఉంది మీలో. ఆ మానవీయత మరణించకూడదు శరత్!'..

* * *

ఆ తర్వాత రెండు నెలల్లోనే డా.దీపిక ఒక అద్భుతమైన మెడికల్ మిరకిల్‌కి నాంది పలికింది. కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్‌ల సాంకేతికత సాయంతో శరత్ మెదడులోని నాడీ వ్యవస్థను నియంత్రిచేలా ఒక ప్రత్యేకమైన 'ఏర్పాటు' చేసింది. అది ఏ చిప్ ద్వారానో ఒక పరికరం ద్వారానో కాదు. కేవలం ఒక టాటూ పూతతోనే!! 'గ్రాఫీన్' అనే ప్రత్యేకమైన పదార్థపు పొడి కలిపిన టాటూ! పూతరేకు పొరలో లక్షో వంతు మందం మాత్రమే ఉన్నా.. స్టీల్ కంటే రెండొందల రెట్లు గట్టిది – గ్రాఫీన్! ఒక మేజిక్ మెటీరియల్!

ఆ ప్రయోగం ఫలించింది. శరత్ మెదడులోని నరాలిప్పుడు 'సరిగ్గా' కలపబడి ఉన్నాయ్!

చికిత్స ముగిసి పూర్తిగా కోలుకున్న తర్వాత శరత్, డా. దీపికతో చెప్పాడు.

'మీ 'చేయం'దుకునే అర్హత నాకుందో లేదో తెలీదు. కానీ చల్లని మీ చేతి 'స్పర్శ' జీవితాంతం నాకు కావాలనిపిస్తున్నది. విల్‌యూ మ్యారీ మీ డాక్టర్?' మోకాళ్ల మీద కూర్చుని అర్థించాడు శరత్!

ఎన్నో ఏళ్లుగా స్థబ్ధతతో నిద్రాణమైఉన్న, తనలోని స్త్రీత్వపు ముగ్ధత్వాన్నెవరో

మేల్కొల్పుతున్నట్టు తుళ్లిపడింది దీపిక.

* * *

వివాహమైన కొన్ని నెలలకే, ఒక ఆశ్రమాన్ని స్థాపించారు.. అగ్నిసాక్షిగా భార్యాభర్తలైన దీపికా, శరత్! భౌతిక, లైంగిక, మానసిక వేధింపులకు గురైన ఐదు – పన్నెండు సంవత్సరాల నిరుపేద, అనాథ, వీధి బాల, బాలికల పూర్తిస్థాయి పునరావాసం కోసం ఆ ఆశ్రమం! ప్రారంభోత్సవానికి సీతక్క వచ్చింది. అమ్మానాన్నల సమక్షంలో తన 'సీతమ్మ' చేతులమీదుగా ఆశ్రమ ప్రారంభోత్సవం చేయించింది డా.దీపిక. ఆ రాత్రి, దీపికతో ఒంటరిగా ఉన్నప్పుడు సీతక్క అన్నది..

'ఆనాడు నా భర్త చేసిన అమానుషానికి నేను ఇంకా అపరాధ భావనతో కుమిలిపోతూనే ఉన్నానమ్మా!'.. సీతక్కనే చూస్తున్నది దీపిక.

'కానీ, ఒక్క విషయంలో మాత్రం నాకు సంతృప్తిగా ఉందమ్మా! ఆ రాక్షసుడు చావడం!! ఆ రోజు వాడి స్కూటర్ బ్రేక్ వైర్లని తెంపేసేంత తెగువెలా వచ్చిందో.. నాకిప్పటికీ తెలీదు!'..

దిగ్భ్రాంతితో సీతక్కనే చూస్తున్నది దీపిక.

'నువ్వు దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టడం నాకు చాలా సంతోషంగా ఉంది. జీవితాన్ని ఏ దశలోనూ చేజారిపోనీకూడదు! మానవత్వం మూర్తీభవించిన మంచి మనిషి నీ భర్త. తన 'సమస్య' కారణంగా ఏ చిన్నారికీ కీడు జరగకూడదని అంతగా పరితపించే సున్నితత్వం ఎవరికుంటుంది! నీ భర్తలాంటి మహోన్నతుణ్ని 'రక్షించు'కోవడం ఎంత అవసరమో.. నా భర్తలాంటి రాక్షసుణ్ని 'శిక్షించడమూ' అంతే అవసరం తల్లీ!'..

దీపిక చేతిని మృదువుగా పట్టుకుని, స్థిరంగా చెప్పింది సీతక్క.

***

## గుమ్మడి రవీంద్రనాథ్

గుమ్మడి రవీంద్రనాథ్ స్వస్థలం గుడివాడ. ఎమ్మెస్సీ చేశారు. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో డిప్యూటీ జనరల్ మేనేజర్, హైదరాబాద్ రీజినల్ చీఫ్‌గా పనిచేసి, పదవీ విరమణ పొందారు. ఈయన తొలికథ 'కొసవిరుపు'. ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురితమైంది. ఇప్పటి వరకూ 160కి పైగా కథలు, తొమ్మిది నవలలు.. అన్ని ప్రముఖ వార, మాస, దిన, పక్ష పత్రికలలో ప్రచురితమయ్యాయి. వివిధ పత్రికలు, సాహితీ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీ – 2021లో 'ఆకాశం' కథకు విశిష్ట బహుమతి అందుకున్నారు. – –82973 56766

# ది ఏనిమల్

## వేణు మరీదు



**ఆ పూట నగరం** నగ్నంగా ఉంది. దేహంపై ఒక్క శబ్దం కూడా లేకుండా!

దిగంత్ ఆవులిస్తూ ఆరు కాకుండానే లేచాడు. రోజువారీ అలవాటుకొద్దీ లేవగానే తన అపార్ట్మెంట్ బెడ్ రూమ్ విండో బ్లైండ్స్ జరిపి బయటకు చూస్తూ కూర్చున్నాడు.

ఇదేంటి? చుట్టుపక్కల ఒక మనిషిగానీ, వెహికిల్ గానీ కనపడటం లేదు. నగరం కనుచూపుమేర అంతా నిర్మానుష్యం. కఠిక నిశ్శబ్ధం. రోడ్లన్నీ దుమ్ములో ఆడీ ఆడీ సోయిలేక నిద్రపోతున్న చిన్నారి పిల్లల్లా ఉన్నాయి.

హేమంత రుతువు. అటు పడమటి పక్కపై కృష్ణపక్షపు చంద్రుడు పల్చగా, లీలగా కన్పిస్తూ రుతువిరతికి దగ్గరగావున్న స్త్రీ అనుభవించే నీరసం, నిర్వేదంతో జోగుతున్నట్లుగా దిశ్చక్రం క్రిందికి దిగిపోతున్నాడు. సూర్యుడు మాత్రం మహా దుడుకుగా మరో దిక్కునుండి దూకులు పెడుతున్నాడు. అతని ప్రతి ఉదయంలో తొలిరాత్రి నాటి పెండ్లికొడుకు ఉడుకు!

దిగంత్ అపార్ట్మెంట్ సమీపంలోనే పెద్ద జంక్షన్. మూడు రోడ్లు కలిసే చోట మధ్యన అందమైన సర్కిల్. అందుట్లో మినీ పార్క్. సర్కిల్ కు పక్కనే ఆనుకొని రామాలయం. ఆలయం మైక్ నుండి సుప్రభాతం మోగలేదు. ఆ వెనగ్గా వున్న మస్జిద్ నుండి ఆజాన్ పిలుపుల అజా కూడా లేదు. దిగంత్ టపటప వొళ్ళు విరుస్తూ మహా బద్ధకంగా ఆవులించాడు. నగరమంతా మోకాళ్లమీద కూర్చున్న శివాపిథికస్ ఆదిమానవుని ఒడిలా వుంది. ఇంటిపెద్ద చచ్చిపోగా శ్రాద్ధకర్మలన్నీ ముగిసిన తెల్లారి ఆ ఇంటి మండువా లోగిటి మౌనంలాగా సద్దూసడీ లేకుండా ఉంది ఆ స్థలం అంతా... కొంచెం దూరంలో పాడుబడిన బంగ్లా పెరట్లో ఒట్టిపోయి తెగులు తగిలిన ముసలి కొబ్బరిమాను పసుపు ఆకులు మాత్రమే వీస్తున్న చలిగాలికి స్పందిస్తున్నాయి. దిగంత్ లో భయసంభ్రమాలు అంకురం దాల్చాయి. 'యిదేం వింత? ఎవ్వరూ కనపడరేం? మళ్లీ కరోనా వచ్చిపడిందా యేం ? యింకో లాక్ డౌన్ పెట్టారా?'

దిగంత్ లేచి దిండు కిందున్న మొబైల్ తీసుకొని అప్ డేట్స్ చూసాడు. ఫోన్ స్క్రీన్ బ్లర్ అవుతుంది. ఏమీ కన్పించటం లేదు. బంద్ కూడా ఏమీ లేదే? తెల్లవార్లూ గుండెల మీదుగా పరిగెడుతున్నాయా అన్నట్లుగా ఆ జంక్షన్ సర్కిల్ వైపుగా దూసుకెళ్లే బండ్లు, బస్సులు, కార్లు మొత్తం ఎటు చచ్చినట్లు? అల్లంత దూరంలో రైల్వేట్రాక్స్ మీదనుండి ఏ లోకోల కేకలూ లేవే ఈ వేళ? దిగంత్ మెదడుమానును వేల సందేహాల పురుగులు తొలిచేయటం మొదలైంది.

యింత భయానక మౌనమా? యింత బీభత్స నిశ్శబ్ధతనా? సచ్ సైలెన్స్ ఈజ్ రియల్ వైలెన్స్!

దిగంత్ సందేహం బలపడింది. సందేహం భయానికి తల్లి. కంపించిపోతూ మళ్లీ ఫోన్ అందుకున్నాడు. తన ఫ్రెండ్ సందీప్ కు కాల్ చేసాడు. 'బ్లీప్... బ్లీప్... బ్లీప్...' అవతలనుండి ఏదో వింత మోత. కొలీగ్ సుచేతకు డయల్ చేసాడు. అదే శబ్ధం మళ్లీ. తమ ఊర్లో ఉండే ఇంటివాళ్లందరికీ చేసాడు ఆదుర్దాగా. మళ్లీ మళ్లీ అదే మోత బయటకొచ్చి ఆ బ్లాక్ లో వున్న తలుపులన్నీ మోదసాగాడు. ఎక్కడా మనుషులు సడి లేదు. 'వామ్మో... వామ్మో... ఏమైందసలు?' అని గొణుక్కుంటూ లిఫ్ట్ దగ్గరకు పరుగులు తీసి గ్రౌండ్ ఫ్లోర్ కు దిగొచ్చాడు. 'రాజూ... రాజూ... రాజూ...' అంటూ వాచ్ మ్యాన్ ను గట్టిగా పిలుస్తున్నప్పుడు అతని లంగ్స్ రెండూ నాలికలోకి బైటకు చొచ్చుకొచ్చినట్లనిపించింది. రాజుగానీ, అతని భార్య, పిల్లలు ఎవరూ లేరక్కడ!

ఆ యువకుడికి విషయం మెల్లగా అర్ధమవుతూ ఉంది. 'ఏదో యుగాంతంలాంటిది రాబోతుందన్నమాట! ఈ పాటికల్లా సిటీలో అందరూ ఏటో సముద్రం మధ్యన శిబిరాలకో లేదా యింకో గ్రహమండలంపైకో సర్దుకొని ఉండి ఉంటారా ఏంటి సంగతి? ధూత్... అదేం పిచ్చి ఆలోచన!' తనలో తనే నవ్వుకున్నాడు. ఒకవేళ తనేమన్నా కలలోని భీకర నైట్ మేర్ లోకి జారుకున్నాడా? నాలుగడుగులేసి వాచ్ మ్యాన్ గది బయటి వాష్ బేసిన్ ముందు నిల్చున్నాడు. అద్దంలో తాను తనే! ఎలా చూస్తే అలానే చూసింది. ఎలా చేస్తే అలానే చేసింది తన బింబం. యింకా సందేహం తీరక ట్యాప్ తిప్పి దోసిలితో చల్లటి నీళ్లు మొహం మీద విసురుగా చల్లుకున్నాడు. జివ్వుమన్నాయి చెంపలు, నుదురు! కలకానే కాదు... అంతా నిజమే!

'టు మూవ్ ఆర్ నాట్ టు మూవ్' అన్నట్లు పిరికిగా కదులుతూ దిగంత్ మెయిన్ గేట్ తీసుకుని బయటకు వచ్చాడు. ఫ్లెమింగ్ పక్షి మెడలా తన మెడనూ సాగదీస్తూ ముందూ వెనుకా, కుడీఎడమా చూసుకుంటూ అతి జాగ్రత్తగా మెయిన్ రోడ్ చేరాడు. చలికి రెండు చేతుల్నీ భుజాలకు గట్టిగా వొత్తిపట్టుకుని విశాలమైన వై జంక్షన్ సర్కిల్ దగ్గరకు చేరాడు. 'ఐమ్ ఎ లెజెండ్' సినిమాలో రాబర్ట్ నెవిల్ స్మశానాన్ని తలపించే నిర్జన న్యూయార్క్ నగరంలో ఒక్కడే ఒంటరై తిరిగే సన్నివేశం కళ్లముందు ఆవిష్కృతమైంది. ఆ నెవిల్ కన్నా అతని పెట్ 'స్యామ్' ఉంది. తనేంటి ఒక్కడే యింత దారుణంగా మిగిలిపోయాడు ఈ భూమ్మీద? భయసందేహాల వేల నాగులు అతని మనసును చుట్టేస్తున్నాయి.

దిగంత్ సర్కిల్ లోపటి భాగంలో మినీపార్కులోకి నడచి, విశ్రాంతిగా నడుము మీద చేతులాన్చి చుట్టూ కలియజూసాడు. ఈ సమయంలో కూడా ఎంత రద్దీగా ఉంటుందీ జంక్షన్. మూడువైపులా ముప్ఫయి పైగా చుట్టుపక్కల ఊళ్లతో కనెక్ట్ చేసే జంక్షన్ అది హాట్ రష్ లో మిస్సైల్స్ మాదిరిగా దూసుకొచ్చే వాహనాలు. ఏ మాత్రం పరాకుగావున్నా దేహం నుజ్జు నుజ్జయిపోతుంది. రోజూ తను ఆఫీసుకెళ్లేటప్పుడు నల్లటి తన గ్రానైట్ చెక్కిళ్లను కలువ పూరేకుల్లా విప్పారిస్తూ నవ్వే ట్రాఫిక్ కానిస్టేబుల్ లక్ష్మణ్ తళుక్కున గుర్తొచ్చాడు. 'ఏడీ? ఎక్కడ తను? సిల్లీ థాట్! అసలు ట్రాఫిక్కే సున్నా... యింకా ట్రాఫిక్ కంట్రోలేంటి?'

ఫెర్నాండెజ్ దీవిలో చిక్కుకున్న రాబిన్ సన్ క్రూసోలా దిగంత్ పార్కు బయటకొచ్చి ఆ నిర్జన కూడలి చుట్టూ బిక్కుబిక్కుమని తిరగసాగాడు. పొద్దెక్కుతుంది. పైపైకి ఎగబాకుతున్న సూరీడు ఆలమందల్ని అదిలించినట్లుగా మంచుతెరల్ని తోలుతున్నాడు.

అప్పుడొచ్చి దూరిందో చిలిపి తలపు దిగంత్ తలలోకి! ఆ క్షణం వరకూ అతని నరాల్లో పేరుకుపోయిన భయం స్థానంలో ఓ కులాసా చాలా థిలాసాగా మొలకెత్తింది.

యింతలో వెనుకనుండి లీలగా విన్పిస్తున్నాయి. ఎప్పటివో చిన్ననాటి అమ్మ తీపి హెచ్చరికలు 'ఛీ బోసిముద్ది సన్నాసీ... పోపో... చెడ్డీ వేస్కో పో' అంటూ!

ఈ మధ్యన.. కొన్నేళ్ల కిందట... ఇంజనీరింగ్ ఫైనల్ సెమెస్టర్... ఫస్ట్ క్రష్ నైనితో... ఆ రాత్రి... లాంగ్ అవైటెడ్ హుకప్. 'నోనో దిగంత్... ప్లీజ్ రా... ప్యాంటీస్ అన్నా ఉండనీ... లాగకు... నో... ప్లీజ్... ఐ హేట్ టు బి న్యూడ్... ప్లీజ్... ముందా పింక్ క్యాండిల్ ఊదేసెయ్... నా వొంటిమీదంతా లైటే!' అంటూ ఒకటే గోల... నగ్నత్వానికి చీకటి పుష్టి కదా!

దానికింకా కొన్నేళ్ల క్రిందట... తన ఇంటర్ లో... 'ర్రేయ్... ర్రేయ్... ఆ పిచ్చోడి నడుంకి ఈ తుండుగుడ్డ చుట్టండ్రా. నీ యవ్వా... వాడి మొండిమొల రోజూ పొద్దున్నే చూళ్ళేక చస్తున్నాం!' సైకిల్ మీద స్పీడుగా వెళ్తూ తన మెడమీది ఎర్ర తువాలు మావైపుకి విసిరేసేవాడు లారీ డ్రైవర్ శంకర్ బాబాయ్. ఆ పిచ్చోడికి లేని బాధ వీళ్లకేంటి అనుకునేవాడు దిగంత్. వాడికి వొంటిపై బట్టవుంటే చిరాకు. వెస్టిఫోబియా. వీళ్లకు న్యూడిటీ అంటే భీతి. జిమ్నోఫోబియా!

ఇంకా ఇంకా ముందుకు... హాస్టల్లో స్నానాలు చేసి బయటకొస్తున్న జూనియర్స్ టవల్స్ లాగి పడేసివాళ్లు తమ సీనియర్స్. ఏడుస్తూ గడ్డినేలపై పొర్లుతున్న ఆ చిన్నారుల నగ్నదేహాలిప్పుడు మెరుస్తున్నాయి దిగంత్ కనుల ముంగిట. నిజానికి సృష్టిలో అణువునుండి అంబరం వరకూ దిగంబరమే! మరి మనిషికెందుకు ఈ నగ్నభీతి?

దిగంత్ తనలో తాను ముసిముసిగా నవ్వుకుంటూ తన స్వెట్ షర్ట్ జిప్ సర్రున గుంజి దాన్ని తీసి తన భుజాల బలం కొద్దీ విసిరేసాడు. అది తిన్నగా ఎగిరి మురికి కాలువలో పడి ప్రవాహంలో కొట్టుకుపోయింది.

'ఆహా... హ్హాహ్హాహా... హ్హాహ్హాహా... జిల్లే... జిల్లేలే... జిల్లాయిలే..." అంటూ ఉల్లాసంగా హమ్ చేస్తూ తన హాఫ్ షర్ట్ ను కూడా క్రిందకు జార్చి తీసి పక్కనే వున్న కానుగ చెట్టు మీదకు విసిరేసాడు దిగంత్. స్లో మోషన్ లో మెడవంచి తనను తాను కొంచెం కొంచెంగా ఆసాంతం చూసుకోసాగాడు. ఎన్నిసార్లో అద్దం ముందు తననలా చూసుకోవటం తనకు కొత్తేమీ కాదు. కానీ యిప్పుడు... యిలా... ఆరుబయట... తనొక్కడే! బ్యూటిఫుల్! ప్రకృతి యొక్క కృతి ఈ శరీరాకృతి... ప్రకృతికి లేని ఆచ్ఛాదన మానవుడికెందుకు మరి? ఎక్కడో చదివిన మార్లిన్ మన్రో మాట గుర్తొచ్చింది దిగంత్ కు దేహమున్నది మొత్తంగా దాచుకోటానికే గాదు... చూసుకోటానికి కూడా!

దిగంత్ తన బారు, చురుకైన నగ్నదేహాన్ని మళ్ళీమళ్ళీ మురిపెంగా చూసుకున్నాడు. యింకా పెళ్లికానివాడు. బొర్ర, పిర్ర అతిగా లేనేలేవు. మైఖెలేంజిలో 'డేవిడ్' శిల్పంలా ఉన్నాడు. 'చూద్దాం ఈ ఒంటరి ఆదాముకు ఓ అవ్వ దొరక్కపోతుందా?' అనుకుంటూ మహా

ఉత్సాహంగా ముందుకు కదిలాడు. లేత ఎరుపు నియాన్ లైట్స్ వెలుగులో ప్రాణం పోసుకుని నడుస్తున్న టెర్రాకోటా బొమ్మలా ఉంది దిగంత్ దేహం. పసుపు వెన్నెలను తాగుతూ నది ఒడ్డున ఒక్కతే నిలబడి నిండుగా పూసిన తన మేని సొగసు చూసుకుని మురుసుకుంటున్న చింతమానులా... రాత్రిళ్ళు తను, రాజన్ గాడు ఖాళీ చేసి మూలకు నెట్టిన మార్ఫియస్ మందు బాటిల్స్ లా మెరుస్తున్నాయి దిగంత్ దేహాంగాలు నీరెండకు. ముందుకు నడుస్తూనే మళ్ళీ మళ్ళీ తన కటిభాగం చూసుకోసాగాడు. నగ్నంగా మొదలైన నాగరికత ఎందుకో నగ్నత్వాన్ని నిరసిస్తుంది? ఈ నగ్నత్వం ఎవరిది? శిశువుదా? పశువుదా? అఘోరాలదా? ఆదిమానవులదా? దిక్కులను అంబరంగా ధరించే జైన దిగంబరులదా? మొండిమొలల నాగసాధువులదా? వాళ్ల న్యూడిటీకి పవిత్రత ఎందుకు? వాళ్లకి పూజలెందుకు? జననంతో మొలకెత్తి, మరణంతో మట్టిగలిసే రెండు నగ్నత్వాల మధ్య నడిచే నౌతంకీనే కదా ఈ జీవి బతుకు! మరెందుకు ఈ సంస్కృతికి దిగంబర భీతి? నిజంగా ఈ నగ్నత్వమే మానమా? అభిమానమా? అలా ఉంటే అది నీచమా? ఐతే కోవెలల గోడలపైకి ఎందుకు చేరింది? అది పాపమా? ఐతే కళలో ఎలా వెలిగింది? ఇది నేరమా? ఐతే ఎందుకు నగ్నమో లేక అర్ధ నగ్నమో లోకపు శృంగార నేత్రానికి పండుగవుతుంది? ఖజురహో నగ్న శిల్ప జంటల్లో కనపడని బూతు... అదిమైథునంలో కనపడని బూతు నేటి నరుల నరాల్లోకి ఎందుకని యింకిపోయింది?.

వేల డ్రోన్ల మాదిరిగా ఎన్నెన్నో భావాలు అతని మెదడు మీద దాడి చేస్తుండగా దిగంత్ మెల్లగా తన కాళ్లు, చేతులు, నడుము లయబద్ధంగా ఆడించసాగాడు. 'ఛత్... ఫక్కాఫ్ ఆల్ టాబుస్ ఆన్ నేకిడ్ నెస్... లెట్ మి డాన్స్... లైక్ దిస్... లెట్ మి వాల్ట్స్ ఇన్ ది ఏర్.. విదవుట్ ఎ త్రెడ్ ఆన్ మీ... ఐల్ డూ దట్ ప్రైమల్ డాన్స్ ఆఫ్ ద ప్రిమిటివ్... ద వైల్డ్ ఈజ్ ద ట్రూ నేచర్!" అని బిగ్గరగా, ఉన్మత్తంగా కేకలు పెడుతూ ఊగుతూనే వేగం హెచ్చించాడు ఆ యువకుడు... ఓ అలౌకిక ఏకాంత సౌఖ్యంతో! అతని కటి స్థానం వేడెక్కింది. గజ్జల నడుమ నరాల నాళాలు పొంగుతున్నట్లు ఓ తీపి సలుపు... 'అయ్యో... అయ్యో... ఈ నగరం మరీ యింత సంపూర్ణ నిర్జనఖండంలా కాకుండా ఓ ఆడతోడు ఉంటే ఎంత బాగుండు! తను ఆదిపురుషునిలా... ఆమె అనాది అవ్వలా... తామిద్దరమే... డాన్సింగ్ ఆన్ దిస్ నేకిడ్ గ్లోబ్... అండర్ ది నేకిడ్ స్కై... డిఫైయింగ్ ది క్లోత్ డ్ కల్చర్! అబ్బ... ఆహా... ఆ ఊహే వండర్ఫుల్! మాంసం ఎప్పుడూ మాంసాన్ని ప్రేమిస్తుంది. దేహాలే దైవికాలు! సిగ్గూ బిడియం శీలం సంస్కారం... జాడీలో మురగ మాగిన పాత చింతకాయ తొక్కులే అవన్నీ... కల్చర్ ఈజ్ ఎ వల్చర్ దట్ ఫీడ్స్ ఆన్ ది పికిల్... ట్రాష్... కమాన్... కమాన్... మై బాడీ... మై బిలవిడ్ బాడీ!' అని తనలో తానే మోనోలాగ్స్ గుణుక్కుంటూ యింకా తన నగ్నకాయాన్ని బొంగరంలా భ్రమణాలు చేయించసాగాడు దిగంత్. నడి సముద్రపు పోటెత్తిన అలలా పైకి లేస్తూ దిగుతూ చిందులు తొక్కుతున్నాడు. ఆ దేహం గాండీవమై కదులుతుంది. అది రణరంగంలో భీముని గదలా మెరుస్తుంది. ఆ దేహపు నాట్యం భంగిమలెరుగని శివతాండవంలా... ఛండీదేవి వేనవేల రుధిర నాలికల థిల్లానాలా మధ్యాహ్నం వరకూ నడుస్తూనే ఉంది. అతని దేహమిప్పుడు అతనికి ఓ పసిగుడ్డు... అతని మనసు ఓ కసిగొడ్డు. అది వడివడి చిందులు

తొక్కే మహానంది... విశ్వ ఆనంది!

దిశమొల తాండవంతో తనేదో కొత్తసృష్టిని ఆరంభిస్తున్నట్లుగా ఓ అలౌకిక ప్రచండ ఉన్మత్తతలో ఊగిపోతున్న అతనికి ఎందుకో తనని రెండు కళ్ళు వింతగా, మర్మంగా గమనిస్తున్నట్లనిపించి అమాంతం నిలచిపోయాడు. కళ్ళు గిర్రుగిర్రున తిరిగి చుట్టూ ప్రతి దృగ్విషయమూ సెకన్లపాటు భ్రమణాలు చేసాయి. ఆ తిరగటంలోనే ఆ రెండు కళ్ళూ మళ్లీ మెరిసాయి. బట్టల్లేకుండానే అలాగే సేద తీరుతూ కూర్చొని వేడి ఆవిరులు కక్కుతున్న దేహాంగాలను కాస్త స్థిమితపర్చుకుని కళ్ళు తుడుచుకుంటూ ఆ కళ్ళు కనపడుతున్నట్లున్న దిక్కుగా చూసాడు. అక్కడ కన్పించింది మగువ కాదు. మర్కటం! ఒక్క పురుగూ కూడా కనపడలేదే? ఈ కోతిపిల్ల ఎక్కడినుంచి వచ్చిందబ్బా! దీని కళ్లేంటి అచ్చం తన కళ్ళలానే ఉన్నాయి... సర్ ప్రైజింగ్!' అని అతను అనుకుంటూ, తేరుకునేలోపే అది చెంగున దూకి అటుగా గానుగ కొమ్మపై పడేసివున్న అతని నిక్కర్ ను లాఘవంగా అందుకుని దూరంగా నగరవీధుల్లోకి లంఘించింది. ఎందుకో... అప్పటిదాకా అతనిలో లేని సిగ్గు ఒక్క సారిగా అతని మనసును కమ్మేసింది.

'హేయ్ ... హేయ్... నీ యబ్బా దర్టీ మంకీ... నా షార్ట్ తో నువ్వేం జేస్తావే? ఇటివ్వు... హూం...హూం... కమాన్ ..." రొప్పుతూ దానివెంట పరుగులుదీసాడు దిగంత్. అతను వెనుక ఉరుములా ఘర్జిస్తూ ఉంటే అది మెరుపులా అందకుండా ముందుకు దూసుకెళ్తుంది. నేటికోతి వెంట ఒకనాటి కోతి పరుగు! ఒకనాటి కోతి పరువు నేటికోతి చేతుల్లో! వాళ్ళిద్దరి పరుగు మిస్సైల్ కు, రాకెట్ కు పరుగుపందెంలా నడుస్తుంది. అది ఎన్ని వీధుల మలుపులు తిరిగితే అంత మేరకు అతను పళ్ళుబిగబట్టి పిక్కబలంతో ఉరుకుతున్నాడు. అది ఆగి ఏదైనా చెట్టు ఎక్కితే నిలబడి దాన్ని బతిమిలాడేవాడు. అది మాత్రం అతన్ని కవ్విస్తున్నట్లే దూకి మళ్ళీ పరుగులు తీసేది. అతను ప్రాణంపోయినా సరే తన ఆ లోదుస్తుని దాన్నుండి గుంజుకోవాలనే ఓ ఉడుకు ఆరాటంతో పరిగెడుతున్నాడేగానీ.. 'అసలది పోతేపోయింది... తన అపార్టుమెంట్ ఫ్లాట్ లో ఇంకో పది అలాంటివి ఉన్నాయనే విషయమే అతని బుద్ధికి తట్టట్లేదు. 'ఈ కోతి ఉన్నట్లే పొరపాటున ఎవరైనా మనుషులు ఎదురైతే ఎలా?' అనే ఆలోచన మొగ్గతొడిగింది అతనిలో.

'ఒసేయ్ మంకీ... నా షార్ట్ నాకిచ్చెయ్యవే తల్లీ... యిలా బోసి ముడ్డితో ఎందాకని ఉరికేనే నిన్ను కాల్చి తగలెయ్యా..." అంటూ దానివెంట మారథాన్లు చేస్తూనేవున్నాడు. తన కాలి పిక్కల్లో అంత బలం దాగుందని ఆ క్షణందాకా అతనికే తెలియదు. ఆ కోతిపిల్ల మాత్రం కిచకిచ యికిలిస్తున్నట్లు మధ్యమధ్యలో అక్కడక్కడా ఆగి అతని పసుపురంగు నిక్కరుని జెండాలా ఎత్తిచూపుతూ... అతను దగ్గరకు రాగానే మళ్లీ తన బారు తోకని ఓ పాములా లయ విన్యాసంతో మెలికలు మెలికలుగా ఊపుతూ ముందుకు సాగుతోంది. ఈసారి దిగంత్ చేతికి దొరికిన రాళ్ళు, కర్రపుల్లలు దానిపైకి విసిరేస్తూ ఘోరంగా మొత్తుకుంటూ దానివెంటబడ్డాడు. అప్పటికే సిటీ ఔట్ స్కర్ట్స్ చేరుకున్నారు ఆ మనిషీమృగమూ యిరువురూ.

కోతిపిల్ల ఆ నగ్న యువకుడిని అలా రెచ్చగొడుతూ రెచ్చ గొడుతూ చివరికి ఒక పాత డెసొలేటెడ్ బ్రిడ్జిపైకి చేరింది. పుట్టుకతో వచ్చిన బుద్ధి పిడకలతో కాలిందాకా పోదని అంటారు. అసలే దిగంత్ కచ్చ మనిషి. దాని సంగతెలాగైనా చూడాలని మొండిగా బ్రిడ్జ్ ఎక్కాడు. అగి ఎదురుగా రెండు కాళ్ళపై నిలబడి కవ్వింపుగా చూస్తుంది కోతి. దాని చేతిలో అతని పసుపురంగు షార్ట్. దానికి యింకా దగ్గరగా ఉరికాడు దిగంత్. కోతి గుర్రుమంటూ అతని మీదకు రాబోయింది. అతడు ఓ పలుగురాయి తీసుకుని దానిపైకి విసిరాడు. అది తుర్రుమని వెనక్కు మళ్లీ బ్రిడ్జి డౌన్ లోకి పరిగెత్తింది. అతనూ కదిలి దానిని సమీపిస్తుండగా వంతెన అంచున పాకుడురాళ్లపై కాలుజారింది. గిర్రున బొంగరంలా తిరిగిపోయి చాలా ఎత్తులోవున్న ఆ పురాతన వారధిపై నుండి బారుగా నేలజారుతున్న ఓ ఉల్కలా పాతాళంలోకి విసిరివేయబడినట్లుగా జారుతూ జారుతూ వెల్లకిలా ఒక లోతైన బావి వంటి కందకంలో పొదల మధ్యలో పడ్డాడు. ఆ పడటంతోనే అతని పుర్రె వెనుకభాగం పెద్ద బండకు ఢీకొని నేలకు కొట్టిన కొబ్బరికాయలా పగిలింది. వొళ్లంతా ముళ్ళు, రాళ్ళు, గాజుపెంకుల్లాంటివి గుచ్చుకుని అతని నగ్నశరీరం తల్లిగర్భంలోనుండి పచ్చి నెత్తురులద్దుకుని బయటపడిన శిశుపిండంలా మారిపోయింది. బావిలాంటి ఆ కందకపు పై ఒడ్డుకు దూకి ఆ కోతిపిల్ల చీకటిగా వున్న ఆ లోతు ప్రదేశంలోకి కళ్ళు మిటకరిస్తూ అతని ఆ లోదుస్తుని క్రిందకు పడేసింది. అది ఆ లోయలాంటి ప్రదేశంలో దట్టంగా పెరిగిన నల్లతుమ్మలపై నుండి వీస్తున్న గాలి పొరల మీదుగా ఈకలా జారుతూ తేలుకుంటూపోయి అతని మర్మస్థానంపై కుదురుగా పడిపోయింది.

దిగంత్ తనపై పడిన ఆ మెత్తని వస్త్రపు స్పర్శానుభూతిని కొద్ది సెకన్లు పాటు అనుభవిస్తూ ప్రాణాలను పంచభూతాలకు వదిలేసాడు.

కోతిపిల్ల మాత్రం తన వొంటిని మొత్తంగా పైనా కిందా చూసుకుంటూ కనుమరుగైంది... వనం లాంటి ఆ సబర్బన్ ప్రాంతంలోని పచ్చని చెట్ల మారాకుల హరిత ఆచ్ఛాదనాల మాటుకి!

* * *

'ర్రేయ్ స్టుపిడ్... ఏందిరా ఆ కలవరింతలు, కేకలు? లేరా లే! రాత్రంతా ఆ పియానో నోట్స్ తో కుస్తీపట్టటం... పొద్దుబోయినదాకా పండటం... లేరా లే ! చేసే ఆ కాస్ట్యూమ్స్ డిజైనర్ జాబేదో చేసుకోక ఈ సంగీతం పిచ్చేంట్రా నీకు? లే!' రాజన్ గాడు ఒకటే దొబ్బేస్తున్నాడు.

దిగంత్ మగతగా ఆవులిస్తూ లేచాడు .

తమ ఫ్లాట్ చుట్టూ చూసాడు.

'రేయ్... ఆ కోతి ఏదిరా?"

'ఏ కోతిరా?"

'అదేరా... పిచ్చముండ... నా చెడ్డీ ఎత్తుకుపోయిందే! అది."

'వామ్మో... నీ ఆల్బం ఫినిషయ్యేలోగా నీ పిచ్చి పీక్స్ చేరేలావుందిరోయ్!"

'ఆల్బమ్ పూర్తయిందిరా"

'పూర్తైందా... గుడ్... ఇంతకూ టైటిల్ ఏం పెట్టావు?"

'డోంట్ కిల్ ది ఏనిమల్ న్యూడ్!"

'ఐతే ముందా చెడ్డీ పైకి లాక్కోరా!"

ఇద్దరూ హుషారుగా నవ్వుకున్నారు. నవ్వుతుంటే రాజన్ ముఖం ఆ నిమిషంలో ఆ కోతిపిల్ల ముఖంలా అన్పించింది దిగంత్ కు. క్రిందికి జారిపోయివున్న షార్ట్ ను పైకి లాక్కొని గట్టిగా పట్టుకున్నాడు.

★★★

## వేణు మరీదు

ఆలస్యంగా రచనా వ్యాసంగం ప్రారంభించిన ఈ రచయిత ఇప్పటికి 15 కథలు రాశారు.వా టిల్లో నమస్తే తెలంగాణ– ముల్కనూరు సాహితీ పీఠం వారి 2022 సంవత్సరపు పోటీల్లో తృతీయ బహుమతి పొందిన' కాటుక కన్నుల సాక్షిగా...' 2023 ముల్కనూరు సాహితీ పీఠం వారి జాతీయ కథలపోటీల్లో విశిష్ట బహుమతి సాధించిన 'అతడి నుండి ఆమె దాకా...', ఆంధ్రజ్యోతిలో వచ్చిన డోలాయమానం ముళ్ళ చినుకులు సంకలనంలోని 'ది టాయిలెట్ గర్ల్,' వెలుగు పత్రికలో వచ్చిన 'నాక్కొంచెం ఇంగ్లీషు కావాలి !', వార్త పత్రికలో వచ్చిన 'అచ్చుమ్మవ్వ ఆరో నాణెం',సాహితీ ప్రస్థానంలో వచ్చిన 'ప్రెజెంటేడ బై వసుధ', జాగృతిలో అచ్చయిన 'అవ్వా బువ్వ పెట్టవే!' సాహితీ ప్రస్థానంలో వచ్చిన 'ఆ నలుగురు లేని నాడు', ఉషా పత్రికలో అచ్చయిన పూలకోసం.... పుడమి కోసం.., సారంగ వెబ్ పత్రికలో వచ్చిన 'ఇది ఏం బ్రీడు? ',సంచిక ఆన్లైన్ పత్రికలో వచ్చిన డేడ ఎండ కథలు మంచిపేరు తెచ్చిపెట్టాయి. తెలుగులో కథలు రాయటంతో పాటు ఆల్ పోయెట్రీ డాట్ కామ్ వంటి వెబ్ సైట్లలో ఆంగ్ల కవిత్వాన్ని రాస్తున్నారు .వేణు మరీదు ప్రస్తుతం ఖమ్మంలో ప్రభుత్వ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

– 8555053547

# గబ్బిలం..



*(ది అన్‌టచబుల్)*

**డాక్టర్ ఎమ్ సుగుణ రావు**

**వాషింగ్టన్** డిసి. అమెరికా దేశపు రాజధాని. ఆ నగరంలోని ఒక ప్రముఖ హోటల్ ప్రాంగణంలోకి భారత రాయబారి కార్యాలయంవారి వాహనం వచ్చి ఆగింది. హోటల్ గేటు ముందున్న సూట్ వేసుకున్న వ్యక్తి కారు తలుపు తెరిచాడు. కారులోంచి దిగాడు ఒక 30 ఏళ్ల యువకుడు. గులాబీ రంగు చొక్కా, లేత నీలి రంగు ప్యాంటు. ఇన్‌షర్ట్ చేసి ఏటవాలు గీతలున్న టై కట్టుకున్నాడు. తెల్లగా, పొడుగ్గా ఉన్నాడు.

హోటల్ రిసెప్షన్ వైపు నడిచి, తన ఐడెంటిటీ కార్డు చూపించాడు.

'డాక్టర్ హాసన్ మంగళగిరి, ఐఎఫ్ఎస్. పోస్టెడ్ యాజ్ థర్డ్ సెక్రటరీ. ఇండియన్ ఎంబసీ'..

ఆ రిసెప్షనిస్ట్ ఆ కార్డులోని ఆ వివరాలు పైకి చదువుతూ, నమస్కారం చేసి..

'హేవ్ ఎ సీట్ సార్. యువర్ రూమ్ విల్ బి రెడీ ఇన్ ఎ మూమెంట్' అన్నది.

హాసన్ ఆ మాటలకు చిన్నగా నవ్వి..

'మై అపార్ట్‌మెంట్ ఈజ్ నాట్ యెట్ రెడీ. ఓన్లీ ఫర్ కపుల్ ఆఫ్ డేస్' అన్నాడు.

పావుగంట తర్వాత ఆ హోటల్ అటెండెంట్ హాసన్ లగేజీతో రూమ్‌కు వెళ్లే లిఫ్ట్ ఎక్కాడు. హాసన్ అతన్ని అనుసరించాడు.

* * *

తర్వాతి రోజు ఉదయం ల్యాప్‌టాప్‌లో పని చేసుకుంటున్నాడు హాసన్. తలుపు కొట్టిన చప్పుడు.

'ఎస్ ప్లీజ్' అన్నాడు.

పద్దెనిమిదేళ్ల యువకుడు. తెల్ల మల్లెపూవులాంటి యూనిఫామ్. నెత్తికి క్యాప్. నల్లటి ఆ శరీరం బాగా కసరత్తు చేసినట్టుగా ఉంది. నవ్వుతూ వచ్చిన ఆ వ్యక్తి సెల్యూట్ చేసి..

'రూమ్ సర్వీస్ సార్.. బాత్రూమ్ క్లీనింగ్' అన్నాడు.

ల్యాప్‌టాప్ లోంచి తలెత్తి చూసి..

'వెయిట్ ఫర్ ఎ మూమెంట్' అన్నాడు హాసన్.

ఆ వ్యక్తి అలాగే నిలబడిపోయి చూస్తూ..

'షెల్ ఐ కమ్ లేటర్ సార్' అంటూ వెనక్కి తిరిగాడు.

'ప్లీజ్ బి సీటెడ్ ఫర్ ఎ వైల్' అంటూ సోఫా చూపించి.. అతని చేతిలోని బకెట్టు, ఇతర సామగ్రి తీసుకొని తనే వాష్ రూమ్‌లోకి వెళ్లబోతూ ఉంటే..

'నో సార్.. నో సార్! ఐ విల్ లూజ్ మై జాబ్ సార్. ప్లీజ్.. ప్లీజ్..' అంటూ వెంటపడ్డాడు ఆ రూమ్ బాయ్.

హాసన్ ఆ హోటల్ రూమ్ తలుపు వేసి..

'నో ప్రాబ్లమ్. ఐ విల్ నాట్ రివీల్. దిస్ ఈజ్ ఆల్రెడీ వాష్డ్ ప్రోపర్లీ. ఎనీహౌ.. ఐ విల్ డూ ఇట్' అంటూ చాలా శుభ్రంగా ఉన్న ఆ టాయిలెట్‌ను మళ్లీ కడిగి.. ఆ సామగ్రిని అతనికి అందించాడు.

ఆ బ్లాక్ అమెరికన్ విస్మయంగా, ఆశ్చర్యంగా హాసన్ వంక చూస్తూ ఉండిపోయాడు.

రెండో రోజూ అదే తంతు.

తనని టాయిలెట్ కడగనివ్వకపోవడం, తనే కడుక్కోవడం, తనను బలవంతంగా సోఫాలో కూర్చోబెట్టడం ఆ యువకుడికి ఆశ్చర్యం కలిగించింది. మూడో రోజు ఇక అడిగేశాడు.

'యూ ఆర్ అమేజింగ్ సార్. వాట్ మేడ్ యూ టు డూ దిస్ జాబ్. ది జాబ్ ఈజ్ ఎలోకేటెడ్ టు మి. యూ ఆర్ అవర్ ఫారెన్ డెలిగేట్ అండ్ హై ప్రొఫైల్ డిప్లమేట్' అంటూ చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

హాసన్ ఆ మాటలకు నవ్వి, ఊరుకున్నాడు.

* * *

సివిల్ సర్వీస్ పరీక్షలో సఫలీకృతులైన నాలుగు వందల మందిలో ఇండియన్ ఫారెన్ సర్వీస్ ఎంచుకొన్న బృందంలో హాసన్ ఒకడు. మూడు నెలల శిక్షణలో తమకు న్యాయ నిర్వహణ, ఆర్థిక స్థితిగతులు, క్రిమినల్ ప్రోసీజర్ కోడ్ వంటి వాటి మీద శిక్షణ ఇచ్చారు. అలా తమ శిక్షణా కార్యక్రమంలో తాను రాసిన జనరల్ రైటింగ్.. అంటే ప్రతిరోజూ జరిగిన అనుభవాలు, తేదీల వారీగా రాసిన డైరీ చూస్తూ కూర్చున్నాడు. తమ శిక్షణలో భాగంగా వివిధ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలకు గ్రామ సందర్శన పేరిట తీసుకువెళ్లేవారు. అయితే తాను తన బృందంతో మహారాష్ట్రలోని కొన్ని మారుమూల పల్లెలను సందర్శించాడు. ఇంకా మేన్యువల్ స్కావెంజరింగ్.. అంటే పొట్టకూటి కోసం సఫాయి, మురుగు పనులు చేస్తున్నవారి జీవితాలను పరిశీలించాడు.

సఫాయి కర్మచారుల జీవనం గురించి సివిల్స్ ఇంటర్వ్యూలో అడిగారు. కారణం తాను పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఆ విషయం మీద ఒక ప్రాజెక్ట్ చేశాడు. ఆరోజు ఇంటర్వ్యూలో తనేం చెప్పాడు?

'సాటి మనుషుల మలాన్ని ఎత్తి జీవించే దుస్థితిలో ఈ దేశంలో ఇంకా లక్షలాది మంది బతుకుతున్నారు. అయితే సఫాయి కర్మచారులను పనిలో పెట్టుకోవడాన్ని వ్యతిరేకిస్తూ పొడి పాయిఖానాల నిషేధ చట్టం 1993లో అమలులోకి వచ్చింది. అయితే దేశవ్యాప్తంగా నేటికీ లక్షలాది మంది పారిశుధ్య కార్మికులు డ్రైనేజీ గుంతల్లోకి దిగి శుభ్రం చేస్తున్నారు. చేతులతో మానవ మలాన్ని ఎత్తి గంపల్లో మోసుకొంటూ వెళ్లే అమానుషమైన పనిలో మగ్గుతున్నారు'.. అలా తన పీజీ థీసిస్ గురించి క్లుప్తంగా చెప్పాడు హాసన్.

అంతలో ఇంటర్వ్యూలో తనను ప్రశ్నించే వ్యక్తి హఠాత్తుగా..

'మీకు ఈ హాసన్ అనే పేరు ఎలా వచ్చింది?' అని అడిగాడు.

'యేసుక్రీస్తు పుట్టినప్పుడు ఆయన్ని పడుకోబెట్టేందుకు ఏ స్థలమూ లేదు. ఆయన తల్లి మరియమ్మ ఆయనను పశువుల పాకలో, పశువుల తొట్టెలో పడుకోబెట్టింది. అలాగే ఆయన పుట్టినరోజు డిసెంబర్ 25నే పుట్టిన నన్ను.. ఒక ఖబ్రస్థాన్‌లో పడుకోబెట్టారు' అన్నాడు హాసన్.

ఆ మాటలకు ఇంటర్వ్యూ బోర్డులోని సభ్యులు ఆశ్చర్యంగా చూశారు. మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు.

'మా నాన్నకు ఆ సమయంలోనే, మా అమ్మ డెలివరీ అవడానికి రెండు నెలల ముందు ఢిల్లీలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా మినిస్ట్రీలో గుమస్తా ఉద్యోగం వచ్చింది. నిండు చూలాలైన మా అమ్మను తీసుకొని ఆయన ఢిల్లీ వచ్చేశారు. కొన్నిరోజులు హోటల్లో ఉన్నారు. ఇళ్ల కోసం వేట మొదలుపెట్టారు. అయితే ఆయనకు ఎవరూ ఇల్లు ఇవ్వడానికి ఒప్పుకోలేదు'.

ఆ కమిటీలో ఆ ప్రశ్న అడిగిన సభ్యుడు..

'ఎందుకు ఇల్లు ఇవ్వలేదు?' అని మళ్లీ అడిగాడు.

'రాజ్యాంగంలోని షెడ్యూల్ కులాల జాబితాలో మాది 51వ కులం. పాకి, తోటి, మోటి. ఈ జాబితాలో మొదటిది. అలా ఇళ్ల కోసం తిరిగిన మా నాన్న విసిగి వేసారుతున్న సమయంలో.. పాత ఢిల్లీలోని ఖబ్రస్థాన్ ప్రాంతంలో ఓ ఇల్లు దొరికింది'.

'అంటే.. యు మీన్ బరియల్ గ్రౌండ్' అన్నాడు ఇంకో సభ్యుడు.

'అవును సార్. ఢిల్లీలోని ఆ ఖబ్రస్థాన్ ప్రాంతంలో 500 ఏళ్ల క్రితం నుంచి ఉన్న గోరీలు ఉన్నాయి. వందలాది సమాధుల మధ్య ఇల్లు నిర్మించుకున్నారు.

వాటిని పగలగొట్టడం ఇష్టంలేక అలా ఉంచేసి ఇల్లు కట్టుకొన్నారు. అంచేత కొన్ని ఇళ్లల్లో కూడా సమాధులు కనిపిస్తాయి. అలా మాకు ఇచ్చిన ఆ అద్దె ఇంట్లో మా బెడ్ రూమ్‌లోనూ ఒక సమాధి ఉంది. అక్కడే నా జననం. అలా జీసస్ క్రైస్ట్ పుట్టుక పశువుల పాకలో జరిగితే, నా పుట్టుక సమాధుల స్థలంలో జరిగింది. ఎవరూ ఇల్లు ఇవ్వడానికి నిరాకరించగా.. పెద్ద మనసుతో ఇల్లు ఇచ్చిన ఆయన పేరే మా నాన్న నాకు పెట్టాడు. అదే 'హసన్' పేరు వెనక కథ. పాతికేళ్లుగా మేము ఆ ఇంట్లోనే మకాం. జీవం ఉన్న మనుషులు.. జీవం లేని మనుషులతో సహవాసం' అంటూ చెప్పడం ముగించాడు.

ఇంతలో కమిటీ చైర్మన్..

'మీ పీహెచ్‌డీ థీసిస్‌లో సబ్జెక్ట్ ఏంటి?' అని అడిగాడు.

'బ్యాట్.. అంటే గబ్బిలాలు' అన్నాడు హసన్.

'పులులు, సింహాలు, ఏనుగులు.. ఇలా ఆకర్షణీయమైన జంతువుల గురించి పరిశోధనలు చేస్తారు. మరి గబ్బిలాల గురించి ఎందుకు అధ్యయనం చేశారు?' అన్నాడు చైర్మన్.

హసన్ చెప్పడం మొదలుపెట్టాడు.

'నా రీసెర్చ్ టాపిక్.. కన్జర్వేషన్, ప్రయారిటైజేషన్ ఆఫ్ సౌత్ ఆసియా బ్యాట్స్. మనం గబ్బిలాలను అసహ్యించుకుంటాం. ఇంటి పరిసరాల్లో కనిపిస్తే వాటిని పారదోలుతాం. సినిమాల్లో వాటిని రక్తం తాగే డ్రాకులాలుగా చిత్రీకరిస్తారు. అయితే ప్రపంచం మొత్తానికి 1460 గబ్బిల ప్రజాతులు ఉంటే.. వాటిలో మూడు రకాలు మాత్రమే రక్తాన్ని ఆహారంగా తీసుకుంటాయి. ఈ మూడు దక్షిణ అమెరికా, అమెజాన్ అడవుల్లో మాత్రమే ఉన్నాయి. ఇవి మినహా మిగతావన్నీ పళ్లూ, కీటకాలు తినేవే! పంట పొలాలను నాశనం చేసే పురుగులను గబ్బిలాలు తిని పంటలకు మేలు చేస్తాయి. గబ్బిలాల సంఖ్య పెరిగితే పంటలకు పురుగు మందుల వాడకం తగ్గుతుంది. అయితే చీడపీడ నివారణకు వాడే పురుగు మందుల్లో రసాయనాల వల్ల ఆ పురుగులను ఆహారంగా తిని గబ్బిలాలు చనిపోతున్నాయి.

70 శాతం గబ్బిలాల జాతులకు కీటకాలు, దోమలే ఆహారం. ఒక్క రాత్రిలోనే కోట్ల సంఖ్యలో కీటకాలను నియంత్రించి రైతులకు మేలు చేస్తాయి. మకరందాన్ని ఆహారంగా స్వీకరించి కొన్ని జాతుల గబ్బిలాలు మొక్కలకు ఫలదీకరణానికీ దోహదపడతాయి. అయితే క్రమంగా కొన్ని గబ్బిలాల జాతుల మనుగడ ప్రమాదంలో పడింది. విద్యుత్ తీగలతోనూ ప్రాణాలు కోల్పోతున్నాయి. గాలిమరల వల్ల చనిపోతున్నాయి. అందుచేత గబ్బిలాలు అనేవి శత్రువులు కాదు. మనిషికి మిత్రులే! ఇదే నా థీసిస్‌లో చెప్పింది' అంటూ ముగించాడు.

'అయితే గబ్బిలం మీద ఒక కవి కావ్యం రాశాడు కదా!' అన్నాడు ఒక సభ్యుడు.

'అవును సార్! గబ్బిలాన్ని అపశకున పక్షిగా సమాజం పరిగణిస్తుంది. ఎందుకంటే అది వెలుగును చూడలేదు. పంచముల జీవితాల్లో వెలుగు లేదు. ఎంత ఎదిగినా ఇంకా సమాజం దూరంగానే పెడుతున్నది. దాని ప్రతీకగా జాషువా మహాకావ్యం గబ్బిలాన్ని రాశాడు' చెప్పడం ముగించాడు.

'ఇంకా మీ హాబీలు ఏంటి?' అడిగాడు కమిటీ సభ్యుడు.

'నేను ఇంగ్లిష్ నవలలు బాగా చదువుతాను' చెప్పాడు.

'మీకు బాగా నచ్చిన నవల?' ఇంకో సభ్యుడు ప్రశ్నించాడు.

'ముల్క్‌రాజ్ ఆనంద్ రాసిన అన్‌టచబుల్!' చెప్పాడు.

వెంటనే ఇంకో సభ్యుడు ప్రశ్నించాడు..

'మీరు ఐఏఎస్, ఐపీఎస్‌లలో ఏ సర్వీస్‌ను ఎంచుకోవడానికి ఇష్టపడుతున్నారు?'.

ఒక్క క్షణం ఆలోచించి చెప్పాడు..

'ఇండియన్ ఫారెన్ సర్వీస్. నేను ఇందాక చెప్పినట్టు ముల్క్‌రాజ్ ఆనంద్ రాసిన ఆ నవల నాకు స్ఫూర్తిగా నిలిచింది. దాంట్లో బాఖా అనే పద్దెనిదేళ్ల కుర్రవాడు మరుగుదొడ్లు శుభ్రపరుస్తాడు. ఇంగ్లిష్ వారిలా దుస్తులు ధరించాలని, హాకీ ఆడాలని అతని కోరికలు. అయితే అతని కోరికలు తీరే మార్గం ఉండదు. బాఖా లాంటి నిమ్నజాతి యువకుడి కల నా ద్వారా తీర్చుకోబోతున్నాను' అని చెప్పాడు.

'ఇంటర్వ్యూ అయిపోయింది. మీరు వెళ్లవచ్చు' చెప్పాడు ఇంటర్వ్యూ చైర్మన్.

ఆ ఇంటర్వ్యూ విషయం అంతా మనసులో మెదిలింది హాసన్‌కు.

ఇహంలోకి వచ్చాడు.

* * *

తరువాత రోజు ఎప్పటిలాగే వాష్‌రూమ్ కడగడానికి వచ్చిన కేల్విన్‌ను వారించి తనే వాష్‌రూమ్ కడుక్కున్నాడు. అప్పటికి హాసన్‌తో చనువు పెరిగిన కేల్విన్..

'ఎందుకు సార్.. వాష్ రూమ్ మీరే కడుక్కుంటున్నారు. ఇది మా పని కదా!?' అన్నాడు.

అతనితో సంభాషణంతా ఇంగ్లిష్‌లో సాగుతున్నది.

ఆ మాటలకు చిన్నగా నవ్వి, చెప్పడం మొదలుపెట్టాడు.

'కొందరు జీవితకాల పర్యంతం తమ మేథకు సంబంధించిన శ్రమలే చేస్తారు.

కొంతమంది శారీరక శ్రమ చేస్తారు. వీటిలో చిట్టచివరి శ్రమ మురికిని శుభ్రం చేసే శ్రమ. ఇంకా దారుణమైన శ్రమ.. టాయిలెట్లు కడగడం. అయితే మా దేశంలో డ్రై టాయిలెట్లు కడగడం అనే ప్రక్రియ అత్యంత హేయం, నీచమైనది. ఈ నేపథ్యంలో నుంచి వచ్చిన నేను నా టాయిలెట్ కడుక్కుంటున్నాను. మాది స్కావెంజర్ కమ్యూనిటీ' అన్నాడు.

ఆ మాటలకు కేల్విన్..

'నేను ఇక్కడి యూనివర్సిటీలో చదువుతున్నాను. ఇది పార్ట్‌టైమ్ జాబ్. ఈ దేశంలో నా రంగు చూసే ఈ టాయిలెట్ కడిగే పని నాకు అప్పజెప్పారు. ఆఫ్రికా నుంచి బలవంతంగా ఓడల్లో బానిసలుగా తెచ్చిన గత కాలపు సంస్కృతిలోనే మమ్మల్ని ఇంకా ఉంచుతున్నారు. మీరు చూస్తే తెల్లగా ఉన్నారు. అయినా మీరు ఈ వృత్తి ఆధారిత కులంలోకి ఎలా వచ్చారు?' అన్నాడు.

'భారతదేశంలో ఐదు వేల సంవత్సరాల క్రితం వెలసిల్లిన సింధు నాగరికతలో స్వదేశీయులతోపాటు మెడిటారేనియన్, మంగోలాయిడ్ ప్రోటోఆస్ట్రిల్లాయిడ్ ఆల్వినాయిడ్ అనే జాతులు కలిశాయి. వీటి సమ్మేళనం నుంచి చాతుర్వర్ణ వ్యవస్థ ఏర్పడిందనేది చరిత్రకారుల భావన. వేదకర్మలు నిర్వహించేవారు, పరిపాలించేవారు, వ్యాపారం చేసేవారు, పరిచారక వర్గం.. ఇలా నాలుగు జాతుల తర్వాత ఐదోవర్గం పంచములు.. అంటే అంత్యజులు, అస్పృశ్యులు. ఇలా భారతదేశంలో అంటరానివారిగా, వంశానుగత వృత్తులను అనుసరించి ఆర్యుల కాలం నుంచి కోట్లాది మంది అస్పృశ్యులుగానే పరిగణింపబడుతున్నాం. ఇలా విభిన్న భాషల జాతుల సంస్కృతుల సమ్మేళనంలోంచి వైదిక సాహిత్యం పునాధిగా ఏర్పడిన ఈ కుల వ్యవస్థ మన సమాజంలో ఒక అపశృతి'..

హసన్ చెప్పడం ముగించగానే కేల్విన్ కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

హసన్ రెండు చేతులూ పట్టుకొని కళ్లకు అద్దుకున్నాడు.

* * *

ఆఫీస్ అయిన తర్వాత హోటల్‌కు దగ్గరగా ఉన్న పార్కులో నడుస్తున్నాడు హసన్. ఆ పార్కులోని ఫౌంటెన్ దగ్గర ఆగాడు. అక్కడే కనిపించాడు కేల్విన్.

'సార్.. గుడ్ ఈవెనింగ్!' అంటూ విష్ చేశాడు.

ఇద్దరూ కలిసి నడుస్తున్నారు. మరికొన్ని అడుగులు వేసేసరికి ఎవరి సెల్‌ఫోన్‌లోంచో ఒక తెలుగు సినిమా పాట.

'ఈ అమెరికా నగరంలో ఎక్కడినుంచీ తెలుగు పాట' అనుకుంటూ.. ఆ పాట వింటూ ఉండిపోయాడు హసన్.

'వెళుతున్నా వెళుతున్నా.. మౌనంగా వెళుతున్నా

వెళ్లాలని లేకున్నా దూరంగా వెళుతున్నా
నా మనసు నీ నీడలో వదిలేసి వెళుతున్నా
నా కలలు నీ దారిలో పారేసి వెళుతున్నా
నా కన్నీళ్లు నీ గుమ్మంలో ముగ్గేసి వెళుతున్నా'..

ఆ పాట విని ఒక్కసారిగా నడుస్తున్నవాడల్లా నిల్చుండిపోయాడు. స్తబ్ధుగా అయిపోయాడు. కేల్విన్ హాసన్‌ను పరిశీలనగా చూసి..

'ఆర్ యు ఓకే సార్?' అన్నాడు.

'ఒకే.. ఒకే..' అంటూ ఆ పార్కులోని సిమెంట్ బెంచీపై కూర్చున్నాడు.

అప్పటికి సాయంత్రం ఆరు దాటింది. ఆకాశంలో చిన్నచిన్న మబ్బులు. మెల్లగా చీకట్లోకి జారుకుంటున్న సంధ్య.

'అవును. సంధ్య.. సంధ్య..' నోట్లో అనుకుంటున్న ఆ మాటలు పైకే గొణుక్కున్నాడు హాసన్.

అప్పటికే హాసన్‌తో చనువు ఏర్పడిన కేల్విన్..

'సంధ్య ఎవరు సార్?' అన్నాడు.

'ఢిల్లీలోని జేఎన్‌యూలో నేను పీహెచ్‌డీ చేస్తున్న రోజుల్లో ఆమె ఎంఏ చదివేది. అప్పటికే కోర్సు వర్క్ పూర్తయి.. రీసెర్చ్‌లో పూర్తిగా మునిగిన నేను.. ఆమె ప్రేమలో కూడా పూర్తిగా మునిగిపోయాను. ఎన్నో సాయంత్రాలు.. ఆమెతో జ్ఞాపకాలు.. ఆగ్రాలో తాజ్ మహల్ సాక్షిగా నా ప్రేమను ప్రపోజ్ చేశాను. తను ఇంట్లోవాళ్లకు పరిచయం చేస్తానంటూ రమ్మంది. ఆమె సెమిస్టర్ బ్రేక్ సెలవులకు తన సొంతూరు రాజమండ్రి వెళ్లింది. అది మా ఊరే! మా తాత పుట్టింది, పెరిగింది రాజమండ్రే. అందుకే నేనూ సంతోషంగా బయల్దేరాను. మా మావయ్యలు, బాబాయిలు ఇంకా రాజమండ్రిలోనే ఉన్నారు.

మా తండ్రిగారికి ఉద్యోగం రావడంతో మేం ఢిల్లీ వచ్చేశాం. అప్పుడప్పుడూ సెలవులకు మా ఊరు వెళ్లేవాణ్ని. రాజమండ్రి వెళ్లిన తర్వాతి రోజు సాయంత్రమే సంధ్య ఇంటికి వెళ్లాను. గోదావరి స్టేషన్ దాటిన తర్వాత కొవ్వూరుకు, రాజమండ్రికి మధ్యన మూడంతస్తుల పసుపు రంగు డాబా ఇల్లు. ఇంటి ముందు గేటు. లోపల రకరకాల వాసనలతో రంగులతో కనిపించిన పూల మొక్కలు. నన్ను చూడగానే వాళ్ల డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి లోపలికి వెళ్లింది సంధ్య. నిమిషాలు గడిచాయి. పావుగంట తర్వాత లోపలి నుంచి సంధ్య.. ఎవరితోనో చెబుతోన్న మాటలు నాకు లీలగా వినిపించాయి.

'హాసన్ అంటే ఎవరో అనుకున్నాం. మంగళగిరి గంగాధరం మనవడు. వాడెందుకు తెలీదు' అన్నారు ఎవరో.

'మీకు తెలుసా డాడీ?' అన్నది సంధ్య.

'హాసన్ వాళ్ల తాత ఏం చేసేవాడో తెలిస్తే.. నువ్వు అతగాడిని మన ఇంటివరకూ పిలవవు. అతగాడు స్వయంగా తన చేతులతో మానవ విసర్జనలను ఎత్తివేసేవాడు. మలంతో నిండిన ఆ పాత్రను తలపై పెట్టుకొని ఆ గోదారి గట్టు వెంబడి వెళుతుంటే.. అందరూ ముక్కు మూసుకొని దూరంగా జరిగేవారు. పాపం! ఏం చేస్తాడు.. అతని జీవనోపాధికి మానవుని మలమూత్రాలను చేతితో ఎత్తి తీసుకెళ్లడమే తప్పనిసరి!'.

'అయ్యో.. ఇప్పుడు అలాంటివేమీ లేవు. ఈ ఊర్లో హాసన్ మావయ్యలు, బాబాయిలు ఏదో వ్యాపారం చేసుకుంటున్నారు' అన్నది.

'అవును.. ఏం వ్యాపారమో తెలుసా?' అన్నాడాయన.

'కాంప్లెక్స్..' అంటూ ఆగిపోయింది.

'అవును. వాళ్లు నడిపేది సులభ్ కాంప్లెక్స్! ఆ ముసలాయన 30 – 40 ఏళ్ల క్రితం డ్రైలెట్రిన్లు కడిగితే.. వాళ్లు ఇప్పుడు వెట్ లెట్రిన్లు కడిగే వృత్తిలో ఉన్నారు. ఏమీ మార్పు లేదు. నువ్వు వాళ్ల ఇంట్లోకి వెళతావా.. నీ ఇష్టం!' చెప్పాడతను.

బెడ్‌రూమ్‌లోంచి ఆ మాటలు వింటున్న నేను.. ఆ సంభాషణలు ఇక వినలేకపోయాను. మనసులో కుంగుబాటు.

'లేదు డాడీ.. హాసన్ బాగా చదువుతాడు. బ్యాట్స్ మీద రీసెర్చ్ చేస్తున్నాడు. ప్రొఫెసర్ అవుతాడు!'.

ఆ మాటలకు అతను పెద్దగా నవ్వి..

'బ్యాట్స్ అంటే గబ్బిలాలే కదా? అదొక అపశకునపు పక్షి. వాళ్ల జీవితాల్లాగే అదీ మనకు నిషిద్ధం. ఇక నీ ఇష్టం!'.

ఆ మాటలు విన్న నేను ఇక మరి వినలేకపోయాను. వేగంగా ఆ ఇంట్లోంచి బైటికి వచ్చాను. అయితే అప్పటి నుంచి సంధ్య నన్ను కలవడం మానేసింది. మాటల్లేవ్.. నేను ఫోన్ చేసినా ఎత్తేది కాదు. ఆ తర్వాత తన ఎంఏ పూర్తి కావడంతో ఢిల్లీ నుంచి షిఫ్ట్ అయిపోయింది. ఆ తర్వాత ఆమెకు పెళ్లి అయిపోయింది. భర్తతో లండన్ వెళ్లిపోయింది. ఆమె వెళ్లేముందు నాకు మెసేజ్‌గా పెట్టిందే మనం విన్న ఆ పాట. ఆమె మాటలు మాట్లాడటం ఆపేసినా బాగుండేది. కానీ, వెళ్లిపోయేముందు తన బాధను, నిస్సహాయతను ఆ పాట ద్వారా వ్యక్తంచేయడం నాకు కలవరం కలిగించింది. ఆమెతోనే లోకం అనుకుని బతుకుతున్న నాకు జీవితం శూన్యం అనిపించింది'..

హాసన్ చెబుతున్న అతని గతాన్ని వింటూ కేల్విన్ ఆర్తిగా, జాలిగా చూస్తూ ఉండిపోయాడు.

హాసన్ చెప్పడం కొనసాగించాడు.

'ఒకరోజు రాత్రి ఒక మిత్రుడి రూమ్‌లో ఒంటరిగా ఉండిపోయాను.. అతను ఊరు వెళ్లడంతో. ఆ రూమ్‌లో నిద్రమాత్రల సీసా కనిపించింది. నిద్ర పట్టని ఆ రాత్రి నాకు శాశ్వతంగా నిద్ర కావాలని కోరుకున్నాను. అలా గుప్పెడు నిద్రమాత్రలు నా గొంతులో పోసుకున్నాను. మెల్లగా కళ్లు మూతలు పడ్డాయి. నిద్రలో ఏవో కలలు. తాతయ్య గుర్తుకొచ్చాడు. మంగళగిరి గంగాధరం నా ఎదురుగా నిల్చొని తన కథ చెప్పడం మొదలుపెట్టాడు.

'నాయనా.. మున్సిపాలిటీ కాంట్రాక్టరు ఒక మోరీలో పూడిక తీసేందుకు నన్ను పిలిచాడు. ఆరోజు రాత్రయిపోయింది. తర్వాతి రోజు వస్తానని చెప్పాను. అయితే ఒప్పుకోలేదు. ఆ రాత్రే బలవంతం చేశాడు పనికి రమ్మని. ఆరోజే పనిలోకి దిగాను. ఇంతలో హఠాత్తుగా వ్యాపించిన విషవాయువులు.. నన్ను ఊపిరి ఆడకుండా చేశాయి. అంతే! నా ఊపిరి అనంతవాయువుల్లో కలిసిపోయింది. నా శవం దొరకడానికి ఆరు రోజులు పట్టింది. నాలా ఇలా నిండు జీవితాన్ని బలి తీసుకున్న సఫాయి కార్మికులు ఎందరో! నేను మన కులం కారణంగా బలయ్యాను. నువ్వు కూడా అదే కులం చేసిన గాయాలు తట్టుకోలేక జీవితాన్ని చాలించాలనుకుంటున్నావా? ఇక మనం బతికేదెప్పుడు? బాగుపడేదెప్పుడు?'..

తాత మాటలు నాలో ప్రతిధ్వనించాయి.

సంధ్య, తాతయ్య ఇద్దరూ నీడల్లా కదులుతున్నారు. సంధ్య నీడ కదిలిపోయింది. తాతయ్య నన్ను పట్టి లేపుతున్నాడు.

ఇంతలో నా మిత్రుడు లోపలికి వచ్చి, మత్తుగా చావు అంచుల వరకు వెళ్తున్న నన్ను రక్షించాడు. కాదు.. తాతయ్యే నన్ను కాపాడినట్టున్నాడు'.. చెప్పడం ముగించాడు హాసన్.

అప్పటికే సంధ్య పూర్తిగా కనుమరుగైంది. చీకటి ఆవరించింది. హాసన్ చెప్పిన ఆ విషాదభరిత ప్రేమ కథకు కేల్విన్ కళ్లు తడిచాయి.

'యు ఆర్ అన్‌టచబుల్ సార్... నిజంగా అన్‌టచబుల్. ఎవరూ టచ్ చేయలేని స్థితికి ఎదిగారు!'.

'ఇది విజయమో.. విషాదమో..' అంటూ తనలో తాను గొణుక్కున్నాడు హాసన్, కేల్విన్ చెప్పిన మాటలకు.

అంతలో తల కిందికి వేలాడుతోన్న ఒక పక్షి.. రెక్కలు విప్పుకొని తన తల మీదినుంచి నీడలా పైకి ఎగురుకుంటూ వెళ్లినట్టనిపించింది హాసన్‌కు.

## డాక్టర్ ఎమ్ సుగుణ రావు.

చదువు.. వెటర్నరీ సైన్స్ లో మాస్టర్స్ డిగ్రీ.

ఉద్యోగం.భారత ప్రభుత్వరంగ బీమా సంస్థలో స్కేల్ 4 అధికారిగా పదవీ విరమణ. రాసిన మూడు వందల పాతిక కథల్లో నూట పాతిక కథలకు బహుమతులు వచ్చాయి.ఈ మధ్యనే అన్వీక్షికి ఉగాది నవలల పోటీ లో ఫైనల్ డయాగ్నోసిస్అనే నవలకు ప్రోత్సాహక బహుమతి, స్వాతి వీక్లీ నవలల పోటీ లో గతంలో మరుగేలరా అనే నవలకు, ఈ మధ్య నే ఏడు గుర్రాల సూర్యుడు అనే నవలకు లక్ష రూపాయల బహుమతి లభించింది.

ఆకాశం లో ఒక నక్షత్రం కథ ఇంగ్లీష్ నాటకం గా మలచబడి టాటా లిట్ ఫెస్ట్ సుల్తాన్ పదాంశీ అంతర్జాతీయ నాటక పోటీలలో ద్వితీయ బహుమతి పొందినది. జాబిలి మీద సంతకం, నేలకు దిగిన నక్షత్రం, ఆకాశం లో ఒక నక్షత్రం, సుగుణ కథాభిరామ డాక్టర్ ఎమ్ సుగుణ రావు బహుమతి కథలు అనే నాలుగు కథా సంపుటాలు వెలువడ్డాయి. జీవిత స్పర్శ కలిగించే కథలు చదవడం, రాయడం ఇష్టం. నమస్తే తెలంగాణ.. ముల్క నూరు కథా పీఠం లో ఈ గబ్బిలం ది అన్టచబుల్ మూడోసారి బహుమతి. గతంలో వస్తుమారకం,ఏలీ ఏలీ లామా సభక్తానీ కథలకు బహుమతులు లభించాయి. గబ్బిలం లా సమాజ నిరాపేక్షకు, నిర్ధయకు గురయిన జీవితాలు అస్థిత్వం కోసం, ఉనికి కోసం పడే తపన,ఆవేదన ఈ గబ్బిలం కథా వస్తువు.

**9704677930**

# అలౌకికం



## తులసి బాలకృష్ణ

కుక్కిమంచం మీద పడివుండి, కృష్ణ పక్షపు చంద్రుడిలా రోజురోజుకీ కృశించిపోతున్న అన్నపూర్ణ శరీరం వైపు.. సెగలు పొగలుగా సాగుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాస క్రియా తాలూకు ఉక్కిరిబిక్కిరిలోంచి బయట పడటానికి విఫల ప్రయత్నం చేస్తూ.. కన్నీటి పొరల చాటుగా చూస్తున్నాడు పతంజలి. ఒకనాడు అత్యంత ముగ్ధ మోహన కళాగుళిక లాంటి ఆ ముఖమేనా ఇది?!.. ఇలా.. వాడిపోయిన తామర పూవులా!

గుండెలు కక్కటిల్లి పోతున్నాయి.

'ఈ రాత్రి గడుస్తుందా?' లోలోనే చీకటి కమ్మిన కాళరాత్రి లాంటి భయంతో గొణుక్కున్నాడు.

పొద్దున ప్రారంభమైన గాలివాన.. గుండెల మీద కాళ్లుపెట్టి కదలకుండా నిలబడ్డ మదించిన వృషభంలా.. పైలోకంలో ఉన్న వారంతా ఒక్కుమ్మడిగా రోదిస్తున్నట్లుగా.. రాత్రి పదయినా ఇంకా అలా కురుస్తూనే ఉంది. పైన రేకుల మీద కురుస్తున్న వాన తాలూకు నిరంతర ధ్వని మరణ మృదంగనాదాన్ని తలపిస్తూ గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది.

సాయంత్రం పోయిన కరెంటు ఇంకా రాలేదు. వెలిగించిన గుడ్డి లాంతరు దీపం మసకబారుతూ అప్పుడప్పుడూ రెపరెపలాడుతూ.. అన్నపూర్ణ ముఖం మీద చావు బతుకుల తెరలను కదుపుతున్నది.

లోనుంచి వరద పొంగులా తన్నుకొస్తున్న దుఃఖ్ఖానికి పళ్లని బిగపట్టి ప్రయత్నపూర్వకంగా ఆనకట్ట వేసి ఆపుకొన్నాడు పతంజలి. ఆ చిన్న గదిలోనే బయట వానకు తడిసిపోకుండా లోపలికి తెచ్చిపెట్టుకుని గోడవారగా నిలబెట్టిన తన మరో ప్రాణం.. తన జీవనాధారం అయిన పాత సైకిల్ మీదికి పారింది అతని చూపు. ఆ సైకిలూ, అన్నపూర్ణా ఒక్కసారే పరిచయమయ్యారు తనకి. ఆనాటి నుంచీ తన జీవితంలో భాగమైపోయి.. ఈనాడూ ఒక్కలాగే జీర్ణావస్థకి చేరిపోయి..

చెమ్మ ఇంకి, ప్రపంచపటపు మ్యాపులలాంటి మరకలతో తడి బారిన గోడకి నీరసంగా జేరగిలబడి.. కిందికి జారి కూర్చుని కళ్లు మూసుకున్నాడు పతంజలి.

తమ పరిచయం.. సంవత్సరాల క్రితం నాటి మాట!

* * *

పురి తిప్పిన ఉక్కు తీగల్లాంటి నరాలు కాళ్లలోంచి బయటికి ఉబికివచ్చేంత ఉద్వేగంతో.. కొలిమి నుంచి వెలువడే వేడి సెగలను తలపించే ఉచ్ఛ్వాస నిశ్వాసలతో.. చెదరని లక్ష్యంతో.. 'సాధించి తీరాలంతే' అనే ఉక్కు సంకల్పంతో.. తొక్కుతున్నాడు సైకిల్ని పతంజలి. కిలోమీటర్లు.. కిలోమీటర్లు.. తరిగిపోతున్నాయి.. గమ్యం చేరువవుతూ ఉంది.. పోటీదారులు వెనకబడుతున్నారు. కొద్దిసేపటికే అందరూ వెనకబడి పోయారు కూడా.. తనే ముందున్నాడు.. ముప్పై కిలోమీటర్ల సైకిల్ రేస్‌లో.. కాళ్లని యంత్రవేగంతో ఆడిస్తూ ముందుకు దూసుకుపోయి..

'అండ్ ద విన్నర్ ఇన్ ద రేస్ ఈజ్.. మిస్టర్ పతంజలి!'..

కర్ణపేయంగా అనౌన్స్‌మెంట్ వినిపిస్తూనే గుండెలు ఆనందంతో ఝువ్వుమన్నాయి. గమ్యాన్ని చేరుతూనే సైకిల్ని అలవోకగా పచ్చిక మీదికి జార విడిచి, కూలబడి, హెల్పర్స్ అందించిన మంచినీటి బాటిల్‌ని అందుకుని, తల మీద, ముఖం మీద వంచుకుని, నాలుక తడుపుకొని, పొంగుతున్న ఆనందంతో, ఆయాసం తీరడానికి మోకాళ్ల మీద తల ఆన్చుకుని సేదదీరుతున్నాడు పతంజలి.

చుట్టుముట్టిన అనేకమంది అభినందిస్తూ పొగుడుతున్నారు..

'కంగ్రాట్యులేషన్స్ టు ద హీరో ఆఫ్ ద డే!'..

స్వరమా అది!?.. ఈమని శంకర శాస్త్రి వీణానాదం కాదూ!?

చటుక్కున తలెత్తాడు పతంజలి. కళ్లెదురుగా.. తెల్లని అరటి దూట చివర పొందిగ్గా ఓ కలువని తగిలించినట్లున్న హస్తం!.. తన వైపే సాగి ఉంది.. అందుకోమన్నట్లుగా.. అభినందనగా! ఒళ్లు తెలియని నివ్వెరపాటుతో ఆ హస్తంలో అప్రయత్నంగానే తన హస్తాన్ని ఉంచాడు పతంజలి.

'కంగ్రాట్స్ వన్స్ అగైన్. బైదిబై.. ఐ యాం అన్నపూర్ణ'.. ముర్మర ధ్వనితో అల్లన మెల్లన సాగుతున్న కృష్ణవేణమ్మ అలలలాంటి మృదుమధుర స్వరం.

యాంత్రికంగా పతంజలి తల ఇంకొంచెం పైకి లేచింది. ధవళ కాంతులీనుతున్న కళ్లకి రేగడి ఒడ్డుల్లాంటి నల్లటి కాటుకతో.. పండిన బాదపు రంగు పల్చని పెదవుల మధ్య పాల నురగలాంటి తెల్లని నవ్వుతో.. దిగివచ్చిన పున్నమి చందమామలా..

అవాక్కయి పోయి అలాగే చూస్తున్నాడు పతంజలి.

'నేను కూడా ఈ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌కి సంబంధించిన కాంపిటీషన్స్‌లో పార్టిసిపెంట్‌నే! డ్యాన్స్ విభాగంలో. రియల్లీ ఐయాం థ్రిల్డ్ ఆఫ్టర్ సీయింగ్ యువర్ పెర్ఫార్మెన్స్!'.

సంభ్రమాశ్చర్యాలతో పతంజలికి నోరు పెగిలితే కదా.. ఏవేవో అలౌకిక

అనుభూతులు. ఆమెతో గత జన్మలోనే ఏదో బంధమున్నంత వింత భ్రాంతి.

అది మొదలుగా.. ఆ పరిచయం వివిధ సందర్భాలలో కలయికగానూ.. అనేక రీతుల్లో ఆకర్షణతో నిండిన అభిమానంగానూ.. ఆపైన ప్రేమగానూ మారి.. చివరికి ప్రణయం దాకానూ దారితీసింది. ఆర్థిక స్థితుల స్థాయీ భేదం కారణంగా వారి పెళ్లికి సుతరామూ ఒప్పుకోమన్నారు అన్నపూర్ణ తాలూకు పెద్దలు. తెగించి, ఇంటిలోంచి బయటికి వచ్చేసి, పతంజలి చెయ్యందుకుంది అన్నపూర్ణ.

'నీ సంపన్న కుటుంబపు సుఖాలనన్నీ వదులుకుని, నాతోపాటే సామాన్య జీవితాన్ని గడపడానికి వచ్చేసిన నిన్ను పువ్వులలో పెట్టి చూసుకుంటూ, సుఖపెట్టాల్సిన నైతిక బాధ్యత నామీదుంది. నీచేత ఉద్యోగమే కాదు.. ఏ పనీ చెయ్యనియ్యను నేను' అని ఖచ్చితంగా చెప్పేసిన పతంజలి.. స్పోర్ట్స్ కోటాలో బ్యాంక్ ఉద్యోగం సంపాదించుకున్నాడు.

చుట్టుపక్కల పిల్లలకి ఉచితంగా డ్యాన్స్ క్లాసులు తీసుకుంటూ, ఆనందంగా కాలక్షేపం చేస్తూ, భర్త సహకారంతో తరుచు బీదాబిక్కీకి అన్నదానం చేస్తూ.. సార్థక నామదేయురాలు అనిపించుకుంటున్నది అన్నపూర్ణ.

జీవితాలతో ఆడుకోవడం ఈ సృష్టికో వింత సరదా.

తృప్తిమయ జీవితాన్ని కొనసాగిస్తున్న వాళ్ల జీవితంలో పెద్ద కుదుపు..

పెళ్లయి మూడు సంవత్సరాలైనా కాకుండానే అన్నపూర్ణ పక్షవాతానికి గురయ్యింది. ఇప్పుడామె కదలలేదు. కాలు, చేయి కదిపి నృత్యం చెయ్యలేదు. కుమిలిపోయాడు పతంజలి. ఉద్యోగ సమయంలో తప్ప మిగిలిన కాలమంతా ఆమె చెంతనే ఉండి కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు.

మరో ఏడేళ్లు గడిచాయి. పతంజలి మీద మళ్లీ ఏ దేముడో కన్నెర్రజేశాడు. బ్యాంకులో తను చేయని నేరానికి బాధ్యుడిగా, అన్యాయంగా ఉద్యోగాన్నే పోగొట్టుకున్నాడు.

ఇటువంటి పరిస్థితులలో పిల్లలు లేకపోవడం ఓ వరమే అనిపించింది. అయినా, ఇల్లు గడవాలంటేనూ.. అన్నపూర్ణకి మందులు కొనాలంటేనూ తనకి పని కావాలి!

పతంజలి విజ్ఞాపన విని ఫక్కున నవ్వాడు క్యాటరింగ్ మేనేజర్.

'లంచ్‌కి కర్రీస్ క్యారేజీలు సప్లయి చేసే పనికోసం మా దగ్గరకి వచ్చే ప్రతి ఒక్కరి దగ్గరా బళ్లుంటాయి! ఎందుకంటే ఆగమేఘాల మీద అందించడానికి. నువ్వేమో నీ దగ్గర బండి లేదంటున్నావాయే! ఎట్లా నీకు ఈ జాబ్ అప్పజెప్పమంటావు? కుదరదు కదా?' అడిగాడు నొసలు ముడేసి .

వినయంగా చెప్పాడు పతంజలి..

‘నా దగ్గర సైకిల్ ఉందండి. నేనుకూడా వాళ్లంత వేగంగానూ క్యారేజీలు అందించి రాగాలనండీ!’.

‘సైకిలా? ఏఁవయ్యా తమాషా అనుకున్నావా? మా కస్టమర్లలో తొంభై తొమ్మిది శాతం మంది ముసలి వాళ్లుంటారు. పది నిమిషాలు లేటైతే చాలు ముప్పై ఫోన్లు వస్తాయి నాకు.. ‘కర్రీస్ రాలేదింకా’ అంటూ. బళ్లున్నవాళ్లే ఒక్కోసారి సమయానికి అందించలేక పోతుంటే.. నువ్వు.. ఆ పాత సైకిల్ మీద..!?’ వెటకారంగా నవ్వేశాడు మేనేజర్.

‘నేను సైకిల్ రేసుల్లో పదిసార్లు స్టేట్‌ఫస్ట్ సర్. ప్రస్తుతం నేనున్న పరిస్థితులలో నాకు ఏదో ఓ ఉద్యోగం చాలా అవసరం సర్. ప్లీజ్!’.

పతంజలి వైపు ఆశ్చర్యంతోనూ, జాలితోనూ, అభినందనతోనూ చూశాడు మేనేజర్. మారు మాట్లాడక పతంజలికి జాబ్ ఇచ్చేశాడు.

గత పది సంవత్సరాలుగా తనకు తోడుగా తనతోపాటే కష్ట సుఖాలను అనుభవిస్తూ వస్తున్న తన సైకిల్ నేస్తాన్ని, తట్టి ఉత్సాహ పరుస్తూ..

‘రాజా! నాకు ఎన్నో విజయాలనిచ్చి కడుపుని ఆనందంతో నింపావు. ఇప్పుడు కాలుతున్న మా దంపతుల కడుపుల్ని ఆహారంతో నింపు’ అని రెండు చేతులూ జోడించాడు.

తూర్పు తెల్లారకముందే లేచి కాలకృత్యాలు తీర్చేసుకుని, అన్నపూర్ణకి స్నానం చేయించి, తల దువ్వి, చీర మార్చి, పాక హోటల్ నుంచి రెండు ఇడ్లీలు తెచ్చి పెట్టి, అన్నం మాత్రం వండి, ఆదరాబాదరాగా కేటరింగ్ హౌస్‌కి చేరి, తన సైకిల్‌కి ఇరుపక్కలా సంచులలో కర్రీ ప్యాకెట్లని పెట్టుకుని, ఒకప్పటి తన శక్తిసామర్థ్యాలను గుర్తుతెచ్చుకుంటూ సైకిల్‌ను శక్తికొద్దీ తొక్కి, ప్యాకెట్స్ అందించి, పని పూర్తయ్యాక తిరిగి మేనేజర్‌కి కనిపించి, ఆయన వర్కర్లందరికీ ఫ్రీగా ఇచ్చే రెండు చల్లబారిన కర్రీ పొట్లాలతో ఇంటికి చేరడం.. పతంజలి నిత్యకృత్యం.

ఇంటికి చేరాక, కర్రీ పొట్లాలు విప్పి, గబగబా అన్నంలో కలిపి, ఆకలితో ఎదురుచూసే భార్యకి నాలుగు ముద్దలు తినిపించి, తనూ ఎంగిలి పడతాడు. ఇదీ దినచర్య.

తమ క్యాటరింగ్ హౌస్ కుక్ మాస్టర్స్ ‘అద్భుతంగా’ చేసే గుత్తి వంకాయ కూరని ‘సరిగ్గా కస్టమర్లకి సరిపోయేంత మాత్రమే’ చేయిస్తాడు మేనేజర్. ఆ కారణంగా తమకి ఆ కూర ఎన్నడూ దక్కదు. విచారించాల్సిన విషయం ఏమంటే గుత్తి వంకాయ కూరంటే అన్నపూర్ణకి ప్రాణం.

ఆ కూర ఎన్నోసార్లు ఆమె తనకి వండి పెట్టింది. ఇప్పుడు.. ఆమె ఆరోగ్యం బాగాలేనప్పుడు.. క్యాటరింగ్ హోమ్‌లో గుండిగ నిండా ఘుమఘుమలాడే ఆ కూర

కళ్ల ఎదుట కనిపిస్తున్నా.. ప్యాకెట్లలో వేడివేడిగా కస్టమర్లకి వెళ్లిపోతున్నా.. ఒక్కముక్క కూడా తను అన్నపూర్ణ కోసం తీసుకొని వెళ్లలేడు. చాలా బాధగా ఉంది పతంజలికి.

* * *

..అలా గోడకి జార్లబడి నిస్సత్తువతో కూర్చుని ఉన్న పతంజలికి కొద్దిగా కునుకు పట్టేసింది. అందులో ఓ కల. తనని వదిలేసి అలా పైపైకి వెళ్లిపోతున్న అన్నపూర్ణ.. ఒంటరిగా మిగిలి కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తున్న తనని ఓదార్చుతున్న ఎవరిదో అమృత హస్తం. తన తల నిమురుతూ.. చెంపల మీది కన్నీరు తుడుస్తూ...

ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు పతంజలి.

ఎదురుగా అన్నపూర్ణ.. కుక్కి మంచం పట్టీమీద కూర్చుని తన వైపు వంగి, తన ముఖంలోకి ప్రేమగా, ఆత్మీయంగా చూస్తూ, తన తల నిమురుతూ, చెంపలు తడుముతున్నది. విస్మయంగా చూశాడు ఆమె ముఖంలోకి.

నీరసంగా.. తుంపుడు మాటలతో అన్నది అన్నపూర్ణ..

'ఇలా.. మంచం మీద.. కూర్చోండి!'.

'ఫర్వాలేదులే! నాకిక్కడ బాగానే ఉంది. నీకెలా ఉందో చెప్పు!?' పూడుకుపోతున్న స్వరంతో అన్నాడు.

తన పక్కన మంచం మీద తట్టుతూ మళ్లీ పిలిచింది. లేచి, పక్కనే కూర్చుని, ఆమెని పొదివి పట్టుకుని..

'ఏంటమ్మా?' అనడిగాడు గోముగా.

ఒక్కసారి కళ్లు మూసుకుని తెరచి, నీరసంగా, పతంజలి వీపు నిమురుతూ అన్నది..

'మీరు.. నా గురించి.. ఎక్కువగా.. ఆలోచిస్తూ.. భయపడుతున్నారు. నాకు.. ఏమీ కాదు.. ముందు మీ ఆరోగ్యం.. జాగర్త!' ఆమె గొంతు అనురాగం నిండిన భయంతో వణికింది. ఆర్ద్రమయిన హృదయంతో ఆమె తలని గుండెలకు హత్తుకున్నాడు పతంజలి.

'ఏమయినా.. కబుర్లు.. జోకులూ.. చెప్పండి. నేను.. ఎక్కువగా.. మాట్లాడలేను.. వింటాను' అంటున్న భార్య మాటలు ఈరోజు కొంత విచిత్రంగానూ.. ముద్దుగానూ.. ఏదో తెలియని వింత గుబులుగానూ అనిపించాయి.

తమ వివాహ జీవితంలోని అనేక మధుర క్షణాలనీ, హాస్య సంఘటనలనీ గుర్తుచేస్తూ పతంజలి అలా చాలాసేపే మాట్లాడుతూనే ఉన్నాడు. అతని చాతీమీద

తల ఆన్చి, పెదాల మీద చెరగని చిరునవ్వుతో అతని కళ్లలోకి ఆరాధనగా చూస్తూ ఆమె వింటూనే ఉంది.

అంతా అతని చేతే మాట్లాడిస్తూ, మౌనంగా వింటూనే ఉన్నదల్లా ఒక్కసారిగా నోరు విప్పి..

'ఏమండీ.. ఓ విచిత్రమైన కోరిక కోరనా? నాకు మీ చేత్తో.. అన్నంలో వేడివేడి గుత్తి వంకాయ కూర.. కలిపి.. తినిపిస్తే.. తినాలని ఉందండీ!' అన్నది.

విస్మయంతో ఉలిక్కిపడ్డాడు పతంజలి!!

తనకోసం వండి పెట్టడం.. అనేక మంది బీదాబిక్కీ కోసం వండి వార్చి వడ్డించడమే చేసిన అన్నపూర్ణ.. ఈనాడు ఇలా.. ఈ కోరిక..!!!? అతి సామాన్యమైన చిన్న కోరికే ఇది!.. కానీ.. ఎలా?! వేడివేడి గుత్తి వంకాయ కూర.. తనకి వండటం చేతకాదు. కానీ, తన చేతుల మీదుగా ఇస్తూనే ఉంటాడు తను కష్టమర్లకి. అయినా, ఒక్క ప్యాకెట్టూ తను ఇంటికి తెచ్చుకుని, ఆమెకి తినిపించే ప్రాప్తం లేదు. పోనీ.. మేనేజర్‌తో..

'డబ్బులిస్తాను.. ప్యాకెట్ కావాలి' అందామంటే.. అతగాడి అహం దెబ్బతిని, మొదటికే మోసం రావచ్చు. బాధతో గిలగిలలాడి పోయాడు పతంజలి.

'ఏం.. మీ చేత్తో ఓసారి ఓ ముద్ద తినిపిస్తారా?' మళ్లీ అడిగింది అన్నపూర్ణ గోముగా.. ఆఖరి కోరికేమో!? అన్నంత భ్రాంతిని ధ్వనించే స్వరంతో. చలించిపోయాడు పతంజలి..

ఏదో స్థిర నిర్ణయానికి వచ్చిన వాడై..

'త-ప్ప-కుం-డా..' అన్నాడు.

రెండు రోజులు గడిచాయి. ఏవేవో వేరే పచ్చళ్లూ పులుసుల ప్యాకెట్లతో ఇంటికి వచ్చిన పతంజలి భార్యకి అన్నం కలిపి తినిపిస్తూ.. చాలా బిడియ పడుతూ.. మూగవాడే అయిపోయాడు.

మూడవ రోజు..

క్యాటరింగ్ హోం కిచెన్‌లో.. వంటల పనులు జరుగుతుండగా.. కమ్మని గుత్తి వంకాయ కూర తయారవుతున్న సువాసన.. పతంజలి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

ప్యాకెట్లు తయారయ్యాయి. తను పంచాల్సిన బ్యాగుల్ని సైకిల్కి తగిలించుకున్నాడు పతంజలి. మనసు రాయిచేసుకుని.. తెగించి.. సైకిల్ని ఈరోజు మొదటే ఇంటి మార్గం పట్టించాడు.. అతని మస్తిష్కంలో ఆశగా తను కోరిన ముద్దకోసం ఎదురుచూస్తున్న అన్నపూర్ణ, ఇంకా నిత్యం మందు మీదుండే ఆ కాలనీ సెవెంత్ క్రాస్‌లోని నార్త్ ఇండియన్ డివోర్సీ ముసలాయన మాత్రమే

మెదులుతున్నారు ఇప్పుడు. ఆ ముసలాయన కొన్ని క్యారేజీని అలా ప్యాకెట్ల పళంగానే డస్ట్ బిన్‌లో పడెయ్యడం తనకి తెలుసు. అందులో వంకాయ కూర ఒకటి.. అతగాడికి పడదు. అనైతికమే అయినా.. ఇప్పుడు తను ఆ క్యారీ తీసుకువెళ్లక పోయినా ప్రాబ్లం ఏమీ ఉండదు. అతగాడికి కారణం చెప్పొచ్చు.

వేగంగా ఇంటికి చేరాడు పతంజలి.

అన్నంలో గుత్తి వంకాయ కూర గబగబా వేడి, చల్లారిపోకూడదనే ఆతృతతో కలిపి.. రెండు ముద్దలు స్వయంగా అన్నపూర్ణ నోటికి అందించాడు. ఇష్టంగా ఆ ముద్దల్ని తినగలిగిన అన్నపూర్ణ.. 'ఇక చాలు' అన్నట్లుగా ఎంతోతృప్తిగా నవ్వుతూ.. కృతజ్ఞత, ఆరాధనా నిండిన చూపులతో పతంజలి కళ్లలోకే చూస్తూ.. చూస్తూ.. చూస్తూ..

కదలిక లేక 'నిలిచిపోయిన' ఆమె ముఖంలోని అలౌకికమైన ఆ తృప్తినే చదువుతున్న పతంజలి గుండెలు పొంగాయి.

'పతంజలీ!' గుమ్మం బయటి నుంచి పిడుగులాంటి పిలుపు.

గొంతుని గుర్తుపట్టాడు పతంజలి. భుజం మీద వాలి ఉన్న భార్య తలని అతిసున్నితంగా తలగడ మీదికి చేర్చి, సుతారంగా ఆమె కనురెప్పల్ని వాల్చి, యాంత్రికంగా లేచి, నిబ్బరంగా బయటికి నడిచాడు.

'ఇటువైపు వెళ్తుంటే నీ ఇంటి బయట మన క్యారేజీ సంచులతో నీ సైకిల్ కనిపించింది. అంటే.. దొంగతనంగా క్యారీలను ఇంటికి తెచ్చుకు తింటున్నావన్న మాట రోజూ! ఇక నువ్వు రేపట్నుంచీ పనిలోకి రానక్కర్లేదు. ఈనెల జీతం కూడా ఇవ్వను నీకు'.. పతంజలి ఎంగిలి చేతివైపు చూస్తూ కోపంగా ఉరిమి, వెళ్లిపోయాడు మేనేజర్.

అతని మాటలకి పతంజలిలో ఎటువంటి స్పందనా లేదు. చేయి కడుక్కొని, అన్నపూర్ణ కనురెప్పల మీద సుతారంగా ముద్దుపెట్టి.. తన ప్రియ నేస్తమైన సైకిల్నిచేతుల్లోకి తీసుకున్నాడు. రోజూ కంటే వేగంగా తన డ్యూటీ ప్రకారం లంచ్ ప్యాకెట్స్ బట్వాడా చేసేశాడు.

అ తర్వాత...

..అన్నపూర్ణ ఆఖరి చూపుల్లోని తృప్తితో నిండిన ఆరాధనతో కూడిన రూపమే కళ్లముందు మెదులుతుండగా.. ఆకాశాన్ని తాకిన ఉత్సాహంతో పెడల్స్ మీద బలంగా పాదాలను తొక్కుతూ.. ఓనాడు రేసుల్లో పాల్గొని విజయాలను సాధించిన ఘడియల్ని నెమరు వేసుకుంటూ.. హైవే మీద అలా.. అలా.. గాలిలో తేలిపోతూ..

'కమాన్ కమాన్.. పతంజలీ!'..

అభిమానుల కేకలు..

'కమాన్ ద హీరో ఆఫ్ ద సైకిల్ రేసెస్..' అన్నపూర్ణ ప్రోత్సాహపు కేరింతలు.

చెవుల్లో మారుమోగుతున్నాయి.

తొక్కుతూనే ఉన్నాడు పతంజలి. ఎక్కడికో తెలియదు. ఒక్కటే కోరిక.. ఈ ప్రపంచాన్ని జయించి, అన్నపూర్ణ వెళ్లిపోయిన లోకానికి చేరి, ఆమెని కలవాలని ఆరాటం. అంతే!..

ఒక్కసారిగా చాతీ ఎడమ వైపున ఎగసిన రక్తపు కెరటం.. రోడ్డు పక్కగా చల్లని చెట్టు నీడలో తన ప్రియనేస్తం సైకిల్‌తోపాటు అలవోకగా వాలిపోతున్న పతంజలిలో అలౌకికమైన ఆనందంతో కూడిన స్పందన.. తన(ను) అన్నపూర్ణని చేరుతున్న అ-మృత క్షణాలు ఆసన్నమయ్యాయని..

***

## తులసి బాలకృష్ణ

మనిషై ఈ భూమ్మీద పుట్టాక.. కొన్ని బంధాలు మనల్ని అల్లుకుంటాయి. అందులో కొన్ని అలౌకికంగా మన గుండెలను గుబాళింపజేస్తే.. మరికొన్ని అర్థంకాని ఆవేదనతో ఘూర్ణింపజేస్తాయి. ఓ అలౌకిక మమకారం, ఆత్మీయత, స్నేహం మనల్ని స్థిరంగా నిలవనీయక కుదిపేస్తాయి. ఈ కథలో.. ఆ విషయాన్నే ఆవిష్కరించే ప్రయత్నం చేశారు రచయిత తులసి బాలకృష్ణ. రచయితగా, రంగస్థల నటుడిగా, దర్శకుడిగా తెలుగువారికి సుపరిచితులు. వీరి స్వస్థలం హైదరాబాద్. బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి, విరమణ పొందారు.

500లకు పైగా కథలు, 40 నాటికలు, 8 నవలలు, 3 నాటకాలు, రేడియో నాటకాలు, టీవీ నాటకాలు రాశారు. వీటిలో హాస్యం, సరసం, సస్పెన్స్, సాహసం.. ఇలా అన్నిరకాల రసాల రచనలూ ఉన్నాయి. నాటకాలలో రచన, నటన, దర్శకత్వాలకు నందులు అందాయి. మిత్రులు ఆత్మీయతతో సన్మానించి.. 'రచనా విరించి', 'అక్షర కళా యశస్వి' అనే బిరూదులు కూడా ఇచ్చారు. బళ్లారి రాఘవ, గురజాడ, శ్రీశ్రీ అవార్డులూ దక్కాయి. స్నేహితులతో చమత్కార సంభాషణలు, సరస చతురోక్తులూ అంటే వీరికి ప్రాణం. నమస్తే తెలంగాణ - ముల్కనూరు సాహితీ పీఠం ఏటా నిర్వహించే కథల పోటీలలో మూడుసార్లు పాల్గొనగా.. మూడుసార్లూ బహుమతులు అందుకున్నారు.

**-87901 15544**

# సమాధానం లేని ప్రశ్న

నామని సుజనాదేవి



అదొక కుల సంఘంలోని విశాలమైన హాలు. ఇరువైపులా వేసిన కుర్చీలలో సంఘం పెద్దలందరూ ఆసీనులై ఉన్నారు. వారికి ఎదురుగా ఎడమవైపు ఉన్న కుర్చీలలో అమ్మాయి వైదేహి, వారి బంధువులు.. కుడివైపు అబ్బాయి మోహన్, వారి బంధువులు కూర్చుని ఉన్నారు. కలియుగంలో ఇంతవరకెన్నడూ కనీవినీ ఎరగని ఒక కొత్త ఘట్టానికి అక్కడ తెరలేవబోతున్నదని ఆ క్షణంలో అక్కడున్న ఎవ్వరికీ తెలియదు.

ఆ దంపతులు ఏదో కూలీనాలీ చేసుకునే దిగువ తరగతి జంట కాదు. ఇద్దరూ పీహెచ్‌డీ చేసి.. డాక్టరేట్ పట్టా పుచ్చుకున్న విద్యావంతులు.

పెద్ద మని లేచి..

'అందరికీ నమస్కారం. ఇప్పటికే ఇద్దరు పిల్లలున్న ఈ దంపతుల సమస్యను ఎలాంటి పక్షపాతంలేకుండా, మనస్ఫూర్తిగా, న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా పంచాయితీలో న్యాయం చేస్తామని ఆ భగవంతుడి సాక్షిగా మేమందరం మీకు హామీ ఇస్తున్నాం. ముందు మోహన్.. మీరు చెప్పండి!'.

'అభియోగం నాపైనే.. వైదేహి నుంచి వచ్చింది కాబట్టి ముందు ఆమెనే మాట్లాడమనండి' అన్నాడు మోహన్.

అతని సంస్కారానికి అందరికీ అతనిపై గౌరవభావం కలిగింది.

వైదేహి చెప్పడం మొదలుపెట్టింది.

'మేమిద్దరం ఇరువైపులా ఉన్న పెద్దవాళ్ల అంగీకారం మీదనే.. కాళ్ల దగ్గరికి వచ్చిన ఎన్నో మంచి సంబంధాలను కాలదన్ని.. ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. పెళ్లిరోజే ఊరేగింపులో వైభవంగా సాగనంపాలని ప్లాన్ వేసుకున్న మా తమ్ముణ్ని తిడుతూ.. నాతో..

'ఇక్కణ్నుంచి పావుగంటలో వెళ్లిపోవాలి. నువ్వేం చేస్తావో నాకు తెలియదు' అంటూ వార్నింగ్‌తో మొదలుపెట్టాడు. ఇక తర్వాత ప్రతీ చిన్న పనిలోనూ తప్పులు తీయడమే!'.

'అంటే.. మిమ్మల్ని తిట్టేవాడా ? కొట్టేవాడా ?' పెద్దమనిషి ప్రశ్నించాడు.

'ఆయన చేసే టార్చర్ అంతకు మించింది. ఈయన చూపించిన నరకం అనేది పూర్తిగా చెప్పడానికి రాదు. అవి మనసును ముక్కలు చేసి ఎన్ని గాయాలు చేస్తుందో అనుభవించిన వారికే తెలుసు. పెళ్లయిన వారంలో మా అత్తగారింటి పక్కనే ఉన్న చిన్నత్తకు పెళ్లిలో తెచ్చిన బిందెను ఇవ్వడానికి వెళ్లా. వారు బలవంతంగా భోజనానికి కూర్చోబెట్టారు. వచ్చి ఆలస్యం అందుకే అయ్యిందని చెప్పాను. అంతే!

'వారికీ మాకూ పడదంటే మా అనుమతి లేకుండా అక్కడ భోజనం ఎలా చేస్తావు?' అంటూ సునామీలా విరుచుకుపడ్డారు అత్తా, మామ, భర్తా! ఏడుస్తున్న నన్ను, మరిది ఎదుటే ముక్కు నేలకు రాయించి, మరోసారి ఇలాంటి తప్పు చేయనని చెంపలు వేసుకునేంత వరకూ వదల్లేదు. ముళ్లులా గుచ్చుకుంటూ తీరని వేదనకు గురిచేస్తున్న బాధతోనే ఉద్యోగం చేస్తున్న హైదరాబాద్‌కి ఆయనతో వెళ్లిపోయాను.

లోకమంతా మంచి వాడన్నా, నిజంగా.. మంచివాడా!? కాదా!? అన్నది భార్యను అడిగితేనే తెలుస్తుందని.. అందుకే అన్నారు. మహాసముద్రాన్ని మరచెంబులో పట్టలేనట్లు ఎలా చెప్పగలను? కష్టపడి సంపాదించిన పీహెచ్‌డీ పనిమీద, ప్రొఫెసర్ దగ్గరికి వెళ్లినప్పుడు ఆలస్యమైతే..

'ఇప్పటిదాకా ఎవరితో కులుకుతున్నావే? ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయవు. ఎవడి..' జీవితంలో ఎన్నడూ వినని అసభ్యకరమైన, పలకడానికి జుగుప్స కలిగించే అసహ్యకరమైన పదాలు విన్న నా మెదడు పూర్తిగా మొద్దుబారిపోయింది!'..

'చిత్రహింసలు పెడుతున్నాడని పెళ్లయిన పదమూడేళ్లకు చెబుతున్నారు. మరి ఇంతకాలం ఎందుకు బయట పెట్టలేదు?'..

పెద్దమనిషి మధ్యలో అడుగుతుంటే..

'అలా అడగండి! అన్నీ అబద్ధాలు, అందుకే..' అనబోతున్న మోహన్‌ని పెద్దమనుషులు వారించారు.

'దానికీ కారణం ఉంది. ఎందుకంటే మాకు పెళ్లయిన తొలిరాత్రి ఆయన నాతో ఒకమాట చెప్పారు. అదేమిటంటే..

'మనిద్దరి మధ్యన ఎటువంటి గొడవలు జరిగినా.. వాటికి సంబంధించింది ఏదైనా నువ్వు నాతోనే మాట్లాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడో వ్యక్తి దగ్గరికి వెళ్లకూడదు. పొరపాటున మూడో వ్యక్తి దగ్గరికి విషయం వెళ్లిందని తెలిస్తే మాత్రం.. ఇక ఆ తర్వాత నేను నీతో ఏమాత్రం కలిసి ఉండను. ఒకవేళ నేను కోపంలో ఏమైనా అన్నా.. నువ్వు ప్రేమతో నన్ను మలుచుకో! అంతేకానీ, ఎవరికైనా తెలిస్తే మాత్రం విడాకులే!' అన్నారు. దాంతో ఎన్నోసార్లు కోపంతో అరిచి, చేతిలోనివి ఎత్తేసి, అలిగి మాట్లాడకుండా ఉన్నా! తప్పు ఆయనదే అయినా.. నేనే సర్దుకుని

ఏదో రకంగా ప్రసన్నం చేసుకునే దాన్ని. ఇంకా ముఖ్యమైన ఘోరమైన విషయం ఒకటి చెప్పాలి. అది మా బాబు పుట్టినప్పుడిది..'

* * *

వంశాంకురం పుట్టాడని మా అత్తామామ అందరికీ స్వీట్స్ పంచుతుంటే.. అమ్మానాన్న సంతోషపడ్డారు. కానీ, పచ్చి బాలింతనని కూడా చూడకుండా ఈయన నాకు ప్రత్యక్ష నరకం చూపించాడు.

'నేనేమీ అనను.. ఒక్క విషయంలో నిజం చెప్పు. వీడు నిజంగా నాకు పుట్టిన వాడేనా? నీకు మా నాన్నకు పుట్టిన వాడా?' అన్నాడు.

నాకు గుండెల్లో అగ్నిపర్వతాలు పేలడమంటే, కన్నీరు కాల్వలు కట్టడమంటే ఏమిటో తెలిసిందప్పుడే. కళ్లు బైర్లు కమ్మాయి. ఒకవైపు విపరీతంగా బ్లీడింగ్. డెలివరీ అయి రెండు గంటలు కూడా కాలేదు.

'ఛీ! నువ్వసలు మనిషివేనా? మామయ్య నాకు తండ్రిలాంటి వాడు. ఆయనతో ఇలాంటి సంబంధం.. ఎంత నీచంగా ఆలోచిస్తున్నారు? భగవంతుడా! ఈ పురిటిలోనే నన్ను చంపేయాల్సింది. ఎందుకు బతికించావు?'.. శారీరక బాధకన్నా, గుండెను గునపాలతో గుచ్చిన ఆ మాటలతో తట్టుకోలేక పైకి గుండెలవిసేలా పొగిలి పొగిలి ఏడ్చాను.

'నామీద ఒట్టేసి నిజం చెప్పు! నేనేమీ అనుకోను. మా నాన్న మంచివాడు కాదు. ఎప్పుడైనా ఏదో బలహీన క్షణంలో ఏమైనా కాలు జారారా!? అందరూ వాడు అచ్చం మా నాన్నలా ఉన్నాడంటున్నారు. వాడూ అచ్చం అలాగే ఉన్నాడు. నేనేమీ అనుకోను. ఏదైనా బలహీన క్షణంలో ఏమైనా జరిగిందా?' అంటూ.. గుండెలవిసేలా ఏడుస్తున్న నన్ను చూస్తూ, పదేపదే అడుగుతున్న ఆయన మాటలకు లేని బలం తెచ్చుకుని, కత్తికొక కండగా నరికేయాలనిపించింది. అవి మాటలా? కాదు ఈటెలు. పదునైన శరాలు. పచ్చి బాలింతను ఎవరైనా పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు. అప్పుడు ఏడవకూడదని అంటారు. ఎక్కువగా ఏ పనీ చేయకూడదని చెబుతారు. అలాంటిది.. నాకు తీరని శోకం పెట్టాడు.

కొన్నినెలల వరకు ఇద్దరినీ చూసుకుంటూ నేను ఉద్యోగం చేయలేకపోయాను. అప్పుడే ఆ తీవ్ర మానసిక వేదనకి నాకు డాక్టర్ దగ్గరికి వెళ్తే.. క్రాన్స్ వ్యాధి బయటపడింది.

'అది నివారణలేని వ్యాధి. ఎట్టి పరిస్థితుల్లో మానసిక స్ట్రెస్ ఉండకూడదు. అది లేకుంటే.. ఇదికూడా త్వరగా తగ్గుముఖం పడుతుంది. దీనికి నయం కావడం అంటూ ఉండదు' అంటూ చెప్పి.. డాక్టర్ రాసిన మందులకి ప్రతినెలా ఎంతలేదన్నా కనీసం నాలుగువేల వరకు ఖర్చు అయ్యేవి.

చాలా నెలల వరకు మా అమ్మవాళ్లే పెట్టుకున్నారు. కానీ, నాకే అలా ఇష్టంలేక ఆయనను అడిగితే..

'ఉద్యోగం చేస్తావో.. ఇంకేం చేస్తావో నాకు అనవసరం. కాలేజ్‌కు వెళ్లి.. 'బాబూ.. ఉద్యోగం ధర్మం చేయండి. నాకు మందులు కొనుక్కోవడానికి డబ్బులు లేవు' అంటూ అడుక్కోపో!' అనేవాడు. ఆయన జీతం లకారానికి దగ్గరగా ఉన్నా, ఎప్పుడూ నాకు చెప్పేవాడు కాదు. నా పిల్లలకు నేను దక్కాలంటే ముందు ఆర్థికంగా నా కాళ్లపై నేను నిలబడాలని కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా మళ్లీ జాబ్ సంపాదించుకున్నాను.

* * *

పాపకి యూనిఫాం చినిగిపోవడం వల్ల స్కూల్లో నిలబెడుతున్నారని తెలిసి.. కొనుక్కొని వచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటిపోయింది. చార్జింగ్ లేక నా ఫోన్ స్విచ్‌ఆఫ్ అయింది. ఇంటికి రాగానే చేయిని వెనక్కి వడితిప్పి..

'ఎవడితో కులుకుతున్నావే? ఇప్పటివరకూ ఏ రంకు మొగుడి దగ్గరికెళ్లి వస్తున్నావు?' అంటూ పిల్లల ముందే నానా దుర్భాషలాడాడు. కిందికి వంగోబెట్టి.. వీపు మీద దబాదబా బలంగా గుద్దాడు. ఆయనొక శాడిస్ట్. దానికితోడు నేను అందంగా ఉండటం కూడా.. నా పాలిట శాపమయ్యింది.

* * *

'హడావుడిలో మీకు స్నాక్స్ పెట్టడం మర్చిపోయాను'.

'ఎలా గుర్తుంటుంది? ఎవడెవడినో 'ఆరోగ్యమెలా ఉంది!?' అని అడగడానికి సమయముంటుంది కానీ.. కట్టుకున్నోడెలా గుర్తుంటాడు? ఊరంతా రంకు మొగుళ్లే! పెళ్లికానోనితో ఇకఇకలు పకపకలు, షేక్ హ్యాండ్ లేంటి? ఇదంతా ఫోన్ వరకేనా, వ్యవహారం బయట తిరగడం వరకూ వెళ్లిందా?'.

మా ఫ్యామిలీ ఫ్రెండ్ కార్డియాలజిస్ట్ అయిన డా. శ్రీనివాస్ గారికి ఆరోగ్యం బాలేదని అమ్మ చెబితే.. మెసేజ్ పెట్టాను. ఆయన.. 'ఫైన్! థాంక్యూ ఫర్ యువర్ కన్సర్న్' అంటూ నవ్వుతున్న బొమ్మ, షేక్ హ్యాండ్ ఎమోజీ పెట్టారు.

'అంటే.. దొంగతనంగా నా ఫోన్ చూస్తున్నారా? ఛీ! ఆయన మా బాబాయి వయసువారు. మొన్న మా కొలీగ్‌తో నవ్వుతూ మాట్లాడుతుంటే ఇలాగే అన్నారు. అలా కనిపించిన వారందరితో సంబంధం అంటగట్టడానికి సిగ్గుగా లేదూ!'..

అలా మాటామాటా పెరిగి నన్ను తలపట్టి గట్టిగా నెట్టేశాడు. దాంతో నా తల గోడకు తగిలి.. దిమ్ముగా అయి కింద కూలబడ్డాను. అయినా ఆగకుండా, నా గొంతు నొక్కుతూ..

'ఏంటే.. ఊరుకుంటుంటే రెచ్చిపోతున్నావ్?' అంటుంటే గిలగిలలాడి

పోయాను. నోట్లోంచి మాట రావడం లేదు. ఇంతలో ఏదో ఫోన్ రావడంతో నా గొంతుపై చెయ్యి తీసేశాడు.

ఎవరి ముందైనా నన్ను రాక్షసిగా చిత్రీకరిస్తూ.. 'మోహన్ మంచి బాలుడు'గా ఆస్కార్ లెవెల్లో నటించేవాడు. ఆ గొడవలతో అమ్మావాళ్లు తీసుకెళ్తే డిప్రెషన్‌లోకి వెళ్లి, జ్వరంతో ఫిట్స్ వచ్చి డేంజర్ జోన్‌లోకి వెళ్లిపోయాను. కొన్ని నెలలు అక్కడే ఉండిపోయాను. అలాంటి నన్ను, పిల్లలను కంటిరెప్పలా కాపాడిందమ్మ. అంతకుముందు కూడా ఇలాగే ఆరోగ్యం బాగాలేనప్పుడు, డాక్టర్ దగ్గర చూపించి మందులు ఆయన కొనడని.. అమ్మకు ఫోన్ చేస్తే కారు పంపేది. పిల్లలతో అక్కడికి వెళ్లి డాక్టర్ ఫీజులు, మందులు అమ్మ డబ్బులతోనే చెల్లించి తెచ్చుకునేదాన్ని. రానూపోనూ కార్‌ని డ్రైవర్‌నీ ఇచ్చి అమ్మే పంపేది.

దానికి కూడా బంధువులతో..

'అక్కడ దానికి ఎవడో ఉన్నాడు. అందుకే ఎప్పటికీ వెళ్తుంది' అనీ..

'ఆమెకు సంసారానికి పనికిరాని వ్యాధి వచ్చింది. అందుకే అక్కడ ఉంది!' అనీ చెప్పుకొచ్చాడు.

* * *

'మహాసముద్రాన్ని మరచెంబులో పట్టించలేనట్లు.. ఆయన దారుణాలెన్నో ఈ వ్యవధిలో చెప్పలేను. నాకేం న్యాయం చేస్తారు?'.. ఏడుస్తూ వైదేహి చెబుతుంటే..

'ఆమె చెప్పినవన్నీ అబద్ధాలే! ఆమెలాగా కథలల్లి నేను చెప్పలేను. పెళ్లికి ముందే మేం ప్రేమించుకున్నాం. నేను భద్రకాళి అమ్మవారి పాదాల మీద ఒట్టేసి చెప్తున్నాను.. జాగ్రత్తగా వినండి. పెళ్లికి ముందే మాకు అన్నీ అయిపోయాయి.. 'అన్నీ' అంటే పెళ్లయ్యాక కావాల్సినవన్నీ కూడా అప్పుడే అయిపోయాయి. అలాంటి దాన్ని నేను చేసుకున్నాను అంటే అర్థం చేసుకోండి..' మోహన్ ఆ మాటలంటుంటే.. వైదేహి ఫిట్స్ వచ్చినట్టు ఊగిపోతూ..

'అరేయ్! నీకు బుద్ధి ఉందా? నువ్వసలు మనిషివేనా? పవిత్రమైన అమ్మవారి పాదాలమీద ఒట్టేసి ఇలాంటి ఘోరానికి ఒడిగడతావా? అందరి ముందూ నా శీలాన్ని శంకిస్తావా? పెళ్లికి ముందే నీతో అన్నీ చేసుకునే బరితెగించిన ఆడదానిగా నన్ను చిత్రీకరిస్తావా? నిన్ను అస్సలు వదలనురా..' అంటూ అరిచి, మోహన్‌ని కొట్టడానికి వెళ్లబోతుంటే పెద్ద మనుషులు ఆపారు.

అబ్బాయి తరపు వారుకూడా లేచి..

'అలాంటి ప్రమాణం చేసి, ఏమీ లేకుండా ఎందుకు నింద వేస్తాడు?' అంటూ సమర్థించుకోవడం, ఇరువైపుల వారు లేచి అరచుకోవడం చూసి..

ఓ పెద్ద మనిషి లేచి నిలబడి..

'అమ్మా! మీరందరూ కూర్చోండి. మీరంతా మా మాట వినాల్సి ఉంటుంది. లేదంటే మేమెందుకు?' అనడంతో అందరూ నిశ్శబ్దమైపోయారు.

'ఆయన అమ్మవారి పాదాల మీద అన్నప్పుడు నమ్మాల్సి ఉంటుంది కదా! అయినా అదిప్పుడు అప్రస్తుతం' అన్నాడు పెద్దమనిషి.

'నేనీ నింద ఎలా భరిస్తాను? మోజు తీరగానే భార్య నడుం మీద కూర్చుని గుండు గీసి.. బజార్లో చెయ్యి పట్టి పశువును లాకెళ్తున్నట్టుగా వీధుల్లో లాక్కెళ్లినవాడు ఒకడు. తన సొత్తు కాదనుకొని అమానుషంగా అనుభవించి, కిరాతకంగా పేగుల్ని బయటికి తీసేవాడు ఒకడు. చిన్నపిల్లలని కూడా చూడకుండా మర్మాంగాల్లో సూదులు గుచ్చేవాడు ఒకడు. బయటికి కనిపించకుండా లోపలే అంతం చేసి ముక్కలుగా కోసి పారేసేవాడు ఒకడు. తండ్రిలాంటి మామయ్యతో సంబంధాన్ని అంటగట్టి, ఫోన్‌లో కనీసం పలకరింపులకు కూడా విపరీతార్థాన్ని తీసి చిత్రహింసకు గురి చేసేవాడు వీడు. ఇలాంటి వాడు ఎంతకైనా తెగిస్తాడు. దీన్ని నేను నిరూపించుకోలేనన్న ధైర్యం ఆయనది! ఎందుకంటే ఇది ద్వాపరయుగం కాదు.. ద్రౌపది మానాన్ని చీరలిచ్చి కాపాడడానికి. త్రేతాయుగం కాదు.. సీతమ్మ వారిలా అగ్నిలో పడితే మళ్లీ అగ్నిదేవుడు వచ్చి 'సీతమ్మ తల్లి పునీత' అంటూ అప్పజెప్పడానికి. కానలకు పంపిన సీతమ్మ తల్లిని భూదేవి వచ్చి తన ఒడిలోకి తీసుకుపోవడానికి వీల్లేకుండా.. ఇది కలియుగం అయిపోయింది. నిరూపించుకోవడానికి ఏ శక్తీ లేదనుకుంటున్నాడు. కానీ, నాకా అమ్మవారి అండ ఉంది. నేను చెప్పినవన్నీ ఒప్పుకొంటే నేనిది తప్పని నిరూపిస్తాను' వైదేహి అన్నది స్థిరంగా.

ఆ మాటలకు పెద్ద మనుషులకే కాదు.. అక్కడున్న వారందరి మతులూ పోయాయి.

'ఏంటిది? పెళ్లికి ముందు శీలం పోయిందనే విషయాన్ని.. పోలేదని ఇప్పుడెలా నిరూపిస్తుంది?'..

అందరిలోనూ విపరీతమైన ఆశ్చర్యం! వింటున్న మోహన్ కూడా ఆశ్చర్యపోయాడు. ఇదేంటి!? ఇదెలా నిరూపిస్తుంది? అమ్మవారి పాదాల మీద అంటూ సెంటిమెంట్ కూడా ఉపయోగించి అందరి దృష్టినీ మళ్లించాడు. ఎందుకంటే అక్కడ తనకు వాయిస్ లేదు. ఎట్టి పరిస్థితుల్లో నిరూపించే ఛాన్స్‌లేదు కాబట్టి ఒప్పుకొంటున్నట్లు తలూపాడు.

వైదేహి లేచి ఎవరికో ఫోన్ చేసింది.

అందరి కళ్లూ ఆమె మీదనే ఉన్నాయి. అంత పెద్ద హాల్‌లో దాదాపు 50 మంది ఉన్న ఆ సమావేశ మందిరంలో.. సూది పడినా వినిపించేంత నిశ్శబ్దం

ఆవహించింది. అటువైపు నుంచి..

'హలో!' అని ఫోన్ ఎత్తగానే.. స్పీకర్ ఆన్ చేసి..

'పిన్నీ! బాగున్నారా?' అన్నది వైదేహి.

'ఆ! బాగున్నామమ్మా! మీరెలా ఉన్నారు? మోహన్, పిల్లలు అందరూ బాగున్నారా? నేను రెండేళ్ల నుంచి మా అబ్బాయి దగ్గరికి బెంగళూరుకి రావడం వల్ల ఏ విషయాలూ తెలియడం లేదు'.

'ఆ బాగున్నారు పిన్నీ! మిమ్మల్ని అప్పుడు.. మా మొదటి రాత్రప్పుడు ఒక ప్రశ్న అడిగాను గుర్తుందా?'.

'ఎందుకు లేదూ? మొదటి రాత్రిలో మీరు సక్సెస్ కాలేదనీ, ఇద్దరం బాధపడుతున్నామనీ అడిగావు కదా! ఇప్పుడు ఆ విషయం ఎందుకు?'.

'ఆ! ఏం లేదు పిన్ని.. ఇంతకీ మీరప్పుడు ఏం చెప్పారు?'.

'ఏమన్నాను.. 'ప్రతి మొదటి రాత్రి ఎవరికీ అంతగా సక్సెస్ అవదు. అప్పుడు అమ్మాయి బిడియంతో బిగిసుకుపోయి ముడుచుకుపోతుంది. ఇద్దరి మధ్యలో అంతా మొదట కొత్త కాబట్టి.. అలాగే ఉంటుంది. తర్వాత అదే సక్సెస్ అవుతుంది. ఏం ప్రాబ్లం లేదమ్మా!' అన్నాను. పైగా నువ్వే.. 'ఆయన కూడా ఈ విషయంలో బాగా బాధపడుతున్నారు. ఎవరినైనా అడుగు' అన్నారని.. సిగ్గనిపించి నాతో నీకున్న అభిమానంతో నన్ను అడుగుతున్నావని కూడా అన్నావు కదా!?'.

'అవును పిన్నీ! నేను మళ్లీ మాట్లాడతాను' అంటూ ఫోన్ పెట్టేసి.. అందరూ నిశ్చేష్టులై చూస్తుండగా, వెళ్లి మోహన్ చెంపలు ఎడాపెడా వాయించింది. ఈసారి ఎవరూ వారించలేదు.

'ఇంతటి ఘోరమైన పరాభవం, అవమానం ఎటువంటి ఆడపిల్లకూ, ఎప్పుడూ రాకూడదు. పట్టపగలు బయటికి పోయినా వయసుతో సంబంధం లేకుండా పాలుగారే పసిపాపలో, పండు ముదుసలిలో కూడా ఆడతనాన్ని మాత్రమే చూసే కామాంధులే ఎక్కువగా ఉన్నారిప్పుడు! ముక్కు పచ్చలారని పసిబిడ్డ రక్తం కారుతుంటే.. ఇంటింటికీ తిరిగి సహాయమర్థించినా ముఖం మీదే తలుపులు వేసిన లోకమిది! సభ్య సమాజం తలవంచుకునే బిహార్ ముజఫర్పూర్, మణిపూర్ ఘటనలు జరిగినంతకాలం.. చెప్పకుండా ఐబ్రోస్ చేయించుకుందని తలాక్ చెప్పే మహానుభావులు ఏన్నంత కాలం.. ఎన్ని తరాలు మారినా తరుణి తలరాత మాత్రం మారదు. 21వ శతాబ్దంలోనూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు శారీరక/లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థే తెలిపింది. అందులో జీవిత భాగస్వాములతోనే ఎక్కువ ముప్పని కూడా చెప్పింది.

ఒకవేళ నేను ఆరోజు అలా అడిగి ఉండకపోతే.. కనీసం నేను చెప్పిన మాట నిజమని ఎవరైనా నమ్మేవారా? నిరూపించ గలిగేదాన్నా? ఇలాంటి నీచనికృష్టుడికి బిడ్డలుగా నా పిల్లలను ఎందుకు పుట్టించావు దేవుడా! వీడికే శిక్ష వేయాలి? నా పిల్లలకేం న్యాయం జరగాలి?'..

ఉగ్రరూపంతో నిప్పులు కురిపిస్తున్న ఆమె కళ్లు అగ్నిగోళాల్ని తలపిస్తుంటే.. ఆమెను చూడటానికి భయపడి, అలాంటి పరిస్థితులలో ఉన్నందుకు సిగ్గుపడి, కొందరు.. చరిత్రలో కనీవినీ ఎరుగని దృశ్యాన్ని చూస్తున్న గగుర్పాటుతో మరికొందరు చూస్తుంటే.. ఆమె చెప్పే నిర్ణయాన్ని వినడానికి చెవులు రిక్కించి ఒక్కక్షణం గాలి కూడా స్తంభించిపోయింది. గుడిలోని అమ్మవారి సాక్షిగా, నిజం నిప్పులా ఎప్పటికైనా, ఎంత క్లిష్ట పరిస్థితులనైనా తట్టుకొని మేలిమి బంగారంలా బయటకొస్తుందని నిరూపిస్తూ.. గుడి గంటలు గణగణ మోగాయి.

* * *

## నామని సుజనాదేవి

మగవాడిలో మార్పు రానంతవరకూ.. ఎన్ని తరాలు మారినా తరుణి తలరాత మాత్రం మారదని చెబుతున్న కథ.. 'సమాధానం లేని ప్రశ్న'. రచయిత్రి నామని సుజనాదేవి. వీరి స్వస్థలం హన్మకొండ. భారతీయ జీవితబీమా సంస్థలో లీగల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ దాదాపు 250 పైగా కథలు రాశారు. ఆరు కథా సంపుటాలతోపాటు 2 కవితా సంపుటాలు, ఒక నవలను వెలువరించారు. వీరి మొదటి కథ 'ప్రేమ తపన'. 1991లో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. సాహిత్య సేవలో భాగంగా వందకు పైగా పురస్కారాలు, బహుమతులు, సన్మానాలు అందుకున్నారు. వివిధ పోటీల్లో 50కిపైగా కథలు, కవితలకు బహుమతులు గెలుచుకున్నారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. ఆన్‌లైన్ ద్వారా దేశంలోని అన్ని జిల్లాల వారీగా ప్రధానమంత్రి నిర్వహించిన 'లోరీ పోటీ'లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా నుంచి ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. ఇటీవలే స్వాతి 'అనిల్ అవార్డు', పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి ఉత్తమ కథ రచయిత్రి పురస్కారం అందుకున్నారు. వీరి కథలు కొన్ని కన్నడంలోకి, ఆంగ్లంలోకి అనువాదయ్యాయి.

-77993 05575

# సంతకం

## జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి



'సంతకం అంటే మనిషి హోదాకీ విలువకీ మాత్రమే కాదు.. మానవత్వానికీ సహృదయతకీ గుర్తింపేనని నిరూపించావు. ఈరోజు నా సంతకం, నీ ఔన్నత్యానికి సాక్ష్యంగా మారుతున్నది. నేను చాలా అదృష్టవంతురాల్ని' అంటూ.. సంతకం చేసిన అనుమతి పత్రాలని వినీత్ చేతిలో పెట్టింది స్నిగ్ధ.

ఆ పత్రాలను బల్లమీద పెట్టి..

'అదృష్టం నీది కాదు, నాది' అంటూ ఆమెను చుట్టేశాడు వినీత్.

కానీ, అసలైన అదృష్ణం వాళ్లిద్దరిది కూడా కాదు.

అనుకూల దాంపత్యానికి ఉదాత్తమైన భాష్యం చెప్పే ఈ కథ.. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా వినీత్ హైదరాబాద్ వెళ్లడంతో ఆరంభమైంది.

* * *

హైదరాబాద్‌లో ఎప్పుడూ దిగేచోటే దిగాడు వినీత్. స్నానం చేసి ఎప్పట్లాగే దగ్గరలోని శివాలయానికి బయల్దేరాడు. ఎప్పట్లాగే రణగొణ ధ్వనులతో శబ్దకాలుష్యాన్నీ, ఇంధనం వెలువరించే పొగలతో వాయుకాలుష్యాన్నీ నగరానికి ఉచితంగా సరఫరా చేస్తూ.. అడ్డదిడ్డంగా పరుగులు తీస్తున్నాయి వాహనాలు.

వంతెనమీది నడకదారిలో ఆ చివర కూర్చుని ఉన్నాడొక యువ బిచ్చగాడు. జానెడు గెడ్డం–బారెడు జుట్టు. అప్పుడే స్నానం చేసి వచ్చినట్లున్నాడు. నల్లటి గెడ్డం మధ్య మరింత నల్లటి ముఖం సూర్యకాంతిలో నిగనిగలాడుతున్నది. అతన్ని చూసి..

'బుద్ధిగా పని చేసుకోవడం మానేసి అడుక్కోవడం ఏం ఖర్మ?' అనుకుంటూ, అతన్నేమాత్రం పట్టించుకోకుండా గుడికి వెళ్లిపోయాడు వినీత్.

గుడిలో దర్శనం చేసుకుని బయటికి రాగానే మెట్లమీద బిచ్చగాళ్ల అరుపులు చుట్టుముట్టాయి. వాటిని వింటూంటే వంతెన చివరి బిచ్చగాడు గుర్తొచ్చాడు. దాంతో అలవాటు ప్రకారం జేబులోకి వెళ్లబోయిన చేతిని వెనక్కి తీసేసుకున్నాడు. వీళ్లంతా తమ వృత్తి నై–పుణ్యంతో భక్తులకు పుణ్యాన్ని పంచుతున్నామని డబ్బాలు కొట్టిమరీ చాటుకుంటారు. వేసినవాడికి పుణ్యం మాటెలాగున్నా వెయ్యనివాడికి

శాపనార్థాలు మాత్రం తప్పవు. మరా గెడ్డం బిచ్చగాడు? పాపం అతనికి అడుక్కోవడంలో ఓనమాలు కూడా తెలిసినట్లు లేవు. తెలిస్తే పాదచారులు బిచ్చం వెయ్యడానికి వీలుగా కనీసం తన ముందు తుండుగుడ్డయినా పరుచుకోకుండా ఉంటాడా? ఇచ్చేదేదో అలాంటివాడికి ఇస్తే సద్వినియోగం అవుతుందని అనిపించింది. అందుకే వృత్తిబిచ్చగాళ్ల అరుపుల్ని పట్టించుకోకుండా మెట్లు దిగిపోయాడు.

వినీత్ వెళ్లేసరికి ఇంకా అక్కడే కూర్చుని ఉన్నాడా బిచ్చగాడు. అతని కళ్లల్లో అపారమైన వెలితి. అంతులేని నైరాశ్యం.

అవే అతని పట్ల తనలో జాలి కలిగించి ఉంటాయని అనుకుంటూ.. జేబులో చెయ్యిపెట్టాడు వినీత్. చేతికి ఐదురూపాయల నాణెం తగిలింది. కానీ దాన్ని తియ్యబుద్ధి కాలేదు. అందుకే పదిరూపాయల కాగితం తీసి అతని చేతికందేలా పట్టుకున్నాడు.

ఆ బిచ్చగాడు దానివైపు భావరహితంగా చూస్తున్నాడే తప్ప అందుకోవడానికి చెయ్యి ముందుకి చాచడం లేదు. దాంతో అతను గుడ్డివాడేమో అనే అనుమానం కలిగింది. అందుకే ఆ పదిరూపాయల కాగితాన్ని అతని చొక్కాజేబులోకి దూర్చాడు. తన చేతి స్పర్శ తెలిశాకైనా స్పందిస్తాడని అనుకున్నాడు వినీత్. కానీ, అతని నుంచి ఏ ప్రతిక్రియాలేదు. చూపుల్లోకి ఏ భావమూ రాలేదు. అంటే తను ఊహించింది నిజమే కావచ్చు అనుకుంటూ ముందుకు కదిలాడు.

నాలుగడుగులు వేశాడో లేదో వెనకనుంచి దుమ్ములగొండి నవ్వులాంటి వెకిలి నవ్వు వినిపించింది. వెంటనే వెనక్కి తిరిగాడు. ఆ బిచ్చగాడు తనలో తనే నవ్వుకుంటూ పదికాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేస్తున్నాడు. అంటే అతను గుడ్డివాడు కాదు, బహుశా తనిచ్చిన పదిరూపాయలు అతనికి చాల్లేదు కాబోలు అందుకే చింపేసుంటాడు.

'అయినా అడుక్కునేవాడికి అంత అహంకారం పనికిరాదు' అనుకుంటూ తనదారిన తను వెళ్లిపోయాడు.

* * *

తన బాధ్యతల్లో భాగంగా స్థానిక కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్నాడు వినీత్. అంతలోనే తన శాఖలోనే పనిచేసే ఒక ఉన్నతోద్యోగి తనని బయటికి తీసుకెళ్లి కాఫీ ఇప్పించాడు. పనిలో పనిగా ఐదువందల కట్టనొకదాన్ని జేబులో పెట్టబోయాడు. వినీత్ దాన్ని సున్నితంగా తిరస్కరిస్తుండగా వంతెన బిచ్చగాడు గుర్తొచ్చాడు. దుమ్ములగొండి ఇకిలింపు గుర్తొచ్చింది. ఆ ఉన్నతోద్యోగి ఇచ్చిన డబ్బు తిరస్కరించడానికి తన కారణాలు తనకున్నాయి. అలాగే తన పది కాగితాన్ని చింపి

పారెయ్యడానికీ అతని కారణాలు అతనికీ ఉంటాయనుకున్నాడు వినీత్. అలా అనుకోగానే ఆ కారణాలేమిటో తెలుసుకోవాలనే ఆసక్తి మొదలైంది.

మధ్యాహ్నం భోజనాలవేళ గదికొచ్చాడు. భోజనం చేస్తూ యథాలాపంగా కిటికీలోంచీ బయటకి చూస్తే వంతెన కనిపించింది. వంతెన చివర బిచ్చగాడూ కనిపించాడు. భోజనం చేస్తూనే ఆ బిచ్చగాణ్ని గమనిస్తున్నాడు వినీత్. అదే సమయంలో వంతెన మీద భార్యాభర్త, వాళ్ల పిల్లాడూ వస్తూ కనిపించారు. ఆ బిచ్చగాణ్ని చూడగానే భార్య ఏదో చెప్పింది. భర్త జేబులోంచి ఓ నాణెం తీసి కళ్లకద్దుకుని భార్యచేతిలో పెట్టాడు. ఆమె కూడా నాణాన్ని కళ్లకద్దుకుని పిల్లాడి చేతికిచ్చింది. అ పిల్లాడుకూడా దాన్ని కళ్లకు అద్దుకున్నాడు. ఆవిధంగా వాళ్లు ముగ్గురూ దానం చెయ్యడానికి ముందే దాని తాలూకూ పుణ్యాన్ని సరిసమానంగా పంచుకోవడం చూసి వినీత్‌కి నవ్వొచ్చింది.

పిల్లవాడు తన చేతిలోని నాణేన్ని బిచ్చగాడి ముందు పడేసి తల్లిదండ్రుల వెంట వెళ్లిపోయాడు.

ఇప్పుడా బిచ్చగాడి స్పందనెలా ఉంటుందో చూడాలనే కుతూహలంతో అతన్నే గమనిస్తున్నాడు వినీత్.

బిచ్చగాడు ఆ నాణేన్ని తీసుకున్నాడు. నాలుగైదుసార్లు అటూఇటూ తిప్పి చూశాడు. తరువాత దాన్ని గుప్పిట్లో బిగించి గుండెలకి ఆన్చుకున్నాడు. అతని చర్యని చూడగానే..

'బహుశా అతను చిల్లర నాణాలు తప్ప కాగితాలు తీసుకోడుగాబోలు!' అనే అనుమానం కలిగింది. అయినా తరవాతేం చేస్తాడో చూద్దామనే కుతూహలమైతే తగ్గలేదు.

బిచ్చగాడు నాణేన్ని గుండెలకి ఆన్చుకునే మనసులో ఏదో తలుచుకున్నాడు. ఆ తలుచుకున్నది జరుగుతుందో లేదో తేల్చుకోవడానికి బొమ్మా బొరుసూ వేశాడు. నాణెం గిర్రున తిరుగుతూ పైకి వెళ్లింది. కింద పడుతున్నప్పుడు రెండు చేతుల్తో పట్టుకున్నాడు. ఏం పడిందో ఆత్రంగా చూసుకున్నాడు. అనుకున్న ఫలితం వచ్చినట్టు లేదు. అందుకే ఈసారి మరింత పైకి ఎగరేశాడు. ఈసారి కూడా ఫలితం వచ్చినట్టు లేదు. ముచ్చెంగా మూడోసారి ఎగరేసి చూసుకున్నాడు. కోరుకున్న ఫలితం వచ్చుండదు. అందుకే నాణాన్ని కోపంతో విసిరికొట్టాడు. అది తిన్నగా వెళ్లి ఒక పెద్దాయన ముందు పడింది. ఆయన ఓసారి అటూఇటూ చూసి తనని ఎవరూ గమనించలేదని నిశ్చయంకాగానే.. దాన్ని తీసుకొని జేబులో వేసుకున్నాడు.

వినీత్ గుంభనంగా నవ్వుకున్నాడు.

* * *

మర్నాటి ఉదయం గుడికెళ్లడానికి తయారవుతూ కిటికీలోంచి చూస్తే వంతెన చివరే కనిపించాడా బిచ్చగాడు. క్రమశిక్షణలో వాడు తనలాంటి వాళ్లందరినీ తలదన్నేలా ఉన్నాడనిపించింది. అంత క్రమశిక్షణ కలిగినవాడు ఇంత విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడంటే.. అది వెర్రితనమో పిచ్చితనమో అయివుండదు. అయినా దానం తీసుకోని బిచ్చగాడు ఎక్కడైనా ఉంటాడా? ఆ అనుమానంతోపాటుగానే అతణ్ని తనదగ్గర దానం తీసుకునేలా చెయ్యాలనే పట్టుదల కూడా కలిగింది.

అందుకే గుడినుంచి వచ్చేప్పుడు బిచ్చగాడి ముందుకెళ్లి నిలబడ్డాడు. అతని కళ్లముందు యాభై రూపాయల కాయితం పెట్టాడు. ఆ బిచ్చగాడు కాగితాన్నే చూస్తున్నాడు. కానీ, అతని చూపుల్లోని భావరాహిత్యం మాత్రం అలాగే ఉంది. వందకాయితం చూపించినా.. రెండువందలు, ఐదువందల కాయితాలు చూపించినా ఆ కళ్లలోకి వెలుగు రాలేదు.

రెండువేల కాయితం రద్దయిపోయింది. లేకపోతే దాన్నీ చూపించి ఉండేవాడు. రద్దు చెయ్యడానికే ప్రవేశపెట్టిన కాయితమది. కనుక రద్దయినా బాధలేదు. కానీ, తన పట్టుదల మాత్రం రద్దుకాదు. అందుకే జేబులో ఉన్న డబ్బంతా తీసి అతని కళ్లముందు పెట్టాడు.

అయినా ఆ కళ్లలో అదే నిరాసక్తత. అదే నిర్లిప్తత. ఆ చూపుల్లోని భావరాహిత్యం వినీత్‌ని సవాలు చేస్తూనే ఉంది. అందుకే బిచ్చగాడివైపు కోపంగా చూస్తూ..

'అడుక్కునేవాడు ఎంతేస్తే అంత తీసుకోవాలి. ఐదు రూపాయలైనా డబ్బే. పది రూపాయలైనా డబ్బే. చాలకపోతే అడిగి తీసుకోవాలి. అంతేగానీ ఇచ్చినవాణ్ని అవమానించే హక్కులేదు నీకు' అన్నాడు.

బిచ్చగాడు మౌనంగానే తీసుకున్నాడు. వినీత్ ఇచ్చిన డబ్బు లెక్కపెట్టాడు. ఆ తరువాత..

'నేను అడుక్కునేవాడినని ఎవరు చెప్పారు మీకు?' అంటూ, ఆ డబ్బుని వినీత్ చేతిలో పెట్టేసి మళ్లీ భావరాహిత్యంలోకి వెళ్లిపోయాడు.

వినీత్‌కి ఒక్కసారిగా ఛెళ్లున చెంప పగలగొట్టినట్లయింది.

ఆ తరువాత తను ఆవేశంతో ఎన్ని మాట్లాడినా, ఎన్ని మాటలన్నా ఆ బిచ్చగాడినించి సమాధానంగా వచ్చిందిమాత్రం కేవలం శూన్య దృక్కులే. చివరికి తనే మౌనం వహించి, వెనుదిరక్క తప్పలేదు.

* * *

వినీత్‌కి ఆరోజంతా పదేపదే గుర్తొస్తూనే ఉన్నాడా బిచ్చగాడు. అతనితో పంతానికిపోయి అవమానం పాలైనందుకు కాదు. అసలా గెడ్డం యువకుడు

ఎవరు? ఎందుకక్కడే ఉంటున్నాడు? అతని సమస్యేమిటి? అక్కడే కూర్చుంటే పూటెలా గడుస్తుంది? అన్నీ ప్రశ్నలే. అన్ని ప్రశ్నలెదురైనా ఆ బిచ్చగాడితో నాకెందుకు? అనే ప్రశ్నమాత్రం పుట్టలేదు.

మర్నాడు గుడికెళ్లేప్పుడు వంతెన ఇవతలివైపు కాకుండా అవతలివైపు నుంచి వెళ్లాడు. కానీ వచ్చేప్పుడు మాత్రం బిచ్చగాడి మాట మర్చిపోయాడు. అందుకే ఇవతలివైపుగా వచ్చేశాడు. తన మతిమరుపును తనే తిట్టుకుంటూ హడావుడిగా నడుస్తున్నాడు. బిచ్చగాడి దగ్గరకొస్తున్నకొద్దీ ఏదో జంకు. ఏదో అపరాధభావం. కానీ, ఆ మనిషి చూపులు మాత్రం అలాగే ఉన్నాయి.. భావరహితంగా! ఇప్పుడెందుకో ఆ మనిషి గురించి 'బిచ్చగాడు' అనుకోవడానికి కూడా తటపటాయిస్తున్నది మనసు.

ఉంది.. ఏదో ఉంది. ఆ మనిషిలో తను ఊహించనిదేదో ఉంది. అందుకే చూపులు తిప్పుకోలేక పోతున్నాడు. అలా చూస్తుంటే మనసులోకి వస్తున్న ఆలోచనలన్నీ దగ్గరదాకా వచ్చి అక్కడే ఆగిపోతున్నాయి. తన జీవితంలో స్నిగ్ధ ప్రేమ తప్ప మరేదీ ఇంతగా వేటాడలేదు. అందుకే అతన్ని దాటి వెళ్లిపోతున్నప్పుడు వినీత్ కాళ్లు సన్నగా కంపించాయి.

ఆ రాత్రి ఫోన్‌లో స్నిగ్ధతో మాట్లాడుతూ వంతెన యువకుడి గురించి చెప్పాడు.

'అలాంటి మనుషుల్లో మనం చదవని శాస్త్రాలు, మనం చూడని సత్యాలు ఎన్నో ఉంటాయి. వదిలి పెట్టద్దు. విషయం కనుక్కో!' అన్నది స్నిగ్ధ. సమయానికి తగిన సలహాలివ్వడంలోనూ, సహకారం అందించడంలోనూ తనని మించినవారు లేరు.

రాత్రంతా ఆ యువకుడికి పూటెలా గడుస్తుందో తెలుసుకోవాలన్న ఆలోచనతోనే గడిచిపోయింది.

మరునాటి ఉదయం ఫలహారం చేస్తున్నప్పుడు వచ్చిందో ఆలోచన. వెంటనే రెండిడ్లీలు, మసాలా దోశ పొట్లం కట్టించుకున్నాడు వినీత్. అరడజను పూతరేకులు కూడా కొన్నాడు. తిన్నగా గెడ్డం యువకుడి దగ్గరికి వెళ్లాడు. వినీత్ చేతిలోని పొట్లాలు చూడగానే భావరహితమైన ఆ శూన్యదృక్కుల్లోకి ఒక్కసారిగా చైతన్యం వచ్చింది. ఇవ్వకముందే పొట్లాలు లాగేసుకున్నాడు.. పూతరేకుల్ని ఒళ్లో పెట్టుకున్నాడు. ఇడ్లీ విరుచుకుని తినబోయే ముందు వినీత్ వైపు చూస్తూ..

'అన్నదాతా సుఖీభవ!' అన్నాడు.

అక్కడితో ఆగలేదు,

'తినగా మిగిలింది ఊరికే పడెయ్యడం ఎందుకని నాకు ఇస్తారంతే! కానీ ఇలా నాకోసం ప్రత్యేకంగా తీసుకొచ్చింది మీరొక్కరే!' అన్నాడు.

అతను తింటుండటాన్ని చూసి తృప్తిగా ముందుకు నడిచాడు వినీత్. అలా నడుస్తుంటే అమ్మ గుర్తొచ్చింది.

'అన్నపూర్ణమ్మ తల్లి పట్టెడన్నంతో అంతులేని తృప్తినిస్తుంది. కానీ, లక్ష్మీదేవికి తృప్తి అనే మాటే తెలీదు. మా చిన్నప్పుడు బియ్యమో పప్పులో కూరలో వేస్తే తీసుకునేవారు. ఇప్పుడు డబ్బులు తప్ప ఇంకేమీ తీసుకోవడం లేదు. మనుషుల్లో తృప్తి అనేదే లేకుండా పోతున్నది' అని బాధపడుతూ ఉంటుంది.

అమ్మ గనుక ఈ యువకుణ్ని చూస్తే ఎంత సంతోషిస్తుందో అనుకున్నాడు.

* * *

హైదరాబాద్ వచ్చిన పని పూర్తయింది. మధ్యాహ్నం తను భోజనం చేశాక గెడ్డం యువకుడికోసం భోజనం కట్టించుకొచ్చాడు వినీత్. ఈ వారం రోజుల్లోనూ వినీత్‌తో కొంచెం స్నేహం కలిసినట్లు అనిపించింది. అందుకే, అతన్ని అల్లంత దూరంలో చూడగానే సంబరంగా ఎదురొచ్చాడు గెడ్డం యువకుడు. భోజనం పొట్లం అందుకున్నాడు.

ఇద్దరూ నడుస్తున్నారు. అతని స్థానం చేరగానే ఒక్కసారిగా చతికిలబడ్డాడు.

వినీత్ జేబులో చెయ్యిపెట్టాడు. అంతకు ముందు ఆ యువకుడు వెనక్కిచ్చిన డబ్బు అలాగే మడతపెట్టి ఉంది. దాన్ని బయటికి తీశాడు.

'నేను మా ఊరెళ్లిపోతున్నాను. ఈ డబ్బుంచు! అవసరానికి పనికొస్తుంది'.

'తీసుకుంటాను. కానీ, నాకు కావాల్సినంత మీరివ్వలేరు'.

'ఇచ్చే ప్రయత్నం చేస్తాను. చెప్పండి.. ఎంత కావాలి?'.

'లక్ష?'.

'ఇస్తాను'.

'రెండు లక్షలు?'.

'చూస్తాను'.

'ఐదు లక్షలు?'.

'ఆలోచిస్తాను'.

'పది లక్షలు?.. చెప్పండి, ఇవ్వగలరా? మీరు ఇవ్వలేకపోయినా ఇవ్వగలిగినవాళ్లు సిద్ధంగా ఉన్నారు. కానీ, నాకు కావాల్సింది డబ్బు కాదు. ఎందుకంటే.. డబ్బు కొనలేనివి ఎన్నో ఉంటాయి. నాకు కావాల్సింది మీ దగ్గర ఉంది. మీ దగ్గరే కాదు.. అందరి దగ్గరా ఉంది. కానీ, ఎవ్వరూ ఇవ్వరు. ఇవ్వనిదాన్ని దానంగా కోరడంలో అర్థం లేదు!'.

'నేను మాట తప్పను. ఒకవేళ నేను తప్పాలనుకున్నా మా స్నిగ్ధ తప్పనివ్వదు. అడగండి.. నా దగ్గర ఉన్నదైతే తప్పకుండా ఇస్తాను'.

'అందరూ ఇంతే! అడక్కముందు పెద్ద దానకర్ణుడిలా ఏం కావాలన్నా ఇస్తామంటారు. అడిగాక మళ్లీ ముఖం చూపించరు'.

'అందరూ అలాగే ఉండరు. నిస్సంకోచంగా అడగండి'.

'ఇవ్వడానికి మీరొప్పుకొంటే చాలదు. మీవాళ్లూ ఒప్పుకోవాలి. కానీ, వాళ్లొప్పుకోరు. వాళ్లు ఒప్పుకోకపోతే చట్టం ఒప్పుకోదు'.

'మావాళ్లు ఒప్పుకొంటారో లేదో మీకెలా తెలుసు? కేవలం మీ అనుభవాల్ని మించిన సత్యం ఉండదనే భ్రమలోనుంచి బైటికి రండి. నిస్సందేహంగా అడగండి.. మీకు కావాల్సిందేమిటి?'.

'నా మూత్రపిండాల్లో ఒకటి చెడిపోయింది. నెలరోజుల్లో మార్చకపోతే నేను బతకను. ఇప్పుడు చెప్పండి.. నాకో మూత్రపిండం దానం చేయగలరా?'.

* * *

## జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

కథా నవలా రచయితగా, అనువాదకులుగా తెలుగువారికి చిరపరిచితులు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి. స్వస్థలం భీమవరం. ఈటీవీలో కన్నడ రచయితగా, మాటీవీలో తెలుగు రచయితగా 30 ఏళ్లు పనిచేశారు. టీవీ సీరియళ్లను హిందీ, కన్నడ భాషలనుంచి తెలుగులోకి అందిస్తుంటారు. 'అంతర్యామి', 'సాక్షాత్కారం' నవలలు; 'దిడెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్', 'ఈ కథకి శిల్పం లేదు', 'నూటొకటో మార్కు', 'తెలకోవెల' కథాసంపుటాలను వెలువరించారు. విశ్వర్షి వాసిలి వసంతకుమార్ యౌగిక కావ్యం 'నేను', బ్రహ్మర్షి ఉమర్ ఆలీషా 'విజ్ఞానజ్యోతి' మొదలైన గ్రంథాలను కన్నడ భాషలోకి అనువదించారు. కేంద్రసాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కారం పొందిన నవలని తెలుగులో 'భలేతాత మన బాపూజీ' పేరుతో తెలుగులోకి తీసుకొచ్చారు. అమెరికన్ తెలుగు అసోసియేషన్ తొలి నవలల పోటీలో 'వలసదేవర' నవలకి మొదటి బహుమతి అందుకున్నారు. 'జంగమదేవర' నవలకి సంయుక్త ఆంధ్రప్రదేశ్ భాషాసాంస్కృతిక శాఖ నుంచి నవలల పోటీలో బహుమతులు పొందారు. ఇవి కాకుండా.. అప్పాజోస్యుల విష్ణుభొట్ల పౌండేషన్, తెల్సా, నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం, కౌముది, రచన, ఆంధ్రప్రభ, స్వాతి, మొదలైన పత్రికలు, సంస్థల నుంచి వివిధ సందర్భాలలో బహుమతులను పొందారు.

# మేరా బాప్ ఖయ్యూం!



హుమాయూన్ సంఘీర్

ఫజర్ నమాజ్ అజాం మైకుల్లో వినిపిస్తున్నది. నల్గొండలోని ఘడియాల్ చౌరస్తాలో ముప్ఫై ఏళ్ల ఖలీల్.. కోల్పోయిన తన అస్తిత్వం కోసం నిరసనకు కూర్చున్నాడు. అతని వెనకాల.. 'మా అమ్మీకి న్యాయం కావాలి'; 'మేరా వతన్ నల్గొండ అని ఎలుగెత్తి చాటాలి'; 'సాంప్రదాయక దుర్మార్గం నశించాలి' అని రాసి ఉన్న ప్లకార్డులు ఉన్నాయి.

అప్పుడప్పుడే ఆటోవాలాలు, వ్యాపారులు, నమాజుకు, వాకింగ్‌కు, జిమ్‌కు వెళ్తూ.. ఖలీల్‌ను చూసి, దగ్గరికి వచ్చి ఆరాలు తీస్తున్నారు. అతని పక్కనున్న మిత్రుడు సంతోష్ వాళ్లకు సమాధానం చెబుతున్నాడు.

'ఘరేలు మస్లా హైతో చారోమే బైఠ్కే బాత్ కర్లేనా.. మగర్ యే క్యా తరీఖా?' అంటూ.. కొందరు ముక్కువిరుస్తూ గబగబా నమాజుకు వెళ్తున్నారు.

'ఉన్కో అల్లా కభీ మాఫ్ నహీం కరేగా'.. సైకిల్ మీదున్న ఓ తెల్లగడ్డం పెద్దాయన విసుక్కుబోయాడు.

'అయ్యో.. ఇంత అన్యాయమా? మనుషులేనా వాళ్లు? నీకు అండగా మేముంటం బ్రదర్!' అంటూ ఖలీల్ భుజం చరిచాడు మానవ హక్కుల ఉద్యమనేత శంకర్. ఆయన మాట ఖలీల్‌కు నిట్టాడంత ఆదెరువిచ్చింది.

నిరసన తెలుపుతున్న ఖలీల్ కళ్లు ఎర్ర గోర్జాల్లా ఉన్నాయి. ముప్ఫై ఏళ్ల క్రితం తన తల్లికి జరిగిన అన్యాయం తాలూకు గతమంతా నిక్షిప్తమై, న్యాయంకోసం ఎదురు చూసీచూసీ అలసిపోయినట్టుగా కూడా ఉన్నాయి.

ఏ న్యాయశాస్త్రంతో అన్యాయం జరిగిందో దాంతోనే న్యాయం పొందాలని పట్టుదలగా వచ్చాడు.

అలా కొయ్యబొమ్మలా శూన్యంలోకి చూస్తున్న అతని దృష్టి.. ఘడియాల్ చౌరస్తా నుంచి దక్షిణం వైపు కనిపిస్తున్న ఫీల్‌ఖానా వైపు మళ్లింది. ఆ ఫీల్‌ఖానా.. తనకెప్పటినుంచో ఫీలింగ్స్ అన్నీ బంధీ అయిన ఖానాలా కనిపిస్తుంది!

ఖలీల్‌ది నిజామాబాద్ జిల్లా గోపాల్‌పేట్ గ్రామం. నిన్నే నల్గొండకు వచ్చాడు.

'ఇన్నేండ్లల్ల జరగని న్యాయం ఇప్పుడు జరుగుతదని అనుకుంటున్నవా?

మనం ఎప్పుడన్న మాట మర్యాదకు నల్గొండకు పోతే కుక్కలను ఎలగొట్టినట్టు ఎలగొట్టిర్రు. అత్తమ్మకు, మీకు జరిగిన అవమానాలు సాలయా? వాళ్లు తేమలేని రాళ్లే! వాళ్లల్ల ఆ గురాతనం ఎప్పటికీ రాదు. పైసకోసం పియ్యి తినే మన్సులు. నా మాట ఇని రేషం మానుకో. వాళ్లతాన పైస ఉంది, పరపతి ఉంది. అంతకుమించిన దీన్వాలాలు వాళ్లు. మనం వాళ్లతోని ఎన్లగూడ పోటీవడలేం. మన రాత గింతే అనుకోరాదు. మనకిద్దరు పిల్లలున్నరు. ఇంత ఎవుసం, టైలర్ దుకాణం ఉంది. గదే మనకు ప్రాప్తం అనుకో. ఇప్పుడు వోయి నువ్వాడ పోరాటం జేసినా ఏం కాదే. మిమ్ములను ఎన్నో అరిగోసలు వెట్టిన వాళ్లు ఎన్ని హజ్‌యాత్రలు చేసచ్చినా.. దోజఖ్‌కే పోతరు' అన్న భార్య సమీనా మాటలు తన చెవుల్లో ఇంకా మారుమోగుతూనే ఉన్నాయి.

అయినా ఏదో ఆశ, గత ముప్పై ఏళ్లుగా తన మదిలో లార్వాలా మసలుతున్న సంకల్పం అది. అస్తిత్వం కోసం, న్యాయంకోసం సుదీర్ఘంగా అమ్మ ఎదరు చూసీచూసీ.. అలసిపోయి తనువు చాలించిన రాచపుండులాంటి సలపరం అది.

రెక్కల కష్టాన్ని తప్పితే దేన్నీ నమ్ముకోని ఆ తల్లికి అన్యాయం ఎట్లా జరుగుతది? ఆ తల్లి పిల్లలమైన తమ పక్షంగా న్యాయం నిలవాల్సిందే! న్యాయదేవతకు స్త్రీ రూపమే కదా!? అట్లాంటి సాటి స్త్రీకి ఇంత అన్యాయం జరిగినంక ఎట్లా ఊకుంటది?

ఇన్నేసి ప్రశ్నలు బట్టీమీద కడాయిలో బెల్లం పాకంలా అతని అంతరాన్ని కుతకుతా ఉడికిస్తున్నాయి.

నాన్నను తలుచుకొని అమ్మ ఆకాశానికి ముఖం పెట్టుకొని గొడోమని ఏడ్చిన ఆ సందర్భాలను, కాయాకష్టం చేసి బొబ్బలెక్కిన అరచేతులు, చెప్పుల్లేక నడిచి కాయలు కాసిన ఆ కాళ్లు, దూదిలాంటి మెత్తటి అమ్మ మనసును ఎన్నోసార్లు కత్తిగాట్లకు గురిచేసిన ఆ దుస్సంప్రదాయపు పైశాచికత్వం.. అన్నిటికీ ఇవాళ సమాధానం చెప్పాలనుకుంటున్న అతని మనసు నిండా మొక్కవోని ఆత్మవిశ్వాసం.

తెల్లారింది. వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి. అప్పుడే ఈవార్త నల్గొండ అంతా పాకిపోయింది. జనాలు అక్కడికి హోరెత్తడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

ఇంతలో..

'ఏందయ్యా.. ఏ ఊరు నీది? ఏంటి ఈ న్యూసెన్స్?' అక్కడికొచ్చిన సీఐ రవి ప్రశ్నించాడు.

'న్యాయం కావాలి సర్..' అంటూ, తనవద్ద ఉన్న అమ్మానాన్నల పెళ్లినాటి నిఖానామా ఎరుపురంగు పుస్తకాలు, కోర్టులో అమ్మ కేసు వేసిన కాగితాలను

చూపించాడు.

'నువ్వు వెంటనే లాయర్‌ను కలవాలయ్యా. ఇది కరెక్ట్ కాదు' అన్నాడు సీఐ.

'సామాన్యుడికి నిరసన తప్పితే వేరే దారిలేదు సర్. మొండిగా మారిన న్యాయాలు, చట్టాలు నిరసనతోనైనా పదునెక్కుతాయనే నమ్మకంతో వచ్చిన సార్' నింపాదిగా అన్నాడు.

అప్పటికే ఎండ ఖణఖణలాడుతున్నది. టిఫిన్ కూడా చెయ్యలేదు. సంతోష్ తెచ్చిన ఇడ్లీల ప్యాకెట్ మీద ఈగలు వాలుతున్నాయి.

ఖలీల్ అనుకున్నట్టుగానే ఫీల్‌ఖానా నుంచి అతని నెంబర్‌కు కాల్స్ వస్తున్నాయి.

'మర్యాదగా ఎట్లా వచ్చినవో అట్లనే ఎల్లిపో! మానిన గాయాన్ని మల్ల గెల్కకు!' అంటూ గద్దిస్తున్నారు.

ఖలీల్ తన ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టేశాడు.

రెండోరోజు కూడా అతని నిరసన కొనసాగుతున్నదక్కడ. మహిళా మండలి సభ్యులు కూడా అతనికి మద్దతు తెలుపుతున్నారు.

మీడియావాళ్లు వచ్చి వార్తలు కవర్ చేస్తున్నారు. దీంతో ఈ వార్త తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. జాతీయస్థాయిలోనూ హాట్‌టాపిక్‌గా మారింది.

తమకు జరిగిన అన్యాయం గురించి మీడియాలో గొంతెత్తాడు ఖలీల్. పరదాల మాటున సాంప్రదాయక రాక్షసత్వాన్ని దాచి.. అమ్మతోనే శాశ్వతంగా భూస్థాపితం చెయ్యొద్దని, ఏదైతే అమ్మ సమాధిపై ప్రతిన బూని వచ్చాడో.. దాన్ని ఇవాళ బహిర్గతం చేస్తున్నాడు.

'మా నాన్న పేరు ఖయ్యూం. అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌ల ఏడీఏ. నల్గొండ నుంచి రెండువందల కిలోమీటర్ల దూరంల ఉన్న మా గోపాల్‌పేట్ ఫారంలకు నాన్నకు తబాద్ల అయింది. ఆ ఫారంలకు కూలీ పనులకు పోయే అందమైన మా అమ్మను జూశి మనసువడ్డడు. ఇద్దరూ ప్రేమించుకున్నరు. కొన్నిరోజులకు పెద్దమన్సులను ఒప్పిచ్చి నిఖా జేసుకున్నడు. నాలుగేండ్లల్లనే నేను, మా తమ్ముడు పుట్టేసినం.

నాన్నకు ఆల్రెడీ పెండ్లి అయి.. మాకన్నా పెద్దగ ముగ్గురు కొడుకులు, ఒక బిడ్డె ఉందన్న విషయం అమ్మకు తెల్సి శానా బాధవడ్డదట. మా పెద్దమ్మ గూడ భర్తను రెండో స్త్రీతోని పంచుకునుడును అస్సలు యాక్సెప్ట్ చెయ్యలేదు. పల్లెటూర్ల పుట్టిపెరిగిన అమ్మకు సాంప్రదాయాలు, ఆచారాలు అంతగనం తెల్వాయి. పెద్దమ్మకు అన్నీ తెల్సు. 'గోషాపర్దా, నమాజ్, జికర్ లేదు. ఛూ! ఏం ఆడిదమ్మ' అని తిట్టేది. చిన్నప్పటిసంది అమ్మకేమో.. 'కష్టవడితే గానీ కడుపులకు రాదు! తప్పు జేస్తే అల్లా

మాఫ్ చెయ్యడు' అనే తెల్సు. శుక్రవారం తానం జేసి గా ఒక్క నమాజ్ సదువుడు, ఏవో కొన్ని సూరాలు.. గంతే తెల్సు. గా తెల్వనితనమే వాళ్లకు ఆయుధమైంది. మా మర్మన్న అన్నలు గూడ అమ్మను అసహ్యించుకునేటోళ్లు. సాంప్రదాయాలకు మేము బ్రాండ్ అంబాసిడర్లం అన్నంత బిల్డప్ ఇచ్చేటోళ్లు.

అట్లుండంగ.. అకస్మాత్తుగా ఒకరోజు నాన్న గుండెనొప్పితోని సచ్చిపోయిండు. సీతారాముల వనవాసం 14 ఏండ్లయితే.. అమ్మానాన్నల సహవాసం ఏడేండ్లే! అటెన్క అమ్మకు బతుకంతా వనవాసమే చేసిర్రు వాళ్లు!

ప్రకృతి ఒడిల పుట్టిపెరిగిన అమ్మకు నాన్న పోయినంక సాంప్రదాయాల కట్టడైన ఆ ఇంట్ల అస్సలు ఉండబుద్ధికాలేదు.

'ఊరికి పోతా!' అన్నది.

'ఈడినుంచి వోయి ఎవనితోనో పోతవ్.. పోరగాండ్లను ఆగం జేస్తవ్. సప్పుడుదాంక ఈడనే ఉండు'.. పెద్దమ్మ మాట అమ్మ మనసును ఎల్లత్తబొంగును ఒక్కపెట్టున కమ్మకత్తితోని ఫక్కున చీల్చినట్టయ్యింది.

కట్టుబొట్టు, తనకొచ్చే పల్లెయాస నుంచి.. ఇట్ల ప్రతీ విషయంల వాళ్లు తనకు ఆంక్షలు పెట్టుడు, ఎక్కిరిచ్చుడు, కొత్తగా ఏదో నేర్పుడు..

'సువ్వర్‌దానా!' అనుడు, పనిమనిషిలాగ ట్రీట్ చేసుడుతోని.. 'పుల్సీరాత్ కా రాస్తా!' అంటే ఇదేనేమో అన్న ఫీలింగ్ వచ్చిందక్కడ. ఊపిరి ఆడకుంటైంది.

ఒకరోజు లారీడ్రైవర్ అయిన మా మామ వాళ్లకు మంచిగనే సంజాంచినా.. 'రౌడీ లెక్కున్నడు' అన్నరు.

వేషభాషలను సూశి మన్సులను డిసైడ్ చేసేటంత పైస, ఆచార సాంప్రదాయాలకు తామే సొక్కమైన వారసులం అనుకునే అహంకారం.. పైపెచ్చు పెద్ద సదువులు సదువుకున్నం అనే పొగరు వాళ్ల నరనరాన ఇంకిపోయింది.

అక్కడ మనలేనని ఖచ్చితంగా అనుకొని మమ్మల్ని తీసుకొని అమ్మ పుట్టింటికే వచ్చేసింది. ఏ సుట్టపక్కాలు గూడా ఏం జెయ్యలేకపోయిర్రు.

మల్ల అమ్మ కూలీ అవతారమెత్తి మమ్మల్ని పోషించింది. తమ్ముడు టీచర్ జాబ్ జేస్తున్నడు. నేను టైలర్. నాన్నకు రెండో భార్య అయిన అమ్మకు ఆస్తిల సగం వాటా న్యాయంగా రావాలి గదా? ఇయ్యుమని అడుగుతే ఇయ్యమన్నరు. నాన్న చేసిన ఉద్యోగాన్ని కూడా పెద్దమ్మనే మల్చుకొని పెన్షన్‌ల గూడా పాలు ఇయ్యలేదు.

దీంతోని అమ్మ కోర్టుల కేసేసి రెండుమూడేండ్లు కోర్టుల సుట్టు తిరిగింది. తనకు అంత స్థోమత లేదు, ఏం తెల్వది. లాస్టుకు.. 'డెబ్బై వేలిస్తం కేసు ఎన్కకు తీస్కో!' అన్నరు. అమ్మీ ససేమిరా అన్నది. దీంతోని హైకోర్టుల లాయర్‌గ జేస్తున్న పెద్దమ్మ వాళ్ల అన్నతోని గల్సి.. శానా అన్యాయంగా కేసును నీరుగార్చింది. చట్టం

దృష్టిల ఫలానా ఖయ్యూం సాబ్‌కు ఒకతే భార్య, ఆ నలుగురు పిల్లలే ఉన్నరు. రెండో భార్య లేదు, మేము లేమని కోర్టు ద్వారా తీర్పు ఇప్పిచ్చి.. మా అస్తిత్వాన్ని బొందవెట్టి, కేసును క్లోజ్ చేపిచ్చిర్రు.

ఆ తీర్పుతోని అమ్మ సగం సచ్చిపోయింది. మనసు మొరంగడ్డ అయిపోయింది.

'మనసులతోని ముడిపడ్డ మా బంధాన్ని ఈ కాగితాలు, కత్వలు ఎట్ల ఏరు జేస్తయి?' అన్న ప్రశ్న అమ్మను లైఫ్‌లాంగ్ ఏడిపిచ్చింది.

తను ఎవరి భార్య? మేము ఎవరి పిల్లలం? అనే ప్రశ్న మా ఎదుగుదలల పొడసూపింది. మా భవిష్యత్తు మీద బండమోపింది.

షరియా సట్టాలన్నా న్యాయం చేస్తయేమో అంటే.. అవి గూడా మమ్మల్ని అక్కడికే రావాలన్నయి.

'వో బాజారీ ఔరత్‌కో హమ్ దీన్ సిఖాకే సుధారీంగే' అని అత్యంత కర్కషంగా మాట్లాడిర్రు.

అమ్మకు ఆ బంగారు పంజరంలకు పోవాలని లేదు. షరియా సట్టాలు గూడా సాంప్రదాయక ముసుగేసుకొని స్త్రీని అణగదొక్కే పురుషహంకారాన్ని ఇంకిచ్చుకున్నయని అమ్మకు సమజైంది.

'ఈ జన్మకింతే, వాళ్లతోని గెల్వలేం' అనుకొని మా ఎదుగుదలను, నాన్న ఫొటోను చూసుకుంట అమ్మ ఆ గాయాన్ని మెల్లగ మర్చిపోవట్టింది.

కానీ, తాను సచ్చిపోయినంక నాన్న పక్కకు బొందవెట్టాల్నని, గదే తన చివరి కోరికని అన్నది నాతోని. తమ ప్రేమబంధాన్ని మట్టిలోనైనా శాశ్వతం చేసుకుందామని అనుకున్నది.

బాధే జీవితంలా గడిపి వృద్ధాప్యంల అమ్మ సచ్చిపోయినప్పుడు నల్గొండల ఉన్న కనీస్ అన్నకు ఫోన్ జేస్తే నిర్దాక్షిణంగా ఫోన్‌కట్ చేసిండు.

అట్ల అమ్మ అటు చట్టం దృష్టిల ఖయ్యూంసాబ్ భార్య కాకుంట, ఇటు భర్త పక్కన సమాధి కాకుంటనే.. అస్తిత్వం కోల్పోయి ఆ అల్లా తానికి పోయింది. మరి ఆయన గూడా సాంప్రదాయాలు పాటిచ్చేటోళ్లే తనకు ప్రీతి అంటడు గదా!? ఈ అల్లా ప్రీతి ఏందో ఏమో? మరి అమ్మను అక్కడ గూడా ఆయన వేధిస్తున్నడేమో తెల్వది? అయినా.. నేను గవన్నీ నమ్మ. అమ్మకు న్యాయం చెయ్యాలని ఒట్టుతోని నేనిక్కడికచ్చిన' అంటూ ఖలీల్ భారంగా నిట్టూర్చాడు.

తన శ్వాసలో రాళ్లు అడ్డం పడుతున్నట్టు అనిపించింది.

ఇదంతా వార్తల్లో వచ్చినా.. తను ఎవరినుంచైతే న్యాయాన్ని కోరుకుంటున్నాడో.. వాళ్లెవరూ అటువైపు రావట్లేదు. కానీ, ఖలీల్‌కు కాల్స్,

వాట్సాప్ మెసేజులు పంపిస్తూ బెదిరిస్తున్నారు.

'మామా.. వాళ్లు చానా డేంజర్ గాళ్లున్నరు. ఫేమస్ అవుతవ్‌గనీ.. న్యాయం జరుగుతదని అనిపిస్తలేదు' భయంగా అన్నాడు సంతోష్.

ఆ మాటలు విన్న ఖలీల్ పెదాలమీద ఓ వైరక్తిక నవ్వు. ఆ నవ్వులో.. వెన్ను చూపేదే లేదని.. తన ప్రాణం అడ్డు పెట్టయినా ఏదో ఒకటి తేల్చుకోనిదే ఈ నల్గొండ నుంచి వెనకడుగు వేసేదేలేదని స్పష్టంగా కనిపిస్తుననది.

దృఢాత్మవిశ్వాసం అతని ఊపిరిలో ఉచ్ఛ్వాసనిశ్వాసమవుతున్నది.

కుదురుగా ఉన్న తమ కూసాలు కదిలిపోతున్నాయి. ఇన్నాళ్లు ఎవరికీ తెలియని చేదునిజం ఇవ్వాళ్ల అందరికీ తెలిసి తమ పరువంతా పోతున్నది.. అనుకొని కనీజ్, రియాజ్, ఫైజాన్ మరికొందరు మనుషులతో రాత్రిపూట అక్కడికొచ్చారు.

'కుచ్ దీన్ కే బారేమే మాలుమాత్ హువాతో యే షైతానీ చాల్ నై కర్తేరే తుమ్ లోగాం'..

కనీస్ మాటలు ఖలీల్ రక్తాన్ని మరింత ఉడికించాయి. గడ్డం పెంచిన వాళ్ల నుదుర్ల మీద నల్లని మచ్చలున్నాయి. ఐదు పూటలా నమాజ్ చదువుతారు. కానీ, ఖలీల్ వాళ్లకు పూర్తి వ్యతిరేకంగా ప్యాంటు, షర్టులో ఎలాంటి గడ్డం, మచ్చలేకుండా ఉన్నాడు.

వాళ్లనుంచి అవే సాంప్రదాయక చీదరింపులు. మానవత్వం కోసం దీన్ కావాలా? దీన్ మానవత్వాన్నే కదా బోధిస్తున్నది? ఈ అణచివేతకు అంతులేదా? దీన్ వాళ్ల దానవత్వాన్ని యాక్సెప్ట్ చేస్తుందా? నిరంకుశత్వాన్ని సహకరిస్తుందా? మాకింత అన్యాయం చేసి వాళ్లు హజ్‌యాత్ర చేసి రావడం కుబూలా? అసలిదంతా ఆ పైవాడు చూస్తున్నాడా? చూస్తూ మౌనం నటిస్తున్నాడా?

ఖలీల్ మనసులో ప్రశ్నలు?

నిరసన మానకుంటే చంపేస్తామన్నారు. అయినా ఖలీల్ బెదరలేదు. నిండా అమ్మ ఉన్న ఆ గుండెను మరింత నిబ్బరం చేసుకున్నాడు.

అయితే ఫీల్‌ఖానాలో ఉన్న కొంతమంది పరోక్షంగా ఖలీల్‌కు మద్దతు తెలుపుతున్నారు. కనీజ్ తన పలుకుబడిని ఉపయోగించి ఎమ్మెల్యే, ఎంపీలతో చివరికి రౌడీలతో కూడా బెదిరించాడు.

అయినా ఖలీల్ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో వెనకడుగేసే ప్రసక్తే లేదనుకున్నాడు. ఎందుకంటే ఈ విషయం మీద తనకు సోషల్ మీడియాలో, ప్రత్యక్షంగా, పరోక్షంగా లభిస్తున్న మద్దతే కారణం.

* * *

ఈ క్రమంలో అడగకున్నా వరాలిచ్చే దేవదూతలాగా శాంతి అనే అడ్వకేట్

వచ్చింది. తన అస్తిత్వ పోరాటంలో చేయూతనిచ్చింది. ముప్పై ఏళ్ల క్రితం తాహేరాబేగం దిగువ కోర్టు ప్రొసీడింగ్స్‌లో కావాలని గైర్హాజరు అయినట్లుగా చిత్రీకరించి.. ఆమె కేసును నీరుగార్చిన తీరును గమనించింది. ఆ కేసును రీటేక్ చేసి హైదరాబాద్లోని హైకోర్ట్‌లో వాళ్ల అమ్మ తరుపున అప్పీల్ వేసింది.

కోర్టు తీర్పు వచ్చేవరకు తన శాంతియుత నిరసన అక్కడే కొనసాగుతుందన్నాడు ఖలీల్.

అప్పీల్ వేయడంలో ఆలస్యాన్ని మన్నించమని, దిగువ కోర్టు కళ్లకు గంతలు కట్టి మోసపూరితంగా కేసును రద్దు చేయించిన తీరును హైకోర్టు గమనించాలని ఆధారాలతో ప్రార్థించింది శాంతి.

చివరికి శాంతి శ్రమ ఫలించింది. తాహేరాబేగం, ఖయ్యూం నిఖానామాను హైకోర్టు సరైనదిగా గుర్తించింది.

'భౌతికంగా లేని తాహేరాబేగంను.. ఖయ్యూం రెండో భార్యగా కోర్టు గుర్తిస్తున్నది. వారి నిఖా చట్టబద్ధంగానే జరిగింది' అంటూ తీర్పిచ్చింది.

ఆ తీర్పును విన్నాక మందంగా, పటిష్ఠంగా ఉన్న మౌనమైన గోడను ఒక్కపెట్టున గుద్ది బద్దలు చేసినంత సంబురమైంది ఖలీల్‌కు! సమాధైన సత్యం లేచి ఊపిరి పీల్చుకున్నట్టయ్యింది!!

ఆకాశానికి అశ్రులుజాచి, ఆర్ద్రంగా చూస్తూ..

'అమ్మీ నువ్వు ఖయ్యూంసాబ్ భార్యవే. నీకు న్యాయం జరిగిందమ్మీ' అన్నాడు ఆకాశానికి చిల్లులు పడేంత గట్టిగా గర్జిస్తూ.

తండ్రి ఆస్తుల కోసం కేసు వేద్దామన్న శాంతి గారి సలహాను సున్నితంగా తిరస్కరించాడు ఖలీల్.

'మాకు ఆస్తులు ఏమద్దు. నా జన్మ సార్థకం చేసుకున్నా. కోర్టు అమ్మను ఖయ్యూం సాబ్ భార్య అన్నది గదా! ఇగ మా అమ్మీ జన్మ, సావు ధన్యమైనట్టే! గదే నాకు కోట్ల ఆస్తితోని సమానం. వాళ్లతాన దీన్, దౌలత్ రెండు నిండుగ ఉన్నయి గదా.. అవిటిని మాకు పంచియ్యకుంట వాళ్ల దగ్గర్నే ఉంచుకోనియ్యుర్రి. కాకపోతే నాది ఇంకొక కోరికేందంటే.. నాన్న సమాధిని మాకు సూపించాలె. ఆయన సమాధి మీద ఇన్ని పూలేసి మా జన్మగూడ ధన్యమైందనుకుంటం. అట్లనే ఈ తీర్పును మసీదుల మైకుల్ల కెల్లి ఈ నల్గొండ మొత్తం ఇనిపించాలె' అన్నాడు ఉబికొస్తున్న దుఃఖాన్ని పంటి బిగువున అదుముతూ.

ఖలీల్ అభ్యర్థనకు ఫీల్‌ఖానా జనమంతా పచ్చజెండా ఊపారు. కనీజ్ వాళ్లు మాత్రం తీవ్ర అవమానం జరిగిందన్నట్టు అసలు ఇంట్లోంచి బయటికి రాకుండా ముఖం చాటేశారు.

* * *

'రంజాన్, బక్రీద్ పండగలకు నాన్న సమాధి మీద కాసిన్ని పూలు వేసి.. దరూద్ చదువుతానా!?' అన్న తన ఎన్నో ఏళ్ల కల ఇవాళ నెరవేరుతున్నది!

రాళ్లు ఊడిపోయి ఉన్న నాన్న సమాధి మీద పడి బోరున విలపిస్తున్నారు అన్నదమ్ములు.

పూల నక్షత్రాలను గుమ్మరించి తమ కన్నీటి అత్తరును ఆ సమాధిపై ధారపోశారు.

తండ్రి గుండెల మీద పసివాడిలా సమాధిపై పడి గుక్కపట్టినట్టే ఏడ్చేస్తున్నాడు ఖలీల్. అతని దుఃఖాన్ని ఆపడం ఎవరితరమూ కావడంలేదు.

చాలా సేపటికి తేరుకొని సమాధి పైనుంచి రెండు దోసిళ్ల మట్టిని తీసి సంచిలో వేసుకున్నాడు.

'ఆ మట్టిని తీస్కపోయి ఏం జేస్తవయ్యా?' అక్కడున్న వారిలోంచి ప్రశ్న.

'అమ్మ సమాధి మీద వోస్త. అట్లనన్న అమ్మ.. నాన్న పక్కకు సమాధి అయిననని అనుకుంటదేమో. ఇది నా సెల్ఫ్ సాటిస్ఫాక్షన్ కోసమే!' అన్నాడు.

మనిషి మనుగడకు శాశ్వత చిరునామా అయిన ఈ మట్టిలోనే వాళ్లను శాశ్వతంగా మమేకం చేస్తున్నానన్న ఆత్మసంతృప్తి అతని గుండెల నిండా.

* * *

మర్నాడు నల్గొండలోని మసీదుల మైకులన్నింట్లోంచి అందరికీ తెలిసేలా ఆ కోర్టు తీర్పును చదివి వినిపించారు.

'అన్యాయమైన బతుకు అట్లా చరిత్రల సమాధి కావొద్దు. అది ఎప్పటికైనా బయటికచ్చి కొన ఊపిరితోనైనా కనీసం గొంతు విప్పాలె. న్యాయం కోసం పోరాడాలె. పదిమందికి తెల్వాలె. అట్లా తెలిస్తేనైనా ఇంకెవరైనా అసుంటి అన్యాయం ఆడోళ్లకు చెయ్యరు' ఖలీల్ మనసులోని మాట నిజమైంది.

అవే మైకుల్లో..

'మేరా బాప్ ఖయ్యూం' అని తన వతన్, మాయిముంత అయిన నల్గొండ మట్టిలోని పరమాణువులకు, దిగంతాల్లోని నాన్న ఆత్మ చెవులకు సైతం వినిపించేలా బిగ్గరగా అరిచాడు. అలా అరవగానే అతని ఎదలో పెనుతుఫాను తగ్గాక తొలగిన మబ్బుల చాటునుంచి నీలాకాశపు నిర్మలత్వం ఆవరించింది.

అతని శరీరంలోని అణువణువూ అస్తిత్వపు సొబగులు అద్దుకొని విజయగర్వంతో ఉప్పొంగసాగింది.

నా దేశం, నా మాతృభూమి అని అన్నంత గర్వంగా.. 'నా పితృభూమి' అని ఆ నల్గొండ నేల మీద సాష్టాంగపడి గాఢంగా ముద్దుపెట్టాడు.

* * *

*పుల్సిరాత్ కా రాస్తా = నరకపు దారి, దీన్ = ఇస్లాం సంబంధిత, ఘరేలూ మస్లా = ఇంటి వ్యవహారం, మాలూమాత్ = ఎరుక, సూరాలు = స్తోత్రాలు, ఎర్ర గోర్జాలు = గురువింద గింజలు*

## హుమాయూన్ సంఘీర్

రచయిత జీవితంలో ఎదురైన ఒక పెద్ద సంఘర్షణకు అక్షరరూపమే.. 'మేరా బాప్ ఖయ్యూం' కథ. కథా రచయితగా, నటుడిగా, దర్శకుడిగా సుపరిచితులు హుమాయూన్ సంఘీర్. కామారెడ్డి జిల్లా గోపాల్‌పేట్ ఈయన స్వస్థలం. ప్రస్తుత నివాసం హైదరాబాద్. ఇప్పటివరకు 60 కథలు, 3 నవలలు రాశారు. కామునికంత, ఇల్లింతపండ్లు, మేరా బాప్ ఖయ్యూం పేరుతో మూడు కథా సంపుటాలను వెలువరించారు. ఇక సినిమారంగంలోనూ సహ రచయితగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం.. రెండు సినిమాలకు రచనా సహకారంతోపాటు ఒక సినిమాకు కథ, మాటలు అందిస్తున్నారు. రచయితగా.. అనేక కథలు, నవలల పోటీల్లో బహుమతులు అందుకున్నారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం కథల పోటీ–2022లో 'ఇబ్లీస్' కథకు మొదటి బహుమతి దక్కించుకున్నారు. ఉషా పత్రిక – సుజనా ఫౌండేషన్ నవలల పోటీలో 'కళంకం' నవలకు బహుమతి వచ్చింది. 'కామునికంత' పుస్తకానికి కొలకలూరి భాగీరథీ పురస్కారం–2023, 'ఇల్లింతపండ్లు' పుస్తకానికి డా.వేదగిరి రాంబాబు కథానిక పురస్కారం–2024 అందుకున్నారు.

**94411 17051**

# లచ్చిమి

## కటుకోజ్వల ఆనందా చారి



ఈ లోకానికి వెలుగును, వేడిమినీ విరామం లేకుండా పగలంతా అందించిన సూర్యుడు అలసినట్లున్నాడు. ఎర్రబడ్డ ముఖాన్ని తిప్పుకొని తిరుగు పయనమవుతున్నాడు. పక్షులన్నీ ఎంతో క్రమశిక్షణతో తమ గూళ్లకు చేరుతున్నాయి. దేహబడలికతో మంచమెక్కిన ఆకాశం ముసుగేసుకుంటోంది. దారులన్నీ ఇంటిదారి పట్టాయి. నీటి తొట్టి దగ్గర నిలబడి ఉన్న కుక్కలు రొట్టెముక్క వాసనతో అలానే నిలబడి అటూ ఇటూ చూస్తున్నాయి. సోమ్లా కాళ్లూ చేతులు కడుక్కుంటున్నాడు. మట్టిలో పని చేయటం వల్ల నల్లగా మారిన శరీరం అంతా ఎరుపు రంగులోకి మారుతోంది.

'కాయ్ కరీచి? దసేక్ పీయర్ పానిలా.. ఆజ్ కామ్ వారుయేగో'..

(ఏం జేస్తున్నవ్? గిన్ని మంచినీళ్లు తేరాదు.. ఇవ్వాళ పని ఒంటినిండా పడ్డది. ఆ) అంటూ పిలిచాడు లచ్చిమిని.

'మార్ హాత్ నకామ్ చేయ్! ఆటో భేల్‌రిచూ, తూజ్ మాయిదాన్ లియా!'..

(పిండి కలుపుతున్నానయ్యా! నా చేతులతో ఇయ్యలేను గాని, లోపలికి పోయి నువ్వేతెచ్చుకో)

జొన్నపిండిలో వేడినీళ్లు పోసుకుంటూ పిసుకుతున్న పిండిపై చూపును తిప్పుకోకుండానే జవాబిచ్చింది లచ్చిమి.

చేసేదేంలేక సోమ్లు లోనికెళ్లి మంచినీళ్లు తెచ్చుకుని, ఆ రేకుల షెడ్డు చివరగా ఉన్న బల్ల పీటమీద కూలబడ్డాడు. నీళ్లు తాగాక కొద్దిగా ప్రాణం నెమ్మదించింది. ఒకసారి లచ్చిమికేసి చూశాడు. నిశ్చలంగా ఉన్న లచ్చిమిని ఎప్పుడైనా చూశాడా? లేదు. ఎప్పుడూ ఏదో పనిలోనే ఆమె. పెండ్లయి ముప్పయి ఐదేండ్లు అయింది. నాతో వచ్చినప్పటి నుంచీ రెక్కలాడిస్తూనే ఉంది. ఇప్పుడిప్పుడు చీర కడుతోంది కానీ మొన్నమొన్నటి వరకూ కాళె తొడుక్కుని, ఫేటియా తొడుక్కుని, ఘూంఘాట్‌తో ముసుగేసుకునే ఉండేది. చూస్తూ చూస్తూ గతంలోని లచ్చిమి కళ్లలోకి వచ్చింది సోమ్లాకి.

ఆ అందమైన ముఖం. దిగులు కనపడని నవ్వు ముఖం. అద్దాలు పొదిగిన ఎర్రని రవికెపైన మెడలో వెండి కాసుల పేరు, పూసల గొలుసులు తళుక్కున మెరుస్తుండేవి. చెవులకు టోక్రీలు, ముక్కును మించిన ముక్కుపోగు, ఘూంఘాట్ ముసుగును చూస్తే రాజమందిరంలోని రాణిలా కనపడేది. ముంజేతి నుంచి దండల వరకు ఏనుగు దంతాలతో చేసిన గాజులు, కాళ్లకు కడియాలు, వడ్డాణం అన్నీ ధరించిన లచ్చిమి, మహాలచ్చిమిలాగే కనపడేది. వీటన్నిటికి కూడా అందాన్నిచ్చింది లచ్చిమి మనసే. నిజంగా ఎంత మంచి తోడును నాకిచ్చాడో ఆ భగవంతుడు.

బయటికి అరుసుద్ది గానీ, కలిపిన పిండిలాంటి మెత్తని మనసు దాంది.

'కాయ్ పిల్డోక పానీ? హై కాయ్ దే క్రోచి'..

(ఏందీ తాగినవా నీళ్లు? గట్ల కదలకుండా చూస్తున్నవేంది?).. గట్టిగనే అదిలించింది.

జ్ఞాపకాలలోకి పోయిన సోమ్లా వర్తమానంలోకి వచ్చాడు.

'ఆ.. ఆ.. పీల్డో'!'..

(ఆ.. ఆ.. తాగిన) అంటూ బదులిచ్చాడు.

నిజంగా జ్ఞాపకాలు ఎంత మధురంగా ఉన్నాయో! ఒంటి అలుపును మాయంచేశాయి. ముప్పై ఐదేండ్ల క్రితంలోకి పోయిన సోమ్లా, ఆ అనుభూతిని వదులుకోలేక పోతున్నాడు. ముక్కెరపైకి చూపు పోయింది..

మిగతావేమీ వేసుకోకున్నా, ఆ ముక్కెర మాత్రం ముక్కును పెట్టుకునే ఉంటుంది లచ్చిమి. ఆ ముఖం మీద ఉన్నందుకే దానికి అందం పెరిగింది. ఎలా మెరిసిపోతుందో... దాని తెల్లని ముఖం కన్నా, దాని తెల్ల మనసే నా కండ్లకు కనిపిస్తది. అప్పుడప్పుడు గొడవపడినా, మళ్లీ మామూలుగానే మాట్లాడుకుంటాం. ఎన్నిసార్లు తిట్టుకున్నా ప్రేమ మాత్రం తగ్గనేలేదు. ప్రేమకు భేదాభిప్రాయానికి సంబంధమే ఉండదు.

ఇవన్నీ మనసులో అనుకుంటూ ఊహల్లోకి వెళ్లిన సోమ్లాకు సమయమే తెలవలేదు. లచ్చిమి పిండి పిసికి, రొట్టెలు చేయటమూ, పెనంపై కాల్చటం చేస్తూనే ఉంది.

'భూక్ లాగిరీకోనిక ది బాటీఘాల్లేన్‌కో ఉదే ఓ గిన్నె మా బాజీ హై!'..

(ఆకలేయటం లేదా! రెండు రొట్టెలు పెట్టుకొని తిను. అగో ఆ గిన్నెల తోటకూరుంది)..

లచ్చిమి సోమ్లా ఆకలి గురించి మాట్లాడుతూ చెప్పింది.

'హా.. సరే!'..

(ఊ సరే!) అని సోమ్లా ఆలోచనలకు శుభం పలికి, ఆకలి లోకంలోకి

వచ్చాడు. ప్లేటు తీసుకుని రొట్టెలు పెట్టుకుని తింటున్నాడు.

ఇల్లందు నుంచి కారేపల్లి పది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మండల కేంద్రమది. చుట్టుపక్కల అనేక తండాలుంటాయి. సోమ్లా, లచ్చిమిలది దగ్గరలో వున్న భాగ్యనగర్ తండా. కారేపల్లికొచ్చి చాన్నాళ్లయింది. సోమ్లా రోజు కూలీకి పోతాడు. లచ్చిమి సాయంత్రం రొట్టెలు చేసి అమ్ముతుంది. రొట్టెలు బాగుంటాయని చెప్పి చాలామంది అక్కడికొచ్చి తింటుంటారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కూలీలు బాగానే వస్తారు. వాళ్లిద్దరి ఆదాయంలోంచే కూడబెట్టి ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశారు. ఒక్కగానొక్క కొడుకును చదివించారు. బంధువుల అమ్మాయినే చూసి పెళ్లి కూడా చేశారు. కొడుకు సుందర్‌లాల్ బాగానే చదువుకున్నాడు. బ్యాంకు ఉద్యోగం వచ్చింది. హైద్రాబాద్‌లో కొడుకూ కోడలు ఉంటారు. ఏడాది క్రితమే కొడుక్కి పెళ్లి చేసి పంపారు. నెలకొకసారి కొడుకు అమ్మానాన్నల దగ్గరికొచ్చి ఒక రోజుండి, అమ్మ పెట్టే రొట్టెలు తిని వెళ్తడు. వచ్చినప్పుడల్లా పట్నం రమ్మని అడుగుతూనే ఉంటడు కొడుకు. లచ్చిమి, సోమ్లా.. 'వస్తాం, వస్తాం!' అని వాయిదా వేస్తూనే ఉన్నారు. మొదట్లో ఒకసారి పోయి వచ్చిన్రు. మొత్తంగానే వచ్చేయమంటడు గానీ, వీళ్లు దాని గురించి మాట్లాడనే లేదు.

'ఏమైంది తింటున్నావా?' రొట్టెలు కాలుస్తూనే అడిగింది లచ్చిమి.

'ఆ.. ఆ.. తింటున్న. సరే గానీ, సుందర్ ఎప్పుడొస్తనన్నడు. ఈ ఆదివారమేనా?' కొడుకు గుర్తుకొచ్చి ఆరా తీసిండు సోమ్లా.

కొడుకు అన్ని విషయాలూ తల్లి దగ్గరే చెబుతాడని ఆయనకు తెలుసు. అందుకే లచ్చిమినడిగి తెలుసుకుంటున్నడు.

'అవును, వాడు వచ్చే ఆదివారం వస్తనన్నడు'.

'మరి కోడలు పిల్ల రాదా?'.

'ఏమో అడక్కపోయినవా!'.

'నేనెందుకు అడుగుత, నీతోనే అన్నీ చెబుతడు గదా! నువ్వే అడుగు!'.

'అడుగుతనే ఉన్న. ఎన్నిసార్లడిగినా ఏదో ఒకటి చెపుతుండు'.. రొట్టెలు కాలుస్తూనే మాట్లాడుతోంది లచ్చిమి.

సాయంత్రం ఏడు గంటలు దాటింది. ఒక్కొక్కరు జొన్న రొట్టెలు తినడానికి వస్తూనే ఉన్నరు. కొందరు ఇంటికి పార్సిల్ తీసుకుపోతున్నరు. రాత్రి తొమ్మిదిన్నర దాకా నడుస్తూనే వుంటది.

'నీ కోడలు గురించి చెబుతలేగని గా సారుకు రెండు రొట్టెలు కట్టియ్యి!'.. భర్తను పురమాయించింది లచ్చిమి.

రోజూ ఓ మూడు గంటలు చేతికింద పనిచేసే పనిపిల్ల రాకపోవటంతో కొద్దిగ

ఒత్తిడి పెరిగింది లచ్చిమికి. పదింటికల్లా చేసిన రొట్టెలన్నీ అమ్ముడు పోయినయ్. ఇద్దరు కలిసి అన్నీ సదిరేశారు. కాళ్లూచేతులు, ముఖం కడొక్కుని, తనకోసం ఉంచుకున్న ఓ రొట్టె కంచంలో పెట్టుకుని, ఆకుకూర వేసుకుని సోమ్లా పడుకున్న మంచం దగ్గరకొచ్చి కూసుంది లచ్చిమి. మనుషుల నడకలు తగ్గి, రోడ్ల మీద ప్రశాంతత ఆవరిస్తోంది. ఆకాశం, ఆకలి తీరిన మనిషి, మంచంలో కూలబడ్డట్టు నిద్రకు ఉపక్రమిస్తోంది. కానీ, గుండెలో ఎక్కడో అలజడిగా, మనాదిగా ఉంది లచ్చిమికి. కడుపులో ఉన్న ఆ రందిని సోమ్లాతో పంచుకోవాలనుకుంది.

'పడుకున్నావా?' అన్నది.

'లేదు.. చెప్పు. ఇందాక ఏదో చెప్పబోయావ్.. ఇప్పుడు చెప్పు'.

'ఏం లేదు. కుటుంబాలకు తెల్సిన పిల్ల, కల్సిపోయినట్లు ఉంటదని బంధువుల ఇంట్ల పిల్లనే చేసుకుంటిమి'.

'అయితే ఇప్పుడేమైంది!'.

'వాడు చెప్పింది ఏమీ ఇనటం లేదటయ్యా! ఊరికే.. 'అది కావాలి, ఇది కావాలి' అని విసిగిస్తున్నదట'.

'ఇయ్యాల్రేపటి పిల్లలు గట్లనే ఉన్నరు. చిన్నగ చెప్పుకోవాలి. గదేం పెద్ద సమస్యనా!'.

'అది కాదయ్యా! రోజూ షాపింగ్‌లకు తిరుగుతదట. సంప్రదాయంగా డ్రెస్సులు, నగలు వేసుకోదట'.

'ఇప్పుడెవరు సంప్రదాయకంగా ఉంటున్నారులే! సదువుకున్నోళ్లాయే!'.

'చెప్పేది ఇననే ఇనవ్! కోడలెందుకు రాలేదని అడుగుతవ్'.

'ఆ.. చెప్పు'.

'ఏం జెప్పాలి! మనం తినే జొన్నరొట్టెలు, కూరలను కూడా.. 'ఛీ! ఛీ!' అని అసయించుకుంటదట! నేనింట్లో మన ఆచారం ప్రకారం ఉంటనని, పాషన్‌గా ఉండమనీ రానంటుందట. అంతేకాదు, ఇంట్లో ఎప్పుడన్న మన భాష మాట్లాడితే, ఉంకోసారి మాట్లాడొద్దని కోప్పడుతోందట. ఫోన్లో నాతో మాట్లాడినా చిర చిరలాడుతోందట. మన తిండి, కట్టుబొట్టు, మాట, పండుగ, పబ్బం, మర్యాద అన్నీటికీ దూరంగా ఉండాలని కోరుకుంటోందట!'.

'నాగరికం మనుషులు కదా! అట్లనే ఉంటరు. మనవేమీ మంచిగనిపించవు. అంతా పైకే ఉంటున్నయ్ చూపులు. ఏం చేస్తాం!'.. ఏం చెప్పాలో అర్థంకాక కోడలు తీరుపై వ్యాఖ్యానం చేశాడు సోమ్లా.

'పడాయి వేజా జెర్ పచ గోరేవున ఆప్ని వాతే కూడి వేజాకు (సదువుకోంగనే మన భాష, మనకు అసయ్యమేస్తదా!) చిన్నప్పటి నుంచి వాడికున్న తిండి

అలవాట్లను మర్సిపోవాలా! ఈ ఊరూ, తండాల్లోంచే కదా మన బతుకు మొదలయింది. పుట్టినూరును, అమ్మ మాట్లాడే బాసను వొదులుకోవాలనుకుంటరా! ఇదేం, బాగు పట్టం!' రొట్టె తినబుద్ధికావటం లేదు లచ్చిమికి.

'పెండ్లయి యాడాదే ఆయే! 'ఇంట్లోకి ఆ సామాను కావాలి. ఇది కావాలి. కారెప్పుడు కొంటారు!' అని ఒకటే పోరట. దీంతో గొడవలు, తిట్టుకోవడం కూడా మొదలైందట. వాడు చెప్పిన కాన్నుంచి నాకొకటే బాధవుతోంది' అంటూ నిట్టూరుస్తూ చెబుతోంది లచ్చిమి.

'సరే ఇప్పుడవ్వన్నీ ఎందుకులే! తర్వాత మాట్లాడుదాం. నువ్వు ముందు రొట్టె తిను' భార్యను సముదాయించాడు సోమ్లా.

'ఈకాలం పిల్లలు జర షోకుగా, మంచిగా ఉండాలనుకుంటారు. మన కుటుంబంలోదే గదా! నేటి కాలపు పిల్లగాండ్ల కోరికలు అట్లనే ఉంటున్నయి. అందరితోని వాళ్లూ! ఏంజేస్తం. కాలం నాగరికత మారుతోంది కదా! నువ్వు బాధపడితే ఏం లాభం. మనకు చాతనైంది చెప్పాలి. లేదంటే వొదిలేయాలి. వాళ్లే తెలుసుకుంటరు. పట్నంలో సెల్‌ఫోన్లలో, కళ్లు జిగేల్‌మనే సరుకులు, వస్తువులు, కొనకుంటే మనం మనుషులమే కావేమో అని భ్రమలు కలిగిస్తయి. వాళ్లు మాత్రం ఏం జేస్తరు. ఈ మార్కెట్ ప్రపంచం ఆడించే బొమ్మలు వాళ్లు!' అని సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు సోమ్లా.

లోపల ఆయనకూ బాధ ఉన్నా, భార్య బాధ పోగొట్టే ప్రయత్నంగా కొన్ని మాటలు చెప్పాడు.

'నా బాధే కాదు! వాడు కూడా బాధపడవట్టే. 'మన తీజ్ పండుగొచ్చింది. పోదాం మనింటికి, తండాలో అందర్ని ఒకసారి కలిసొద్దాం' అన్నాడట. 'నువ్వుపోతే పో.. నేను రాను!' అని మొండికేసిందట. పండగంటే నలుగురం కలిసి ఉండటమే కదా! గది కూడా తెల్వదా గీ సదువుకున్నోళ్లకు. ఎక్కడికి మనం ఎగబాకినా, కాళ్లు నేల మీదనే ఉండాల. మరీ చిత్రం చేస్తున్నరు. మనుషుల్లేని నాగరికం ఏం నాగరికం!' అంటూ, ఆయన మాటల్ని తిప్పికొట్టింది లచ్చిమి.

కొంత ఆవేశం, ఆవేదన తగ్గినా, కోడలు చేస్తున్నది సరికాదనే వాదన మాత్రం పోలేదు ఆమెలో.

చిన్నగా ఉన్న రొట్టె ముక్కనూ బలవంతాన మింగి, నీళ్లు తాగింది లచ్చిమి. సోమ్లా ఇక ఏమీ మాట్లాడలేదు. ఇంటి ముందరి తలుపులు పెట్టి, సోమ్లా పక్కగా వచ్చి పడుకుంది లచ్చిమి. పడుకుంటూనే..

'ఎల్లుండి వాడు వస్తనన్నడు. మనల్ని కూడా రమ్మంటున్నడు' మెల్లిగా

వినిపించింది సోమ్లాకు.

'ఎందుకిప్పుడు మనం అక్కడికి? సరే సరే! వాడొచ్చినంక ఆలోచిద్దాం. పడుకో!' అని మాటలకు ముగింపు చెప్పాడు సోమ్లా.

* * *

అమ్మను కౌగిలించుకున్న కొడుకునూ, బిడ్డను అట్లనే గట్టిగ పట్టుకుని, చెమ్మగిల్లిన కళ్లతో, ప్రేమను కురిపిస్తున్న ఆ తల్లిని చూస్తూ సోమ్లా అలా అక్కడే ఆగిపోయి నిలుచున్నాడు. ఈ రోజు కొడుకు వస్తాడని పనికి ఎగనామం పెట్టాడు. తల్లి ఇల్లంతా సర్ది, పొద్దటి నుంచీ కొడుకు కోసం ఎదురు చూస్తూనే ఉంది. కొడుకు రాగానే అమ్మకున్న ప్రేమేంటో ఎరుక పడుతోంది.

'ఎట్లా ఉన్నావమ్మా.. ఆరోగ్యం బాగుందా?'.

'నాకేంది బిడ్డా.. బాగానే ఉన్న. నువ్వెట్లున్నవ్?'.

'బాగున్నానమ్మా!' అని బదులిచ్చి, నాన్న దగ్గరికెళ్లాడు సుందర్.

'ఎట్లా ఉన్నవు నాన్నా!' అని కౌగిలించుకున్నాడు.

'బాగున్నారా నాన్నా! మాకేమయింది. బాగున్నమ్! కోడలమ్మ బాగుందా?'.

'బాగుంది. మేమంతా బాగానే ఉన్నం'.

'లోపటికి రా! బ్యాగు ఆడపెట్టు, కాళ్లూ చేతులు కడుక్కో.. ఎప్పుడు బయల్దేరినవో ఏమో! అన్నం పెడతా.. పా!' అంటూ సుందర్‌ను లోపలికి తీసుకెళ్లిపోయింది తల్లి.

కొడుకు భోజనం చేస్తుంటే, తల్లిదండ్రులిద్దరూ అక్కడే కూర్చొని క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకుంటున్నరు. కొడుక్కి ఇష్టమైన కూరలు చేసింది లచ్చిమి. భోజనం పూర్తిచేసి చేతిని కడుక్కుని వచ్చి కుర్చీలో కూచున్నాడు సుందర్.

'కోడలిని తోలుకు రాకపోయినవ్ బిడ్డా! ఒక్కతి ఎట్ల ఉంటది' తల్లి ప్రశ్నించింది.

'వాళ్ల స్నేహితులతో ఈరోజు మీటింగ్ ఉందట. వాళ్లందరూ ఈరోజు కలుసుకుంటున్నారంట. అందుకే రాలేదమ్మా!' అని సమాధానం చెప్పాడు. 'సరే! ఇద్దరు బాగున్నారా!' చిన్నగా అడిగింది.

'ఆ బాగానే ఉన్నాం' తృప్తిగానే బదులిచ్చాడు సుందర్.

'అది రావటం.. నేను రావటం కాదమ్మా! మీరే రావాలి. అసలు మీరిక్కడెందుకు ఉండటం. మా దగ్గరే ఉండండి. నేను సంపాదిస్తూనే ఉన్నాను కదా! మళ్లీ మీరు రొట్టెలు చేయాలా? ఏంటి నాన్నా.. నువ్వు ఇంకా కూలికెళ్లాలా? పడ్డ కష్టం చాలు. నేను చెపుతున్నట్లు మీరిద్దరూ నా దగ్గరికి వచ్చేయండి. ఎన్నిసార్లు చెప్పినా, మీరు వినట్లేదు. ఈ పనులన్నీ మానేసి వచ్చేయండి. హాయిగా జీవితాన్ని

గడపండి’ సుందర్ క్లాస్ తీసుకుంటున్నాడు.

‘ఈ మారుమూల ఊర్లో ఉంటే.. గబుక్కున వైద్యం కావాలంటే ఎట్ల? ఆరోగ్యం బాగాలేకపోతే ఎవరు చూస్తారు! ఇంకా మీరు పని చెయ్యాలా.. కూలికి పోవాలా..! రొట్టెలమ్మాలా..!’ కొద్దిగా విసుగ్గానే, నిష్ఠూరంగానే సుందర్ ఇద్దరినీ నిలదీస్తున్నాడు. తన వెంట రమ్మని అడుగుతున్నాడు. తల్లిదండ్రులు కష్టపడకూడదనే ప్రేమ సుందర్‌లో ఉంది. అయితే, భార్య మాటలూ కొంత ప్రభావితం చేయటమూ ఉంది.

నెల రోజులకొకసారి వచ్చిపోయే కొడుకుతో.. రాగానే ఈ గొడవెందుకని ఇద్దరూ మౌనంగానే ఉండిపోయారు. ఏమీ మాట్లాడటం లేదు.

కొద్దిసేపు అయిన తర్వాత.

‘ఈ హోటల్.. అన్నీ తీసేయండి! హైద్రాబాద్ వచ్చేయండి!’ తిరిగి నొక్కి వక్కాణించాడు సుందర్.

‘బిడ్డా! రొన్నెళ్ల క్రితం ఓసారి వచ్చినం పట్నానికి. గప్పుడు నాల్గు రోజులే ఉండలేకపోయినం. మొత్తం ఇక్కడంతా మూసేసి రమ్మంటే, అక్కడే ఉండమంటే ఎట్ల! మేము ఉండగలుగుతమా! నువు చెప్తున్నది మా మీద ప్రేమతోనే.. కానీ...’ చిన్నగా కొడుకుకు తమ నిస్సహాయతను వివరించింది లచ్చిమి.

‘కానీ లేదు ఏమీ లేదు. ఈ పనులు మానేయండి. నేను చెప్పేది వినండి’ మళ్లీ అదే చెప్పాడు సుందర్.

‘ఏం చేయాలి మేమక్కడికి వచ్చి? ఊరికే కూసొని ఉండటం మావల్ల అయితదా? తినుడు పండుడు గంతేనా!’ ఒక వాక్యం లచ్చిమికి జోడించాడు సోమ్లా.

‘మీరీ పని చేయటం బాగాలేదు నాన్నా! అమ్మా ఇంకా గా జొన్నరొట్టెలు చేసి అమ్మడమేంది? ఈ పల్లెల్లో చాకిరి చేస్తూ ఉండటం వద్దు! నేను బ్యాంకు మేనేజర్‌ను. మీ కోడలు బీటెక్ ఇంజినీరు. మాకు నామూషీగా ఉంటుంది. వద్దని చెబుతున్నాగా..’ అసలు విషయాలను మనసు కక్కేసింది. విసిగిపోయిన సుందర్ ఉన్నది ఉన్నట్లు చెప్పేశాడు.

ఒక్క రెండు నిమిషాలు మౌనం దాల్చింది ఆవరణం. లచ్చిమి భర్త వైపు చూసింది. ఏ రకమైన భావన లేనట్టే ముఖం పెట్టాడు. ఇల్లూ, హోటలు, దర్వాజలోంచి బయటికి చూసింది చిన్నగా.. లచ్చిమి. తనని కప్పుకొన్న ఆవరణమది. తనని నింపుకొన్న తలం అది. కొడుకు వైపు చూసింది.

‘నాయనా సుందర్.. మాకు పని చేయటం కష్టం కాదురా! అది మా బతుకులో భాగం. ఎవరూ లేరని నువ్వనుకుంటావు కానీ, మాకు తోడున్నది గీ

పనే. పనే మా జీవితం. పొద్దున్నే లేచి, మీ కడుపుల్లోకి ఏదో ఒకటి తయారు చేసి, వండి పెట్టాలని ఇన్నేండ్లూ మనసులో అనుకుంటూనే చేసి పెట్టాను. అందుకనే మీరు పెరిగిన్రు.. పెద్దగయిన్రు. మీ పని మీరు చేసుకుంటున్నరు. ఎక్కడోళ్లక్కడ ఎళ్లిపోయిన్రు. మాతోనే ఉన్నది మా రెక్కలేరా! ఇవి ఆడుతూనే ఉన్నయ్! పని మాకు కష్టంకాదు బిడ్డా! నువ్వు ఏడాది నుంచీ రమ్మంటున్నవ్. కానీ, మాకు కుదరదు. ప్రతి సాయంత్రం జొన్న పిండి పిసకందే, చేతులు ఊరుకోవు. రొట్టెలు చేయన్నాడు చేతులు పడిపోయినట్లుంటది. అసలు చేతులే లేనట్లుంటది!'..

తల్లి తన అనుభవాన్ని అంతరంగాన్ని చెబుతుంటే సుందర్‌కు ఆశ్చర్యంగా అనిపించింది. తల్లి ముఖాన్ని తీక్షణంగా చూశాడు. సోమ్లాకు కొద్దిగ కొత్త విషయాలే.. భలే మాట్లాడుతోందే లచ్చిమి అనుకుని ఆమెనే చూస్తున్నాడు.

కొద్దిగా ఆగి మళ్లీ..

'జొన్నరొట్టె మన ఆహారం మాత్రమేకాదు, ఆచారం కూడా. రొట్టె చేయటం నామూషీ అయితే.. దాన్ని తినడమూ అంతే అవుతుంది. నాకెంత సంతోషంగా ఉంటది. నేను రోజూ చేసి పెడుతున్న రొట్టెల కోసం ఎంతోమంది ఎదురుచూస్తూ ఉంటారు. వాళ్ల ఆకలికి, నా పని కడుపు నింపుతోందంటే ఆనందం నాకు. మీకు వండిపెట్టినపుడూ అదే తృప్తి పొందాన్నేను. డబ్బులిచ్చే కొనుక్కుంటారు. కానీ, రొట్టెలు బాగుంటాయని వాళ్లు సంతోషపడటం చూస్తే నాకు ఆనందంగా ఉంటది. రొట్టె ఎక్కడైనా దొరుకుతుంది. కానీ, నువ్వు తినాలని పెట్టేవాళ్లు దొరకడం కష్టం. ఈ రెండు సంతృప్తులకు నేను అడ్డాగా నిలుస్తున్నాను. ఈ రొట్టే, ఈ పనే నాకీ ఆరోగ్యాన్నిచ్చింది. పనికూడా ఒక అవాటే బిడ్డా! అది మన తరతరాల సంప్రదాయం. ఇప్పుడు నేను పని మానితే.. నేను నేనుగా ఉండటమే కష్టమవుతది. పరిసరాల అనుకూలతలలోనే మనిషి బతుకుతడు. బతకడానికి తిండొకటుంటేనే సరిపోదు. ఇక్కడి నేల, మట్టి, మనిషి, నిప్పు, రాయి, మొగ్గ, చెట్టు, పుట్ట, పువ్వు పుట్రా, కుక్క, పిల్లి అన్నీ నా సుట్టాలుగానే అనిపిస్తది. కాళ్లూరెక్కలాడినంత కాలం ఇక్కడే ఉంటం. మీ బతుకుదెరువు కోసం మీరు పోయిండ్లు. పోండి. కానీ, బతుకునిచ్చిన, మట్టినీ, మనిషినీ, బంధాన్ని సంప్రదాయపు అనుబంధాల్ని గౌరవించండి! మన ఇష్టమున్న తీరుగనే బతకాలి. కానీ, ఎవరినీ కష్టపెట్టవద్దు. బాసతోని, బతకటానికి నిజాయతీగా చేసే పనితోని మన విలువలు తగ్గిపోవురా.. చేయకూడని పనులు చేస్తేనే సిగ్గుపడాలి!'..

రోజూ రొట్టెలు తినేవాళ్లతో మాట్లాడీ మాట్లాడీ లచ్చిమి లోకజ్ఞానం బాగానే సంపాదించింది.

తల్లి చెబుతుంటే నిర్ఘాంతపోయి వింటున్నాడు సుందర్. యూనివర్సిటీలో

ప్రొఫెసర్ పాఠం చెబుతున్నట్లు అనిపించింది. నిజంగా అమ్మ నాన్నల ప్రాణం ఎక్కడ ఉందో అర్థమయింది సుందర్‌కు. కుర్చీలోంచి లేచి.. కళ్లలో నీళ్లు తిరుగుతున్న అమ్మ చేతులు పట్టుకున్నాడు.

'నన్ను క్షమించమ్మా! మీరిక్కడే ఉండండి! నేను బలవంతం చేయను. మీకే ఇబ్బంది వచ్చినా నాకు చెప్పండి. సరేనా!' అని లేచాడు.

'ఈ రకంగా నా భార్యకు నేనెందుకు చెప్పలేకపోయాను. వివరించలేకపోయాను'.. అని మనసులోనే అనుకున్నాడు సుందర్.

లచ్చిమి ఏం చెప్పిందో అది నిజం.

నేను లచ్చిమితోడే.. సోమ్లా కూడా మనసులోనే లచ్చిమిని కౌగిలించుకున్నాడు.

లచ్చిమి పెద్దగా సదువుకోలే. మనుషుల మధ్య సంబంధాలలో తనను తానుగా రూపుదిద్దుకుంది. నాగరికతలోని విషయాలు, సౌకర్యాలు, సమస్యలూ ఆమెకు తెలవకపోవచ్చు. కానీ బతుకు సారమేంటో, ఎలా బతకాలో, బతుకులోని విలువేంటో తెలుసు. తరతరాలుగా వస్తున్న కొన్ని సంప్రదాయాలు అనివార్యంగా మారిపోతవి. కొన్ని అనవసరం అయిన వాటిని వదిలించుకోవాలి కూడా. కానీ ఏవయితే మనిషిని మనిషిగా నిలబెట్టవో, మనుషుల మధ్య అనుబంధాలను పెంచుతవో వాటిని కొనసాగించాలి. లచ్చిమి అందుకు నిలువెత్తు నిదర్శనం.

* * *

## కటుకోజ్వల ఆనందా చారి

స్వస్థలం ఖమ్మం. ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, 2019లో ఉద్యోగ విరమణ చేశారు. నాలుగు దశాబ్దాలుగా సాహిత్యరంగంలో కృషి చేస్తున్నారు. ఇప్పటివరకూ 20 కథలు రాశారు. 'ధిక్కార గళం మన కాళోజీ', 'మహోన్నతుడు మార్క్స్' పేరుతో కాళోజీ నారాయణరావు, కార్ల్ మార్క్స్ జీవిత చరిత్ర పరిచయాలను రచించారు. 'మొలక', 'స్ఫూర్తి శిఖరం' కవితా సంపుటాలను వెలువరించారు. 1999 నుంచీ సాహిత్య సభలను నిర్వహిస్తున్నారు. 'సాహిత్య ప్రస్థానం' అనే సాహిత్య పత్రికకు 12 ఏండ్లపాటు సంపాదకవర్గ సభ్యుడిగా పనిచేశారు. 2016లో సినారె చేతుల మీదుగా 'ఉత్తమ కవి' బహుమతి సత్కారం పొందారు. 2020లో నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీలో 'గస్సాల్' కథకు ప్రథమ బహుమతి అందుకున్నారు. –99487 87660



# కిష్కింధ కాండ

**చందు తులసి**

'ప్రాకారముల బద్దలు చేసి,
ద్వారబంధముల ధ్వంసము చేసి
సుందరమైన అశోకవనమును..
చిందరవందర చేసేను మారుతి..

శ్రీహనుమాను గురుదేవులు నా యెద పలికిన సీతారామ కథ.. నే పలికెద సీతారామ కథ!'..

హనుమంతుడు లంకా దహనం ఎలా చేశాడో వర్ణిస్తూ.. సుందరకాండ ఆలపిస్తున్న ఎం.ఎస్ రామారావు గొంతు రాములవారి గుడి మైక్ లోనుంచి ఊరంతా వినిపిస్తోంది. రోజూ ఆ పాటలు వినపడగానే నిద్రలేవడం ఆ ఊరి జనానికి అలవాటైపోయింది. అందరిలాగే ఎంకన్న కూడా లేచి.. సగం నిద్ర మత్తులోనే నడుచుకుంటూ కొట్టంలో ఉన్న ఆవులకు మేతవేయడానికి పోతున్నాడు.

ఇంతలోనే ఒక్కసారిగా ఆకాశంలో హఠాత్తుగా ఉరిమి, పిడుగు పడ్డట్టు.. 'ఢమ ఢమ ఢమ'.. అంటూ వాళ్ల రేకుల ఇంటిపైన పెద్ద చప్పుడు. అంతకుముందే నిద్రలేచి ఇంటిపని చేసుకుంటున్న ఎంకన్న భార్య, ఇంకా నిద్రలేవని ఇద్దరు పిల్లలే కాదు, చుట్టుపక్కల జనం కూడా.. ఉలిక్కిపడ్డారు.

ఆ రేకుల ఇంటిపైనుంచి గుంపులు గుంపులుగా పోతున్న కోతులు. 'కిచ కిచ కిచ.. కీర్ కీర్'.. అంటూ నలభై, యాభై కోతులు ఒక ఇంటిమీది నుంచి ఇంకో ఇంటిమీదికి దుంకుతున్నాయి. అలా దుంకుతున్నపుడు వీధీదీపం వెలుగులో.. పెద్దగా, పొడుగ్గా సాగినట్లు ఉన్న ఆ నీడలు.. కోతుల నీడలు భయంకరమైన దయ్యాల్లాగా కనిపించాయి.

'తెల్లారక ముందే ఊరిమీద పడ్డాయిరా కోతుల మంద..' అని తిట్టుకుంటూ పెద్ద వెదురు కట్టె పట్టుకుని..

'హొయ్, హోయ్'.. అంటూ వాటిని తరమసాగాడు. చుట్టుపట్టు జనంకూడా పెద్దపెద్ద గిన్నెలు, రేకు డబ్బాలు కొడుతూ.. భయంకర శబ్దం చేస్తూ.. తరుముతున్నారు.

కోతులు ఏమాత్రం భయపడకుండా.. ఒక ఇంటి గాబు దగ్గర ఉన్న ఎంగిలి గిన్నెలు, రాత్రి మిగిలిన అన్నం కోసం వంట పాత్రలు.. ఏది దొరికితే అది

అందుకుని ఉరుకుతున్నాయి. కేబుల్ టీవీ వైర్లమీద ఊగుతూ, ఎగురుతూ, దూకుతూ.. అల్లకల్లోలం చేసి ఇంకో బజారువైపు పారిపోయినయి. ఒక పెద్ద యుద్ధం ముగిసినట్టు ప్రశాంతంగా ఉంది అక్కడ.

* * *

ఎంకన్నకు నలభై ఏళ్లు ఉంటాయి. తండ్రి ఇచ్చిన మూడెకరాల భూమిని సేద్యం చేసుకుంటూ బతుకుతున్నాడు. పగలు, రాత్రి వ్యవసాయమే లోకంగా పచ్చని చెట్టులా బతుకుతున్నాడు. భార్య ఎల్లమ్మకు కూడా చేను తప్ప ఇంకో ముచ్చట తెల్వదు. ఈ కోతుల గోల లేకముందు.. అంటే, ఐదేళ్ల కిందట.. ఎకరం వరి పొలం, ఇంకో ఎకరం పత్తి, మరో ఎకరం వేరుశనగ పంట సాగుచేసేవాళ్లు. ఈ కోతుల గోల మొదలై నాలుగేళ్లు అయింది. ఏ పంటను దక్కనిస్తలేవు. వేరుశనగ చేనులో.. పిందెలు పడకముందే ఒక్క రాత్రిలో చేను మొత్తం పీకిపారేస్తయి. పత్తి చెట్టు పిందెలను పీక్కతింటయి. ఆఖరికి వరిపొలాన్ని కూడా కొరికికొరికి తింటున్నాయి. వీటిని ఎట్ల వదిలించుకోవాల్నో అర్థం కావట్లేదు ఎంకన్నకు.

ఎంకన్న వాళ్ల ఊరి పక్కనే ఉన్న నది మీద.. పెద్ద డ్యాం కట్టడానికి పనులు చురుగ్గా జరుగుతున్నయి. పెద్ద కొండను బాంబులు పెట్టి పేలుస్తున్నరు. ప్రొక్లెయినర్లతో కాలువలు తవ్వుతున్నరు. చీమల బారులా నిత్యం రోడ్లమీద భారీ లారీలు, టిప్పర్లు. ప్రాజెక్టు పని అయిపోతే.. తమ ఊరితోపాటూ చుట్టుపక్కల ఊళ్లకు నీళ్లు వస్తాయని.. భూముల ధరలు పెరుగుతాయని సంబరపడుతున్నారు రైతులు. ఎంకన్నకు మాత్రం ప్రశాంతంగా అడవిలో బతికే కోతులు ఈ ప్రాజెక్టు వల్లనే.. ఊళ్ల మీదపడ్డాయని కోపంగా ఉంది.

ఎంకన్న చిన్నతనంలో కోతులు ఇంతగనం ఉండేవి కాదు. ఎప్పుడో ఒకసారి దారితప్పినట్టు కోతులు ఊళ్లోకి వచ్చేటియి. ఆ రోజుల్లో కోతి అంటే అదో ఇచ్చిత్రం. అట్లనే గారడీ చేసేటోళ్లు కూడా.. ఊళ్లో కోతిని ఆడించేటోళ్లు. కోతికి ఒక సద్దిమూట ఇచ్చి..

'నీ మొగనికి సద్ది తీసుకుని పో!' అని చెప్తే.. అది ఊరి పెద్దమనిషి ఒకాయన్ని గట్టిగా పట్టుకునేది. దాన్ని చూసి పోరగాళ్లు చప్పట్లు కొడుతూ పకపకా నవ్వేటోళ్లు. కానీ ఇప్పుడు.. కోతుల్ని చూస్తే దయ్యాల్ని చూసినట్టే జనం భయపడుతున్నరు.

పంట చేల మీదనే కాదు.. ఊరి మీదకూడా దాడి చేస్తున్నయి. పండుగ పూట అప్పలు చేయడానికి డాబాల మీద ఆరబెట్టిన బియ్యం, శనగపప్పులు కానీ కోతుల కంట్లో పడితే.. ఇంక ఆశ వదులుకోవాల్సిందే. నిమిషంలో మాయం చేస్తయి. కావలి ఉన్న చిన్నపిల్లలను, ఆడోళ్లను కూడా భయపెడతయి. ఓపాలి ఇంటి ముందర బియ్యం చెరుగుతున్న.. సాకలోల్ల శాంతమ్మ మీదపడి శాటెడు బియ్యం ఎత్తుకొని

పోయినయి. అంతెందుకు కుమ్మరోల్ల లక్ష్మమ్మ ఇంట్లె.. నానబెట్టిన బియ్యం గిన్నె కూడా ఎత్తుకొని పోయినయి. మంగళోల్ల భాగ్యమ్మ.. ఇంటికి తాళం వేసుకుని చేను కాడికి పోతే.. కిటికీలు నెట్టి లోపలకి జొరబడి ఇల్లు మొత్తం అల్లడంతల్లడం చేసినయట. దొంగలు పడ్డరేమో అని భాగ్యమ్మ ఏడ్పులు పెడబొబ్బలు. ఇంక ఇంటి కప్పుమీద బెంగళూరు పెంక ఉన్న ఇండ్లోళ్ల పరిస్థితి మరీ అధ్వాన్నమైపోయింది. గొల్లోళ్ల లింగయ్య ఇంటి పెంకలు మొత్తం ఊడబీకినయట. ఇంగ ఎంకన్నది రేకుల ఇల్లు. ఆ రేకుల మీద ఎగిరిఎగిరి దూకుతయి. ఆ చప్పుడు వాటికి సంబరంగా అనిపిస్తదో ఏమో. మల్లమల్ల అటూఇటూ దూకుతయి. ఇగ ఒంటరిగ ఆడోళ్లు, చిన్నపిల్లలు కనిపిస్తే వాళ్ల దగ్గర ఏమున్నా లాక్కొని పోతున్నయి. తాటిచెట్లు, ఈతచెట్ల మీదికెక్కి కల్లు మొత్తం తాగుతయి. లొట్లు పగలగొడుతున్నయి. ఇట్లయితే లాభం లేదని.. ఓపాలి ఊరంతా కలిసిగట్టుగ పోయి సర్పంచి మల్లారెడ్డికి ఫిర్యాదు చేసినరు.

'నేను ఈ ఊరి సర్పంచిని నిజమే! ఐతే నన్ను ఏం చేయమంటరు. కోతులకు కావలి ఉండమంటరా? లేకపోతే కోతులను పట్టుకొమ్మంటరా ఎట్లా..' అని ఎగతాళిగ మాట్లాడిండు.

ఇట్ల కాదని జనమే ఒక ఉపాయం చేసినరు.

'హైదరాబాద్ దగ్గర కోతులను పట్టేటోళ్లు ఉంటరట'.. అని చెప్పి, ఇంటికి ఐదొందలు చొప్పున లక్ష రూపాల దాకా వసూలు చేసినరు. ఆటో కట్టుకుని పోయి ఇద్దరు మనుషులను తెచ్చినరు. వాళ్లు అటు ఉరికి ఇటు ఉరికి ఓ.. యాభై కోతులు పట్టినరు.

'మీరు ఇచ్చిన యాభైవేలకు లెక్కసరిపోయింది!' అని.. యాభై కోతులను పట్టుకుని పోయినరు.

వసూలు చేసిన డబ్బులో యాభైవేలు కోతులు పట్టేటోళ్లకు, ఇంకో యాభై వేలు పెద్దమనుషుల తాగుడు పేరుతో మింగినరు.

'ఇట్ల కాదు.. మన పక్కూరు రామారంలో ఒక కొండంగిని తెచ్చినరట. కొండంగిని చూస్తే.. కోతులు జడుసుకుని ఆమడ దూరం పారిపోతయట!' అని దూదేకుల మస్తాన్ చెప్పిండు.

మరి కొండంగి యాడ దొరుకుతది అని జాడ తీస్తే.. యాడనో కర్ణాటక దగ్గర కొడంగల్ అనే ఊళ్లే కొండంగులు ఉంటయట. అందుకనే ఆ ఊరుకు కొడంగల్ అనే పేరొచ్చిందట. అది సరెగానీ ఊళ్లెకి కోతులైతే.. ఫ్రీగా వచ్చినయి కానీ.. మరి కొండంగి రాదుగద. దాన్ని కొనాలంటే యాభై వేలు కావాలంట. ఇగ మళ్ల.. ఇంటికి ఇంత అని వసూలు చేసినరు. కొండంగిని బస్సులనో, రైళ్లనో తీసుకుని రావడం

కుదరదు కాబట్టి.. ఒక కారు మాట్లాడుకుని దర్జాగా తెచ్చినరు.

ఇంగ అది ఊళ్లోకి వచ్చినపుడు చూడాలే సందడి. ఒక బ్యాండు మేళం, డప్పులు పెట్టి డాన్సులు ఏసుకుంటూ స్వాగతం పలికినరు కొండంగికి. మన ఊరికి ఏకంగా హనుమంతుడే దిగి వచ్చినడు అని ఊరి ఆడోళ్లు.. బిందెల కొద్ది నీళ్లు ఆరబోసి.. హారతిలు పట్టింద్రు. ఆ కొండంగి మొఖం నల్లగ.. అచ్చం జీడిగింజ ఉన్నట్టే ఉంది. దాని తోక ముల్లుగర్ర అంత.. బారెడు ఉన్నది. దాన్ని చూడంగనే చిన్నపోలగాండ్లు జడుసుకుని ఇంటికి ఉరికినరు.

ఆ కొండంగితోనే.. ట్రైనింగ్ ఇయ్యడానికి ఒక మాస్టర్ కూడా వచ్చినడు. ఆ మాస్టర్‌కి నెలకు పదివేల జీతం.. మూడూపూటల తిండి బాధ్యత కూడా ఊళ్లో వాళ్లదేనట. ఆయన కోతులను పట్టుడు ఏమో కానీ.. ఎప్పుడు చూడు.. ఫుల్లుగా నాటుసారా తాగి.. ఆ మాస్టరే ఒక కల్లు తాగిన కోతిలా చిందులేసేటోడు. రెండు రోజులు కొండంగిని చూసి కోతులు భయపడి ఇంకో బజారుకు పారిపోయినయి. కొండంగి ఒక వైపు ఉంటే.. కోతులు ఇంకో దిక్కు పోయేవి. ఆ తాగుబోతు మాస్టర్.. కొండంగికి కూడా సారా అలవాటు చేసిండు. మెల్లగ సారాయి మత్తుకు అలవాటు పడ్డ కొండంగి.. మాస్టర్ రెండుగ్లాసులు తాగితే అది నాలుగు గ్లాసులు తాగేది. ఆ సారా మత్తు ఎక్కడంతో ఫుల్లుగా నిద్రపోయేది. చివరకు ఓ రాత్రి పూట.. చైన్ ఊడబీక్కొని పారిపోయింది. మూడు రోజుల తర్వాత.. సారా మత్తు దిగిన ఆ మాస్టర్..

'మీ వల్లనే నా కొండంగి పోయింది.. లక్షరూపాయలు ఇయ్యాలె!' అని ఒకటే గోల.

చివరకు మళ్లా ఊరి జనమే తలా ఇంత వేసుకుని పదివేలు చేతిల పెడితే.. వెళ్లిపోయిండు. పోతుపోతూ రెండు పావులు సారా తాగడం మాత్రం మర్చిపోలేదు. కొండంగి పోయింది కానీ.. కోతులు మాత్రం అట్నే ఉన్నయి. మళ్ల కథ మొదటికొచ్చింది.

* * *

అందరి సంగతి ఎట్ల ఉన్న.. ఎంకన్న పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. అప్పుడే పత్తి చేనులో పిందెలు పడుతున్నయి. కోతులు చూసినయంటే పత్తి పిందెలన్నీ తెంపుతయి. అందుకనే పగటిపూట భార్య ఎల్లమ్మతో కలిసి కాపలా కాస్తున్నడు. రాత్రి పూట చేను చుట్టూ.. ఉన్న ఫెన్సింగ్ తీగకు కరెంటు వైరుతో కనెక్షన్ ఇచ్చిండు. ఆ రోజు అర్ధరాత్రి ఎందుకో ఎంకన్నకు మెలకువ వచ్చింది. నిద్ర పట్టలేదు. ఎక్కడినుంచో కోతులు అరుస్తున్న చప్పుడు వినిపించింది. కొంపదీసి పత్తిచేను దగ్గర గిట్ల ఉన్నయా? అన్న అనుమానం వచ్చి.. లేచి చేతికర్ర, టార్చిలైటు తీసుకుని

చేనువైపు పోయిండు. పత్తిచేను దగ్గరకి వచ్చి టార్చిలైట్ వేసి చుట్టూ చూసిండు. దూరంగా ట్రాన్స్‌ఫార్మర్ చప్పుడు.. గుయ్యిమంటూ వినిపిస్తంది. అంటే కరెంట్ ఉందని అర్థం. కోతుల జాడ కనపడకపోయే సరికి.. ఇంటికి పోదాం అనుకున్నడు. అంతలోనే చిన్నగా కోతి పిల్లల కేకలు వినిపించాయి. చీకట్లో చేను చుట్టూ టార్చిలైట్ వేసి చూశాడు. దూరంగా ఎక్కడో కోతుల మంద. చీకట్లో టార్చిలైట్ కాంతికి.. వరుసగా మెరుస్తున్న తెల్లని కళ్లు. కోతుల మంద దగ్గరికి వస్తోంది. ముందుగాల వాటికి నాయకుడిలా నడిపించిన కోతి.. దగ్గరగా వచ్చి ఫెన్సింగ్‌ను అనుమానంగా పట్టుకుంది. షాక్ కొట్టగానే వెనక్కు జరిగి మిగిలిన కోతులను.. 'పోవద్దు!' అన్నట్లు గట్టిగా అరుస్తోంది. కానీ, అంతలోనే రెండు పిల్ల కోతులు ఫెన్సింగ్ పైకి ఎక్కాయి. కరెంట్ షాక్ తగిలి గిలాగిలా కొట్టుకుంటున్నాయి. మిగిలిన కోతులు వాటిని లాగడానికి దగ్గరికి పోయి.. షాక్ తగిలి మొత్తుకుంటున్నాయి. నలభై యాభై కోతులు.. కిచ..కిచ.. అంటూ ఒకటే గోల! ఇంకొద్దిసేపు అలాగే ఉంటే.. ఆ రెండు పిల్లకోతులే కాదు. పదైనా పెద్ద కోతులు చనిపోతాయి. కానీ, మనసు ఒప్పుకోలేదు ఎంకన్నకు. గబగబ పరిగెత్తి.. కరెంటు కనెక్షన్ పీకేశాడు. భయంతో కోతులు అక్కడినుంచి పరిగెత్తాయి. మనసు ఎలాగో అనిపించి అక్కడే కూలబడ్డాడు. అడవి పందులు, జింకలు చివరకు పులిని ఐనా ఎదుర్కోవచ్చు కానీ.. ఈ కోతులను ఎలా ఎదుర్కోవాలో అర్థం కాలేదు. దూరంగా గుట్టల్లో బాంబు పేలిన శబ్దం. డ్యాం కట్టడం కోసం.. కొండను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఆ ప్రాజెక్టు కట్టడం అయిపోతే.. తమ ఊరు పొలాలన్నింటికి నీళ్లు వస్తాయని.. తమ భూముల ధరలు పెరుగుతాయని జనాలు అనుకుంటున్నారు. భూముల ధర సంగతి ఏమో కానీ.. పంటలు ఎలా కాపాడుకోవాలో అర్థం కాలేదు ఎంకన్నకు. అక్కడే చేను పక్కన ఉన్న బండమీద పడుకుని తెల్లవారు గట్ల ఇంటి బాటపట్టాడు.

ఊరి రచ్చబండ దగ్గర రావి చెట్టు కింద కూచొని కోతుల గురించే మాట్లాడుకుంటున్నరు.

'ఒకప్పుడు ఊరు ఎట్ల ఉంటుండే! ఎటు చూసినా పచ్చని చెట్లు. ఎండకాలం మామిడి పండ్లు, సీమసింత పండ్లు, తునికి చెట్లు, వానకాలం వస్తే ఎటుచూసిన పచ్చని చిగుళ్లు, చింతచెట్ల వానగాయలు, నేరేడు చెట్లు, తాటిపండ్లు.. శీతాకాలం నారింజ పండ్లు, సీతాఫలం చెట్లు, సంక్రాంతి సమయానికి ఇరగకాసిన రేగుపండ్లు.. ఇంగ జామకాయలు మూడు కాలాలూ కాసేటియి. అడవి జీవరాసుల ఆకలి తీరుతుండె. ఇప్పుడు రియల్ ఎస్టేట్ పేరుతోని భూమిని నాశనం చేస్తిరి. జీవరాసులు ఎట్ల బతకాలె. అడవిలే ఏం దొరకుతుంది తినడానికి!'.. అని టీచర్‌గా పనిచేసి రిటైరైన ధర్మయ్య సార్ ఇవరం చెప్పబట్టే.

'మరి ఇప్పుడు కోతుల గోల వదిలించుకోవాలంటే ఎట్ల సారూ!' అని అడిగిండు ఎంకన్న.

'వదిలించుకోవడం ఎట్ల కుదురుతది? ఈ భూమి మన ఒక్కరిదే కాదు కద. అన్ని జీవరాశులది కద! అట్లనే కోతులది కూడా. కాబట్టి వాటిని వదిలించుకోవడం కుదరదు. వాటితోని కలిసిబతకాల్సిందే'..

'కోతులు, మనుషులు ఎట్ల కలిసిబతుకుతరు'.. అర్థం కాలేదు ఎంకన్నకు.

'ఎందుకు బతకలేము. మన తాతలు, ముత్తాతలు అట్లనే కద బతికింది. కుక్కలు, పిల్లులు, పందులు, పాములు, కోతులు అందరు కలిసి బతకలేదా! ఎవల బతుకు వాళ్లు బతికితే ఈ భూమి మీద ఎవరికి ఇబ్బంది లేదు'.

'ఇంతకీ ఇప్పుడు ఏం చేద్దాం అంటరు సారూ' అని అడిగిండు ఎంకన్న.

'మన ఊరంతా తల ఇంత ఏసుకుని అరటి పండ్లు.. బత్తాయిలు.. ఇంట్ల ఏది చౌకగ దొరికితే అవి తెచ్చి.. ఊరిబయట ఒక తావుల పెట్టాలె. అట్ల ఒక వారం పాటు అలవాటైతే.. కోతులు రోజూ తిండికి అక్కడికే వస్తయి. అట్లనే తొందరగా పండ్లు వచ్చేటి.. సీతాఫలం చెట్లు, జామ చెట్లు ఊరిబయట బంజరు భూముల్ల.. రోడు పక్కన నాటించాలె. అట్ల వాటికి తిండి అడవిలనే దొరికితే ఊరి మీదికి రావు కద. అట్ల ఏ ఊరు కోతులు ఆ ఊళ్లోనే ఉంటే.. సమస్యే ఉండదు కద!'..

ధర్మయ్య సార్ చెప్పింది ఏదో మంచిగనే ఉందనిపించిది ఎంకన్నకు.

ఇంతలో మళ్లీ ప్రాజెక్టు బాంబు పేలుడు శబ్దం ఊరంతా ప్రతిధ్వనించింది. ఇంటి గోడలు, ఇంట్లో ఉన్న వంటపాత్రలు ఉలిక్కిపడ్డట్టుగా కదిలాయి. గుంజకు కట్టేసిన ఆవు.. భయంతో అటు ఇటూ తిరుగుతోంది. బాంబు పేలుళ్లు.. పెద్దపెద్ద ప్రొక్లెయినర్ల శబ్దాలు.. ఇరవై నాలుగ్గంటలూ రోడ్లమీద టిప్పర్లు.. వీటన్నిటిని చూస్తే.. ప్రాజెక్టు వచ్చాక భూముల ధరలు పెరగడం ఏమో కానీ.. ఊరంతా విధ్వంసం అవుతోందన్న భయం కలిగింది ఎంకన్నకు. పెద్దపెద్ద ప్రాజెక్టుల వలన మనుషులు బతుకుతరేమో కానీ.. కోతులతోసహా అన్ని జీవరాశులు, కొండలు, గుట్టలూ అన్నీ విధ్వంసం అవుతున్నట్టు కళ్లముందు కనపడుతోంది.

* * *

ఆరోజు పొద్దున్నే ధర్మయ్య సార్ పేపర్ పట్టుకుని అందరికీ చదివి వినిపిస్తున్నాడు. అది పిడుగు లాంటి వార్త అని జనానికి అర్థమైంది. తమ ఊరు దగ్గరలో కడుతున్న ప్రాజెక్టు ఎత్తు ఇంకా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందట. ఎత్తు పెంచడం వలన నీళ్ల ముంపు ప్రాంతం ఎక్కువగా ఉంటుందని.. అందుకే తమ ఊరితోపాటు ఇంకా రెండు గ్రామాలను ఖాళీ చేసి.. తరలిస్తామని ప్రభుత్వం ప్రకటించిందంట.

తరతరాలుగా ఉన్న ఊరు. పుట్టి పెరిగిన ఊరు. అన్నీ వదిలేసి ఇంకో తావుకి పోయి బతకాలె అంటే అయితదా!? గవుర్మెంటు డబ్బులు ఇవ్వొచ్చు. కానీ, డబ్బులు ఎంతకాలం ఉంటయి. ఎంకన్నలో కనపడని ఆందోళన మొదలైంది. ఆ రాత్రి మొత్తం నిద్రపట్టలేదు. తెల్లవారు ఝామున ఎప్పుడో చిన్న కునుకు.. ఇంతలో మళ్లీ ఒక్కసారిగా రేకుల మీద చప్పుడు.. కాకపోతే ఇప్పుడు కోతులు కాదు.. మనుషులు! తను, తన భార్య, పిల్లలు, తన ఊరివాళ్లు.. ఆ రేకుల మీద, ఇండ్ల మీద దూకుతూ పరిగెడుతున్నారు. ప్రశాంతంగా బతకడానికి ఇంత తావు కోసం..

'అమ్మా.. నాన్నా!' అంటూ పిల్లల ఆర్తనాదాలు.. పరిగెడుతున్నారు.. దూకుతున్నారు.

'కోతులు.. గుంపులు.. మనుషులు.. తావులు.. విధ్వంసం.. కోతులు.. బిడ్డా.. జాగ్రత్త..' అంటూ గట్టిగట్టిగా అరుస్తూ, కేకలు పెడుతూ ఊరిలోని వీధుల్లో ఉరుకుతున్నాడు ఎంకన్న.

* * *

## చందు తులసి

చందు తులసి అసలుపేరు చంద్రశేఖర్. సూర్యాపేట సమీపంలోని బండమీద చందుపట్ల స్వగ్రామం. హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 'చందు తులసి' కలం పేరుతో కథలు రాస్తుంటారు. ఈయన రాసిన మొదటి కథ.. 'ఊరవతల ఊడలమర్రి'. మంచి గుర్తింపు తెచ్చింది. నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం 'బతుకమ్మ'లో వచ్చిన పాలపిట్టల పాట కథ.. నేషనల్ బుక్ ట్రస్ట్ కథా సంకలనానికి ఎంపిక కావడమే కాకుండా.. ఇతర భారతీయ భాషల్లోకీ అనువాదమైంది. తల్లిగారిల్లు, నీళ్లబిందె, బతుకమ్మ పుట్టింది లాంటి కథలు పలు గుర్తింపు పొందిన కథా సంకలనాలకు ఎంపికయ్యాయి. సినిమారంగంలోనూ రచయితగా పనిచేస్తున్నారు. గతంలో గడి, తక్కెడ, మోదుగు పువ్వు, కాటుక పూల బతుకమ్మ.. కథలకు నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీల్లో బహుమతులు అందుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల జీవితాలను ప్రధాన ఇతివృత్తాలుగా తీసుకుని కథలు రాస్తుంటారు.

**–99855 83022**

# పోటెత్తిన అల



గండ్రకోట సూర్యనారాయణ శర్మ

నీలాకాశంలో ప్రకాశిస్తున్న చంద్రుడు.. తన వన్నెల వెన్నెలను ఆ ప్రదేశమంతా ఒలకబోస్తున్నాడు. ఆ వెన్నెల వెలుగులకు బిక్కబోయిన నక్షత్రాలు.. చంద్రుడితో పోటీపడలేక అతనికి దాసోహమన్నట్లుగా మిణుకు మిణుకుమంటున్నాయి. సముద్రతీరంలో కొందరు హాయిగా సేదతీరుతున్నారు. మరికొందరు యువతీయువకులు గుంపులు గుంపులుగా విహరిస్తున్నారు. కొంతమంది పిల్లలు ఇసుకలో ఆటలాడుతూ కేరింతలు కొడుతున్నారు.

అక్కడే కొంచెం దూరంగా వెల్లకిలా పడుకుని ఉన్న ఏడుకొండలు మనసులో సంతోషం సముద్రపు అలల్లా ఎగసిఎగసి పడుతున్నది. సముద్రం మీదినుంచి రయ్యిమంటూ వీచే గాలికి అతని తలవెంట్రుకలు చిందరవందరగా అవుతున్నా.. ఇసుక రేణువులు ఎగిరొచ్చి మీదపడుతున్నా అతను పట్టించుకోలేదు. పుట్టి బుద్ధెరిగినప్పటినుంచీ అతనికి ఆట పాటలన్నీ ఆ సముద్రంతోనే! నురగలతో నాట్యం చేస్తున్న ప్రియనేస్తమైన సముద్రమంటే అతనికి తగని ఇష్టం. ఆ సముద్రం తర్వాత మళ్లీ అతనికి మరో ప్రియాతిప్రియమైన స్నేహితుడున్నాడు. అతనే ఓబులేసు.

ప్రస్తుతం అతని మనసు సంతోషంతో ఉప్పొంగిపోవడానికి కారణం.. ఆ స్నేహితునినుంచి ఫోన్‌కాల్ రావడమే. చిన్నతనంలో తనతో కలిసి పెరిగిన తన స్నేహితుడు ముంబయిలో ఉన్నాడని మాత్రమే అతనికి తెలుసు. ఎన్నో ఏళ్లుగా ఒక్కసారి కూడా కనిపించని ఓబులేసు.. తననెప్పుడో మరిచిపోయి ఉంటాడని అతను అనుకున్నాడు.

అయితే.. 'అతని ఆలోచన అబద్ధం' అని రుజువు చేస్తూ ఒకరోజు అతనికో ఫోన్ వచ్చింది. అతను లిఫ్ట్ చేసి..

'హల్లో.. ఎవురూ?' అని అడిగాడు.

'ఎవరు మాట్లాడేది? ఏడుకొండలేనా?' అవతల నుంచి ప్రశ్న వచ్చింది.

'అవును! తమరెవురు?' అడిగాడతను.. కాస్త బెరుగ్గా.

'ఎవరేంట్రా.. నేను ఓబులేసుని. గుర్తుపట్టావా?' అన్నాడు అవతలి వ్యక్తి.

చిరపరిచితమైన ఆ గొంతు వినగానే అతనికి ఒక్కక్షణం నోట మాట రాలేదు. మెల్లిగా గొంతు పెగుల్చుకుని..

'ఎవురూ? ఓబులేసు గారేనా?' అనడిగాడు.

'ఒరే పూల్! 'గారు' ఏంట్రా? నేను నీ స్నేహితుణ్నిరా. నన్ను 'ఒరే ఓబులేసు' అని పిలవరా' అని వినిపించడంతో అతను ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

'నువ్వా.. నువ్వేనా? నేన్నీకు గుర్తున్నానా?' అనుమానంగా అడిగాడు.

'గుర్తుండటానికి నిన్నసలు మర్చిపోతే గదరా! అసలు విషయం ఏమిటంటే నేను వచ్చే బేస్తవారం నిన్ను కలవడానికి మన ఊరికి వస్తున్నా. అందుకే ముందుగా చెప్తున్నా' అన్నాడు.

'అలగలాగే! నీకోసం ఎయిటింగ్ సేస్తుంటా!' అన్నాడు ఏడుకొండలు.

ఓబులేసు వస్తున్నాడన్న సంతోషంలో అతని కాలు ఒకచోట కుదురుగా నిలవలేదు. చిన్ననాటి మధురమైన జ్ఞాపకాలు అతని మనసులో సుడులు తిరగసాగాయి.

* * *

పక్కపక్క ఇళ్లలో పుట్టిన ఏడుకొండలు, ఓబులేసుల మధ్య బాల్యంనుంచే విడదీయరాని బంధం ఏర్పడింది. చిన్నప్పుడు మామిడి తోపుల్లో కాయలు దొంగతనం చేసి పంచుకున్న దగ్గర్నుంచీ, సముద్రం ఒడ్డున ఇసుకలో ఆడుతూ పాడుతూ కబుర్లు చెప్పుకొన్న వారి స్నేహం సముద్రంకన్నా లోతైనది. ఒకరికోసం ఒకరు ప్రాణం ఇచ్చేంతగా గాఢ స్నేహం వారి మధ్య అల్లుకుంది.

చిన్నతనంలోనే తమ కులవృత్తి అయిన చేపలు పట్టడం కూడా ఇద్దరూ కలిసే నేర్చుకున్నారు. పెద్దవాళ్లతో కలిసి ఇద్దరూ సముద్రంలోకి వేటకు వెళ్లేవారు. ఏ పని చేసినా, ఎక్కడ చూసినా ఇద్దరూ కలిసే కనిపించేవాళ్లు. వాళ్ల వయసుతోపాటే వాళ్ల స్నేహం కూడా దినదిన ప్రవర్ధమానమైంది.

పన్నెండేళ్ల వయసులో ఇద్దరూ సముద్రంలోకి వేటకు వెళ్లారు. వాళ్లు స్వంతంగా వేటకు వెళ్లడం అదే మొదటిసారి. వారి తండ్రులు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, ఇద్దరూ వేట పూర్తిచేసి తిరిగి రావడం.. గూడెం వాళ్లందరిలోనూ ఆనందాన్ని నింపింది. సముద్రం మీద వాళ్లు ఆడింది ఆటగా, పాడింది పాటగా చేపల వేట సాగేది.

ఒకరోజు ఎప్పటిలాగే సముద్రంలోకి వెళ్లారు. అయితే ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే సముద్రం ఆరోజు భీకరరూపం దాల్చింది. అప్పటికే వాళ్లు తీరంనుంచి చాలాదూరం లోపలికి వెళ్లిపోయారు. ఒక్కసారిగా సముద్రం అల్లకల్లోలమైంది. వాళ్ల పడవ తలకిందులైంది. ఇద్దరూ నీటిలోకి చెరొకవైపు పడిపోయారు. ఇద్దరూ

ఈదుతూ తమ పడవ దగ్గరికి చేరుకున్నారు. అయితే ఏడుకొండలు పడవ ఎక్కుతుండగా ఒక పెద్ద అల అతన్ని మళ్లీ సముద్రం లోపలికి లాగేసింది. అది గమనించిన ఓబులేసు ఎంతో చాకచక్యంతో వ్యవహరించి, అతన్ని పడవలోకి లాఘవంగా లాగేశాడు. ఓబులేసే గనక ఆరోజు లేకుంటే.. ఏడుకొండలు జీవితం ఆ రోజుతో ముగిసిపోయి ఉండేది. ఆ సంఘటన తర్వాత వాళ్ల మధ్య స్నేహం మరింత బలపడింది.

అయితే ఒకానొక దుర్దినాన ఒక అనుకోని ప్రమాదంలో ఓబులేసు తల్లిదండ్రులు మరణించడంతో, అతని మనసు వికలమైపోయింది. ఎవరెంత చెప్పినా వినకుండా ఊరొదిలేసి ఎటో వెళ్లిపోయాడు. దొరికిన చోట, దొరికిన పనల్లా చేస్తూ చివరికి ముంబయికి చేరుకున్నాడు. రకరకాల పనులు చేస్తూ అక్కడే స్థిరపడిపోయాడు. అదృష్టవశాత్తూ అతను చేపట్టిన వ్యాపారం కలిసివచ్చి, అతనికి విపరీతమైన లాభాలను తెచ్చిపెట్టింది. దాంతో అనతికాలంలోనే అంచెలంచెలుగా పైకెగబాకాడు. క్రమేణా అతని కనుసన్నల్లో ఒక పెద్ద వ్యాపార సామ్రాజ్యమే ఏర్పడింది.

అలాంటి గొప్పవాడు తనకోసం ప్రత్యేకంగా ముంబయి నుంచి వస్తుండటంతో ఏడుకొండలు సంతోషానికి హద్దులేదు. అతను చెప్పిన వార్త విని గూడెం వాళ్లంతా ఎంతో సంతోషించారు.

మిత్రుడు వస్తున్న విషయం భార్యకు చెప్పి..

'ఆనికి మనింట్లోనే భోజనం ఏర్పాటు సెయ్యి. సిన్నప్పుడు రొయ్యల ఇగురు శానా ఇట్టంగా తినేటోడు. గాబట్టి అది సెయ్యటం మర్సిపోవొద్దు' అని చెప్పాడు ఏడుకొండలు.

'మీ దోస్తు గురించి నువ్వింతగనం సెప్పాల్నా? ఓబులెసన్న అంటే నీకెంత ఇట్టమో ఎన్నిసార్లు నువ్వు సెప్పలేదు నాకు. అదంతా నేను సూసుకుంటా' అని భరోసా ఇచ్చిందామె.

* * *

ఆ గురువారం ఖద్దరు బట్టలు వేసుకుని, నల్ల కళ్లద్దాలు సవరించుకుంటూ వచ్చిన ఓబులేసు, దూరంగా నిలబడి తననే తదేకంగా చూస్తున్న ఏడుకొండలుని చూసి..

'అరే ఏడుకొండలూ! మై జిగిరీ దోస్త్! ఏంటింకా అట్లా దూరంగానే ఉన్నావ్? రా రా' అంటూ దగ్గరికి పిలిచాడు.

అతన్ని చూసిన ఆనందంలో ఏడుకొండలు కళ్లవెంట నీరు ధారాపాతంగా కారిపోసాగాయి. అది చూసి..

'ఏమిట్రా పిచ్చోడా? ఎందుకీ కన్నీళ్లు?' అంటూ ఆత్మీయంగా కౌగలించుకున్నాడు ఓబులేసు.

ఆరోజు అతన్ని తమ ఇంట్లో భోజనానికి రమ్మని పిలిచాడు ఏడుకొండలు. రాకరాక తమ ఇంటికి వచ్చిన అతన్ని లక్ష్మి సాదరంగా ఆహ్వానించింది.

భోజనాలు అయ్యాక ఓబులేసు లక్ష్మితో..

'వీడు నా ప్రాణస్నేహితుడు. ప్రేమాభిమానాలు కురిపించడంలో నువ్వుకూడా వాడికి తగ్గ భార్యవనించుకున్నావు. నువ్వు చేసిన రొయ్యల ఇగురు నాకెంతో ఇష్టమైనది. నిజంగా ఇట్లాంటి భోజనం చేసి ఎన్నాళ్లయిందో! మీ ఇద్దరికీ చాలాచాలా థాంక్స్' అన్నాడు.

'గదేందన్నా గట్లంటవ్. నీ ఆసుంటి గొప్పోడు మా ఇంటికి వొచ్చుడే ఎక్కువ. ఇది మా అదురుట్టం' అని లక్ష్మి అనడంతో అతను నవ్వేశాడు.

తర్వాత ఏడుకొండల్ని చూస్తూ..

'సర్లే! నీ గురించి చెప్పు. ఎట్లా ఉంది నీ పని? వేట లాభసాటిగా ఉందా?' అనడిగాడు.

'ఎందుకుండదు? ఆ సముద్దరాన్ని నమ్ముకున్నాను. ఆ తల్లే ఇంత కూడు బెడుతున్నది. నా సంగతి సరే.. నువ్వు బొంబై బోయి ఎన్ని తిప్పలు వడ్డవో ఏమో తెల్వదు గానీ, మొత్తానికి గొప్ప యాపారయేత్తవైనావని అందరూ సెప్పుకొంటుంటే ఇన్నాను. శానా సంతోసం ఏసినాది' అన్నాడు.

'ఈ బిజినెసుల్లో ఎన్ని తలనొప్పులో నీకేందెల్సు. సర్లే.. ఈ గొడవ ఎప్పుడూ ఉండేదే! అట్లా బీచికి వెళ్లి కాసేపు కబుర్లు చెప్పుకొందాం పద' అంటూ అతన్ని బయల్దేరదీశాడు.

లక్ష్మికి వీడ్కోలు చెప్పి ఏడుకొండలుతో కలిసి ఓబులేసు వెళ్లేసరికి, బీచ్ చాలా సందడిగా ఉంది. ఇద్దరూ వాళ్లు చిన్నతనంలో ఎక్కడైతే ఆడుకునేవాళ్లో, అక్కడికే వెళ్లి కూర్చున్నారు.

కొద్దిసేపు ఆ మాటా ఈమాటా మాట్లాడుకున్న తర్వాత..

'ఒరే! నీ పడవ తియ్యరా. సముద్రం మీదికి వెళ్లి చాలా రోజులైంది' అన్నాడు ఓబులేసు.

అతనలా అడగడం ఆలస్యం.. ఏడుకొండలు వెంటనే అతన్ని తన పడవ దగ్గరికి తీసుకెళ్లాడు. సముద్రం చిన్నచిన్న అలలతో నవ్వుతూ ఆ స్నేహితులిద్దరినీ ఆహ్వానించింది. అలా వాళ్లు మాటల్లోపడి తీరం నుంచి కాస్త దూరంగానే వెళ్లారు. ఆ సమయంలో ఉన్నట్లుండి అక్కడి వాతావరణంలో ఏదో మార్పు వచ్చింది.

* * *

రక్తంతోనూ, సముద్రపు నీళ్లతోనూ తడిసిపోయి ఉన్న ఓబులేసు శరీరాన్ని ఏడుకొండలు భుజంపైన వేసుకుని రావడం చూసిన గూడెం జనం.. 'ఏటయినాది...' అంటూ అతని చుట్టూ గుమిగూడారు.

ఓబులేసు శరీరాన్ని నేలపైకి దించిన ఏడుకొండలు, మౌనంగా ఆ శవాన్నే చూస్తుండిపోయాడు. అతను ఏడవడం కూడా మర్చిపోయేంతగా దిగ్భ్రాంతిలో మునిగిపోయి ఉన్నాడనీ అందరూ అర్థం చేసుకున్నారు. క్షణాల్లో అక్కడ పోలీసు వ్యాను ప్రత్యక్షమైంది.

ఏమైందన్న పోలీసుల ప్రశ్నకు అతికష్టంమీద..

'సముద్దరంలో సరదాగా శికారు సేద్దామని మా ఓబులేసు అడిగితే కాదనలేక పడవ తీసినాను సారూ! కాసింత లోపలికెల్లినంక ఒక పెద్ద అల వొచ్చి మా పడవను ఎంత గట్టిగా తాకిందంటే.. ఆ దెబ్బకు అది గింగరాలు తిరుగుతూ పైకి ఎగిరింది. మేము దాన్లోంచి నీళ్లల్లో పడిపోయినం. కానీ, దురదురుట్టం ఏటంటే.. ఆ పైకెగిరిన పడవ సరిగ్గా వొచ్చి మా వోడి తలమీద పడినాది. దాంతో ఆడి తల పగిలినాది. ఎంటనే ఈడ్ని ఒడ్డుకు తెచ్చేసినా. కానీ, అప్పటికే రక్తం శానా కారిపోయినాది. ఒడ్డుకు తెచ్చేలోపల ఆడు..' ఇక ఏడుకొండలు నోట మాట పెగల్లేదు.

ఇంకా పెళ్లికూడా కాని ఓబులేసు, అలా పుట్టిన ఊరిలోనే మట్టిలో కలిసిపోవడం అందరినీ ఎంతగానో కదిలించింది. అతని అంత్యక్రియలు ఏడుకొండలు చేతుల మీదుగానే జరిగాయి.

అందరూ శ్మశానాన్ని విడిచిపోతున్నా ఏడుకొండలు మాత్రం అక్కడే స్నేహితుని చితికి కాస్త దూరంలో కూలబడి ఉండటం చూసి, అందరి మనసులూ ద్రవించాయి. తన ప్రాణాన్ని రక్షించిన ఓబులేసు, తన కళ్లముందే చనిపోవడం చూసిన అతను.. దిగ్భ్రాంతికి గురయ్యాడని అక్కడ అందరికీ అర్థమైంది. అతన్ని ఓదార్చడం అక్కడ ఎవ్వరి తరమూ కాలేదు.

'ఇక గూడేనికి పోదాం రా!' అంటూ ఎవరెంత బతిమిలాడినా అతను అక్కణ్నుంచి కదలలేదు. అతని వ్యధ అంత తేలిగ్గా తీరేది కాదనుకుంటూ ఒక్కొక్కరూ అక్కణ్నుంచి వెళ్లిపోయారు.

'మనం ఎంత బాదపడినా పోయినోడు తిరిగొత్తాడా సెప్పు. పొద్దుగాలనుంచి పిల్లలు బువ్వకూడా సరిగ్గా తినలేదు. నేనింటికెల్తన్నా. నువ్వూ సీకటడకముందే వచ్చేయ్' అని చెప్పి.. అతని భార్య కూడా వెళ్లిపోయింది.

అక్కడ అతను ఒంటరిగా మిగిలిపోయాడు. జరిగిందంతా అతనికి ఒక కలలాగా అనిపించసాగింది. ఒకసారి అది మొత్తం అతని కళ్లముందు గిర్రున తిరిగింది.

* * *

ఓబులేసును పడవ ఎక్కించుకుని కొంతదూరం పోయాక..

'ఇప్పుడు సెప్పు. ఇంకేటి సంగతులు!' అని అడిగాడు ఏడుకొండలు.

'మన బెస్త గూడేలన్నిటికీ నువ్వే నాయకుడివి కాబట్టి నువ్వో పని చేయాలి. అది చెబుదామనే నిన్నింత దూరం తెచ్చింది' అన్నాడు ఓబులేసు.

'సెప్పు. నీకోసం ఏట్టైనా సేస్తా!' అన్నాడు ఏడుకొండలు.

'చెప్తాను. నేనీ ఊర్లో ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో దిగాను. అసలు నిన్నే అక్కడికి పిలుద్దామని అనుకున్నాను. కానీ గోడలకు చెవులుంటాయి. మా బిజినెస్‌లో ఎవ్వడినీ నమ్మకూడదు. కానీ, నువ్వు నా ప్రాణస్నేహితుడివి. అందుకే నిన్ను నమ్మాను. నా బిజినెస్ పార్ట్‌నర్‌గా చేయి కలుపుతానని మాటివ్వు' అన్నాడు ఓబులేసు.

'నువ్వేటి సెబుతున్నావో నాకొక్క ముక్కగూడా అర్థం కాలేదు!'.

'అక్కడికే వస్తున్నా. నేను ముంబయిలో చేసే బిజినెస్‌కు కావాల్సింది అమ్మాయిలు..' అని ఒక్క క్షణం ఆగాడు ఓబులేసు.

'అంటే.. అమ్మాయిలకు ఉజ్జోగాలు ఇచ్చే బిగినెస్సా?' అనడిగాడు ఏడుకొండలు.. పడవ తెడ్డు వేస్తూ.

'ఓరి వెర్రి మొఖమా! నేను చెప్పేది పూర్తిగా విను. అరబ్బు దేశాల్లో మనదేశం అమ్మాయిలకు చాలా డిమాండుంది. డబ్బు ఆశ ఉన్నవాళ్లనూ, పేదవాళ్లనూ నేను ఎరవేసి పట్టుకుని, వాళ్లకు అరబ్బు దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి తీసికెళ్లి.. అక్కడ షేకులకు అమ్మేస్తుంటాను' అంటూ చెప్పాడు ఓబులేసు.

ఆ మాట వినగానే ఏడుకొండలు నిశ్చేష్టుడయ్యాడు.

'గదేం బిగినెస్? పాపం కాదా?' అనడిగాడు.

'పాపం - పుణ్యం అంతా ట్రాష్. డబ్బు ఒక్కటే నిజం. ఇక్కడ మన వాళ్లందరికీ నువ్వే లీడర్‌వు కాబట్టి.. ఇక్కడున్న మన కులపోళ్లలో మంచి వయసులో ఉన్న అమ్మాయిల్ని మెల్లిగా మాయమాటలు చెప్పి, ముంబయిలో నా దగ్గరికి పంపించు. కొద్దిరోజుల్లో నాలాగే నువ్వూ లక్షాధికారివై పోతావు!'.

'సీ.. సీ.. అంత నీతిమాలిన పని నేను జేస్తానని ఎట్టా అనుకున్నావు రా?'.. ఛీత్కారంగా అన్నాడు ఏడుకొండలు.

అప్పటిదాకా ఎంతో గౌరవంగా మాట్లాడిన మిత్రుడు.. ఒక్కసారిగా ఏకవచనంలోకి దిగడం ఓబులేసు గమనించాడు. అయినా దాన్ని పట్టించుకోకుండా..

'ఇంకా ఈ నీతీ నిజాయితీ ఏంట్రా? చిన్నప్పటి నుంచీ నువ్వీ గర్భదరిద్రంలో

మగ్గుతున్నావు. నిన్నెవరైనా కాపాడారా? నువ్వు నా ప్రాణ స్నేహితుడివి కాబట్టి నీకు లక్షలు సంపాదించే మార్గం చూపిస్తున్నాను. నువ్వూ నా దారిలోకి రా. కొద్దిరోజుల్లోనే నీ దశ తిరిగిపోతుంది' ఆశపెట్టాడు ఓబులేసు.

'వొద్దురా! ఈ సెండాలపు పని నేను సెయ్యను. నువు గూడా దీన్ని ఇక ఆపేసి ఇక్కడే నాతో ఉండిపో! నియ్యతిగా మనకొచ్చింది తిని బతుకుదాం' స్పష్టంగా చెప్పాడు ఏడుకొండలు

'ఏంటీ.. వ్యాపారం ఆపెయ్యాలా? ఇక్కడే ఉండిపోవాలా? ఎంత తేలిగ్గా చెప్పావురా. ఇప్పుడు నేను ముంబయ వెళ్లకపోతే ఎన్ని డీల్స్ ఆగిపోతయ్యో.. నాకెన్ని లక్షల నష్టం వస్తుందో తెలుసా? ఇక్కడ నువ్వు కాకపోతే ఇంకొకడు సహాయం చేస్తాడు. నాకు బోడి సలహాలు ఇవ్వడం మాని.. నాతో చెయ్యి కలుపుతావో లేదో చెప్పు' నిష్కర్షగా అడిగాడు ఓబులేసు.

'నేను నీతో సెయ్యి కలపను. ఇంకోన్ని కలపనివ్వను'.. అంతకంటే నిష్కర్షగా అన్నాడు ఏడుకొండలు.

అంతే.. ఒక్కసారిగా అక్కడి వాతావరణంలో మార్పు వచ్చేసింది. గాలి గంభీరమైపోయింది. ఓబులేసు పడవలో లేచి నిలబడి..

'కలపనివ్వనంటే.. ఏం చేస్తావు? అసలు నువ్వేం చేయగలవు? ఆఫ్టరాల్ ఒక అర్భక జాలరిగాడివి. నేను పెట్టిన ప్రాణభిక్షతో బతుకుతున్నవాడివి. నాకు నువ్వు పనికి వస్తావని ఇక్కడికి వచ్చానే గానీ, నీ మీద ప్రేమతో రాలేదు. నేనెంత కర్కోటకుడినో నీకు తెలీదు. నాలో జాలి – దయ అన్నవి ఏ కోశానా లేవు. నేను తలచుకుంటే నిన్నిక్కడే ఇప్పుడే జలసమాధి చేసి వెళ్లిపోగలను' అన్నాడు కర్కశంగా.

అది విని ఏడుకొండలు..

'అబం సుబం తెలీని ఆడబిడ్డల ఉసురు పోసుకుంటున్నావని తెలిసినప్పుడే నువ్వెట్టాంటోనివో నాకు అర్థమైంది. ఒకప్పుడు నువ్వు నాకు పేణబిచ్చ పెట్టింది నిజమే గావొచ్చు. అంతమాత్తరాన నువ్ సెప్పే నీతిమాలిన పని సేస్తానని ఎట్టా అనుకున్నావు? నేను ఒక నాయకున్నే కాదు, మానవత్వం ఉన్న మడిసిని కూడా! అందుకే ఎంతోమంది ఆడబిడ్డల్ని రచ్చించడం కోసం ఉప్పుడు నేనీ పని సెయ్యాక తప్పడంలేదు. ఎందుకంటే నీలాంటోడు బతికుంటే ఇంకెంతమంది ఆడబిడ్డల బతుకులు బుగ్గిపాలు అవుతయ్యో తెల్వాదు' అంటూ..

అధాటున పోటెత్తిన అలలా లేచి, తన చేతిలో ఉన్న పడవ తెడ్డుతో ఓబులేసు తలపైన బలంగా ఓ దెబ్బ వేశాడు.

ఒకే ఒక దెబ్బ. అంతే.. దాంతో ఓబులేసు తల రెండుగా విచ్చుకుంది.

'అబ్బా..' అని పెద్దగా ఆర్తనాదం చేస్తూ అతను పడవలోంచి నీళ్లలోకి

జారిపోయాడు.

'నేను సేసిన ఈ పని ఏమాత్తరం తప్పుగాదని నాకు దెల్సు. ఒకేల తప్పయినా.. ఆ దేవుడు నన్ను తప్పకుండా సెమిస్తాడు!' అంటూ ఏడుకొండలు నీళ్లలోకి దూకి, అతని శరీరాన్ని పడవలోకి ఎక్కించి, తీరానికి చేర్చాడు.

ఆ ఓబులేసే ఒకప్పుడు ఏడుకొండలుకు ప్రాణాభిక్ష పెట్టాడన్న సంగతి పోలీసువాళ్లకు గూడెంవాళ్లు చెప్పారు. అందుకే జరిగిందంతా దాచి, కొత్తగా కట్టుకథ అల్లి చెప్పిన ఏడుకొండలు మాటలను పోలీసులు కూడా విశ్వసించారు. వాళ్లకు అతనిపైన అణుమాత్రం అనుమానమైనా రాలేదు.

జరిగిందంతా గుర్తుకు రావడంతో ఏడుకొండలు గాఢంగా నిట్టూర్చాడు.

వెనుకనున్న సముద్రం మాత్రం అసలు అక్కడ ఏమీ జరగనట్లు, తానేమీ చూడనట్లు ప్రశాంతంగా ఉంది.

* * *

## గంద్రకోట సూర్యనారాయణ శర్మ

ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో పుట్టిపెరిగారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ (తెలుగు సాహిత్యం) చదివారు. తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఏజీఎంగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. వివిధ ప్రక్రియల్లో రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. ఈయన రాసిన కథల్లో ఇప్పటివరకూ 80 వరకు కథలు ప్రచురితమయ్యాయి. పాతిక పైగా కథలు వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నాయి. ముప్ఫై వరకు కవితలు, గజల్స్ వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. ఆనంద హేల, కలలు కౌముది, జాబిల్లి కోసం ఆకాశమల్లె నవలలు రాశారు. 'అసుర మేధం' 24 వారాల సీరియల్‌గా ప్రచురితమైంది. 'ఆనంద హేల' నవల పుస్తకరూపంలో విడుదలైంది. నమస్తే తెలంగాణా – ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహించే కథల పోటీలో.. గెలుపొందడం ఇది రెండవసారి.

**96669 03960**

# కిస్మత్



స్ఫూర్తి కందివనం

కూర్చున్న చోటునుంచి ఇంచుకూడా పక్కకి జరగడంలేదు నాగమ్మ. తాటిచాప పరిచినట్టున్న ఆ మట్టినేల మీద ఒక కాలు చాపుకొని, ఇంకో కాలు దగ్గరికి ముడిచి పెట్టుకుని.. ఒక చిన్న కర్రముక్కతో అదేపనిగా మట్టిని తవ్వుతూ ఉంది.

జుట్టంతా రేగిపోతూ, చెవుల్లో గులకరాళ్లేసి ఆడిస్తున్నట్లు బలంగా వీస్తున్న గాలులు ఆమెను విసిగిస్తున్నాయి. దానికి తోడు నడినెత్తికెక్కిన నిప్పురవ్వ మరింత చికాకు పుట్టిస్తున్నాడు. చేదు తిన్నట్టు మొఖమంతా చిట్లించి పైటకొంగును తలకు ముసుగులాగ చుట్టుకుంది.

పొద్దున్న మొదలు పెడితే మధ్యాహ్నం కావొస్తున్నది.. తవ్విన చోటంతా చిన్న గుంతలాగా ఏర్పడింది. వదులుగా అయిన మట్టినంతా కొద్దికొద్దిగా చేతుల్లోకి తీసుకుని కళ్లతోనే జల్లెడ పడుతున్నది.

దమ్మొస్తున్నది. దూపైతున్నది. వెంట తెచ్చుకున్న నీళ్ల బాటిల్ అందుకుని, ఉన్న ఆ గుక్కెడు నీళ్లూ గొంతులో పోసుకుంది. దప్పిక తీరలేదు. యాష్టకొస్తున్నది.

అసహనంగా మట్టిని గుప్పెట్లోకి తీసుకుంది. కొంత ఆవేదన, కొంత బాధ, ఇంకొంత.. నిస్సహాయత ఆమెను ఆవహించి ఉన్నాయి.

'వో క్కా! ఏమన్న గానొచ్చెనా?'..

అక్కడికి కొద్ది దూరంలో ఉన్న తిరుమలమ్మ గట్టిగా కేకేస్తూ నాగమ్మ ఉన్న వైపు నడిచొచ్చింది.

చేతిలోని మట్టి దిక్కే తీక్షణంగా చూస్తున్నదల్లా చివ్వున తల పైకెత్తి.. 'ఏం కనిపించలేదు!' అన్నట్లు తలను అడ్డంగా అటూఇటూ ఊపింది నాగమ్మ.

తిరుమలమ్మ.. 'నాగ్గూడ!' అని..

'ఈడికి నాల్గు దినాలైపాయే. బిడ్డతానికి వొయ్యొస్తంటాని జెప్పొస్తి ఇంట్ల. ఆయిమెనేమో.. 'తమ్మున్కి దెలుస్తే నీతోపాటు నన్ను గిట్ట పొట్టుపొట్టు తిట్టిపెడ్తడు. దేవులాడిన కాడికి సాల్ గాని.. ఇగ బయల్దేరు ఆడికెల్లి. అవల్ల నమ్మొద్దంట చెప్తుంటే గుడంగ వోతివి. ఇంట్ల పరిస్థితి తెల్సే తెల్సు. ఇప్పుడిగ ఉన్నది వాయే.. ఉంచుకున్నది వాయే! అన్నట్లున్నది నీ కత. అసలాడ ఏందింటున్నవో ఏడుంటున్నవో.. నాకైతే ఈడ మస్తు పర్శానైతున్నది!' అని పొద్దట్సంది ఒకటే పోస్ల మీన పోస్లు జేస్తుండది. ఈడ జూస్తెనేమో మూల్గు మునుపటోలెనే.. తిండి ఎప్పటోలెనే అన్నట్లుండది. 'ఇదొక్కరోజు

సూశి రేపొస్తలే బిడ్డ!' అంట జెప్పి.. ఈ పూటకెట్లనో ఓలాగ ఒప్పిస్తి!' అన్నది.. ఎండకు ముడుచుకపోయిన లేత చిగురాకులా మొఖమంత దగ్గరికి చేసుకొని.

నాగమ్మ నిర్వికారంగా నవ్వి..

'కిస్మతక్కా అంతే! మన ప్రాప్తమెట్లుంటే అట్ల. అగో.. ఇప్పుడు నీ కొరకంత మాత్రమన్న బెంగటిల్లెటోళ్లు ఉన్నరు. మల్ల నాకు? వొచ్చినప్పట్సంది సూస్తుండవు గదా.. ఇంతవరకు ఆ మనిషి యాడున్నదో, తిన్నదో లేదో, అసలుండదో పోయిందో అన్న ఖాయిష్ గుడ్క లేకపాయే మా వోళ్లకు!' అని శూన్యంలోకి చూసింది.

చిన్నప్పుడు ఇసుక కనిపిస్తే చాలు.. కర్రముక్కతో ఇలానే మట్టిని గెలుకుతూ ఆడుకునేవాడు ఆమె పెద్ద కొడుకు. ఆ రోజులన్నీ బొంగరం తిరిగినట్టు కళ్ల ముందు గిర్రున తిరిగాయి నాగమ్మకు.

కొడుకు చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలన్నీ ఇంటి వెనకాల గోడనిండా అల్లుకున్న బచ్చలి తీగల్లా ఆమెను గట్టిగా చుట్టేయగానే.. ఒక్కసారిగా గుడ్ల నిండా నీళ్లూరినయి ఆమెకు. తమాయించుకొని తిరిగి మళ్లీ పనిలో పడింది.

* * *

కొండంచున తపస్సు చేస్తున్న మౌన మునిలాగ ఉన్నాడు సూర్యుడు. ఆకాశమంతటా పరిచిన తన కాషాయాన్నంతా మెల్లిమెల్లిగా లాగేసుకుంటూ కొండల్లోకి జారిపోతున్నాడు.

'మబ్బైతుంది. ఏం గానోస్తలేదు. పోదం పా క్కా!'.. ఆ మబ్బులో కూడా వెలుగుని వెతుక్కుంటున్న తిరుమలమ్మతో అన్నది నాగమ్మ.

'వొస్తున్నక్కా! ఇగో గీ తొవ్విన మట్టికాడికి సూషొస్త. నిన్న ఒకాయిమెకు ఎట్లాయే! పాపం అంతసేపు దేవులాడ్తె కండ్లవడలేదు గాని, గదే కుప్పలకేంచి ఇంగొకాయిమెకు జెర్రంత సేపట్లనే ఎట్ల దొర్కే! నిజంగనే నీవన్నట్టు కిస్మత్.. అంతే!' అని, పావుగంటసేపు వెతికి, ఇక లాభం లేదని అర్థమయ్యి పైకి లేచి, చీరకంటుకున్న మట్టినంతా దులుపుకొన్నది తిరుమలమ్మ.

ఆ తర్వాత అక్కడ్నుంచి నడిచి రోడ్డెక్కి, దగ్గర్లోని ఊళ్లోకి చేరుకున్నారిద్దరు. తెచ్చుకున్న డబ్బులు అయిపో వొస్తుండటంతో, వాళ్లు రోజూ రాత్రి పడుకోడానికి వెళ్లే హనుమంతుడి గుడిలో పెట్టిన ప్రసాదం తిని సర్దుకున్నారు ఆ పూటకి.

కానీ, నదిలో కలిసిపోయిన కాలువలా, సముద్రంలో తప్పిపోయిన నదిలా.. ఆ ప్రసాదం ముద్ద వాళ్ల కడుపుల్లో ఏ మూలకో వెళ్లి నక్కి కాసేపటికే అక్కడ్నుంచి మాయమైపోయింది.

నాలుగు రోజులనుంచి సరిగా తిండీ తిప్పలు లేకుండా తిరుగుతుండటంతో నాగమ్మకు ఏదోలాగ అయిపోయింది. తిన్న అదింత ముద్ద ఏ పాటికీ కాలేదు. మరోపక్క ఆమె మెదడు నిండా నిండిపోతున్న ఆలోచనల ప్రవాహాన్ని

నియంత్రించలేక పోతున్నది.

ఒళ్లంతా చమటలు పట్టేశాయి. తల పగిలిపోతున్నది.

కళ్లు బైర్లు కమ్ముకుంటున్నాయి. నిలబడిన చోటే కూలబడిపోయి.. 'లేవలేను!' అన్నట్లుగా సైగ చేసింది.

తిరుమలమ్మకు కాళ్లూ చేతులాడలేదు. సాయం కోసం చూసింది.

ఎదురుగా ఉన్న షాపులోని యజమాని వాళ్లను గమనించి పరుగున వచ్చి విషయం కనుక్కున్నాడు. వెంటనే వెళ్లి అతను ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని పట్టుకొచ్చి వాళ్లకిచ్చాడు.

ఆ తర్వాత వాళ్ల వివరాలు కనుక్కుని..

'ఏంటికమ్మా మీకీ తిప్పలు. అయ్యన్ని జరిగే పనులు కావు. నూటికో కోటికో ఎవురో ఒకరికి.. అంతే! అనోసరంగా ఆశలు పెట్టుకోమాకండి. మీలాగే చానామంది ఆళ్ల పనులు ఇడిసిపెట్టుకుని ఈడకు వొస్తారు. వారం పది దినాలు ఈడే ఉంటారు. తిండికి, రేత్రి పొద్దు పండుకోనీకి నానా తంటాలు పడతాంటరు. అవొసరం, ఆశ మనిషిని ఎంత దూరమైనా తీసుకపోతది.. ఏమైనా చేయిస్తది. ఆశించినట్లు దొరికితే అది యేరే ఇసయం, ల్యాకపోతే..? అందుకే మీకింత ఇదిగా చెబుతాండ. సరే.. ఈ పొద్దుకి ఈడే పండుకోండి. పొద్దున్నే మిమ్మల్ని బస్టాండ్కి తోల్కపోతా. హాయిగా ఇంటికి పోండి. మీ ఇంటోళ్లు ఎంత బుగులు పడతాంటరో ఏమో!' అని అతను చెప్తుంటే.. ఆ చివరి మాటకు మనసులోనే పిచ్చిగా నవ్వుకున్నది నాగమ్మ.

'రేపొక్కటి సూశి పోతం సారు!'అన్నది తిరుమలమ్మ.

అతనిక ఏమీ అనలేక, వొద్దంటున్నా ఖర్చులకు కొంత డబ్బిచ్చి వెళ్లిపోయాడు.

'అసలే తెల్వని ఊరాయే! గా సారెవరో టయానికి దేవుడ్లాగొచ్చిండు. లేకుంటే మన గతేమైతుండెనో!' అతను వెళ్తున్న దిక్కే చూస్తూ అన్నది తిరుమలమ్మ.

'దునియల మంచితనమింగా ఉన్నదంటే నమ్మబుద్ధయితలేదు. ఆపత్కాలంల పక్కోని కష్టం తెల్సుకొని మరీ సాయం జేశేటోళ్లింకా ఉన్నరంటే దునియ కొత్తగ్గానొస్తున్నది నాకు!'.. తల్లిదండ్రులతోనే ప్రేమాప్యాయతలకు దూరమైన ఆమెకు, ఇప్పుడు తనకోసం ఆలోచిస్తున్న తిరుమలమ్మను, తను కుదుటపడేవరకు కంగారు పడిపోయిన షాపు యజమానిని చూస్తుంటే.. అదేదో జీవితంలో ఎప్పుడూ చూడని వింతను దగ్గరగా చూస్తున్నట్లుంది నాగమ్మకు. అర్థరాత్రి వేళ మూగబోయిన అడవిలా మౌనంగా ఉండిపోయింది.

ఆ రాత్రంతా పడుకోకుండా నల్లని ఆకాశంలోకే చూస్తూ ఉంది. ఆమె పెండ్లప్పుడు తల్లిగారింటి నుంచి తెచ్చుకున్న నల్లజాడి మీద చిన్న మన్మరాలు తన గౌనుకున్న చమ్కీలను పీకి పారేసినట్లున్న చుక్కల వంకే తీక్షణంగా చూస్తూ ఉంది. వాటిల్లోంచి కనీసం ఒక్కటైనా.. పోనీ ఒక చిన్న తునకైనా నేల రాలిపడితే ఎంత

బాగుండునో!? అప్పుడిక తన సమస్యలన్నీ తీరిపోతాయన్న వెర్రి ఊహతో వాటివైపే చూస్తూ ఉంది.

* * *

'రోజంత క్యాబ్ నడుపుకొని మల్ల రూముకొచ్చి వొండుకొని తినాల్నంటే బేజారొచ్చిపోతున్నది. అందుకే ఈసారి సరస్వతిని, పిల్లలను గూడ నా ఎంబడి తీస్కపోదమన్కుంటున్న' అన్నాడోరోజు నాగమ్మ పెద్దకొడుకు యాదగిరి.

'నేను సరిగ్గానే విన్ననా!?' అని ఆమె కనుబొమ్మలు ముడేసి..

'మల్ల.. నేను? నన్ను గిట్ట దోల్కపోరా?' అన్నది నాగమ్మ.

ఒక్కసారిగా ఆమె ముఖం ప్రశ్నాపత్రంగా మారిపోయింది. అందులో కొడుకేం సమాధానం రాస్తాడోనని ఆతృతగా అతని కళ్లలోకి చూసింది.

'అట్ల గాదే.. ఆడ నేనింకా ఇల్లు గిట్ల ఏం చూస్కోలేదు. ఇప్పుడుంటున్న రూము మా దోస్తుగాన్ది. వాడిప్పుడు ఊరికి వొయిండు. రానికే జెర టైం పడ్తదన్నడు. అందుకే ముందు వీళ్లను తోల్కపోత! ఓ వారం పది రోజులల్ల వేరే ఇల్లు చూస్కున్నాక నిన్ను గుడ్క తీస్కపోత. ఇప్పుడు అందరం వొయి ఆడుంటే ఇబ్బందైతది!' అని చెప్తున్నప్పుడు.. అతని కళ్లలోని అబద్ధం నిజమవుతుందేమోనని లోలోపలే బుగులైంది నాగమ్మకు.

'నేనొక్కదాన్నే ఎక్వైతినా? ఏంగాదులే.. కష్టమో నష్టమో ఎట్లనన్న సర్దుకుందం. ఎన్ని సూశొచ్చిందాన్ని.. నాకిదో లెక్కనా!' అనబోయి ఎందుకో మాట గొంతులోనే ఇరుక్కుపోయింది ఆమెకు.

కొడుకు పిల్లోడిగా ఉన్నప్పుడు తను పనికెళ్లే సమయానికి రోజూ 'నేనొస్తా!' అంటూ వెంటపడేవాడు.

'వొద్దు' అని ఎంత చెప్పినా ఆమెని వెళ్లనివ్వకుండా చీర చెంగులు పట్టి గుంజుతూ గట్టిగా ఏడ్చేవాడు. పెద్దోణ్ని చూసి చిన్నోడు కూడా వెంటపడేవాడు. పిల్లలలా ఏడుస్తుంటే అడుగు ముందుకు పడేదికాదు ఆమెకు.

వాళ్లకు మాత్రం ఇంకెవరున్నారు? వాళ్లకన్నీ అమ్మేగా! అమ్మ వెంటుంటే చాలు!

అందుకే కాదనలేక వెంట తీసుకెళ్లేది.

ఇప్పుడు తన పరిస్థితి కూడా సరిగ్గా అలానే ఉందేమో అనిపిస్తున్నది నాగమ్మకు. కానీ 'అమ్మకు మాత్రం ఎవరున్నారు. నేనొక్కణ్నే గదా!' అని తనలా కొడుకెందుకు అనుకోవడం లేదన్న ఆలోచనకి ఆమె మనసు బీడు వారిపోయింది. ఈ విషయంలో కోడలు కూడా కలగజేసుకోకపోడం ఆమెను మరింత వ్యధకు గురిచేస్తున్నది.

* * *

చెప్పినట్టుగానే కొడుకు 'తన' కుటుంబాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. వారం పది రోజుల్లో వచ్చి తనను కూడా తీస్కెళ్తానన్న వాడు, మొహం చాటేశాడు. చివరికి ఆమె

ఫోన్‌చేస్తే ఎత్తడం కూడా మానేశాడు.

నాగమ్మకు గుండెల్లో సన్నని బెరుకు మొదలైంది. వాళ్లు తననిక వొద్దనుకుంటున్నారన్న విషయం మెల్లిమెల్లిగా అర్థమవుతున్నది.

ఇటు చూస్తే, వారం రోజుల్లో కిరాయి కట్టకుంటే ఇల్లు ఖాళీ చేయమని ఇంటి ఓనరు పెట్టే పోరు పడలేకపోతున్నది.

'చేతిల చిల్లి గవ్వ లేన్నాడు గూడ నా బిడ్డలను పోషించుకున్న. అంతేగాని ఏనాడూ 'మీ సావు మీరు సావండి' అని వాళ్లను ఇడిసిపెట్టి నా సుఖం నేను జూస్కోలేదు గదా! మల్ల నా కొడుక్కు నేనెట్ల భారమైతి. నా కిస్మతి ఇట్లెందుకున్నదో!' అని ఒంటరి పక్షిలా రాత్రుళ్లు గోడలతో చెప్పుకొని ఏడ్చేది.

* * *

తల్లి, తండ్రి లేని పిల్ల అని.. ఆమెను చూసుకోడం భారమని నాగమ్మ మేనత్త ఆమెకు పదమూడేళ్లకే తెలిసిన మంచి సంబంధమని చెప్పి పెళ్లి చేసేసింది. నాగమ్మకు, ఆమె భర్తకు వయసులో పదిహేనేళ్ల తేడా. పైగా అతనికి లేని అలవాటంటూ లేదు. మరీ ముఖ్యంగా మందే మంచినీళ్లతనికి. తాగొచ్చి నాగమ్మను రోజూ ఏదో ఒకదానికి కొడుతూండేవాడు. పెళ్లి తరువాత ఆమె పుట్టింటి వాళ్లు ఇటువైపు కనీసం తొంగి కూడా చూడకపోడం అతనికి మరింత ధీమాగా ఉండేది.

భర్త విషయంలో కన్నీళ్లు పెట్టి పెట్టి ఆఖరికి తన ఒంట్లో ఇక కన్నీరే మిగల్లేదేమో అన్నంతలా మొద్దుబారిపోయింది. చివరికి ఆ తాగుడే అతన్ని తీస్కెళ్లిపోయినా.. ఆమెలో ఏ చలనం లేకుండా ఉన్నింది.

అప్పటికే ఇద్దరు పసివాళ్లున్న నాగమ్మను కొన్నిరోజులకు అత్తింటి వాళ్లు వదిలించుకున్నా.. మౌనంగా, నిస్సహాయంగా తప్పుకొన్నదే కానీ అడ్డుపడి ఒక్కమాట కూడా అడగలేదు, అనలేదు.

ఇటు పుట్టింటి వాళ్లూ ఆమెని ఎప్పటిలాగే చూశారు. దాంతో రోడ్డున పడింది.

పొట్ట కూటి కోసం తిరిగితిరిగి వాళ్ల కాళ్లు, వీళ్ల కాళ్లు పట్టుకుని దొరికిన పనల్లా చేసుకునేది.

అంత కష్టంలోనూ మొండిగానే ఉన్న నాగమ్మకు.. మెదడు సరిగాలేని తన చిన్నకొడుకు ఇంట్లోంచి ఏటో వెళ్లిపోయి తప్పిపోయినప్పుడు తడైన ఆమె కళ్లు చాలా ఏళ్లవరకు తడిగానే ఉండిపోయాయి.

ఇక తనకంటూ మిగిలిన పెద్ద కొడుకే ఆమెకు వెన్ను ముక్కనుకుని బతుకుతుంటే.. ఇప్పుడతను తనను వొద్దనుకుంటున్నాడని అర్థమయ్యాక ఆమె గుండెని ఎవరో కాళ్లకిందేసి తొక్కి, రంపంతో కోస్తున్నట్లుంది.

* * *

వారమైపోయింది.

ఓనర్‌తో ఇక మాటలు పడలేక.. ఆమెకొచ్చే పింఛన్లో నెలనెలా కొంత డబ్బును పక్కకు తీసి, తన ముగ్గురు మన్మరాళ్లకు పండక్కి బట్టలు కొనిద్దామని ఎప్పట్నుంచో జమ చేసుకున్న పైసలతో కిరాయి కట్టింది. ఆ తర్వాత అక్కడ్నుంచి వచ్చేసి దిక్కు తోచక బస్టాండ్‌లో కూర్చుంది.

'నీవు తమ్మునికి ఇప్పుడేం జెప్పకు. రెండ్రోజులల్ల వొస్త. ఏమో.. మన అదృష్టం బాగుంటే దొర్కుతది. టీవీలల్ల అంతగానం సూపుతున్నరు! ఒకాయినకు రెండు దొరికే! అరవై లచ్చలంట అవిటికి. ఇంగొకాయిమెకు పదారు లచ్చలు. ఎవరికో కోటిన్నరంట. అట్ల మస్తుమందికి దొర్కవట్టే! నీవు నా గురించేం ఫికర్ జేయకు. నేను మంచిగనే ఉంటలే. ఉంట మల్ల.. శార్జింగు మూడు పుల్లలే ఉంది!'.. తన పక్కనే కూర్చున్న తిరుమలమ్మ ఫోన్‌లో కూతురితో మాట్లాడిన మాటలు నాగమ్మను ఆశ్చర్యానికి గురిచేశాయి.

'ఏందక్కా.. ఏంటివో 'లచ్చలు, కోట్లు దొరికినయ్!' అంటుండవు. యాడ? అసలు పైసల్ దొరుకుడేంది!?' అని ఆమెను అడక్కుండా ఉండలేకపోయింది.

'పైసల్ గాదక్కా.. వొజ్రాలు! ఆడ కర్నూల్ దిక్కు.. నీకు దెల్వదా! టీవిలల్ల మస్తుగ సూపుతున్నరు'.

'తెల్వదక్కా.. ఎప్పుడు ఇనలే, సూడలే!'.

'నేను మొన్న టీవిల సూశి వొచ్చినక్కా!' అని చెప్పి..

'నాకిద్దరు కొడుకులు, ఒక బిడ్డక్కా! నా పెద్దకొడుకు మొన్న గా కరోన రోగమని వొచ్చే గద.. అప్పుడు సచ్చిపోయిండు. ఇగ అప్పట్సంది అందరం చిన్న కొడ్కుతాననే ఉండుకమయ్యింది. వాడొక్కడే మాకు ఆదరవు. కానీ, మా గాచారం ఎట్లున్నదో సూడు.. వాన్కి రెండు కిడ్నీలల్ల ప్రాబ్లమున్నదంట. మస్తు ఖర్చొస్తున్నది. కోడండ్లే అట్లిట్ల తిప్పలు వడ్తున్నరు. అందుకే.. ఎట్లయితే అట్లయిందని ఈడ నాగర్ కర్నూల్‌ల ఉండే నా బిడ్డతానికి వొయ్యొస్తంట జెప్పి.. వొజ్రాలు దేవులాడనీకే కర్నూల్ వోతుండ! తెలుస్తే మల్ల నా కొడుకు గరమైతడని! ఇగ మా అదృష్టమెట్లుంటే అట్ల!' అంటూ తన కథంతా చెప్పుకొచ్చింది తిరుమలమ్మ.

ఆమె కథ విన్నాక తన పెద్ద కొడుకును గురించి గుర్తుచేసుకొని బాధపడుతూ.. తనుకూడా తన కథనంతా చెప్పుకొచ్చింది నాగమ్మ.

ఆమె పరిస్థితి తెలుసుకున్నాక తిరుమలమ్మకు మనసంతా అదోలా అయిపోయింది. ఆమెను కూడా తనవెంట రమ్మంది.

ఒకవేళ నిజంగానే వజ్రాలు దొరికితే తన సమస్య తీరుతుందేమోనన్న ఆశతో ఆమెతోపాటు నాగమ్మ కూడా పయనమయ్యేచ్చింది.

* * *

మరుసటిరోజు పొద్దున్నే నాగమ్మ, తిరుమలమ్మ తిరిగి మళ్లీ తమ వజ్రాల వేట..

కాదు బతుకువేట కోసం సిద్ధమయ్యారు.

తొలకరి జల్లులకు మొలకలెత్తిన గింజల్లా ఉన్నారు.. ఆ పొలంలో వజ్రాలను వెతికేందుకు వచ్చిన జనాన్ని చూస్తుంటే! ప్రతొక్కరి వెనుక ఏదో ఒక కథ. ఊరికే.. తమ అదృష్టాన్ని పరీక్షించుకోడానికి వచ్చిన వాళ్లూ ఉన్నారు.

నాగమ్మ, తిరుమలమ్మ రోజులా కాకుండా షాపతను చెప్పినట్టుగా కొంచెం చిన్నగా, తెల్లగా, నునుపుగా మెరుస్తున్నట్లుండి.. ప్రత్యేకంగా అనిపించిన రాళ్లను ఏరుకున్నారు.

సాయంత్రమైంది! ఇక అంతటితో ఆట ముగిసింది.

ఏడాదంతా కష్టపడి చదివి పరీక్షలు రాసాక ఫలితాల కోసం ఎదురుచూస్తున్న పదో తరగతి పిల్లల్లా, అక్కడున్న వాళ్ల సాయంతో ఆ రాళ్లను పరీక్షకు ఇచ్చి ఆతృతగా చూస్తున్నారిద్దరు.

తిరుమలమ్మ రాళ్లల్లో ఒక్క వజ్రమూ లేకపోడంతో ఆమె చెంపలు అప్రమేయంగా తడిసిపోయాయి. ఎన్ని కష్టాలున్నా ధైర్యంగా ఉండేది. మొదటిసారిలా డీలా పడిపోయింది.

ఇక నాగమ్మ రాళ్లను పరీక్షిస్తుంటే ఆమె ధ్యాసంతా కొడుకు మీదే ఉంది. ఇప్పుడు ఈ రాళ్లే తన గమ్యాన్ని శాసిస్తున్నట్లుగా ఉందామెకు. తన పయనం కొడుకు వెంటా..? లేక తన నీడ వెంటా..? అని తలచుకుంటుంటే అరచేతులు చల్లగా అయిపోయాయి.

'మిషను పన్నెండు పాయింట్లు చూపిస్తుందమ్మా.. ఇది వజ్రమే! ఇంచుమించు పన్నెండు లక్షల దాకా వస్తాయేమో!' అన్న మాట వినగానే.. నాగమ్మ ఊపిరి పీల్చుకుంది. ఒకవైపు పట్టరాని సంతోషం, మరోవైపు తెలియని దుఃఖం ఆమెను చుట్టుముట్టేశాయి.

'కిస్మతక్కా! నీకంత మంచే పో! ఇగ నీ కొడుకు, కోడలు నిన్ను నెత్తిన పెట్టుకుంటరు. మస్తు ఖుషైతుందక్కా నాకైతే!' ఒకవైపు తనచుట్టూ ఉన్న సమస్యల ఊబిలోకి జారిపోతున్న బాధలో ఉన్నా.. స్నేహితురాలి బతుక్కి ఓ దారి చూపగలిగినందుకు సంతోషంగా ఉంది తిరుమలమ్మకు.

కల్మషం లేని ఆమె స్నేహానికి ఏమిచ్చి రుణం తీర్చుకోవాలో అర్థం కాలేదు నాగమ్మకు.

ఒకరు కొండంత ఆశతో, మరొకరు గుండెనిండా నిరాశతో తిరుగు ప్రయాణమయ్యారు.

* * *

'తిరుమలమ్మ ఇల్లు ఇదేనా?' అన్న మాట విని, గుమ్మం బయట పరధ్యానంగా కూర్చుని ఉన్న తిరుమలమ్మ ఉలికిపాటుగా చూసి..

'నేనే తిరుమలమ్మని. మీరెవరు?' అన్నది.

'నాగమ్మ గారు ఈ డబ్బు మీకిమ్మని పంపా..' అతని మాట పూర్తి కాకముందే.. 'నాగమ్మ' అన్న పేరు వినపడగానే..

'ఎవరూ.. నాగమ్మనా? ఎట్లున్నది? కొడ్కుకాడికి వొయిందా? పోన్లే మంచిగుంటే అంతే సాలు! ఇంతకీ నీవెవరు? నాగమ్మ కొడ్కువి నీవేనా ఎట్ల?' అంటూ పైకిలేచి విప్పారిన ముఖంతో అతన్ని సమీపించింది.

'కాదమ్మా! నేను కర్నూల్నుంచి వచ్చినాను. నాగమ్మగారు పదిరోజుల క్రితమే మా ఆశ్రమంలో చేరినారు. తన స్నేహితురాలు తిరుమలమ్మ కుటుంబం కష్టాల్లో ఉన్నదనీ, ఆమెకు ఈ డబ్బును ఎలాగైనా అందజేయాలని మమ్మల్ని కోరారు. ఆవిడిచ్చిన మీ నెంబరుకి ఫోన్ చేస్తే కలవలేదు. ఇక ఆ నెంబర్ ద్వారా మీ అడ్రస్ కనుక్కుని వచ్చినాము. ఇదిగొండి మీ డబ్బు.. మొత్తం పన్నెండు లక్షలు' అని ఆ డబ్బును తిరుమలమ్మ చేతుల్లో పెట్టి ఆశ్రమం నెంబర్ ఇచ్చాడు.

'అంత గొప్ప స్నేహితురాలు దొరకడం మీ అదృష్టమమ్మా!' అని చెప్పి అతను సెలవు తీసుకున్నాడు.

ముందు గదిలో మంచంపై పడుకుని ఉన్న తిరుమలమ్మ కొడుకు వెంకట్రాములు వాళ్ల మాటలు విని అయోమయంలో పడ్డాడు.

తిరుమలమ్మ లోపలికొచ్చి జరిగిందంతా వివరంగా చెప్పింది.

వెంకట్రాములుకి నోట మాట రాలేదు. వెంటనే అతనిచ్చిన నెంబర్‌కు ఫోన్ కలిపాడు. నాగమ్మతో మాట్లాడుతూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యాడు. అక్కడుండే బదులు తమ దగ్గరే ఉండమని బతిమిలాడాడు. కానీ, ఆమె నిరాకరించింది.

'నాగమ్మా! నీవు ఆశ్రమంల జేరినవంట? ఎందుకట్ల జేశ్నవ్? మంచిగ కొడుకుతోనుండక గిదేం పని? అయినా నీకు తగిలిన అదృష్టాన్ని మాకెందుకిచ్చినవ్? నాకైతే ఏమర్థమైతలేదు' అన్నది తిరుమలమ్మ.

నాగమ్మ ఎన్నో రహస్యాలను తన కడుపులో దాచుకున్న నిశ్శబ్ద అరణ్యంలా మౌనంగా ఉండిపోయింది.

'వజ్రం దొరికిందంట కదమ్మా! టీవిల గనవడ్డవని నీ కోడలు జెప్పింది. ఇగ మన కష్టాలన్నీ తీరిపోయినట్టే!'.. ఇంటి ముఖం చూసి ఆరు నెలలైనా.. ఫోన్ చేసినా ఎత్తని పెద్దకొడుకు.. ఆమెకు వజ్రం దొరికిందని తెలియగానే తనంతట తానే ఫోన్ చేసి, అరువు తెచ్చుకున్న ప్రేమనంతా ఒలకబోస్తుంటే.. ఆమెలోని తల్లి మనసు ఆమెను కొద్దిసేపటి వరకు వెర్రిదాన్ని చేసింది. ఆ మాయలోపడి సంతోషంతో ఉక్కిరిబిక్కిరైపోయింది నాగమ్మ.

కానీ.. ఆ తరువాత తిరుమలమ్మ గుర్తొచ్చింది. ప్రతీది డబ్బుతో ముడిపెట్టే తన కుటుంబానికి, డబ్బుకంటే మనిషి ముఖ్యం, ఆ మనిషితో తనకున్న అనుబంధం

ముఖ్యం అనుకునే తిరుమలమ్మ కుటుంబానికీ.. నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా కనిపించింది.

ఈరోజు తన దగ్గర డబ్బుందని కొడుకు తిరిగి ఆమెను వెతుక్కుంటూ వచ్చాడు. అదే ఆ డబ్బంతా అయిపోయిన రోజున తన పరిస్థితి మళ్లీ రోడ్డెక్కొచ్చు. ఏ బంధమూ శాశ్వతం కాదు.. ఏదీ తనవెంట రాదన్న సత్యాన్ని మెల్లిమెల్లిగా గ్రహించగలిగింది.

అంతే.. ఊరికి తిరిగొచ్చినదల్లా తిరిగి కర్నూల్‌కి వెళ్లింది. ఇదివరకు తనకు సాయం చేసిన షాపు యజమాని ద్వారా అక్కడే ఓ వృద్ధాశ్రమంలో చేరింది. ఇప్పుడదే తన గమ్యస్థలం.

'అడుగుతుంటే ఏం జెప్పవేంది నాగమ్మా?'.. తిరుమలమ్మ మళ్లీ అడిగింది ఫోన్‌లో.

'కిస్మత్.. అక్కా!' అని చెప్పి.. నిశ్శబ్దంగా నవ్వింది నాగమ్మ.

***

## స్ఫూర్తి కందివనం

తండ్రి కందివనం రఘురామయ్య స్ఫూర్తితో.. సాహిత్యంవైపు అడుగులు వేశారు స్ఫూర్తి కందివనం. వీరి స్వస్థలం మహబూబ్‌నగర్. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. బయోటెక్నాలజీలో పీజీ చేశారు. ప్రస్తుతం సైంటిఫిక్ ఈ-జర్నల్స్ పబ్లిషింగ్ సంస్థలో ఎడిటోరియల్ అసిస్టెంట్‌గా సేవలు అందిస్తున్నారు. 2019 నుంచి రచనలు చేస్తున్నారు. ఇప్పటివరకూ 30కి పైగా కథలు, 3 నవలలు రాశారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం కథల పోటీల్లో 'డిమ్మి' కథకు ప్రథమ బహుమతి (2021), 'ముసురు' కథకు తృతీయ బహుమతి '2022) అందుకున్నారు. 'నాయన చెప్పిన అబద్ధం', 'డిమ్మి', 'నల్ల చీమలు', 'ముసురు', 'చీకటి వెలుగులు' కథలు అత్యంత పాఠకాదరణ పొంది.. రచయిత్రికి మంచి గుర్తింపు నిచ్చాయి. 'చైత్ర' నవలకు తెలంగాణ సారస్వత పరిషత్తు యువ పురస్కారం, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ ప్రథమ నవలా పురస్కారం దక్కింది. శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ద్వారా తొలి కథా సంపుటి 'డిమ్మి' వెలువడగా.. ఈ పుస్తకానికి ఇటీవలే 'కందికొండ రామస్వామి స్మారక జాతీయస్థాయి పురస్కారం' అందుకున్నారు. 'ముసురు' కథకు వాసిరెడ్డి నవీన్ సంపాదకత్వంలో వెలువడిన 'కథా సాహితీ – 2023' కథా సంకలనంలో చోటు దక్కింది.

**–96527 45117**



# కులకస్సి

**కాలువ మల్లయ్య**

తలకు ఇంతెత్తు రుమాలు. మీదికి మలిచికట్టిన కుప్పన పంచు ధోతీ.. రుమాట్లో మొక్కి చుట్ట.. భుజంమీద గొంగడి తప్ప అంగీ లేక సాగబారిన శరీరం.. కుడిచేతికి బోలు కడియం.. నడుముకు తోలు సంచి.. అందులో చెకుముకి రాయి, దూది.. బుర్రమీసాలు.. భైరి గడ్డం.. చేతిలో కట్టె!

వాకిట్ల నిల్సున్నడు ఓ నడి వయసాయన.

అరుగుమీద నులుక మంచంల కూసున్న గంగయ్యె నుద్దేశించి..

'శనార్తులు బావా!' అన్నడు.

గంగయ్య నొసలు ముడేసి..

'శనార్తులే కని నువ్వెవ్వలు? ఎప్పుడు చూసినట్టు లేదు..' అన్నడు.

ఇంతల్నే సాయమాన్లకెళ్లి లచ్చవ్వ అచ్చింది.

'అక్కా దండాలు. నీ తమ్మున్ని..' అన్నాడాయన.

'నాకు అన్నలు, తమ్ముల్లు లేరు. మా అవ్వకు ముగ్గురు బిడ్డలే!' అన్నది లచ్చవ్వ.

'మీకు నేను తెలువకపోవచ్చుకని నాకు మీరిద్దరెరుకే. పార్వతీ పరమేశ్వరులసోంటోల్లు మా అక్కాబావలు. అగో నా అల్లుడు గూడత్తండు గద.. అల్లుని పేరేంది?'.

'నా కొడుకు గాలయ్య. గిప్పుడు నాలగో తరగతి సదువుతండు! వరుసలు బాగానే కలుపుతున్నవు గని నువ్వెవ్వలో చెప్పకపోతివి!'.

'బావా! నాపేరు గట్టయ్య. నాది నుచ్చులాపూర్. నాకు నా అనెటోళ్లు ఎవ్వలు లేరు. ఒంటిబాయిగాన్ని. మన కులపోళ్లు బాగున్న ఊరుగిది. ఇక్కడ బతుకుదామనచ్చిన. నువ్వు పెద్దగొల్లవైతివి. ఎవ్వలనడిగినా నీపేరే సెప్పింద్రు!'.

'గంతదూరం నుంచి వచ్చినవా!? సరెగని.. బువ్వదిన్నవా లేద? ఈడ్సుకపెయిన మొకం జూత్తె తిన్నట్టనిపిస్తలేదు! లచ్చమ్మా.. ముందుగాల మీ తమ్మునికన్నం బెట్టు. కడుపు సల్లవడ్డంక మాట్లాడుకుందాం!'.

గా మాటతోని లేచి.. లచ్చమ్మతో సాయమాన్లకు పేయిండు గట్టయ్య.

కంచు తలెల రెండు గడుకబోట్లు.. గింతంత పప్పేసి, పచ్చిపులుసు పోసింది లచ్చమ్మ.

బగ్గ ఆకలున్నట్టుంది.. వాటిని కలుపుకొని దవ్వదవ్వ బుక్కలు పెట్టుకున్నడు.

'అక్కా! మనం గొల్లొల్లం. కృష్ణుడు మన కులదైవం. మీకు గొర్రెమ్యాకలు లేనట్టున్నయి. గదేం మంచిగనిపిస్తలేదు..' అన్నడు గట్టయ్య.

* * *

'గట్టయ్యా! ఇగజెప్పు. మీ అక్కతోనేమో అన్నవట. అసలు నువ్వు ఇక్కడికి ఎందుకచ్చినవు? నాతోని నీకేం పనో సెప్పు!?' అన్నడు గంగయ్య.. పక్కన కూసున్న గట్టయ్య భుజం మీన సెయ్యేసి.

'బావా! నాకు సదువురాదుగని గీ మాటెక్కన్నో విన్న. 'విలువిద్యలెన్ని నేర్చిన కులవిద్యకు సాటిరావు గువ్వలచెన్నా' అని. నీకు ఎవుసముంది. పెద్ద గొల్లతనముంది. కుల పంచాయితులు తెంపుతవు. మందెచ్చులోళ్లు, ఒగ్గోళ్లు, గంగిరెద్దులోళ్లు, కొమ్మోళ్లు.. అందరూ మీ ఇంటిముంగటనే ఆటలాడ్తరు. కతలు జెప్పుతరు. బొమ్మలు నిలవెడ్తరు. నువ్వే త్యాగాలు దెంపుతవు. ఊళ్లె గొల్లలిండ్లల్ల పట్నాలేసుకుంటే నువ్వే ముందట గూసుంటవు. కుడుక, కర్పూరం నీకే పంపుతరు. మందమీద పస్కపిల్లను కోసుకుంటె సప్కమాంసం నీకే పంపుతరు. కానీ, నీకు 'కులకస్పి' లేదు. కులపెద్దకే కులకస్పి లేకుంటెట్ల బావ?'..

గట్టయ్య మాటలు విని బొలబొలా నవ్వెండు గంగయ్య.

'కులకస్పి' అనే మాట గాలయ్యకెంతో సంబురమనిపిచ్చింది. ఆహ్లాదకరంగా అనిపించింది. ఈ మాటను ఎన్నోసార్లు విన్నడు.

'గట్టయ్యా! నా తమ్ములిద్దరు గొర్ల కాసుకుంటనే బతుకుతంద్రు. మా కుటుంబానికి కులకస్పి ఉన్నట్టేకద! మళ్ల నన్నుగూడ గొర్లుగాయమంటవా ఏంది? '.

'మీ తమ్ముళ్లకుంటె మీకున్నట్టు ఎట్లయితది బావా? పెద్దమనిషివి అయినంత మాత్రాన కులకస్పి ఉండద్దంటవా? మనకు గొర్లు మ్యాకలుంటె అదో గౌరవం. గొర్లుమ్యాకలున్న ఇండ్లు జూడు.. పాలు, పెరుగు, కవ్వం, ఉట్లు, పాలు కాగవెట్టే ధాతి, ఇండ్లల్ల చిన్న గొర్రెబొక్కల 'మేమే' అని ఒర్రుల్లు.. ఎంతమంచి గుంటది'.

'గా మాట నిజమేనే నాయిన్న. నాకు గూడ గొర్రెబొక్కులంటె మస్తిష్టం. మనగ్గాడ గొర్లుంటె మంచిగుంటదే!'..

గాలయ్య మాటలను లచ్చమ్మకూడ సమర్థించింది.

'ఓర్నీయవ్వ! గంటకింద తమ్మున్నని చెప్పుకొంటచ్చిన గట్టయ్య.. అక్క, అల్లుడు అందరు ఒక్కటైనెట్టున్నరు గద! నేనేమో గాలయ్యను సదివించుకుంట

తెలివికి తేవన్నంటె.. మీరేమో గొర్లనవడ్తిరి. పొల్లగాన్ని సదువు బందుజేసి గొర్లకు పెట్టన్నా ఏంది?' అన్నడు గంగయ్య.

'కులకస్పిని ఉంచుకున్నంత మాత్రాన అల్లున్ని సదివియ్యద్దని ఎవ్వలన్నరు? సదువు సదువే. నువ్వు, నీ కొడుకు గొర్లగాయవల్సిన పన్లేదు. కానీ, మీకు గొర్లుండాలె! ఆ గొర్లను నేనుగాత్త!'.

'గట్టన్న సెప్పేది నిజమే. మనకు గొర్లుండాలె!'.

'నాయిన్నా! గొర్లు కొనే.. నేను మంచిగ సదువుకుంట. మామతోని గొర్లకాడికి గూడ పోత!'.

'అటెవుసం, ఇటు గొర్లు.. మనకు ఊళ్లె గౌరవం ఇంకా పెరుగుతది'.

'లచ్చమ్మా.. అందరికి గొర్లమీదికి మనుసు పోయిందేంది?'.

'కులపోళ్లింటికి పండుగ, పబ్బాలకు పెయినప్పుడు అందరడుగుతండ్రు.. 'పెద్దగొల్ల గదా.. మీ ఆయినెకు గొర్లెందుకు లెవ్వు?' అని. గట్టన్న దేవునోలచ్చిండు. గొర్లు కొనుడే!' అన్నది లచ్చవ్వ.

'బావా! నాతోని నువ్వురా చుట్టుపక్కల ఊర్లల్ల మందమందకు తిరిగి మంచి సనుగులను ఏరుకత్త. గొర్ల మర్మం నాకెరికే. నాకెవ్వలు దిక్కులేరు. మీ ఇంట్లనే ఉంట. గొర్లగాత్త. బట్టపొట్టకు పోంగ ఏమిత్తవో ఇయ్యి. అవ్విగూడ నీ దగ్గర్నే ఉంచుకో.. నేను సచ్చేదాక నీతోనే ఉంట!'.

'అన్నా! ఎవ్వల కులకస్పి ఆల్లకుండాలె.. నువ్వే మాలోసించకు..' అన్నడు గొర్లకాన్నుంచి వచ్చిన తమ్ముడు రాజయ్య.

'గంగునాయిన్నా! గొర్ల కొను. బోయుడుగూడ దొరికె. ఒక్కగొర్రె గూడలేని నువ్వేం పెద్దగొల్లవురా?'.. అక్కడికి వచ్చుకుంటనే అన్నడు మెండె రాజయ్య.

'నా పెద్దకొడుకువు నువ్వేగాదుర రాజన్న. నువ్వుగూడ మీ అవ్వ, తమ్ముడన్న మాటే అనవడ్తవి. నన్ను పెద్దమనిషితనం ఇడిసిపెట్టి గొల్లబోయున్ని సెయ్యన్నని అనుకుంటున్నర? మరి నా కొడుకును గా పనిసెయ్యమనా మీ మాటలు...? మంచోల్లే ఉన్నరు!'.

'గంగునాయిన్నా! మనిద్దరం ఒక్క వయిసోల్లమేనైతిమి? ఊళ్లె పెద్దమనిషితనం నువ్వే సేత్తున్నవుగని.. నేం జేత్తలేనా? నాకు గొర్లు లెవ్వా! నా కొడుకును సదివిస్తలేనా? నీ కొడుకు సదువుకు, నీ పెద్దమనిషి తనానికి గొర్లేం అడ్డమత్తయని? కులకస్పి లేనోనికి పెద్దగొల్లతనం ఎందుకురా!?ఇంకేమాలోసించకు!'.

మెండె రాజన్న మాటలిని తలుకాయూపిండు గంగయ్య.

* * *

అంబటాల్లయింది. ఊరిజనం బువ్వదిని చేనుపనికి పోవుటానికి తయారైతంద్రు. ఎడ్లను తోలుకొని మక్కపెరండ్లల్ల కలుపుమొక్కలు దున్నుటానికి రైతులు చేండ్లల్లకు పోతున్నరు. చిప్ప మల్లయ్య మగ్గం గుంటల కాల్లువెట్టి కదురు టక్‌టక్ మనుకుంట అటూ ఇటు తిరుగుతుంటె మగ్గం నేస్తున్నడు. కమ్మరి బక్కయ్య కొలిమంటబెట్టి కర్రులు సాగదీస్తున్నడు. వడ్ల లసుమయ్య బాడిసెతోని నాగలిదుంపను చెక్కుతున్నడు. అవుసుల బ్రహ్మయ్య సవునంతోని బంగారం ఏరి నగలు సేత్తున్నడు. తెనుగోళ్లు, బెస్తోళ్లు గాలాలు, తోపెలలు పట్టుకోని చేపలు పట్టుటానికి వాగు, చెరువు దిక్కు నడుస్తున్నరు. చిలుక రాజయ్య ఇంటిముంగట ఎండబెట్టిన ఎద్దుతోలు, చెప్పులు కుట్టే సామాన్లు సిద్ధంగున్నయి.

ఊరంత ఎవ్వరి పనులల్ల వాళ్లు లీనమవుటానికి సిద్ధమైతున్నరు.

గొల్లవాడ రేపల్లె వాడోలె ఎలిగిపోతంది. అందరి ముఖాలల్ల సంబురం కనవడుతంది. అందరి ఇండ్లల్ల కవ్వంతో చల్లచిలికే సప్పుడు వినబడుతంది. గంగయ్య ఇంటిముంగటున్న పందిరి కింద నిల్చుంది రామక్క.

'లచ్చువ్వా..! ఓ లచ్చువ్వా!!' అని పిలిచింది.

రొండుసార్లు పిలిచినా సడీసప్పుడు లేదు.

'లచ్చువ్వా! ఓ లచ్చువ్వా!! ఏం జేత్తున్నవు? ఎంత పిల్సినా రావేంది?' అని గట్టిగ పిల్సింది.

లచ్చువ్వ రాలేదుకని దేవునర్రలకెల్లి బైటికచ్చిండు గాలయ్య. గా పిలగాని చేతులల్ల గొర్రె పిల్లుంది.

'ఎనిమిదో తరుగతి సదివే పిల్లగానివి గొర్రెపిల్లలతోని ఆడుకుంటున్నవా బిడ్డ! మీ నాయిన్న గొర్ల కొన్నప్పట్నుంచి బాగ సంబుర పడ్తున్నట్టున్నవు గద. కులకస్పుందని సదువు బందుజేత్తవా ఏంది? గొర్ల బొక్కులంటె మస్తు ప్రేమ నీకు!'.

'గవ్వేం మాటలే రామక్క! నా కొడుకెందుకు సదువు బంజేత్తడు? ఇటు మంచిగ సదువుకుంటండు. అటు కులవృత్తి పనులు నేర్సుకుంటండు. నాలుగేండ్లాయె గద మేంగొర్లు కొని.. అప్పుడు కొన్న గొర్లు నలుపై. గిప్పుడు మా మంద వందకు పెరిగింది' అన్నది లచ్చుమ్మ.. సాయమాన్లకెల్లి అవుతలికి అచ్చుకుంట.

'అత్తా! నువ్వు గిసోంటి మాటలు మల్లనేవు! నాకు సదువన్న.. మా కులకస్పి పనులన్న పానమే..' అన్నడు గాలయ్య.

'సరెగని రామక్కా.. ఎందుకో వత్తివి!' అన్నది లచ్చుమ్మ.

ఎనుకకు వెట్టుకున్న సెయ్యి ముందుకన్నది రామక్క. ఆమె చేతిల చెంబున్నది.

'సల్లకచ్చి ముంత దాసుడంటె గిదే.. సల్ల కచ్చిన్నని సెప్పలేవు! సాయమాన్ల సల్లజేత్తున్న. నువ్వు పిల్సినా వినలేదు' అని సాయమాన్లోకి పోయింది లచ్చమ్మ.

చెంబుల సల్లదెచ్చి రామక్క చెంబుల పోసింది.

'రేపు ఆదివారం. పాలు పిండం. మల్లన్న దేవుని పండుగ దినం కదా! గొర్రెబొక్కులకే ఇడిసిపెడతాం. రేపు రాకు!' అన్నది.

'సరే!' అంటూ వెళ్లిపోయింది రామక్క.

గొర్రెపిల్లలతోని అరుగుమీద ఆడుకుంటున్నడు గాలయ్య. తమకు గొర్లమంద వచ్చినప్పట్నుంచి పెద్దగొల్లరికం మరింత పెరిగింది. గౌరవం పెరిగింది. అటు కొంత భూమితోపాటు గొర్లమంద ఉండటం వల్ల సామాజిక గౌరవం పెరిగింది.

ఓ దిక్కు సదుకుంటూనే.. గాలయ్య గూడ గొర్లవెంట, పొలాల వెంట తిరుగుతూ పెరుగుతున్నడు. గట్టయ్య మామంటే తనకెంతో ఇష్టం. తమ కుటుంబంకోసం మామ రాత్రనక, పగలనక పనిజేస్తున్నడు. పెద్దమందలో తమ గొర్లను ఎట్ల ఏర్పాటు చేసుకునుడో నేర్సుకున్నడు. చెవులకున్న పెనుక (చెవికత్తిరింపు)ను బట్టి ఎవరి గొర్లను వాళ్లు ఎట్ల పాపుకుంటరో తెలుసుకున్నడు. పొలిమేరలున్న ఊరు గొర్లమందలో తమ గొర్లు కలిసినా.. వాటిని గుర్తుపడతడు. గొర్లతో కాలుకు బట్టకుండా చెట్టనక, పుట్టనక, రాయనక రప్పనక తిరుగుతున్న తనవాళ్లను చూసిండు. తోడేళ్లు, దొంగల బారినుంచి గొర్లను కాపాడుకోవడానికి వాళ్లు పడుతున్న కష్టాలను చూస్తున్నడు. చిటుకురోగమచ్చి బొంతపురుగులోలె గొర్రెలు చస్తే.. తన వాళ్లు పడుతున్న వేదన తాను అనుభవిస్తున్నడు. తను చదువుకుంటున్నా.. తనవాళ్లతోనే మమేకమై బతుకుతున్నడు. అపారమైన సాంస్కృతిక, సాంప్రదాయ సంపదను తనవి చేసుకుంటూ పెరుగుతున్నడు. కులకస్పిని, చదువును సమానంగా ప్రేమిస్తున్నడు. మూలాలు – కులకస్పి... ఈ పదాల గురించే నిత్యం ఆలోచిస్తున్నడు.

* * *

ఇరవై ఐదేండ్లు కాలగర్భంల కలిసిపోయినయి. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక విప్లవ ప్రభావంతో వచ్చిన యంత్రాల ఉపయోగం, వాటి ప్రభావం తెలంగాణలోనూ ప్రారంభమైంది. శారీరక శ్రమతో వృత్తిపనులు చేసుకునేవారి ఆదాయమార్గాలకు గండిపడటం మొదలైంది. గంగయ్యకు గొర్లుకొనిచ్చి తానే గొర్లకాపరిగా చేసి మందను పెంచిన గట్టయ్య చనిపోయిండు. ఏ దిక్కూ లేని గట్టయ్యకు గంగయ్యనే అన్నీ అయి అంత్యక్రియలు చేసిండు. గాలయ్య విద్యార్థిదశలో ఉన్నప్పటోలె కాకుండా.. గ్రామాల్లో మార్పులు శరవేగాన్ని మించి విమానవేగాన్ని అందుకున్నయి. ఊరికి కరెంటొచ్చింది. బస్సు పడింది. ఊరూరికీ

పాఠశాలలొచ్చినయి. వృత్తిపనులు ధ్వంసమవుతూ.. చాలామంది వ్యవసాయ కూలీలుగా మారారు. వ్యవసాయంలోనూ వచ్చిన సంక్షోభంతోని వలసలు పెరిగినయి. ఊరు ఇడిసిపోయేటోళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతంది. అన్ని గ్రామాల్లాగే ఆ ఊరుకూడా ప్రాకృతిక స్వభావాన్ని కోల్పోయి.. కృత్రిమత్వాన్ని అలుముకునే స్థితికొస్తున్నది.

ఈ పాతికేళ్ల కాలంల గాలయ్య ఎం.ఏ సోషియాలజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిండు. ప్రొఫెసర్ స్థాయికెదిగిండు. కానీ, ఊరిని.. కుటుంబాన్ని.. తన మూలాలను మరిచి ఉండలేదు. హైదరాబాద్‌లో ఉంటున్నా కరీంనగర్ జిల్లాలున్న తన ఊరితోని సజీవ సంబంధాలు పెట్టుకొనే ఉన్నడు. గ్రామాల్లో వస్తున్న మార్పులను గమనిస్తున్నడు. కులకస్పి ఉండాలని తండ్రితో గొర్లు కొనిపించిన గట్టయ్యను, తండ్రి పెద్దగొల్లరికాన్ని మరిచిపోలేక పోతున్నడు. ఏ స్థితిలో ఉన్నా అవే ఆలోచనలు.

తెలంగాణ గ్రామాలల్ల భూపోరాట ఉద్యమాలు బాగా జరుగుతున్న కాలం. ప్రపంచీకరణ ప్రభావం అప్పుడప్పుడే గ్రామాలకూ విస్తరిస్తున్న సందర్భం. తండ్రి సంవత్సరికానికి ఊళ్లెకొచ్చిన గాలయ్య మిత్రుడు రమణయ్యతో కలిసి ఊరంతా తిరిగి చూస్తున్నడు. ఊరుమ్మడి స్థలంగా ఉండే కమ్మరి కొలిమి దగ్గర జనం లేరు. కుమ్మరిసారె తిరగడం లేదు. చాకలి బాలయ్య పెళ్లి పల్లకి విరిగిపోయింది. అవుసులోల్ల కుంపటి నుంచి అగ్గి రాజుకుంటలేదు. సాలెల మగ్గం మూలకు పడింది. కత్తెర్లోళ్ల పశువుల మంద జాడ కనిపిస్తలేదు. వడ్లధాతి బోసిపోయింది. గొల్లలిండ్లలో కవ్వం మోతల చప్పుళ్లు లేవు. చాలా వ్యవసాయాలు మూలకుపడ్డయి. వృత్తి పనులన్నీ సంక్షోభంల పడ్డయి. ఊళ్లెకు జానపద యాచక కులాలోళ్లు రావడం తగ్గినట్టుంది.

ఊరంతా తిరిగొచ్చి మంచంల కూర్చున్నడు గాలయ్య. అతని కండ్లవెంట పటపటా నీళ్లు కారుతున్నయి. 'ఏంది బిడ్డా ఏడుస్తున్నవు! నాయిన్న యాదికచ్చిండా!?' అన్నది లచ్చవ్వ.. కొడుకు భుజంమీద చెయ్యేసి.

'అవునే అవ్వా! నాయిన్న యాదికచ్చిండు. మనింట్లనే బతికి మనకోసమే బతికి చనిపోయిన గట్టయ్యమామ యాదికత్తుండు. నాతోని సదువుకున్నోళ్లంత యాదికత్తండ్రు. వాళ్లెవ్వలు కనవడ్తలేరే! చాలా ఇండ్లకు తాళాలు కనవడ్తున్నయే అవ్వ! కొన్ని ఇండ్ల ముంగట కొడుకుల కోసురం ఎదిరిచూస్తున్న నీ అసోంటి తల్లులు గలుమలకాడ కూసుండి కనవడ్తున్నరు. ఎవుసాలు మూలకు వడ్తున్నయి. కులకస్పి పనులన్ని మూలకు పడ్డట్టనిపిస్తందే అవ్వ..' అని గొడగొడా ఏడ్వబట్టిండు గాలయ్య.

తెల్లవారి భారమైన మనసుతోని హైదరాబాద్ ఎల్లిపోయిండు.

* * *

కాలమిప్పుడు జెట్ స్పీడుతో పరుగెడుతంది. యాంత్రీకరణ ప్రభావంతో చరమదశకు వచ్చిన కులవృత్తులు.. ఇప్పుడు మరీ దెబ్బతిన్నాయి. తండ్రి చనిపోయిన తర్వాత గాలయ్య కుటుంబానికున్న మందను చూసుకునే దిక్కులేక.. గొర్రెలను అమ్మేయాల్సి వచ్చింది. భూములను, ఇల్లును కూడా ఊళ్లో ఉండే గాలయ్య చెల్లెకే దక్కినయి. పట్నంలో ఉన్న గాలయ్య.. తల్లిని చూసుకునే స్థితిలో లేడు కాబట్టి.. ఉన్నభూములు, ఇల్లు తీసుకొని తల్లిని చూసుకోవాలని ఊరి పెద్దమనుషులిచ్చిన తీర్పును గాలయ్య శిరసావహించిండు. కొన్నేండ్లలో గాలయ్య తల్లికూడా ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయింది. దాంతో.. ఊరితో సంబంధాలు తగ్గుముఖం పట్టినయి.

ఇపుడు సెల్‌ఫోన్ యుగం నడుస్తంది. కాలం మనోవేగంతో పరుగులు తీస్తంది. 21వ శతాబ్ది రెండవ దశాబ్దం నడుస్తంది. గాలయ్య పదవీవిరమణ పొందిండు. అతని పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడింద్రు. హైదరాబాద్‌లో వాళ్లకు సొంత ఇండ్లున్నయి. కానీ, ఊరిని – కులకస్పిని ప్రేమించిన గాలయ్యకు ఊళ్లో ఇంచుభూమి కూడా లేదు. నిలువనీడ లేదు. ఊరిపై ప్రేమ, ఊళ్లో స్థిరపడాలన్న బలమైన కోర్కె మాత్రముంది. చాలా ఏండ్ల తర్వాత చిన్నప్పటి సోపతికాడు డాక్టర్ రాఘవరెడ్డితో కలిసి ఊరెళ్లిండు గాలయ్య. హైదరాబాద్ నుంచి రాఘవరెడ్డి, గాలయ్య వచ్చింద్రని తెలిసి చాలామంది వచ్చి కలిసిపోతున్నరు.

'గాలన్నా! నీ పిల్లలు హైదరాబాద్‌లున్నా, వాళ్లకిండ్లున్నా.. నీకైతె ఊళ్లె ఓ ఇల్లుండాలె! రెండెకురాలన్న పొలముండాలె! భూమి కొనుక్కో. శేషజీవితం ఇక్కన్నే గడుపు!'.. చాలామంది ఇదే మాటన్నరు.

తన చిన్నప్పుడు గట్టుమామ మాటలు యాదికచ్చినయి గాలయ్యకు.

'నాకూ అదే ఆలోచనుంది. చాలా కాలమైంది గదా! చూసిపోదామని వచ్చిన. రేపు పొద్దున ఊరంత తిరుగుత!' అన్నడు.

ఉదయం రాఘవరెడ్డితో కలిసి ఊళ్లో తిరుగుతున్న గాలయ్య ముఖంలో ఏదో తెలియని ఆనందం. ఎవ్వలు ఎదురచ్చినా..

'గాలన్నా.. నమస్తే!'..

'గాలన్నా.. శనార్తులు! మంచిగున్నారె.. ఊర్ను మరిసిపోతివి!'..

'ఊళ్లె భూమి కొనుక్కోయే!'..

'ఊళ్లె ఇల్లు గట్టుకో గాలన్నా!'..

ఇవే మాటలు. బిగ్గీత కౌగిలింతలు.. ప్రేమలు!

నగర జీవితంతో ముఖం వాచున్న గాలయ్యకు తన ఊరివారి ఆప్యాయ

పలుకరింపులు చెప్పలేనంత ఆనందాన్నిస్తున్నాయి.

ఇద్దరూ మెండె రాజన్న కొడుకు పోచన్న ఇంటికెళ్లింద్రు. టీ తాగి మాటల్లో పడ్డరు.

'గాలయ్య బాపూ! నేను బీఏ చదివినా కులకస్పిలనే ఉన్న. ఇపుడు నాకు నాలుగువందల గొర్లమందుంది. యాభై ఎకరాల భూముంది. నా పిల్లలందర్నీ చదివించిన. నౌకర్లయినయి. నువ్వు పట్నంల ఏం సంపాదించినవో తెలువది కానీ.. పుట్టినూర్లనైతె ఏం లేకుంటయింది. చదువుకొని ఉద్యోగం చేయడం తప్పంటలేను. కని.. ఊర్ల భూమిని, ఇంటిని పోగొట్టుకునుడే మంచిగనిపిస్తలేదు. హైదరాబాద్‌ల నువ్వు శ్రీరామకోతులల్ల బోడకోతి అసోంటినివి. ఇక్కడ భూమున్నా, ఏ కస్పి ఉన్నా గౌరవమే కదా!'..

పోచన్న మాటలు వింటున్న గాలయ్యకు దుఃఖం ఆగడంలేదు. కళ్లవెంట పటపటా నీళ్లు కారుతున్నయి.

'బాపూ! నిన్ను నేనేమన్న బాధపెట్టిన్నా! ప్రొఫెసర్‌గ, సామాజిక కార్యకర్తగ నీకెంతో పేరుంది. ఊరుమీద మస్తు పాయిరముంది. మీ నాయిన్న, మా నాయిన్న కాలంల ఉన్నట్టు ఇప్పుడు ఏ కులం వాళ్లు ఆపనే చేసుకుంట బతుకుత లేరు. అందరు చదువుకుంటున్నరు. మునుపు భూములు లేనోల్లిప్పుడు భూములు కొనుక్కున్నరు. ఉన్నోళ్లు పోగొట్టుకున్నరు. బట్టల ముల్లె నెత్తిమీద పెట్టుకొని ఇండ్లపొంటి తిరుగుకుంట అమ్మిన రామయ్య కొడుకు ఇప్పుడు బిల్డరయిండు. ఇరవై ఎకరాల భూములు కొన్నడు. జడ్పీటీసీ అయిండు. రేపు ఎమ్మెల్యే కావచ్చు..' అన్నడు పోచన్న.. గాలయ్యను ఓదార్చుకుంట.

'పోచన్నా! పీజీలు, పీహెచ్‌డీ చేసిన నాకు లేని అవగాహన నీకున్నది. మరి నేను కులకస్పిని వదిలి చదువుకునుడు తప్పంటవా? ఎవుసాయాలు, వృత్తిపనుల సంగతేంటి?' అన్నడు గాలయ్య.

'బాపూ! మెడకాయమీద తలుకాయ ఉన్నోడెవ్వడు గట్లనడు. ఊళ్లల్ల వ్యవసాయాలు సంక్షోభంల పడ్డంక చదువుకున్నోళ్లంత భూమితోని, ఊళ్లతోని తెగదెంపులు జేసుకున్నమాట నిజమే! కని, భూమి గుండ్రంగ ఉన్నదంటరు సూడు.. గది నిజమని గిప్పటి పరిస్థితులను జూత్తె అర్థమైతంది. సమాజం ఒక వర్తులాన్ని పూర్తిచేసుకుంది. భూమ్మీద ప్రేమ పెరిగింది. ఊళ్లమీదా ప్రేమ పెరుగుతంది. అందుకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడ ఊళ్లకొచ్చి భూములు కొంటున్నరు. అమెరికాకు పోయచ్చినోళ్లు, ఇంజనీర్లు గూడ భూములు కొని ఎవుసాయాలు చేయాలనుకుంటున్నరు. అప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పుడైనా.. వస్తున్న మార్పుల కనుగుణంగ తనను తాను మార్చుకున్నోడే నిలిచి గెలుస్తడు.

పట్నాలకు దూరంగ పల్లెల్ల ఫాంహౌస్‌లు కట్టుకుంటున్నోళ్లు కనడ్తలేరా బాపు!'.

పోచన్న మాటలకు నోరెళ్లబెట్టి చూస్తున్నడు గాలయ్య.

'పోచన్నా! నేను ఎంత చదివినా నా చదువు అనుభవాలు నీ గ్రామీణ, వ్యావసాయిక, కులకస్పిపర అనుభవాల ముందు దిగదుడుపే.. నాకిప్పటికీ 'కులకస్పి' అనే పదంపై స్పష్టమైన అవగాహన లేదు. చెప్తుతవా!' అన్నడు.

'కులకస్పి అంటె ఏదైనా వృత్తికి సంబంధించిన పని. అంటే.. ఏదైనా ఉత్పత్తికి సంబంధించిన పనిలో నైపుణ్యం సంపాదించాల్నని. ఈ వృత్తి, ఉత్పత్తికి సంబంధించిన పనులు అన్ని దేశాలల్ల ఉంటయి. వాటితోనే ఏ దేశంలనైన ఎక్కువ మంది బతుకుతరు. ప్రభుత్వ ఉద్యోగాలతోని ఎంతమంది బతుకుతరు? ఎన్నేండ్లు బతుకుతరు? ఇరవై ఐదేండ్ల దాకా బాల్యం.. సదువేనాయె! అరవై ఏండ్లతర్వాత పదవి దిగి పోవుడేనాయె. మరి మిగతా జనం, మిగతా కాలం ఎట్ల బతుకాలె? ఏదో పని జేసుకుంట బతకాలె. గదే కులకస్పి. అంటే గీపని జేసెటోళ్లు, చేద్దామనుకునెటోళ్లు చదువుకోవద్దని కాదు.. వేరే దేశాలల్ల అందరు బాగ సదువుకొని ఏపనైన జేసుకుంటరు. కొద్దిమంది నౌకర్లు జేత్తరు. గక్కడ కస్పికి వృత్తిపనికి గౌరవముంటది. గదాన్నే మీ అసోంటోళ్లు 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అంటరు. గా డిగ్నిటీ ఆఫ్ లేబర్ మన దగ్గర లేకపోయేపటికెనె గిన్ని సమస్యలు. చదువుకున్నా, నౌకరి రాకుంటె ఏదైన వృత్తిపనిల నైపుణ్యముంటే సుఖంగ బతుకచ్చు గద! కులకస్పంటె ఏ కులపోళ్లు ఆ కుల వృత్తిమాత్రమే చేసితీరాలి. చదువుకోవద్దని కాదు.. గిప్పుడర్థమైందాయె!' అన్నడు పోచన్న.

'పోచన్నా! నేనిప్పుడు రిటైరయి ఉన్న! నా చిరకాల స్వప్నమైన 'ఊళ్లో స్థిరపడటం' అనే కోర్కెను తీర్చుకుంట. ఇక్కడే ఇల్లు కట్టుకుంట. ఊళ్లో ఎన్ని మార్పులచ్చినయని చెప్తుతున్నా.. పట్నాలల్ల వచ్చినట్టు కృత్రిమత్వం రాలేదు. పెదవులపై మాటలు రాలేదు. వరుసలు పెట్టుకొని పిలుచుకోవడాలు, అలాయిబలాయ్‌లు ఇంకా సజీవంగున్నయి. పట్నమోల్లోలె వ్యాపార మనస్తత్వం రాలేదు. మునుపటంత ప్రేమలు లేకున్నా పట్నాలోల్లా ప్రేమరాహిత్యం.. ఈ ఊళ్లళ్ల లేదు. నేను 'కులకస్పి'తో ఈ ఊళ్లనే శేషజీవితం గడుపుత. గొర్లు, భూమి కొని వాటిపై వచ్చే ఆదాయంతోని బతుకుత. నా పిల్లలు వాళ్ల పిల్లలతరం నాటికైనా నన్ను అనుసరిస్తరన్న ఆశ నాకుంది. అప్పటికి నేనుండకపోవచ్చు. మనదేశంల కులకస్పిని కులాలకు అతీతంగ అనుసరిస్తే ఇంకొన్నేండ్లకైన కులాలు పోతయేమొ?.. పోతయన్న ఆశ నాకుంది..' అన్నడు గాలయ్య.

* * *

## కాలువ మల్లయ్య

కాలువ మల్లయ్య 1952 జనవరి 12వ తేదీన ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత పెద్దపల్లి) జూలపల్లి మండలం తెలుకుంట గ్రామంలో జన్మించారు. ఎమ్మెస్సీ బీఈడీ, పీజీ డీపీఆర్, ఎంఏ, పీహెచ్‌డీ చేశారు. తల్లిదండ్రులు గొర్లకాపర్ల సమూహానికి చెందిన పోశమ్మ-ఓదెలు. విద్యార్థి దశనుంచే సాహిత్యాభిలాషను పెంచుకున్నారు. 1972లో పీయూసీ చదివే రోజుల్లోనే కథా రచనను ప్రారంభించారు. 1983లో రాసిన 'వెలి' కథ.. ఆయనను అభ్యుదయ రచయితగా మార్చింది. దాదాపు 50 ఏండ్లకు పైగా సాహితీ ప్రయాణం చేస్తున్న కాలువ మల్లయ్య గారు 25వేల పేజీలకుపైగా రచనలు చేశారు. ఇందులో వెయ్యికిపైగా కథలు, 18 నవలలు, 6 కవితా సంపుటాలు, 800 వ్యాసాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 70 పుస్తకాలు ప్రచురించగా, 100కుపైగా పుస్తకాలు ప్రచురించాల్సి ఉన్నది. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 30 మందికిపైగా విద్యార్థులు, ఆయన సాహిత్యంపై పీహెచ్‌డీ, ఎం ఫిల్ పట్టాలు తీసుకున్నారు. 'అవ్వతోడు గిది తెలంగాణ', 'కాలువ మల్లయ్య కథలు', 'నేలతల్లి', 'మా కథలు', 'కట్నం కథలు', 'తెలంగాణ మట్టికథలు', 'రాజు కోడి', 'తెలంగాణ తాతలు చెప్పిన కథలు', 'చెప్పుల తయారీ'లాంటి అనేక కథలు రాశారు. 'భూమి పుత్రుడు', 'సాంబయ్య చదువు', 'మాట్లాడే బొమ్మలు', 'బతుకు పుస్తకం', 'తెలంగాణ దేవదాసు', 'గువ్వల చెన్నా', 'మాదిగ విజయం'లాంటి కథా సంపుటాలను వెలువరించారు. 'బతుకు పుస్తకం' నవలకు 'ఆటా అవార్డు' అందుకున్నారు. తన రచనలకు ఇప్పటిదాకా 90కిపైగా వివిధ పురస్కాలు, అవార్డులు, అనేక సన్మానాలు అందుకున్నారు.

**-98493 77578**

# ఆశ బరువు తూయగలమా!

కైకాల వెంకట సుమలత



'సునీ! ఊరి నుంచి మా అమ్మ, నాన్నలను మనతోపాటు ఇక్కడే ఉండేందుకు తీసుకొద్దామని అనుకుంటున్నాను'..

తటపటాయిస్తూనే అన్నాడు మాధవ్.

'వద్దు.. అదనపు పనులు నేను చేయలేను. అదనపు ఖర్చులూ పెట్టలేను. ఇప్పటికే ఆఫీసులో పనెక్కువైంది. ఇంటికి వచ్చాక రోహిత్‌ని చదివించాలి. ఇప్పుడు బాగా చదివితేనే వాడి భవిష్యత్తు బాగుంటుంది. లేకపోతే వాడు కూడా చిన్న ఉద్యోగం చేసుకుంటూ మీలాగా ప్రతి రూపాయికీ వెతుక్కుంటూ ఉంటాడు' నిష్టూరంగా అన్నది సునీత.

మాధవ్ ముఖం మాడిపోయింది.

'మా అమ్మ, నాన్నలను పోషించడం కొడుకుగా నా బాధ్యత. నాకు వచ్చే జీతంలోనే వాళ్లను చూసుకుంటాను. నువ్వేమీ వాళ్లకు ఇవ్వనవసరం లేదు!' పట్టువదలకుండా మళ్లీ అన్నాడు మాధవ్.

'కొడుకుగా మీ బాధ్యత నెరవేర్చుకోవాలని అనుకుంటే.. మీరు కూడా దోసపాడు వెళ్లి మీ అమ్మనాన్నలతో నాగలి పట్టి పొలం సాగుచేయండి. అసలు మీరు ప్రైవేట్ బ్యాంక్‌లో బిజినెస్ లోన్స్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నారని పెళ్లికి ఒప్పుకొన్నాను. మీకు ఇన్సెంటివ్‌లు బాగా వస్తాయి, పోనీలే జీతం కంటే గీతం ఉంటుందని అనుకున్నాను. కానీ, మీది అరకొర సంపాదన కావడం వల్ల నేను అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది' అసంతృప్తిగా అన్నది సునీత.

మాధవ్ మనసంతా బాధతో విలవిలలాడింది. ఆ నిమిషంలో సునీతకు దూరంగా వెళ్లిపోయి అమ్మనాన్నలతో సంతోషంగా గడిపాలనిపించింది. కానీ, అతని కళ్ల ముందు రోహిత్ ముఖం కనిపించింది. వెంటనే ఆ ఆలోచన విరమించుకున్నాడు.

'మీకు వచ్చే భారీ జీతంలో మీవాళ్లకు సరిపడే డబ్బులు పంపుతూనే ఉన్నారు. అవి చాలకపోతే ఇంకా పంపండి. నాకు, రోహిత్‌కి మీరేమి పెట్టనవసరం లేదు. అంతేకానీ వాళ్లను తీసుకొచ్చి నా నెత్తిన ఎక్కించకండి. ఇక ఈ విషయంలో నేను మాట్లాడాల్సింది మరేమీ లేదు!' నిర్మొహమాటంగా అన్నది సునీత.

చేసేదేమీ లేక తన నిస్సహాయతకు తనను తాను తిట్టుకున్నాడు మాధవ్.

* * *

మాధవ్ విజయవాడలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో లోన్స్ ఇప్పించే ఉద్యోగం చేసేవాడు. సునీత గుంటూరు రెవెన్యూ ఆఫీసులో క్లర్కుగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నది. పెళ్లయ్యాక మాధవ్ కూడా గుంటూరులోనే ఉద్యోగం చూసుకున్నాడు. అలా సునీతకి ట్రాన్స్‌ఫర్ అయినప్పుడల్లా తను కూడా అక్కడే ఉద్యోగం వెతుక్కుంటాడు. వాళ్లకు ఒక్కడే అబ్బాయి.. పేరు రోహిత్. తను చేస్తున్నది ప్రభుత్వ ఉద్యోగం, భర్తది ప్రైవేట్ ఉద్యోగమని సునీతకు చిన్నచూపు. మాధవ్ మంచివాడు. నిదానస్థుడు. సునీత పొగరు అతణ్ని బాధించినా.. రోహిత్ భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని భార్యలో మార్పు కోసం ఎదురు చూస్తున్నాడు. రోజులు వడివడిగా సంవత్సరాలుగా మారుతున్నాయి. సునీతకు సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ వచ్చి మచిలీపట్నం ట్రాన్స్‌ఫర్ అయింది.

* * *

'రోహిత్! నిన్ను చేర్చిన స్కూల్ కృష్ణా జిల్లాలోనే నంబర్ వన్ స్కూల్. నువ్వు పదవ తరగతి మంచి మార్కులతో పాసవ్వాలని డబ్బు కోసం ఆలోచించకుండా ఇందులో చేర్చాను!' స్కూల్లో అడ్మిషన్ తీసుకోగానే అన్నది సునీత.

'సునీ! ఎందుకు చదువు పేరుతో వాడి మీద ఒత్తిడి తెస్తున్నావు? మొదటి నుంచి రోహిత్ బాగానే చదువుతాడు. చిన్నప్పటి నుంచీ వాడితో చదువు గురించి తప్ప వేరేదైనా, ఎప్పుడైనా మాట్లాడావా? ప్రేమగా దగ్గరికి తీసుకున్నావా?' అన్నాడు మాధవ్.

'అలా కబుర్లు కాకరకాయలు, చెప్పడానికి మీరున్నారు కదా? నాకు అంత సమయం లేదు!' ముఖం చిట్లించి అన్నది సునీత.

వాళ్లిద్దరి మాటలు విని రోహిత్ ముఖం వాల్చేసాడు. మాధవ్ అది చూసి.. రోహిత్ చెయ్యి పట్టుకుని గట్టిగా నొక్కాడు. ఆ స్పర్శలో.. 'నేనున్నాను!' అనే అండ ఉన్నదని అర్థమైన రోహిత్.. తండ్రిని చూసి నవ్వాడు.

'ఇక ఇంటికి వెళ్దాం పదండి. ఈరోజు లీవులో ఉన్నాను కదా పక్క ఇళ్లల్లో వాకబు చేసి పనిమనిషిని వెతుక్కోవాలి' అని తొందరపెట్టింది సునీత.

అన్నట్లుగానే ఇంటికి వెళ్లిన తరువాత చుట్టుపక్కల ఇళ్లలో పనిమనిషి కోసం వాకబు చేసింది.

* * *

'అమ్మగారు! అమ్మగారూ!..' అన్న పిలుపు వినిపించింది సునీతకు.

'ఎవరూ?' అంటూ వంటగదిలో నుంచి హాల్లోకి వచ్చింది.

'అమ్మగారూ! నా పేరు తులసి. నేను మీ పక్కింట్లో ఉండే లాయరమ్మ గారింట్లో పని చేస్తాను. మీరు మధ్యాహ్నం పనిమనిషి కావాలని చెప్పారట. అందుకే వచ్చాను' అన్నది తులసి.

ఒక నిమిషం పాటు తులసిని పరీక్షించింది సునీత.

తెల్లగా, బక్క పలుచని ఆకారం, నుదుట చిన్న సింధూరం బొట్టు, ప్రశాంతత నిండిన నవ్వుతో, చిరిగిన చీరైనా మనిషి శుభ్రంగా కనిపిస్తున్నది.

'పేదరికంలో కూడా ఈ ప్రశాంతత ఎక్కడినుంచి వచ్చింది? ముఖ్యంగా పాచిపని చేసుకునే వ్యక్తికి?'.. ముఖం చిట్లించింది సునీత.

'అమ్మగారు! నేను పని శుభ్రంగా చేస్తాను. మీరు ఉద్యోగానికి వెళ్తారట కదండీ! అందుకే ఇప్పుడే మాట్లాడటానికి వచ్చాను. మీరు రమ్మంటే రేపటి నుంచి పనిలోకి వస్తానమ్మగారు. నా పని మీకు నచ్చితే.. లాయరమ్మ గారు ఇచ్చినంత జీతం మీరూ ఇవ్వండి' అన్నది తులసి.

తనకు ప్రస్తుతం పనిమనిషి అవసరముందని మారు మాట్లాడకుండా ఒప్పుకొన్నది సునీత.

'ఇదుగో తులసి! నాకు పని ముఖ్యం. సోది కబుర్లు చెప్తూ కాలక్షేపం చేస్తే ఊరుకోను. రోజూ తప్పనిసరిగా రావాలి, సెలవు కావాలంటే ముందుగా చెప్పాలి' సీరియస్‌గా అన్నది సునీత.

'అలాగే అమ్మగారు!' అన్నది తులసి.

తులసి అన్నమాట ప్రకారం ఎక్కువగా నాగాలు పెట్టకుండా పని శుభ్రంగా చేస్తున్నది.

'తులసీ! నువ్వు తింటావని ప్లేట్‌లో టిఫిన్ పెడితే తినకుండా బాక్సులో పెట్టుకున్నావేంటి?'.. ఒకరోజు ఉదయం ఆశ్చర్యంగా అన్నది సునీత.

'ఇంటి దగ్గర మా అత్త ఉంటుందమ్మా! ఆమెకు టిఫిన్లంటే చాలా ఇష్టం. నేను పొద్దుటే అన్నం వండేస్తాను, గంజి పోసుకుని తింటాం. మీరు ఇచ్చినవి మా అత్త తింటుందని తీసుకెళ్తాను' అన్నది తులసి.

ఆ జవాబుకి సునీత తుళ్లిపడింది. హల్‌లో పేపర్ చదువుతున్న మాధవ్ వైపు చూసింది. అతను తల ఎత్తకుండా పేపర్ చూస్తున్నాడు.

'హమ్మయ్యా!' అనుకుంది.

'మీ ఆయన ఏం పని చేస్తాడు?' తులసిని ఎగాదిగా చూస్తూ అన్నది సునీత.

'మా ఆయన లేడమ్మా! మా పెళ్లయిన రెండో ఏడాది చేపల వేటకు వెళ్లినప్పుడు నీళ్లలో పాము కాటేసి అక్కడికక్కడే పోయాడు. అప్పుడు మా అబ్బాయికి ఏడాది వయసుంటుంది. మా మామగారు కూడా చిన్న వయసులోనే

పోయాడట. మా అత్తను, మా అబ్బాయిని పోషించే బాధ్యత నాదేనమ్మా! వాళ్ల కోసమే నాలుగిళ్లల్లో పని చేస్తున్నాను' అన్నది తులసి.

'తులసీ! మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు?' అన్నాడు పేపర్ మడుస్తూ మాధవ్.

'చదువుకుంటున్నాడు బాబుగారు! వాడికి చదువంటే బాగా ఇష్టమయ్యా! మా అత్తనేమో.. 'వాణ్ని పనిలో పెట్టు, నీకు తోడుంటాడు!' అంటుంది. కానీ వాడు పెద్ద చదువులు చదవాలని ఆశపడుతున్నాడు. అలా చదవడం మాలాంటోళ్లకి వీలుకాదని వాడి పసి బుర్రకి అర్థం కావడం లేదు' అన్నది తులసి.

'తులసీ! నాకు టైం అవుతున్నది తొందరగా పని కానివ్వు' అని టాపిక్ పెంచకుండా తులసిని అక్కడినుంచి పంపించేసింది సునీత.

* * *

ఒక ఆదివారం తులసి ఒక అబ్బాయిని తీసుకుని వచ్చింది. కాలర్ దగ్గర చిరిగిన షర్టు, పొట్టి ప్యాంటు వేసుకుని తులసి పోలికలతో ఉన్నాడు. చూడగానే.. చెప్పకుండానే అర్థమవుతున్నది ఆమె కొడుకని. ఆ అబ్బాయి వాళ్లమ్మకు పనిలో సాయం చేస్తున్నప్పుడు దగ్గరికి రమ్మని పిలిచాడు మాధవ్.

'నీ పేరేంటి బాబూ? ఎక్కడ చదువుకుంటున్నావు?' అన్నాడు మాధవ్.

'నా పేరు వేణు అండి. గాంధీ మెమోరియల్ హైస్కూల్లో చదువుకుంటున్నాను' వినయంగా అన్నాడు వేణు.

'రోహిత్! కాసేపు పుస్తకాల దగ్గర నుంచి లేచి ఇలా వచ్చి వేణుతో ఆడుకో!' అన్నాడు మాధవ్.

రోహిత్ వచ్చి వేణుని పరిచయం చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి కాంపౌండ్ వాల్ బయటికి వెళ్లి మాట్లాడుకుంటున్నారు.

'సునీ! మన తులసి కొడుకు వేసుకున్న ప్యాంటు, షర్టు అసలు బాగాలేవు. చదువుకుంటున్న పిల్లాడు కదా అలాంటివి వేసుకుంటే బాగుండదు. రోహిత్ పాతదుస్తులు కొన్ని ఆ అబ్బాయికివ్వు' అన్నాడు మాధవ్.

'ఇప్పుడు కాదు లెండి! తరువాత ఎపుడైనా చూస్తాను. రోహిత్‌కి రేపటి నుంచి సమ్మేటివ్ ఎసెస్మెంట్స్ ఉన్నాయి. నేను దగ్గరుండి వాణ్ని చదివించాలి. ఏడి వీడు?' అంటూ బయటికి వచ్చింది సునీత.

కాంపౌండ్ వాల్ దగ్గర రోహిత్, వేణు నవ్వుతూ మాట్లాడుకోవడం చూడగానే సునీత ముఖం చిట్లించింది.

'రోహిత్! ఇలా రా!'.. పెద్దగా అరిచింది సునీత.

'ఆదివారం కూడా కాసేపైనా వాణ్ని వదలవా? తోటి పిల్లలతో కాలక్షేపం మానసిక ఉల్లాసం కలిగిస్తుంది. చదువనేది ఇష్టంతో చదివితే ఒంటపడుతుంది.

బలవంతంగా ఒత్తిడిచేసి కూర్చోబెడితే తలకెక్కదు సునీ! నా మాట విని వాణ్ని వదిలేయి' బతిమాలినట్లుగా అన్నాడు మాధవ్.

'ఏం చేయాలో నాకు తెలుసు. ఇష్టంతో ఏ పిల్లలూ చదవరు. వెంటపడి కూర్చోబెడితేనే చదువుతారు. అయినా వాడికి పనిమనిషి కొడుకుతో కబుర్లేంటి? నాకు సలహాలివ్వకుండా మీ పని మీరు చూసుకోండి!' చిరాకుగా ముఖం పెట్టి అన్నది సునీత.

సునీత వెనక.. లోపల పని పూర్తిచేసుకుని వస్తున్న తులసి కనిపించింది. ఆ మాటలన్నీ విన్నదనిపించింది. కానీ ఆమె ముఖంలో కోపతాపాలకు అతీతమైన నిర్వికారభావం కనిపిస్తున్నది. ఈ పరిస్థితికి కారణం రోహిత్‌ని పిలవడమేనని మాధవ్ బాధపడ్డాడు.

'అమ్మగారు! పనంతా అయిపోయింది. ఇక నేను వెళ్తాను' అన్నది తులసి.

'సరే!' అన్నట్లుగా తలూపింది సునీత.

సునీత అలా అవమానకరంగా మాట్లాడినప్పుడు ఎదిరించాలనిపించినా.. చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లేనని మౌనంగా అక్కడినుంచి వెళ్లిపోయాడు మాధవ్.

రోహిత్ అయిష్టంగానే వేణుకి బై చెప్పి లోపలికి వచ్చి పుస్తకాలు తీసాడు.

* * *

వార్షిక పరీక్షలు వచ్చేసాయి. సునీత తను టెన్షన్ పడుతూ రోహిత్‌ను కూడా టెన్షన్ పెడుతున్నది. తెల్లవారుఝామున లేచిన నుంచి అర్ధరాత్రి పడుకునే వరకు రోహిత్ పుస్తకాలతో కుస్తీ పడుతున్నాడు అనడం కన్నా.. సునీత పట్టిస్తున్నది అనడం సబబు. ఎట్టకేలకు పరీక్షలు పూర్తయ్యాయి. 'హమ్మయ్యా!' అంటూ ఇద్దరూ ఊపిరి తీసుకున్నారు. ఆ తరువాత ఫలితాల రాకకోసం ఎదురుచూస్తున్నది సునీత. ఆ రోజు కూడా వచ్చేసింది.

* * *

'అమ్మగారు! ఈ రోజు పదవ తరగతి పాసు, ఫేలు ఫోనుల్లో తెలుస్తుందని అందరూ అంటున్నారు. నిజమేనా అండి?'.. కంప్యూటర్ ఉన్న గది గుమ్మం బయట నిలబడి చేతుల తడి కొంగుకి తుడుచుకుంటూ అన్నది తులసి.

'ఆ.. అవును నిజమే! అయినా అవి నీకెందుకు? అంట్లు తోమడం పూర్తయితే ఇల్లంతా శుభ్రంగా సర్దుకురా. గుడ్డ తీసుకుని కిటికీల అద్దాలు మరకలు లేకుండా తుడువు. ఎక్కడా కొంచెం దుమ్ము కూడా కనిపించకూడదు' ముఖం చిట్లించి అన్నది సునీత.

'ఎక్కడా దుమ్ము లేదమ్మగారు! మొన్నేగా శుభ్రంగా తుడిచాను. ఇంటికి

ఎవరైనా చుట్టాలు వస్తున్నారామ్మా?' అన్నది తులసి.

'చుట్టాలు రావడం లేదు. ఇవ్వాళ బాబు పరీక్షా ఫలితాలు తెలుస్తాయి. వాడు స్కూల్ ఫస్ట్ వస్తాడు. సాయంత్రం ఆఫీసు వాళ్లకి పార్టీ ఇవ్వాలి. ఈ పూట పనవ్వగానే ఇంటికి వెళ్లి సాయంత్రం త్వరగా రావాలి' తులసి ముఖం వైపు చూస్తూ అన్నది సునీత.

తులసికి పనెక్కువ చెప్పినప్పుడు కోపం రావడం, చిరాకు పడటం సునీత ఎప్పుడూ చూడలేదు. ఆమె ముఖం ఎప్పటిలాగానే ప్రశాంతంగా కనిపించింది. అది చూడగానే సునీతకి మళ్లీ ప్రశ్నార్థకం గుర్తు కళ్ల ముందు మెదిలింది.

'ఒక్కదాని రెక్కల కష్టం మీద మూడు ప్రాణాలు బతకాలి. సరైన తిండి, కట్టుకోవడానికి సరైన గుడ్డ లేదు. మరేం చూసుకుని ఈ ప్రశాంతత?' ఒక క్షణం మనసులో అనుకుంది సునీత.

'అమ్మగారు! మన చిన్నబాబు గారిని మీరు బాగా చదివించారు. బాబు తప్పకుండా అందరికంటే ఫస్టుగా పాసవుతాడు. మీరు చెప్పినట్లు సాయంత్రం తొందరగా వస్తానమ్మా!' ముఖం చాటంత చేసుకుని అన్నది తులసి.

'మరి కొద్ది క్షణాలలో మన విద్యాశాఖ మంత్రిగారు పదో తరగతి ఫలితాలు విడుదల చేస్తారు!' అని టీవీలో వార్త వినిపించింది.

'ఇక నన్ను విసిగించకుండా ఇక్కడినుంచి వెళ్లి పని చూసుకో!' అని సిస్టం ముందు నుంచి లేచి, హాల్‌లోకి వచ్చి టీవీవైపు చూసింది సునీత.

రోహిత్ హాల్‌లో సోఫాలో కూర్చుని టీవీ చూస్తున్నాడు. అతని ముఖమంతా చెమటలు పట్టాయి. టెన్షన్‌గా సునీత వైపు, టీవీవైపు మార్చి మార్చి చూస్తున్నాడు.

'రోహిత్! మరి కాసేపట్లో నీ రిజల్ట్స్ వస్తున్నాయి. నేను సిస్టంలో చూస్తాను. నువ్వు కూడా నాతో రా!' అంటూ వేగంగా గదిలోకి వెళ్లింది సునీత.

తులసి కాసేపు ఏదో అడగాలని తచ్చాడుతూ సునీత పట్టించుకోవడం లేదని గ్రహించి అక్కడినుంచి లోపలికి వెళ్లిపోయింది.

విద్యాశాఖ మంత్రిగారు ఫలితాలు వెల్లడి చేసారు. సిస్టంలో సర్వర్లన్నీ బిజీ అయ్యాయి. సునీత ముఖంలో విపరీతమైన కంగారు మొదలైంది. అది చూస్తున్న రోహిత్ మనసులో అంతకంతకూ భయం పెరుగుతున్నది.

'అమ్మా! ఒకవేళ నువ్వనుకున్నట్లు నేను స్కూలు ఫస్ట్ రాకపోతే?' భయపడుతూనే అడిగాడు రోహిత్.

'నో వే.. నీకు తప్పకుండా వస్తుంది. అలాంటి మాటలు మాట్లాడి నన్ను ఇంకా టెన్షన్ పెట్టకు' అసహనంగా మౌస్ కదుపుతూ అన్నది సునీత.

ఆ మాటలకు రోహిత్ మనసులో భయం మరింత పెరుగుతున్నది. ఒళ్లంతా

వణుకు వస్తున్నది. సరిగ్గా అప్పుడే అతని భుజం మీద ఒక చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూసేసరికి మాధవ్ ఉన్నాడు.

'బీ బ్రేవ్ మై బాయ్!' చిన్నగా అన్నాడు మాధవ్.

రోహిత్ మాట్లాడకుండా తండ్రి చేయి తన రెండు చేతులతో పట్టుకున్నాడు.

'రోహిత్! నీకు టెన్ బై టెన్ పాయింట్స్ వచ్చాయి. నా అంచనా ప్రకారం కాసేపట్లో మీ స్కూల్ నుంచి ఫోన్ వస్తుంది' ఆనందంగా అరుస్తూ రోహిత్ చెయ్యి పట్టుకుని ఊపేస్తూ అన్నది సునీత.

రోహిత్ ముఖం పువ్వులా వికసించింది. కానీ, అంతలోనే మళ్లీ భయంతో ముడుచుకుపోయింది. అది చూసిన మాధవ్‌కి పరిస్థితి అర్థమైంది.

'రోహిత్! నువ్వు మంచి మార్కులతో పాసయినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. కంగ్రాట్స్' అంటూ అతని నుదురు మీద ముద్దు పెట్టుకున్నాడు మాధవ్.

'రోహిత్ స్కూల్ ఫస్ట్ వచ్చాడని స్కూల్ నుంచి ఫోన్ రాలేదు. కొంపదీసి వీడికి ఫస్ట్ ర్యాంక్ రాలేదంటారా? స్కూల్‌కి ఫోన్ చేసి చూడనా?' ఆతృతగా అన్నది సునీత.

'సునీ! ర్యాంకులు పిల్లల శక్తి సామర్థ్యాలను నిర్ణయించలేవు. నీలాంటి తల్లితండ్రుల వల్లే పిల్లల్లో అసూయ ద్వేషాలు పేరుకుంటున్నాయి. ర్యాంక్ రాకపోతే తల్లిదండ్రుల కోపాలకు, నిరాశలకు పిల్లలు బలవుతున్నారు. తోటి పిల్లల గెలుపును మంచి మనసుతో అభినందించలేక పోతున్నారు. రోహిత్‌కి ఫస్ట్‌ర్యాంక్ రాకపోయినంత మాత్రాన ఇప్పుడు వచ్చిన నష్టమేముంది?' అన్నాడు మాధవ్.

అంతలో సునీత ఫోన్ రింగయింది.

'స్కూల్ నుంచి ఫోన్!' ఉద్వేగభరితంగా అంటూ ఫోన్ తీసింది సునీత.

రోహిత్ తండ్రి చెయ్యి పట్టుకుని తల్లివైపు బిక్కమొహంతో చూసాడు. మాధవ్ మాట్లాడకుండా దగ్గరికి తీసుకున్నాడు.

'ఓ మై గాడ్! థాంక్యూ.. థాంక్యూ! థాంక్యూ సో మచ్ అండి. ఇన్నాళ్లకు నా కలలు నెరవేరాయి. మీ స్కూల్‌లో టీచర్స్ అందరికీ నేను రుణపడి ఉంటాను. నేను రోహిత్‌ని తీసుకొని మిమ్మల్ని కలుస్తాను. వన్స్ అగైన్ థాంక్స్ అండి!' అంటూ ఫోన్ పెట్టేసింది సునీత.

అప్పటికే విషయం అర్థమైన రోహిత్, మాధవ్ ఇద్దరూ ఊపిరి పీల్చుకున్నారు.

'హార్టీ కంగ్రాట్స్ మై బాయ్!' పెద్దగా అరుస్తూ రోహిత్‌ని కౌగలించుకుంది సునీత.

'థాంక్స్ అమ్మా!' నవ్వుతూ అన్నాడు రోహిత్.

ఈ అరుపులకు తులసి కూడా హాల్‌లోకి వచ్చి వాళ్లను చూసి తనుకూడా వారి నవ్వుల్లో జత కలిపింది.

'తులసీ! చెప్పానా! మా రోహిత్ స్కూల్ ఫస్ట్ వస్తాడని. అలాగే వచ్చాడు!' పట్టలేనంత ఆనందం సునీత గొంతులో.

'కూర్చోబెట్టి చదివిస్తే చదువు రాదన్నారు. ఇప్పుడైనా మీకు తెలిసిందా? మంచి స్కూల్‌లో చేర్పించి, క్రమపద్ధతిలో చదివిస్తేనే చదువు వస్తుంది' మాధవ్ వైపు తిరిగి అరుస్తూ అన్నది సునీత.

'సునీ! నువ్వు చాలా ఎక్సయిట్ అవుతున్నావు. నీ కోరిక నెరవేరింది కదా! ముందు కాస్త రిలాక్స్ గా కూర్చో!' అంటూ ఆమె చేయి పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టబోయాడు మాధవ్.

అంతలో కాంపౌండ్ వాల్ దగ్గర గేటు తీసిన శబ్దమయింది. అందరి దృష్టి అటు వైపు మళ్లింది. గేటు తీసుకుని కొంతమంది విలేఖర్లు లోపలికి వస్తున్నారు.

'అదుగో! అప్పుడే మీడియా వాళ్లకు స్కూల్ నుంచి సమాచారం అందినట్లుంది. ఇప్పుడు రోహిత్ దగ్గర ఇంటర్వ్యూ తీసుకుంటారు. తల్లిదండ్రుల ఫీలింగ్స్ కూడా అడుగుతారు. మీరు పిచ్చి మాటలు మాట్లాడకుండా కాస్త జాగ్రత్తగా మాట్లాడండి. అది లోకల్ టీవీలో కూడా ప్రసారమవుతుంది. అర్థమవుతుందా?' కంగారు కంగారుగా అంటూ రోహిత్ చెయ్యి పట్టుకుని వాళ్లకు ఎదురు వెళ్లింది సునీత.

విలేఖరుల బృందం ఆమెను దాటుకుంటూ ముందుకు నడిచారు.

'హలో! ఇటు చూడండి.. రోహిత్ ఇక్కడే ఉన్నాడు!' అని పిలిచింది సునీత.

వాళ్లు వినిపించుకోకుండా వెళ్లి తులసి దగ్గర ఆగారు. వాళ్లు తన దగ్గరికి వచ్చి మైక్ ముందు పెట్టగానే.. తులసికి ఏమీ అర్థంకాక అయోమయంగా బిత్తర చూపులు చూస్తున్నది.

'అమ్మా! మీరు వేణు తల్లి తులసి గారేనా?' అన్నాడు ఒక విలేఖరి.

'అవును బాబూ! వేణు నా కొడుకే.. ఏమైందయ్యా!?' అయోమయంగా అన్నది తులసి.

'మీ అబ్బాయి వేణు పదవ తరగతిలో మన స్టేట్‌ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు గారు అతి నిరుపేద కుటుంబానికి చెందిన వేణుకి చిన్నప్పటి నుంచీ చదువంటే చాలా ఇష్టమని గొప్పగా చెప్పారు. మీరేమంటారు?' అన్నాడు మరో విలేఖరి.

'వేణు విజయానికి మీరే విధంగా సహాయం చేసారు?' అన్నాడు ఇంకో విలేఖరి.

తులసికి వాళ్ల మాటల్లో వేణు పాసయ్యాడని మాత్రం అర్థమైంది. అందుకు వీరంతా ఎందుకు వచ్చారో అర్థం కావడం లేదు.

'వేణూ! మీ అమ్మగారు అకస్మాత్తుగా నీ గెలుపు వార్త వినడం వల్ల ఆనందంతో మాట్లాడలేకపోతున్నారు. అక్కడే అగిపోయావేంటి? ఇలా రా!' అని విలేఖరులలో ఒకతను వెనక్కి తిరిగి పిలిచాడు.

అప్పుడు అందరి దృష్టి గుమ్మం వైపు మళ్లింది. అక్కడ వేణు నిలబడి ఉన్నాడు. వెనుక నుంచి టీవీలో వార్తలు వినిపిస్తున్నాయి.

'మచిలీపట్నానికి చెందిన వేణు స్టేట్ ఫస్ట్ వచ్చాడు. ఈ అబ్బాయి గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్య రాణిస్తుందనడానికి ఇదో మచ్చుతునక'...

హాల్ టికెట్ మీదున్న వేణు ఫొటో టీవీలో చూపిస్తున్నారు.

'డాడీ! వేణు!.. వేణుకి స్టేట్ ఫస్ట్ వచ్చింది!' సంతోషంగా అన్నాడు రోహిత్.

'రియల్లీ గ్రేట్ రోహిత్! వేణుకి అభినందనలు తెలియజేద్దాం పద..' అన్నాడు మాధవ్.

రోహిత్ పరుగులాంటి నడకతో వేణు చేయి పట్టుకుని..

'కంగ్రాట్స్ వేణు! నాకు చాలా హ్యాపీగా ఉంది తెలుసా? నాకు స్కూల్ ఫస్ట్ వచ్చిన దానికన్నా కూడా నీకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడం ఎక్కువ హ్యాపీగా ఉంది' అన్నాడు రోహిత్.

సునీతకు ఊహించని పరిణామానికి కళ్లు చీకట్లు కమ్మినట్లయి పడిపోబోయింది. అది ముందుగా చూసిన తులసి పరిగెత్తుకుంటూ వచ్చి పడకుండా పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టింది. మాధవ్, రోహిత్ కూడా సునీతను చూసి కంగారు పడ్డారు. వేణు అక్కడే ఉన్న మంచినీళ్ల సీసా మూత తీసి సునీత చేతికిచ్చాడు.

'సునీ! కొంచెం నీళ్లు తాగు.. అంతా సర్దుకుంటుంది' సునీత మానసిక పరిస్థితి గ్రహించి అన్నాడు మాధవ్.

సునీత కోలుకోవడం గమనించి విలేఖరులు వారు వచ్చిన పని మళ్లీ మొదలు పెట్టారు.

'తులసి గారు! మీరు మీ అబ్బాయి గెలుపు గురించి చెప్పండి. వేణుని చదువుకోమని బాగా ఒత్తిడి పెట్టేవారా?'.. మైక్ తులసి ముందు పెట్టి ప్రశ్నించారు.

'అయ్యో! ఉన్నట్లుండి నన్ను గారు అంటున్నారు. నాకు ఏమీ తెలియడం లేదు కానీ, మా వేణు పాసయ్యాడని అర్థమైంది. నేనేనాడు వాణ్ని చదువుకోమని బలవంతం చేయలేదు. స్కూల్లో ఉచితంగా పుస్తకాలు ఇస్తారు. నోట్సులు, పెన్నులు

కొనడానికి కూడా నా దగ్గర డబ్బులు ఉండవు. వాటి కోసం పొద్దున్నే లేచి ఇంటింటికీ పేపర్లు వేస్తాడు. సాయంత్రం బడి నుంచి వచ్చాక నాకు పనిలో సాయం చేస్తాడు. మిగిలిన సమయంలో పుస్తకాలు వదలడు. అయ్యో! వాడు వాడిష్టంతోనే చదువుకున్నాడు. ఇందులో నేను చేసిందేమీ లేదు!' చెమర్చిన కళ్లతో అన్నది తులసి.

'చాలా సంతోషం తులసి గారు! వేణు కష్టమనుకోకుండా ఇష్టపడి చదువుకోవడం వల్లనే ఇంత పెద్ద విజయం సాధించాడంటారు. ఇక వేణు మాటల్లో అతని భావాలు విందాం' అంటూ వేణు ముందు మైక్ పెట్టాడు విలేఖరి.

'సర్! నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మా అమ్మ పనిమనిషిగా చాలా కష్టపడుతున్నది. తను తిన్నానని అబద్ధం చెప్పి నానమ్మకి, నాకు ఇంట్లో ఉన్నది పెట్టి తను మంచి నీళ్లతో కడుపు నింపుకోవడం నేను చాలాసార్లు చూసాను. 'నువ్వు బాగా చదువుకుంటే మీ అమ్మ కష్టాలు తీరతాయి!' అని మా హెచ్ఎం గారు చెప్పారు. అప్పటినుంచి చదువంటే ఇష్టాన్ని పెంచుకున్నాను. నేను పెద్దయ్యాక మా అమ్మను పనిమనిషిగా చూడకూడదని నా కోరిక' ఆనందభాష్పాలతో అన్నాడు వేణు.

అక్కడున్న వారందరూ వేణు మాటలకు కరతాళ ధ్వనులతో హర్షాన్ని వ్యక్తం చేసారు. సునీత మాత్రం వేణుని రెప్ప వేయకుండా చూస్తున్నది.

'ఇష్టంగా చదవడం అన్న వేణు మాట' సునీతను ఆలోచింపజేసింది. అలాగే తులసి వైపు చూసింది. ఎప్పటిలాగే ప్రశాంతంగా కనిపిస్తున్నది.

'తన కుటుంబాన్ని పోషించడమనేది ఇష్టంగా చేస్తున్నది కాబట్టే అసంతృప్తి లేదు' .. సునీతకి అప్పటి వరకు తనకు తెలియని సత్యం బోధపడినట్లు అనిపించింది. క్రమేపీ ఆమె ముఖంలో చిరునవ్వు చోటు చేసుకుంది.

'మేడం! మీ ఇంట్లో పనిచేసే వ్యక్తి కొడుక్కి స్టేట్‌లో ఫస్ట్ ర్యాంక్ రావడం పట్ల మీ అభిప్రాయం తెలుపండి'.. సునీత దగ్గరికి వచ్చి, ఆమె ముందు మైక్ పెడుతూ అన్నాడు విలేఖరి.

'పువ్వు సహజంగా వికసించాలి. బలవంతంగా రేకులు విప్పితే సహజత్వాన్ని కోల్పోతుంది. పిల్లలు వారికై వారు ఇష్టంతో చదివితే ఎలిమెంటరీ స్కూల్లో చదివినా చదువు వస్తుంది. కార్పొరేట్ స్కూలే కానవసరం లేదు. ర్యాంకుల పేరుతో వారి తెలివి తేటలను అంచనా వేయకూడదు. వారిని మార్కుల కోసం ఒత్తిడి చేయకూడదు. వేణు మంచి అబ్బాయి, బాధ్యతలు తెలిసిన తులసి పెంపకంలో మరింత రాణిస్తాడు. అతని భవిష్యత్తుకి మావంతు సహకారం మేము అందిస్తాము' అంటూ మైక్ ఇచ్చేసింది సునీత.

తరువాత అక్కడినుంచి తులసి, వేణు, విలేఖరులతో సహా అందరూ

వెళ్లిపోయారు.

సునీత గొంతులో నిజాయతీ గమనించిన మాధవ్ ఆమె భుజం మీద చేయి వేసాడు. 'ఏవండీ! మీరే గెలిచారు. ఉన్నత స్థానం చేరుకోవాలనే ఆశతో అనుబంధాలు, ఆత్మీయతలు వదిలేసి పరుగులు తీసాను. అసంతృప్తితో రగిలిపోతున్న నాకు ఇప్పుడు చల్లని గంధంపూత పూసినట్లుంది!' అంటూ పశ్చాత్తాపంతో మాధవ్ చేయి మీద చేయి వేసింది సునీత.

'అమ్మా! ఇన్ని రోజులూ నువ్వు చెప్పావని భయపడుతూ చదువుకున్నాను. ఇక నుంచి ఇష్టపడుతూ చదువుకుంటాను' నవ్వుతూ అన్నాడు రోహిత్.

సునీత కళ్లకు రోహిత్ వికసించిన పుష్పంలాగా కనిపించాడు.

***

## కైకాల వెంకట సుమలత

పిల్లల తెలివితేటలను ర్యాంకులతో నిర్ధారించి.. వారి మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న వ్యవస్థ మారాలని 'ఆశ బరువు తూయగలమా!' కథ ద్వారా కోరుతున్నారు రచయిత్రి కైకాల వెంకట సుమలత. వీరి స్వస్థలం కృష్ణా జిల్లా గుడివాడ. డిగ్రీ తర్వాత టీటీసీ చేశారు. ఊహ తెలిసినప్పటి నుంచే తన మనసును ఆకట్టుకునే అందాలకు, హృదయాన్ని కదిలించే ఆర్ద్రతకు అక్షర రూపం ఇవ్వాలని ఉవ్విళ్లూరేవారు. డిగ్రీ మొదటి సంవత్సరం సావనీర్‌లో వీరి మొదటి కవిత 'అందాల శిశిరమా! నిశ్శబ్దత దాల్చి దుఃఖిస్తావెందుకు?' ప్రచురితమైంది. మొదటి కథ 'ప్రేమించే మనసు'.. ఆంధ్రభూమి సచిత్ర వారపత్రికలో వచ్చింది. అలా వీరి సాహితీప్రయాణం మొదలైంది. సాహో, స్వాతి ముత్యం, ఏది దానం?.. ఎవరు దాత? కథలు విశేష పాఠకాధరణ పొందాయి. శ్రీమతి సుశీల నారాయణ రెడ్డి ట్రస్టు నుంచి వీరి కథల సంపుటి 'సుమ సౌరభాలు' వెలువడింది. వీరి రచనలు అన్నీ ప్రముఖ దిన, వార పత్రికలలో ప్రచురితం అయ్యాయి. వాటిలో బహుమతులు పొందినవే ఎక్కువగా ఉన్నాయి. సాహిత్య ప్రయాణంలో భాగంగా.. సోమేపల్లి జాతీయస్థాయి పురస్కారం, అక్షరాల తోవ జాతీయ స్థాయి పురస్కారం, మం'దారం' లాంటి పలు జాతీయస్థాయి పురస్కారాలు అందుకున్నారు.

**–94926 56255**



# అమ్మ పుట్టిల్లు

## నెల్లుట్ల రమాదేవి

'ఇంకెంత దూరంలో ఉన్నాం?' తల్లి ప్రశ్నతో..

కారు కిటికీలోంచి బయటి పరిసరాలు చూస్తున్న శిరీష..

'దగ్గరి కొచ్చేసాం.. పదిహేను నిమిషాలు అంతే!' అని మళ్లీ..

'ఎందుకమ్మా .. అలసటగా ఉందా?!' అని అడిగింది.

ఏమీ లేదన్నట్టు తలూపి.. మళ్లీ కళ్లు మూసుకుంది లలిత. ఇంకొద్దిసేపట్లో తన ఊరొస్తుంది. కేశవను చూడొచ్చు.

ఎలా ఉన్నాడో కేశవ?.. ఎంత ఇబ్బంది పడుతున్నాడో! ఏదీ చెప్పడు. తనకు ఏదైనా అయితే మటుకు ఆకాశం, నేలా ఒకటి చేస్తాడు.

తన కాలికి ముల్లుగుచ్చితే విలవిల్లాడి పోయేవాడు. తనకేదైనా బాధ కలిగితే వాడి కళ్లల్లో నీళ్లు తిరిగి ఆ బాధ ప్రతిఫలించేది. ఎవరైనా అలా ఉంటారా అసలు ?!

* * *

బడికెళ్లే రోజుల్లో ఓసారి శ్రీహరి వెనుకనుంచి తన రెండు జడలు లాగాడని తెలిసి.. ఎలా చితగ్గొట్టాడో అతన్ని! ఐదారుగురు కలిస్తేగానీ కేశవను పట్టుకోలేకపోయారు.

'ఈసారి మా అక్కనేమన్నా అన్నావంటే చేతులిరగ్గొడతా!' అంటున్న కేశవ్ కళ్లల్లో కోపాన్ని చూసి మొదటిసారిగా భయపడిన క్షణాలవి!

ఊర్లో హైస్కూల్ ఉన్నా తను ఇంటర్ కోసం పక్క టౌన్‌కు బస్సులో వెళ్లి రావాలని తెలిసి, కేశవ టీసీ తీసుకుని కాలేజీకి దగ్గర్లో ఉన్న స్కూల్‌లో చేరాడని తెలిసి.. ఆ ప్రేమకు ఆశ్చర్యం, పొసెసివ్‌నెస్‌కి భయం కలిగిన మాట నిజం! తనకే కాదు, తన స్నేహితులకూ కేశవ తమ్ముడే! ఎవ్వరికేది కావాలన్నా తెచ్చిపెట్టేవాడు.

వాళ్లు మొహమాటపడినా..

'ఏం ఫర్వాలేదక్కా! మా అక్కెంతో మీరూ అంతే!' అనేవాడు. తనెప్పుడైనా..

'ఎందుకురా అందరి పనులూ నెత్తినేసుకుంటావు?!' అన్నా కూడా..

'నీ ఫ్రెండ్సే కదక్కా! వాళ్లకేదైనా కావాలంటే నువ్వు వెంటవెళ్లాల్సిందే కదా! ఎండలోపడి ఆ ఊరంతా తిరగడం, అలసిపోవడం ఎందుకు?' అనేవాడు.

తనకు సంబంధించిన ప్రతి విషయంలోనూ ఎంతో కేరింగ్‌గా ఉండేవాడు.

కొన్నిసార్లు అమ్మానాన్నల కంటేకూడా కేశవే ఎక్కువ శ్రద్ధ చూపించేవాడని అనిపించేది.

తనకు తెల్లకలువలు అంటే ఎంతో ఇష్టం. ఊరిచెరువు నిండా విచ్చుకుని ఉండేవి. తనకు వాటిని తెచ్చివ్వడం కోసమే ఏడేళ్ల వయసులో ఇంట్లో చెప్పకుండా ఈత నేర్చుకున్నాడు కేశవ. ఊరి నిండా వాడి స్నేహితులే! అయినా చింతకాయలు, మామిడికాయలు, రేగుపళ్లు, జామపళ్లు ... ఇలాంటివి తామిద్దరి మధ్యే. అన్నయ్య మాధవ్ తనకన్నా మూడేళ్లు పెద్ద అయినా ఎందుకో తన చదువేమో.. తనేమో అన్నట్టుండేవాడు.

డిగ్రీ చదువుతున్నప్పుడు తన సీనియర్ కృష్ణమోహన్ లవ్‌లెటర్ రాసి వాళ్ల తమ్ముడు రాజు చేతికిచ్చి పంపించాడు తనకు. ఇంట్లో పెద్దవాళ్లకు చెప్పడానికి భయపడి, స్నేహితులు ఆటపట్టిస్తుంటే ఆ ఉత్తరం చించిపారేద్దామని చూస్తే దొరకలేదు. అదెలా తెలుసుకున్నాడోగానీ ఆ ఉత్తరం చదివిన కేశవ.. కృష్ణమోహన్ దగ్గరికి సరాసరి వెళ్లిపోయి మాట్లాడాడట.

'ఆ ఉత్తరం టైంపాస్ కోసం రాశావా!? లేక నిజాయతీగా ఇష్టపడుతున్నావా?! మా అక్కపట్ల నీకు నిజంగా ప్రేముందా?! మా అక్కను పెళ్లి చేసుకోవాలంటే నీ డిగ్రీ పూర్తిచేసి మంచి ఉద్యోగం దొరికాక అప్పుడు మాట్లాడు.. అదికూడా మా అక్కకు ఇష్టమైతేనే! ఈలోగా ఏదైనా అల్లరి చేశావంటే నేను మంచోణ్ని కాను. మా అక్కకోసం ఏదైనా చేస్తాను' అంటూ బెదిరించాడట. ఆ తరువాత తనను చూస్తేనే ఆమడదూరం పారిపోయేవాడు కృష్ణమోహన్. అప్పుడు కేశవ చదువుతున్నది ఇంటరే.

ఏళ్లు గడుస్తున్నకొద్దీ అక్కాచెల్లెళ్ల మధ్యకన్నా అన్నదమ్ముల మధ్యప్రేమ తగ్గుతుందంటారు. కానీ, కేశవ ప్రేమలో ఏమాత్రం మార్పు లేదు. ఇంకా పెరిగింది కూడా! డిగ్రీ అవుతూనే తన పెళ్లి అయింది. ఆ పెళ్లిలో సందడంతా కేశవదే! అమ్మకు ఇంట్లో అన్నీ సర్దిపెట్టడం నుంచీ, సామాన్లు తేవడం, ఎక్కడికంటే అక్కడికి వెళ్లడంలాంటి పనుల్లో నాన్నకు ఎంతసహాయం చేసాడో! నెలకోసారి తన అత్తవారింటికి చుట్టానికి వచ్చేవాడు కేశవ.

'మీ అక్కను పెళ్లి చేసుకుంటే నువ్వు బోనస్‌గా వచ్చావు. మరదలువైనా కాకపోతివి'.. అంటూ బావమరిదితో పరాచికాలాడేవాడు తన భర్త ఆనంద్. కేశవ నవ్వేసేవాడు.

ఆనంద్ నీటిపారుదల శాఖలో ఇంజినీరుగా నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడుల్లో పనిచేసేప్పుడు తనొక్కతే ఇంట్లో ఉంటుందని అప్పుడప్పుడూ కేశవ వచ్చి ఉండేవాడు. కొన్నిసార్లు క్యాంపుకెళ్లాల్సి వస్తే ఆనందే కేశవను పిలిపించేవాడు.

అంతలా అతనికికూడా నచ్చాడు. ముగ్గురు కలిసి సినిమాలకు వెళ్లేవాళ్లు, కార్డ్స్ ఆడేవాళ్లు, ఎటైనా పిక్నిక్‌లకు వెళ్లేవాళ్లు. కేశవ వస్తే తనకు ఎంతో సంతోషంగా, రిలీఫ్‌గా ఉండేది. వంటచేస్తుంటే కూరగాయలు కట్ చేసిస్తూ, చపాతీలు వత్తితే పెనంమీద కాలుస్తూ, ఎప్పుడైనా టైలర్ దగ్గరికో, మార్కెట్‌కో వెళ్తే తోడుగా వస్తూ ఉండేవాడు. ఇద్దరూ కలిసి బోలెడు పుస్తకాలు చదువుతూ ఆ కథల గురించీ, నవలల గురించీ చర్చించుకునే వాళ్లు.

శిరీష పుట్టినప్పుడు, శ్రీకాంత్ పుట్టినప్పుడు అమ్మ ఇంటికి వచ్చి వంటచేసి తీసుకొచ్చే టైంలోనూ, రాత్రంతా అమ్మతో బాటుగానూ హాస్పిటల్‌లో ఉండేవాడు. పిల్లలను ఎత్తుకోవడం, స్నానం పోయడం, బట్టలు తొడగడం ఎంతబాగా అలవాటు చేసుకున్నాడో! మూడు నెలలదాకా పిల్లలు రాత్రుళ్లు నిద్రపోకుండా ఉంటే..

'మీరు పడుకోండి అమ్మా! మళ్లీ అక్కకు నిద్రసరిగా లేకపోతే కష్టం!' అంటూ పిల్లల్ని భుజంమీద వేసుకుని తిప్పేవాడు.

ఏ తెల్లవారుఝామునో నిద్రపోతే చప్పుడు కాకుండా.. పిల్లల్ని తనదగ్గర పడుకోబెట్టి వెళ్లి పడుకునేవాడు.

'నాకు ఇంకో ఆడపిల్లలా ఆసరా అవుతున్నావురా! బంగారు కొండవి! మీ అక్కకూడా నా చేతికింద ఇంతపని చేయలేదు!' అనేది అమ్మ మురిపెంగా.

'ఆఁ.. వంటింటి పనులు చేయించి వాన్ని చెడగొడుతున్నావు. ఎప్పుడు చదువుకుంటాడు?!' అనేవాడు నాన్న.

అలా అనేవాడే గానీ, నాన్నకూ ఇష్టమే. ఎప్పుడూ చదివినట్టు కనిపించేవాడు కాదుగానీ, కేశవ బాగా చదివేవాడు.

అన్నయ్య బాగా చదువుకుని అమెరికాకు వెళ్లడం, మధ్యలో ఓ పెద్దింటి అమ్మాయి సంబంధం నచ్చి పెళ్లి చేసుకోవడం, ఇద్దరుపిల్లలూ అమెరికాలోనే పుట్టడం, అక్కడే బాగా సెటిల్ అవడం జరిగిపోయాయి. కేశవ మాత్రం డిగ్రీ దాకానే చదివి అమ్మానాన్నలకోసం ఆ ఊర్లోనే ఉంటూ వ్యవసాయం చేపట్టాడు. వ్యవసాయం చేస్తున్నాడని తనకు పెళ్లి సంబంధాలు పెద్దగా రాలేదు. వచ్చినవాటిలో కూడా..

'అక్కా! మొదటగా అమ్మాయిని నువ్వు చూడాలి! నీకు నచ్చాలి' అనేవాడు.

'చేసుకోబోయే వాడివి నువ్వు! నీకు నచ్చాలి గానీ, నాదేముందిరా!' అంటే వినేవాడు కాదు.

ఓ పేదింటి అమ్మాయిని కట్నమేమీ తీసుకోకుండా చేసుకోవాలనేది కేశవ కోరిక. చివరికి అలాగే తను ఎన్నికచేసిన లక్ష్మి కోడలిగా ఆ ఇంటికి వచ్చింది. మంచీ,

మర్యాదా ఉన్న అమ్మాయి. ముఖ్యంగా కేశవను అర్థంచేసుకుని వాడి జీవితంలో అంతర్వాహినిలా కలిసిపోయింది.

చూస్తూ ఉండగానే ఏళ్లు గడిచాయి. కేశవ దంపతుల చేతుల్లో సంతృప్తిగా కన్నుమూశారు అమ్మానాన్న. మాధవన్నయ్య కూతురు పెళ్లిఖర్చుల కోసమని ఊర్లో ఉన్నపొలంలో తన వాటా సగంఅమ్మి ఇండియాలోనే చాలా గ్రాండ్‌గా పెళ్లిచేసాడు. పంపకాల్లో రెండెకరాల పొలమే కేశవకు మిగిలింది. ఊర్లో ఉన్న ఇల్లు మాత్రం..

'నువ్వు అమ్మానాన్నల్ని చూసావుగా.. అందుకని ఇంట్లో నాకేమీ వాటావద్దు!' అన్నాడు మాధవ ఉదారంగా. కేశవ ఏమీ మాట్లాడలేదు.

ఉండబట్టలేక ఆనంద్ కేశవతో..

'మీ అన్నయ్య మంచిపొజిషన్‌లో ఉన్నాడు. తన ఫారిన్ చదువుకు మీ నాన్న ఎంతో ఖర్చుపెట్టాడు కూడా! ఆ రెండెకరాల పొలం అమ్మకపోతే ఆయనకు గడవదా? నీకు వదిలిపెడితే బావుండేది. నాకు తెలిస్తే నేనైనా అడిగేవాణ్ని!' అన్నాడు.

కేశవ వెంటనే..

'వద్దు బావా! మీకు నామీద ఉన్న అభిమానం చాలు. అన్నయ్యకు కూడా అమ్మానాన్నల ఆస్తిలో హక్కు ఉంటుంది కదా! ఏమాత్రం వీలున్నా నేనే ఆ పొలం కొనుక్కునేవాణ్ని. కానీ, నా దగ్గర డబ్బు లేదు. అసలు మా అక్కకు ఏమైనా ఇవ్వాలన్నా నా దగ్గరలేదు' అన్నాడు నిస్సహాయంగా. ఆ పొలం కొనుక్కోవడానికి ఆనంద్ అప్పుగా డబ్బు ఇస్తానన్నా కేశవ ఒప్పుకోలేదు.

కేశవకు నెలనెలా ఆదాయమొచ్చే ఉద్యోగమేదీ లేదు. వ్యవసాయంలో ఆదాయం అంతంత మాత్రమే. మధ్యమధ్య తనదగ్గరికి వచ్చేటప్పుడు కూరగాయలు, తినుబండారాలు, పచ్చళ్లు, పొడులు పట్టుకొచ్చేవాడు. లక్ష్మి కూడా సహకరించకుంటే అది సాధ్యపడేది కాదని తనకూ తెలుసు. కొన్నేళ్లుగా కేశవ చాలా కృంగిపోయినట్టు కనిపించేవాడు.

'ఏమిట్రా.. అలా ఉన్నావు?! ఏమైనా ఇబ్బందా?!' అంటే..

'ఏమీ లేదక్కా!' అనేవాడు.

అడగ్గా అడగ్గా కొడుకు శరత్ సరిగ్గా చదువుకోవట్లేదనీ, అల్లరిచిల్లరగా తిరుగుతున్నాడనీ చెప్పాడు.

బలవంతంగా కేశవను ఒప్పించి మేనల్లుణ్ని తెచ్చి తన దగ్గరే ఉంచుకుని.. ఇక్కడి స్కూల్లో చేర్పించింది. కేశవ చెప్పిన దానికన్నా ఎక్కువే మొండితనం ఉందని అర్థమయ్యింది.

'మీరంతా బాగానే ఉన్నారు. తాతయ్య కోసం, నానమ్మకోసం మా నాన్నను

ఊర్లోనే కట్టిపడేసి సరిగ్గా చదివించక పైకి రానీకుండా చేశారు. అందుకే మేమిలా ఉన్నాం!' అనే శరత్ అభిప్రాయాన్ని ఎంత నచ్చచెప్పినా మార్చలేకపోయింది తను.

వాణ్ని బాగా చదివించాలనుకున్నా పట్టుమని పదినెలలు బలవంతంగా ఉండి.. మళ్లీ ఊరికి వెళ్లిపోయాడు. కూతురి పెళ్లికి, ఆ తరువాత అప్పులకీ ఆ రెండెకరాలూ కేశవ అమ్మాడని తెలిసి చాలా బాధపడింది.

ఈలోగా శిరీష మెడిసిన్, శ్రీకాంత్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. శిరీష పీజీలో ఉండగా డా. విజయ్‌తో పెళ్లికాగానే ఇద్దరూ ఇరాన్ వెళ్లి, కొన్నాళ్లకు ఇండియా వచ్చి నర్సింగ్ హోమ్ పెట్టుకున్నారు. శ్రీకాంత్ కూడా అమెరికాలో ఎమ్మెస్ చేసి, సంధ్యతో పెళ్లికాగానే అక్కడే ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

పదేళ్ల కింద ఆనంద్ చనిపోవడంతో తనచుట్టూ చీకట్లు కమ్ముకున్నాయి. ఆరోగ్యం కూడా దెబ్బతిన్నది. అదివరకే శిరీష దగ్గర తను ఉండననడంతో వాళ్లే పిల్లలకోసం తమ ఇంట్లోనే పైఫ్లోర్‌లో ఉంటున్నారు. తమకు ఎప్పటికీ ఇంట్లోనే ఉండేలా వంటమనిషి ఉంది. పై పనులకు ఇంకో ఆవిడ ఉంది. రోజూ శిరీష వచ్చిచూసి కాసేపు మాట్లాడుతూ ఉంటుంది. ఒకవిధంగా జీవితం సాఫీగానే సాగుతున్నది. ఇప్పుడీ వార్త.. కేశవ ఇల్లు అమ్ముతున్నాడని! అంతకంటే ఎక్కువ బాధపెట్టిన విషయం.. కొద్దిగా పక్షవాతంలా వచ్చి తగ్గిందనీ, కర్రతో నడుస్తున్నాడనీ! కొడుకు సిటీలోనే ఉంటూ ఏదో చిట్‌ఫండ్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడనీ, అందులో డబ్బులు వాడుకున్నాడనీ, కట్టకపోతే ఊరుకునేది లేదని వాళ్లు ఒత్తిడి చేస్తున్నారనీ, ఎలాగైనా ఇల్లు అమ్మి డబ్బు ఇవ్వమంటున్నాడని తెలిసి ఇంకా బాధ కలిగింది.

ఇల్లు మరొకరి ఆధీనంలోకి వెళ్లకముందు ఒక్కసారి చూసిరావాలని, ఆ ఇంటితో ఉన్న జ్ఞాపకాల్ని మరోసారి తల్చుకోవాలనీ బలంగా అనిపించింది. కేశవ ఇబ్బందులేమిటో ఓసారి అడిగి.. తన చేతనైనంత సాయం ఏదైనా చేయాలని కూడా అనిపించింది. అందుకే ఇప్పుడీ ప్రయాణం.. ఆదివారమైతేనే శిరీషకు కొంచెం సమయం చిక్కుతుంది. కానీ, ఏమిటో సడన్‌గా నిన్న..

'అమ్మా! రేపు మనం అమ్మమ్మా వాళ్ల ఊరెళ్తున్నాం!' అన్నది.

* * *

'అమ్మా! ఊరొచ్చింది. నిద్రపట్టిందా?!'.. శిరీష అడుగుతుంటే ఆలోచనల దారం తెగింది.

ఊరు చాలా మారింది. ముందున్న చెరువు చిక్కిపోయి చిన్నగా అయింది. అయినా కలువ మొగ్గలు నిండుగా ఉన్నాయి. రాజరత్నం పాన్‌షాప్ ఉన్నచోటునే ఓ బిల్డింగూ, అందులో పెద్ద కిరాణాషాపు వెలిసాయి. ఆ పక్కనే సెలూన్ కొంచెంమారి

అద్దాలతో నీట్‌గా కనిపిస్తున్నది. మణెమ్మ టైలర్ మాయమై ఓ రెడీమేడ్ బట్టలషాప్ వచ్చినట్టుంది.

'ఈ ఊరినిక మళ్లీ చూస్తానా!' అనిపించింది లలితకు.

చూస్తుండగానే ఇంటి ముందు కారు ఆగింది. ఓ పక్కన ప్రహరీ కొంచెంకూలి రాళ్లు, మట్టికుప్పగా పడిఉంది. అందులోంచే ఓ బఠాణీతీగ నిండా గులాబీరంగు పూలతో తొంగి చూస్తున్నది. పెద్ద వేపచెట్టు పచ్చగా ఉండి బోలెడంత నీడ ఇస్తున్నది. ఇల్లు బాగా పాతబడినా ఎప్పట్లాగే కళగా ఉంది. పదేళ్లనాడు చూసిన ఇల్లు. ఆనంద్ పోయాక కేశవ తీసుకువస్తే బలవంతంగా వచ్చి.. ఓరోజు ఉండి వెళ్లిందంతే! మళ్లీ ఇప్పుడే రావడం.

తను ఆడిపాడిన ఇల్లు, అమ్మానాన్నలతో ఆనందంగా గడిపిన ఇల్లు, బాల్య, యవ్వన జ్ఞాపకాలతో ముడిపడిన ఇల్లు.. ఇక తమదికాదా?! కనీసం కేశవది కూడాకాదా?! ఇక కేశవ ఎక్కడుంటాడు? ఆలోచనలతోనే శిరీష చెయ్యిపట్టుకుని లోపలికి అడుగుపెట్టింది లలిత.

'అక్కా!' అంటూ చేతికర్రతో మెల్లగా నడుస్తూ వచ్చి.. గట్టిగా చేయి పట్టుకున్నాడు. ఇద్దరి కళ్లల్లోనూ నీళ్లుతిరిగాయి.

'ఏంరా ఇది?! ఇలా అయిపోయావు? నాతో మాటమాత్రం చెప్పకూడదా?! నేనంత పరాయిదాన్ని అయిపోయానా! లేక ఏమీ చేయలేనని అనుకున్నావా?!' మాటపూర్తిగా రాకుండానే గొంతు గద్గదమైంది.

'లేదక్కా!! నువ్వు బాధపడతావని.. అయినా బాగానే ఉన్నానుగా!' అన్నాడు కేశవ. అతని గొంతులో ఎప్పుడూ కనిపించని దిగులు ధ్వనించింది. 'నువ్వు రెస్ట్ తీసుకో అక్కా! నేను రిజిస్టర్ ఆఫీస్ దాకావెళ్లి ఇప్పుడే వస్తాను!' అన్నాడు.

'నా కారులో వెళ్దాం మామయ్యా! నేనుకూడా వస్తాను. అమ్మకూడా రావాలి కదా.. సంతకం పెట్టడానికి' అన్నది శిరీష.

'అక్కడ ఎంతసేపు పడిగాపులు పడాలో ఏమిటో! అక్కను ఇంటిదగ్గరే ఉండనివ్వు, సంతకం అవసరమైతే అప్పుడు కారు పంపుదాం' అన్నాడు కేశవ.

మేనమామకు తన తల్లిఅంటే ఎంతప్రేమో మరోసారి అర్థమైంది శిరీషకు. కాఫీతాగి వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

లలిత పెరట్లోకి వెళ్లింది. గోడకు పాకిన మల్లెతీగ నిండా మొగ్గలతో అలాగే ఉంది. సాయంత్రం అవుతూనే మొగ్గలుకోసి తల్లి తనకు జడనిండా పెట్టేది. ఇంకా పొడవాటి మాలలు ఇస్తే తను స్నేహితురాళ్లకి ఇచ్చేది. జామచెట్లు రెండు నిండాకాయలతో ఉన్నాయి. అటుపక్క చింతచెట్టు, బాదంచెట్టు బాగా నీడను పంచుతున్నాయి. మునగ, సపోటా చెట్లకు ఇప్పుడే కాయలు వస్తున్నాయి. చిక్కుడు,

దొండ, బీర, సొరకాయ తీగలు పందిళ్లకు పాకుతున్నాయి. పరిసరాలు పచ్చగా ఉన్నాయి.

మరోపక్క ఆకుకూరలు, కూరగాయమడులు చక్కగా పెరిగి ఉన్నాయి. ఇంట్లోఉన్న పాత బావికే కరెంట్ మోటార్ అమర్చినట్టున్నారు. నీళ్లుబాగానే ఉన్నట్టున్నాయి.

'ఎంతపెద్ద పెరడు? సిటీలో ఇంతజాగా ఉంటేనా! ఈ ఇల్లు అమ్ముకుంటే ఎక్కడ ఉంటారు?!'.. గాఢంగా నిట్టూర్చింది లలిత.

'మొక్కలు చూస్తున్నారా వదినా?!'..

వెనకాల లక్ష్మి మాటలు వినిపించి చూసింది.

'మీరు చిన్నప్పుడు పెరిగిన పరిసరాలు చూసుకుంటున్నారా?!'.

'అవును.. బహుశా ఆఖరిసారి!' అన్నది లలిత దిగులుగా.

'ఏంచేస్తాం? ఆయన కూడా చాలా బాధపడుతున్నారు. కానీ, తప్పని పరిస్థితి వచ్చింది. ఉన్న రెండెకరాలూ ఇదివరకే చదువులకీ, శైలూ పెళ్లికీ అమ్మేసాం. రెండేళ్లనుంచీ ఇల్లు అమ్మేద్దామని శరత్ వెంటపడుతూనే ఉన్నాడు. మీ తమ్ముడే ఎలాగో నచ్చచెప్పి ఆపుతూ వచ్చారు. ఇక రెండు నెల్లకింద వాడేవచ్చి స్నేహితులద్వారా ఇల్లు బేరం కుదిర్చి అడ్వాన్స్ తీసుకుని వెళ్లాడు. ఇక చేసేదేముంది?!' నిర్వేదంగా అన్నది లక్ష్మి.

'అంత అవసరం ఏమొచ్చిందట?!' లలిత అడిగింది గానీ..

'ఎందుకు అడగడం!? బాధ పెట్టడానికి కాకపోతే!' అనుకుంది.

'మీ దగ్గర దాచేదేముంది వదినా! శరత్‌ను మంచి స్కూల్‌లో, కాలేజీలో చేర్చి, ఫీజులుకట్టినా, అడిగినవన్నీ కొనిచ్చినా.. చదువుకునే రోజుల్లో సరిగ్గా చదువుకోలేదు. మంచి ఉద్యోగమూ లేదు. ఏదో చిన్న ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు వాడు. ఇక ఇద్దరూ ఇష్టపడ్డారేమో.. ఆ అమ్మాయికి ఇంట్లో వాళ్లు వేరే సమ్మంధం చూసినా.. వద్దని పెళ్లి చేసుకున్నారు. తెలిసిందే కదా! కొన్నాళ్లు మా దగ్గరే ఉన్నారు. ఆ తరువాత కోడలుకు ఈ పల్లెటూరు నచ్చలేదు, బస్తీలో కాపురం పెట్టారు. మేమూ వద్దనలేదు. ఇద్దరికీ పొదుపు లేదు. దాంతో బాగా అప్పులై అందరూ ఇంటి మీదికొస్తున్నారని ఇప్పుడు ఇల్లమ్మి ఆ డబ్బు తీసుకుంటానని గోల!'..

'అయ్యో! నాకు ఈ విషయాలేవీ తెలియవు. ఎప్పుడైనా ఫోన్ చేసినప్పుడు కేశవకూడా ఏమీచెప్పడు. ఈ వయసులో ఇల్లమ్ముకుంటే మీరెక్కడుంటారు లక్ష్మీ!' లలిత మనసంతా ఎలాగో అయింది.

ఇక్కడ తన తోడబుట్టినవాడు ఇంత బాధపడుతుంటే.. తానూ, అన్నయ్యా

మాత్రం సుఖంగా, సౌకర్యంగా ఉన్నారు. తల్లిదండ్రులు తమపిల్లల్ని ఒకేలా పెంచి పెద్దజేస్తారు. కానీ, వాళ్లజీవితాలు ఎంతవేరుగా ఉంటాయి?!

'మమ్మల్ని తన దగ్గరికే వచ్చి ఉండమని శరత్ అంటున్నాడు గానీ.. వాడిదీ చిన్న ఇల్లే! పిల్లలతో ఏం సరిపోతుంది?! నేను ఎలాగోలా సర్దుకున్నా మీ తమ్ముడు అక్కడ ఉండలేరు. పక్కసందులో రంగయ్యగారని రిటైర్డ్ హెడ్‌మాస్టర్ గారింట్లో మూడురూముల పోర్షన్ ఉంది. అక్కడికి వెళ్దామని అనుకుంటున్నాం. అదొక్కటే కొంచెం అద్దె తక్కువ. కాకపోతే నా కుట్టుమిషన్‌కీ, మీ తమ్ముడి ట్యూషన్లకీ ఇబ్బంది అవుతుందేమో చూడాలి!' చెప్పీ చెప్పనట్టుగా కొడుకు దగ్గరికి వెళ్లలేమని చెప్పినట్టు అనిపించింది లలితకి.

'కేశవ ట్యూషన్స్ చెబుతున్నాడా?!' తనలో తాను అనుకుంటున్నట్టుగా అన్నది.

'అవునొదినా! వ్యవసాయం లేదుగా! అప్పట్నుంచే చెప్తున్నారు. ఎయిత్ నుంచి టెంత్ పిల్లలకు చెబుతారు. మనిల్లు మెయిన్ రోడ్‌కే ఉంది గనుక ఇంట్లో చిన్న కిరాణాషాప్ కూడా నడుపుతున్నాం. బడి ఎదురుగానే గదా.. పిల్లలకోసం పెన్నులూ, పెన్సిళ్లూ, నోట్ బుక్సు, బిస్కెట్లూ, చాక్లెట్లు కూడా బాగానే అమ్ముడుపోతాయి. ఈ ఇల్లు మాకు నిలువనీడే కాదు.. జీవనాధారం కూడా! ఇంటెనక పండే కూరగాయలు రాములు అనే ఆయన మాదగ్గర కొని పక్క బస్తీలో అమ్ముకుంటాడు. నేను కూడా పక్క టౌన్‌లో రెడీమేడ్ షాప్‌వాళ్ల ఆర్డర్‌కు బట్టలు కుట్టి ఇస్తుంటాను. ఊర్లో బట్టలకన్నా అవే కాస్త ఎక్కువ డబ్బులొస్తాయి. ఏదో ఉన్నంతలో గుట్టుగా గడుపుకొస్తున్నాం. శైలూ బాగానే ఉంది. అల్లుడు కూడా మంచివాడే! వీడి జీవితమే ఇట్లా అయింది. ఇంత జాగాతో ఇల్లు మళ్లీ కొనగలమా!' చెబుతున్నది లక్ష్మి.

లలిత మనసంతా తెలియని వేదనతో నిండిపోయింది. కేశవ తెలివి తక్కువవాడు కాదు, కష్టపడి పనిచేయని వాడూ కాదు. అన్నివిధాలా అనుకూలవతి అయిన భార్య. అయినా కూడా అమ్మానాన్నల కోసం ఇంటిపట్టునే ఉండి వాళ్లనీ, వ్యవసాయాన్నీ చూసుకుంటూ ఉండిపోయాడు. కేవలం వ్యవసాయంతో ఎవ్వరూ ధనవంతులు కాలేరని తెలిసికూడా.. దాన్ని అంటిపెట్టుకుని ఉన్నాడు. వెనకటి పరిస్థితులు వేరు. అప్పుడిన్ని ఖర్చులూ, పోటీలూ లేవుగనుక ఆ రోజుల్లో గడిచింది. అసలు అమ్మానాన్నలది కూడా పొరబాటే. ఆ పొలం అంతాకూడా కేశవకు ఇచ్చి ఉండాల్సింది. ఏమో.. అప్పుడెలా ఉండేదో!

కారు వచ్చింది. లలిత వెళ్లి యాంత్రికంగా తనపేరు పిలిచినప్పుడు సంతకం పెట్టివచ్చింది గానీ మనసు ఆలోచిస్తూనే ఉంది. కేశవకు ఏదైనా సహాయం చేయాలి..

వాడి జీవితం ఇంత నిస్సహాయంగా ఉండకూడదు. తనకు వచ్చే పెన్షన్ ఖాతాలో ఏదైనా మిగులు డబ్బుంటే ఇవ్వాలి. ఒప్పుకోకపోతే లక్ష్మికి నచ్చచెప్పి ఇవ్వాలి. తనదగ్గర వచ్చి ఉండమంటే.. వింటాడో లేదో! పోనీ అలాగైనా ఒప్పించాలి. అలా అనుకున్నాక లలిత మనసు తేలికపడింది.

అందరూ కూర్చొని భోజనాలు చేస్తుంటే శిరీష తనచిన్నప్పటి కబుర్లు చెప్పి నవ్వించింది. కేశవ కూడా నవ్వుతుంటే..

'మీరుంటే ఎంత సంతోషమో ఆయనకి..' అని సంబరపడింది లక్ష్మి.

అన్నీ లలితకు ఇష్టమైన వంటకాలే. ఎంతజ్ఞాపకమో కేశవకి అనుకుంది లలిత.

భోజనాలవగానే బల్లమీద కేశవ పక్కనే కూర్చుంది లలిత. తన మనసులో మాటను ఎలా చెప్పాలా.. అనుకుంటూ.

శిరీష తల్లి దగ్గరికి వచ్చి ఓ కాగితాల మడత చేతిలో పెట్టి..

'అమ్మా! ఓసారి చూసుకో!' అన్నది.

'ఏమిటే ఇవి! నేనెందుకూ చూట్టం!' అంటూనే ఓసారి తిరగేసింది లలిత.

మొదటిపేజీ చదువుతుంటేనే ఆమెకు అర్థమైంది. అవి ఇంటి తాలూకూ కాగితాలని! కేశవ ఇంటిని తనకు అమ్మితే.. తను కొంటున్నది!

'ఇదేమిటే! ఈ ఇల్లు నేను కొనడమేంటీ?!' అంటూండగానే లలిత ఫోన్ మోగింది.

శిరీష ఎత్తి తల్లికిచ్చింది.

'అమ్మా! నేనూ.. శ్రీకాంత్‌ని. సంతోషమేనా అమ్మా?! మీ తమ్ముడికి ఇప్పుడేం ఇబ్బంది ఉండదుగా?!' అంటున్నాడు.

సప్తసముద్రాల అవతల ఉన్న కొడుక్కి తన పరివేదన ఎలా తెలిసింది?!

'నువ్వు చాలా బాధ పడుతున్నావని అక్క చెప్పింది. 'చిన్న మామయ్య కోసం ఈమాత్రం చేయలేమా!?' అనుకున్నాం.. అక్కా, నేనూ. నేనే మొత్తం ఇస్తానంటే అక్క ఒప్పుకోలేదు. 'నన్ను కూడా కలవనీ! నాకు తృప్తిగా ఉంటుంది!' అన్నది!'..

లలిత నిరుత్తరురాలు అయింది.

'మరి.. నా పేరెందుకు?! ఆ డబ్బులు మామయ్యకో, శరత్‌కో ఇస్తే పోయేదిగా!' అందామనుకుంది.

మళ్లీ శ్రీకాంతే..

'ఆ డబ్బులేవో మామయ్యకే ఇవ్వచ్చు గానీ, ఆయన తీసుకుంటాడో లేదో.. ఇక శరత్‌కు ఇస్తే అవి ఖర్చయిపోయాక మళ్లీ కొన్నాళ్లకు ఇల్లు అమ్ముతానంటాడేమో! అప్పుడు మళ్లీ ఇబ్బందేకదా అనుకున్నాం. ఇలా బాగుంటుందని అనిపించిందమ్మా! సరే.. మామయ్యను ఏమీ బాధపడొద్దని

చెప్పు!' అన్నాడు.

శిరీష దగ్గరిగా వచ్చి తల్లి భుజంమీద చెయ్యేసి..

'అమ్మా! నీ పుట్టిల్లు ఇక నీదే! అడ్వాన్స్ ఇచ్చినవాళ్లతో మాట్లాడి ఒప్పించి కొంతడబ్బు ఎక్కువిస్తామంటే ఒప్పుకొన్నారు. ముందే అనుకుని నీపేరిట కొన్నాం. మామయ్యకు కూడా ఇవాళే తెలిసింది. కొనగలిగే స్థితిలో ఉన్నాం కాబట్టి ఇలా చేసాం. లేకపోతే ఎలా ఉండేదో! ఇక మీ తమ్ముడు ఎక్కడికీ వెళ్లక్కర్లేదు!' అంటూ..

'మామయ్యా! నీకు శరత్ ఎంతో.. మేమూ అంతే! మా దగ్గర నువ్వేమీ మొహమాట పడొద్దు. కొన్నిసార్లు పిల్లల మాటలుకూడా పెద్దవాళ్లు వినాలి. సరేనా!' అన్నది కేశవకేసి చూస్తూ.

హృదయం తేలికపడగా.. నీళ్లునిండిన కళ్లతో కేశవనూ, లక్ష్మినీ చూస్తూ ఉండిపోయింది లలిత.

* * *

## నెల్లుట్ల రమాదేవి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్. ఎంఏ (ఎకానమిక్స్) చేశారు. ఆంధ్రా బ్యాంకులో సీనియర్ మేనేజర్‌గా పనిచేసి, పదవీ విరమణ తీసుకున్నారు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. కార్టూన్లు గీయడం, కథలు, కవిత్వం రాయడం వీరి ప్రవృత్తి. మనసు భాష (కవిత్వం), రమణీయం (కార్టూన్లు), మనసు మనసుకూ మధ్య (కథలు), చినుకులు (నానీలు), తల్లి వేరు (కథలు) పుస్తకాలను వెలువరించారు. తొలి కవితా సంపుటికి సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం, కర్టూనిస్టుగా అపురూప అవార్డు, తెలంగాణ ప్రభుత్వం నుంచి 'ఉత్తమ రచయిత్రి (వరంగల్ జిల్లా)', పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట వారి ఐతా భారతి చంద్రయ్య సంప్రదాయ కథా సాహితీ పురస్కారం, గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ అవార్డు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిభా పురస్కారం, గుఱ్ఱం జాషువా ఫౌండేషన్ పురస్కారం, పర్చా రంగారావు స్మారక అవార్డు, తిరుమల స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారం, రాగతి పండరి స్మారక పురస్కారం పొందారు. -94406 22781

# రూపాంతరం



చింతకింది శివశంకర్

'అమ్మా!'..

హరిహరన్ అరుస్తూ ఇంట్లోకి వచ్చాడు.

'కిచెన్‌లో ఉన్నా..' అని అరిచినట్టే చెప్పింది శారదాంబ.

వంటగదిలో గుత్తివంకాయలకు మసాలా పెడుతున్న శారద, పక్కన టమాటాలు కోస్తున్న చంద్రశేఖర్.. ఇద్దరూ కొడుకువైపు చూశారు.

హరి మొహం నిండా నవ్వు.

'ఏమైంది హరీ?'.

'నాకు ఎయిమ్స్‌లో మెడికల్ సీటు వచ్చింది డాడీ!'.

చంద్రశేఖర్ వచ్చి హరిని హత్తుకున్నాడు. శారద కళ్లనిండా నీళ్లు. దీనికోసం హరి ఎంత కష్టపడ్డాడో వాళ్లకు తెలుసు. శారద చేతులు కడుక్కొని వచ్చి కొడుక్కు స్వీట్ తినిపించింది.

'ఇప్పటినుంచి డాక్టర్. హరిహరన్. సన్నాఫ్ చంద్రశేఖర్! ఈ విషయం అందరికీ చెప్పాలి!'.. పుత్రోత్సహంతో పొంగిపోతున్నాడు చంద్రశేఖర్.

'అక్కర్లేదు డాడీ.. కాసేపైతే ప్రెస్‌వాళ్లు వస్తారు'.

అన్నట్టుగానే ప్రెస్‌వాళ్లు వచ్చారు. వాళ్లు అడిగినదానికి సమాధానాలు ఇస్తున్నాడు హరి.

'ఇదంతా మా అమ్మనాన్నల వల్లే సాధ్యమైంది' అని చెప్పాడు.

ప్రెస్‌వాళ్లు చంద్రశేఖర్‌నూ అడిగారు.

'చాలా గర్వంగా ఉంది. నా కొడుకు ఒక తరానికి ఆదర్శంగా నిలబడ్డాడు' అన్నాడు.

బంధువుల నుంచి, ఫ్రెండ్స్ నుంచీ అభినందిస్తూ చాలా ఫోన్స్ వచ్చాయి.

ఆ తర్వాత ఎమ్మెల్యే రాజవర్ధన్‌ను కలిశారు.

'మీకు ఎలాంటి సాయం కావాలన్నా నన్ను అడగండి. నీ కొడుకులాంటోడు ఊరికి ఒక్కడుంటే చాలు.. దేశం ఎప్పుడో బాగుపడేది!'.

ఎమ్మెల్యే మాటలకు చంద్రశేఖర్ ఆనందంతో తల ఊపుతున్నాడు. హరిని

హత్తుకొని..

'హరిహరన్.. నీవు మీ నాన్ననే కాదు, మన నియోజకవర్గం మొత్తం తల ఎత్తుకునేలా చేశావ్!'.

హరికి కాస్త ఇబ్బందిగా ఉన్నా.. ఏమీ అనలేకపోయాడు.

* * *

'హలో!'.

'ఆ.. అమ్మా!'.

'ఏంట్రా ఈమధ్య ఫోన్ చేయడం లేదు. కొంపదీసి.. ఎవరినన్న ప్రేమిస్తున్నవా ఏంటి?'.

అటునుంచి ఏ సమాధానమూ లేదు. పెళ్లి గురించి కానీ, అమ్మాయిల గురించి కానీ మాట్లాడితే హరి పెద్దగా ఏం మాట్లాడడు. హరి చాలారోజుల నుంచి ఫోన్ చేయకపోతే చాలు.. ఇదే విషయం గురించి శారద ఆటపట్టిస్తుంది.

'మా కోడలిని ఎప్పుడు పరిచయం చేస్తున్నావ్?'.

'అలాంటిదేం లేదమ్మా'.

'ఉంటే చెప్పు రా.. మాకే ప్రాబ్లంలేదు. మాదీ లవ్ మ్యారేజే! మేమంటే మావాళ్లతో కోట్లాడి ఒప్పించుకున్నాం. నీకు ఆ ప్రాబ్లంలేదు. పైగా ఉన్నది నీవొక్కనివే!'.

'అబ్బా.. అదంతా అయ్యే పని కాదులేమ్మా!'.

'అయితే, ఎవరు లేరా..?'.

'ఎవరూ లేరు. నెక్ట్స్ మంత్ ఫిఫ్త్ సెమిస్టర్ ఎగ్జామ్స్ ఉన్నాయి. అందుకే చదువుకుంటున్నా.. అంతే!'.. కొట్టినట్టుగా చెప్పాడు.

'తర్వాతైనా సరే.. ఏమన్న ఉంటే చెప్పు'.

'చెప్పిన కదమ్మా.. అదంతా అయ్యే పనికాదు'.

'అమ్మాయిల గురించి అంటే చాలు, కంగారుపడిపోతాడు. ఎలా బతుకుతాడో ఏమో..!?' అనుకొని ఫోన్ పెట్టేసింది శారద.

* * *

సూర్యుడు చీకట్లో కలవడానికి సిద్ధం అవుతున్నాడు. శారద, హరి ఇంటి పక్కనున్న పార్క్‌లో నడుస్తున్నారు. అక్కడ చాలా ప్రేమ జంటలు ఉన్నాయి. హరి మాత్రం సైలెంట్‌గా ఉన్నాడు.

'ఆ అమ్మాయి చూడు.. నవ్వితే ఎంత బాగుందో! నీవు ప్రేమించిన అమ్మాయి కూడా ఇలాగే ఉంటుందా!? మీరూ ఇలాగే తిరుగుతారా?' మళ్లీ ఆటపట్టిస్తున్నది.

'ఆ అబ్బాయి కూడా నవ్వితే భలే ఉన్నాడు. బుగ్గలు సొట్ట పడుతున్నాయి.

బాడీ, హెయిర్ స్టయిల్ కూడా బాగుంది!'.. అంటున్న హరి కళ్లలో ఈర్ష్య కనిపిస్తున్నది.

హరివైపు చూసింది శారద. ఎప్పుడు అమ్మాయిల గురించి మాట్లాడినా, అలిగినట్టు ఉంటాడు. ఇప్పుడు అలా లేడు. శారద ముందుకు నడుస్తూ..

'నీ ఇంటర్న్‌షిప్ అయిపోగానే పెళ్లి చేయాలని చూస్తున్నాడు మీ నాన్న. ఇప్పటికే చాలా సంబంధాలు వస్తున్నాయి. మీ నాన్న ఫ్రెండ్ రఘునాథం అయితే చాలాసార్లు అడిగాడు. మీ నాన్నేమో.. 'మావాడు ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటాడు' అని చెప్పుకొంటూ తిరుగుతున్నాడు. నువ్వు ఎవరినన్న ప్రేమిస్తే చెప్పు!' అంటూ చూసింది. హరి వెనకాలే ఆగిపోయాడు.

'ఏమైంది?'..

హరి ఏమీ మాట్లాడలేదు.

'కోపమొచ్చిందా?'.

హరి నేల చూపులు చూస్తున్నాడు.

'చూడు హరీ.. ప్రతిఒక్కరూ ప్రేమ గురించి ఇంట్లో చెప్పడానికి భయపడతారు. నీవు భయపడాల్సిన పనిలేదు. ఏమున్నా అమ్మతో చెప్పేయి! అమ్మ చూసుకుంటది. సరేనా!'.. గదవ పట్టుకొని చెప్పింది.

ఒకసారి గట్టిగా శ్వాస పీల్చి వదిలాడు. ఆ శ్వాసలోనే హరి భయాలన్నీ కొట్టుకపోయాయి.

'అమ్మా.. ఇలా రా!' అని పక్కనే ఉన్న బెంచీపై కూర్చోబెట్టాడు.

ఎవరైనా అమ్మాయి పేరు చెప్తాడని ఆశగా, నవ్వుతూ కూర్చుంది శారద. హరి ఆమె ముందు మోకాళ్ల మీద కూర్చున్నాడు.

'అమ్మా!'.

చీకట్లు సూర్యున్ని మింగేయడం వల్ల, అతని కళ్లలో భయం కనిపించడంలేదు. కానీ, గొంతులో వినిపించింది.

'అమ్మ దగ్గర చెప్పడానికి భయం ఎందుకు హరి?' అని అతని చేతిని, ఆమె చేతుల్లోకి తీసుకుంది.

'అమ్మా.. నాకు ఒకమ్మాయి జీవితాన్ని నాశనం చేయడం ఇష్టంలేదు' అని తల కిందికి దింపుకొన్నాడు.

శారదకు ఏమీ అర్థంకాలేదు.

'అమ్మా.. నాకు అమ్మాయిలు నచ్చరు. నేనొక 'గే'ని' అన్నాడు.

అంతరిక్షంలోని ఉల్క వచ్చి ఆమె నెత్తిన పడింది. తల వెయ్యి ముక్కలై మళ్లీ అతుక్కుంది. ఆమె పాదాలు భూమిలోకి దిగబడ్డాయి. కాళ్ల కింద భూమి కదలడం

ఆమెకు తెలుస్తున్నది. ఆమె నవ్వు కూడా సూర్యునిలాగే చీకట్లో కలిసిపోయింది.

'ఈ విషయం డాడీకి నీవే చెప్పాలి' అని అలాగే ఒళ్లో పడుకున్నాడు.

అతని గొంతులో కంటే, అతని కళ్లలోనే తడి ఎక్కువగా ఉంది.

'ఈ విషయం మీకు చాలాసార్లు చెప్పాలనుకున్నా. కానీ భయమేసిందమ్మా!'.

పొరలుపొరలుగా అతని ఏడుపు వినిపించింది. ఆమె మాత్రం తన ఏడుపును గొంతు దాటనివ్వడం లేదు.

'పోనీ.. ఎవర్నైనా డాక్టర్‌ని కలుద్దామా.?' అంటూ తల నిమిరింది.

'నేను కూడా డాక్టర్‌నే అమ్మా'.

'సరే! నాకు ఏం చేయాలో, ఏమని చెప్పాలో, ఎలా ఒప్పించాలో తెలియట్లేదు. నీ ఇంటర్న్‌షిప్ అయిపోగానే ఎమ్మెస్ చేయడానికి అమెరికా వెళ్లు! అది అయిపోయేలోపు ఏదో ఒకటి చేద్దాం'.

'ప్రకృతిలో ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటది. కానీ, ప్రతిసారీ పరిష్కారం లేని ఒక సమస్య పరిష్కరించమని సవాలుగా విసురుతుంది. అదే జీవితం' అనుకొని హరిని ఓదార్చింది.

* * *

హరి ఫోన్ చేయకపోతే శారదనే చేసి మాట్లాడేది. అప్పుడప్పుడూ వీడియో కాల్ కూడా. వీలైనంత నార్మల్‌గా ఉండటానికి ప్రయత్నం చేసేది. శారద వేరే విషయాలు మాట్లాడినా.. హరి తిరిగితిరిగి అక్కడికే వెళ్లేవాడు.

'అమ్మా.. డాడీకి చెప్పావా!?'.

'ఇంకా లేదు'.

'ఏమంటాడోనని భయంగా ఉందమ్మా'.

'అవన్నీ నేను చూసుకుంటానని చెప్పానుగా. నీవు నీ స్టడీస్ మీద కాన్సంట్రేట్ చేయి. నీవు అనుకున్న హార్వర్డ్ యూనివర్సిటీలో సీటు రావాలి. సరేనా!?'.

* * *

అనుకున్నట్టుగానే హరికి హార్వర్డ్ యూనివర్సిటీలో సీటు వచ్చింది. అదే విషయం శారదకు వీడియోకాల్ చేసి చెప్పాడు. చాలా సంతోషించింది.

'అమ్మా.. ఇంటికి రావాలని ఉంది'.

'ఇప్పుడొద్దు హరి'.

'మరి ఎప్పుడమ్మా? ఇప్పుడు అమెరికా వెళ్తే.. ఎప్పుడంటే అప్పుడు రానికే ఉండదు'.

'ఇప్పుడు మనమున్న పరిస్థితుల్లో అదే కరెక్ట్. ఎప్పుడు రావాలో నేను చెప్పే పనిలేదు. నీకు తెలుస్తది.. అప్పుడు రా!'.

'అమ్మా.. నా లాఫింగ్ బుద్ధ లేదేంటి?'.

'పగిలిపోయింది. నిన్న మీ నాన్నతో గొడవ అయ్యింది!'.

'అమ్మా.. ఇలా పుట్టడం నా తప్పా..!?' అంటూ ఏడ్చాడు.

'నీవు గైనకాలజిస్ట్వి కదా.. నీవు చెప్పు!? ఇందులో నీ తప్పు ఉందా? మా తప్పు ఉందా??'.

హరి ఏం మాట్లాడలేదు.

'నేను చెప్పనా.. ఆడవాళ్లలో ఎక్స్ క్రోమోజోమ్స్ ఉంటాయి. మగవాళ్లలో ఎక్స్ అండ్ వై రెండూ ఉంటాయి. మగవాళ్లలోని ఎక్స్, ఆడవాళ్ల ఎక్స్‌తో కలిస్తే.. ఆడపిల్ల (ఎక్స్ఎక్స్). మగవాళ్లలోని వై, ఆడవాళ్ల ఎక్స్ క్రోమోజోమ్‌తో కలిస్తే.. మగ పిల్లాడు(ఎక్స్వై) పుడతారు. ఇందులో తేడాలు వచ్చినప్పుడు.. ఎక్స్ఎక్స్వై అండ్ ఎక్స్వైవైగా మారుతుంది. వాళ్లే ఈ గే, లెస్బియన్, ట్రాన్స్‌జెండర్‌లుగా పుడతారు. ఇది పుట్టుకతో కాకుండా పెరిగేకొద్దీ తెలుస్తుంది. ఇప్పుడు చెప్పు.. ఇందులో ఎవరి తప్పు ఉంది!?'.

ఇదంతా బాగానే స్టడీ చేసిందనే ఆశ్చర్యంతో అమ్మనే చూస్తున్నాడు.

'ఈ మనుషులలో ఒక భయంకరమైన రోగం ఉంది. అదేంటో తెలుసా.. పరువు. దానికోసం హత్యలు కూడా చేస్తారు. తప్పును, మార్పును ఒప్పుకోవడం ఈ సమాజానికి చేతకాదు. ఇలాంటి సమస్య వచ్చినప్పుడు ఎవరికైనా.. 'సమాజం ఏమనుకుంటుందో' అనే భయం ఉంటది. దాన్ని దాటుకొని 'ఏమనుకుంటే నాకెందుకు' అన్న తెగింపు రావాలి. తర్వాత అవమానపడటం అలవాటు కావాలి. ఇవన్నీ దాటుకొని రావాలంటే ఎవరికైనా కొంచెం టైమ్ పడుతుంది. అందుకే.. అప్పటివరకూ నీ ఎమ్మెస్ చేసుకో!'.

ఆమె చదివిన సోషియాలాజీ.. హరిని నార్మల్‌గా చేయడానికి పనికొస్తుందని ఎప్పుడు అనుకోలేదు.

* * *

'ఏమంటున్నాడు.. నీ పుత్రరత్నం. అమెరికా ఎలా ఉందంటా?'.

'అదేదో మీరే ఫోన్ చేసి అడగొచ్చుగా'.

ఈ మధ్య శారద – చంద్రశేఖర్ ఎప్పుడు మాట్లాడుకున్నా.. పోట్లాడుకున్నట్టే ఉంటున్నది.

'ఏమని మాట్లాడాలి. 'కొడుకా!' అని పిలవాలా.. 'కొజ్జా!' అని పిలవాలా.. చెప్పు' అని అరిచాడు.

ఆమె మాత్రం నిశ్శబ్ధంగా నిలబడింది. ఫ్యాన్.. గడియారం శబ్ధం మాత్రమే వినిపిస్తున్నాయి. ఆమె దగ్గరికి వెళ్తూ..

'శారదా.. మనిద్దరి అభిప్రాయాలు ఒక్కటే అన్నావ్. వాడు పుట్టినప్పుడు మన ప్రేమకు ప్రతిరూపం అన్నావ్. మన ప్రేమ అటూఇటూ కానిదై., మనల్ని ఎటూ కానివాళ్లని చేసింది. ఇప్పుడు బయట తల ఎత్తుకొని ఎలా తిరుగుతాం. ఇంత జరిగినా.. అసలు వాడితో ఎలా మాట్లాడగలుగుతున్నావ్!?'..

నిజానికి అది అతని బాధ. కానీ, మగవాడు కదా కోపంగానే చెప్తాడు. కోపంతో మొదలై.. బాధతో ఆపాడు.

'ఇప్పటికీ మన అభిప్రాయాలు ఒక్కటే! కాకపోతే మీరు సమాజం గురించి ఆలోచిస్తున్నారు. నేను నా బిడ్డ గురించి ఆలోచిస్తున్నా.. అంతే! అప్పుడు మన పేరెంట్స్ సమాజం గురించి ఆలోచించి మన పెళ్లికి ఒప్పుకోలేదు. ఇప్పుడు నీవు, వాళ్ల స్థానంలోకెళ్లి 'వద్దు' అంటున్నావ్.. నేనిప్పటికీ నా స్థానంలోనే ఉన్నా! అప్పుడు మన కోసం పోరాడిన. ఇప్పుడు నా కొడుకు కోసం పోరాడుతున్న!'.

గడియారం ఒక్క క్షణం ఆగి, శారద వైపు గర్వంగా చూసి.. మళ్లీ పరుగెడుతున్నది. చంద్రశేఖర్ చూపు తిప్పుకొని గడియారం వంక చూశాడు. అందులో అతని గతమంతా సెకన్ల ముల్లు కంటే వేగంగా తిరిగింది.

'నాకొక విషయం చెప్పండి. ఒకవేళ మనకు కుంటివాడో.. గుడ్డివాడో.. మతిస్థిమితం లేనివాడో పుడితే ఏం చేసేవారు?'.

'చెప్పు.. సమాధానం చెప్పు!'.. ఫ్యాన్ అరుస్తూనే ఉన్నది.

'కొందరికి కన్ను, కాలు ఉండికూడా ఎలా పనిచేయవో.. అలాంటిదే నా కొడుకు శరీరంలో ఒక అవయవం పనిచేయట్లేదు. అంతే!'.

చంద్రశేఖర్‌కు తల్లి ప్రేమ కనిపిస్తున్నది. ఆమె తల్లిగానే కాదు.. మామూలు మనిషిగా కూడా ఇలానే ఉంటుంది. ఎవరూ జీర్ణించుకోలేని వాటిని అరిగించడం ఆమె ప్రత్యేకత. చంద్ర శూన్యంలోకి వెళ్లాడు. అతని మైండ్ కాంతికంటే వేగంగా పరుగెడుతున్నది. ఆ వేగంలో అతని కన్నీళ్లు అతనికి కనిపించలేదు.

'తల్లిగా వాడి మనసుకు తగ్గ శరీరాన్ని ఇవ్వలేకపోయాను. కనీసం జీవితాన్నైనా సరిగ్గా ఇద్దాం. వాడి అవయవాల్లో లోపం ఉన్నంత మాత్రాన, మన ప్రేమలో లోపం ఉన్నట్టు కాదు!'.

కూరగాయలు తూచే త్రాసు కూడా మధ్యలో నిలబడదు. దాన్ని సరిగ్గా పట్టుకోగలిగితే సగం సమస్యలు తిరినట్టే! చంద్రశేఖర్ గుండె.. రాయి నుంచి కండరంగా మారింది.

'ఒకసారి వాడికి ఫోన్ చేయి.. మాట్లాడుతా!' అంటూ, కన్నీరు తూడ్చుకున్నాడు.

ఆమె ఆనందంగా ఫోన్ తీసుకుంది. అప్పుడే హరి ఫోన్ చేశాడు.

'వాడే చేస్తున్నాడు!'..

'స్పీకర్ ఆన్ చేయి!' అన్నట్టుగా సైగ చేశాడు.

'హలో!'..

'అమ్మా!'..

పిలుపులో కాస్త భయం కనిపించింది.

'ఏమైంది హరీ!?'.

'అమ్మా.. నేను 'గే' కాదు!'..

శారద, చంద్రం.. ఆనందంతో ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

'నేను అమ్మాయిని'..

శారదకు సరిగ్గా అర్థంకాలేదు.

'ఏం మాట్లాడుతున్నావ్ హరి!?'.

'నిజం అమ్మా.. నేను బయటికి మగవాడిలా కనిపించినా.. నా లోపల ఆడవాళ్ల ఆర్గన్స్ డెవలప్ అయ్యాయి. అంటే నేను 'హీఫీమేల్' అన్నమాట!'.

'అంటే ట్రాన్స్‌జెండర్ వా!?'.

'అవును' అన్నట్టుగా మూలిగాడు హరి.

చంద్రశేఖర్‌కు హరి మొహం.. మగవాడి రూపం నుంచి ఆడ రూపంగా మారుతూ కనిపించింది. గుండె కండరం నుంచి రాయిగా మారడానికి పెద్దగా సమయం పట్టలేదు. శారద చేతిలోని ఫోన్ తీసుకొని నేలకేసి కొట్టి.. విసురుగా బయటికి వెళ్లిపోయాడు.

చంద్రం ఏం చేసినా.. హరి ఏం చెప్పినా.. శారద నిశ్శబ్దంగా ఉంటుంది. ఎందుకంటే.. ఆమె గుండె రాయిగా మారి చాలా రోజులైతున్నది. ఒంటరిగా ఉన్నప్పుడు, ఆ రాయి పగిలి అందులోంచి ఏ మాత్రం రుచించని నీరు బయటికొచ్చి.. ఆమె చీర కొంగును తడుపుతుంది.

* * *

రెండు రోజులుగా ఆ ఇంట్లో మాటల్లేవు. శారదకు మాత్రం హరితో మాట్లాడాలని ఉంది. చంద్రానికి కూడా కాస్తా సమయం ఇద్దామని ఆగింది. ఇద్దరు ఎదురెదురుగా కూర్చొని తింటున్నారు.

'ఒకసారి ఫోన్ ఇవ్వండి, హరితో మాట్లాడాలి'.

'ప్లీజ్ శారదా! నన్ను కాస్త ప్రశాంతంగా బ్రతకనివ్వు!'.

'వాడు చేసిన తప్పేంటి?'.

'శారదా! వాడిప్పుడు ఆడదానిలా మారతాడు. అది నాకు ఇష్టంలేదు'..

తినడానికి వెళ్లిన ముద్దను ప్లేట్‌లోనే వేశాడు. శారద ఇంకా ప్రశాంతంగా..

'అదే విషయం వాడితో మాట్లాడు.. వాడు ఏం అంటాడో విందాం. తర్వాత నీ ఇష్టం!'.

చంద్రశేఖర్ కాసేపు ఆలోచించి ఫోన్ ఇచ్చాడు.

'హలో.. డాడీ!'.

'హరీ!'.

'అమ్మా.. ఏమైపోయావ్!? రెండు రోజులనుంచి నీ ఫోన్ కలవట్లేదు'..

జాతరలో తప్పిపోయిన పిల్లాడిలా ఎంత వెతికాడో.. ఎంత ఎదురు చూశాడో.. ఎంత మదనపడ్డాడో.. ఆ ఒక్క మాట చాలు శారదకు అర్థం కావడానికి.

'నీవు ఫోన్ చేసినప్పుడు మీ నాన్న పక్కనే ఉన్నాడు. ఇప్పుడు కూడా ఉన్నాడు'.. కాస్తా ఆగి,

'నీవు ట్రాన్స్‌జెండర్‌గా మారడం ఆయనకు ఇష్టంలేదు'.. కాస్త కఠినంగా, దాదాపు చంద్రశేఖర్‌లానే చెప్పింది.

'అమ్మా.. ప్లీజ్ అమ్మా! ఇన్నాళ్లూ గొంగళి పురుగులా బతికానమ్మా! ఇవ్వాళ నాలో ఓ సీతాకోకచిలుక ఉందని తెలిశాక.. నా రూపం నాకు నచ్చట్లేదమ్మా!'.. చిన్నప్పుడు చాక్లెట్ కోసం బతిమాలినట్టు బతిమాలుతున్నాడు.

'అంటే.. నేనిచ్చిన రూపం నీకు నచ్చట్లేదా హరి!?'.. ఆమె గొంతే కాస్త జీరబోయింది.

'అమ్మా అమ్మా.. అలా కాదమ్మా! ఇది నీవిచ్చిన రూపమే అమ్మా! ఇన్నాళ్లూ కొడుకులా బతికా.. ఇకపై కూతురిలా బతుకుతా!'.. ఇదే చివరి కోరిక అన్నట్టుగా బతిమాలుతున్నాడు.

వాళ్లిద్దరూ మాట్లాడుకుంటుంటే, చంద్రశేఖర్ పరువుకి – బతుక్కీ మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. శారద చెప్పిన మాటలు ఓ వైపు.. సమాజం ఛీత్కరించే మాటలు ఓ వైపు..

'హరీ!'.

'డాడీ!'.

శారద ఆశ్చర్యంగా చూసింది.

'మనసు మార్చుకున్నంతా తేలిక కాదు.. శరీరాన్ని మార్చుకోవడం!'.

'ఇక్కడ కొన్ని ఆర్గనైజేషన్‌లు ఉన్నాయి డాడీ. నాకు తెలిసిన స్పెషలిస్ట్‌లు ఉన్నారు. సర్జరీ తర్వాత వన్‌మంత్ ఇబ్బంది ఉంటుంది. హార్మోన్స్ మారుతుంటాయి. అప్పుడే మూడ్ స్వింగ్స్ అవుతాయి. కానీ డాడీ.. వైద్యశాస్త్రంలో ఎన్ని మందులు వచ్చినా.. అవి శరీరానికే! నా మనసుకు మందు మాత్రం మీరే!'.

ఆ మాటలు సూదిలా చిన్నగా కపాలం దాటి మెదడులోకి దిగాయి.

అక్కడనుంచి న్యూరాన్స్ పరుగెత్తి గుండెను కదిలించాయి.

'సరే అయితే.. జాగ్రత్త!'.

'థాంక్స్ డాడీ.. థాంక్ యు సో మచ్!'.. ఒకరికి తెలియకుండా ఒకరికి కన్నీళ్లు తూడ్చుకున్నారు.

'హరీ!'.

'డాడీ!'.

'నీవు ఎవరైనా అబ్బాయిని ఇష్టపడ్డవా!?'.

శారద ఆశ్చర్యంగా చూసింది. పాత చంద్రం కనిపించాడు. ఏదైనా పని భుజానికి వేసుకున్నాడు అంటే.. అది పూర్తయి తీరాల్సిందే!

'లేదు డాడీ!'.

'పర్లేదు.. చెప్పు'.

'కాకపోతే.. అందరిలాగే నాకూ పెళ్లి చేసుకోవాలని ఉంది'.

చంద్రం ఆలోచనలో పడ్డాడు.

'డాడీ.. ఒకవేళ మీకు అమ్మాయి పుడితే ఏం పేరు పెట్టేవాడివి?'.

'రమ్య!'.

* * *

'మా కొడుక్కి వరుడు కావలెను'.

పేపర్‌లో ప్రకటన. అన్ని వివరాలతోపాటు, చంద్రశేఖర్ నంబర్ కూడా ఉంది. ఆ ప్రకటన చూసి చాలామంది గేలి చేస్తూ సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. 'ఎయిమ్స్ నుంచి ట్రాన్స్‌జెండర్ దాకా' అంటూ టీవీల్లో ప్రోగ్రామ్స్ కూడా నడిచాయి. బంధువుల నుంచి, ఫ్రెండ్స్ నుంచి తిడుతూ చాలా ఫోన్స్ వచ్చాయి. చంద్రశేఖర్ అన్నిటికీ సమాధానం ఇస్తున్నాడు. అప్పుడే రఘునాథం ఫోన్ చేశాడు.

'చెప్పు.. రఘు!'.

'ఏరా.. మీవాడికి మా అమ్మాయిని కట్టబెట్టరా అన్నా.. వినలేదు. ఇప్పుడు చూడు ఏమైందో!? పోనీ.. మీ అమ్మాయిని మవాడికి ఇస్తావా!?'.. వెటకారం.. పాలు పొంగినట్టు పొంగిపోతున్నది.

'నేను మళ్లీ.. చెప్తున్నా! నా కూతురికి ఇష్టం అయితేనే చేస్తా.. ఏ సంబంధం వస్తే అది చేయడానికి కాదు. తనకి నచ్చితేనే చేస్తా. నేను ఆ ప్రకటన ఇచ్చింది.. రేపు నా కూతురు ఇంటికి వచ్చినప్పుడు బయటికి వెళ్లాలంటే భయపడకూడదు. ఆ అవమానాలు.. ఇబ్బందులేవో మేమే పడతాం. నీవు కూడా నీ పిల్లలకి ఇష్టమైతేనే చేయి' అంటూ ఫోన్ పెట్టేశాడు.

తర్వాత ఒక యూట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూ చేసింది.

'ఒకప్పుడు మీ కొడుకు, ఇప్పుడు మీ కూతురికి పెళ్లి చేయాలి అనుకుంటున్నారు. సమాజం దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?'.

'ఈ సమాజం ఒప్పుకొన్నా.. ఒప్పుకోకపోయినా నేను ఈ పెళ్లి జరిపిస్తా. అది కూడా చాలా ఘనంగా.. మీరు ఏ పేరుతో పిలిచినా సరే, పుట్టింది ఆడైనా మగైనా.. ముందు నా బిడ్డ! ఈ సమాజం ఎప్పుడైనా మార్పును మొదట తిరస్కరిస్తుంది. కానీ, అర్థం చేసుకుంటుంది. దాన్ని ఆపడం ఎవరివల్లా కాదు. మహా అయితే కాస్త లేట్ అవ్వొచ్చు. కాలమైనా.. మనిషైనా.. శక్తయినా.. రూపాంతరం చెందాల్సిందే! అది ప్రకృతి నియమం. దాన్ని ఆపాలనుకోవడం మూర్ఖత్వం. అలాగే, ప్రేమ కూడా రూపాంతరం చెందుతుంది. దాన్ని కాపాడుకోవాలి. సమస్య కూడా రూపాంతరం చెందుతుంది. దాన్ని ఎదుర్కోవాలి'.

ఇంత జరుగుతున్నా శారద అస్సలు తలదూర్చలేదు. కూతురు ట్రీట్‌మెంట్‌ను చూసుకుంటూ ఉంది. కొన్ని రోజులకు దీనిపై చర్చ తగ్గింది. రమ్య ఇంటికి వచ్చింది. తనకి ఎవరూ నచ్చలేదని పెళ్లిని పక్కన పెట్టి.. హాస్పిటల్ పెట్టాలని అనుకుంది.

* * *

ఇండియాలో హాస్పిటల్ పెట్టడం అంతా తేలికైన విషయం కాదని తెలవడానికి, వాళ్ల చెప్పులను చూస్తేనే అర్థమవుతుంది. పైగా ఇంకో రెండు నెలల్లో ఎలక్షన్స్. అందరూ ఆ హడావుడిలోనే ఉన్నారు. అప్పటి ఎమ్మెల్యే రాజవర్ధనే.. ఇప్పటి ఆరోగ్యశాఖ మంత్రి. అతన్ని కలవడానికి వెళ్లారు. లోపలికి రానివ్వలేదు. మంత్రి బయటికి వెళ్తుంటే..

'సర్.. సర్!' అంటూ చంద్రశేఖర్ అడ్డం వెళ్లాడు.

మంత్రి కాస్త చిరాకుగా చూశాడు.

'సర్.. నా కూతురు రమ్య హాస్పిటల్ పెట్టాలనుకుంటున్నది. ఏదైనా సాయం కావాలంటే మీరే అడగమన్నారు'.. అంటూ గతాన్ని గుర్తుచేశాడు.

మంత్రి రమ్యవైపు తిరిగి..

'అటూఇటూ కాని మనిషితో హాస్పిటల్ పెట్టిస్తే.. ప్రజల ప్రాణాలు ఎటూ కాకుండా పోతయి. పోయి.. ట్రైన్‌లో చేతులు చరుస్తూ అడుక్కోపో.. నీవల్ల, మీ నాన్న వల్ల ఇప్పటికే నియోజకవర్గం పరువంతా పోయింది' అంటూ వెళ్లిపోయాడు.

రమ్యకు మత్తుమందు ఇవ్వకుండా, నిలబెట్టి సర్జరీ చేసినట్టు అనిపించింది. చంద్రం వెళ్తున్న మంత్రి కారునే చూస్తూ ఉన్నాడు.

'డాడీ.. నేను ఎమ్మెల్యేగా పోటీ చేద్దాం అనుకుంటున్నా'.. చంద్రం ఆశ్చర్యంగా చూశాడు.

'రాజకీయాల్లో నెగ్గుకరావడం చాలాకష్టం. పైగా ఇంకా ఎక్కువ అవమానాలు

పడాల్సివస్తది’.

‘ప్రచారంలోనే వైద్యం చేద్దాం. గెలవడం కోసం కాదు నాన్న.. వైద్యం కోసం! నా అస్తిత్వం కోసం! నాలాంటి వాళ్ల ఉనికి కోసం!’.

‘పిల్లలకు రూపంతో పాటు పోరాడే లక్షణాన్ని ఇవ్వండి. ఎందుకంటే, సమస్య ఎప్పుడూ తీరదు. అది రూపాంతరం చెందుతుంది. ఒక సమస్య తీరితే.. ఇంకో సమస్య వస్తది. దాన్ని ఎదుర్కొంటూనే సంతోషాన్ని వెతుక్కోవాలి. జీవితం ఒక పోరాటం. జీవితమైనా.. పోరాటమైనా.. మరణంతోనే ముగుస్తుంది!’.. ఆలోచనల్లోనే రమ్యను దగ్గరికి తీసుకున్నాడు చంద్రశేఖర్.

* * *

## చింతకింది శివశంకర్

పిల్లలకు రూపంతోపాటు పోరాడే లక్షణాన్ని ఇవ్వాలని చెబుతున్నారు రచయిత చింతకింది శివశంకర్. ఎందుకంటే.. సమస్య ఎప్పుడూ తీరదనీ, అది ఎల్లప్పుడూ ‘రూపాంతరం’ చెందుతూనే ఉంటుందని అంటున్నారు. ‘రూపాంతరం’ కథా రచయిత శివశంకర్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల్ మండలం అంబట్‌పల్లి గ్రామం. తల్లిదండ్రులు అపరంజమ్మ – వెంకటయ్య. బీటెక్ (ఈసీసీ) తర్వాత సైయంట్, ఇన్ఫోసిస్ సంస్థల్లో టెలీకామ్ ఇంజినీర్‌గా ఐదేళ్లు పనిచేశారు. సాహిత్యంపై మక్కువతో 2021 నుంచి కథలు, కవితలు రాస్తున్నారు. ఈయన మొదటి కథ.. ‘స్వాతంత్ర్యం’. నమస్తే తెలంగాణ – ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం నిర్వహించిన 2021–కథల పోటీలో రూ.1000 బహుమతి గెలుచుకున్నది. లోక కళ్యాణం, కథలు కల్పితం కాదు, ఏ దేశమేగినా – ఎందుకాలిడినా.. అంటూ పదికి పైగా కథలు రాశారు. ‘విషనరుడు’ కవితా సంపుటిని ప్రచురించారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన కథల పోటీలలో బహుమతి పొందడం ఇది వరుసగా మూడోసారి. ఇంతకుముందు వరకు స్వాతంత్ర్యం, బొందలగడ్డ కథలకు బహుమతులు అందుకున్నారు. ‘చరిత కామాక్షి’ సినిమా, ‘గప్ చుప్’ అనే వెబ్ సిరీస్‌కు రచయితగా పనిచేశారు. యూట్యూబ్ చానెల్ ద్వారా వివిధ రకాల పుస్తకాల గురించి చెబుతున్నారు. ‘అసుర తెలుగు పోడ్‌కాస్ట్’ను నిర్వహిస్తున్నారు.

# వెన్ యు రియలైజ్ దట్..



**అరుణ్ కుమార్ ఆలూరి**

అయాన్ ఫోన్ శబ్దం చేయకుండా స్క్రీన్ మాత్రమే వెలిగింది. ఇంట్లో వాళ్ల నాన్న ఉండటంతో తనుకూడా సైలెంట్ మోడ్‌లో మెలగాల్సి వస్తున్నది. సమీర నుంచి వాట్సప్‌లో మెసేజ్ వచ్చింది. కొత్తగూడెంకు చెందిన ఎవరో ఇద్దరు ప్రేమికులు రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవడానికి పెట్టుకున్న దరఖాస్తును పంపింది. అమ్మాయి మెజారిటీ, అబ్బాయి మైనారిటీ అని అందులో ఉన్న ఫొటోలు, పేర్లని బట్టి తెలుస్తున్నది.

'మరో లవ్‌జిహాద్. అమ్మాయి తల్లిదండ్రులకు ఈ విషయం చేరేంత వరకు షేర్ చెయ్యండి..' అని, వాటితోపాటు 'ఫార్వర్డెడ్ మెనీ టైమ్స్' అన్న లేబుల్‌తో వచ్చిందా సందేశం.

'వీళ్లు ఇట్లెందుకున్నరబ్బ? ఎవరిష్టం వాళ్లదని ఇడ్శిపెట్టచ్చు గదా? ఆళ్లుగుడ బైట ఎట్లున్నదో తెల్సి ఈ నెత్తినొప్పులు ఎందుకు పెట్టుకుంటరో?' అని వాటి కింద ఆమె పంపిన మెసేజ్ కూడా ఉంది.

తను అనవసర విషయాలకు టెన్షన్ పడుతూ ఉంటుందని అతని భావన. ఏమని సమాధానం ఇవ్వాలో తెలియక..

'పోనీలే.. వదిలెయ్! అవును అసలారోజు పది నిముషాల్లో వస్తానని గంట వరకు రాలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా.. వస్తున్నా అంటావు కానీ రావు. అప్పుడే ఊహించాల్సింది.. ఫ్యూచర్‌లో కలవటానికి కూడా ఇలాగే డిలే చేస్తావని' అంటూ రిప్లయి ఇచ్చి టాపిక్ మార్చాడు.

'ఫోన్‌ల చాటింగ్ చేస్తున్నం. మాట్లాడుకుంటున్నం సాలదా? కలవనీకి అంటె ఇంట్ల కారణం చెప్పాల. ఆరు గంటలు బస్‌ల కూసుండాల. అంతవుస్రం ఏమున్నదిప్పుడు? ఇంతకుముందు ఏమన్నవు.. గంట వరకు రాలేదా? హ హ.. అయినా నువ్వింకా ఫస్టు రోజును మర్చిపోలే?'.. లోగొంతుకతో రికార్డ్ చేసి పంపినట్టుంది. హెడ్‌సెట్‌లో హస్కీ వాయిస్ చెవుల గుండా లోపలికి వెళ్లి.. గుండెను హత్తుకున్నట్టు అనిపించి, అతని చేతిమీద రోమాలు క్షణకాలం నిక్కబొడుచుకున్నాయి. ఆ అమ్మాయికి టైప్ చేయటమంటే బద్ధకం! అందుకే వాయిస్ మెసేజ్. ఇంట్లో పరిస్థితులను బట్టి స్వరంలో హెచ్చుతగ్గులుంటాయి.

బ్యాంక్, గ్రూప్ ఉద్యోగ పరీక్షల కోసం అతను ప్రిపేర్ అవుతున్న సమయంలోనే.. ఉపాధ్యాయ పరీక్షల కోసం ఆమె సిద్ధమవసాగింది. ఇద్దరికీ కామన్‌గా ఉండే జీకే, ఇంగ్లిష్ మొదలైన సబ్జెక్టులు చెప్పే కోచింగ్ సెంటర్ దగ్గరికి.. నోటిఫికేషన్ వెలువడిన మరునాడే వెళ్లినప్పటికీ, అడ్మిషన్ కోసం బయటున్న కుర్చీల్లో చాలాసేపు ఎదురుచూసేంత మంది వచ్చారు. లగేజ్‌తో సహా వచ్చి అతని పక్కనే కూర్చుంది. కాసేపటికి తన స్నేహితురాలు.. 'హాస్టల్ దొరికింది' అని ఫోన్ చేయడంతో, సామాన్లు చూడమని చెప్పి అతని నంబర్ తీసుకొని, గబగబా వెళ్లిపోయింది.

జరిగింది గుర్తొచ్చి..

'హ హ.. ఏం చెయ్యాల మరి! ఆ హాస్టల్ చెండాళంగా ఉంది. అక్కడున్న అన్ని హాస్టల్లూ సూశి, లాష్టుకి ఒక్కటి కొంచెం పోపు అన్పించి అడ్వాన్స్ ఇచ్చచ్చే సరికి.. ఆ టైం అయ్యింది' అని మెసేజ్ పంపింది.

'అసలారోజు లగేజ్ తీసుకొని పారిపోయుంటే తెలిసేది' అని పంపాడు.

కుదిరినప్పుడల్లా వాళ్లు మొదటి నుంచి అన్నీ నెమరు వేసుకొని గుర్తుచేసుకుంటూ, తద్వారా ఎన్నో యుగాలుగా ఒకరికొకరు తెలిసిన వాళ్లమన్న లోకంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారు.

'నోట్లె యేలు వెడ్తె కొర్కడన్నట్టుండె నీ మొకం. అందుకే నా సామాన్ నీకప్పజెప్పిన హ హ..' అంటూ తెరలు తెరలుగా నవ్వుతున్నదామె.

దూరం నుంచి వాళ్లమ్మ గొంతు..

'ఏందే.. ఎంతసేపు నగుడు? పంటె కాదా?' అని.

ఇంతలో వాళ్ల నాన్న..

'ఏదో సినిమా సూస్తున్నట్టు ఉన్నది. పంటది తియ్!' అంటూ.

నవ్వు ఆపుకొంటూనే..

'ఆ.. పంటున్ననే!' అన్నది.

'సరె బై.. మరి!' అని మెసేజ్ పెట్టి చాటింగ్ ముగించింది.

* * *

ఆ కోచింగ్ సెంటర్‌లో ఉదయం తొమ్మిది వరకు క్లాస్ అయిపోగానే, సైన్స్ సబ్జెక్ట్‌లో తర్ఫీదు కోసం దగ్గర్లోని మరో సెంటర్‌కి వెళ్లేది. ఆ అబ్బాయి నిదానంగా పది గంటల బ్యాచ్‌లో వచ్చేవాడు. దాంతో ఇద్దరికీ కలుసుకునే అవకాశం ఉండేది కాదు. అయితే నోటిఫికేషన్లకు సంబంధించి ఏదైనా కొత్త విషయం తెలిసినా, కొత్త స్టడీ మెటీరియల్ ఏమైనా దొరికినా ఫార్వర్డ్ చేసుకునేవారు.

ఒకరి గురించి ఇంకొకరు తెలుసుకోవడానికి వారి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం అకౌంట్లు ఉపయోగపడ్డాయి. ఇద్దరూ ఖాళీగా ఉన్న రోజు, ఒకవైపు పనులు చేసుకుంటూనే మరోవైపు రోజంతా వాయిస్ మెసేజ్‌ల రూపంలో మాట్లాడుకుంటూ.. పక్కపక్కనే గడుపుతున్న అలౌకిక భావనలో ఉండేవారు.

* * *

మరునాడు రాత్రికి..

'ఏం జేస్తున్నవ్?' అని వాయిస్ మెసేజ్ పంపింది.

ఆమె గొంతులో అలజడిని పసిగట్టి..

'ఏమైంది' అని అడిగాడు.

ఒక వీడియో పంపించింది. అందులో బురఖా ధరించిన ఒక యువతిని, బొట్టు పెట్టుకొని ఉన్న ఒక యువకుడు బైక్‌మీద తీసుకెళ్తుండగా కొంతమంది వెంబడించి ఆపి.. అతన్ని కొట్టి మరోసారి 'వాళ్ల' అమ్మాయిలతో తిరగొద్దని వార్నింగ్ ఇచ్చారు.

'ఇట్లాంటియి చూస్తే భయమైతదబ్బ!'.

'నువ్వెందుకు అంత టెన్షన్ పడతావు? అది జరిగింది ఇక్కడ కాదు. ఎక్కడో నార్త్‌లో! ఏదో ఎమర్జెన్సీ ఉందంటే అతను లిఫ్ట్ ఇచ్చాడని తర్వాత తెలిసింది. ఆ వీడియో వైరల్ అయ్యాక ఇక్కడ హైదరాబాద్‌లోని పెద్ద రాజకీయ నేత.. అలా చేయకండని గట్టిగా చెప్పాడు. అయినా మనకా ప్రాబ్లం లేదు కదా!'.

'హా కరక్టే! కానీ, కొంచెం భయమైంది. అయినా ఈ పొలిటీషియన్లని నమ్మొద్దబ్బ.. వాళ్ల స్వార్థం కోసం అనవ్రుసంగ జనంతోని ఆడుకుంటరు'.

'ఆ వీడియో గొడవలో అసలు విషయం మర్చిపోయాను. రేపు భైంసా రావడం కుదురుతుందా?'.

అయాన్ వాళ్ల నాన్నని గల్ఫ్‌లో ఉండే ఆయన స్నేహితుడు ఒక బిజినెస్ ప్రపోజల్ మీద నిర్మల్ జిల్లాలోని భైంసాకి వెళ్లిరమ్మన్నాడు. ఈ వయసులో అంతదూరం ప్రయాణం చేయలేక.. ఆ పనిని అయాన్‌కి పురమాయించాడు. భైంసాకి ఇరవై కిలోమీటర్ల దగ్గరలోని కుబీర్‌లో ఉంటున్న తనని కలవడానికి ఇదే మంచి అవకాశంగా భావించి ఆమెని అడిగాడు.

ఆమె మనసులోనే ఎగిరి గెంతేసింది.

'అయ్యో.. ఎందుకు రాను? తప్పకుండస్త' అని పంపింది.

సమీర నాన్న ప్రభుత్వోద్యోగి కావటం వల్ల తనుకూడా గవర్నమెంట్ జాబ్ సంపాదించాలని, సబ్జెక్ట్స్ మీద పట్టు పెరగడానికి ఇంటికి దగ్గరగా ఉన్న స్కూల్లో టీచర్‌గా జాయిన్ అయ్యింది. జాబ్ నోటిఫికేషన్ పడ్డాక హైదరాబాద్ వచ్చి కోచింగ్ తీసుకొని పరీక్షలు రాసి.. తిరిగి ఇంటికి వచ్చి అదే బడిలో చేరి, ఫలితాల కోసం ఎదురుచూడసాగింది.

బెడ్ మీద బోర్లా పడిపోయి..

'అసలెన్ని సార్ల కలిశినం?'.. ఎదురుగా ఉన్న నిలువుటద్దంలో తనని తాను చూసుకుంటూ ప్రశ్నించుకుంది.

'మూడు సార్లు! ఇప్పుడు కలిస్తే నాలుగోసారి. అంతేనా!?' అనుకుంది.

ఆ ఎక్స్‌ప్రెషన్ బాగా నచ్చేసి.. అతనికి మాత్రమే కనిపించేలా వాట్సప్‌లో స్టేటస్

పెట్టింది.

ఆ రీల్ చూశాడు అయాన్.

'వెన్ యు రియలైజ్ దట్ యు మెట్ హిమ్ ఓన్లీ త్రైస్' అన్న అక్షరాలు డాన్స్ చేస్తుంటే.. ఆశ్చర్యపోతున్న మొహంతో కళ్లను కుడి ఎడమలకు తిప్పుతున్న ఆమె లేత గులాబీలా మరింత అందంగా కనిపించింది. అది చూడగానే, నవ్వుతో చిన్నవవుతున్న కళ్లను మూసుకొని ఆలోచించాడు.

'పరిచయమై ఆరు నెలలైనా, కలిసింది కేవలం.. ఓహ్.. హౌ షేమ్ ఇట్ ఈస్?' అనుకున్నాడు.

'యు నో వాట్?' ఏదో గుర్తొచ్చిన సంతోషంలో వాయిస్ మెసేజ్ పంపాడు.

'ఏంది?'.

'ఏం లేదు. కలిసాక చెప్తా!'.

ఒకరినొకరు ఇష్టపడ్డారన్న విషయం కూడా ఎరుకలోకి రాకుండానే వారి మనసులు అలా సర్దుకున్నాయి. ఇంతవరకు ప్రపోజ్ చేసుకోలేదు కాబట్టి అతనేం చెప్తాడోనని ఊహించగానే ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

* * *

అయాన్ తల్లిదండ్రులది శ్రీకాకుళం దగ్గర ఒక చిన్న ఊరు. కరువుకు తాళలేక అతను పుట్టకముందే హైదరాబాద్‌కు వలస వచ్చారు. అతను పుట్టిన మూడేళ్ల వరకు ఇక్కడే ఉన్నాడు. చెల్లి పుట్టగానే అతన్ని అమ్మమ్మ వాళ్లింటికి పంపించారు. సెలవుల్లో వచ్చిపోతూ పది వరకు అక్కడే చదువుకొని, తర్వాత ఇక్కడికి వచ్చి ఇంటర్ నుంచి పీజీ వరకు పూర్తి చేశాడు. అక్కడి స్థానికత ఉండటంతో ప్రభుత్వ సంబంధిత పరీక్షలకు వెళ్లి రాసి వచ్చేవాడు.

'యు నో వన్ మోర్ థింగ్? మనం మొదటిసారి శుక్రవారం రోజు కలుసుకుంటున్నాం!' అని పంపాడు.

'అవునా?'.

'నీకు శుక్రవారం బాగా ఇష్టం అనుకుంటా?'.

'హా.. నీకేమన్న తక్కువనా? అసలే మీకు బిజినెస్ ఉంది కదా! మీక్కొంచెం ఎక్కువనే ఇష్టముంటది!' అని పంపింది.

అబ్బాయి నాన్నకు ఫుట్‌వేర్ షాపుంది. చిన్నప్పటి నుంచీ నాన్న ఒడుదొడుకుల్ని చూస్తున్న అతనికి.. ప్రభుత్వరంగ ఉద్యోగం ఉంటేనే భద్రత అని నమ్మి ప్రయత్నిస్తున్నాడు.

'ఆరోజు ఇద్దరం ట్రెడిషనల్‌గా తయారై కలుద్దామా?'.

ఆ ఐడియా అమ్మాయికి బాగా నచ్చింది. పైగా మళ్లీ ఎప్పుడు కలుస్తారో తెలియదు కాబట్టి..

'సరే!' అని మెసేజ్ చేసింది.

* * *

ఆమె పొద్దున్నే లేచింది. చిలకపచ్చ రంగు పట్టుసారీ కట్టింది. లిప్‌స్టిక్ తీసింది. వద్దనుకొని లిప్ లైనర్‌తో బార్డర్ వేసింది.

'మేకప్ వేసుకోవాలా? వద్దా?' అని ఆలోచించి.. చివరికి ఫౌండేషన్ క్రీం రాసి, లైట్‌గా పౌడర్ అద్దింది. ముందే చెప్పడం వల్ల ఇద్దరు స్నేహితురాళ్లు ఇంటికి వచ్చారు.

'భైంసాల చిన్న ఫంక్షన్ ఉంది. పొయస్తం!' అని ఇంట్లో చెప్పింది.

'ఎందుకు బిడ్డా అనవసరంగా?' అన్నది సమీర అమ్మ కాస్త భయపడుతూ!

'ఇట్ల భయపడితె ఎట్లమ్మ? అట్లనే గోపాల్‌కృష్ణ మందిర్‌కి పోక మస్తు రోజులాయె. జల్ది అచ్చేస్తం!'.

'లేట్ జేస్కోకుండ్రి మల్ల.. ఆపత్ల వద్దరు' అన్నది అమ్మ.

* * *

భైంసా మార్కెట్ దగ్గర దిగగానే అక్కడ కనిపించిన తునికిపండ్లు తీసుకుంది.. అబ్బాయికి రుచి చూపిద్దామని. ఆ ఊళ్లో మాత్రమే తయారయ్యే 'కలామ్' స్వీట్‌ను కూడా ప్యాక్ చేయించింది.

గుడికి వెళ్లి దర్శనం చేసుకొని, అక్కడే కిసాన్ గల్లీలో ఉన్న ఒక బేకరీలో కూర్చున్నారు. టెన్షన్ టెన్షన్‌గా అటూ ఇటూ చూస్తూ అన్నీ గమనిస్తూ ఉన్నారు. మూడు నెలల క్రితం మొదలైన గొడవల వల్ల ఆ ఏరియా సమస్యాత్మక ప్రాంతంగా మారింది. కానీ, అక్కడ కలుసుకోవడం ఒకరకంగా 'సేఫ్' అని రమ్మంది. ఇప్పుడంతా సర్దుకుంది కానీ.. ఎప్పుడు ఏ క్షణంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కాదు. అతను తొందరగా వస్తే కాసేపుండి గుడికి తీసుకెళ్లాలని ఎదురుచూస్తూ కూర్చుంది.

మొహంలో తెలియని నవ్వు, మనసులో కనిపించని ఆత్రం తగ్గక ముందే.. వెనుక నుంచి వచ్చి..

'హాయ్' అన్నాడు.

వెనక్కి తిరిగి తలెత్తి చూసింది సమీర.

ట్రిమ్ చేసి ఉన్న సన్నని గడ్డం మీసాలు, నల్లని జుట్టును కప్పి ఉంచిన తెల్లటి టోపి, కళ్ల కింద సుర్మా, తెల్లటి లాల్చీ పైజామలో.. మరింత రంగు తేలిన అయాన్‌ను చూస్తూ..

'ఓల్లీళ్లు? యాడ్నో సూశినట్టుంది?' అనుకున్నది.

'సమీరా! నేను..' అంటూ.. నుదుటన కుంకుమతో, దాని కింద చిన్న స్టిక్కర్‌తో, వీరబూసిన జుట్టును చిన్న క్లిప్‌తో జతచేసిన ఆమెని చూసి ఆశ్చర్యపోయాడు.

మూడు రోజులు నీళ్లు పోయకుంటే వాడిపోయిన రోజాలా..

'అయాన్.. నువ్వేనా? ఇట్లున్నవేంది?' అన్నది.

అప్పటికే సమీర ఫ్రెండ్స్ అతని వంక బిగుసుకుపోయి భయంగా చూస్తున్నారు. చుట్టూ ఉన్నవాళ్లు వీళ్లని గమనిస్తున్నారు.

'ట్రెడిషనల్‌గా రెడీ అవుదామని అనుకున్నాం కదా! కానీ, నువ్వేంటి ఇలా?' షాక్

తగిలినట్టుగా అన్నాడు.

సమీర ఫ్రెండ్ ఆమె చెవిలో..

'సుట్టూరుగ సూడే ఒకసారి' అన్నది.

పక్క టేబుల్ దగ్గరున్న ఒకతను పళ్లు కొరుకుతూ చూస్తున్నాడు. బేకరీ షాపు ఓనర్ వీళ్లని తీక్షణంగా గమనిస్తూ ఫోన్ తీసి ఎవరికో కలుపుతున్నాడు.

ఈ లోకంలోకి వచ్చిన సమీర బేలగా చూస్తూ..

'ఈడ్నుంచి ఎంబటే యెళ్లిపో!' అన్నది.

అసలేం అర్థంకానట్టు చూశాడు అతను.

'నువ్వింకో ఐదు నిమిషాలు ఈడ్నే ఉంటె.. అటూ ఇటూ కల్పి పదిండ్లు కాలిపోతయి. జప్పున పో!' అన్నది కాస్త గట్టిగా.

చుట్టూ ఓసారి చూసి క్షణం ఆలస్యం చేయకుండా బయటికి వచ్చి కార్ స్టార్ట్ చేసుకొని వెళ్లిపోయాడు.

పక్కనున్న వ్యక్తి..

'బేటీ.. ఏమంట?' అన్నాడు అనుమానంగా చూస్తూ!

'ఏంలే కాక.. హైద్రవాద్కెంచి అచ్చిండట. 'ఖాజీ గల్లి యాడుంటది?' అంటే తెల్వదన్న!'.

'గంతే అనాల..' అని ఊరుకున్నాడు.

సమీర, ఆమె దోస్తుల కాళ్లూ చేతులు వణుకుతుంటే కాసేపు అక్కడే కూర్చొని స్థిమితపడి ఇంటికొచ్చారు.

* * *

'అయాన్.. మీరు ముస్లింలా? నాకెందుకు జెప్పలేదు!? నీ లాంగ్వేజ్, డ్రెస్సింగ్‌తోని ఇన్నిరోజులూ మావోళ్లనే అనుకున్న!' అని వాయిస్ మెసేజ్ చేసి.. రిప్లయి కోసం ఎదురు చూడసాగింది.

అతని దగ్గరి నుంచి సమాధానం రాకపోయేసరికి, అతని సోషల్ మీడియా అకౌంట్లు చెక్ చేసింది.

ఎక్కడా ఒక్క పోస్టు, డీపీ కూడా అతను ముస్లిం అని తెలిసేలా కనిపించలేదు.

ఇంటికి చేరుకున్న తరువాత రాత్రి పదిన్నర ప్రాంతంలో చూసుకున్న అతను..

'సమీరా.. నువ్వూ నాలాగా ముస్లిం అనే ఇన్ని రోజుల్నుంచి అనుకుంటున్నా. నువ్వు ఒక్కసారి కూడా బొట్టు పెట్టుకున్నట్టు గుర్తులేదు. వేళ్లకు ఉంగరాల్లాంటివి కనిపించలేదు కదా!' అని తిరిగి వాయిస్ మెసేజ్ పంపించాడు.

'గవన్నీ నాకిష్టముండయి. అయినా నువ్వు మీవోళ్లందరి లెక్క మీసాలు తీసి గడ్డం ఎందుకు పెంచుకోలె?'.

'అందరు అలా ఉండరు!'.

'అసలు నీకు మా దేవుడి పేరు పెడితె నాకెట్ల దౌటస్తది?'.

'అది మా వాళ్లందరూ పెట్టుకునే పేరు. గాడ్స్ గిఫ్ట్ అని అర్థం. అసలు నువ్వు మా పేరెందుకు పెట్టుకున్నావు?'.

'అది పువ్వు పేరు. మాదాంట్లో చాలా మందికుంటది. నీ లాంగ్వేజ్ ఎందుకంత న్యూట్రల్‌గ ఉంటది?'.

'నేను టెంత్ వరకు ఆంధ్రాలో చదివానని చెప్పా కదా. అక్కడ మా వాళ్లెవరూ ఇక్కడిలా ఉర్దూ - హిందీ మాట్లాడరు. మొత్తం తెలుగే. ఇక్కడికి వచ్చాక నా స్లాంగ్ ఎవ్వరికీ అర్థం కావట్లేదని న్యూట్రల్‌గా మాట్లాడటం అలవాటు చేసుకున్నా'.

కాసేపు ఇద్దరి ఫోన్లలో నిశ్శబ్దం రోమింగ్ చేసింది. గతంలో కలిసినప్పుడు క్లాసుకు టైం అవుతుందన్న హడావుడిలో ఒకర్నొకరు సరిగ్గా గమనించుకోలేదని అర్థం అయ్యింది. ఒకరికొకరు నచ్చారని తెలుసుకున్నాక కలవడం మాత్రం ఇదే మొదటిసారి.

'ఐ స్వేర్ సమీరా! నువ్వు నిజంగా మావాళ్లు అనుకొనే నేను లైక్ చేశాను'.

'నేను కుడ.. నువ్వు మావోళ్లనుకునె ఇష్టవడ్డ! నీకు చాలాసార్లు చెప్పిన కద.. నాకెంత భయమో! మూడు నెల్ల కిందట జరిగిన గొడవల్ల ఇక్కడ ఇండ్లు బండ్లు కాలవెట్టిండ్రు!'.

'ఇప్పుడేం చేద్దాం?'.

'మీది అంధ్రా అని ఎట్ల చెప్పల్నో నాకిప్పటికీ సమజ్ కాదు. అసుంటిదిప్పుడు వేరే మతం అంటె.. ఇంట్ల చెప్పుడు నాతోని కాదు అయాన్'.

'మనిద్దరం మతం పట్ల ఏదీ తలకెక్కించుకోకుండా న్యూట్రల్‌గా ఉన్నాం. పైగా ఇతర మతాల పట్ల మనిద్దరికీ గౌరవమే ఉంది. మనిద్దరం ఎవరి మతాన్ని వారు ఆరాధిస్తూ జీవితాన్ని గడపొచ్చు కదా?'.

'అట్ల ఉండదల్గి మనం సెలబ్రిటీలం కాదు. ఆళ్లకు సొంతంగ సెక్యూరిటీ ఉంటది. మనకేముంటది? ఇక్కడ భైంసాల జరిగిన అల్లర్లల్ల రక్తాలు కారినయి, కాళ్లు చేతులిర్గినయి, తలలు వల్గినయి. పొలిటీషియన్లు, పైసలున్నోళ్లు కిందున్నోళ్లని మతం సెంటిమెంట్‌తోని రెచ్చగొడుతున్నరు. ఆళ్ల పిల్లలు మాత్రం పెద్ద సదువుల కోసం ఫారెన్ పోతున్నరు. ఈడ లొల్లి వెట్టుకొమ్మని చెప్పే మతమోల్లతోని ఆళ్లు వేల కోట్ల బిజినెస్‌లు పెడుతున్నరు. కని ఈడ మధ్యతరగతోళ్లు, కింది తరగతోళ్లు ఈ గొడవల్లల్ల పడి.. అటు పైసలు, ఆరోగ్యం, ఇటు పిల్లల సదువు లాసై కోర్టు జైళ్ల సుట్టూత తిరుగుతున్నరు. నువ్వు హైద్రబాదుల ఉండి సూస్తున్నవ్. నీకర్థం కాదు. ఈడ ఒక మతమోళ్ల దుకాండ్ల ఇంకో మతమోళ్లు అడుగువెడ్తలేరు. ఏం కొంటలేరు'.. జీరబోయిన గొంతుతో వాయిస్ మెసేజ్ పంపింది సమీర.

అయాన్‌కి పొద్దున అందరూ తనని చూసిన చూపులు గుర్తొచ్చాయి. సమీరా భయపడుతూ తనని ఎందుకు వెళ్లిపొమ్మందో అర్థం అయ్యింది. నెట్‌లో వెతికి ఫొటోలు, వార్తలు చూసి నుదుటిన వచ్చిన చెమటను తుడుచుకున్నాడు.

ఆ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య గతంలో ఒకసారి గొడవలు జరిగినా

సద్దుమనిగింది. కానీ, మూడు నెలల క్రితం జరిగిన అల్లర్లలో తీవ్ర ఆస్తి నష్టంతోపాటు చాలామంది గాయపడ్డారు. 38 మందిని అరెస్టు చేసి, 66 మందిని బైండోవర్ చేసి, 26 కేసులు నమోదు చేసి, 500 మంది పోలీసులు పహారా కాస్తే తప్ప.. శాంతి భద్రతలు నెలకొనలేదన్న విషయం తెలుసుకొని హతాశుడయ్యాడు.

కానీ, ఆశ చావక, సమీరకి కాల్ చేశాడు.

ఫోన్ తనలా వణికిపోతుంటే, మెల్లిగా రూమ్ తలుపు మూసేసి లిఫ్ట్ చేసింది.

'అలా కాదు సమీరా! మనం బాగా కలిసిపోయాం. ఒకర్నొకరం అర్థం చేసుకున్నాం కదా!' అన్నాడు.

'మా అమ్మానాయినకు నేనొక్కత్తే బిడ్డెని. ఆళ్లని ఇడ్సవెట్టి రాను. ఆళ్లను ఒప్పిచ్చే చేసుకోవాల. ఇంకొక పదేండ్ల సర్వీసున్నది నాయినకు. అప్పటిదాక మావోళ్లు ఈన్నే ఉండాల. ఒక్యాల మావోళ్లని ఒప్పిచ్చి చేసుకున్నా.. దేశంల యాడ మతఘర్షణలైనా మనమీద కోపంతోని రెండు వర్గాల జనం మా ఇంటి మీది కొస్తరు. అగ్గే వెడ్తరో, నెత్తే వలగ్గొడ్తరో తల్సుకుంటెనే భయమైతుంది. ఇప్పుడు కీడు దినాలు నడుస్తున్నయి దేశంల. నన్ను ఇడ్సవెట్టెయ్!' వణుకుతున్న గొంతులో బాధ, భయం కలగలిపిన మాటలు వచ్చాయి.

'రోజులెప్పుడూ ఒకేలా ఉండవు సమీర. మంచి రోజులొస్తాయి. నాకా నమ్మకం ఉంది'.

'నాకు లేదు అయాన్! మన చేత్లేం లేదు. కొన్నేండ్ల నుంచి సూస్తున్న, మా దగ్గర్నే కాదు దేశం మొత్తం అంతే ఉంది. ఎప్పుడు ఏదో ఒక జాగల మతం లేకపోతె కులం మీద లొల్లి నడుస్తున్నది. ఓళ్లని సపోర్ట్ జేసే గౌర్నమెంట్ అస్తె ఆళ్లు రెచ్చిపోతున్నరు. ఊహల్ల బత్కుడు నాకు రాదు. మనం కల్శినమని నేను మర్శిపోత. నువ్వు గుడ మర్శిపో.. ప్లీజ్!'.

'ఐ లవ్ యూ సమీర. ఐ రియల్లీ లవ్ యూ!' చేజారిపోతున్న ప్రాణసఖికి, మళ్లీ చెప్పలేనేమోనన్న బెంగ కనిపించిందా గొంతులో.

'సేమ్ టూ యూ అయాన్' అని అనుకోకుండా వచ్చిన మాటలకు తల పట్టుకొని..

'అయ్యో.. ఐ మీన్ ఐ టూ లవ్ యూ' అన్నది కళ్లు మూసుకొని.

బాధలో కూడా వచ్చిన చిన్న నవ్వును ఆపి..

'యు నో వాట్?' అన్నాడు.

కళ్లలోంచి నీళ్లు జలపాతం అవుతుంటే..

'ఏందబ్బా?' అన్నది.

'విడిపోయే ముందు ఐలవ్‌యూ చెప్పుకొన్న జంట.. బహుశా ఈ ప్రపంచంలో మనమే కావచ్చు'.. మసక బారుతున్న కళ్లను తుడిచి చెప్పాడు.

'గుడ్ బై!' గద్గద స్వరంతో అన్నది.

'బై!'.. గొంతు బొంగురు పోతుండగా కాల్ కట్ చేశాడు.

చాలాసేపు మోకాళ్లలో తలపెట్టుకొని ఏడ్చింది ఆమె. ఫోన్ తీసి..

'నువ్వు ఎవర్ని ప్రేమించాలన్న విషయం అసలు నీకేమాత్రం సంబంధంలేని వ్యక్తుల చేతుల్లో ఉందన్న నిజం తెలిసినప్పుడు..' అని టైప్ చేసి, అందరికీ కనిపించేలా, అన్ని సోషల్ మీడియా మాధ్యమాల్లో పోస్ట్ చేసింది.

అది చూసిన అతను గుండె పగిలేలా మనసులోనే రోదించాడు.

* * *

## అరుణ్ కుమార్ ఆలూరి

స్వస్థలం నిజామాబాద్ జిల్లాలోని అభంగపట్నం. ప్రస్తుతం మెదక్ జిల్లా ఎనగండ్లలో స్థిరపడ్డారు. బీ టెక్ చేసి.. సినీ రచయితగా పనిచేస్తున్నారు. జయమ్మ పంచాయతీ, 8 ఏఎం మెట్రో చిత్రాలకు స్క్రిప్ట్ కన్సల్టెంట్‌గా, షరతులు వర్తిస్తాయి, టెన్షన్ కైకు బాబా సినిమాలకు కోరైటర్‌గా పనిచేశారు. 2007 నుంచి కథలు రాస్తున్నారు. ఇప్పటివరకు 20 కథలు, 20 నానీలు రాశారు. మేడిపండు (ఆటా), మిణుకుమనే ఆశలు (తెలుగు వెలుగు), సుబ్బయ్య తాత పెళ్లి (విశాలాక్షి), సూపర్‌ఫాస్ట్ రైటర్ (సారంగ), తండ్లాట (నమస్తే తెలంగాణ), వంట చేయగలవా ఓ నరహరి (ఈనాడు) కథలు గుర్తింపు పొందాయి. దాదాపు అన్ని ప్రధాన పత్రికలలో ఈయన కథలు అచ్చయ్యాయి. అమెరికన్ తెలుగు అసోసియేషన్, వాసా ఫౌండేషన్ - సాహితీ కిరణం, తెలుగుతల్లి కెనడా, విశాలాక్షి, నమస్తే తెలంగాణ - ముల్కనూరు సాహితీ పీఠం, నవసాహితి ఇంటర్నేషనల్ (చెన్నై) నుంచి బహుమతులు, పురస్కారాలు అందుకున్నారు.

-63058 16242

# అనుకోకుండా అలా..



మాచి రాజు కామేశ్వర రావు

'అత్తయ్య గారూ.. మీరుకూడా మాతో రావచ్చు కదా! ఆ కొత్త మాల్ చాలా బాఉందిట. అందులో అయిదు స్క్రీన్‌లు కూడా ఉన్నాయట. కాసేపు మాల్‌లో తిరిగి సినిమా చూసి వద్దాం' బాల్కనీలో కూర్చుని కింద గ్రౌండ్‌లో ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తున్న రాజేశ్వరి.. కోడలి మాటలు విని ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

'నేను రానులే తల్లీ! నువ్వూ అబ్బాయి వెళ్లి రండి' అంటూ కుర్చీ లోనుంచి లేచింది రాజేశ్వరి.

'ఏం అంటోంది అమ్మ? వస్తోందా?'.. టక్ సవరించుకుంటూ వచ్చాడు సాగర్.

'ఎంత చెప్పినా రానంటున్నారు'.. నిష్ఠూరంగా అన్నది శృతి.

'మీరిద్దరూ వెళ్లి రండిరా.. వచ్చేవారం నన్ను శివాలయానికి తీసుకువెళ్తే సంతోషంగా వస్తాను' నవ్వింది రాజేశ్వరి.

'తప్పకుండా తీసుకుని వెళ్తాను. తలుపు వేసుకో!' అంటూ భార్యతోపాటు వెళ్లిపోయాడు సాగర్.

తలుపు వేసుకుని, మళ్లీ వచ్చి బాల్కనీలో కూర్చుంది రాజేశ్వరి. కాసేపు పిల్లల ఆటలు చూసి హాల్‌లోకి వచ్చి గంటసేపు చాగంటి వారి ప్రవచనాలు విని, రెండు పుల్కాలు తిని, టేబుల్ సర్దుతూ ఉండగా కాలింగ్ బెల్ మోగింది. రాజేశ్వరి వీధి గదిలోకి వెళ్లి బయట లైటు వేసి.. కిటికీ కర్టెన్ పక్కకు జరిపి చూసింది. గుమ్మంలో సాగర్, శృతి..

రాజేశ్వరి ఆశ్చర్యపోతూ తలుపు తెరిచింది.

'అప్పుడే వచ్చేసారేమిటి? సినిమాకి వెళ్లలేదా?'.

శృతి ఏమీ మాట్లాడకుండా జేవురించిన మొహంతో విసురుగా తమ గదిలోకి వెళ్లి తలుపు మూసుకుంది.

నిశబ్దంగా లోపలికి వచ్చి వీధి తలుపు మూశాడు సాగర్.

'ఏమైందిరా? శృతి ఏమిటి అదోలా ఉంది? ఇంత త్వరగా వచ్చేసారేమిటి?' అంతా అయోమయంగా ఉంది రాజేశ్వరికి.

'ఏమో? మాల్‌లో కాసేపు తిరగగానే ఇంటికి వెళ్లి పోదామంది. కారణం చెప్పదు. కారులో కూడా ఉలుకూ పలుకూ లేకుండా కళ్లు మూసుకుని కూర్చుని ఉంది'.

'ఒంట్లో బాగో లేదేమో! ఒకసారి వెళ్లి చూడు!'.

మూసి ఉన్న తలుపు తోసుకుని గదిలోకి వెళ్లాడు సాగర్. మంచం మీద పడుకుని ఉంది శృతి.

'ఏమిటీ.. పడుకుండి పోయావు? భోజనం చేయవా? అసలు ఏమైంది నీకు?'..

మంచం మీద ఆ వైపు తిరిగి పడుకుని ఉన్న శృతినుదుటి మీద చేయి వేసి చూస్తూ.. ఆత్రుతగా అన్నాడు సాగర్.

'జ్వరం కానీ రాలేదు కదా!?'.

శృతి ఏడుస్తోంది.

కంగారు పడి పోయాడు సాగర్.

'ఎందుకు ఈ ఏడుపు? కడుపు నొప్పిగా ఉందా?'.

సాగర్ మాటలు విని కంగారుగా గదిలోకి వచ్చిన రాజేశ్వరికి.. ఏడుస్తున్న శృతిని చూసి కాలూ చేయీ ఆడలేదు.

'అమ్మా శృతీ! ఏమైంది తల్లీ! నాకు చెప్పు' శృతి పక్కనే మంచం మీద కూర్చుంటూ, ఆమె మొహాన్ని తన వైపు తిప్పుకొంది రాజేశ్వరి.

ఏడుపుతో శృతి మొహం అప్పటికే ఉబ్బి పోయింది.

శృతి వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది.

'ఎందుకమ్మా.. ఈ ఏడుపు? ఏమైంది నీకు?'.

శృతి నుంచి ఎటువంటి సమాధానం లేదు.

'ఒరేయ్.. నువ్వొకసారి బయటికి వెళ్లు!' అని, కొడుకు వెళ్లాక..

'నాకు అర్థమైంది. ఆడవాళ్ల ప్రాబ్లెమ్ అనుకుంటా! పొత్తి కడుపులో నొప్పిగా ఉందా? డాక్టర్ దగ్గరికి వెళ్దామా? చెప్పు తల్లీ! నువ్విలా బాధ పడుతూ ఉంటే నేను చూడలేను' పమిట చెంగుతో శృతి చెక్కిళ్ల మీది కన్నీళ్లు తుడుస్తూ అంది రాజేశ్వరి.

కష్టం మీద ఏడుపు కంట్రోల్ చేసుకుని..

'నా ఒంట్లో బాగానే ఉంది' అంది శృతి చిన్నగా.

'మరి.. ఎందుకిలా ఏడుస్తున్నావు?'.

అత్తగారు అలా అడగగానే మళ్లీ దుఃఖం పొంగుకు వచ్చింది శృతికి.

'అలా ఏడుస్తూ ఉంటే బాధ ఇంకా ఎక్కువ అవుతుంది. నా తల్లివి కదా.. చెప్పు ఏం జరిగింది?'.. శృతి చుబుకం పట్టుకుంది రాజేశ్వరి.

'మాల్‌లో జనం విపరీతంగా ఉన్నారు. ఏమిటో అన్నీ ఊరికే పంచుతున్నట్లుగా జనం ప్రతిచోటా ఎగబడి పోతున్నారు. అదే అదనుగా భావించి ఒకడు.. ఒకడు..'

'ఆ ఒకడు.. వాడేం చేశాడు?'.

'నా నడుం, గుండెలు నొక్కేశాడు' భోరున మళ్లీ ఏడ్చేసింది శృతి.

క్షణంపాటు రాజేశ్వరి నోరు పెగలలేదు. కాస్సేపటికి తనని తాను సర్దుకుని..

'అప్పుడే చెప్పు తీసి వాడి చెంప చెళ్లుమనిపించాల్సింది' అంది కోపంగా.

'ఆ పాడు పని చేయగానే, వాడు గబగబా జనంలో కలిసి పోయాడు. మళ్లీ కనిపించ లేదు'.

'ఇది అబ్బాయి చూడలేదా?'.

లేదన్నట్లుగా తల ఊపింది శృతి.

'ఆయన ఐస్‌క్రీమ్ కోసం కౌంటర్ దగ్గిర ఉన్నారు. ఏమీ చేయలేని నా అశక్తతకి దుఃఖం పొంగుకు వచ్చింది. ఒళ్లంతా తేళ్లు జెర్రులు పాకుతున్న ఫీలింగ్. అందుకే ఆయనను తీసుకుని వెనక్కి వచ్చేశాను. జరిగిన దానికి నామీద నాకే అసహ్యంగా ఉంది. ఒళ్లు మైల పడినట్లుగా ఉంది. వాణ్ని ఏమీ చేయలేక పోయినందుకు దుఃఖం..' మళ్లీ దుఃఖం పొంగుకు వచ్చింది శృతికి.

'ఊరుకో తల్లీ! ఇలా ఎంతసేపు ఏడుస్తావు? ఇందులో నీ తప్పు ఏమీ లేదు. బాధ పడకు' కోడల్ని ఎలా ఊరడించాలో అర్థం కావడం లేదు రాజేశ్వరికి.

'నా మనసు రగిలిపోతోంది అత్తయ్యా! ఇటువంటి దుర్మార్గులను ఊరికే వదిలి పెట్టకూడదు'.

'అవుననుకో.. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు మనం ఏమీ చేయలేం. మనసు కుదుట పరచుకుని భోజనం చేసి పడుకో!'.. కోడలి భుజం తట్టి తన గదిలోకి వెళ్లిపోయింది రాజేశ్వరి.

* * *

మర్నాడు కొడుకు, కోడలు ఏదో గొడవ పడుతూ ఉంటే.. పూజ గదిలో నుంచి ఇవతలకు వచ్చింది రాజేశ్వరి.

'సాయంత్రం మాల్‌కి వెళ్లాల్సిందే!' అంటోంది శ్రుతి.

'ఎందుకు తీరుకూర్చుని గొడవ పెద్దది చేసుకోవడం. నలుగురూ నాలుగు మాటలు అనుకుంటారు. అవసరమా? అంతా ఒక పీడ కలగా భావించి మరచిపో!' అంటున్నాడు సాగర్.

'అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది బాధ. నేను వాణ్ని వదలను. ఆ దుర్మార్గుడికి శిక్ష పడాల్సిందే!'.

తల్లిని చూస్తూనే..

'చూడమ్మా! నీ కోడలు ఎంత చెప్పినా వినడం లేదు. సాయంత్రం మళ్లీ మాల్‌కి వెళ్లి, నిన్నటి సీసీటీవీ ఫుటేజ్ చూసి.. వాణ్ని ఐడెంటిఫై చేసి, వాడి మీద పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలట! ఎందుకు చిన్న విషయం పెద్దది చేసుకుని నలుగురి నోట్లో నానడం అంటే వినడం లేదు!' అన్నాడు సాగర్.. శృతి మీద ఫిర్యాదు చేస్తున్నట్లుగా.

'ఇది చిన్న విషయమా? దీనిని ఆడవాళ్లు ఎంత అవమానంగా భావిస్తారో మీకు అర్థం అవుతోందా? వాడికి శిక్ష పడితే మళ్లీ జీవితంలో ఇటువంటి పాడుపని చేయడు. అది చూసి అటువంటి పాడు ఆలోచనలు ఉన్న వాళ్లకీ బుద్ధి వస్తుంది' ఆవేశంగా అంది శృతి.

'అయితే నా మాట విననంటావు. నీ మొండి పట్టుదల నీదే అన్నమాట! అమ్మా.. నువ్వయినా నీ కోడలికి అర్థమయ్యేలా చెప్పు. నాకు ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్ ఉంది ఇవాళ' బూట్లు వేసుకుని హడావుడిగా వెళ్లి పోయాడు సాగర్.

'అమ్మా.. వాడు అంతగా చెబుతున్నాడు కదా! ఇక్కడితో ఈ విషయం అందరం మరచిపోదాం. ఇక ఈ విషయంలో నువ్వు ముందుకు వెళ్లవద్దు' నచ్చ చెబుతున్న ధోరణిలో అంది రాజేశ్వరి.

'లేదు అత్తయ్య గారు! వాడు చేసిన పాడుపనికి వాడు శిక్ష అనుభవించాల్సిందే!' ఖచ్చితంగా చెప్పేసింది శృతి.

సాయంత్రం అయిదు అవగానే భర్తకు ఫోన్ చేసింది.

'ఏమిటో త్వరగా చెప్పు. చాలా బిజీగా ఉన్నాను' అన్నాడు సాగర్ చిన్నగా మాట్లాడుతూ.

'గుర్తుంది కదా.. సాయంత్రం మాల్‌కి వెళ్లాలి. ఆరు అవకుండా వచ్చేయండి'.

'ఇంకా నువ్వు అదే విషయం పట్టుకుని కూర్చున్నావు. చెప్పాను కదా.. గొడవ పెద్దది చేసి, నలుగురి నోట్లో పడటం ఎందుకని?! మరోసారి ఆలోచించు!'.

'మరో ఆలోచనే లేదు. వాణ్ని పోలీసులకి పట్టించి జైలుకి పంపించాల్సిందే!'.

'అలాగే చేద్దాం. చెప్పానుగా ఈరోజు చాలా బిజీ. మరోరోజు చూద్దాం'.

'కుదరదు.. ఈరోజే వెళ్లాలి!'.

'ఏమిటంత మొండితనం. ఈరోజు కుదరదు అంటున్నాను కదా.. రేపు వెళ్దాం'.

'మీరు ఆరు గంటలకల్లా రాకపోతే నేనే క్యాబ్ బుక్ చేసుకుని వెళ్లిపోతాను' ఫోన్ కట్ చేసింది శృతి.

సాయంత్రం అయిదు గంటల కల్లా స్నానం చేసి, చీర మార్చుకుని రెడీ అయిపోయింది శృతి.

మాటిమాటికి టైమ్ చూసుకుంటున్న శృతిని చూసి..

'అయితే అబ్బాయి వస్తున్నాడా!? మాల్‌కి వెళ్తున్నారా తల్లీ' అని అడిగింది రాజేశ్వరి.

'వెళ్తున్నాం అత్తయ్య గారూ! ఆ పాడు పనిచేసింది ఎవరైనా వదిలేది లేదు'.

'జాగ్రత్త తల్లీ! వాడు ఎలాంటి వాడో.. మనసులో పగ పెట్టుకుని ఏం చేస్తాడో అనేదే నా భయం'.

'తప్పు చేసిన వాళ్లు భయపడాలి. మనకెందుకు అత్తయ్యా భయం?' ధీమాగా అంది శృతి.

సరిగ్గా గడియారం ఆరు కొడుతూండగా వచ్చేశాడు సాగర్.

వస్తూనే..

'నొప్పితో తల బద్దలు అయిపోతోంది! కొంచం కాఫీ ఇవ్వు శృతి.. ప్లీజ్' అన్నాడు.

శృతి బ్రూ కాఫీ కలిపి తెచ్చింది.

'కాఫీ తాగగానే స్నానం చేసి వచ్చేయండి. పొద్దుపోయిన కొద్దీ మాల్‌లో జనాలు పెరిగిపోతారు'.

అలాగే అన్నట్లుగా తల ఊపి, కాఫీ తాగి స్నానానికి వెళ్లాడు సాగర్.

పావు గంట టీవీ చూసి..

'ఆరున్నర అవుతోంది.. రావాలి!' అంటూ టీవీ ఆఫ్ చేసి, బెడ్‌రూంలోకి వెళ్లింది శృతి.

సాగర్ స్నానం చేసి, నైట్ డ్రెస్ వేసుకుని కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని.. దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు.

'ఏమిటీ!? మీరింకా రెడీ అవలేదా? ఎన్నిసార్లు చెప్పాలి?' అసహనంగా అంది శృతి.

'కొంచం జ్వరం వచ్చినట్లుగా అనిపిస్తోంది. పోనీ రేపు వెళ్దాం!? ఏమంటావు?' శృతి వైపు చూడకుండా అన్నాడు సాగర్.

ఆ మాట వినగానే భర్త నుదుటి మీద చేయివేసి చూసింది శృతి.

'జ్వరం ఏమీ లేదు. ఎందుకో మీరు మాల్‌కి రాడానికి భయ పడుతున్నారు!'.

'అవును! ఈ గొడవ ఎక్కడిదాకా పోతుందోనని భయం'.

'మనం ఎందుకండీ భయపడాలి? అటువంటి పాడు పని చేసినవాడు భయపడాలి గానీ! డ్రెస్ మార్చుకోండి.. వెళ్దాం!' భర్త చేయి పట్టుకుని పైకి లేవదీసింది శృతి.

పైకి లేస్తూనే చప్పున శృతి రెండు చేతులూ పట్టుకున్నాడు సాగర్..

'నన్ను క్షమిస్తానంటే నీకో నిజం చెబుతాను'.

'ఆ నిజం ఏమిటో తెలుసుకోకుండా క్షమిస్తానని ఎలా మాటిస్తాను?' నిర్మొహమాటంగా అంది శృతి.

'ఆ రోజు మాల్‌లో నేను కూడా అటువంటి పాడు పని చేశాను!' తల దించుకుని చెప్పాడు సాగర్.

'ఇప్పుడు మాల్‌కి వెళ్లి సీసీటీవీ ఫుటేజ్ చెక్‌చేస్తే.. నేను కూడా దొరికి పోతాను'.

'మీరు చేసిన పాడుపని నేను కళ్లారా చూశాను లెండి!'.

పక్కనే బాంబు పడినట్లు అదిరిపడ్డాడు సాగర్.

మొహంలో కత్తి వాటుకు నెత్తురు చుక్కలేదు. ఒంట్లో ఒణుకు.

'నా కోసం నిన్ను తాకినవాణ్ని క్షమించు'.

'నా ఒంటి మీద ఎవరూ చేయి వేయలేదు. మీరు చేసిన పాడు పని చూసినందుకే రాత్రంతా నిద్ర లేకుండా ఏడ్చాను నేను! మరి మీరు అసభ్యంగా ఒళ్లంతా తాకిన ఆ అమ్మాయి కూడా రాత్రంతా నా కన్నా ఎక్కువగా ఏడ్చి ఉంటుంది కదా! అటువంటి పాడుపని చేస్తే ఆడవాళ్లు ఎంత బాధ పడతారో మీకు ఇప్పటికైనా అర్థమై ఉంటుందని అనుకుంటా! పోతే.. ఆ పని ఎంత ప్రమాదకరమో తెలియ చెప్పడానికి, మాల్ కి వెళ్లి సీసీ టీవీ ఫుటేజ్ చూద్దామని అన్నాను. ఆ అమ్మాయికి కూడా ఇటువంటి ఆలోచనే వచ్చి ఉంటే మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించుకోండి. మీ అమ్మగారి ముందు తల ఎత్తుకొగలరా? హాస్టల్‌లో ఉండి ఇంజినీరింగ్ చదువుతున్న అబ్బాయి మీ గురించి ఏమనుకుంటాడు? ఒకసారి ఊహించుకోండి'..

ఊపిరి తీసుకోవడం కోసం అన్నట్లుగా క్షణం ఆగింది శృతి.

'ఈ నేరానికి జైలు శిక్ష పడొచ్చు, ఉద్యోగం ఊడొచ్చు!'.

'ఐయామ్ వెరీసారీ శృతి. నేను నిజంగా అంతదూరం ఆలోచించ లేదు. అనుకోకుండా అలా..'

'అనుకోకుండా అలా ఎలా చేస్తారండి? అసలు పరాయి ఆడదాని ఒంటి మీద చేయి వేయాలనే ఆలోచన ఎలా వస్తుంది? ఆ క్షణంలో మీకు మీ తల్లీ, చెల్లి, భార్య పిల్లలు ఎవరూ గుర్తుకు రారా?' అప్రయత్నంగా గొంతు పెంచింది శృతి.

'నెమ్మది.. అమ్మ వినగలదు' అన్నాడు సాగర్ గొంతు తగ్గించి.

'వింటే మంచిదే! తన పెంపకంలో కొడుకు ఎంత ఉన్నతంగా ఎదిగాడో తెలుసుకుంటారు'.

'ప్లీజ్ అలా మాట్లాడకు. ఇలా ఇదివరలో ఎప్పుడూ..' అంటూ సాగర్ ఇంకా ఏదో చెప్పబోతూండగా అడ్డుపడింది శృతి.

‘ఇంతకు మునుపు ఇలా ఎన్నిసార్లు ఇటువంటి పాడుపని చేశారని నేను అడగను. ఇక మీదట ఇలా ఎప్పటికీ జరగదని అబ్బాయి అభయ్ మీద ఒట్టు వేయండి’ అంటూ చేయి చాచింది శృతి.

మనస్ఫూర్తిగా ఆ చేతిలో చేయి వేసి, ప్రేమగా శృతిని దగ్గరికి తీసుకున్నాడు సాగర్.

***

**మాచిరాజు కామేశ్వర రావు**

ఈ కథా రచయిత తూర్పుగోదావవరి జిల్లా పత్తిపాడులో పుట్టారు. ఆయన రాసిన మొదటి కథ.. ప్రసిద్ధ బాలల కథల మాస పత్రిక చందమామ (1969 సెప్టెంబరు సంచిక)లో ప్రచురితమైంది. ఒక్క చందమామలోనే ఆయన రాసిన 256 కథలు ప్రచురితమయ్యాయి. అయిదు వందలకుపైగా కథలు, ఏడు నవలలు రాశారు. అయిదు కథా సంపుటాలు వెలువరించారు. ఆయన రాసిన ‘పారిపోయిన దొంగ’ కథ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ 12వ తరగతి విద్యార్థుల పాఠ్యాంశంగా ఎంపికైంది. ‘విధి నిర్వహణ’ అనే కథను మహారాష్ట్ర పాఠశాల విద్యా ప్రణాళిక సంస్థ 6వ తరగతి పాఠ్యాంశంగా ఎంపిక చేసింది. బాలల అకాడమీ నవలల పోటీలో తను రాసిన ‘అడుగుకో ఆపద’ ప్రథమ బహుమతి గెలుచుకుంది. మాచిరాజు బాల సాహిత్యపీఠం స్థాపించారు. బడి పిల్లలకు ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నారు. మాచిరాజు సీతారామయ్య – రత్నకుమారి స్మారక పురస్కారాలను ఏటా ఇద్దరు బాలసాహితీవేత్తలకు ప్రదానం చేస్తున్నారు. ఇక ఈ కథ పుట్టుకకు బలమైన నేపథ్యమే ఉంది. ఆడవాళ్ల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారిని షీ టీమ్ అరెస్ట్ చేస్తున్న వార్తలు తరచూ వస్తుంటాయి. ఆ ఆకతాయిల్లో పరివర్తన కోసం ‘ఎవరు కౌన్సెలింగ్ చేస్తే బాగుంటుంది’ అన్న ఆలోచనకు అక్షర రూపమే ఈ కథ.

**-9000080396**

# జెట్ట రోగం



## క్రాంతి శివరాత్రి

'ఆకలయితాందే'.

ఎగిలిబారంగాల్నే రాజు గాడు అట్ల అడిగేసరికల్ల ఎల్లవ్వ మనసు కలుక్కుమన్నది.

పాడు ఆకలి. రాజుగానికి రాతిరి సుత ఆకలాయే. సర్వలేమో యింత బువ్వ లేకపాయే. ఐనా అండుతండుకు రాజుగానికి ఆరేళ్లుంటయి. పోరనికి జరమొచ్చింది. వొళ్లు అగ్గి లెక్క మండ్తాంది. రెండ్రోజుల సంది ఆపతి వడ్తాండు. గది సూశి మల్లడూ బాధవడ్తనే వున్నడు. కానీ దవ్కనకు తీస్కవోను ముసలోని శేతిల పైసలేడియి.

'వున్నొక్క పోరనికి బుక్కెడు బువ్వ గూడా వెట్టలేక వోతుంటిమయ్యా' అన్న ఎల్లవ్వ మాటలకు, గుడిసెకు గంతదూరం వోయి దోశెడు కన్నీళ్లకు యెక్కువ యెడ్శిండు మల్లడు. కొడుకు ఫొటో సూసుకుంట.. 'ఐనా ఆడు బతికుంటే నా మూసలోనికి ఈ గతి వట్టేది కాదని' ఎల్లవ్వ బాధవడ్డది.

యాదిగాడు.. మల్లని కొడుకు. ఆడు సచ్చి మూడేళ్లయితాంది. అమ్మా నాయినల్ని యిడ్శీవెట్టి.. పోరన్ని, యింటామెని యెంటెస్కోని బాయి పనిజేయ్య దేశం వొయ్యిండు. మట్టిపెళ్లలు కూళీ, అయ్యి మీద వడి పాణమిడిశిండు. మూడేళ్ల రాజుగాడ్ని సంకలేస్కొని, పెనిమిటి పినిగని యేడ్సుకుంట యింటికి యేస్కచ్చింది కోడలు సుభద్ర. పటేళ్లు.. ఆ సచ్చిన పాణానికి రెండు వేలిచ్చి శేతులు దులుపుకున్నరని జెప్పి, అయ్యి మావకు అప్పజెప్పింది.

సావూ, దినాల ఖర్సులకే గా పైసలు వడ్శినయి. దినాలెల్లిన మూడ్రోజులకు కోడలు యింట్ల నుంచి మాయమైంది. దోలాడి అల్శిపోయిన కులపోల్లు, పెనిమిటి వొయ్యిండన్న బాధల.. పిచ్చిలేశి యేటో తప్పివొయిందన్నరు. అటుపక్క ఎల్లవ్వకీ పాణం కరబైంది. ఇగ గప్పటిసంది మల్లడొక్కడే కూలీ నాలి జేత్తూ ముసల్దానికీ మనవడికి అన్ని అయి సూత్తాండు.

మట్టిపని తప్పించి మల్లనికి మరేపని రాదు. కాలువల్ని, బావుల్ని తవ్వట్ల ఆన్నీ తీసి పడేసేటోడు లేడు. ఐనా పెద్ద పెద్ద అంత్రాలచ్చీ శేతి పని జేసేటోళ్ల వుపాధికి గండి గొట్టే గదా. అన్ని సోట్ల ఆళ్లకు పని దొరుకుడు కష్టమైంది.

రాజుగాడు ఆనాడైన కాడ్నుంచి ముసలోళ్లిద్దరూ సొంతూరనే మాటే మర్శిన్రు. కొడుకూ కోడలి లెక్కనే ఏ వూర్లె పనుందని తెల్సినా.. కడుపు శేత వట్టుకుని పోరడ్ని యెంటెసుకుంటున్నరు. కులపోల్లతో గల్సి ఆ సోటుకి వోతున్నరు. పని నడిశినన్ని రోజులూ గుడిసేలేస్కొని గక్కడే వుంటున్నరు. పని ఐపోయ్యిన్నాడు.. గిట్లనే మళ్లో కాడికి వలసవోతూ సంచార జీవితం గడుపుతున్నరు.

ఈ వూరికచ్చి గూడ కొద్ది దినాలే ఐతాంది. వచ్చీ రాంగానే మూణ్రోజుల పనైతే దొరికింది. అట్లొచ్చిన పైసల్తో యిన్ని దినాలూ పూట గడ్శింది. కానీ ఆరం సంది మళ్ల పనెక్కడిది!

ఏ వూరికి వొయినా పనిల కుదుర్కొనికి టైం వడ్తది. గుత్తదార్లూ, మేస్త్రీలు పరిచయం గావలే. యేడేడ యే పనులైతున్నయో తెల్సుకోవాలే. కులపోల్లల్లో జరంత సదువచ్చినోల్లిద్దరు అటువొయ్యి కూలీ మాట్లడుకరావాలే.

దినాం పని దొర్కుతనే నాలుగు పైసలు కండ్ల జూస్తడు మల్లడు. రెక్కలిర్గా జేయంగచ్చే ఆ పైసలు ఐద్రోజులు గూడా సరిపోవు. వొక్కోపారి రోజులకద్దీ పనే దొరకదు. గట్లైతే పొట్ట నిండదు. యింతకుమున్పు గాశారం బాలేక పస్తులుండాల్శిన దినాలు గూడా అచ్చే గానీ, రాజుగానికిన్ని గంజి మెతుకులైనా వెట్టిన్రు. కానీ యీసారట్ల గాలే. పోరనికి మందుగోళి యెయ్యనికి గూడా శేతిల పైసా లేకుంటైంది.

పక్కపొంటి యేడెనమిది గుడిసెలుంటయి. ఆపతికి యెవల్నన్న సాయమడుగుదామన్నా.. మనసు రాలే. 'ఐనా యెవలు సాయమైతరు! యెవలి కస్టాలాళ్లయి. యే పూటకాపూట జేస్కుంటనే పూట గడిశే యెట్టి బతుకులు గదా' అనుకుండు.

***

పోరడు 'అమ్మా, అమ్మా'' అనుకుంటా జరంతోనే మూల్గుతున్నడు. ఆకలైతున్నట్టు పొట్టని వత్తుకుంట సాప మీదనే అటీటూ బొర్లుతున్నడు. మనవడినట్ల సూశి ముసలోని కండ్లకు మళ్లా నీళ్లచ్చినయి.

'యింకెక్కడి అమ్మ కొడ్కా. అసలుందో లేదో దెల్వని గతివట్టె నీకు.

కొడుకుని వోగొట్టుకున్న నాకేమో.. యీ గతివట్టే.'

అని మనసులనుకుంట మళ్లోపారి కుమ్లివొయ్యిండు.

***

కులపోల్ల సప్పుడినిపిచ్చి గుడిసె బయటకచ్చిండు మల్లడు. అప్పుడే ఎగిలిబారిన.. రాబోయ్యే యెండ సూశనగా వొంటికి యేడిగా తగుల్తాంది. ఎగిలిబారకమున్పే పటేళెవరో అచ్చి పని జెప్పినట్టు కులపోల్లంతా తయారైతున్రు. కూలీకి పోవాలన్నట్టు దబ్బదబ్బ గట్కా తిని, గిన్నెలు కడుక్కుంటున్రు. కావ్ కావ్

మని అర్సనికి గూడా వోపిక లేనట్టే నాలుగైదు కాకులు యేపశెట్టు మీదచ్చి కుసున్నయ్. యే గుడిసె ముందైనా యిన్ని మెతుకులు వడ్తయని నోరు తెర్శీ, కండ్లప్పగిచ్చి అటీటూ సూత్తున్నయి. కాకుల్ని సూస్కుంట యింత పండ్ల పుల్ల తెంపి నోట్లేసుకుండు మల్లడు.

కులపోల్లంతా ఆగమాగం గుడిసెల్లోంచి బైటికొత్తున్రు. ఆడోళ్లంతా గోశిలు పెట్టుకున్రు. మొగోళ్లంతా లుంగీలు సరి చేసుకున్రు. నేలమీది పారలూ, గడ్డ పారల్ని యెడమ కాలితో లేవదన్నీ వంగకుండానే ఆటిని జేత వట్టుకుంటున్రు. ఆళ్ల ఆడోళ్లంతా గంపల్ల సర్దిన సద్ది మూటలు నెత్తినెత్తుకుంటున్రు. యిదంతా జూసిన మల్లనికి గుండెల రాయి వడ్డట్టైంది. పని దొరికీ, కూలికి వోతున్నట్టు తనకెవలూ జెప్పలేదని దుక్కం పొడుసుకచ్చింది.

'యేమాయేరా పని దొరికేనా? వొక్కడూ జెప్తలేడేమిరా?' అని సూరన్ని అడిగిండు మల్లడు.

సూరడు యినిపించుకోలే.

'యేమాయేరా..?' మళ్లోపారి అడిగిండు.

'వొయ్యేది యెంచర్ల పనికి. గాడ పెద్ద సార్లు యే పని జెప్తరో! జంటలుండాలే. నీ వొక్కనితోటి యేడైతదే ముసలోడా?' అన్నడు సూరడు.

'అయ్యో. ఆరం సంది పని లేకవాయే. గుడిసెల పొద్దుందాకా యేం జేద్దూ! యెంచర్ల పనైతే యేంది. నేను జూడనిదా. జేయ్యనిదా. నా పని నేనే జేత్త. ఓ దమ్ము గడ్డపారేత్తా. ఓ దమ్ము తట్టెత్తుకుంట. ముసలోడంటివేందిరా? పనిల యేనాడన్న సాయమడిగితినా నిన్ను. జేయకుండ తప్పించుకుంటినా? పని రానిదే గిడిదాకా అచ్చిన్నారా? నిన్నియాల నా ముందు పుట్టి పెరిగితివి. నాకే జెప్పవడ్తివేందిరో.' అని జరంత కోపంగ అన్నడు.

మధ్యల నర్సిగాడు కలగజేసుకుంట.. 'ఓ మావా నువ్వేడ జేత్తావే గా పని. పెద్ద సారు సూత్తే మూసలోన్ని పట్టుకచ్చినరని మా మీద కోపమైతడు. యెనిమిద్రోజుల పని. నీ వల్ల కరబ్ చేసుకోవాల్నా?' గద్దించి అన్నడు.

పక్కనుంచి యిదంతా యింటున్న మైసడు..

'యేందిరా గప్పటినుంచి సూత్తాన్న. పెయ్యి గులగుల వెడ్తుందా? గాడ్డి కొడుకా. నువ్వేమన్న వశ్శోనివారా. శేతనైన వోలే ఇద్దరు జేశే పని వొక్కనివే శెత్తాన్నవావా?' అని నర్సిగాని మీద గరమైండు.

మధ్యలొచ్చిన సూరీగాడ్ని గూడా.. 'ఊకో బాడకవ్. భలే మాట్టడతాన్నవ్. కులపోడూ. మనల్ని నమ్ముకొని వొచ్చిండు. ముసలోడు అత్తాంటే యెనకేసుకచ్చేదివొయ్యి.. పరాశ్కాలడ్తన్నవ్.' అనంగనే నాల్క సర్సుకున్నరు

సూరడూ, నర్సిగాల్లు.

'నీ యవ్వ. యెవడేమంటడే సూత్తా. న్వుతే దావే పెద్దయ్య.' అని మైసడు అనంగనే.. మల్లడు మొఖాన యిన్ని నీళ్లు కొట్టుకుని తువాళ, గడ్డపార అందుకుని పయనమైండు.

యెంచర్లకి వొంగనే సూపరైజరుకి దూరం నుంచే వో నమస్తే కొట్టిన్రు కులపోల్లు. అంతా వొక్క కాడా కూడిన్రు. పనిముట్లు శేతవట్టి పని షురు చేసిన్రు. భూమికి పలుగుడు వడుతున్నట్టు యెండ ఘోరంగా మండవట్టింది. ఇయ్యేవీ వట్టనట్టుగా మోగోళ్లంతా గట్టిమ్మటి గడ్డపారేసి తవ్వుతున్రు. ఆడోల్లంతా తట్టల్లో మట్టి నింపి శెట్లు వెట్టే సోట పోస్తున్రు.

గోశి సర్దుకుంట గడ్డపారేస్తున్న మల్లని నల్లటి పెయ్యి మీద.. శెమట నీరు నిగనిగ మెరుస్తాంది. సూత్తుండంగనే యెండ నడినెత్తికచ్చింది. గప్పటికే అల్సిపోయిన కులపోల్లంతా అన్నానికి దిగిన్రు. ఉప్పేసిన గంజన్నంల ఉల్లిగడ్డ, నిమ్మ తొక్కేసి జుర్రుతున్రు.

'రావే పెద్దయ్య. సల్లబడి, ఇంత తిందువు' అని మైసడూ, ఇంకొంతమంది పిలిశినా.. ఆకలైతలేదంటూ మల్లడు వోలే. పనిగాకుంటే పెద్దసారు గరమైతడని వొంట్లోని పాణవంతా తీసి మట్టిగడ్డ తవ్వుతనే ఉన్నడు.

మల్లనికి ఆకలి మీదకన్నా.. మనవని మీదకే పాణం గుంజుతాంది. 'గుడిసెకెప్పుడు వొవాల్నో. ఆనికింత డబుల్రొట్టే వెట్టి, మందుగోళీ యెప్పుడెయ్యాల్నో' అన్న బాధే మనసుల మెదులుతాంది.

మల్లని పాలుకొచ్చిన పని సగం గూడ ఐతలేదని దూరం నుంచి జూస్తున్న కులపోల్లు అనుకుంటున్రు. అటుపక్క పని ఐపోవుడు సంగతి పక్కన వెడ్తే, తిండి లేక ముసలోని వొంట్లున్న వోపికైతే ఐపోవచ్చింది.

గట్టిగా వొక్క తవ్వుడు తవ్విన మల్లని గడ్డపారకి వో బండరౌతు తల్గింది. గడ్డపార మొన వంకరై, శేయి జారి కిందవడ్డది. అటెనక కాలూశేయిలు వణికి ముసలోడు గూడా వొక్కపారిగా కూలవడ్డడు.

'అయ్యో.. మల్లయ్య మావా కింద పడ్డడుర్లా' అని తినే సద్దిని పక్కనేశి వురికొచ్చిర్రు కులపోల్లు.

మల్లన్ని లేపీ, పక్కకు కుసవెట్టే పనిల కొంతమందుంటే, ముసలోడ్ని తోలుకస్తే గిట్లనే వుంటదని సూరీగాడు, నర్సీగాడు అన్నరు. ఆళ్లంతా వొక్కకాడ మూగేసరికల్లా సూపరైజరూ అటొచ్చిండు.

'కూలికచ్చి అందరూ వొక్కకాడ గూడి ముచ్చట వెడ్తున్నార్రా?' అని గుర్రుగా జూసిండు. పని మజ్జెల బండెల్లిన ఇషయం గమనించిండు. ముసలోని గోస

తెల్సుకుని అయ్యో పాపం అనుకుండు.

'వో ముసలోడా, గీ పనికొస్తివి. నీతోని యేడైతదే. యీళ్లంతా రక్తం మీదున్నరు. నీ వల్ల గాదుగాని, రేపటిసంది మాకు నీ అసోంటి జీతగాడొకడు గావాలే. యెంచర్ సుట్టూ శెట్లు వెడ్తరు. రోజూ వొచ్చి ఆటికి నీళ్లు వట్టాలే. నెలకు పదిహేనొందలిస్తం. జేరుతవా పనిల?' అన్నడు సూపరైజరు.

ఆ మాటతో మల్లని కళ్లల్ల నీళ్లాగాలే. కడుపు నిండినట్టైంది. దేవుడా, నా పోరన్ని సల్లంగా సూశినవ్ అని మనసుల మొక్కుకున్నడు. 'గట్లనే అయ్యా. నీ బంచాన్. రేపట్నుంచి పనిలకొస్త. జెప్పిన పని జేస్తా' అని సూపరైజర్తో అన్నడు.

ఆ మాటలకు మైసడు, ఆని పెళ్లాం, యింకొంత మంది కులపోల్లు మస్తు సంబురపడ్డరు. సూరిగాడు, నర్సిగాడు మాత్రం మూతి తిప్పుకున్నరు.

మల్లడు పస్తులున్న యిషయమిని.. 'సరేగానీ నాతోటిరా. మా పెద్ద సారు ఆఫీసు రూము కాడా యింత కూడు తిని కడుపు సల్ల జేసుకుందువు' అన్నడు సూపరైజరు.

పెద్దోళ్లు పిలిశిర్రు, యెళ్లకపోతే యెట్లా అనుకుండు మల్లడు. పెట్టిన బువ్వల యింత తీస్కవొయి మనవని ఆకలి గూడా తీర్సొచ్చని ఆశవడ్డడు. ఆయన యెన్కమ్మటే పెద్దసారు ఆఫీసుండే యింటి దగ్గర్కి వొయ్యిండు.

మల్లన్ని యింటి లోపలికి తీస్కవోతూ.. 'అమ్మగారూ. వున్నరా. మన కూలీకచ్చినాయనే అన్నం టిపినీ మర్చిపోయొచ్చిండంట. జర గింత బువ్వ వెడ్తరా' అని బయట్నుంచే అడిగిండు సూపరైజరు.

'యేంది. దారిన వొయ్యేటోళ్లందరినీ పట్టుకస్తన్నవా. నువ్వు శెప్పంగనే ఇస్తారేశి అడ్డించాల్న యిప్పుడు. యేదో దూరపు సుట్టానివని నౌకర్లకి తీసుకున్నడాయనే. నువ్వేమో రాత్రానాను యిసుంట రమ్మంటే, యిళ్లంతా నాదే అంటన్నవ్. సూశీ సూడనట్టు వోతంటే యేర్పడ్తలేదు నీకు. గీడ వుద్యోగం శేయాలనుందా లేదా నీకు' అని లోపల్నుంచి అర్శిందామే.

'ముసలోడు అమ్మగారు. పాపం గావరై, కళ్లు తిరిగి వడ్డడు.' అన్నడు సూపరైజరు.

మళ్ల యిటు దిక్కేమో.. 'శెప్పులిప్పు. యీడనే కూసో.' అని మల్లనికి మెల్లగా శేవుల జెప్పిండు.

'మా సార్ భార్య దేవత. శానా మంచిది. ఆ దూరంగా రెండంతరాలిళ్లు కనిపిస్తాంది సూడు. ఆమె గా యింట్లనే బిడ్డలతో కలిసుంటది. యిప్పుడిందులుందీ మా సారు ఉంచుకున్నామె. పొగరువోతు. మనుసుల్నీ లెక్క జేయ్యదు. మన లాంటోళ్లనింక పురుగులెక్క జూస్తది. వొకప్పుడు మీలెక్కనే కూలీ పని జేసేటిదంట.

మా సార్ని వల్లెస్కోని, ఆళ్లతోనే ఆమె మొగడ్ని పక్కకు జరిపించి యిడికొచ్చిందంట.' అని మల్లనికి గొణుక్కుండా జెప్పిండు.

కాసేపటికి 'కూలోడ్ని, కూలోని లెక్కనే వుంచాలి. పాపం అనుకుంట యింట్లకి తీస్కరావొద్దు. ఐనా ముసలోన్ని పనిలకెందుకు తీస్కున్నవ్. మా సొమ్మంత ఆగం జేస్తున్నవ్' అనుకుంట ఓ యిస్తరాకుల యింత అన్నం, పచ్చడేదో వట్టుకుని బయటికచ్చిందామే.

బగ్గ ఆకలి మీదున్న మల్లడు.. తనకెళ్లోచ్చే యిస్తరాకును గాకుండా ఆ ఆడ గొంతెక్కడ్నో యిన్నట్టనిపించి తలెత్తి జూసిండు. మొకం గూడా యెడ్నో జూసినట్టనిపిచ్చి, కళ్లు తూడ్సుకుని మళ్లోపారి జూసిండు. గతమొక్కపారి కండ్లముందు యాదికచ్చి మాయమైనట్టనిపిచ్చింది ముసలోనికి. బతికుందో, సనిపోయిందోననుకుంటున్న కోడలు సుభద్రను.. యెదురుంగ ఆ రీతిల జూసేసరికల్ల కండ్లు తిరిగినట్టనిపిచ్చింది. 'కట్టూ, బొట్టు అన్నీ మార్నయి. మెడల బంగారం, నెత్తిల మల్లెబూలు, వొంటికి శిల్కు శీర కట్టుకుని యేషకాంత లెక్కున్నంత వోలే దాన్నెట్ల మర్శిపోత' అనుకున్నడు.

'నోరొక్కటే శెడ్డది. వూకే మొగని మీదవడి వొర్లుతదేగానీ మనసు బంగారమనుకుంటి. కానీ బంగారమసొంటి నా యాదిగాన్ని మాయం జేశుంటదా ఇది' అనుకుంట గుండెల్నుంచి తన్నుకొస్తున్న యేడుపును ఆపుకున్నడు. కోపాన్ని అదిమిపట్టుకున్నడు. మొకాన్ని పక్కకు తిప్పి కూసుండు.

'యిదిగో పెట్టుకోపో. మీ సారు లేనిది జూసి యింకోపారి యిలాంటోళ్లందర్ని యింట్లకి తోల్కరాకు.' అనుకుంట ఆ అన్నం సూపరైజరుకిచ్చి ఆమె లోపల్కి వొయ్యింది.

సూపరైజరు యిస్తరాకుని మల్లని ముందు వెట్టిండు. 'జెప్పిన గదనే గామె యెట్లాంటిదో. యెన్ని మాటలన్న నేను వట్టించుకోను. నువ్వు గూడ సప్పుడు జేయకుండ దబ్బున తిని యింటికి వో. రేపొచ్చి పనిల జేరు. నేను వోతన్న. గక్కడ పనెట్ల జేస్తున్నరో' అనుకుంట యెల్లివొయ్యిండు.

ముసలోడు పచ్చడి మెతుకుల్నైతే కలిపిండు గానీ, ముద్ద నోట్లోకి వెట్టలేదు. యింకో దిక్కు మన్వని ఆకలి గూడా మతికి రాలేదు ఆ గడియల. శేతికంటిన ఆ యెఱ్ఱటి మెతుకులు జూస్తే కొడుకు రక్తపు కూడులెక్క అన్పిచ్చినయి. బలవంతంగా యిస్తర్లోకి వదిలించుకున్నడు. 'అమ్మో బుక్కెడన్ని నీళ్లిత్తవా' అని గట్టిగా పిల్శిండు.

'ఏయ్. నీకు బువ్వ వెట్టుడే యెక్కువ. యింక నీళ్లు గూడా నేనే యియ్యాల్నా'

అన్నదామే.

మళ్లీ.. 'అమ్మా..' అని యింకింత గట్టిగనే వొర్లిండు మల్లడు.

'ఛీ ఛీ. అడ్డమైనోళ్లందర్నీ లోపలికి రానిత్తే యిట్టనే వుంటది.' అనుకుంట కొంతసేపట్కి నీళ్లు తెచ్చి మల్లని ముందు వెట్టింది సుభద్ర.

కళ్ల నుంచి దుంకుతున్న కన్నీళ్లను ఆగవట్టుకుంట పైకి లేసిండు మల్లడు. మావని జూసిన సుభద్ర ఒక్కపారిగా యెనక్కి జరిగింది. భయంతో యెనకాలున్న గోడకతుక్కుని కదలకుండా నిలవడ్డది.

కోడల్ని సంపేటంత కోపంతో పళ్లు కొరుక్కుంటా.. వో సూపు జూసిండు మల్లడు. తెచ్చిన నీళ్లను శేత గుంజుకుండు. యిసొంటి తిండి తింటే యెంత, తినకవోతే యెంత అనుకుంట దబ్బదబ్బ శేతులు కడుక్కున్నడు. 'థూ. దీనవ్వ. పాడు ఆకలి.' అనుకుంట అక్కడ్నుంచి బైటకచ్చి, గుడిసెల దిక్కు నడ్శిండు.

అప్పటిదంకా బొమ్మలెక్క కళ్లు కిందకేశిన సుభద్ర, మల్లడు అటు తిరగంగనే యేగిరంగా యింట్లకుర్కి తలుపులేస్కుంది.

***

గుడిసెకు ఎదురుంగొస్తున్న మల్లన్ని జూసింది ఎల్లవ్వ. గప్పుడే అత్తాన్నావ్ ఎందయ్యా అనుకుంటనే 'పోరనికి జరమగ్గింది' అని సంబురంగా జెప్పింది.

'రాజుగాని ఆకలి జూసి.. జరానికి కూడా భయమైనట్టున్నదే ఎల్లి. ఆని అమ్మ నాయనల లెక్కనే గది గూడా ఆడ్ని దబ్బున్నే యిడ్సివెట్టి వొయ్యిందిలే. ఐనా జరానికి మించిన జెట్ట రోగాలున్నయ్ గొన్ని. గయి మనకు లేనందుకే యింకెక్కువ సంబురవడాలే' అనుకుంట దబ్బదబ్బ గుడిసెలోకి వొయ్యిండు. బాసాన్లని, బట్టల్ని బస్తాల సర్దిండు. గుడిసేపైన పట్టాల్ని అట్లే అదిలేసిండు.

మనవన్ని భుజానేసుకున్నడు. బస్తా శేతవట్టిండు. యేవైందయ్యా అనడిగిన ఎల్లవ్వకు 'యీ వూళ్లే మనకు పని దొరకదే. పోరడ్ని బతికించుకొని సాదుకోవాల్నంటే మనం యిడ్నుంచి బోవాలే' అని జెప్పి బయటకి తీస్కచ్చిండు. అట్లా ఆల్లంతా కొంత దూరం నడ్శి, పక్కనే వున్న పెద్ద రోడ్డెక్కిర్రు. ఎదురుంగొచ్చిన బండేదో యెక్కిర్రు.

***

అటుదిక్కు సూపరైజరును యింట్లకి పిల్శింది సుభద్ర. రేపటిసంది యీ గుంపునంతా పనులకు రానియ్యొద్దని జెప్పింది. యేరే గుంపుతో పని వొడ్పియ్యాలన్నది. యెందుకు, యేంది అనడిగితే.. 'నన్ను నువ్వు శెర్సొడానికి జూసినవని మీ సారుకు జెప్తా' అని ఆన్ని బెదిరిచ్చింది.

నౌకరి వొతే బతుకుదెరువు కష్టమనుకున్న సూపరైజరు.. పొద్దుగూకగముందే

కూలోల్ల దగ్గర్కివొయ్యిండు. యేమీ జెప్పకుండా రేపటిసంది పనుండదని జెప్పీ, రెండు పొంటెల కూలిచ్చి ఆళ్లని యెల్లగొట్టిండు. యేమైందో సమజ్గాని మల్లని కులపోల్లు.. గుడిసెల కాడికచ్చీ ఆళ్లక్కడ లేనిది జూసి ఆగమైన్రు.

## క్రాంతి శివరాత్రి

ఈ కథ రాసిన రచయిత క్రాంతి శివరాత్రిది సూర్యాపేట జిల్లా తిరుమలగిరి. సివిల్ ఇంజినీరింగ్ చదివి, ఉస్మానియా యూనివర్సిటీలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ చేశారు. మూడేండ్ల పాటు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో ఉండగా మొదటి కథ రాశారు. 2019లో పూర్తిస్థాయి కథలు రాయడం మొదలుపెట్టారు. ఇలా రాసిన మొదటి కథ ఓ ప్రముఖ దినపత్రికలో అచ్చయింది. ఈ అయిదేండ్లలో ఎనిమిది కథలు రాశారు. అవన్నీ వివిధ దిన పత్రికల్లోని ఆదివారం అనుబంధాల్లో ప్రచురితమయ్యాయి. కొన్ని నవలలకు ఎడిటర్‌గా కూడా సేవలు అందిస్తున్నారు క్రాంతి శివరాత్రి. 2020 సంవత్సరంలో 'వెలితి' అనే కథకు 'భానుపురి సాహితీ వేదిక' వారి నుంచి జాతీయ పురస్కారం అందుకున్నారు. చుట్టూ జరిగేవాటిని, చూసిన వాటిని, విన్న వాటిని కథావస్తువులగా ఎంచుకుంటానంటారు రచయిత. 'జెట్టరోగం' మా అమ్మ చెప్పిన కథ. ఇది రాసేటప్పుడు, పోటీకి పంపేటప్పుడు అమ్మ నా పక్కనే ఉంది. ఫలితాలు వచ్చేసమయానికి బ్రెయిన్ స్ట్రోక్‌తో అమ్మ నాకు దూరమైంది' అని తన ఆవేదనను వెలిబుచ్చారు.

**- 99515 90398**

# అక్రోధేన జయేత్ క్రోధం

**ఉమా మహేష్ ఆచాళ్ల**



ఇక్కడ చీకటైతేనే గానీ అక్కడ వెలుగురానంత దూరంలో ఉన్న కొడుక్కి ఫోన్ చేశాడు అనంతం.

'హా.. చెప్పు నాన్నా!' అన్నాడు రాజేంద్ర ఆవులిస్తూ.

'అదేరా.. మీరు ఎప్పుడొచ్చేదీ చెబితే ఏర్పాట్లు చేద్దామని. డాక్టర్ గారికి కూడా చెప్పాలి కదా!?' అన్నాడు అనంతం ఆదుర్దాగా.

'నాన్నా! అదీ.. ముందు వాళ్ల పేరెంట్స్ ఇంటికి వెళ్దాం అంటున్నది కౌసల్య. 'సర్జరీ కూడా అక్కడే చేయిద్దాం. మంచి హాస్పిటల్స్ ఉన్నాయి. తిరిగి యూఎస్ వెళ్లే ముందు మీ ఇంటికి వెళ్దాం' అంటున్నది' అంటూ నసిగాడు రాజేంద్ర.

'అవునా!? ఏదీ ఫోన్ ఒకసారి అమ్మాయికి ఇవ్వు, నేను మాట్లాడతాను' అన్నాడు అనంతం.

'హలో.. మావయ్యా చెప్పండి' అంది కౌసల్య అవతల్నించి పొడిగా.

'ఆ అమ్మా.. బావున్నావా!? చంటాడు బావున్నాడా!? మీ అమ్మగారు నాన్నగారు కులాసానా!?' అన్నాడు అనంతం అభిమానంగా.

'ఆ.. అంతా బావున్నాం మావయ్యా! మీ ఆరోగ్యం ఎలా ఉంది!?' అడిగింది న్యూస్ పేపర్ తిరగేస్తూ.

'నాకేం.. చొక్కా వేసుకునేటప్పుడు కనబడే 'జెర్రి' లాంటి మచ్చ తప్ప, బైపాస్ చేయించుకున్నానన్న విషయమే గుర్తురానంత ఆరోగ్యంగా ఉన్నాను. అదేనమ్మా.. చంటాడి ఆపరేషన్ విషయం మా ఫ్రెండ్ సూర్రావుతో మాట్లాడాను. అతను నాతోబాటు ఆర్మీలో డాక్టర్‌గా చేసి రిటైర్ అయ్యాక మన ఊళ్లోనే హాస్పిటల్ పెట్టాడు. చాలా మంచివాడు, హస్తవాసి ఉన్నవాడు. టాన్సిల్స్ చాలా చిన్న ఆపరేషనట. 'ఒక్క పూటలో చేసి పంపించేస్తాను' అన్నాడు. మీరు నేరుగా ఇక్కడకి వస్తే బావుంటుంది' అన్నాడు ప్రాధేయ పడుతూ.

'అదీ మావయ్యా.. మీకెందుకు ఇబ్బందని..' అంటూ ఉండగా, అతను మధ్యలోనే..

'ఇబ్బందా!? మీ అత్తయ్య పోయాక ఒక్కణ్నీ ఉండలేక మీరు ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తున్నా. నాకూ చంటాడితో కొన్నిరోజులు గడిపినట్టు ఉంటుంది కదా' అని, మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు.

'నీకు తెలుసుకదమ్మా.. నేను పెద్దగా చదువుకోలేదు. ఇక్కడ ఉంటేనే దేశంమీద ప్రేమ ఉన్నట్టు అనుకుని, మీరు అమెరికా వెళ్తామంటే అభ్యంతరం పెట్టాను. తర్వాత అర్థమైంది. మీలాంటి వాళ్లు కష్టపడి అక్కడినించి పంపే డాలర్ల వల్ల మన రూపాయి బలపడుతుందని, ఇదీ ఒకరకమైన దేశభక్తే అని. అందుకే నీకు మళ్లీమళ్లీ సారీ చెబుతున్నా. అవేమీ మనసులో పెట్టుకోకుండా మీరు రండి. ఓ నాలుగు రోజులు గడిపి అప్పుడు మీ పుట్టింటికి వెళుదురు' అన్నాడు ప్రాధేయ పడుతూ.

కాసేపు తటపటాయించి..

'సరే మావయ్యగారు!' అనగానే, అనంతం సంతోషంగా..

'థాంక్స్ అమ్మా! మరొక్క విషయం. నన్ను 'మీరు' అనకమ్మా, మీ నాన్నగారి లాగానే నేనూ..' అన్నాడు.

ఫోన్ పెట్టేసింది కౌసల్య.

నిజానికి ఆమె పుట్టింటికి వెళ్లాలనే నిర్ణయించుకుంది. కానీ తన తల్లికి ఫోన్ చేస్తే..

'మీ వదిన చంటిపిల్లతో ఉంది. పిల్లాడి ఆపరేషన్ అంటున్నావు, హాస్పిటల్ ఇన్‌ఫెక్షన్స్ అవీ తగిలితే ఇబ్బంది. మీ మావగారు చేయిస్తానంటూ రమ్మన్నారుగా.. అక్కడే చేయించి, తిరిగి యూఎస్ వెళ్లేముందు మనింటికి రండి' అని నిర్మొహమాటంగా చెప్పేసింది.

ఆ విషయం భర్తకి కూడా చెప్పలేదు కౌసల్య. మావగారితో మరీమరీ చెప్పించుకుని అయిష్టంగానే ఓకే అంది.

* * *

కోడలు ఒప్పుకొన్న దరిమిలా అనంతం హడావుడి మొదలైంది. భార్య పోయిన తర్వాత ఒంటరిగా ఉండటం అతనికి కష్టంగా ఉంటున్నది. రైతు పోలయ్య అప్పుడప్పుడూ వస్తాడు. కావాల్సిన కిరాణా సామాను, కూరగాయలు తెప్పించి పెట్టాడు. ఆర్మీలో పనిచేయటం వల్ల ఇంట్లోని వస్తువులన్నీ ఎప్పుడూ పద్ధతిగా పెరేడ్ గ్రౌండ్‌లోని సైనికుల్లా ఉంటాయి.

వాళ్లు వచ్చేరోజు అద్దెకారు మాట్లాడుకుని ఎయిర్ పోర్ట్‌కి వెళ్లి.. వాళ్లని ఇంటికి తీసుకొచ్చాడు. ఆరోజు రెస్ట్ తీసుకున్నారు. ముగ్గురికీ కావాల్సినవి అనంతమే స్వయంగా వండిపెట్టాడు. ఆ మర్నాడు మంగళవారం అవటం చేత డాక్టర్ దగ్గరికి

బుధవారం వెళ్దామన్నది కౌసల్య. ఆ ఉదయం చంటాడు పొలం తీసుకెళ్లమని పేచీ పెట్టాడు. తెల్లవారితే ఆపరేషన్.. దాంతో వద్దన్నది కౌసల్య.

'పోనీలే అమ్మా! చంటాడు సరదా పడుతున్నాడు. ఓ గంట అలా తిప్పి తీసుకొస్తాను' అని బుల్లెట్ మీద మనవడిని ఎక్కించుకుని, పొలం బయల్దేరాడు అనంతం.

* * *

ఇంటికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది అతని పొలం. నున్నటి తార్రోడ్డు మీద బుల్లెట్ దూసుకుపోతున్నది. అటూఇటూ చెట్లతో రోడ్డంతా నీడ పరుచుకుంది. ఓచోట పుంతలోకి బండి టర్న్ చేశాడు అనంతం. ఐదొందల మీటర్లు దాటేక వచ్చిందా పొలం. పొలం అనే కంటే.. దాన్నో వనం అనాలేమో.

ఆరుమడులూ కలిపి మూడెకరాలు. ఓ మడిలో మామిడిచెట్లు పంచాయితీలో పెద్దమనుషుల్లా గంభీరంగా ఉన్నాయి. మధ్యలో వేసిన జనుమునార పచ్చని పువ్వులతో 'ఆమ్‌స్టర్ డ్యామ్'ని తలపిస్తున్నది ఆ చంటోడికి.

మరో మళ్లో వరుసగా వేసిన కొబ్బరిచెట్లు సరిహద్దు సైనికుల్లా క్రమశిక్షణతో ఊగుతున్నాయి. అంతరపంటగా వేసిన మినుములు మిలటరీ ట్యాంకుల్లా మౌనంగా బలపడుతున్నాయి.

మరో మళ్లో అప్పుడే వేసిన రకరకాల కూరగాయల మొక్కలు, పాదులు.. ఎల్‌కేజీ పిల్లల డ్రిల్లులా గాలికి అటూఇటూ ఊగుతున్నాయి. మిగిలిన మడులు అరటి పిలకలతో అట్లబంతిలో కూర్చున్న ఆడపిల్లల్లా సుకుమారంగా ముచ్చటగా ఉన్నాయి. దూరంగా బోరు శబ్దం చేస్తూ, నీరు సన్నటి కాలవ ద్వారా పారుతున్నది.

బుల్లెట్ శబ్దం వినిపించగానే గట్లు సరిచేస్తున్న పోలయ్య పరిగెత్తుకుని వచ్చాడు.

వద్దన్నా వినకుండా అనంతంతోబాటే చంటాడు కూడా మడిలోకి దిగాడు. కాసేపు నీళ్లలో ఆడాడు. షూ తడిసిపోవడంతో విప్పేశాడు. కుండీలో తాబేళ్లతో కాసేపు ఆడుకున్నాడు. పోలయ్య కొట్టిచ్చిన కొబ్బరిబొండం తాత చూపించినట్టుగా ఎత్తిపెట్టి తాగడానికి ప్రయత్నించి.. చొక్కా మొత్తం తడుపుకొన్నాడు. కడుక్కునే సాకుతో బోరు ఎదురుగా నిలబడి కాసేపు వళ్లు తడిసేలా ఆడాడు.

'ఇంక చాలు నాన్నా.. వెళ్లిపోదాం పద!' అనగానే, అడుగులో అడుగేస్తూ వస్తున్న వాడల్లా దుక్కి దున్నిన నేల కావడంతో తూలి పడబోయి.. కోతులు చొరబడకుండా వేసిన ఉన్న ముళ్లకంచె మీద కాలేశాడు. లేత పాదంలో తుమ్మముల్లు కస్సుమని దిగింది.

'అమ్మా' అంటూ కూలబడ్డాడు.

వెంటనే పోలయ్య పిల్లాణ్ని ఎత్తుకుని గట్టుమీదున్న నులకమంచం మీద కూర్చోబెట్టి, నెమ్మదిగా ముల్లు తియ్యసాగాడు. పిల్లాడు ఏడుస్తున్నాడు. ఒక్కక్షణం కంగారు పడినా.. అనంతం వెంటనే తేరుకుని, పిల్లాణ్ని కదలకుండా పట్టుకున్నాడు. ఒడుపుగా ముల్లు తియ్యగానే రక్తం ఎగచిమ్మింది. జేబులో ఉన్న కర్చీఫ్‌ని నీళ్లలో ముంచి పిండి, రక్తాన్ని తుడుస్తున్నాడు. యుద్ధంలో నెత్తురు పారించిన అతనికి ఆ క్షణం చాలా కంగారుగా ఉంది. కోడలికి విషయం తెలిస్తే చాలా రభస అవుతుంది. ఓ అయిదు నిమిషాల్లో అంతా సర్దుకుంటుంది. నొప్పి తగ్గాక 'అమ్మకి చెప్పొద్దని మనవడికి చెప్పాలి' అనుకుని, వాడికి తగ్గాక బయల్దేరదామని వెయిట్ చేస్తున్నాడు. అంతలో మొత్తం కర్చీఫ్ రక్తంతో తడిసిపోయింది. పోలయ్య తలకి చుట్టుకున్న టవల్ తీసుకుని తడిపి, పిండి.. దాంతో తుడవడం మొదలుపెట్టాడు. మరో పది నిమిషాలు గడిచింది. ఎర్రటి పిల్లాడు పాలిపోసాగాడు. పాదం ఇంకా రక్తం చిమ్ముతూనే ఉంది. పోలయ్య బెదిరిపోయాడు.

అనంతానికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. డాక్టర్ సూర్యారావుకు ఫోన్ చేశాడు. అతను మొత్తం విషయం తెలుసుకుని..

'వెంటనే తీసుకురండి. అవసరమైతే రక్తం ఎక్కించాలి. బ్లడ్ బ్యాంకు నుంచి ప్లాస్మా తెప్పించి ఉంచుతాను. వాళ్లకి నీ నెంబర్ ఇస్తాను. ఓ ఇద్దరు వెళ్లి, చెరో యూనిట్ బ్లడ్ రీస్టోర్ చేస్తే సరిపోతుంది' అన్నాడు.

కోడలితో మాట్లాడటానికి ధైర్యం చాలక, కొడుక్కి ఫోన్ చేసి విషయం చెప్పి నేరుగా హాస్పిటల్‌కి రమ్మన్నాడు. పోలయ్య పిల్లాణ్ని ఎత్తుకుని బండి వెనకాల కూర్చుంటే.. నేరుగా హాస్పిటల్‌కి బయల్దేరాడు అనంతం. దారి పొడుక్కీ రక్తం చిమ్ముతూనే ఉంది. అనంతం జీవితంలో మొదటిసారి భయపడ్డాడు.

* * *

అనంతం హాస్పిటల్‌కి చేరుకునే సరికి అప్పటికే కొడుకు, కోడలు అక్కడున్నారు. అనంతాన్ని చూస్తూనే పరిగెత్తుకెళ్లిన కౌసల్య.. పోలయ్య దగ్గరనించి పిల్లాణ్ని లాక్కుంది. అప్పుడు ఆమె అనంతం కేసి విసిరిన చూపు ముందు.. శత్రుదేశపు ఉరికంబం కూడా దిగదుడుపే! వేలాడిపోతున్న పిల్లాణ్ని చూసి ఏడుస్తూ అనంతం మీద విరుచుకుపడింది కౌసల్య. అతనికి యుద్ధంలో వచ్చిన మెడల్స్ ఏవీ.. దించిన మెడ ఎత్తేలా చెయ్యలేకపోయాయి. సర్వీస్‌లో ఉండగా అతనెప్పుడూ ఎదుర్కోని 'కోర్ట్ మార్షల్'.. ఆ క్షణం కోడలి దగ్గర తప్పలేదు. కనిపించే తూటాలని తప్పించుకున్నాడు కానీ.. వినిపించే తూటాలని తప్పించుకోలేక పోయాడు.

అతను ఏదో చెప్పబోయాడు. ఆమె రొప్పుతూ చివరగా..

'రానంటే రమ్మన్నావు. వద్దంటే తీసుకెళ్లావు. నీలా మట్టిలో దొర్లాల్సిన ఖర్మ

నా కొడుక్కి పట్టలేదు. వాడికేదైనా జరిగిందో.. నీ మీద పోలీస్ కేసు పెడతా' అంది.

ఎప్పుడో శీతకాలం కోరుకున్న ఎండ.. వేసవిలో వడగాల్పుగా కొట్టినట్టుందా 'ఏకవచనం'!

ఆమె కోపం అతనికి తెలిసిందే కానీ, ఈ స్థాయిలో ఎప్పుడూ చూసి ఎరగడు. యుద్ధం లేనప్పుడు శత్రు సైన్యంతో రొట్టెలు పంచుకున్న మనసతనిది. ఈగలు తోలుకునే క్రమంలో కొమ్ము విసిరితే, పిల్లాణ్ని పొడవబోయిందని పొరబడి.. కబేళాకి పంపించేస్తే, కళ్లవెంట నీరు కార్చటం తప్ప ఏమీ చెయ్యలేని గంగిగోవులా బేలగా చూస్తూ ఉండిపోయాడు.

కౌసల్య పిల్లాణ్ని తీసుకుని హాస్పిటల్ లోపలికి పరిగెత్తింది. అనంతం కూడా వెంటరాబోతే రావొద్దని చెప్పింది. లోపలికి వెళ్తూ..

'ఫస్ట్ ఎయిడ్ చేయించి తీసుకెళ్లిపోదాం. నెక్స్ట ఫ్లయిట్‌కి మా ఊరికి టికెట్ బుక్ చెయ్యండి' అని భర్తకి విసురుగా చెప్పింది.

* * *

లోపల క్యాజువాలిటీ వార్డ్‌లో నర్స్ పిల్లాణ్ని పడుకోపెట్టి కాలికి డ్రెస్సింగ్ చేస్తున్నా.. బ్లీడింగ్ ఆగటం లేదు. డాక్టర్ సూర్యారావు పిల్లాడి కళ్లకింద పరీక్షగా చూసి, అనంతం ఫోన్ చెయ్యగానే తెప్పించి ఉంచిన రెండు ప్యాకెట్ల ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మాను ఐవీ ద్వారా ఇచ్చాడు. గడ్డకట్టే కారకాలను పెంచే విటమిన్ కె ఇంజక్షన్ ఇచ్చాడు. బ్లడ్ శాంపిల్ తీసి కోయాగ్యులేషన్ స్క్రీనింగ్‌తోబాటు మరికొన్ని టెస్ట్‌లు చేయించాడు. కాసేపటికి రక్తస్రావం ఆగింది. పిల్లాడు నీరసంగా కళ్లు విప్పాడు. నర్స్ చేత పేరెంట్స్‌ని రమ్మని కబురు చేశాడు. కౌసల్యాని, ఆమె భర్తని కూర్చోమని..

'అనంతం ఎక్కడ!?' అన్నాడు డాక్టర్ సూర్యారావు.

'బైట ఉన్నారు డాక్టర్!' అన్నాడు రాజేంద్ర.

'అదేం?' అడిగాడు సూర్యారావు.

సమాధానం చెప్పకుండా..

'బాబుకి ఇప్పుడు ఎలా ఉంది డాక్టర్?' ఆదుర్దాగా అడిగింది కౌసల్య.

'ఎందుకిలా జరిగింది డాక్టర్!?' అడిగాడు రాజేంద్ర.

'ప్రస్తుతం బానే ఉన్నాడు. ఇంతకుముందు ఎప్పుడూ బాబుకి దెబ్బలు తగలటం కానీ, బ్లీడింగ్ అవటం జరగలేదా?' అడిగాడు సూర్యారావు బ్లడ్ రిపోర్ట్స్ చూస్తూ.

'లేదు డాక్టర్.. ఇదే మొదటిసారి. యూఎస్‌లో చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. వద్దంటే మా మావగారే పొలం తీసుకెళ్లారు' అంది కౌసల్య. ఆమెకి అనంతం మీద కోపం ఇంకా తగ్గలేదు.

'సరే! ఓ విషయం చెబుతాను కంగారు పడకండి. మీ అబ్బాయికి హీమోఫీలియా ఉన్నట్టుంది' అంటూ ఉండగానే..

'అంటే ఏంటి డాక్టర్?' అడిగింది కౌసల్య కంగారుగా.

'ఏకారణంచేతైనా రక్తస్రావం జరిగితే, కొద్ది నిమిషాల్లో దానంతటదే గడ్డకట్టి ఆగిపోతుంది. కానీ, హీమోఫీలియా పేషంట్లలో ఎనిమిది, తొమ్మిది, పదకొండు రకం రక్తస్రావ కారకాల్లో ఏదో ఒకటి చాలా తక్కువగా ఉండటంతో రక్తం గడ్డకట్టదు. హిస్టరీ తెలిస్తే తప్ప సర్జరీకి ముందు ఈ విషయం బయటపడదు. ఈ పేషెంట్లు చాలా తక్కువ శాతం ఉండటంతో మేమూ సాధారణంగా వాటి గురించి పరీక్ష చెయ్యము' అనగానే.. కౌసల్య ఆందోళనగా చూసింది. డాక్టర్ ఇంకా చెప్పసాగాడు.

'అనుకున్న ప్రకారం రేపు టాన్సిల్స్ ఆపరేషన్ మొదలుపెట్టినట్లయితే.. రక్తం గడ్డకట్టక చాలా ప్రమాదం జరిగేది. ఓ రకంగా ఈరోజు చంటాడి కాల్లో ముల్లు గుచ్చుకుని మంచే జరిగింది. కొంతకాలం సర్జరీ వాయిదా వేద్దాం. నాకు తెలిసిన హెమటాలజిస్ట్‌కి బ్లడ్ శాంపిల్ పంపుదాం. ఫర్దర్‌గా ఎగ్జామిన్ చేసి ఏయే ఫ్యాక్టర్లు లోపమున్నాయో తెలుసుకొని.. ట్రీట్‌మెంట్ ప్రొటోకాల్ చెబుతాడు. ఆ తర్వాత టాన్సిల్స్ ఆపరేషన్ ప్లాన్ చేద్దాం. లేదంటే అమెరికాలో స్పెషలిస్ట్‌కి చూపిస్తానన్నా మీ ఇష్టం!' అన్నాడతను వెనక్కి వాలి.

'ఏం ఫరవాలేదా డాక్టర్?' అడిగాడు రాజేంద్ర విచారంగా.

'మందులు రెగ్యులర్‌గా వాడుతూ, దెబ్బలేవీ తగలకుండా చూసుకోవాలి. అవసరమైనప్పుడు ఫ్యాక్టర్లు ఎక్కించుకుంటే చాలు. జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది' అన్నాడు సూర్యారావు.

* * *

ఈలోగా బ్లడ్ బ్యాంకు నుంచి ఫోన్ వచ్చింది. పక్కనే ఉండటంతో అనంతం, పోలయ్య వెంటనే వెళ్లి చెరో యూనిట్ బ్లడ్ రీస్టోర్ చేసి వచ్చి కూర్చున్నారు. ఎప్పుడూ నిటారుగా కూర్చునే రిటైర్డ్ ఆర్మీ హవిల్దార్ అనంతం.. బల్లపైన ఒంగి కూర్చుని మోకాళ్లపై చేతులు పెట్టుకుని నేలని చూస్తున్నాడు.

బైటవాళ్లకి కనబడనీయకుండా అతని కన్నీళ్లని జోళ్లు పీల్చుకుంటున్నాయి.

'మట్టిలో దిగటం ఖర్మనా? మట్టి లేనిదే మెతుకు లేదు. మట్టి లేనిదే బతుకు లేదు. అదేంటో.. ఈ కాలం మనుషుల లక్ష్యం మాత్రం పిల్లల కాలికి మట్టంటకుండా తిరగటం' అనుకుంటుంటే.. మెలితిప్పిన మీసాల మాటున మెత్తని గుండె విలవిల్లాడుతున్నది. లోపల ఏం జరుగుతున్నదో తెలీదు. చిన్న ముల్లు గుచ్చుకుంటే ఇంత ప్రమాదం ఎందుకైందో తెలీదు. ప్రస్తుతం చంటాడు ఎలా

ఉన్నాడో తెలీదు. ఇందులో తన తప్పెంతుందో కూడా తెలీదు. ఏదైనా జరగరానిది జరిగితే.. కోడలు ఏం చేస్తుందో మాత్రం తెలుసు. నీరసంగా ఉన్నా సరే.. బ్లడ్ బ్యాంకు వాళ్లు ఇచ్చిన ఫ్రూట్ జ్యూస్ ప్యాకెట్‌ను తాగాలనిపించలేదు. మనవడి కోసం దాచి ఉంచాడు.

కాసేపటికి డాక్టర్ రూమ్‌లోంచి బైటకొస్తూ.. బల్లమీద కూర్చున్న తండ్రిని వెళ్లి పలకరించమని కౌసల్యకి సైగ చేశాడు రాజేంద్ర.

'గడ్డకట్టే లక్షణం బైటకొచ్చే రక్తానికే కాదు.. బయటకొచ్చే కోపానికి కూడా అవసరమే! రక్తస్రావాన్ని ఆపేందుకు కోయాగ్యులేషన్ ఫ్యాక్టర్లను శరీరం ఎలా ఉంచుకుంటుందో.. క్రోధాన్ని ఆపేందుకు బంధాలను కూడా పేనుకుంటూనే ఉండాలి' అని భార్యకి చెప్పాలని ఉందతనికి.

పులి ప్రవచనాలు వినదు. జింక విన్నా ఉపయోగం లేదు.

శాంతంతో క్రోధాన్ని, మంచితో చెడుని, సత్యంతో అసత్యాన్ని జయించొచ్చని తెలుసుకోవాల్సిన అవసరం ఆమెకి ఇంతవరకూ కలగలేదు. తెలుసుకోలేదు. అనంతానికి అవన్నీ తెలిసినా ఉపయోగం లేదు. అపార్థాలతో గీసుకున్న 'గిరి' చెరిగి, అసహనంతో పేరుకున్న 'గిరి' కరిగి, తిరిగి మామూలుగా మారటానికి ఆమెకి బహుశా కొంచెం సమయం పడుతుందేమో. ఏం లాభం? ఆలస్యంగా వచ్చిన జ్ఞానం.. అజ్ఞానంతో సమానం.

ఆమె కొడుకుని ఎత్తుకుని ఇంటికి వెళ్లిపోయింది.

'నాన్నా.. నాన్నా!' అంటూ ఎంత పిలిచినా అనంతం పలక్కపోవటంతో.. డాక్టర్‌ని పిలవటానికి లోపలికి పరిగెత్తాడు రాజేంద్ర.

***

## ఉమా మహేష్ ఆచాళ్ల

'శాంతంతో క్రోధాన్ని జయించొచ్చని శాంతంగా ఉండేవాళ్లకి తెలిస్తే సరిపోదు.. క్రోధంతో ఊగిపోయే వాళ్లకి కూడా తెలియాలి' అని చెప్పే కథ.. 'అక్రోధేన జయేత్ క్రోధం'. రచయిత ఉమా మహేష్ ఆచాళ్ల. వీరి స్వస్థలం కాకినాడ జిల్లా తుని. కేంద్ర పరోక్ష పన్నుల విభాగమైన కస్టమ్స్ డిపార్టుమెంటులో ఉన్నతోద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగరీత్యా ప్రస్తుతం విశాఖపట్నంలో ఉంటున్నారు. 2016 నుంచి కథలు రాస్తున్నారు. ఇప్పటివరకూ దాదాపు 50 కథలు.. నమస్తే తెలంగాణ, ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, స్వాతి, వార్త వంటి ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వీటిలోని 21 కథలతో 'సంఘే శక్తి కలియుగే' శీర్షికతో కథా సంపుటిని వెలువరించగా, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ నుంచి

స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. మరో పదహారు కథలతో 'వ్యక్తావ్యక్తం' పేరుతో రెండో సంపుటి రాబోతున్నది. నమస్తే తెలంగాణ – ముల్కనూర్ సాహితీపీఠం సంయుక్తంగా నిర్వహిస్తున్న కథల పోటీలలో వరుసగా నాలుగు సార్లు బహుమతులు అందుకున్నారు. తెల్సా – 2022 కథల పోటీలో ఈనాడు కథా విజయం – 2019, 2020లో బహుమతులు పొందారు. మూడు కథలు కన్నడలో అనువాదమై.. అక్కడా ప్రాచుర్యం పొందాయి.

ఈయన రాసిన మొదటి కథ.. 'మా తుఝే సలాం'. 2016లో 'వార్త'లో ప్రచురితమైంది. ఇప్పటివరకూ దాదాపు 45 కథలు అన్ని ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వీటిలోని 21 కథలతో.. 'సంఘే శక్తి కలియుగే' శీర్షికతో కథా సంపుటిని వెలువరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ చేతుల స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. తెల్సా 2022 కథల పోటీలో బహుమతి దక్కించుకున్నారు. ఈనాడు కథా విజయం – 2019లో 'భువి కోరని భ్రమణం' కథకు, 2020లో 'అడ్డుగోడ' కథకు బహుమతులు గెలుపొందారు. నమస్తే తెలంగాణ – ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం కథల పోటీల్లో 'వానకారు కోయిల', 'ఇంకా తెలవారదేమీ', 'నైతికానైతికం' కథలకు వరుసగా బహుమతులు అందుకున్నారు. 'ఇంకా తెలవారదేమీ' కథ.. కన్నడలోకి అనువాదమై, అక్కడా ప్రముఖుల ప్రశంసలు పొందింది.

**–98493 03247**

# సహజం



**ఆకెళ్ల సూర్యనారాయణ మూర్తి**

బ్రాహ్మీముహూర్తం.. అలారం మోగడంతో బద్ధకం వదిలించుకుంటూ నెమ్మదిగా లేచి కూచున్నాను. మహానగరంలో ఉరుకులు పరుగుల జీవితాలు.. ఇంత ప్రొద్దున్నే లేచినా, ఆఫీసుకి బయలుదేరే సమయానికి..

'మీవల్లే లేట్ అయింది..' అంటే.. 'నీకే టైమ్‌సెన్స్ ఉండదు' అంటూ.. నేనూ రేవతి అరుచుకోవడం కూడా అలవాటుగా జరిగేదే.

సుప్రభాతం వింటూ అరచేతులు రుద్దుకున్నాను.

ఆవలిస్తూ మంచం దిగబోతుంటే..

'గేటు తాళంతీసి నీళ్లు పెట్టండి. గుమ్మంలో ముగ్గేస్తాను'.. దుప్పటి ముసుగు తీయకుండానే చెప్పింది సతీమణి.

కళ్లు నులుముకుని బెడ్రూంలోంచి హాల్‌లోకి వచ్చి.. పూజామందిరంలో దేవుడికో నమస్కారం చేసి నిత్యకృత్యాలలో పడ్డాను. ఇద్దరి మొబైల్ ఫోన్లు చార్జింగ్ కోసం పెట్టడంతో రోజు మొదలైనట్టే. ఊపిరి తీయడం క్షణం ఆలస్యమైనా ఫర్వాలేదు, చేతిలో మొబైల్ లేకపోతే మాత్రం ఊపిరి ఆగిపోయినట్టే.

రోజంతా ఎంత హడావుడిగా గడిచిపోయినా, పొద్దున మాత్రం మా రెండో అంతస్తు బాల్కనీలో ఎదురెదురు కూచుని నేనూ, రేవతి టీ తాగుతాం. అయితే ఒక చేతిలో టీ గ్లాస్, రెండో చేతిలో మొబైల్ ఫోన్లు ఉంటాయి. రాత్రి ఆలస్యంగా వచ్చిన వాట్సాప్ సందేశాలు, మెయిల్, మిస్డ్‌కాల్స్ అన్నీ చకచకా చూసేసి కొన్నిటికి సమాధానాలు ఇస్తూ, కొన్ని వదిలేస్తూ, ఇంటి వ్యవహారాలు మాట్లాడుకోవడం కూడా జరిగిపోతాయి. ఇదంతా పూర్తిచేసి లేవబోతుంటే నా మొబైల్ మోగింది. ఆ రోజు తనకి ఆన్‌లైన్‌లో జాతీయస్థాయి సమావేశం ఉందట. రోజూ కన్నా త్వరగా బయలుదేరాలని చెప్పి కాల్ త్వరగా పూర్తి చేయమని సైగలు చేసి.. రేవతి లోపలికి వెళ్లిపోయింది. తనకి కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం.

ఆ కాస్తలోనే రెండు మిస్డ్‌కాల్స్. ఒక వాట్సాప్ కాల్.. న్యూజెర్సీ నుండి

మోహన్ చేశాడు. ఇంటర్‌లో ఇద్దరం కలిసి చదువుకున్నాం. తను ఇంజినీరింగ్ చేశాడు. ఎమ్మెస్ కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిపోయాడు. నాకు ర్యాంక్ సరిగారాక డిగ్రీ పూర్తిచేసి.. అతి కష్టమ్మీద ప్రభుత్వ ఉద్యోగంలో చేరగలిగాను. ఎప్పుడు ఇండియా వచ్చినా, ఎంత బిజీగా ఉన్నా.. మొబైల్‌లో తప్పనిసరిగా పలకరించేవాడు. సమయం చూస్తే ఆరు అవుతోంది. అంటే నిన్న రాత్రి ఎనిమిదిన్నర అక్కడ. ఆలోచనల్లో ఉండగానే మళ్లీ ఫోన్ మోగింది.

'సారీ సూర్యా! పొద్దునే ఇబ్బంది పెడుతున్నాను' అవతల మోహన్ గొంతులో ఆందోళన.

'ఏమైందిరా'

'అమ్మకి సీరియస్‌గా ఉందిరా.. గంట క్రితమే నాన్న ఫోన్‌చేశారు. మెట్రోసిటి హాస్పిటల్‌లో ఐసీయూలో ఉంది. క్రిటికల్ అని చెప్పారు. వీలైనంత త్వరగా బయలుదేరే ప్రయత్నం చేస్తున్నాను. మలేషియాలో ఉన్న మా చెల్లెలు సుధ రేపు బయలుదేరుతోంది. అక్కడ నాన్నగారు ఒక్కరే ఉన్నారు. నీకు ఏమాత్రం వీలున్నా'.. ఆగాడు మోహన్.

ఈ మధ్యకాలంలో తన మాట కాదనలేక వాళ్ల అమ్మానాన్నల అనారోగ్య కారణాల కోసం.. దాదాపు అయిదారుసార్లు సెలవు పెట్టి వెళ్లాల్సి వచ్చింది.

'సర్లే రా! వెళ్తాను' నా ప్రమేయం లేకుండానే జవాబు చెప్పాను.

తనొచ్చేలోగా ఖర్చుల కోసం ఆన్‌లైన్ ద్వారా డబ్బు పంపిస్తానన్నాడు. క్షణాల్లో పెద్దమొత్తం నా బ్యాంక్ అకౌంట్‌లోకి చేరినట్టుగా మొబైల్‌లో సందేశం కూడా వచ్చింది.

'ఎవరు? ఆ ఆన్‌లైన్ మోహనేనా? ఇంత పొద్దునే ఫోన్‌చేస్తే ఆయనే అనుకున్నాను.. వాళ్లకి పడకేసే టైమ్, మనకి పరిగెత్తే టైమ్! మన హడావుడి తెలిసికూడా మీరు చెప్పరు. ఆయన అనుకోడు. ఈసారి.. ఎవరికి బాగోలేదట? అలాంటప్పుడేగా మీరు గుర్తొస్తారు.. మళ్లీ సెలవు పెడుతున్నారా?' కిచెన్‌లోంచే రేవతి అరిచింది.

'ఆంటీకి.. అస్సలు బాగోలేదు. వెంటిలేటర్ పెట్టారట! మోహన్ బయలుదేరుతున్నాడు. రేపు వాళ్ల చెల్లెలు వస్తోంది.. అంకుల్ ఒక్కరే ఉన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బు కూడా ట్రాన్స్‌ఫర్ చేశాడు..' విషయమంతా నెమ్మదిగా చెప్పాను.

'ఇదంతా సరే.. ఎప్పుడూ మీకే చేస్తాడాయన. చుట్టాలు, స్నేహితులు ఇంకెవరు లేరా!?' రేవతిలో అసహనం.

మోహన్ వ్యక్తిగత వివరాలు అంతగా తెలియవు నాకు. గతంలో ఇలాంటి అవసరాలలో వాళ్లింటికో, ఆసుపత్రికో ఎన్నిసార్లు వెళ్లినా.. మరో మనిషి

తారసపడలేదు. అమెరికాలో ఉద్యోగం దొరికాక అక్కడే పెళ్లి చేసుకున్నాడు మోహన్. మొబైల్‌లో శుభలేఖ పంపించాడు. పెళ్లి చూడటం కోసం 'ఆన్‌లైన్ లింకు' పంపించాడు. ల్యాప్‌టాప్‌లో మోహన్ పెళ్లి చూసి.. స్క్రీన్ మీదే అక్షింతలు వేశాం నేనూ, రేవతి. అప్పుడప్పుడూ ఆన్‌లైన్‌లోనే పలకరిస్తుంటాడు.

ఇంట్లోంచి త్వరగానే బయల్దేరాం. బైక్ మీద వెళ్తున్నంతసేపూ.. రేవతి చికాకు పడుతోనే ఉంది. మా అవసరాల కోసం ఆదివారాలు, పర్మిషన్లు వాడుకోవడమే తప్ప.. ఇలా ప్రత్యేకంగా సెలవులు పెట్టడం తక్కువ. ఎవరూ చూసేవాళ్లు లేక, పిల్లల చిన్నతనాలలో ఇద్దరం విపరీతంగా సెలవులు వాడేశాం. చాలా సందర్భాలలో జీతాల్లో నష్టంకూడా భరించాల్సి వచ్చింది.

ఎప్పుడో రిటైర్ అయ్యాక వచ్చేడబ్బుల కన్నా.. ఇప్పుడు కళ్లముందున్న అవసరాలు చాలా ముఖ్యం అనుకుని బాధపడలేదు. అయితే ఈమధ్య మోహన్ కోసం చాలా సెలవులు పెడుతున్నాను. ఆలోచనల్లో ఉండగానే రేవతిని ఆఫీసు దగ్గర దిగబెట్టాను.

'బైట నుండి వచ్చీరాగానే ఆ గుడ్డలతో ఇల్లంతా తిరిగేయకండి. మెట్లకింద స్నానం చేసి బట్టలు మార్చుకుని ఇంట్లోకి వెళ్లండి. సాయంత్రం ఏదో తంటాలు పడి నేనే వచ్చేస్తాను' హెచ్చరికలు చేసి ఆఫీసులోకి వెళ్లిపోయింది రేవతి.

ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి పరిగెత్తాను. దార్లో ఉండగానే మోహన్ మళ్లీ ఫోన్ చేశాడు. వీలైతే తన తల్లిని వీడియో కాల్‌లో చూపించమన్నాడు.

ఐసీయూ ముందు వరండాలో దిగాలుగా కూర్చుని ఉన్నారు మోహన్ తండ్రి సుందర్రావుగారు.

'అంకుల్..' అంటూ ఆయన భుజమ్మీద చెయ్యేశాను.

'సూర్యం.. క్షమించు బాబు! నేనే సాయం కోసం రమ్మన్నాను..' నా రెండు చేతులూ పట్టుకున్నారాయన.

'పెద్దవారు.. మీరు ఆ మాటనకండి. మోహన్ ఎంతో, నేనూ అంతే' అంటూ ఆయన పక్కనే కూర్చున్నాను.

'ఆ చనువుతోనే ప్రతీసారీ నా కోసమో, నా భార్య లక్ష్మి కోసమో నిన్ను ఇబ్బంది పెడుతున్నాను. బాబూ సూర్యం.. ఇంతక్రితమే డాక్టర్‌గారు చూసి వెళ్లారు. ముఖ్యమైన వాళ్లని పిల్చుకోమని చెప్పారు. కనీసం పిల్లలకైనా కడసారి చూపు దక్కుతుందో లేదో? ఈసారి లక్ష్మి నాకు అన్యాయం చేసేటట్టుగా ఉంది.. బాబు..' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మనిషి మొత్తంగా వణికిపోతున్నారు.

ఆయన్ని ఓదార్చడానికి నాకు శక్తి చాలటం లేదు.

'లక్ష్మిగారి అటెండర్ రావాలండి..' ఐసీయూ ముందున్న సెక్యూరిటీ

అరిచాడు.

ఒక్కసారిగా సుందర్రావుగారు కంపించిపోయారు. కూర్చున్నచోటు నుంచి లేవలేకపోతున్నారు.

'సూర్యం.. నాకు ధైర్యంలేదు! ఒక్కసారి నువ్వు..' అంటూ ఆగిపోయారు.

నేను తడబడుతూ భయంగానే వెళ్లాను. అచేతనంగా పడి ఉన్నారు ఆంటీ. చాలారోజుల క్రితం సుందర్రావుగారికి బాగోలేనప్పుడు ఆవిడకి సాయంగా ఉన్నాను. అదే పరిచయం.

'మీరు..' డాక్టర్ అడిగారు.

'నా పేరు సూర్యం.. ఆవిడ మా ఆంటీ..' ఆవిడనే చూస్తున్నాను.

'వీళ్లబ్బాయి మోహన్ చాలాసేపు మాట్లాడాడు నాతో' అంటూ వైద్య పరిభాషలో మిగతా విషయాలు చెప్పాడు డాక్టర్.

'మాలోపం లేకుండా అన్ని విధాలా ప్రయత్నించాం.. మీ అంకుల్‌కి చెప్పండి. వెంటిలేటర్ విషయంలో ఆయన ఎలా చెబితే అలా..' చెప్పడం పూర్తయినట్టు వెళ్లిపోయాడు డాక్టర్.

ఈ విషయం పెద్దాయనకి ఎలా చెప్పాలో తెలియడం లేదు.

యాంత్రిక శ్వాస ద్వారా, నిశ్చలంగా ఉన్న ఆంటీని చూస్తున్నాను. మరి కొన్నిఘడియలలో జీవన చరమాంకపు ఘట్టంలోకి శాశ్వతంగా చేరబోతున్నారు. కోరికలు, కలలు, ఆశలు, ఆశయాలు, కష్టాలు, ఇష్టాలు, తీరినవి, విఫలమైనవి, అనుభవాలు, ఆవేదనలు.. ఇలా ఎంతో జీవితాన్ని చూసిన ఆవిడని అలా చూస్తుంటే.. ఎందుకో ఒళ్లు జలదరించింది. చిత్రమైన అనుభవం.. అసలు నేనెవరు? ఆవిడెవరు? ఈ సమయంలో ఇక్కడ నేనుండటం నిజంగా అనూహ్యం.

కేవలం మోహన్ అర్థించడం వల్ల నేనిక్కడ ఉన్నాను అంటే.. నమ్మశక్యం కావడం లేదు. అంతకుమించిన మరేదో బంధం.. వీడియో కాల్‌లో ఆంటీని చూపించమన్న మోహన్ మాటలు గుర్తొచ్చినా.. మనస్కరించక బైటికి నడిచాను.

అతికష్టం మీద అంకుల్‌కి నచ్చచెప్పడం, మోహన్‌తో మాట్లాడటం, వాడు తన చెల్లెలితో మాట్లాడటం, హాస్పిటల్ వ్యవహారాలు త్వరగా పూర్తిచేసి.. లక్ష్మి ఆంటీ మృతదేహంతో రాత్రి పది గంటల సమయంలో ఔటర్ రింగ్‌రోడ్ దగ్గర్లో ఉన్న వాళ్ల విల్లాకి చేరుకున్నాం.

అప్పటికే రేవతి పదిపన్నెండు సార్లు ఫోన్ చేసింది. జరిగింది క్లుప్తంగా చెప్పి, మరో గంటలో ఇంటికి చేరతానని చెప్పాను. పొద్దుటినుంచి తిండీ నీళ్లు లేకపోవడం, హాస్పిటల్ వాతావరణం, ఫోన్ల ద్వారా నిర్ణయాలు, క్షణం తీరిక లేకుండా ఇతర ఏర్పాట్లు చూడటంతో కళ్లు తిరుగుతున్నట్టుగా ఉంది.

పనివాళ్ల సాయంతో హాల్‌లోకి ఫ్రీజర్ బాక్స్ చేరింది. నిర్జీవమైన ఆంటీముఖాన్ని చూడటానికి ధైర్యం లేదు.

సుందర్రావుగారు నిస్తేజంగా ఉన్నారు.

'అంకుల్.. ఎవరికైనా చెప్పాలంటే ఫోన్ చేస్తాను..' ఎలాగో గొంతు పెగుల్చుకున్నాను.

'లక్ష్మిని ఇంటికి తెచ్చేశాం! ఇంకేం కంగారు లేదు. పనివాళ్లున్నారుగా.. అయినా ఇంక చేయడానికేముంది? శవంగా తనూ, జీవశ్చవంగా నేనూ.. పిల్లలొచ్చేవరకు ఎదురుచూడటమే! ఇప్పటికే నిన్ను చాలా ఇబ్బంది పెట్టాను.. ఇంకా ఉండమనడం భావ్యం కాదు' అంటూ చేతులు జోడించబోయారు. చప్పున ఆయన చేతులు పట్టుకున్నాను.

తప్పనిసరై నిశ్శబ్దంగా బైటికి నడిచాను.

ఇంటికెలా చేరానో, ఏం తిన్నానో, కలలో జరిగినట్టుగా అనిపించింది. మర్నాడు ఎనిమిదింటికి నిద్రలేచాను.

'ఇవాళ కూడా రానట్టేగా?' అసహనంగా చూసింది రేవతి..

'రాత్రి చాలా లేట్టైనట్టుంది..' తల భారంగా అనిపిస్తోంది.

'గూర్ఖావాడు, మీరు కలిసే వచ్చారు..' రేవతి మాటల్లో విసుగు, బాధ, భయం..

'ఎందుకీ అర్థంపర్థం లేని పనులు.. మీ స్నేహితుడేమో అక్కడ్నుంచి ఫోన్‌చేసి ఆర్డర్ వేయడం.. తగుదునమ్మా అని మీరు పరిగెత్తడం.. ఇంతాచేస్తే మీఫ్రెండ్ గానీ, వాళ్ల నాన్నగారు గానీ ఆస్తిలో వాటా ఇస్తారా? సంపాదన కోసం ఎగబడి పోతున్నారుగా.. కన్నవాళ్లు ఇక్కడ ఉన్నారో చచ్చేరో ఎవరికీ పట్టదు. డబ్బులు పంపిస్తే చాలా? నిలబడి చేసేవాళ్లు కావాలి? పిల్లల్ని పంపించి పెద్దవాళ్లు, ఈ పెద్దవాళ్లని వదిలేసి ఆ పిల్లలు ఏం బావుకుంటున్నారో తెలియడం లేదు. అమ్మ అన్నమాట నేర్పుతున్నారో లేదో తెలీదు గానీ.. అమెరికా, ఆస్ట్రేలియా అన్న మాటలు మాత్రం బాగా పలికిస్తున్నారు. అయినా మీరు సాయం చేస్తున్నారో, చాకిరీ చేస్తున్నారో తెలుసుకోలేని పిచ్చిలో ఉన్నారు. అంతా నా ఖర్మ!' రేవతి మాటలు ఆగడం లేదు.

సరిగ్గా అప్పుడే మోహన్ దగ్గరనించి ఫోన్. చటుక్కున నా చేతిలో ఫోన్ లాక్కుని స్విచాఫ్ చేసింది.

తన ఆవేదన తెలుసు. నచ్చచెప్పే ప్రయత్నం చేశాను.

'పెద్దాయన ఒక్కరే ఉన్నారు. కనీసం మోహన్ వచ్చేవరకు.. ప్లీజ్ రేవతి! అర్థం చేసుకో! నిన్ను ఆఫీసు దగ్గర దిగబెట్టి..' నా మాటలు పూర్తికాకుండానే రేవతి

అందుకుంది..

'అక్కర్లేదు.. నా చావు నేను చస్తా! మీరు శవజాగరణ చేసుకోండి'.. విసురుగా వెళ్లిపోయింది.

రెండు రోజుల తర్వాతగానీ మోహన్, సుధ రాలేకపోయారు. మోహన్ భార్య గర్భవతి, రాలేదు. సుధ, ఆమె భర్త వచ్చారు, పిల్లలు రాలేదు. సుందర్రావుగారి తరుపు బంధువులు పెద్దగా రాలేదు. చాలామంది విదేశాలలో ఉన్నారని ఇంటి పనివాళ్లు చెప్పారు. సిటీలో ఉన్నవాళ్లు కూడా ఎక్కువగా రావడం చూడలేదన్నారు.

మొబైల్ ద్వారా మాత్రమే ఎక్కువగా మాట్లాడేవారని చెప్పారు.

'ఆన్‌లైన్' సదుపాయంతో పెద్దగా హడావుడి లేకుండానే లక్ష్మి ఆంటీ అంత్యక్రియల ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీడియో రికార్డింగ్ కూడా జరుగుతోంది.

భుజమ్మీద చెయ్యేసే వాళ్లు లేరు. పక్కన కూచుని పలకరించే వాళ్లు లేరు. దగ్గరకి తీసుకుని ధైర్యం చెప్పేవారు లేరు. ఒకమాట ఇటు, ఒకమాట మొబైల్‌లో.. అక్కడున్న పదిమంది చేతుల్లో ఇరవై కనిపిస్తున్నాయి. ఒకరిద్దరు ఫ్రీజర్ పక్కన నిలబడి సెల్ఫీలు దిగుతున్నారు. మళ్లీ వస్తామో!? రామో!? అనిట! నిమిషానికో ఫోన్ మోగుతోంది. జీవంలేని మొబైల్.. ప్రాణంగా తయారైంది.

ప్రాణం పోయిన మనిషిని ఎప్పుడు తీసుకెళ్తారా!? అని అసహనంగా ఎదురుచూస్తున్నారు. ఏడవాలో, నవ్వాలో అర్థం కావడంలేదు.

జరిగే తతంగమంతా ప్రత్యక్షప్రసారంలాగా రానివాళ్ల కోసం ఫోను ద్వారా చూపిస్తున్నారు ఇంకెవరో. పలకరింపులు, పరామర్శలు, ఓదార్పులు, నిట్టూర్పులు, ఏడవడాలు అన్నీ మొబైల్ ద్వారా జరిగిపోతున్నాయి. సుందర్రావుగారు నిర్లిప్తంగా ఉన్నారు.

'పిన్ని మొహం సరిగ్గా కనిపించడం లేదు.. కాస్త దగ్గరగా చూపించు..' ఎవరి ఫోన్‌లోంచో అవతలివైపు గొంతు స్పష్టంగా వినిపిస్తోంది.

'నా ఫోన్లో డాటా అయిపోయింది. ఒక్క నిమిషం.. రీఛార్జి చేస్తున్నాను' ఇవతలి వారి సమాధానం.

'ఎందుకురా కంగారు! ఫోన్‌లో సరిగా కనిపించదనే వీడియో తీయిస్తున్నాడు మోహన్. ఆన్‌లైన్‌లో లింక్ పంపిస్తానన్నాడు. డాటా ఎందుకు దండగ' అన్నాడో మధ్య వయస్కుడు.

మార్కెట్లో ఉన్న అధునాతన స్మార్ట్‌ఫోన్లు, ఇప్పుడున్న 'జీ' నుంచి.. భవిష్యత్తులో రాబోయే 'జీ' లు. ఉన్న చోటునుంచి కదలకుండా జీవితాలని సౌకర్యవంతం చేస్తున్న ఆన్‌లైన్ ఉపకరణాల గురించి చర్చ మొదలైంది.

మోహన్ తన భార్యకి, సుధ తన పిల్లలకి మొబైల్ ద్వారా ఇక్కడి దృశ్యాలని చూపిస్తూ, రన్నింగ్ కామెంటరీ చెబుతున్నారు.

నా చేతిలో ఉన్న మొబైల్ని చూస్తే భయమేస్తోంది.

'అమ్మగారి మంచితనం' చెప్పుకొంటూ.. పనివాళ్లు అప్పుడప్పుడూ గొల్లుమంటున్నారు.

దహన సంస్కారాలు పూర్తయ్యాయి. వచ్చిన అతిథులు వెళ్లిపోయారు. భరించలేనంత నిశ్శబ్దం!

అంతకుముందే మోహన్‌తో చెప్పాల్సింది చెప్పి, తనిచ్చిన సొమ్ములో మిగిలింది ట్రాన్సఫర్ చేసేసి భారంగా అడుగులేశాను.

అప్పటికే వారంరోజులు సెలవులుగా కరిగిపోయాయి. ఇంటికెళ్లగానే పూర్తిస్థాయిలో శుద్ధి చేసింది రేవతి.. నన్నూ, నా మొబైల్ని కూడా.

మర్నాడు ఆఫీసులోకి అడుగుపెట్టగానే బాస్ కూడా వార్నింగ్ లెటర్ ఇచ్చాడు.

మరో వారం తర్వాత అమెరికా వెళ్లబోతూ విమానాశ్రయం నుండి ఫోన్ చేశాడు మోహన్. సుధ ఆమె భర్త రెండురోజుల ముందే పిల్లల కోసం వెళ్లిపోయారట. భార్యని డెలివరి కోసం చేర్పించడంతో, కొడుకుగా తల్లికి చేయాల్సిన మిగతా కార్యక్రమాల కోసం ఎవరినో ఏడాదిపాటు 'గుత్తగా' మాట్లాడి కుదిర్చానని చెప్పాడు.

'మరి నాన్నగారు..' ఇంకేం అడగాలో అర్థం కాలేదు నాకు.

'అంత పెద్దింట్లో ఆయనొక్కరే ఉండటం కష్టమని.. వెళ్లేముందే వృద్ధాశ్రమంలో చేర్పించాను. ఆన్‌లైన్ ద్వారా సులువుగానే పనైపోయింది. ఇల్లు అద్దెకివ్వడం కోసం కూడా ఆన్‌లైన్‌లోనే వివరాలిచ్చానురా. ఇండియా ఎప్పుడొస్తానో తెలీదు.. సమయానికి నువ్వు చేసిన సాయానికి చాలా థాంక్స్ రా.. మళ్లీ ఆన్‌లైన్‌లో కలుద్దాం.. బై!' కాల్ ఆగిపోయింది.

అంటే.. ఇంక తండ్రితో అవసరం లేదన్నమాట! అంకుల్ మొహం గుర్తొచ్చి మనస్సు చివుక్కుమంది.. తట్టుకోలేకపోయాను.

మానవ జీవితాలని, సంబంధాలని 'ఆన్‌లైన్' శాసిస్తోందా? మంచితనం, మానవత్వం అసహజాలా?

భవిష్యత్తులో మానవతా విలువలు, సంబంధ బాంధవ్యాలు, అనురాగాలు, ఆప్యాయతలు వంటి పదాల అర్థాల కోసం అంతర్జాలంలో గాలించాలేమో?

చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ వైబ్రేషన్‌లో కదులుతోంది, పాముపిల్లలా.

'రవీంద్ర కాలింగ్'.. సహోద్యోగి అతను. నాకు జూనియర్. ప్రసవంలో అతని భార్యకి కడుపులో బిడ్డ అడ్డం తిరగడంతో ఆపరేషన్ చేస్తున్నారట.. సాయంగా

రమ్మంటున్నాడు.. ఏం చేయను? తోచడం లేదు.

ఎందుకో గానీ, చిన్నప్పుడు విన్న ఒక కథ మాత్రం గుర్తొచ్చింది. ఒక సాధువు నీటిలో కొట్టుకుపోతున్న ఒక తేలుని చూసి, సాయం చేద్దామని ఎన్నిసార్లు బైటికి తీసి కాపాడినా.. అన్నిసార్లూ సాధువుని కుట్టి మళ్లీ నీళ్లలోకే పడుతోందిట ఆ తేలు. ఆ బాధ భరిస్తూనే తన ప్రయత్నం ఆపకుండా మళ్లీమళ్లీ దాన్ని బయటకు తీస్తూనే ఉన్నాడాయన. చుట్టూ చేరిన జనాలు వినోదంలా చూస్తూ నవ్వుతుంటే, ఆ సాధువు కూడా నవ్వి.. 'కుట్టడం దాని సహజగుణం. సమయానికి సాయం చేసి కాపాడటం మనిషి సహజగుణం. ఒంట్లో విషాన్ని నింపుకొన్న తేలే దాని గుణాన్ని వదులుకోనప్పుడు.. మనిషిగా నేను, నా సహజగుణాన్ని ఎలా వదులుకుంటాను' అంటూ జనాల మాటలు పట్టించుకోకుండా.. మళ్లీ తేలుని తీసి దూరంగా విడిచిపెట్టి ముందుకెళ్లి పోయాడు.

ఈ సన్నివేశం జ్ఞప్తికి రాగానే మనసు తేలికపడింది. ఆ సమయంలో రేవతి తిట్లు, బాస్ హెచ్చరికలు, తోటివారి గుసగుసలు మరేమీ గుర్తుకురాలేదు.

తక్షణం నా మిత్రుడి కోసం బయలుదేరాను.

***

## ఆకెళ్ల సూర్యనారాయణ మూర్తి

ఏదైనా విషయం లేదా సంఘటన పట్ల మనసు స్పందించినప్పుడు.. కథ గానీ కవిత గానీ రూపుదిద్దుకుంటుంది. అలా రూపుదిద్దుకున్న కథే.. సహజం! రచయిత ఆకెళ్ల సూర్యనారాయణ మూర్తి. ఎం.కామ్ చేశారు. సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే సొసైటీలో ఆఫీస్ సూపరింటెండెంట్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి.. 2023లో విరమణ తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర శ్రీ సత్యసాయి సేవాసంస్థలలో రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా ఉన్నారు. సాయి సంస్థల కోసం రచనలు, అధ్యాత్మిక ప్రసంగాలు చేస్తున్నారు. కథలు, కవితలు, నాటికలు, ఇతర రచనలు చేయడాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. పత్రికలతోపాటు రేడియో, దూరదర్శన్, ఇతర ప్రైవేట్ చానల్స్‌లో డైలీ సీరియల్స్ కోసం మాటలు రాశారు. 2015లో రాజమండ్రిలో నిర్వహించిన నంది అవార్డ్ నాటకాల పోటీలలో.. ఈయన రాసిన 'పడగనీడ' నాటకం ప్రదర్శితమైంది. స్టేజ్, రేడియో, టీవీలలో నటన, వ్యాఖ్యానం చేశారు. ఈయన రచించి వ్యాఖ్యానం చేసిన భక్తి గీతాల ఆడియో సీడీలు ఎనిమిది వరకూ విడుదలయ్యాయి. -92474 95346

# షీరో



## డా. చెళ్లపిళ్ల సూర్య లక్ష్మి

డాక్టరేటు పట్టా సంపాదించడానికి వైవా వోసీ జరగబోతోంది ఆ పెద్ద హాలులో. పరిశోధన చేసిన విద్యార్థినిని చూసి జడుసుకున్నాడు వేరే ఊరి నుండి వచ్చిన నిపుణుడు. ఆమె దగ్గరగా లేనప్పుడు..

'ఈ అమ్మాయేనా పోషణ మీద ఇంత మంచి సిద్ధాంత గ్రంథం రాసింది?' అని, ముక్కుమీద వేలు వేసుకున్నాడు.

మన దేశంలో ఇది మామూలేనని ఆ అమ్మాయి తాలూకు గైడ్ ఆ విషయం పట్టించుకోలేదు.

అడిగిన ప్రశ్నలకి బ్రహ్మాండంగా జవాబులు చెప్పి, అందరి మన్ననలు అందుకున్న ఆ అమ్మాయి సాగరిక.. ఒకప్పటి 'చేపల్లాంటి' తన కంటి కొనల్లోంచి జారబోతున్న కన్నీటిని రుమాలుతో తుడిచేసింది. తనని చూసి జడుసుకోవడం, తనని వింత, వికృతమైన చూపులు చూడ్డం ఆమెకొక రొటీన్ అయిపోయింది. ఇంత అలవాటు పడినా, తన చర్మం మొద్దుబారిన విషయాన్ని ఇంకా తన మనసు అంగీకరించలేదేమో! అప్పుడప్పుడూ అందవిహీనమైన తన కళ్లు చిప్పిల్లుతూనే ఉంటాయి.

* * *

'డాక్టర్ సాగరికా! ఈ రెస్టారెంట్ గురించి మీరు ఎక్కడ తెలుసుకున్నారు?' అడిగింది ఒక ఆవిడ.

'న్యూస్ పేపర్లో మేడమ్' జవాబిచ్చింది ఆమె.. ఒక ఫైల్‌లోకి చూస్తూ.

'మీరు బాగా చదువుకున్న వారు. ఒక చిన్న రెస్టారెంట్‌లో పని చేద్దామని ఎందుకు వచ్చారు?' అడిగింది మరో స్త్రీ.

సాగరిక చిరునవ్వుతో..

'మేడమ్! ఎంత చదువుకున్నా, ఒక్క మంచి ఉద్యోగం కూడా సంపాదించలేక పోయాను. కారణం..' అంటూ, తన మొహం చుట్టూ వేలు తిప్పి,

'ఈ మొహం! ఇది ఒక రెస్టారెంట్ కాబట్టి మీ చెఫ్‌లు రుచి గురించి ఆలోచిస్తే..

నేను ఆరోగ్యం, పోషకాహారాల గురించి జాగ్రత్త తీసుకుంటాను. వాల్యూ ఎడిషన్ అయినట్టే కదా మేడమ్!' అంది.

ఆవిడ తలూపుతూ..

'దీనితో మీ బాధ్యత పూర్తయిపోతుందా?' అని అడిగింది.

సాగరిక నవ్వుతూ..

'ఈ స్థలం కేవలం ఆర్డర్ ఇచ్చిన టిఫిన్ తిని వెళ్లిపోవడానికి కాదనే ఉద్దేశంతో ఈ రెస్టారెంట్ తెరిచారు. మీ కల నిజమవ్వాలంటే మన ఈ చోటు.. స్త్రీలు నిర్భయంగా తమ కష్ట సుఖాలు పంచుకునే ఒక పవిత్రమైన ఆలయం కావాలి. ఈ కలను సాకారం చేయడానికి నాకో అవకాశాన్ని ఇస్తారా?' అని మర్యాదగా అడిగింది.

ఇంటర్వ్యూ చేసినావిడ చిరునవ్వు నవ్వి, సాగరికను తమ బృందంలోనికి స్వాగతించింది.

* * *

గుండ్రటి టేబుల్‌లో కూర్చున్న అమ్మాయిలను పరిచయం చేసింది ఇంటర్వ్యూ చేసిన ప్రమీల.

'డియర్ ఫ్రెండ్స్! ఈరోజు మన ప్రయత్నంలో ఒక కొత్త భాగస్వామినిని పరిచయం చేస్తాను. ఈమె పేరు డా. సాగరిక. మీ పరిచయాలు, కథా-కమామీషూ మొదట కానివ్వండి. ఆవిడ గురించి ఆమే తరువాత చెప్తారు' అని ముగించింది.

మొదటి అమ్మాయి..

'నైస్! నా పేరు నర్మద. నేను డిగ్రీ చదువుతున్నప్పుడు మా కాలేజీ పోకిరిగాడు నన్ను ప్రేమించమని వెంటపడే వాడు. నేను వాడికి నచ్చే జవాబు చెప్పలేదని ఒకరోజు కాంటీన్‌లో నా మొహంపై యాసిడ్ పోశాడు దరిద్రుడు. ఆ బాధ ఎలా భరించానో దేవుడికే తెలియాలి. మా ఇంట్లోవాళ్లు నా చదువుకి మంగళం పాడేశారు. నేను ఉద్యోగం చేసి, నా కాళ్ల మీద నేను నిలబడతానని.. ఒక వంట మనిషికి ఉద్యోగం ఇస్తానని తెగ గారాలు పోతూ, వంట నేర్చుకోలేదు. ఇక్కడ నేను ఆర్డర్స్ తీసుకుంటాను' అంది.

ఆమె ఆ బాధను అధిగమించినట్టుంది. యాసిడ్ దాడి గురించి చెప్పినప్పుడు ఎటువంటి హావభావాలూ కనబరచలేదు అనుకుంది సాగరిక.

తరువాతి అమ్మాయి..

'నా పేరు మోనాలిసా. నేను మా అమ్మ కడుపులో ఉన్నప్పుడు మా నాన్నగారు మోనాలిసా చిత్రాన్ని చూశారట. అందుకే, నాకు ఆ పేరు పెట్టారు. నా మానాన నేను చదువు చదువుకుంటే.. ఒకరోజు మా కాలేజీలోకి ఒక తెలియని వ్యక్తి వచ్చి నా

మొహంపై యాసిడ్ పోశాడు. చదివేది మెడికల్ కాలేజీలోనైనా నా కర్మని నేను అధిగమించలేను కదా! అందుకని నా మొహం ఇలా అయ్యింది. చివరికి తెలిసిందేమంటే.. మా అన్నయ్య రోడ్డు రోమియోలా ఎవరో అమ్మాయి వెంటపడితే, వాడికి బుద్ధి చెప్పడానికి ఆ అమ్మాయి వాళ్లన్నయ్య నాపై దాడి చేశాడు. అన్నయ్య ఉంటే నా వెంట మగాళ్లు పడరనుకున్నాను గానీ.. మా అన్న వల్లే నాకిలా నష్టం జరుగుతుందనుకోలేదు. కాలిన మొహంతో క్లాస్‌రూమ్‌కి వెళ్లడానికి అప్పట్లో ధైర్యం సరిపోక చదువు అటకెక్కింది. ఇక్కడికి వచ్చాక ధైర్యం వచ్చింది. సంతోషం వచ్చింది' అంది.

మరో అమ్మాయి..

'నా పేరు స్ఫూర్తి. నా బాయ్‌ఫ్రెండ్ నన్ను ప్రలోభపెట్టి, నన్ను వదిలించుకోడానికి ప్రయత్నించాడు. నేను స్త్రీల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తానన్నాను. వాడు నన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పి, నన్ను చంపే ఉద్దేశంతో నా మీద యాసిడ్ పోశాడు. నేను బతికిపోయాను గానీ, నా కడుపులో ఉన్న వాడి పాపం మాత్రం.. వాడు పోసిన యాసిడ్‌తోనే పోయింది. ఇక్కడకి వచ్చి తల ఎత్తుకు బతుకుతున్నాను' అంది.

ఈ అనుభవాలు పంచుకునే అమ్మాయిలు వాళ్ల వయసుకు మించిన పరిపక్వతను కనబరిచారు. అది చూసి సాగరికలో ఇన్నాళ్లుగా పేరుకుపోయిన నిరాశ, నిస్పృహ వెంటనే మటుమాయమయ్యాయి. ఒకప్పటి చేపల్లాంటి కళ్లు మౌనంగా కన్నీరు కార్చడం మానేశాయి. వాళ్లని చూసి, తను నేర్చుకోవాల్సింది చాలా ఉందని అర్థమైంది. తరువాత తనని తాను నిర్భయంగా, నిబ్బరంగా పరిచయం చేసుకుంది. అనతి కాలంలోనే ఆమె వాళ్లకి తగ్గ ధైర్యవంతురాలయ్యింది.

* * *

కొన్నాళ్లు గడిచాక...

మరో కొత్త అమ్మాయి వీళ్ల బృందంలో సభ్యురాలిగా చేరింది. పేరు స్వీటీ! మోడల్‌గా ఎదగాలని అనుకుందట. గిట్టని వాళ్లెవరో యాసిడ్‌తో దాడి చేయించారట. ఒక చెంప మాత్రం కాలింది. కాస్మెటిక్ సర్జరీకి డబ్బులు లేక ఇక్కడికి వచ్చిందట. చిన్నపిల్ల అవడం వల్ల నిజమవని కోరికలు, నెరవేరని కలలు.. ఈ రెండిటినీ తలుచుకుంటూ బాధపడుతూ ఉండేది. మిగతా అమ్మాయిలు ఆమెకు ఊరటనివ్వడానికి శాయశక్తులా ప్రయత్నించేవారు. ముఖ్యంగా సాగరిక..

'నీలాంటి మంచి అమ్మాయి మీద దాడి చేయించారంటే వాళ్లు ఎంత కుళ్లుబోతులో అర్థం అవుతోంది. అలాంటి ఫీల్డ్ ఎందుకు? అది కాకపోతే వేరే ఉద్యోగాలే లేవా? ఏం.. ఇప్పుడు మనం చేస్తున్నది ఉద్యోగం కాదా? మనకి

కావాల్సినంత తిన్నాక కూడా పొదుపు చేసుకోగలుగుతున్నాం. కొన్ని డబ్బులు పోగయ్యాక కావాల్సిన బట్టలూ, నగలూ కొనుక్కోవచ్చు. మనమందరం అందరి కోసం నిలబడి, తలెత్తుకుని బతుకుదాం. డోంట్ వర్రీ!' అని ధైర్యం చెప్పేది.

'ఈ మొహానికి ఖరీదైన బట్టలూ, నగలూ కూడానా? ప్చ్!' అని స్వీటీ నిట్టూర్చితే..

'నేనూ ఇలాగే ఉండేదాన్ని. మన సహచరులని చూడు.. వాళ్లు కూడా ఇదే బాధని అనుభవించి, పోటీపడి దాన్ని అధిగమించారు. రేపు నీకు ఒక చీటీలో ఎవరెవరు ఎంత కాలం తీసుకున్నారో రాసిస్తాను. నీతో నువ్వే పోటీ పడాలి. ఫ్యాషన్ పరేడ్ కన్నా ఇది ఇంకా వైవిధ్యంగా ఉంది కదూ!' అని ప్రోత్సహించేది సాగరిక.

* * *

ఆ రెస్టారెంట్‌లో పని చేసేవారికి తలలో నాలుకలా అయిన సాగరిక, ఊళ్లో గర్భిణులకు పోషకాహారం మీద ఒక ఉచిత శిబిరం ఏర్పాటు చేయించింది. తద్వారా పరోక్షంగా స్త్రీలలో తమబోటి వారి పట్ల అవగాహన పెంచి, వారిపట్ల న్యూనత తగ్గించే ప్రయత్నం చేసింది. దానికి మంచి స్పందన లభించడంతో చదువుకునే పిల్లలకి, వృద్ధులకి, స్థూలకాయులకి వేరువేరుగా ఉచితశిబిరాలు బ్రహ్మాండంగా నిర్వహించింది.

ఆ నోటా ఈ నోటా ఈ విషయం పెద్ద కార్పొరేట్ సంస్థలకి తెలిసి, వాళ్లు ఇటువంటి శిబిరాలకు ఆర్థిక సహాయాన్ని అందించడానికి ముందుకి వచ్చారు. ఆ వనరులతో పేదవారికి కూడా శిబిరాలు ఏర్పాటు చేసి, ఉచితంగా పోషకాహారం ఇవ్వడం మొదలుపెట్టారు సాగరిక, తన అనుచరులు!

ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకుండా సాగరిక ఎంతో పేరు సంపాదించుకున్నది. వాళ్ల రెస్టారెంట్‌కి వచ్చే అతిథుల సంఖ్య కూడా పెరిగిపోయింది.

* * *

ఒకరోజు రష్ తగ్గే సమయానికి..

'అమ్మా! మీరు రెస్టారెంట్ మూసేసే సమయం అవుతోంది. ఇక్కడికి వస్తే నా మనసుకెంతో ప్రశాంతత దొరుకుతుంది. రేపు సాయంత్రం కోసం ఎదురు చూసి మళ్లీ వస్తా!' అంది ఒక నడివయస్కురాలు.

సాగరిక చేతులెత్తి నమస్కారం పెట్టి..

'తప్పకుండా మేడమ్!' అంది.

'వారం రోజులుగా ఒక్కరోజూ వదలకుండా మీ రెస్టారెంట్‌కి వస్తున్నాను.

ఇంకా 'మేడమ్' ఏమిటమ్మా? నన్ను మీరంతా 'ఆంటీ' అని పిలవండి. నాకు ఆత్మీయంగా ఉంటుంది. అన్నట్టు.. నా పేరు వనజ' అందామె.

* * *

రోజులు నెలలుగా మారాయి. సాగరిక, వనజల మధ్య బంధం బలపడింది. తనకు సెలవున్న రోజుల్లో వనజ కూరగాయలు, పప్పులు-ఉప్పులు కొనేటప్పుడు ఆమెతో తోడు వెళ్లేది సాగరిక.

ఒక రోజు వనజ..

'నా స్నేహితురాలు కొత్త సంవత్సరపు క్యాలెండర్ కోసం కొత్త మోడల్స్ కోసం వెతుకుతోంది. మీలో ఎవరైనా సాయం చేస్తారా?' అని అడిగింది. అందరూ యాసిడ్ దాడిలో అందం కోల్పోయిన వాళ్లు గనుక ఈవిడకి ఏమైందన్నట్టు వింతగా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. స్వీటీ తన చెంపని నిమురుకుని కళ్లలో నీళ్లు నింపుకొంది.

వనజకి ఆ అపార్థం అర్థమై..

'అబ్బే! మా ఫ్రెండ్ సంకల్పం వేరు. యాసిడ్ దాడిని తట్టుకుని, ప్రపంచానికి ఎదురు నిలిచిన ధీరవనితలతో వచ్చే ఏడాది క్యాలెండర్ చేయాలనేది ఆమె ఉద్దేశం. మీరు సహకరిస్తారా?' అని అడిగింది.

స్వీటీ ప్రోత్సాహం వల్ల అందరూ మోడలింగ్ చేయడమే కాదు, తమ ధీరగాథలను టూకీగా చెప్పుకొన్నారు కూడా!

ఒక ప్రఖ్యాత సంఘసేవిక ఈ క్యాలెండర్ గురించి ప్రస్తావించి, వీళ్ల పోరాట పటిమని మెచ్చుకుంటే.. కొన్నాళ్లు సోషల్ మీడియాలో విధిని ఎదురించిన ఈ వీరనారులు హల్‌చల్ చేశారు. స్వీటీకి ఇప్పుడు జ్ఞానోదయమైంది. శారీరక సౌందర్యం ఒక్కటే ముఖ్యం కాదనీ, బాహ్య సౌందర్య విహీనులైనా జీవితాన్ని దర్జాగా బతకవచ్చని!

అప్పుడప్పుడూ సాగరికని మాల్‌కి తీసుకుని వెళ్లమనీ, ఖరీదైన బట్టలు కొనివ్వాలని చూసేది వనజ. కానీ, సాగరిక సున్నితంగా తిరస్కరించేది. అప్పుడప్పుడూ ఏదైనా పార్క్‌కి వెళ్లి తాజా గాలి పీల్చుకునేవారు వాళ్లిద్దరూ.

* * *

కొన్నాళ్లకి వనజ అక్కడికి రావడం మానేసింది. అందరూ ఆవిడను మిస్ అయ్యారు. ఆవిడ బాగోగుల గురించి సాగరికని అడిగారు. ఆమె అందరికన్నా ఎక్కువగానే వనజను తలచుకున్నా.. తన సెలవు రోజులు వనజకి అంకితం చేసినా, సాగరిక ఆమె గురించి ఏమీ తెలుసుకోలేదు. కనీసం ఫోన్ నెంబర్ కూడా తీసుకోలేదు. ఏ ప్రోగ్రాం పెట్టుకున్నా, వనజ రెస్టారెంట్‌లోనే చర్చించేది మరి!

తమ సంస్థ నియమాల ప్రకారం అక్కడికి వచ్చే స్త్రీలకి ఊరటనివ్వడమే తమ బాధ్యత గానీ.. అవతలి వాళ్లని ఇబ్బంది పెట్టి వాళ్ల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం తగదు. అలాగే తను నడుచుకుంటోంది. కానీ, అప్పుడప్పుడూ ఈవిడ తనపై మాత్రం ఇంత ప్రేమ ఎందుకు చూపిస్తోందా? అని ఆలోచించేది సాగరిక. అంతు తోచేది కాదు, పాపం!

వనజని మిగిలినవాళ్లు మరచిపోయే సమయానికి.. ఒక సాయంత్రం ఒక యువకుడు, ఒక యువతితో కలిసి రెస్టారెంట్‌కి వచ్చాడు. సాగరిక గురించి అడిగి, అందరినీ పిలిచి ఇలా చెప్పాడు.

'నేను వనజగారి అబ్బాయిని. పేరు అభిజిత్. ఈమె నా భార్య భాషిణి. మా అమ్మగారు ఓ గంట క్రితం పోయారు' అన్నాడు.

అందరూ బాధపడితే, సాగరిక బాధతో కన్నీరు మున్నీరయ్యింది. వెంటనే తేరుకుని, కన్నీటిని నియంత్రించుకుంది. అతను..

'మూడు రోజుల క్రితం ఆవిడకి గుండెపోటు వచ్చింది. తట్టుకుంటారనే అనుకున్నామండీ. కానీ..' అంటూ రుమాలుతో కళ్లు తుడుచుకున్నాడు. సాగరిక మౌనంగా ఉండిపోయింది. ఆమె కళ్ల ముందు వనజ ఆంటీతో తను గడిపిన మధుర స్మృతులు మెదిలాయి.

'మా నాన్నగారు చాలా ఏళ్ల క్రితమే పోయారు. అప్పటినుండీ ఆవిడ నాతోనే ఉంది. కానీ, మా చెల్లి పోయాక మా సొంతూరైన ఈ ఊరికి వచ్చింది మా అమ్మ. ఇక్కడున్న వంట మనిషి, పని మనిషి ఆవిడకి కొన్ని దశాబ్దాల నుండీ తెలుసు. వాళ్ల సాయంతో బతికేస్తానంది. ఆవిడ ఆసుపత్రిలో ఉన్నప్పుడు తన డైరీ తెమ్మని చెప్పారు. అందులో ముందుచూపుతో బుక్‌మార్క్ చేసిన తేదీలలో మీ రెస్టారెంట్ గురించి, మీ గురించి ఉన్నాయి. ఆవిడ చదవమంటే చదివాను. మీరు వయోవృద్ధుల కోసం నిర్వహించిన పోషక విలువల శిబిరంలో మా అమ్మ కూడా పాల్గొన్నారట. అప్పుడు మీరు అమితంగా నచ్చారట. పైగా, మిగిలిన వారిలాగా కాకుండా మీరు ఎవరినో తప్పించబోతూ యాసిడ్ దాడికి గురయ్యారట కదా! దానివల్ల ఆవిడకు మీమీద ఉండే గౌరవం రెట్టింపయ్యిందట. అదికూడా ఆవిడ డైరీలోని వివరమే! మీ సెలవు రోజుల్లో ఆవిడకి సాయం చేశారట కదా! సహాయకులు ఇంట్లో ఉన్నా మీతో సమయం గడపడానికి ఆవిడ ఆ పని చేశారట. ఆవిడ మీకు ఏమైనా ఇవ్వజూస్తే మీరు మర్యాదగా వద్దనే వారటగా! మీ మంచితనానికి ఆవిడ ఫిదా అయిపోయారు. మరి, పేజీల నిండా మిమ్మల్ని మెచ్చుకుంటూ, మా అమ్మ మీ ఔన్నత్యాన్ని చాటడంలో ఆశ్చర్యం లేదు కదా! మా చెల్లి పోయిన బాధను ఆవిడ మీవల్లే అధిగమించారని చెప్పగలను. ఆమె పోయాక..

తన చర్మాన్ని శరీరం కాలినవాళ్లకు ఇవ్వాలని చాలా రోజులుగా చెప్పేవారు. ఆవిడ కోరిక ప్రకారం ఆవిడ భౌతికకాయాన్ని ప్రభుత్వాసుపత్రిలో పొందుపరిచాం. ఆవిడ రాసుకున్న డైరీలో మీకు తన చర్మాన్ని ఇమ్మన్నట్టు ఉంది!' అంటూ ముగించాడు అభిజిత్.

ఏం చెప్పాలో తెలియని అయోమయంలో మునిగిపోయింది సాగరిక.

'మీ చెల్లెలు.. పాపం చిన్నవయసులోనే పోయినట్టుంది' అని సంతాపం ప్రకటించింది స్వీటీ.

'ఆమె కూడా మీలాగా యాసిడ్ దాడి బాధితురాలే! అన్ని వనరులూ ఉండి, సమయానికి చర్మం దొరక్కపోవడంతో మేం ఆమెను కోల్పోయాం. అప్పటినుంచీ, అమ్మే కాదు.. నేనూ, నా భార్యా కూడా చనిపోయాక బతికున్నవాళ్లకి ఉపయోగపడాలని తీర్మానించుకున్నాం. అందుకని, సాగరికగారూ, మీరు వెంటనే వస్తే ప్లాస్టిక్ సర్జన్ దగ్గరకి వెళ్దాం. ఎంత తక్కువ సమయం తీసుకుంటే అంత మంచిది. అందుకే, ఆవిడ పోయిన గంటలోనే ఇటొచ్చాను. డాక్టర్ సర్జరీ తేదీ నిర్ణయిస్తారు' అన్నాడు అభిజిత్.

రెండు క్షణాలు మౌనంగా ఉన్న సాగరిక..

'సర్! నాకు ఆంటీ అంటే చాలా ప్రేమ. అందుకు ప్రతిఫలంగా నేను ఆమె చర్మంతో నా మొహాన్ని అందంగా చేసుకోవడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే ఆవిడతో నేను గడిపిన సమయం ఒక నిష్కామకర్మ అనే అనుకున్నాను. దాన్ని ఇలా ఎక్స్‌చేంజ్‌లా మార్చడం తప్పు. మేమంతా యాసిడ్ బారినపడి, జీవితాన్ని పోగొట్టుకున్నవాళ్లమే! కానీ, అసలైన జీవితం అంటే ఏమిటో.. ఈ 'ఛాంప్ స్వచ్ఛంద సంస్థ' వాళ్లు మాకు నేర్పించారు. నాకు ఈ రూపం కూడా ఇష్టమే! అందరిలోనూ చిన్నపిల్ల, పెద్ద ఆశలు ఉన్న పిల్ల.. మా స్వీటీకి ప్లాస్టిక్ సర్జరీ చేయించండి!'..

స్థిరమైన మనసుతో చెప్పింది సాగరిక.

సాగరిక మాటలతో నివ్వెరపోయిన స్వీటీ.. ఆ తరువాత ఆనందభాష్పాలతో ఆమెను హత్తుకుని, ధన్యవాదాలు తెలిపింది.

***

## డా. చెల్లపిళ్ల సూర్య లక్ష్మి.

వీరి స్వస్థలం విశాఖపట్నం. ఎంబీఏతోపాటు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని రైల్వే నిర్మాణ విభాగంలో ఫైనాన్షియల్ ఎడ్వైజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. 2011 నుంచి రచనా వ్యాసంగాన్ని

కొనసాగిస్తున్నారు. తెలుగు, ఆంగ్లంలో కలిపి 130 వరకూ కథలు, రెండు నవలలు (అపజయాలు కలిగిన చోటే, మార్పు మన'సు'తోనే మొదలు) రాశారు. వీరి మొదటి కథ.. ఫెయిత్ ఇన్ అప్‌బ్రింగింగ్ (ఆంగ్లం), తెలుగు కథలో రాసిన మొదటి కథ.. ఓ బలహీన క్షణాన. వీటితోపాటు అవగాహన, పిచ్చి డాక్టరమ్మ, తోడు, ఓ వర్షం కురిసిన రాత్రి, కత్తిలాంటమ్మాయి, యమలోకం వర్షన్ 2.0, ఆపన్నహస్తం, హస్తవాసి కథలు మంచి గుర్తింపు పొందాయి. వీరి మొదటి నవల 'అపజయాలు కలిగిన చోటే..' మహిళావాణి కార్యక్రమంలో 'నవలా స్రవంతి' పేరిట ప్రసారమైంది. వీరి రచనలు అన్ని ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 'తెలుగు తల్లి కెనడా' ఏటా నిర్వహించే పోటీలలో ఆరుసార్లు బహుమతి గెలుచుకున్నారు. చినుకు, నెలవంక – నెమలీక, స్వాతి, జాగృతి, తురగా, జలదంకి ఫౌండేషన్లు నిర్వహించిన పోటీలలోనూ కొన్ని కథలు గెలుపొందాయి. యాసిడ్ దాడి బాధితుల ఫొటోలతో రూపొందించిన 'అన్యూజువల్ కాలెండర్'తో స్ఫూర్తిపొంది.. ఈ కథ రాసినట్లు రచయిత్రి చెబుతున్నారు.

**– 94451 84363**

# ఒకరికొకరు



పట్ల యాదగిరి

మధ్యాహ్నం ఒంటిగంట. ప్రమీల ఇల్లంతా కలియ తిరుగుతున్నది. తన ఆత్రుత.. ఆమె చూపులను పదేపదే గుమ్మంవైపు చేర్చుతున్నది. క్షణాలు గడిచేకొద్దీ ఆ చూపులు ఎదురు చూపులవుతున్నాయి..!

తల్లిలోని టెన్షన్ చూస్తూ నవ్వింది కూతురు వాసంతి.

'ఏంటే.. ఆ నవ్వు? నా కంగారు నీకు నవ్వులాటగా ఉందా?' అంది తల్లి!

'అదేం లేదమ్మా.. ప్రశాంతంగా ఉండు! రా కూర్చో' అంటూ తల్లి చేయి పట్టుకుని తన ఎదురుగా కూర్చోబెట్టుకుంది.

'అమ్మా! సంబంధం చూస్తున్న రోజుల్లోనే మనీ ఆశించని మనిషి ఉంటే చూడు.. కళ్లు మూసుకుని తాళి కట్టించుకుంటానని చెప్పాను. వింటేగా? 'అబ్బాయి బాగున్నాడు! బాగా ఉన్నోడు! వాళ్లడిగినవి ఇస్తాం.. ఏం భయం లేదు!' అని అభయమిచ్చి ముడేశారు. ఇప్పుడేమైంది? నాలుగ్గోడల మధ్య ఆ దేవుడికి బాధలు చెప్పుకొంటున్నారు. ఆడపిల్లని పెంచి, పెద్దచేసి, ఆ ఫ్యామిలీ ఇరవై ఏళ్ల కష్టం పోగేసి కట్నకానుకలుగా ఇస్తారని తెలిసి కూడా కట్నమడిగే ప్రతి మగాడిదీ తప్పు. అది తప్పని తెలిసి తాహతుకి మించి కట్నమిస్తామని ఒప్పుకొంటున్న తల్లిదండ్రులది ఇంకా పెద్ద తప్పమ్మా!' అంటూ చెప్పుకొచ్చింది కూతురు.

'నువ్వు చెప్పింది నిజమేనే! కానీ, ఏ ఆడపిల్లకైనా పెళ్లి వరమవ్వాలి. శాపంలా మారకూడదు. అత్తారింటిలో కూతురు బాగుండాలనే ఆశే కదా ప్రతి తల్లిదండ్రులది. అందుకే తల తాకట్టు పెట్టయినా తహతుకి మించి కానుకలు ఇస్తారు. అయినా, కట్నకానుకల్లో మీ ఆయనకు లక్షలేమన్నా ఎగ్గొట్టామా? పెళ్లయిన ఆడపిల్ల అత్తింట్లో కన్నా పుట్టింట్లో ఎక్కువగా కనిపిస్తే చూసేవాళ్లు ఏమనుకుంటారు? అయినా, ఈరోజు గడిస్తే చాలమ్మా! మీ ఇంటికి నువ్వు వెళ్లిపోతావు' అంది తల్లి.

ఆ మాటకు ఒక్క ఉదుటున వచ్చి తల్లిని కౌగిలించుకుంది. ఆమె కళ్ల నుండి జారిన బాధల చినుకులు ప్రమీల భుజాన్ని తడిపాయి.

'పిచ్చితల్లి! ఎక్కడికి పోతావే! ఫోన్‌కాల్ దూరంలోనే ఉంటావు కదా!'

అంటూ.. చెమర్చిన తన కళ్లను చీర కొంగుతో తుడుచుకుని, కూతురిని ఓదార్చింది ప్రమీల.

'చెల్లికి ఫోన్‌చేయి! వెళ్లి చాలా సేపయ్యింది. లగేజీ మొత్తం సర్దేసుకో.. మళ్లీ అక్కడికెళ్లి 'అది లేదు! ఇది లేదు!' అని నా ప్రాణాలు తీయొద్దు.. చెల్లి రాగానే అల్లుడుగారికి ఫోన్‌చేసి రమ్మని చెప్పు' అంది.

అప్పుడే కాలింగ్ బెల్ మోగింది. వాసంతి వెళ్లి డోర్ ఓపెన్ చేసింది. ఎదురుగా చెల్లి మహతి.

'ఎందుకే.. ఇంత లేట్!?' అంటూ ఆమె భుజానికున్న హ్యాండ్‌బ్యాగ్ లాక్కొని..

'అమ్మా!' అంటూ ఇంట్లోకి పరుగెత్తింది వాసంతి.

బ్యాగ్ లాక్కెళ్తుందని ఊహించని మహతి..

'అక్కా! అక్కా! ఆగు..' అంటూ వెనకాలే వెళ్లింది.

మహతిని చూసిన తల్లి..

'ఇంత లేట్ అయ్యిందేంటమ్మా! బ్యాంకులో డబ్బుల్లేవా?'.. డబ్బులు వచ్చాయన్న సంతోషంలో నవ్వుతూ అన్నది.

ఇంతలో బ్యాగ్ ఓపెన్ చేసిన వాసంతి..

'బ్యాంకులో కాదమ్మా.. బ్యాగులోనే డబ్బులు లేవు!' అని చెప్పింది.

ఆ మాటలకు ప్రమీల అవాక్కయ్యి..

'అదేంటే.. డబ్బుల్లేవంటావ్? మతి పోయిందా! సరిగ్గా చూడు!' అంది.

'చూసే చెప్తున్న.. బ్యాగు ఖాళీగా ఉందమ్మా'

'ఏమైందే? వట్టి చేతుల్తో వచ్చావ్? బ్యాంక్‌కు వెళ్లలేదా?' చిన్న కూతురి భుజం తట్టి అడిగింది తల్లి.

'వెళ్లానమ్మా'..

'వెళ్తే డబ్బులు ఎక్కడే?'.. బ్యాగ్ పక్కన పడేస్తూ కోపంగా అడిగింది వాసంతి.

'అక్క అడుగుతుందిగా!? చెప్పవే!' గద్దించింది తల్లి.

'అమ్మా!!' అని నసుగుతున్న మహతిని చూసి..

'ఏంటే.. నీళ్లు నములుతున్నావ్? నాకేదో అనుమానంగానే ఉందే!' అంటూ ప్రమీల కంగారు పడిపోయింది.

'అమ్మా! ఏదేదో ఊహించుకుంటూ టెన్షన్ పడకు. ముందు దాన్ని చెప్పనివ్వు'.. అంటూ తల్లిని నిదానపరిచింది వాసంతి. 'దాని వాలకం చూస్తుంటే తెలియడం లేదా? డబ్బులుంటే బ్యాగులో ఉండాలిగా? మేం అంతలా అరుస్తుంటే మాట్లాడవేంటే??' కాస్త కోపాన్ని పెంచింది తల్లి.

అక్కా, అమ్మ కలిసి ప్రశ్నలమీద ప్రశ్నలు వేస్తుంటే.. మహతికి కోపం వచ్చి..

'నన్ను మాట్లాడనిస్తేగా మీరు' అంది.

'అంత కోపం దేనికే? ముందు ఏం జరిగిందో చెప్పు' మళ్లీ అడిగింది వాసంతి.

'డబ్బులు డ్రా చేసి రోడ్డుదాటి వస్తుంటే.. ఒక పెద్దయానకు స్ట్రోక్ వచ్చి పడిపోయాడు. అక్కడున్న ఒక్కరూ హెల్ప్ చేయకపోగా.. ఫోన్లో వీడియోలు తీస్తూ నిలబడి చూస్తూన్నారంతా! నేను మాత్రం అలా చూస్తూ ఉండలేక పోయా! అంబులెన్స్‌కు ఫోన్ చేసి, హాస్పిటల్‌కు తీసుకు వెళ్లాను. కండిషన్ సీరియస్‌గా ఉన్నదనీ, వెంటనే ఆపరేషన్ చేయాలని అక్కడి డాక్టర్లు చెప్పారమ్మా! అమౌంట్ కడితే ఏర్పాట్లు చేస్తామన్నారు. దాంతో.. వేరే ఆలోచించకుండా.. అమౌంట్ కట్టేశా!'.. అని చెప్పీ చెప్పగానే మహతి చెంప చెల్లుమంది. ఆ దెబ్బకు కిందపడిపోయింది.

'కొంప ముంచావు కదే! మీ అక్క కాపురం కూల్చేశావు. నువ్వసలు మనిషివేనా? ఎవరో పడిపోతే నీకేంటే? ఆడపిళ్లవై ఉండి.. అణిగిమణిగి ఉండకుండా.. మగరాయుళ్లా ఇవేం పనులే!? సొంతవాళ్లనే పట్టించుకోకుండా హాయిగా బతుకుతున్న రోజులివి.. ఆయన మన చుట్టమా? పక్కమా?' అని తిడుతూనే ఉన్న తల్లిని ఆపుతూ..

'అమ్మా ఆపుతావా! పోనీలే.. అయ్యిందేదో అయ్యింది. దాన్ని కొట్టి చంపితే?. డబ్బులు తిరిగొస్తాయా? నా రాత ఇలా రాసుంటే, దాన్నని ఏం లాభం??' అంది వాసంతి.

'అమ్మా.. నాకు తోచింది చేశాను. హెల్ప్ చెయ్యాలా? వద్దా? అని లెక్కలేసుకుని చెయ్యలేదు. ఇందాక అన్నావే .. 'మనిషివేనా?' అని. మనిషిగా పుట్టినందుకే ఆ పని చేశాను. ఒక మనిషి తోటి మనిషికి సాయం చేసుకోకుండా.. ఒకే సంఘంలో బతకడం ఎందుకు?' అంది మహతి.

'చూడు ఎలా మాట్లాడుతున్నదో!? ఆడపిల్లని ఆడపిల్లలాగే పెంచాలి. కొడుకుల్లేని లోటు తీరుస్తుందని గారబం చేస్తే.. సంఘసేవ చేస్తున్నది' అంటూ వాపోయింది తల్లి.

'అక్కా.. నేను చేసిన పనికి క్షమించు. అమ్మ కోపంలో అర్థముంది! చీటీ కట్టి రెడీ చేసిన డబ్బులను బావగారికి ఇవ్వాలనుకున్నారు. ఆ డబ్బుపైనే నీ జీవితం ఆధారపడుంది. కానీ, నాకు ఆ టైంలో ఒక ప్రాణమే ముఖ్యమని అనిపించి అలా చేసేశా!' అంది.

చెల్లి మాటల్లో మర్మం అర్థమైన వాసంతి..

'పోనిలేవే.. మంచి పనేగా చేశావ్. ఒక ప్రాణం నిలబెట్టావ్! కట్నం ఆశిస్తూ,

కట్టుకున్న వాళ్లని హింసిస్తూ, చంపేస్తూ.. పుట్టింట్లో వదిలేసే భర్తలున్నారు. అలాంటి వాళ్లతో ఏ భార్య మనస్ఫూర్తిగా కాపురం చేస్తుంది? ఒక మనిషి ప్రాణం కాపాడిన నీ మనసు ఎంతో గొప్పది. ఇలాంటి గుణం ఉన్న నిన్ను చూసి గర్వపడాలి. నా సంగతి నేను చూసుకుంటాలే' అని చెల్లిని సమాధాన పరిచింది.

'బాగుందమ్మా వరుస! దారిన పోయే దానయ్యకు సొమ్మంతా ధారపోసి వస్తే.. గొప్ప పని చేశావని చెప్తున్న అక్క ఇంకా గొప్పది! రానీయండి.. మీ నాన్న వచ్చాక చెప్పుకోండి.. చెల్లి మదర్ థెరిసా.. అక్క సతీ సావిత్రి. ఖర్మ ఖర్మ' అంటూ తలపట్టుకుంది ప్రమీల.

* * *

రాత్రి పది గంటలు. భర్త రాజారాం ఇంటికి వచ్చిరాగానే..

'వచ్చారా!? ఫోన్ చేస్తుంటే తియ్యరూ??' అంటూ గయ్యిన లేచింది ప్రమీల.

'డ్రైవింగ్‌లో ఉన్నానే! పైగా వెనకాల ప్యాసింజర్స్ ఉన్నారు. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడుతారా?? తరువాత చేద్దామనుకున్నా! ఇంతలో ఛార్జింగ్ అయిపోయింది. ఇదిగో ఇలా వస్తూనే ఉన్నా! అన్నం వడ్డించు.. ఆకలిగా ఉంది. అవునూ.. పిల్లలేరి? తిన్నారా? పడుకున్నారా??' అంటూ అడిగాడు రాజారాం.

'వాళ్లు తినకపోయినా ఊళ్లో అందరి కడుపులూ నింపి వస్తారులే! అప్పుడే వాళ్లకు కడుపు నిండుతుంది. ముందు మీరు తినండి' అంది కోపంగా.

భార్య మాటల్లో వ్యంగ్యాన్ని పసిగట్టి..

'ఏమైందే! పిల్లలు భోంచేశారా? అని అడిగితే ఏదేదో మాట్లాడుతున్నావ్! మతిగాని పోయిందా?' అన్నాడు రాజారాం.

ప్లేట్స్ హడావుడిగా సర్దుతూ..

'హా! మతిపోయే మాట్లాడుతున్నా! విషయం తెలిస్తే మీకూ పోతుంది.. మతి!' అంది.

'అబ్బబ్బా.. విషయం చెప్పకుండా కాకిలా అరవకే! ముందు సంగతేంటో చెప్పు?' అన్నాడు భోజనానికి కూర్చుంటూ..

'నీ ముద్దుల చిన్న కూతురు.. అల్లుడుగారికి ఇద్దామనుకున్న లక్ష రూపాయల్ని ముక్కూముఖం తెలియని వాడ్ని హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి.. బిల్లు కట్టి లోక కల్యాణం చేసొచ్చింది!'..

'లోక కల్యాణం' అని రెండుసార్లు వత్తి పలికింది.

ఆ మాటతో భోజనానికి కూర్చున్న రాజారాం గబుక్కున లేచి..

'మహతీ!' అంటూ గట్టిగా పిలుస్తూ.. బెడ్‌రూమ్ వైపు కదిలాడు.

భర్త పిలుపులతో భయపడ్డ ప్రమీల వెనకే నడుస్తూ..

'నేనే కొట్టాను. మీరేమీ అనకండి! చిన్న పిల్ల.. తెలిసో తెలియకో'.. అంటుంటే..

అవేవి పట్టించుకోకుండా..

'మహతీ.. వాసంతీ.. తలుపు తీయండి!' అని పిలుస్తూనే ఉన్నాడు.

బెడ్‌పైన కూర్చున్న అక్కా చెల్లెళ్లు భయంతో ఒకరినొకరు చూసుకుంటున్నారు. బయటి నుండి రాజారాం తలుపు కొట్టడం ఆపలేదు.

ధైర్యం తెచ్చుకొని మహతి డోర్ తీసింది.

లోపలికొచ్చిన ప్రమీల.. అక్కడే ఉన్న వాసంతి భయంతో ఏం జరుగుతుందోనని చూస్తున్నారు.

'అదీ.. నాన్నా! అక్కడున్న పరిస్థితిలో నాకు ఆ హెల్ప్ కరెక్ట్ అనిపించింది.. చేసేశాను. క్షమించండి!' అంది మహతి.

కూతురు భుజాలు పట్టుకొని ..

'ఇప్పుడు ఆ పెద్దాయన పరిస్థితి ఎలా ఉందమ్మా!?' అంటూ ప్రేమగా అడిగాడు రాజారాం!

తండ్రి అలా అడిగేసరికి రిలాక్స్ అయ్యి..

'ఓకే నాన్నా! బాగున్నాడు. ఆ విషయం తెలిశాకే నేను ఇంటికొచ్చాను' నవ్వుతూ చెప్పింది.

బాహుబలి యుద్ధమే జరుగుతుందనుకున్న ప్రమీల, వాసంతి.. అక్కడి సీన్ చూసి షాక్ అయ్యారు.

ప్రమీల కల్పించుకుని..

'బాగుంది నీ వరస! కన్నబిడ్డ కాపురం కన్నా.. తెలియని వాళ్ల ప్రాణాలు మీకు ముఖ్యమయ్యాయా?' అంది.

'అల్లుణ్ని బతిమాలి.. టైమ్ అడిగి సర్దుబాటు చేద్దాంలే! అంతమందిలో మన కూతురికే ఆయన్ని రక్షించాలన్న ఆలోచన వచ్చింది చూడు.. అదే మానవత్వం! మానవత్వమున్న మనుషులెవ్వరు.. ఎవరు ఆపదలో ఉన్నా చూస్తూ ఉండరు. ఏం చేయడానికైనా సిద్ధపడతారు. అది వాళ్ల గుణం. వాళ్లకది దేవుడిచ్చిన వరం! అలాంటి వాళ్లను గౌరవించాలి. మహతి చేసింది కూడా అదే! ఒక నిండు ప్రాణాన్ని కాపాడింది. ఇది బాధపడే విషయం కాదే!' అన్నాడు.

భర్తకు భోజనం వడ్డిస్తూ..

'పైసా పైసా పోగేసినవి.. ఎవరికో ధారదత్తం చేసొచ్చింది. కానీ, మీరు ఒక్కమాట కూడా అనలేదు. పైగా 'సహాయం చేయాలంటే రక్త సంబంధం ఉండాలా? ఒకరికొకరు తెలిసిన వారైతేనే సాయం చేయాలా? మనిషికి మనిషి

సహాయం చేసుకోకుండా బతకడం ఎందుకు?? దండగ!' అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడింది!! అయినా మీరెంటి??.. ఉలకరు పలకరు? నా పాటికి నేను వాగుతూనే ఉన్నా.. మీ పాటికి మీరు తింటూనే ఉన్నారు' అన్నది విసుగ్గా.

పల్లెంలో అన్నం కలుపుతూ..

'అబ్బా! ఎక్కడా.. నువ్వు నన్ను మాట్లాడనిస్తే కదా! నన్ను అన్నం తినమని.. నువ్వు నన్ను తింటుంటే.. ఇంకేం మాట్లాడ్తా నేను! నువ్వు భోంచేయి.. చాలా పొద్దుపోయింది' అన్నాడు.

'ఏంటి తినేది? కడుపు బాగా నింపారుగా.. తండ్రీకూతుళ్లు కలిసి'.

'ఆపుతావా నీగోల! అది చేసింది మంచి పనేగా? కాకపోతే మన డబ్బులు పోయాయి. పోతే పోనీలే.. అక్కడ ఒక మనిషి ప్రాణం! పోతే పోనీలే అని అనుకుంటే కుదరదు. పైసలంటే మళ్లీ సంపాదించుకోవచ్చు. ప్రాణం పోతే తిరిగిరాదు. ఒకరి సహాయం పొందిన మనం.. ఇలా సహాయం తప్పంటూ రాద్ధాంతం చేయడం ధర్మం కాదే.. ముందు నువ్వు తిను' అంటూ భార్య పల్లెంలో భోజనం పెట్టి..

'గుర్తుందా.. మన మహతి పుట్టిన రోజు'..

ఆ మాట వినగానే ఆమె గుండె ఇరుకుల్లో ప్రకంపనలు రేపిన సంఘటన తాలూకు నీడలు కళ్ల ముందు కదిలాయి.

* * *

ఇరవై ఏళ్ల క్రితం.. జూన్ నెల చివరి ఆదివారం. అర్ధరాత్రి దాటిన తరువాత కుండపోతగా వర్షం..

ప్రమీలకు నొప్పులు మొదలయ్యాయి. ఆమె బాధతో పెట్టే అరుపులకు ఉలిక్కిపడి లేచింది రెండేళ్ల వాసంతి.

వర్షం ధాటికి కరెంట్ పోయింది.

అప్పుడే వచ్చిన రాజారాం.. నొప్పులతో విలవిల్లాడుతున్న భార్యని, ఏడుస్తున్న కూతురిని ఆటోలో ఎక్కించుకుని హాస్పిటల్‌కి బయల్దేరాడు.

ఇంటికి.. ప్రభుత్వ ఆసుపత్రికి చాలాదూరం. ఆటోను వేగంగా నడుపుతున్నాడు.

ప్రమీల సొమ్మసిల్లి పోతుంటే..

'వచ్చేశాం.. నీకేం కాదు! కాస్త ఓర్చుకో!' అంటూ.. వెనక్కి, ముందుకూ చూసుకుంటూ ఆటోని వేగంగా నడుపుతున్నాడు రాజారాం.

వర్షం ఇంకా పెరిగింది.. రోడ్లన్నీ జలమయం. పైగా కరెంట్ లేదు. గాలి వాన.. మెరుపులు!

అంతలో మళ్లోసారి వెనక్కి తిరిగి..

'ఇదిగో వచ్చేశాం..' అని చెప్పి ముందుకు తిరిగేలోపు..

వర్షం నీళ్లతో నిండి ఉన్న మ్యాన్‌హోల్‌లో ఆటో ముందు చక్రం దిగబడి.. ఆటో బోల్తా కొట్టింది. ముగ్గురూ చెల్లాచెదురుగా పడ్డారు.

వాసంతి ఏడుపు.. ప్రమీల అరుపులు.. ఆ వర్షంలో కలిసిపోతున్నాయి. బిడ్డని, భార్యని రక్షిద్దామనుకొన్న రాజారాం.. కాలు విరిగి లేవలేకున్నాడు. పాక్కుంటూ వచ్చి కూతుర్ని అక్కున చేర్చుకున్నాడు. అర్ధరాత్రి కావడంతో రోడ్డుపైన వాహనాలు తిరగడం లేదు. ఒకటి అరా కనిపించినా.. ఎవ్వరూ సాయానికి రావడం లేదు. అప్పటికే ప్రమీల స్పృహ కోల్పోయింది. ప్రకృతి విలయతాండవం చేస్తున్నది.

కొద్ది సేపయ్యాక ఒక కారొచ్చింది. ఒక వ్యక్తి దిగి వచ్చి.. ముగ్గురినీ హాస్పిటల్‌కు చేర్చారు.

ప్రమీలకు ప్రసవమైంది. రాజారాం కాలుకు ట్రీట్‌మెంట్ చేయించి.. చేతిలో పదివేల రూపాయల డబ్బులు పెట్టారు! రాజారాం అతనికి చేతులెత్తి మొక్కి..

'దేవుడిలా వచ్చి కాపాడారు. ఎంతోమంది మా అవస్థలు చూశారు. కానీ, ఎవరిలోనూ చలనం లేదు. మేము మీకు తెలియక పోయినా కాపాడారు. మీరే మా దేవుడు. మీ రుణం ఎలా తీర్చుకోను. ఇప్పటికే చాలా చేశారు. ఈ డబ్బులు ఎందుకు?? వద్దు సార్.. క్షమించండి' అన్నాడు.

'నాకు తోచిన సాయం చేశాను. సహాయం చేయడానికి ఒకరికొకరు తెలిసుండాలా?. రక్త సంబంధం కలిగుండలా? మనుషులకు మనుషులే సహాయం చేసుకోకుంటే ఎలా? అలాంటప్పుడు ఈ సమాజమెందుకు? నువ్వెందుకు.. నేనెందుకు? ఈ సంఘంలో బతకడం దేనికి?' అని చెప్పి కదిలాడు.

* * *

అన్నం కలుపుతూ జ్ఞాపకాల్లోనే ఉన్న భార్యను.. అన్నం నోట్లో పెట్టడం లేదంటూ తట్టాడు రాజారాం.

జ్ఞాపకాల్లోంచి బయటికి వచ్చి..

'తింటున్నా!' అంది ప్రమీల.

* * *

వారం గడిచాక..

ఒకరోజు ఉదయం రాజారాం ఇంటి ముందు ఒక కారు వచ్చి ఆగింది. అప్పుడే బయటికి వెళ్తున్న రాజారాం.. దాన్ని చూసి ఆగిపోయాడు.

ఆ కారులోంచి ఒక పెద్దాయన దిగాడు. రాజారాం దగ్గరికి వచ్చి..

'బాబూ.. ఇక్కడ మహతి?' అనగానే..

'నా కూతురే! మీరూ..' అంటూ.. అతన్ని పరీక్షగా చూశాడు. ఆశ్చర్యం.. తాము ఇన్నేళ్లూ దైవంగా కొలుస్తున్న వ్యక్తే అతను.

'సార్!! మీరా? ఇక్కడ.. ఇలా??' అంటూ అడిగాడు.

'నేను మీకు తెలుసా? వయసు పైబడింది కదా.. జ్ఞాపకశక్తి తగ్గింది. గుర్తు పట్టలేకపోతున్నా'..

'మేము బతికున్నామంటే మీ దయనే.. ఇరవై ఏళ్ల క్రితం వర్షంలో ఆటో యాక్సిడెంట్.. పురిటి నొప్పులు..' అని రాజారాం అనగానే..

'హా.. హా.. రాజారాం, ప్రమీల' అన్నాడు ఆ పెద్దాయన.

'రండి రండి..' అంటూ, అతని చేయి పట్టుకుని.. ఇంటిలోపికి తీసుకొచ్చాడు. కూర్చోండని కుర్చీ చూపించాడు.

'ప్రమీలా.. గుర్తుపట్టావా! మహతి పుట్టిన రోజున మనల్ని కాపాడిన..' అంటూ చెప్పగానే..

వెంటనే పెద్దాయన కాళ్లకు మొక్కింది ప్రమీల.

'ఏం తీసుకుంటారు బాబాయ్ గారూ! టిఫిన్, టీ' అంటూ అడిగింది.

'అవేమీ వద్దమ్మా! అన్నీ కానిచ్చాను.. ఇంతకూ మహతి?' అని పెద్దాయన అనగానే..

రాజారాం, ప్రమీల ఆశ్చర్యపోయారు. మహతి ఈయనకు ఎలా తెలుసని.

'అమ్మా మహతీ.. ఇలారా!' అని పిలిచింది ప్రమీల.

గదిలోంచి బయటికి వచ్చిన మహతి.. పెద్దాయన్ని చూసి..

'తాతగారూ.. మీరా! మీరిక్కడ?? ఎలా ఉంది మీ హెల్త్?' అంటూ దగ్గరికి వచ్చింది.

'బాగుంది తల్లీ! కొడుకులు పుడితే జీవితానికి కొదవ లేదనుకున్నా! నా బిడ్డలకు నేను పాతబడి పోయానని వదిలేశారు. ఆడపిల్లవైనా.. అందులో చిన్న పిల్లవైనా నీలో చేతులెత్తి మొక్కే సంస్కారం, మానవత్వం నిండుగా ఉన్నాయి! దేవుడి ఆట గొప్పది. నువ్వు పుట్టినప్పుడు నా చేత మీ అమ్మానాన్నలకు సాయమందించాడు. ఇప్పుడు నాకు పునర్జన్మ ఇవ్వడానికి నిన్ను పంపించాడు' అంటూ ఆనంద భాష్పాలు రాల్చాడు.

విషయం అర్థమై.. ప్రమీల, రాజారాం, వాసంతి ఒకరినొకరు చూసుకుని.. పూజగదిలోని దైవాన్ని చూశారు.

* * *

ఇంతలో వాసంతి ఫోన్ మోగింది.

భర్త శశికాంత్.

'వాసంతీ.. ఈరోజు సాయంత్రమే వస్తున్నా! రెడీగా ఉండు' అన్నాడు.

'ఎందుకు?' అడిగింది

'అదేంటి డియర్..?'.

'మనీ ఇంకా రెడీ అవ్వలేదు.. అయ్యాక చెప్తా! వచ్చి తీసుకెళ్లండి.. మనిషిని కాదు.. మనీని..!' వ్యంగంగా అంది.

'సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న మహతి హెల్పింగ్ వీడియో చూశాను. మనుషులు అలాగే ఉండరు.. మారతారు! ఛాన్స్ ఇవ్వండి మేడమ్!' అంటూ బతిమిలాడాడు.

ముసిముసిగా నవ్వుకుని..

'చూద్దాంలే మిస్టర్!' అన్నది వాసంతి.

***

## పట్ల యాదగిరి

'గిరిపట్ల' కలంపేరుతో సాహిత్యసేవ చేస్తున్నారు పట్ల యాదగిరి. స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల. ప్రస్తుతం ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. డిగ్రీ చేసిన యాదగిరి.. ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. 8వ తరగతిలో ఉన్నప్పుడే రచనలో తొలి అడుగు వేశారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ప్రతి ఆదివారం ప్రసారమయ్యే 'బాలనందం' కార్యక్రమంలో ఈయన రాసిన పొట్టి కవితలు ప్రసారం అయ్యాయి. 'పుత్రుడు' సినిమా కోసం ఈయన రాసిన తొలి పాటను ఎస్పీ బాలసుబ్రమణ్యం ఆలపించారు. ఆ తర్వాత 'శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట' చిత్రం కోసం రాసిన 'అడుగుతో అడుగే అడుగేసిందని', 'తొలి పరువం కురిసిందని' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఆ తర్వాత మలయాళ అనువాద చిత్రం'కృష్ణం'లో పూర్తి పాటలు, 'వస్తా' చిత్రంలో రాసిన 'కాలం కలిపిన స్నేహం' పాట, '14డేస్ లవ్' సినిమాలో రాసిన నాలుగు పాటలూ మంచి పేరు తెచ్చిపెట్టాయి. -99859 26292

# దైవం మానుష రూపేణా



**సూరిశెట్టి వసంతకుమార్**

సూర్య కిరణాలు నెమ్మది నెమ్మదిగా లోకాన్ని కాంతిమంతం చేస్తున్న సమయమది. అప్పటికే రకరకాల వంటకాలతో డైనింగ్ టేబుల్ నిండిపోయింది. అమెరికాలోని న్యూజెర్సీ నుంచి రాబోతున్న తన కొడుకు మాధవన్‌కీ, కోడలు మార్గరెట్‌కీ ఇష్టమైన స్వీట్స్ తయారు చెయ్యడంలో బిజీగా ఉంది కామేశ్వరి.

'ఏమండీ.. టైం అప్పుడే ఆరయిపోయింది. ఫ్లయిట్ పది గంటలకి. ఇప్పుడు బయల్దేరితేనే సరిగ్గా ఉంటుంది'

భర్త రామారావుకి వినిపించేటట్లుగా చెప్పింది.. వంటగదిలోంచి కామేశ్వరి.

'కొడుకూ, కోడలూ రాబోతున్నారన్న సంతోషం.. వాళ్లొచ్చే వరకూ కొంచెం దాచుకో! ఇదిగో నాన్నగారికి టవల్ బాత్ చేయించి బయల్దేరుతాను' నవ్వుతూ చెప్పాడు రామారావు.

పక్షవాతం వచ్చి ఒక కాలూ, ఒక చెయ్యి పడిపోవడంతో మంచానికే అంకితమై పోయాడు రామనాథం.

'నాన్నగారూ లేవండి. స్నానం చేయించేస్తాను' అంటూ ఆయన వేసుకున్న బట్టల్ని నెమ్మదిగా తీసి, టవల్‌తో ఒళ్లంతా తుడుస్తూ ఉంటే చూశాడు.. తండ్రి కళ్లల్లోంచి కారుతున్న కన్నీటిని.

'ఎందుకు నాన్నా ఏడుస్తున్నారు. ఇవాళ మీ మనవడూ, మనవడి భార్యా ఇక్కడికి వస్తున్నారు. అందువల్ల మనసులో ఏదీ ఆలోచించకుండా సంతోషంగా ఉండాలి మరి' అంటూ స్నానం చేయించి బట్టలు మార్చాడు రామారావు.

కామేశ్వరి తెచ్చి ఇచ్చిన టిఫిన్‌ని తండ్రికి తినిపించి ఎయిర్‌పోర్టుకి బయల్దేరాడు రామారావు.

ఇంటికి వచ్చిన కొడుకూ, కోడల్ని చూసి తెగ సంబర పడిపోయింది కామేశ్వరి.

మార్గరెట్‌కి ఆ ఇల్లు, వాతావరణం చాలా కొత్తగా ఉంది. ఇక్కడ ఒకరి కోసం ఒకరు జీవించడం, ప్రేమానురాగాలు పంచుకోవడం చూసి ఆశ్చర్యపోయింది. తల్లీ-తండ్రి, భార్యా-భర్త, కొడుకూ-కోడలు, కూతురూ-అల్లుడు.. ఇలా అందరి

బాంధవ్యాలూ ప్రేమపాశంలో చిక్కుకుని ఉండటం, ఒకరి గురించి మరొకరు కష్టాన్నీ సంతోషంగా అనుభవించడం చూస్తుంటే.. ఆనందంతో పులకరించి పోయింది మార్గరెట్.

అమెరికాకి చెందిన మార్గరెట్.. మాధవన్‌ని చూడగానే ప్రేమించేసింది. భారతదేశ సంస్కృతి గురించి, మమతానురాగాల గురించి విన్న ఆమె.. తనకి తెలియకుండానే భారతదేశం మీద పిచ్చి అభిమానాన్ని పెంచుకుంది. అందుకే మాధవన్‌ని చూడగానే ప్రేమించేసింది. అందం, సంస్కారం ఉన్న మార్గరెట్ అంటే మాధవన్‌కీ చాలా ఇష్టం ఏర్పడింది. అదీ కాకుండా తన తల్లిదండ్రులు ఒప్పుకొంటేనే పెళ్లి.. లేకపోతే లేదు అని కచ్చితంగా, నిర్మొహమాటంగా చెప్పిన మాధవన్‌ని ఇంకా ఇష్టపడిపోయింది మార్గరెట్.

అలాగే ఇండియా నుంచి తల్లిదండ్రుల అనుమతి దొరికిన తర్వాతనే మార్గరెట్‌ని పెళ్లి చేసుకున్నాడు మాధవన్. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఇద్దరూ ఇండియా వచ్చారు.

బాల్కనీలో నిలబడి చుట్టు పక్కలకు చూస్తున్న మార్గరెట్ దగ్గరకి వచ్చాడు మాధవన్. బంగారు ఛాయలో తళతళ లాడుతున్న ఆమె తల వెంట్రుకలు గాలికి ఎగురుతూ ఉంటే.. అందంగా, కుందనపు బొమ్మలా ఉన్న మార్గరెట్.. మాధవన్‌ని చూసి.

'అమ్మ, నాన్నగారు, ఈ ఇల్లు, ప్రశాంతమైన ఈ వాతావరణం, కళ్లతోనే ప్రేమను పంచే తాతయ్య గారు, నాకిక్కడ చాలా బాగుంది మాధవ్' అంది తెగ సంబరపడుతూ.

ఆమె మాటల్లో నిజాయతీ కనిపించింది.

'నీకీ విషయం తెలుసా? అమ్మ మొదట్లో మన పెళ్లికి ఒప్పుకోలేదు. నాన్నగారే అమ్మ దగ్గర మాట్లాడి, నచ్చచెప్పి ఆమె మనసు మార్చారు. నేను వచ్చేటప్పుడు తాతయ్య బాగానే ఉన్నారు. ఇప్పుడు ఇలా చూస్తుంటే చాలా బాధగా ఉంది. మా ఇంటికి సంబంధించినంత వరకూ నాన్నగారే అన్నీ. మా తాతగారి మనసు కష్టపడకుండా, అమ్మమనసు నొప్పించకుండా చాలా శాంతంగా ఉంటారు. చాలా పెద్ద మనసుతో నిన్ను కోడలుగా చేసుకున్నారు. నాన్నగారంటే అందుకే నాకంత ఇష్టం!' అంటూ తన తండ్రి గురించి గొప్పగా చెప్పసాగాడు మాధవన్.

'మధూ! నా డెలివరీ టైంలో అమ్మానాన్నలు ఉంటే బాగుంటుందని, వాళ్లని మనతోపాటు తీసుకుని వెళ్దామని అనుకున్నాం కదా! వాళ్లు మనతో వస్తారంటావా?' దీనంగా అడిగింది మార్గరెట్.

కచ్చితంగా వస్తారు. మనవణ్ని చూడాలన్న కోరిక వాళ్లకి మాత్రం ఉండదా?

తాతయ్యకి ఏదో ఒకటి అరేంజ్ చేసిన తర్వాత వాళ్లని మనతో తీసుకుని వెళ్దాం' అన్నాడు మాధవన్ ఆమెని సమాధాన పరుస్తూ.

'తాతయ్యా.. మార్గరెట్ మీతో ఏదో చెప్పాలనుకుంటోంది' అంటూ రామనాథం దగ్గరగా వచ్చి కూర్చొన్నాడు మాధవన్.

'రామ్మా.. ఇలా వచ్చి కూర్చో!' అంటూ, దగ్గరికి పిలిచాడు రామనాథం.

'తాతయ్య గారూ! ఇండియాకు వచ్చి మీ అందరితో మాట్లాడాలనే తెలుగు నేర్చుకున్నాను'.. మార్గరెట్ చిన్నపిల్లలా మాట్లాడుతుంటే ఆనందంగా వినసాగాడు.

'నా డెలివరీ టైంలో అత్తయ్య, మామయ్యా మా దగ్గర ఉండాలని అనుకుంటున్నాం. మీరు తప్పుగా తీసుకోవద్దు. మిమ్మల్ని మంచి వృద్ధాశ్రమంలో ఉంచుతాం. తిరిగి వాళ్లు ఇండియాకి వచ్చిన తర్వాత.. మీరు ఇంటికి వచ్చేద్దురుగానీ. ఇందులో మీకేమైనా అభ్యంతరముంటే చెప్పండి తాతయ్యగారు. మీరు మనస్ఫూర్తిగా ఒప్పుకొంటేనే అత్తయ్య, మామయ్యల్ని మాతో తీసుకుని వెళ్తాం'.. బతిమాలుతున్నట్లుగా అడిగింది మార్గరెట్.

గొంతు వణుకుతుంటే మాట్లాడటం మొదలుపెట్టాడు రామనాథం.

'పాపం నా కొడుకు.. ఈ రెండేళ్లలో నాకు సేవలు చేసి బాగా అలసిపోయాడు. ఎప్పుడూ ముఖం మాడ్చుకోవడం గానీ, విసుక్కోవడం గానీ నేను చూసింది లేదు. వాడికి కొంచెం మార్పు కావాలి. తప్పకుండా వాళ్లిద్దర్నీ మీతోపాటు తీసుకుని వెళ్తామంటే.. నాకు అంతకన్నా కావాల్సిందేముంది? చాలా సంతోషం. నువ్వు మామీద ఇంత ప్రేమ చూపించడం.. నిజంగా చాలా ఆనందంగా ఉందమ్మాయ్. నేను అబ్బాయితో మాట్లాడతాను. వాళ్లిద్దర్నీ మీతోపాటు పంపే బాధ్యత నాది'.. నమ్మకంగా చెప్పడంతో మార్గరెట్‌కి కొంచెం ధైర్యం వచ్చింది.

* * *

బాల్కనీలో నిలబడి ఆకాశాన్నే తదేకంగా చూస్తున్న కొడుకూ, కోడలు దగ్గరికి వచ్చి నిలబడింది కామేశ్వరి.

'మార్గరెట్.. నువ్వు గోవా వెళ్లి అక్కడి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బాసిలికా చర్చిని చూడాలని చెప్పావుకదా! మరి ఎప్పుడు బయల్దేరుతున్నారు?' అడిగింది.. కోడలి చేతులు పట్టుకుని.

'మేము రెండు నెలల లీవ్‌లో వచ్చాం అత్తయ్యా! మిమ్మల్నీ, మామయ్య గారినీ మాతోపాటు తీసుకుని వెళ్లడానికి ఏర్పాట్లు చేయాలి కదా! తాతగార్ని మంచి వృద్ధాశ్రమంలో చేర్పించాలి. ఇవన్నీ చక్కగా అయిన తర్వాతే దేవుడి దర్శనం'.. జవాబు చెప్పిన కోడల్ని తదేకంగా చూస్తూ తన్మయత్వంలో ఉండిపోయింది కామేశ్వరి.

'మాధవన్‌ని అడిగితే వాడూ ఇలాగే అన్నాడు. కానీ, మీ మామయ్యగారు ఒప్పుకొంటారా? అన్నదే నాకు కొంచెం అనుమానంగా ఉందమ్మా. పుట్టబోయే మనవణ్ని చూడాలన్న కోరికైతే మనసులో బోలెడు ఉందికానీ.. ఆయన ఏమంటారో చూడాలి మరి'

'మీరేం భయపడకండి. మామయ్య తప్పకుండా వస్తారు. మీ మనవణ్ని ముందుగా మీరే ఎత్తుకుని ముద్దాడాలి. అదే నా ఆశ కూడానూ' నెమ్మదిగా అంది మార్గరెట్.

రెండు రోజుల తర్వాత...

'మీరందరూ వారం రోజుల్నుంచీ చెవులు కొరుక్కుంటున్న విషయం నాకిప్పుడే తెలిసింది. నాన్న ఇప్పుడే నాకంతా చెప్పారు. కానీ, మీరు అనుకుంటున్నదానిలో చిన్న మార్పు. కచ్చితంగా మీ అమ్మ మీతో వస్తుంది. తనని మీతో తీసుకుని వెళ్లి, మీతోనే ఉంచుకుని మనవడి ఆలనా పాలనా చూసుకోమని చెప్పండి. మీకెప్పుడు తిరిగి పంపాలనిపిస్తే అప్పుడు పంపించండి. దయచేసి నన్ను మాత్రం బలవంతం చేయవద్దు. ప్లీజ్.. నాన్నగారిని ఈ స్థితిలో వదిలిపెట్టి రాలేను. ఆయన్ని వేరేవాళ్ల దగ్గర ఉంచడం నాకిష్టం లేదు. ఆయన ఆఖరి శ్వాస వరకూ నేను ఆయన పక్కనే ఉండాలని అనుకుంటున్నాను' కొడుకును నెమ్మదిగా సమాధానపరిచాడు రామారావు.

రాత్రి పడుకునే ముందు..

'ఏమండీ! మీరు లేకుండా నేనుమాత్రం వెళ్లడం నాకిష్టం లేదండి' అంది కామేశ్వరి.

భార్యని ప్రేమగా చూశాడు రామారావు.

'కామూ! నువ్వు తప్పకుండా వాళ్లతో వెళ్లాలి. డెలివరీ సమయంలో నువ్వు మార్గరెట్ పక్కన ఉండటం చాలా అవసరం. నా గురించి భయపడొద్దు. వంట చెయ్యడానికి పనమ్మాయి ఉంది. నాన్నగారిని చూడటానికి నేనున్నాను. నువ్వు మాత్రం ఎలాంటి కారణాలు చెప్పక బయల్దేరు' అన్నాడు రామారావు.. భార్యకి ఆర్డరు వేస్తున్నట్లు.

* * *

కామేశ్వరికి వీసా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇంకో పదిరోజుల్లో బయల్దేరాలి. తండ్రి తమతో రాకపోవడం మాధవన్‌కి బాధగానే ఉంది.

రాత్రి మాధవ్ రూమ్‌లోకి వెళ్లింది కామేశ్వరి. తల్లిని చూసి..

'ఏమ్మా! ఇంకా నిద్రపోలేదా? నాతో పనేమైనా ఉందా?' ఆత్రుతగా అడిగాడు మాధవ్.

'మాధవ్.. నేను ఒకమాట అడుగుతాను. తప్పుగా తీసుకోవద్దు. నాకు నాన్నగారిని వదిలి అమెరికా రావాలనిపించడం లేదురా! మీరు వెళ్లిరండి. తర్వాత

నేనూ, నాన్నగారూ వీలు చూసుకుని అక్కడికి వస్తాం'

మాధవన్, మార్గరెట్ ఆశ్చర్యంగా చూశారు కామేశ్వరిని.

'సర్లేమ్మా! నాకు అర్థమైపోయింది. నువ్వు మార్గరెట్‌ని నీ కోడలుగా మనస్ఫూర్తిగా అంగీకరించలేదని తెలుస్తోంది. ఆమె వేరే దేశానికి చెందిన అమ్మాయి అయి ఉండొచ్చు. కానీ, ఆమె ఈ ఇంటి వారసుణ్ని తన కడుపులో మోస్తోంది. మన దేశ సంస్కృతిని, ఇక్కడ ఒకరిపై ఒకరు చూపించుకునే ప్రేమాభిమానాల్ని చూసే.. నన్ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. డెలివరీ సమయంలో తనకి తోడుగా ఉండమని అడిగితే నిరాకరించడానికి మీ మనసెలా ఒప్పుకొందమ్మా! నువ్వు, నాన్నగారూ తనతోపాటు అమెరికా వస్తారని, తనకి తోడుగా ఉంటారని ఎంతో నమ్మకం పెట్టుకుంది మార్గరెట్. కానీ, ఒక్క నిమిషంలో మా నమ్మకాన్ని ముక్కలు చేసేశావు కదమ్మా!' మాధవన్ గొంతులో కోపం తొంగి చూసింది.

'లేదు నాన్నా! నేను చెప్పేది కొంచెం విను!'

'వద్దమ్మా ప్లీజ్! ఇంతటితో ఈ టాపిక్‌ను ముగించేద్దాం. మేము ఎలా వచ్చామో అలాగే వెళ్లిపోతాం. ఎవరూ మాతో రావొద్దు' అంటూ ముఖం తిప్పుకొన్నాడు మాధవన్.

కామేశ్వరికి ఏం మాట్లాడాలో తెలీక నిశ్శబ్దంగా అక్కడినుంచి వెళ్లిపోయింది.

మార్గరెట్ విచారంలో మునిగిపోయింది.

'ఇక్కడ ఉన్నన్ని రోజుల్లో నువ్వు చూడాలనుకున్నవన్నీ చూసేసి బయల్దేరిపోదాం' అన్నాడు మాధవన్. కళ్లలో తిరుగుతున్న కన్నీటిని బయటికి రానీయకుండా.

'నాన్నగారూ! నేనూ, మార్గరెట్ ఇవ్వాళ గోవాకి బయల్దేరుతున్నాం. తిరిగి మేం అమెరికా వెళ్లడానికి ఒకరోజు ముందే వస్తాం!'

'అలాగే వెళ్లరా! మార్గరెట్‌కి అన్నీ చూపించు. అవన్నీ చూసిన తర్వాత బాలఏసులాంటి మనవణ్ని కని ఇవ్వమని చెప్పు' అంటూ.. మౌనంగా నిలబడి ఉన్న కొడుకు దగ్గరికి వచ్చి..

'చూడు మాధవ్! అమ్మా, నేనూ రావడం లేదని బాధపడకురా! నేను లేకుండా రావడానికి అమ్మ ఇష్టపడటం లేదు. ఇక్కడ మా బాధ్యతల్ని పూర్తిగా నిర్వహించిన తర్వాత తప్పకుండా అమెరికా వస్తాం.. సరేనా?' కొడుకుని సమాధానపరిచాడు రామారావు.

* * *

ఇంటి ముందు టాక్సీ నిలబడి ఉంది.

'ఫ్లయిట్‌కి టైం అవుతోంది. త్వరగా రా మార్గరెట్'.. అంటూ, ఇంట్లోకి వెళ్లి మంచినీళ్లు తాగుతున్నాడు మాధవన్.

నెమ్మదిగా కొడుకు దగ్గరికి వచ్చింది కామేశ్వరి.

మాధవన్ చేతికి ఒక కవరిచ్చి..

'తొందర లేదురే! గోవాకి వెళ్లి అన్నీ చూసిన తర్వాత నిదానంగా ఈ ఉత్తరం చదువుకో!' అంది కళ్లలో నీళ్లు తిప్పుకొంటూ.

ఆమె కన్నీళ్లు అర్థం కాక.. కవర్ తీసుకొని గబగబా నడిచి వెళ్లిపోయాడు మాధవన్.

ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లో కూర్చొన్న తర్వాత జేబులోంచి లెటర్ తీసి మార్గరెట్ చేతికిచ్చాడు.. లోపల పెట్టమని. కానీ, మార్గరెట్ అక్కడే కవర్ చింపి ఆ లెటర్‌ని చదవసాగింది ఆత్రుతగా.

ప్రియమైన మాధవన్, మార్గరెట్‌కి,

దయచేసి మమ్మల్ని తప్పుగా అర్థం చేసుకోకండి. మేము మీమీద చూపించే ప్రేమలో ఏ మాత్రమూ లోపం లేదు. అది మీరు తెలుసుకోవాలి. అదీ కాకుండా మీ నాన్నగారిని మీరు తప్పుగా అర్థం చేసుకోకూడదని నేను ఇంత కాలమూ దాచిన ఒక రహస్యం మీకు చెప్పాలనుకుంటున్నా. మాధవన్.. నువ్వు నా కడుపులో ఉన్నప్పుడే ఒక యాక్సిడెంట్‌లో మీ నాన్నగారు చనిపోయారు. ఈ రామారావు గారు మీ నాన్నకాదు. పెద్దల్ని ఎదిరించి పెళ్లిచేసుకుని.. అందర్నీ దూరం చేసుకున్నాను. మీ నాన్నగారి మరణంతో అందరి ఆదరాభిమానాల్నీ కోల్పోయాను. ఒంటరిగా మిగిలిపోయాను. అలాంటి సమయంలో మీ నాన్న స్నేహితుడైన ఈ రామారావుగారు నన్ను పెళ్లి చేసుకుని.. సమాజంలో నాకొక స్థానం సంపాదించి పెట్టారు. అలాగే నువ్వు తండ్రిలేని అనాథవి కాకూడదని తనే నీకు నాన్న అయ్యారు. నీ దగ్గర మనసు విప్పి చెబుతున్నాను.

ఈ క్షణం వరకూ మేమిద్దరం మంచి స్నేహితులుగానే ఉండిపోయాం. మామధ్య ఎలాంటి దాంపత్య సంబంధాలూ లేవు. తన స్నేహితుడి కుటుంబం కోసం తన జీవితాన్నే కర్పూరంగా మార్చి కరిగిపోతున్నారు. అంతేకాదు మాధవన్! పక్షవాతం వచ్చి కాలూ, చెయ్యి పడిపోయిన మీ తాతకి తనే అన్నీ అయి చూసుకోసాగారు. ఆయన కూడా రామారావు గారి తండ్రి కాదు. ప్రేమ పెళ్లి చేసుకున్నానని నన్ను ఇంటి నుంచి తరిమేసిన మా నాన్నే. అమ్మ చనిపోయిన తర్వాత అన్నయ్యలు చేతులు దులిపేసుకుంటే.. ఎవరి ప్రేమకీ నోచుకోక నా దగ్గరికి వచ్చారు. ఆయన్ని మన కుటుంబంలో ఒకరిగా ఆదరించారు రామారావుగారు. ఈరోజు వరకూ మీ తాతయ్యని తన తండ్రిగానే చూసుకుంటున్నారు రామారావుగారు.

ఆయనకి భార్యగా జీవిస్తున్న నేను.. నిజానికి భార్యగా ఏమీ ఇవ్వలేకపోయాను. నువ్వు ఆయన కొడుకువి కాదు. నీ తాత ఆయన తండ్రి కాదు. అయినా సరే.. ఆయన చూపే ప్రేమానురాగాలలో నువ్వేమైనా తప్పు పట్టగలవా? చెప్పు మాధవ్? జన్మతః వచ్చేవే కాదు బంధుత్వాలు. ప్రేమతో, అనురాగాలతో కూడా బంధుత్వాలని

ఏర్పరుచుకోవచ్చని నిరూపించారు మీ నాన్నగారు. అలాంటి ఆయన్ని విడిచి మీతో రావడం న్యాయమా చెప్పు? జీవితాంతం ఆయన పక్కనే ఉండి ఆయన సేవ చేసుకోవాలన్నదే నా కోరిక. ఆయన మీనుంచి ఆశించేది కూడా.. మీ ప్రేమ మాత్రమే.

ప్రేమతో..

అమ్మ.

* * *

మంచం మీద కళ్లు మూసుకుని పడుకుని ఉన్న రామారావుకి.. నీడలా ఏదో కదలినట్టనిపిస్తే కళ్లు తెరిచి చూశాడు.

ఎదురుగా మాధవన్, మార్గరెట్.

'ఏమిటి మాధవా?. ఫ్లయిట్ ఏమైనా క్యాన్సిల్ అయ్యిందా'? అంటూ లేచి కూర్చున్నాడు.

'లేదు నాన్నగారూ! ఉన్న పది రోజులూ మీతోనూ, అమ్మతోనూ గడపాలని గోవా వెళ్లకుండా వచ్చేశాం'.. తండ్రిని ఆరాధనగా చూస్తూ అన్నాడు మాధవన్.

'నేను చూడాలని ఆశపడ్డ ఆ బాలఏసు నా కళ్లెదురుగా ప్రశాంతంగా కూర్చుని ఉంటే.. మీ కాళ్ల దగ్గర ఆనందంగా జీవించాలని వచ్చేశాం మామయ్యా!' అని మనసులోనే అనుకుంటూ..

కామేశ్వరిని మంచం మీద కూర్చోబెట్టి వాళ్ల కాళ్ల దగ్గర కూర్చొంది మార్గరెట్.. కళ్లలో ఆనందబాష్పాలు తిరుగుతూ ఉంటే!

***

## సూరిశెట్టి వసంతకుమార్

వసంత కుమార్. బి.ఎ. చదివారు. నెల్లిమర్ల జూట్ మిల్లులో 20 ఏళ్లు పర్సనల్ మేనేజర్గా ఉద్యోగం చేసి.. పదవీ విరమణ చేశారు. తండ్రి సూరిశెట్టి సాంబశివరావు. దాదాపు 20 ఏళ్లపాటు బాలమిత్రకి ఎడిటర్గా చేశారు. తండ్రి దీవెనలతోనే రచనారంగంలో రాణిస్తున్నట్లు రచయిత చెబుతున్నారు. ఇప్పటి వరకు 30 కథలు, 25 ఆర్టికల్స్ రాశారు. అవన్నీ ప్రముఖ దిన, వార, మాస పత్రికలలో ప్రచురితమయ్యాయి. నమస్తే తెలంగాణ - ముల్కనూరు ప్రజా గ్రంథాలయం కథల పోటీతోపాటు ఉషా పక్షపత్రిక, జాగృతి, సాహితీ కిరణం, విశాలాక్షి సంస్థలు నిర్వహించిన వివిధ కథల పోటీల్లోనూ బహుమతులు గెలుచుకున్నారు.

*-62812 87659*

# తడబడిన జ్ఞాపకం



## సలీం

సాయంత్రం ఐదు గంటల సమయం..

వసారాలో కుర్చీలేసుకుని కూచుని, కాఫీ తాగుతూ.. మా పిల్లల చిన్నప్పటి కబుర్లు కలబోసుకుంటున్నాం. రోజూ మాకిదో వ్యాపకం.. పిల్లలు మాకు దూరంగా ఉన్న బాధనుంచి కొంత ఉపశమనం..

'వరుణ్ చిన్నప్పుడు చాలా అల్లరి చేసేవాడు కదండీ. స్కూల్ నుంచి ఏదో ఓ గొడవ ఇంటికి మోసుకొచ్చేవాడు. పెద్దోడు బుద్ధిగా ఉండేవాడు' అంది శకుంతల, నా భార్య.

నేనేదో చెప్పబోయేలోపల, గేట్ తీసుకుని ఓ పదహారేళ్ల కుర్రవాడు లోపలికొచ్చాడు.

మావైపు బెరుగ్గా చూస్తూ..

'ప్రసాద్ గారిని కలవాలండి' అన్నాడు.

'నేనే ప్రసాద్‌ని. ఏంటో చెప్పు? ఇంతకూ ఎవర్నువ్వు?' అని అడిగాను.

'నాపేరు రఘురాం అండీ! నేనూ, మా తాత హైద్రాబాద్ నుంచి ఈ ఉదయమే వచ్చాం'

'ఆ వివరాలన్నీ నాకెందుకు? నాతో ఏం పనో చెప్పు చాలు' అన్నాను.

'అదే చెప్పబోతున్నానండీ. మా తాత పేరు సత్యవోలు శ్రీనివాసమూర్తి. ఈ ఊళ్లోనే పదో తరగతి వరకు చదువుకున్నాడటండీ. ఆ తర్వాత వాళ్ల నాన్నగారు హైద్రాబాద్‌కి మకాం మార్చడంతో.. ఈ ఊరికి దూరం కావాల్సివచ్చిందట. మా తాతకి ఈ ఊరంటే చాలా ఇష్టమని చెప్పాడు. తన చివరి రోజుల్లో ఓసారి ఈ ఊరిని చూడాలని ఉందని కోరడంతో.. పిల్చుకొచ్చానండీ' అన్నాడు.

ఈ ఊళ్లో నేను చదివిన స్కూల్లోనే పదో తరగతి వరకు చదువుకున్నాడని వినగానే నాలో ఆసక్తి కలిగింది.

'పదో తరగతి ఏ బ్యాచో తెలుసా?' అని అడిగాను.

'తెలుసండి. 1971' అన్నాడు.

నాది కూడా అదే బ్యాచ్. కానీ, సత్యవోలు శ్రీనివాసమూర్తి ఎవరో గుర్తుకు రావడం లేదు.

'ఇంతకూ నన్ను వెతుక్కుంటూ ఎందుకొచ్చావు?'

'ప్రసాద్ అనే అతను మా తాతకు బాల్యస్నేహితుడట. పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారట. తన ప్రాణ స్నేహితుణ్ని కల్సుకోవాలని తాత కోరిక. అతనితో కలిసి చిన్నప్పుడు తిరిగిన ప్రదేశాలన్నీ మళ్లా తిరగాలని కోరిక'

'ఏ ప్రసాదూ? ఇంటి పేరు ఏమైనా చెప్పాడా?'

'మా తాతకు అతని పూర్తిపేరు గుర్తులేదట. అందుకే ఇప్పటివరకూ ఇద్దరు ప్రసాద్ల ఇళ్లకు వెళ్లాం. ఎవ్వరూ తాతను గుర్తుపట్టలేదు. తాత ఇంక నడవలేనంటే.. ఆయన్ని రాములోరి గుడి అరుగులమీద కూర్చోబెట్టి వచ్చాను' అన్నాడు.

'ఇందాక నువ్వు మీ తాత తన చివరి రోజుల్లో ఈ ఊరు చూడాలనుకుంటున్నట్టు చెప్పావు. చివరి రోజులేంటి? 71లో పది పాసైతే.. నా ఈడు వాడేగా. అరవై ఆరేళ్లుంటాయి' అన్నాను.

ఆ అబ్బాయి మొహంలో విషాదఛాయలు కన్పించాయి.

'మా తాతకు ప్రోస్టేట్ క్యాన్సర్. రెండు మూడేళ్లకు మించి బతకడం కష్టమని డాక్టర్లు చెప్పారు. దానికితోడు ఈమధ్య ఆయనకు మతిమరుపు కూడా ఎక్కువైంది' అన్నాడు.

మా ఇంటికి నాలుగిళ్ల అవతల మూర్తి అనే కుర్రాడు ఉండేవాడు. పదో తరగతి నాతోపాటే చదివాడు. మేమిద్దరం ఓ జట్టుగా తిరిగేవాళ్లం. వాళ్ల కుటుంబం కూడా ఇల్లూ పొలాలు అమ్మేసి, హైద్రాబాద్కి వెళ్లిపోయింది. ఆ మూర్తి.. ఈ మూర్తి ఒక్కరే కావొచ్చేమో!? అన్పించడంతో..

'మా వీధిలోనే మూర్తి అనే అబ్బాయి వాళ్ల ఇల్లుండేది. ఇంటిపేరు నాకు గుర్తులేదు. ఓసారి మీ తాతను చూస్తే గుర్తు పట్టగలనేమో వెళ్దాం పద' అన్నాను.

అతని మొహంలో సంతోషం వెల్లువలా పొంగింది.

రామాలయం అరుగుమీద కూచుని ఉన్న మూర్తి.. నన్ను చూడగానే లేచినిలబడి, తన మనవడివైపు మెచ్చుకోలుగా చూస్తూ..

'ఇతనే నా చిన్ననాటి స్నేహితుడు ప్రసాద్' అన్నాడు. నావైపు తిరిగి..

'ఈ ఊరిడిచిపెట్టి వెళ్లి యాభై యేళ్లు దాటినా నిన్నెలా గుర్తుపట్టానో చూశావా?' అంటూ కౌగిలించుకున్నాడు.

అతని దుర్భలమైన శరీరం సంతోషాతిరేకంతో అనుకుంటాను.. కొద్దిగా వణకడం గమనించాను.

ఐదడుగుల నాలుగంగుళాలకు మించని ఎత్తు, పల్చటి శరీరంతో మనిషి

పిట్టలా ఉన్నాడు. మొహంలో ముడతలు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ వల్లనుకుంటాను.. నెత్తిమీద ఒక్క వెంట్రుక కూడా లేదు.

'నీలో చాలా మార్పొచ్చింది మూర్తీ. గుర్తు పట్టలేనంతగా మారిపోయావు' అతని చేతిని నా చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నిమురుతూ అన్నాను.

'నువ్వు మాత్రం అలానే ఉన్నావు ప్రసాద్. జుట్టు నెరిసింది అంతే! అందుకే వెంటనే గుర్తు పట్టగలిగాను' అన్నాడు మూర్తి.

మెల్లగా చీకట్లు ముసురుకోసాగాయి. గుళ్లో దీపాలు వెలిగించారు.

'మొదట ఇంటికెళ్దాం. అక్కడ తాపీగా మాట్లాడుకోవచ్చు' అంటూ మూర్తి చేయి పట్టుకుని.. మా ఇంటి వైపు నడవసాగాను. మమ్మల్ని అనుసరిస్తూ రఘురాం..

'నిన్ను కల్సుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది ప్రసాద్. మనం కలిసి చదువుకున్న స్కూల్, మనం ఆడుకున్న చింతలతోపు, మనం కూచుని కబుర్లు చెప్పుకొన్న చెరువు గట్టు, అక్కడి తాటిచెట్లు, మేం వదిలేసి వెళ్లిన ఇల్లు.. ఇవన్నీ నీతో కలిసి చూడాలన్న కోరిక' అన్నాడు మూర్తి.

'ఇప్పుడేగా కల్సుకున్నాం. తొందరేముంది? మా ఇంట్లో నాలుగైదు రోజులైనా ఉండకుండా వెళ్తానంటే కుదర్దు కదా. నువ్వడిగినవన్నీ మెల్లగా చూపిస్తాలే' అన్నాను.

ఇంటికెళ్లగానే నా భార్యకు పరిచయం చేశాను.

'నా చిన్ననాటి స్నేహితుడు శ్రీనివాసమూర్తి. పదోతరగతి వరకు కలిసే చదువుకున్నాం. ఇన్నేళ్ల తర్వాత నన్ను వెతుక్కుంటూ హైద్రాబాద్ నుంచి వచ్చాడు' అన్నాను.

మా పెరట్లో ఉన్న వేపచెట్టు నీడలో కుర్చీలేసుకుని కూచుని కబుర్లలో పడ్డాం.

'ఊరంతా ఎంత మారిపోయిందో? ఎంత గుర్తు చేసుకుందామన్నా అప్పటి వీధులు, ఇళ్లు, భవనాలు ఏమీ గుర్తుకు రావడంలేదు' అన్నాడు మూర్తి.

'ఐదు దశాబ్దాల కాలం గడచిపోయింది కదా.. అప్పుడు మన ఊరు గ్రామపంచాయతీ కింద ఉండేది. ఇప్పుడు మండలకేంద్రం అయ్యింది. వ్యాపారాలు పెరిగాయి. వాటితోపాటు రోడ్లు, బిల్డింగులు, ట్రాన్స్‌పోర్ట్.. అన్నీ పెరిగాయి' అన్నాను.

'నేనీ ఇంటికి చాలాసార్లు వచ్చేవాణ్ని. ఈ వేపచెట్టు కిందనే ఆడుకునేవాళ్లం. కానీ, అప్పుడది పెంకుటిల్లు కదా. ఇంటిముందు అరుగులు కూడా ఉండేవి'

'మా నాన్నగారు చనిపోయాక, పాత ఇంటిని పడగొట్టి పైన రెండు పోర్షన్లు, కింద ఒక పోర్షన్ ఉండేలా ఇల్లు కట్టించాను. నాకిద్దరు మగపిల్లలు. పై పోర్షన్లలో

వాళ్లుంటారని కట్టించినవే! అయినా.. ఈ రోజుల్లో పిల్లలెవరూ తల్లిదండ్రుల్ని చూసుకుంటూ ఉన్న ఊళ్లో ఉండటం లేదుగా. మా ఇద్దరబ్బాయిలూ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో సెటిలైనారు. పెళ్లిళ్లయ్యాయి.. పిల్లలు! ఎవరి సంసారాల్లో వాళ్లు బిజీ. పలకరించే తీరిక లేనంత బిజీ' దుఃఖం ఉండలా నా గొంతుకు అడ్డుపడింది.

'మా నాన్న చేసిన బట్టల వ్యాపారమే నేనూ చేశాను. వ్యాపారాన్ని నాలుగింతలు పెంచాను. నాకు ఒక్కడే కొడుకు. వాణ్ని ఇంజినీరింగ్ చదివించి పొరపాటు చేశాను. బట్టల కొట్టులో కూచోవడం నామోషీ అట. బెంగళూర్‌లో ఒరాకిల్‌లో పనిచేస్తున్నాడు. వాడి కొడుకే రఘురాం. కాలేజీకి సెలవు ఇచ్చినపుడల్లా హైద్రాబాద్ వచ్చేస్తాడు. నా కొడుకు నుంచి ఆశించిన ప్రేమ.. మనవడి ద్వారా దొరుకుతున్నందుకు సంతోషపడాలో, మా గురించి పట్టించుకోని కొడుకుని తల్చుకుని బాధపడాలో తెలియని పరిస్థితి మాది' మూర్తి కళ్లు తుడుచుకున్నాడు.

'వంటేం చేయమంటారు? మీ చిన్ననాటి మిత్రుడికి ఇష్టమైన కూరలేమిటో చెప్తే అవే వండి పెడ్తాను' అంది శకుంతల.

'మూర్తికి బెండకాయ పులుసిష్టం. చిన్న బెల్లమ్ముక్క వేయడం మర్చిపోకు. గడ్డపెరుగు, అందులోకి మజ్జిగ మిరపకాయలు ఎలాగూ ఉన్నాయిగా' అన్నాను.

'అదేంటీ? మా తాత బెండకాయతో ఏం చేసినా ఇష్టపడడు కదా! మర్చిపోయారా?' అన్నాడు రఘురాం.

'ఔను కదా! అయినా మతిమరుపుకి నేనేమీ అతీతుణ్ని కాదుగా' అంటూ నవ్వాను.

'బీరకాయ కందిపప్పు కలిపి కూర చేయి' అన్నాను నా భార్యతో..

వంట పూర్తయ్యాక, భోజనాలు చేస్తున్నప్పుడు..

'మన క్లాస్‌లో రాజ్యలక్ష్మి అనే అమ్మాయి ఉండేది కదా. నువ్వా అమ్మాయిని చాలా ఇష్టపడేవాడివి. ఇప్పుడెక్కడుందో తెలుసా?'.. నాకు మాత్రమే విన్పించేంత మెల్లగా అడిగాడు మూర్తి.

'తెలియదు. టెన్త్ క్లాస్‌లో ఆ అమ్మాయిని చాలా గాఢంగా ప్రేమించాను. కానీ ఆ అమ్మాయితో చెప్పేంత ధైర్యం చేయలేకపోయాను. ఇప్పటి జనరేషన్‌కున్న తెగువ, చొరవ మనకెక్కడివి?'.. నేను కూడా శకుంతలకు విన్పించనంత మెల్లగా చెప్పాను.

'ఆరేళ్ల క్రితం బెంగళూరు నుంచి తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ స్టేషన్‌లో కన్పించింది. ఎంత మారిపోయిందో తెలుసా? నేనసలు గుర్తుపట్టలేక పోయానంటే నమ్ము. తనే నన్ను పోల్చుకుని, దగ్గరకొచ్చి పలకరించింది'

'తనకూ అరవై యేళ్లు వచ్చి ఉంటాయిగా! బాగా లావై ఉంటుంది. ఎంత

తెల్లగా ఉండేదో కదా. పాల నురగలాంటి తెలుపు..'

'రంగు పెద్దగా మారలేదు. తను హైద్రాబాద్‌లోనే ఇంగ్లీష్ లెక్చరర్గా చేసి రిటైరైనట్టు చెప్పింది. ముగ్గురు ఆడపిల్లలని చెప్పింది. ఇద్దరు అమెరికాలో, ఒకరు ఆస్ట్రేలియాలో సెటిలైనారట'

'పక్కన వాళ్లాయన లేడా?'

'లేదు! యేడాది క్రితం హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడని చెప్పి కన్నీళ్లు పెట్టుకుంది'

'అయ్యో పాపం' అన్నాను ఇంకేమనాలో తెలియక.

పై బెడ్రూంలో వాళ్లకు పడకలు ఏర్పాటు చేశాను.

శకుంతల మొహం చూస్తేనే అర్థమైంది.. చాలా కోపంగా ఉందని.

అటువంటి సమయంలో ఆమెను కదల్చకపోవడమే ఉత్తమమని, పక్కకు తిరిగి పడుకున్నాను.

'ఎవరా రాజ్యలక్ష్మి? నాకెప్పుడూ మీ టెన్త్‌క్లాస్ ప్రేమ గురించి చెప్పలేదే!' గదిలోని నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, శకుంతల నోటినుంచి బుల్లెట్లలా మాటలు దూసుకొచ్చాయి.

'రాజ్యలక్ష్మి ఎవరు?' అన్నాను ఆశ్చర్యాన్ని నటిస్తూ.

'బుకాయించకండి. మీరు చిన్నగా మాట్లాడుకుంటే నాకు విన్పించవనుకున్నారా? నాకేమీ చెవుడు లేదు' అంది.

'ఓహ్.. ఆ రాజ్యమా? టీనేజ్ కదా.. ఏదో వెర్రి. దాన్నే ప్రేమనుకుని. అయినా ఎప్పటి విషయమో అది.. ఎప్పుడో మర్చిపోయాను. నాకు రాజ్యాలూ రాణులూ ఎందుకు చెప్పు. నా శాకుంతలం ఉండగా' అన్నాను.

'చాల్లెండి సంబడం! మీ మాటల మాయలో పడిపోవడానికి నేనేమీ టీనేజ్ అమ్మాయిని కాదు'

శకుంతల ముసిముసిగా నవ్వుకుంటోందని అర్థమైంది.

* * *

ఉదయం పదింటికి మూర్తిని మా స్కూల్‌కి తీసుకెళ్లాను. రిటైర్డ్ హెడ్మాస్టర్‌ని కదా. టీచర్లందరూ ఆత్మీయంగా పల్కరించారు.

'ఇతను నా క్లాస్‌మేట్ శ్రీనివాసమూర్తి. మన స్కూల్లోనే పదో తరగతి వరకూ చదువుకున్నాడు. తన స్కూల్ రోజుల్ని రీవిజిట్ చేసుకోవాలన్న కోరికతో హైద్రాబాద్ నుంచి వచ్చాడు' అంటూ వాళ్లందరికీ పరిచయం చేశాను.

తరగతి గదులన్నీ తిప్పి చూపించాను.

'మనం చదివిన స్కూల్లోనే నువ్వు టీచర్‌గా చేరి, హెడ్‌మాస్టర్‌గా రిటైర్

కావడం గొప్ప విషయం ప్రసాద్. స్కూల్ చాలా మారిపోయింది. ఆ రోజుల్లో ఆరేడు తరగతుల్లో మనం కిందనే కూచునేవాళ్లం. గదులన్నీ రంగులు వెలసిపోయి, పెచ్చులూడిపోయి ఉండేవి. ఇప్పుడన్నీ పక్కా కాంక్రీట్ గదులే కన్పిస్తున్నాయి. అన్ని గదుల్లో పిల్లలు కూచోడానికి బల్లలున్నాయి. అంతా కొత్తగా కన్పిస్తోంది' అన్నాడు మూర్తి.

'నేను హెడ్‌మాస్టర్ అయ్యాక, ఓల్డ్ స్టూడెంట్స్ గెట్ టుగెదర్ ఏర్పాటుచేశాను. వచ్చినవాళ్లలో అన్ని రంగాల్లో రాణిస్తున్నవాళ్లు ఉన్నారు. వాళ్లందరి సహకారంతో స్కూల్ బిల్డింగ్‌కి కొత్త రూపు తీసుకొచ్చాను' కించిత్ గర్వంతో అన్నాను.

'మరి నాకెందుకు ఆహ్వానం పంపలేదు? నేను తప్పకుండా వచ్చి ఉండేవాణ్ని. పాత స్నేహితుల్ని కల్సుకునే అరుదైన అవకాశాన్ని మిస్సయ్యాను' బాధగా అన్నాడు.

'నువ్వు హైద్రాబాద్‌లో సైటిలైనట్టు తెలుసు కానీ.. నీ అడ్రస్ తెలియదు. నీదే కాదు, చాలామంది అడ్రస్‌లు మా దగ్గర లేవు. అందుకే న్యూస్ పేపర్‌లో ప్రకటనలు ఇప్పించాం'

'అలానా.. నేనా ప్రకటనల్ని చూసి ఉండను. డబ్బు సంపాదనలో పడి జీవితాన్ని జీవించడం మర్చిపోయాను. అనుభవించడం, అనుభూతి చెందడం మర్చిపోయాను. ఇప్పుడు పశ్చాత్తాపపడి ప్రయోజనం ఏముంది? గడచిపోయిన కాలం తిరిగిరాదుగా!'

'ఇప్పటికీ మించిపోయింది లేదు మూర్తీ. ఇకనుంచి జీవితంలోని ప్రతి క్షణాన్నీ ఆస్వాదించు. నీ మనసుకు నచ్చిన పనులు చేయి. నచ్చినట్టు బతుకు. రోజుకో ఉత్సవంలా బతుకు' అన్నాను.

'అందుకేగా ఈ ఊరికొచ్చాను' మూర్తి మొహంలో సంతోషం కన్పించింది.

ఇంటికి తిరిగొచ్చేటప్పటికి పన్నెండున్నర దాటింది. భోజనం చేసి, సాయంత్రం ఐదు గంటల వరకు విశ్రాంతి తీసుకున్నాక..

'చెరువు గట్టుమీద కూచుని కబుర్లు చెప్పుకుందాం పద' అన్నాడు మూర్తి.

మాకు పాఠాలు చెప్పిన టీచర్ల గురించి మాట్లాడుకుంటూ, మెల్లగా నడక సాగించాం. ఎదురుగా పార్క్ కన్పించింది.

'లోపలికెళ్లి కూచుందాం' అన్నాను.

'మరి చెరువు గట్టో' అన్నాడు మూర్తి.

'గుర్తుకు తెచ్చుకో.. మనం ఇప్పుడు నడిచొచ్చిన దారేగా చెరువుకట్టకు దారి' నవ్వుతూ అన్నాను.

'అవునా? గుర్తుకు రావడంలేదు. ఇంతకూ చెరువేది?'

'ఇంకెక్కడి చెరువు? చాలా యేళ్ల క్రితమే దాన్ని పూడ్చేసి, ఇళ్ల స్థలాలు చేసి

అమ్ముకున్నారు. ఈ చుట్టుపక్కల కన్పిస్తున్న ఇళ్లన్నీ ఆ జాగాలో కట్టుకున్నవే. ఎటొచ్చీ కొద్ది స్థలాన్ని పార్క్ కోసం వదిలిపెట్టి పుణ్యం కట్టుకున్నారు'

'అయ్యో.. ఎంత అందమైన చెరువు.. దాన్ని పూడ్చేయడానికి మనసెలా ఒప్పింది?' అన్నాడు మూర్తి.

'రియల్ ఎస్టేట్ బూమ్ నడుస్తోందిగా! శ్మశానాల్నే వదలడం లేదు, చెరువుల్ని వదుల్తారా చెప్పు.. గజం స్థలం తులం బంగారంకన్నా విలువైపోయిందిగా'.. పార్క్‌లో చెట్లకిందున్న సిమెంట్ బెంచీ మీద కూచుంటూ అన్నాను.

మూర్తి నా పక్కన కూచున్నాక..

'చింతల తోపైనా ఉందా?' అని అడిగాడు.

'దానికీ అదే గతి పట్టింది. ఒక్క చింతచెట్టు కూడా లేకుండా కొట్టేసి ఇళ్లు కట్టుకున్నారు'

'మన చిన్నప్పుడు ఆ చెట్లెక్కి చింతచిగురు కోసేవాళ్లం గుర్తుందా!? చింతచిగురేసి పప్పు వండితే ఎంత రుచిగా ఉండేదో. చింతకాయలతో అమ్మ తొక్కుడు పచ్చడి చేసేది. సాయంత్రాలు పిల్లలందరం అక్కడ ఎన్ని ఆటలు ఆడుకునేవాళ్లమో! చింతలతోపుతో అల్లుకుని ఎన్ని జ్ఞాపకాలో కదా!' అన్నాడు.

కొన్ని క్షణాల విరామం తర్వాత..

'స్కూల్లో మనతోపాటు చదివిన రంగనాయకులు ఇప్పుడెక్కడున్నాడో తెలుసా?' అని అడిగాడు.

'ఏ రంగనాయకులు?'

'వాడి అమ్మానాన్న చిన్నప్పుడే చనిపోతే వాడి నాయనమ్మేగా సాకింది. మన బడి బైట తేగలు, రేగుపళ్లు, నువ్వుజీడీలు, వేరుసెనగ ఉండలు అమ్మేది గుర్తుందా? బడి వదిలాక రంగనాయకులు సోడాబండి వేసుకుని, వీధులన్నీ తిరిగి సోడాలు అమ్మేవాడు'

నేను మూర్తివైపు మెచ్చుకోలుగా చూస్తూ..

'ఎంత బాగా గుర్తుపెట్టుకున్నావో.. హాట్సాఫ్ మూర్తీ! నాకిప్పుడు గుర్తొస్తున్నాడు. సన్నగా బక్కపల్చగా ఉండేవాడు కదా. వాడి నాయనమ్మ చనిపోయాక, గుంటూర్‌లో బంధువులెవరో చేరదీశారని విన్నాను. ఆ తర్వాత ఏమైనాడో తెలియదు' అన్నాను.

ఓ గంట పార్క్‌లో గడిపాక, తిరుగు ప్రయాణంలో..

'ఆ రోజుల్లో మీరున్న ఇంటిని చూపిస్తాను పద' అన్నాను.

మా ఇంటికి నాలుగిళ్లవతల ఉన్న సుబ్బన్న వాళ్ల ఇంటి దగ్గర ఆగాం. సుబ్బన్న తన ఐదెకరాల పొలంలో వ్యవసాయం చేస్తాడు. నా స్టూడెంట్.. తొమ్మిదో తరగతి

వరకు చదివాడు.

నన్ను చూడగానే లేచొచ్చి..

'రండి మాస్టారూ!' అంటూ సాదరంగా ఆహ్వానించాడు.

మూర్తి ఒళ్లంతా కళ్లు చేసుకుని, ఆ ఇంటిని గమనిస్తూ.. గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

సుబ్బన్నకు మూర్తిని పరిచయం చేస్తూ..

'ఇప్పుడు నువ్వుంటున్న ఈ ఇల్లు వీళ్లదే. మూర్తి వాళ్ల నాన్న ఈ ఇంటిని మీ తాతకు అమ్మేసి, హైద్రాబాద్ వెళ్లిపోయాడు' అన్నాను.

'అలానా మాస్టారూ.. నాకా విషయం తెలియదు' అన్నాడు సుబ్బన్న.

ఇంటి చుట్టూ తిరిగి చూసి..

'పెరట్లో జామచెట్టు ఉండాలే. మనిద్దరం దోరగా ఉన్న జామకాయలు తెంపుకొని తినేవాళ్లం గుర్తుందా? ఆ చెట్టు ఏమైపోయింది?' అన్నాడు మూర్తి.

'సుబ్బన్న వాళ్ల నాన్న పాత ఇంటిని పడగొట్టి కొత్త ఇల్లు కట్టుకున్నాడు. అప్పుడు జామచెట్టు అడ్డంగా ఉందని కొట్టేశారు' అన్నాను.

* * *

మరో రెండ్రోజులు ఉన్నాక మూర్తి హైద్రాబాద్ తిరిగెళ్లడానికి బ్యాగ్ సర్దుకుంటుంటే..

'స్టేషన్ దాకా నేనూ వస్తాను' అన్నాను.

'నీకెందుకు శ్రమ?' అన్నాడు మూర్తి.

'శ్రమేముంది? నువ్వు నన్ను చూడటానికి హైద్రాబాద్ నుంచి రెండొందల కిలోమీటర్లు ప్రయాణించి రాగాలేనిది.. నేను మూడు కిలోమీటర్లు నీ కోసం రాలేనా?' అంటూ నవ్వాను.

రైల్వే స్టేషన్లో రఘురాం నాతో..

'మీ ఇంట్లో ఉన్న నాలుగు రోజులు మాతాత ఎంత సంతోషంగా ఉన్నాడో.. టీనేజ్ కుర్రాడిలా మీతో ఎక్కడెక్కడికో ఎంత ఉత్సాహంగా తిరిగాడో. మీ దయ వల్లనే మా తాత కోరిన కోరిక తీర్చగలిగాను. మీకు చాలా థ్యాంక్స్ సర్' అన్నాడు.

రైలు ఎక్కేముందు మూర్తి నా చేతులు రెండూ పట్టుకుని..

'ఎన్ని అందమైన జ్ఞాపకాల్ని మూటగట్టుకుని పోతున్నానో.. నీలాంటి స్నేహితుడుండటం నా పూర్వజన్మ సుకృతం' అంటున్నప్పుడు అతని కళ్లు చెమర్చడం గమనించాను.

ఇంటికి తిరిగి రాగానే నా భార్య మంచినీళ్ల గ్లాస్ చేతికిస్తూ..

'మీ బాల్య స్నేహితుడికి సెండాఫ్ ఇచ్చి వచ్చారన్నమాట' అంది.

'నీకో రహస్యం చెప్పనా? అతను నాతో కలిసి చదువుకున్న మూర్తి కాదు. ఈ శ్రీనివాసమూర్తి ఎవరో నాకు తెలియదు' అన్నాను.

నా భార్య ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టి..

'అదేంటండీ! నాలుగు రోజులు ప్రాణస్నేహితుణ్ని చూసినట్టే చూశారుగా. నటించారా?' అంది.

'లేదు.. నటించలేదు! నిజంగానే అతను నా చిన్ననాటి స్నేహితుడైనట్టే అనుభూతి చెందాను. అతన్ని సంతోషపెట్టడమే కాదు.. నేనూ సంతృప్తి పొందాను' అన్నాను.

'ఎందుకలా చేశారు?'

'రెండు కారణాల వల్ల శకుంతలా.. అతని మనవడికి తన తాత కోరిక తీర్చిన సంతృప్తిని మిగల్చాలని చేశాను. మూర్తికి తన చివరి రోజుల్లో ఓ అందమైన అనుభవం మిగల్చాలని చేశాను'

'ఇంతకూ అతను మీ బాల్యస్నేహితుడు కాదని ఎప్పుడు తెల్సింది? అలాంటప్పుడు ఆ శ్రీనివాసమూర్తి మిమ్మల్ని వెతుక్కుంటూ ఎందుకొచ్చినట్టు?'

'నాతోపాటు చదువుకున్న మూర్తి అప్పట్లోనే చాలా పొడవుగా, తెల్లగా ఉండేవాడు. అతన్ని రామాలయం దగ్గర చూసినపుడే తెల్సిపోయింది.. ఈ మూర్తి ఆ మూర్తి కాదని. మా ఊళ్లో నా చిన్నప్పుడు కూడా చెరువు లేదు. చింతలతోపు కూడా లేదు. నాకు అర్థమైంది ఏమిటంటే.. అతనికి క్యాన్సర్ కంటే ముందే అల్జీమర్స్ వ్యాధి ఉండి ఉంటుందని. అతని చిన్నప్పుడు ప్రసాద్ అనే స్నేహితుడు నిజం. ఆ ఊళ్లో చెరువుగట్టు, చింతలతోపు నిజం. అతను గుర్తుచేసుకున్న రంగనాయకులు నిజం. కానీ, ఆ ఊరిపేరు మర్చిపోయాడు. మన ఊరినే తన బాల్యంలో గడిపిన ఊరనుకుని భ్రమపడ్డాడు. అతని భ్రమని అందమైన నిజంలా చేయడంలో నేను తోడ్పడ్డాను అంతే! నిజం చెప్పనా? అతనున్న నాలుగు రోజులు నేను కూడా ఎంత సంతోషంగా ఉన్నానో.. నేనూ బాల్యంలోకి ప్రయాణించాను. ఏడాదికి ఒక్కసారైనా ఒక్కడైనా అలా నన్ను వెతుక్కుంటూ వచ్చి, బాల్యంలోకి లాక్కెళితే ఎంత బావుంటుందో కదా!' అన్నాను.

* * *

# సలీం

మలి వయసులో మనల్ని వెతుక్కుంటూ ఎవరైనా వచ్చి, మూడు రోజులు మనతో గడిపి వెళ్తే.. ఎంత బావుంటుందో కదా! పొరబడి వచ్చినా, వాళ్లు పొందే ఆనందం, మనకు మిగిల్చి వెళ్లే అనుభూతి మధురంగా ఉంటాయి కదా.. ఈ భావనే 'తడబడిన జ్ఞాపకం' కథకు ప్రేరణ. రచయిత సలీం. ఒంగోలు సమీపంలోని తోవగుంట. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి భౌతిక శాస్త్రంలో ఎమ్మెస్సీ (టెక్) చేశారు. ఇప్పటివరకు మూడు కవితా సంపుటాలు, పన్నెండు కథా సంపుటాలు, ముప్పయ్ ఆరు నవలలు వెలువరించారు. ఈయన రాసిన కొన్ని నవలలు, కథలు ఆంగ్లం, హిందీ, మరాఠి, ఒరియా, కన్నడ, మళయాళం, తమిళ భాషల్లోకి అనువాదం అయ్యాయి. బాలల కోసం ఏడు సై-ఫై నవలికలు రాశారు. సాహితీసేవలో భాగంగా.. భాషా పురస్కారం, చాసో సాహిత్య పురస్కారం, వాసిరెడ్డి సీతాదేవి సాహిత్య పురస్కారం, కొవ్వలి సాహిత్య పురస్కారం, మాడభూషి రంగాచారి స్మారక పురస్కారం, సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. వివిధ సాహితీ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో బహుమతులు, సన్మానాలు పొందారు.

– 95886 30243

# చిరంజీవి



సౌందర్య తేజ కోరా

సమయం ఒంటి గంట దాటి పోతున్నది. గేటు పక్క గొలుసుతో కట్టేసి ఉన్న స్నూబీ నిముషానికోసారి కూర్చుంటూ మళ్లీ పైకి లేస్తూ, ఓసారి గిరగిరా తిరుగి మళ్లీ నిలబడి.. పదేపదే వాష్ ఏరియా వైపున్న వంటగది తలుపు వైపు చూస్తున్నది.

ప్రతిరోజూ ఈపాటికి రెండుసార్లు తినడానికి పెట్టే అమ్మాజీ తన దరి దాపులకు రాలేదు సరి కదా, కంటికి కూడా కనిపించక పోయే సరికి స్నూబీకి అయోమయంగా ఉంది. దాని కడుపు ఆకలితో నకనకలాడుతుంటే.. ఆమెపై కోపం కూడా వస్తున్నది.

బయట స్నూబీ సంగతలా ఉంటే.. ఇంటి లోపల మనుషుల పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే ఉంది.

బల రామ్మూర్తి గారికి టిఫిన్ తినని కారణంగా కళ్లు బైర్లు కమ్ముతున్నట్లు అనిపిస్తున్నది. అసలే షుగరు ఉండటం వల్ల ఆయణ్ని ఆకలి ఎక్కువగా బాధిస్తుంటే.. కాఫీ అయినా తాగుదామనిపించి కోడలు పద్మని అడిగితే, ఆమె కాఫీ ఇచ్చింది. ఆ కాఫీ కప్పు నోటిదగ్గర పెట్టుకోగానే రుచి సహించక సైలెంటుగా కప్పు పక్కన పెట్టేస్తుంటే చూసిన పద్మ.. మామ గారితో అంది.

'ఏం మామయ్యా! ఇదిగూడ నచ్చలేదా ఏంది? ఎవరికి నచ్చిన నచ్చకున్న నాకట్లే చాతనైతది.. తాగితె తాగండ్రి.. లేకుంటె మానండ్రి! అసలికీ అమ్మాజీకి ఏం రోగం పుట్టిందో ఏమో.. చెప్పపెట్టకుండా మానేసె! ఇప్పటికి ఎన్నిమార్లు జెప్పిన.. చిన్నఫోన్ కొని పెడతనె. ఇట్లాంటి అవసరమొస్తె ఫోన్ చెయ్యడానికి పనికొస్తదని. 'నాకెందుకమ్మ పోనూ.. దాన్ల ఎట్ట మాట్లాడాల్నో నాకు తెలియనే దెలియదాయే! పొద్దంతా ఈడ్నే ఉంటగా.. రాత్రైనంకేగా తెలిసినోళ్ల ఇంటి పక్కగదిల పండుకునేతందుకు పొయ్యేది.. మరీ అక్కరపడితె ఆల్లకి చేయండమ్మా' అంట వాళ్ల నంబరు పేపర్ మీద రాపించుకుని తెచ్చె! గాని ఏం లాభం? ఉదయం ఎనిమిది గంటలకెల్లి వాళ్లకి కాల్ జేస్తున్న గాని.. వాళ్లు కాల్ రిసీవ్ చేసుకోటమే లేదాయె! మరీ ఆలస్యమైతందని మార్నింగ్ నేను ఉప్మా జేస్తే.. ఏం రోగమో ఏందో.. ఇంట్ల

ఒక్కరంటే ఒక్కరు కూడా తిని చావలే! జర ఆలస్యంగైనా అమ్మాజీ వస్తదిలే అని వంట జోలికే పోలే..'

నిజానికి ఆమె చేసిన ఉప్మా ఆమే తినలేక చెత్త బుట్టలో వేసేసింది. ఇంట్లో తెచ్చి పెట్టుకున్న ఫ్రూట్స్ కూడా నిన్ననే అయిపోతే.. ఈరోజు తెప్పించు కుందామనుకుంది. ఇప్పుడేమో కడుపులో ఖాళీఖాళీగా పేగులు లాగేస్తున్నట్టనిపిస్తుంటే.. దాన్నే ఆకలంటారని తెలిసొచ్చి ఆ దుస్థితికి కారణమైన అమ్మాజీ మీద కోపంతో రగిలిపోతూ ఆ కోపంలో మామగారిపై విరుచుకుపడింది పద్మ.

'సర్లే.. గిప్పుడు నువ్వు వంటజేస్తె మాత్రం తినేదెవరంట? అదిగూడ చెత్తబుట్టల బోసేదేగద తల్లీ'.. మనసులో అనుకున్నానని పైకి అనేసారు బల రామ్మూర్తి గారు.

అంతే.. కస్సున లేచింది పద్మ.

'ఏంది అంటుండ్రు.. నా వంటంత చెండాలంగ ఉంటదనా మీ ఉద్దేశం! అత్తమ్మ ఉన్న రోజుల్ల గూడ ఆమెని మాత్రానికి మెచ్చుకున్నరా ఏనాడైనా? మీకూ, మీ కొడుక్కి ఎప్పుడు జూసినా పొరిగింట్ల పుల్ల కూరేగా మంచిగుండేది. అందుకేగ మీ కొడుకు ఈ అమ్మాజీని వెతికివెతికి తీసుకొచ్చి పెట్టిండు..' అంటూ రుసరుసలాడింది పద్మ.

నిజం అది కాదు. అత్తగారు ఉన్నప్పుడు 'నువ్వు చెయ్యి' అంటే.. 'నువ్వు చెయ్యి' అంటూ వంతులు వేసుకుని అలక పాన్పులెక్కుతూ, అత్తగారు టీవీ సీరియల్స్ చూస్తూ.. కోడలు కొత్తగా వచ్చిన సెల్‌ఫోన్లో ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ.. షాపింగులకు తిరుగుతూ ఉంటే.. కడుపు మాడ్చుకోలేకా, బైట తినలేకా తన బడ్జెట్లోనే తక్కువ జీతానికి వస్తుందిలే అని వంట మనిషి అమ్మాజీని పెట్టాడు తన కొడుకు భాస్కరం. ఆ విషయం గానీ గుర్తుజేస్తే కోడలు ఉగ్రరూపం ధరిస్తదని తెలిసిన బల రామ్మూర్తి గారు నచ్చచెబుతున్నట్టుగా.. మెల్లగా..

'అదిగాదు పద్దమ్మా.. నీకు అలవాటు లేదుగా'.. అని నసుగుతూ, ఆకలికి తట్టుకోలేక మాటిమాటికీ నీరసంగా కడుపు తడుముకుంటూ..

'ఛ.. పొద్దుటా ఉప్మ ఎట్లోగట్ల తినేసి ఉంటె మంచిగుండేది.. జర లేటైన ఎట్లయిన అమ్మాజి వస్తాదిలే.. అప్పుడా వంట కాంగానే త్వరగ తినొచ్చులే.. అనుకుని తినకుండా వదిలేసిన.. ఇప్పుడేమొ ప్రాణం బోతున్నట్లు అనిపిస్తుండె' అనుకున్నారు బల రామ్మూర్తి గారు.

స్కూల్‌కి వెళ్లడానికి లంచ్ బాక్సులు రెడీ కాలేదన్న వంకతో ఇంటి దగ్గరే ఉండిపోయిన పన్నెండేళ్ల మనవరాలు వసుధ, పదేళ్ల మనవడు వంశీ చాక్లెట్లూ అవీ

తింటూ.. ట్యాబ్‌లో గేమ్స్ ఆడుకుంటుంటే.. మనవడిని పిలిచి..

'అమ్మాజీ ఎందుకు రాలేదో తెలుసుకుని ఆడ్నే ఉంటె వెంట పెట్టుకుని దీసుకురా' అని చెప్పి.. వంశీని గంట క్రితం బతిమాలి, అమ్మాజీ రాత్రిపూట ఉండే చోటికి పంపించారు. వాడు వస్తున్నాడేమో.. వాడివెంట అమ్మాజీ వస్తుందేమోనని గేటువైపే చూస్తుంటే, వంశీ ఒక్కడే వస్తుండటం చూసి నిరాశ పడ్డారు. విషయమేంటని అడిగితే చెప్పాడు.

'తెల్లవారు జామున అమ్మాజీ చనిపోతే, హాస్పటల్ వాళ్లు వచ్చి తీసుకెళ్లింద్రట' అని చావుకబురు చల్లగా చెప్పేసరికి, బల రామ్మూర్తి గారు కోడలు పద్మ వైపు చూశారు.. 'నీవే దిక్కు' అన్నట్లు.

ఆ చూపు అర్థమైనా గానీ పద్మ.. పట్టించుకోనట్టుగా..

'చచ్చిందాన్ని హాస్పటల్‌కి దీసకపోయి ఏం చేస్తారంట? ఒక్కమాట ముందే ఒంట్లో బాగోలేదనో, ఇంకోటనో జెప్పుంటె.. ఈసరికి ఇంకో మనిషిని పెట్టుకుందుముగ. ఇట్ల చెప్పా పెట్టకుండ పోతే ఎట్ల!'

ఆవిడేదో పని ఎగ్గొట్టి పక్కూరుకి వెళ్లినట్టుగా, ఆవిడ ఏం చేసినా తన కనుసన్నల్లోనే జరగాలనే ఆలోచనతో.. ఆఖరికి ఆవిడ మహాప్రస్తానం కూడా తనకి చెప్పి చేయాలన్నట్టు అంది పద్మ.

తమకి అసౌకర్యంగా అనిపిస్తే ఎదుటి మనిషి ఏ పరిస్థితిలో ఉన్నా గానీ, వాళ్లనే తప్పుపట్టే మెంటాలిటీ ఉన్న మనుషులలో మొట్టమొదటి వరసలో ఉంటుందామె.

'ఇంగో మామయ్యా.. ఏనాడైన బైటనుంచి ఫుడ్ ఆర్డర్ బెడితె కడుపుకి పడలేదంటరుగా.. అయిన గానీ మరో మనిషి దొరికిందాక ఎవరైన సరే మాట్లాడకుండ అది తినాల్సిందే! తప్పదు. మీ కొడుక్కి గూడ ఫోన్ చేసి.. 'ఇంటి నుండి క్యారేజీ రాదు. ఆడ్నే క్యాంటీన్‌లో తిను' అని చెబుతాలె'.. అంటూ వెజ్‌మీల్స్ ఆర్డర్ పెట్టింది పద్మ.

ఒక్కపూట భోజనానికే నలుగురికీ వెయ్యి రూపాయిలైంది. పద్మ గుండె గుబేలుమంది. అదీ అమ్మాజీ ఉంటే.. ఇంటి పని, వంటపనీ కూడా పొద్దుటి నుండి రాత్రి ఎనిమిది గంటల వరకూ చేస్తుంది. మధ్యాహ్నం నాలుగు ముద్దలు, రాత్రి నాలుగు ముద్దలు అందరూ తిన్నాక.. మిగులిపోయిన కూరలతో తినేసి వెళ్లిపోతుంది.

నెలకు కేవలం వెయ్యి రూపాయిలు ఇవ్వమని పోస్టాఫీసులో కట్టుకుంటుంది. అత్తగారు పోయాక ఆమె కొత్త చీరలు కావాల్సిన వాళ్లకు ఇవ్వగా మిగిలిన పాత జరీచీరలు అమ్మాజీ కట్టుకుంటుంది. అంత తక్కువ జీతానికి మనిషి దొరకటమంటే

కష్టమే.. ఒక్క పాచి పని చేయటానికే మూడు వేలు అడుగుతున్నారు.

ఇప్పుడు పద్మకేం చెయ్యాలో తోచటం లేదు. ఈ రోజులాగ ప్రతిరోజూ ఫుడ్ ఆర్డర్లు పెడితే.. భర్త సంపాదనలో సగం తిండికే సరిపోతుంది. ఇంక పిల్లల చదువులు, షాపింగులు, సరదాల సంగతేంటి.. తననీ అగమ్యగోచరంలో పడేసి, అకస్మాత్తుగా వంటింటిని వదిలేసి పోయిన అమ్మాజీ మీద మళ్లీ కోపం ముంచుకొచ్చింది కానీ.. ఎవరి మీద చూపించాలో తెలియక డైనింగ్ టేబుల్ పక్కనున్న కుర్చీని కాలితో తన్నింది. బొటన వేలు బొప్పి కట్టడం మినహా.. ఏం జరగ లేదు. కోడలి అవస్థ చూసి మనసులో చిన్నపాటి ఆనందం కలగగా, ఆమెనింకా ఉడికించాలన్నట్టుగా..

'ఏ మాటకామాటే చెప్పుకోవాలి పద్దమ్మా! చదువు సంధ్యా, తీరూ వాకా లేకున్న.. వంట మాత్రానికి అమోఘంగ చేస్తది అమ్మాజీ. ఆ చేతిల ఏం మహిమ ఉందో ఏమో.. మన ఇంటిల్లిపాదీ కంచంలో ఒక్క మెతుకంటే ఒక్కటి కూడా ఉంచకుండా తినేస్తం..'

ఇంక ఆ వంట తినలేక పోతామే అన్న నిరాశతోనూ, ఇక నుండి రుచిపచీ లేని కోడలి వంట తినాల్సొస్తుందేమోనని భయంతోనూ బల రామ్మూర్తి గారు అంటుంటే.. ఈరోజు తాను చేసుకున్న ఉప్మా నోట్లో పెట్టుకున్నప్పుడే.. అమ్మాజీ వంట విలువ తెలిసొచ్చిన పద్మకి మామ గారితో ఏకీభవించక తప్పలేదు.

* * *

గంట గడిచాక ఆర్డర్ చేసిన ఫుడ్ వచ్చేసింది. ఆవురావురంటూ గబగబా ప్యాకెట్స్ విప్పుకొని తినేసాక, కాస్త అన్నం కూర కలిపి స్నూబీ దగ్గరకు వెళ్లి.. దాని గిన్నెలో వెయ్యాలని చూస్తే.. పొద్దుట వేసిన ఉప్మా అలాగే ఉండేసరికి..

'ఏమే! నీకుగూడ నచ్చలే నా ఉప్మ! సర్లే ఇది తిను' అని, గిన్నె ఖాళీ చేసి, అందులో అన్నం వేసి వెళ్లింది పద్మ.

స్నూబీ కడుపులో ఆకలి బాధ పెడుతున్నా సరే.. అన్నం గిన్నెలో మూతి పెట్టకుండా ఇంకా వంటగది తలుపువైపే చూస్తుండి పోయింది.

'ఇంగో మావయ్యా! ఈరోజు ఎట్లయిన వైకుంఠ ఏకాదశే గద! రాత్రికి ఉపాసం.. రేపటి ముచ్చట రేపు జూసుకుందాం గానీ.. ఎట్లయిన సరె పైసలెక్కువైన గానీ.. ఎవర్నొకర్ని పెట్టమని మీ కొడుక్కి జెబుదాంలె! అమ్మాజీ గాకుంటె ఇంకో బొమ్మాజీ..' అంటూ తెలిసినవాళ్లని చవకలో వచ్చే వంట మనిషి గురించి అడగటానికి ఫోన్ అందుకుంది పద్మ.

'అవునా.. ఈరోజు వైకుంఠ ఏకాదశా! ఎంతమంచి రోజున అమ్మాజీకి చావొచ్చె! ఏం పుణ్యం జేసుకుందో ఏవో గానీ.. డైరెక్టుగ స్వర్గానికే పోతది' అన్నారు

బలరామ్మూర్తి గారు.

'ఆ.. అవును! ఏం దెలియనమ్మకి ఏకాశి, అన్ని తెలిసినమ్మకి అమాస అని ఊర్కె అన్నారా!? విచిత్రం ఏంటంటె.. రోజూ పురాణాలు చదువుత, పూజా పునస్కారాలు జేస్త.. రెండుమార్లు కాశీకి పోయొచ్చిన.. అత్తమ్మకి, మాయమ్మకి గూడ చెడ్డ గడియన చావొచ్చెనని.. ఎన్నో శాంతి పూజలు చేయించాల్సి వచ్చె! కనీసం అక్షరం ముక్కరాని ఈ అమ్మాజీ ఏ దినాన గూడ ఏ దేవుడికి మొక్కుడు చూడలే.. అయిన సరె అప్పనంగ స్వర్గానికి పోయేటట్టుంది'..

పద్మ గొంతులో అసూయ లాంటిది తొలికిసలాడింది. ఎందుకో తెలియదు ఇప్పటికిప్పుడు అమ్మాజీ చచ్చిపోయి తననేదో మోసం చేసేసి, తనకి డబ్బు నష్టం కలిగించినట్టు ఫీలింగ్ వచ్చి.. అమ్మాజీపై అకారణంగా చిన్నపాటి ద్వేషంకూడా పుట్టుకొచ్చేసింది ఆమె మనసులో.

చీల మండలపైకి చీర కట్టుతో, సీవెండి గాజులు, ఎర్ర పూసల దండ వేసుకుని పలచబడిపోయిన జుట్టుతో జిల్లేడు మొగ్గంత ముడి వేసుకుని మోటు మనిషిలా, అమాయకత్వంతో కూడిన మాటలతోనూ ఉండే అమ్మాజీ అంటే.. పద్మకు మొదటి నుండి చిన్నచూపే! ఎవరే పని చెప్పినా, ఏం వండి పెట్టమన్నా విసుగన్నది చూపించకుండా అన్నీ అమర్చిపెడుతూ కూడా జీతం పెంచమని కానీ, మానేస్తానని కానీ అనని అమ్మాజీనీ..

'ఎక్కడికి పోతుందిలే' అన్న అలసత్వంతో మరీలోకువగా కూడా చూసేది. అలాంటిదీ రోజు అమ్మాజీ పుణ్యతిథిన పోయి స్వర్గానికి వెళ్లేవారి లిస్టులోకి చేరిందంటే.. పద్మ మనసు అస్సలు తట్టుకోలేక పోతున్నది.

'ఆమె ఏం పుణ్య కార్యాలు, ఘన కార్యాలు జేసెనని ఆ దేవుడీ సన్మానం చేసిండు' అని అర్థంకాక తెగ మథన పడిపోతున్నది.

* * *

రెండు రోజులు వరుసగా హోటల్ భోజనాలతో గడిపాక మామగారికి, భర్తకి, ఆఖరికి తనకి కూడా ఎసిడిటీతో కడుపులో మంట మొదలయ్యే సరికి.. ఆరు వేలు ఇస్తామని చెప్పి ఓ వంట మనిషిని పెట్టుకున్నారు. రుచికరంగా వండించుకుని తింటూ అమ్మాజీ పేరుకూడా తలుచుకోవటం మానేసారంతా.. వాళ్ల దృష్టిలో అమ్మాజీ ఓ గతం.

కానీ, అమ్మాజీ కనిపించని రోజు నుండి ముద్దముట్టని స్నూబీ.. చిక్కి శల్యంగా మారసాగింది. దానికెందుకు తిండి సహించటం లేదో అర్థం కాని ఇంట్లో వాళ్లు..

'ఒకవేళ మాంసం ముక్కల మీద దుమ్మల మీద మొహం వాచిందేమో' అ కోడి దుమ్ములు, మేక బసర కొని తెప్పించి వండించి పెట్టారు.

మాంసాహారం అంటే తోక ఊపుకొంట ఎగబడిపోయే స్నూబీ.. ఆ కంచం వైపు మొఖం తిప్పి వాసన కూడా చూడలేదు. దాని నిరాహార దీక్ష ఏడో రోజుకి చేరింది.

దాని కనుకొనలకు పుసుకులు కట్టి నీరుధారగా అట్ట కట్టింది. డాక్టర్ కూడా వచ్చిచూసి.. ఇంజిక్షన్ ఇవ్వాలన్నా వీలు పడనివ్వలేదు. అతన్నే కాదు ఎవ్వర్నీ దగ్గరకు రానీయడం లేదు. ఎవరైనా దగ్గరకు రాబోతుంటే 'గుర్రు గుర్రు' మంటూ ముడుచుకుని పడుకుని, అప్పుడప్పుడూ ఓపిక తెచ్చుకుని నెమ్మదిగా పైకిలేచి వంటగది గుమ్మంవైపు చూడటం మాత్రం మానలేదు.

దాన్ని పదివేలు పెట్టి కొనితెచ్చింది భాస్కరమే అయినా.. దాని ఆలన పాలన చూసింది మాత్రం అమ్మాజీయే! కాబట్టి, అమ్మాజీ మీద కాస్త బెంగ పెట్టుకుందేమోనని అందరికీ అర్థమై.. కొన్నాళ్లకి మరిచి పోతుందిలే! అనుకున్నారు.

తొమ్మిదో రోజు ఓ అపరిచిత వ్యక్తి గేటు దగ్గరున్న కాలింగ్ బెల్ నొక్కి, గేటు తీసుకుని లోనికి వస్తుంటే.. అక్కడే గేటు పక్కన కట్టేసి ఉన్న స్నూబీ ఓపిక తెచ్చుకుని లేచి ఆ వ్యక్తి దగ్గరగా వచ్చి 'కుయ్ కుయ్!' అంటూ తన రెండు కాళ్లనూ పైకిచాపి, ఆ వ్యక్తి గుండెలపై వేసి ముఖం నాకి, మళ్లీ కిందకి వచ్చి అతని చేతిలో కనిపిస్తున్న తిను బండారాలను నోటితో లాక్కుని, అక్కడే అతన్ని ఎటూ కదలనీయకుండా అతని పాదాల మీద జారబడి కూర్చుని ఆబగా తినసాగింది. ఆ వ్యక్తి ఈ హఠాత్పరిణామానికి కాస్త బెదిరినా ధైర్యంగా నిలదొక్కుకుని, అక్కడే ఉయ్యాల బల్ల మీద కూర్చుని సెల్‌ఫోన్లో సోషల్ మీడియా వీడియోలు చూస్తూ బిజీగా ఉన్న పద్మ వైపూ, కూర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్న బల రామ్మూర్తి గారి వైపూ చూస్తూ...

'ఏమండీ..' అని పిలిచాడు. ఆ వచ్చిన వ్యక్తి.

'ఎవరు నువ్వు?' అన్నట్టు చూశారు వాళ్లు.

'నాపేరు రామచంద్రం. నేను కంటి హాస్పిటల్ నుండి నేరుగా ఇక్కడికి వచ్చాను. నాకు కంటిచూపు పోతే.. హాస్పిటల్లో ట్రీట్మెంటు తీసుకుంటున్నా.. ఎవరో ఒక డాక్టర్ ఉపన్యాసం విని, మీ ఇంట్లో ఉన్న ఓ దేవత తను బతికుండగా తన కళ్లను దానం చేసి, కళ్లు లేని వాళ్లకు ఉచితంగా పెట్టమని అప్లికేషన్ పెట్టి, ఎవరి అనుమతీ అవసరం లేదని, తను చనిపోగానే తీసుకుపొమ్మని రాయించి వేలి ముద్రేసి, అప్లికేషన్లో ఇదే తన అడ్రస్ అని రాయించిందట. ఆమెకి ఊపిరాడక ఇబ్బంది పడుతుంటే పక్కింటి వాళ్లు అబులెన్స్‌కి ఫోన్ చేశారట. వాళ్లు వచ్చేసరికే చని పోయిందట. ఆమె కంటి పొర నా కంటికి అమర్చి.. నాకు చూపు వచ్చేలా చేశారు. అందుకే ఆమె ఇంట్లో వాళ్లకు కృతజ్ఞతలు చెప్పుకొందామని చూపు వచ్చిన మరుక్షణం ఇక్కడికే వచ్చేశాను. తన కళ్లే కాదు.. తన విగత శరీరాన్ని

నిరుపయోగంగా కాల్చేయవద్దనీ, దానిలో ఎవరికైనా అవసరమైతే ఏ అవయవాన్నైనా తీసుకోమని, లేకుంటే మెడికల్ స్టూడెంట్ల కోసం హాస్పిటల్‌కి ఇచ్చేయమందట ఆ దేవత. అంతేకాదు తన పేరున పోస్టాఫీసులో కొంత డబ్బు ఉందనీ, తనుపోతే అది తీసి ఓల్డేజ్ హోమ్‌కి ఇమ్మని బతికుండగానే పేపర్ మీద రాయించి వేలిముద్ర వేసిందట.

అంతటి పుణ్యాత్మురాలు నివసించిన చోటు చూసి తరించాలని వచ్చాను. ఆమెతో నివసించిన ఈ ఇంటివారు కూడా ఎంతో గొప్పవారు నిపిస్తున్నది.

ఇన్నాళ్లూ మీ ఇంట్లో వెలిగిన వెలుగు నా కంటి వెలుగై నాకు జీవితాన్నిచ్చి బతకాలనే ఆశ పుట్టించింది. ఆమె కంటితో నేను లోకాన్ని చూసేలా చేసింది. మీరేకాదు మీలాగే మీ కుక్కకూడా మనసున్న దానిలా ఉంది. ఇది నా మీదకి ఎక్కేసరికి భయపడ్డాను. విచిత్రంగా నా ముఖాన్ని ముద్దాడి నేను మీకివ్వాలని తెచ్చిన స్వీట్స్ తీసుకుని తినటమేంటో.. అర్థం కాలేదు. సాధారణంగా ఈ జర్మన్ షఫర్డ్ జాతి కుక్కలు కొత్తవారిని కరవకుండా వదలవు. ఇప్పుడు కూడా ఇది నా పాదాల మీద కూర్చుని నా కాలు కదపనీయటం లేదెందుకో..' అన్నాడు ఆ వచ్చినతను.

అతను చెప్పింది విన్నాక అర్థమైంది పద్మకి. అమాయకంగా కనిపించే అమ్మాజీ ఎంత గొప్ప పని చేసిందో! తన శరీరంలో తొడ భాగాన్ని తృణ ప్రాయంగా కోసి దానంగా ఇచ్చేసిన శిబి చక్రవర్తి కంటే కూడా తన యావత్ శరీరాన్ని దానం చేసిన అమ్మాజీ గొప్పగా కనిపించింది. తను అమ్మాజీ రూపమే చూసింది. కానీ, ఆమెలోని మంచితనం చూడలేక పోయింది. స్నూబీ మాత్రం అమ్మాజీ రోజూ దానికి అన్నం పెట్టేటప్పుడు ఆమె కళ్లలో ఆప్యాయత చూసి ఆమెపై ప్రేమ పెంచుకుందనుకుంటా.. ఆ కంటి ఆనవాళ్లు మళ్లీ చూసేసరికి దాని బెంగపోయింది. తినాలని ఆశ పుట్టింది.

ఛఛ.. ఏమిటి తన బుద్ధి. రెండేళ్ల పరిచయానికే తనకన్నం పెట్టే అమ్మాజీని అభిమానించి తను చనిపోతే తిండి మానేసి బెంగపడిన కుక్కకున్న విశ్వాసం, పదేళ్లుగా అమ్మలా ఆప్యాయంగా వండి వడ్డిస్తున్న అమ్మాజీని, మనిషి పుట్టుక పుట్టిన తనెందుకు అభిమానించలేక పోయిందో తలుచు కుంటుంటే సిగ్గుగా అనిపించి.. తల వంచుకున్న పద్మకి తనకెప్పుడూ నేలకట్టడున కనిపించే అమ్మాజీ ఒక్కసారిగా 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు వామనవతారంలో విష్ణుమూర్తిలా పెరిగిపోతుంటే.. తలఎత్తి చూడగా ఆకాశమంతా అనంతంగా అమ్మాజీయే కనిపించేసరికి.. తలతిప్పి మామగారి వైపు చూసింది.

అప్పటికే వచ్చిన మనిషివైపూ స్నూబీ వైపూ మార్చిమార్చి చూస్తున్న బల

రామ్మూర్తి గారు, తనను స్నూబీతో పోల్చుకోగా.. ఆయన మనసు భారమయింది. పదేళ్లుగా ఇంటి మనిషిలా.. మనిషిమనిషికీ నచ్చినట్టు వండి వడ్డించిన అమ్మాజీ చనిపోతే కనీసం ఒక్కపూట పస్తుండి సంతాపం చూపించకపోగా.. తిండి కోసం వెంపర్లాడానన్న అపరాధ భావం మనసంతా నిండిపోగా, వచ్చిన మనిషిని లోనికి తీసుకెళ్లి, మర్యాదచేసి ఆ వ్యక్తి కళ్లలో అమ్మాజీని చూస్తూ.. అప్పుడప్పుడూ వస్తుండమని చెప్పి పంపించారు.

పూజలు, పునస్కారాలు, పురాణాలు, పుణ్య క్షేత్రాలు కాదు.. మనిషిని దేవుడి సరసన నిలబెట్టేవి.

మనిషి మరణించినా మరో మనిషికి బతుకునిచ్చే గుప్తదానం, అవయవ దానమే దేవుడికి దగ్గరయ్యేలా చేసి మనిషిని దేవతగా నిలబెడుతుందని, మరణించినా మళ్లీ మనుషుల మధ్య చిరంజీవిగా ఉంచగలదని, అమ్మాజీ గురించి పూర్తిగా అర్థమైన పద్మ.. ఆరోజే తను కూడా ఓ మంచి నిర్ణయం తీసుకుంది.

* * *

## సౌందర్య తేజ కోరా

రాసిన రెండు కథలకూ నమస్తే తెలంగాణ – ముల్కనూర్ ప్రజాగ్రంథాలయం కథల పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు యువ రచయిత్రి సౌందర్య తేజ కోరా. కథల పోటీ – 2022లో 'మట్టి వాసన', 2023/24లో 'చిరంజీవి' రెండు కథలూ రూ. 3వేల బహుమతికి ఎంపికయ్యాయి. రచయిత్రి స్వస్థలం భద్రాచలం. తల్లిదండ్రులు దుద్దుంపూడి అనసూయ – చంద్ర శేఖర్. బాల్యం, విద్యాభ్యాసం రాజమండ్రిలో గడిచింది. బెంగళూరులో ఎంబీఏ చదివి, ప్రస్తుతం అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. అమ్మ దుద్దుంపూడి అనసూయ, పెద్దమ్మ జాస్తి రమాదేవి ఇద్దరూ రచయిత్రులే! దాంతో బాల్యం నుంచీ కథలు చదవడం, రాయడంపై ఇష్టం పెంచుకున్నారు. వారి ప్రోత్సాహంతోనే కథా రచనలోకి అడుగుపెట్టారు. అయితే, ఉద్యోగబాధ్యతల వల్ల కథలు రాయడానికి సమయం కేటాయించలేక పోతున్నారు. తన చిన్నతనంలో తాతగారి ఒళ్లో కూర్చొని విన్న ఆయన వ్యవసాయ అనుభవాలనే.. 2022లో 'మట్టి వాసన'గా పాఠకుల ముందుకు తీసుకొచ్చారు. తాజాగా, కొన్ని వాస్తవ సంఘటలను స్ఫూర్తిగా తీసుకొని 'చిరంజీవి' కథను మలిచారు. తన కథలను బహుమతికి ఎంపిక చేసిన నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం నిర్వాహకులకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

**–78998 53581**

# మొ'గే'డు



**పి. చంద్రశేఖర అజాద్**

పెళ్లి చూపులప్పుడు పరిమళను చూశాడు అనంత్.

అప్పుడు వారు మాట్లాడుకున్నదేం లేదు. ఇద్దరి కళ్లూ మాట్లాడుకున్నాయి.

ఇప్పుడు పెళ్లి జరుగుతోంది. ఇద్దరి మధ్య అడ్డుతెర కట్టారు. అయినా ఆమెను చూడాలని తాపత్రయం కలగటం ఏమిటో తనకే అర్థం కాలేదు. పరిమళ కూడా అలాంటి స్థితిలోనే ఉందా? అనిపించింది అతనికి.

ఓసారి తెర కిందకు జారింది!

అప్పుడు పరిమళను చూశాడు. అనుమానం వచ్చింది.

ఆమె ముఖంలో ఏమాత్రం సంతోషం కనిపించటం లేదు.

మెడలో మూడుముళ్లు వేస్తున్నప్పుడు మరోసారి నిశితంగా చూశాడు. ప్రసన్నభరితంగా లేదు. పరిమళకి ఈ పెళ్లి ఇష్టం లేదా! మరెందుకు పెళ్లి పీటల మీదకు రావటం? అమ్మానాన్నలు బలవంతంగా ఈ వివాహం జరిపిస్తున్నారా? అయినా తను చదువుకుంది. ఆధునిక స్త్రీ. తనకు అంగీకారం లేకుండా మరొకరితో బతుకు పంచుకోవాల్సిన అవసరం లేదు. ఇది ఓ జీవితకాలం కలిసి చేయాల్సిన ప్రయాణం కదా!

మంత్రాలు వినిపిస్తున్నాయి. ఆమె పూలజడను పైకెత్తి పట్టుకున్నారు. తను ఆలోచనల్లో ఉంటే దృశ్యం రసాభాస అవుతుంది. అయినా ఇదంతా తన అనుమానం కావచ్చును కదా!? అనుకున్నాడు. భజంత్రీలు మోగుతున్నాయి. ఎలా అయితే అలా అవుతుంది. మంచి భార్య దొరకటం అదృష్టం అంటారు. రేపటి నుండి ఎలాంటి స్థితినైనా ఎదుర్కోవాల్సిందే! అనుకుంటూ.. మూడుముళ్లు వేశాడు అనంత్.

* * *

పరిమళ ఆలోచనల్లో ఉంది.

తనకి లాస్య మాటలు గుర్తుకు వస్తున్నాయి.

'పరీ.. ఇప్పటివరకు నేను చచ్చేంత బిజీగా ఉన్నాను. అందుకనే ఫోన్‌కూడా చేయలేకపోయాను. నేనూ, సుమనా, కీర్తి.. నీ పెళ్లికి వచ్చి అల్లరల్లరి

చేయాలనుకున్నాం. కానీ, సారీ.. అందరం ఇక్కడే ఇరుక్కుపోయాం. ఒక్కరం కూడా రాలేకపోతున్నాం.'

'ఏం చేస్తాను. అది నా బ్యాడ్‌లక్ అనుకుంటాను.'

'ఆ విషయం మాట్లాడటానికే ఫోన్ చేశాను. నీది నిజంగానే బ్యాడ్‌లక్ కావచ్చు.'

'అదేంటి?'

'నీ శ్రీవారి పేరేంటి?'

'అనంత్!'

'నువ్వు అతనితో మాట్లాడావా?'

'ఏ విషయం గురించి?'

'నీకు పెళ్లి చూపులయ్యాయి కదా.. అప్పుడు మీరు విడిగా మాట్లాడుకోలేదా?'

'లేదు లాస్యా?'

'నాన్సెన్స్.. ఈరోజుల్లో ఎవరైనా అలాంటివారు ఉన్నారా? తర్వాతైనా అతను నీ ఫోన్ నెంబర్ తీసుకున్నాడా? మీరు మాట్లాడుకున్నారా?'

'లేదని చెబుతున్నాను కదా. అయినా పెళ్లికి ముందు ఏం మాట్లాడుకుంటారు. మాట్లాడుకున్నంత మాత్రాన ఒకరికొకరు అర్థం అవుతారా?'

'అందుకని తల తాకట్టు పెడుతున్నావా? అసలేం మాట్లాడకుండా పెళ్లి పీటల మీదకు ఎక్కటానికి నువ్వు బి.సి. కాలంనాటి మహిళవా. కనీసం ఇద్దరూ కలిసి ఓ ఈవెనింగ్ చాయ్ తాగటానికి.. గుర్తుంచుకో చాయ్ మాత్రమే! బీర్ తాగటానికి వెళ్లారా అనటం లేదు'

'లాస్యా.. అల్లరి చేయటం ఆపి అసలు విషయంలోకి రా' అంది పరిమళ.

'అనంత్ అందగాడు. అందుకే నువ్వు పడిపోయావు. నాకు మీ పెళ్లి గురించి చెప్పావు. ఇప్పుడతని ఫొటోని చూశాను. షాకయ్యాను!'

'ఎందుకు షాకవటం. అనంత్ నీకు తెలుసా? అతని వెనకాల ఏమైనా కథ ఉందా?'

'అవన్నీ తీరిగ్గా చెబుతాను. ముందు ఈ పెళ్లి జరగకుండా చూసే అవకాశం నీకు ఉందా?'

'లాస్యా.. నీ మాటలు వింటుంటే దీని వెనకాల పెద్ద కారణమే ఉండి ఉంటుంది. అది తెలియకుండా, అమ్మానాన్నలను ఎలా ఒప్పించగలను? నువ్వు నా దగ్గరికి వెంటనే ఎలా అయినా రాగలవా!'

'అది కుదరదనే కదా ఈ గోలంతా!' అంది లాస్య.

'అసలు విషయం చెప్పు లాస్యా!'

'అనంత్ 'గే' కావచ్చు!'

'గే నా!' పరిమళ నిర్ఘాంతపోయి అంది.

'యా! అవన్నీ తర్వాత చెబుతాను. నువ్వు ఇంట్లో నుంచి వెళ్లిపో. ముందు పెళ్లి రద్దు అవుతుంది. తర్వాత సంగతి చూద్దాం'

'నువ్వు మతుండే మాట్లాడుతున్నావా? అప్పుడు మా కుటుంబం పరువు, నా భవిష్యత్తూ ఏమవుతుందో ఆలోచించావా? అయినా అనంత్ 'గే' అని ఏ ఆధారంతో చెప్పగలవు?'

'గే.. కాకుంటే నపుంసకుడు!'

'లాస్యా!' నెత్తి మీద పిడుగుపడినట్లు, చివరి మాటల్లా ఉన్నాయి.

'నీకు సమయం లేదు. అయినా పర్వాలేదంటే నీ ఇష్టం. నీ జీవితం నీది. ఓ 'గే'తో లేదా 'నపుంసకుడి'తో జీవితాంతం బాధలు పడతావా? రెక్కలు విప్పుకొని స్వేచ్ఛగా విహరిస్తావా! నిర్ణయం నీది. ఇప్పటికి నాకు పది మిస్సేడ్ కాల్స్ ఉన్నాయి. బై!' అని కట్ చేసింది.

పరిమళ ఇప్పటివరకు ఇలాంటి కఠినమైన సందర్భాన్ని ఎదుర్కోలేదు. లాస్యతోపాటు తన మిత్రబృందం అల్ట్రా మోడ్రన్ అమ్మాయిలు. సిగరెట్లు తాగుతారు. వైన్ నుండి హాట్‌డ్రింక్స్ తీసుకునేవారున్నారు. ఆడా – మగా సంబంధాల గురించి వారు మాట్లాడుకునే మాటలు వింటే.. పాతతరం వారికి గుండెలు బద్ధలైపోతాయి. వారిలో లిబరల్‌గా ఉండేది తనే. కొత్తలో బలవంతం చేసేవారు. అప్పుడు స్పష్టంగా చెప్పింది.

'నేను బెంగళూరు రావటానికి కారణం చదువుకోవటానికి. ఇక్కడికి వచ్చేముందు నాకు చాలామంది చెప్పారు. ఆడపిల్లలు కూడా డ్రగ్స్ తీసుకుంటున్నారని. మా అమ్మానాన్నలు ఒకేమాట చెప్పారు. 'నీకు చదువా? ప్రేమా? అక్కడ పిల్లల గురించి అనేకం వింటున్నాం. మేం ఆంధ్రాలో ఉండి నువ్వు అక్కడ ఏం చేస్తుంటావో తెలుసుకోలేం. బతుకు నీది. బంధం నీది. దాన్ని చక్కగా మలుచుకుంటావో.. కుక్కలు చింపిన విస్తరిలా చేసుకుంటావో నీ ఇష్టం!' అన్నారు. అందుకని నన్ను మీరు బలవంతం చేయొద్దు'.

'వ్వావ్.. పరిమళాలు వెదజల్లావ్. ఓకే.. నీ జోలికి మేం రావటం లేదు. కనీసం నీ పెళ్లికైనా పిలుస్తావా?' అందో అమ్మాయి.

'నేనూ అదే అడుగుతున్నాను.'

'పరీ.. నేను మగవాళ్లని చేసుకోను. యామే లెస్బియన్' అంది.

మరొకామె..

'నేను సింగిల్ మదర్‌గా ఉంటా!' అంది.

ఆశ్చర్యంగా చూస్తుంటే...

'పరిపరి విధములుగా ఆలోచించకు. ఇవన్నీ ఇప్పుడు చట్టం ఆమోదించినవి' అన్నారు మరొకరు.

అవన్నీ గుర్తుకు వస్తున్నాయి. లాస్య హాస్యం కోసం ఇదంతా చేయదు. ఏదో ఒక ఆధారం ఉంటుంది. అయినా తను ఎంత సంప్రదాయబద్ధంగా ఉన్నా.. 'గే' తో, 'నపుంసకుడి'తో ఎలా ప్రయాణం చేయగలదు! అలా అని ఇందులో వాస్తవం తెలియకుండా ఎదుటివారిని ఏ రకంగా గాయపరచగలదు!

ఎవరి జీవితం వారిదే. అది ఓ రెండు కుటుంబాలతో, సమాజంతో కూడా ముడిపడి ఉంది కదా అనుకుంది. ఎటూ తేల్చుకోలేక మథనపడింది. అప్పుడు తనకు తనే సమాధానం చెప్పుకొంది.

'అనంత్ నిజంగానే ఆ రెండిటిలో ఏ ఒక్కటి అయినా ఆ ప్రయాణం సాగదు. అతని నుండి విడిపోయే అవకాశాన్ని చట్టమే కల్పించింది. తను ఏ నిర్ణయం తీసుకున్నా బాధే. అందుకని అదేదో నేనే తాత్కాలికంగా అనుభవిస్తాను. ఈ వేదనను రెండు కుటుంబాలకు పంచను' అనుకుంది.

పెళ్లి పీటల మీద కూర్చున్నా ఈ ఆలోచనలు పరిమళని అంటి పెట్టుకునే ఉన్నాయి. తనలోని ఆందోళనను కప్పిపుచ్చటానికి విశ్వ ప్రయత్నం చేసింది. ఆమెకు సాధ్యం కాలేదు.

'అమ్మాయీ' అని అమ్మ పిలవటంతో ఆలోచనలకు తెరపడింది.

* * *

తిరిగి అదే సందిగ్ధత!

శోభనం గురించి చెప్పినప్పుడు ఓ నెల రోజులు వాయిదా వేశాడు అనంత్. ఇంట్లో వారికి అదేమంత పట్టించుకోదగ్గ విషయం అనిపించలేదు. అనంత్‌కి చెందిన ఓ ప్రాజెక్ట్ చివరి దశలో ఉంది. దానికి అతను లీడర్. అది సమయానికి అందించాలి. విజయవంతంగా పూర్తి అయిన అనంత్‌కి ప్రమోషన్లు ఉంటాయి.

అతనిప్పుడు ముంబైలో పని చేస్తున్నాడు. అక్కడికి వెళ్లే ముందు పరిమళను కలుసుకున్నాడు. ఇద్దరి మధ్య కొంతసేపు మాటలు లేవు.

'నేను ముంబై వెళ్తున్నాను పరిమళగారూ! మనకి పెళ్లయిన వెంటనే ఇలా వెళ్లటం కాస్త నిరుత్సాహంగా ఉంటుందని నాకు తెలుసు. అసలు ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాకే పెళ్లి చేసుకుంటానని అమ్మా నాన్నలకు ముందే చెప్పాను. మళ్లీ ముహూర్తాలు లేవని ఒప్పించారు. అందుకని తప్పలేదు'.

'అంతేనా?' అంది పరిమళ.

ఆశ్చర్యంగా చూశాడు. ఆ తర్వాత అడిగాడు..

'ఎందుకలా అడిగారు?'

'నా ఉద్దేశం మీ అమ్మానాన్నల కోసమే ఈ పెళ్లి చేసుకున్నారా అని'

'అది కూడా ఉంది. నాకు మీరు నచ్చారు. ఇది కూడా కారణం'

చిన్నగా తలూపింది.

'మీరు కూడా..' అని ఆగాడు.

'అడగండి' అంది పరిమళ.

'మీ అమ్మా నాన్నల కోసం చేసుకున్నారా ఈ పెళ్లిని?' అతను పరిమళని నిశితంగా చూస్తూ అడిగాడు.

పెళ్లిరోజు ఆమె వదనం ఇంకా గుర్తుకు వస్తూనే ఉంది.

'వారి కోసం.. నా కోసం కూడా' అంది తనూ అతని కళ్లల్లోకి చూస్తూ.

'సంతోషం! మనం తొందరలో ప్రశాంతంగా మాట్లాడుకుందాం. మీకు కొన్ని విషయాలు చెప్పాలి. ఇప్పుడు నా మనసంతా ప్రాజెక్ట్ మీదే ఉంది'

అనంత్ వెళ్లాక పరిమళ అనుకుంది!

'ఏం చెబుతాడు. లాస్య అన్నట్లు నేను..'

పరిమళ బాధగా కళ్లు మూసుకుంది.

* * *

పరిమళ బెంగళూరుకు వచ్చింది. బిజీ షెడ్యూల్‌లోనూ తనకోసం ఒక రోజును కేటాయించింది లాస్య.

ఇప్పుడు లాస్య గదిలో వారిద్దరూ ఎదురెదురుగా ఉన్నారు.

'అయ్యిందా శోభనం?' అదోలా అంది లాస్య.

'కాలేదు' ముభావంగా చెప్పింది పరిమళ.

'అందుకే ముందుగానే హెచ్చరించాను. అఫ్‌కోర్స్.. అది చివరి నిముషంలో! నువ్వే ధైర్యం చేయలేకపోయావు. ఇప్పుడేం చేయాలనుకుంటున్నావు?' అడిగింది లాస్య.

'నేనింకా అతన్ని 'గే' అనో, 'నపుంసకుడు' అనో కన్‌ఫర్మ్ చేయలేదు'

'సో..' అంది లాస్య ముఖం చిట్లించి..

'అసలు ఓ వ్యక్తి గురించి అలాంటి నిర్ణయానికి రావటానికి నీకున్న ఆధారం ఏంటి? అనంత్ నీకు ముందే తెలుసా? పోనీ నీ, నా ఫ్రెండ్స్ సర్కిల్‌లో ఎవరికైనా అనంత్‌తో అంత దగ్గరి పరిచయం ఉందా? నా జీవితం నాశనం అవుతుందని అనుకున్నప్పుడు ఓ అరగంట నాకు ఇవ్వలేకపోయావా! జీవితం అంటే అంత లోకువా?'

లాస్య ముఖం వివర్ణమైంది.

'ఒకవేళ అదే నిజం అనుకుని నువ్వు చెప్పినట్లు చేస్తే.. ఓ మగవాడి జీవితం రోడ్డున పడేది కదా?' అంది పరిమళ.

'సో.. అనంత్ మగవాడు అంటున్నావు!'

'ఆ తొందరే వద్దంటున్నాను. పెళ్లిపీటల మీద అనంత్ నన్ను చూసి కంగారుపడ్డాడు. అప్పుడు తనకి రెండు రకాల అనుమానాలు వచ్చి ఉంటాయి. మొదటిది.. నేను ఇంకెవరినన్నా ప్రేమించి ఉంటానని. రెండవది నేను కూడా ఓ స్త్రీతో కలిసి బతకవచ్చుని!'

'అలా అనుకున్నాడా?'

'మనుషుల ముఖం చూసి ఎవరు 'గే'నో ఎవరు 'లెస్బియనో' చెప్పగలమా? ఇప్పుడు ఇలాంటివారి సంఖ్య పెరుగుతోంది. నీ మాటల్లో అది చట్టబద్ధం కదా!?'

'నన్ను విమర్శించటానికి వచ్చావా?'

'పజిల్ ఇంకా పూర్తి కాలేదు. అనంత్ ఏ రకానికి చెందినవాడో ఇంకా తెలియదు. మా శోభనం ఇంకా జరగలేదు' అంది పరిమళ.

'అతను వాయిదా వేస్తున్నాడంటే అర్థం కావటం లేదా?' అంది లాస్య.

'సావధానంగా వినటం నేర్చుకో లాస్యా? మిగతా చర్చ అనవసరం. అనంత్ ఎలాంటి వాడైనా కావచ్చు. అతనిలో నువ్వు చెప్పిన ఏ లక్షణం ఉన్నా.. రేపటి నా జీవితం గురించి నాకో అవగాహన ఉంది'

'ఇప్పుడు నేనేం చేయాలి?'

'అనంత్ మీద నువ్వు చేసిన ఆరోపణలకు నాకు ఆధారాలు చూపించాలి. అవి చెప్పకపోతే నిజంగా నాకు అన్యాయం చేసిన దానివి అవుతావు. ఇంకోమాట కూడా అంటున్నాను. నువ్వు నా అనుకూల శత్రువువి అనుకుంటాను' అంది పరిమళ.

'పరీ.. నేను చేసింది మంచో చెడో నాకు తెలియదు. అనంత్ నాకు పరిచయంలేని వ్యక్తి. ఆ రోజు అతని ఫొటో చూస్తున్నాను. మీ ఇద్దరికీ శుభాకాంక్షలు పంపాలనుకున్నాను. అప్పుడు నా కొలీగ్ అతని ఫొటోని చూసి అడిగింది. ఎవరితను అని. నా ఫ్రెండ్ పెళ్లి చేసుకోబోతోంది అన్నాను. వెంటనే 'మైగాడ్!' అంది. 'ఇతను నీకు తెలుసా!?' అని అడిగాను. 'హవ్ కెన్ ఐ ఫర్‌గెట్ హిమ్!' అంది. అప్పుడు ఆమె చెప్పిన మాటలు నీకు చెప్పాలి' అంది లాస్య.

'తర్వాత నువ్వు మాట్లాడలేదా?'

'తను ముంబైలో ఉంటుంది. అక్కడ నుండి రకరకాల పనులు. కాంటాక్ట్ చేయటం కుదరలేదు'

'ఆమె పేరు నాకు కావాలి. తన ఫొటో ఉందా?'

'ఉంది. నీకు పంపిస్తాను. అయినా నువ్వు మాట్లాడవద్దు. నేను

మాట్లాడతాను’ అంది లాస్య.

పరిమళ తలూపింది.

* * *

నెలన్నర గడిచిపోయింది.

ఆరోజు శోభనం ఏర్పాటు చేశారు.

ఉద్వేగంతో గదిలోకి అడుగుపెట్టింది పరిమళ.

ఆమె చేతులు అందుకుని మంచంమీద కూర్చోబెట్టాడు అనంత్.

‘పరిమళా.. మనం ఒకటి కావటానికి ఇన్నిరోజుల సమయం తీసుకుంది. ముందు నాకు ఓ విషయంలో నీ వివరణ కావాలి. నా గురించి నీ అభిప్రాయం ఏమిటి? పెళ్లి జరిగినప్పటి నుంచి నువ్వు ఎందుకంతగా అదోలా ఉంటున్నావు. నేనంటే ఇష్టం లేకపోయినా, మరేదో కారణం ఉన్నా చెప్పు. మనం స్నేహితుల్లా విడిపోదాం’ అన్నాడు అనంత్.

పరిమళకు మళ్లీ ఎక్కడో అనుమానం.

‘మాట్లాడు పరిమళా!’ అన్నాడు అనంత్.

అప్పుడు పరిమళ తన ఫోన్ తీసుకువచ్చి..

‘ఈ అమ్మాయి మీకు తెలుసా?’ అంది.

అనంత్.. ఆమెను చూశాడు. అతని ముఖంలో కనిపిస్తున్న మార్పులను గమనిస్తోంది పరిమళ.

‘తెలుసు. మరిచిపోవటం కష్టమే!’ అని ఫోన్ పక్కన పెట్టాడు.

‘ఈమె, మరో స్నేహితురాలు, నేనూ కలిసి ఓ గదిలో ఆ రాత్రి ఉండాల్సి వచ్చింది. వాళ్లంతా మోడ్రన్ గాల్స్. అసలు అలాంటి సందర్భం రావటమే చిత్రం. ఓ పని మీద వెళ్లాను. అక్కడ హోటల్ గదులు లేవు. ఎడ్జస్ట్ కావాల్సి వచ్చింది. ఆరోజు ఈమె నన్ను తన కోరిక తీర్చమంది. నేను ఒప్పుకోలేదు. ‘ఇందులో తప్పేం ఉంది. ఇది ఫిజికల్ నీడ్ కాదా!?’ అంది. నన్ను గాఢంగా హత్తుకుంది. కవ్వించింది. నన్ను నేను నిగ్రహించుకోవటం కష్టమైంది. అప్పుడు నేనే తనతో చెప్పాను.. నేను ‘గే’ అని’.

ఆ మాటలు వింటూనే పరిమళ కళ్లు పెద్దవయ్యాయి.

‘నా దిండు తీసుకుని ఆ గదిలోంచి బయటికి వెళ్లిపోయాను. నేను ఈ తరానికి చెందినవాణ్ని కాకపోవచ్చు. పెళ్లి పట్ల, దాంపత్య జీవితం పట్ల నాకు కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. భార్యాభర్తల అనుబంధం గొప్పది. ఇంకొకరు వారి మధ్యకు రాకూడనిది. పవిత్రమైనది. ఎవరు ఏ రూల్స్ బ్రేక్ చేసినా అది వారిష్టం. నేను ఇంకొకరిని విమర్శించాలనుకోను. ‘గే’లు, లెస్బియన్స్, ట్రాన్స్‌జెండర్లు..

అందరూ మనుషులే' అన్నాడు అనంత్.

పరిమళ అప్పుడు మాట్లాడటం మొదలుపెట్టింది. అనంత్ చిరునవ్వుతో వింటున్నాడు. ఆమె చెప్పటం పూర్తయింది. పరిమళను దగ్గరకు తీసుకున్నాడు.

'నన్ను 'గే' అనే పదమే కాపాడింది. ఇంక 'నపుంసకుడు' అన్న బిరుదుని కూడా వదిలించుకోవాలని అనుకుంటున్నాను నువ్వు సహకరిస్తే' అన్నాడు చెవిలో.

పరిమళ అతని హృదయం మీద వాలిపోయింది.

రాత్రి కరుగుతూనే ఉంది.

* * *

ఫోన్ అందుకుంది లాస్య.

'లాస్యా.. మా శోభనం దివ్యంగా జరిగిపోయింది. నీ కొలీగ్ కోరుకునే మగాడు అనంత్ కాకపోవచ్చు. కానీ, అతను ఓ మంచి భర్త. భార్యను మాత్రమే ప్రేమించి, తనతోనే జీవితాంతం ప్రయాణం చేయాలనుకునే పాతకాలపు అబ్బాయి. ఐ లవ్ హిమ్' అని ఫోన్ కట్‌చేసింది పరిమళ.

***

## పి. చంద్రశేఖర అజాద్

పూర్తి జీవితాన్ని సాహితీసేవకే అంకితం చేసిన రచయిత.. పి. చంద్రశేఖర ఆజాద్. నాలుగున్నర దశాబ్దాలుగా అనేక ప్రక్రియల్లో సాహిత్య సాగు చేస్తున్నారు. ఈయన స్వస్థలం గుంటూరు జిల్లా వెల్లటూరు. ఏపీ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా వీఆర్ఎస్ తీసుకొన్నారు. ఇప్పటివరకూ 850కి పైగా కథలు, 87 నవలలు, 18 నవలికలు, 5000 టీవీ ఎపిసోడ్స్, టెలీ ఫిల్మ్స్ రాశారు. రేడియో, సినిమా, సాహితీ సంస్థల నిర్వహణతోపాటు కొన్ని సీరియల్స్, ఒకటి రెండు సినిమాల్లోనూ కనిపించారు. 2024లో 'మాయా లోకం' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు. 'అడవి పూలు' టెలీ ఫిల్మ్ సంభాషణలకు రెండు నంది అవార్డులు అందుకున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించిన నాలుగు టెలీ ఫిలిమ్స్‌కు మూడు స్వర్ణ నందులు, ఓ వెండి నంది స్వీకరించారు. 'భారతి' పిల్లల సినిమాకు స్వర్ణ నంది దక్కింది. ఇవేకాకుండా.. కళారత్న (హంస), ఉగాది పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి అవార్డులు దక్కించుకున్నారు. సినిమా రంగంతోపాటు బుల్లితెరపై మెరిసినా.. సాహిత్యాన్ని మాత్రం వదలలేదు. ఓపిక ఉన్నంతకాలం రచనలు చేస్తూనే ఉంటానని చెబుతున్నారు చంద్రశేఖర ఆజాద్.

–92465 73575

# నాన్న టికెట్



**మంజీత కుమార్**

చల్లని పిల్ల తుంపరలు వరండాను తడిపేస్తున్నాయి.

వాలు కుర్చీలో కూర్చుని వర్షాన్ని చూస్తుంటే.. అదో హాయి!

ఇంతలో.. ఒక చేతిలో వేడివేడి పకోడీల ప్లేటు, మరో చేతిలో గ్లాసెడు టీ తీసుకొచ్చింది మధురమ్మ. భర్త అలవాట్లు, అభిరుచులు ఆమెకు తెలియంది కావుగా.

'ఇదిగోండి మాస్టారు. నేలపై కూర్చుంటున్నాను. మాటిమాటికీ నన్ను పైకి లేపకండిక'..

'అన్నీ అందించేశాను!' అన్నట్టు కనుబొమలు ఎగరేస్తూ అన్నది మధురమ్మ.

'సర్లే అమ్మడు. ఇలా వాన పడటం.. అలా వేడివేడి నూనెలో పకోడీలు ఈదడం ఈనాటిదా!? మన పెళ్లయిన నాటినుంచి చూస్తున్నదేగా! అయినా ఇన్నిన్ని పకోడీలు చేస్తావు.. మొహమాటానికా అన్నట్టు ఒక్కటో రెండో తింటావు ఎందుకని? డైటింగా ఏమిటీ?' వేళాకోళంగా అన్నాడు కృష్ణలీలయ్య.

'డైటింగా నా ముఖమా! ఏమిటోనండి ఆ నూనెవాసన అంతసేపు పీల్చుకునేసరికి తినాలన్న ఆశపోతుంది. అందుకే తినలేను. అయినా మీరు ఆవురావురుమంటూ ఆరగిస్తుంటే నా కడుపు నిండిపోతుందిలెండి' అని సిగ్గుతో తలదించుకుంది.

'అబ్బో.. పడుచుపిల్ల వచ్చింది. కొత్త పెళ్లికూతురిలా ఎలా సిగ్గుపడుతున్నావో చూడు' అని భార్యను ఇంకాస్త ఏడిపించాడు కృష్ణలీలయ్య.

'చాల్లెండి .. పెళ్లయి ఇన్నేళ్లు కావస్తున్నా ఇంకా మీ చిలిపితనం పోలేదు' భర్తను సూటిగా చూడలేక నేలపై కాలి వేలితో రాస్తూ అంది మధురమ్మ.

'నా పేరే కృష్ణుడు కదా అమ్మడు' అని తియ్యగా నవ్వాడు కృష్ణలీలయ్య.

అలా ఇద్దరూ వర్షాన్ని ఆస్వాదిస్తూ హాయిగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకొంటూనే ఉన్నారు. అలా ఎంతసేపు కూర్చున్నారో వారికే తెలియదు. వాన ఎప్పుడు ఆగిపోయిందో గమనించనే లేదు.

* * *

గోవర్ధనపురంలో నివసించే మధురమ్మ, కృష్ణలీలయ్యలకు ఐదుగురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు. అందరూ చదువులని విదేశాలకు వెళ్లి, పెళ్లిళ్లు చేసుకుని అక్కడే స్థిరపడిపోయారు. రెండుమూడేళ్లకు ఓసారి వచ్చి నెలరోజులు అమ్మానాన్నలతో గడిపి వెళ్లిపోతుంటారు. వారు వచ్చివెళ్లినప్పుడు ఇల్లంతా సందడి. ఆ తర్వాత మామూలేగా.

అయితే పిల్లల వైఖరి కృష్ణలీలయ్యకు అంతగా నచ్చేదికాదు. అమ్మతో అవీఇవీ చేయించుకోవడం, తినడం.. మళ్లీ ఏవేవో ప్యాకింగ్లు గట్రా చేయించమనడం.. వెరసి అందరూ విమానాలు ఎక్కి వెళ్లిపోయాక.. మధురమ్మ అనారోగ్యంతో మంచం ఎక్కడం.. ఇలాగే ఉండేది.

'ఇప్పటికే పిల్లల కోసం చేసింది చాలు! నీ గురించి కాస్త శ్రద్ధ తీసుకో!' అంటూ అప్పుడప్పుడు భార్యను కూడా ఈ విషయంలో మందలిస్తూ ఉండేవాడు. కానీ, మధురమ్మ అమ్మ మనసు అవన్నీ పట్టించుకునేదికాదు.

ఇలా ఉండగా ఓసారి కూతురి దగ్గరి నుంచి ఫోన్ వచ్చింది.

'అమ్మా! నాకు ఏడో నెల. నీకు కావాల్సిన పాస్‌పోర్టు, వీసా అంతా సిద్ధం చేశాను. వచ్చేవారమే వచ్చేయ్. నాకు తోడుగా ఉందూగానీ' అని క్లుప్తంగా విషయం చెప్పింది.

'ఏడో నెలా!? ఈ శుభవార్త ఇప్పుడా చెప్పేది. కంగ్రాట్స్ తల్లీ! ఆరోగ్యం ఎలా ఉంది' అని ఎంతో ప్రేమగా అడిగింది మధురమ్మ.

'అంతా ఓకే గానీ.. నేను ఓ లిస్టు పంపుతాను. వచ్చేటప్పుడు ఆ సామాన్లన్నీ వెంట తీసుకుని వచ్చేయ్. సరే ఉంటా' అని ఫోన్ పెట్టేస్తుండగా..

'వస్తాను గానీ.. ఈ వయసులో నాన్నను ఒంటరిగా వదిలి రావాలంటే?' అని ఏదో చెప్పబోతుండగా కూతురు కయ్యిమంది.

'ఇప్పుడు నాన్న ఇక్కడికి వచ్చి చేసేదేముంది. నువ్వంటే పాపను చూసుకుంటావు. దండగ ఖర్చులు ఎందుకు చెప్పు' అంటూ ఫోన్ పెట్టేసింది.

ఇదంతా వార్తాపత్రిక చదువుతున్నట్టు నటిస్తున్న కృష్ణలీలయ్య హాల్లో కూర్చుని లీలగా వింటూనే ఉన్నాడు. భార్య బాధగా ముఖంపెట్టి బెడ్రూమ్ నుంచి బయటకు రావడం చూశాడు.

'ఆ.. ఎప్పుడు అమ్మడూ అమెరికా ప్రయాణం' అని వెక్కిరించాడు.

'అంటే.. అదీ' అని భార్య నాన్చడం చూసి సన్నగా నవ్వుకున్నాడు.

'ఏ మాటకామాట చెప్పుకోవాలోయ్. నేను మగాడిగా పుట్టినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇదిగో నీలాగా ఆయా పని తప్పింది' అంటూ పగలబడి నవ్వాడు.

'ఛీ ఊరుకోండి. మన పిల్లల సంతానానికి మనం కాకపోతే ఎవరు చేస్తారండీ' అని భర్తను పైకి మందలించినా.. తన బతుకు అలాగే మారినందుకు చిరాకేసింది మధురమ్మకు లోలోపల.

'అవునా.. అయితే నీ కూతురికి చెప్పి నీకు, నాకు ఇద్దరికీ టిక్కెట్లు బుక్ చేయమను. ఏమంటుందో చూద్దాం' అని తెల్సిన జవాబే అయినా ప్రశ్నించాడు.

'వాళ్లను మాత్రం ఏం అనగలమండి. వాళ్ల ఖర్చులు వాళ్లకు ఉంటాయి' అని భర్తతో పైకి అన్నా కూడా.. మనసులో మాత్రం ఆ కోరిక ఆమెకు లేకపోలేదు.

'అంటే.. ఇప్పుడు వెళ్తానంటావు అంతేనా!? రెండేళ్ల క్రితం వెళ్లావు గుర్తుందా. తమరి వారసుడి తొలి సంతానానికి సేవ చేయడానికి. అక్కడ వాతావరణం, తిండి పడక ఎంతలా విలవిల్లాడిపోయావు. ఇక్కడికి రావాలని ఉన్నా బుడ్డోడికి సకల సేవలు చేయాల్సి రావడంతో అక్కడే ఉండిపోయావు. రాత్రనకా పగలనకా వాళ్లు షికార్లు, పార్టీలు చేసుకుంటుంటే.. నువ్వేమో బాబు మలమూత్రాలు కడుగుతూ గడిపావు. అవునా కాదా!? అసలు నిన్నో మనిషిలా చూశారా వాళ్లు. ఫ్రీగా వచ్చిన ఆయమ్మలా చూశారు తప్ప. అయినా మళ్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నావా!?' కృష్ణలీలయ్యకు భార్య పరిస్థితి చూసి జాలేసింది.

'మనం కాకపోతే ఇంకెవరు చేస్తారండీ వాళ్లకు.. పాపం!' భర్త చెప్పినదాంట్లో అణువణువు నిజమే ఉన్నా.. కూతురికి 'రాను!' అని చెప్పలేని బలహీనస్థితిలో పడిపోయింది మధురమ్మ. తల్లి మనసు కదా. పిల్లలు ఏమన్నా.. ఏం చేసినా.. పడివుండేలా తయారైంది మరి.

'చూడు అమ్మడూ! ఇప్పటికే నువ్వు మన సంతానానికి చాలా సేవలు చేశావు. రాత్రనకా పగలనకా వాళ్లకు చాకిరీలు చేశావు. కనీసం నీతో అయినా వారు వారంవారం.. పోనీ నెలకోసారి ఫోన్లు చేసి మాట్లాడతారా! నువ్వు చేస్తే ఫోన్ ఎత్తుతారా? వాళ్లంతా బిజీ మరి. మనం మాత్రం ఖాళీగా దోమలు, ఈగలు తోలుకుంటూ ఉన్నాం. సరే అదంతా పక్కనబెట్టు.. నువ్వు వెళ్లడం నాకిష్టం లేదు. నీకు నేను కావాలో, పిల్లలు కావాలో తేల్చుకో!' అని తేల్చిచెప్పి బయటకు వెళ్లిపోయాడు కృష్ణలీలయ్య.

మధురమ్మకు ఏం చేయాలో తోచలేదు. అలా గుమ్మం దగ్గర కూర్చుండిపోయింది. పరిసరాలను గమనిస్తూ గతంలోకి వెళ్లిపోయింది.

* * *

చిన్న వయసులోనే భర్తతోపాటు అడుగుపెట్టిన పచ్చగా సింగారించుకున్న గడప. దానికి ఇరువైపులా గజేంద్రుల ప్రతిరూపాలు. చిన్న పాత్రలో ఆరోజు తోటలో విచ్చుకున్న ఎర్రని గులాబీలు, తెల్లని జాజులు. ఇంటి ఎదుట కళ్లాపి చల్లి

వేసిన పదహారు చుక్కల ఏడు వరసల అందాల ముగ్గు.

ఒకవైపు ఏపుగా పెరిగిన జామ, మామిడి, సపోటా చెట్లు. మరోవైపు ఆకుకూరలు, కూరగాయల మొక్కలు. తాను ఎంతో ఇష్టంగా చేయించుకున్న తులసి కోట. అందులో శ్రీరాధాకృష్ణుల రాతి విగ్రహం.

కాస్త దూరంలో పల్లెపందిరి. దాని కిందే నులకమంచం, మట్టికుండలో నీళ్లు. ఆ మంచంపై కూర్చుని భర్త వార్తాపత్రిక చదువుతుంటే తాను వింటూ ఎన్ని మల్లెదండలు కట్టిందో తనకే తెలీదు. కొన్ని గుడికి పంపితే మరికొన్నిటిని ఇంట్లో పూజకు వాడేది. ఎన్నిసార్లు తలలో పెట్టుకోమని భర్త చెప్పినా.. పువ్వులన్నీ ఆ భగవంతుడికే చెందాలని తాను చెప్పేది. అయినా భర్త ఊరుకుంటేనా.. ఒకటో రెండో మల్లెలను తెంపి తన తలలో ప్రేమగా పెట్టేవాడు.

అత్తగారింట్లో గంపెడు సంతానం. పెద్ద ఇల్లు. ఒక్కొక్కరుగా అత్తామామ, మతిస్థిమితం లేని మరిది చనిపోవడంతో.. ఇంటి బాధ్యతంతా తనపై పడింది. చిన్నతనంలోనే పెద్దరికం వచ్చేసింది. ఈ క్రమంలోనే ఒక్కొక్కరుగా పిల్లలు పుట్టడంతో వారిని చూసుకోవడం కష్టంగా మారింది. భర్త ఉద్యోగరీత్యా పలు ఊళ్లలో ఉద్యోగాలు చేయాల్సి రావడంతో.. తన టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసేసింది. పిల్లలను తానే పూర్తిగా చూసుకోవడం మొదలుపెట్టింది. నాన్న.. వారికో మనీ మెషీన్‌లా అనిపించసాగాడు. తాను పస్తులుండి పిల్లలను ఉన్నతస్థితికి తీసుకువచ్చాడు. తాహతుకు మించినా వారు కోరిన చదువులు చదివించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేశాడు. కానీ, ఇప్పుడు రెక్కలు రాగానే వారు తల్లిదండ్రుల సేవలను మరచిపోయారు. అవసరాలకు అమ్మను వాడుకుంటున్నారు. నాన్నతో ఇక పనేలేదు కాబట్టి ఆయనను ఒక్కసారి కూడా విదేశాలకు తీసుకువెళ్లింది లేదు. గతంలో ఇలాగే కాన్పు కోసం భర్తను వదిలి విదేశాలకు వెళ్లొచ్చేలోపు ఆయన సమయానికి సరైన తిండిలేక ఎంతో అనారోగ్యం పాలయ్యారు. ఈసారి అస్సలూ వెళ్లకూడదని భర్త చెప్పనే చెప్పాడు. కానీ, తాను వెళ్లకపోతే పిల్లలు చంటిపిల్లలతో అన్ని పనులు ఎలా చేసుకోగలరు. వారికి కృతజ్ఞతాభావం లేదు కానీ.. పేగుబంధం తనను ఇక్కడ నిలవనివ్వగలదా! ఎటూ తేల్చుకోలేక మౌనంగా ఉండిపోయింది.

అప్పుడే..

'అక్కా అక్కా! ఎలా ఉన్నావు?' అంటూ పలకరించేందుకు వచ్చింది పక్కింటి చెల్లెమ్మ వర్ణమ్మ.

'రారా.. నేను బాగానే ఉన్నాను. నీ సంగతులు ఏంటి? అమెరికా నుంచి ఎప్పుడొచ్చావేమిటి?' అంటూనే కాఫీ కలుపుకొని తీసుకొచ్చింది.

'వారం కిందే వచ్చానక్కా. వెళ్లేముందు ఆరు నెలలకు సరిపడా ఇక్కడంతా

సిద్ధంచేసి వెళ్లాలా.. మళ్లీ అక్కడ చాకిరీ. అదిచేసి ఇక్కడికి వచ్చేసరికి ఇల్లంతా చెత్తా చెదారం. అంతా శుభ్రం చేసుకుని మళ్లీ ఓ స్థితికి తీసుకొచ్చేసరికి నా చావుకు వచ్చింది. అయినా మనకీ డ్యూటీలు ఏంటక్కా. పోనీ అక్కడ మనకేమన్నా రాజభోగాలు ఉన్నాయా అంటే.. ప్రతీదానికి 'నీకు ఇది తెలీదు. అది తెలీదు' అంటూ సూటిపోటి మాటలు. గొడ్డు చాకిరీ చేసినందుకు కనీసం కృతజ్ఞతలు చెప్పిన పాపానపోరు. అరే.. 'ఇండియా తిరిగెళ్తున్నాం. ఇరుగుపొరుగులు బంధువులు అడుగుతారు.. ఓ చాక్లెట్ ప్యాకెట్టు కొనివ్వవే!' అంటే .. 'ఎందుకూ దండగ!' అంది నా ముద్దుల కూతురు. పైగా.. నా టిక్కెట్టుకే లక్షల్లో ఖర్చయ్యిందని ఈసడింపులు. నేనేమన్నా పంపమన్నానా.. లేక అమెరికా చూడాలని తహతహలాడానా. వాళ్ల అవసరం కాబట్టి వాళ్లు టికెట్టు తీసి పంపించారు. మనం సరదాగా వస్తామంటే రానిస్తారా ఏంటి' ఊపిరి తీసుకోకుండా గలగలా మాట్లాడేసి.. కాఫీ తాగేందుకు కాస్త బ్రేక్ ఇచ్చింది.

'ప్రస్తుతం నాదీ అదే పరిస్థితి చెల్లెమ్మా! నాకూ పిల్లల దగ్గరి నుంచి పిలుపువచ్చింది. మీ బావగారికైతే నేను వెళ్లడం అసలే ఇష్టం లేదు. 'కనీసం ఈ వయసులో అయినా మనం కలిసి ఉండకపోతే ఎలా!?' అంటూ నన్నే తిడుతున్నారు. ఏం చేయాలో అర్థం కావట్లేదు. నిజం చెప్పాలంటే నాక్కూడా వెళ్లేందుకు మనసు ఒప్పుకోవట్లేదు. అన్నన్ని నెలలు మీ బావగారిని ఒంటరిగా వదిలి అక్కడ నాలుగు గోడల మధ్య ఉండాలంటే బాధగా ఉంది. కానీ పిల్లలు అర్థం చేసుకోరుగా మన బాధ' మధురమ్మకు బెంగగా ఉంది.

'ఏం పిల్లలక్కా. అమెరికా నుంచి వాళ్లు ఇక్కడికి వచ్చినా మనకే పని. మనం అక్కడికి వెళ్లినా మనకే పని. ఏ.. మనకు మాత్రం పనుల నుంచి విరామం వద్దా. మనకేమన్నా రోబోలు ఉన్నాయా లేక మనమే మెషీన్లమా!?' అంటున్న వర్ణమ్మ మాటలు విన్నారు అప్పుడే లోపలికి వస్తున్న కృష్ణ లీలయ్య.

'ఏమ్మా! అమెరికాకు వెళ్లొచ్చావు. ప్రెసిడెంటును కలిశావా లేదా? కనీసం ఒక చాక్లెట్ ముక్కయినా తెచ్చావా లేదా నాకు..' అని ఏడిపించారు.

'అయ్యో రామా! మనం తీసుకువెళ్లడమే కానీ మనతో ఏమన్నా పంపిస్తారా ఏంటీ!? అందుకే చెప్పేసి వచ్చాను.. నేనింకోసారి ఈ చాకిరీ కోసం రానని' నవ్వుతూ అంది వర్ణమ్మ.

'ఆ బుద్ధి ఈ జన్మలో మీ అక్కగారికి వచ్చేలా లేదమ్మా' అని భార్యను గుర్రుగా చూస్తూ లోపలికి వెళ్లిపోయాడు.

'చూశావా! ఎంత కోపంగా ఉన్నారో. ఇప్పుడు పిల్లలకు నేను ఏం చెప్పాలి. నాన్నకు నన్ను పంపడం ఇష్టంలేదు అంటే ఆయనపై కోపం పెంచుకుంటారు. నాకు

పిచ్చెక్కుతోంది అనుకో' అని వర్ణమ్మతో తన గోడు వెళ్లబోసుకుంది.

'ఈమధ్య ఇది ఇంటింటి రామాయణంగా మారింది. ఏదో ఒకటి నువ్వే ఆలోచించుకో' అంటూ వర్ణమ్మ వెళ్లిపోయింది.

* * *

'ఏమిటోయ్ ఇంకా అమెరికా ప్రయాణానికి సిద్ధం కావట్లేదేంటీ?' అని భార్యను ఉడికించాడు కృష్ణలీలయ్య.

'నాకన్నా మీకే తొందర ఎక్కువగా ఉన్నట్టుందిగా' అంది భర్తను ఓరకంట కనిపెడుతూ.

'అరే.. ఈ పాటికి నీ సంతానం 'ఇవి గ్రైండు చేసుకుని తీసుకురా! అవి షాపింగు చేసి కొనుక్కురా! ఈ పచ్చళ్లు, ఆ పొడులు..' అంటూ లిస్టు పంపుతారు కదా.. ఇంకా రాలేదా అని ఆత్రుత అంతే!' అని చటుక్కున నోటిపై వేలేసుకుని భార్య ఏమంటుందోనని చూశారు.

'మీరు ఊరుకోండి. అరే.. 'మన అమ్మానాన్నే కదా!?' అని అలా చెబుతారు. దానికే ఓ.. ఇదైపోతే ఎలా? అయినా వాళ్లు అడిగినా అడగకపోయినా తీసుకువెళ్లడం నా బాధ్యత. ఓపిక ఉన్నంతవరకూ చేస్తూనే ఉంటాను' అంటూ లోపలికి వెళ్లిపోయింది.

భార్య మనసు అటు భర్త.. ఇటు పిల్లలమధ్య ఎంతలా కొట్టుకుంటుందో కృష్ణలీలయ్యకు అర్థమయ్యింది.

వెంటనే పిల్లలకు ఒక ఆడియో మెసేజీని పంపించాడు.

'పిల్లలు.. మీరంతా మీమీ దేశాల్లో బిజీ అని నాకు తెలుసు. మీకు వీలు ఉన్నప్పుడు ఈ ముసలాడి మెసేజీ వింటారని ఆశిస్తున్నాను. మాకు పెళ్లయినప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు, ఉద్యోగరీత్యా మీ అమ్మా, నేను ఎన్నోఏళ్లు దూరంగా ఉన్నాం. దూరంగా ఉన్నా ఒకరి గురించి ఒకరం ఆలోచిస్తూ.. సరిగ్గా తినీతినక అవస్థలుపడ్డాం. ఎన్ని పస్తులున్నామో.. ఎంత ఒంటరితనం అనుభవించామో మాకే తెలుసు. అందరు తల్లిదండ్రుల్లానే మేము కూడా పిల్లల భవిష్యత్తు గురించే ఆలోచించాం. వాటికి త్యాగాలు, సేవలు అన్న పెద్దపేరు పెట్టలేను కానీ.. మా జీవితాన్నంతా మీకోసమే ధారబోశాం. నేనంటే ఇప్పుడు రిటైరయ్యాను కానీ.. మీ అమ్మ మాత్రం ఇంకా మీ డెలివరీలు, పురుళ్లు అనుకుంటూ శ్రమిస్తూనే ఉంది. అది ఆమె బాధ్యత అంటూ మీరు హుకుం జారీ చేస్తున్నారు. పిల్లలుగా మాపై మీకా హక్కు ఉంది. కానీ, మాకూ కొన్ని ఇష్టాయిష్టాలు ఉంటాయని మీకెందుకు అనిపించడం లేదు. మాకు ఈ వయసులో ఒకరికొకరి తోడు కావాలి. మా వృద్ధాప్యంలో మా కబుర్లను విని, సమయానికి మందులు వేసే ఒక మనిషి కావాలి.

అది అమ్మకు నేను. నాకు అమ్మ.

పిల్లలూ.. మీ నుంచి ఒకే ఒక్కటి ఆశిస్తున్నాను. ఇప్పుడైనా.. కనీసం ఇప్పుడైనా మమ్మల్ని కలిసి ఉండనివ్వండి. మీ అవసరాల కోసం మా ఇద్దరినీ విడదీయకండి. మీకు కాన్పులు ఉంటే తప్పకుండా అమ్మగా ఆమె వచ్చి బాధ్యతను తీసుకుంటుంది. కానీ ఆమె మనసు మాత్రం నాపైనే ఉంటుంది. నేనేం తిన్నానో, మందులు గట్రా సరైన సమయానికి వేసుకున్నానో లేదోనని ఆరాటపడుతూనే ఉంటుంది. అందుకే ఒకే ఒక్క విన్నపం! ఈ ముసలాడిని కూడా అమ్మతో రానివ్వండి. మీ దగ్గర నాన్న టికెట్టుకు డబ్బులేకుంటే.. అప్పో సొప్పో చేసుకుని నేనే టికెట్టు కొనుక్కుంటాను. అక్కడ మీ ఇంట్లో నేను ఉన్నన్ని రోజులు మీకు ఎంత ఖర్చు అవుతుందో చెబితే.. అది కూడా ఇచ్చుకుంటాను. మీకు భారం కాను. కానీ, దయచేసి ఈ వయసులో మమ్మల్ని విడదీయకండి. ఇది తండ్రిగా నా ఆఖరి కోరిక అనుకోండి!'.. అని ముగించాడు.

కానీ, ఈ విషయాన్ని భార్యకు చెప్పలేదు. పిల్లలు కచ్చితంగా మారతారని మాత్రం భావించాడు. పిల్లల నుంచి మెసేజీ కోసం ఎదురు చూడసాగాడు.

అతను ఊహించినట్టుగానే.. తండ్రి నుంచి వచ్చిన మెసేజీని చూసి పిల్లలు చలించిపోయారు. చిన్నప్పుడు అమ్మానాన్నలు తమకోసం పడ్డ కష్టాలు వారికి గుర్తొచ్చాయి. అమ్మానాన్న వయసులో ఉండగా.. ఎప్పుడూ సుఖపడ్డది లేదు. ఎప్పుడూ తమ కోసం, తమ చదువు కోసం తాపత్రయపడ్డారు. ఇప్పుడు తాము కేవలం కొంత డబ్బును మిగుల్చుకునేందుకు నాన్నకు టికెట్ తీయకుండా అమ్మకు మాత్రమే టికెట్ కొనడం ఎంత నీచపు చర్యో అర్థమై వారికి సిగ్గేసింది. అమ్మను కూడా ఎప్పుడూ డెలివరీల సమయంలో చాకిరీ చేయడానికే పిలిచారు తప్ప.. ఒక హాలీడే ట్రిప్‌లా ఎంజాయ్ చేయడానికి ఎప్పుడూ పిలవలేదని గుర్తొచ్చి గుండె మెలేసింది. తమ తప్పును తెలుసుకున్న పిల్లలు వెంటనే అమ్మానాన్నలిద్దరికీ టికెట్లు పంపించారు. తండ్రికి ఫోన్ చేసి క్షమాపణలు కోరారు. తాము తమ తప్పును తెలుసుకున్నామని మరోసారి ఈ విధంగా చేయమని చెప్పుకొచ్చారు. ఇద్దరికీ టికెట్లను పంపుతున్నామని.. ఇకపై ఎప్పుడూ విదేశాలకు వచ్చినా అమ్మానాన్నలు కలిసే వచ్చేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఇది విన్న కృష్ణలీలయ్య కళ్లు చెమర్చాయి.

మరుసటి రోజు ఉదయం భార్య ఎంతో ఉత్సాహంగా ఉండటం గమనించాడు కృష్ణలీలయ్య.

'ఏమండీ ఏమండీ.. ఇదిగోండి ఇటు చూడండి. మీకూ, నాకు ఇద్దరికీ టికెట్లు పంపారండి మన పిల్లలు. మీరేమో వెళ్లొద్దని నన్ను కట్టడి చేశారు. మన పిల్లలేమో

మన గురించే ఆలోచించారు. మన పెంపకం అలాంటిది' అంటూ అసలు విషయం తెలియక పొంగిపోయింది.

'అవునా.. నాన్నకు కూడా టికెట్ పంపారా!?' అంటూ కృష్ణలీలయ్య చిరునవ్వు నవ్వుతూ టిక్కెట్లను ప్రేమగా తడిమి.. భార్య భుజంపై చేయి వేశాడు.

***

## మంజీత కుమార్

విదేశాల్లో అమ్మాయి డెలివరీ అనగానే.. అమ్మలను మాత్రమే తీసుకెళ్తారు. నాన్నలను ఎందుకు తీసుకెళ్లరు? అన్న ఆలోచనలోంచి ఈ కథను రాశారు రచయిత్రి మంజీత కుమార్. వీరి స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ (జర్నలిజం) చేశారు. 'ఆడియో ఆప్స్ రైటర్'కు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. వివిధ యూట్యూబ్ చానెల్స్‌కు కథలు, మాటలు అందించడంతోపాటు ఆకాశవాణి రేడియోకు నాటకాలు రాస్తుంటారు. వివిధ తెలుగు మీడియా సంస్థలలో 'చీఫ్ న్యూస్ ఎడిటర్'గా సేవలు అందించారు. ఆకాశవాణి, ఎంఎఫ్ రేడియోల్లోనూ పనిచేశారు. మూడున్నరేళ్లుగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో కథలు, కవితలు రాస్తున్నారు. కుక్కర్, క్షమయా ధరిత్రీ కథలు పాఠకుల మన్ననలు పొందాయి. 'నాగ మంజీతం' వీరి తొలి నవల. 'తపస్వి మనోహరం' సంస్థ తరపున నిర్వహించిన నవలల పోటీల్లో ప్రథమ బహుమతితోపాటు రూ.5000 గెల్చుకున్నది. రెండుసార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు సంపాదించుకున్నారు. వీటితోపాటు వంశీ గ్లోబల్ అవార్డ్‌తోపాటు విశిష్ట కథా మంజరి, సాహిత్య కళానిధి, కలం భూషణ్ బిరుదులు అందుకున్నారు. గాథ సృజన సంయమి పురస్కారం, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ సేవా పురస్కారం, ఝాన్సీ లక్ష్మీబాయి సాహిత్య పురస్కారం, అక్షర క్రాంతి పురస్కారం, ఎస్‌బీవీవీ ఉగాది జాతీయ పురస్కారంతోపాటు అనేక అవార్డులు, పురస్కారాలు దక్కించుకున్నారు.

**–98496 49594**

# తప్పిపోయిన కూతురు



## జి. లక్ష్మి

'నేను అబార్షన్ చేయించుకున్నాను. రెండు నెలలైంది'..

వంటింటి గుమ్మానికి ఆనుకుని ధీర చెప్పింది వినగానే.. ఒక్కక్షణం అయోమయంగా అనిపించింది. తలెత్తి ధీర మొహంలోకి చూశాను. అలాగే నిశ్చలంగా చూస్తోంది. ఎంత కాజువల్గా.. ఎంత ఉదాశీనంగా.. గొంతులో ఎలాంటి భావం లేకుండా.. అదేదో తన శరీరం కానట్టు ఎలా చెప్పింది అది? చెప్పటం కాదు.. అది ఒక స్టేట్మెంట్. అంతే!

ఏదైనా జరుగుతుందేమోనన్న భయం మనల్ని భయపెట్టినంతగా.. అది జరగడం అంత భయపెట్టదు. నిజంకన్నా ఊహే ఎప్పుడూ భయంకరంగా ఉంటుందేమో. నిజానికి నా గుండె బద్ధలవ్వాలేమో! కానీ చిత్రంగా నా గుండె ముక్కలేమీ అవలేదు. ఇంకా చెప్పాలంటే ఏదో భారం దిగిపోయినట్టుగా ఉంది. ఇది ఇట్లాగే జరుగుతుందని.. ఇలా కాకుండా ఇంకోలా జరిగినా, చివరికి అదికూడా ఇలాగే ముగుస్తుందని నాకు ముందుగానే తెలిసినట్టుగా అనిపించింది. ధీర విషయంలో నా భయం నిజమైనందుకు సంతోషపడుతున్నానా!? అని ఒక్కక్షణం గిల్టీగా అనిపించింది.

ధీరకి పెళ్లిచూపులు అనుకున్నప్పటినుంచీ ఏదో తెలీని టెన్షన్. సగం భయం, సగం సంతోషం కలగలిసిన చిత్రమైన ఫీలింగ్. సిగరెట్లు తాగే, డ్రింక్ చేసే అలవాటున్న కూతురికి పెళ్లిచేయాల్సిన తల్లికి, ఆ పెళ్లిని నాలుగు కాలాలపాటు నిలబెట్టాల్సిన బాధ్యత ఉన్న తల్లికి ఆమాత్రం టెన్షన్ ఉండటం సహజమేనేమో.

తను చెప్పిన మాటకి నేను ఏం అంటానా!? అన్నట్టు నా ముప్ఫయి రెండేళ్ల బాధాశిఖరం.. నా అయిదేళ్ల ఒంటరి దుఃఖం.. నా నిలువెత్తు దిగులు మేఘం.. గుమ్మంలో ఇంకా అలాగే నిలబడి చూస్తోంది.

'ఎవరు?' సాధ్యమైనంత మామూలుగా, క్లుప్తంగా అడిగాను.

'ఇట్ డజంట్ మేటర్' ధీర అంతే క్లుప్తంగా చెప్పింది.

ఎలాంటి ప్రశ్నకు ఎలాంటి సమాధానం? ప్రపంచంలో ఏ తల్లీకూతుళ్ల మధ్యా ఇంత అద్భుతమైన సంభాషణ జరిగి ఉండదేమో.

'ఇట్ డజంట్ మేటర్' అంటే.. అదేమంత చెప్పుకోదగ్గ పెద్ద విషయం కాదనా? ఎవరైనా నీకు అనవసరం అనా? ఎవరైనా ఒకటే.. పెద్ద తేడా ఏంలేదు. నీకు సంబంధంలేదు. నువ్వు చెయ్యగలిగిందీ లేదు అనా? భేతాళ ప్రశ్నలు.

ధీర మొహంలో ఒకలాంటి నిర్లక్ష్యం. ఒకలాంటి ఇన్‌డిఫరెన్స్. అందులో కొంత తెచ్చిపెట్టుకున్న నిర్లక్ష్యం. తనకు నాన్న లేకుండా చేశానని నామీద పెంచుకున్న కోపం. నిజమే.. చిన్నప్పటినుంచీ అది నాన్న అంటే ఎవరో తెలీకుండానే పెరిగింది. అది నా జీవితం. అది నా జీవితానికి సంబంధించిన విషయం అనుకున్నాను. కానీ, అదే విషయానికి తర్వాత ఒకరిముందు నేను దోషిగా నిలబడాల్సి వస్తుందని అప్పట్లో నాకు తెలీదు. విడాకులు తీసుకోవడం నా స్వంత విషయం అనుకున్నాను.

జీవితంలో ఒకరితో పంచుకునేవి పంచుకోగలిగినవి ఎన్నో ఉండొచ్చు. కానీ, ఇంకొకళ్లతో పంచుకోలేనిది ఒకటే ఒకటి ఉంది. భార్య భర్తని, భర్త భార్యని. తను అలా పంచుకోలేక పోయింది.

తను ఎంతో ఇష్టపడి అమ్మా నాన్నల్ని ఎదిరించి పెళ్లి చేసుకున్న అతను, తన సర్వస్వం అనుకున్న అతను.. ధీరను చూసుకోవడానికి పెట్టుకున్న అమ్మాయితో తన ఇంట్లోనే.. తను ఎంతో అపురూపం అనుకున్న తన బెడ్‌మీదే..

తన చదువు, తన విజ్ఞానం, తన తెలివితేటలు, అతనంటే తనకున్న ప్రేమ, అభిమానం ఏవీ.. ఒక పనిమనిషి పాటి చేయలేక పోయాయి. శరీరాలు మాత్రమే మాట్లాడగలిగిన భాష ఒకటి ఉంటుందని.. అతను కూడా దానికి అతీతం కాదని తెలుసుకోలేక పోయింది. చాలామందికి అంతేనేమో? శరీరాలతోపాటు ఉన్న మెదళ్లు ఇగోని హర్ట్ చేస్తాయేమో? అహంకారానికి అడ్డు వస్తాయేమో? అమ్మ ఎప్పుడూ అంటుండేది..

'మగవాళ్లు తెలివైన అమ్మాయిల్ని స్నేహితులుగా ఇష్టపడతారు. కానీ, తెలివైన అమ్మాయిల్ని భార్యలుగా చేసుకోవడానికి మాత్రం ఇష్టపడరు' అని.

వాళ్లలో ఉండే బోలుతనాన్ని, బలహీనతల్ని, అవలక్షణాలని ఎక్స్‌రే తీసినట్టు తెలుసుకోవడం ఎవరికి మాత్రం సుఖంగా ఉంటుంది?

అతను తనతో ఉన్నంతకాలం దేనికోదానికి ఘర్షణ. తర్వాత ఎవరో చెప్పారు.. ఆ అమ్మాయినే తర్వాత అతను పెళ్లి చేసుకున్నాడని, ఒక పాప అని.

అయిదేళ్ల కిందట ఒకరోజు అనూహ్యంగా అడిగింది ధీర..

'నాన్న ఎవరు?' అని?.

చెప్పింది.

'ఒకసారి చూడాలని ఉంది. చూసి వస్తాను!' అంది.

అతని ఇంట్లో ఒకపూట ఉండి వచ్చింది. అతని భార్యాపిల్లలతో కలసి హోటల్‌కు వెళ్లి లంచ్ చేసిందంట. తర్వాత బీచ్‌కి వెళ్లి సరదాగా గడిపారట. అంతా చెప్పి..

'ఆ పిల్ల స్థానంలో నేనుకదా ఉండాల్సింది. నువ్వు నన్ను లేకుండా చేశావు' అంది.

అక్కడికీ.. జరిగిందేంటో తను చెప్పింది. కానీ, ధీర కన్విన్స్ అవలేదు.

'ఇవాళా రేపూ అందరూ అలాగే ఏడుస్తున్నారు. అంతమాత్రానికే డైవోర్స్ తీసుకోవాలా?' అంది.

ఆ బాధ, ఆ దుఃఖం, తనని అహర్నిశలు వెంటాడే పీడకల.. ఎలా చెబితే దానికి అర్థం అవుతుంది? భర్తని ఇంకొకళ్లతో పంచుకోవడం.. అది ఎవళ్లకి వాళ్లకే తెలుస్తుంది? ఆ స్థానంలో ఉన్నవాళ్లకే తెలుస్తుంది. అలా పంచుకోవడం, పంచుకోగలగడం నాగరికత లక్షణమేమో. తను అంత నాగరికత నేర్చుకోలేక పోయింది.

అప్పటినుంచీ ధీర ప్రవర్తన మారిపోయింది. మొండిగా తయారైంది. బ్యాంక్ పీవోగా సెలెక్ట్ అయి.. ముంబై వెళ్లినప్పటినుంచీ ఇద్దరి మధ్యా ఆ అగాధం ఇంకా పెరిగి పెద్దదైంది. ముంబై వెళ్లిన తర్వాత ఆరు నెలలకు ఒకసారి ఇంటికి వచ్చింది.

'ఎలా ఉందే.. బాంబే లైఫ్?'

'అబ్బా! చాలా ఫాస్ట్ లైఫ్ అమ్మా! జర్నీకే సగంరోజు సరిపోతుంది. అసలు ఇంట్లో ఉండేదే తక్కువ. అంతా హడావుడిగా టెన్షన్ టెన్షన్‌గా గడిచిపోతుంది. ఒకటే ఉరుకులుపరుగులు. అన్నట్టు.. నీకు గుండెలు పగిలే విషయం ఒకటి చెప్పనా?'

'ఏంటి అది?'

'మా రూమ్‌మేట్స్ లీనా, మేఘన సిగరెట్లు కాలుస్తారు తెలుసా? వీకెండ్స్‌లో డ్రింక్ కూడా చేస్తుంటారు'

'నీ సంగతి ఏంటో?'

'ఇప్పటివరకైతే లేదు. కానీ, ఎక్కువకాలం రెసిస్ట్ చేయలేననుకుంటా. ఆ ఒత్తిడి తట్టుకోవడం కష్టం' కవ్విస్తున్నట్టుగా అంది.

రెసిస్ట్ చేయలేకపోయిందని తర్వాత దానిని చూసినప్పుడు అర్థమైంది. మన బలహీనతలు, తప్పులు.. అన్నిటికీ పని ఒత్తిడిని, టెన్షన్‌ని సాకుగా చూపించేవాళ్ల జాబితాలోకి ధీర కూడా చేరిపోయింది. తర్వాత కొన్నాళ్లకి ఓరోజు ఫోన్ చేసింది.

'అమ్మా.. నేను ఫ్లాట్ మారదామని అనుకుంటున్నాను'

'ఎందుకే? రెంట్ ఎక్కువ అవదూ ఒక్కదానికి?'

'మా రూమ్‌మేట్స్ ఇద్దరికీ బాయ్‌ఫ్రెండ్స్ ఉన్నారు. వీకెండ్‌కి వాళ్లు ఫ్లాట్‌కి

వస్తుంటారు. నాకు ఎంబరాసింగ్‌గా ఉంటోంది. అందుకే మారదామని అనుకుంటున్నాను. శాలరీలో కొంత హైక్ కూడా వచ్చిందిలే!'

'అయినా.. వాళ్లు అట్లా ఫ్లాట్‌కి రావడం ఏమిటి?'

'వాళ్ల లైఫ్.. వాళ్ల ఇష్టం!'

ధీర చెప్పింది విన్న తర్వాత ధీర గురించి, ధీర జీవితం గురించి ఏదైనా అనుకోవాలన్నా, ఆలోచించాలన్నా భయం వేసింది. ఏదీ ఎక్కువ ఆలోచించలేకపోవడం కన్నా ఉత్తమం ఇంకోటి లేదనిపించింది. పెళ్లి అయినా చేసుకుంటే నా బాధ్యత కొంత తీరిపోతుందని ఆ ప్రయత్నాలు చేస్తే.. అసలు పెళ్లే చేసుకోనని చెప్పేసింది.

ఏదన్నా చెప్పబోతే..

'నా పెళ్లి గురించి నాకులేని బాధ నీకెందుకు?' అంటుంది.

అది బాధపడొద్దు అన్నంత మాత్రాన బాధ లేకుండా పోతుందా? దాన్ని ఒంటరిగా ఎలా వదిలి వెళ్లాలనే దిగులు లోపల ఎక్కడో పేగుల్ని మెలిదిప్పి.. పైపైకిపాకి నా మొహంలోకి దూరి.. నా మొహంలోని కాంతిని, వెలుగుని, నా నవ్వుని నాకు దూరం చేసిందని.. నేను నవ్వే నవ్వుల్లో, నేను మాట్లాడే మాటల్లో నేనులేని ఒక శూన్యంలోకి నన్ను విసిరేసిందని చెబితే దానికి అర్థం అవుతుందా? ఎక్కడ ఉన్నా ఏ పని చేస్తున్నా ముప్ఫయ్యేళ్లు దాటుతున్నా.. దానికి ఇంకా పెళ్లి కాలేదని ఆలోచన వస్తేచాలు.. చేతిలో ఉన్న పని అలాగే వదిలేసి ఉండిపోతున్నానన్న నిజం దానికి ఎలా చెప్పను? ఎవరిదన్నా పెళ్లి అని వింటే సంతోషించే బదులు.. ఒక దుఃఖసముద్రంలో మునిగిపోతున్నానన్న విషయం దానికి ఎలా చెప్పను? నా దుఃఖం నేనే మోసి.. దాని దుఃఖం నేనే మోసి.. నేనేమన్నా దుఃఖ నదినా అందరి దుఃఖాలు మోయడానికి? కానీ అది ఎవరు? పరాయిదా? దాని తాలూకు దుఃఖం నా దుఃఖం కాకుండా పోతుందా?

ఎందుకు మనుషులు తమ జీవితానికంతా ఒక్కళ్లనే కేంద్రంగా చేసుకుని బతుకుతుంటారు? ఆ ఒక్క బంధంలో ఏదన్నా తేడా వస్తే తల్లకిందులు అయిపోతుంటారు? ఇది ముందే తెలిస్తే నా జీవితాన్ని ధీర చేతుల్లో పెట్టేదాన్నా?

పలుచని మొహంతో.. మొహంలో సిగ్గు, వినయం కలగలిసిన నవ్వుతో అరవిరిసిన నందివర్ధనంలా ఎంత మనోహరంగా ఉండేది ధీర. ఇంటికి చుట్టాలు ఎవరన్నా వస్తే తుర్రుమని లోపలికి పరిగెత్తుకుని వచ్చి తన చాటున దాక్కునే ధీరే నిన్న మొన్నటి వరకూ గుర్తొచ్చేది. బొంబాయి వెళ్లడానికి రైలు ఎక్కినప్పటి దాని దిగులు మొహం ఇంకా కళ్లముందు కదలాడుతూనే ఉంది. కానీ, తర్వాత తర్వాత దాని మొహంలో నేవళం, మృదుత్వం పోయి ఏమాత్రం సున్నితత్వం లేని ఒకలాంటి

గండు మొహం.. ఎప్పుడు? ఎక్కడి నుంచి వచ్చిచేరిందో గుర్తురావడంలేదు.

చెల్లెలి కొడుకు కిరణ్ ఏడాది కిందట అన్నమాట గుర్తొచ్చింది. పెళ్లిచూపులకి వెళ్లివచ్చిన కిరణ్‌ని..

'అమ్మాయి ఎలా ఉంది' అని అడిగింది ఒకసారి.

'నాకు ఆ అమ్మాయిలో ఏమాత్రం ఫెమినిటీ కనిపించలేదు పెద్దమ్మా!' అన్నాడు కిరణ్.

'అంటే ఏంటిరా?'

'అదేంటో నేను చెప్పలేనుగానీ.. మా ఇద్దరినీ కాఫీషాప్‌కి పంపించారు. నాకు నా పక్కన ఇంకో అబ్బాయి ఉన్నట్టే అనిపించింది తప్ప.. అమ్మాయి ఉన్నట్టే అనిపించలేదు' అన్నాడు.

కిరణ్ ఆ మాట అన్నప్పుడు నాకు అంతగా అర్థంకానిది.. తర్వాత ధీరని చూస్తున్నకొద్దీ కొద్దికొద్దిగా అర్థమైనట్టు అనిపించింది. నా పాత ధీర నాకు ఇంక కనిపించదని, అది బొంబాయి మహానగరంలో ఎక్కడో తప్పిపోయిందని.

మహానగరపు జీవితమా? చుట్టూ ఉన్న పరిసరాలా? వ్యక్తులా?.. ఏది కారణమో తెలీదు. నా ధీర ఇంక పాత ధీర కాదు. దాన్ని నగరం పూర్తిగా ఆవహించింది. దానిలోని మంచిని, భయాన్ని, మొహమాటాన్ని, అలవాట్లను కొంచెం కొంచెంగా మింగిమింగి.. జీర్ణంచేసుకుని చివరకు పనికిరాని పిప్పిని మా మీదకు వదిలినట్టుంది దాన్ని చూస్తుంటే. ధీర మొహంలో ఒకలాంటి ఉదాసీనత. ఇన్‌డిఫరెన్స్. అది జీవితం మీదో, మనుషులమీదో, తనమీద తనకో తెలియని నిర్లక్ష్యం. ఎక్కడో చదివింది..

'ఏదైనా సమస్య వస్తే పరిష్కరించు. నువ్వు పరిష్కరించలేని సమస్య అయితే కాలానికే వదిలెయ్యి' అని.

అలా.. ధీర పెళ్లిని కాలానికే వదిలేసింది.

* * *

హాల్‌లో ఉయ్యాల బల్లమీద కూర్చుని సెల్‌లో మెసేజ్‌లు చూసుకుంటున్న ధీరని చూస్తే ఓవైపు బాధా, ఓవైపు విరక్తి.. సిగరెట్లు, డ్రింక్ చేయడంతోపాటు అబార్షన్ కూడా చేయించుకున్న కూతురికి పెళ్లిచేయాల్సిన తల్లిగా.. తన బాధ్యత ఇంకా పెరిగినట్టు ఉంది అనుకుంటే, అవార్డు ఫంక్షన్లప్పుడు సినిమా హీరోలు, దర్శకులు అనే మాటలా అనిపించి.

వంట చెయ్యడం బోర్. పిల్లల్ని కనడం బోర్. పెంచడం అంతకన్నా బోర్. ఎప్పుడూ సెల్‌తో గడపడం అనేది ఒక ఇంటర్నల్ వ్యాక్యూమ్ లోంచి వచ్చే వ్యాపకం. ఒక వ్యాక్యూమ్‌ని ఇంకో వ్యాక్యూమ్‌తో నింపే ప్రయత్నం. పక్కనున్న మనిషితో మాట్లాడరు కానీ..

‘రెండ్రోజుల్లో పెళ్లిచూపులు పెట్టుకుని.. వాళ్లని మోసం చేసినట్టు అవదూ?’ అంతకన్నా ఇంకేం అనాలో తోచలేదు.

‘నా పాత రూమ్‌మేట్ లీనా.. హైమెన్ రీ కన్‌స్ట్రక్షన్ సర్జరీ చేయించుకుని పెళ్లి చేసుకుంది. మోసం అంటే.. చిరిగిన కన్నెపొరకి సర్జరీ చేయించుకుని వర్జిన్‌లా పెళ్లి చేసుకోవడం. అందుకే.. ఎందుకైనా మంచిదని నీకు చెప్పాను. అయినా అవతలి వాళ్లుకూడా అంత మడికట్టుకుని ఏమీ ఉండటం లేదులే!’

‘అబార్షన్ చేయించుకుని పెళ్లి చేసుకోవడం మోసం కాదా?’

‘అది తప్పేమో కానీ మోసం కాదు’

దేవుడా! ఇంక నావల్ల కాదు. దీన్నంతా భరించే శక్తి ఇవ్వు తండ్రీ. నా బలహీనపు గుండె బద్దలు కాకుండా చూడు స్వామీ.

ధీర.. దేన్నయినా ధైర్యంగా ఎదుర్కోవాలని ఏరికోరి అపురూపంగా పెట్టుకున్న పేరు. ఇప్పుడు ఇందుకు పనికి వస్తోంది. ఎక్కడైనా గొంగళి పురుగు సీతాకోక చిలుక అవుతుంది. కానీ, సీతాకోక చిలుకే గొంగళిపురుగు అవడం ఎక్కడన్నా ఉంటుందా?

అవతలి వాళ్లు అంత మడికట్టుకుని ఉండటం లేదని.. ఇది కూడా ఇట్లా అయిందా? అయినా సృష్టిలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే! ఒకరు ఎక్కువా కాదు, ఒకరు తక్కువా కాదు. ఎవరి అస్థిత్వం వారిదే. మగవాళ్లతో సమానం అవ్వాలని ఆడవాళ్లు మగవాళ్లని ఎందుకు అనుకరించాలి? స్త్రీ పురుషులిద్దరూ కలిస్తేనే కదా పరిపూర్ణత్వం సిద్ధించేది. స్త్రీకి సహజసిద్ధమైన సున్నితత్వం, లాలిత్యం, ఆర్ద్రత ఉంటాయి. ఆ లక్షణాలు పోగొట్టుకుని మార్దవంలేని కరకు మగమొహాలు ఎందుకు అరువు తెచ్చుకోవడం? ఐడెంటిటి క్రైసిస్ ఆడవాళ్ల మొహాల్ని కఠినంగా మగమొహంగా మారుస్తోందా?

‘ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటావు? వాళ్లకు ఏం చెప్పమంటావు?’

‘అదేదో నువ్వే డిసైడ్ చేయి’

అంటే.. ఇప్పుడు బాల్ తనకోర్టులో ఉందన్నమాట. హామ్లెట్ ‘టుబి ఆర్ నాట్ టుబి’లా ఇప్పుడు నిర్ణయం చేయాల్సిన బాధ్యత తనది. చేసేదంతా అది చేసి.. కూర్చుని తీర్పు తను చెప్పాలి.

‘లండన్ బ్రిడ్జ్ ఈజ్ ఫాలింగ్ డౌన్. ఫాలింగ్ డౌన్’.. టి.ఎస్. ఇలియట్ ‘వేస్ట్‌లాండ్’లో అనైతిక సంబంధాల గురించి అన్నమాట గుర్తొచ్చింది. ఒక్క లండన్ బ్రిడ్జేనా కూలిపోతున్నది? అన్ని బ్రిడ్జిలూ కూలిపోతున్నాయి. అన్ని విలువలూ అందులో కొట్టుకుపోతున్నాయి. భర్తలకు తెలియకుండా భార్యలు, భార్యలకు తెలియకుండా భర్తలు, అమ్మా నాన్నలకు తెలియకుండా పిల్లలు.. అక్రమమో, సక్రమమో అయిన సంబంధాలు. వాళ్లందరూ పాదాలను సోడానీళ్లతో

కడుక్కోవడం మొదలుపెడితే.. ఆ నీళ్లు ఇంకో హిందూమహాసముద్రం అంత అవుతాయేమో. ఆ మహాసంద్రంలో ధీర కూడా ఓ నీటిబొట్టు. అంతేకానీ.. అది సోడానీళ్లతో కాళ్లు కడుక్కున్నంత మాత్రాన దాని కాళ్లు కడిగి కన్యాదానం చేయాలా? చుట్టూతా ఇంత కమ్ముకున్న విషంలో, ఇంత విషవలయంలో తను ఏ విలువల కోసం పాకులాడుతోంది? ఏ విలువల కోసం ఘర్షణ పడుతోంది? ఏది ఏమైపోతే నాకెందుకు అని ఎందుకు ఉండలేకపోతోంది? అదేమైనా జబ్బా? జబ్బు లక్షణమా?

జయకాంతన్.. 'కొన్ని సమయాలలో కొందరు మనుషుల'కు, తనకు మధ్య ఏదో పోలిక స్ఫురించింది. గంగ అనే అమ్మాయిని డ్రాప్ చేస్తానని కారులో ఎక్కించుకుని అత్యాచారం చేస్తాడు ఒక యువకుడు. గంగ ఈ విషయాన్ని వాళ్ల అమ్మకు చెప్పినప్పుడు ఆమె అరిచి ఏడ్చి ఊరూవాడా ఏకం చేయడంతో.. గంగ పెళ్లికాకుండానే ఉండిపోతుంది. తర్వాత అదే విషయం పత్రికలో కథగా వచ్చినపుడు.. అందులో తల్లి అత్యాచారానికి గురైన కూతురికి తలస్నానం చేయించి.. 'నీకు అంటిన మైల అక్కడితోనే పోయింది. ఇక దాని గురించి మర్చిపో' అంటుంది. మా అమ్మ కూడా అట్లా అరిచి గోల చెయ్యకుండా, అలా తలస్నానం చేయించి ఉంటే.. ఇవాళ ఇలా ఉండాల్సి వచ్చేదికాదు కదా అనుకుంటుంది గంగ.

కానీ, ఆ కథలో గంగ వేరు. అది యాదృచ్ఛికంగా జరిగింది. అందులో గంగ ప్రమేయం లేదు. అలా తలస్నానం చేయించి జరిగిన పొరబాటుని కడిగేయించడానికి ధీర.. 'గంగ' కాదు.

తన ముందున్నది ఒకటే ఆప్షను. ధీరకు పెళ్లి చేయకుండా వదిలేయడమా? పెళ్లిచేసి విడాకులు తీసుకున్నా.. బాధపడకుండా ఉండటమా? సిగరెట్లు, మందు తాగుతూ, అబార్షన్ కూడా చేయించుకున్న కోడల్ని క్షమించి వదిలేసే అత్తగార్లు, భర్తలు ఉన్నట్టు చరిత్రలో ఎక్కడా ఆధారాలు లేవు. అయితే పెళ్లి చేస్తే తల్లిగా తను సక్సెస్ అయినట్టు. అక్కడికి తన ప్రాణం ఒడ్డున పడుతుంది. పెళ్లి చేయలేని తలిదండ్రుల జాబితాలో అయితే ఉండదు.

ప్రతి మనిషి జీవితంలో కొన్ని దౌర్భాగ్యకరమైన క్షణాలు ఉంటాయి. అలాంటి క్షణం ఒకటి మన జీవితంలో లేకుండా ఉంటే బాగుండు అనిపించే క్షణాలు. ఇప్పుడు అలాంటిదే ఓ దౌర్భాగ్యకరమైన క్షణంలో ఉన్నాను. తల్లిగా గెలవడమా? మనిషిగా ఓడటమా? తేల్చుకోవాల్సిన క్షణం. నాకే ఒక కొడుకు ఉంటే.. ధీరలాంటి అమ్మాయిని వాడికి ఇచ్చి చేస్తానా? ఆ అబ్బాయి కూడా నాకు కొడుకులాంటి వాడే కదా!

ఉయ్యాలలో కూర్చుని గోళ్లకు నెయిల్ పాలిష్ వేసుకుంటున్న ధీరని చూస్తే

ఏదో తెలియని ఆవేశం. నన్నిట్లా సుడిగుండంలో నెట్టి..

గబగబా దాని దగ్గరికి వెళ్లాను.

'చూడు ధీరా! విలువలు అనేవి ఎవరికోసమో ఉండేవి కాదు. ఎవరివి వారికే ఉండేవి. ఒకళ్ల కోసం తెచ్చిపెట్టుకునే విలువ సరైన విలువ కాదు. శాశ్వతమైన విలువలు కొన్ని ఉంటాయి. ఆడవాళ్లకైనా, మగవాళ్లకైనా, లేకపోతే నువ్వు ఈమాట చెప్పాల్సి వచ్చేదే కాదు. చేసినదాన్ని దేన్నయినా ధైర్యంగా ఫేస్ చేయడం నేర్చుకో. అది మంచిదైనా, చెడ్డదైనా! పెళ్లి కావాల్సిన కూతురు అబార్షన్ చేయించుకున్నానని చెబితే.. ఇవాళా రేపూ ఇది మామూలేగా అని తల్లిదండ్రులు అనుకునేంతగా సమాజం మారిపోయిందేమో నాకు ఇంకా తెలీదు. అది నా వెనుకబాటుతనం అనుకుంటే నాకు ఆ వెనుకబాటు తనమే ఇష్టం. నీ గురించి నువ్వు పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోగలిగినంత పెద్దదానివయ్యావు. నీకు నేను ఇంకా ఏదో చెయ్యగలనని నేను అనుకోవడం లేదు. నీ పెళ్లి నువ్వే డిసైడ్ చేసుకోవడం మంచిది. ఆ పెద్దరికం నాకు వద్దు. తర్వాత నీ ఇష్టం!'

* * *

తప్పిపోయిన నా కూతురు మళ్లీ ఎప్పుడో.. ఎక్కడో కనిపిస్తుందని చిన్న ఆశ. తల్లిగా ఆ మాత్రం ఆశ పడటంలో తప్పులేదేమో?

***

## జి. లక్ష్మి

రచయిత్రి స్వస్థలం కృష్ణా జిల్లా గుడివాడ. ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి దిన పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత గ్రూప్–2 సాధించి.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగంలో చేరారు. జిల్లా రిజిస్ట్రారుగా పనిచేసి.. ఇటీవలే పదవీ విరమణ చేశారు. ఇప్పటివరకూ దాదాపు 60 కథలు, ఒక నవలిక రాశారు. స్వీయ కథా సంకలనాలు 'పూలు పూయని నేల', 'అభయారణ్యం', 'జి. లక్ష్మి కథలు'.. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ద్వారా ప్రచురించారు. ఆల్బర్ట్ కామూస్ 'ది అవుట్ సైడర్' నవలను 'అపరిచితుడు'గా, ప్రముఖ జర్మన్ రచయిత కాఫ్కా కథలను 'కాఫ్కా కథలు'గా తెలుగులోకి అనువాదం చేశారు. ప్రముఖ నోబెల్ రచయితల కథలను 'నోబెల్ కథలు'గా, నోబెల్ బహుమతి గ్రహీత ఆలిస్ మన్రో కథలను 'ఆలిస్ మన్రో కథలు'గా తెలుగుభాషలోకి అనువదించారు. వీరి పదిహేను కథల వరకూ హిందీ, తమిళం, కన్నడ భాషల్లోకి అనువాదం అయ్యాయి.

–94907 35322



# అంతర్నేత్రం

## యస్వీ కృష్ణ

'కాఫీ.. కాఫీ.. కాఫీ..'

ఆలోచనల్లోంచి తేరుకుంటూ తల తిప్పాను!

డిపార్చర్ టైమ్ దగ్గరపడేకొద్దీ కంపార్టుమెంట్లోకి ఎక్కుతున్న ప్రయాణీకులు క్రమంగా పెరుగుతున్నారు. అప్పటికే ఎక్కేసినవారు తమ పక్కవారితో కబుర్లు చెబుతున్నారు. ఇంకొందరు కాఫీ తాగుతూ నాలాగే ఆలోచనల్లో మునిగి ఉన్నారు. మొత్తానికి ఎవరి లోకంలో వారున్నారు. మళ్లీ ఇటువైపు తిరిగి కిటికీలోంచి బయటికి చూడసాగాను.

నేను గుంటూరుకి ప్రయాణమవడం ఇది అయిదోసారో, ఆరోసారో.. సరిగ్గా గుర్తులేదు. మొదటిసారి నా చిన్నప్పుడెప్పుడో వెళ్లాను. కానీ, గత ఐదేళ్లుగా గుంటూరు టౌన్ గుర్తురాగానే.. వెంటనే నా మదిలో మెదిలే వ్యక్తి.. నా ప్రాణస్నేహితురాలు.. మంజుల! ఇప్పుడు కూడా నేను హైదరాబాద్ నుంచి బయల్దేరింది.. తన పెళ్లికి అటెండ్ అవడానికే!

'నేనెందుకే మంజూ! పెళ్లిలో నన్ను నీ ఫ్రెండ్‌గా చూశారంటే.. నీ అత్తింటివారికి నీపట్ల ఇంప్రెషన్ పోతుందే! నా మనసు నీకు తెలుసుగా.. నేను రాకున్నా నా విషెస్ ఎప్పుడూ నీకుంటాయనీ!' అని నేను నచ్చజెప్పాలని చూసినా..

తను వినిపించుకోలేదు.

'నోర్ముయ్యవే! నువ్వు గనుక నా పెళ్లికి రాలేదంటే.. ఏం చేస్తానో తెలుసా?'

'ఊఁ.. ఏం చేస్తావ్?' నేను కుతూహలంగా చూస్తూ అడిగేసరికి చెప్పింది..

'ఇంకెప్పుడూ నీతో మాట్లాడను!'

నేను తేలిగ్గా నవ్వేశాను.

'పోవే.. నువ్వూ, నీ ప్రతిజ్ఞలూ! నీ గురించి నాకు తెలీదా మంజూ! నాతో మాట్లాడకుండా రెండ్రోజులు కూడా నువ్వుండలేవు! ఏదైనా జరిగే విషయం చెప్పమ్మా!' అన్నాను.

'అయితే విను!' అని ఉక్రోషంగా..

'నువ్వు నా పెళ్లికి రాకుంటే..'

నేను ఆసక్తిగా చూడటం గమనించి చెప్పేసింది..

'నేనూ నీ పెళ్లికి రాను!'

అంతే.. ఫకాల్మని నవ్వేశాను. ఈసారి తను నివ్వెరపోతూ చూసింది నావంక.

'ఏమైందే.. ఇప్పుడు నేనేం అన్నాననీ? ఉన్నట్టుండి ఎందుకలా నవ్వుతున్నావ్?'

నేను నవ్వాపుకోడానికి ప్రయత్నిస్తూ..

'మరి.. ఇలాంటి జోకులేస్తే నవ్వరేంటీ?' అంటూ పడీపడీ నవ్వుతున్న నేను.. మనసులో ఎక్కడో కలుక్కుమనేసరికి గుండెలోని దిగులుపొర కళ్లలో తేమతెరగా మారుతూండగా నోరు విప్పాను..

'చెప్పు మంజూ.. నిజంగా నాకు పెళ్లవుతుందంటావా?'

* * *

'యువర్ అటెన్షన్ ప్లీజ్.. తెనాలి వెళ్లు నాగార్జున ఎక్స్‌ప్రెస్ తొమ్మిదో నెంబర్ ప్లాట్‌ఫారంపై బయలుదేరుటకు సిద్ధముగా ఉన్నది!'

అనౌన్సర్ మాటలు వినగానే ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణీకుల్లో ఉన్నట్టుండి కలకలం మొదలైంది.

కిటికీ పక్కనే కూర్చున్న నేను అప్రయత్నంగా టైమ్ చూసుకున్నాను. ఐదు నిమిషాలుంది.. రైలు బయల్దేరడానికి!

ఓ ముగ్గురు వ్యక్తులు లగేజీతో గబగబా నేను కూర్చున్న కంపార్ట్‌మెంట్లోకి వచ్చారు. నా ఎదురుగా ఖాళీగా కన్పిస్తున్న సీటు దగ్గరకొచ్చి కూర్చోవడానికి సిద్ధపడుతున్నట్లుగా వంగి, యథాలాపంగా నావైపు చూశారు.

అంతే.. ఠక్కున కింద పెట్టబోయిన లగేజీని తిరిగి అందుకొని వెనుదిరిగి మరో కంపార్ట్‌మెంట్ వైపు వెళ్లిపోయారు.

నా మనసు చివుక్కుమంది.

నిజమే.. మామూలుగానే నా వంక చూడటానికి ఎవరూ ఇష్టపడరు. ఒకసారి చూశాక.. ముఖం తిప్పేసుకోకుండా ఉండలేరు. అలాంటిది గంటో, రెండు గంటలో ప్రయాణం చేసేందుకు రైలెక్కినవాళ్లు అంత సమయాన్ని ఎదురుగా నన్ను చూస్తూ గడపాలని కోరుకోరు. అందుకే వేరే సీటు వెతుక్కుంటూ వెళ్లారు.

ఒకవేళ.. తప్పనిసరై నా ఎదురుగా కూర్చోవాల్సివస్తే మాత్రం.. నా వైపు చూస్తూ కూర్చోరు. పక్కకి తిరిగి ఎటో చూస్తూ ఉంటారు. అనుకోకుండా పొరపాట్న నా వైపు సారించిన చూపుల్లో కూడా 'అసహ్యం, ఈసడింపు' తప్ప మరో భావమేదీ కన్పించదు. ఊహ తెలిసినప్పటినుంచి పాతికేళ్లుగా నాపట్ల ఈ సమాజానికి అలవాటుగా మారిన స్థితి! ఇది నాకు అవమానమో, అపహాస్యమో

విశ్లేషించుకుంటూ.. నన్ను నేను ఓదార్చుకుంటూ గడిపే రోజులు కూడా దాటిపోయాయి.

అందుకే.. 'మౌనిక' నయ్యాను.. ప్రపంచాన్ని దూరాన్నుంచే చూస్తూ చదివే జీవిత పాఠకురాలినయ్యాను.

సమాజం నన్ను వీక్షించే విధానాన్ని అర్థంచేసుకునే పరిశోధకురాలినయ్యాను!

'ఎక్స్‌క్యూజ్ మీ.. ఈ సీటు ఖాళీయే కదండీ..?' అన్న మాటలకి తేరుకొని తల తిప్పి చూశాను.

నా ఎదురుగా ఉన్న సీటు మీద చేత్తో తడుముతూ కూర్చోవాలని ప్రయత్నిస్తున్నాడతను.

'ఆఁ.. ఎవరూ లేరు. ఖాళీయే!' చెప్పాను.

చేత్తో సీటుని తడుముకుంటూ కూర్చోబోయాడు.

'అయ్యో.. జాగ్రత్త!' అన్నాను అప్రయత్నంగా.

అతడు జాగ్రత్తగానే కూర్చున్నాడు.

ఎందుకో.. ఆ క్షణంలో రవ్వంత గర్వంగా అన్పించింది నాకు. నా ఎదురుగా కూర్చోవడానికి ఓ వ్యక్తి వచ్చినందుకు!

* * *

'ఆశ లేనిదే బతకడం కష్టం. కళ్లు లేనందుకు మీకెప్పుడూ బాధ కలగలేదా? ఈ లోకాన్ని చూడాలన్పించలేదా?'

ట్రైన్ బయల్దేరి రెండు గంటలు కావొస్తోంది. ఈ రెండు గంటల్లోనూ మామధ్య మాటల బాటలు ఎందుకో.. మమ్మల్ని కాస్త సన్నిహితం చేశాయన్పించింది. నా ప్రశ్నకి బదులివ్వకుండా నవ్వాడతను. తేలిగ్గా ఉంది ఆ నవ్వు!

'పుట్టుకతోనే చూపులేని నాకు అసలు 'ఆశ' అంటే ఏమిటో తెలీదు. 'ఆశ' అనేదాన్ని 'వెలుగు'తో పోలుస్తారందరూ. కానీ.. నాకు మాత్రం వెలుగంటే ఏమిటో తెలీదు. నాకు తెలిసిన లోకమంతా చీకటే! 'దృష్టి' అనేది ఒకటుంటుందనీ, దాంతో చూస్తారనీ, ఆ చూపు వల్లే ఈ లోకం కనిపిస్తుందనీ.. ఊహ తెలిసేదాకా నాకు తెలీదు. తర్వాత లోకం గురించి అవగాహన ఏర్పడేకొద్దీ అనిపించింది.. నాకు చూపు లేకపోవడమే మంచిదని! అప్పుడు అర్థమైంది.. నేనే అదృష్టవంతుణ్నని!'

'ఎందుకని..?'

'లోకంలో స్వచ్ఛతా, మంచీ ఎక్కడున్నాయండీ? అంతటా మలినం, అవినీతీ, దుర్మార్గమే కదా! పక్కవాడి ఎదుగుదలని చూసి 'కుళ్లు'. 'వాడికున్నది నాకు లేదే' అని ఏడుపు. ప్రమోషన్ రాలేదని నిరసన. ట్రాన్స్‌ఫర్ కాలేదని వేదన. మనుషుల మనసులన్నీ ఛీదర! మహాకవి శ్రీశ్రీ అన్నట్లుగా 'మనదీ ఒక బ్రతుకేనా..

కుక్కల వలె, నక్కల వలె/ మనదీ ఒక బ్రతుకేనా.. సందులలో పందుల వలె!' అని..

ఓ క్షణమాగి..

'సారీ అండీ.. నేను తప్పుగా మాట్లాడితే!' అన్నాడు.

'లేదు లేదు.. మీరు మాట్లాడుతూంటే స్వచ్ఛత కనిపిస్తున్నది. మీ మాటల్లో వాస్తవం వినిపిస్తున్నది. ఔను.. మీరు చెప్పేది నిజమే! మనుషులంతా కులమతాల పోలికల్లో, స్థాయీ స్తోమతల బేరీజుల్లో, తరతమ భేదాల అంచనాల్లో, లాభనష్టాల లెక్కల్లో, అనునిత్యం న్యూనత అహంభావాల రాపిడిలో.. తమ 'అంతరాత్మ'ల్ని చంపుకొని, ప్రేమరాహిత్యపు 'నిధి'నే మితిమీరిన ఆత్మవిశ్వాసంగా భావిస్తూ బతికేస్తున్నారే తప్ప.. మనస్ఫూర్తిగా ఎవరూ జీవించడం లేదు!' అన్నాను.

అతడు ఆశ్చర్యపోతూ..

'అరెెఁ.. మీరూ నాలాగే మాట్లాడుతున్నారే! మీ భావాలు నా భావాల్లాగే ఉన్నాయ్!' అన్నాడు.

'నాకూ అలాగే అనిపించింది. అందుకే మీ మాటలు వింటూంటే ఇంకా వినాలనిపిస్తోంది.. చెప్పండి!' అన్నాను.

అతడు నవ్వేస్తూ..

'చెప్పడానికేముందండీ.. నేను చెప్పేవన్నీ అందరికీ తెలిసినవే, ప్రతి ఒక్కరూ ఒప్పుకొనేవే.. కొత్తగా ఏమున్నాయనీ?! మనుషులై ఉండి ఒకరినొకరు పీల్చుకుతింటున్నారు. చంపుకొంటున్నారు. నిజం చెప్పండీ.. పసిపిల్లలు తప్ప మనుషుల్లో ఎవరైనా మనస్ఫూర్తిగా నవ్వగలుగుతున్నారా?' అన్నాడు.

'నవ్వటం మాట అటుంచి.. 'తమ పాపాలు ప్రక్షాళనమయ్యేట్లు కనీసం మనస్ఫూర్తిగా ఏడవగలుగుతున్నారా?' అనే ప్రశ్నకి కూడా లేదనే బదులివ్వాల్సి వస్తుందండీ!' అన్నాను.

'అదేమరి! మనుషులు ఇంత భయంకరంగా ఉంటారనీ, వాళ్ల అంతరంగాలు ఇంత వికృతంగా ఉంటాయనీ తెలిసేకొద్దీ.. అదంతా చూసే దౌర్భాగ్యం నాకు లేకపోవడం అదృష్టమే కదా మరి! కాబట్టి ఆ దేవుడు నాకు మేలే చేశాడు..'

ఈసారి నాకు నవ్వొచ్చింది.

'మీకు సంబంధించి మీరెంత అదృష్టవంతులో.. నా మటుకు నేనూ అంతే!' అన్నాను.

'ఎందుకలా..?'

'ఎందుకంటే.. ఒంటరితనం! నాతో ఎవరూ మాట్లాడరు. నా వంక చూడాలని కూడా ఎవరూ అనుకోరు. అలా ఒంటరితనం అలవాటైంది నాకు. ఈ

ఒంటరితనాన్నే ఒకవిధంగా 'ఏకాంతం'గా భావించే మనోస్థితిని అలవాటు చేసుకున్నాను. ఈ స్థితి.. ఈ ఒంటరితనం.. ఈ ఏకాంతంలోనే నిశ్చింతగా ఉండగలం. ఎవరూ మనవంక చూడరు, మన జోలికి రారు, మనల్ని బాధపెట్టరు, ఎవరూ కోప్పడరు.. అవి వింటూ బాధపడీ, లోలోపలే కృశించిపోయే దౌర్భాగ్యం మనకి ఉండదు!'

నేను 'నా' గురించి చెప్పటం మొదలుపెట్టి, అతణ్ని కూడా కలుపుకొని 'మనం' అంటూ ముగించానని గుర్తొచ్చి నాలిక్కరుచుకున్నాను. అయితే అతడు అది గమనించాడో, లేదో తెలీదుకానీ.. నా మాటలకి 'నిజమే' అన్నట్లు తలూపుతూ..

'నాకు మాత్రం మీ మాటలు వింటూంటే, మీతో మాట్లాడుతుంటే ఎంతో ఆహ్లాదంగా, ఆత్మీయంగా అన్పిస్తోంది. నాతో కూడా ఇప్పటివరకూ ఇంత బాగా ఎవరూ మాట్లాడలేదు. నాలాంటి భావాలు కలిగి, నావంటి అభిప్రాయాలుండి, నాలాగే మాట్లాడే మీరు పరిచయమైన ఈరోజునీ, మీతో మాట్లాడుతున్న ఈ సమయాన్నీ నేనెప్పటికీ మర్చిపోలేను' అన్నాడు.

జీవితంలో మొదటిసారిగా నా గురించి ఓ మగవాడి నోటినుంచి ఇలాంటి పొగడ్త విన్నందుకేమో.. సంతోషంతోపాటు మనసులో కాస్త గర్వంగా కూడా అన్పించింది నాకు. అంతేకాదు.. నాపట్ల అతడికి కలిగిన భావమే అతడి పట్ల నాకూ కలిగింది. నిజానికి అతడి మాటలు విన్నాక..

'నా మనసునే మాటల్లోకి అనువదించి అని ఉంటాడా?' అనిపించింది.

కొద్దిసేపటికి నన్ను నేను సంబాళించుకుని అన్నాను.

'మీరు నన్ను చూడలేదు, చూడలేరు కాబట్టి మీకు దగ్గరై మీ మెప్పు పొందాలని నాకేం లేదులెండి! ముందే చెప్పాను.. నేనెలా ఉంటానో! నేనిలా అన్నందుకు మరోలా అనుకోకండి!'

వింటూ అర్థం చేసుకుంటున్నట్లుగా అన్పించింది అతని మౌనం. కాసేపు మా ఇద్దరిలో ఎవరమూ మాట్లాడలేదు.

ఎందుకో.. ఆ కాస్త సమయమూ ఎంతో భారంగా గడిచిందని అన్పించింది నాకు.

* * *

'తీసుకోండి!' అన్నాను.. బ్యాగ్‌లోంచి టిఫిన్‌బాక్స్ బయటకి తీసి, మూతతెరిచి అతడి ముందుకు చాచి.

'ఏమిటీ..' అంటూ చేత్తో తడిమి, మళ్లీ తిరిగిస్తూ అన్నాడు..

'ఇప్పుడేం వద్దండీ! నేను తినలేను, ఆకలిగా లేదు!'

'ఆకలైతేనే తినడానికి ఇది భోజనం కాదులెండి. రవ్వలడ్లు! మొహమాట పడకండి.. తీసుకోండి!' బలవంతపెట్టాను.

అతడు సున్నితంగానే తిరస్కరించాడు. నాకెందుకో 'గిల్టీ'గా అనిపించింది.

'కొంపదీసి వీటిలో మత్తుమందు కలిపానని అనుమానమా? మిమ్మల్ని మైకంలో పడేసి మీ దగ్గరున్నదంతా దోచేస్తానని సందేహమా?' అన్నాను చనువుగా.

'అరెరేఁ.. అలా ఎందుకనుకుంటారు? అదికాదు!' అంటూ నొచ్చుకుని..

'అయినా దోచుకోడానికి నా దగ్గరేముందనీ? ఒకవేళ మీరు దోచుకోవాలనుకున్నా.. నా దగ్గరున్నవాటి కంటే మీ రవ్వలడ్డే ఖరీదైనది.. తెలుసా?!' అన్నాడు నవ్వేస్తూ.

'మరి? నేనెలా ఉంటానో చెప్పాను కాబట్టి.. అందరిలాగే నాలాంటిదాని దగ్గర్నుంచి ఏదీ తీసుకోకూడదని మీరూ అనుకుంటున్నారా?' ఎందుకో.. నా కంఠం కొద్దిగా జీరబోయింది. ఎంతగా వద్దనుకున్నా.. నాలోని 'ఆత్మన్యూనతాభావం' కొద్దిమంది 'దగ్గరివారి' వద్దే ఇలా వ్యక్తమౌతుంది.

'అయ్యయ్యోఁ.. మీరు మరీను! అలాగేం అనుకోవద్దండీ! నాక్కొంచెం మొహమాటం ఎక్కువ!' అని..

'ఏదీ.. ఇవ్వండి! ఇలా ఇవ్వండి!' అని చేయి చాచాడు ఆత్మీయంగా.

అతడలా చనువు తీసుకోవటం ముచ్చటగా అన్పించింది నాకు. నా చేతిలోని టిఫిన్‌బాక్స్ అతడి చేతికి తగిలేలా ముందుకి పెట్టాను మురిపెంగా. ఇబ్బందిగానే తీసుకున్నాడు.

'రవ్వలడ్డు చాలా బావుంది... కొన్నారా, చేశారా?' అడిగాడు కొంచెం తిని చూసి.

నవ్వాను.

'వంటకాల విషయంలో తినడానికి అవసరమైనవన్నీ చేయడం నాకు వచ్చండీ! కొనే అలవాటు లేదు! నేను బావుండనంత మాత్రాన నేను చేసేవి కూడా బావుండవనా మీ ఉద్దేశం?' అతన్నే సూటిగా చూస్తూ అడిగాను.

చప్పున అతని ముఖమంతా విచారం ఆవరించింది. బాధని కళ్లతో 'చూసే' స్థితి అతడికి లేకపోయినా.. బాధని అర్థంచేసుకున్న భావాన్ని నిజాయతీగా వ్యక్తం చేయగలిగే నిష్కపట భావం అతని ముఖంలో స్పష్టంగా కనిపించింది.

వెంటనే నోరు విప్పాడు.. నవ్వుతో పాటు..

'మిమ్మల్ని మీరు నిరూపించుకునే మార్గాల్లో ఈ వంటపని కూడా ఒకటేమో! ఎవరో అన్నారు.. ఒక వ్యక్తి ప్రియమైనది ఏదైనా కోల్పోయినప్పుడు ఆ క్షణంలోనే ఒక అద్భుత సృష్టికర్త అవుతాడట. ఆ పోగొట్టుకున్నదే తక్కువగా అన్పించే మరో

గొప్ప విజయాన్నేదో సాధిస్తాడట! మనలాంటి వారికి సరిగ్గా సరిపోయే మాట అది!'

అబ్బురంగా చూశానతడి వైపు! అతడి మాటలు వింటుంటే నాలోని ఆత్మన్యూనతాభావం 'ఆత్మవిశ్వాసం'గా రూపాంతరం చెందడం తెలుస్తోంది నాకు. అంతేకాదు.. తనుకూడా 'మనలాంటి' అనే పదం వాడటం నాకు నచ్చింది.

'నాకు కాదు.. మీకు సరిగ్గా సరిపోతుంది ఆ మాట! 'అంధత్వం' అనేది ఓ మేలిమి ముసుగైతే.. దాని వెనుక దాగిన 'మేధోదృష్టి' మీది! లోకుల దృష్టిలో మీరు అంధులేమో కానీ, లోకం పట్ల మాత్రం మీరు అంధులు కారు!' అన్నాను.

బదులివ్వకుండా విని ఊరుకున్నాడతను.

మరోసారి మౌనం మామధ్య నాట్యమాడింది. కానీ ఈసారి మౌనం.. భారంగా అనిపించలేదు నాకు. కారణం.. అతడి కళ్లు శూన్యంలోకి చూస్తూవున్నా, అతడు చూడలేకున్నా.. అతడి మనోనేత్రాలు మాత్రం నన్నే చూస్తున్నట్లు అనిపించడం!

చిత్రమైన విషయమేంటంటే.. ఆ చూపుల్లోని భావం 'నేనొక ఆడదాన్ని' అన్న విషయం గుర్తుచేస్తూ.. నేను మునుపెన్నడూ చవిచూడని 'పులకింత'కి గురిచేసింది.

* * *

'మీ ఇంట్లో ఎవరెవరుంటారు?' ఉన్నట్టుండి అడిగాను.

'నేనూ, మా అమ్మమ్మ!'

'ఇంకా..?' అని ఓ క్షణమాగి..

'అంటే.. భార్యా, పిల్లలూ.. అలా ఎవరైనా?' అనడిగాను.

'అలా ఎవరూ లేరు. నేనింకా పెళ్లిచేసుకోలేదు!' చెప్పాడు.

'అదేం..?' అసంకల్పితంగానే అడిగేశాను.

'ఏమో.. తెలీదు. చేసుకోలేదు.. అంతే!'

కొద్దిసేపయ్యాక మళ్లీ అడిగాను..

'మీకు 'తోడు'గా మరొకరుంటే బావుణ్ను.. అన్పించలేదా?'

తల అడ్డంగా ఊపాడు.

'మా అమ్మమ్మ ఉంది చాలు! మూడోవ్యక్తి వస్తే.. నాలో మీరన్న.. ఏమిటదీ ఏదో 'దృష్టి' అన్నారే ఇందాక.. మాయదృష్టా?' అంటూ అతడు తడుముకుంటూంటే..

'మేధో.. మేధోదృష్టి!' అని సరిచేశాను.

'ఆం.. నాకున్న ఆ దృష్టి కూడా పోతుంది. మరీ అన్యాయమైపోతాను. అందుకే వద్దు'

'అదేంటీ.. అలా ఎందుకు అనుకుంటారు? ఒకవేళ మూడోవ్యక్తి ఎవరైనా తనే మిమ్మల్ని ఇష్టపడి, కోరుకొని వస్తే?'

'ఎవరూ రారు.. నాకు తెలుసు!' చాలా స్పష్టంగా, ఖచ్చితంగా చెప్పాడు.

'లేదు.. మీకు తెలీదు.. వచ్చింది.. వచ్చేసింది!'

ఉలిక్కిపడుతూ..

'ఏంటీ..? ఏంటి మీరంటోంది?!' తడబడుతూ అడిగాడు.

నేను తమాయించుకుని..

'గుంటూరు! గుంటూరు స్టేషన్ వచ్చేసిందంటున్నాను!' అన్నాను.

'ఓం..' అంటూ నిట్టూర్పు విడుస్తూ నెమ్మదించినట్లుగా సర్దుకున్నాడు.

ట్రైన్ వేగం తగ్గసాగింది.. స్టేషన్ రాబోతోందనడానికి సూచనగా! రైలెక్కిన ప్రతిసారీ 'ఎప్పుడెప్పుడొస్తుందా!?' అని ఎదురుచూసే స్టేషన్.. ఈసారి వెంటనే వచ్చేయడం నాకు అస్సలు నచ్చలేదు. రైలు దిగాలంటే మనసంతా దిగులుగా ఉంది. 'నేను దిగాల్సిన స్టేషన్ వచ్చేసింది. ఇక జనగణమన అధినాయక జయహే..!' అన్నాను పేలవంగా నవ్వుతూ.

నవ్వలేదతను.. ఏదో చెప్పాలనుకుంటూ అతికష్టమ్మీద నిగ్రహించుకుంటున్నట్లుగా అన్పించింది నాకు. స్టేషన్ దగ్గరపడ్తోంది. అదేమిటో నేనే అడుగుదామని నోరు తెరిచాను.

అంతలో.. అతడే అడిగాడు.

'నాతో మాట్లాడాల్సింది ఇంకేమీ లేదా?'

ఆశ్చర్యంగా చూశాను.

'ఏముంటాయి ఇంకా? ఇప్పటికే చాలా విషయాలు మాట్లాడుకున్నాం కదా! మీరే చెప్పండి ఏదైనా.. ట్రైన్ ఆగబోతోంది. చెప్పండి త్వరగా.. ప్లీజ్!' అన్నాను కంగారుగా.

'మీరూ హైదరాబాద్‌లోనే కదా ఉండేది?'

'అవును.. కానీ, ఇద్దరిదీ పక్కపక్క ఇళ్లు కాదుకదా!' అనేశాను అసంకల్పితంగా. అతడి 'మనసు'ని చదివేసినట్లుగా, అందులోని 'భావం' అర్థమైనట్లుగా!

జేబులోంచి ఏదో తీసి నాకివ్వబోతున్నట్లు చేయి ముందుకి చాచాడు.

'ఏమిటిది?' అంటూనే తీసుకుని చూశాను.

విజిటింగ్ కార్డ్! అతడిది!!

* * *

'ఈరోజు పౌర్ణమి! నిద్ర పోవాలన్పించదు. మా ఇంట్లో అయితే ఆరుబయట

కూర్చొని ఆకాశంలో చంద్రుడి వంక చూస్తూ జాగారం చేయాలనిపిస్తుంది..' చెప్తూ ఆపాను మధ్యలో.

'ఔనా... పౌర్ణమి అంత బావుంటుందన్నమాట! అయితే..?'

'ఏం లేదు.. ఆరోజు నేను మీతో ట్రైన్‌లో మాట్లాడినంతగా ఇప్పటివరకూ నేనెవరితోనూ మాట్లాడలేదు. ఈరోజు మీతో మాట్లాడాలనే వచ్చాను. పౌర్ణమి వెన్నెలని చూస్తూ మా ఇంట్లో ఒంటరిగా, మౌనంగా ఉండటం కన్నా.. ఇక్కడ మీ ఇంట్లో, మీతో మాట్లాడుతూ, మరోవైపు చంద్రుణ్ని చూస్తూ గడపొచ్చనే ఉద్దేశంతో వచ్చాను..'

అతడి కళ్లలో 'వెలుగు' కన్పించింది నాకు.. చిత్రంగా!

'అయితే.. ఆ పౌర్ణమికి థాంక్స్!' అన్నాడు నవ్వుతూ.

నాకు తెలీకుండానే నా హృదయం ఆనందంతో నిండిపోయింది. అతడు నవ్వుతూ, సరదాగా మాట్లాడటం చూస్తుంటే.. నాలాగే అతడు కూడా ఎప్పుడూ 'నవ్వడం' అనే అదృష్టానికి నోచుకోలేదేమో.. అన్పించింది.

'ప్రకృతిలో మీకు ఏదిష్టం?' అడిగాను. నా మాటలకి నిస్సారంగా చేతివేళ్లతో కళ్లను నులుముకున్నాడతను.

'ప్రకృతిలో ఇష్టమైనవి అంటే.. ఎలాగూ చూడగలిగే వరం లేదు కాబట్టి వినడం వరకే నా భాగ్యం! వినడం, వాసన చూడటం, రుచి చూడటమే కదా నా జీవితం! ఆ మూడింటి ఆధారంగా చెబుతున్నాను నాకు నచ్చినవేమిటో.. సంగీతం అంటే ఎంతో ఇష్టం. మల్లెపూల వాసన అన్నా చాలా ఇష్టం! ఇక రుచిలో.. రుచిగా ఉండేదేదైనా ఇష్టమే!' అన్నాడు.

'మరి.. 'మనసు'కి నచ్చిన రుచుల్లో?' అన్నాను.

వెంటనే బదులివ్వలేదతడు.

'మనసు రుచి.. మనసు రుచి..' తడుముకుంటున్నట్లు తనలోతానే స్వగతంలా పలికాడు రెండు మూడుసార్లు.

'మనసు రుచి అంటే.. మరోలా అనుకోకండి. మనస్తత్వాల్ని బట్టి ఫలానా రుచిపట్ల ఇష్టం ఉంటుందిగా!' అన్నాను.

'తెలుసు..' తెలుసన్నట్లుగా తలూపుతూ నవ్వాడు.

'ఏం చెబుతాడా...' అన్నట్లుగా ఎదురుచూడసాగాను.

నిజమే.. మనసుల్లో కూడా చాలా రకాలున్నాయి. అందరి మనస్తత్వం ఒకేలా ఉండదు. నాకు నచ్చిన, ప్రియమైన 'మనసు రుచి'.. తనలోని లోపాల్నీ, లేమినీ దాచుకోకుండా ఆత్మసాక్షిగా, నిజాయతీగా, స్వచ్ఛంగా మాట్లాడే అతడి వైఖరి!

అతను చెప్పసాగాడు.. నేనేం మాట్లాడలేదు.. వింటూ ఉండిపోయాను.

'నాకు మీ మనస్తత్వం నచ్చింది. మీలోని సుగుణాలు కూడా! మీ గురించి మీకు తెలిసిందే గాక.. మీ గురించి పదిమందీ అనుకునేదీ, చెప్పుకొనేదీ కూడా చెప్పారు. మీ తప్పొప్పులూ, మీ గుణగణాలూ, మీలోని అవలక్షణాలూ.. అన్నీ వివరించారు. ఇన్నేళ్లకి, ఇన్నాళ్లకి 'మనిషి' అనే పదానికి సరైన అర్థంలా మీరు నాకు కన్పించారు..'

'కన్పించానా..?'..

ఆనందం, గర్వం, మురిపెం.. ఒకేసారి ధ్వనించాయి నా స్వరంలో.

'ఔను.. కన్పించారు. నాలోని అంతర్నేత్రానికి! నా మనసుకి, నా మనోదృష్టికి! మీ మాటల్లో చెప్పాలంటే నా మేధో దృష్టికి కనిపించారు.. కనిపిస్తున్నారు! నేను మిమ్మల్ని చూడగలుగుతున్నాను!'

సంభ్రమంగా చూశానతడ్ని! నాపట్ల అతడి మదిలో దాచుకున్న భావాల్ని ఏ విధంగా, ఎలాంటి సమయంలో, ఎటువంటి సందర్భంలో వ్యక్తం చేస్తున్నాడో అర్థమై.. ఒక్కసారిగా స్త్రీ సహజమైన సిగ్గు కమ్మేసింది నన్ను.

ఆ తర్వాత ఎన్నో కబుర్లు చెప్పుకొన్నాం ఇద్దరం. ఆకాశంలో చంద్రుడివంక చూస్తూ, చల్లని వెన్నెలని ఆస్వాదిస్తూ, హాయి గొలిపే అతడి మాటలు వింటూంటే.. గంటలు కూడా క్షణాల్లా గడిచిపోయాయ్.

'ఇక... వెళ్తా!' అంటూ లేచాను.

'అప్పుడేనా..?' దిగులుగా అన్నాడు.

'ఏం..? ఎప్పటికైనా వెళ్లాల్సిందే కదా?' అన్నాను.

నిజానికి నాకూ వెళ్లాలని లేదు. కానీ, తప్పదు కదా?! నేను అన్నదానికి అతడేం బదులిస్తాడోనని ఎదురుచూశాను. తనలో తానే తర్జనభర్జన పడుతున్నట్లుగా, సందిగ్ధంగా ఉండిపోయాడు చాలాసేపు. ఆ తర్వాత అన్నాడు..

'పౌర్ణమి.. ఇంత అద్భుతంగా ఉంటుందని నాకిప్పటివరకూ తెలీదు!'

'నాక్కూడా..!' నా మనసులోని అనుభూతి అతడి మాటల్లో వ్యక్తమయ్యేసరికి ఠక్కున అనేశాను.

'ఇలాంటి పౌర్ణమిలు ప్రతిరోజూ వస్తే ఎంత బావుణ్ను..!'

నా మనసుని చదువుతున్నట్లు ప్రతి భావాన్నీ అతడు మాటల్లో తెలుపుతూంటే విస్మయంగా చూశానతడి వంక.

'నాకూ అలాగే అన్పిస్తోంది. కానీ, అదెలా వీలవుతుంది?' అన్నాను నిరాశగా.

అతడేమీ మాట్లాడలేదు. నాకింకేం మాట్లాడాలో తెలీలేదు.

'సరే మరి.. వెళ్లనా!' అయిష్టంగానే లేచి నించున్నాను.

అప్పుడు కూడా అతడేమీ మాట్లాడలేదు. కాసేపు ఎదురుచూసి..

'ఓకే. గుడ్‌నైట్!' అంటూ అక్కణ్ణుంచి కదిలాను.

అప్పుడన్నాడు హఠాత్తుగా..

'ఆశలు రేపడం మీకు బాగా తెలుసు..!'

ఆశ్చర్యంగా చూశానతడి వంక.

'నేను మీలో ఆశలు రేపానా..?' అన్నాను.

'ఔను! సమాంతర రేఖలు ఎన్నటికీ కలవవేమో కానీ.. మనం కలిసి ఉంటామన్న నమ్మకం నాకుంది!' అన్నాడు.

'ఎలా..?' అప్రయత్నంగానే అడిగాను.

'అందరు భార్యాభర్తల్లా ఒకరి లోపాల్ని మరొకరు వేలెత్తి చూపుకొనే పరిస్థితి మనమధ్య రాదు కాబట్టి!'

'ఏమిటంత ధీమా? అందరు భార్యల్లాగే నేనూ మారిపోతే?'

'నువ్వు మారవు..!'

అతడి 'నువ్వు' అనే ఏకవచన సంబోధనలో ఆత్మీయత, అనురాగమే కాదు.. నా మనసుని తన మనసుతో ఆత్మీయంగా తాకిన అనుభూతి, తన హృదయంతో నా హృదయాన్ని ఆప్యాయంగా హత్తుకున్న నిశ్చింత కూడా ధ్వనించింది.

'నేను మారనని అంత నమ్మకమేంటి మీకు?'.. అతడి ఉద్దేశం ఇంకాస్త స్పష్టంగా తెలుసుకోవాలని నా ప్రయత్నం.

'రెండు ఒకట్లు పక్కపక్కన చేరితే ఎంతవుతుంది?' ఉన్నట్టుండి అడిగాడు.

అసందర్భ ప్రశ్నలా అన్పించి.. ఆశ్చర్యంగా అతడి వైపు చూసి, చెప్పాను వెంటనే

'పదకొండు!'

నవ్వాడతడు.

'చూశావా! నువ్వూ, నేనూ కలిస్తే 'రెండు' కాదు.. పదకొండు! అందుకే నువ్వు మారవు. మనం కలకాలం అన్యోన్యంగా ఉంటాం!' అంటూ నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

చిత్రం.. నా చేయి 'అందుకోవడానికి' అతడు తడుముకోలేదు.

* * *

ముప్ఫయ్ అయిదేళ్లు గడిచాయి.. ఒక పాప.. ఒక బాబు!

మాలాగా కాదు. ఏ లోపమూ లేని సంపూర్ణ ఆరోగ్యవంతులు. ఎలాంటి వైకల్యమూ లేని పరిపూర్ణవంతులు!

పెళ్లిళ్లు కూడా ఘనంగానే చేశాం. మనవలూ, మనవరాళ్లతో కాలక్షేపం చేయడమే మా దినచర్య ఇప్పుడు!

ఇన్నేళ్ల మా వైవాహిక జీవితంలో ఏనాడూ పల్లెత్తుమాట అనుకోలేదు ఇద్దరమూ.ముఖ్యంగా.. మావారి 'అంధత్వం' నాకేనాడూ గుర్తురాలేదు. అలాగే.. శరీరమంతా తెల్లని మచ్చలతో నిండిపోయిన నా 'చర్మవ్యాధి' కూడా ఆయనకి జ్ఞాపకం రాలేదు.

ఇంతకీ.. నా పేరేంటో చెప్పలేదు కదూ మీకు?

..'మానసవంశీ!' ఏంటీ.. మావారి పేరేంటో కూడా చెప్పమంటారా?

ఉహుఁ.. చెప్పను! నా పేరు నుంచి కూడా ఆయన్ని విడదీయటం నేను తట్టుకోలేను!

***

## యస్వీ కృష్ణ

యస్వీ కృష్ణ. రచయితగా, ప్రచురణ కర్తగా సుపరిచితులు. రసాయన శాస్త్రంలో ఎమ్మెస్సీ చదివారు. న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్నారు. ఫైన్ ఆర్ట్స్ (శిల్పం)లో బీఎఫ్ఏ డిగ్రీ, శాస్త్రీయ సంగీతం (కర్ణాటక వయొలిన్)లో బీఏ చేశారు. శాస్త్రీయ నృత్యం(కథక్)లో డిప్లొమా చేసి జాతీయ ప్రదర్శనలూ ఇచ్చారు. ఇక సాహిత్యంలో.. కవి, కథా - నవలా రచయిత, వ్యాసకర్త, విమర్శకుడు, ప్రచురణకర్త కూడా. 'జయంతి పబ్లికేషన్స్' ప్రచురణ సంస్థను స్థాపించి.. వర్ధమాన రచయితలు మొదలుకొని లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తల రచనలు 410కి పైగా పుస్తకాలుగా ప్రచురించారు. తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేస్తున్నారు. వీరి రచనలు దాదాపు అన్ని ప్రముఖ దిన-వార-పక్ష-మాస పత్రికలలో ప్రచురితమయ్యాయి. రేడియో-దూరదర్శన్లలోనూ ప్రసారమయ్యాయి. ఎన్నో రచనలకు బహుమతులు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆథర (ఇన్సా)' సంస్థకు రెండు తెలుగు రాష్ట్రాల తరపున సమన్వయకర్తగా ఉన్నారు. పలు జాతీయ- అంతర్జాతీయ సాహితీ సదస్సులలో పాల్గొన్నారు. 'నమస్తే తెలంగాణ - ముల్కనూరు సాహితీపీఠం' కథలపోటీ-2022లో 'గుండె చాటు జ్ఞాపకం' కథ, 2023/24లో 'అంతర్నేత్రం' కథ బహుమతికి ఎంపికయ్యాయి.

93999 39302

# ఒక దీపం వెలిగింది



గాజోజు నాగభూషణం

ట్రాన్స్‌ఫర్ షెడ్యూల్ రాగానే, ఆన్‌లైన్‌లో 'యూపీఎస్ కొండాపూర్' మొదటి ఆప్షన్ పెట్టుకుంటే.. తెలిసిన వాళ్లందరూ వద్దన్నారు. కారణాలు అడిగితే ఒక్కో మిత్రుడు ఒక్కో సమస్య గూర్చి చెప్పాడు. అందరి సారాంశం ఏమిటంటే, ఆ పాఠశాల గంగెద్దుల కాలనీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. గంగెద్దుల వాళ్ల పిల్లలు తప్ప వేరే పిల్లలుండరు. వాళ్లంతా చాలా వెనుకబడి ఉంటారు. తల్లిదండ్రులకు చదువు పట్ల ఏమాత్రం ఆసక్తి, అవగాహన ఉండదు. విద్యార్థులకు క్రమశిక్షణ బొత్తిగా తెలియదు. విపరీతమైన అల్లరి. తల్లిదండ్రులు సంవత్సరంలో సగం రోజులు వేరే ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల, పిల్లలూ బడికి సరిగా రారు. బడి బడిలాగా ఉండదు. బంజరుదొడ్డిలాగా ఉంటుంది.

ఇలా అందరూ ప్రతికూలమైన విషయాలే చెప్పారు.

కానీ, నా ఇరవై ఐదు సంవత్సరాల అనుభవంలో అననుకూలంగా ఉన్న పరిస్థితులను ఎదుర్కోవడం నాకు కొత్తేం కాదు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకొని, విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు విద్యా నైపుణ్యాల పెంపుదలలో గుణాత్మకమైన మార్పులు తేగలిగాను. గ్రామీణ ప్రాంతాలలో పేరుకుపోయిన మూఢవిశ్వాసాలలోనూ కొన్నిటిని మార్చగలిగాను. నా సేవలకు గుర్తింపుగా రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులనూ తీసుకున్నాను.

ఊహించినట్లుగానే కొండాపూర్‌కు బదిలీ అయి ఉత్తర్వులు తీసుకొని పాఠశాలలో జాయిన్ కావడానికి వెళ్లాను.

నన్ను చూడగానే పిల్లలు..

'కొత్త సారచ్చిండు' అంటూ కేకలు వేస్తూ, ఒక బెంచీ మీదినుండి మరొక బెంచీ పైకి దుంకసాగారు.

పిల్లలు మరీ ఇంత అదుపుతప్పి ఉండటం చూసిన మొదటి అనుభవమే నన్ను బెంబేలెత్తించింది.

'చదువు కంటే ముందు వీళ్లలో క్రమశిక్షణ నేర్పాలి' అని స్టాఫ్ మీటింగులో

అంటే..

'వీళ్ల జీవితాల్లోనే క్రమశిక్షణ లేదు సర్! వీళ్లు అంతే.. వీళ్ల తల్లిదండ్రులూ అంతే! ముందుముందు మీకే తెలుస్తుంది' అంది నా తరువాత సీనియర్ అయిన రమ్య మేడం.

'లేదమ్మా! మన ప్రయత్నం మనం చేద్దాం. దేనినైనా పాజిటివ్‌గా ఆలోచిస్తే పరిష్కారం దొరక్కపోదు'..

నా మాటలకు ముసిముసి నవ్వులు నవ్విన ఆ టీచర్ మనోగతం నాకర్థం కాలేదు.

* * *

ముందుగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలన్న సంకల్పంతో బడివేళల తరువాత టీచర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రైవేట్‌కు వెళ్లే పిల్లల్ని మా స్కూలులో చేర్పించమని అడిగితే.. అందరిదీ ఒకటే మాట.

'గంగెద్దుల వాళ్ల పిల్లలతో కలిసి చదువుకుంటే ఆ జంగ్లీ లెక్కలు మా పిల్లలకు కూడా అలవాటవుతాయి. మేం అసలే పంపం'.

నాకు ఆశ్చర్యం వేసింది. ఇది కూడా సమాజం వాళ్ల పట్ల చూపిస్తున్న ఒక వివక్షనే. పాఠశాల అంటే ఏ ఆధిపత్యాలు, అంతరాలకు చోటులేని ఒక విజ్ఞాన, వికాస కేంద్రంగా ఉండాలి. ఈ పరిస్థితిలో మార్పు తేవాలంటే వారి సాంస్కృతిక మూలాలను అధ్యయనం చేయాలని నిశ్చయించుకున్నాను.

* * *

పాఠశాలకు సరిగా రాని విద్యార్థులను కలవడానికి వాళ్ల కాలనీలోకి వెళ్తే, వాళ్ల జీవన విధానాన్ని అంచనా వేయొచ్చని అనుకున్నాను. అక్కడికెళ్లి చూస్తే.. ఇండ్లన్నీ ఇందిరమ్మ పథకం కింద కట్టించినవి. దాదాపు శిథిలావస్థలో ఉన్నాయి. ఏ ఇంట్లోనూ తల్లిదండ్రులు లేరు. ప్రతి ఇంట్లోనూ ముసలివాళ్లు, పెండ్లికాని ఆడపిల్లలు, రెండు మూడేళ్ల వయస్సు పిల్లలు మాత్రమే ఉన్నారు.

ఆడపిల్లలకు సాధారణంగా పన్నెండేళ్లు ఆపై వయస్సులోపే పెళ్లిల్లు చేస్తారు. గంగెద్దులాడిస్తూ, బిచ్చమెత్తుకుంటూ కొందరు జీవిస్తే ఇంకొందరు వ్యవసాయంతోపాటు చిన్నచిన్న వ్యాపారాలు చేస్తారు.

పిల్లలు రోజూ బడికి పోతున్నారా? చదువుతున్నారా లేదా? వాళ్లకు కావలసిన పుస్తకాలు, నోట్ బుక్కులు ఉన్నాయా? ఇలాంటి విషయాలేవీ వాళ్లకు పట్టవు. సిబ్లింగ్ కేర్ కోసం ఎక్కువమంది పిల్లలు ఇంటి వద్దే ఉంటారు. పదేండ్ల వయసున్న మగపిల్లలు చదువు మధ్యలోనే మానేసి, కంట్రోల్ బియ్యం కొనడం – అమ్మడం, వేటకు వెళ్లడం వంటి పనులు చేస్తూ డ్రాపవుట్స్‌గా మిగిలిపోతారు. వాళ్ల కాలనీకి

ఎప్పుడు వెళ్లినా, పేరెంట్స్ ఎవరూ ఉండరు.

ఇంట్లో ఉన్న ముసలి వాళ్లను కదిలిస్తే..

'ఏం జెయ్యమంటరు సారూ! ఆల్లు బేరానికి పోతేనే ఇల్లు గడుస్తది. ఇగ సదువంటే ఆల్లకు అచ్చే కాడికస్తది తియ్యుండ్రి' అంటారు.

'జీవన పోరాటంలో అనివార్యంగా వాళ్లు ఇల్లు విడిచి వెళుతున్నారు. వాళ్ల ఆర్థిక వెనుకబాటుతనమే వాళ్ల అజ్ఞానానికి కారణం' అని రమ్య మేడంతో అనగానే..

'వాళ్లేమీ ఆర్థికంగా పూర్తిగా లేమిని అనుభవిస్తున్న వాళ్లుకాదు సార్. ఎవరి ఇండ్లలో ఏ శుభకార్యమైనా, చావులాంటి అశుభకార్యమైనా వాళ్ల ఇండ్ల ముందు గుంపుగా వాలి వేలకువేలు వసూలు చేస్తారు. ఒక్కొక్కరికీ రెండు నుండి పది ఎకరాల భూములన్న వాళ్లూ ఉన్నారు. లక్షలాది రూపాయలు వడ్డీకి తిప్పుతారు'.

ఈసారి ఖంగుతినడం నా వంతయ్యింది. పరస్పర విరుద్ధ అంశాలు నా అనుభవంలోకి వచ్చేసరికి, ఏది నిజమో తెలుసుకోలేని సందిగ్ధావస్థలో పడిపోయాను.

* * *

మధ్యాహ్నం పిల్లలు భోజనం చేస్తున్న సమయంలో రెండవ తరగతి చదువుతున్న వంశీ తల్లి ఏడుస్తూ, అరుస్తూ రువ్వడిగా వచ్చింది. తింటున్న వాన్ని తింటున్నట్టే లేపి చెయ్యి పట్టుకొని గుంజుకు పోసాగింది.

'ఏమైందమ్మా.. అన్నమైనా తినకుండా వాన్ని అట్లా గుంజుకుపోతున్నావు' అని అడగ్గానే..

'బతుకే బాయిల వడ్డట్లయ్యింది. బువ్వ నెవడడిగిండు సార్' అంటూ పోతనే ఉంది.

నాకేమీ అర్థం కాకుండా అలాగే ఉండిపోయాను.

మధ్యాహ్న భోజనం వండే వెంకటమ్మ..

'పెండ్లం మొగని పంచాతి సారు. ఇది ఉండంగనే ఇంకోదాన్ని తెచ్చుకున్నడు. ఇది తిరగవడితే రాత్రి బాగా తాగచ్చి ఇయ్యరమయ్యర కొట్టిండు. 'ఎవనితో జెప్పుకొంటవో చెప్పుకో.. పో!' అని బరిదెగించితే, అది పోలీస్ స్టేషనుకు పోతంది' అన్నది.

'ఈ అమ్మాయి నా స్టూడెంట్ సార్. ఏడవ తరగతి పూర్తికాగానే చదువు మానిపించి పెండ్లి చేశారు. ఇక్కడి ఆడ పిల్లలందరి పరిస్థితి కొంచెం అటుఇటుగా ఇంతే ఉంటుంది' అంది రమ్య మేడం.

'బాల్య వివాహాలు నిరోధించడానికి పోలీస్, రెవెన్యూ ఇంతటి

యంత్రాంగముంది కదా, వీటికి అడ్డుకట్ట వేసే ప్రయత్నాలేవీ జరగడం లేదా? మేడం' అంటే..

'ప్రభుత్వ యంత్రాంగం వీళ్ల కోసం అవేర్‌నెస్ క్యాంప్ ఏర్పాటు చేస్తే, అంతా తిరగబడి రాళ్లతో కొట్టి ఉరికించిన చరిత్ర వీళ్లది. వీళ్లను ఎవరూ మార్చలేరు సార్. అన్నీ మూర్ఖమైన ఆలోచనలే. చేసుకున్న దానిమీద మోజు తీరిపోతే, కుల పంచాయితీ పెట్టి లక్షలకు లక్షలు పోసి విడాకులిచ్చి వేరేవాళ్లను చేసుకుంటారు. పోలీసులు, కోర్టులు వాళ్లకు లెక్కలేదు సార్'.

బాల్య వివాహాలు ఆగాలంటే వాళ్లకు చదువు అందాలి. ముఖ్యంగా ఆడపిల్లలకు. ఎలాగైనా ఈ అనాచారాన్ని ఆపేందుకు నేనే ఏమైనా చెయ్యాలి అనుకున్నాను.

మాది ప్రాథమికోన్నత పాఠశాల. అంతా పదమూడేళ్లలోపు పిల్లలే. కొందరు పెద్ద పిల్లలు నా మాటల్ని శ్రద్ధగా వింటారు. వాళ్లవంటూ సొంత ఆలోచనలు రూపుదాల్చని పసి వయసులో వాళ్ల అమ్మానాన్నల మాటలు వాళ్లమీద ఒక ముద్రను వేస్తున్నాయని నాకర్థమైంది. వాళ్లకు కొత్త ఆలోచనలను, కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయాలనుకున్నాను.

తినడానికి తిండిలేని నిరుపేదలు, అంగవైకల్యంతో బాధపడే అసహాయులు, చదువు అనే దీపపు వెలుగులో ఎన్ని విజయాలు సాధించారో నా ట్యాబ్‌లోని వీడియోలను చూపించి, సాధారణ భాషలో వారి మనసుకు హత్తుకొనే విధంగా వారిని మోటివేట్ చేయడం మొదలుపెట్టాను.

ఒకరోజు కాలనీలో మీటింగ్ పెట్టి తల్లిదండ్రులతో మాట్లాడాలనుకున్నాను. అయితే, రమ్య మేడం గతంలో జరిగిన విషయాల గురించి చెప్పింది గుర్తొచ్చింది. అందుకే బాల్యవివాహాల గురించి అని చెబితే ఎవరూ రారని, మహిళల ఉపాధి కోసం మార్గాల గురించి అని మాత్రమే చెప్పాను.

అధికారులు, పేరు మోసిన రచయిత్రులు, కౌన్సిలర్స్‌ను తీసుకువచ్చాను. ముందుగా మహిళలకు గల ఉపాధి అవకాశాల గురించి మాట్లాడించి మెల్లగా ఆడపిల్లల చదువు ప్రాధాన్యత గురించి, బాల్య వివాహాల వల్ల సంభవించే శారీరక సమస్యలతోపాటు, బాల్యవివాహాల వల్ల సామాజిక వివక్షకు, వెనుకబాటుకు ఎలా గురవుతారన్న విషయాన్ని చెప్పగానే మీటింగులో కలకలం మొదలైంది.

సాయంత్రం ఏర్పాటుచేసిన మీటింగ్ కావడం వల్ల పనులు ముగించుకొని, బాగా తాగి వచ్చిన వాళ్లు ఆవేశంగా మాట్లాడటం మొదలుపెట్టారు.

'ఏంది సారూ! మా ఆడోల్లకింత పైసలు దొరికే పనుల గురించి చెప్పుతనని, గీ లేనిపోని రామాయణం మొదలు పెట్టిచ్చినవ్. నీకేమైనా మతుందా. మా

ఆడివిల్లగాండ్లను ఎంతదాంక సదివియ్యన్నో.. ఎప్పుడు లగ్గం జెయ్యన్నో మా కెరుకనే. నువ్వేంది జెప్పేది. టీవీలల్ల, సినిమాలల్ల సూత్త లేరా.. పేమా దోమా అని ఎన్ని కతలు వడుతున్నరో! కులంగానోడు, తలంగానోడు ఎవనెంటనో పడిపోతే నువ్వేమన్నా కావలుంటవా!? నాలుగొద్దులు సదువు జెప్పుకొని పోయెటోనివి.. గంతల్నే ఉండు. మా పోరగాండ్లయి, మాయి దమాఖ్‌లు ఖరాబు జేత్తనని జూత్తే మంచిగుండది. ఏదో బడి సారువని ఇడ్సివెడ్తున్నం. మీటింగ్ లేదు.. గీటింగ్ లేదు ఛల్ దొబ్బేయిండ్రి!' అంటూ ఒక్కసారిగా పరిస్థితిని భయానకంగా మార్చేశారు.

ఊహించిందే కావడంతో మేము కూడా వెంటనే మీటింగ్ ఆపేశాం. అయినా నేను నా ప్రయత్నాన్ని విరమించుకోదల్చుకోలేదు. వందల సంవత్సరాలకు ముందే ఆ మహాతల్లి సావిత్రిబాయి పూలే మహిళలకు చదువు అందివ్వడానికి ఛాందస సమాజాన్ని ఎదిరించి ఎన్ని కష్టాలకో ఓర్చి ముందడుగేయకుంటే.. మహిళలకు చదువు దక్కేదా!? ఇప్పటి ఈ వెలుగులన్నీ ఆ తల్లి తన రక్తాన్ని చమురుగా చేసి వెలిగించిన దీపాలే కదా!

నాకున్నదల్లా. ఇక పిల్లల మెదళ్లలో అభ్యుదయాంకురాల్ని మొలిపించడమే. వాళ్ల పూర్వీకులు విద్యకు దూరంగా ఉండటం వల్లనే ఈ తరం పసిమొగ్గలు పూసీ పూయకుండానే రాలిపోతున్నారు. బ్రహ్మలిపి ఏమోగానీ తల్లిదండ్రులే వారి నుదుటన అజ్ఞానలిపిని రాస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే వచ్చే తరాలు కూడా ఇదే చీకటిలో మగ్గిపోతాయి. వీళ్లలో కాంతిని పంచగలిగే ఒక్క జ్యోతినైనా నేను వెలిగించగలనా? నేను వేసుకున్న ప్రశ్నకు సమాధానంగా నాకు వసంత కనిపించింది. తెలివైనది. నా మాటలపట్ల ఆకర్షణ, విశ్వాసం మెండుగా ఉన్న అమ్మాయి. ఈ ఒక్కదాన్ని మార్చగలిగినా.. ఒక దీపం మరికొన్ని దీపాల్ని వెలిగించినట్లు, వాళ్ల సామాజికవర్గంలో మార్పునకు దోహదపడే రోల్ మోడల్‌గా నిలిచిపోతుందని స్థిరపరుచుకున్నాను.

అప్పటినుండి వసంత నా కలల ప్రతినిధిగా మారిపోయింది. ఆమెకు ముందే చెప్పాను. సాయంత్రాలు ఫోన్‌చేస్తే అమ్మా నాన్నలకు డౌట్స్ క్లారిఫికేషన్ కోసమేనని చెప్పాలని. జీవితంలో అనేక అవాంతరాలను దాటుకొని, గొప్పగొప్ప విజయాలు సాధించిన వారి గురించి స్ఫూర్తిదాయకంగా వివరిస్తూ ఆమెకు ఒక జీవిత లక్ష్యాన్ని నిర్దేశించసాగాను.

ఉపాధ్యాయ వృత్తిలో నేను సాధించిన విజయాలు, పురస్కారాలన్నీ ఒక ఎత్తయితే, ఈ ఒక్క విజయాన్ని పొందితే నా అంతిమ విజయంగా ఆనంద పడతాను. గతంలో కూడా జోగినిగా మారిన విద్యార్థిని ఒకామెను తిరిగి వివాహం చేసుకొనేలా ప్రోత్సహించి విజయం సాధించాను. మధ్యలోనే చదువు మానేసిన

వారిని ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేయించగలిగాను. కొందరు ఉద్యోగాలు కూడా సాధించారు.

చదువుతోపాటు, విద్యార్థుల వ్యక్తిగత జీవితాలనూ అధ్యయనం చేయడం నాకు గురుపరంపరగా అబ్బిందే. పదవ తరగతి వరకు సోషల్ స్టడీస్ బోధించిన హన్మాండ్లు సార్ నాకు మార్గదర్శి. సమాజంలో నెలకొన్న కులమత భేదాలు, ఆర్థిక అంతరాలు, లింగ వివక్ష, అనేక రూపాల్లో కొనసాగే హింసను కళ్లకు కట్టినట్లు వివరించి, వాటి ప్రభావాలు విద్యార్థుల చదువుపై, ఎదుగుదలపై ఎలాంటి ప్రభావాల్ని చూపుతాయో చెప్పేవాడు. వాటిని అధిగమించాలంటే, చదువు ఒక్కటే ఆయుధమని బోధపరిచారు.

విద్యాసంవత్సరం ముగింపు దశకు వచ్చింది. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తుంటే, వారం రోజులుగా వసంత బడికి రాకపోవడం గమనించి పిల్లలను అడిగాను.

'ఆమెకు పెళ్లి సెటిల్ అయ్యింది సార్' అని పిల్లలు అనగానే.. నా పక్కనే ఏదో బాంబ్ పేలినట్లు అదిరిపోయాను. షాక్‌కు గురయ్యాను. నా చెవులను నేనే నమ్మలేకపోయాను. నా తల బద్దలవుతున్న భావన.

'మేడం' అంటూ గట్టిగా అరవగానే రమ్య మేడం పరుగున వచ్చారు. నాకు తెలియకుండానే, నా కళ్లలోంచి కారిపోతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ..

'ఇలా జరిగిందేంటి మేడం? వసంతకు పెళ్లి అంటున్నారు. ఎంత ఘోరం ఇది. మనం ఈ పెళ్లిని ఆపలేమా? ఏది జరుగకూడదని భయపడ్డానో, అదే జరుగుతున్నది. ఎలాగైనా ఈ పెళ్లిని జరుగనివ్వను. అధికారులకు కంప్లయింట్ చేస్తాను'.

'సర్! మీరు అనవసరంగా ఆందోళన పడుతున్నారు. మీరేదో చేయాలన్న మితిమీరిన ఎక్స్‌పెక్టేషన్స్‌తో ఉండటం వల్ల అతిగా డిస్టర్బ్ అవుతున్నారు. నిజానికి ఇవన్నీ ఇక్కడ వెరీ కామన్. అనవసరంగా ఇందులో తలదూర్చకండి. గతంలో పోలీసులు, అధికారులు ప్రయత్నించినా ఈ తతంగం ఆగలేదు. ఒక ఉపాధ్యాయుడిగా మీరేం చేయలేరు. అది మీకు కూడా మంచిది కాదు. వాళ్లు అందరి లాంటివాళ్లు కాదు. నా మాట విని ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయండి'.

ఇక ఆమెతో వాదించలేదు. వసంతకు ఫోన్ చేస్తే ఎత్తలేదు. ఆ రాత్రంతా నాకు నిద్రే పట్టలేదు. తెల్లవార్లూ వసంత గురించే ఆలోచించసాగాను. పద్నాలుగేండ్ల పసికూన. ఇంత చిన్నవయసులో చదువుకు దూరమై జీవితమంతా ఆ చక్రబంధంలో చిక్కి చితికిపోవాల్సిందే. వీళ్లలో ఇలా ఎంతమంది బలి

అవుతున్నారో.

పెళ్లిరోజు నాడు ఉండబట్టలేక ఒక్కసారి వెళ్లి వస్తానంటే.. రమ్య మేడం తీవ్రంగా అభ్యంతర పెట్టారు. వాళ్లు ఎంత నిర్దయగా ఉంటారో చెప్పి నన్ను నిరోధించారు.

నెల రోజులు నేను మనిషిని కాలేకపోయాను. బడిలో ఉన్నా, ఇంట్లో ఉన్నా ఆ పసి ముఖమే కళ్లలో కదలాడింది. ఎంత ఆశపడ్డాను. ఎన్ని ఆశలు కల్పించాను ఆమెకు. ఎంత మథనపడిందో.. ఎంత పెనుగులాడిందో. తరతరాలుగా పేరుకుపోయిన మూఢాచారాల ముందు, పెళ్లిలో పోచమ్మకు బలిచ్చే మేకపిల్లలాంటిదే.. వాళ్ల కులంలోని ఆడపిల్ల పరిస్థితి అనుకున్నాను.

కోర్టుకేసుతో నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియ తిరిగి చేపట్టడం వల్ల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ ప్రమోషన్‌తో నేను వేరే ఊరికి వెళ్లిపోయాను. ఆ ఊరిని విడిచి వెళ్తుంటే.. నా సొంత కూతురిని పులిబోనులోకి తోసి వెళ్తున్న బాధ ఏదో నన్ను మెలిపెట్ట సాగింది. నా అశక్తత నన్ను వెక్కిరించసాగింది.

* * *

కాలం గిర్రున తిరిగిపోయింది. నేను పదవీ విరమణ పొందాను. విశ్రాంత జీవితం గడుపుతున్న సందర్భంలో క్రమక్రమంగా వసంతను మర్చిపోయినా, జ్ఞాపకం వచ్చిన ప్రతీసారీ.. నా మనసు సునామీతో అల్లాడిన సాగరమవుతుంది. చదివే కథల్లో, చూసే సీరియల్లలో ఎక్కడ వసంత, వసంతం పదాలు కనిపించినా, వినిపించినా.. తెలియకుండానే నా కళ్లు తడితడిగా మారేవి. గుండె బరువెక్కేది.

నేను రిటైర్ అయిన చాలా సంవత్సరాలకు ఒకనాడు ఉదయం ఓ వాహనం నా ఇంటి ముందు ఆగింది. అటెండర్‌లాంటి వ్యక్తి ముందు దిగి కారు డోర్ తెరవగానే.. అందులోంచి ఒక యువతి దర్పంగా దిగి నా వద్దకు రాసాగింది. నేను అయోమయంలో ఆమెను చూడసాగాను. వచ్చీ రాగానే, నన్ను, నా భార్యను కూర్చోబెట్టి పట్టు శాలువాలు కప్పి, కొత్త బట్టల కవర్లు మా చేతుల్లో పెట్టి స్వీట్లు, పండ్లు ఇచ్చి.. మా ఇరువురి కాళ్లకు దండం పెట్టింది. ఆమె ఎవరో ఎంతమాత్రం పోల్చుకోలేకపోతున్నా.

'సార్! నేను.. మీ వసంతను. కొండాపూర్‌లో మీవద్ద ఏడవ తరగతి వరకు చదువుకున్నాను. గుర్తుకొచ్చానా!?..'

'వసంత' పేరు వినగానే నా ఒళ్లంతా ఒక్కసారిగా కంపించింది. సజల నేత్రాలతో ఆమెను ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని..

'అమ్మా.. వసంతా! నువ్వా బేటా.. నా వసంత వా! నాకోసం వచ్చావా! ఎలా ఉన్నావు తల్లీ.. ఏం చేస్తున్నావు!?'.. వివశుడనై అడుగుతుండగానే,

'మీ వసంత ఇప్పుడు మీ జిల్లా డిప్యూటీ కలెక్టర్. మీరు వెలిగించిన దీపం. కాలం వీచిన కల్లోల గాలులకు ఆరిపోయినా.. మీ ఆశీస్సుల చమురుతో, మీరందించిన జ్ఞాన కాంతితో తనకు తాను వెలిగించుకొని ఇప్పుడు మీ ఆశీర్వాదం కోసం మీ ముందు నిలబడింది. మీరు కోరుకున్నట్లుగా మా సమూహంలోనే కాదు, సమాజంలోని ఏ ఆడపిల్లా బాల్య వివాహపు బాకుకు బలి కాకుండా రక్షణగా నేను నిలుస్తాను. అప్పుడు ఒక సాధారణ ఉపాధ్యాయులుగా మీకు అసాధ్యమైంది. ఇప్పుడు అధికారిగా, మీ ఆశయంలోంచి ఉద్భవించిన ఆయుధాన్ని నేను. మీ కలను నేను నిజం చేస్తాను సార్!'

'ఇది కలా.. నిజమా!? ఇంతటి అద్భుతం ఎలా సాధ్యమైందమ్మా!?'.

'సార్.. మాటలతోనే సరిపుచ్చుతారా. ఈ పూట భోజనం మీతో చేయాలనుకుంటున్నా'.

'శారదా! వెళ్లమ్మా.. అందరికీ భోజనాలు సిద్ధం చేయ్. ఈసారి కొత్తగా వసంతం మన గడప తొక్కింది. మన ఇల్లే కాదు, ఆమె పారాడిన నేలంతా పచ్చదనంతో పరవశిస్తుంది'.

భోజనాలు చేస్తున్నంతసేపూ, తన గతమంతా చెప్పసాగింది వసంత.

'ఆనాడు మూర్ఖత్వం ముందు మీ విజ్ఞత వెలవెలబోయింది. మూఢాచారం ముందు నా నిరసన.. స్వరం లేనిదయ్యింది. ఒక్కడే కొడుకు. పదెకరాల భూమి, పెద్ద బిల్డింగ్ ఇవన్నీ నన్ను సుఖపెట్టేవని తొందరపడ్డాడు నాన్న. చదువుకొంటానంటే.. 'మన కులంలో ఏ ఆడదైనా ఉద్యోగం జేసిందా.. ఊర్లేలిందా!?..' అంటూ బలవంతంగా పెళ్లి జరిపించాడు. ఇద్దరు పిల్లలై, వాళ్లు బడికి పోతున్నప్పుడు, నాలో నివురు గప్పి ఉన్న ఆశయం నిప్పయి రగిలింది. మీరు నాకోసం పడ్డ ఆరాటం, నన్ను నిలబెట్టాలని చేసిన నిశ్శబ్ద పోరాటం నన్ను నిలువనీయలేదు. పెళ్లయినప్పుడు ఆపేసిన చదువు, తిరిగి ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పొందడంతో నన్ను నేను నిరూపించుకున్నాను. సోషల్ మీడియాలో ఎందరివో విజయగాథలు చూశాను. పెళ్లయి, పిల్లలైన తరువాత ఐఏఎస్, ఐసీఎస్‌లకు సెలెక్ట్ అయిన వాళ్ల స్టోరీలు ఒక ఎత్తయితే.. మీ ఆశయాన్ని నిలబెట్టాలన్న సంకల్పం మరొక ఎత్తయి గ్రూప్-1 పరీక్షలో స్టేట్ టాపర్‌గా నిలిచి డిప్యూటీ కలెక్టర్ పోస్ట్ సంపాదించాను. నా తరువాత లక్ష్యం సివిల్స్ రాసి కలెక్టర్ కావడమే. నా ప్రతి ఆలోచనకు మీ ప్రేరణ చోదక శక్తి. తిరిగి వెలిగిన ఈ దీపం వేల దీపాలను వెలిగిస్తూనే ఉంటుంది'.. సంక్షిప్తంగా తన విజయగాథను ముగించింది వసంత.

కానీ, ఆ తీరం చేరుకోవడానికి ఎన్ని తుఫానులను ఎదిరించిందో, ఎన్ని కల్లోలాలకు సవాలు విసిరిందో, కాలానికి ఎంత ఎదురీదిందో.. మొత్తానికి తాను

గెలిచి, నన్ను గెలిపించిన వసంత నా ఆశయాన్నీ గెలిపిస్తుందన్న ప్రగాఢ విశ్వాసంతో, నా ఆశీస్సులందించి విజయగర్వంతో ఆమెను సాగనంపాను. నడిచి వెళ్తున్న వసంత చుట్టూ ఓ కాంతివలయం ప్రసరిస్తున్న భావన నాలో కలిగింది.

* * *

## గాజోజు నాగభూషణం

జీవితాన్ని ఉన్నతీకరించడంలో సాహిత్యానిది కీలక భూమిక అంటారు రచయిత గాజోజు నాగభూషణం. కవి, రచయిత, గాయకులుగా తెలంగాణ సమాజానికి సుపరిచితులు. ఈయన స్వస్థలం జగిత్యాల. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. అలిశెట్టి ప్రభాకర్ సాన్నిహిత్యంతో, జగిత్యాల రైతాంగ ఉద్యమాల ప్రభావంతో కవిత్వం రాయడం మొదలుపెట్టారు. నిరంతర ఉద్యమాల భాగస్వామ్యంతో ఎరుకలోకి వచ్చిన మానవ జీవన విధ్వంసమంతా.. కథల్లోనే ప్రతిఫలించే అవకాశముందని కథా రచనపై ఆసక్తి పెంచుకున్నారు. కవిత్వంలో 'మట్టి సరిగమలు', 'ప్రాణదీపం' సంకలనాలు వెలువరించారు. 'నెత్తుటి గాయాలు' పేరుతో తెలంగాణ ఉద్యమ గేయాలు రచించి, గానం చేసిన సీడీని విడుదల చేశారు. ఇప్పటివరకు 25 కథలు రాశారు. వీటిలో పదకొండు కథలకు వివిధ పోటీల్లో బహుమతులు అందుకున్నారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీల్లో వరుసగా నాలుగేళ్లుగా బహుమతులు దక్కించుకుంటున్నారు. వీరి కవిత్వ సంపుటి ప్రాణదీపం.. కందికొండ రామస్వామి రాష్ట్రస్థాయి పురస్కారం, పాలమూరు సాహిత్య వేదిక రాష్ట్రస్థాయి పురస్కారం దక్కించుకున్నది. కవిత్వంలో అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారంతోపాటు, అనేక అవార్డులు అందుకున్నారు. 2009 టీవీ నంది అవార్డుల కమిటీ జ్యూరీ మెంబర్‌గా పనిచేశారు. తెలంగాణ రచయితల వేదిక, కరీంనగర్ ఫిలిం సొసైటీలాంటి అనేక సంస్థల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. త్వరలోనే కథల సంపుటిని వెలువరించనున్నారు.

**–98854 62052**

# ఆకలి



## సుజల గంటి

'ఈరోజు వంట చాలా బాగుంది. నువ్వే చేసావా?' అన్నాడు ప్రకాష్.

'నేను చెయ్యలేదు. కొత్త వంట మనిషి దొరికింది. నెమ్మదస్తురాలు. వంట బాగా చేస్తోంది. శుచి, శుభ్రం కూడా ఉన్నాయి. బతికి చెడ్డ మనిషిలా ఉంది' అంది సుమిత్ర.

'కోపం తెచ్చుకోకు.. తినగానే అనుకున్నాను. నువ్వు చెయ్యలేదని. నీకన్నా బాగా చేసింది'.

'అవును లెండి. పొరుగింటి పుల్లకూర రుచి అన్నారు. ఇన్నాళ్లూ నేను చేస్తుంటే లొట్టలు వేసుకుని తిన్నారుగా' అంది మూతి మూడు వంకరలు తిప్పుతూ.

ప్రకాష్ అలా అన్నాడని కోపం వచ్చినా అతని మాటల్లో నిజం ఉంది. ఆమె వంట అద్భుతంగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు.

'ఇంతకీ ఈమెను ఎక్కడ పట్టావు? ఎప్పుడు వచ్చింది?' అన్నాడు.

'పట్టడం ఏమిటీ? ఈమధ్య ఎక్కువసేపు నించుంటే కాళ్లు నొప్పులు పెడుతున్నాయి. అందుకని, వంట మనిషి కావాలని, నా ఫ్రెండ్ రమని అడిగితే.. ఈమెను పంపింది. మీరు ఊళ్లో లేనప్పుడు వచ్చింది. నాకు నచ్చి పెట్టుకున్నాను' అంది సుమిత్ర.

* * *

ప్రకాష్‌కు మంచి ఉద్యోగంతోబాటు ఆస్థిపాస్థులూ బాగానే ఉన్నాయి. ఫ్లాట్ కల్చర్ వచ్చినా స్థలం కొని డూప్లెక్స్ ఇల్లు కట్టుకున్నాడు. కింద వంటిల్లు, స్టోర్ రూం, డైనింగ్ రూం, పూజ గది, ఒక బెడ్ రూం.. పైన మూడు బెడ్ రూంలు ఉన్నాయి. పనివాళ్లు వెనక పెరటివైపు నించి వస్తారు కాబట్టి, ప్రకాష్‌కు తారసపడే అవకాశం తక్కువ. అయినా అతనికి తన ఆఫీస్, క్లబ్, ఫ్రెండ్స్ తప్ప ఇల్లు పట్టించుకోడు. అన్నీ సుమిత్రే చూసుకుంటుంది. పిల్లల పెంపకం, చదువులు.. అన్ని బాధ్యతలూ ఆమెవే. ఇద్దరు పిల్లలు. అబ్బాయి ఇంజినీరింగ్ చదువుతున్నాడు. అమ్మాయి కూడా కాలేజ్‌కి వచ్చింది.

వాళ్లిద్దరి మధ్య దెబ్బలాటలు లేవు కాబట్టి, అందరూ అన్యోన్య దాంపత్యం అనుకుంటారు.

ఆరోజు ఒంట్లో బాగుండక ఆఫీస్‌కి వెళ్లలేదు ప్రకాష్. పొద్దున్నే డల్‌గా ఉన్న భర్తను చూసి..

'ఏమయ్యింది?' అని అడిగింది సుమిత్ర.

'కొద్దిగా జ్వరం వచ్చినట్లుగా ఉంది' అన్నాడు.

'అయ్యో! నాకు ఇవ్వాళ కాలేజ్‌లో మీటింగ్ ఉంది. పోనీ సెలవు పెట్టనా?'.

'వద్దు. నువ్వు కాలేజ్‌కు వెళ్లు. ఫరవాలేదు. నేను ఉంటాను'.

'నేను ఇవ్వాళ కాలేజ్‌లోనే లంచ్ చేస్తాను. వంటామె వచ్చి వంటచేసి వెళ్లిపోతుంది. ఆమె దగ్గర వంటింటి తాళం ఉంది. వెనకవైపు నించి వస్తుంది. మీకు ఇబ్బంది లేకుండా. వీలుంటే నేను తొందరగా వస్తాను. లేకపోతే డైనింగ్ టేబుల్ మీద గాయత్రి అన్నీ పెడుతుంది. ఆకలి వేసినప్పుడు తినండి. బ్రేక్‌ఫాస్ట్ ఇప్పుడు తింటారా? లేక తరువాత తింటారా?'.

'వద్దు.. ఏం తినాలని లేదు. నువ్వు నీ పనులు మానక్కర్లేదు'.

సుమిత్ర కాలేజ్‌లో లెక్చరర్. పిల్లలు చిన్నవాళ్లుగా ఉన్నప్పుడు కొన్నాళ్లు చెయ్యలేదు. తరువాత ప్రకాష్ తన ప్రపంచం తాను ఎన్నుకోవడంతో.. ఆమె కూడా తన ప్రపంచం తను చూసుకోక తప్పలేదు.

ప్రకాష్ చెడ్డవాడు కాదు కానీ, స్వార్థపరుడు. అతని సమయంలో భార్యకు, పిల్లలకు వెచ్చించేది తక్కువనే చెప్పొచ్చు. పెళ్లయిన వెంటనే అతని మనస్థత్వం అర్థం చేసుకున్న సుమిత్ర, తామిద్దరూ సమాంతర రేఖలమని గ్రహించి.. పిల్లలనే తన ప్రపంచంగా మార్చుకుంది. పిల్లలకు కూడా తల్లి దగ్గరే చనువు. ఏం కావాలన్నా అమ్మ మీద ఆధారపడటం అలవాటై పోయింది. ఎపుడైనా సినిమాకి, పిక్నిక్‌కి వెళ్లినప్పుడే తండ్రి సమక్షం దొరికేది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ప్రకాష్ మంచి తండ్రిగా వ్యవహరించేవాడు. అందుకని తండ్రి తన ఉద్యోగంలో బిజీగా ఉండి తమతో సమయం గడపలేక పోతున్నాడని పిల్లలు అనుకున్నారు.

ప్రకాష్ నిద్ర లేచి టైం చూసుకున్నాడు. పదకొండు అవుతోంది. సుమిత్ర కాలేజ్‌కు వెళ్లాక మేడపైకి వచ్చి పడుకుంటే.. మంచి నిద్ర పట్టేసింది.

అంతలోనే ఫోన్ మోగింది. చూస్తే సుమిత్ర..

ఫోన్ లిఫ్ట్ చేసి..

'హల్లో' అన్నాడు.

'మీరు లేచారా? మందేమైనా వేసుకున్నారా?'

'లేదు. నువ్వు వెళ్లాక పడుకుంటే ఇప్పుడే తెలివి వచ్చింది. కిందకు వెళ్లి ఒక

కప్పు కాఫీ కలుపుకొని తాగుతాను'

'సరే! నేను వీలైనంత తొందరగా వచ్చేస్తాను'

'ఫరవాలేదు సుమిత్రా! నేను ఉండగలను. టూర్‌లో ఉన్నప్పుడు ఒంట్లో బాగుండక పోతే నన్ను నేను చూసుకోవటం లేదూ!'

నిజమే.. ఏమిటో ఈ భార్యలు భర్తను కూడా పిల్లల్లా చూసుకుంటారు. భర్తకు ఒంట్లో బాగుండకపోయినా ఆమెలోని అమ్మతనం నిద్ర లేస్తుంది. తన ఆలోచనకు తానే నవ్వుకుంది సుమిత్ర.

మేడ దిగి కిందకు వచ్చి, వంటింటి వైపు అడుగులు వేసాడు. వంటింట్లో ఏవరో ఉన్నట్లు చప్పుడు వస్తోంది. దొంగలు వచ్చే అవకాశం లేదు. మెల్లిగా వెళ్లి వంటింట్లోకి తొంగి చూసాడు. గ్యాస్ వెలుగుతోంది. అటువైపు తిరిగి ఒక ఆడమనిషి కూరగాయలు తరుగుతోంది. వంట మనిషి వచ్చి వెళ్లిపోయిందని అనుకున్నాడు.

'నాకు ఒక కప్పు కాఫీ ఇస్తారా?' అన్నాడు ఆమెను ఉద్దేశించి.

ఆ మాటతో వెనుతిరిగిన ఆమె, ప్రకాష్.. ఇద్దరూ స్థాణువులై పోయారు. ప్రకాష్ రెండడుగులు వెనక్కి వేసాడు. అతన్ని అక్కడ చూసిన గాయత్రి పరిస్థితి కూడా ఇబ్బందిగానే ఉంది.

ఇద్దరూ అనుకున్నారు.

'ఇదేంటి మేమిద్దరం.. ఇక్కడ, ఇలా కలుసుకున్నాం' అని.

ముందుగా గాయత్రి తేరుకుని..

'మీరు వెళ్లి కూర్చోండి. నేను ఇప్పుడే కాఫీ కలిపి తెస్తాను. మేడం ఫోన్ చేసి, మీకు ఒంట్లో బాగులేదంటే.. వేడిగా వండుదామని ఇప్పుడే వచ్చాను' అంది.

మాట్లాడకుండా డ్రాయింగ్ రూంలోకి వచ్చి కూర్చున్నాడు. పది నిమిషాల్లో పొగలు కక్కుతున్న కాఫీ అతని ముందున్న టేబుల్‌పైన ఉంచి, పక్కనే బిస్కెట్స్ కూడా పెట్టి వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఆమెను మళ్లీ ఇలాగ, తన ఇంట్లో చూస్తానని కలలో కూడా అనుకోలేదు.

అతను ఎప్పుడైనా ఎదురు పడవచ్చని అనుకున్నా.. ఇలా తారసపడతాడని గాయత్రి కూడా అనుకోలేదు.

కొద్దిసేపటికి వంట పూర్తి చేసి, అన్నీ డైనింగ్ టేబుల్ మీద పెట్టి.. వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది. ఆమె అంత మామూలుగా ఎలా ప్రవర్తిస్తోందో ప్రకాష్‌కి అర్థం కాలేదు. అతని మనసులో మాత్రం ఏదో తెలియని అలజడి. ఆమెకు అలవాటేనేమో! రోజూ కాకపోయినా అప్పుడప్పుడూ ఆమె తారసపడితే అసలు సంగతి సుమిత్రకు తెలిసిపోతుందన్న భయం పట్టుకుంది అతనికి.

ఆలోచనలను పక్కనపెట్టి కాఫీ తాగాడు. మనసు సరిగాలేక భోజనం

చెయ్యబుద్ధి కాలేదు. ఆకలిని జయించలేక.. లేచి భోజనం చేసాడు. పడుకుంటే ఇట్టే నిద్ర పట్టేసింది.

చల్లని చెయ్యి నుదురు తడుముతుంటే తెలివి వచ్చింది. అది సుమిత్రదని అతనికి తెలుసు. అప్రయత్నంగా ఆ చెయ్యిని పట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు.

'జ్వరం తగ్గిందా! భోజనం చేసారా? గాయత్రి కాఫీ కూడా కలిపి ఇచ్చినట్లుంది. ఇవ్వాళ వంట వద్దన్నాను. మీకు ఒంట్లో బాగోలేదని తెలిసి, మీకు వేడిగా వండి పెడతానని చెప్పింది గాయత్రి. చూసారా! ఎంత మంచిదో?' అంది సుమిత్ర.

సుమిత్ర రాగానే ఆమెను మాన్పించమని అందామనుకున్న ప్రకాష్‌కు.. పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టుగా అయ్యింది.

ఆ విషయం మాట్లాడటానికి ఇది సమయం కాదని..

'ఆ తిన్నాను. టీ పెట్టు. ఇద్దరం తాగుదాం' అన్నాడు.

'సరే! మీరు కాస్త మొహం కడుక్కొని కిందికి రండి. ఈ లోపల నేను టీ చేస్తాను' అంటూ కిందికి వెళ్లింది.

తనలోని అలజడిని ఆమె ఎక్కడ పసిగడుతుందో అని భయపడ్డాడు.

సుమిత్ర అతనిలోని అలజడిని చూడలేదు. ఒంట్లో బాగుండక డల్‌గా ఉన్నాడనుకుంది.

ఇద్దరూ కలిసి టీ తాగారు. మధ్యాహ్నం చేసిన వంట ఇంకా మిగిలింది. పొద్దున్న వచ్చి బ్రేక్‌ఫాస్ట్, వంట.. రెండూచేసి వెళ్లిపోతుంది. సాయంకాలానికి ఇంకో కూర చేస్తుంది. కూతురు రమ్య, సుమిత్ర లంచ్‌బాక్స్ పట్టుకుని వెళ్తారు. ప్రకాష్ ఆఫీస్‌లోనే తింటాడు. రాత్రికి సుమిత్ర, అన్నం కానీ రొట్టెలు కానీ వేడిగా చేస్తుంది. ప్రకాష్ ఎక్కువగా ఊళ్లో ఉండడు. కొడుకు హాస్టల్‌లో ఉన్నాడు. రోజూ కూతురికి, తనకి రాత్రి వంట గురించి పట్టింపులేదు. ప్రకాష్ లేనప్పుడు రమ్య ఎప్పుడైనా స్నేహితులతో బైటికి వెళ్తే.. సుమిత్ర ఒక్కత్తే అవుతుంది. ప్రకాష్ ఊళ్లో ఉన్నప్పుడు ఒక్కోసారి బైటకు వెళ్లి తిందామంటాడు. అలాంటప్పుడు మిగిలిన వంట మర్నాడు పనివాళ్లకు ఇచ్చేస్తుంది.

ఇంటికి వచ్చిన గాయత్రి మనసు కూడా అలజడిగా ఉంది. పిల్లలు స్కూల్ నించి వచ్చాక వాళ్ల అవసరాలలో అలజడి మరుగున పడింది.

* * *

గాయత్రి అందరి ఆడపిల్లల్లాగే కోటి కలల్తో దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టింది. భర్త మంచివాడే. ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. అన్నీ బాగుంటే జీవితం ఏముంది? గాయత్రి చల్లని కాపురంలో కలకలం. ఆఫీస్ నించి వస్తున్న రవి

యాక్సిడెంట్‌లో ప్రాణాలు కోల్పోయాడు. డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం చెయ్యాలని అనుకోలేదు. ఉన్నదానితోనే ఆనందంగా గడపాలన్న ఆలోచన ఆమెది. రవికూడా ఎప్పుడూ ఆమెను.. 'ఇది చెయ్యి!' అని శాసించ లేదు.

రవి ప్రైవేట్ ఉద్యోగి. కాబట్టి, ఆఫీస్ నించి పెద్దగా డబ్బులు రాలేదు. ఇద్దరు పిల్లలని సాకాలంటే గాయత్రి ఉద్యోగం చెయ్యక తప్పదు. రవి ఆఫీస్‌లోనే అడిగింది. ఖాళీలు లేవన్నారు. ఆఖరికి ఏ పనైనా చేసి పిల్లల్ని పోషించుకోవాలని, ఒక స్కూల్లో ఆయాగా చేరింది. కొద్దిరోజులు బాగానే నడిచింది. కానీ, ఒకరోజు ఒక టీచర్ పిల్లలకు పాఠం తప్పుగా చెప్తుంటే.. ఆగలేక ఆ తప్పును సవరించింది. దాంతో, ఆమెపై లేనిపోని చాడీలు చెప్పి, ఆమె ఉద్యోగం పోవడానికి కారణ భూతురాలయ్యింది ఆ టీచర్.

మళ్లీ ఉద్యోగాల వేట. ఉద్యోగాలు అంత తొందరగా దొరుకుతాయా? పోనీ ట్యూషన్స్ చెప్దామంటే చుట్టుపక్కల అందరూ కాన్వెంట్ స్కూల్ పిల్లలే. కాబట్టి గాయత్రి దగ్గరకు ఎవరూ రావడానికి ఇష్టపడేవారు కాదు. పిల్లల ఆకలి తీర్చాలి. వాళ్ల అవసరాలు తీర్చాలి. గవర్నమెంట్ స్కూల్‌లో చదివించినా, తిండి, బట్టకూ డబ్బు కావాలి.

ఆరోజు గాయత్రి జీవితంలో కాళరాత్రి. ఇప్పటికీ ఆరోజును తల్చుకుంటే ఆమె ఒళ్లు జలదరిస్తుంది. పిల్లవాడికి ఒళ్లు తెలియని జ్వరం. అప్పటికి వాళ్లు భోజనం చేసి రెండు రోజులయ్యింది. 'అమ్మా.. ఆకలి!' అంటున్న పిల్లల్ని చూస్తుంటే కడుపు తరుక్కు పోతోంది. ఎలాగోలాగ పిల్లల కడుపు నింపాలని.. తమ్ముడ్ని చూస్కోమని కూతురికి చెప్పి బైటకు నడిచింది గాయత్రి.

అమ్మ ఎక్కడికి వెళ్తుంది? బైటకు వెళ్తే ఎవరైనా డబ్బులు ఇస్తారా? అడుక్కోకూడదని అంటుంది అమ్మ. మరి ఎవరు ఇస్తారు?.. ఇలా అన్నీ ప్రశ్నలే ఆ చిన్ని బుర్ర నిండా.

* * *

మర్నాడు గాయత్రి మామూలుగానే పనిలోకి వచ్చింది. అప్పటికి ప్రకాష్ ఇంట్లోనే ఉన్నాడు. సుమిత్ర కాఫీ కలపమంటే ఇద్దరికీ తెచ్చి అక్కడ పెట్టి వెళ్లిపోయింది.

కాఫీ తాగుతూ..

'వేరే వంట మనిషిని చూడు సుమిత్రా'? అన్నాడు.

'ఎందుకు? గాయత్రి బాగానే చేస్తోందిగా' అంది.

'నాకు నచ్చలేదు' అన్నాడు ఇంక ఏం అనాలో తెలియక.

'నిన్న ఏమైనా జరిగిందా? వంట బాగాలేకపోతే చెప్పండి'

‘ఆమె మంచిది కాదు’

‘మంచిది కాదంటే.. దొంగతనం చేసిందా? నాకు అలా అనిపించలేదే?’

‘కాదు.. ఆమె క్యారెక్టర్ మంచిది కాదు’

‘మీకెలా తెలుసు?’

‘నా ఫ్రెండ్ చెప్పాడు’

ఎందుకో.. భర్త ఏదో దాస్తున్నాడని అనిపించింది సుమిత్రకు.

‘మీ ఫ్రెండ్‌కు ఈమె ఎలా తెలుసు? అయినా, ఆమెను ఇన్నాళ్లూ మీరు చూడలేదు కదా! మీ ఫ్రెండ్ చెప్పింది ఈమే అని మీకు ఎలా తెలుసు?’ అని గుచ్చిగుచ్చి అడిగింది సుమిత్ర.

అప్పుడే.. ఏం వండాలో అడగడానికి వచ్చిన గాయత్రి నోరు విప్పింది.

‘ఆయన ఫ్రెండ్ చెప్పలేదు. ఆయనే చెప్తున్నారు’.

‘అసలు ఏమైందో స్పష్టంగా చెప్పండి. ఇలా ఇద్దరూ చెరో వాక్యం చెప్తే నాకు ఎలా అర్థం అవుతుంది?’

‘జరిగిన సంగతి మీరు చెపుతారా? నేను చెప్పనా?’ అన్నది గాయత్రి.

‘సిగ్గు లేకుండా చేసిన పని చెప్తావా?’ కాస్త కోపంగానే అన్నాడు ప్రకాష్.

‘మీకు లేని సిగ్గు నాకెందుకు?’ అంది మొండిగా.. ఆరోజు సంఘటనను తల్చుకుని, కన్నీళ్లు వస్తున్నా.

ఆ మాటతో ఆమె నిజం చెప్పేస్తుందని భయం వేసినా..

‘చెప్పు! నాకేం భయం నేను మగవాడ్ని’ అన్నాడు మొండిగా.

‘అవును! మగవాడు ఏం చేసినా చెల్లుతుంది. మగవాడు చేస్తే తప్పు కాదు. ఆడది చేస్తే తప్పు. అది లోకనీతి. మగవాడు చేస్తే జల్సా పురుషుడు. ఆడది చేస్తే విచ్చలవిడి. అంతేనా ప్రకాష్ గారూ?’ అంది గాయత్రి.

ఆమె తెగింపు చూసి ఇద్దరికీ ఆశ్చర్యం వేసింది.

‘అసలు సంగతి నేను చెప్తాను మేడం. ఇలా ఈయన్ని మళ్లీ కలుస్తానని కానీ, ఆరోజు మళ్లీ తల్చుకోవాలని కానీ, ఈ పరిస్థితి వస్తుందని కానీ నేను అనుకోలేదు’.

అంతా అయోమయంగా ఉంది సుమిత్రకు. విషయం కొంతవరకూ అర్థమైంది. ప్రకాష్ కోపంగా ఏదో చెప్పబోయాడు.

‘ఆమెను చెప్పనివ్వండి’ అంది సుమిత్ర

తన గురించి వివరంగా చెప్పడం మొదలు పెట్టింది గాయత్రి.

* * *

‘ఏ ఆడదీ చెడిపోవాలని అనుకోదు. పవిత్రంగా ఒక భర్తకే కట్టుబడి ఉంటుంది. నా భర్త పోయాక చదువుకున్నాను కాబట్టి ఉద్యోగం చేసి నా పిల్లల్ని

పోషించుకోవాలని అనుకున్నాను. కానీ ఉద్యోగాలు అంత తొందరగా దొరకవని నాకర్థం అవడానికి కొంత సమయం పట్టింది. డబ్బు నిలవలేం పెద్దగా లేవు. ఉన్నదాంట్లో ఆనందంగా బతుకుతున్న మా జీవితాల్లో.. రవి చావుతో భూకంపం వచ్చినట్లు కంపించి పోయాం. బాబుకు జ్వరంగా ఉంది. మందు ఇప్పించాలంటే డబ్బులు కావాలి. రోజు కూలీ చేసైనా మందుకు డబ్బులు తెద్దామని బైట పడ్డాను. ఎక్కడా ఏ పనీ దొరక లేదు. పిల్లలే కళ్లముందు కదులుతున్నారు. పొద్దుటినించీ ఏం తినలేదు. కను చీకటి పడుతున్న వేళ.. నా శరీరం స్వాధీనం తప్పింది. అలా ఎంతసేపు గడిచిందో నాకు తెలియదు.

కళ్లు తెరిచిన నేను మత్తుగా ఒక మెత్తటి పరుపు మీద పడుకున్నట్లుగా గ్రహించాను. ఏం జరిగిందో అర్థం కాలేదు. కళ్లు పూర్తిగా తెరిచిన నాకు.. ఎదురుగా సిగరెట్ తాగుతూ మీ ఆయన కనిపించారు.

నా ఒంటి మీద బట్టలు అస్థవ్యస్థంగా ఉన్నట్లు గ్రహించాను.

'నాకేమైంది' అన్నాను మెల్లిగా.

'రోడ్ మీద పడిపోతే నేనే ఇక్కడికి తెచ్చాను' అన్నారాయన.

ఏదో జరిగిందని నా మనసు చెపుతోంది. రోడ్ మీద పడిపోతే ఇక్కడికి ఎందుకు తేవాలి? హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలి కదా! ఎదురుగా గోడ గడియారం తొమ్మిది చూపిస్తోంది. పిల్లల్ని తలచుకుని, గుండె గుభేలుమంది.

'నన్నేం చేసారు?' అని గట్టిగా అరిచాను.

'నీ అందం నన్ను పిచ్చివాడ్ని చేసింది. అందుకని నీ శరీరంతో కాసేపు ఆడుకున్నాను. ఇదిగో దాని విలువ' అంటూ.. ఐదువేలు నా మొహాన విసిరి కొట్టాడు ఈ పెద్ద మనిషి.

'నేను కళ్లు తిరిగి పడిపోయాను కానీ.. ఇంత జరిగినా నాకెలా తెలియలేదు'

'నాకు ఎదురు తిరుగుతావని, మత్తుమందు కలిపిన నీళ్లు తాగించాను'

'అంటే.. ఇలాంటి పని ఇంతకుముందు కూడా చెయ్యడం అలవాటు ఉందన్నమాట'

'హా! అప్పుడప్పుడూ' అంటూ ఒక వంకర నవ్వు.

జరిగింది తల్చుకుని నా మీద నాకే అసహ్యం వేసింది. ఎదురుగా ఉన్న రాక్షసుడ్ని చూసి భయం వేసింది.

'ఎందుకిలా చేసావు?'

'ఇంకోసారి నీ ఇష్టంతో ఒప్పుకొంటే పదివేలు ఇస్తాను' అన్నాడు.

నా నోటివెంట 'ఛీ!' అన్న మాట వెలువడింది.

తొందరగా అక్కడినించి పారిపోవాలి. మత్తుగా ఉన్న శరీరాన్ని స్వాధీనంలోకి

తెచ్చుకుని, మంచం దిగాను. బైటకు నడుస్తున్న నన్ను ఉద్దేశించి.. 'డబ్బులు తీసుకో' అన్నాడు.

మంచం మీద ఉన్న నోట్లను చూసాను. నా పిల్లల ఆకలి కళ్ల ముందు కదిలింది. ఒక మృగం ఆకలి ఖరీదు.. నా పిల్లలకు నెల రోజులు తిండి పెడుతుంది. పోయిన శీలం తిరిగి రాదు. అని అనుకున్న నేను.. ఆ నోట్లను తీసుకుని బైట పడ్డాను. ఇప్పుడు చెప్పండి.. ఇందులో నా తప్పేం ఉంది? నేను ఎంతవరకు బాధ్యురాల్ని' అంది గాయత్రి.

'అంతా అబద్ధం' అన్నాడు ప్రకాష్ తన తప్పు దాచుకునేందుకు.

'ఆమె చెప్పింది అబద్ధం అయితే.. ఆమె చెడిపోయిందని ఎందుకు అన్నారు?' అని నిలదీసింది సుమిత్ర.

అతను మాట్లాడలేదు.

'నేను లేకుండా ఫాంహౌజ్‌కి వెళ్తారని తెలుసు. మందు పార్టీకి వెళ్తారేమో అనుకున్నాను. అందరి ఆడవాళ్లలాగా నా భర్త శ్రీరామ చంద్రుడనుకున్నాను. కానీ, ఇంత నీచులని అనుకో లేదు. నిజం చెప్పండి. గాయత్రి మీ ఆకలి మంటలో కాలిన ఎన్నో శలభం?' అంది సుమిత్ర.

సుమిత్ర కళ్లల్లోకి చూసిన ప్రకాష్‌కి ఒక్కసారి భయం వేసింది. అంతకుముందు ఎప్పుడూ ఆమెను అలా చూడలేదు.

'అదికాదు సుమిత్రా! కళ్లు తిరిగి పడిపోయిన ఆమెను చూడగానే సహాయం చేద్దామని కార్ ఆపాను. ఆమెను ఎత్తి సీట్‌లో పడుకో పెడుతున్నప్పుడు ఆమె అందం నన్ను పిచ్చివాడ్ని చేసింది. అందుకే ఆ తప్పు చేసాను' అన్నాడు.

'రెండు రోజులు తిండి లేకపోయినా ఆమె తన ఆకలిని అదుపులో పెట్టుకుంది. కానీ, మీరు మీ శరీరానికి వేసిన ఆకలిని ఆమెను మోసం చేసి తీర్చుకున్నారు. ఇందులో చెడిపోయింది ఆమెకాదు ప్రకాష్.. మీరు!' అంది సుమిత్ర.

'ప్రకాష్ గారూ! నేను చెడిపోయినదాన్నయితే ఒకరాత్రికి ఐదు వేలిచ్చే మీలాంటి వాళ్లు ఈ లోకంలో చాలామందే ఉండి ఉంటారు. తప్పు ఒకసారి చేసినా మళ్లీమళ్లీ చేసినా పెద్ద తేడాలేదు. వంటలక్కగా ఆకలి తీర్చిన దానికన్నా.. మీలాంటి వాళ్ల ఆకలి తీరిస్తే నాకు ఎక్కువ డబ్బు వస్తుంది కదా! నేను ఆ పని చెయ్యకుండా మీ ఇంట్లో వంటకి ఎందుకు వస్తాను? ఇది మీ ఇల్లని తెలిస్తే అస్సలు వచ్చేదాన్ని కాను. రేపటినించీ పనిలోకి రాను మేడం' అంది గాయత్రి.

పర్స్‌లోంచి ఒక పదివేలు తీసి గాయత్రి చేతిలో పెట్టింది సుమిత్ర.

'అదేంటి మేడం.. ఇంత డబ్బు ఇచ్చారు?'

'మళ్లీ పని దొరికేదాకా నీ పిల్లలు, నువ్వు పస్తులు పడుకోకుండా ఉండటానికి.

నువ్వు క్యాటరింగ్ చేసుకుంటానంటే డబ్బు పెట్టుబడి పెట్టి, కస్టమర్స్‌ని చూస్తాను' అంది సుమిత్ర.

* * *

అస్సులు ఊహించని షాక్ మర్నాడు తగిలింది ప్రకాష్‌కి. అతను పొద్దున లేచేసరికి సుమిత్ర ఇంట్లో కనిపించలేదు. కూతురు కూడా లేదు.

సుమిత్ర ఎక్కడకు వెళ్లింది? కోపం వచ్చి వాళ్ల అమ్మ దగ్గరికి వెళ్లి ఉంటుందని ఫోన్ చేసాడు.

'సుమిత్ర వచ్చిందా అండీ' అన్నాడు.

'అదేంటి బాబూ! నీకు చెప్పకుండా మా ఇంటికి ఎందుకు వస్తుంది? ఏమైనా గొడవపడ్డారా?'

ఇన్నేళ్ల కాపురంలో అలా ఎప్పుడూ జరగలేదు.

అక్కడికి వెళ్లలేదని తెలిసింది. అత్తగారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోయాడు. అల్లుడు అలా అడిగేసరికి ఆమెకు కంగారు వచ్చింది.

వాట్సాప్‌లో మెసేజ్ చూసాడు.

'ఇంక మనం కలిసి ఉండటం కుదరదు. ఇన్నాళ్లూ మిమ్మల్ని ఎంతో ఉన్నతంగా ఊహించుకున్నాను. పిల్లల మూలంగా సర్దుకుపోతానని అనుకోవద్దు. అలా అని పిల్లలకు నిజం చెప్పలేను. ఏం చెయ్యాలో ఆలోచించుకోండి' అని ఉంది.

పరువు కోసం, పిల్లల భవిష్యత్తు కోసం కూడా ఆలోచించకుండా సుమిత్ర అలాంటి పని చేస్తుందని అతను ఊహించలేదు.

ఆడదాని బతుకు, ముళ్లపొద మీద వేసిన చీరలాంటిది. ఎప్పటికప్పుడు జాగ్రత్తగా వ్యవహరించక తప్పదు. అతని అన్ని ఆకళ్లు తీర్చడానికి ఆడదాని మీద ఆధారపడక తప్పకపోయినా.. ఆడదంటే చులకన.

సుమిత్ర సలహాని అమలు చేసి.. క్యాటరింగ్ ద్వారా ఎంతోమంది ఆకలిని, మిగిలిన భోజనాలతో నిజమైన అన్నార్తుల ఆకలి తీర్చడానికి నడుం కట్టుకుంది గాయత్రి.

***

## సుజల గంటి

అందరి ఆకలితీర్చే ఆడదాన్ని ఆకలి చూపులు చూసే మగపుంగవులు ఉన్నంతవరకూ.. ఆడదానికి భద్రత లేదన్న విషయమే 'ఆకలి' కథకు మూలం. రచయిత్రి సుజల గంటి. కలం పేరు అనురాధ. రాజమండ్రిలో పుట్టారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో విద్యాభ్యాసం చేశారు. ప్రజా యుద్ధనౌక గద్దర్.. వీరి క్లాస్‌మేట్.

ఎకనమిక్స్‌లో డిగ్రీ, ఇంగ్లీష్‌లో ఎంఏ చేశారు. హిందుస్థానీ సంగీతంలో పట్టభద్రురాలు. వారసత్వంగా కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు. సంగీతం – సాహిత్యాలు వీరికి రెండు కళ్లు. 2011 (60వ ఏట) నుంచి రచనా వ్యాసంగంలోకి అడుగుపెట్టారు. ఏది రాయాలన్నా కొత్త సబ్జెక్ట్ కోసం ఆలోచిస్తారు. ఇప్పటివరకూ 80 కథలు, 23 నవలలు రాశారు. వీరి మొదటి నవల 'అమ్మ బంగారు కల'కు అనిల్ అవార్డు దక్కింది. ఈ నవల ఇంగ్లీష్, తమిళంలోకి అనువాదమైంది. మరికొన్ని కథలు తమిళం, కన్నడం అనువాదమయ్యాయి. ఒక కథ కెనడాలో రేడియో నాటకంగానూ ప్రసారమైంది. రెండు పిల్లల నవలలకు 'తానా' బహుమతులు గెలుచుకున్నారు. భాషా దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవార్డుతో సత్కరించింది. జైనీ అవార్డ్, లేఖిని మాతృపురస్కారం, యద్దనపూడి జ్యోతి పురస్కారం, 'అమ్మ బంగారు కల'కు ఉత్తమ నవల పురస్కారం, రంజని కుందుర్తి అవార్డ్, వాకాటి పాండురంగారావు అవార్డ్, మాతృవందన షష్టిపూర్తి కలాలు, గోవిందరాజు సీతాదేవి అవార్డు.. ఇలా లెక్కకు మిక్కిలి అవార్డులు అందుకున్నారు. ఇటీవలే అమృతలత జీవన సాఫల్య పురస్కారం పొందారు.

**–7702 319 351**



# దేవర

## ఎస్.నాగేందర్‌నాథ్ రావు

దేవర ముందు కూర్చున్న పెద్ద పటేలు చేయి ఊపాడు.. 'ప్రారంభించండి!' అన్నట్లుగా.

పక్కనే కూర్చున్న పూజారి పిడికిలితో పసుపు తీసి దేవరమీద చల్లాడు. ఆ క్షణం కోసమే కాచుకు కూర్చున్న కొమ్ము బూరలు, గాలిలోకి లేచాయి. ఒక్కసారిగా అందరూ బూరలు ఊదగానే.. 'ధమ్‌ధమ్' అంటూ డోలు వాద్యాలు మోగాయి.

ఆ శబ్దం.. చుట్టూ ఉన్న కొండల్లో ప్రతిధ్వనిస్తూ లయాన్వితంగా మోగసాగింది. పెద్ద పటేలు లేచి వారి దగ్గరికి వచ్చాడు.

'బెర్ర పటేలు వాసోమందోడు' అని గుసగుసగా చెప్పిందో ఒక అమ్మాయి.

భుజాల మీద చేతులు వేసుకొని నిలబడ్డ కోయ పడతుల దండ, కొండ చిలువలాగా కదిలింది.

'రేరేలాయో రేరేలాయో.. రేలా రేలా
రేల రేలా, రేలా రేలా, రేల రేలా, రేలా రేలా
ఇత్తాకిని పుంగారే లచ్చీ నా బంగారే
తాడిగుంట టీయ్ టోయ్.. 'అంటూ గానం సాగింది.

ఆ పాటకు అనువుగా డోలు వాద్యాలు మోగాయి. అడవి మారుమోగింది. దేవరకు పూజ ప్రారంభమైంది.

కొండ దేవరకు పూజ చేస్తున్న ఆ ప్రాంతం భద్రాచలం అడవుల్లో చింతూరు నుండి మధ్యప్రదేశ్ వెళ్లే మార్గంలో ఉంది. అక్కడంతా భాష కోయలు ఉంటారు. ఆ ప్రాంతం దాటి ఇంకా ముందుకు అడవుల్లోకి వెళితే.. గోండు జాతి వారు ఉంటారు.

భాష కోయల పండుగల్లో కొండదేవర పండుగ చాలా ముఖ్యమైనది. ఆ తర్వాత పచ్చ పండుగ, భూమి పండుగ, చిక్కుళ్ల పండుగ అంటూ చాలా పండుగలు చేసి దేవరను పూజిస్తారు. భాష కోయలు నిష్కపటంగా ఉంటారు. నమ్మితే ప్రాణాలు ఇవ్వడానికి ఏమాత్రం సంకోచించరు.

అడవిలో అందరి ఇళ్లూ ఒకచోటనే ఉండవు. అక్కడొక ఇల్లు, ఇక్కడొక ఇల్లు ఉంటాయి. అన్నిటినీ కలిపి ఊరు లేదా గుంపు అంటారు. ఆ ఊరి పేరు చింతలమెట్ట.

చింతలమెట్ట గుంపులో నక్కలబోడు ప్రదేశంలో ఒక కోయగుడిసె ఉన్నది.

దాంట్లో సిరవడు, లచ్చి కాపురం ఉంటున్నారు. సిరవడు అనే పదం శ్రీరాముడు అనే పేరుకు వికృతి కాబోలు. కోయల పేర్లు అలాగే ఉంటాయి.

చింతలమెట్ట పక్కనే ఉన్న ఎస్టేట్ రాజారాం దొరది. వాళ్ల తాతల కాలం నుండి అది వారి అధీనంలోనే ఉన్నది. సిరవడి తండ్రి అరసడు కూడా ఆ ఎస్టేట్‌లోనే పనిచేసేవాడు. ఆ కుటుంబానికి జీతం ఇచ్చి తగు సౌకర్యాలు కల్పించేవారు ఆ దొరలు. అడవికి దూరంగా గౌరీపేటలో రాజారాం నివసించే భవంతి ఉన్నది.

రాజారాం దొర ఆరోజు పనిమీద దూరంగా వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అడవి ప్రాంతం కాబట్టి కార్లు ఉపయోగించరు. అతను ఎప్పుడూ జీపులోనే ప్రయాణం చేస్తాడు. తను బయలుదేరిన ప్రదేశం నుంచి చుట్టూ తిరిగి వెళితే రాత్రిపూట చాలా ఆలస్యం అవుతుందని, తమ ఎస్టేట్ గుండా చింతలమెట్ట మార్గంలో దగ్గరతోవ ఉండటం వల్ల, ఆ దారిలోనే ప్రయాణం చేయాలనుకున్నాడు రాజారాం దొర.

సాయంకాలం అవుతూ ఉన్నది. మరో గంట ప్రయాణం చేస్తే ఇంటికి చేరిపోతాడు. కానీ, అకస్మాత్తుగా వర్షం ప్రారంభమైంది. ఒక్కోసారి కుండపోత వర్షం కొద్దిసేపు ఆపకుండా కురిస్తే.. అడవిలో వాగులు, ఒర్రెలు పొంగి పారుతాయి. చాలాసేపటి దాకా ఆ నీటి ఒరవడి తగ్గదు. ఆ నీటి ప్రవాహం వేగంగా ఉండటం వల్ల దాటడానికి అవకాశం ఉండదు.

రాజారాం పరిస్థితి అదే అయింది. ఒర్రె బాగా పారుతూ ఉండటం వల్ల దాటలేక పోయాడు.

వర్షం, బురద వల్ల జీవు ముందుకిపోలేని పరిస్థితి ఏర్పడింది. జీవును అక్కడే ఆపేసి సిరవడి ఇంటివైపు నడిచాడు దొర. సిరవడిని తోడు తీసుకుని ఎస్టేట్‌కి వెళ్లి, ఆరోజు అక్కడ విశ్రాంతి తీసుకుని మర్నాడు ఇంటికి వెళ్లవచ్చు అనేది రాజారాం ఆలోచన. సాయంకాల సమయం. సిరవడి గుడిసె దగ్గరికి చేరుకున్నాడు.

'సిరవా!' అని పిలుపు వినిపించే సరికి, తడిక పక్కకు జరిపి.. బైటికి తొంగి చూసింది లచ్చి.

వర్షంలో తడుస్తూ వచ్చిన దొరను చూసి ఆశ్చర్యపోయింది.

'రండి దొరా! లోనకు రండి' అంటూ దొరను ఆహ్వానించింది.

వర్షంలో తడుస్తున్న దొర గుడిసెలోకి అడుగు పెడుతూ..

'సిరవడు లేడా ?' అని అడిగాడు.

'లేడు దొరా! గౌరీపేటకి పోయిండు. గట్లనే మీ ఇంటికి కూడా పోయి వస్తనని.. జుంటి తేనె, చింతపండు, అడవి పండ్లు తీసుకపోయిండు దొరా! అయ్యో.. గట్లనే నిలబడ్డరు. లోనకి రండి దొరా' అన్నది లచ్చి.

గుడిసెలోకి వెళ్లి చుట్టూ చూశాడు దొర. చిన్న గుడిసె. మధ్యలో తడిక ఉంది. దాని అవతల వంట పొయ్యి ఉన్నది. చాలాసార్లు ఆ ఇంటివైపు వచ్చాడు కానీ, సిరవడి

గుడిసెలోకి ఎన్నడూ తొంగి చూడలేదు.

మంచంలో ఆడుకుంటున్న చిన్నబాబును తీసి తడిక లోపలి మంచంలో పడుకోబెట్టింది లచ్చి. మంచం మీది బట్టలు తీసేసి శుభ్రమైన చెద్దరు పరిచింది.

'దొరా!'.. అంటూ తల తుడుచుకోవడానికి తువ్వాలు ఇచ్చింది.

'సిరవడు ఎప్పుడొస్తానన్నడు లచ్చి' తల తుడుచుకుంటూ అడిగాడు దొర.

'బెగే ఒత్తానన్నడు దొరా! ఈపాటికి వచ్చేయాల. ఒత్తా ఉంటడు'

దొర ఫోన్ తీసి ట్రై చేశాడు. సిగ్నల్ కలవడం లేదు. లచ్చి గ్లాస్‌తో డికాక్షన్ తెచ్చి ఇచ్చింది.

'దొరా! తడిసిపోయి ఉన్నరు. కాత్త ఏడిగా ఉంటదని డికాసను చాయ్ చేసిన. మాకు పాలు దొరకవు దొరా'

' పర్వాలేదు లచ్చి! ఇలా ఇవ్వు' అంటూ గ్లాస్ తీసుకొని తాగాడు దొర.

ప్రయాణ బడలిక, వర్షపు చల్లటి గాలి నుండి ఈ డికాక్షన్ మంచి రిలీఫ్ ఇచ్చింది.

'జగదల్‌పూర్ పోయి వస్తుంటే మధ్యలో వర్షం ప్రారంభమైంది. సిరవడిని తోడు తీసుకుని ఎస్టేట్‌కు వెళదామని వచ్చిన'

'ఒత్తడు దొరా! మీరు కూతంత ఇసరాంతి తీసుకోండి. ఈ వానల ఎట్లా పోతరు. తగ్గినంక పోదురుగాని. ఈలోపు సిరవడు ఒత్తడు'

కానీ, వాన ఏమాత్రం తెరిపి ఇవ్వడం లేదు. కుండపోతగా కురుస్తూనే ఉంది. చీకటి పడింది. కానీ, సిరవడు రాలేదు. ఇంటికి ఫోన్ చేయాలని ట్రై చేస్తున్నాడు దొర. ఫోన్ సిగ్నల్ కలవడం లేదు.

లచ్చికి కూడా ఆత్రుతగా ఉంది. దొర వచ్చి ఉన్నాడు. బయట వర్షం తగ్గడంలేదు. సిరవడు ఇంకా రాలేదు. ఆమెకు ఏం చేయాలో తోచడం లేదు. ఒకవేళ సిరవడు వచ్చినా దొర కొరకు భోజనం ఏర్పాటు చేయాలి కదా. అందుకని అన్నం వండింది. కోడిగుడ్లు కూర చేసింది. చారు చేసింది.

'దొర మాకు దేవునసొంటోడు. గసొంటి దేవర మా ఇంటికొచ్చిండు. ఆయినెకు ఎసువంటి మర్యాద చేయాల్నో ఏమో!? సిరవడు వస్తే బాగుండును' అనుకున్నది.

కానీ బాగా చీకటి పడడంతో..

'ఈ వానల సిరవడు అచ్చుడు సుత కట్టమే!' అనుకున్నది లచ్చి.

'బాగా రేతిరి అయింది దొరా! ఇంకా వాన తగ్గలేదు. సిరవడు ఎప్పుడొత్తడో ఏమో!? మీరు కూతంత కూడు తిని పడుకోండి. బాగా అలసిపోయి ఉన్నరు' అన్నది లచ్చి.

దొర ఏమీ మాట్లాడలేదు. ఏం చెప్పాలో ఆయనకు అర్థం కాలేదు. మౌనంగా ఫోన్ ట్రై చేస్తూ ఉన్నాడు. కానీ సిగ్నల్ కలవడం లేదు.

అరుగు మీద కొయ్యకు తగిలించి ఉన్న సొరకాయ బుర్ర గుర్తుకువచ్చింది

లచ్చికి.

'మద్దేన్నపేల సుక్కయ్య మామ తెచ్చిన జీలుగు కల్లు ఉన్నది. దొరకు కొంచెం పోస్త. ఇంత కూడు దిని పండుకుంటడు' అనుకున్నది లచ్చి.

గ్లాసు శుభ్రంగా కడిగి జీలుగు కల్లు ఒడియ పోసి తీసుకొచ్చింది.

'దొరా! జీలుగు కల్లు. కొంచెం రుచి చూడండి. చెట్టుమీది నీరం కదా, అలసట తగ్గి మంచిగ నిద్ర పడ్తది' అంటూ గ్లాసు చేతికి అందించింది.

దొర ఏమీ మాట్లాడకుండా గ్లాస్ తీసుకొని సిప్ చేశాడు. ఒంట్లో బడలిక, బయట చల్లటి గాలి. ఆ సమయంలో ఈ చల్లటి జీలుగు కల్లు రుచి కొత్తగా అనిపించింది దొరకు. ప్లేట్లో కోడిగుడ్ల కూర తెచ్చిపెట్టింది లచ్చి. రెండు మూడు గ్లాసులు తాగేసరికి సరిపోయింది దొరకు. కానీ జీలుగు కల్లు బాగా నిషాను కలుగజేసింది.

ఇంట్లో ఫారిన్ విస్కీ తాగే అలవాటున్న దొరకు.. ఆ కల్లు బాగా మత్తును కలుగజేసింది. రాత్రిపూట బాగా పొద్దుపోయింది. సిరవడు ఇంకా రాలేదు. ఇంట్లో తన భార్య డెలివరీకి ఉన్నది. ఆమె ఆరోగ్యం ఎలా ఉందో ఏమో!? ఫోన్ కలవడం లేదు. వర్షం తగ్గడం లేదు. జీలుగు కల్లు నిషా, రప్పున తలకు ఎక్కుతున్నది. భార్య డెలివరీకి ఉన్నది. తనకు చాలారోజులుగా స్త్రీ సాంగత్యం లేదు. అడవిలో, గుడిసెలో, లచ్చి ఒక్కతే ఉన్నది. బయట చలిగాలి వీస్తున్నది. పాతిక సంవత్సరాల లచ్చి. నిండు ఆరోగ్యంతో కళ్లముందు తిరుగుతూ ఉంటే.. మనసు స్థిరం తప్పుతూ ఉన్నది. ఆలోచనలు కలగా పులగమై అదుపుతప్పాయి.

లచ్చి చేయి పట్టుకున్నాడు దొర.

దొరలోని ఈ వింత ప్రవర్తనకు లచ్చి ఆశ్చర్యపోయింది.

'దొరా!'.. భయంగా అన్నది లచ్చి.

'లచ్చీ.. నా కోరిక తీర్చవా? నిన్ను చూస్తుంటే తట్టుకోలేక పోతున్నా. నిన్ను కోరడం నాది తప్పే. అయినా నిగ్రహించుకోలేక పోతున్నా. నా కోరిక తీర్చు.. ప్లీజ్!' మత్తులో ఉన్నాడు దొర.

దొర బేలగా అభ్యర్థించేసరికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు ఆమెకు.

'దొరా! మీరు మాకు దేవర. మీ ఉప్పు తిని బతుకుతున్నం. వరాలు ఇచ్చే దేవుడే వచ్చి, కోరిక తీర్చమని అడుగుతా ఉంటే.. నేను ఏం సెప్పాలె దొరా! కానీ, నేను ఒకరికి ఆలిని కదా. నన్ను ఆ సూపుతో సూడటం తప్పు కదా దొరా'

'అవును! నాకు తెలుసు లచ్చి. కానీ నాకిప్పుడు ఆడదాని సాంగత్యం కావాలనిపిస్తుంది. కోరికతో మనసు నిలకడ ఉంటలేదు. కాదనకు.. ప్లీజ్!' అంటూ ఆమె కాళ్లు పట్టుకున్నాడు దొర.

అప్పటికే జీలుగు కల్లు మత్తు బాగా తలకెక్కింది అతనికి. తనపై తాను నియంత్రణ కోల్పోతున్నాడు.

'సరే.. గట్లనే దొరా! ముందు మీరు కూడు తినండి. ఈలోపు నేను బుడ్డోణ్ని పండుకోబెట్టి వస్త. మీరు మాకు దేవర. మీ కోరిక తప్పకుండ తీరుస్త దొరా' అంటూ నచ్చజెప్పి, దొరకు అన్నం తినిపించింది. కొడుకును నిద్రపుచ్చి, తాను తిని వచ్చింది.

మంచంలో కూర్చుని ఉన్నాడు దొర. అన్నం తిన్న తర్వాత అతను మనసు కాస్త స్థిమిత పడింది. కల్లు ప్రభావం చాలావరకు తగ్గిపోయింది. ఫోన్ సిగ్నల్ కలిసింది. ఇంటి నుండి వచ్చిన వీడియో ఓపెన్ చేసి చూశాడు. అతని మత్తు పూర్తిగా దిగిపోయింది.

మంచంలో కూర్చున్న దొర కాళ్ల దగ్గర కూర్చుంది లచ్చి. నేల మీద కూర్చుని, అతని కాలు మీద తడుతూ..

'దొరా! నేను వచ్చిన. బుడ్డోడు నిద్రపోయిండు' అన్నది పాడిపాడిగా.

దొర ఏమీ మాట్లాడకుండా అచేతనంగా ఉండటం చూసి అతని మొహంలోకి చూసింది లచ్చి. అతని కంటి నుండి నీటి చుక్కలు కారి ఆమె ముఖంపై పడ్డాయి. ఉలిక్కి పడింది లచ్చి.

'దొరా.. ఏమైంది? ఏమన్నా తప్పు జరిగిందా? మీరు మాకు దేవర. మీ కోరిక తీర్చుతనని సెప్పిన కదా!'

దొర మౌనంగా ఫోన్ ఆన్‌చేసి ఆమె చేతికి ఇచ్చాడు. ఈరోజు అతని ఇంట్లో జరిగిన విషయమంతా చాలా వివరంగా ఉంది ఆ వీడియోలో. లచ్చి ఆసక్తిగా చూడసాగింది.

* * *

గౌరీపేటలోని దొర భవంతిలోకి సిరవడు అడుగుపెట్టగానే.. వర్షం ప్రారంభమైంది. పెద్ద దొరసాని సిరవడిని చూసి..

'సిరవా! అమ్మగారికి నొప్పులు వస్తున్నయి. మంత్రసాని వచ్చింది. దొర కూడా సమయానికి లేడు. నువ్వు ఈ పూట మాకు తోడుగా ఇక్కడే ఉండాలి' అన్నది.

'గట్లనే తల్లీ! ఈడనే ఉంట' అన్నాడు సిరవడు.

ఆ ఇంటికి సేవ చేయడం తన భాగ్యం అన్నట్లుగా జవాబు ఇచ్చాడు అతను. దొరసానికి నొప్పులు ఎక్కువైనాయి. కానీ, కానుపు కష్టమైపోయింది. బిడ్డ అడ్డం తిరిగి.. తల్లీపిల్ల ప్రమాదంలో పడ్డారని మంత్రసానికి అర్థమైంది.

పక్కూరు నుండి డాక్టరమ్మను తీసుకురావాలి. కానీ, వర్షం వదలకుండా జోరున కురుస్తున్నది.

'సిరవా! అమ్మగారికి కడుపుల బిడ్డ అడ్డం తిరిగింది. ఆమె ప్రాణం ప్రమాదంలో ఉన్నది. పక్కూరు నుండి డాక్టర్ను తీసుకురాకపోతే ప్రాణాలు దక్కవు. ఏం చేద్దాం' అన్నది పెద్ద దొరసాని.

'డాక్టరమ్మను ఎట్లనైన తీసుకొస్త దొరసాని' అన్నడు సిరవడు.

ఆ వర్షంలోనే బయలుదేరాడు.

డాక్టరమ్మ ఉండే ఊరికి, దొర భవంతికి మధ్యల ఒక కాలువ ఉన్నది. ఈ కుండపోత వర్షానికి ఆ కాలువ పొంగి పారుతున్నది. మనుషులను దాటనివ్వడం లేదు. కానీ, సిరవడు ఊరుకోలేదు. అతని మనసులో ఒకటే ఆలోచన మెదుగుతూ ఉన్నది.

'డాక్టరమ్మ రావాలె! దొరసాని బతకాలె!'..

కాలువ దాటి డాక్టరమ్మ ఇంటికి చేరాడు. కానీ, ఈ వర్షంలో రావడానికి నిరాకరించింది డాక్టరమ్మ.

డాక్టరమ్మ కాళ్లు పట్టుకున్నాడు సిరవడు. ఆమె వస్తాననేదాకా వదిలిపెట్టలేదు. కానీ, కాలువ దాటడం ఒక సమస్యగా ఉన్నది. కాలువ ఒడ్డుకు చేరిన తర్వాత.. డాక్టరమ్మను ఎత్తుకొని భుజం మీద కూర్చోబెట్టుకున్నాడు. ఆ వర్షంలోనూ, వరదలలోనూ అతి కష్టంమీద డాక్టరమ్మను భుజంపై మోస్తూ కాలువ దాటించాడు. దొర ఇంటికి తీసుకువచ్చాడు.

అప్పటికే ప్రాణాపాయ స్థితికి చేరుకున్నది దొరసాని. సమయానికి వచ్చి రెండు ప్రాణాలనూ కాపాడింది డాక్టర్.

పెద్ద దొరసాని డాక్టరమ్మకు చేతులెత్తి మొక్కింది. డాక్టరమ్మ ఆమెను వారిస్తూ..

'పెద్దవారు.. మీరు నాకు దండం పెడితే ఆయువు తగ్గుతుందని అంటారు. నిజంగా మీరు దండం పెట్టాల్సింది సిరవడికి. ఈ వర్షంలో నేను రానని అంటే.. నా కాళ్లు పట్టుకొని వదలలేదు. చిన్నపిల్లను ఎత్తుకున్నట్లు భుజాలపైకి ఎత్తుకొని కాలువ దాటించాడు. ఈ రెండు ప్రాణాలు నిలబడ్డాయి అంటే.. ఆ క్రెడిట్ అతనికే దక్కుతుంది' అన్నది.

* * *

వీడియో అయిపోయింది. ఆ వీడియో చూసి సంతోషంతో తల మునకలైంది లచ్చి.

'దొరా! సిరవడు నాతోటి చాలాతూర్లు అన్నడు.. 'మన దొర రునం ఎట్లా తీరతాది లచ్చీ!' అని. ఇప్పుడు దొరసానికి, బిడ్డకు పానం పోసి ఆ రునం తీర్చుకున్నడు' అన్నది లచ్చి.

తన కాళ్ల దగ్గర కూర్చున్న లచ్చి తలమీద చేయివేసి నిమిరాడు దొర.

'నిజమే లచ్చీ! అక్కడ రెండు ప్రాణాలను కాపాడి సిరవడు రుణం తీర్చుకున్నాడు. కానీ ఇక్కడ మద్యం మత్తులో నిన్ను కోరరాని కోరిక కోరి, నేను మహాపాపం చేసిన'

'అట్లా అనమాకండి దొరా! మీరు మాకు దేవుడు. మా కుటుంబాలను

కాసుకుంటున్న దేవర. మద్దెన ఈ కల్లు మత్తు బాగా చికాకు చేసింది దొరా! గంతే!'

'అవునే లచ్చీ! నా ఎస్టేట్‌లో బతికే మీరందరూ నా పిల్లల్లాంటి వాళ్లు. అందుకే మీ దేవర.. జీలుగు కల్లు రూపంలో నాకు పరీక్ష పెట్టిండు. ఆ పరీక్షలో నువ్వు నెగ్గేటట్లుగ చేసిండు'

'దొరా! మీరు బాగా అలసిపోయినరు. పడుకోండి!' అంటూ దొరను పడుకోబెట్టి.. చెద్దరు కప్పింది లచ్చి.

కాళ్లు వత్తుతూ నిద్రపుచ్చింది. ఆ ఇంట్లో తడక అవతల బుడ్డోడు. తడక ఇవతల దొర.. నిద్రలో నవ్వుకుంటున్నారు. ఏం కలలు కన్నారో ఏమో!?

***

## ఎస్.నాగేందర్‌నాథ్ రావు

రచయిత ఎస్. నాగేందర్‌నాథ్ రావు. వీరి స్వస్థలం హైదరాబాద్. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 36 ఏళ్లు పనిచేసి, విరమణ పొందారు. తొలి నియామకం.. భద్రాచలం దగ్గరి కూనవరం ప్రాంతంలో ఉండే ఉప్పనపల్లి గుట్టల ప్రదేశం. అది పూర్తిగా అడవి ప్రాంతం. అక్కడందరూ కోయ ప్రజలే నివసించేవారు. అక్కడ ఉద్యోగం చేసిన సమయంలో కోయ భాష నేర్చుకున్నారు. వారి భాషలోనే మాట్లాడుతూ పిల్లలను ఆకట్టుకొని విద్యా బోధన చేసేవారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు కూడా పొందారు. తన సర్వీసు మొత్తం గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులతోనే గడిపారు. రచయితగానూ అనేక కథలు, పాటలు, వ్యాసాలు, కవితలు రచించారు. వీటిలో చాలావరకు అన్ని ప్రముఖ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. వీరి రచనలు మొత్తం ఏడు పుస్తకాలుగా ప్రచురించారు. 2016లో 'అమ్మ' కథల సంపుటి, 2023లో 'గెలుపు' కథల సంపుటి ప్రచురితం అయ్యాయి. కొన్ని కథలు, కవితలు బహుమతులు గెలుచుకున్నాయి. యూట్యూబ్‌లో 100 దాకా లఘు చిత్రాలు, రెండు ప్రత్యేక చిత్రాలకు కథలు, మాటలు సమకూర్చారు. ప్రస్తుతం కథారచన, బాలసాహిత్యంలో కృషి చేస్తున్నారు.

**–99638 22520**

# రీసైక్లింగ్



డాక్టర్ ఎ. సంతోష్ రెడ్డి

తెల్లారేందుకు ఇంకా చాలా టైముంది..

వీధిలైట్ల వెలుతురుకూ, మిగులురాత్రి చీకటికీ నడుమ జరిగే యుద్ధంలో పరిసరాలు మసకమసగ్గా ఉన్నయి.

ఆ పిల్లకు పన్నెండేళ్లకన్నా ఎక్కువుండవు. మసక చీకట్లో రోడ్డుపక్కన ప్రాణం పోసుకున్న నీడలా కదులుతోంది. మధ్యమధ్య కాసేపు ఆగుతూ.. వీపుమీద వేళ్లాడుతున్న సంచీ కిందికి దించుతూ.. తిరిగి భుజంమ్మీద వేసుకుంటూ సాగిపోతోంది.

ఆమె చూపులు చుట్టూ చురుగ్గా గమనిస్తున్నయి. చేతులు యంత్రాల మాదిరి కదుల్తూ చెత్తలో పారేసిన వస్తువుల్ని పోగేసుకుంటున్నయి.

ప్లాస్టిక్ బాటిల్లు, సీసాలు, చిత్తు కాగితాలు, అట్ట డబ్బాలు, పైపు ముక్కలు, ఇనుప తుక్కుసామాన్లు, చిరిగి పాడైన బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, ఫ్యాన్ల రెక్కలు, అప్పుడప్పుడూ బ్రెడ్ ముక్కలు.. ఒక్కటేమిటి పనికొస్తుందనుకున్న వస్తువేది దొరికినా ఎత్తి సంచిలో వేస్తోంది.

సన్నగా బక్కపల్చని ఆకారం. పాలిపోయిన ముఖం. ముక్కుకి, నోటికి అడ్డంగా కట్టుకున్న బట్ట. కాళ్లకి రెండు వేర్వేరు సైజుల్లో పాత చెప్పులు. అవికూడా ఎక్కడో పెంటకుప్పల్లో దొరికినవే. నడిచేందుకు ఇబ్బంది పడుతూ అట్లాగే నడుస్తున్నది.

తెల్లారేందుకు ఇంకా సమయముంది..

చలికి వొణికే నగరం ఒకవైపు వొత్తిగిలి పీడకలల మధ్య కలతనిద్ర పోతోంది. నగరానికి వడ్డాణంలా చుట్టుకొని మట్టిపాములా ప్రవహించే మురికి నది.. కాలుష్యాన్ని కడుపులో మోస్తూ విషకన్యలా కదులుతోంది.

అన్ని ఊర్లలాగే ఆ ఊరుకూ తనదైన ఉనికి ఉంది. తనవనుకునే పగళ్లూ రాత్రుళ్లూ. మంచిదో చెడ్డదో ఏళ్లతరబడి సృష్టించుకున్న సంస్కృతి. ఆకాశాన్ని తాకే బహుళ అంతస్తుల భవనాలు. చెట్లకు బదులు నిలబడి ఉన్న కరెంటు, టెలిఫోన్ స్తంభాలు. అభివృద్ధి పేరిట విస్తరించిన కాంక్రీట్ అడవులు. పగలు ఇరుకుగా, రాత్రుళ్లు విశాలంగా మారే రహదార్లు. వన్య ప్రాణుల్లా అక్కడక్కడా వృద్ధాప్యం మీదపడ్డ వృక్షాలు. రోబోల్లా బతికేస్తున్న మనుషులు. పొద్దుపొడిస్తే ఉరుకులూ పరుగులూ.

తెల్లారేందుకు ఇంకొంత వ్యవధి ఉంది..

మానవ గూళ్లు ఇంకా నిద్రలోనే జోగుతున్నయి. రోడ్ల పక్కన ఫ్లోరోసెంట్ లైట్లు

అలసటగా చీకటితో పోరాడుతున్నాయి. ఉపనదుల్లా పారుతున్న తారురోడ్లు చొక్కాకు కుట్టిన గుండీల మాదిరి నగరాన్ని అనుసంధానం చేస్తున్నాయి. కొమ్మల్ని ఊపుతూ కదలాడే అలవాటు మర్చిపోయిన నగర చెట్లు దిష్టిబొమ్మల్లా నిల్చుని దిక్కులు చూస్తున్నాయి.

ఇవేం పట్టించుకోకుండా రాజమ్మ నడుస్తోంది. వీధుల్లో మూలమూలల్లో చెదపురుగులా తిరుగుతోంది. ఫుట్‌పాతులు, సెల్లార్లు, పీడబ్ల్యూడీ నిర్లక్ష్యంగా వొదిలేసిన గుంతలు, దుర్వాసనల్ని శ్వాసించే మురికి కాల్వల్ని దాటుకుంటూ పోతోంది. నట్టనడి శీతాకాలపు చలి గజగజ వణికిస్తున్నా ఆమెకి ఖాతరు లేదు.

తెల్లారేందుకు కనీసం ఇంకో గంట గడువుంది..

ప్రతిదినం కోడికూయక ముందే లేచి రోడ్డెక్కుతుంది రాజమ్మ. తన పని అట్లాంటిది. వీధిమూలలు, ఖాళీస్థలాలు, డస్ట్ బిన్స్, చెత్తకుప్పలే ఆమె ప్రపంచం. పారేసిన, పనికిరాని వస్తువుల కోసం నిద్రకళ్లతోనే గాలిస్తూ తిరుగుతుంది.

ఆమె దినచర్య చెత్త ఏరుకోవడంతో మొదలై.. పోగేసుకున్న వస్తువుల్ని స్క్రాప్ డీలరుకు అమ్ముకోవడం, అతనిచ్చే డబ్బులతో కొంపకు చేరుకోవడంతో ముగుస్తుంటుంది.

అన్ని వృత్తుల్లో మాదిరే చెత్త ఏరుకోవడంలోనూ పోటీ ఉంది. ఎవరికివారే ముందుగా వచ్చి వీధుల్లో గాలింపులు జరుపుతారు.

ఆలస్యంగా రోడ్లమీద కొస్తే దొరికేది ఏమీ ఉండదు. రాజమ్మకు ఈ సంగతి బాగా తెలుసు. అందుకే చీకటితోనే లేచి బయటపడుతుంది.

దేశమేదైనా.. ప్రాంతమేదైనా చెత్త ఎక్కడైనా చెత్తనే! పనికిరాని వస్తువులు ప్రతిచోటా ఉండేవే. భిన్నప్రాంతాల సంస్కృతులు భిన్నంగా ఉండొచ్చు. కానీ, పారేసిన చెత్త సంస్కృతి ఎక్కడైనా ఒకే తీరు. అట్లాగే చెత్త యేరుకొని బతుకులు సాగించే జీవులంతా సేమ్ టు సేమ్.

నానారకాలైన కుళ్లు, వెగటు వాసనల్ని పీలుస్తూ గంటలు గంటలు జనం అసహ్యించుకునే ప్రదేశాల్లో తిరగడం. అలుపొస్తే ఏ ఫుట్‌పాత్ మీదో, మెట్ల కిందనో ఒకింత సేద దీరడం. తిరిగి అదే వేటలో సాగిపోవడం.

పెంటకుప్పల్లో చేతులుపెట్టి వెతకడం. నాలాల్లో.. మురుగునీళ్లలో తేలియాడే వస్తువుల్ని కూడా పట్టుదలగా సమీకరించడం.

కొన్నిసార్లు చెత్తను కెలుకుతుంటే చేతులకి అంటరాని వ్యర్థాలు, మలమూత్ర అశుద్ధాలు అంటుకుంటయి. రాజమ్మ విసుక్కోదు, అసహ్యించుకోదు. తనకు మామూలైనట్టు పనిలో మునిగిపోతుంది.

చీదరించుకుంటే ఎవరికి నష్టం..? తిండికి దొరక్కుంటే ఆకలి ఎవరికి..?

మనిషి రోగాలతో చచ్చినా ఫరవాలేదు, ఆకలితో చావకూడదు కదా..? అట్లా

ఎవరూ కోరుకోరు కూడా. ఏదోవిధంగా బతికెయ్యాలి. బతకడం కోసం అన్నీ భరించాలి. మూత్రమైనా, మలమైనా, అది మనిషిదైనా జంతువుదైనా చేతుల్తో ముట్టుకోవాలి. అంటుకోనివ్వాలి. తనకలాంటి హీనస్థితి కల్పించిన దేవుణ్ని రాజమ్మ ఎప్పుడూ తిట్టుకోదు. అసలు తిట్టుకునేందుకో మెచ్చుకునేందుకో ఆమెకు తీరిక ఉండదు.

అప్పుడప్పుడే తెలతెల్లవారుతోంది..

పాత ఏడాదికి వీడ్కోలు చెపుతూ రాత్రంతా విందులూ వినోదాల్లో మునిగి తేలిన నగరం, కొత్త ఏడాదిలో తొలిరోజు కొంచెం ఆలస్యంగా మేలుకుంటోంది. రాజమ్మకు ఒకింత సంతోషంగా ఉంది. ఆ దినం ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ బాటిల్లు, అట్టడబ్బాలు కొంచెం ఎక్కువే దొరుకుతున్నయి. ఆమె వయసుకూ, ఎత్తుకూ యేమాత్రం పొంతన లేనట్టు మోసుకొస్తున్న పెద్దసంచీ క్రమేపీ నిండిపోతోంది.

బరువెక్కిన సంచీతో నడవడం కష్టంగా ఉంది. అయినా భారంగా అడుగులేస్తూ వీధులు కలియ తిరుగుతోంది.

అట్లా నడిచి ఆ ప్రాంతంలోని అతిపెద్ద చౌరస్తాకు చేరుకుంది. నాలుగు దిక్కులనుంచి విశాలమైన రోడ్లు అక్కడ ఒకే దేహానికి అతికించినట్టు కలుస్తున్నయి. ఒక పక్కన సర్వీసు రోడ్డులోకి తిరిగిందామె. వరుసగా దుకాణాలు, షాపింగ్ మాల్స్. షాపుల ముందు మెట్లపక్కన ఉన్న చెత్తడబ్బాలు వెతుకుతూ వెళుతున్నది. ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో చేయిపెట్టి కెలుకుతూ వెతికింది. నాలుగైదు ఖాళీ వాటర్ బాటిల్లు దొరికినయి. మరోచోట కొన్ని అట్ట డబ్బాలు, డిస్పోజ్డ్ టీ గ్లాసులు, పారేసిన మద్యం సీసాలు కనిపిస్తే సంచీలో వేసుకుంది.

అప్పటికి పూర్తిగా తెల్లారిపోయింది..

నగరం మెల్లగా తూర్పు దిక్కుకు తిరుగుతోంది. రాజమ్మ నిశ్శబ్దంగా తనపని చేసుకపోతోంది. ఓచోట లెక్కలేనన్ని అంతస్థులతో ఒక భారీ అపార్టుమెంటు నిర్మాణం జరుగుతోంది. తలెత్తిచూస్తే అంతెత్తున ఇంకా నిర్మాణం పూర్తికాని ఫ్లాట్స్ కింద నుంచి పిచ్చుకగూళ్ల మాదిరి కనిపిస్తున్నయి. భారీ యంత్రాలు, క్రేన్ల సాయంతో రాత్రీ పగలూ ఏకధాటిగా కడుతున్నారు. మేస్త్రీలు, వర్కర్లు నిర్విరామంగా పనిచేస్తున్నారు.

సరిగ్గా దానికి ఎదురుగా ఉన్న టీకొట్టు దగ్గరకొచ్చింది రాజమ్మ. భుజం మీది సంచి ఓ పక్కన దింపేసి అటు చూస్తూ నిలబడింది. ఆ పిల్లకి ఛాయ్ తాగితే బాగుంటదనిపించింది. కానీ డబ్బుల్లేవు. టీలు చేసి అందిస్తున్న వ్యక్తి కేసి చూసింది. అతడూ ఆమెని చూశాడు.

రాజమ్మ కదలక మెదలక తదేకంగా చూస్తుంటే కొద్దిసేపటికి అతనే అడిగాడు..

'ఛాయ్ తాగుతవా పోరీ..?'

ముందు వద్దన్నట్టు తల అడ్డం ఊపింది. తర్వాత తడబడుతూ చిన్నగా అంది..

'నా దగ్గర పైసల్లేవన్నా!'

అతడేమనుకున్నాడో మరేమీ ఆడక్కుండా చిన్న ప్లాస్టిక్ గ్లాసులో టీ పోసి అందించాడు. రాజమ్మ సంతోషంగా తీసుకుంది. అలసిన ముఖంలో వెలుగు. కృతజ్ఞతగా చూసింది. ఛాయ్ తాగుతూ ఓ మూల ఒదిగి నిలబడింది.

టీకొట్టతను పక్కన కస్టమర్లతో చెపుతున్నాడు.

'ఎంత పెద్ద అపార్టుమెంటు కడ్తున్నరో చూసిన్రా? ఒక ఊరంత ఉన్నది. దీంట్ల ఎన్ని కుటుంబాలుంటయో!?'

'అవునవును.. కోట్ల రూపాయల ముచ్చట'

'దాన్ని కట్టిస్తున్న ఓనర్ నాకు తెలుసు'

'తెలుసా.. అంత గొప్పోడు నీకెట్ల ఎరుక?'

'అతనిది మా ఊరే. ఒకప్పుడు బాగ పేదోడు. చదువుకోలేదు. ఆవారగా తిరిగిండు. తండ్రి చిన్నప్పుడే సచ్చిపోయిండు. కూలినాలి చేసుకుంట తల్లే అతన్ని పెంచింది. ఆమె కూడ పోయినంక సిటీకొచ్చి పడ్డడు. ఇక్కడికొచ్చి పది పన్నెండేండ్లు కావొచ్చు. ఇంత తక్కువ టైములో ఎక్కడున్నోడు ఎక్కడికో పెరిగి పోయిండు'

'ఇంత మార్పు ఎట్ల జరిగింది' ఎవరో అడిగారు.

'కొంతకాలం అక్కడక్కడ చిన్నచిన్న పనులు చేసుకుంట ఉన్నడు. తర్వాత ఒక పేరున్న బిల్డరు తానికి పనిలోకి పోయిండు. అక్కడ నమ్మకంగా ఉండి ఈ రంగంలోని కిటుకులన్నీ నేర్చుకున్నడు. తర్వాత సొంతంగ బిల్డరు అవతారమెత్తిండు. తంతెలెక్కినట్టు పైపైకి పోయిండు. గంతనే..! సూస్తుండంగనే సీన్ మొత్తం మారిపోయింది. తర్వాత అతడు సిటీల ఎన్నో అపార్టుమెంట్లు, భవంతులు కట్టిండు. ఇంకోపక్క కాంట్రాక్టరు పనులు మొదలుపెట్టి చాలాచోట్ల రోడ్లేసిండు, వంతెన్లు కట్టిచ్చిండు. అట్లా పల్లెటూరు నుంచి పొట్ట చేతవట్టుకొని ఎలుకపిల్ల లెక్క వొచ్చిన మనిషి ఏనుగంత అయిండు. పదేండ్ల కింద పేదవాళ్లల్ల ఒకడిగ ఉండేటోడు. ఇప్పుడుసూడు యాడున్నడో!?'

'అంతే అన్నా..! అదృష్టం చిత్రమైంది. మనలాంటోళ్ల మీద ముసురు లెక్క రాలిపడి ఇంకొందరి మీద కుంభవృష్టి తీర్గ కురుస్తది'

'అట్లెందుకు అనుకోవాలె..? మనకంటే నికృష్టంగ ఎందరు లేరు? అదృష్టం ముఖం కూడా చూడకుండ బతుకంతా దరిద్రంలో మగ్గుతున్నోళ్లు చాలామంది ఉన్నరు'

'ఏం జేస్తాం? ఎవడి రాత వాడిదే. దేవుడు జన్మ ఇచ్చినప్పుడు చచ్చేదాక బతికితీరాలె. అది మనిషి తీర్గనో, కుక్క తీర్గనో'

రాజమ్మ అందరి మాటలు విన్నది. తర్వాత అక్కణ్నుంచి మెల్లగా కదిలింది. చెత్తలో గాలింపు సాగిస్తూనే అదృష్టాన్ని గురించి తన చిన్న బుర్రతో తలపోసింది.

ఈ లోకంలో ఎంతమంది చెత్తవాళ్లు ధనికులయ్యే అదృష్టాన్ని పొంది ఉంటరు? పెంటకుప్పల్లో పనికిరాని వస్తువులు యేరుకునే వాళ్లకు అదృష్టం ఏ రూపంలో వొచ్చి తలుపు కొడుతుంది? బహుశా పెంటకుప్పల నుంచే పుట్టుకరావాలి. చెత్తలోనే ఏదైనా విలువైన వస్తువు దొరికితే ఎంత బాగుంటది?

ఆమెకి చెత్తలో ఎప్పుడో అరుదుగా ఒకటీ ఆరా కొంచెం విలువైన వస్తువులు దొరుకుతుంటయి. కానీ, అవేవీ బతుకుల్ని సమూలంగా మార్చివేసేవి కావు. అట్లా మార్చగల విలువైనవి ఎప్పటికైనా దొరుకుతాయన్న ఆశ ఉంటుంది. తనకే కాదు, చెత్త యేరుకుని బతుకుతున్న అందర్లోనూ ఉంటుందని ఆమె అనుకుంటది.

ఇప్పటివరకైతే అలాంటి పెన్నిధి ఏదీ రాజమ్మకు తగల్లేదు. తననింకా అదృష్టం వరించలేదని భావిస్తుంది.

ఎవరు చెప్పగలరు..? అటువంటి ఒకరోజు.. ఒక గొప్ప సందర్భం రావచ్చు. కానీ ఏ రూపంలో? వెండి బంగారు మూటలు, నోట్లకట్టలతో నిండిన బ్యాగులెవరైనా పారేసుకుంటారంటే ఆమె నమ్మదు. డబ్బు విషయంలో మనుషులు అంత నిర్లక్ష్యంగా ఉంటారన్న అత్యాశకు పోదు. కానీ, ఎప్పుడో ఒక్కక్షణం అనిపిస్తుంది. ఏమో.. ఎవరూ ఊహించని అద్భుతం జరగొచ్చు. అప్పుడు దశ తిరిగి పోతుంది. తనూ, తన కుటుంబమూ సంపన్నుల్లో చేరుతారు. డబ్బులున్న వాళ్లయి పోతారు. ఏదీ అసాధ్యం అనుకోవడానికి లేదు.

బతుకైనా అదృష్టమైనా చిత్రమైంది. కనికరిస్తే అది దేవత. తప్పించుకుని తిరిగితే దయ్యం.

ఆమె చిన్న ప్రపంచంలో ఎన్నెన్నో కలలు. అవి ఆకాశమంత విశాలం, చెత్తకుప్పలంత విస్తారం.

తెల్లవారి ఏడు గంటలు దాటిపోయింది..

మబ్బుల నడుమ లేత సూర్యుడు తప్పటడుగులు వేస్తున్న పిల్లాడిలా హుషారుగా ఉన్నాడు. ఎండ కొద్దికొద్దిగా వేడెక్కుతూ చలిని తరిమేస్తోంది. కడుపు ఉబ్బిపోయి బరువెక్కిన సంచీ రాజమ్మ భుజం మీద భారంగా ఊగుతోంది.

ఆమె బాగా అలసిపోయింది. నిజానికి ఆరోజు ఎక్కువే తిరిగింది. సంచీ నిండినమాట నిజమే, కానీ అందులో రాబడి ఎక్కువగా వొచ్చే వస్తువులేవీ లేవన్న సంగతి ఆమెకు గ్రహింపు ఉంది. రాజమ్మ తనకు చెత్త కుప్పల్లో దొరికిన ప్రతి వస్తువూ అమ్మకాని కోసమనే భావిస్తుంది. అది తప్ప ఇంకో యోచన రాదు. దాచుకోవడం, వాడుకోవడం వంటివి తెలియవు.

లేనోడు దేన్నయినా అమ్ముకునేందుకు సిద్ధపడతాడు. ఉన్నోడు ఎంత విలువైనదైనా కొనడానికి రెడీగా ఉంటాడు. ప్రతిదీ అమ్మకానికో, కొనుగోలుకో పనికొచ్చే వ్యావహారిక వ్యవస్థలో బ్రతుకుతున్నామనే నిజాన్ని చెత్తవృత్తి పాఠాలు

నేర్పుతూ వొచ్చింది. పదిలంగా దాచుకునే వస్తువేదీ చెత్తకుప్పల్లో ఉండదని రాజమ్మ నమ్మకం.

అంతేకాదు, దొరికిన వస్తువు విలువైనదా కాదా అనే తేడాలు కూడా ఆమె దృష్టిలో లేవు. దొరికిందల్లా సంచిలో వేస్తుంది. వాటిల్లో కొన్ని వస్తువులు ఎందుకూ పనికిరానివి కూడా ఉంటయి. వాటిని కొనేందుకు సేర్ ఒప్పుకోడు. అవెంత బరువైనవైనా తీసి పడేస్తాడు.

చెత్తలో దొరికే పనికిరాని వస్తువేదైనా రీసైక్లింగ్ జరగాల్సిందే. వాటిని కరిగించి తిరిగి కొత్త వస్తువుల్ని తయారు చేస్తారన్న సంగతి రాజమ్మ వినివుంది. ప్రస్తుతం పగిలిన, విరిగిన, పాడైపోయి ఉన్నవన్నీ తర్వాత మరో రూపాన్ని పొందేవే.

రాజమ్మ చూపు సైతం చిత్రంగా ఈ నేపథ్యం లోంచే ఉంటుంది. సంపూర్ణమైన వస్తువులేవీ ఆమె చూపులకు ఆనవు. చూసినా పట్టించుకోదు. అలాంటివి తనకు అస్సలు పనికిరావు. ఏం చేసుకుంటుంది? తీసుకపోయి ఇంట్లోనో, మ్యూజియంలోనో పెట్టలేదు.

ఆమె కళ్లు చెత్త వస్తువుల్ని చూసేందుకే అలవాటు పడ్డయి. శిథిలాలు, ముక్కలు, పనికిరాని వాటికే చూపులు అతుక్కపోతయి.

చెత్తలో దొరికేది ఏదైనా అమ్మకానికి పనికొస్తుందా, డీలర్ కొంటాడా అన్నదే గమనిస్తుంది.

కాసిన్ని డబ్బులు కూడా ఇవ్వలేనివి కండ్లబడ్డా పట్టించుకోదు. వొదిలేసి ముందుకు పోతుంది. పాడైపోయిన తుక్కులు, ముక్కలే ఆమెకు విలువైనవి. ఆమె దృష్టిలో అవి పూర్తికాని చిత్రాలు. కరిగించి రీసైక్లింగ్ చేస్తే కొత్త చిత్రాలవుతయి. వాటికి పునః ప్రతిష్ఠ జరుగుతుంది.

ఉదయం ఎనిమిది గంటలు దాటింది..

ఎన్నోచోట్ల తిరిగి తిరిగి చివరగా డంప్ యార్డుకు చేరుకుంది రాజమ్మ. ఆ రోజుకి అదే ఆఖరి మజిలీ. అక్కణ్నుంచి నేరుగా డీలర్ దగ్గరకు పోవడమే. పనికొస్తాయనుకున్న వాటిని తూకమేసి పైసలిస్తడు సేర్. ఆ పైసలు తీసుకొని కొంపకు పోతుంది.

డంప్ యార్డ్ భయం గొలిపేలా ఉంది. ఏవో రెండు రాజ్యాల మధ్య భీకర యుద్ధం జరిగినట్టుంది పరిస్థితి. ఎటుచూసినా చెత్తకుప్పలు. నరకాన్ని మోసుకొచ్చే గాలి. భరించలేని దుర్గంధం. ముక్కుపుటాలు అదిరి కొత్తోళ్లయితే అక్కణ్నుంచి పారిపోతరు. బాల్యం నుంచి మురికి, దుర్గంధంలోనే గడిపిన రాజమ్మకు పెద్ద ఫరక్ పడలేదు.

కొన్నిచోట్ల చెత్తకుప్పలు చిన్నచిన్న కొండల్లా పెరిగిపోయి ఉన్నయి. రాబందుల్ని తలపిస్తూ ఊరకుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నయి. గార్బేజ్ ట్రక్కు ఒకటి అప్పుడే

చెత్త డంప్ చేసి వెళ్లింది.

రాజమ్మ అటు నడిచింది. సంచీ పక్కన పడేసి వొంగి చెత్తలో వెతకసాగింది.

తడితడిగా.. చీదరగా.. రకరకాల దుర్గంధాలు కలగలిసి ఊపిరాడనట్టుంది. తడిచెత్త పొడిచెత్త వేరుచేయాలని మున్సిపాలిటీ చెపుతుంది. కానీ ఎవరూ పట్టించుకోరు. సబ్బండ రకాల చెత్తంతా ఒకేచోట.

చెల్లాచెదురుగా పడున్న పెద్దపెద్ద క్యారీ బ్యాగు మూటల్ని ఒక్కొక్కటీ విప్పి చూస్తోంది. బ్యాగుల్లోపలికి చేయిపెట్టి ఒక్కొక్కటీ బయటికి లాగుతుంది. ఒక పెద్ద నల్లరంగు ప్లాస్టిక్ బ్యాగు విప్పింది. లోపల బాగా తడిసిన చెత్త కుక్కినట్టుంది.

చేతికి ఏదో మెత్తగా తడిగా జిగటగా అంటుకుంది. దాన్ని బయటికి తీసింది. తట్టుకోలేనంత దుర్వాసన, రక్తంతో కూడిన నీచువాసన ఒక్కసారి గుప్పుమంది. అంత మొత్తంలో మాంసాన్ని మూటకట్టి అట్లా ఎందుకు పారేశారో ఆమెకు అర్థంకాలేదు. బహుశా పాడైపోతే పారేసి ఉంటారని అంతవరకే భావించింది.

చేతుల్ని చిత్తు కాగితాలతో తుడుచుకొని మళ్లీ బ్యాగులో చేయిపెట్టి చూసింది. అడుగున నల్లగుడ్డలో చుట్టిన మరో మూట దొరికింది. అది ఇంకొంచెం పెద్దది. విలువైనవి ఏవైనా ఉన్నాయేమోననే ఆశతో బయటికి లాగి విప్పింది.

చూసిన మరుక్షణం భయంతో వణికిపోయింది.

ఆ మూటలో ఓ పసికందు శవం. కొన్ని గంటల వయసున్న రక్తపు గుడ్డు. చచ్చిపోతే అట్లా మూటకట్టి చెత్తబ్యాగులో వేశారో, లేక కావాలని శిశువు ప్రాణాలు చిదిమేసి వదిలించుకున్నారో తెలియదు.

బిత్తరపోయి పెద్దగా అరిచింది రాజమ్మ. ఆమెకు ఊపిరి ఆడలేదు. ఒక్కఉదుటున లేచి నిలబడింది. క్షణం ఏం చెయ్యాలో తోచలేదు. తర్వాత మైకంలోంచి బయటికొచ్చినట్టు రక్తశిశువుకేసి తేరిపార చూసి బాణంలా అక్కణ్నుంచి పరుగు తీసింది. తన సంచీ అక్కడే వదిలేసి ఎటు వెళుతున్నదీ చూడకుండా దూసుకుపోయింది.

నగరంలో తొమ్మిది గంటల జనసందడి మొదలైంది..

ఎంతోదూరం ఆగకుండా పరుగెత్తి అలసిపోయిన రాజమ్మ ఆయాసంతో ఒక దుకాణం మెట్లపైన కూలబడింది. గుండె వేగంగా కొట్టుకుంటుంటే తేరుకునేందుకు చాలాసేపు పట్టింది.

ఎంత పారేసేవైనా అసలు పనికిరాని వస్తువేదీ ఉండదని రాజమ్మ ఇప్పటివరకూ నమ్ముతూ వొచ్చింది. పాత వస్తువు సరికొత్త రూప పరివర్తనకు దోహదం చేస్తుంది. ఏదీ నశించదు, కేవలం రూపం మార్చుకుంటుంది.

పాత ప్లాస్టిక్ నుంచి కొత్త ప్లాస్టిక్ సామాన్లు, చిరిగి పాడైన పాత బ్యాగులేమో వేర్వేరు రూపాల్లో సరికొత్త బ్యాగులు, తుప్పుపట్టిన తుక్కు రేకులు కొత్త డబ్బాలై, పాత

లెదరంతా తళతళ మెరిసే చెప్పులు, షూలు తదితర నయా అవతారాలుగా రూపొందుతయి.

పాత బంగారాన్ని కరిగించి జిగేల్మనే సరికొత్త ఆభరణాల్ని తయారు చేస్తారు. చిన్నపిల్లలు పెరిగి పెద్దవారై కొత్త మనుషులుగా, పరిపూర్ణులుగా మారిపోతారు.

అట్లా కొత్తదేదీ స్వతహాగా కొత్తది కాదు. పాతదానితో అనుసంధానం అయ్యే ఉంటుంది.

మరైతే డంప్ యార్డు చెత్తలో కనిపించిన మృతశిశువు..? ఆ పసిగుడ్డు కొత్త వస్తువా? లేక పాత వస్తువా..? ఏమనుకోవాలి?

ఏ రూపాంతరం జరక్కుండానే పాతదిగానే ముగిసింది. కాదు, ముగించేశారు. చెత్తలో కలిపేశారు.

చెత్తను నమ్ముకొని బతికే ఆమెకు సైతం ఉపయోగపడని చెత్తవస్తువు కంటే హీనాతిహీనం చేశారు.

అన్నిటిలా ఆ పసిగుడ్డు దేహానికి రీసైక్లింగ్ లేదు. ఏం చేసినా మరో రూపానికి రాదు. అసలు పరివర్తనే లేదు.

పదిగంటల ఎండ వేడెక్కి చురచురమంటోంది..

రాజమ్మ తలెత్తి మొగులు వైపు చూసింది. పైన సూర్యుడు వెండి కడియంలా మెరిసిపోతున్నాడు.

***

## డాక్టర్ ఎ. సంతోష్ రెడ్డి

స్వస్థలం హైదరాబాద్‌లోని కొత్తపేట్. ప్రస్తుతం వృత్తిరీత్యా న్యూఢిల్లీలో ఉంటున్నారు. ఎంబీబీఎస్, డీఎన్‌బీ (రేడియాలజీ) చేశారు. న్యూఢిల్లీలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో రేడియాలజీ చీఫ్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. సాహిత్య పఠనం పట్ల అభిరుచి పెంచుకున్నారు. 'రీసైక్లింగ్'.. ఈయన మొట్టమొదటి కథే కాదు, మొట్టమొదటి రచన కూడా! నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీలో.. తన తొలి కథకే బహుమతి రావడం ఎంతో ఆనందంగానూ, ప్రోత్సాహకరంగానూ ఉందని చెబుతున్నారు రచయిత. సాహితీ రచనలో ఇంకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని నమ్ముతున్నానని అంటున్నారు.

# కొండెక్కని దీపం



మౌనిక సుదర్శనం

చెట్లమీది పూలన్నీ బతుకమ్మల పేరంటానికి ఇండ్లకు చేరినట్లు.. పొద్దుగూకే వేళ పక్షులన్నీ చెట్లమీదికి చేరుకున్నట్లు.. అత్తగారిండ్లకు పోయిన ఆడబిడ్డలు బతుకమ్మ పండుగకు తల్లిగారిండ్లకు చేరుకుంటరు. ఆడబిడ్డల రాకతో.. ఊరినిండా రంగురంగుల సీతాకోక చిలకలు వాలినట్లు, నగల ధగధగలతో, గాజుల గలగలలతో, గజ్జల చప్పుళ్లతో, గంధపు సువాసనలతో.. ఊరు కొత్త పెండ్లికూతురులా ముస్తాబై మురిసిపోతది.

ఇక చిన్ననాటి ముచ్చట్లతో అరుగులు, బతుకు కష్టాల వలపోతతో మంచినీటి బావులు, మసక చీకట్లో వాకిట మంచాలమీద కూర్చోని పంచుకునే మాటల మూటలు, గుండెలనిండా దాగిన జ్ఞాపకాలను ఒంపుకొంటూ, గుండెచాటు గాయాలను తడిమి చూసుకుంటూ.. సంతోషాల పల్లకిలో ఊరేగుతూ, మనసు పొరల ఒరిపిడికి ఇంకిన కన్నీళ్లను ఒదార్చుకుంటూ.. ఇలా పసందైన మాటలతో, ఘాటెక్కిన వాదనలతో, మసాలా సంగతులతో ఊరంతా కుతకుతలాడుద్ది.

'అమ్మక్కో.. ఓ భూలచ్చిమి.. గౌరక్కా.. ఇంకా లేవలేదానే!? మబ్బుల్నే లేసి గాయిగాయి గత్తరగత్తర సేసేటిదిగాదె నీ ముద్దుల బిడ్డ! అవ్వల్లో ఇంకా లేవనే లేదా!? అవునుగాదు!? మరిసేపోయిన! ఇగ అక్క ఊరి కొత్తాందని రాత్రి మా బావ గౌరక్కని నిద్రపోనిచ్చినట్లు లేదు! అందుకే మస్తుగా నిద్రవోతాంది' అంది గౌరి వాళ్ల పిన్ని బిడ్డ సీత.

'ఓ పొల్లా.. ఏం మాటలే గవి? పోయి మీ అక్కని లేపుకోరాదే? ఈ పోరికి పెండ్లయినా ఇవురం రాలేదు. దీని మొగడు ఎట్లేగుతాండో ఏందో దీంతోని!?' అంది.. వాకిలి ఊడుస్తున్న గౌరి తల్లి భూలక్ష్మి.

'అమ్మక్కా.. తమ్మున్ని సుత తోల్కపోతానం పూలు తెంపనీకి, గౌరక్కని లేపకులే.. దానిగ్గూడా మేమే కోసుకొత్తంతీ! పాపం దాన్ని పండనీయి' అంటూ గిరుక్కున మళ్లిపోయింది సీత.

గొడ్లకొట్టంలో పెండకళ్లు తీస్తున్న సీత తండ్రి వెంకన్న..

‘ఇగో.. నిన్నేనే?.. ఓపాలిట్రా?’ అని వాకిట్ల అలుకు జల్లుతున్న భార్యను పిలిచిండు.

‘ఏందయ్యా..! అగ్గో.. గట్ల ఏడవబట్టివి! పానం గిట్ల మంచిగలేదా ఏంది! జర్రుండు జప్పున గిన్ని మంచినీల్లు తెత్త’.. అంటున్న భార్యను ఆగమని చెయ్యితో ఇషారా చేసి.. పెండ్లాం దగ్గరికి వచ్చిండు వెంకన్న.

‘నిన్న గౌరవ్వను తోల్కరాను బోయిన గదనే.. ఆళ్ల అత్త బిడ్డను సాగనంపుకొంటా అనరాని మాటలన్నదే! ‘లగ్గమై గిన్నోద్దులైనా పిల్లాజెల్లా లేని గొడ్డుబోతు దానివి! మాకేడ దాపురించినవే!’ అని శాపనార్థాలు వెట్టిందే. ‘ఈపాలి మీ అవ్వకు జెప్పి డాక్టరుకు జూపించుకొని రా! రొండ్నెల్లల్ల కడుపున కాయబడకుంటే.. నా కొడుక్కు ఇంకో లగ్గంజేత్త! ఇగ నువ్వు మీ అవ్వగారింటికి బోతవో.. అడక్క తింటవో నీ ఇట్టం!’ అని పిల్లను ఎట్లబడితే గట్లన్నదే! ఆ మాటలింటాంటే పానం సచ్చిపోయిందే! ఇగ గౌరవ్వ దారిపొంటంతా ముదాం ఏడుత్తనే ఉందే! భగమంతుడు కట్టాలన్నీ మనకే బెట్టినట్టుండే!’ అంటూ.. కండ్లనీళ్లు తుండుగుడ్డతో తూడ్సుకుంటా..

‘సరెతీ.. పదిల పదకొండు అప్పోసప్పో జేద్దాం గని, బిడ్డను ఇయ్యాల్నో రేపో పట్నం దోల్కపోయి మంచి డాట్టర్కు చూపించే!’ అన్నడు వెంకన్న పెండకళ్లను తట్టలకు ఎత్తుకుంటూ.

‘దాన్నోట్లె మన్నువడ! దాని తలపండు వలుగ! దొంగ ముండ.. బిడ్డను రాసి రంపాన వెడ్తానట్లుంది. దాని నోటికి జడిసి బిడ్డ బువ్వగూడా సక్కంగ తింటానట్లు లేదు. పోరి దవుడలన్నీ గుంజుకపోయి సెంపలు లొట్టలువడి, యాడికాడికి ఎండుక పోయింది. బతుకమ్మ పండుగంటే బిడ్డకు పానం లెక్కుండేది. ఊల్లె పూలు, సెర్ల పూలు కోలుముందే తెంపి తెస్తుండె బిడ్డ. ఇప్పుడు పండుగన్న కయాలే లేకుండ బోయింది బిడ్డకు. ఈ పెండ్లిమీద మన్నువడ.. పెండ్లి దాని నెత్తిన నిప్పులు వోసి.. సంతోసాన్ని దిగ మింగింది! అయినా దొంగ బొడ్డి.. అదిగూడా ఆడిదేగదా! నాలుగొద్దులు ఆల్సమైతే గొడ్డుబోతని పేర్ల వెడతదా? ముందు దాని కొడుకును దవఖానాల జూపుమను. దుక్కిదున్నంగనే పంట పండుద్దా!? ఇచ్చాంత్రం గాకుంటే.. గట్టి ఇత్తనం పడొద్దా ఏంది?’

అని కాసేపు దమ్ము దీసి..

‘నువ్వు సూత నామాట ఇన్నావా? వద్దయ్యా! పట్నపోళ్ల సంబంధం అంటే ఇనకపోతివి. ‘బిడ్డ కట్టపడొద్దే.. మనలెక్క మట్టి పిసుకద్దే!’ అని తన్లాడితివి. ఇప్పుడు సూడు దాని గతేమైందో!?..’ అని వలవల ఏడ్చింది భూలక్ష్మి.

కండ్లు నలుపుకొంటా వాకిట్లకొచ్చిన బిడ్డను జూసి.. పెండ్లాం మొగలిద్దరు ఏం

తెలియనట్లు మాట మడతబెట్టింద్రు.

'అవ్వా! నేను ముగ్గెయ్యనానే?' అంది గౌరీ.

'అద్దుతీ బిడ్డ! నువ్ బోయి మొఖం గడుగు. నేను చాయివెడ్త' అంది భూలక్ష్మి.

బాయి గట్టున కూసోని ఆలోచనల్లో మునిగింది గౌరీ.

ఎట్లాంటి బతుకు.. ఎట్లయిపాయే! పది అయిపోంగనే.. 'ఇగ సాల్‌తీ!' అని సదువకుండ జేసిరి. మంచి సంబంధం, పిల్లగానికి పట్నంల నౌకరని.. అప్పులు జేసి, ఉన్నదమ్మి కట్నం పోసి లగ్గం జేసిరి. తమ్ముడు జూడ చిన్న పోరడు. అమ్మ నాయినలు తిని తినక రెక్కలు ముక్కలు జేసుకొన్నా.. సాలి సాలని బతుకులు. ఆడ జూద్దమా.. అత్త జూస్తే రాకాసి. మావ ఉన్నా లేనట్లే! ఇగ ఆన్ని మొగడన్నా మొద్దన్నా ఒకటే! పెండ్లాం పక్కలపంటే పక్కకు మల్లి పంటడు. ఇప్పటిదాక పెయిమీన సెయ్యేసి ఎరగడు. ఇగ పిల్లలు పిల్లలని అంటే నీనేడతెద్దు!? ఏం జేద్దు?.. అని గుడ్లల్ల నీళ్లు నింపుకొన్నది గౌరి.

వాన్ని నిలదీస్తే బెదిరిత్తాండు. 'బైటికి జెప్తే నీ ఖందాన్ మొత్తాన్ని నడిబజార్ల నరుకుత!' అని బయపెడ్తాండు. మరి పిల్లల సంగతి ఎత్తొద్దని మీ అవ్వకు జెప్పుమంటే.. 'నేం జెప్పను! ఎవని దగ్గరన్న పండి పిల్లలను గను!' అని గలీజు మాటలంటాండు. అమ్మ నాయినలకు ఏం జెప్పల్నో, ఎట్ల జెప్పాల్నో తోస్తలేదు. చెప్తె యాడ గుండె పగుల్తరోనని బుగులైతాంది. ఇగ దేవుడు నాకు సావురాతే రాసిండేమో! ఈ పండుగెల్లుడు నా పీనుగెల్లుడు ఒకటే గావాలె! గంతకన్నా తోవలేదు.. అని తీర్మానించకుంది.

కానీ, ఇగ ఉన్నన్ని రోజులు నా బాధ అమ్మ నాయినలకు తెల్వనీయొద్దు! సంతోషంగా ఆఖరి బతకమ్మ ఆడి.. గౌరమ్మ గంగలో కలిసినట్లు నేనుసుత ఆ గంగల్నే కలిసిపోతా! అనుకుంది గౌరి..

'గౌరవ్వా! ఎంతసేపే? చాయి సల్లర్తాంది జప్పునరా బిడ్డా!' అన్న తల్లి మాటలతో... ఆలోచనలు బందువెట్టి..

'ఆ.. అత్తాన్నే' అంటూ గబగబా మొఖం కడుక్కొని పోయింది గౌరి. అవ్వ కొంగుతో మొఖం తూడ్సుకుంటాంటే.. చిన్నతనం యాదికొచ్చింది. ఆవ్వ కొంగంటే పిల్లలకు దాపుడు పెట్టె. ఎక్కడ తినేది దొరికినా అవ్వ చెంగున ముడేసి పిల్లపచ్చులకు తల్లి పచ్చి తెచ్చినట్లు తెచ్చిపెట్టేది. కాయో, పండో, అప్పాలో.. చివరకు చిల్లర పైసలుసుత అవ్వ కొంగున్నే దొరికేయి. అవ్వ కొంగు అక్షయపాత్ర. ఆ కొంగు ఎండకు వానకు గొడుగు పట్టేది. జరమొచ్చినా, పడిశంపట్టినా అవ్వకొంగే ఆసరా అయ్యేది.. ఇప్పుడు సుత గుడ్లనీళ్లు కనపడకుండా అవ్వకొంగే కాపాడింది అనుకుంది గౌరీ.

అవ్వ ఇచ్చిన చాయి అమీతం కన్నా ఎక్కువే!

'అవ్వా! చాయిల గిన్ని కారపు సుట్టలు పోయారాదే!' అంది గౌరి.

'మాపటేల తిందువులే బిడ్డా! ఇయ్యాల ఎంగిలిపూలు. ఒక్కపొద్దుండి బతుకమ్మ పేరువు! తమ్ముడు తంగేడు పూలకు పోయిండు. జప్పన్నే అత్తడుతీ!' అంది భూలక్ష్మి.

తలదీపార స్నానం చేసి, కొత్తచీర కట్టుకొని, నిండుగా అలంకరించుకొని, నట్టింట్ల సాపేసి, సిబ్బిల బీరాకులు పరిసి.. తంగేడు పూలతో బతుకమ్మ పేర్చి.. దేవుని ముందు పెట్టి పూదించి, అగరొత్తులు అంటించి, కొబ్బరికాయ గొట్టి, నీల్లారబోసి దండం బెట్టుకుంది గౌరి.

'మంచిగ మొక్కుకో బిడ్డా! అచ్చే ఏడు సంకల బిడ్డతోని బతుకమ్మను ఆడిపియ్యమని గౌరిదేవికి మొక్కుబిడ్డ' అంది భూలక్ష్మి.

'పిచ్చితల్లి.. కాపురం జేయని మొగనితోని పిల్లల గనుమంటే దేవుడేంజేత్తడు? మన తలరాతే సక్కగ లేనప్పుడు ఎంతమొక్కితే ఏమొస్తది?' అని మతిల అనికోని, కండ్లు మూసుకొని..

'ఏ బాధ లేకుండా.. ఎవ్వరినీ బాధవెట్టకుండ నువ్వు గంగలో కరిగినట్లు, నన్ను నీలో కలుపుకో తల్లీ! మా అవ్వను, బాపును, తమ్మునీ సల్లంగా సూడమ్మా!' అని మొక్కింది గౌరి.

గుండె దిటవు చేసుకున్నాక ధైర్యం తెచ్చుకొని, ఉన్న నాలుగురోజులు సంతోషంగా ఉండాలె అనుకున్నది గౌరి.

* * *

ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ (ఆరో రోజు బతుకమ్మ ఆడరు), వేపకాయ బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ.. పండగన్ని రోజులు తీరొక్క చీరగట్టింది. రంగు రంగుల పూలతోని భక్తిగా బతుకమ్మను పేర్చింది. రోజుకో నైవేద్యం పెట్టింది. తమ్మునికి బుద్ధిమాటలు చెప్పింది. నాయిన కాళ్లు పట్టింది. అమ్మ తలకు నూనెరాసి కొప్పుపెట్టింది. అందరితో ప్రేమగా మాట్లాడింది. ఆట పాటలతో అందరినీ సంతోషపెట్టింది. కానీ, గుండెల్లో రగిలే నిప్పుల కొలిమిని, మనసులో ఆగని దుఃఖపు ముసురును, మళ్లీ ఆడలేని బతుకమ్మను, ఆడకుండానే ఓడిపోయిన బతుకును.. తలచినప్పుడల్లా రంగులు మారే మొఖాన్ని, నవ్వుల బుర్ఖా చాటుకు నెట్టేసింది గౌరి.

'బిడ్డా.. దవాఖానకు పోదామానే?' అని తల్లి ఎన్నిసార్లన్నా..

'సద్దుల బతుకమ్మ తెల్లారి పోదాంతీ!'.. అని నచ్చచెప్పింది గౌరి.

ఆ ఖర్చు సుతా తన ఆఖరి పయానానికి అక్కరకొత్తయని మదిల తలిచింది.

ఆరోజు సద్దుల బతుకమ్మ. అందని కొమ్మల తంగేడు పూలు, అంతులేని లోతుల తామరలు, కలువలు, గౌరమ్మకు ఇష్టమైన గుమ్మడి పూలు, దేవుండ్లకు ఇష్టమైన మందారాలు, పొన్నలు, పోగడలు, సీతమ్మ జడలు, గునుగు పూలు, బంతులు,

చేమంతులు, గోరింటలు.. అన్నిటిని బీరాకులు పరిచిన పెద్ద తాంబాళంలో దొంతులుగా పెట్టి.. బతుకమ్మను పేర్చి, బతుకమ్మ శిఖరాన పసుపుతో గౌరమ్మను చేసి అలంకరించింది. దేవుని దగ్గర బతుకమ్మను పెట్టి సత్తుపిండి, పెరుగన్నం, పులిహోర, మలీద ముద్దలు, కొబ్బరన్నం, నువ్వులన్నం నైవేద్యంగా పెట్టి, కొబ్బరికాయ కొట్టి హారతిచ్చింది గౌరి.

అమ్మ, నాయినల కాళ్లకు మనసారా మొక్కింది.

'అమ్మ, నాయినల రుణం తీర్చుకోకుండానే ఎల్లిపోతాన! మళ్లీ జన్ముంటే కొడుగ్గానో, ఎద్దుగానో, నాగలిగానో మీ ఇంట్ల పుట్టి రుణం తీరుసుకుంటా!' అనుకుంది.

గౌరిని చూసిన తల్లి.. తనదిష్టే బిడ్డకు తగుల్తదని, గౌరి అరికాలికి దిష్టిబొట్టు పెట్టింది. రెండుచేతులతో తల నిమురి మెటికలు విరిసింది. వేళ్లు పటుక్కున విరిగాయి.

గౌరీ పేర్చిన బతుకమ్మ సద్దుల పండుగకే వన్నె తెచ్చింది. ఈఏడు ఊళ్లె గౌరిదే పెద్ద బతుకమ్మ. భూలక్ష్మి పిల్ల బతుకమ్మను, గౌరీ తల్లి బతుకమ్మను తలకెత్తుకున్నారు. నైవేద్యాల గిన్నెతో తమ్ముడు తోడునడవంగా.. డప్పు సప్పుల్లతో, వాడకట్టు బతుకమ్మలన్నీ వెంట నడువంగ.. దివినుండి దిగిన అప్సరసలా నడుస్తూ.. దేవునిగుడి దగ్గర సద్దుల బతుకమ్మ ఆఖరి ఆటకు బైలెల్లింది గౌరి.

డప్పు చప్పుల్లు, చుట్టూ జనాలు.. రేపుకూడా ఇంతేగా..? ఇప్పుడు సంతోషంగా నడిచే ఈళ్లందరూ రేపు నన్ను గుర్తు చేసుకుంటూ.. ఏడుస్తూ నడుస్తరు. నాయిన నా ముంగట నడుస్తడు. ఇవన్నీ అప్పుడు నాకు అగుపడవు.. ఈ ఆలోచనలు మనసులో ముసరగానే గౌరి కండ్లు నీటి చెలిమలైనయి.

ఆ పొద్దు ఎన్నడూ ఆడని బతుకమ్మ ఆడింది గౌరి. ఎప్పుడూ గొంతిప్పని గౌరి.. ఎన్నెన్ని పాటలు పాడిందో! దోస్తులతో కూడి దస్తిబిస్తి ఆడింది. చమ్మ చెక్కలాడింది. జంటలుగా విడిపోయి ఎదురుకోల్లాడింది. కూసోని కాళ్లతో ఆడే తుమ్మిస ఆడింది. అలిసిపోయేదాక ఆడిపాడి.. అందరితో కలిసి బతుకమ్మను సాగనంపనీకి పెద్ద చెరువుకు చేరుకుంది గౌరి.

అమ్మా, నాయిన, తమ్ముడు సాయం పట్టంగా.. బతుకమ్మతో చెర్ల దిగింది.

పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. ఇచ్చుకుంట వాయినం, పుచ్చుకుంటి వాయినం.. జోరుగా సాగే బతుకమ్మ పాటలు, మంగళహారతులు, వాయినాల పాటలతో రేవంతా సందడిగా ఉంది. దీపాలతో తేలే బతుకమ్మలతో చెరువు వెలుగుపూల తోటలా కనిపిస్తాంది.

పిల్ల బతుకమ్మను విడిచి, అందరూ కలిసి పెద్ద బతుకమ్మను కొంచం లోతుకు వెళ్లి ఇడిసి పెడుతున్నారు.

'గౌరమ్మా.. నీతోపాటు నన్నూ గంగలో కలుపు తల్లీ!' అని గౌరమ్మకు మొక్కి..

'నీ దీపం కొండెక్కక ముందే.. నా దీపాన్ని కొండెక్కించు తల్లీ!' అని మనసులో చివరిసారి మొక్కుకుంది.

అవ్వ మొఖం చూసింది. పిచ్చితల్లి బిడ్డ చానా సంతోషంగా ఉందని అమాయకంగా మురిసిపోతాంది. తండ్రి కళ్లల్లో ఎన్నడూ కనపడని సంబురం, తమ్మునిది అటగోలు పసితనం అయినా.. నీనేడ పడ్తనోనని చేయి గట్టిగా పట్టుకుండు. భర్త గుర్తొచ్చిండు..

'అరేయి.. లం... కొడుక! నా జీవితాన్ని ఎందుకు నాశనం చేసినవురా!' అని గట్టిగా అరవాలనిపించింది.

'సంసారానికి పనికి రానోనివి ఆడపిల్ల జీవితంతోని ఎందుకు ఆడుకుంటున్నవురా?' అని అడగాలనిపించింది.

'అవునూ.. నేను చస్తేనే ఈ సమస్య తీరిపోద్దా?.. నా దినాలు తిరగకముందే వాడు మళ్లో పెళ్లి చేసుకుంటడు. పిల్లలు పుట్టరని బాధతో ఆత్మహత్య చేసుకుందని నామీద నిందమోపుతడు. అందరూ గదే నిజమని నమ్ముతరు. ఆ తరువాత ఇంకో అమాయకురాలు బలిపీఠం ఎక్కుద్ది. దాని బతుకూ గింతే. మరివాడు ఆడేసులోడైనా.. మొగేశం ఏసుకొని దొరలా బతుకుతడు. మరి ఆని తప్పులకు శిక్షలేదా!? తప్పు చేసినోడేమో తలెగరేసి పొగరుతోని బతుకుతుంటే.. ఏ తప్పూ చేయని నేనెందుకు సావాలి? లేదు.. లేదు.. సావొద్దు! తెగబడి కొట్లాడ్తా? ఆడదంటే నీళ్లల్ల కరిగిపోయే గౌరమ్మ గాదు.. నీళ్లల్ల సుత మంటలు పుట్టించే భద్రకాలిళి అనిపిస్తా! గిట్ల భయపడి నిందలు మోసి సావడానికేనా నేను పుట్టింది!? లేదు.. నేను బతుకుతా! నన్ను ఏడిపించిన అందరినీ నలుగుట్లెకు గుంజుతా! ఆల్లందరి అసలు రంగు బైటికి ఇగ్గి సూపెడ్తా!' అనుకుంది.

ఇట్ల గౌరీ మనసులో ఆలోచనల తర్కం చావునుండి బతుకు మీదికి మళ్లింది. ఇది చాలు.. చచ్చిపోవాలి అనుకున్నవారికి ఒక్కక్షణం ఆలోచన మారితే ఇక చావమన్నా చావరు! అదే జరిగింది ఇక్కడ.

'లేదు! ఈ నీళ్లలో పడి కుళ్లిపోయి సావడం కంటే.. కోట్లాడి సస్తా! అమ్మకు, నాయినకు తోడై.. తమ్ముణ్ని గొప్పోన్ని చేసి కుటుంబాన్ని రేవుకు తెస్తా!'..

ఈ ఆలోచన రాగానే గౌరి గుండె వేగం తగ్గింది. కాలు వెనక్కి పడింది. తల్లి బతుకమ్మ నీటి తెమ్మెరలపై తూగుతూ.. ఊయలలూగుతూ నిశ్చలంగా నదిలో పోతాంది. గౌరి మనసు కూడా ఆలోచన బరువులను దులుపుకొని నిమ్మలపడుతాంది. తమ్ముడు చెయ్యి వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు.

'ఏదెట్లయినా.. ఇగ అన్యాయానికి ఎదురుమల్లుతా! అవసరమైతే ఊరిని, తనవాళ్లను కూడగట్టుకొని ధైర్యంగా నిలబడి కొట్లాడుతా! మాంటే పానం పోద్ది గంతే! అట్లా సచ్చే బదులు గిట్ల సస్తా! సావుకు భయపడి రోజు సావడం కంటే.. సంపుతా

అన్నోన్నే సంపి బొంద పెడ్తా! మొగని ముసుగేసుకున్న మొగోడుకాని ఆనికి బుద్ధి చెప్తా!' అని ధైర్యంగా ముందడుగు వేయడానికి నిశ్చయించుకొని, నీళ్లలో వెనకడుగు వేసింది గౌరీ.

ముందుకు నడుస్తున్న తండ్రి చేయిని గట్టిగా పట్టుకుంది.

'నాయినా! నన్నే నీ పెద్ద కొడుకననుకో!' అనుకుంది.

నీళ్లలో నెమ్మదిగా నడిచే అమ్మ భుజం చుట్టూ చెయ్యివేసి ఆసరాగా తోడై నడిచింది.

తమ్ముడు గెంతుతూ ముందు నడుస్తున్నాడు. ఎక్కడలేని ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఇంటివైపు అడుగులు వేసింది గౌరి.

దూరంగా కదిలే పెద్ద బతుకమ్మ అటూఇటూ ఊగుతూ.. ఆశీర్వదిస్తున్నట్లు, కొండెక్కని గౌరమ్మ దీపం చీకట్లో దారి చూపిస్తున్నట్లు తోచింది.

***

## మౌనిక సుదర్శనం

సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప.. భయపడి చావడం పరిష్కారం కాదని 'కొండెక్కని దీపం' కథ ద్వారా సందేశం ఇస్తున్నారు యువ రచయిత్రి మౌనిక సుదర్శనం. వీరి స్వస్థలం హైదరాబాద్. ఎంఎస్ (ఐటీ) చేశారు. ప్రస్తుతం జేపీ మోర్గాన్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నారు. తండ్రి ప్రముఖ రచయిత రంగనాథ్ సుందర్శనం. ఆయన కథలకు తనే మొదటి పాఠకురాలు. ఆ ప్రభావంతోనే రచనా రంగంలోకి వచ్చారు. 'కొండెక్కని దీపం'.. వీరి తొలి కథ. ఈ రచనకు ఆలోచన మాత్రమే తనదనీ, కథకు బతుకమ్మ పండుగ నేపథ్యంతోపాటు తెలంగాణ మాండలికంలో తీసుకురావడం వెనక తన తండ్రి కృషి ఎంతో ఉన్నదని చెబుతున్నారు రచయిత్రి. ఈ కథ క్రెడిట్ మొత్తం ఆయనదేనని అంటున్నారు. తొలికథకు బహుమతి అందించి ప్రోత్సహించిన నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీపీఠం కథల పోటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

**–70266 27444**

# మనసా ఎటులోర్తునే..

## పి.ఎస్. నారాయణ

'రేపు ఎండాకాలం సెలవుల్లో బదరీనాథ్ వెళ్దామనుకుంటున్నా.. నువ్వు కూడా వస్తావా?" కేశవ్ అడిగాడు రాఘవని.సాయంత్రం ఆరు గంటలప్పుడు వాళ్లిద్దరూ వాళ్ల ఇళ్లకు దాపులో ఉన్న పార్కులో కబుర్లు చెప్పుకొంటూ నడుస్తున్నారు. రోజూ ఓ గంటసేపు కాలక్షేపం. సంతోషాలు, కష్టాలు పంచుకుంటారు. దాదాపు నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న కార్యక్రమం అది. ఏడవుతుండగా ఇళ్లకు వెళ్తారు. జనవరి మాసం. చలి తగ్గలేదు. అందునా ఈ సంవత్సరం మరింత ఎక్కువగా ఉన్నట్లనిపిస్తోంది.

ఇద్దరూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కేశవ్ తెలుగు, రాఘవ సైన్స్ సబ్జెక్టులు బోధిస్తారు. ఐదు సంవత్సరాల క్రితం ఒకేసారి చేరారు. ఒకరికొకరు ఆకర్షితులై త్వరలోనే ఆత్మీయ మిత్రులయ్యారు. నివాసం ఒకే బస్తీలో. రాఘవ తాతగారు దగ్గరలోనే ఉన్న గ్రామం నుండి వచ్చి మహబూబ్‌నగర్‌లో ఇల్లు కట్టుకుని స్థిరనివాసం ఏర్పరుచుకోవటంతో.. అది అతడికి వంశపారంపర్యంగా వస్తున్న ఇల్లు అయ్యింది. కేశవ్ వనపర్తి నుండి ఈ ఉద్యోగం వచ్చిన తరువాతే రావటంతో.. అద్దె ఇంట్లోనే ఉంటున్నాడు. ఇద్దరిదీ ముప్పై పైనే వయసు. రూపం కూడా తెలుగు మాస్టారే అనిపించేలా.. కేశవ్ ఎప్పుడూ ధోతి, లాల్చీనే ధరిస్తుంటాడు. అంట కత్తెర వేసిన జుట్టు, చిన్న శిఖ. రాఘవకు ప్యాంటూ, చొక్కా తప్ప.. ధోతి కట్టే అలవాటు లేదు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కేశవ్‌కు ఓ పిల్లవాడు. కాస్త ఆలస్యంగా వివాహమైన రాఘవ ఇంకా తండ్రి కాలేదు.

'ఎందుకు అనుకుంటున్నావ్ అక్కడికి వెళ్లాలని!" రాఘవ అడిగాడు.. కేశవ్‌నే చూస్తూ.

'నాన్న బతికున్నంత కాలం అంటుండే వాడు.. 'ఎన్నాళ్లుగానో బ్రహ్మకపాలం వెళ్లి మా పితరులకు పిండప్రదానం చేసి సద్గతులు కలిగించాలని అనుకుంటున్నా. సానుకూలం కావటంలేదు. ఇప్పుడా.. వయసు మీదపడటంతో అంతదూరం వెళ్లగలనా? అనే అధైర్యం కూడా పీడిస్తున్నది' అని. మనసులోని ఆ కోరిక నెరవేరకుండానే ఆయన వెళ్లిపోయారు. కన్నకొడుకుగా దానిని నిర్వర్తించి ఆయన ఆత్మకు తృప్తి కలిగించాలనేది నా ఆశ!".

భార్య రమ.. బీఏ తరువాత తెలుగు పండిట్ చేసి ప్రైవేటు స్కూల్లో ఉపాధ్యాయినిగా చేస్తోంది.అమ్మకు ఓపిక తగ్గటంతో రాలేదు. భార్యను తీసుకొని వెళ్దామన్నా.. పిల్లవాడు పసివాడు. అందుకే ఒక్కడే వెళ్దామనుకున్నాడు.'తోడుగా నువ్వు వస్తానంటే నాకు ధైర్యంగానూ, ఆనందంగానూ ఉంటుంది!" అన్నాడు రాఘవతో.'వస్తాను కానీ, నేనక్కడ

చేయాల్సిన కర్మకాండలేవీ లేవు. లక్ష్మీనారాయణున్ని దర్శించుకోవటం, హిమాలయాల అందాల్ని ఆస్వాదించటం.. అంతే!"

అతడి తండ్రి పదిహేను సంవత్సరాల క్రితం ఒకరోజు ఇంటినుండి వెళ్లిపోయాడు. ఎక్కడికి వెళ్లాడో తెలియదు. ఎక్కడున్నాడో తెలియదు. అసలు బతికి ఉన్నాడో లేదో కూడా తెలియదు.'నీ అంగీకారం నాకు చాలా ఆనందం కలిగిస్తున్నది రాఘవా! ఇక ఆ ప్రయత్నంలో ఉంటాను. అక్కడ నిర్వర్తించాల్సిన కార్యక్రమాలకు ఎప్పుడు బావుంటుందో చూస్తాను!" అన్నాడు మిత్రుడి చేతిని అందుకుంటూ.

ఏప్రిల్ మొదటి వారంలో వెళ్లటానికి నిర్ణయించుకున్నారు ఇద్దరూ. అప్పటికి స్కూల్లో పిల్లల పరీక్షలే కాకుండా పేపర్లు దిద్దటమూ అయిపోతుంది. బదరీనాథ్‌తోపాటు ఢిల్లీ, హరిద్వార్, రుషికేశ్ చూడాలనేది వాళ్ల ఆలోచన. ఢిల్లీకి రానూపోనూ రైలుకు టిక్కెట్లను రిజర్వు చేసుకున్నారు. కేశవ్ బ్రహ్మకపాలంలో చేయాల్సిన కార్యక్రమానికి వారి ఇంటి పురోహితుడు తనకు తెలిసినవారి ద్వారా ఏర్పాట్లు చేశాడు.
పదిహేను రోజుల్లో బయల్దేరతారనగా.. ఒక రోజున రాఘవ తల్లికి దగ్గర బంధువు నుండి ఓ ఉత్తరం వచ్చింది.

**'సుభద్రమ్మా!**

పదిహేను రోజుల క్రితం ఓ మిత్రుడితో కలిసి తొమ్మిది రోజులు ఉందామని కాశీ వెళ్లినప్పుడు.. అక్కడ ఒక అనాథాశ్రమానికి వెళ్లటం తటస్థించింది. నాతో వచ్చిన మిత్రుడు ప్రతి సంవత్సరం పంటలు రాగానే ఆ ఆశ్రమానికి పదివేలు విరాళంగా పంపిస్తుంటాడు. ఈసారి ఎలాగూ కాశీ వెళ్తున్నాం కదా.. స్వయంగా ఇద్దామని నిర్ణయించుకున్నాడు.ఇదంతా ఎందుకు రాస్తున్నాను అంటే.. అక్కడ ఆ ఆశ్రమంలో బావగారి ఫొటో చూశాను. పదిహేను సంవత్సరాల క్రితం ఎవరో అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను తీసుకువచ్చి అందులో చేర్చారట. అక్కడ అనాథగా చేరిన ఆయన.. త్వరలోనే కోలుకుని ఆ ఆశ్రమవాసులకు నాథుడై ఎంతో నిబద్ధతతో సేవ చేశాడట. అందరూ ఆయన్ను తమ కష్టాలు తీర్చేందుకు వచ్చిన దేవుడిగా భావించేవారట.అక్కడున్న అందరినీ దుఃఖసముద్రంలో ముంచి బావగారు రెండు సంవత్సరాల క్రితం ఆగస్టు నెల ఎనిమిదో తేదీ, ఏకాదశీ సోమవారం నాడు శివైక్యం చెందారట. నిర్వాహకులే సంప్రదాయ బద్ధంగా కర్మకాండనంతా గంగ ఒడ్డున జరిపించారట. నిస్వార్థంగా ఆశ్రమంలో చేసిన సేవలకు గుర్తింపుగా.. బావగారి ఫొటోను వారి ఆఫీసులో పెట్టారు.బావగారు తన వివరాలను ఎన్నిసార్లు అడిగినా చెప్పకపోవడంతో.. వారూ ఆయనకు కావాల్సిన వారికి ఆ విషయాన్ని తెలియజేయ లేకపోయినట్లుగా చెప్పారు.బావగారి ఫొటో చూసి నేను గుర్తించటంతో.. నన్ను ఆ విషయాన్ని మీకు తెలియబరచమని కోరారు.
– నీ సోదర సమానుడు, రామబ్రహ్మం.'

కొడుకు చదువుతున్న ఆ ఉత్తరంలోని విషయాన్ని వింటూనే.. సుభద్ర ఘొల్లుమన్నది. కేశవ్ కూడా ఆ సాయంత్రం పార్కులో కలిసినప్పుడు విషయం తెలుసుకుని ఎంతగానో బాధపడ్డాడు.'జరిగింది బాధాకర విషయమే! కానీ, ఇదే సమయంలో నువ్వు బదరీనాథ్ బయల్దేరటం యాదృచ్ఛికం. ఎలాగూ నీ చేతులమీదగా ఆయన్ను సాగనంపలేక పోయావు. ఇప్పుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆ పవిత్ర స్థలంలో తర్పణాలు విడిస్తే.. అంతదూరం వెళ్లిన శ్రమకూ ఫలితం దక్కుతుంది. అటు ఆయనకూ పుణ్యగతులు ప్రాప్తిస్తాయి!"

రాఘవ క్షణం కూడా ఆలస్యం చేయలేదు.'నేను అక్కడ ఎలాంటి కార్యక్రమాలనూ నిర్వర్తించనని ముందే చెప్పాను. చేయకపోవటమే కాదు, చేయాలని అనుకోవటమూ నాకు ఇష్టంలేదు!" అన్నాడు కంఠం హెచ్చించి.అతడి మాటతీరుకు ఉలిక్కి పడ్డట్లుగా మిత్రుడి ముఖంలోకి కన్నార్పకుండా చూస్తుండి పోయాడు కేశవ్.

**'అదేం?"**

'మిత్రుడి ముందు తొందరపడ్డానా!?' అన్నట్లుగా రాఘవ తడబడి..'అనవసరం అనిపిస్తున్నప్పుడు దాన్నే చర్చిస్తూ బుర్రపాడు చేసుకోవటం దేనికి!" అంటూ తేలిగ్గా నవ్వేశాడు.

ఘాట్ రోడ్డు మీద పదకొండు గంటల బస్సు ప్రయాణం. ఒళ్లంతా నొప్పులు. కాళ్లూ చేతులూ పట్టుకున్నట్లవ్వగా.. బదరీనాథ్‌లో దిగిన ఇద్దరూ కించిత్ ఇబ్బందిపడ్డారు.. ఆ చలిలో నడవటానికి. సాయంత్రం ఆరు గంటలకే ఆ ప్రదేశమంతా చీకటి ఆవరించింది. దానికి తోడు ఏప్రిల్ నెల అయినా చలి ఎక్కువగానే ఉన్నది.కేశవ్ ఇంటి పురోహితుడు ముందుగానే తెలియబరచటంతో అక్కడ ఆయనకు తెలిసిన భట్టుగారు బస్సు దగ్గరికి వచ్చి వాళ్లను తన ఇంటికి తీసుకువెళ్లాడు.'మాది కర్ణాటక. మా నాన్నగారు నాలుగు దశాబ్దాల క్రితమే ఇక్కడికి వచ్చారు. మీకు మా ఇంట్లోనే వసతి, భోజన సదుపాయం ఏర్పాటుచేశాను. మన భోజనం మీకు ఇక్కడ హోటళ్లలో దొరకదు!"భోజనాలైన తరువాత, వాళ్లకిచ్చిన మేడమీద గదిలో కూర్చుని.. కేశవ్ చెప్పిన గతించిన వారి పెద్దల వివరాలను గోత్రనామాలు సహా ఓ కాగితం మీద రాశాడు.

'అక్కడి కార్యక్రమం మీరే నిర్వహిస్తారా?" కేశవ్ అడిగాడు.'లేదండీ.. దానికి ప్రత్యేకంగా వేరే పురోహితుడు ఉన్నారు. ఆ ఏర్పాట్లకు కూడా చెల్లించాల్సిన రుసుం కట్టి రసీదు తీసుకున్నాను. మీరు చెప్పిన వివరాలతోపాటు ఆ రసీదును కూడా వారికివ్వాలి!"'ఇక్కడ ఈ కార్యక్రమం నిర్వహించటం వలన పొందే అనుభూతుల్ని, ప్రయోజనాలని తెలుసుకుంటే మనసు పెట్టి వారు చెప్పినట్లుగా చేయగలుగుతారు కదా!" అన్నాడు ఓరగా రాఘవ వంక చూస్తూ. అతడి ఉద్దేశం ఆ వివరాలు వింటేనన్నా అతడు మనసు మార్చుకుని తండ్రికి తనలాగానే కార్యక్రమం నిర్వర్తిస్తాడేమోనని మనసులో ఏర్పడిన చిన్న ఆశ.

భట్టు చిరునవ్వుతో..
'నిజమే! ఉపనిషత్తులు ఏం చెబుతున్నయంటే మనిషి మరణించిన తరువాత కారణ శరీరం ఈ జన్మలో చేసిన పాపపుణ్యాల ఆధారంగా మరో శరీరాన్ని వెతుక్కుంటూ వెళ్తుంది!" అంటూ మొదలుపెట్టగానే.. రాఘవ లేచి గదిలోంచి బయటకు వెళ్లిపోయాడు.
వణుకు పుట్టిస్తున్న చలికి వత్తాసుగా ఆకాశాన మరీ కిందకు దిగాడా అన్నట్లుగా చంద్రుడు. తెలియని తపనతో ఊగిపోతున్న మనసు. కలవరపాటును అధిగమించాలి అన్నట్లుగా మూసుకుపోతున్న కళ్లు. కొద్ది క్షణాల తరువాత తనని తాను నిగ్రహించుకుంటూ కనురెప్పలు తెరిస్తే ఆకాశవీధిలో కాలుపెట్టినట్లుగా చుట్టూ ఎత్తుపల్లాల మధ్య ఇళ్లు, వాటిలో వెలుగుతున్న దీపాలు.. వంతెన కిందుగా గలగలా పారుతున్న అలకనంద నీటి శబ్దం.
తన ఆలోచన ఫలించనందుకు కేశవ్ ఓ నిట్టూర్పు విడిచాడు.. మిత్రుడు వెళ్లిన వైపే చూస్తూ.'ఆ నూతన శరీరానికి మనం పెట్టిన పిండాలే ఆహారం..!" భట్టుగారు చెప్పుకొంటూ పోతున్నాడు.

మరునాడు ఉదయం ఎనిమిది గంటలప్పుడు ఇద్దరూ దేవాలయం ముందున్న ఉష్ణగుండంలో స్నానం చేశారు. ఒడ్డుకు వచ్చి శరీరాల్ని శుభ్రపరుచుకుని స్వామివారి దర్శనానికి వెళ్లారు.అదో అద్భుతమైన దేవాలయం. లోపలికి వెళ్తూ ఎత్తుమెట్ల మీద నిలబడి వెనక్కు తిరిగి చూస్తుంటే.. చుట్టూ మంచును కప్పుకొన్న హిమాలయ పర్వతాలు ఆకాశాన్ని చుంబిస్తున్నయా!? అన్నట్లుగా కనిపిస్తున్నాయి.గుడి లోపల బద్రి నారాయణుడు అనే పేరుతో ఉన్న లక్ష్మీనారాయణుని దర్శించుకున్నారు. ఆలయంలోని వివిధ దేవుళ్లనూ దర్శించుకుని దగ్గర్లోనే ఉన్న బ్రహ్మకపాలానికి భట్టుగారు దారి చూపుతుండగా బయల్దేరారు.వీళ్లు వెళ్లేసరికి అప్పటికే ఆ ప్రదేశంలో కొంతమంది కూర్చుని పిండాలు చేస్తుండగా, పురోహితుడు వారిమధ్య అటూఇటూ తిరుగుతూ సూచనలు ఇస్తున్నాడు.కేశవ్ తనకు నిర్దేశించిన స్థలంలో కూర్చుని చేయాల్సిన పనికి ఉపక్రమించాడు. అతడికి కాస్తంత దూరంగా రాఘవ కూర్చుని అతడు చేస్తున్న పనులనే నిర్లిప్తంగా చూస్తున్నాడు.కేశవ్ తన చేతిలోని చిన్న తోలుసంచి నుంచి రాత్రి భట్టుగారు తన పెద్దల పేర్లు, వారి గోత్రాలు, బంధుత్వాలు రాసి ఇచ్చిన కాగితాన్ని, డబ్బు కట్టిన రసీదును బయటకు తీశాడు.తర్పణాలు, పిండపూజ పూర్తయ్యేటప్పటికి పన్నెండు దాటింది. కేశవ్ పిండాలను తీసుకువెళ్లి ఎత్తునుండి నురుగులు కక్కుతూ పడుతున్న అలకనంద నీటిలో గతించిన పెద్దలను స్మరించుకుంటూ వదిలాడు. అతడి నేత్రాలు తండ్రి కోరికను ఇప్పటికైనా తీర్చగలిగాను అన్న తృప్తితో నిండి ఉన్నాయి.

కేశవ్ కళ్లలోని వెలుగును తదేకంగా చూస్తున్న రాఘవ తలెత్తితే..పితరులే హిమాలయాల నుంచి వాటిని స్వీకరించేందుకు వస్తున్నారా!? అన్నట్లుగా ఆకాశాన

వేగంగా కదులుతున్న తెల్లటి మబ్బు తునకలు.అక్కడికి తమతోపాటు వచ్చిన భట్టుగారిని చూస్తూ,'ఇక్కడ స్వచ్ఛమైన రుద్రాక్షలు దొరుకుతాయని విన్నాను. నాకు ఇప్పించగలరా?" అడిగాడు రాఘవ.'నా దగ్గరే ఉన్నయండీ! ఇస్తాను. చాలా పవిత్రమైనవి. సహజంగా చెట్లనుండి పొందినవి!"'చాలా సంతోషం.. వాటి ధర ఎంతో చెబితే ఇస్తాను!"

'ఈ పవిత్ర క్షేత్రంలో అడుగిడి మరణించిన ఆత్మీయులకు శాంతి చేకూరేలా నువ్వు ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించక పోవటం నాకు ఎంతో బాధ కలిగిస్తోంది రాఘవా!" కేశవ్ గుండె లోతుల్లోనుంచి వచ్చిన మాటలు అవి.ఉదయం ఆరుగంటల సమయంలో భట్టుగారు వాళ్లను బస్టాండులో దించి వెళ్లారు. అక్కడికి రాత్రి వచ్చిన బస్సు తిరిగి వెళ్లేందుకు రెడీగా ఉన్నది. అందులో కొందరు ప్రయాణికులు అప్పటికే ఎక్కి కూర్చున్నారు.

చలికి తట్టుకోవాలి అన్నట్లుగా స్వెటర్ తొడుక్కుని, మంకీ క్యాప్‌లు పెట్టుకున్నారు ఇద్దరూ.'దేవుళ్లమీద నమ్మకం లేదా అంటే నమ్మలేను. నాతోపాటు దేవుళ్లందరినీ భక్తితో దర్శించుకున్నావు. పవిత్రమైన రుద్రాక్షలు కొని మెడలో వేసుకున్నావు. ఇన్నాళ్లూ ఏమయ్యాడో తెలియని మీ నాన్న మరణించాడని తెలిసినా.. తర్పణాలు విడవటానికి మాత్రం అంగీకరించలేక పోయావు!" నిష్టూరంగా అన్నాడు కేశవ్.రాఘవ మాట్లాడలేదు చాలాసేపు. మిత్రుడి మాటలు వింటూ ఇబ్బందిగా చూశాడు అతడి ముఖంలోకి. అంత చలిలోనూ ఎండిపోతున్న నోటిని తడుపుకొంటున్నట్లుగా.. నాలికను అటూఇటూ తిప్పాడు.'కేశవా! నువ్వు నాకెంతగానో నచ్చచెప్పాలని ప్రయత్నించావు. మనం బయల్దేరుతున్న సమయంలో అమ్మ కూడా నన్ను ఆ విధి నిర్వర్తించమంటూ కన్నీరు పెట్టుకోవటం నీకు గుర్తున్నది కదా! అయినా నాకు చేయాలనిపించలేదు! చేయలేదు!" తలవంచుకుని అన్నాడు.

**మళ్లీ..**

'ఇంకా.. అయిపోయిన దాన్ని గురించి చర్చించటం అవసరమంటావా!" అన్నాడు రాఘవ.కేశవ్ మాట్లాడలేక పోయాడు.తరువాత అరగంటలోనే బస్సు బయల్దేరింది.పచ్చటి చెట్ల నడుమగా లోయలోకి జారిపోతున్నదా అన్నట్లుగా పోతున్న బస్సు. మంచుతో తడిసి అద్దాల సందులలోనుండి ప్రయాణికుల్ని ఇబ్బంది పెడుతూ వీస్తున్న చల్లటి గాలి.'అమాయకురాలైన ఓ ఆడపిల్లని ఏ వ్యక్తి అయినా కిరాతకంగా నాశనం చేసి.. ఆమె జీవితంలో వెలుగును అతిహేయంగా చిదిమి.. చీకటితో నింపివేయటం భరించగలిగే విషయమేనా? అలాంటి మనిషి చస్తే శాస్త్రాలు చెబుతున్నాయంటూ వారసులు మాసికాలూ, తద్దినాలతో అతడి ఆత్మకు ఆహారం పెట్టటం సమంజసమా? అతడికి సద్గతులు కలగాలని, స్వర్గానికి పంపాలని ప్రయత్నించటం సమంజసమా?".. పావుగంట తరువాత నోరు తెరిచాడు రాఘవ.

మనసులోని నిజాల్ని ఇంకా అదిమి పెట్టుకోలేనట్లుగా.
విచిత్రంగా చూశాడు మిత్రుడి ముఖంలోకి కేశవ్.

'ఎవరతను?" మనసులో రూపు ఏర్పరుచుకుంటున్న అనుమానం అతడిలో ఆరాటాన్ని పెంచసాగింది.

'రోజూ వచ్చే పనిమనిషి ఆరోగ్యం బాగోలేక.. పన్నెండేళ్ల కూతురుని పంపింది. ఇంట్లో అతడు తప్ప ఎవరూ లేరు. తెలిసీ తెలియని వయసులో ఉన్న ఆ అమ్మాయిని అదునుచూసి కాటేశాడు అతడు. అందునా ఆ పిల్ల ఎవరికీ బాధను చెప్పుకోలేని మూగది. ఇంటికి పరుగెత్తుకెళ్లి ఏడుస్తూ తల్లికి సైగలతో చెబితే ఆమె అర్థం చేసుకుని. తన వాళ్లందరినీ తీసుకుని, కర్రలూ కత్తులతో ఇంటిమీద దాడి చేస్తే.. అతడు భయంతో పారిపోగా ఆ కొంప ఛిన్నాభిన్నమైంది. ఆ ఇంట్లో మిగిలినవారి మనసులు అవమానంతో చచ్చి శవాలయ్యాయి. పదిహేను సంవత్సరాల క్రితం ఆ నికృష్టపు పనిచేసిన అతడికి మనం ఇక్కడ ఇప్పుడు మనవాడు అనే ఒక్క కారణంతో స్వర్గద్వారాలు తెరిపించాలా?"

**'ఎవరతను?"..**

తన అనుమానం నిజం కాకూడదని దేవుడిని ప్రార్థిస్తూ అడిగాడు భయం భయంగా కేశవ్.'నేను నాస్తికుడిని కాదని నీకు తెలుసు. నీ మాట, అమ్మ మాట వినకపోవటానికి అసలు కారణమేమిటో ఊహించలేక తపన పడుతున్నావనీ తెలుసు. పదిహేను సంవత్సరాలుగా నిజాన్ని మింగలేక, కక్కలేక నాలో నేనే కుమిలిపోవటానికి అలవాటుపడ్డ నన్ను.. మా బంధువునుండి వచ్చిన ఉత్తరం మరింత కుంగదీస్తూ, అడకత్తెరలో పెట్టి నొక్కసాగింది. నీ ముందు ఇంకెన్నాళ్లీ దాగుడుమూతలు!" చటుక్కున ముఖాన్ని రెండు చేతులలో దాచుకున్నాడు.అయ్యో.. తెరుచుకున్న మిత్రుడి మనసును చూడలేనట్లుగా తలవంచుకున్నాడు కేశవ్.'గరుడపురాణంలో చెప్పినదంతా నిజమే అయితే అతడు నరకానికి వెళ్లి అక్కడ ఆ శిక్షలన్నీ అనుభవించక తప్పదు!" అతడి కళ్లు కోపంతో నెత్తుటి ముద్దలు అవుతున్నాయి.'ఆ అమ్మాయి బతుకేకాదు.. మా జీవితాలూ ముక్కలయ్యాయి. తెలిసినవారి దృష్టిలో హీనచరితులమయ్యాం. వారి చీదరింపులకు గురయ్యాం. బతకటానికి అమ్మ అడ్డమైన చాకిరీ చేసింది. వడియాలు పెట్టింది, అప్పడాలు ఒత్తింది, కూరలు వండింది.. వాటిని నేను సంచుల్లో పెట్టుకుని ఇంటింటికీ తిరిగి అమ్మాను. మొదట్లో కొన్ని ఇళ్లల్లో వాకిళ్లు ఊడ్చి, అంట్లు తోమింది కూడా! వాళ్లు ఇచ్చిన చద్ది పదార్థాలను తెచ్చుకుని నాకు పెట్టి.. మిగిలింది తను తిన్నది. ఈ స్థితికి కారణం నాన్న అని గర్వంగా చెప్పుకోవాల్సిన ఆ మగవాడు కాదా.. నరకంలో అన్ని విధాలా శిక్షలు అనుభవించటానికి అర్హుడైన అతడిని నేనెందుకు కాపాడాలి? ఎందుకు రక్షించాలి?" ఆవేశంతో ఊగిపోతున్నాడు రాఘవ.

అతడి చేతిమీద చేయి వేశాడు కేశవ్ అనునయిస్తున్నట్లుగా. మరుక్షణంలోనే అతడి మనసులో భారతంలోని ఓ పద్యం మెదిలింది.తనువున విరిగిన యలుగుల ననువున

బుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్ మనమున నాటిన మాటలు విను మెన్ని యుపాయములను వెడలునె యధిపా?

మిత్రుడి ముఖంలోకే స్తబ్ధుగా చూస్తూ ఉండిపోయాడు కేశవ్. శరీరానికి తగిలిన గాయాలకు చికిత్స చేసుకుని ఆ మనిషి విముక్తి పొంది ఉండవచ్చు కానీ.. జీవించి ఉన్న ఈ మనిషి తన మనసుకు కలిగిన గాయంనుండి ఎప్పటికి కోలుకోగలిగేనో..

అమాయకురాలైన ఓ ఆడపిల్లని ఏ వ్యక్తి అయినా కిరాతకంగా నాశనం చేసి.. ఆమె జీవితంలో వెలుగును అతిహేయంగా చిదిమి.. చీకటితో నింపివేయటం భరించగలిగే విషయమేనా? అలాంటి మనిషి చస్తే శాస్త్రాలు చెబుతున్నాయంటూ వారసులు మాసికాలూ, తద్దినాలతో అతడి ఆత్మకు ఆహారం పెట్టటం సమంజసమా? అతడికి సద్గతులు కలగాలని, స్వర్గానికి పంపాలని ప్రయత్నించటం సమంజసమా?

***

## పి.ఎస్. నారాయణ

మానసిక విశ్లేషణతో కూడిన రచనలు చేయడంలో రచయిత పి.ఎస్. నారాయణ దిట్ట. అలాంటి రచనే.. 'మనసా ఎటులోర్తునే'. ఈయన స్వస్థలం గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చినకాకాని. 30 ఏళ్లపాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐడీపీఎల్‌లో వివిధ స్థాయుల్లో ఉద్యోగం చేశారు. 1993లో సీనియర్ ఎకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌గా స్వచ్ఛంద విరమణ చేశారు. 28 ఏళ్ల క్రితం రచనా వ్యాసంగం మొదలుపెట్టారు. ఇప్పటివరకూ 350కి పైగా కథలు, 50 నవలలు రాశారు. వీటిలో మానసిక విశ్లేషణతోపాటు సస్పెన్స్‌తో కూడిన ధారావాహికలూ ఎన్నో ఉన్నాయి. వీటిలో పలు కథలు కన్నడ, తమిళ భాషలలోకి అనువాదమయ్యాయి. వివిధ సాహితీ సంస్థలు, పత్రికలు నిర్వహించిన పోటీల్లో.. ఈయన రాసిన కథలు, నవలలు.. బహుమతులు గెలుపొందాయి. నమస్తే తెలంగాణ - ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహిచిన కథల పోటీ 2023_24లో 'మనసా ఎటులోర్తునే..' రూ.3వేల బహుమతికి ఎంపికైంది.

9959808862



# చేజారిన జ్ఞాపకం

## జన్ను లక్ష్మి

నీ గురించి అడిగింది బాటసారి! వీలైతే ఓసారి వచ్చివెళ్లమని చెప్పింది!'.. నా ఫ్రెండ్ సుజన చెప్పిన మాటలతో వైజాగ్ ప్రయాణానికి సిద్ధమయ్యా! 'ఇక కనిపించదు' అనుకున్న మానస.. తన మనసులో నాపైన కాసింత ప్రేమని 'ఇం..కా..' కలిగి ఉందనే ఊహనిచ్చిన సుజన మాటలు మొన్నటినుంచీ నన్ను నిద్రకు దూరంచేశాయి.అప్పుడెప్పుడో మానసతో కలిసి చేయాలనుకున్న 'ప్రేమ ప్రయాణం' విధివశాత్తూ విఫలమై.. జీవన పయనంలో ఇద్దరమూ దారితప్పిన బాటసారులం అయ్యామనుకున్నాను. కానీ, నా మనసుకు కాసింత దూరంలోనే మానస ఉందన్న వాస్తవం నాలో ఏదో కొత్తశక్తి నింపుతోంది. అవును.. 'మానస' అనే మూడక్షరాలు చాలు. వేసవి వడగాడ్పులను సైతం హిమసమీరాలుగా మార్చే శక్తి ఒక్క మానసకూ, మానసతో గడిపే అమృత క్షణాలకే ఉంది.

ముప్పై మూడేళ్ల వయసులో ఐదేళ్ల తర్వాత ఇప్పుడిలా మానసను కలిసేందుకు వెళ్తున్నప్పటికీ.. ఇన్నేళ్లలో మానస గురించిన ఆలోచనలూ, తనతో గడిపిన సంఘటనల తాలూకు జ్ఞాపకాలూ నన్ను చాలాసార్లు ముంచెత్తాయ్! నేను ఏకాంతంగా ఉన్నప్పుడు చదువుకునేది కూడా.. యూనివర్సిటీలో తనతో పరిచయం తరువాత నేను రాసుకున్న డైరీనే!ఎన్నో సాయంత్రాలు.. యూనివర్సిటీ స్టేడియం మెట్లపై మానసతో కలిసి కూర్చున్నప్పుడు.. అసురసంధ్యవేళ అస్తమిస్తున్న రవి కిరణాలు నా ఎదురుగా కూర్చున్న మానస ముఖం మీదకు ప్రసరించి పసిడిరంగులో మెరిసిపోతున్నప్పుడు.. మానస సౌందర్యమంతా సజీవశిల్పమై నా మనోమందిరంలో ప్రతిష్ఠింపబడిన క్షణాలు.. ఆ క్షణాలు శాశ్వతమై.. నేను రాసుకున్న డైరీ చదువుతున్నప్పుడు మానస రూపం ప్రతిపేజీలోనూ కనిపించేదెప్పుడూ!

నా భార్య నిద్రలో ఉన్న అపరాత్రో, తను పుట్టింటికెళ్లిన ఏకాంత సమయాల్లోనో.. గతాన్ని డైరీ లోపలి పేజీల్లో వెదుక్కుంటూ 'మానస' గురించి ఆలోచిస్తే.. మనసంతా మధురమైన ఆర్ద్రతతో నిండిపోయి, ఒక తీయని బాధలాంటి అనుభూతి కలిగేది.కాలం మానసను నానుంచి దూరం చేసిందేమో కానీ.. కలలు మాత్రం నామీద జాలిపడి ఏ అర్ధరాత్రో, అపరాత్రో నన్ను ఊరడించేందుకు మానసను నా మనసు దగ్గరికి చేర్చేవి.నా ఆలోచనలతో తనకు సంబంధం లేనట్లుగా రైలు వేగంగా పరుగులు పెడుతోంది. ఎదురుసీట్లో పసిపిల్లాడి ఏడ్పుతో ఈ లోకంలోకి వచ్చాను.. మానస ఆలోచనల్లోంచి కూడా! పిల్లాడిని వాడి తల్లి జోకొడుతోంది. సరిగ్గా 'ఎప్పుడెప్పుడు వైజాగ్

చేరుకుంటామా..' అని గోలపెడుతున్న నా మనసును నేను జోకొడుతున్నట్లుగా!రైలు కుదుపులకు కిటికీలోంచి వీస్తున్న స్వచ్ఛమైన పిల్లగాలి తోడై మనసుకు హాయిగా అనిపిస్తూంటే.. మళ్లీ మానసగురించిన ఆలోచనల్లోకి జారిపోయాను.

'అసలీ ప్రయాణమెందుకు?!' విచిత్రమైన ప్రశ్న నా మదిలో మెదిలింది.మానస కోసమా? ఆమె ప్రేమ కోసమా? నిజమే! అంతటి సౌందర్యాన్ని అనుభవించకపోతే ప్రేమకు ఫలమేమిటి?ఏఁవిటీ.. నేనేనా ఇలా ఆలోచిస్తోంది? నా ఆలోచన నాకే చిత్రంగా అనిపించింది..! ఎప్పుడైనా మానస మీద నాకు 'అలాంటి' ఉద్దేశం కలిగిందా? ఏమో.. అలాంటి ఉద్దేశం లేదన్న ఆత్మవంచనతో బతికానేమో!మానస కూడా నన్ను చూడాలని ఉందని 'సుజన'తో అన్నదంటే.. 'ఈ ఉద్దేశం'తోనే అన్నదేమో! ఆమెకింకా నాపై ఆ 'ఇది' ఉన్నదేమో! ఎంతైనా నా కవితలకు ఫిదా అయిపోయి నన్ను గాఢంగా ప్రేమించింది కదా! ఎలా మర్చిపోగల్దు!మానసపై ఇలాంటి 'కోరిక' కలగడం ఇదే తొలిసారి కాకపోవచ్చేమో కానీ, ఇప్పుడు కలగటం మాత్రం గమ్మత్తుగా ఉంది! కోరిక కలగడంలో తప్పులేదేమో.. వీలైతే ఆచరణలో పెట్టాలనుకుంటున్నాను కూడా! ఆ భావమే థ్రిల్లింగ్‌గా ఉంది!ఆలోచనల్లోంచి తేరుకుంటూ కిటికీలోంచి బయటికి చూశాను.దూరంగా కనిపిస్తున్న కొండల మధ్య అస్తమిస్తున్న సూర్యుడు కాషాయరంగులో నెమ్మదిగా, బరువుగా కిందకి జారిపోతున్నాడు. బహుశా.. పగలంతా తనని అంటిపెట్టుకొని ఉన్న ఆకాశదేవిని వదిలివెళ్లలేక ఆమె నీలిరంగు పైట చెంగులో దాక్కుంటున్నాడేమో.. అనిపించేలా పడమటి నింగి మొత్తం కొద్దిసేపట్లోనే అరుణకాంతితో నిండిపోయింది.నిజమే.. మానస మాత్రమే కాదు. తనలాగే, తన మనసులాగే ప్రకృతిలోని ప్రతిదీ మధురమే..సౌందర్యమయమే!

పెద్ద బంగళా.. పోర్టికోలో ఖరీదైన కారు పార్క్ చేసి ఉంది! అప్పుడు అర్థమైంది.. మానస స్థాయి ఏ 'స్థాయి'లో ఉందో?!నేను కనిపించగానే.. మానస కళ్లింత చేసుకొని నావంక అలా చూస్తూండిపోతుందా? లేక.. సంతోషం పట్టలేక పరిగెత్తుకుంటూ వచ్చి నామీద వాలిపోతుందా? నా అంచనాలన్నీ తప్పని కాసేపట్లోనే అనుభవమైంది!తలుపులు తీసిన మానస.. మెరిసే కళ్లతో క్షణంపాటు నావంక చూసి, తలవంచుకొని కాసేపు నిల్చుండిపోయింది. ఆ తర్వాత.. 'బాగున్నారా.. ఇదేనా రావడం?" అంది చిరునవ్వుతో.ఆశ్చర్యపోయాన్నేను.. ఆమె బహువచన సంబోధనకు! తనతో నా స్నేహం కొనసాగుతున్న రోజుల్లో.. 'ఏమోయ్ బాటసారీ.. ఈరోజు కవిత ఏ వనిత గురించి రాశావోయ్?' అంటూ నన్ను ఏకవచనంతో చనువుగా ఆటపట్టించే మానసేనా ఈమె? అనిపించింది.'ఫణికుమార్'గా కంటే.. కవిగా 'బాటసారి' అనే కలంపేరుతోనే నేను ఎక్కువ పాపులర్!'హలో.. ఏంటలా ఉండిపోయారు?" అంటూ గట్టిగా వినిపించిన ఆమె ప్రశ్నకు గతంలోంచి తేరుకొని ప్రస్తుతానికి వచ్చాను.నేనేదో అనబోయేంతలో.. 'రండి.. లోపలికి రండి!" అంది లోనికి దారితీస్తూ.ఆమె వెనకే

లోపలికి నడిచాను. హాల్‌లో ఉన్న సోఫా చూపిస్తూ
'కూర్చోండి..'' అంది.

కూర్చోబోతూ చుట్టూరా ఓసారి పరికించి చూశాను. పెద్ద హాలు.. హాల్‌లోంచి పాములా పైకి పాకుతున్నట్లుగా కనిపిస్తున్న మెట్లతో కూడిన డూప్లెక్స్ నిర్మాణం, గోడలకు ఖరీదైన తైలవర్ణ చిత్రాలు, సీలింగ్ నుంచి హాలు మధ్యలోకి వేలాడుతున్న అధునాతన శాండిలియర్, పొందికగా అమర్చిన సామాన్లతో అందంగా, హుందాగా ఉంది ఇంటీరియర్ డెకరేషన్!తను నా ఎదురుగా కూర్చుంది.'మానస భర్త బిజినెస్‌మెన్!' అని చెప్పిన సుజన మాటలు గుర్తొచ్చాయ్. తలతిప్పి ఆమెవంక చూశాను నిశితంగా.కాస్త ఒళ్లుచేసింది. అప్పట్లో పురులు విప్పుకొంటున్నట్లుగా ఉండే ఆమె అందం.. ఇప్పటికి పరిపూర్ణత సంతరించుకున్నట్లుగా అప్పటికంటే ఇప్పుడే నిండుగా, ఆకర్షణీయంగా కనిపిస్తోంది.తలంటుస్నానం చేసిందేమో.. నిగనిగలాడుతున్న ముంగురులు ఏసీలోంచి వీస్తున్న పవనాలకు సుతారంగా ఎగురుతూ వచ్చి అందమైన ఆమె ముఖాన్ని అలవోకగా ముద్దాడుతున్నాయి.

మనిషి ఆసాంతం అద్భుత సౌందర్యంతో, అపురూప లావణ్యంతో మెరిసిపోతోంది.'ఈమెను పెళ్లి చేసుకోకుండా వదులుకొని పొరపాటు చేశానా?' అన్న ఆలోచన క్షణంపాటు నా మదిలో మెదిలింది.మానస ముఖంలో కనిపిస్తున్న ఆ 'పరిపూర్ణతే' నన్ను కాస్త సంకోచానికి గురిచేస్తోంది. వ్యక్తిత్వం వల్లో, మెచ్యూరిటీ వల్లో వచ్చిన ఆ 'హుందాతనం' కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.'ఎలాగైనా సరే.. ఈ సౌందర్యాన్ని ఒక్కసారైనా సొంతం చేసుకోవాలి.. ఇంతటి లావణ్యాన్ని అనుభవించకపోతే జీవితం వ్యర్థం!' అనే నిర్ణయానికి వచ్చేశాను.'ఏమిటీ.. మానసను నువ్వు నిజంగానే ప్రేమించావా? ప్రేమిస్తే.. ఇలాంటి ఆలోచనలేంటి?' అంటూ నా అంతరాత్మ నన్ను నిలదీసింది. కానీ, అది కొద్దిసేపే! ఆమెను చూస్తూంటే.. నాలోని 'మరోమనిషి' గెలుస్తున్నట్లుగా అనిపించింది.

**ఇంతలో**..

'ఎక్స్‌క్యూజ్ మీ.. జస్ట్ ఎ మినిట్!'' అంటూ మానస లోపలికెళ్లింది.

**'టీ తీసుకోండి !''**

ఆమె చేతిలోని టీకప్పు అందుకుంటూ.. 'మీవారు ఇంట్లో లేరా?'' అన్నాను.'లేరు. కంపెనీ డైరెక్టర్స్ మీటింగ్ ఉందని నిన్ననే హైదరాబాద్ వెళ్లారు!'' అంది నా ఎదురుగా సోఫాలో కూర్చుంటూ.'థాంక్యూ మానసా! నాకు టీనే ఇష్టమని ఇన్నేళ్ల తరువాత కూడా గుర్తుంచుకున్నందుకు!'' అన్నాను.. ఆమె కళ్లలోకి అదోలా సూటిగా చూస్తూ.మానస నవ్వింది..'నాకూ, మావారికీ కూడా టీ అంటేనే ఇష్టం!'' అంది క్యాజువల్‌గా! అంతేకాదు..

'నీ ఇష్టాన్ని గుర్తుపెట్టుకొని, నీ కోసమేమీ ప్రత్యేకంగా చేసింది కాదు!' అనే అర్థం వచ్చేలా

ఉందామె సమాధానం.నా మనసులో ఏదో విస్ఫోటనం! నాలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న స్వార్థపు కోరికలపై మానస విసిరిన మొదటి అస్త్రానికి కాసేపు కోలుకోలేకపోయాను. అయినా ఏదో ఆశ..'మానస మరోవ్యక్తికి భార్య అయినా మానసికంగా నాదే!' అనే బలమైన విశ్వాసం!

కప్పు టీపాయ్ మీద పెడుతూ అన్నాను..'మొన్ననే సుజన చెప్పింది. నువ్వు నా గురించి అడిగావని! వీలైతే ఓసారి వచ్చివెళ్లమని నాకు చెప్పమన్నావట కూడా!" అంటూ గుర్తుచేశాను. నేనెందుకు వచ్చానన్న విషయం అస్పష్టంగా ఉంచి!'నువ్ రమ్మంటేనే వచ్చాను సుమా!' అన్న అహంకార పూరితమైన మాటలు నావి.'ఔను! మొన్నెప్పుడో సుజన కలిసినప్పుడు మాటల సందర్భంలో మీ ప్రస్తావన వచ్చి 'బాటసారి ఎలా ఉన్నారు?' అన్నాను. 'ఎందుకు?' అనడిగింది.. సగటు ఆడదాని లాగానే! 'చాలా కాలమైందిగా.. చూసి!' అన్నాను.." అంటూ ఆపింది మానస.. కాకతాళీయంగానే నా గురించి అడిగినట్లు తన మాటల్లో స్పష్టం చేస్తూ.నేను పేర్చుకుంటూ వచ్చిన ఆశాసౌధాలను తన ఒక్కొక్క మాటతో ఒక్కొక్కటిగా కూల్చివేస్తున్నట్లు కనిపిస్తున్న మానస వంక సూటిగా చూడలేకపోయాను. అయినా.. ఇంత సులభంగా ఓటమిని ఒప్పుకొంటే 'మగాడిని' ఎలాగవుతాను? 'బాటసారి'ని దుకవుతాను??'మనసెలా ఉంది?" ఆడవాళ్లపై నేను తరచూ ప్రయోగించే పడికట్టు వాక్యం వొదిలాను.

'పండు వెన్నెలలా, నిండు గోదారిలా, వసంతకాలంలోని పచ్చదనంలా.. బావుంది!" అంది.నేను ఆశించని.. ఊహించని.. ఎదురుచూడని.. నాకు నచ్చని సమాధానం అది!!'ఎలా ఉంది నీ జీవితం?" అడిగాను.ఆమెలాగా బహువచనంతో సంబోధించి నాకు నేను తనకు దూరం కాదలచుకోలేదు. అంతేకాదు.. ఈ ప్రశ్నతో 'గతం'గా మారిన మా ప్రేమను 'వర్తమానం'లోకి తీసుకొచ్చి కనీసం కొన్ని ఘడియలైనా ఆమెను నావైపు తిప్పుకోవాలన్న స్వార్థం!'ప్రస్తుతం నా జీవితంలో ఎలాంటి వెలితీ లేదు.. చాలా బావుంది!" బదులిచ్చింది మానస.వెంటనే మరో ప్రశ్న సంధించాను.. '..గతంలోని మన ప్రేమ లాగానా?" ఇది తిరుగులేని ప్రశ్న. ఆమె మీద చిన్న 'గెలుపు' లాంటి గర్వం నాది. కానీ.. మానస నవ్వుతూ బదులిచ్చింది. 'చాలా పిచ్చిప్రశ్న బాటసారిగారూ! ప్రేమ అనేది ఒక్కొక్కరి హృదయంలో ఒక్కోవిధంగా రూపుదిద్దుకుంటుంది. స్వార్థం లేనిదీ, పవిత్రమైందీ అయితే జీవితమంతా ఉండవచ్చేమో కానీ.. పూర్తి వంచనతో కూడుకొంది కదా మీ ప్రేమ! ఓ చేదుగుర్తులా.. నాలాంటి వాళ్ల ఆనందమయ వైవాహిక జీవితానికి మునుపు వేసిన తప్పటడుగులోంచి నేర్చుకొనే ఓ చక్కటి గుణపాఠంలా మిగుల్తుంది. అయితే.. ఆ పాఠం నేర్చుకోవడానికి కావలసిందల్లా.. కాస్తంత ఓర్పూ, మనోధైర్యం.. అంతే !"

'ఎవరిదీ వంచన? నాదా? నీదా?" వెంటనే అన్నాన్నేను.'మీదే.. మీ పిరికితనానిది! నేను తప్పుకొంటే చాలు అనీ.. డబ్బుకోసం, ఎక్కువ కట్నంతో వచ్చే మరో అమ్మాయి

కోసం.. వ్యక్తిత్వం లేనివాడిలా.. మీ అమ్మ అభ్యంతరం తెలిపిందన్న సాకుతో నా ప్రేమను మీ స్వార్థపు చదరంగంలో పావుగా మార్చి చిదిమేసిన మీదే వంచన అవుతుంది తప్ప.. నాదెలా అవుతుందీ?"నేను లేచి ఆమెకు దగ్గరగా వెళుతూ.. 'మానసా! నేను నిజం చెప్తున్నాను.. నన్ను నమ్ము! నన్ను కనిపెంచిన మా అమ్మ మన పెళ్లికి ఒప్పుకోలేదన్న కారణంగా మరో అమ్మాయి మెళ్లో తాళికట్టానే కానీ.. ఇప్పటికీ నా మనసులో నీకు తప్ప వేరొకరికి చోటు లేదు.. ఇవ్వలేను కూడా!" అన్నాను.. అందంగా మాట్లాడటంలో మరోసారి నా కళను ప్రయోగిస్తూ.మానస బదులివ్వలేదు. అటుపక్కకు తిరిగి నిశ్శబ్దంగా రోదిస్తోంది.'అదే సరైన సమయం' అనిపించింది.

ఇక ఆలస్యం చేయదల్చుకోలేదు. చనువుగా ఆమె పక్కనే కూర్చుని.. 'క్షమించు మానసా! ఇప్పుడేమైందనీ? నేనున్నానుగా.. నీకోసం నేనేమైనా చేస్తాను.." అంటూ చుబుకం పట్టుకొని ఆమె ముఖాన్ని పైకెత్తి కళ్లనీళ్లు తుడిచాను.అభ్యంతరం చెప్పలేదు మానస. 'ఆడదాని మౌనం అర్ధాంగీకారం' అన్న విషయం నా 'అనుభవం'ద్వారా నేను తెలుసుకున్న విషయం! నెమ్మదిగా ఆమె భుజంచుట్టూ చేయివేసి నా గుండెలకు హత్తుకోబోయాను.

అంతే.. తోక తొక్కిన తాచులా ఒక్కసారిగా నా చేతుల్ని విదిల్చుకుంటూ లేచి నిలబడింది.'మనం విడిపోవడంలో నా తప్పేముందీ?నువ్వే వేరొకరితో పెళ్లికి ఒప్పుకొన్నావుగా!" అన్నాను తత్తరపడుతూ.

'ఏమిటీ..?" బిగ్గరగా అంది మానస.. దాదాపుగా అరిచినట్లు.'అదే.. నన్ను ప్రేమిస్తూనే మరొకరితో పెళ్లికెందుకు ఒప్పుకొన్నావ్?" అన్నాను బింకంగా. 'నేనొప్పుకొంటే? నీ ప్రేమ.. నీ మగతనం ఏమయ్యాయ్? 'లేచిపోదాం రా' అంటే నేను రానన్నానా? హుఁ.. వచ్చే దాన్నేనేమో.. ఎందుకంటే అప్పటికింకా తమరి అసలు స్వరూపం నాకు తెలీదు కదా!" అంటున్న తననే చూస్తూ అన్నాను.. 'ఇప్పుడు మాత్రం నా గురించేం తెల్సుకున్నావనీ?" ఓడిపోతున్న అసహనం, విజయం జారిపోతున్న ఆందోళనతో. 'కాదు కాదు! నన్ను నమ్ము మానసా! ఇప్పటికీ నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నా!" అన్నాను కాస్త మెలో డ్రమెటిక్‌గా! యుద్ధభూమిలో నేలకొరిగిపోతూ చిట్టచివరిగా ప్రత్యర్థి మీదికి ఈటెను విసిరే సైనికుడి పరిస్థితి నాది! కానీ..

'నిన్ను నమ్మడం, నమ్మకపోవడం.. అనే విషయాలు ప్రస్తుతం నాకనవసరం! ఇప్పుడు కూడా నీ బూటకపు మాటలతో, నీ అద్భుత నటనతో నన్ను నమ్మించాలని అనుకుంటున్న నిన్ను చూస్తూంటే.. జాలేస్తోంది!" అంటూ ఏకవచన సంబోధనతో మానస మాటలు విన్నాక.. 'ఆమెను గెలవటం ఇక దాదాపు అసాధ్యం!' అన్న విషయం తేలిపోయింది.'అయితే.. ఇంటికి పిలిపించి అవమానిస్తున్నావన్నమాట!" అన్నాను.. సాధ్యమైనంత వరకు తప్పును తనమీదకి తోసేసి, నా అస్తిత్వాన్ని నిలుపుకోవాలని నా ప్రయత్నం.ఆమె వెంటనే మాట్లాడలేదు. మానసికంగా తనను తాను

స్తిమితపరచుకోవడానికీ, తనలోని భావావేశాన్ని అదుపు చేసుకోవడానికీ కాస్త సమయం తీసుకొని, ఆ తర్వాత అంది..

'మిమ్మల్ని నేను అవమానించలేదు, ఎప్పుడూ ద్వేషించలేదు. మీపైన నాకెలాంటి భావమూ లేదు కూడా! అసలు అప్పుడూ, ఇప్పుడూ నా బాధల్లా ఒక్కటే.. 'అర్హతలేని ఓ అధముడిని నేనెందుకు ప్రేమించానా?' అని! ప్రేమించడానికి ఎంచుకున్న వ్యక్తి విషయంలో నేను పొరపాటు చేశానేమోకానీ, నా ప్రేమలో ఎక్కడా పొరపాటు లేదు. నా ప్రేమంటే నాకెంతో అపురూపం! అలాంటి నా ప్రేమను మాటలతో అవమానించి, మీ నటనతో ఏమార్చాలని చూస్తుంటే సహించలేక పోయానంతే!"ఆమె మాటలూ, వాటిలోని తన 'ఫిలాసఫీ' వెంటనే అర్థంకాలేదు నాకు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ మౌనంగా ఆమెవంకే చూస్తూండిపోయాను. తనలోని భావసంచలనాన్ని కుదుటపరచుకొనే ప్రయత్నంలో మౌనంగా ఉంది మానస.

నిశ్శబ్దంగా నిల్చున్న ఆమె రూపం నా కళ్లకు అద్భుతమైన పాలరాతి శిల్పంలా, దివినుంచి భువికి దిగివచ్చిన అప్సరసలా కన్పించడం.. అప్పటి నా మానసిక స్థితికి కారణమై ఉండొచ్చు! నెమ్మదిగా లేచి, ఆమె దగ్గరగా వెళ్లి చుబుకాన్ని పైకెత్తి చుంబించబోయాను. అంతే.. ఒక్కసారిగా నా చెంప ఛెళ్లుమంది.'మిస్టర్ ఫణికుమార్! నా భర్త ఇంట్లో లేకపోయినా ఇంతసేపూ నీతో ఎందుకు మాట్లాడానో తెల్సా.. అప్పుడెప్పుడో నిన్ను ప్రేమించిన పాపానికి! నిన్ను ప్రేమించాను కాబట్టే.. నీకు ఆ అర్హత లేకపోయినా, నీవెక్కడున్నా నీ ఉన్నతినే కోరుకున్నాను. ఇక.. సుజనతో 'నిన్ను చూడాలనుంది' అన్నది.. నన్ను నీకు శారీరకంగా అర్పించుకోవడానిక్కాదు. నాపట్ల చేసిన మోసానికి నీలో పశ్చాత్తాపం కలిగిందేమోననీ, పశ్చాత్తాపపడిన బాటసారిని నీలో చూడాలనీ! ఒకప్పుడు నేను నిన్ను ప్రేమించిన మాట నిజమే కానీ.. మరొకరితో కాపురం చేస్తూ, నిన్ను కూడా కోరుకునేటంత నీచురాలిని కాదు. నేనే కాదు.. 'సాధికారత' నిలుపుకోవాలని కోరుకునే నాలాంటి వాళ్లెవ్వరూ తమ భర్తలను మోసం చేయరు!" అంటూ ఆగింది.

ఓడిపోయాను.. పూర్తిగా, ఘోరంగా ఓడిపోయాను!ఒకప్పుడు.. తన మనసులో పేర్చుకున్న ప్రేమరాశుల్నీ, అపురూపమైన ఆమె ఆశల్నీ నేను క్రూరంగా తొక్కి చిదిమేస్తే.. అది తన తల రాతనుకొని మౌనంగా సహించిన మానస మనసులో కాసింత 'సానుభూతి'కైనా నేను అర్హత పొందటం.. ఈ జన్మలో సాధ్యంకాదని స్పష్టంగా అర్థమైంది నాకు. ఇక జీవితంలో మానస నన్ను నమ్మదు గాక నమ్మదు!'వెళ్లొస్తాను.." అంటూ లేచాను. మానస బదులివ్వలేదు. బయల్దేరాను.. అక్కడినుంచీ, ఆమె మనసు నుంచీ దూరంగా.. శాశ్వతంగా! బయటికొస్తుండగా కనిపించింది.. గోడకు వేలాడుతున్న పెయింటింగ్‌లోని ఓ వాక్యం.. 'ఈ ప్రపంచంలో ఏదైతే ఎంత కష్టపడినా దొరకదో.. దేన్నయితే పొందాలంటే చాలా కష్టపడాలో.. ఎంత కష్టపడినా కూడా ఏదైతే

కొంతమందికే దొరుకుతుందో.. అలాంటిది అపురూపమైతే.. అందులో కూడా అపురూపమైనది.. ప్రేమ!నిజమే.. నేను 'కోల్పోయింది' కూడా అపురూపమైనదే! అంతేకాదు.. నాకు ఓ కఠినసత్యం కూడా తెలిసింది. 'గతం' ఎప్పుడూ వాస్తవంలో కన్నా 'జ్ఞాపకం'గా మిగిలిపోవడంలోనే స్తిమితంగా ఉండగలమని!!!

***

## జన్ను లక్ష్మి

కవయిత్రిగా, రచయిత్రిగా సాహితీసేవ చేస్తున్నారు జన్ను లక్ష్మి. 'శ్రీ మానస' కలంపేరుతో కవితలు, కథలు రాస్తున్నారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నివాసం ఉంటున్నారు. వృత్తిరీత్యా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. మూడు దశాబ్దాల వృత్తి జీవితంలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ప్రవృత్తిరీత్యా తెలుగు భాషా పరిశోధకురాలిగానూ పనిచేస్తున్నారు. తన ఆరేళ్ల రచనా ప్రస్థానంలో.. 200కి పైగా కవితలు, కథలు రాశారు. వీటిలో అధిక భాగం.. అన్ని ప్రముఖ పత్రికలు, ఆన్‌లైన్ వేదికల్లో ప్రచురితమయ్యాయి. యూట్యూబ్ చానెళ్లలో ప్రసారమయ్యాయి. తన కవితలలో కొన్నిటిని 2019లో 'విరాళి' పేరిట సంకలనం వెలువరించారు. తెలుగు విద్యార్థులకు, తెలుగు భాషను అధ్యయనం చేసే/చేయాలనుకునే భాషా పరిశోధకులకూ ఉపయుక్తంగా ఉండేలా 'మన తెలుగు' పేరిట వ్యావహారిక తెలుగు భాషా వ్యాకరణం రచించారు. విపుల మాసపత్రికలో ప్రచురితమైన 'సుభద్రమ్మ అత్త' కథ, 'లైవ్' ఆంగ్ల మాస పత్రికలో వచ్చిన 'యాసిడ్ వెర్సెస్ చిల్లీ పౌడర్' కథలు.. పాఠకుల ఆదరణ పొందాయి. సాహితీసేవలో భాగంగా అనేక అవార్డులు, బహుమతులు అందుకున్నారు.

***

# సావాసం



**నెల్లుట్ల రుక్మిణి**

'అమ్మగారూ..''రాజమ్మ పిలుపుతో, చేనంతా కలియ చూస్తున్న జానకమ్మ ఉలిక్కిపడింది.
'ఈ మిరప చేను మాదే అమ్మగారూ! అరెకరం ఉంటది. మిర్చి ఏరడానికి కూలి మదుసులు దొరుకుతలేరు. అందరి తోటలు ఇప్పుడే కోతకొస్తయి కదా! గందుకని కైకిలికి కొద్దిమందే దొరికిండ్రు'' అన్నది రాజమ్మ.
మిరప తోటలో ఎర్రగా పండిన మిరపపండ్లు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఊరికి దగ్గరలోనే ఉన్నది ఆ చేను.
'ఏం పని లేకుండ, ఇంటికాడ ఉత్తగనే కూసుంటే ఏం తోస్తది అమ్మగారూ! పాత ఇసయాలన్నీ యాదికొచ్చి గుబులైతుంటది. జర గిట్ల అటు, ఇటు తిరుగుతా ఉంటే మదికి కాస్త ఊరట వస్తది. గందుకనే నిన్ను ఇక్కడికి తోలుకొచ్చిన'' అన్నది రాజమ్మ.
లింగాపురం చిన్న గ్రామం. ఒంపు వీధిలో జానకమ్మ ఇంటి ఎదురుగానే రాజమ్మ ఇల్లు, ఆమె బంధువుల ఇళ్లు ఉన్నాయి. జానకమ్మ వాళ్లు శ్రీవైష్ణవులు. వాళ్ల తాతల కాలం నుంచి గుడి పూజారులుగానే బతికారు. జానకమ్మ మామగారు తిరువెంగళాచార్యులు. మహా పండితుడు, వేదాధ్యయనం చేసినవాడు. రజాకార్ల హడావుడికి ముందు, పక్కూరి వెంకట్రామిరెడ్డి దొర తిరువెంగళాచార్యుల పాండిత్యానికి మెచ్చి, తమ ఊరి ఆలయానికి అర్చకుడిగా ఉండమని ఆహ్వానించాడు. కానీ, తిరువెంగళాచార్యులు తమ స్వగ్రామమైన లింగాపురం విడిచి వెళ్లడానికి ఇష్టపడలేదు. అందువల్ల వెంకట్రామిరెడ్డి దొర, లింగాపురంలోనే వరదరాజ స్వామి గుడి కట్టించి ఇచ్చాడు.
రజాకార్ల కారణంగా జనజీవనంలో బాగా అస్తవ్యస్తత ఏర్పడటంతో దాని ప్రభావం తిరువెంగళాచార్యుల కుటుంబం పైన కూడా పడింది.
అతని కుమారుడైన వరదాచార్యులు కూడా తండ్రితోపాటు గుడికి వెళ్లేవాడు. అలా వెళుతూ అర్చకత్వం, పౌరోహిత్యం నేర్చుకున్నాడు. ఆ ఊరిలో శ్రీవైష్ణవుల కుటుంబాలు, బ్రాహ్మణుల కుటుంబాలు మరో నాలుగు ఉన్నాయి.

కాలక్రమేణా దొర ఏర్పాటు చేసిన గుడిమాన్యం, ఊరి రాజకీయాలలో హరించుకుపోయింది. తిరువెంగళాచార్యుల అనంతరం వరదాచార్యులు అర్చకత్వానికి వచ్చేసరికి.. గుడికి వచ్చే ఆదాయం శూన్యమైపోయింది. గుడిలో రోజూ దీపం ముట్టించాలన్నా.. వరదాచార్యులే తన చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి

ఏర్పడింది.
వరదాచార్యులకు జానకమ్మతో వివాహం జరిగిన తర్వాత, కుటుంబ జరుగుబాటే కష్టమైపోయింది. గుడి అర్చకత్వంతోను, పౌరోహిత్యంతోను, ఒక కుటుంబం జీవించగలగడం చాలా కష్టమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈలోగా కొడుకు వెంకటాచార్యులు, కూతురు గోదాదేవి జన్మించారు.

'ఏమండీ! ఈ అర్చకత్వంతో మనం బతకడం, పిల్లలను చదివించుకోవడం కష్టం అవుతూ ఉంది కదండీ. మన ఊర్లో ఉన్న మన బంధువులు, బ్రాహ్మణ కుటుంబాలు కూడా పట్నానికి వలస పోతున్నారు కదండీ. మనం కూడా పట్నానికి వెళ్లి బతుకుదెరువు వెతుకుందామండీ" అంటూ బతిమిలాడింది జానకమ్మ.
'ఈ వరదరాజ స్వామి గుడి, అర్చకత్వం మా తండ్రిగారి కోరిక మేరకు మన కుటుంబానికి లభించిన అదృష్టం. ఇదంతా వదిలేసి, ఇప్పుడు అర్ధంతరంగా వెళ్లిపోతే ఆయన ఆత్మ శాంతిస్తుందంటావా జానకీ " అన్నాడు వరదాచార్యులు.
'ఆత్మల శాంతికోసం ఆలోచిస్తే, మన ఆత్మారాముడు ఎలా శాంతిస్తాడండీ? పిల్లలకు రెండు పూటలా కడుపునిండా తిండి పెట్టుకోవాలి కదా? పట్నంలో ఏదో ఒక పని చేసుకొని బతకవచ్చు. ఈ ఊర్లోనే ఉంటే.. అయ్యగార్లుగా, పూజారి కుటుంబీకులుగా మనకు కూలి పనికూడా దొరకదు. కాస్త పిల్లల మొహం చూసి ఆలోచించండి. అంతా బాగుంటే మళ్లీ ఇక్కడికే వచ్చేద్దాం" అంటూ నచ్చచెప్పింది జానకమ్మ.

మనస్ఫూర్తిగా ఇష్టం లేకపోయినా తలపంకించాడు వరదాచార్యులు. జానకమ్మకు అదే పరమ సంతోషం. పట్నం వెళ్లడానికి సామాన్లు సర్దడం మొదలుపెట్టింది. మర్నాడు ఉదయం జానకమ్మ.. మామగారైన తిరువెంగళాచార్యుల పటం తీసి తుడుస్తూ ఉంటే ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చాడు.
'అమ్మగారూ.. అమ్మగారూ! అయ్యగారు గుడిలో పడిపోయిండు. ఎంత పిలిచినా పలుకుతలేదు" గట్టిగా అరిచి చెప్పాడు ఆ వ్యక్తి.
ఈ అరుపులకు, అలికిడికి రాజమ్మ బయటికి వచ్చింది.
'ఏమైందిరా మల్లిగా! అయ్యగారికి ఏమైంది?" అడిగింది రాజమ్మ.
'ఏమోనత్తా! గంట కొట్టుకుంటా కొట్టుకుంటా గట్లనే పక్కకు ఒరిగిపోయిండు. ఎంత పిలిచినా పలుకుతలేదు" అన్నాడు మల్లిగాడు.
'అమ్మగారూ పద.. పొయ్యి చూద్దాం" అంటూ జానకమ్మను తీసుకొని వెళ్లింది రాజమ్మ.
గుడిలో అచేతనంగా పడి ఉన్నాడు వరదాచార్యులు. రాజమ్మ మల్లిగాణ్ని పంపించి, ఆ ఊర్లో ఉన్న ఆర్ఎంపీ డాక్టరును పిలిపించింది.
డాక్టర్ వచ్చి పరీక్షించాడు.

'ఇది పక్షవాతం స్ట్రోక్ లాగా ఉన్నదమ్మా ! పక్కూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకుపోండి" అని చెప్పి వెళ్లిపోయాడు.

రాజమ్మ తన భర్తను పిలిపించి, బండి కట్టించి.. అయ్యగారిని పక్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. జానకమ్మ అంటే రాజమ్మకు చాలా ఇష్టం. ఇద్దరూ దాదాపు ఒకే ఈడువారు. దాదాపు ఒకే సంవత్సరం పెళ్లయి అత్తగారింటికి వచ్చారు. ఆ ఇద్దరి మధ్య స్నేహం బాగా అల్లుకుపోయింది. జానకమ్మ శ్రీవైష్ణవుల ఇంటిపిల్ల కాబట్టి.. రాజమ్మ ఆమెను ఎప్పుడూ గౌరవంగా 'అమ్మగారూ' అని పిలిస్తే.. జానకమ్మ ఆప్యాయంగా 'రాజమ్మా!' అని పిలిచేది.

రాజమ్మ సహకారంతో వరదాచార్యులకు చికిత్స చేయించింది జానకమ్మ. అతనికి పక్షవాతం అని డాక్టర్లు చెప్పారు. మంచంలో ఉలుకుపలుకు లేకుండా పడి ఉన్న చెట్టంత మనిషిని చూస్తుంటే గుండెలు ఆర్చుకుపోతున్నాయి జానకమ్మకు. ఇంట్లో తిరుగుతున్న ఇద్దరు చిన్నపిల్లలను చూస్తూ ఏం చేయాలో, జీవితాన్ని ఎలా గడపాలో తెలియక దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. కొడుకు వెంకటాచార్యులకు తండ్రితో గడిపిన కొద్దికాలం ఒక కలగానే మిగిలిపోయింది. వెంకటాచార్యుల చిన్నతనంలో వరదరాజస్వామి ఆలయ పూజా విధానం, ఇప్పటికీ అతని కనుల ముందు కదులుతూ ఉంటుంది. ఆ జ్ఞాపకాలు అతనికి అమృత తుల్యాలు అయ్యాయి.

జానకమ్మ, వెంకటాచార్యులను ప్రాతఃపూర్వమే నిద్రలేపి, స్నానం చేయించి, చిన్న పట్టు వస్త్రం పంచెగా కట్టేది. తిరువణి, శ్రీ చూర్ణంతో నామాలు తీర్చిదిద్దేది. ఆ చిన్ని బాలుడు ముగ్ధ మోహన రూపంతో ముద్దుగా గోచరించేవాడు. మార్గళి మాసం నెల రోజులూ, చలికి వణుకు పుడుతున్నా.. దైవ ధ్యానం చేస్తూ ఉంటే ఎంతో ఉత్సాహంగా ఉండేది వెంకటాచార్యులకు.

జానకమ్మ తెల్లవారుజామునే నిద్రలేచి, స్నానాదులు కానిచ్చి, దేవుడికి తిరువళిక ముట్టించి, కట్టె పొంగలి వండేది. దాన్ని నైవేద్య పాత్రలో ఉంచి, మరో పూజా పాత్రలో తులసి తీర్థం ఉంచి, ఆ రెండూ ఒక పళ్లెరంలో ఉంచి, పైన పట్టు వస్త్రం కప్పి తయారుచేసేది జానకమ్మ.

వరదాచార్యులు తయారై వచ్చి, ఆ పళ్లెరాన్ని తీసుకొని.. 'శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థి నాం..' అంటూ దైవధ్యానం చేస్తూ గుడివైపు నడుస్తూ వెళ్లేవాడు. అతని వెనకాలే చిన్ని వెంకటాచార్యులు చేతిలో తీర్థ కలశం పట్టుకుని తండ్రిని అనుసరిస్తూ వెళ్లేవాడు. వరదాచార్యులు తిరుప్పావై పారాయణం చేస్తూ గుడివైపు నడుస్తూ ఉంటే, దారిలో అతనికి ఎదురైన వారు ఆ పూజారికి నమస్కరించి పక్కకు జరిగేవారు. ఆ అయ్యగారిని సాక్షాత్తూ దేవుడిగా భావిస్తూ నమస్కరించే వారిని చూస్తూ ఉంటే వెంకటాచార్యుల మనసులో పులకింత కలిగేది.

గర్భగుడిలోకి వెళ్లిన వరదాచార్యులు, సాలగ్రామాన్ని శుద్ధిచేసి తీర్థంతో సంప్రోక్షణ చేసేవాడు. పుష్పాలు, గంధం, అక్షతలు సమర్పించి పూజ చేసేవాడు. కర్పూర హారతి వెలిగించి, పెరుమాళ్లకు హారతి పట్టేవాడు. వచ్చిన భక్తులకు

తీర్థప్రసాదాలు ఇచ్చేవాడు వరదాచార్యులు. భక్తులు భగవంతునికి నమస్కరించి, పూజారికి కూడా పాదాభివందనం చేసేవారు. పూజారి అక్షతలు చల్లి ఆశీర్వచనాలు పలికేవాడు. ఆ సందర్భంలో ఆ భక్తులలో కనిపించే గౌరవ మర్యాదలు చూస్తున్న వెంకటాచారికి, తన తండ్రి ఎంతో గొప్పవాడని, సాక్షాత్తూ భగవంతుడే అన్న తలంపు కలిగేది. తాము ఎంతో గొప్పవాళ్లం కాబట్టే, అలా గౌరవిస్తున్నారని భావన కలిగేది.

కానీ, పక్షవాతం వచ్చి మంచాన పడిన తండ్రిని చూస్తూ ఉంటే.. అమ్మ కూలికి వెళ్లి తెచ్చిన జొన్న గటకతో కడుపులు నింపి, ఆకలి తీర్చుకుంటూ ఉంటే.. జీవితంలో మరోకోణం కూడా ఉంటుందని వెంకటాచార్యులకు అర్థమైంది.

శోక సముద్రంలో మునిగిపోయి ఉన్న జానకమ్మను అలా చూస్తూ ఉంటే రాజమ్మకు ఎంతో బాధేసేది. ఆ కుటుంబానికి ఎలా సహాయం చేయాలో అర్థం కాలేదు రాజమ్మకు. ఆ కుటుంబాన్ని ప్రధానంగా పీడించే సమస్య తిండి. అప్పుడే కరువుకాలం ప్రారంభమైంది. వరి పంట తక్కువై జొన్నలు అధికంగా పండేవి. ప్రజానీకం అవే తినటం అలవాటు చేసుకుంటున్నారు.

రాజమ్మ ఒక తవ్వెడు జొన్నరవ్వ చేటలో తెచ్చి జానకమ్మ ముందు పెట్టింది. ఇంటి అరుగు మీద దిగాలుగా కూర్చున్న జానకమ్మ ఆ జొన్నరవ్వ చూసి గుడ్లనీళ్లు కుక్కుకున్నది.

'ఇట్లా ఎంతకాలం సాయం చేస్తవ్ రాజమ్మా! నీ రుణం ఎట్ల తీర్చుకోవాలె" అన్నది జానకమ్మ.

జానకమ్మను దగ్గరికి తీసుకొని ఓదార్చాలని అనిపించింది రాజమ్మకు. కానీ, వాళ్లు పెద్ద కులం వాళ్లు. తమదేమో తక్కువ కులం.

'అమ్మగారూ! కష్టాలు కలకాలం ఉండవు. కానీ, నీ కష్టం ఒకరు తీర్చగలిగేది కాదు. ఆ బగమంతుడే తీర్చాలె. ఈ గింజలు గట్క వొండు. అయ్యగారికి, ఈ పిల్లలకు ఇంత తినిపించు. బాధపడతా కూసుంటే ఆకలి తీరదు కదా అమ్మా" అంటూ ఓదార్చి వెళ్లిపోయింది రాజమ్మ.

అప్పటికి రెండు రోజులైంది ఆ ఇంట్లో పొయ్యి రాజేసి. జానకమ్మకు ఆ గింజలే అమృతం లాగా అనిపించింది. జొన్న గటక తినడం పిల్లలకు ఎంతో కష్టమైంది. కొడుకు వెంకటాచార్యులు జొన్న గటక చూసి..

'అమ్మా! ఇది మనం తినే అన్నంలాగా లేదు కదమ్మా" అంటూ మొహం విరిచాడు.

'నాన్నగారికి ఆరోగ్యం తొందరగా నయం కావాలంటే.. ఈ ఆహారమే ఇవ్వాలని డాక్టరు చెప్పాడు బాబూ. మరి నాన్నగారికి త్వరగా నయం కావాలి కదా నాన్నా" అంటూ నచ్చచెప్పింది జానకమ్మ.

కష్టాల ఊబిలో ఉన్న జానకమ్మకు ఎలాగైనా సహాయం చేయాలని అనుకున్నది రాజమ్మ. కానీ ఏం చేయాలో అర్థం కాలేదు. అదే విషయం తన భర్తతో మాట్లాడింది. అతడి సలహా

నచ్చింది ఆమెకు.

మర్నాడు రాజమ్మ తాను చేనుకు వెళ్లేటప్పుడు..

'జానకమ్మ గారూ! నాతోపాటు చేనుకు పోదాం రా. ఊరికెనే ఇంట్ల కూసుంటే గుబులుగ ఉంటది" అంటూ తనవెంట చేనుకు తీసుకెళ్లింది. అక్కడ ఒక గంట తర్వాత జానకమ్మకు విసుగు అనిపించింది. రాజమ్మ ఒక గంప తెచ్చి జానకమ్మకు ఇచ్చింది.

'నాకు కాస్త సాయం చెయ్యండి అమ్మగారూ! ఈ పండు మిరపకాయలు తెంపి బుట్టలో వెయ్యి. ఏదో పని చేస్తా ఉంటే.. మనసు తెరిపిన పడుతది కదా!" అని ప్రోత్సహించింది.

చేనులో కూలోళ్లను చూస్తూ కూర్చుంటే, నిజంగానే విసుగు చెందిన జానకమ్మకు.. కాస్త ఏదైనా పని చేస్తుంటే బావుండు అనిపించింది. రాజమ్మ చెప్పినట్లుగానే పండు మిరపకాయలు ఏరడం మొదలుపెట్టింది. సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చాక, రాజమ్మ చేటలో జొన్నలు పోసి తెచ్చింది.

అట్లా జానకమ్మను, రాజమ్మ రోజూ తనతోపాటు చేనుకు తీసుకొనిపోయేది. సాయంకాలం ఇంటికి వచ్చాక.. జొన్నలో, సజ్జలో చేటలో పోసి తీసుకువచ్చి అరుగు మీద పెట్టేది.

నాలుగు రోజుల్లో జానకమ్మకు అర్థమైంది.. తనుకూడా వాళ్లతో పాటు కూలి పనికి వెళుతున్నానని. కానీ, ఆ పని కూడా చేయకపోతే, ఆ కాసిన్ని తిండి గింజలు కూడా దొరకవనే సత్యం కూడా అవగతమైంది ఆమెకు.

ఆ విధంగా జానకమ్మను తన పరిధిలోకి తీసుకొచ్చుకున్నది రాజమ్మ.

'మీలాంటి పెద్దోల్లకు సాయపడితే మాకు పోయిన జన్మల పాపాలు పోతాయట తల్లీ" అంటూ జానకమ్మను తనవెంట కూలికి తీసుకొని పోయేది రాజమ్మ.

కాలచక్రం తిరిగి పోయింది. వెంకటాచార్యులు చదువు పూర్తయ్యాక.. ప్రభుత్వ ఉద్యోగం దొరికింది. జానకమ్మ పెదనాన్న కొడుకు పరమేశం.. తన బిడ్డ పరిమళను వెంకటాచారికి ఇచ్చి పెళ్లిచేశాడు. పక్షవాతంతో మంచంలోనే ఉన్న వరదాచార్యులుకు మెరుగైన వైద్యం లభించడంతో కాస్త కర్ర పట్టుకుని నడవసాగాడు. కొడుక్కు ఉద్యోగం వచ్చాక జానకమ్మ కూలి పనికి వెళ్లడం మానేసింది. కానీ జానకమ్మ, రాజమ్మ మధ్య స్నేహం మాత్రం తగ్గలేదు. రోజుకు ఒకసారైనా కాసేపు కూర్చొని మాట్లాడుకోకపోతే వారికి మనసు తృప్తిగా ఉండదు.

అంతా సవ్యంగా ఉందని మనం అనుకుంటూ హాయిగా ఉంటే.. కాలం అలా కాదు కదా! తన పని తాను చేసుకుపోతూనే ఉంటుంది. రాజమ్మకు అకస్మాత్తుగా సుస్తి చేసింది. రెండు మూత్రపిండాలూ దెబ్బతిన్నాయని, మూత్ర పిండం మార్చకపోతే బతకదని చెప్పారు డాక్టర్లు. హాస్పిటల్లో రాజమ్మను చూడ్డానికి వెళ్లిన జానకమ్మ.. తన కిడ్నీని రాజమ్మకు ఇస్తానని చెప్పింది. డాక్టర్లు పరీక్ష చేసి.. ఆమె కిడ్నీ సరిపోతుందని చెప్పారు. కానీ, జానకమ్మకు ఇంట్లోంచి వ్యతిరేకత ప్రారంభమైంది.

వరదాచార్యులు, అతని వియ్యంకుడు పరమేశం దీనిని వ్యతిరేకించారు.

'తక్కువ కులం వాళ్లతో సహవాసం చేయడమే దోషం. నిత్యాగ్ని హోత్రంలాంటి మన శ్రీ వైష్ణవ కుటుంబాలకు, ఆ తక్కువ కులం వాళ్లతో సావాసం ఏమిటి? ఇంతకాలం అడిగేవాళ్లు లేరనేగా! ఇప్పుడు ఈ ఇంటికి పిల్లనిచ్చిన వ్యక్తిగా నేనందుకు ఒప్పుకోను. అసలు ఆ తక్కువ కులం వాళ్లతో స్నేహమే నాకు ఇష్టం లేదు. మనవి సంశ్రయణాలు చేసిన సంప్రదాయ కుటుంబాలు. నిత్యం పూజలు, పునస్కారాలు చేసే శ్రీ వైష్ణవులం. ఈ కుల భ్రష్టతకు నేను ఒప్పుకోను. మనవాళ్లు కిడ్నీలు కూడా అలాంటి వారికి ఇవ్వకూడదు" అంటూ ఒంటికాలు మీద లేచాడు పరమేశం.

తన బిడ్డను వెంకటాచార్యులకు ఇచ్చి పెళ్లి చేశాడు కాబట్టి.. ఆ విధంగా తన ఆధిక్యతను నిలుపుకోవాలని అతని ప్రయత్నం.

నివ్వెరపోయిన జానకమ్మ.. వెంకటాచార్యుల వైపు చూసింది. ఆమె కళ్లలో నీళ్లు లేవు. గత కాలంలో తాము పడిన కష్టం, రాజమ్మతో ఆమె స్నేహం, రాజమ్మ చేసిన సహాయ సహకారాలు అన్నీ కనిపించాయి వెంకటాచార్యులకు. నెమ్మదిగా లేచి వచ్చి, తల్లి భుజం మీద చేయి వేశాడు.

తల్లిని దగ్గరికి పొదువుకున్నాడు. ఆమె నుదుట ముద్దు పెట్టుకున్నాడు.

'మామయ్యా! మీ ఆరాటంలో అర్థం ఉన్నది. కానీ మానవత్వం లేదు. మా నాన్నగారికి జబ్బు చేసి, మంచాన పడి ఉన్న రోజున.. మేము గుక్కెడు గంజి నీళ్లకు నోచుకోని రోజున.. మన కులం ఏం చేసింది? మీరు అప్పుడు ఎక్కడున్నారు? నాకు ఈ రోజున గవర్నమెంట్ జాబు వచ్చిందని మీ అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేసినంత మాత్రాన.. మా కుటుంబం మీద మీకు అధికారం రాదు కదా! మన కులం వాళ్లకు కొలమానం.. సంశ్రయణాలు కాదు, మానవత్వం. తక్కువ కులంలో పుట్టినా, రాజమ్మ తన సహృదయంతో మా కుటుంబానికి ఆసరాగా నిలిచింది. మమ్మల్ని ఆదుకున్నది. ఈరోజు ఆమె కష్టంలో ఉంటే కుంటి సాకులు చెప్పి తప్పించుకోవడం మానవత్వం అనిపించుకోదు. మా అమ్మకు, రాజమ్మకు మధ్య ఉన్నది స్నేహం కాదు.. గొప్ప అనుబంధం. ఒక్క మాటలో చెప్పాలంటే.. రాజమ్మ నాకు రెండో తల్లి. ఈ విషయంలో మా అమ్మ ఏ నిర్ణయం తీసుకుంటే, దానికి అందరం బద్ధులమై ఉండాలి. ఇష్టం లేనివాళ్లు ఇప్పుడే వెళ్లిపోవచ్చు" అన్నాడు వెంకటాచారి ప్రశాంతంగా.

తూటాల్లాగా వెలువడిన ఆ మాటలలో ఒక నిర్దిష్టమైన నిర్ణయం కనిపించింది.

పరిమళ లోపలికి వెళ్లి బ్యాగు తెచ్చి తండ్రికి ఇచ్చి.. గుమ్మం దాకా సాగనంపి వచ్చింది.

ఆపరేషన్ సక్సెస్ అయింది.

జానకమ్మ, రాజమ్మ అరుగుమీద కూర్చొని ముచ్చట్లు పెట్టుకుంటూ ఉంటే.. కోడలు పరిమళ రెండు గ్లాసులతో టీ తీసుకొచ్చి ఇచ్చింది.

జానకమ్మ గతాన్ని గుర్తు తెచ్చుకుంటూ, రాజమ్మ చేనుకు వెళ్లిన మొదటి రోజు గురించి

తలుచుకున్నది. ఆమె కళ్ల వెంట నీళ్లు తిరిగాయి.
జానకమ్మ కళ్లు తుడిచి, అక్కున చేర్చుకోవాలనుకున్నది రాజమ్మ. కానీ, కులం గుర్తుకు వచ్చింది రాజమ్మకు.
'అమ్మగారూ! మీరింకా కండ్ల నీళ్లు పెట్టే గాచారమేమున్నది? కాలమంత మారిపోయింది కదా. చెట్టంత కొడుకు నీకు అండగ ఉన్నడు. ఏడవకుండ్రి. కండ్లు తుడ్సుకోండి!" అన్నది రాజమ్మ.
'నీ సావాసమే నాకు కొండంత అండ రాజమ్మా!" అంటూ చీర కొంగుతో కళ్లు తుడుచుకున్నది జానకమ్మ.

★★★

## నెల్లుట్ల రుక్మిణి

కష్టాల్లో ఉన్నవారికి ఎలాగైనా సాయం చేయాలనే తపన.. మానవ జీవితానికి విలువను తీసుకొస్తుంది. అలాంటి తపనతో ఉన్న ఓ నిరుపేద స్నేహితురాలికి, ఆమె ఆప్యాయతకు, స్నేహబంధానికి, సామాజిక అంతరాలు అడ్డురావని చెప్పే కథ.. 'సావాసం'. రచయిత్రి నెల్లుట్ల రుక్మిణి. మనుషులను, జీవితాలను, ప్రకృతిని పరిశీలించడం.. చిన్నప్పటినుంచే అలవాటు చేసుకున్నారు. 50 ఏళ్ల కింద.. పదేళ్ల వయసులో తన పరిశీలన, అనుభవంలో ఉన్న విషయాలే.. 'సావాసం' కథకు మూలం. ఇల్లెందు క్రాంతి స్కూలు ప్రిన్సిపాల్‌గా పని చేసినప్పుడు.. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేసేవారు.

ఆ పిల్లల తల్లిదండ్రులతో కలిగిన పరిచయం.. వీరిలో కథలు రాయాలనే తలంపునకు కారణమైంది. వారు చెప్పిన జీవిత వెతలనే, కథలుగా మలిచేందుకు ప్రయత్నించారు. వీరు రాసిన పలు కథలు.. కొత్తగూడెం రేడియో కేంద్రంలో మూడేళ్లపాటు ప్రసారమయ్యాయి. అనేక కథలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'వెన్నెల పూలు' బాలగేయ సంపుటి, 'బతుకు ఎతలు' కథల సంపుటిని ముద్రించారు. అనేక బహుమతులు, అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. నిర్మాతగా.. శ్రీ వెంకటేశ్వర మహత్యం, ఈ రాత్రి గడిస్తే చాలు చిత్రాలను నిర్మించారు.

**+91 90004 41271**



# సోగణ్..!!

**బి.కళాగోపాల్**

బ్యాగ్‌లోనుంచి మరోసారి ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్స్ కాపీని చూసుకొని సర్దుకున్నాను. బాబు నుదుటిపై చెయ్యివేసి చూశాను. జ్వరం జారింది. వేసుకున్న టీషర్ట్ చెమటలు పోసి తడిచిపోయింది వాడికి. అటుకేసి తిరిగాడు. దిగులుపొర నా గుండెల్ని మెలిపెట్టింది. బీటెక్ సెమిస్టర్ పరీక్షల్లో ఈ డెంగీ జ్వరమొకటి వాడికి. ఇంకో రెండు పరీక్షలు రాయాలి. ఈ వేసవిలో.. మే ఐదు, ఆరు తేదీల్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా విధి నిర్వహణ కీలకమైనది నాకు.

బాబును హాస్టల్ నుంచి తీసుకొచ్చి కూకట్‌పల్లిలోని మా దగ్గరి బంధువులింట్లో ఉంచాను. పాఠశాల వేసవి సెలవులు అయినందువల్ల నేనూ అక్కడే మకాం. వాడికి దగ్గరుండి పళ్లరసాలు, అవసరమైన మాత్రలు, తేలికపాటి ఆహారం అందిస్తూ అటు సపర్యలు, ఇటు వాడి పరీక్షల ఒత్తిడిలో తలమునకలై ఉన్న నాకు రేపటి ప్రయాణం ఒక ప్రశ్నార్థకమైన బెంగను రేకెత్తించింది.

డైనింగ్ టేబుల్‌పై ట్రైనింగ్‌లో ఇచ్చిన ప్రిసైడింగ్ ఆఫీసర్స్ డైరీ వేయి నాల్కల ఫణిరాజులా బరువుగా నా ఆఫీసర్ బాధ్యతను నెత్తిన మోదడానికి సిద్ధం అంటూ చూడసాగింది. రేపటి ప్రయాణ ఏర్పాట్లలో భాగంగా అవసరమైన చపాతీలు, నాకిష్టమైన ఆలూ బఠాణీ కూర ప్యాక్ చేసుకొని.. తెల్లవారుజామున 4 గంటలకు అలారం పెట్టుకొని తలగడపై ఒత్తిగిల్లాను. దిమ్మన్న పని ఒత్తిడి భారంతో రాత్రంతా కలతనిద్రా మరకలే..! నా దిండు నిండా..!

తెల్లారి ఫెటీల్‌మన్న సూర్యోదయంతో పోటీపడి, గబగబా రెడీ అయ్యి.. బట్టల బ్యాగు, ఎలక్షన్ ఆర్డర్ కాపీని హ్యాండ్‌బ్యాగ్‌లో సర్దుకొని, బాబుకు నుదుటిపై ముద్దుపెట్టి 'బెస్ట్ ఆఫ్ లక్' చెప్పి బయటపడ్డాను. వాడి కళ్లు అలసటతో మెరిశాయి. పెదవులపై కనీ కనిపించని చిరునవ్వుతో డోర్ వేసుకున్నాడు.

ఉదయం ఏడుగంటలకే బోయిన్‌పల్లి బస్టాండ్ జనసందోహంతో కిటకిటలాడసాగింది. ఊపిరి సలపని రష్. నా మనసులోని గడబిడకు సమాధానమంటూ దేవుడు పంపిన దూతలా కామారెడ్డి బస్ టైంకి వచ్చింది. టికెట్ తీసి కిటికీ తెరిచాను. పొద్దుటి చల్లగాలి విధి నిర్వహణకు ఆహ్వానమంటూ నా చెంపలను సుతారంగా నిమిరింది. మరో రెండుగంటల తర్వాత కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం దగ్గర రిక్వెస్ట్ స్టాపులో దిగిపోయాను.

మైక్‌లో సందడి చేస్తున్న సూచనలు, ఒకపక్క వరుసలో ఉన్న వివిధ రూట్ బస్సులు, పోలీసుల బందోబస్తు, బయట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ దగ్గర నా నెంబర్ చూసుకొని.. మా రూట్ ఆఫీసర్ టేబుల్ దగ్గర రిపోర్ట్ చేశాను. మనిషి సన్నగా, రివటలా ఉన్నాడు. పాత సినిమాల్లో రమణారెడ్డిని తలపిస్తూ..! హడావుడిగా అందరి ఆర్డర్స్ తీసుకొని మెటీరియల్ ఇస్తూ సంతకాలు తీసుకోసాగాడు. ఎన్నికల సామగ్రి, చెక్ లిస్ట్ అన్నీ చెక్ చేసుకున్నాక.. నా ఆర్డర్‌లోని పోలింగ్ ఆఫీసర్ ఇంకా రాలేదని మా ఆర్వోకు చెప్పాను. రిజర్వ్ వాళ్లు అలాట్ అవుతారేమోనన్న సందేహాన్ని పూర్తి హామీతో వెలిబుచ్చలేక తడబడ్డాడు. ఎన్నికల సిబ్బంది అందరూ లేనిదే బస్ బయల్దేరదని రూఢిగా తెలుసు.

వార్డ్ మెంబర్లవి తెలుపు రంగు బ్యాలెట్, గులాబీ రంగువి సర్పంచుల బ్యాలెట్ పత్రాలను జాగ్రత్తగా లెక్కించుకొని భద్రపర్చుకున్నాను. ఎల్లారెడ్డి డివిజన్‌లోని రాంపూర్ గ్రామంలో ఎలక్షన్ డ్యూటీ. అక్కడ సర్పంచ్ ఎన్నిక ఇదే ప్రథమం. అడవిలింగాల, నల్లమడుగు, రాంపూర్, శాంతాపూర్, చద్మల్ తండా, కల్‌పోల్, బైరాపూర్ తండా రూట్ మ్యాపు గిర్రున కళ్లలో తిరిగింది. నా జ్ఞాపకాలు ముప్పై ఏళ్లు వెనక్కి నెట్టబడ్డాయి.

మార్పు అత్యంత సహజమేనంటూ.. అనివార్యమైన దానికి శోకించుట తగదు అన్న గీతాచార్యుని ప్రబోధామృతం మదిలో కదలాడగా గుండె చిక్కబట్టుకొని నా ప్రథమ నియామక పత్రాన్ని చేతబట్టుకొని..'బైరాపూర్ తండాకు ఎలా వెళ్లాలి?' అని బస్ ఎంక్వైరీ చేస్తే.. నివ్వెరపోయిన నిజం కళ్లు బైర్లు కమ్మేలా చేసింది.ఆ ఊరికి బస్ లేదన్న విషయం తెలియగానే మూర్ఛిల్లే ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాను..

అప్పటికి నేను అవివాహితురాల్ని. భవిష్యత్ ఎలానన్న భయం, దుఃఖం తాలూకు బెంగతో బిగుసుకుపోయాను. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ బ్లాక్ బోర్డు అన్న స్కీం కింద కొత్తగా తండాల్లోనూ పాఠశాలలు తెరుస్తూ.. ప్రాథమిక విద్యకు పెద్దపీట అంటూ స్పెషల్‌గా మహిళా ఉపాధ్యాయినులను నియమించ సాగింది. అదిగో.. ఆ పద్మవ్యూహంలో భాగంగా నేను మొదట పోస్టింగ్ పొందిన తండా అది.

నావెంట ఎవరూ రాలేదు. ఎలా వెళ్లాలి? ఎక్కడ ఉండాలి? హోరుమంటున్న అంతుచిక్కని ప్రశ్నల సొద నాలో.. జాయినింగ్ రోజు మండల కేంద్రంలో రిపోర్ట్ చేసి నా నిర్జన బతుకుయాత్రను ఎడ్లబండి ఎక్కి ప్రారంభించాను. వన్యమృగాలు తిరిగే అటవీ ప్రాంతం కేసి కిర్రుమంటూ బండిచక్రాలు కదిలాయి. చిక్కటి దట్టమైన కీకారణ్యం అడవి లోపలికి.. లోలోతులకు వెళ్తుంటే.. అసలు ఈ గుట్టల్లో ఎక్కడుందీ తండా? అంటూ తచ్చాడాల్సిందే!

'గీ నల్లవాగు దాటి మూడు కిలోమీటర్లు ప్రయాణించి మొండివాగు మరీ ఉధృతంగా ప్రవహిస్తే చుట్టూ తిరిగి వెళ్లాలి. అదిగో ఆ గుట్టమీద చిన్న గుడిసెలు బొమ్మలలెక్క కన్పిస్తున్నయి జూడు! గదే బైరాపూర్ తండా!" అంటూ ఆ వృద్ధుడు వేలు

తిప్పిన వైపు చూస్తే వెన్నులో చలిపాకింది నాకు.

తెచ్చుకున్న సూట్‌కేసు దించుకున్నాను. ఆ వృద్ధుడు ఎడ్లను అదిలిస్తూ, కల్‌పోల్ తండాకేసి సాగిపోతున్నాడు. క్రమంగా ఎడ్ల మువ్వల శబ్దం వినపడకుండా పోయింది. నిర్మానుష్యమైన ఆ అడవిలో నా శ్వాస, గుండెదడ భయం భయంగా నాకే వినిపించసాగాయి. మధ్యాహ్న మార్తాండ కిరణాలు నిప్పులు కక్కసాగాయి. దాహంతో నాలుక పిడచకట్టుకపోసాగింది. సోయి తెచ్చుకొని బ్యాగులోనుండి నీళ్ల సీసా తీసి గబగబా గొంతు తడుపుకొన్నాను. తెచ్చుకున్న కాల్చిన జొన్నరొట్టెలు తిని, చీర నడుం చుట్టూ బిగించాను.

గుట్టమీద కిరీటంలా మెరిసిపోతున్నాయి తెల్లని మేఘ మాలికలు. నల్లవాగులో కాలు మోపగానే గులకరాళ్ల సంగీత ప్రవాహం ఆప్యాయంగా నా చీర కుచ్చిళ్లను చుట్టుకొంది. ఇసుకలో గట్టిగా పాదాలను తొక్కిపెట్టి జారిపోకుండా.. వాగు ఉధృతికి తగ్గట్టుగా అడుగులను సమంగా వేసుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాను. కొండంత భరోసానిస్తూ ఎదురుగా కొండపైన తునికాకు సేకరణలోనున్న బంజారా స్త్రీలను చూడగానే పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది.

విద్యా గంధానికి దూరమైన ఈ అడవిబిడ్డలకు చదువు విలువ తెలియజెప్పాలి.. చదువుకొని తమకాళ్లపై తాము నిలబడే తొలితరానికి అంకురార్పణం చేసే ఆదిగురువును నేనే అవడం గొప్ప బాధ్యతాయుతమైన కర్తవ్యంగా భావించగానే.. ఎలాంటి జంకూ గొంకూ లేకుండా వారి మువ్వల పట్టీలకు అనుగుణంగా నా పాదాలు ఆశల వసంతంతో అడవిబాట పట్టాయి. ఎత్తుగా, బలాఢ్యులైన ఆ బంజారా మహిళల వెంట నడుస్తుంటే మౌర్యుల కాలంలో అంగరక్షకులుగా మహిళలు ఉండేవారన్న చరిత్ర పాఠం కళ్లముందు కదలాడింది.

దారిలో బండలపై ఎండకాగుకు మత్తుగా జోగుతున్న కొండచిలువలు, అక్కడక్కడా పురివిప్పిన నెమళ్లు, పేరు తెలియని పక్షుల కూతలు వింటూ అదురుతున్న గుండెలతో నాముందు నడుస్తూ బలిష్టంగానున్న ఆ బంజారా మహిళ చేయి చప్పున పట్టుకున్నా.

'అవి అలాగే పోతయిగాని.. నీకేం భయం లేదు. మాతోబాటు గుడిసెలో ఉండొచ్చు!" అంది తన భాషను మిళితం చేస్తూ.. బహుశా నా వాలకం పోల్చుకుందేమో! వీపున కట్టుకున్న తునికాకు మోపును సవరించుకుంటూ.. నాపేరు కనుక్కుని, తన పేరు చంప్లీబాయి అని చెప్పింది దృఢమైన అంగలతో..!

ఈ గుట్టే వారి మాతృఛాయ అంటూ దీని వాలులో పండే పెసలు, కందులు, జొన్న, మక్కలే ప్రధాన ఆహారధాన్యాలుగా.. ప్రతిరోజూ ఇలా ఏడెనిమిది కిలోమీటర్లు నడిచి తునికాకు, కుంకుడుకాయ, పుట్టతేనె, గెయిగడ్డలు, వంటచెరుకు, మొర్రిపండ్లు సేకరిస్తామని గరగరమనే కంఠంతో చెప్పింది చంప్లి. బహుశా తండా దగ్గరపడిందేమో సన్నని నీలిరంగు వెలుతురు పొగ చారికలు చారికలుగా పైకి కదులుతూ వెళ్లసాగింది.

మక్కరొట్టెలు కాలుస్తున్న పచ్చివాసన ముందుగానే పలకరించింది.

పేరు తెలియని అక్షాంశాలు, రేఖాంశాలు అంటూ గిరిగీసుకుంటాం.. గ్లోబుపై ఆనవాలు కూడా పట్టలేని ఈ తండా ఇలా కొండలు, గుట్టలెక్కితేనేగా అగుపడేది..! ఇలా స్థానికత పట్టుతెలిసేది..! అనుకుంటూ.. బురద జారుడుబాటలో పాదరక్షలు జారిపోతుంటే తీసి చేతిలో పట్టుకున్నాను. ఎత్తు ఎక్కడం వలన పిక్కలు పట్టేసినట్లయి రొప్పుతూ.. దగ్గరున్న బండరాయిపై కూలబడ్డాను. గుట్టపైనుంచి చూస్తే చుట్టూ చిక్కని పచ్చని వనం.. ఒకవైపు మొండివాగు పాయ, మరోవైపు నల్లవాగు ఝరి.. ద్వీపం లాంటి ఈ గుట్టపై బైరాపూర్ తండా..

రేపు నేను ప్రారంభం చేయబోయే ప్రాథమిక పాఠశాల స్కూల్ రిజిస్టర్ నా సూట్‌కేస్‌లో అల్లావుద్దీన్ అద్భుత దీపంలా తనలో ఎవరి పేర్లు ఎక్కుతాయో చూద్దామన్నట్టుగా నిరీక్షించసాగింది.అటూ ఇటూ దూరంగా.. దగ్గరగా.. ఎత్తుగా పల్లంలో పాకలు.. వెదుళ్లపాకలు.. గుడ్డిదీపాలు.. దూడమూతి పచ్చి పాలవాసన లాంటి ఆ తండా.. ఆరనిమంటల కథలకు కేంద్రంలా అనిపించింది.

మాగన్నుగా నిద్రించిన నాకు ఉదయం పూట ఎవరో చెద్దరు బలంగా లాగుతున్నట్టయి చప్పున మెలకువ అయ్యింది. నా మొహంలో మొహం పెట్టి చూస్తున్న తొర్రిపళ్ల చిన్నారులు, ముక్కుపుడక, కాళ్లకు కడియాలు, చేతులకు వెండిగాజులు.. చిరుగడ్డంపై పచ్చబొట్లు.. రెండు రిబ్బన్లు వీస్తున్న గాలికి ఊగుతుంటే.. అసలుసిసలైన బంజారా బాలికలు. నా మొహం ఆనందంతో విప్పారింది.. ఆ ఆకుపచ్చ చందమామలను చూడగానే..

వారి కళ్లలో పసితనం.. వదనంలో నిర్మలత్వం చూడగానే గొప్ప ఉత్తేజపు అలజడి నాలో.. బంజారా మహిళలు, మగవాళ్లు వ్యవసాయ పనుల్లో, మూగజీవాల్ని మేపుక రావడంలో పగలంతా అడవిబాట పడితే, ఇంట్లోనున్న ఎడపిల్లల్ని సాకడానికి జవసత్వాలుడిగిన వృద్ధులను కనిపెట్టుకొని ఉండటానికి ఈ ఆడపిల్లలే ఆధారమని అర్థమవడానికి ఎక్కువసేపు పట్టలేదు నాకు.

లిపిలేని భాష గోర్ బోలి మాట్లాడేవాళ్లకు మన వర్ణమాల, సంఖ్యలు, గుణింతాలు, ఎక్కాలు, సైన్స్ పరిజ్ఞానం, నీతికథలు ఎలా చెప్పాలి? అన్న ఆశ్చర్యార్థక ప్రశ్న నాలో ఉదయించి ఆవిరయ్యింది.అందులో చురుకుగా ఉండే రూప్లి, పీరుబాయి, ఖింణిబాయి అంటే భలే ఇష్టం నాకు.గళ్ల నుడికట్టు జవాబు తెలిసిపోయిందన్న చందాన వాళ్లతో మిళితమై, ముందుగా నేను గోర్ బోలి భాష నేర్చుకుంటే తప్ప వాళ్లకు తెలుగులో చదవడం, రాయడం నేర్పలేననే సూత్రం కొద్దిరోజుల్లోనే అవగతమైంది.వాళ్ల మనసులోకి దూరే రాచమార్గంగా, పిల్లలను బడికి రప్పించే తాయిలంలా వారి స్థానిక భాషే నాకు ఆయువుపట్టు అన్న నిజాన్ని ఇట్టే పట్టేశాను.

రోజూ పీరుబాయి, రూప్లి, ఖింణిలతో మాట్లాడేదాన్ని. వాళ్ల ఇష్టాలు, అభిరుచులు,

కుటుంబం గురించి అడుగుతుంటే ఆ పసికళ్లలో కోటి ఆహ్లాదాలు వెల్లివిరిసేవి. నేను వారి భాషలో మాట్లాడబోయి తడుముకుంటూ తడబడితే తప్పుదిద్ది, ఉచ్చారణను సరిదిద్ది తొ(్రిపళ్లతో తుంటరి నవ్వులు రువ్వేవారు ఆ నెలవంకలు.

'పెండ్లీడు ఆడపిల్లవు.. అక్కడే ఉంటే నీకెలా వివాహం చేయాలి? సంబంధాలు వస్తున్నాయి.. నీవేమీ పలక్కపోతే పోతున్నాయి కూడా.. మధ్యమధ్యలో ఇంటికొచ్చి కన్పించి వెళ్లు!'.. అంటూ అమ్మ మందలింపుతో కూడిన అభ్యర్థన.

వేసవి సెలవుల్లో వెంటతెచ్చే వేసంగి పప్పులు, తండావాసులు అభిమానంతో, ఇష్టంతో ఇచ్చిన అటవీ ఉత్పత్తుల్ని, నెయ్యి, జున్నులాంటివి తీసుకెళ్తే అమ్మ పెదవులపై చిరుదరహాసరేఖ కదలాడేది. లెక్కలేని దయాభావం, కృతజ్ఞతతో వారు అలా నా దోసిలి నింపుతూనే ఉన్నారు. వారి ఔదార్యానికి వెలకట్టలేం! సరికదా.. నవనాగరికులమైన మనం వారికి సరితూగలేమనీ అనిపించింది.

మెరుపు మెరిసినపుడు పట్టుకున్న జ్ఞాపకాల ఆనవాలులా అదే అదను అనుకొని నేను వెళ్లినచోట కచ్చితంగా రెండుమూడేళ్లు అయినా పనిచేయాలనీ, అప్పుడే ట్రాన్స్‌ఫర్ అర్హత వస్తుందనీ, ఆ తర్వాతే పెళ్లి అంటూ నిక్కచ్చిగా దాటవేశాను.

వర్షాకాలం రాకముందే ఆ తండావాసులు దగ్గర్లోని మండల కేంద్రంలో సరుకులు కొనుగోలు చేసి తెచ్చుకునేవారు. నేనూ అలాగే.. సరుకులతో బాటు ఆ తండా పుణ్యమాని నాలోని చదువరి మరిన్ని పుస్తకాలను మస్తిష్కంలోకి ఎక్కించుకుంటూ.. నేనూ ఆ అడవికి.. తండాకు అలవాటుపడ్డాను. చీకట్లోంచి చూస్తే తండా గుడిసెలు ఆకారంలేని ముద్దల్లా.. నల్లవాగు.. మొండివాగు నీటిపాయల కదలికలు జలతరంగిణి వాద్యంలా.. రాత్రిపూట అడవిలోంచి వినిపించే జంతువుల వింత శబ్దాలకు నిర్భయంగా నిద్రించడం నేర్చుకున్నా!

చంప్లీ ఆతిథ్యంలో.. అజ్ఞాతవాస చంద్రోదయాలు.. అరణ్యవాస సూర్యోదయాలు చూడటం నేర్చుకున్నా!

తూరుపుగాలి కోస్తుంటే పెచ్చులూడిన గుడిసె గోడలు, బీటలువారిన మట్టి వాకిండ్లు, అడవితీగ వనాల ఆదివాసీ మూలాలను దర్శిస్తున్నా!

అక్షరాలను దిద్దమంటే బుర్రగోక్కునే రూప్లి.. 'అమ్మ ఏది? (యాడి కత్?)' అని ఏడ్చేది. కొద్దిగా పెద్దదైన ఖింణి మాత్రం ఏకసంథాగ్రాహి.. చెప్పిందే తడవుగా మందనుంచి విడిపోని లేగదూడలా బుద్ధిగా నాదారికి వచ్చేది. ఏవో నాకున్న కొద్దిపాటి ఆలోచనల కాల్వలతో భయపెట్టే సిలబస్‌ను సరళీకృతం చేసేదాన్ని. ఎండుమక్కలు, పెసర్లు, ఎర్రకందుల్ని చార్ట్‌లపై అతికించి వర్ణమాలను, సంఖ్యామానాన్ని వర్ణరంజితం చేస్తే.. ఇంద్రమాలికలా వారి కళ్లలో ఫెటీల్‌మని ప్రతిఫలించిన ఆశ్చర్యంతో.. స్తబ్ధతను వీడుతూ మెల్లిమెల్లిగా రాయడం, చదవడం నేర్చుకోసాగారు చిన్నారులు.

ఓరోజు కట్టతెగిన తటాకంలా ఏడుస్తూ వచ్చింది ఖింణి. పీరు అక్కకి నల్లతేలు కుట్టింది. గుడిసెలో ఉంది. కడుపునొప్పి దానికి.

'పీరు బాయిన కాలో విచ్చు కాటో, ఓణ్ పేటేమా దూగ్రీ కచ" అంది వెక్కుతూ..

'వద్దు.. ఆ వైపు వెళ్లవద్దు!" అన్నారు తండా పెద్దలు..

ముట్టడినో.. కట్టడినో ఛేదించుకుంటూ వెళ్లాలని ఉన్నా.. నా ఏకాంత ద్వీపవాసం ఇలా.. నాకు అడ్డుకట్ట వేసింది. నాకు తెలుసు నాముందు ఉన్నది చీకటిలోని బావి అని.. నాలాంటి వాళ్లకే కనిపించే బావి అది! కనిపించడం నా తప్పుకాదు గదా!

'ఆ అమ్మాయికి మైల రోజులు.. ముట్టుడు ఇది మా ఆచారం (ఈ హమార్ రివాజ్ ఛ) ఎవరైనా రుతుస్నాత అయితే అక్కడే ఉండాలి. అన్నం, నీళ్లు అక్కడే (ధాణ్ పాణి ఒత్తజ్) ఇది ఇక్కడి నిర్బంధ బహిష్కరణ!" అంటూ తండాపెద్ద లంఖ్యానాయక్ హుంకరించాడు.

మరో రెండురోజుల్లో ఆ పిల్లకు నిలువెల్లా విషపు జెరం సోకి శరీరం ఉబ్బిపోయి మరణించింది. కట్టుబాట్ల పేరుతో నిండుప్రాణాన్ని బలిగొన్న అనాచారానికి దుఃఖితనయ్యాను. ఖింణి వదనంపై విషాద వీచికలు.. మ్రాన్పడిపోయింది.. మరో వారం రోజులకు గానీ మామూలు కాలేదు ఆ అమ్మాయి.

వన్యమృగాల దాడి, అంటువ్యాధులు, గర్భిణుల ప్రసవవేదన, అకాల మరణాలు.. అలా ఆ తండాలో మరో ఐదారు మరణాలు సంభవించాయి. గుండె పగిలేలా ఆక్రోశిస్తూ నేను.. వాటన్నిటికీ సాక్షీభూతమై నిలిచాను.

అయినా.. అన్నిటినీ కళ్ల గవాక్షాలకవతల విసిరిపారేస్తూ.. మొక్కవోని ఆశతో.. గుండె చిక్కబట్టుకొని ప్రతీ వేసవి సెలవుల అనంతరం పిల్లలకు అవసరమైన నోటుబుక్కులు, పెన్నులు, తెల్లకాగితాలు తెచ్చేదాన్ని.

నాకు అవసరమైన రంగుల చాక్‌పీస్‌లూ, ఓ నల్లబల్ల, మరికొన్ని రిజిష్టర్లను పోగు చేసుకొని.. ఆ ఏకోపాధ్యాయ పాఠశాలలో ఓ అడుగు ముందుకేసి కాస్తో కూస్తో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచగలిగాను.

అలా ఓ మూడు వసంతాల కష్టం పిమ్మట.. నా పోస్టింగ్ జిల్లాకేంద్రానికి సమీపంలోని.. బస్ రూట్ గల గ్రామంలో వేసేసరికి ఊపిరి పీల్చుకున్నాను. నా కంటే అమ్మ ఆనందం రెట్టింపు అయ్యింది అనడం సబబు.. పెట్టే, బేడా సర్దుకొని అడవి బిడ్డలకు ఆఖరి వీడ్కోలు పలుకుతుంటే.. ఖింణి నా చీర కుచ్చిళ్లలో తలదూర్చి..

'మీరెల్లొద్దు టీచర్ (తూ జో మత్ టీచర్)!" అంది సజల నయనాలతో.

తల్లి ఆవునుంచి విడిపోయిన లేగదూడలా బెంగటిల్లుతూ నా చేయిని వదలనంటున్న రూప్లి చూపుల స్వచ్ఛతకు.. ఒక క్షణం వివశురాలైనప్పటికీ.. మార్పు అత్యంత సహజమన్న మది అలజడే గెలిచింది.

'రాంపూర్.. రాంపూర్.. దిగండి!" అంటూ ఆర్వో గొంతు పీలగా వినిపించేసరికి ఈ లోకంలోకొచ్చి పడ్డాను. ఒక్క కుదుపుతో బస్సు రాంపూర్‌లో ఆగింది.

చుట్టూ ఎర్రరేగడి మట్టిదిబ్బలు.. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల రెండుగదుల

భవనంలో మా పోలింగ్ బూత్‌లు.. పక్కనేనున్న ఆఫీస్ రూమ్, స్టాఫ్ రూంలో మా బస ఏర్పాట్లను గ్రామస్తులు గావించారు.
మొత్తం ఆరుబూత్‌లు. ప్రతీబూత్‌కు మున్నైకి మించని ఓట్లు. రెండవబూత్‌లో వార్డ్ మెంబర్ ఏకగ్రీవ ఎన్నిక అయ్యారని కేవలం గులాబీరంగు సర్పంచ్ బ్యాలెట్ మాత్రమే ఇవ్వాలి అంటూ.. మధ్యాహ్నం రెండు వరకే ఎన్నికల సమయం.. భోజనానంతరం కౌంటింగ్ ప్రక్రియ షురూ! ఆనక సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రమాణ స్వీకారాలు అన్నీ ఐదుగంటల వరకు అయిపోతే.. మిగతా గ్రామాల సిబ్బందిని ఎక్కించుకొని మండల కేంద్రానికి మనం చేరుకోవాలంటూ.. ముందే సిద్ధం చేసుకున్న ప్రణాళికలను మా ముందు ఉంచాడు ఆర్వో. రెండుగదుల ప్రాథమిక పాఠశాలలో ఒక్కోగదిలో మూడు బూత్‌లు..

మండల కేంద్రంలో బ్యాలెట్ బాక్సులను తుదివిడతగా చెక్ చేసి బస్‌లోకి ఎక్కుతున్న క్లాస్ ఫోర్ ఎంప్లాయి కాళిదాస్‌ని నాకు క్లర్క్‌గా వేసి చేతులు దులుపుకొన్నారు అధికారులు. నాకు అలాట్ అయిన క్లర్క్ ఇంకా రిపోర్ట్ చేయలేదు. మూడు ఫేజ్‌లలో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు, వరుసపెట్టి అందుతున్న ఆర్డర్లకు సిబ్బంది సరిపోవడం లేదు అన్నదానికి ఈ సంఘటనే మచ్చుతునక.. కొంతమంది లేట్‌గా వెళ్తారు. రిజర్వ్ డ్యూటీ ఉంటుందన్న లేజీ భరోసా సాకు కావొచ్చు.
సమయం అయిపోవస్తున్నదని.. ఒకవేళ పోలింగ్ క్లర్క్ గనుక వస్తే అతణ్ని రిజర్వ్‌లో ఉంచి మరుసటి రోజైనా పంపించగలమన్న హామీతో చేతులు దులుపుకొన్న అధికారుల మెలకువలకు 'ఔరా!' అనుకోక తప్పలేదు నాకు..
గత్యంతరం లేక కాళిదాస్‌కు.. బ్యాలెట్ ఎలా చింపాలి, ఎలా మడవాలి, ఇండెలిబుల్ ఇంక్ ఎడమ చూపుడు వేలిపై ఎలా పెట్టాలి అని.. వివరంగా చెప్పి, ఉదయం ఏడు లోపలే పోలింగ్ సామగ్రి అంతా సర్దుకొని కూర్చున్నాం.

అన్ని బూత్‌లను కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లుగా చుట్టబెడుతున్న మా ఆర్వో గంటగంటకోసారి వచ్చి.. మేల్, ఫీమేల్ ఓటర్ల సంఖ్య అడుగుతూ, ఫోన్‌లో.. తన పై అధికారులకు ఈ వివరాలను మెసేజ్ చేయసాగాడు.
కాళిదాస్ నుదుటన చెమటను తుడుచుకుంటూ ఓసారి ఆర్వో దగ్గరకెళ్లి అర్జంట్ ఫోన్ చేసుకొని వస్తానంటూ వెళ్లడం, వచ్చాక మరింత నర్వస్‌తో.. ఆందోళనగా పనిచేస్తూ ఇండెలిబుల్ ఇంక్ కాస్తా ఒలకపోయడంతో నాకు కోపం తారస్థాయిలో పెరిగిపోయింది.
అదిగో! అప్పుడే మా పోలింగ్ గదిలోకి..

అడవిమల్లెల పరిమళం గప్పున వ్యాపించగా గజ్జెల చప్పుడుతో.. గులాబీరంగు పెద్ద లంగా (ఫేట్యా), గవ్వలు, పూసలు, వెండిరూపాయలతో కుట్టిన ప్రత్యేక పైట (టుక్రి), తలనిండుగా కప్పుకొన్న చిక్కని రంగుదారాల అల్లికతో మెరిసిపోయే ఆకుపచ్చరంగు గూంగట్, అదేరంగు పెద్దపెద్ద మెరిసే అద్దాలతో కుట్టిన జాకెట్ (కాళి) మోచేతులవరకు అలంకరించుకున్న ఏనుగుదంతపు గాజులు, నున్నని తల చెంపలపైదాకా దువ్వి జారవిడిచిన పెద్దపెద్ద జుంకీలు, సంపెంగ ముక్కుపై ముచ్చటగా ఒదిగిపోయిన ముక్కుపుడక (పూళి) తీరైన అవయవ సౌష్టవంతో.. పచ్చని పసిమి ఛాయలో ఓ రూపసి

అడుగిడింది.
గదిలో పరుచుకున్న పరిమిత విద్యుత్ కాంతిలో ఆమె వనదేవతలా శోభిల్లింది. ఆ కాంతి తన ముఖంపై సగం పడుతూ ఉంటే, అవాక్కయిన నా ముఖ కవళికలను సరిపోల్చుకొని ఆహ్లాదకరమైన నవ్వుతో.. ఆ అమ్మాయి నా టేబుల్ దగ్గరికి వచ్చి..
'మేడంజీ! గుర్తుపట్టారా? నేను ఖింణిబాయి. (హొరదేచ్చుక మ ఖింణి).. వోటర్ నంబర్ ఇరవైమూడు!" అంది గోర్ బోలి ఆనందాన్ని గొంతులో రంగరిస్తూ..

సగం తెరిచిన నాకళ్లలో ముందుగా నమ్మలేనిది అన్న ఆశ్చర్యం.. ఆ తర్వాత సత్యం బోధపడింది అన్న కదలిక.. సూచనగా..!
తేరుకున్న నేను తన ఓటర్ స్లిప్ నెంబర్, ఓటర్ పేరు సరిచూసుకొని, ఆధార్ కార్డ్ నంబర్ రాసుకొని, ఆ అమ్మాయి సంతకం తీసుకొని, బ్యాలెట్ ఇష్యూ చేశాను. కాళిదాస్ ఇంతలో టేబుల్ క్లీ న్‌చేసి ఉన్న కాస్త ఇండెలిబుల్ ఇంక్‌ను సర్దుతూ..
'మాది పక్కనేనున్న శాంతాపూర్. కేవలం మూడు కిలోమీటర్లే మేడం.. నేను వెళ్లి అక్కడ ఓటు వేసిరావాలి. మా అమ్మ సర్పంచిగా నిలబడింది అక్కడ!" అన్నాడు బెదురుతున్న కళ్లతో..
అతడి అర్జంట్ ఫోన్ కాల్స్ రహస్యం వీడిపోయింది. ఖింణిబాయి ఓటు చివరిది.. ఇంకెవరైనా వస్తే చూసుకోవచ్చునన్న నమ్మికతో ఎంతైనా.. ఓటు వజ్రాయుధం కదా.. అతణ్ని పంపక తప్పలేదు నాకు. తొందరగా రావాలన్న షరతు మాత్రం విధించాను.
ఖింణిబాయి ఓటువేసి వచ్చి చేతులు జోడించింది అభిమానంగా. కనుబొమలతో ప్రోత్సాహకమిస్తూ.. ఎలక్షన్ అయ్యాక మాట్లాడదామని పంపించాను.
మరో అరగంటలో కాళిదాస్ వచ్చేశాడు. గట్టిగా ఊపిరి పీల్చుకున్నాను. దాదాపు తొంభై శాతం ఓట్లు పోలయ్యాయి.
బ్యాలెట్ బాక్సులకు సీలువేసి తెల్లటి గుడ్డసంచీలో దించి కుట్లువేసి మా పోలింగ్ బూత్ నెంబర్ అతికించి, నా సంతకాలు చేసేశాను.
అన్ని బూత్‌ల బ్యాలెట్ బాక్సులను ఆర్వోగదిలో పోలీస్ ఎస్కార్ట్‌తో ఉంచి భోజనాలకు వెళ్లాం మేమంతా..

మధ్యాహ్నం రెండు తర్వాత ఆర్వో ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్సుల సీళ్లు విప్పి ఒక్కో ప్రిసైడింగ్ ఆఫీసర్ సమక్షంలో.. ప్రిసైడింగ్ ఆఫీసర్ డైరీ ప్రకారంగా పోలైన ఓట్ల లెక్కింపులు జరగసాగాయి.
ఖింణిబాయి మిగతా వార్డు మెంబర్లు, ఆ తండా పెద్దమనుషులు నలుగైదుగురు అక్కడే నిలబడి ఓటింగ్ సరళిని సమీక్షించసాగారు. మొదటినుంచీ ఖింణీదే లీడింగ్! ట్రైబల్ మహిళా రిజర్వేషన్‌లో రాంపూర్ ప్రథమ మహిళగా ఖింణీబాయి సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసింది. తనతోబాటే ఉపసర్పంచ్ ఎన్నిక, ప్రమాణస్వీకారాలు పూర్తయ్యాయి. రిజిస్టర్‌లో సంతకం చేశాక.. సంతోషం పట్టలేక ఖింణీ నన్ను గట్టిగా కౌగిలించుకుంది. వనం మైసమ్మ పచ్చిగడ్డి మోపుల వాసనతో ఉక్కిరిబిక్కిరయ్యాను.

బయట ఎదురుచూస్తున్న మీడియాతో ఖింణి మాట్లాడుతూ.. తాను పబ్లిక్

అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశాననీ, చదువు అయ్యాక తనకు రాంపూర్ వాసి బంశ్యానాయక్‌తో పెండ్లి జరిగిందని, తగిన పత్రాలతో తన ఓటు హక్కును బైరాపూర్ తండానుంచి ఇక్కడి రాంపూర్ గ్రామపంచాయతీకి మార్పించుకున్నానని చెప్పింది.
బైరాపూర్ తండాకు ఇప్పటికీ సరైన రహదారి లేక అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉండిపోయింది అంటూ..
విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలకు నోచుకోని తమ తండావాసుల గోడు ఎన్నేళ్లయినా ఇంతేనా? అంటూ ఆవేదన పడింది. చదువు విలువ తెలిసిన తెలివైన భర్త లభించడం తనకు ఒక గొప్ప వరమైతే.. తాను చిన్ననాడు విన్నపాఠం మూడంచెల స్వపరిపాలన అంటే తనకు ఎంతో ఇష్టమని.. గొప్పగా చదువుకొని తండా పెద్దగా మన్ననలు అందుకోవాలన్న ప్రేరణను ఆ పాఠం కలగజేసిందంటూ..
చదువుకోవాలన్న తమ తపనకు పాదులు చేసి నీళ్లు పోసి బతికించిన తన టీచరే తనకు ప్రేరణ అంటూ ఆర్ద్రంగా మెత్తబడిన కంఠంతో పలికింది.

జీరో ఎన్‌రోల్‌మెంట్.. అంటూ ఇటీవల మూతబడిన తమ తండాల్లోని పాఠశాలలను.. రీ ఓపెన్ చేయిస్తానని, డ్రాపవుట్ పిల్లలనూ తిరిగి చదువులమ్మ ఒడికి పంపించాలని, తమ తండాల్లోని బాలికల విద్య కోసం స్పెషల్ గర్ల్స్ ప్రైమరీ స్కూల్‌ను భవిష్యత్‌లో ఏర్పాటు చేసుకుంటామని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్తున్న.. ఆమె మాటల్లోని ధీరత్వంలో వనం సూర్యుడి తేజం.. అక్బర్‌ను ఎదిరించిన గోండురాణి దుర్గావతి శౌర్యపరాక్రమాలు ప్రతిఫలించసాగాయి.
ఈ వెచ్చటి సూర్యాస్తమయ కాంతిలో ఆమె ఒక కంటిలో ఆరని జ్వాలను.. మరొక కంటిలో సతత హరిత వనాలను దర్శించసాగాను.
ఖింణి మాటల్ని అక్కడి తండా రిపోర్టర్ యువకుడెవరో వీడియో తీసి, లోకల్ న్యూస్ చానెల్‌కు పంపిస్తున్నాడు. కాళిదాస్ వదనం కోటి వసంతాలతో వెలిగిపోసాగింది.

'మేడం మా అమ్మ గెల్చింది!" అన్నాడు ఆనందం పట్టలేక.. అతనికి అభినందనలు తెలుపసాగారు అందరూ..
ఖాళీ అయిన బ్యాలెట్ డబ్బాలను విధిగా బస్‌లోకి ఎక్కించసాగాం.. మదినిండిన బోలెడన్ని సంతోషాలను మూటగట్టుకొని మండల కేంద్రంవైపుగా మా ఎన్నికల బస్సు పరుగులు తీసింది. నా చేతిలో ఖింణి ఇచ్చిన వారి సంప్రదాయ లడ్డూ.. ఎలాంటి అరమరికలు లేకుండా, హేతుబద్ధంగా, సముదాయింపుగా, అటు ప్రకృతినీ, ఇటు మానవ ప్రకృతిని పూర్తిగా ఆహ్వానిస్తూ దేనిని, వేటినీ, ఎవరినీ తోసిపుచ్చకుండా, నేలమీదే నిలుస్తూ.. నిలబడుతూ.. ఎటో తేలిపోకుండా వారి ఆచారాలు, సంస్కృతిని పరిరక్షించుకుంటూ, భేషజాలు లేని స్వచ్ఛమైన ఆ ఆదివాసీ తండాల తేనెజల్లు నా మదిలో మధుర సుధలై కురియసాగింది.

అవును.. ముప్పై ఏళ్లు ముందుకీ, వెనక్కీ నెట్టబడిన ఈ జ్ఞాపకాల ముక్కలా అస్తవ్యస్తపు సముదాయమే గడిచిన జీవితం కాబోలు..
మా బస్సు మెల్లగా ఎర్రరేగడి మట్టిదిబ్బ రోడ్డు పక్కన ఉన్న పాక హోటల్ నుంచి అటువైపు వెళ్తోంది.. ఎర్రటి దుమ్మును ఛేదిస్తూ.. హారన్ మోగిస్తూ.. నిగనిగలాడే తారురోడ్డు ఎక్కాలన్న తాపత్రయం దానిది..
వ్యక్తిగతం.. వృత్తిగతమంటూ.. బహుపాత్రల్ని పోషించే ఈ బోహీమియన్ జీవితంలో ఊపిరి

సలపలేనంత పని..
కాలువగట్టు వెంబడి వేసిన పాలకూర మళ్లను.. అంగార వర్ణంతో మెరిసిపోయే సాయం సంధ్యా సూర్యుడిని చూస్తూ.. సాంత్వన పొందసాగాను.
విద్యార్థులంతా తమతమ నిండైన వ్యక్తిత్వాలతో కాలం ఫ్లోలోకి వెళ్లి పోయి స్థిరపడిపోతుంటే.. ఆ సంతోషంతో గొప్పగా రీచార్జ్ అవసాగాను.
ఆకులపై రాలిన చినుకుల అలికిడి నాలో.. తన తండాకై చేసిన సోగణ్ (ప్రమాణం) గెలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ.. గెలిచి నిలిచిన వనం ఆకుపచ్చని చందమామ..! చల్లని వెన్నెల కిరణం.. ఖింణీబాయికి అభినందనలంటూ..

'వద్దు.. ఆ వైపు వెళ్లవద్దు!" అన్నారు తండా పెద్దలు..ముట్టడినో.. కట్టడినో ఛేదించుకుంటూ వెళ్లాలని ఉన్నా.. నా ఏకాంత ద్వీపవాసం ఇలా.. నాకు అడ్డుకట్ట వేసింది. నాకు తెలుసు నాముందు ఉన్నది చీకటిలోని బావి అని.. నాలాంటి వాళ్లకే కనిపించే బావి అది! కనిపించడం నా తప్పుకాదు గదా!'ఆ అమ్మాయికి మైల రోజులు.. ముట్టుడు ఇది మా ఆచారం ఎవరైనా రుతుస్నాత అయితే అక్కడే ఉండాలి. అన్నం, నీళ్లు అక్కడే! ఇది ఇక్కడి నిర్బంధ బహిష్కరణ!" అంటూ తండాపెద్ద హుంకరించాడు.

జీరో ఎన్‌రోల్‌మెంట్.. అంటూ ఇటీవల మూతబడిన తమ తండాల్లోని పాఠశాలలను.. రీ ఓపెన్ చేయిస్తానని, డ్రాపవుట్ పిల్లలనూ తిరిగి చదువులమ్మ ఒడికి పంపించాలని, తమ తండాల్లోని బాలికల విద్య కోసం స్పెషల్ గర్ల్స్ ప్రైమరీ స్కూల్‌ను భవిష్యత్‌లో ఏర్పాటు
చేసుకుంటామని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్తున్న.. ఆమె మాటల్లోని ధీరత్వంలో వనం సూర్యుడి తేజం.. అక్బర్‌ను ఎదిరించిన గోండురాణి దుర్గావతి శౌర్యపరాక్రమాలు ప్రతిఫలించసాగాయి.

***

## బి.కళాగోపాల్

రచయిత్రి బి. కళాగోపాల్. పుట్టి పెరిగింది నిజామాబాద్. ఎం.ఎ (ఇంగ్లిష్), బీఈడీ చేశారు. ప్రస్తుతం ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. పుష్కరకాలంగా కవితలు, కథలు రాస్తున్నారు. వీరు రాసిన 50 కథలు, 550కిపైగా కవితలు వివిధ వార, మాస, సాహిత్య పత్రికలలో ప్రచురితమయ్యాయి. వాటిలో 20 కథలు, అనేక కవితలు.. వివిధ సందర్భాల్లో అవార్డులను పొందాయి. నిజామాబాద్ రేడియో ఎఫ్ఎంలో 20కిపైగా కథానికలు, 40కిపైగా వ్యాసాలు ప్రసారమయ్యాయి. 25 వ్యాసాలు వివిధ పత్రికల్లో వచ్చాయి. 2015లో వీరి కవితా సంపుటి 'మళ్లీ చిగురించనీ', 2022లో ప్రథమ కథాసంపుటి 'కొత్తఊపిరి' ప్రచురించారు. రాధేయ, ఎక్స్‌రే, ఖిలాయ్వాణి, కలహంస, భూమిక, సాహితీకిరణం, ద్వానా, వాల్మీకి, మల్లెతీగ, గుర్రంజాషువా, వాసాప్రభావతి, కవి సంధ్య వారి నుంచి కవితా పురస్కారాలు అందుకున్నారు. **94416 31029**



# ఆర్తి

**అనిసెట్టి శ్రీధర్**

రెండు పెళ్లిళ్లు ఉన్నాయి.. ఐదారు రోజుల వ్యవధిలో. రెండూ వెళ్లవలసినవే. కొన్నేళ్ల క్రితం వరకూ అయితే ప్రతి సంవత్సరం కనీసం రెండుసార్లు సొంతూరికి వెళ్లేవాడు చంద్రకాంత్. వారం రోజుల ప్రయాణానికి సిద్ధమవ్వాలి ఇప్పుడు. ఒకరోజు హైదరాబాద్‌లో మిత్రుల్ని కలవొచ్చు. ఒకరోజు తిరుపతి. మిగిలిన సమయం ఏం చెయ్యాలా!? అని ఆలోచిస్తూ ఉండగా.. ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ స్నేహితుడు శశాంక్ పంపిన ఒక వీడియోతో సమాధానం దొరికింది. శశాంక్ జేఎన్టీయూలో ఇంజినీరింగ్ చదివేటపుడు సహాధ్యాయి. చాలారోజుల తర్వాత ఈమధ్యే మళ్లీ టచ్‌లోకి వచ్చాడు. వాళ్ల ఊరి పొలిమేరల్లో బర్డ్ సాంక్చుయరీ ఏర్పాటు చేశారట. ఆ వివరాలతో వీడియో షేర్ చేశాడు. చంద్రకాంత్‌కు బాగా నచ్చింది. అక్కడికి వెళ్లాలని ఉందంటూ సందేశం పంపాడు.. శశాంక్‌కి. 'తప్పకుండా వెళ్లు. నీకు నచ్చుతుంది. రెండ్రోజులు ఉండిరా! మా భాను అక్కడే ఉంటాడు. నీకు అన్ని ఏర్పాట్లుచేస్తాడు" అని ఫోన్ చేసి చెప్పాడు శశాంక్.

శశాంక్ తల్లిదండ్రులు ఆ ఊరిలోనే ఉంటారు. భాను తనకు శశాంక్ వాళ్ల ఇంట్లోనే మకాం ఏర్పాటు చేస్తాడని ఊహించలేదు చంద్రకాంత్. విశాలమైన లోగిలి, పెద్ద పెరడు. ఈమాత్రం జాగా ముంబైలో ఉంటే పది అంతస్తులు కట్టేసి ఒక అరవై కుటుంబాలు ఎవరికివారు ఇంకొకరితో పట్టనట్టుగా బతికేస్తుండేవారు. అన్నీ అధునాతనమైన వస్తువులతో ఇంటిని నింపేసినట్టున్నాడు శశాంక్. ఈ పాత ఇంటిలో మేము ఇమడలేకపోతున్నాం అన్నట్టు ఉన్నాయి.భోజనాలు అయ్యాయి.తను పోగొట్టుకున్నదేదో చంద్రకాంత్ ముఖంలో కనిపించినట్లు చూస్తున్నారు సుందరమ్మగారు.

'మా శశాంక్, నువ్వూ కలుస్తుంటారా బాబూ" అని అడిగింది.

'ఈ అబ్బాయి ఉండేది ఆస్ట్రేలియాలో కాదు సుందరీ. ముంబైలో" భాస్కరంగారు సర్ది చెప్పారు

'వీడియో కాల్స్ చేస్తుంటాడు" అందామె ఏదో సంజాయిషీ చెబుతున్నట్టు.

అందమైన ఆకృతితో పుస్తకాలు నిండుగా నింపుకొన్న ర్యాక్ ఒకటి ఉంది. దానిమీద చెయ్యి వేస్తూ..

'ఆన్‌లైన్‌లో ఎన్ని పుస్తకాలు ఉన్నా ఈ తృప్తి రాదు" అని నవ్వాడాయన. ఆ నవ్వులో జీవం లేదు. అప్పుడే భాను వచ్చాడు. ఇద్దరూ గ్రామంలో నడుస్తున్నారు. ఊరి పొలిమేరలో ఉన్న

బర్డ్ సాంక్చుయరీ దగ్గరకి వెళ్లడానికి భాను మోటార్ సైకిల్ తెస్తానంటే చంద్రకాంత్ వద్దన్నాడు. పదబంధ ప్రహేళికలో ప్రతి మూడు, నాలుగు గడులకు ఒక సుడి ఉన్నట్టు కొన్ని ఇళ్లకు తాళాలు పెట్టి ఉన్నాయి. విదేశాల్లో స్థిరపడ్డ యువత తమ తల్లిదండ్రుల్ని హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు సామానుతోపాటు ప్యాక్ చేసి తరలించేశారు. దారిలో చాలామంది.. 'ఎవరు?' అన్నట్టు భానువైపు చూశారు. కొత్తముఖం కనిపిస్తే మరి ఆశో, ఆసక్తో.

'భాస్కరం మావయ్య వాళ్ల శశాంక్ లేదూ.. తన స్నేహితుడు"

చంద్రకాంత్‌ని నిలబెట్టేసి తమ పిల్లలు ఏ దూరతీరాల్లో ఉన్నదీ చెప్పుకొన్నారు వాళ్లంతా. 'ఇది మా ఇల్లు".. కొంచెంసేపు కూర్చున్నారు. పక్షుల ఫొటోలతో తయారుచేసిన ఆల్బం చూపించాడు. అద్భుతంగా ఉంది. ఇళ్ల బయట నులక మంచాలు వేసుకుని కూర్చున్నారు కొందరు. కొన్ని ఇళ్లలో టెలివిజన్ సెట్లు మోగుతున్నాయి. కళ్లపై ఎండ పడకుండా చెయ్యి అడ్డం పెట్టుకుని చూసే ముదుసలిని చూస్తే.. 'పదని వాన, రాని అతిథి' కోసం చూస్తున్నట్టు అనిపించింది చంద్రకాంత్‌కి. కొన్ని స్కూటర్లు; ఒకటీ, రెండు కార్లు వాళ్లను దాటి వెళ్లాయి. సంరక్షణ కేంద్రానికి వెళ్లాలంటే ఊరి గుండానే వెళ్లాలి.

'ఆదివారం కదండీ.. సందర్శకుల తాకిడి ఎక్కువే ఉంటుంది" చెప్పాడు భాను.

ఆ ఊరే కాకుండా చుట్టుపక్కల పల్లెలనుండి పట్నాల్లో, విదేశాల్లో స్థిరపడిన యువత కూడా పక్షుల్ని చూడటానికని ఈమధ్య పిల్లా పాపలతో వస్తున్నారు. ఆ విశేషాలను తమ సోషల్ మీడియాలో పంచుకోవడం గొప్పగా అనిపిస్తోంది వాళ్లకు.

ఒక ఇంటి ముందు బెంజ్ కారు ఆగి ఉంది. భాను కజిన్ అట. అమెరికా నుండి వచ్చాడు. కొన్ని ఇళ్లలో గతంలో పాడిపశువులు ఉన్న గుర్తులతో కొట్టాలు కనిపించాయి. ఒక్కో ఇంటిలో జనాభా తగ్గిపోవడంతో చేసేవాళ్లూ లేరు, అవసరమూ లేకపోయింది.

ఈ అనుభవం మరలా రానిది అన్నట్టు నెమ్మదిగా నడుస్తున్నాడు చంద్రకాంత్.

ఎద్దుల బళ్ల జాడే లేదు, మువ్వల సవ్వడీ లేదు. కమ్మరులూ లేరు. ఒక గానుగ మూతపడి ఉంది. ఫలానా కాలంలో వెల్లివిరిసిన నాగరికతకు చిహ్నంగా మిగిలిపోతాయేమో శిథిలమవుతున్న పల్లెలు.

సందర్శకుల వల్ల చిన్న హోటల్ దగ్గర వ్యాపారం బాగానే సాగుతోంది. అమ్మవారి ఆలయంలో ఒకామె మెట్ల మీద కూర్చుని పూలమాల కడతా ఉంది. అవసరమైనంత మంది పిల్లలు లేరని బడి మూసేశారట. ఉన్న పిల్లల్ని ఇక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలోని మరో బడిలో చేర్చారు. పూరించలేని ఖాళీలు దర్శనమిస్తున్నా.. చంద్రకాంత్ పల్లె అందాన్ని ఆస్వాదిస్తూనే ఉన్నాడు. తెగిపోయిన తీగె కూడా ఏదో ఒక రాగం పలికిస్తుందేమో. అసంపూర్ణ చిత్తరువులో కూడా ఆత్మ గోచరిస్తోంది. గాలి గతకాలపు పరిమళాన్ని ఇంకా మోస్తున్నట్టే ఉంది.

'పండక్కి రాము వస్తాడా.. పెద్దమ్మా?" ఒక

పెద్దావిడని పలకరించాడు భాను.

'వాడు అమెరిక బోయినంక ఎప్పుడొచ్చినడు? బాగ సంపాయించుకున్నడు. రెండో, మూడో ఇళ్లుండాయి. రెండేళ్ల కిందొచ్చి గొడవేసుకుని పాలే. అంతే ఇగ రాలె." ఇప్పుడు తాటాకులు అవసరం లేవని పొలం గట్లపై ఉన్న తాటిచెట్లన్నీ కొట్టించేసినట్టు ఉన్నారు, ఎండిన ఆకులు పడి పంట పాడవకుండా. పొలాలు దాటారు. దూరంగా పక్షులు తీస్తున్న రాగాలు వినవస్తున్నాయి. పక్షుల కూతలు, జంతువుల అరుపులతో ఏర్పడినవే సప్తస్వరాలు అంటారు కదా. చెట్ల మీద, ఇసుక తిన్నెలపై, నీళ్లలో.. అదివో, అల్లదివో పక్షుల నివాసము అన్నట్టు ఉంది. పది ఎకరాల విస్తీర్ణంలో చెరువు అల్లంత దూరంలో ఉందనగా ఇనుపకంచె ఏర్పాటు చేశారు.. జనాన్ని నిలువరించడానికి. రకరకాల, రంగురంగుల పక్షులు వేల సంఖ్యలో. జన విస్ఫోటనం మాత్రమే కనిపించే ముంబై నుండి వచ్చిన చంద్రకాంత్ కళ్లముందు ఒక కొత్త ప్రపంచం ఆవిష్కృతమైనట్టు ఉంది. 'చైనా, నేపాల్, హిమాలయాల నుండి పెలికాన్స్, నైజీరియా నుండి పెయింటెడ్ స్టార్క్స్, శ్రీలంక, ఆఫ్రికా నుండి ఓపెన్ బిల్ స్టార్క్స్, దక్షిణాఫ్రికా నుంచి వైట్ ఐబిస్, సైబీరియా, ఆస్ట్రేలియా నుంచి మొత్తం ముప్పై రెండు రకాల పక్షులు వస్తాయి సార్" చెప్పాడు భాను. చెరువు మధ్యలో మట్టిదిబ్బలు, వాటిపై తుమ్మచెట్లు ఏపుగా పెరగడంతో పక్షుల ఆవాసానికి, గుడ్లు పొదగడానికి అనుకూలంగా ఉన్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం అక్కడికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి పక్షులు వలస వచ్చేవి. కానీ అక్కడి చెరువు ప్రైవేట్ వ్యక్తుల అధీనంలోనిది. పెట్టుబడి పెట్టి చేపల చెరువుగా అభివృద్ధి చేశారు.

చుట్టుపక్కల కొన్ని పంటపొలాలూ ఉన్నాయి. పక్షుల ఆహారం కోసం అవి వనంలో కాసిన పళ్లూ, నదుల్లో, సముద్రంలో తిరిగే జలచరాలు కావు కదా! చెరువు లీజుదార్లు, రైతులు పెద్దగా శబ్దాలు చెయ్యడం వంటి పద్ధతులు పాటించి వాటిని తరిమేశారు. భాను వాళ్ల గ్రామం వాటిని అతిథి దేవోభవ అని అక్కున చేర్చుకుంది. వాటివల్ల పంటలకు కొంత నష్టం వాటిల్లినా, నీటికుంటలు కలుషితమైనా వాటిని సంరక్షించారు. ఈ భూమి మీద హక్కు ఒక్క మనుషులకే కాదు అన్ని జీవరాశులకూ ఉంటుందనే ఎరుక పల్లె ప్రజల్లోనే ఎక్కువ అనుకున్నాడు చంద్రకాంత్. సందర్శకులు బాగానే ఉన్నారు. బైనాక్యులర్స్‌తో పక్షులను పరీక్షగా గమనిస్తున్నారు.

'పక్షులకు పాస్‌పోర్ట్, వీసాలతోపాటు గూగుల్ మ్యాప్ కూడా అవసరం లేదు" అన్నాడు భాను.

'పక్షులు సంఘజీవులు"

'మరి మానవులు?"

'సెల్ జీవులు" నవ్వాడు. ఆ ఊరి పిల్లలు ఆదివారాలు అక్కడే ఉంటారు. వాళ్లు తెలుసుకున్నవి, గమనించినవి సందర్శకులకు వివరిస్తున్నారు.

‘పక్షులు నెలల తరబడి ఆగకుండా ఆకాశంలో ఎగురుతూనే ఉండగలవు తెలుసా అండి?” అన్నాడో పిల్లాడు.

‘నిద్ర, తిండి అన్నీ ఎగురుతూనే”

‘వి.. ఆకారంలో ఎగరడం వలన ముందు ఉన్న పక్షి కన్నా వెనుక ఉన్న పక్షికి శక్తి తక్కువ ఖర్చు అవుతుంది. అందుకే అవి పొజిషన్స్ కూడా మార్చుకుంటాయి” అన్నాడు మరో పిల్లాడు.

‘ఈ చెరువుకు ఊరివాళ్లు వాడుకునే చెరువుకు మధ్య తూము ఉండేది. పక్షుల రెట్టలు, మిగిలిన వ్యర్థ పదార్థాలు మా చెరువులోకి రాకుండా అడ్డుకట్ట వేసేశాము. అంటే ఇప్పుడు ఈ చెరువు మీద పూర్తి అధికారం పక్షులదేనన్నమాట” చెప్పాడు భాను.

‘ఆ పక్కన ఇంకో చెరువు ఉంది కదా. అక్కడా పక్షులే కనపడుతున్నాయి?”

‘అదా! ఏ యేటికాయేడు పక్షుల సంఖ్య పెరిగిపోవడంతో చెరువులో మేత సరిపోవడం లేదు. వాటి మధ్య పోటీ పెరిగిపోయింది. అందుకే దానికి దిగువన ఉన్న ఐదెకరాలు పక్షుల కోసం ఇచ్చేశారు”

‘ఎవరా బలి చక్రవర్తి?” ఆశ్చర్యపోతూ అడిగాడు చంద్రకాంత్.

‘ఇందాక బజారులో కనపడిందే. అదే.. వాళ్ల అబ్బాయి రెండేళ్ల క్రితం గొడవ పెట్టుకుని మళ్లీ రాలేదని చెప్పింది. ఆవిడే అండీ”

గొడవ ఎందుకయ్యిందో అర్థమయ్యింది. రాని కొడుకు కన్నా క్రమం తప్పకుండా వచ్చే పక్షులే తనకు వారసులు అనుకుని ఉంటుంది.

‘ఆ భూమి పల్లంలోనే ఉంది కదా. మేమే ఇంకొంచెం తవ్వి చెరువులా చేసి ఉన్న చెరువు నుండి ఆ పొలానికి నీళ్లు పారేలా ఏర్పాటుచేశాం”

రావిచెట్టు చుట్టూ చేసిన చప్టా మీద కూర్చుని ఉన్నారు కొందరు యువకులు. షార్ట్స్, టీ షర్ట్ వేసుకున్న ఒకతను కుర్చీలో కూర్చుని.. ల్యాప్‌టాప్‌లో పనిచేసుకుంటూ మధ్యమధ్యలో మాట్లాడుతున్నాడు. బెంజ్ కారు యజమాని అయ్యుంటాడు. భాను.. చంద్రకాంత్‌ని పరిచయం చేశాడు అందరికీ.

‘చస్! మళ్లీ నెట్‌వర్క్ డౌన్” విసుక్కున్నాడు బెంజ్.

‘ఒరే! మనూళ్లో ఏ వార్తయినా క్షణాల్లో పాకిపోద్ది. మాకు నెట్‌వర్క్ ఎందుకురా” అన్నాడు ఒకడు.

అందరూ నవ్వారు. ఇలాంటి వెటకారాలే పల్లెలకు మిగిలిన అలంకారాలు.

‘అమ్మవాళ్లను అమెరికా రమ్మంటే రారు. ఈ ఐదేళ్లలో ఒక్కసారే వచ్చారు” అన్నాడు.

‘దేవుడి విగ్రహం సంవత్సరంలో ఒక్కపాలే మన ఇళ్ల కాడికి వస్తాదిరా! మనమే రోజూ గుడికి పోవాలె” అన్నాడు భాను.

‘శశాంక్‌గాడు వచ్చి కూడా మూడేళ్లయితలే. పక్షులు వచ్చిన రెండో సంవత్సరం వచ్చినాడు అంతే!”

'పక్షుల్ని చూడటానికి వచ్చినారా సార్'' చంద్రకాంత్‌ని అడిగాడు ఒకతను.
'సమయానికి వచ్చినారు. రేపు చాలా మటుకు పక్షులు ఎల్లిపోతయి. ఈ పక్షులు, ఈ సందడి అంతా మా భాను పుణ్యమే''

పక్షులు రావడం గమనించి భానుయే చొరవ తీసుకుని ఊళ్లో వాళ్లను ఒప్పించడంతో వాటి సంరక్షణ, అవి గూళ్లు పెట్టుకోవడానికి వీలుగా చెట్లు పెంచడం, చెరువులోకి చేప పిల్లల్ని వదలడం ఇలా అన్ని పనులూ చేశారు. ప్రతి సంవత్సరం చెరువులో పెరిగే నాచు, డెక్కని శుభ్రం చేయిస్తాడు. తర్వాత అటవీశాఖ వాళ్ల వెంటపడితే ఈ సౌకర్యాలన్నీ కల్పించారు. గోరంత చేస్తే కొండంత చెప్పుకొనే ఈ రోజుల్లో భాను తనతో ఒక్కమాట కూడా అనకపోవడం..

'అవునా భానుగారూ!'' చంద్రకాంత్ ఆశ్చర్యపోయాడు.
ఎదుటివారి గురించి చటుక్కున ఒక అభిప్రాయానికి రావడం ఎంత తప్పో తెలిసివచ్చింది చంద్రకాంత్‌కి. పెద్దగా చదువు అబ్బని యువతే పల్లెల్లో ఉండిపోతున్నారని అనుకునేవాడు. భాను అలాగే ఊళ్లోనే ఉండిపోయి వ్యవసాయం చేస్తూ దగ్గర్లో ఉన్న మండలంలో వీడియో షాప్ పెట్టుకున్నాడని అనుకున్నాడు. కానీ, భాను బీఎస్సీ అగ్రికల్చర్ చేశాడని తెలిసి ఆశ్చర్యపోయాడు. ప్రయత్నిస్తే ప్రభుత్వ శాఖల్లోనో, బ్యాంక్‌లోనో మంచి ఉద్యోగమే వచ్చేది.

'నేను ఈ ఊరు వదిలి వెళ్లలేను సార్. అది నా బలమో, బలహీనతో తెలియదు. ఇక్కడ ఉంటే నా జీవితం మీద నాకు పూర్తి అధికారం ఉన్నట్టుగా అనిపిస్తుంది. పక్షులపై ఎవరి నియంత్రణా లేనట్టే. మా ఇల్లు ఇక్కడే ఉంది. మీకు పట్నాల్లో దూరంగా ఉంటాయే.. అలా మా ఊరే నాకు ఫామ్ హౌస్''

ఎంతమందికి దక్కుతుంది ఆ అదృష్టం?
పండగకో, పబ్బానికో, శుభకార్యానికో, పలకరింపులకో వచ్చిన వాళ్లు తమ వలస ప్రదేశానికి తిరుగు ప్రయాణం అవుతారు. వలస వచ్చిన పక్షులు తమ తమ స్వస్థలాలకు తిరిగివెళ్లే సమయం వచ్చింది.

ఊరి జనమంతా సరస్సు వద్ద గుమిగూడారు.

రంగురంగుల పువ్వులు ఆకాశంలోకి ఎగరేసినట్టుగా వందలాదిగా పక్షులు గుంపుగా పైకి ఎగిరాయి. మనుషుల్లా వాటికి ట్రాఫిక్ పోలీస్ అవసరం లేదు. అవి చేసే శబ్దాలు ఆతిథ్యం ఇచ్చిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టుగా ఉన్నాయి. పక్షులు వలస వచ్చిన సంవత్సరం వర్షాలు బాగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని వాళ్లకు ఒక నమ్మకం.

తమ ఊరికి జలకళనే కాక; కన్నబిడ్డలు, బంధువులు, పర్యాటకుల్ని సందర్శింపచేసి జనసంద్రపు కళని కూడా ప్రతి శీతకాలం క్రమం తప్పకుండా తీసుకువస్తున్న పక్షులు పితృదేవతల్లా అనిపిస్తాయి. అందుకే చేతులెత్తి నమస్కారాలు

చేశారు. చంద్రకాంత్ తిరుగు ప్రయాణమయ్యాడు.
'మళ్లీ తప్పకుండా రా బాబూ"
'మీరు రమ్మనాలే కానీ ప్రతి సంవత్సరం వస్తా బాబాయ్‌గారూ" అన్నాడు చంద్రకాంత్.
భాస్కరంగారు చేతులు పట్టుకున్నారు. మాట రాలేదు. చంద్రకాంత్ వద్దంటున్నా టౌన్‌లో బస్ ఎక్కిస్తానని తనూ ఆటో ఎక్కాడు భాను.
'మీదీ పల్లెటూరేనా సార్?" భాను ప్రశ్నకి తల ఊపాడు చంద్రకాంత్.
'ఎప్పుడైనా వెళ్తుంటారా?"

ఈ రెండురోజుల నుండి తమ ఊరు గుర్తుకువస్తూనే ఉంది చంద్రకాంత్‌కి. వెళ్లినప్పుడల్లా పని ఉన్నా లేకపోయినా ఊరంతా కాలినడకన అన్ని వీధులూ తిరిగి వచ్చేవాడు. సరిగ్గా పదిహేను నిమిషాలు పట్టదు. నిదానంగా ఒక్కో వీధిలో అన్ని ఇళ్లూ చూసుకుంటూ, తెలిసినవాళ్ల దగ్గర ఆగి కబుర్లాడేవాడు.

'నువ్వు మాత్రం యాడున్నా.. పెతీ సంకురేత్తిరికీ వస్తావు చంద్రం' అనేవాళ్లు. ఊరెళ్లేసరికి జుత్తు పెరిగేలా చూసుకుని తెలిసిన సెలూన్‌కి వెళ్లి ఇష్టంగా తల అప్పగించేవాడు. అవసరం ఉన్నా లేకపోయినా దర్జీ దగ్గర ఒక జత బట్టలు కుట్టించుకునేవాడు. జనంతోపాటు షాపులో దండెం మీద వేలాడే బట్టలు కూడా తగ్గిపోతుండేవి. ఉన్న కొద్దిమంది కుర్రాళ్లు రెడీమేడ్‌కి అలవాటు పడ్డారు. చదువుకున్న బడిని చూసి; బల్లల్ని, గోడల్ని తడిమి, ఊళ్లో ఉన్న మాస్టారు గారింటికి వెళ్లేవాడు. శివాలయంలో తక్కువ ఎత్తులో ఉండే గర్భగుడి దేవుడి ముందు తలవంచుకుని ఉండాలని చెప్పేది.

ఈత కొడుతున్న పిల్లల్లాగే ఉత్సాహంతో ఉరకలెత్తే పిల్లకాలువ. ఊళ్లో సంక్రాంతి తిరుణాళ్లు ముంబైలో పెట్టే ఎగ్జిబిషన్‌లో వందోవంతు కూడా ఉండదు. కానీ వెయ్యి రెట్లు ఎక్కువ ఆనందాన్నిచ్చేది. సెలూన్ కృష్ణ, దర్జీ రాంబాబు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో? పూజారిగారు ఇప్పుడు ఏ గుడి పంచన చేరారో?

టిఫిన్ సెంటర్ మల్లమ్మ.. కూతురు దగ్గరికి గుంటూరు వెళిపోతానంది. ఒక్కో కుటుంబం ఊరు వదిలి వెళిపోతూ ఉంటే.. పల్లె నగ్నమౌతున్నట్టు, దగ్ధమౌతున్నట్టు దుఃఖం పొంగిపొర్లేది. పంజరంలో బంధించబడిన పక్షుల్లా.. తన ముంబై ఫ్లాట్‌లో తల్లిదండ్రులు. కాలేజ్ సెలవులప్పుడే కాదు, ఉద్యోగంలో చేరాక సెలవు పెట్టి ఊరికి వెళ్లినప్పుడు తిరిగి వెళ్లే సమయంలో మనసంతా దిగులు కమ్మేసేది. ఇప్పుడు అదే మానసిక స్థితిలో ఉన్నాడు. భాను అడిగిన ప్రశ్న గుర్తుకు వచ్చి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

'మా ఊరికా? వెళ్లాలనే ఉంటుంది. కానీ ఊరే లేదు" అన్నాడు భారంగా.
'అదేంటి?" అడిగాడు భాను విస్తుపోతూ.

'పోలవరం ముంపు గ్రామాల్లో మాదీ ఒకటి".. ప్రతి పల్లె అనుభవిస్తున్న ఆర్తిని

ప్రతిఫలిస్తూ చంద్రకాంత్ కళ్లల్లో నీటితెర. ఊరు ఎదురుచూస్తున్నా.. మనిషి రాడు. మనిషి వెళ్లామనుకున్నా.. ఊరు లేదు. భుజం మీద అనునయంగా చెయ్యి వేశాడు భాను.

***

### అనిసెట్టి శ్రీధర్

వలసలతో ఖాళీ అవుతున్న పల్లెలు అనుభవిస్తున్న 'ఆర్తి'ని.. ఈ కథతో కళ్లకు కట్టారు రచయిత అనిసెట్టి శ్రీధర్. ఈయన స్వస్థలం నరసరావుపేట. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో చీఫ్ మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. 1990లో కథలు రాయడం మొదలుపెట్టారు. 2008లో 15 కథలతో వేసిన 'కొత్త బంగారులోకం' సంపుటిని కారా మాస్టారు ఆవిష్కరించారు. ఆ తర్వాత మరో 28 కథలు ప్రచురితమయ్యాయి. గత మూడేళ్లుగా సామాజిక మాధ్యమాల్లో చిన్న కథలు, గల్పికలు, హాస్యవ్యంగ్య రచనలు వందకి పైనే వచ్చాయి. 2011లో 'నివేదన' కవితా సంపుటిని తీసుకొచ్చారు.

వీరి కథలు ఆదివారం ఆంధ్రజ్యోతి, ఇండియాటుడే, రచన, స్వాతి, సాక్షి ఫన్‌డే, నవ్య, విపుల, ఈమాట తదితర పత్రికలలో వచ్చాయి. మరికొన్ని హిందీ, మరాఠీ, ఆంగ్లం, తమిళంలోకి అనువాదమయ్యాయి. వీరి రెండో కథ 'పాతసామాను'కు ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం నిర్వహించిన ఉగాది కథల పోటీ (1991)లో ప్రథమ బహుమతి దక్కింది. 'మద్దతు' కథకు రచన పత్రిక ద్వారా కథాపురస్కారం, 'జనజీవన స్రవంతి' కథకు విపుల మాసపత్రిక అవార్డు లభించింది. ఇక ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం అనూస్ హాస్టల్స్ నిర్వహించిన కథల పోటీలో 'శాహో వర్సెస్ మాహో' కథకు రూ.పదివేలు ప్రైజ్‌మనీ అందుకున్నారు.



# జాతర

పొన్నాడ వెంకట అన్నాజీరావు

కళ

"రోజు మారిపోద్ది.. రోజు మారిపోతే లోకం మారిపోద్ది.. నిన్నసూసినవన్నీ కలలైపోతాయి.. కతలన్నీ గుండెల్లో జ్ఞ్యాపకాలు అయిపోతాయి.. కట్టె కాలినప్పుడు ఆ జ్ఞ్యాపకాలన్నీ కాలిపోతాయి..."

చదువురాని అప్పన్న తాత, కవిలా మాట్లాడుతుంటే కళ్ళార్పకుండా చూస్తున్నాడు ఆదిత్య. తాత ఎప్పుడూ తాత్వికుడుగానే కనిపిస్తాడు అదిత్యకి. తాత ఊరు విడిచిరాడు. నాన్న పట్నం వదిలిరాలేడు. తాతతో గడిపే ఆ కొద్ది రోజులను, దొరికే ఆ కొద్ది సెలవులను జ్ఞాపకాలుగా, జ్ఞానంగా దాచుకుంటాడు ఆదిత్య.

"నిజంరా సిన్నా! నా సిన్నప్పుడుకీ, ఇప్పుడికీ ఎంత మారిపోయింది జాతర! నెలముందు నుండే పనులు మొదలెట్టీవోళ్లు. డబ్బుల ఊసే లేదసలు. తలో సెయ్యేస్తే అదే పోగయ్యిది. మనూరి పండగ మనం సేసుకోవాలంతే.! మాకు - పిల్లలకైతే సందడే అసలు. మూడు రోజులూ ఎవుడుకీ బడీ లేదు. పనీ లేదు. పులి వాలకాలోల్లు వస్తుంటే, ఆ సప్పుడుకి సెట్లెక్కి సూసివోల్లం. రాత్రల్లా కూకోని తోలుబొమ్మలాటలు సూసివోల్లం. తప్పెడుగుళ్ళు, పగటేషాలు, పందిరి పాటలు, హరికథలు - ఇలా పూటకో పోగ్రాముండేది. సాయంకాలం నాలుగింటికి జాతరకెల్తే, మళ్లీ తెల్లారే తిరిగి ఇంటికిరాడం. జాతరలోనే తిండి, పోగ్రామేదో సూసుకుని ఏ ఏలకో అక్కడే పడుకొనివోళ్లం."

తాత మాటల ప్రవాహానికి అడ్డు రాకూడదని మౌనంగా వింటున్నాడు ఆదిత్య.

"పోనీ నా సిన్నప్పుడంటే ఎప్పుడి కథో.! మీ నాన్న సిన్నప్పుడు కూడా జాతర కళగానే ఉండీది. హరిశ్చంద్ర నాటకవేస్తే తెల్లార్లూ ఎవుడూ కదిలీవాడు కాదు. పందిరిపాటలూ, తోలుబొమ్మలు తగ్గిపోనాయి గానీ, హరికథలు, బుర్రకథలూ ఉండీవి. వాలకోలు ఉండీవి. ఇప్పుడన్నీ పోనాయి. ఒక సాంఘిక డ్రామా ఏసి కానిచ్చేస్తునారు," అప్పన్న తాత మాటలోని వేగం, ఉత్సాహం, జాతరలో జానపద కళలు తగ్గినట్లే తగ్గిపోయాయి.

"మొదటిసారి పులివేషం ఎప్పుడేశావు తాత, నా వయసుంటుందా అప్పుడు..?" అడిగాడు ఆదిత్య.

"నీకన్నా కొంచెం పెద్దే, పద్దెనిమిదో ఏడు అప్పుడు," మళ్లీ అలలా ఎగసింది తాత మాట.

"ఏడాది పాటూ నేర్చుకున్నాం. మా గురువు పొలాల గట్లెంబడ పరుగెత్తించీవోడు. మమ్మల్ని రోజుకి వంద దండీలు కొట్టమనీవాడు. అడుగులోన, సేతి ఊపులోన, మెడ నులుపులోన అన్నింటా పులి అవుపించాలి అనీవోడు. జాతర రోజు వరకూ అలాగే సాధన సేసీవోళ్లం."

"బాగ గుర్తుంది, జాతరరోజు నేను, నా ఈడోలు జాతరెనకాల షెడ్డులో నిల్చొని రంగు పూయించుకొంటున్నాము, ఒకరిద్దరిని ఒగ్గేసి, మిగిలినందరికీ అదే మొదటిసారి ఏషం కట్టడం. అప్పుడు సన్యాసన్న వచ్చాడక్కడికి. సన్యాసన్న పందిరిపాట పాడీవోడు, కత్తిసాము సేసీవోడు, సదువుకున్నోడు. అప్పట్లోనే రంగూనెల్లొచ్చాడు. అందుకే సన్యాసన్న అంటే ఊళ్లో అందరికీ గౌరవం. ఊళ్లో ఏ ఉత్సవమైనా సన్యాసన్న కత్తి తిప్పి, ఒక ఉడామేసి కొబ్బరికాయ కొడితేనే మొదలయ్యేది. అలాటి సన్యాసన్న మా దగ్గరికి వచ్చి ఓ మాటన్నాడు" -

'అబ్బాయిలూ, పులి వాలకోలు అంటే మూడడుగుల స్టెప్పో, డప్పుల చప్పుడో కాదర్రా, నైవేద్యం. వేదం తెలిసినోడు మంత్రం చదువుతాడు, అది తెలీనోడికీ దేవుడున్నాడు, పాడే పాటలోనో, ఆడే ఆటలోనో ఉన్నాడు. ఒకరిద్దరికి శాస్త్రమైతే, జనానికి జానపదం, మన పదం. అడుగు దేవుడికోసం అనుకొండి, మనసు మండపమనుకొండి, సత్తువంతా భక్తిగా చేసి ఆడండి,' అని."

"సన్యాసన్న మాటలు మంత్రంలా పనిసేశాయి మామీద. దేవుడు ఆడిస్తున్నట్లే ఆడామారోజు. అది మొదలు గౌరీ పున్నమైనా, రాములోరి జాతరైనా, అమ్మోరి పండగైనా ఏషం కట్టకుండా ఉన్నది లేదు, మాకది బక్తి, దేవుడికి సేసే పూజ, ఊరి పండుగకి మేమిచ్చే కానుక."

క్షణమాగి, మళ్లీ అన్నాడు, "అన్నీ మారిపోనాయిప్పుడు."

మాట నిర్వేదమయింది. ఉత్సాహం ఉద్వేగమయింది. రెండు నిముషాల పాటూ ఏం మాట్లాడాలో తెలియలేదు ఆదిత్యకి.

తర్వాత అడిగాడు, "ఇప్పుడు వేషం కట్టచ్చుగా తాత?" అని.

"ఇప్పుడా..!"

<u>కథ</u>

"ఇప్పుడా..!" అన్నాడు ప్రెసిడెంట్, ఎదురుగా కూర్చున్న అప్పన్న మాటలు వింటూ. బల్లపై అప్పన్న ప్రక్కనే ఆదిత్యా కూర్చున్నాడు.

"పులుముకొని పాతికేళ్లు అయినాది, ముడుకుల్లో సత్తువ పోతాంది. వచ్చేఏడికి ఉంటానో, పోతానో తెల్దు, ఈ ఏడికి ఏషం కట్టనీ" అన్నాడు అప్పన్న.

ముసలోడు, తెలిసిన మనిషి, చిన్నప్పటి నుండి చూసిన మనిషి, పదే పదే

అదేమాట చెబుతుంటే ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు ప్రెసిడెంటుకి.

"అప్పన్నా, పులివేషాలు ఎవరూ చుడట్లేదిప్పుడు. పాత కళలకు కాలం కాదిది. ఈ ఏడు సాంఘిక డ్రామా కూడా వద్దన్నారు కమిటీ సభ్యులు. టీవీ యాంకరుని, కమీడియన్లను పిలిచి ప్రోగ్రాం పెట్టిస్తునాం, కాలంతో పాటూ మనమూ మారాలి కదా" అన్నాడు నచ్చజెబుతున్నట్లుగా.

"కాలంకి అన్నీ ఒగ్గేస్తే, నాగావళికి ఒగ్గేసినట్లే, కొట్టుకుపోతాయి అన్నీ. మీలాటి బాబులే సూసుకోవాలి, ఏది ఒగ్గేయాలో, ఏది ఒగ్గకూడదో" అన్నాడు అప్పన్న.

"ఒకరి చేతిలోని పనా అప్పన్న! కమిటీలో పది మందున్నారు, మా తలమీద ఇంక స్పాన్సర్లు. ఇచ్చినోడు నచ్చిన ప్రోగ్రాం పెట్టమంటాడు. ఖర్చులా ఏటికి ఏడూ పెరిగిపోతున్నాయి. గత ఏడాది ఫ్రీగా దొరికింది, ఈ ఏడు కొనుక్కోవల్సి వస్తుంది. కేవలం మంచినీళ్లకే ఈ ఏడాది పాతికవేలు అయింది. ఇంక లైట్లు, సౌండ్లు, శాలువలు, సన్మానాలు అంటూ, చేతి ఖర్చుకీ తగిలేస్తుంది. పది ప్రోగ్రాములు పెట్టి వందమందిని పోషించే అవకాశం లేదిప్పుడు" అన్నాడు ప్రెసిడెంట్.

"కళతోటి పోషణ రోజులు పోనాయిలే బాబు! ఆడినోళ్లు, పాడినోళ్లు రెండు రకాలోల్లే మిగిలారు దేశంలో. డబ్బు అవసరం లేదనుకుని కళతోటి ఉన్నోళ్లు, డబ్బు రాదని తెలిసినా కళతోటే ఉన్నోళ్లు. ఆ రెండో కోవకే సెల్లుతానేమో నేనున్నూ! ఏషం కట్టి మనవడికి సూపించాలనుంది, అంతే! నాకు డబ్బులొద్దు, టేజీ వద్దు, టేజీ ముందు, జనం మద్యల ఓ పావుగంట ఏషం కట్టి ఆడటానికి అవకాశమివ్వు, సాలు!" అన్నాడు అప్పన్న.

అవునన్నట్లు తలూపాడు ఆదిత్య. ఇద్దరినీ తేరిపారా చూశాడు ప్రెసిడెంట్. ఇంకో గంట కూర్చోబెట్టి మాట్లాడినా 'సరే' అన్న మాట దగ్గరకే తీసుకొస్తారని అర్ధమయింది. అందుకే "సరే" అన్నాడు.

"రేపు సాయంత్రం ఆరు నుండి ఆరుంపావు! టీవీ వాళ్లు స్టేజ్ ఎక్కడానికి అరగంట ముందు." అన్నాడు ప్రెసిడెంట్.

"చాలు!" అనుకుంటూ లేచాడు అప్పన్న. అప్పన్నతో పాటే ఆదిత్య. ఒకే వయసు వాళ్లలా ఉత్సాహంగా అడుగు బయటపెట్టిన వాళ్లకి, "మరి డప్పుల సంగతి ఏంటి?" అని ప్రెసిడెంట్ అడుగుతున్న ప్రశ్న వినిపించింది.

"అది నేను సూసుకుంటానులే!" అన్నాడు అప్పన్న, ఉత్సాహంగా.

అన్నాడే గానీ, బయటకొచ్చి ఆలొచిస్తే ఏం చెయ్యాలో తెలియలేదు. 'రేపు రవణగాడి ట్రూపు ఉత్సవ విగ్రహాల ఎనకాల ఉంటారు, ఆళ్లు రాలేరు, లక్ష్మణ, ఆడి బ్యాచు టవునులో పెళ్లికెళ్తున్నారు, ఆళ్లూ రాలేరు', అనుకుంటూ ఇంటికొచ్చాక, పక్కూరి ప్రసాదుకి ఫోను కలిపాడు. రెండు అడిగాడు. 'రెండు వేలా!' అంటూ నిలువునా నీరుగారిపోయాడు అప్పన్న.

"రంగుడబ్బాలు కొనుక్కోవాలి, ఏసిన రంగు వదిలించుకోవడానికి డీజిలు

కొనుక్కోవాలి, ఒంటికి రంగులేసినోడికీ ఎంతో కొంత ఇచ్చుకోవాలి, ఇది తేలేలా లేదు సిన్నా!" అన్నాడు అప్పన్న. "ప్రెసిడెంట్ తెలివైనోడు, కాదనకుండా దెబ్బనప్పించేన్డు." అన్నాడు మళ్లీ.

"నాన్నను అడుగుదామా?" అన్నాడు ఆదిత్య.

"సీరేస్తాడు ఇద్దర్నీ కలిపి. సంపాదించక్కర్లేదు, కానీ తగలేసే పనులేవీ సెయ్యకని ముందే సెప్పాడు" అన్నాడు అప్పన్న.

"సరే, ఓ పని చేద్దాం తాత, ముందు మిగతా ఏర్పాట్లన్నీ చూసుకుందాం. కావల్సినవన్నీ కొందాం. డప్పులకు ఇంకేమైనా దారుందేమో వెతుకుదాం, రేపు సాయంత్రం వరకూ టైమ్ ఉంది కదా!" అన్నాడు ఆదిత్య.

ఆ సాయంత్రం తాత మనవళ్లు ఇద్దరూ కావల్సిన సామాన్లన్నీ కొనుక్కొని వచ్చారు. తెలిసిన పెయింటర్ ఒకరిని రంగు వేయడానికి బెత్తాయించుకున్నారు, రంగులెలా వెయ్యాలో అప్పన్న చెప్పాడు. ఇంటికొచ్చాక పెట్టెలో ఉన్న పాత పులిచెవుల టోపీని, రబ్బరు తోకను చూపిస్తూ అన్నాడు అప్పన్న, "ఓ సారి రంగేస్తే మునుపటి మెరుపొస్తాదీటికి" అని. రాత్రికి అప్పన్న మరికొన్ని జాతర కథలు చెప్పాడు, ధ్యాసగా విన్నాడు ఆదిత్య. తాత కథల మాటున, రేపటి సంగతేమిటన్న చింత, అంతా సవ్యంగా జరిగితే బావుణ్ణు అన్న ఆత్రుతా కనిపించాయి ఆదిత్యకి.

తెల్లారింది. స్నానాలు చేసుకుని గుడికి వెళ్లారు ఇద్దరూ. రాములవారి కల్యాణం చూడటానికి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలంతా పోటెత్తినట్లు వచ్చారు. మంత్రాలు, మంగళవాయిద్యాలు మైకులో మారుమ్రోగుతున్నాయి. గుడి ప్రాంగణమంతా పండగ వాతావరణంతో కనిపిస్తుంది. ఆభరణాలతో, అలంకరణలతో అందంగా ఉన్నారు సీతారాములు. దర్శనమయ్యాక మేళం వాయిస్తున్న వాళ్లను చూపిస్తూ అన్నాడు అప్పన్న,

"అదుగో! ఆ డోలు వాయిస్తున్నోడు రవణగాడు. ఆ పక్కన మృదంగంతోటి ఉన్నోడు సూరి. సన్నాయి వాయిస్తున్నోడు శ్యామలు. పులేషానికి మృదంగం, సన్నాయి అక్కర్లేదు. డోలుతో పాటూ డప్పు, బిగేలు ఉంటే సరిపోద్ది. అవన్నీ ఆలదగ్గర ఉంటాయి. మనకైతే ముందు వాయించినోళ్లే కావాలి" అని.

తాత ఆలోచనలన్నీ అక్కడే ఉన్నాయి అనిపించింది ఆదిత్యకి. ఇప్పుడైతే ఇంక టైమ్ కూడా దగ్గర పడుతుంది, నిర్ణయం తీసుకోవాలి అనుకున్నాడు.

"తాత! నిన్న సామానుకి పోను, మన దగ్గర వెయ్యి రుపాయిల వరకూ ఉంది. ఊరెళ్లాక, నాన్నని ఎలాగోలా ఒప్పించి డబ్బు పంపిస్తాను, అందాకా వెయ్యి ఎవరిదగ్గరైనా అప్పు తీసుకో, నువ్వు వెయ్యి అప్పడిగితే లేదనేవాళ్లు ఉండరు. ఆ ప్రసాదుకి ఫోన్ చేసి సాయంత్రం రమ్మని చెప్పు" అన్నాడు.

నవ్వాడు అప్పన్న. "మా సత్తెం మేష్టుకి నాటకాల పిచ్చి. గతేడాది వారాలకి

సొంత డబ్బులతో సాంఘికడ్రామా వేసి, అప్పులపాలయిపోనాడు. ఈ ఏడు నా వంతులాగుంది" అన్నాడు.

"డబ్బులు సర్ధుబాటు చేద్దాంలే తాత, ముందు వాళ్లను సాయంత్రం రమ్మని చెప్పు" అన్నాడు ఆదిత్య.

సరేనని ఫోను కలిపాడు అప్పన్న. ఫోను కలవలేదు. భోజనాలయ్యాక మళ్లీ చేద్దామనుకుని, ఈ లోపు తెలిసినవాళ్ల దగ్గర వెయ్యి రూపాయిలు అప్పు అడిగి తీసుకున్నాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక మళ్లీ ప్రసాదుకి ఫోన్ చేశాడు, మళ్లీ కలవలేదు. ఈసారి అప్పన్నకి, ఆదిత్యకి ఇద్దరికీ టెన్షన్ మొదలయింది. మూడు గంటలకు పెయింటర్ ని రమ్మన్నాడు, కొత్త కుర్రాడు, పులివేషాలకు వేసిన అలవాటు లేదు. రంగు వేయడానికి, ఆరడానికి కనీసం రెండు, రెండున్నర గంటల సమయం పడుతుంది. ఇప్పుడింక కదిలే పరిస్థితీ లేదు అప్పన్నకి.

"నేను వెళ్లి చూసుకొస్తాను" అన్నాడు ఆదిత్య, బయటకు నడుస్తూ.

"ఊర్లో దిగ్గానే ప్రసాదు ఇల్లెక్కడని అడుగు, ఎవుడైనా సెప్తాడు" అన్నాడు అప్పన్న, తలుపు మూసిన చప్పుడు గుండె దడలా వినబడుతుంటే!

మరికాసేపటికి మూసిన తలుపులు తెరుచుకుంటూ పెయింటర్ వచ్చాడు. అప్పన్నను చూస్తూ అన్నాడు, "చమటలు పడుతుంటే రంగు వెయ్యలేము, నిలవదు" అని.

ఒళ్లంతా తువ్వాలుతో తుడుచుకొని, లంగోటా పైకెత్తి కట్టి, ఫ్యానుకింద నిటారుగా నిల్చున్నాడు అప్పన్న. తనకు రెండువైపులా చెరో అడుగు దూరంలో కుర్చీలను ఉంచి, వాటిపై అరచేతులు ఆన్చాడు.

ఒంటికి రంగు పడుతుంటే, మనసు మాట్లాడుతుంది. ఒకవైపు పాతికేళ్ల తర్వాత రంగులేసుకుంటున్నందుకు ఉద్వేగంగా ఉంటే, మరోవైపు ఇంత కష్టమా అనిపిస్తుంది.

'నాకు తెలిసిన ఆట నేను ఆడటం ఇంత కష్టమా! ఆటలోని అందమే కనిపించట్లేదా ఎవులికి? అంత పాతబడిపోనాదా? పాతబడిపోడానికి వస్తువేమి కాదుగా! ఏ రంగులొచ్చాయి దేశం లోనికి, మా రంగులు సెరిపేయడానికి! ఆడితే రూపాయి వస్తాదన్న రోజులనుండి, ఆడాలంటే రూపాయి పెట్టుకోవాలి అన్న రోజులకొచ్చేనాం, డబ్బుల ఊసూ కాదిది. డబ్బులు రాకుంటే రాలేదు, జాతరకి కళే లేకుండా పోనాది. ఏదో గాలి! అన్నీ నిముషాల మీద అయిపోవాలి, సూసిందేది మళ్లీ కళ్లకి అవుపించకూడదు, ఇదే వరస అన్నింటా! ఇది కళకు నప్పుద్దా లేదా అని ఎవుడాలోసిస్తున్నాడు, కళనే నమ్ముకున్నోళ్లు ఏమైపోతున్నారు అని ఎవులడుగుతున్నారు?'

ధఢేలున చప్పుడు చేస్తూ తలుపు తెరుచుకుంది, మనసు మూసుకుంది. ఎదురుగా ఆదిత్య, అలసిపోతూ చెప్తున్నాడు, "ప్రసాదు, వాళ్ల బాజావాళ్లూ ఊళ్లో లేరు తాత, రేపటికి గాని రారంట."

ఏం మాట్లాడలేదు అప్పన్న, తీక్షణంగా చూస్తున్నాడు. రంగు ఆరుతుంది, ఒంటినుండి నీరురాకుండా పైనున్న ఫ్యాను ఆపుతుంది, కంటి నుండి నీరు రాకుండా ఏం ఆపగలదు??

**<u>గతి –</u>**

రాత్రి ఏడుగంటలయింది. జాతర కోలాహలంగా ఉంది. ఎల్ఈడీ లైటింగ్ సెట్ల మధ్య ప్రాంగణమంతా వెలుగులతో నిండిపోయింది. సౌండ్ బాక్సుల నుండి డీజే మిక్సింగ్ పాటలు మంచి బీటులో వస్తున్నాయి. స్వీట్ కార్న్, ఐస్ క్రీము, టీ – కాఫీ స్టాల్లు చెల్లాచెదురుగా జాతరంతా ఉన్నాయి. బొమ్మల షాపులు, మినీ ఎగ్జిబిషన్ ను తలపించే రంగుల రాట్నాలు మిగతా స్థలమంతా నిండిపోయాయి. పిల్లలు ఆడుకుంటున్నారు, పెద్దలు కబుర్లు చెప్పుకుంటున్నారు, స్టేజ్ ముందు జనం నిండుగా ఉన్నారు. స్టేజ్ మీదున్న ప్రెసిడెంట్ దేనికో కంగారు పడుతున్నాడు. కమీడియన్ల బండి లేటయింది, మరో రెండు గంటలకు గానీ రారంట - ప్రెసిడెంట్ కంగారుకి కారణం! అప్పన్న రాలేదన్న ధ్యాస లేదతనికి, వస్తానన్నాడన్న గుర్తు కూడాలేదు.

"ఈయాల పోగ్రాం పెంటయిపోయేలాగుంది" స్టేజ్ ముందున్న జనం లోనుండి ఎవడో అన్నాడు. మెల్లగా ముసలం మొదలయింది, గోలగా మారుతుంది. ఏం చేయాలో తెలియలేదు ప్రెసిడెంట్ కి, పాటలాపమన్నాడు, మాట్లాడడానికి.

"ప్రేక్షక మహాసయులకు విజ్ఞప్తి" అంటూ మొదలుపెట్టాడు ప్రెసిడెంట్. గోల ఆగింది, జనం చూస్తున్నారు ఏం చెప్తాడా అని. ఒక్కసారిగా వచ్చిన నిశ్శబ్ధానికి ఏం మాట్లాడాలో ప్రెసిడెంటుకీ తెలియలేదు.

ఇంతలో, గాలితో శృతి కలుపుతూ మెల్లగా బిగేలు చప్పుడు వినిపించింది ఎక్కడినుండో. అరనిముషానికి డప్పు, డోలు తోడయ్యాయి. ఆ చప్పుడు, ముందు విన్న డీజే పాటలలో లేని సహజమైన ఊపుని తెస్తుంది. జనం దృష్టి అటుమళ్లింది, ఎగబడి చూస్తున్నారు, చప్పట్లు కొడుతున్నారు, విజిల్లేస్తున్నారు. ఏం జరుగుతుందో ప్రెసిడెంటుకి అర్థంకాలేదు, ముందేముందో కనిపించలేదు. నెమ్మదిగా, జనం మధ్యనుండి దారి ఏర్పడింది. అప్పుడు కనిపించింది ప్రెసిడెంటుకి పులి.

పులి ఊగుతుంది, గెంతుతుంది, నాట్యం చేస్తుంది. జనం మొత్తాన్నీ తనవైపుకి తిప్పుకుంది. రవణ, అతని తోటి వాయిద్యాల వాళ్లూ పులితో పాటే వస్తున్నారు, ప్రక్కనే ఆదిత్య కూడా ఉన్నాడు. ప్రెసిడెంట్ ఎప్పుడు స్టేజ్ దిగాడో, అప్పన్న పులి, వాయిద్యాల వాళ్లూ ఎప్పుడు స్టేజ్ ఎక్కారో ఎవరికీ గుర్తులేదు. అందరికీ గుర్తున్నదంతా ఆ రాత్రి, ఆ రెండు గంటలు అప్పన్న తనకు తెలిసిన కళతో అంతమంది జనానికి ఎంతలా వినోదాన్ని

పంచాడో! పిల్లలు ఆ పులినాట్యం చూసి ఎంతలా కేరింతలు కొట్టారో! కుర్రాళ్లు ఈలలెలా వేశారో!

తనకు తెలిసిన కళలో లీనమయిపోయాడు అప్పన్న. 'కళ, దేవుడికిచ్చే నైవేద్యం,' ఇదే మాట తిరుగుతుంది మనసులో. డప్పుల చప్పుడుకి పాదం కదులుతుంది, చేయి గాల్లోకి లేస్తుంది, తల ఊగుతుంది. సత్తువతగ్గి, పాదం తడబడెంతవరకూ అలానే ఆడాడు. ముందున్న జనంలోనూ దైవమే కనిపించింది అప్పన్నకి. మనసంతా ఆనందంతో నిండిపోయింది. స్టేజ్ దిగి, ప్రెసిడెంట్ చేతులు పట్టుకొని ఏడ్చేశాడు. ఆదిత్య దగ్గరకు వచ్చి, అప్పన్న చేయి పట్టుకుని ముందుకు తీసుకువెళ్లాడు.

"అప్పన్న, అదరగొట్టావు! జాతరకు మునుపటి కళతెచ్చావు" అన్నాడు జనం లోనుండీ ఎవరో పెద్దాయన, "మాకూ నేర్పించు అప్పన్న తాత" అన్నాడు ఎవరో కుర్రాడు.

"నాకూ నేర్పించు తాత, వచ్చే ఏడాది నేనూ పులివేషమేస్తాను" అన్నాడు ఆదిత్య.

కళ్ల నీళ్లు తుడుచుకుంటూ, ఆదిత్యను చూసి నవ్వి సరేనన్నాడు అప్పన్న.

ఇవన్నీ లీలగా వినిపిస్తూనే ఉన్నాయి ప్రెసిడెంటుకి. అప్పన్న తర్వాత స్టేజ్ దిగిన రవణ, డోలు భుజానికి తగిలించుకొని, నేరుగా ప్రెసిడెంట్ దగ్గరకు వచ్చి అన్నాడు,

"మా అప్పన్నమావకు తెగ మొహమాటం ప్రెసిడెంటుగారూ, నిన్నటి నుండి బాజాలకోసం ఇబ్బంది పడుతున్నాడు. ఉత్సవం ఆరుకి ముగిసిపోద్దని, తర్వాత మేం ఖాళీయే అని మీరయినా చెప్పాల్సింది. మీరు అవకాశమిచ్చారనే కళ్లంట నీళ్లు తిప్పుకున్నాడు, ఇంకాస్త సపోర్టు చేసుంటే, నెత్తిన పెట్టుకునేవాడు" అని.

పొరలేవో తొలగిపోయినట్లనిపించింది ప్రెసిడెంటుకి. సమాధానమేం చెప్పలేదు. నేరుగా స్టేజ్ మీదకు వెళ్లి మైక్ అందుకున్నాడు,

"జాతరని ఇంత విజయవంతం చేస్తున్న మీ అందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా ఈ రోజు, ఇంతలా మనల్ని అలరింపజేసిన అప్పన్న గారికి ఏ విధంగా కృతజ్ఞత తెలియజేయాలో నాకు తెలియట్లేదు, అందుకే నేను ఒక నిర్ణయానికి వచ్చాను. అయితే అది చెప్పేముందు మీ అందరికీ మరో విషయం చెబుదామనుకుంటున్నాను."

"గత ఏడాది ఇదే జాతరలో శనగకాయలు అమ్మినవాళ్లు, ఈ ఏడాది స్వీట్ కార్న్ అమ్ముతున్నారు, గత ఏడాది టీ అమ్మినవాళ్లు, అదే టీ ఈసారి 'టీ టైమ్' అనే బోర్డు కింద అమ్ముతున్నారు. మరి గత ఏడాది ఇదే స్టేజ్ మీద నాటకాలేసిన వాళ్లు ఈసారి ఏమయ్యారు? ఈ సారి మనం వాళ్లను పిలవలేదు, వాళ్లు ఏ చీకటిలో ఉండిపోయారో మనకు తెలీదు. ఉపాధి మారినంత వేగంగా కళ మారదు కదా! అసలు మారాల్సిన అవసరమే లేదుకదా! ప్రతి విషయంలో మార్పు కావాలన్న తొందరలో మనమే, మనదైనదేదో వదిలేసుకుంటున్నాము. అలరించే శక్తి ఉన్న కళలని, ఆదరించడానికి

మనమెందుకు ప్రయత్నించట్లేదు. ఈ రోజు ఒక అప్పన్న చీకట్లోంచి బయటకొస్తే జాతరకెంత వెలుగొచ్చిందో చూశాం మనం. అదే మరో నాటకమో, హరికథో, తప్పెడుగుళ్లో తోడైతే ఇంకెంత అందంగా ఉంటుంది! అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను. ఇకపై జాతరంటే మన కళలే ఉంటాయి, మన కళాకారులే ఉంటారు. దానికి మీ అందరి సహాయ సహకారాలు కావాలి. అప్పన్న గారికి పంచాయితీ తరుపున ప్రతినెలా రెండువేలు భత్యం ఇద్దామని నిర్ణయించుకున్నాను, వచ్చే ఏడాదికి ఆసక్తి ఉన్న ఓ అరడజను కుర్రాళ్లను పులివేషం వేయించేలా సన్నద్ధం చేసే బాధ్యతను అతనికి అప్పగిస్తున్నాను. అలానే సత్యం మాష్టారుగారికి ఒక నాటకం ట్రూపుని తయారుచేసే బాధ్యతను ఒప్పజెబుతున్నాను. దానికి అయ్యే ఖర్చునీ పంచాయితీ పెట్టుకుంటుంది. జాతరకు మనమిచ్చే విరాళాలను, మన కళలకు మనమిచ్చే ప్రోత్సాహకాలుగా ఉపయోగిద్దాం. ఈ చైతన్యం ఇక్కడితో ఆగిపోకూడదు. మనదైనదేదీ వదులుకోవద్దు. మన నిర్ణయం, మన గ్రామం మరో పదిమందికి ప్రేరణగా నిలవాలి."

ప్రెసిడెంట్ మాటలకు, జాతరంతా కరతాళ ధ్వనులతో నిండిపోయింది. ఆ చప్పుడు, ఓ కొత్త సంస్కృతిని స్వాగతిస్తున్నంత అందంగా వినిపిస్తుంది.

★★★

## పొన్నాడ వెంకట అన్నాజీరావు

పొన్నాడ వెంకట అన్నాజీరావు స్వస్థలం ఎచ్చర్ల గ్రామం, శ్రీకాకుళం. బీటెక్ చదివారు. కేంద్ర కస్టమ్స్ పన్నులశాఖలో సూపరింటెండెంట్ గా పని చేస్తున్నారు. "జాతర" వారి ఐదవ కథ. మొదటి కథ "శూన్యం" 2016లో హైదరాబాద్ లోని ఎజీ కార్యాలయం వారి రంజని నందివాడ భీమారావు కథానికల పోటీలో, ప్రత్యేక బహుమతిని గెలుచుకుంది. 2018లో, తెలుగు వెలుగు మాస పత్రికలో ప్రచురితమైన "ఎర్ర ధోవతి" కథ, గుర్తింపుని తెచ్చింది. ఏమీ ఆశించకుండా, జానపద కళలను ప్రేమించే బీద కళాకారులను కొంతమందిని దగ్గరగా చూశారు రచయిత. ప్రపంచీకరణలో భాగంగా మారిన సామాజిక అభిరుచులు, వాటిని మన సంస్కృతికి, కళలకూ కూడా ఆపాదించుకున్న తీరు, దానివలన కళాకారులకు జరుగుతున్న నష్టం, అందులో ఉన్న ఆర్థిక, ఉపాధి కోణాలను గూర్చి ఈ కథను రాశారు.

**9441121556**

# మనసున మనసై

## లక్ష్మీ గాయత్రి



కళ్లు మూసుకుని చేతులు జోడించిందే గాని తనూజ మనసంతా ఘుమఘుమలాడుతూ చవులూరిస్తున్న నైవేద్యం మీదే ఉంది!

తనకి బలంగా ఉండాలని ఎత్తుకెత్తూ జీడిపప్పు,బాదాం, కిస్మిస్‌వేసి, కమ్మని నెయ్యి పోసి, చిక్కని పాలతో చేసుకుందా పరమాన్నం. అదిప్పుడు ఒకటే నోరూరించేస్తోంది.

''ఇదిగో,మన తిండిపిచ్చి రోజు రోజుకీ పెరిగిపోతోంది. ఇలా తింటూంటే ఇద్దరం మోటూల్లా తయారవుతాం. డాడీ వెక్కిరిస్తారు. నోరు కాస్త అదుపులో పెట్టుకోవాలి..విన్నావా...'' ఎత్తుగాకనిపిస్తున్న పొట్టని అపురూపంగా చూసుకుంటూ ముద్దుగా చెప్పింది.

అంతలో, ''నీ దండాలింకా అవలేదా...!'' అంటూ వెనకనుంచి రాకేష్ స్వరం వినిపించింది.

ఆ మాట వింటూనే గబుక్కున కళ్లు మూసుకుని దేవుడికి రోజువారీ దండం అప్పజెప్పేసింది తనూజ. ''స్వామీ, నాకు రాముడిలాంటి బాబో, లక్ష్మీదేవిలాంటి పాపో కావాలి...ఎవరైనా ఫర్వాలేదు గాని చక్కగా బుద్ధిగా, మంచి మనసుతో ఉండాలి. నా పొట్టలోనే బాగా తీర్చిదిద్దు. ఓకేనా..!''

ఇద్దరూ ఆఫీసులకి తయారయ్యారు.

బయల్దేరబోతూ, ఏడో నెల గర్భంతో ముద్దబంతిపువ్వులా ఉన్న భార్య పొట్ట మీద ముద్దు పెట్టుకున్నాడు రాకేష్...''బంగారూ, ఇవాళ ఎలాగైనా మమ్మీకి హైక్ తెప్పించెయ్యాలి నువ్వు. వచ్చే నెలకల్లా మనం లగ్జరీ కారు కొనెయ్యాలి!''

''రాకీ, పిల్లలకి చిన్నప్పటినుంచే లగ్జరీలు అలవాటు చేసేట్టున్నావు నువ్వు!'' కినుకగా అంది తనూజ

''లేకపోతే నీలా సన్యాసి కబుర్లు చెప్పమంటావా...చాల్లే, హైక్ రాగానే ఫోన్ చేసి చెప్పు. మర్చిపోకు!''

''నువ్వు కల్లోక్కూడా వచ్చి చెబుతున్నావు. ఇంక మర్చిపోవడం కూడానా..'' నవ్వింది తనూజ

''నీక్కూడా ఆ ధ్యాస ఉంటే నాకీ యాతన లేకపోను. సన్యాసమ్మవి నువ్వు...నాకెలా దొరికావో గాని...''

తనూజ మాట్లాడలేదు. రాకేష్ మాటలు నిజమే. ఉప్పుకీ నిప్పుకీ ముడిపెట్టి వింత

చూస్తాడా దేవుడు. బహుశా మనిషి స్వభావానికి అతీతంగా ప్రేమించాలని కాబోలు. తనకి పర్ణశాల ఇష్టం. రాకేష్‌కి మైసూర్‌ప్యాలెస్ కావాలి. తనకి పరమాన్నం ఇష్టం...రాకేష్ డ్రై ఫ్రూట్ హల్వా తప్ప మరేమీ తినడు. రాకేష్ కోరికలనే తన ఇష్టాలుగా స్వీకరించి, అతను దుడుకుగా మాట్లాడినా తను మౌనంగా ఊరుకుంటుంది కాబట్టి ఇద్దరి మధ్యా గొడవలేమీ లేవు.

హైక్ గురించే ఆలోచిస్తూ కంప్యూటర్ ఆన్ చేసిన తనూజకి హెచ్ ఆర్ డిపార్ట్మెంట్ నుంచి మెయిల్ కనబడింది. అంతే.. ఒక్కక్షణం గుండె కొట్టుకునే వేగం పెరిగింది. హైక్ తో బాటు ప్రమోషన్ కూడా వచ్చినట్టుంది...నిజానికి తనకి కిందటేడాదే రావాల్సింది..ఇప్పుడు ఇస్తున్నట్టున్నారు..రాకీ కోరిక తీరిపోతుందింక...పొట్టలో బుజ్జినీ తననీ ఒకటే ముద్దు చేస్తాడు..

ఆనందంతో మెయిల్ ఓపెన్ చెయ్యకుండానే రాకేష్‌కి వీడియో కాల్ చేసింది.

రాకేష్ వెంటనే లైన్లోకొచ్చాడు...తనూజ మొహంలో ఉద్వేగం చూస్తూనే హుషారుగా ''వచ్చేసిందా...ఎంత?!'' అంటూ ప్రశ్నించాడు

''ఏమో..నేనింకా మెయిల్ ఓపెన్ చెయ్యలేదు. నువ్వే చూడు...'' ఫ్రంట్ కెమెరాలో రాకేష్‌కి చూపిస్తూ మెయిల్ ఓపెన్ చేసింది తనూజ.

మొదటి వాక్యం చదివేసరికే ఆమె ఆనందమంతా ఇంకిపోయింది. సారాంశం బుర్రకెక్కేసరికి మెదడు ఏడుస్తున్నట్టూ తల్లోంచి చెమటలు పట్టడం ప్రారంభమైంది. ఎలాగో నిగ్రహించుకుంటూ కెమెరా తిప్పుకుని చూసింది.

రాకేష్ మొహం సీరియస్‌గా ఉంది.

తనూజని చూస్తూనే, ''పింక్ స్లిప్...! సర్లే...డోంట్ వర్రీ. యూ కెన్ ట్రై ఫర్ అనదర్. బై!'' అనేసి ఫోన్‌పెట్టేశాడు.

దుఃఖానికి భాషాజ్ఞానం లేదు. ఆనందం ఎన్ని భాషల్లోనైనా కబుర్లు చెబుతుంది గాని దుఃఖం మాత్రం అమ్మభాష లోనే ఏడుస్తుంది! అలాగే ఓదార్పుకీ భాషలు తెలియవు. అమ్మభాష అయితేనే ఆ ఓదార్పు అమ్మ చేతి స్పర్శలా మనసును చేరుతుంది. పరాయి భాషలో అయితే పక్కింటివాడి కంటితుడుపులాగే ఉంటుంది.

తనూజకి బాహ్యస్పృహ పోయింది. పంచభూతాలూ చెవిలో ఒకటే మాట చెబుతున్నాయి.... ''ట్రై ఫర్ అనదర్''

రెండు నిమిషాలయేసరికి తనూజ గుండె చావు డప్పులా కొట్టుకోవడం ప్రారంభించింది. ఘుమఘుమలాడుతూ నోరూరించిన పరమాన్నం అసహ్యంగా వాంతి రూపంలో బైటికి వచ్చేసింది. తిన్నదంతా వమనం చేసుకుని వేలాడిపోతూ వాష్ రూం బైటికొచ్చేసరికి ఆమె ఈదురుగాలికి కంపిస్తున్న గులాబీపువ్వులా ఉంది. చెమటలు దిగకారుతున్నాయి. సన్నగా వస్తున్న వెక్కిళ్ల వల్ల ఛాతీతో బాటు నిండు గర్భం కూడా అదురుతోంది. ఏడుస్తున్నానన్న స్పృహ కూడా లేని తనూజ కళ్ల నుంచి ధారాపాతంగా

నీళ్లు కారిపోతున్నాయి.

అప్పటికే తనూజ పింక్‌స్లిప్ విషయం నలుగురికీ తెలిసింది. అంత పొట్టతో ఆమె పరిగెడుతున్నట్టూ వాష్‌రూంకి వెళ్లడం చూసిన కొలీగ్స్ గబగబా ఎదురు వెళ్లి నెమ్మదిగా తీసుకొచ్చి కూర్చోబెట్టారు. హారిక మంచినీళ్లు అందించింది.. రమ వెన్ను నిమరసాగింది. జగదీష్ వెళ్లి వేడిగా కాఫీ తీసుకొచ్చాడు.

ఎవరు ఎన్ని చేస్తున్నా తనూజకి పట్టలేదు. వెక్కివెక్కి ఏడుస్తున్న ఆమె ఉన్నట్టుండి ''అమ్మా'' అని ఆర్తనాదంచేస్తూ కడుపు పట్టుకుని కుర్చీలో ముందుకి వాలిపోయింది!

చూస్తున్నవాళ్ళు మరింత గాభరా పడ్డారు. ''నా పాప..నా పాప'' అని ఏడుస్తూ, విలవిలలాడుతున్న తనూజని ఆస్పత్రికి తీసుకువెళ్ళడమే మంచిదని నిర్ణయించుకుని, రాకేష్ కి కబురందించి, బయల్దేరారు.

రాకేష్ వచ్చేసరికి తనూజ ఆపరేషన్ థియేటర్‌లో ఉంది. ఆ కోమలహృదయిని ఆరునెలల పాటు పాలూ పరమాన్నం పెట్టి, కడుపారా పెంచి పోషించుకున్న బిడ్డ, ఉన్నపాటున తల్లి శరీరంలో ఉధృతంగా పెరిగిన బీపీకి బలైపోయింది. ఉద్యోగాన్నీ బిడ్డనీ ఒకేసారి పోగొట్టుకుని, లోతుకి పోయిన పొట్ట, తగ్గని బీపీ, ఆగని బ్లీడింగ్ తో స్పృహలేని స్థితిలో ఐసీయూ పాలైంది తనూజ!!

దాదాపు పదిహేను రోజుల తర్వాత, రాకేష్ కోపంగా అరుస్తున్నాడు....

''గోరంతని కొండంత చేసుకుని, ఎక్కడలేని సమస్యలూ తెచ్చిపెట్టింది నీ కోడలు! ఇందులో నా తప్పేముంది..?! ఆవిడగారి ఉద్యోగం పోయినందుకు నేను పల్లెత్తు మాట అనలేదు సరికదా డోంట్ వర్రీ అని కూడా చెప్పాను. అయినా సరే నానా గాభరా పడిపోయి నిక్షేపంలాంటి పిల్లని పొట్టన బెట్టుకుంది. అయిందేదో అయింది ఇకనైనా ధైర్యంగా ఉండవమ్మా అని చెబుతుంటే కూడా వినకుండా మంచాన్ని అంటిపెట్టుకుపోతోంది. నోరు విప్పిమాట్లాడదు..తిండి తినదు, లేచి తిరగదు. అలా మంచాన పడి ఉంటే పోయిన ఉద్యోగమూ, పిల్లా తిరిగొచ్చేస్తాయా...ధైర్యంగా ఉంటే ఈపాటికి హాయిగా మరో ఉద్యోగంలో సెటిల్ అయిపోయి ఉండేది. లక్షణంగా బాబో పాపో పుట్టి ఉండేవారు! నువ్వేమో ఆవిడగారికి చెప్పడం పోయి నేనేదో తప్పు చేసినట్టు నన్ను పట్టుకు తిడుతున్నావు!''

కొడుకు మాట్లాడుతున్నంతసేపూ నిశ్శబ్దంగా కూర్చుంది హేమలత.

తర్వాత, ''అంటే, అంతా తనూజ పిరికితనం వల్లే జరిగిందంటావు..'' అంది

''ఖచ్చితంగా...''

''సరే, బాగానే ఉంది. ఉద్యోగం పోతే పోయిందిలే అని ఆ పిల్ల ధైర్యంగా ఇంటికి వచ్చేసిందే అనుకో. ఏమై ఉండేది.. వెంటనే మరో ఉద్యోగం దొరికేస్తుందన్న గేరంటీ ఏమీ లేదు కదా. తన ఏటీఎం కార్డు కూడా నీ పర్సులోనే పెట్టుకు తిరిగే నువ్వు నెలనెలా తనూజ తెచ్చే లక్షా అరవై వేలూ లేకపోయినా మామూలుగా నవ్వుతూ తుళ్ళుతూ

ఉంటావా....దయచేసి అబద్ధం చెప్పాలని చూడకు...నేను నీ గురించి సమస్తం తెలిసిన నీ తల్లినని మర్చిపోకు.'' అంటూ ఆగింది.

''బావుంది...బాధ పడటం సహజమమ్మా..'' రాకేష్ కోపంగానే అన్నాడు

''భార్య ఉద్యోగం పోతే నీకు బాధ కలగడం సహజం...తనకి బాధ కలగడం అసహజం...''

''బాధ పడొచ్చు...కానీ అంతలా పిచ్చెక్కిపోవాలా....ప్రయత్నిస్తే మరో ఉద్యోగం దొరుకుతుంది''

''దొరకొచ్చు. కానీ దొరికే దాకా నువ్వు మామూలుగా ఉండవుగా...ముళ్ళ మీద నడుస్తావు. ఏదేదో మాట్లాడతావు. ఉద్యోగం పోయినా ధైర్యంగానే ఉండొచ్చు గానీ, మనతో కలిసి బతికే మనిషి మొహం మాడ్చుకుని, చిరాకు పడిపోతూ ఉంటే భరించడం కష్టం. అవునా కాదా..''

"నేనేమీ నీ కోడల్ని కాల్చుకు తినడం లేదు..'' రాకేష్ మొహం ముడుచుకున్నాడు.

"నువ్వు కాల్చుకు తినవు...కానీ నీ ప్రవర్తన మనసులో ముళ్లు గుచ్చుతుంది. నిన్ను ప్రసన్నం చేసుకోవాలంటే ఆ పిల్ల కడుపులో బిడ్డని మోస్తూ కూడా అహర్నిశలూ వేరే ఉద్యోగం కోసం తాపత్రయపడాలి. నెలతప్పిన తర్వాత అసలు ఉద్యోగమే మానెయ్యాలనుకుంది తను. మెటర్నిటీ లీవ్ తీసుకునే దాకా చెయ్యమన్నావు నువ్వు. నీ ఇష్టానికి తను తలొగ్గింది. మామూలుగా ఆఫీసు పని చేసుకు పోవడంవేరు...కొత్త ఉద్యోగం కోసం ప్రయత్నించడం వేరు. ఏవో పాట్లు పడినా కూడా మెటర్నిటీ లీవ్ తీసుకునేపరిస్థితిలో ఉన్న మనిషికి కంపెనీలు వెంటనే ఉద్యోగం ఇస్తాయన్న గేరంటీ లేదు. అంచేత నెలలునిండుతున్న వేళ నీ అసంతృప్తినీ చిరాకునీ భరించక తప్పదు''

రాకేష్ మాట్లాడలేదు.

''మనిషికి మనిషే తోడూ..నీడా...ధైర్యం అన్నీ! మనిషి అంటే భౌతికమైన శరీరం కాదు...మనస్సు!! నీతో కలిసి బతికే మనిషి మనసును నువ్వు ఎంత అర్థం చేసుకుంటావో, కష్టానా సుఖానా నీకు నేనున్నానన్న భరోసాని ఎంత కల్పిస్తావో, ఏదైనా సమస్య వచ్చినప్పుడు మనసుకు సాంత్వన కలిగే మాటలు ఎంత చెబుతావో అవతలిమనిషి అంత ధైర్యంగా, నిబ్బరంగా, ఆనందంగా ఉంటుంది. కాని ఈ రోజుల్లో మీ తరం మనుషులు చేస్తున్నదేమిటో తెలుసా....భార్య లేదా భర్త గురించి కించిత్తూ ఆలోచించకపోవడం...పట్టించుకోకపోవడం...నోటికొచ్చిందేదో మాట్లాడెయ్యడం.. అదే మీరు చేస్తున్నది. మనుషుల మధ్య సంబంధాలు తగ్గిపోతూ ఉండటానికి, చాలా వివాహాలు విచ్ఛిన్నమవడానికి కారణం ఇదే...మనసుతో సంబంధంలేని బతుకు! నీకు డబ్బు పిచ్చి, మరొకడికి అహంకారం, ఇంకొకడికి ఛాందసం..మరో ఆడదానికి అనుమానం...ఇంకో ఆడపిల్లకి ధనదాహం...కారణాలేవైతేనేం గాక, ఎవరు పెత్తనం చెలాయించగలిగితే వాళ్లు చెలాయిస్తున్నారు. రెండోవాళ్లు తలొగ్గుతున్నారు...లేదా

ఎదురు తిరుగుతున్నారు.''

రాకేష్ మౌనంగా తలవంచుకుని ఊరుకున్నాడు.

''ఒకరినొకరు అర్థం చేసుకుని ఒకరి తప్పులు మరొకరు దిద్దుతూ మనసా వాచా ఐక్యం కావడం మీకు చేతగావడం లేదు. స్వార్ధం, అహంకారం అడ్డొస్తున్నాయి. ఎడమొహం పెడమొహం బతుకులు బతుకుతున్నారు. అబద్ధాలకూ మోసాలకూ అలవాటు పడుతున్నారు. వివాహేతర సంబంధాలకు ఆకర్షితులవుతున్నారు. ఎన్ని చేసినా ఒకటిగా బతకలేక విడిపోతున్నారు. ఇక తనూజ విషయానికొస్తే తను చాలా సెన్సిటివ్..అంటే సున్నిత మనస్కురాలు. అటువంటి ఆడవాళ్లు మొగుడు ఆనందంగా లేకపోతే భరించలేరు. ఎందుకంటే వాళ్ళు మొగుడిచుట్టూనే తమ ప్రపంచాన్ని అల్లుకుంటారు కాబట్టి. వాళ్ళ ఆనందమేదో మొగుడి సంతోషం లోనే ఉంటుంది కాబట్టి. తనూజ కూడా అంతే. నీ ఆనందమే తన సంతోషంగా బతుకుతోంది. ఇప్పుడు తన ఉద్యోగం పోయింది. నువ్వు చిరాకు పడిపోతావు. వెంటనే మరో ఉద్యోగం వెతుక్కుని నిన్ను సంతోష పరిచే శక్తి, ఓపిక తనకిప్పుడు లేవు. దాంతో గాభరా పడిపోయింది. .... ఏడో నెల నడుస్తున్న మనిషి కాబట్టి ఆ గాభరాతో బీపీ పెరిగి మొదటికే మోసం వచ్చింది. అంచేత జరిగినదానికంతటికీ కారణం నువ్వు..! అయినా నీకు నీ తప్పు తెలియడం లేదు. ఎదురు తనూజనే తిడుతున్నావు. మెత్తనివారిని చూస్తే మొత్తబుద్ధి అని...ప్రపంచం మొత్తం సున్నితంగా ఉండేవాళ్ళతో ఇలాగే నిర్దాక్షిణ్యంగా ఆడుకుంటుంది...ఇప్పుడు నువ్వు ఆ పిల్లని తిడుతున్నట్టే! తనూజ ఉద్యోగం పోయింది అనగానే నువ్వు తన పరిస్థితి గురించి మనసు పెట్టి ఆలోచించి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. ఇప్పటికైనా మించిపోయింది లేదు....''

''ఆంటీ...''

ఒక్క తీరుగా కొడుక్కి హితబోధచేస్తున్న హేమలత, ఉన్నట్టుండి వినిపించిన ఆ పిలుపుకి ఉలికిపాటుగా తిరిగి చూసింది.

ఎప్పుడొచ్చిందో తనూజ, బెడ్ రూమ్ గుమ్మంలో నిలబడి ఉంది.

హఠాత్తుగా వచ్చిన ఆమెని చూసి రాకేష్ కూడా ఉలిక్కిపడ్డాడు. వడిలిపోయిన గులాబీలా ఉన్న భార్య రూపం ఆ క్షణంలో అతని మనసుని కదిలించి, ఆమె గురించిన ఆలోచనకి బీజం వేసింది.

''ఆంటీ, మీరు అనవసరంగా నా కోసం శ్రమ పడకండి. నేను మా అమ్మా వాళ్ళింటికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాను.. మరిక రాను!'' తనూజ నెమ్మదిగానే అయినా స్పష్టంగా చెప్పింది.

శ్రోతలిద్దరూ మరోసారి త్రుళ్ళిపడ్డారు. ఇద్దరికీ నోట మాట రాలేదు.

తనూజే మళ్ళీ మాట్లాడుతూ, ''నా తరపున ఇంతలా మాట్లాడుతున్నారు. నా మనసులో మాట మీకు చెప్పి వెళ్ళడం న్యాయమని వచ్చాను....నాకు పింక్ స్లిప్

వచ్చిందనగానే రాకేష్ ''పోన్లే...కొంప మునిగిపోయిందేమీ లేదు. ఎటూ నీకు డెలివరీ దగ్గరపడుతోంది...కొన్నాళ్ళ పాటు హాయిగా ఇంట్లో రెస్ట్ తీసుకో'' అంటాడేమో అని ఆశపడ్డాను. కానీ తను అలా అనడని నాకు తెలుసు. అనుకున్నట్టే మొక్కుబడిగా డోంట్ వర్రీ అనేసి, ట్రై ఫర్ అనదర్ అన్నాడు. నాకు అర్థమైపోయింది...నాకు అదే జీతం మీద గాని లేదా అంతకంటే ఎక్కువ ప్యాకేజీ మీద గాని ఉద్యోగం వచ్చే వరకూ తనకి నిద్రపట్టదు...నాకు ప్రశాంతత ఉండదు. నేను మరో నాలుగు రోజుల్లో లీవ్ తీసుకుని హాయిగా నా పాప గురించి కలలు కంటూ కాలక్షేపం చేద్దామనుకున్నాను. ఇప్పుడిక నాకు హాయీ, ప్రశాంతతా కల్లో మాటే. ...నెలలు నిండినా కూలిపనికి వెళ్లే ఆడదానికీ నాకూ తేడా లేదు. ఆ ఆలోచనలతో ఒక్కసారిగా గాభరా వచ్చేసింది. ఆ గాభరా నా పాపని బలితీసుకుంటుందన్న ఆలోచన నాకు లేకపోయింది. అదే ఉంటే బహుశా రాకేష్‌ని లక్ష్యపెట్టక పోయేదాన్నేమో. ఆ క్షణం నా ఆలోచనల్లో రాకేష్ తప్ప మరెవరూ లేరు. దాంతో నా గాభరా నా పాపని మింగేసింది. ఐసియులో కూడా ఎలా ఏడ్చానో అక్కడి నర్సులకీ ఆ భగవంతుడికే తెలుసు. అయిపోయిందేదో అయిపోయింది...అయినా నాకు రాకేష్ మీద ఇంకా ఆశే. మా అమ్మ తీసుకువెళతానంటే రానని చెప్పి ఆస్పత్రి నించి నేరుగా ఇక్కడికొచ్చాను...ఎందుకో తెలుసా ఆంటీ....నా బిడ్డకి తండ్రి అయిన వాడితో నా దుఖాన్ని షేర్ చేసుకుందామని! పుట్టబోయేబిడ్డ గురించి నేను ఎన్ని కలలు గన్నానో రాకేష్‌కి బాగా తెలుసు. తను వెక్కిరించేవాడు నన్ను. నేను ఆనందంగా నవ్వేదాన్ని. ఇప్పుడు ఆ బిడ్డ నాకు దక్కకుండా పోయాడు. ''పోనీలే...ఏడవకు. ఏడాది తిరక్కుండా మనకి మళ్ళీ బాబో పాపో పుడతారు. ఈసారి జాగ్రత్తగా ఉందాం...'' లాంటి మాటలన్నీ ఆశించి ఇక్కడికి వచ్చాను. కానీ, నాకు దక్కినదేమిటి...తిట్లు! ఒక ఓదార్పు లేదు...ఒక సానుభూతి లేదు...''నీకు బుద్ధి లేదు.. పిచ్చెక్కిపోయి అంతా నాశనం చేశావు...బిడ్డని పొట్టన పెట్టుకున్నావు...'' అదే మాట...అవే తిట్లు!! మీరు చెప్పండి ఆంటీ....నా బిడ్డని నేను చంపేశానా...'' తనూజ ఒక్కసారిగా సోఫాలో కూలబడి వెక్కి వెక్కి ఏడ్చింది.

కొడుకు వైపు తీక్ష ్ణంగా చూసి చప్పున వెళ్లి కోడలి పక్కన కూర్చుని ఆ పిల్లని దగ్గరగా పొదువుకుంది హేమలత. ఒక్క నిమిషం ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

తర్వాత రాకేష్ వంటింట్లోకి వెళ్లి వేడిగా టీ పెట్టి తీసుకొచ్చి తల్లికీ తనూజకీ ఇచ్చాడు. ఇద్దరూ నిశ్శబ్దంగా తీసుకున్నారు.

''అమ్మా, ఇప్పుడు నేనేం మాట్లాడినా డ్రామాలా ఉంటుంది. పైగా నా మీద నాకే నమ్మకం కలగడం లేదు కూడా....ఉన్నపాటున నాకు బుద్ధొచ్చేసింది అనడానికి ఇది కథ కాదు...జీవితం. కాకపోతే మీ ఇద్దరి మాటల వల్లా నాలో అంతర్మధనం మొదలైందన్నది నిజం. అలాగే తనూజ అంటే నాకు చాలా ఇష్టం అన్నదీ నిజమే. తను ఉద్యోగం చేసి సంపాదించకపోయినా కూడా....ఐ లవ్ హర్ అండ్ ఐ వాంట్ హర్ ఫరెవర్...నువ్వు

చెప్పినట్టు తను మెత్తగా ఉండబట్టి తిట్టినా పడుతుందిలే అన్నట్టుగా తిట్టాను గానీ తన మనసు బాధ పడుతుందన్న ఆలోచన లేకపోయింది. ఇక మీదట ఐ విల్ మేకోవర్ మైసెల్ఫ్. ప్లీజ్ గివ్ మీ సమ్ టైం...'' నెమ్మదిగా చెప్పి తనూజ చేతిలో ఖాళీ టీ కప్పు తీసుకున్నాడు రాకేష్.

భయంగానే కోడలి మొహంలోకి చూసిన హేమలతకి ఆ మొహంలో పునరుత్తేజం పొందుతున్న ప్రేమా, ఆశా, ఆనందమూ కనిపించి....మనసు కాస్త కుదుటపడింది!!

***


**లక్ష్మీ గాయత్రి**

లక్ష్మీ గాయత్రి గత నలభై సంవత్సరాల నించి విశాఖపట్నం లో ఉంటున్నారు. 1983 నుంచి దాదాపు చందమామ ఆగిపోయేదాకా అందులో కథలూ సీరియల్సు రాశారు. ఆ తర్వాత పదేళ్ళ పాటు ఏమీ రాయలేదు. మళ్లీ రెండు మూడు సంవత్సరాల నుంచి మామూలు కథలు రాస్తున్నారు. ఇప్పటి వరకు మూడు ప్రథమ బహుమతులు, ఒక ద్వితీయ బహుమతి, ఒక తృతీయ బహుమతి కొన్ని ప్రోత్సాహక బహుమతులు వచ్చాయి. ముల్కనూరు నమస్తే తెలంగాణ కథల పోటీలో బహుమతి రావడం ఇది రెండోసారి.

+91 63025 55947



# కరిగినమేఘం

**లక్ష్మి ప్రశాంతి**

ఉదయం ఎనిమిదైనా మత్తుగా నిద్రపోతుంది మేఘ.అప్పుడే ఆమెను నిద్ర లేపడానికి బెడ్రూమ్ లోకి వచ్చిన ఆకాశ్ కి మేఘ ముఖంలో అలజడి స్పష్టంగా కనిపించింది. ఆ అలజడికి కారణం ఏమిటో అతనికి తెలుసు. ఆ స్థితి నుంచి ఆమెను బయటకు తీసుకురావడానికి తన సాయశక్తుల ప్రయత్నిస్తున్నాడు.మంచపై కూర్చోని ఆమె తలలోకి చేతివేళ్లను పోనిస్తూ "మేఘా "అని పిలిచాడు ప్రేమగా. ఆమెలో ఎలాంటి కదలిక లేదు.మరోసారి కొంచెం గట్టిగా పిలిచాడు. ఈసారి అతని పిలుపు ఆమె చెవులను తాకినా రాత్రి వేసుకున్న మందుల ప్రభావం వల్ల కళ్ళు తెరవలేకపోయినా ఆ పిలిపులోని ప్రేమ ఆమె మనసుకు తెలుస్తోంది. ఆమెను డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేనివాడిలా మేఘ తల నిమురుతూ ఉండిపోయాడు ఆకాశ్. కొంతసేపటికి మెలుకున్న మేఘ "గుడ్ మార్నింగ్ " అంది ఆకాశ్ ని చూస్తూ. "గుడ్ మార్నింగ్.త్వరగా ఫ్రెషై రా.ఈరోజు నీకిష్టమైన టిఫిన్ చేశాను. "ఊరిస్తున్నట్టుగా అంటూ బద్ధకంగా ఉన్న ఆమెను బలవతంగా బాత్రూం లోకి తోసాడు ఆకాశ్. మేఘ వచ్చి డైనింగ్ టేబుల్ ముందు కూర్చోగానే హాట్ బాక్స్ లోంచి వేడిగా ఉన్న ఉప్మా పెసరట్టుతో పాటు అల్లంచట్నీ ఆమె ప్లేట్ లో వడ్డించి "టేస్ట్ ఎలా ఉందో చెప్పండి మేడం "అంటూ తనూ వడ్డించుకున్నాడు. అతని మాటలకు పెసరట్టు ముక్క తుంచుకుని తింటున్న మేఘ చిన్నగా నవ్వి "చాలా బాగుంది ఆకాశ్ "అంది. ఇద్దరు మాటల్లో పడిపోయారు. ఈ మధ్య మేఘలో చాలా మార్పు కనిపిస్తోంది. మొదట్లో తనతో మాట్లాడటానికే పెద్దగా ఇష్టపడని మేఘ ఇప్పుడు బాగానే మాట్లాడుతోంది.తను ఇంకొంచెం ఓపిక పడితే చాలు ఆమె మనసులో భయాలన్నీ తొలగిపోయి అందరాడపిల్లల్లాగానే తను మాములుగా అవుతుంది. అప్పుడిక మా వైవాహిక జీవితం కూడా ఆనందమయం అవుతుంది అనుకున్నాడు తనతో ఉత్సాహంగా కబుర్లు చెబుతున్న మేఘను చూస్తూ. "మేఘా టాబ్లెట్స్ వేసుకో "టిఫిన్ తిని సోఫాలో ఫోన్ చూస్తూ కూర్చున్న మేఘకు మెడిసిన్స్, వాటర్ బాటిల్ అందిస్తూ అన్నాడు ఆకాశ్. అవి చూడగానే ఆమె మొహం అప్రసన్నంగా మారిపోయింది. "ప్లీజ్ ఆకాశ్ తర్వాత వేసుకుంటాను." అంది వాటిని పక్కన పెట్టేస్తూ. "మేఘా ఇవి నీకోసం కాదు. నాకోసం, మనకోసం. నువ్వు అందరమ్మాయిల్లాగా నార్మల్ లైఫ్ లీడ్ చెయ్యడానికి వేసుకోవాలి. జరిగిందేదైనా అది గతం మేఘా.దాన్ని ఎంత త్వరగా మర్చిపోతే నువ్వు అంత సంతోషంగా ఉండగలవు. "ఆమెకు

నచ్చచెబుతున్నట్టుగా అన్నాడు ఆకాశ్. మెల్లగా అతని చేతుల్ని ఆమె చేతుల్లోకి తీసుకోని పెదవుల వరకు తీసుకువెళ్ళింది కానీ ముద్దు పెట్టుకోలేకపోయింది. ఆక్షణం ఆకాశ్ ని చూడాలంటే ఆమెకు గిల్టీగా అనిపించింది.ఇంతలో అతని ఫోన్ రింగ్ అయింది ఆమెను రక్షించడానికి అన్నట్టు. ఆకాశ్ తన చిన్ననాటి స్నేహితుడే కాదు.తన గురించి అంతా తెలిసి కూడా తనను ప్రాణంగా ప్రేమించి పెళ్లి చేసుకున్న వ్యక్తి.పెళ్ళైన నాలుగు నెలల్లో అతనికి భార్యగా దగ్గర కాలేకపోయినా ఏమాత్రం అడ్వాంటేజ్ తీసుకోకుండా తనంతట తను అతనికి దగ్గరయ్యే క్షణాలకోసం ఓర్పుగా ఎదురుచూస్తున్నాడు.ఆమె పరిస్థితి మెరుగుపర్చడానికి సైకియాటిస్ట్ దగ్గకు తీసుకెళ్లాడు. అప్పటినుండి మెడిసిన్స్ వాడుతూనే ఉంది. ఆ మందులకంటే కూడా ఆకాశ్ ప్రేమే మేఘను ఎక్కువ కదిలిస్తోంది. మగాళ్లను చూస్తేనే ముడుచుకుపోయే మేఘ ఆకాశ్ తో మనస్ఫూర్తిగా మాట్లాడుతోంది. అతనికి దగ్గరవ్వాలనే ఆశ ఆమె అంతరాంతరాళాల్లో ఉంది. ఆ దుర్గటన తాలూకా జ్ఞాపకాలు ఆమెలో ఘనీభవించి మేఘను గతం నుండి బయటకు రానీయకుండా చేస్తున్నాయి.మేఘుకు ఒక్కసారిగా ఏడవాలనిపించింది.మనసులో పేరుకుపోయిన దుఃఖమంతా కరిగిపోయేలా ఏడవాలని ఉంది .చివరిగా తను ఏడ్చి పదిసంవత్సరాలపైనే అయింది. ఆ సంఘటన తర్వాత తను ఎడవడమే మానేసింది.అమ్మానాన్నా,డాక్టర్లు ఎవరెంత ప్రయత్నించినా మేఘ ఏడవలేదు. "మేఘా "అన్న ఆకాశ్ పిలుపుతో ఆలోచనల నుండి బయటకు వచ్చింది. ఫోన్ మాట్లాడి ఎప్పుడు వచ్చాడో చేతిలో టాబ్లెట్స్ పట్టుకొని మేఘనే చూస్తున్నాడు. మారుమట్లాడకుండా అతని చేతిలో టాబ్లెట్స్ తీసుకుని వేసుకొంది. "గుడ్ గర్ల్ "ఆమె తల నిమురుతూ "ఆఫీస్ కి వెళ్ళొస్తాను. ఏం ఆలోచించకుండా రెస్ట్ తీసుకో. లంచ్ రెడీ చేసి డైనింగ్ టేబుల్ మీద పెట్టాను. అన్నీ నీకిష్టమైనవే చేశాను.ఒక్కటి కూడా మిగల్చకుండా తినాలి. ఓకే నా "అన్నాడు ఆకాశ్. అప్పుడప్పుడు ఇలా వంట చెయ్యడం అతనికి అలవాటే. నవ్వుతూ తలూపింది మేఘ.వెళుతున్నవాడల్లా మళ్ళీ వెనకకు వచ్చి "టేక్ కేర్ మేఘా "అన్నాడు. తల ఎత్తి ఆకాశ్ కళ్ళలోకి చూసింది.ఆ కళ్ళలో అంతులేని ప్రేమ కనిపించింది.ఒక్కక్షణం అతని గుండెల్లో వాలిపోవాలనిపించింది మేఘకు.అంతలోనే ఏదో భయం ఆమెను వెనుకకు లాగింది.అది భయమో మరింకేదో స్పష్టంగా ఆమెకే తెలీదు. "సరే "అన్నట్టు తలఊపి తలుపు వరకూ వెళ్లి అతన్ని పంపించి డోర్ లాక్ చేసుకొని టీవీ ముందు కూర్చున్న మేఘను గడిచిన చేదుజ్ఞాపకాలు పలకరించాయి. "పెద్దమ్మకు ఏం కాదు అక్కా.నువ్వు ఏడవకు.మేఘను చూడు నువ్వేడుస్తుంటే ఎలా బిక్కమొహం వేసుకుందో "ఒకపక్క శారదని ఓదార్చుతూనే హడావిడిగా ఆమె లగేజ్ బ్యాగ్ సర్దుతోంది రూప. "అవును వదినా అతయ్యగారికి ఏంకాదు. నువ్వు కంగారు పడకు. ముందు కళ్ళు తుడుచుకో "భార్య రూపతో ఏకీభవిస్తూ శారదను సముదయించాడు ప్రకాష్. "అది కాదు ప్రకాష్ మాములు అనారోగ్యమైతే ఫోన్ చెయ్యడు మా అన్నయ్య. ఉన్నపళంగా

రమ్మన్నాడంటే ఆమ్మకు సీరియస్గానే ఉండి ఉంటుంది. సమయానికి మీ అన్నయ్య కూడా ఊర్లో లేరు. ఆఫీస్ పనంటూ ఊరేళ్లారు. నాకు కాలుచేయ్యి ఆడటంలేదు." అంది శారద. "అన్నయ్యకు ఫోన్ చేశా వదినా. వెళ్లిన పని అవ్వగానే అటునుంచి ఆటే మీ ఇంటికి వస్తానన్నాడు ." అన్నాడు ప్రకాష్. ఒకపక్కన నుంచొని ఈ సంభాషణంతా వింటున్న మేఘ శారద దగ్గరకి వచ్చి "ఏమైందమ్మా అమ్మమ్మ కి " అడిగింది. "అమ్మమ్మకి ఆరోగ్యం బాగాలేదని మావయ్య ఫోన్ చేసాడమ్మా. "కూతుర్ని దగ్గరికి తీసుకుంటూ చెబుతూనే "రూప మేఘని నాతోపాటు తీసుకెళదామంటే రేపటినుండి తనకి ఎగ్జామ్స్ ఉన్నాయి ".అంది తోడికోడలు రూపవైపు చూస్తూ. "మరేం పర్వాలేదు అక్కా .మేఘ మాయింట్లో ఉంటుంది."అంది రూప. "అవుననుకో రూప.మేఘని వదిలి ఎప్పుడూ ఉండలేదు. తనను వదిలి వెళ్లాలంటే నాకెలాగో ఉంది "అంటున్న శారద దగ్గరకి వచ్చి "వదినా మేఘ మీకే కాదు మాకూ కూతురే.తన గురించి నేవ్వేమి దిగులు పడకు."ప్రకాష్ ధైర్యం చెప్పగా మేఘని వదలలేక వదిలి వెళ్ళింది శారద. శారద భర్త శ్రీనివాస్ ప్రకాష్ సొంత అన్నదమ్ములు.శ్రీనివాస్ గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నాడు.అతనికి శారదతో పెళ్ళై పదమూడేళ్లు కాగా వాళ్ళ పన్నెండేళ్ల గారాలపట్టి మేఘ.ఆమె ఇప్పుడు ఏడోతరగతి చదువుతొంది.ప్రకాష్ వ్యాపారం చేస్తూన్నాడు.అతనికి రూపతో వివాహమై అయిందేళ్లయింది.వాళ్లకు ఇంకా పిల్లలు లేరు.అన్నదమ్ములిద్దరూ వారసత్వంగా వచ్చిన స్థలంలో ఇళ్ళు కట్టుకున్నారు.శారద రూప కూడా సొంత అక్కాచెల్లెళ్లలా కలిసిపోయారు. ఇంతవరకూ ఎప్పుడూ తల్లిని వదిలి ఉండకపోవడంతో మేఘకి చాలా బెంగగా ఉంది.అది గమంచిన రూప మేఘతో సరదాగా మాట్లాడుతూ ఆమె బెంగ పోగొట్టడమే కాక మరుసటిరోజు పరీక్షకి సిద్ధం చేసింది. ఏడున్నరకల్లా మేఘకి టిఫిన్ పెట్టడంతో పాటు ఆమెకు తనకు లంచ్ బాక్స్ లు సర్దింది రూప.రూప ప్రైవేట్ కాలేజీలో పనిచేస్తుండటంతో ఉదయం లంచ్ తీసుకోని వెళితే తిరిగి వచ్చేది సాయంత్రం అరింటికే.అందువల్ల మేఘని స్కూల్ కి తీసుకువెళ్లి తీసుకొచ్చే బాధ్యత ప్రకాష్ తీసుకున్నాడు. శారదవాళ్ళ అమ్మగారికి హార్ట్ఎటాక్ వచ్చిందని సమయానికి హాస్పిటల్ కి తీసుకువెళ్లడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు ప్రకాష్ దంపతులు.ఆఖరి పరీక్ష వ్రాసి ఇంటికి వచ్చింది మేఘ.ఫోన్ మోగడంతో పరిగెత్తుకుంటూ వెళ్లి ఫోన్ తీసింది.తను ఊహించినట్టుగానే వాళ్ళమ్మ శారద దగ్గరనుంచి ఫోన్.పరీక్షలన్నీ బాగా వ్రాసానని ర్యాంక్ గ్యారెంటీ అని ఆనందంగా తల్లితో చెప్పింది.అమ్మమ్మకి తగ్గిపోయిందని రాత్రి బస్ కి బయల్దేరి నేను నాన్నా వచేస్తున్నామని శారద చెప్పడంతో మేఘ ఆనందం రెట్టింపు అయింది.కొద్దిసేపు మాట్లాడి ఫోన్ పెట్టేసి వెనక్కి తిరిగేసరికి గుమ్మంలో ప్రకాష్ నుంచొని ఉన్నాడు. కాలేజీ నుండి వచ్చేసరికి తెరిచివున్న తలుపుల్ని చూసి ఆశ్చర్యపోతూ ఇంట్లోకి అడుగుపెట్టింది రూప.ఇది ప్రకాష్ ఇంట్లో ఉండే సమయం కాదు.మేఘని స్కూల్ నుంచి ఇంట్లో దింపి వెళ్ళిపోతాడు.మేఘ

ఉన్నా తలుపులు వేసే చదువుకోవడమో,రాసుకోవడమో చేస్తోంది.అలాంటిది తలుపులు తెరిచి ఉండటం మేఘ కూడా ఎప్పటిలాగా హాల్లో లేకపోవడంతో "మేఘా "అని పిలుస్తూ లోపలికి వెళ్ళింది.సమాధానం లేదు.ఇల్లంతా వెతికింది.చివరిగా బెడ్రూమ్ లోకి వెళ్లి చూసేసరికి మంచంపైన చెదిరిన దుస్తులతో రక్తమోడుతూ కనిపించింది మేఘ.తను చూస్తున్నదేమిటో అర్ధం కాలేదు రూపకి.మరింత పరిశీలనగా చూసేసరికి మేఘ లేతశరీరం నిండా గోళ్ళగాట్లు,పంటిగుర్తులు.ఏం చెయ్యాలో తోచనట్టుగా ఒకక్షణం అలా నుంచుండిపోయింది రూప.ఆతరువాత ప్రకాష్ కి ఫోన్ చేసి విషయం చెప్పింది.మేఘుని తడుతూ లేపసాగింది.ఆమెలో ఎలాంటి చలనం లేదు.వంటింట్లోకి పరిగెత్తి ఫ్రిజ్ లోంచి వాటర్ బాటిల్ తీసుకువచ్చి మేఘ మొహం మీద జల్లింది.ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు.మేఘుని చూస్తుంటే కళ్ళల్లోంచి నీళ్లు వచ్చేస్తున్నాయి రూపకి.ఈలోగా ప్రకాష్ రావడంతో మేఘుని హాస్పిటల్ కి తీసుకువెళ్లారు. " హలో అక్కా మీరు త్వరగా బయల్దేరి రండి.మేఘుకి వంట్లో బాలేదు "శారదతో చెప్పి మరో మాటకు అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసింది రూప.రూప చెప్పిందేమిటో శారదకు అర్ధం కాలేదు.సాయంత్రం తనతో బాగానే మాట్లాడిన మేఘుకి ఉన్నటుండి ఆరోగ్య పాడవడం ఏంటి.?అదే విషయం ఫోన్ చేసి అడిగింది శారద."అక్కా నువ్వు,బావగారు వచ్చెయ్యండి.అంతకుమించి నన్నేం అడగకు."ఏడుస్తూ అంది రూప.శారదకు అంతా అయోమయంగా ఉంది.వెంటనే బయల్దేరారు శారద శ్రీనివాస్ లు. ఒంటినిండా గాట్లతో స్పృహలేకుండా ఉన్న మేఘుని చూడగానే మతిపోయినట్టు అయింది శారద,శ్రీనివాస్ లకు.అప్పుడే రౌండ్స్ కి వచ్చిన డాక్టర్ మేఘుపై ఎంత దారుణంగా అత్యాచారం జరిగిందో చెబుతొంటే ఏడుస్తూ కుప్పకూలిపోయింది శారద.ఆమెను ఓదార్చడం ఎవరితరం కాలేదు. నిద్రహారాలు మాని మేఘ దగ్గరే పిచ్చిదానిలా కూర్చొని ఉంది.ఎవరెంత బతిమాలినా భోజనం కాదుకదా కనీసం కాసిన్ని టీనీళ్లు కూడా తాగలేదు.పైకి నిబ్బరంగా కనిపిస్తోన్న భార్యాబిడ్డని చూస్తోంటే గుండె పగిపోతున్నట్టు ఉంది శ్రీనివాస్ కి.రెండురోజుల తర్వాత స్పృహలోకి వచ్చిన మేఘ ఆమె పరిక్షిస్తున్న డాక్టర్ ని చూడగానే పెద్దగా అరుస్తూ అతన్ని దూరంగా తోసేసింది.తల్లితండ్రి ఎంత ఆపాలని ప్రయత్నించ్చినా మేఘ ప్రతిఘటించడమే కాకుండా మరింత బలంగా తండ్రిని సైతం దూరంగా నెట్టేసింది.కొంతసేపటికి మామూలైన కూతుర్ని అడగలేక అడిగింది శారద. "చిట్టితల్లి నిన్నెవరు ఇలా చేశారు.అసలేం జరిగిందమ్మా." తల్లి మాటలు వినబడనట్టు శూన్యంలోకి చూస్తూఉన్న మేఘ నిమిషం తర్వాత ఆరోజు జరిగిందతా చెప్పసాగింది. "బాబాయ్ అమ్మా.ఆరోజు నీతో ఫోన్లో మాట్లాడక బయటకు వెళ్లిన బాబాయ్ మళ్ళీ ఇంటికి వచ్చాడు.నేను ఎగ్జామ్స్ బాగా రాసినందుకు చాక్లెట్స్ తీసుకొచ్చానన్నాడు.అవి నాకు ఇచ్చి పక్కన కూర్చొని నా ప్రైవెట్ పార్ట్స్ ని తడమసాగాడు.నాకు చాలా భయం వేసిందమ్మా.వద్దని ఎంతచెబుతున్న వినకుండా

నన్ను బెడ్రూమ్ లోకి తీసుకువెళ్లి "చెబుతున్న మేఘ భయంతో చిన్నగా వణుకుతోంది. "ఇంకేమీ చెప్పొద్దు మేఘ.నాకు అర్థమైంది."ఆపై వినలేనట్టు ఏడుస్తూ కూతుర్ని కౌగిలించుకుంది శారద .అక్కడే ఉన్న రూప మేఘ చెప్పిందంతా విని నిర్ఘాంతపోయింది.మేఘ సృహలోకి వచ్చినప్పటినుంచి ప్రకాష్ ఎందుకు కనిపించకుండా పోయాడో అర్థమైంది రూపకి.ఒకరికౌగిలిలో ఒకరు ఒదిగిపోయి నరకాయతన అనుభవిస్తోంన్న తల్లికూతుళ్ళను క్షమాపణ అడగాలనిపించినా పసిపాపకి రక్షణ ఇవ్వలేని తను,ఆపాపని చిదిమేసిన ప్రకాష్ క్షమకి అర్హులు కాదనిపించి మౌనంగా బయటకు నడిచింది.కాసేపటికి తేరుకున్న శారద కోపంగా రూప ప్రకాష్ ల కోసం చూసింది.వారిద్దరూ కనిపించలేదు.మేఘుకి ఇంజక్షన్ చెయ్యడానికి నర్స్ వచ్చింది.ఇంజక్షన్ చేయించుకోవడానికి మేఘ ఏడ్చి గోల చేస్తుందని తెలిసిన శారద తనను గట్టిగా పట్టుకొంది.నర్స్ ఇంజక్షన్ చేసి వెళ్ళిపోయినా మేఘ ఏడవలేదు.అప్పుడు గమనించింది శారద.మేఘ శారీరకంగా,మానసికంగా ఎంత బాధ అనుభవిస్తోన్నా ఏడవడంలేదన్న విషయాన్ని.ప్రకాష్ చేసిన దుర్మార్గం గురించి చెప్పేటప్పుడు కూడా ఆమె మొహంలో భయం,బాధ కనిపించయే తప్ప కంటినుండి ఒక్క కన్నీటిచుక్క కూడా రాలేదు. సంవత్సరం గడిచింది ఉన్న ఊరిని వదిలేసి వచ్చి. సైకియాటిస్ట్ దగ్గర ట్రీట్మెంట్ తీసుకున్నాక మేఘలో మార్పు కనిపిస్తోంది. మొదట్లో తండ్రిని చూసినా ఒణికిపోయే మేఘ ఇప్పుడు శ్రీనివాస్ తో బానే మాట్లాడుతోంది కానీ మగవాళ్ళ పట్ల ఏర్పడిన భయం, విముకత అలాగే ఉండిపోయాయి. తన స్నేహితులంతా అమ్మాయిలే. మేఘ బిటెక్ పూర్తి అయ్యాక తన చిన్ననాటి స్నేహితుడైన ఆకాశ్ పెళ్లి ప్రపోజల్ పెట్టాడు మేఘ తల్లితండ్రుల దగ్గర.మేఘ గురించి అంతా తెలిసిన ఆకాశ్ ఆమెను పెళ్లి చేసుకుంటాననడంతో శారద దంపతులు ఆనందంలో మునిగిపోయారు.పెళ్ళికి రెండు కుంటుబాలకు ఎలాంటి అభ్యంతరం లేదు.ఉన్నదల్లా మేఘుకే.ఆమెకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు.పురుషుడి నీడను కూడా భరించలేని తను ఆకాశ్ ని పెళ్లి చేసుకొని తన మనసులో,జీవితంలో స్థానం ఎప్పటికి ఇవ్వలేదు.అదేవిషయం సున్నితంగా ఆకాశ్ కి చెప్పింది.గతం ఆమెను ఎంతగా గాయపరిచిందో అర్థం చేసుకున్న ఆకాశ్ ఆమె అంటే తనకి ఎంత ఇష్టమో చెప్పాడు.పెళ్ళైనా ఆమె మనసు మారేంతవరకూ ఎదురుచూస్తానని,ఆమెకి కష్టం కలిగించేలా ప్రవర్తించనని మాట ఇచ్చాడు.మరోవైపు తల్లితండ్రులు "మేఘ నీకు ఇష్టం లేకుండా మేము ఏ పని చెయ్యము.నువ్వు మనస్ఫూర్తిగా ఒప్పుకుంటేనే ఈ పెళ్లి జరుగుతుంది ".అంటున్నా తను అంగీకరించాలనే ఆశ వారి కళ్ళల్లో కనిపిస్తోంది.తల్లితండ్రుల్ని బాధ పెట్టడం ఇష్టంలేక,ఆకాశ్ ఇచ్చిన మాటమీద నిలబడతాడనే నమ్మకంతోనూ పెళ్లికి సరే అంది మేఘ. ఫోన్ రింగ్ అవడంతో ఆలోచనల్లోంచి తేరుకొని ఫోన్ తీసుకుంది. "భోజనం చేసావా మేఘా ". అడిగాడు ఆకాశ్. "లేదు ఆకాశ్.నువ్వు తిన్నావా."అంది మేఘ. "తింటూనే నీతో మాట్లాడుతున్న

మేఘ.టైమ్ చాలా అయింది.నువ్వు తిను."అన్నాడు. "సరే ఆకాశ్ ".ఫోన్ పెట్టేసి డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్ళింది.ఉదయం అన్నట్టుగానే అన్నీ ఆమెకు ఇష్టమైనవే చేసాడు ఆకాశ్. భోజనం అయ్యాక ఫోన్లో మునిగిపోయింది మేఘ. పెద్దగా ఉరమడంతో ఫోన్ చూస్తున్న మేఘ ఒకసారిగా ఉలిక్కిపడింది. వంటింట్లోకి వెళ్లి కాఫీ పెట్టుకొని బాల్కనీలోకి వచ్చింది .శ్రావణమాసం కావడంతో ఆకాశం అంతా మబ్బు పట్టి వర్షించడానికి సిద్ధంగా ఉంది.ఆ వాతావరణాన్ని ఆస్వాదిస్తూ కాఫీ తాగింది.సన్నగా జల్లు ప్రారంభమైంది. ఉన్నట్టుండి గుర్తొచ్చింది మేఘకి ఉదయం పని చేసి వెళుతూ కాస్త ఎండగా ఉండటంతో పద్మ టెర్రస్ పైన బట్టలు ఆరేసిన విషయం. హడావిడిగా టెర్రస్ పైకి వెళ్ళింది. అక్కడ కనిపించిన దృశ్యం చూసి ఆమె మనసు బగ్గుమంది. మేఘవాళ్ళ పక్కఫ్లాట్ లో ఉండే కరుణాకర్ ఎదురు ఫ్లాట్ లో ఉండే ఆరేళ్ళ పింకీపై అత్యాచారం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. మేఘలో కోపం, ఆవేశం పోటీ పడ్డాయి. చుట్టూ చూసింది. ఒకపక్కగా ఉన్న పూలకుండీల దగ్గర ఇనుపచువ్వ కనిపించింది. మరోఆలోచన లేకుండా అది తీసుకోని కరుణాకర్ని కొట్టసాగింది. అతను కొట్టవద్దని వారించినా, చేతులు జోడించి ఎవరికీ చెప్పొదని ప్రాధేయపడినా వినిపించుకోలేదు. చివరికి మేఘను తప్పించుకొని వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోగానే ఏడుస్తూ మేఘని చుట్టేసింది పింకీ. అప్పుడు మొదలైంది మేఘ మనసులో కదలిక. ఎన్నోఏళ్లుగా ఘనీభవించిన దుఃఖం ఉప్పెనలా పొంగింది. తనివితీరా గుండెభారమంతా దిగిపోయేలా ఏడ్చింది. ఇప్పుడు మేఘ హృదయం వర్షించిన ఆకాశంలా ప్రశాంతంగా ఉంది. ఆ ప్రశాంతత మేఘ, ఆకాశ్ ల కొత్తజీవితానికి నాందివాక్యం అయింది.

***

**లక్ష్మి ప్రశాంతి**

రచయిత్రి లక్ష్మి ప్రశాంతి.. తల్లి ప్రోత్సాహంతో కళాశాల స్థాయి నుండి కవితలు వ్రాయడం ప్రారంభించి వివిధ పత్రికలకు పంపేవారు.కొన్ని సంవత్సరాలు రచనలకు దూరమైనా సాహిత్యం చదవడం మాత్రం ఆపలేదు. పెళ్లి తర్వాత భర్త సహకారంతో తెలుగు సాహిత్యం తో పాటు బెంగాలీసాహిత్యం కూడా చదవడం మొదలుపెట్టారు. గత నాలుగేళ్ళనుండి మళ్ళీ రచనలు చెయ్యడం ప్రారంభించారు .తెలంగాణ సాహితీవారు విలువరించిన "తెలుగెత్తి జైకొట్టు "వ్యాససంకలనంలో "నాయిని కృష్ణకుమారి జీవితం సాహిత్యంపై వ్యాసం వ్రాసారు.కరోనా కథలు సంకలనంలో "అస్తమయం "కథ ప్రచురితం అయింది. ముల్కనూర్ సాహితీపీఠం మరియు నమస్తే తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో 2021లో "నిషేధిత స్వప్నం "2022లో "కెరటం, 20232024లో "కరిగిన మేఘం "కథలకు వరసగా మూడుసార్లు బహుమతులు గెలుచుకున్నారు.



# నా బలగం

**డా. శ్రీదేవి శ్రీకాంత్**

"నాన్న గారు ఎన్ని సార్లు ఫోన్ చేశానో నిన్నటి నుండి." "చెవుడు మిషన్ యెక్కడ పెట్టానో. కనబడలేదు తల్లీ!" "నీ చెవుడు మిషన్ కు మాట్లాడే యంత్రం మేదైనా జత చేర్చాలి నాన్నా." "వస్తాయి ఆరోజులూ. అవీ కని పెడతారు". "నాన్నా! బాగా దగ్గుతున్నారు. ఎక్కువ మాట్లాడకండి." "దగ్గుదేముంది గానీ, మీరంతా వచ్చెయ్యండి." "నాన్నగారు ఎందుకు అలా మాట్లాడుతున్నారు." "నాకు పిలుపు రాబోతోంది తల్లీ! నన్ను చూడడానికి వెంటనే రండి. నేను పోయాక వచ్చి ఫలితం ఏముంది? ఎందుకో రోజులు దగ్గర పడ్డాయి అనే సంకేతాలు పదేపదే కనిపిస్తున్నాయి." "నాన్నా! అలా అనకండి. వస్తాములే. నేను చెల్లితో మాట్లాడి ఇద్దరం వస్తాము." "సరే నాన్నా! అమ్మకు ఒకసారి ఫోన్ ఇవ్వండి." "అమ్మా! ఎలా ఉన్నావు!?" "నిన్నటికి ఈ రోజుకు ఏమైపోతాను గానీ, నిన్న నువ్వు ఫోన్ చేసినప్పుడు చెబుదాము అనుకుని చెప్పలేదు. ఎక్కడో అమెరికాలో ఉన్న మిమ్మల్ని కంగారు పెట్టడం ఎందుకని!? "ఏమ్మా! ఏమయ్యింది?" "ఏమ్మా!? అంటే ఏమి చెప్పను!? ఎలా ఉన్నాను? అంటే ఒకటే ఆందోళన." "దేనికమ్మా!?" "మీనాన్న గారు "నేను పోయాక పిల్లల దగ్గరికి వెళతావా!? వాళ్ళు చాలా పని బిజీలో ఉంటారు. అందులో అమెరికాలో పనివాళ్ళు కూడా ఉండరు.నీకూ పనిచేసే ఓపిక కూడా లేదు. వాళ్లకు ఏమి సాయం చేస్తావు!? నాతో వచ్చేస్తావా!" అంటున్నారు." 'నిజానికి మొన్న షుగర్ డౌన్ అయ్యి, బీపీ డౌన్ అయ్యి మూడు రోజులు ఆసుపత్రిలో ఉన్న నాకు, నేను పోతే మీ నాన్న జీవితం ఎలాగా అనుకున్నా? మందులు వేసుకున్నా వెంటనే కొలుకో లేక పోయాను. మిమ్మల్ని రమ్మని చెప్పాలి అనిపించింది." "రమ్మని పిలిస్తే వస్తాము కదా!? మీ కన్నా మాకు ఏమి కావాలి?" 'అమెరికాలోఒక్క నెల జీతం పోతే బోలెడు డబ్బు పోతున్నట్టు ఉంటుంద" అని మన పక్కింటి వాళ్ళ అబ్బాయి రమ్మంటే వాళ్ళమ్మతో అంటాడట. వాళ్ళ అమ్మ చెప్పే మాటలు గుర్తువచ్చాయి." "అందరూ ఒకేలా ఉండరు అమ్మా! మాది మీ పెంపకం." "నాన్న కు ఏమయ్యిందమ్మా!?" "ఇదిగో మీ నాన్న మళ్ళీ నీతో మాట్లాడాలి అంటున్నారు." "హలో! నాన్నా!" 'తల్లీ!కొడుకులు లేని నాకు ముగ్గురు కూతుర్ల లో నువ్వు కొడుకులా నాకు అండ. నువ్వు దగ్గర ఉంటే నాకు కాస్త ధైర్యం ఎక్కువ.వెంటనే బయలు దేరి రా. నేను బ్రతికి ఉండగా కనీసం ఒక నెల అయినా మీతో కబుర్లు చెప్పాలి." "నాన్నా! అలా అనకండి. నాకు కంగారుగా ఉంది. చెల్లాయికి కూడా ఫోన్ చేస్తాను. ఇద్దరం వస్తాము. మీరు ధైర్యంగా ఉండండి" "పిల్లల్ని కూడా తీసుకురా. అల్లుడు గారు

వస్తే మరీ మంచిది."

***

"హలో చెల్లీ!" "ఆ అక్కా!" "ఇందాక నువ్వు ఫోన్ చేసినప్పుడు మీటింగ్ లో ఉన్నాను అక్కా! నేనే ఇప్పుడు నీకు ఫోన్ చేద్దాము "అలాగా!? సరే గానీ నేను చెప్పే విషయం విను. నేను ఇప్పుడు నాన్నతో, అమ్మతో మాట్లాడాను. ఎంతో ధైర్యంగా ఉండే నాన్న ఇలా మాట్లాడటం నాకు కంగారుగా ఉంది." "అవునక్కా! నువ్వు చెప్పే దాన్ని బట్టి నాన్న ఎందుకో భయపడుతున్నారు అనిపిస్తుంది. "చెల్లీ! నాన్న మాటల్లో ఏదో నిగూఢంగా ... నీకు ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు." 'నువ్వూ బయలుదేరు." 'అలాగే అక్కా!"

***

"నాన్నా! కిందటి సారి నేను చూసినప్పటికీ ఇప్పటికీ చాలా చిక్కి పోయావు. ఏమిటో!? మొబైల్ లో వీడియో కాల్ చేసి చూస్తే... సగం వరకే కనబడి నువ్వు ఇలా చిక్కి పోయినట్లు ఇంత ఢీలా పడిపోయినట్లు తెలియలేదు." "పై వాడు పిలుస్తునట్లు అనిపిస్తుంది." 'చూడండీ అమ్మాయి.! మీ నాన్నది ఈ మధ్య ఎంత సేపూ ఇదే వాలకం." "నాన్నా! ఎందుకు మమ్మల్ని కంగారు పెడతారు!?" "కంగారేమీ లేదు గానీ, తల్లీ! నువ్వు మనదేశంలో ఉన్నంత వరకు నా కళ్ళ ఎదురుగా చీర కట్టుకుని తిరగాలి. మనవరాలికి ఓణీ వేయించు." "తా త గారూ... నాకు పం చి క ట్టు కో డం ఇష్టం. ఒక సారి మా ఆ మే రి కా లో సత్య న్నారా యణ వ్రతం అప్పుడు నాన్న నాకు కట్టారు. నీకు గుర్తు ఉందా!? పంచెల పండుగ అప్పుడు నువ్వు నాకు కట్టావు. " "వీడు తెలుగు బాగా మాట్లాడుతున్నాడు""అవును అమ్మమ్మా! అమ్మ ఇంట్లో తెలుగే మాట్లాడ మంటుంది." అంది మనుమరాలు మరింత స్పష్టంగా.

***

"తల్లీ! నీ చేత్తో ఉప్మా చేసి పెట్టు. ఉప్మా పలచగా ఉండాలి." "నాన్నా! మరింత నెయ్యి, జీడి పప్పు వేసి నీకు ఇష్టమైనట్టు పలుచటి ఉప్మా చేశాను." "ఈకాలు వాపు తగ్గడం లేదు. చూడు తల్లీ! నాకు డాక్టర్ చెప్పే మందుల మీద నమ్మకం ఉండదు. అందుకే ఎలా పనిచేస్తాయో గూగుల్ కొట్టి చూస్తా. ఈ ఇంగ్లీషు మందులు వేరే రోగాల్ని తెచ్చి పెడతాయి." "నాన్నా! సాయంత్రం హాస్పిటల్ కు వెళదాము. నేనూ, చెల్లి నిన్ను రేపు ఆసుపత్రికి తీసుకుని వెళతాము."

***

"మీ నాన్నగారికి కొన్ని టెస్ట్స్ చేయాలి ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలి." "అలాగా డాక్టర్!" అన్నారు ముగ్గురు కూతుర్లు. "మీ నాన్నకి కాలు నొప్పికి తగ్గిపోవడానికి కారణం... క్యాన్సర్" అన్నాడు డాక్టర్... పెట్ టెస్ట్ రిజల్ట్స్ చూస్తూ "మీ నాన్నగారికి క్యాన్సర్. నాల్గవ స్టేజ్ లో ఉంది. ఈ క్యాన్సర్ సాధారణంగా చివరి స్టేజ్ లోనే తెలుస్తుంది.ఇప్పటికే చాలా అవయవాలకు పాకింది. ఇంచు మించు ఓ నెలరోజులు

బ్రతకవచ్చు." "అయ్యో! ఏడ్వకండి. మీరు దగ్గరుండి ధైర్యంగా మీ నాన్నగారిని చూసుకోండి." "డాక్టర్! నాన్నకి ఈ విషయం తెలిస్తే తట్టు కోలేరు." "అలాగే! మేమూ చెప్పము." 'మీరు ఈ ఐదు రోజులకు పదకొండు లక్షలు ఖర్చు పెట్టారు. నేను చెప్పాను అని ఈ ఆసుపత్రి వారికి చెప్పవద్దు. నేను ఇక్కడ చాలా కాలంగా పనిచేస్తున్నాను. ఎన్ని లక్షలు ఖర్చు పెట్టినా చివరికి ప్రాణాలు దక్కడం కష్టం. నేను ఇలా అంటున్నాను అనుకోవద్దు.ఇంటికి తీసుకుని వెళ్ళి బంధువులు అందరితో చివరి రోజులు ఆనందంగా గడప నీయండి." "అలాగే డాక్టర్!" "ధైర్యంగా ఉండాలి మీరిద్దరూ. ఆయన ముందు ఏడ్వకండి." డాక్టర్! అమ్మ అన్నీ విషయాల్లో పూర్తిగా నాన్నమీదే ఆధార పడుతుంది. అమ్మకు చెప్పాలా వద్దా!? అమ్మ మందులు ఎప్పుడు ఏమి వేసుకోవాలో తెలియదు. పూర్తిగా నాన్న మీద ఆధార పడుతుంది.అమ్మ ఎలా తట్టుకోగలదు." "మీరు అధైర్య పడవద్దు.ధైర్యం అదే వస్తుంది. ఇదే జీవితం. జీవితం ధైర్యాన్ని ఇస్తుంది. "యమధర్మ రాజు ధర్మ రాజును పరీక్షించడానికి యక్షుని రూపం లో వచ్చి యక్షప్రశ్నలు వేస్తాడు. అందులో ఒక ప్రశ్న...మానవునికి సహాయ పడేది ఏది అంటాడు? "ధైర్యం" అని సమాధానం చెబుతాడు ధర్మరాజు." 'మీ నాన్నకు, అమ్మ కు ఎన్నో సార్లు ఆరోగ్యం బాగోనప్పుడు ధైర్యం చెప్పి మందులు ఇచ్చాను. మందుల కన్నా నాధైర్య వచనాలే బాగా పనిచేసాయి" అన్నాడు మీ నాన్న. 'ధైర్యం అన్ని వేళలా శ్రేయస్కరమైంది. నేను మీ నాన్న ఎన్నో సంవత్సరాలుగా స్నేహితులం."మీనాన్నకు ఈ మధ్య ధైర్యం సన్నగిల్లింది. "మానవుడు మనిషి ఎందుకు అయ్యాడు?" నేను చెబుతాను. మృత్యు భయం వల్ల. దేని వల్ల మనిషి స్థిరంగా ఉండలేడు. భయం వల్ల. ఇది జీవితం. మృత్యువు ప్రతి ఒక్కరికీ తప్పదు. ఈ వాక్యాలు ధర్మరాజు చెప్పినవి. సత్య వచనాలు." "చూడండి! నా మాటవిని ధైర్యంగా ఉండండి. ఇలా ఏడ్వ కూడదు. మీ అమ్మకు ధైర్యం చెప్పాలి మీరు." "అదృష్టం. మీ నాన్న చనిపోయాక మీరు రాలేదు." 'మృత్యువుకు చేరువు అవుతున్నాను అని ఎందుకో మీ నాన్నకు అనిపించింది." "మీ నాన్న ఏ వైద్య పరీక్షలు చేసుకోక ముందు మృత్యువు చేరువలోవున్నది అని తెలుసు కున్నాడు. ఏదో శక్తి మీ నాన్నలో ఉంది. ఆయన పోయే వరకు ప్రతి రోజూ ఆయనకు ఆనందం ఇవ్వండి. క్యాన్సర్ చివరి రోజులు చాలా బాధగా ఉంటాయి. కొందరు ఎన్నో నెలలు ఇబ్బంది పడతారు. మీ నాన్న ఈ విషయం లో అదృష్టవంతుడు. చివరిలో తెలిసింది. పైగా ఇప్పటి వరకు పెద్ద ఇబ్బందులు పడలేదు" అన్నాడు డాక్టర్ " "అమ్మ చేసే పూజలు అయి ఉండవచ్చు డాక్టర్!" 'అయ్యి ఉండవచ్చు" 'నేను ఈ ఆసుపత్రిలో చాలా సంవత్సరాల నుండి పనిచేస్తున్నాను. మీరు నాకు బాగా దగ్గర బంధువులు కాబట్టి చెబుతున్నాను. నేను చెప్పినట్లు చెప్పకుండా మీ నాన్నను డిశ్చార్జ్ చెయ్యమని అడగండి"

***

"నాన్నా! నీకు ఇష్టమని ఆవిరి కుడుము చేశాను." 'ఆకలిగా లేదు తల్లి" "చీరలో మీ

ఇద్దరూ మహాలక్ష్మిల్లా ఉన్నారు." "మీ అక్క రాలేదా!" "పక్కనే ఉంటుంది. కానీ రాదు. దాని ధోరణి ఏమిటో!?" "అన్నయ్యా! నువ్వు ఇష్టం చేసుకుని కాస్త తినాలి. కాస్త తింటేనే కదా బలం వచ్చేది" పెద్ద చెల్లెలు అన్న భుజం పట్టుకుని ఇదుగో రెండు ముద్దలు తినుఅన్నయ్యా!"అంది. "అన్నయ్యా! నా చేతి ముద్దా తినాలి" అంటూ చెల్లెలు కూడా ఆప్యాయంగా తినిపిస్తుంటే బావలు ఇద్దరూ ఎదురుగా కూర్చున్నారు. 'మనం పద్నాలుగు మంది సంతానం. అమ్మ పని చేసుకుంటుంటే నువ్వూ, పెద్దన్నయ్య మాకు వద్దన్నా కుక్కి కుక్కి తినిపించే వాళ్ళట అన్నారు చెల్లెళ్ళు." "అయితే ఇప్పుడు నా ఇద్దరు చెల్లెళ్ళు ఆ కక్ష తీర్చు కుంటున్నారు అన్నమాట" అన్నాడు నవ్వబోయి రొప్పుతూ. అందరూ పెద్దగా నవ్వేశారు. "మిమ్మల్ని అందర్నీ చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది. ఇంత సందడి చిన్నప్పుడు ఉండేది" అన్నాడు తన కుటుంబాన్ని, తమ్ముళ్లను, మరదళ్ళను వారి పిల్లల్ని చూస్తూ... "మీరంతా నా బలం. నా బలగం" అంటున్న అతని కళ్లలో చిన్న కన్నీటి జీర ఛాయగా కదలాడింది.

***

"నా తమ్ముళ్లు, నా వాళ్ళు అందరూ నాకు బాగోలేదని రోజూ చూడ్డానికి వస్తుంటే చిన్నప్పుడు తప్పి పోయిన బాల్యం నాకు ఎదురు పడినట్లు ఉంది. అమెరికాలో ఇంచు మించు ఇరవై సంవత్సరాలు ఉండి ఏమి కోల్పోయానో ఇప్పుడు అర్థం అవుతుంది. ఆ యాంత్రిక జీవితం... ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న బాధ." "తాతయ్యా ! రొప్పుతున్నారు మీరు మాట్లాడకండి" అన్నాడు పెద్ద మనవడు. "మీరంతా వెళ్ళాక అంతా విశ్రాంతి... రేపు మళ్ళీ మీరు వచ్చే వరకు. ఉదయం కోసం ఇప్పుడు నేను ఎదురు చూసినంత ఎప్పుడూ జీవితంలో చూడలేదు. సూర్యుడు చాలా అందంగా అనిపిస్తున్నాడు. రాత్రి చందమామ నిద్రపోనీయడు. మీతో కబుర్లు చెప్పాలి అని నిద్ర మాత్ర వేసుకుని పడుకుంటున్నాను." "మామయ్యా! బాగా రొప్పుతున్నారు. మాట్లాడకండి!" అన్నారు అమెరికా నుండి వచ్చిన అల్లుళ్ళు మామగారికి రెండువైపులా నిలబడి భుజం మీద చెయ్యి వేసి దగ్గరగా తీసుకుని. మీరంతా రోజూ ప్రొద్దుటే నాకోసం రావడం ఎంతో ఆనందంగా ఉంది.

***

"నాన్నా! మీకు సహస్ర చంద్ర దర్శనం పూజలు మేము ఇక్కడ లేము అని చెయ్యలేదు. అయ్యగారికి నీచేత కొన్ని దానాలు ఇప్పించాలి అని మేమందరం ముచ్చట పడుతున్నాము" అన్నారు కూతుర్లు ముగ్గురూ ఏక కంఠంతో. "మనకు ఆ ఆనవాయితీ ఉందా!? నాకు గుర్తు లేదు" "మంచి ఎవరి దగ్గర నుండైనా తీసుకోవచ్చు అని మహాభారతంలో విదురుడు చెప్పాడు అని చెబుతుంటావుగా నువ్వు. నీ చేత, అమ్మ చేత ఈవేడుక చేయించడం మా అందరికీ ఇష్టం" అన్నారు కూతుళ్ళు. "అలాగే మాకందరికీ వడిబియ్యం మీరూ, అమ్మా పోయించాలి.. పుట్టింటి నుండి స్త్రీ పోయించుకునే

వడిబియ్యం ఐశ్వర్యాన్ని ఇస్తుంది అంటావుగా!' అంది పెద్ద కూతురు

****

"అన్నయ్యా! ఇదుగో ఈ పట్టు పంచి కట్టుకోండి." "ఓపిక లేదు. తమ్ముడూ!" "అన్నయ్యా! నీకు గుర్తు ఉందా!? పెద్దన్నయ్యా, నువ్వూ, మా చిన్నప్పుడు మాకు స్నానం చేయించి బట్టలు వేసేవాళ్ళు. ఒకసారి నేనూ, ఆకరి తమ్ముడు కాలవలో ఈది బురదతో వచ్చాము. నువ్వు మా ఇద్దరినీ రెండు దెబ్బలు వేసి స్నానం చేయించి బట్టలు వేశావు" అంటూ మాట్లాడుతూ తమ్ముళ్లు బట్టలు మార్చారు అన్నయ్యకు. అందరి ముఖాల్లో త్వరలో అన్నయ్యను కోల్పోతున్నాం అనే వేదన ఉన్నా పైకి మాత్రం అన్నయ్యకు బాధ కనబడనీయకుండా దిగమింగు కొంటున్నారు . "వదినా! ఈ పట్టు చీర కట్టుకో!" అంటూ ఇద్దరు ఆడ బదుచులు, తోడి కోడళ్ళు చుట్టు ముట్టారు. "నాకు ఇవన్నీ ఈ సమయం లో ఎందుకు?" "వదినా! ధైర్యంగా ఉండు. ఈ చిన్న సంతోషాలు మన రేపటి జీవితంలో తీపి జ్ఞాపకాలు అంటున్న ఆడపడుచుల తో పాటు, తోడికోడళ్ళ కళ్లు చెమర్చినాయి.

***

కుటుంబంలో స్త్రీలకు ఒడి బియ్యం పోయించడానికి సిద్ధం చేయించాడు. చేయించి సాయంత్రం నిండు చంద్రునికి హారతి ఇప్పించారు. బయట చాలా సందడిగా వుంది. ఆ దంపతులను కూర్చో పెట్టి దండలు వేయించి... ఐదుగురు అయ్యావార్లకు భూదానం, గోదానం, స్వర్ణ దానం, వస్త్ర దానం మొదలైన దానాలు చేయంచారు కుటుంబ సభ్యులు.. "మీరు చాలా అలసిపోయారు. ఇళ్లకు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి. అసలు ఈరోజు మిమ్మల్ని ఇక్కడే ఉండమనాలి అని వుంది. ఇల్లు చాలదు. మీరంతా రేపు తొందరగా రండి. మీకు నేను ఒక విషయం చెప్పాలి." అన్నాడు. "ఇప్పుడు చెప్పన్నయ్యా!" అన్నారు అందరూ ఏక కంఠంతో. "కాదు. రేపే చెబుతాను" అన్నాడు గొంతులో కాస్త గంభీరం నింపు కుంటూ.

***

అన్నదమ్ములు, బంధువులు అందరూ వచ్చారు. "అన్నా! రేపు తప్పక రావాలి ఏదో చెబుతాను అన్నావు. అదేమిటో చెప్పకుండా మమ్మల్ని వదిలి వెళ్ళి పోయావు" అంటూ గుండె బాదుకుని ఏడ్వసాగారు. ఆ ఏడుపుకు దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. "ఏమి చెప్పాలి అనుకున్నాడో? అన్నయ్యా!?" అంటూ పెద్దగా ఏడుస్తున్నారు. "మీరంతా వెళ్ళి పోయాక నేనూ అక్కా 'నాన్నా! ఏమి చెప్పాలి అనుకున్నావు అందరికీ అని అడిగాము." "నాన్నకు ఉన్న ఇళ్ళల్లో ఒక ఇల్లు మీ అందరి పేరునా రాయాలని, ఆ ఇంట్లో మీరంతా అప్పుడప్పుడు కలుసుకోవాలని ఉంది" అన్నారు. ఇంకో కోరికగా... "అందరితో కలిసి బలగం సినిమా చూడాలి అని ఉంది" అన్నారు.. అని చెబుతున్న చిన్న కూతురి గొంతు గధ్గధమైంది.

***

## శ్రీదేవీ శ్రీకాంత్

శ్రీదేవీ శ్రీకాంత్ స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం ఆఫ్రికాలోని బోట్స్ వాన దేశంలో ఉంటున్నారు. ట్రాన్స్ లేషన్ స్టడీస్ లో పీహెచ్డీ చేశారు. మొత్తం 5 పీజీలు రెండు PhD లు చేశారు. ప్రస్తుతం క్లినికల్ సైకాలజిస్ట్ గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ 163 కథలు, 1750 తెలుగులో గజల్స్,, 56హిందీ గజల్స్, కొన్ని ఆంగ్ల గజల్స్ రాశారు. రెండు వందలకుపైగా తెలుగు కవితలు, అనేక నానీలు, భక్తి పాటలు, హైకూలు, జానపద పాటలు రాశారు. ఆంగ్ల కవితలు,ఆంగ్ల పాటలు, సైకాలజీలో నాలుగు పుస్తకాలు (ఆంగ్లంలో) తీసుకొ చ్చారు. The Solaris Bloom ఆంగ్ల కవితా పుస్తకాన్ని ప్రచురించారు. భారత్ మాతా కీ జై కథల పుస్తకం, దరహాస్ చంద్రికలు గజల్స్ పుస్తకం, తప్త తరణి నాటిక, తప్త తరణి నాటిక పుస్తకం, విశ్వ విలాపం గేయ కావ్యానికి తానా వారి ఉత్తమ గేయ పురస్కారం వచ్చింది.

# వాడు వెళ్ళి పోయాడు



డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు

కృష్ణ శర్మకు మనసులో మనసు ఉండడం లేదు.రాజ్య లక్ష్మి ప్రవర్తన అతనికి అనేక కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతుంది.

రాత్రి 8 గంటలు కావొస్తుంది.

కృష్ణ శర్మ కొడుకు విజయ్ ఒకటిన్నర ఏండ్లున్న తమ్ముడు మోహి ని ఆడిస్తున్నాడు .

విజయ్ కి ఇప్పుడిప్పుడే ఎనిమిదేళ్లు వస్తున్నాయి. వాడి మాటలే ముద్ద ముద్దగా ఉంటాయి.తమ్ముడు పుట్టినప్పటినుండి తాను పెద్దవాన్ని అనే భావం లోకి వెళ్ళి పోయాడు. ఆరిందలా ప్రవర్తిస్తున్నాడు.నాన్న అప్పుడప్పుడు తనాకు నేర్పిన పద్యాలు , శ్లోకాలు తమ్ముడికి నేర్పడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

''వంటయింది వచ్చేయండి,డైనింగ్ టేబుల్ దగ్గరనుండి పిలిచింది రాజ్యలక్ష్మి. కృష్ణ శర్మ వెళ్ళి కూచున్నాడు. తండ్రిని చూస్తూ అనుకరిస్తూ తాను వచ్చి కూచున్నాడు విజయ్. ఆ వెనకే అంబాడుతూ తో మోహి.

''పిలిచింది నిన్ను కాదు , డాడి ని'', చుర చుర చూస్తూ చెప్పింది రాజ్య లక్ష్మి.

విజయ్ సరే కాసేపు ఆడుకుంటా , అంటూ లేచి వెళ్లిపోయాడు. వెనకనే తానూ పాకుతూ వెళ్ళాడు మోహి.

కృష్ణ శర్మ భోజనం ముగించి వెళ్లిపోయాడు. తరువాత విజయ్ డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళి కూచున్నాడు.

''నీకు అక్కడ కాదు,ఇక్కడ,'' నేలపైన ప్లేట్ పెడుతూ చెప్పింది రాజ్యలక్ష్మి.

''నేను ఇక్కడే తింటాను,'' అన్నాడు విజయ్.

''నువ్వు శుభ్రంగా తినడం లేదు, నువ్వు శుభ్రంగా తినడం నేర్చుకునేదాక అక్కడే తినాలి '' గట్టిగా అంది రాజ్యలక్ష్మి.

''నేను ఇక్కడే తింటాను'' పెంకెగా అన్నాడు విజయ్.

రాజ్యలక్ష్మి విసురుగా వాని చెయ్యి పట్టి లాగి నేల మీద కూచో పెట్టింది. '' చెప్పినట్టు వినకపోతే చంపేస్తాను,''

విజయ్ అంతే విసురుగా లేచాడు,'' నేను అసలు అన్నం తిననే తినను '' అంటూ గదిలోకి వెళ్ళాడు.

రాజ్యలక్ష్మి మోహికి వాడి ఫుడ్ తినిపించింది. మొహిని తీసుకొని బెడ్రూంకి వెళ్ళిపోయింది.

విజయ్ కళ్ళు మూసుకొని పడుకున్నాడు. అమ్మ వచ్చి తనను బలవంతంగా తీసుకొని వెళ్ళి తినిపిస్తుందనుకున్నాడు.అట్లాంటి గొడవలు ఆ ఇంట్లో ఎన్నో సార్లు జరిగాయి.విజయ్ తినని మొండికేసినప్పుడల్లా రాజ్యలక్ష్మి రావడం బతిమాలి, బుజ్జగించి తినిపించడం మామూలే.ఈ విషయం కృష్ణ శర్మకు తెలుసోలేదో, రాజ్యలక్ష్మి మాత్రం ఈ వైపుకు తొక్కేచూడలేదు.

విజయ్ అట్లాగే ఆకలితో నిదుర పోయాడు.

***

కృష్ణశర్మ ఆఫీస్ నుండి వచ్చి సోఫాలో కూచోని టీ తాగుతున్నాడు. రాజ్యలక్ష్మి పాలు పడుతూ మొహిని ఆడిస్తుంది. మోహి మాటిమాటికి డోర్ వైపే చూస్తున్నాడు, అన్న ఇంకా రాలేదని కాబోలు, బెల్ మ్రోగింది. వెళ్ళి డోర్ తీసింది రాజ్యలక్ష్మి.విజయ్ ఒక్క ఉడుతున లోనికి వచ్చాడు. చేతిలో స్కూల్ ప్రోగ్రెస్ కార్డ్ ,

డాడీ , నేను అన్నింటిలో ఫస్ట్ వచ్చాను. ప్రోగ్రెస్ కార్డ్ కృష్ణశర్మ చేతిలో పెట్టాడు.

కృష్ణ శర్మ ప్రోగ్రెస్ కార్డ్ మొత్తం చూశాడు. ఫోర్త్ ఫోరం చదువుతున్న విజయ్ అన్నీ సబ్జెక్టులలో మంచి మార్కులు సాధించాడు. కృష్ణశర్మ విజయ్ వీపు చరిచి 'వెరీ గుడ్' అని మెచ్చుకున్నాడు.

ఇదివరకు అట్లా ప్రోగ్రెస్  కార్డ్ తెచ్చినపుడు రాజ్యలక్ష్మి గబ గబా వచ్చి కార్డ్ లాగుకొని చూసేది. విజయ్ మంచి మార్కులు సాధిస్తే దగ్గరకు లాగుకొని చెంపలు ముద్దాడేది.ఇంట్లో ఏదైనా స్వీట్ కూడా చేసేది.

ఇప్పుడలాంటివి ఏవీ లేక చూస్తూ నిలబడింది.విజయ్ కార్డ్ తెచ్చి ఆమె చేతిలో పెట్టాడు.కార్డ్ చూసి ఊ అంటూ మళ్ళీ ఇచ్చేసింది.తల్లి ముభావంతో విజయ్ చిన్నబుచ్చుకున్నాడు.

***

విజయ్ కి చెప్పలేని దు:ఖం వస్తోంది. చిన్నపటినుండి తనమీద చూపిన మమ్మీ ప్రేమ ఇప్పుడేమయింది ? తనను గారాబం చేస్తూ అన్నం తినిపించడం, పాట పాడుతూ నిద్ర పుచ్చడం , తనని చిన్నగా నడిపిస్తూ స్కూల్ కి తీసుకెళ్ళడం ,స్కూల్ నుండి వచ్చాక ఇంగ్లీషు ప్రాక్టీస్ చేయించడం ఇవన్నీ ఏమయ్యాయి? మోహి గాడు పుట్టాక అమ్మ ఇట్లా మారిపోయిందా? లేక తాను పెద్దవాడినయ్యానని ఇట్లా చేస్తుందా? తమ్ముళ్ళు పుట్టాక అందరూ మమ్మీలు ఇట్లాగే చేస్తారా? చిన్ని బుర్రకు అసలు అర్థం కావడం లేదు. ఈ వరకు తాను ఆ బెడ్ రూమ్ లోనే అమ్మ నాన్నల తోనే పడుకునేవాడు. తమ్ముడు వచ్చాక కొన్ని రోజులనుండి తనను ఈ బెడ్ రూంలో పడుకోబెడుతున్నారు. '' నువ్వు పెద్దవాడివయ్యావుగా ,ఇట్లా పడుకోవడం నేర్చుకోవాలి , అని సముదాయించారు. మొదట భయం వేసేది. కాని తరువాత అలవాటయింది. అయినా మమ్మీ రోజంతా ఇంత కోపంగా ఉంటే ఎలా?  సందేహాలు ఎంత అస్పష్టమో సమాధానాలు అంతకంటే

అస్పష్టంగా ఉన్నాయి.

***

మోహి అన్నను అసలు విడువడం లేదు. వాడిని ఆడించడం విజయ్ కి ఓ గొప్ప సరదా.

మోహి ఆ డూప్లెక్స్ ఇంట్లో తానే సొంతగా మెట్లు ఎక్కడానికి అంబాడుతూ వెడుతుంటాడు.

ప్రతి ఆదివారం సంబరంగా ఆడే ఆటల్లో అదో ఆట.

మోహి అట్లా పైకి పాకుతుంటే రాజ్యలక్ష్మి మురిపెంగా చూస్తుంటుంది.

'' ఒరేయ్ ,జాగ్రత్త , తమ్ముడు క్రింద పడిపోతుంటాడు.'' కృష్ణ శర్మ హెచ్చరిస్తుంటాడు.

ఆరోజు అదే ఆట .పైనుండి విజయ్ వాడిని పిలుస్తున్నాడు.మోహి గ్రిల్ పట్టుకొని ఎక్కుతున్నాడు.ఐదారు మెట్లు అలాగే ఎక్కాడు. వాడిని చూస్తూ పైనున్న విజయ్ రెండు చేతులెత్తి 'హుర్రే' అని అరుస్తున్నాడు.

అన్నను చూసి మోహి అట్లాగే గ్రిల్ వదలి పట్టు తప్పి పడిపోయాడు. కిందకు దొరలాడు. విజయ్ భయంతో అరచాడు. చూస్తూన్న రాజ్యలక్ష్మి అరుస్తూ పరుగెత్తుకొచ్చింది. బెడ్ రూంలో ఉన్న కృష్ణశర్మ పరుగెత్తుకొచ్చాడు. మోహి తలకు గాయమై రక్తం కారుతోంది. రాజ్య లక్ష్మి మొహిని ఎత్తుకొంది .విజయ్ దగ్గరికి వెళ్ళి నాలుగు తగిలించింది.'' వెధవా, ఎక్కడివాడవు నువ్వు, నా కొడుకును చంపేస్తావా ?

కృష్ణశర్మ 'పదపద, హాస్పిటల్ కి వెడదాం' అంటూ కారు తీశాడు. రాజ్యలక్ష్మి మోహిని హత్తుకొని వెళ్ళి కారులో కూచుంది.

ఎనిమిదేళ్ళ పిల్లవాడు ఇంట్లో ఒక్కడు ఎట్లాఉంటాడని ఎవరూ పట్టించుకోలేదు.

కారు శరవేగంగా వెళ్ళింది . విజయ్ ఏడుస్తూ గేటుదగ్గర ఉండి పోయాడు.

***

''నేను ఈ టార్చర్ భరించలేను కృష్ణా ,వాడిని పంపించేద్దాం , వాడు ఎవడని వాడిని నా కొడుకుతో సమానంగా చూస్తాను''? రాజ్యలక్ష్మి బాధగా అంది.

హాస్పిటల్ లో మొహిని చూసిన డాక్టర్ మరేం 'ఫరావా లేద'ని చెప్పాడు. అడ్మిషన్ అవసరం లేదని చెప్పి కావలసిన మెడిసిన్ ఇచ్చాడు. నుదురు పైన చిన్న బ్యాండెజ్ వేశాడు.

''రాజీ, ఆలోచించు , వాడు మనసొంతకొడుకు కాదని వాడికసలు తెలియదు, ఈ విషయం తెలిస్తే వాడి పసిమనసు ఎంత గాయపడుతుంది? చిన్నప్పటినుండి ఎంతో ప్రేమతో చూశావ్ , అన్నీ రకాల కేర్ తీసుకున్నావ్, ఇప్పుడిలా అంటే ఎలా?

రాజ్యలక్ష్మికి ఆ మాటలూ నిజమే అనిపించింది. ఆమెకు విజయ్ మీదా ప్రేమ చావడం లేదు, అలాగని మోహి పుట్టాక వాన్ని తన కొడుకుగా కూడా

అంగీకరించాలనిపించడం లేదు. నుదురు రాసుకుంటూ ఉండిపోయింది.

కృష్ణశర్మ స్టీరింగ్ తిప్పుతూనే ఓచేయి రాజ్యలక్ష్మి భుజం మీద వేశాడు ఓదార్పుగా.

కారు ఇంటిదగ్గరికి వెళ్లే సరికి చిన్నబోయిన మొహంతో గేటు ముందే సిమెంట్ బెంచీ కూచోని ఉన్నాడు విజయ్.

దగ్గరికి వస్తూ చెప్పాడు కృష్ణశర్మ. '' ఏం ఫరావా లేదు, బాగున్నాడు , రేపటికల్లా నీతో ఆడుకుంటాడు, '' విజయ్ చెయ్యి పట్టి లోపలికి తీసుకెడుతూ అన్నాడు కృష్ణశర్మ.

***

విజయ్ కి నిద్ర పట్టడం లేదు.అర్థరాత్రి ఒంటిగంట దాటింది. తనిక్కడ...ఒక్కడే... బెడ్రూంలో ...ఇలా తన స్కూల్ ఫ్రెండ్స్ ఎవరూ పడుకోరట. తన్నెందుకు ఇలా.. తాను తమ్ముడిదగ్గరే పడుకుంటే పోతుంది కదా ? ...

విజయ్ లేచి బయటకు వచ్చాడు . మొహిని ముద్దాడాలనిపించింది. మమ్మీ డాడీ మోహి పడుకున్న గదిలోకి వెడదామని వెడుతుంటే లోపలినుండి మమ్మీ ఎడుపు వినిపించింది. డాడీ ఏదో అంటున్నాడు,విజయ్ అక్కడే ఆగిపోయాడు.

''అవును రాజ్యం, నీ బాధ నేను అర్థం చేసుకోగలను. నీకు కొడుకు పుట్టడం వల్ల విజాయ్ ని సొంత కొడుకుగా చూడలేకపోతున్నావ్,అట్లాగని ఏమి చేస్తావ్? అనాథ శరణాలయం నుండి వాణ్ని తెచ్చి పెంచుకుంటున్నాం, ఇన్ని రోజులు ఎంతో ప్రేమగా చూశావ్, ఇట్లా మారిపోతే ఎట్లా ?

మమ్మీ ఏడుస్తూ ఏదో అంటూంది.విజయ్ కి ఏదీ వినిపించడంలేదు. వాడి పసిమనసులో తెలియని చీకటి తెరలు నిద్ర లేచాయి. వెనక్కి తిరిగి తన గది వైపు వెళ్ళాడు.

***

మరునాటినుండి విజయ్ ప్రవర్తనలో ఏదో తేడా వచ్చింది.కృష్ణశర్మ రాజ్యలక్ష్మిలకు ఎప్పటిలా స్కూల్ విశేషాలు చెప్పడంలేదు. మోహిదగ్గరకు ఆడించడానికి రావడం లేదు. హార్లిక్స్ లాంటివేవీ సరిగా తీసుకోవడం లేదు. రాజ్యలక్ష్మికి వాడి మీద ఏదో జాలి కలుగసాగింది.

కొద్దిరోజుల్లో విచిత్రంగా ఉన్నట్టుండి కృష్ణశర్మ గంభీరంగా మారిపోయాడు. వాడిని అసలే పట్టించుకోవడం లేదు. రాజ్యలక్ష్మి అప్పుడప్పుడూ జాలి చూపిస్తుంది. జాలి మాత్రమే చూపిస్తుంది.

వీజయ్ పూర్తిగా ముడుచుకు పొతున్నాడు.

***

ఆ రోజు ఆదివారం.

కృష్ణశర్మ కు విజయ్ కి సెలవు దినం .

పొద్దున్నే లేచి ఎప్పటిలాగే బ్రేక్ ఫాస్ట్ సిద్ధం చేయసాగింది రాజ్యలక్ష్మి.

విజయ్ పడకగది దగ్గారగా వేసి ఉంది.

అప్పటికి ఉదయం తొమ్మిది గంటలయింది.

మోహి లేచాడు. వాడికి ఆట కావాలి. పాకుతూ విజయ్ గది దగ్గరకు వెళ్ళాడు. తలుపు నెట్టి ఊ, ఊ, అంటూ తన భాషలో పిలిచాడు. గదినుండి సమాధానం రాకపోయేసారికి అట్లాగే లోపలికి వెళ్ళాడు. విజయ్ కనబడక పోయేసరికి ఇల్లంతా తిరిగాడు. టిఫిన్ కోసం కూచున్న కృష్ణశర్మకు అప్పుడు దృష్టి పడింది. అయోమయంగా మొహిని చూస్తున్నాడు. రాజ్యలక్ష్మికి విజయ్ లేడని అప్పుడు స్ఫురించింది. గబ గబా బెడ్రూంలోకి వెళ్ళి చూసింది. ఇల్లంతా తిరిగి చూసింది. వాడెక్కడా కనిపించడం లేదు. '' విజయ్ లేదు, కృష్ణశర్మ తో కంగారుగా అంది.

కృష్ణశర్మ బయటకు వెళ్ళి చూశాడు.ముందు డోర్ తెరచి ఉంది. ఆశర్యపోయాడు.

కొద్ది క్షణాలలో అతనికి విషయం అర్థమయింది. విజయ్...విజయ్ వెళ్ళి పోయాడు, నూతినుండి మాట వచ్చినట్టుగా మెల్లిగా అన్నాడు. రాజ్యలక్ష్మికి అర్థమయాక రిలీఫ్ అనిపించింది.'' ఇకముందు వీడి బాధ తనకు లేదు ,వెళ్లనీ... అనుకుంది.

విజయ్ కోసం ఏడుస్తున్న మొహిని ఎత్తుకొని సముదాయించింది.అటు ఇటు తిప్పింది.

కాని ఏదో మమకారం మళ్ళీ మేల్కొంది.

కృష్ణశర్మ గంభీరంగా ఉండిపోయాడు.

ఆ రోజంతా సాంతోషం, దు:ఖం కానీ ఒక విచిత్రస్థితిలో గడచిపోయింది. ఎవరూ సరిగ్గా భోజనం చేయలేక పోయారు.

***

విజయ్ గ్యాకాలు రాజ్యలక్ష్మిని వీడడం లేదు. ముద్దు ముద్దు మాటలు కబుర్లు ఆమెకు పదే పదే గుర్తుకు వస్తున్నాయి.

తనకు సంతానం కాకపోతే అనాథ శరణాలయం నుండి పసిగుడ్డుని తెచ్చుకున్నారు.మురిపెంగా పెంచుకుంటున్నారు. ఎక్కడా ఎలాంటి తేడా లేదు.

ఇన్నాళ్ళకు ఆ దంపతులకు మోహిత్ పుట్టాడు. మోహిత్ పుడతాడన్న విషయం తెలిసినప్పటినుండి విజయ్ సంతోషం ఇంతా అంతా కాదు.తమ్ముడిని ఇలా ఆడిస్తా, అలా ఆడిస్తా అంటూ తెగ కబుర్లు చెప్పేవారు.

మోహి కూడా విజయ్ తో ఆడుకోవడానికి ఉత్సాహం చూపేవాడు.విజయ్ స్కూల్ నుంచి వస్తూనే చూస్తూ కేరింతలు కొట్టేవాడు.

అట్లాంటి విజయ్ తన కొడుకు కాదనే భావం తనలో ఎందుకు ప్రవేశించింది?

అసలు వాడి తప్పేముంది? వాడెక్కడ ఉంటున్నాడో ?...... ఏం తింటున్నడో?

తమాయించుకోలేక పోయింది .క్రమంగా ప్రేమ ముందు స్వార్థం, సంకుచితత్వం ఓడిపోయింది.

***

చివరికి కృష్ణ శర్మతో అంది. ''వాడిని వెతికించండి, వెళ్ళి పోలీసు కంప్లయంట్ ఇద్దాం, నేనే పొరపాటు చేశాను, ఘోరమైన తప్పుచేశాను ,పదండి,'' కన్నీరు ఆపలేకపోతూంది .

కృష్ణశర్మ గంభీరంగా ఉండిపోయాడు. చివరికి మెల్లిగా అన్నాడు" నేను రాలేను రాజీ , వాడిని వెళ్లనివ్వు "

''ఎందుకు? ఎందుకు? పొరపాటు చేశానంటున్నానుకదా, ఇక వాడిపట్ల ఎలాంటి వివక్ష చూపించనంటున్నానుకదా, వెడదాం పద ,''

'' వివక్ష ఇప్పుడు నేను చూపవల్సి వస్తుంది.''

''ఎందుకు'' ? ఆశర్యంగా అడిగింది రాజ్యలక్ష్మి.

''వాడు...వాడు ..మాదిగల పిల్లవాడు. వాడిని ఇంట్లో పెంచలేను, వాడిని నేనే బయట దింపేద్దామనుకున్నాను, కాని వాడే అనుకోకుండా వెళ్లి పోయాడు.''

రాజ్యలక్ష్మి నోరు వెళ్లబెట్టింది.

***

అవును వాడు మాదిగ పిల్లవాడు .పుట్టినవెంటనే తల్లిని కోల్పోయాడు.తండ్రి పరుశురామ్ కి లెప్రసి వ్యాధి.వాడికి తన భయంకరమైన వ్యాధి సోకుతుందని తండ్రి అనాధ శరణాలయంలో ఇచ్చి వెళ్ళాడు.తరువాత ఫార్మాలిటీస్ పూర్తి చేసి వాన్ని మనం తెచ్చుకున్నాం. నిబంధనల ప్రకారం వాళ్ళు తండ్రి వివరాలు గోప్యంగా ఉంచారు. మనం వాన్ని తీసుకెడుతుంటే రెండు రోజులకోసారి కొడుకు కోసం తచ్చాడే పరుశురామ్ వాణ్ని మనం తీసుకెల్లడం గమనించాడు. తరువాత ఎక్కడెక్కడో తిరిగాడు .అతని వ్యాధి నయమైంది. లారీ డ్రైవర్ గా చేస్తున్నాడు. తిరిగి వచ్చాడు. విజయ్ ని దూరం నుంచి చూసుకున్నాడు. తరువాత తన కొడుకు కావాలని అభ్యర్థించాడు.

''ఇది...ఇది మీకెలా తెలిసింది?'

'పరుశురాం నన్ను కలిశాడు. అతను చెప్పిన వివరాలను పోల్చుకున్నాను. అతనికొడుకును నిబంధనలకు లోబడి అతనికే ఇచ్చేదామనుకున్నాను. కాని.. అతను తిరిగి రాకముందే ఘోరమైన లారీ యాక్సిడెంట్ లో పోయాడు. ఇక నేనే ఎలాగో వాన్ని వదిలించుకుందామనుకున్నాను.

చివరికి నువ్వు కోరేది నేను కోరేది ఒకటే అయింది. వాడు వెళ్ళి పోయాడు...

***

రెండు రోజులు గడచాయి. ఆ ఇంట్లో విజయ్ గ్యాపకాలు ఎవరినీ విడిచి పెట్టడం లేదు. బ్రేక్ ఫాస్ట్ చేసేటపుడు, భోజనం చేసేటపుడు, విజయ్ లేడని మరచిపోయి వాడిని పిలవడం రివాజు అయింది.వాడు స్కూల్ నుండి రాలేదని ఎదిరి చూడడం మామూలైంది. వాడు ఇంట్లో లేడనే విషయమే ఓ విషాదమైంది.

మోహి అన్నకోసం బెంగ పెట్టుకొన్నాడు.అన్న బడి నుండి వస్తాడని అంబాడుకుంటూ మెయిన్ డోర్ దగ్గరకు వెడతాడు.అన్నతో ఆడుకోవడానికి తహతహ లాడుతాడు. ఒక్కోసారి గుక్క పట్టి ఏడుస్తాడు. కృష్ణ శర్మ కులభావం, రాజ్యలక్ష్మి అసూయ, పెంచిన ప్రేమ ముందు వెలవెల బోతున్నాయి చివరికి .

***

ఆ రోజు పొద్దున్నే రాజ్యలక్ష్మి చకా చకా తయారైంది. నాకు విజయ్ కావాలి, నా కంటే ఎక్కువ మోహికి కావాలి , నేను పోలీసు కంప్లైంట్ ఇస్తాను, వెడతాను , స్థిరంగా అంది.

కృష్ణశర్మ నిశ్శబ్దంగా చూశాడు.

'నేనేదో అపరిణితమైన మనసుతో వాన్ని ఈసడించుకున్నాను, కాని.కాని నువ్వేం చేశావ్ ... అతి క్షుద్రమైన ఫీలింగ్ తెచ్చావ్, మనువాదం వల్ల సమాజం ఎంత చిన్నాభిన్నమౌతుందో ఎంత చర్చించాం ? సరే వదిలేద్దాం ... నువ్వేదో బ్రాహ్మల ఇంట్లో మాదిగ పిల్లవాన్ని పెంచలేనని అన్నావ్ , ఆ బ్రహ్మణ్యాన్నైనా నువ్వు ఎప్పుడు పాటించావ్ ? వేదం చదవటం, సంధ్యావార్చుడం లాంటివి నువ్వు చేయగా చూడలేదు. విజయ్ కి వడుగు చేద్దామంటే , ఎందుకు లే , పెళ్లి ముందేకదా ఇప్పుడందరూ చేస్తున్నారు అన్నవ్ కదా , అప్పుడప్పుడూ కొలిగ్స్ తో మందు కూడా కొడతావ్ కదా, బ్రాహ్మణత్వం ఇతరులమీద పెత్తనం చేయడానికేనా ? ఇంట్లో బ్రాహ్మణుడివి , బయట సామాజిక వాదివా ?సరే... ఏది ఏమయినా మోహికి విజయ్ కావాలి, నాకు కూడా కావాలి, ఎలాగైనా వాన్ని వెతికిస్తాను'', స్థిరంగా అంది. మొహిని 'ఎత్తుకొని పద అన్నను తెద్దాం' అంటూ బయటకు నడచింది.

కృష్ణశర్మ లో ఏదో సంచలనం కలుగుతోంది. మెల్లిగా లేచి ఆమెను అనుసరించాడు.

***

**డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు** 9 సెప్టెంబర్ 1961లో నేటి పెద్దపెల్లి జిల్లా జూలపల్లి గ్రామంలో జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మే తెలుగు పూర్తి చేసిన కాంచనపల్లి తెలుగు యూనివర్సిటీలో ఎంఫిల్ పిహెచ్డి చేశారు. గురుకుల్ ఘట్కేసర్ లో తెలుగు ఉపన్యాసకుడుగా, తర్వాత కళాశాలకు ప్రిన్సిపల్ గా పనిచేసే 2018 లో ఉద్యోగ విరమణ చేశారు. తెలంగాణ జాగృతి తంగేడు సాహిత్య పక్ష పత్రికకు నాలుగేళ్లు సహ సంపాదకులుగా పనిచేశారు. ప్రస్తుతం తెలుగు విశ్వవిద్యాలయంలో

గెస్ట్ ఫ్యాకల్టీ గా పనిచేస్తున్నారు. కాంచనపల్లి తాను ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే 1981లో భావ మంజరి అనే పద్య సంకలనం వెలువరించారు. తర్వాత 1995లో కవి మిత్రులతో కలిసి ఆచూకీ అనే అస్తిత్వాద కవిత్వం,అదే సంవత్సరం చేదబావి వచన కవితా సంపుటి విలువరించారు. 2011లో తండ్లాట తెలంగాణ ఉద్యమ దీర్ఘకావ్యం, తర్వాత2015 లో కలయింకామిగిలే ఉంది, కవితా2024 సంపుటి పెంకుటిల్లు కవితా సంపుటి, అదే సంవత్సరం బల్మూరి కొండలరాయుడు ),పద్యగేయ సంపుటి క్రమంగా వెలువరించారు.2018 లో ఓ వర్షం కురిసిన రోజు, కథా సంపుటి2022లో తరాజు విమర్శన వ్యాసాల సంపుటి వెలువరించారు. మునుం అనే బృహత్ కవితా సంకలనానికి కవి మిత్రులతో కలిసి సంపాదకత్వం వహించారు. ఇంకా ఆయన సంపాదకత్వంలో కలల దారి తెలంగాణ జాగృతి కవితా సంకలనం, కాళోజి యాది, తెలంగాణ జాగృతి కవితా సంకలనం, కవితా మంజరి, గర్రిపల్లి సత్యనారాయణ రాజు కావ్య సమాహారం వెలుపడ్డాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కవి పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్తు ఉత్తమ గ్రంథ పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్తు ఉత్తమ కవి పురస్కారం ఆయనను వరించాయి ఇదే కాక బోవేరా అవార్డు గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారం, విశ్వ శ్రీ ఫౌండేషన్ వారి జాతీయ పురస్కారం, బండారు అచ్చమాంబ పురస్కారం, సావిత్రిబాయి పూలే అవార్డు, ప్రపుల్ల మెమోరియల్ అవార్డు,మొదలైన పురస్కారాలు అందుకున్నారు.

***

# అంతర్యామి



**కెవివి సత్యనారాయణ**

'యత్ వాచా నభ్యుదితం యేన వాగభ్యుద్యతే ' 'తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే'

'యన్మనసాన మనుతే యేనాహుర్మనో మతమ్' ' తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిద ముపాసతే'

'మాటలు దేనిని ప్రకటించలేవో, ఏది మాటలనే ప్రకటిస్తుందో మనసు దేనిని గ్రహించలేదో, దేనిచేత మనసు గ్రహించబడుతుందో అది మాత్రమే భగవంతుడు. అంతే కాని నీవు పూజించేది కాదు.' అంటుంది కేనోపనిషత్తు. ఆలయంలో ముగ్గురు వ్యక్తులు కనపడుతున్నారు భక్తుడనే వ్యాపారి. పూజారనే యాచకుడు. సిబ్బంది అనబడే దళారి. ఇదంతా ప్రహసనం. భౌతికనిగ్రహం లేని వ్యక్తుల మధ్య భావరహిత విగ్రహం. ఇక హుండీలు నింపేది ఎందుకంటే భగవంతుడితో జరిగే రహస్య వ్యాపారం బయటకి తెలియకూడదు కనుక... మొబైల్ లో స్పీకర్ ఆన్ చేసి వినిపిస్తున్న వీడియోని పాజ్ చేసాడు సోమయాజులు. ' ఇది అవసరమా..? ఇది నీకు అవసరమా అని. అసలు నువ్వు ఏం చెప్పదలుచుకున్నావు శివుడూ..? నేలన పోయేది నెత్తికి రాసుకోవడం అంటే ఇదేగా. విగ్రహాలు తీసేయమంటావా..? ఆలయాలు మూసేయమంటావా..? హుండీలు ఎత్తేయమంటావా..? భౌతికనిగ్రహం లేని వ్యక్తుల మధ్య భావరహిత విగ్రహమా..? వింటున్న నాకే చిర్రెత్తు కొస్తోంది..'' అతనికి ఆయాసం వస్తోంది. 'ధర్మానికి, న్యాయానికి తేడాను స్పష్టపరిచి దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ప్రవచనానికి ఉంటుందని నమ్మేవాడిని. దేశ, కాల పరిస్థితులను అనుసరించి ధర్మం, న్యాయం మారుతూ ఉంటుంది. ఉండాలి కూడా. అలాగని మౌలిక భావనని వదిలేస్తారా..? అహం బ్రహ్మస్మి అన్నది మరిచిపోతే ఎలా..? '' అన్నాడు శివశంకరం. ' లౌక్యం కావాలి బావా. అందరి కుండలు బద్దలు కొట్టేస్తుంటే ఎలా..? ఎవరు అంగీకరిస్తారని..?'' ' అందరినీ అలరించడం నా బాధ్యత కాదు. నిజంచెప్తూ తలొంచాల్సిన అవసరం నాకైతే లేదు.'' ' ఉంది... ఎందుకంటే వాడిచేత శఠగోపం పెట్టించుకోవాలి కనుక. శివాలయం శాస్త్రి మన సంబంధం వద్దన్నాడు. మన చుట్టూ తిరిగిన వాడే ఇప్పుడు మనల్ని కాదంటున్నాడు. '' 'ఫర్వాలేదు అంకుల్. లైట్ తీసుకోండి. ఇది కాకపోతే మరొకటి.'' నవ్వుతూ బయటకు వచ్చాడు గౌతమ్. ' లంచ్ బాక్స్ తీసుకున్నావా..? డైనింగ్ టేబిల్ మీద పెట్టాను.'' అన్నాడు శివశంకరం. 'తీసుకున్నాను. ఇవాళ మార్చ్ ఎండింగ్. రావడానికి

లేటవుతుంది. అన్నట్లు నాకు ఎల్టీసీ శాంక్షన్ అయ్యిందని తెలిసింది. కాశీదర్శనం కన్ఫర్మ్...” తండ్రితో చెప్పాడు గౌతమ్. ‘ శాస్త్రి కాదన్నాడని వదిలేస్తానా..? ఇది చూడు. దాన్ని మించిందీ శర్మ సంబంధం. ” సోమయాజులు ఇచ్చిన ఫోటో చూసి చిరునవ్వుతో గౌతమ్ కి అందించి అన్నాడు శివశంకరం. ‘ అమ్మాయి లక్షణంగా ఉంది. మంచి సంబంధం తెచ్చి జేబులో దాచుకొని ఈ దులుపుడు ఎందుకు..?” ‘ దూకుడు ఎక్కువ బావా నీకు. బ్రేకెయ్యాలి..! సర్లే. శర్మకు ఒక్కర్తే కూతురు. మనవాడికి జన్మలగ్నాత్తు రెండవ భావంలో అంగారకుడు తిష్టవేసాడని నీకూ తెల్సుగా. ఓకే అనేయ్... ఒక పనయిపోద్ది.” ‘ ఈ అమ్మాయి తెలుసు. నియతి... జూబ్లీ హిల్స్ బ్రాంచ్ లో పనిచేస్తోంది.” గౌతమ్ కళ్ళు మెరిసాయి.

***

‘2023 జూన్ 2న చెన్నై నుంచి హౌరా వెళుతున్న కోరమాండల్ ఎక్స్ ప్రెస్ రైలు ఆగి ఉన్న గూడ్స్ రైలుని ఢీకొట్టింది. ట్రాక్ పై పడున్న ఈ రైలు బోగీలను యశ్వంత్ పూర్, హౌరా ఎక్స్ ప్రెస్ ఢీకొట్టడంతో అది కూడా పట్టాలు తప్పింది. ఒరిస్సాలోని బాలాసోర్ జిల్లా, బహానాగ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో వెయ్యి మందికి పైగా గాయపడ్డారు, రెండువందల డెబ్బై ఐదు మంది మృతి చెందారు. ప్రమాదంలో మృతులకు పదిలక్షల రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి రెండులక్షలూ, స్వల్ప గాయాలకు యాభైవేల చొప్పున కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణ పరిహారం ప్రకటించారు. ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. హెల్ప్ లైన్ నెంబర్లు.” చదువుతున్న పేపరు టీపాయ్ మీద పెట్టి లేచి నిలబడ్డాడు సోమయాజులు. కొన్ని క్షణాలు అతని గుండె వేగంగా కొట్టుకుంది. సెల్ ఫోన్లు స్విచ్డ్ ఆఫ్ అని వచ్చాయి. హెల్ప్ లైన్ నెంబర్లకు ట్రై చేయగా చాలా సేపటికి సమాధానం దొరికింది. ‘బి. త్రీ’, థర్డ్ ఏసీ బోగీలో ప్రయాణం చేసారు వాళ్ళు. ఇద్దరినీ హాస్పిటల్ కు పంపించినట్లు తెలిసింది. నెంబర్ ఇచ్చారు కానీ ఆ హాస్పిటల్లో వాళ్ళు జాయిన్ కాలేదని సమాచారం. నెలరోజుల తర్వాత ఒకరోజు కొత్తనెంబరు నుంచి కాల్ వచ్చింది సోమయాజులుకి. శివశంకరం..! ఖరగ్ పూర్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యామని, సెల్ ఫోన్లు ఏక్సిడెంట్లో పడిపోవడంతో కాంటాక్ట్ చేయలేకపోయామని, ఈరోజు ఉదయం ఇంటికి వచ్చేసామని... కాల్ రాగానే పరుగెత్తుకు వెళ్ళాడు సోమయాజులు. ‘ సక్రమంగా తిరిగొచ్చాం. అంతకు మించి అదృష్టం ఏవుంది..? కాళికమ్మ దయ..! డిశ్చార్జ్ అయ్యాక తల్లిదర్శనం చేసుకునే వచ్చాం.” అన్నాడు శివశంకరం. గౌతమ్ ఆఫీసుకు ఆటోలో వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నాడు సోమయాజులు. ఆ మర్నాడు మళ్ళీ వచ్చాడు అతను శర్మని తీసుకొని. కానీ గౌతమ్ పూర్తిగా కోలుకున్నాక ఆలోచిద్దామని చెప్పి పంపించేసాడు శివశంకరం.

***

'ఈయన సిద్ధరామయ్య అని నాకు అత్యంత ఆప్తుడు. ఈవిడ ఆయన భార్య అఖిల, ఈమె వీరి కోడలు రేవతి - కొంతకాలం మన ఫ్లాట్లోనే అద్దెకుంటారు." అన్నాడు శివశంకరం. అది టూ బిహెచ్కె ఎపార్టుమెంటు. ఎలా ఉంటారో అర్థం కాలేదు గౌతమ్ కి. 'ఎప్పుడో రావాల్సింది. కానీ అమ్మాయిని ఒప్పించడానికి ఇంతకాలం పట్టింది." అని శివశంకరం తన బెడ్ రూమ్ లోకి తీసుకువెళ్ళాడు వాళ్ళని. కాసేపటికి పిల్లో, బెడ్ షీట్, కొన్ని పుస్తకాలతో బయటకు వచ్చిన ఆయన కొడుకుతో అన్నాడు. 'కొన్ని రోజులు గౌతమ్. కొడుకు పోయిన కష్టంలో ఉన్నాడు. ఆ బాధనుంచి బయట పడితే అతనే వెళ్ళిపోతాడు. నేను హాల్లో సర్దుకుంటాను అప్పటివరకూ." తండ్రి గొంతు వణకడం విని తలెత్తి చూసాడు గౌతమ్..! 'నా గదిలో మంచం డబుల్ కాటేగా మీకు ఇబ్బంది లేకపోతే నా దగ్గరే పడుకోండి. " ఆ మర్నాడు హన్మకొండ వెళ్ళిపోయాడు శివశంకరం ప్రవచనాలు ఉన్నాయని. వేళకు గౌతమ్ మందులు వేసుకునేలా చూడమని సిద్ధరామయ్యకు చెప్పి మరీ వెళ్ళాడు.

***

సెకండ్ సాటర్ డే కావడంతో ఆలస్యంగా నిద్ర లేచాడు అతను... వాష్ రూమ్ లోంచి బయటకు వచ్చేసరికి రేవతి కాఫీ కప్పు టీపాయ్ మీద పెడుతూ కనిపించింది. అలానే నిలబడిపోయాడు ఆచ్ఛాదన తొలగిన ఆమె నడుమును చూస్తూ... నెమ్మదిగా అతని కనులు పైకి క్రిందకి కదలాడాయి. తలతిప్పి కనురెప్పలు పైకెత్తి అతని వంక చూసి వెళ్ళిపోయిందామె. మైగాడ్. అలవికాని సౌందర్యం..! తల విదలించుకొని కాఫీ కప్పు చేతిలోకి తీసుకున్నాడు... స్నానంచేసి బట్టలు మార్చుకొని దేవుడిగది దగ్గరకు వెళ్ళాడు గౌతమ్. తిరిగి గదిలోకి వస్తుండగా సిద్ధరామయ్య ఎదురుపడి అన్నాడు. ' టిఫిన్ అయాక మందులు వేసుకోవడం మరిచిపోకు బాబూ. నేనూ, తనూ అలా బయటకు వెళ్ళొస్తాం. వచ్చేసరికి కాస్త సమయం పడుతుంది. అమ్మాయి ఇంట్లోనే ఉంటుంది - కావల్సింది మొహమాటం లేకుండా అడుగు." తలూపి గదిలోకి వచ్చాడు గౌతమ్. ఎందుకో ఈ కుటుంబం ప్రవర్తన వింతగా అనిపిస్తోంది అతనికి. ఉన్నట్లుండి బాత్ రూమ్ తలుపు తెరుచుకొని బయటకు వచ్చింది రేవతి. ఆమె తలారా స్నానం చేసినట్లుంది. రోజ్ కలర్ బ్లౌజ్ మీద అదే కలర్ చీర. అక్కడక్కడా తడి గుర్తులు. పరిమళాలను విరజిమ్ముకుంటూ ఆమె బయటకు రావడంతో అతను అచేతనంగా ఆమెనే చూస్తూ ఉండిపోయాడు. 'మా బాత్ రూమ్ లో షవర్ పనిచేయడం లేదు." ఆమె తడితలను చుట్టుకున్న టవల్ ను విప్పేస్తూ ఆ రూమ్ బాల్కనీలోకి వెళ్ళింది. అక్కడ ముక్కాలిపీటపై కూర్చొని తడి కురులను రెండు చేతులతో ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణాలలో ఆరబోసుకుంటోంది అచ్చెరువొందే అందాలతో పాటూ. ప్రత్యూష మయూఖాలు ఆమె కోమల బాహువుల్ని చుంబించి అక్కడికక్కడే అవ్యక్తానందంలో మూర్ఛిల్లడం అతనికి తెలుస్తోంది. దోసెడు గులాబీలు ఉంటే బావుండును ఆ లేతపాదాల కోసం అన్న

యోచనలో మునిగిపోతున్న అతన్ని ఏదో వివేచన జుట్టుపట్టి లాగిన భావన. లేచి సెల్ తీసుకొని ముందు హాలులోకి వచ్చేసాడు. ఇంతలో అతని సెల్ కు ఏదో కాల్ వచ్చింది. ' టిఫిన్ ఏం చేయమంటారో చెపితే వెంటనే రడీ చేసేస్తాను." గది నుండి బయటకు వచ్చిన రేవతి అంది. 'నాకు నా రూమ్ లో ప్రైవసీ కావాలి. మీకు నచ్చినట్లు వండుకోండి." అంటూ తన రూమ్ లోకి పోయి తలుపు వేసుకున్నాడు గౌతమ్. సిద్ధరామయ్య వచ్చేంత వరకూ అతను బైటకు రాలేదు. ' ఏం బాబూ టిఫిన్ కూడా చేయలేదట..?" సిద్ధరామయ్యే వచ్చి అడిగాడు. ' మీరు ఎక్కడికి వెళ్లారండీ ఇంతసేపూ..? రేవతి ఇంట్లో ఒంటరిగా ఉందని తెలుసుగా." ' తను ఒంటరిగా ఎక్కడ ఉంది బాబూ..? నువ్వున్నావుగా." ' అదే అనేది. పరాయి మగవాడితో ఆమెను ఒంటరిగా ఒదిలేసి మీరెక్కడికి వెళతారని..?" ' నువ్వు పరాయి ఎందుకు అవుతావు బాబూ..? మా కొడుకుతో సమానం." అఖిల అంది. ' కొడుకుతో సమానమే కానీ కొడుకును కానుకదా... ఆమెను ఇలాంటి పరిస్థితిలో కూడా తిప్పుకునే బదులు పుట్టింటికి పంపొచ్చుగా." ' రేవతి ఎవ్వరూ లేని అనాధ బాబూ. మేం తప్ప ఎవ్వరూ లేరు." 'మీరామెను ఏ విషయంలో ఎంకరేజ్ చేస్తున్నారో అర్థం కావడం లేదు. నాన్నగారికి తెలిస్తే ఏవంటారు..?" ' ఏవంటాను... రేవతిని నీకిచ్చి పెళ్లి చేసేయమంటాను." అప్పుడే వచ్చిన శివశంకరం అన్నాడు. ' నాన్నా... మీరేం మాట్లాడుతున్నారో మీకు అర్థమౌతోందా..? ఆమె పెళ్ళయిన స్త్రీ..!" ' వట్టి పెళ్ళే కదరా అయ్యింది. జరగరానిదేదో జరిగిపోయినట్లు మాట్లాడతావేం..?" ' పెళ్లి నాన్నా..! పెళ్ళే కదా అంటారేంటి..? ఆమెకు అన్యాయం జరిగిందని మీరు ఏదో చేసేసి నాకు అన్యాయం చేయకండి. ఆమె మానసికంగా వారి అబ్బాయిని భర్తగా అంగీకరించింది." 'నువ్వు పెళ్లిచూపులు చూసిన ప్రతీ అమ్మాయినీ మానసికంగా అంగీకరించేగా వెళ్లావు. ఏవయిందని..? రేవతికి ఆ పెళ్లి చూపులు కూడా జరగలేదు. హాస్టల్లో ఉన్న అమ్మాయిని ఉన్నపళంగా తెచ్చి కొడుక్కి కట్టబెట్టేసారు. పసుపుబట్టల్లో ఉండగానే అనుకోని ప్రమాదం జరిగిపోయింది. " శివశంకరం అన్నాడు. ' అసలు మీ ఆలోచనలు నాకెంతకీ అర్థంకావు నాన్నా... ఆ నియతి సంబంధం వద్దంటారు. వివాహిత ఈ రేవతి సంబంధం కావాలంటారు. దేనికి నాన్నా నా జీవితంతో ఇలా ఆడుకుంటున్నారు..?" అరిచినట్లు అన్నాడు గౌతమ్. ' గౌతమ్ బాబూ... మీరు ఉద్రేక పడొద్దు. మంచిది కాదు." ఏదో చెప్పబోయాడు సిద్ధరామయ్య. ' మీరు ఇక్కడ ఉంటేనే మంచిది కాదు. నాన్నగారిని మాయ చేసి ఇంట్లో ప్రవేశించారు. ఇప్పుడు నా జీవితంలోకి ప్రవేశించి ఏం చేయాలని..? మీరందరూ ఈక్షణమే ఇక్కడనుంచి వెళ్లిపొండి." మళ్ళీ అరిచేసాడతను. ' అలాగే బాబూ. అలాగే. మీరు ఆవేశపడకండి. ఇప్పుడే వెళ్ళిపోతాం... పద అఖిలా. మనం ఇక్కడ ఉంటే బాబుకి ఇబ్బంది అవుతోంది." సిద్ధరామయ్య అన్నాడు కంగారుగా చూస్తున్న అఖిలతో. రేవతి గదిలోంచి బయటకు రానేలేదు అప్పటివరకూ. ' ఇంత అర్థాంతరంగా పొమ్మంటే ఎక్కడికి పోతారు..? సోమయాజులుతో మాట్లాడి ఏదో ఒకటి ఏర్పాటు

చేస్తాను రేపటివరకూ ఓపిక పట్టు." 'సరే... డాక్టర్ రవిచంద్ర హైదరాబాదులోనే ఉన్నారట. రేపు ఉదయం అప్పాయింట్మెంట్ ఇచ్చారు. మనం ఖరగ్ పూర్ వెళ్ళక్కర్లేదు. ఆయనను కలుసుకొని వస్తాను. మీరు వీళ్ళని పంపించే ఏర్పాటు చేయండి. " ' డాక్టర్ రవిచంద్ర ఇక్కడే ఉన్నారా..! అయితే నేనూ వస్తాను..." ' అక్కర్లేదు. నేను వెళ్ళగలను మీరు ఇక్కడుండి ఈ కుటుంబాన్నీ దయచేసి పంపించేయండి నాన్నా."

***

'ఏవన్నాడు డాక్టరు..? టెస్టులు చేయించావా..?" ఆతృతగా అడిగాడు శివశంకరం కొడుకుని. 'చేయించాను... అంతా బాగానే ఉంది - సిద్ధరామయ్యగారు వెళ్ళిపోయారా..? " 'సోమయాజులు ఇంటిలో ఉన్నారు. డాక్టరింకేవన్నా చెప్పాడా..?" అనుమానంగా అడిగాడు. ' కండీషన్ బావుందని జరిగిన ఆపరేషన్ గురించి చెప్పేసారు. కార్తీక్ ఎవరు అన్నది మీరు చెప్పాలి." ' వత్తిడికి లోనైతే ప్రాణానికే ప్రమాదం, అప్పుడు చెప్పొద్దంటే చెప్పలేదు... కార్తీక్ సిద్ధరామయ్య కొడుకు." ' వివరంగా చెప్పండి నాన్నా. అసలేం జరిగింది..?" ఉద్వేగంగా అడిగాడు గౌతమ్. 'స్పృహ వచ్చేసరికి నా కుడికాలుకి బాండేజీ వేసుంది. ప్రక్క బెడ్ మీద నువ్వు ఇంకా స్పృహ తప్పే ఉన్నావు. నన్ను వీల్ చైర్ లో కన్సల్టేషన్ రూమ్ కి తీసుకువెళ్ళారు. నీ గురించని మాట్లాడాక తెలిసింది..." ఆగాడు శివశంకరం. ' అప్పటికే నీ గుండెకు అరిథ్మియాస్ అనే హార్ట్ వాల్వ్ డిసీజ్ ఏదో ఉందనీ, త్వరగా హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషన్ జరగాలని డాక్టర్ రవిచంద్ర అన్నాడు. దానికి నీవయసే ఉన్న నీబ్లడ్ గ్రూప్ వ్యక్తి వీలయితే బ్రెయిన్ డెడ్ కండీషన్ లో కావాలట..! ఆపరేషన్ ఖర్చు దాదాపు పదిలక్షలు అవుతుందట. అలాంటి మనిషిని ఎక్కడని వెదకనూ..? అప్పటికప్పుడు పదిలక్షలు అంటే ఎలా తేగలను..?" గొంతు బొంగురుపోయింది శివశంకరానికి. ' మరి ఎలా జరిగింది నాన్నా ఇదంతా..? సిద్ధరామయ్యగారిని ఎలా కలుసుకోగలిగారు..?" ' సిద్ధరామయ్య ఎవరో నాకు తెలియదు..! నేను కలవలేదు. తనే వెదుక్కుంటూ వచ్చాడు. తన కొడుకు ఏక్సిడెంట్ లో ఘోరంగా దెబ్బతిని 'బ్రెయిన్ డెడ్' అయి చనిపోయినట్లేననీ, అతని గుండెను నీకు అమర్చి మళ్ళీ కొట్టుకునేలా చేయమనీ చేతులు జోడించి తనే వేడుకున్నాడురా. ఆపరేషన్ ఖర్చులు కూడా కొడుకు మరణానికి ఇచ్చిన 'ఎక్స్ గ్రేషియా' మొత్తంతో తనే సర్దుబాటు చేసాడు..! కొడుకు గుండెను దానం చేసీ, ఖర్చులు భరించీ, నిన్ను బ్రతికించిన సిద్ధరామయ్య నీకేమౌతాడు..? తండ్రిలాంటి వాడు కాదురా గౌతమ్... తండ్రే..!" అచేతనంగా వింటూ నిలబడిపోయాడు గౌతమ్. 'నా కొడుకు గుండెను తీసుకొని నీ కొడుకుని బతికించుకో అని ఇవ్వడానికి ఎన్ని గుండెలు ఉండాలి అతనికి..? అనాధని కులగోత్రాలు అడగకుండా కొడుకుకి భార్యని చేయడానికి ఇంకెన్ని గుండెలు ఉండాలి ఆ దంపతులకి..? ఇప్పటికీ ఆమె జీవితం అన్యాయం కాకూడదని తిరుగుతున్న మనిషితనాన్ని ఎలా చూడాలి..? ఆపదల్లో ఆదుకునేది, వరాలిచ్చేది భగవంతుడే అయితే వీళ్ళని ఏవనుకోవాలిరా..? ఎలా కొలవాలి..? "

శివశంకరం రోదిస్తున్నాడు. ‘ బావా...” వస్తూనే శివశంకరం చేతులు పట్టుకున్నాడు సోమయాజులు. ‘ఇవ్వడం తెలిసిన మనిషి భగవంతుని ప్రతినిధి అనీ... సర్వమానవ హితాన్ని కోరేది సాంప్రదాయం అన్న జనసూక్తం అర్ధమయింది. ఇది బ్రహ్మము అనీ, ఇదే బ్రహ్మరహస్యం అన్న ప్రవచనానికి రూపసందర్శనం జరిగింది. రేవతి విషయంలో జరిగిన తప్పుకి క్షమించమని, వెళ్ళిపోయే ముందోసారి పలకరించి పోదామని మహోన్నత మానవతావాది నీకొడుకు అంగీకారం కోసం ఎదురుచూస్తున్నాడు. లోపలకు రమ్మను బావా... భగవంతుడు కుటుంబంతో బయట నిలబడ్డాడు. పిలు బావా...”

***

**కెవివి సత్యనారాయణ**

కెవివి సత్యనారాయణ. తండ్రి పేరు కోనే సూర్యనారాయణ. హైదరాబాద్ మియాపూర్ లో ఉంటున్నారు. ఆంధ్రా బ్యాంక్ లో మేనేజర్ గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. మౌలికంగా నాటక రచయిత. 'అర్ధనారీశ్వరం' నాటకానికి అమలాపురంలో రాష్ట్రస్థాయి ఉత్తమ రచయిత గా పేరు తెచ్చుకున్నారు.

'బాస్టర్డ్' నాటకానికి కొలకపురి నాటక పరిషత్ ఉత్తమ ద్వితీయ రచనగా బహుమతి, 'క్రతువు' నాటికకు తెలుగు కళా సమితి, విశాఖ ఉత్తమ ద్వితీయ రచనగా బహుమతి, 'కర్రెద్దు' కథకు తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా (TELSA ) నుండి ప్రథమ బహుమతి రూ. 50వేలు, చదువు నవలల పోటీలో 'యవనిక' నవలకు ద్వితీయ బహుమతి (రూ.50,000/) అందుకున్నారు. మొదటి నవల 'ఋతం ' చతుర మాస పత్రికలో ప్రచురితమైంది.

# తాళి బంధం



పురిమళ్ల సునంద

"గీతమ్మ గారూ! అంట్లు రుద్దిన. బట్టలుతికి ఆరేసిన్నండీ!' ఇంగ ఎల్లొత్తా! అయ్య గారూ! మీయి కూడా...

ఇద్దరికీ ఒకేసారి గట్టిగా చెప్పి గబగబా ఆ ఇంట్లోంచి బయట పడింది తిరుపమ్మ.

"ఇద్దరికీ ఈ వయసులో పంతాలు పట్టింపులేందో!" "పెద్దోళ్ల గుట్టు పెరుమాళ్ళ కెరుక" అనుకుంటా మరో నాలుగు ఇండ్లల్లో గబగబా పని చేసి గుడిసెకు చేరుకుంది తిరుపమ్మ.

మంచంలో తన కోసమే సంటి బిడ్డోలె ఎదురు సూత్తున్న మొగుడు ఎంకటిని చూసే తలికి కండ్లల్ల జివ్వున నీళ్ళు పొంగినయి.

"మావా! ఇంద తిను" తనకోసం ఓ ఇంటోళ్ళు పెట్టిన ఇడ్లీని టిపిని డబ్బాలోంచి తీసి ముక్కలు చేసి పచ్చడద్ది నోటికి అందించింది.

"ఇంకెంత కాలమే తిరుపా! నన్ను బతికిత్తావు! నా వల్ల ఏమన్న నీకు ఒరిగేది ఉందా! రెండు కాళ్ళు ఇరిగి ఇట్ల శవమొతికె పడివున్నా! కాసింత ఇసం ఇయ్యరాదే! నీ కట్టాలు నా కట్టాలు తీరి పోతయి".

'ఏంది మావా! గీ పాడు మాటలు! ఇంకోపాలి అన్నావంటే నేను సచ్చినంత ఒట్టు.. నువు నడుత్తవు. గా గాయాలు మాన్నీ! ఏదో ఒకటి సేద్దాం అదైర్న పడకు మావా! మనకూ మంచిరోజులు వత్తయి" నీళ్ళు తాపించి. తనూ మిగిలింది తిని, చెయ్యి కడుక్కుని,ఎంకటి మూతి తుడిచింది.

ఎంకటి, తిరుపమ్మ కూలి నాలి చేసుకునే జంట. పల్లెటూరిలో పని దొరక్క బతుకు తెరువు కష్టమై పోయింది.ఉన్న ఒక్క కొడుకును బాగా సదివించాలని కోరికతో పట్నం వచ్చారు.ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుంటూ కొడుకు శివను ప్రైవేటు బళ్లో చదివిస్తున్నారు.

తాను పని చేస్తున్న మూటాలో కొందరు పొద్దంతా పని చేసుడు. వచ్చిన డబ్బులతో పొద్దుగూకితే పీకలదాకా తాగుడు.అలాంటోళ్ళ వెంట తిరిగి తిరిగి ఎంకటి తాగుడుకు అలవాటు అయ్యాడు."కొత్త బిచ్చగాడు పొద్దెరుగడు" అన్నట్లు. రాత్రే కాదు పొద్దున్నే కూడా తాగడం మొదలు పెట్టిండు.

తిరుపమ్మ భయపడ్డట్టే పొద్దున్నే సుక్కేసుకుని పనికెళ్ళిన ఎంకటి బిల్డింగ్

కట్టుబడికి పోయిండు. పరంజా మీద నిలబడి ఇటుక బొచ్చెలు అందియ్య బోయి దాని మీద నుంచి కిందకు జారి పడ్డాడు.రెండు కాళ్ళు విరిగినవి. పాతిక ముప్పై వేలు ఖర్చయినవి కాళ్ళు రావని చెప్పారు డాక్టర్. ఇంకా పచ్చిదనం పోలేదు. ఎంకటిలో పశ్చాత్తాపం. భార్య కష్టాన్ని సూడలేక పోతున్నడు. బతుకే వ్యర్థమని తలపోస్తున్నడు.

ఏ సయిమంలో ఏం చేస్తాడోనని కంటి రెప్పోలే కాపాడుకుంటున్నది.మంచి

రోజులు వత్తయని దైర్నం చెబుతోంది.

***

"గీతమ్మ గారూ! నేనో మాట అడుగుతా! ఏం నొచ్చుకోరుగా.. అంట్లు రుద్దుతుంటే అక్కడే కుర్చీ వేసుకుని కూర్చున్న గీతతో " అంది.

"ఏంది తిరుపమ్మా! అడుగు!" ప్రసన్నంగా అనడంతో కూసింత దైర్నం వచ్చింది తిరుపమ్మకు..

"ఎందుకు అయ్యగారితో మాట్లాడటం నేదు. పాపం ఆ అయ్య ఎంత తల్లడిల్లి పోతున్నడో! సూత్తుంటే కడుపు తరుక్కుపోతుంది.వంట చేసుకోలేక చెయ్యి కాల్సుకుంటుంటే సూడలేక పోతున్నమ్మా!

లండన్, అమెరికాలో ఉన్న మీ పిల్లలకు సెప్పి గీ సమస్య తీర్సుకో రాదుండ్రి.. పనిది గింత పెద్ద మాటలు చెప్పిందని కోపం తెచ్చుకోకుండ్రి. గీ వయసులో కూడా మీరిద్దరూ సిలకా గోరింకల్లా ఉండారని నా మావకు సెప్పేదాన్ని... ఏమయ్యింది మీకు.. "వంటా పడకా అన్నీ ఏరు చేసుకున్నరు" అయ్యగారిని సూడంగనే శివాలెత్తినట్టు మాటలతో ఇరుసుకు పడుతున్నరు. అయ్యగారికి ఏమన్నైతే మీరు తట్టుకుంటరా అమ్మగారూ!" గుక్క తిప్పుకోకుండా అడిగింది తిరుపమ్మ.

ఆ మాటలకు ఇంతకు ముందైతే విరుచుపడేది. తనంటే ఎంతో ఆత్మీయంగా సొంత మనిషిలా అడిగే సరికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి గీతకు..

" తిరుపా! ఈ గీత త్వరలో చెరిగి, చెరిగి మాయమై పోతుంది.. అందుకే నేను లేకుండా... అంటూ అప్పుడే వాకింగ్ కు వెళ్లి లోపలికి వస్తున్న భర్త రాఘవను చూసి .

"నీకు అన్నీ ఆరాలు కావాలి! పని మనిషి! పని మనిషిలా ఉండాలి." మా సొంత విషయాల్లో జోక్యం చేసుకుంటే ఊరుకునేది లేదు" తెచ్చిపెట్టుకున్న కోపంతో నాలుగు మాటలు టపాటపా అనేసింది.

"ఇప్పుడిప్పుడే ఏమయ్యింది అమ్మగారికి" తెల్లబోయి , నోరెత్తకుండా పనులు పూర్తి చేసి వెళుతున్న తిరుపమ్మ చేతులు పట్టుకుని ఏడ్చి, వెళ్ళగానే తలుపులు వేసుకుంది.

*భర్త రాఘవకు గీత ప్రవర్తన అర్థం కాలేదు. పనిమనిషి మీద కూడా విరుచుకు పడుతుంటే "ఛీ! ఛీ! ఏం మనిషి!" అనుకుంటూ లోపలికి వెళ్ళాడు.

వంట చేసుకోబుద్ధి కాక పాలలో నాలుగు బిస్కెట్లు అద్దుకుని తినేసి బయటికి వెళ్ళి పోతుంటే...

"ఇప్పుడు స్వేచ్ఛా జీవులు కదా! తిరగండి తిరగండి.. తిండి లేకుండా తిరిగి తిరిగి,వచ్చి అడ్డం పడితే ఇక్కడెవరూ చేసేవాళ్ళు లేరు" అది గుర్తుంచుకోండి" గయ్యిమని నాలుగు మాటలు అనేసింది తలుపు చప్పుడు వినగానే బయటకు వచ్చి...

'మాటకు మాట తెగులు' నీటికి నాచు తెగులు'. గీత కాదు నా తలరాత.. ఇలా రాక్షసిలా మారింది ఎందుకో" విసురుగా తలుపు దఢేల్ మని వేసి రోడ్డు ఎక్కాడు. రిటైర్ అయ్యాక ఇద్దరూ కలిసి తీర్థ యాత్రలు చేశారు. చావైనా బతుకైనా కలిసే అనుకున్నారు.ఎట్టి పరిస్థితిలో పిల్లల దగ్గరకు వెళ్ళి వాళ్ళను ఇబ్బంది పెట్టొద్దనీ ఎన్నో ముచ్చట్లు స్నేహితుల్లా కలబోసుకున్నారు.అలాంటిది ఆర్నెల్ల నుండి మారిపోయింది. పిల్లలతో ఈ విషయం చెబుతానని అంటే " వాళ్ళకు చెబితే నిద్ర మాత్రలు మింగి చస్తానని బెదిరించడంతో...ఈ వయసులో పిల్లలకు చెప్పలేక, తాను భరించలేక ఎన్నడూ రాని వంటావార్పు చేసుకోలేక సతమతం అవుతున్నాడు రాఘవ.

***

అలా తీవ్రమైన అసహనంతో అలా కొంత దూరం వెళ్తూ వుంటే గీత ప్రాణ స్నేహితురాలు కమల గుర్తొచ్చింది . వెంటనే ఆమె ఇంటికి వెళ్ళాడు.

రాఘవను చూడగానే తడబడి పోతూ లోపలికి ఆహ్వానించింది.

కళ్ళూ ముఖం పీక్కుపోయి పదేళ్ల వయసు పైబడ్డట్టుగా కనిపిస్తున్న అతడిని చూడగానే చాలా బాధ కలిగింది కమలకు.

"టీ తీసుకోండి! అన్నయ్య గారు!"తెచ్చిన టీ

టీపాయ్ మీద పెట్టింది .

"నువ్వైనా చెప్పు చెల్లాయ్! భరించలేకుండా ఉన్నాను.ఈ దిగులుతో గుండె ఆగిపోయేట్టు ఉంది"అంటున్న రాఘవ మాటలకు అడ్డు పడుతూ.. "అన్నయ్యా! ఆ మాట అనకండి ఇప్పటికే దాని గురించి ఆలోచిస్తూ రోజూ ఏడుస్తున్నా! అంది.

"ఏమైంది చెల్లాయ్! నా గీతకు " ఆదుర్దాగా అడుగుతున్న రాఘవకు విషయం చెప్పింది. తనకు క్యాన్సర్ ఫోర్త్ స్టేజ్ లో ఉంది. ఈ వయసులో ఏమిటోనే బ్లీడింగ్ ఓకటే అవుతోందని నా దగ్గరికి వచ్చి చెప్పింది. ఎందుకైనా మంచిదని ఇద్దరం కలసి హాస్పిటల్ కు వెళ్ళాము. చెయ్యి దాటి పోయిందని ఎప్పుడు ఏటైమో చెప్పలేం ఆపరేషన్ చేయడానికి వీలు పడలేదని డాక్టర్ మందులు రాసి ఇచ్చింది. అందుకే మీకు తెలియకుండా ఉండేందుకు గదులతో సహా వేరు చేసి మిమ్మల్ని దూరంగా ఉంచుతోంది. "తను లేకుండా మీరు బతకేలా చేయాలని.పిల్లలు వాళ్ళ ధర్మంగా రమ్మని పిలుస్తారే కానీ మన అలవాట్లు, అవసరాలు అర్థం చేసుకునే గొప్ప మనసు వాళ్ళకు ఉండదని, ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పిందన్నయ్యా!"

విషయం తెలుసుకున్న రాఘవ బరువెక్కిన గుండెతో"వచ్చేటప్పుడు ఎన్ని

తిట్టుకున్న నా గీతను. అయినా తను లేని ఈ లోకం నాకు మాత్రం అవసరమా! తను బతికినంత కాలం తోడుగా నీడగా ఉంటాను.సంతోషంగా ఉంచేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాను చెల్లీ!"చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ ఇంటికి వచ్చాడు రాఘవ.

***

అప్పటి దాకా దుఃఖిస్తూ రాస్తున్న ఉత్తరాన్ని మంచం కింద దాచేసి." తలుపు తీస్తూ "ఏం తొందరగానే వచ్చారే.. అయ్యగారికి బయట తిరుగుళ్ళు అయిపోయినవా"! అంటున్న గీత దగ్గరగా వెళ్లి గుండెలకు హత్తుకుని" నీవు ఇలాగే తిడుతూనే ఉండు. ఎన్నైనా పడతాను.కానీ నువ్వు నాతోనే ఉండాలి. నన్ను దూరం చేయొద్దు'. నేను నేర్చుకున్న వంట నీకూ చేసి పెడతాను". ఇంకొక్క మాట అన్నావంటే నేను చచ్చిపోయినంత ఒట్టు" అంటున్న భర్త నోరు మూస్తూ "లేదు.లేదు.మీరు కాదు చచ్చిపొయ్యేది నేను. నేను లేకున్నా మీరు బతకాలి అందుకే.. దుఃఖం అడ్డుపడి మాటలు పూడుకుపోయాయి.

ఒకరి గుండెల్లో ఒకరు...

భర్త కాళ్ళకు జైపూర్ కాళ్ళు పెడతారట అని సంబురంగా చెప్పడానికి వచ్చిన తిరుపమ్మకు ఆ దృశ్యం శివ పార్వతులను ప్రత్యక్షంగా చూసినంత ఆనందం కలిగించింది.

ఆ తర్వాత అమ్మ గారి జబ్బు గురించి తెలిసి,అయ్యగారి సేవలు చూసి ఆలుమగలు అంటే ఇలా కదా !ఉండాలి అనుకుంది.

మొగుడు ఎంకటితో ఈ ముచ్చట్లన్నీ చెప్పి "ఇదుగో! మనం సుత గట్లనే ఉండాల.ఈ చిల్లర కొట్టు సూసుకుంటే. నీకు కాలచ్చేపం అవుద్ది, మనకి నాలుగు పైసలు వత్తయి ఏమంటవు మావా!" అంటున్న తిరుపమ్మను మురిపెంగా చూస్తూ "ఇంకేమంట, "తాళిబంధ మంటే" గిదేనని చెప్పిన..తిరుపతి కొండంత మనసున్న నా తిరుపకు " దగ్గరకు తీసుకున్నాడు.

***

**వురిమళ్ల సునంద** తెలుగు భాషోపాధ్యాయినిగా భద్రాద్రి కొత్త గూడెం జిల్లా, జూలూరుపాడు మండలం లోని పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ పెద్దల, బాలల కథలు కలిపి 150కి పైగా కథలు రాశారు. కవితలు వ్యాసాలు, సమీక్షలు, పాటలు,బాల గేయాలు, నాటికలు, గజల్స్,రుబాయీలు, నానీలు, హైకూలు, సుభాషితాలు మొదలైన ప్రక్రియల్లో రచనలు చేశారు. బాల సాహిత్య సృజన చేయడమన్నా, బాలల్లో సాహిత్య అభిలాష కలిగించి వారితో వివిధ ప్రక్రియల్లో రచనలు చేయించి సమాజానికి నవ సాహితీ వేత్తల తరాన్ని అందించాలనే తపన ఎక్కువ. అందుకే వారు పనిచేసే పాఠశాల విద్యార్థుల్లో మాతృ భాష తెలుగు గొప్పతనాన్ని తెలుసుకునేలా చేస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికి తీసి

సుమారుగా 15 బాలల సాహిత్య సృజన సంకలనాలను తీసుకుని వచ్చారు. పెద్దల కోసం కథల సంపుటి "బహు'మతు'లు. కవితా సంపుటాలు 1. వరిమళ్ల వసంతం 2. మెలకువ చిగురించిన వేళ నా రచనలు. ఇవే కాకుండా సంస్కృత న్యాయాలకు తెలుగు వ్యాఖ్యానాలు 915 వరకు రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన పాఠ్య పుస్తకాల రూపకల్పనలో 1 నుండి 5 వరకు ప్రథమ భాష తెలుగు పాఠ్య పుస్తకాల రూపకల్పనలోనూ, 1 నుండి 9 వరకు ద్వితీయ భాష విద్యార్థుల తెలుగు పాఠ్య పుస్తకాల రూపకల్పనలోనూ, ఓపెన్ టెంత్ తెలుగు (TOSS) పాఠ్య పుస్తక రూపకల్పనలోనూ, డిజిటల్ పాఠాల బోధనలోనూ పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా విద్యాశాఖ వారిచే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, తేజా ఆర్ట్ క్రియేషన్స్ సంస్థ నుంచి ఉత్తమ కవయిత్రి గా, తెనాలి గుర్రం జాషువా సేవా సమితి వారిచే జాషువా స్మారక పురస్కారం, .పట్టాభి కళాపీఠం వారిచే గిడుగు రామమూర్తి పంతులు గారి స్మారక పురస్కారం, ఉదయ సాహితీ కరీం నగర్ వారిచే దాస్యం సేనాధిపతి గారి తండ్రి పేరుతో దాస్యం వెంకట స్వామి స్మారక పురస్కారం వంటి పలు పురస్కారాలు అందుకున్నారు.

**9441815722**

# తెలుగు మాస్టారు

**లక్ష్మి మదన్**

నటింట్లో పీట వేసుకుని కంచంలో అన్నం కూర పెట్టుకొని చారు ఒక గిన్నెలో పోసుకొని మంచినీళ్లు చెంబు పెట్టుకొని కూర్చుంది సుజాత..

ఇంట్లో అందరూ భోజనాల బల్ల పైనే తింటారు ..కానీ, సుజాతకి కింద కూర్చుని తింటేనే తిన్నట్టు ఉంటుంది' ఎందుకమ్మా కింద కూర్చొని తింటావు టేబుల్ మీద తినొచ్చు కదా !" అని..పిల్లలు అడిగితే..

" నాకు ఇలా తింటేనే తిన్నట్టు ఉంటుంది.. నా తండ్రి చనిపోయే వరకు కూడా నేల మీద కూర్చొని భోజనం చేసేవాడు.. నాకు అదే అలవాటు వచ్చింది. ఇప్పుడైతే కాళ్ల నొప్పులు ఏం లేవు కదా! అవి వచ్చినప్పుడు టేబుల్ మీద తింటాలే" అని సమాధానం చెప్పేది.

కూతురు ప్రతిమ ఇంజనీరింగ్ ఫైనల్ ఎగ్జామ్స్ ఉన్నాయని ప్రిపరేషన్ హాలిడేస్ కోసం వచ్చి హాల్లో కూర్చుని చదువుకుంటుంది... కొడుకు అదే ఊర్లో ఇంటర్ చదువుతున్నాడు... భర్త కొడుకు టిఫిన్ బాక్సులు తీసుకొని వెళ్ళిపోయారు తాను మాత్రం ప్రతిమకు భోజనం పెట్టి తాను కూర్చుంది తినడానికి...

ఇంతలో బయట నుండి 'కొంచెం భోజనం ఉంటే పెట్టండి తల్లీ!" అనే గొంతు వినిపించింది..

అది విన్న సుజాత..

"ప్రతిమా! ఒక్కసారి బయటకు చూడు ఎవరో పిలుస్తున్నారు" అన్నది సుజాత నోట్లో ముద్దని పెట్టుకోబోతూ..

" ఎవరో నమ్మా! భోజనం కావాలని అడుగుతున్నారు పంపించేయనా"? అని అడిగింది.

" తప్పు ఎవరైనా అన్నం అడిగితే లేదని పంపించవద్దు.. అందులో నేను భోజనం చేసే ముందు వచ్చారు.. నేను ఇదే కంచం తీసుకెళ్లి అతనికి భోజనం పెట్టేసి వస్తాను" అని తన పళ్లెంతీసుకుని బయటకు వెళ్ళింది సుజాత..

బయటకు వెళ్లిన సుజాత వచ్చిన వ్యక్తిని చూసి నిర్ఘాంత పోయింది,.. అతను ఎవరో కాదు.. వారి తెలుగు మాస్టారు.. "ఇదేంటి ఇతను భిక్షాటన కోసం వచ్చాడు.. ఎంతో గొప్పగా బ్రతికిన ఇతనికి భిక్షం అడుక్కోవాల్సిన పని ఏమిటి?" అని మనసులో అనుకొని..

"మాస్టారూ! మీరేమిటి ఇలా! ముందు లోపలికి రండి" అని చేయి పట్టుకొని తీసుకెళ్లి లోపల ఉన్న దివాన్ మీద కూర్చోబెట్టింది..

అతను సుజాత వంక అయోమయంగా చూసి గుర్తుపట్టలేదన్నట్టుగా మొహం పెట్టాడు..

"నేను సుజాతను మాస్టారూ! దక్షిణామూర్తి గారి అమ్మాయిని మనం బంధువులం కూడా అవుతాము గుర్తుకొచ్చానా!" అని అడిగింది.

అతని మొహంలో చిన్న వెలుగు కనిపించింది '' గుర్తుపట్టాను "అన్నట్లుగా ఒక చూపు చూశాడు.. కానీ అతను చాలా నీరసంగా ఉన్నాడు మాట్లాడే పరిస్థితిలో లేడు..

అది గుర్తించిన సుజాత అతనికి విస్తట్లో అన్నం పెట్టింది దాన్ని తెచ్చి స్టూల్ వేసి అతని కూర్చున్న చోటే అమర్చింది, "మీరు తినండి మాస్టారు" అని చెప్పింది.

అతను చేతుల వంక చూసుకున్నాడు... ఒక ఖాళీ బకెట్ తెచ్చి పెట్టింది.. దానిలో కడుక్కోమని చెప్పి చేతుల మీద నీళ్లు పోసింది..

అతను చేతులు కడుక్కొని నెమ్మదిగా భోజనం చేయసాగాడు.. అతని వయసు దాదాపు ఎనభై ఏళ్లు ఉంటుంది...

అతను నిదానంగా భోజనం చేస్తుంటే.. గతమంతా కళ్ళ ముందు కదలాడింది సుజాతకి..

వంటింట్లో సుజాత తల్లివర్ధనమ్మకట్టెల పొయ్యి మీద వంట చేస్తుంది ..ఆ పొయ్యి మంటలో నాలుగు వంకాయలను పెట్టి కాలుస్తూ కూర్చుంది.. పక్కనే కూర్చున్న సుజాత 'ఆ వంకాయలతో ఏం చేస్తావమ్మా!" అని అడిగింది..

" నాన్నకి వంకాయలను అన్నంలో కలుపుకుని తినడం ఇష్టం అందుకనే కాల్చి పెట్టి దానిలో ఉప్పు నెయ్యి వేసి పెడతాను" అని చెప్పింది.

" అయితే నాకు కూడా కావాలి" అన్నది సుజాత.

" సరే నీకు కూడా ఇస్తా గానీ.. మన ఇంటికి బంధువు వచ్చారు.. అతను నీకు మామ వరస అవుతారు. ఇక్కడ స్కూల్లో టీచర్గా వచ్చారట అదే మీ స్కూల్లోనే ..వెళ్లి అతనికి మంచినీళ్లు ఇచ్చి నమస్కారం చేసి రా" అని చెప్పి తల్లి పంపించింది.

అతనికి మంచినీళ్లు ఇచ్చి నమస్కారం చేసింది సుజాత.

" ఏం చదువుతున్నావు తల్లి" అని అడిగాడు వచ్చిన బంధువు.

"తొమ్మిదవ తరగతి చదువుతున్నానండి" అని చెప్పి లోపలికి వచ్చింది.

మామూలుగానే ఇంట్లో అక్కతో చెల్లెళ్లతో కొట్లాడుకుంటూ జోక్స్ చేసుకుంటూ మాట్లాడింది సుజాత ..అతని ముందు ఏమీ భయపడలేదు కూడా..

అసలు ఆ బంధువు గురించి పట్టించుకోకుండా చాలా అల్లరి చేసేసింది అప్పటికి తల్లి చెప్తూనే ఉంది "కొత్త వాళ్ళ ముందు ఏంటి ఆ అల్లరి?" అని.. అయినా సుజాత పట్టించుకోలేదు..

ఆలస్యంగా ఇంటికి వచ్చిన తండ్రి వచ్చిన బంధువుతో ఆప్యాయంగా మాట్లాడుతూ

చాలా రాత్రి వరకు అతనితోనే కూర్చున్నాడు.

ఇద్దరూ ఒకరినొకరు "బావ 'అనుకుంటూ సంబోధించుకున్నారు..

తెల్లవారి సుజాత యధాప్రకారంగా స్కూలుకు వెళ్ళింది..

అంతకు ముందు రోజే హెడ్మాస్టర్ వచ్చి మీకు కొత్త తెలుగు మాస్టర్ వస్తున్నాడు.. ఇప్పుడున్న మాస్టారు ట్రాన్స్ఫర్ మీద వెళ్ళిపోయారు" అని చెప్పాడు..

"కొత్త మాస్టారు ఎలా పాఠాలు చెప్తారు.. స్ట్రిక్ట్ గా ఉంటాడా లేక ఫ్రెండ్లీగా ఉంటాడా" ఇవన్నీ చర్చించుకుంటున్నారు క్లాస్లో పిల్లలందరూ.. అంతకు ముందు ఉన్న మాస్టారు అసలు ఒక్కరోజు కూడా క్లాస్ తీసుకునేవాడు కాదు. ఎప్పుడు సెలవు పైనే ఊరికి వెళ్ళిపోయేవాడు..

ఇలా అనుకుంటుండగానే ఫస్ట్ పీరియడ్ లో మాస్టారు లోపలికి వచ్చారు...

అందరూ లేచి నిలబడి "గుడ్ మార్నింగ్ సార్ "అని చెప్పారు..

కానీ సుజాతకి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టు అయింది.. ఎందుకంటే వచ్చిన మాస్టారు ఎవరో కాదు నిన్న వాళ్ళ ఇంటికి వచ్చిన బంధువు..

"ఈవిషయం తెలియక ఇంత అల్లరి చేశాను నేను ఇప్పుడు సార్ ఏమంటారో" అని భయపడ సాగింది సుజాత...

ఒక్కొక్కరిగా వారి పేర్లు చెబుతూ పరిచయం చేసుకో సాగారు..

ఇక పరిచయం చేసుకోవడం సుజాత వంతు వచ్చింది ఒక్కసారిగా సుజాతకు చెమటలు పట్టుసాగాయి..

ఏమి మాట్లాడకుండా నిలబడ్డ సుజాతను చూసి..

" నువ్వు ఎవరో నాకు తెలుసు గాని.. నువ్వు నీ నోటితో నీ పేరు చెప్పు బిడ్డా" అన్నాడు మాస్టారు నవ్వుతూ..

కొంచెం భయం పోయి ధైర్యం వచ్చింది మెల్లిగా లేచి తన పేరు చెప్పింది....

అలా వచ్చిన తెలుగు మాస్టారు పేరు సూర్య నారాయణ శాస్త్రి గారు... మొదటి రోజే పిల్లలందరినీ ఆకట్టుకున్నారు.

అతను తెలుగు పండితుడే కాకుండా ఒక అవధాని అని, ఒక కవి అని తర్వాత తెలిసింది...

తెల్లని ధోతి అంగీ వేసుకుని నుదుట కని కనిపించని విభూతి రేఖలు పెట్టుకొని..చిన్న కుంకుమబొట్టుతో స్కూల్ కి వచ్చేవారు.. ఆయన ఒక్కొక్కసారి ఏ లోకంలోనో ఉన్నట్టుగా ఉండేవారు.. ఆయన ఆహార్యం మీద కూడా శ్రద్ధ ఉండేది కాదేమో!.. ఇంట్లో వారి సతీమణి ఇచ్చిన బట్టలను కట్టుకొని పెట్టిన భోజనం తిని బయలుదేరేవారు ఒక్కొక్కసారి చెప్పులు కూడా వేసుకునేవారు కాదు.

ఆయన పాఠం చెప్పే విధానం చూస్తే అరటి పండు వలిచినట్లు అనిపించేది

..అప్పటికప్పుడే ప్రశ్నలకు జవాబు రాయగలిగేంత అర్థం అయ్యేలా వివరించేవారు.

పాఠం చెప్పగానే చివరలో అప్పటికప్పుడు ఎవరు పద్యం ఒప్ప చెప్పితే వారి ముఖంలో ప్రశంస కనపడేది.. ఆ ప్రశంస కోసం విద్యార్థులు ఎంతో తాపత్రయపడేవాళ్లు... కనీ కనిపించని ఒక ఎక్స్ప్రెషన్ ఉండేది ముఖంలో అదే తప్పు చెప్పితే అతని ముఖ కవళికలు మారిపోయేవి.. మాస్టారు తిట్టకుండా కూడా ఆ కవళికలను చూస్తేనే పిల్లలకు బాధ కలిగేది..

పిల్లలందరికీ చక్కని చందస్సును నేర్పించారు.. పద్యాలు ఎలా రాయాలో చూపించారు.. మంచి మార్కులు పొందిన వాళ్లకు తన రచనల్లో నుండి పుస్తకాలు బహుమతిగా ఇచ్చేవారు.. ఇలా తెలుగు మాస్టారు పిల్లలకు ఎంతో స్ఫూర్తిగా నిలిచారు.

అప్పుడప్పుడు చతురోక్తులతో తరగతిని ఎంతో ఉల్లాసంగా ఉంచేవారు... అతని ప్రతిభ తెలుసుకున్న సుజాత అతనంటే అపారమైన గౌరవం పెంచుకుంది.. వీళ్ళ ఇంటి దగ్గరనే మాస్టారు ఇల్లు ఉండేది వాళ్ల పిల్లలతో ఎక్కువ సాన్నిహిత్యం కూడా కలిగింది సుజాతకు.. అప్పుడప్పుడు వాళ్ళ ఇంటికి వెళ్ళేది కానీ మాస్టారు లేనప్పుడు మాత్రమే వెళ్ళేది.. మాస్టారును చూడాలంటే స్కూల్లో మాత్రం చూడ్డానికి ఇష్టపడేది... అలా అతను అంటే ఇష్టంతో పాటు గౌరవం పెరిగింది.

ఇదంతా గుర్తుకొచ్చిన సుజాత ఒక్కసారి ఈ లోకంలోకి వచ్చి మాస్టారును చూసింది.. అతను భోజనం చేసి మెల్లిగా లేచి వెళ్లి పెరట్లో చేయి కడుక్కున్నాడు.

"మాస్టారూ! కాసేపు విశ్రాంతి తీసుకుంటారా" అని అడిగింది సుజాత

" లేదమ్మా నేను వెళ్ళిపోవాలి" అన్నారు శాస్త్రి గారు.

"అసలు ఎక్కడుంటున్నారు ఎక్కడికి వెళ్తున్నారు? మీ పరిస్థితి ఏంటో తెలుసుకోవాలని ఉంది" అని అన్నది సుజాత.

అతని కళ్ళనుండి జలజల కన్నీళ్లు రాలిపడ్డాయి..

అతని భుజం మీద చేయి వేసిన సుజాత "బాధపడకండి మాస్టారూ! ఏం జరిగిందో చెప్పండి మీ బాధను తగ్గించడానికి నా వంతుగా ప్రయత్నం చేస్తాను" అని చెప్పింది.

"ఏం చెప్పను తల్లి !ఎంతో వైభోగంగా గడిచిన నా జీవితం ఈరోజు నేల రాలి పడింది.. పిల్లలందరినీ చక్కగా చదివించాను పెళ్లిళ్లు చేశాను ఏ మాత్రం నేను డబ్బులు మిగిల్చుకోకుండా వారి కోసం మాత్రమే ఖర్చు పెట్టాను.. పోయిన సంవత్సరం నాభార్య చనిపోయింది.. అప్పటినుండి నాకు నరకం మొదలైంది... ఆమె ఉన్నంతవరకు నాకు ఏ లోటు తెలియలేదు ఎవరి సూటి పోటీ మాటలు నాకు వినపడలేదు.. నాకు ఆమె వినబడనీయలేదు కూడా ..ఎప్పుడైతే ఆమె పోయిందో అందరి నిజస్వరూపాలు తెలిసిపోయాయి... నాకు కంచంలో పట్టెడన్నం కాకులకు విసిరిన దానికన్నా హీనంగా పెట్టడం మొదలయ్యింది ఇంట్లో నుండి నా పడక వీధి అరుగు మీదికి చేరింది... నా ఉనికి ఇంట్లో అందరికీ భారం అయిపోయింది... ఉద్యోగాల పేరిట అందరూ ఇంట్లో నుండి

బయటకు వెళ్ళిపోతారు నేను ఆ పంచలోనే బయట కూర్చుంటున్నాను ఆకలి వేస్తే లోపలికి వెళ్లడానికి లేదు ..ఒకప్పుడు నేను కట్టిన ఇల్లు అది.. ఇప్పుడు ఆ ఇంట్లోకి కాలు పెట్టడానికి నాకు అర్హత లేదు... పెన్షన్ డబ్బులు కూడా జాయింట్ అకౌంట్లోనే పడతాయి.. అందులో నుండి పది రూపాయలు ఇవ్వడానికి కూడా ఎవరికీ మనస్సుఒప్పదు.. ఆకలి దప్పులకు ఓర్చుకుంటాను.. కానీ సూటి పోటీ మాటలను భరించలేకపోయాను.. నేను చేసిన నేరమేంటో నాకు అర్థం కాలేదు.. అవన్నీ భరించలేక ఇలా బయటకి వచ్చాను.. అదే ఊళ్లో అడుక్కుంటే వాళ్లకి ఇంకా భారమైపోతానని ఇలా ఈ ఊరికి వచ్చాను కానీ ఇక్కడ నిన్ను చూస్తానని నేను ఊహించలేదమ్మా! మీ నాన్నగారు నేను ఇద్దరం ఎంతో ప్రాణంగా మెలిగాము.. ఆయన అదృష్టవంతుడు నేను ఇలా మిగిలిపోయాను" అని చెప్పి వెక్కి వెక్కి ఏడవసాగారు శాస్త్రి గారు.

బాధతో కళ్ళ నీళ్లు వచ్చాయి సుజాతకి. అక్కడే ఉండి వింటున్న ప్రతిమకి నోట మాట రాలేదు ఇంకా లోకం తెలియని ఆపసిదానికి "ఇలా కూడా చేస్తారా" అనిపించింది..

"మాస్టారు మీరు బాధపడకండి మా వారు వచ్చిన తర్వాత మిమ్మల్ని ఒక ప్రదేశానికి తీసుకెళ్తాము.. అంతవరకు ఇక్కడే ఉండండి.. మీరు ఎక్కడికి వెళ్ళడానికి వీల్లేదు" అని చెప్పి కట్టుకోవడానికి ఒక ధోతి ఒక చొక్కా తెచ్చి ఇచ్చింది సుజాత.

ఆ బట్టలు మార్చుకొని అక్కడే దివాన్ మీద పడుకున్నారు శాస్త్రి గారు.

ఆరోజు సాయంత్రం భర్త శ్రీనివాస్ తో కలిసి శాస్త్రి గారిని ఆనంద నిలయానికి తీసుకెళ్ళింది. అది వృద్ధాశ్రమం అని తెలుసుకున్న శాస్త్ర గారు మరింత బాధ పడిపోయారు..

" మీరు బాధపడకండి మాస్టారు లోపలికి వచ్చిన తర్వాత మీకే అర్థమవుతుంది" అని చెప్పి శాస్త్రి గారిని లోపలికి తీసుకెళ్లారు సుజాత దంపతులు.

లోపల అంతా సందడిగా ఉంది పెద్దలు పిల్లలు అందరూ కలిసి ఉన్నారు..

కొంతమంది వృద్ధులు మూడు నుండి పదేళ్ల వయసున్న పిల్లలకి పద్యాలు నేర్పిస్తున్నారు. మరి కొందరు ఇంగ్లీష్ చదివిస్తున్నారు.. మరికొందరు కథలు చెబుతున్నారు. మరికొందరు ప్రేమగా తినిపిస్తున్నారు ఇలా పెద్దవాళ్లు పిల్లలు ఆనందంగా కలిసే ఉన్నారు ఆప్రాంగణమంతా..

అదంతా చూస్తున్న శాస్త్రి గారికి ఏమి అర్థం కాలేదు అన్ని కుటుంబాలు ఇక్కడే కలిసి ఉన్నాయి..ఇది అనాథలు ఉన్నట్లుగా లేదు అని ఆశ్చర్యపోయారు..

అప్పుడు చెప్పింది సుజాత..

"మాస్టారూ! మన స్కూల్లో రమణమూర్తి అని ఒక అబ్బాయి ఉండేవాడు గుర్తుందా? అతను స్కూల్ టాపర్ గా ఉండేవాడు అతను ఈ జిల్లా కలెక్టర్ గా పని చేశారు కొంతమంది ఇలా ఇంటి నుండి గెంటివేయబడిన వారిని చూసి ఆయన మనసు ద్రవించిపోయింది ..అప్పుడు ఆయన మనసులో ఒక ఆలోచన రూపుదిద్దుకుంది అదే ఈ ఆనంద నిలయం ఇది వృద్ధాశ్రమం కాదు.. దీనిలోనే తల్లిదండ్రులు చెత్తకుండీలో వదిలేసిన పిల్లలు లేదా తప్పిపోయిన పిల్లలు మరియు ఇలాంటి వృద్ధులు ఉంటారు..

తల్లిదండ్రులు ప్రేమ కోల్పోయిన పిల్లలకి వీళ్ళు ఆ ప్రేమను పంచుతారు పిల్లలకు ప్రేమ కోల్పోయిన వృద్ధులు అదే ప్రేమను తిరిగి అందిస్తారు.. ఇలా ఇచ్చి పుచ్చుకోవడం తో వారికి బ్రతుకు భారం అనిపించడం లేదు ..తెల్లవారి లేచినది మొదలు నా పిల్లలకు ఇది చేయాలి అది చేయాలి అని వృద్ధులు వారి ప్రేమను పొందాలి అని పిల్లలు ఇలా తప్పించి పోతున్నారు.. కాలం వారికి ఇప్పుడు వారికీ ఆశా జనకంగా కనిపిస్తుంది .నిరాశ నిస్పృహ మాయమై ఆ స్థానంలో కొత్త ఊపిరి పోసుకుంది.. అందుకే మిమ్మల్ని ఇక్కడికి తీసుకొని వచ్చాను.

ఇక్కడ మొక్కుబడి భోజనం ఉండదు కొన్ని కుటుంబాలు స్వచ్ఛందంగా వచ్చి ఆప్యాయంగా ప్రేమగా వడ్డిస్తారు..అందులో మేముకుడా ఉన్నాము.. ఇక్కడికి వచ్చినవారు ఇంట్లో గడిపిన దానికన్నా ఇంకా ఎక్కువ సంతోషంగా ఉన్నారు...

చెప్పండి ఇప్పుడు మిమ్మల్ని సరియైన చోటుకే తీసుకొని వచ్చానా" అని అడిగింది సుజాత.

ఆయనకు ఇదంతా చూసిన తర్వాత ఎంతో సంతోషంగా అనిపించింది "ఇంకా ఎంతో మంది మహనీయులు భూమి మీద ఉన్నారు కాబట్టి లోకంలో మానవత్వం మిగిలి ఉంది" అని అనుకునీ సుజాత చేయిని గట్టిగా పట్టుకున్నారు...

అప్పుడే అక్కడికి వచ్చిన ఐదేళ్ల పిల్లవాడు..

"తాతయ్యా! నాకు కథ చెప్పవా !అమ్మ నాకు కథలు చెప్పేది కానీ ఇప్పుడు అమ్మ లేదుగా నువ్వు చెప్తావా" అని చేయి పట్టుకుని అడిగాడు.

అక్కడికి వచ్చిన నిర్వాహకురాలు చెప్పింది

"ఈ అబ్బాయి తల్లిదండ్రులు యాక్సిడెంట్ లో పోయారు.. నెల క్రితం ఆ సంఘటన జరిగింది ..దాదాపు చనిపోయే స్టేజికి వచ్చిన ఇతన్ని ఇక్కడికి తీసుకొని వచ్చిన తర్వాత ఇంతమంది ప్రేమను పొంది మామూలు మనిషి అయ్యాడు" అని చెప్పింది.

వెంటనే శాస్త్రి గారు ఆ అబ్బాయి చేయి పట్టుకుని

"నేను నీకు కథలు పద్యాలు అన్నీ నేర్పిస్తాను నీ పేరేంటి రా అబ్బాయ్" అని అడిగాడు చిరునవ్వుతో..

"నా పేరు సూర్య" అని చెప్పాడు.

"ఒరే ఒరే నా పేరు పెట్టుకున్నావట్రా" అంటూ ఆ పిల్లవాడి చేయి పట్టుకుని లోపలికి నడిచారు శాస్త్రి గారు సంతోషంగా ఒక ఆలంబన దొరికినట్లుగా..

సుజాత అతన్ని సంతృప్తిగా చూసి" ఇంక మాస్టారికి ఏ బాధ లేదు తెలుగుని ఇంకా బాగా బతికిస్తారు" అని అనుకుంటూ బయటకు వచ్చేసింది ఆనంద భాష్పాలు రాలుస్తూ!

***

# ఈశ్వర్ అల్లా తేరోనాం!

డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి

ఇద్దరు ఆడ బిడ్డలను డబ్బుకోసం షేక్ లకు అమ్మేసిన భర్త మొండి తనానికి కర్కసత్వానికి చాలా సంవత్సరాలు మాట్లాడలేదు. బ్రతిమలాడినా దగ్గరకు రానివ్వలేదు. పది సంవత్సరాలు దర్గాలకు మసీదులకు, చివరకు దేవాలయాకు భర్త హబిబుల్లాకు తెలియకుండా తిరిగితే పుట్టాడు ఆసాద్ అల్లా ఇచ్చిన కానుకని అమిత ప్రాణంగా పెంచింది ఫాతిమా .

'చెప్పల్ సే మార్థూంన్గా! మాదర్చేద్క బచ్చా !" అంటూ నిప్పులుగక్కుతూ ఎడతెరిపి లేకుండా చేతికి అందిన దానితో బాదుతున్న హబిబుల్లాను బ్రతిమలాడుతూ, అడ్డునిలబడి అన్ని దెబ్బలు బండబూతులు తినింది ఫాతిమా, ఆసాద్ ను తప్పిస్తూ.

అప్పటికే అసాద్ కిందపడిపోయి పెద్దగా," మై క్యా గల్తీ కియా పాపా! కొట్టొద్దు..కొట్టొద్దు. మరూన్గా మై i చచ్చిపోతాను..చచ్చిపోతాను. అని బిగ్గరగా ఏడుస్తూ తనకలాడుతూ తల్లిని అడ్డుపెట్టుకుని తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

'గల్తీ నై కియా! క్యాబోలేరే తూ ! ఈశ్వర్.. తూ. ముసల్మాంకి బేటా ! తు చోడనా నై ఏ మై లూంగా ! నాలుక కోస్తాను. సైతాన్ పదం పలికిన ముస్లిం నాలుక ఉండకూడదు." అంటూ కత్తి తీసుకున్నాడు.

'మేరీజాన్! హాభిబ హల్బి,యా హైయాతీ... మీ కాళ్ళు పట్టుకుంటా ! ఒక్కగానొక్క బచ్చా! మైన్ బాత్ కర్ లీ హై ! చూసుకుంటాను. మేరా బచ్చాక చోడ్ ధో!" ఫాతిమా హభిబుల్లా కాళ్ళు పట్టుకుంది.

ఒక్క తోపు తోసి ముందుకు కదిలాడు. ఫాతిమా అడ్డు నిలబడి,"ముజే మార్ దాలో ఆవుర్ ఆగే బాధో! నన్ను చంపి ముందుకు కదలండి ." కళ్ళల్లో నీళ్ళు కారిపోతున్నా చూపులు నిప్పులు కురుస్తున్నాయి.

'జరుగు ! మార్దూన్గా !' అని నెట్టుతూ వినకూడని బూతుమాటలతో తిడుతూ గట్టిగా తోసాడు.

అయినా ఫాతిమా కదల్లేదు . తోస్తున్నా వదల్లేదు

'మై నహి చోడూంన్గా! వదలను.నా బిడ్డ ! రోజువాడ్ని ఎంత ఘాత్కంగా తప్పుడుమాటలతో తిట్టి కొట్టి నాకు లేకుండా చేస్తావు. నన్నూ చంపు!!"

కొడుకు వైపు చూసాడు.ఏడుస్తూనే ఉన్నాడు. భార్య ఫాతిమా అడ్డు లేవలేదు. భార్య అంటే ప్రేమ, భయంకూడా ! అయినా వాడు పాడే పాట చెవుల్లో హోరేత్తుతుంది. అల్లాను అంత అవమానిస్తుంటే సహించలేక పోయాడు . బిగ్గరగా అరిచి కోపంతో విసురుగా కత్తి విసిరేసి వీధిలో పడి తిట్టుకుంటూ అల్లాను క్షమాపణ అడగడానికి మసీదు

వైపు పరుగెత్తాడు ఎక్కడ నేర్చుకున్నాడు వాడు. ఈ దరిద్రపు కుంపటి... ! ఇంటికి కాస్త దూరంలో సైతాన్ ..దేవస్థానం అనడానికి మనస్కరించలేదు. ఆడమగ కలిసే... ...తప్పుడుమాట నోట్లో తగలపడింది. వాళ్ళు చేసే భజనలు వినలేక ఆ దారిన పోనే పోదు

కానీ పిల్లాడు అదే దారిన పోవడం. అక్కడ నిలిచి తదేకంగా భజన పాటలు వింటూ ఉండడం చాలా సార్లు గమనించాడు హబిబుల్లా!.దానికి చితకబాదాడు కానీ ఆపలేక పోయాడు..పిచ్చి పట్టి పోయేది !.

ఇది ఈ నాటిదికాదు.ఆసాద్ కు మాటలు వచ్చినప్పటినుంచి రోజు ఇదే రచ్చ. అప్పుడే అంతం అయిపోయినట్లు భార్యా భర్తల చంపుకునేంత గొడవ !

ఆసాద్ కు ఎందుకు తండ్రి ఇంత గొడవ చేస్తున్నాడో అర్థం అయ్యాదే కాదు. కానీ అతనికి ప్రాణం ఆ పాట! విని.. పాడి, లోకాన్నే మరిచిపోతుంటాడు. తండ్రిది కసాయి వృత్తి. కోళ్ళు పొట్టేళ్ళు మాంసం అమ్మడం. అతనికి ఇష్టమేలేదు. చస్తూ అవి చేసే ఆర్తనాదాలు ఆసాద్ ను కదిలించివేసేవి.చంపొద్దు అని బ్రతిమలాడుకునే వాడు తరువాత తిరుక్కునే వాడు. కొట్టించుకునేవాడు.

ప్రతి రోజు భోజనం దగ్గర గొడవ మాంసం తిననని! వింతగా తోచేది. అది మన ఆహారం అదే ముస్లిమ్స్ తినాలి అని ఎంత బ్రతిమలాడి చెప్పినా ససేమిరా అని తండ్రి దగ్గర దెబ్బలు తినేవాడు.

అవి జంతువులురా ! ఎందుకూ పనికి రావు ! ఎక్కువయి పోతే ఆద్మీ. దునియా ఖతం హోగా అంటే, మనుషులు కూడా ఎక్కువయిపోతున్నారుకదా, పనికిరాని తిరుగుబోతులు, కొవ్వు పట్టి కండ కావరాలు పెంచుకుని, మంచివాళ్ళను నానా హింసలు పెడుతున్నారు. వాళ్ళను చంపి ఎందుకు తినకూడదు అదీ మాంసమే కదా అని తిరుక్కునేవాడు.నివ్వెరపోతూ దేవాలయ సామూరొహ్ ..ప్రసంగాలకు వెళ్లి నేర్చుకున్నాడా అని ఆశ్చర్యపోతూ, వాళ్ళు మనల్ని నరుకుతారు అంటే తిరగబడవని ఎదురు మాట్లాడవని ప్రాణభీతితో గోడున ఏడుస్తున్నా చంపడమేనా?? మరి నన్ను ఎందుకు వదిలేస్తున్నావు? అని అడ్డు తిరిగేవాడు.

స్కూలో చేర్పించాల్సిన వయసు వచ్చింది. వాళ్ళ స్కూల్లో చేర్పించాడు. కొన్ని రోజులు వెళ్లి మొగించేసాడు .ఎంత చెప్పినా, ' అక్కడ ఒక్క భాషే నేర్పిస్తారు నేను చేరను. అన్నీ భాషలు నేర్చుకుంటేనే ఈ రోజుల్లో మంచిగా బ్రతుకు ఉంటుంది." వాళ్ళ అమ్మ దగ్గర ససేమిరా పోను అని మొండికేసాడు.

'నువ్వు చదివి ఉద్యోగాలు వెలగ పెట్టనవసరం లేదు.ఖురాన్ చదివి, నవాజ్ చేస్తూ ఈ వ్యాపారం చేసుకుంటే చాలు."కసురుకున్నాడు హబిబుల్లా

'ఈ వ్యాపారం చచ్చినా చెయ్యను. నిన్నుకూడా చేయనివ్వను. దిక్కులేని అమాయక మూగజీవుల ప్రాణాలు మనకంటే ఎంతో విలువైనవి. వాటి ప్రేమలు, బిడ్డలకోసం పడే తపన, బిడ్డల్ని అమ్ముకున్న నీలాంటి ఘాతకులకు ఏం తెలుస్తుంది"

'క్యా బోల్తా హిరే తూ! నాకే ఎదురు చెపుతావ్ !" అని జుట్టుపట్టుకుని చితక కొట్టాడు...కొట్టాడు! మాట వినక పోతే మీ అమ్మను చంపుతాను అని బెదిరించాడు.

'చంపు. చంపడం నీకో లెక్కకాదు ! చేయి పడిందంటే చూడు నిన్ను చంపి కుక్కలకు వేస్తా!" అంటూ తండ్రి పైకి దూకి గొంతు పట్టుకున్నాడు ఆసాద్

అప్పుడు అర్థం అయ్యింది కొడుకు పెద్దవాడు అవుతున్నాడని. హబీబుల్లాకు. అయినా తగ్గలేదు.

ఇద్దరినీ విడతీసి సర్దడానికి బ్రహ్మ ప్రళయమై తోపులాటలో విరుచుకు పడిపోయింది ఫాతిమా!

అది చూసి కొడుతున్న దెబ్బలు లెక్కచెయ్యకుండా తల్లి దగ్గరకు వచ్చి, 'ఒమీ ! ఒమీ ... అమ్మా! అమ్మా!" అంటూ ఎంత కదిలించినా కదల్లేదు. బోరున ఏడుస్తూ," మర్గయా ! మేరీ మా మర్గయా! అమ్మీ మర్గయా! మార్దాన్గా ! " అంటూ తండ్రిని ఒక తన్ను తన్నాడు ఆసాద్.

ఇంతలో ఆ గొడవకు చుట్టుపక్కల వాళ్ళు వచ్చి రిక్షాలో పెట్టి హాస్పిటల్ కు తీసుకెళ్ళమని తొందర చేసారు. వెనక ఆసాద్ పరుగెత్తాడు.

వారం రోజులకు ఫాతిమా మామూలు అయ్యింది. కానీ ఏడుస్తూనే ఉంది. దిగులుతో లేవలేక పోయింది. ఆసాద్ తల్లిని వదిలేవాడుకాదు. కానీ తండ్రి వస్తే నిప్పులుగక్కుతూ వెళ్ళిపోయేవాడు.

ఆసాద్ లేనప్పుడు హబీబ్, వాడిని ఆ పాట పాడకుండా చేయమని, అల్లాను కాదంటే వాడు కొడుకేకాడు చంపి తీరుతానని చెప్పి ఫాతిమాను భయపెట్టేవాడు.

కొడుకుకి ఎలా చెప్పాలో అని దిగులుతో కన్నీళ్లు పెట్టుకుని అల్లాను ప్రార్థిస్తూ దిగులు పడుతూ ఉండి పోయేది !

ఆసాద్ దిగులుతో తల్లి ప్రక్కనే కూర్చున్నాడు. ఎప్పటికో ఫాతిమా కదిలింది. తలెత్తి చూసాడు. ఇంకా కన్నీళ్లు కారుతూనే ఉన్నాయి.

తుడుస్తూ, ' ఐసా నయీ రోనా మా! నువ్వు సంతోషంగా ఉంటే నాకు ఆనందం. లేకుంటే లోకమంతా అందా హాయ్! బోలో ! మై క్యాకర్నా! నిన్ను బాధ పెట్టిన వాళ్ళు ఎవరైనా చంపుతా!' ఉద్వేగంతో ఊగిపోతూ అన్నాడు.

అప్పటికి కన్నీరు కారుస్తున్న తల్లి తో, " నన్ను నమ్ము అమ్మీ! నీ కాళ్ళు పట్టుకుని ప్రమాణం చేస్తున్నా! మాట తప్పను.మై ఫాతిమాకు బేటా హుమ్ !!" చేతుల్ని తీసుకుని ముద్దులు పెడుతూ అన్నాడు .

'అడగంగా అడగంగా' బేటా ! తండ్రిని తిరుక్కుంటే మాట వినక పోతే అల్లా క్షమించడు.' అంది.

'భార్యను హింసపెడితే అల్లా క్షమిస్తాడా! ఖురాన్లో అల్లా చెప్పేవున్నారమ్మా . గృహహింస క్షమించరానిదని.మరి తను చేస్తున్నదేవిటి ?"

కొడుకుని ఆశ్చర్యంగా చూస్తూ 'ఖురాన్ అంత బాగా అర్థం చేసుకుంటున్నావా ! నా బంగారు ! మేరీ ప్యారీ రాజా! నిన్ను అల్లా ఆశీర్వదిస్తాడు.మీ బాబాతో చెపుతా, సంతోషంతో పొంగిపోతాడు. మన కష్టాలు తీరిపోతాయి' అంటూ పొంగిపోయింది.

'తీరవు ! అతను ఆ మూగజీవుల్ని చంపడం ఆపకపోతే !" చాలా దృడంగా అన్నాడు.

'బేటా! నీకు అల్లా శక్తి తెలియదు. ఆ మహా గ్రంథంలో సురా ఆయత్ అల్ కురసి ఒక్కసారి మనసుపెట్టి చదువు.ఆ మహానుభావుడి గొప్పతనం శక్తి అర్థం అవుతుంది. అంత గొప్ప దేవుడు మరొకరు ఉండరు... లేరు !! ' ఆ పాట పాడ కూడదని పలురకాలుగా ఖురాన్ అంతా చెప్పి బ్రతిమలాడింది .

చాలా సేపు మౌనంగా ఉండి, " అర్థంగాని దేవిటంటే నేను తప్పు పాడటం లేదు. ఈశ్వర్.. అల్లా తేరోనాం అంటే అర్థం ఏవిటి? దేవుడొక్కడే, ఏ పేరుతోనైనా పిలవొచ్చని కదా ! "

'అయిసా నయీ బోల్నా బేటా! అది హిందువుల దేవుడు పేరు. మన నోటిగుండా వస్తే అల్లా నాలుకకోస్తాడు. శపిస్తాడు. కోపం తెప్పిస్తే నన్ను చంపేస్తాడు"

'ఆ పాట పాడితే అల్లానే చూస్తునట్లు ఉంటుందమ్మా! బ్రతకడానికి ఎన్నోవ్యాపారాలు ఉన్నాయి. చంపడం.. నెత్తురు, నేను చూడలేను. వాటి తపన, ఆర్తనాదాలు నేను వినలేను.అల్లా ఏ ఆత్మను చంపొద్దున్నారు"

'అది మన బ్రతుకు తెరువు ! మీ పాపాకు తెలిసింది అదే ! పొట్టకూటికోసం చెయ్యాలి.తప్పదు!'

'అంటే ! పొట్టకూటికోసం మూగ జీవుల్ని చంపొచ్చా? "

'అది ఆహారం! అల్లా అనుమతితో హలాల్ చేసి కానుకగా సమర్పించి మన తింటున్నాము. 'లాఇలాహ ఇల్లాల్లాహై... దేవుడు వేరే లేడు ఉండేది అల్లా ఒక్కడే ! ఆయనే వాటిని చంపించి అందరి ఆకలి తీరుస్తాడు. ఆకలినుంచి రక్షిస్తూ ఉంటాడు."

ఈశ్వర్ కూడా అనబోయి ఆలోచిస్తూ ఉండిపోయాడు.

'వాటిని అల్లా నేరుగా స్వర్గానికి తీసుకెళ్ళి సంతోషంగా ఉంచుతాడు. ఖురాన్ ఏడవ సూరాలో డెబ్బైమూడో పంక్తిలో ఉంది. వాటికి మనలా మనసుండదు అని చెప్పి ఉన్నాడు. '

'నేను వొప్పుకోను. వాటికి మనలాగే మనసు ఉంటుంది .ప్రేమ, సంతోషం, దుఖం అన్నీ ఉంటాయి. ఇప్పుడు చూడు నేను కనిపించక పోతే ఎంత తపన పడిపోతాయో !. నేను రాగానే ఎగిరి గంతులేస్థాయి . పాపా ను చూస్తే కొళ్ళు కూడా భయపడి అరుస్తూ పారిపోవడానికి ప్రయత్నిస్తాయి. వాటికి మనసులేదంటా వేవిటి... ఉంది !!. అల్లానే ఉంటే మూగ జీవుల్ని కాపాడాలి పాపా మనసు మార్చాలి. " అని మొండిగా వాదనకు దిగాడు. ఎంతెంతో బ్రతిమలాడింది .

చివరకు, వినిపించేటట్లు పాడను అని వొప్పుకున్నాడు. పోనీ ఖురాన్ చదువుతున్నాడు అర్థం చేసుకుంటున్నాడు అని మనసు నెమ్మది చేసుకుంది ఫాతిమా. బిడ్డను కాపాడమని అల్లాను ప్రార్థిస్తూ ఉండిపోయింది.
ఇంటికి వచ్చేసిన తరువాత ఆ పాటను మనసులోనే పాడుకోసాగాడు.

ఆరు నెలల క్రితం అనుకోకుండా పొట్టేళ్ళతో కలిసి ఆడ నల్ల గొర్రెను తోలుకోచ్చారు. ! నల్ల గొర్రె వచ్చీ రాగానే ఆసాద్ దగ్గరకు వచ్చి ప్రేమగా చేతులు మూతి నాక సాగింది. రోజునుంచి ప్రాణం పెట్టుకున్నాడు . దానికి నూర్జహాన్ అని పేరు పెట్టాడు. 'అది సూడులో ఉంది,.మా బనేగా వో బాగా మేపు !' ప్రేమతో చెప్పడంతో ఆశ్చర్యంగా తండ్రి వైపు అనుమానంగా చూసాడు. హబిబుల్లా నవ్వి వెళ్ళిపోయాడు. ఆ మాటతో ఇంకా ప్రేమ ఎక్కువయి పోయి మంచి ఆహారం ఇస్తూ, ఏ మాత్రం కష్టం కలగకుండా చూడసాగాడు. అదే పిచ్చి అయిపోయింది. కోళ్ళు పొట్టేళ్ళు వస్తున్నాయి అయిపోతున్నాయి. బాధగా ఉన్నా దీన్ని వదిలేసినందుకు గమ్మనుండి పోయాడు.

ఒకరోజు తండ్రి ఎవ్వరితోనే పెద్దగా నవ్వుతూ సంతోషంగా మాట్లాడటం వినిపించింది.

'సలామా లేకుం మహ్మద్ బాయీ ! బిస్మిల్లా మాదభేడ్ హాయ్ అమార్ పాస్! మంచి గొర్రె కడుపుతో ఉంది. రేపో మాపో బచ్చాను పెడుతుంది. . బహుత్ కూబ్ సేవకీ. జహాపనాకో దేదూన్గా ! నాకు ఇండ్లు .... చెప్పాలా ! కొనుక్కొవాల !"

'బహుత్ షుక్రియా! దేశమంతా తిరిగి వచ్చాను. దొరకలేదు. జహాపనా బహుత్...బహుత్ కుషీ హోగా! తొమ్మిదినెల బిడ్డ కూరవండి తింటే అల్లానే చూసినట్లు ఉంటుంది. స్వర్గం ఇధర్ ఆవొంగా ! 'ఎగిరి గంతులేస్తూ జహాపనా నీకు ఏమ్కావాలన్నా ఇస్తాడు అని పదిసార్లు చెప్పాడు.

'శుభాకో చార్బజేకు ఆనా ! మీముందే కోసి ఇస్తాను" వొంగి వొంగి దండాలు పెట్టి పంపించాడు

రే! బేటా ! ఆసాద్ ! రాత్రికి కోళ్ళ లోడువస్తుంది మేల్కొని దించుకో !మన జాతకం మారిపోతుంది ." అని తలుపులన్నీ గట్టిగా వేసి ఒకసారి నూర్జహాన్ను తృప్తిగా చూసి వెళ్లి పడుకున్నాడు హబిబుల్లా.

ఆసాద్ కు పైప్రాణాలు పైనే పొయ్యాయి. రాక్షసులారా ! కడుపులో బిడ్డ వున్న తల్లిరా! సైతాన్కి బేటా! తార్కొల్కి పోతారు అని బండ బూతులు తిడుతూ గుండెలు పగిలేటట్టు ఏడుస్తూ కూర్చున్నాడు. ఎం చెయ్యాలో అర్థగాలేదు. సగం రాత్రివరకు కన్నీళ్లు పెట్టుకుంటూ నూర్జహాన్ను చూస్తూ ఉండి పోయాడు. ఎం చెయ్యాలి...ఎం చెయ్యాలి ? ఏదో ఒకటి చేసి నూర్జహన్ను, కడుపులో ఉన్న బిడ్డను రక్షించుకోవాలి. ఇతను ఖచ్చితంగా చంపేస్తాడు.ఎలా.. ఏలా??

సగం రాత్రి అయ్యింది. కోళ్ళ లారీ వచ్చినట్లు శబ్దం అయ్యింది. నూర్జహాన్ దగ్గరకు

వచ్చాడు. ముదిగారం చేస్తూ అతని చుట్టూ తిరగసాగింది. తొడలకు రక్త అయినట్లు కనిపించింది . చూస్తే అది మరో దగ్గర నుంచి వస్తుంది. జవిరి ఎత్తుకుని వెనుక సందు లోంచి దూకేసాడు. కోళ్ళు బోనుల్లో పిచ్చిగా అరుస్తున్నాయి. వెళుతూ వెళ్ళుతూ వాటిని వదిలేసాడు.

ఎవరో తలుపులు దబా దబా బాదుతుంటే హబీబుల్లా హడాట్టుగా లేచి తలుపు తీసాడు. కోళ్ళు అన్నీ వీధుల్లో తిరుగుతున్నాయని. ఎవ్వరంటే వాళ్ళు పట్టుకు పోతున్నారని చెప్పారు.

ఆసాద్ అని గట్టిగా అరిచాడు. జవాబులేదు. అరుపుకు ఫాతిమా లేచి ఆసాద్ కోసం చూసింది. లేదు. హబిబుల్లా వీధి లోకి పరుగెత్తి కోళ్ళను పట్టుకుంటూ హటాత్తుగా ఏదో గుర్తుకొచ్చి ఇంట్లోకి పరుగెత్తాడు. అక్కడ గౌరె లేదు. భూమి బద్దలయ్యేటట్లు అరుస్తూ కత్తి తీసుకుని, కొడుకును అనకూడని బూతులు తిడుతూ నిప్పులుగక్కుతూ వీధిలోకి పరుగెత్తాడు.

ఫాతిమా గుండెలు అరి చేతిలో పట్టుకుని అతని వెంట పరుగెత్తింది.

దూరంగా ఏదో పెద్ద శబ్దం వచ్చింది వాళ్ళ ముందునుంచే కారు స్పీడుగా వెళ్లిపోయింది. అటు పరుగెత్తాడు. దేవస్థానం పూజారులు రోడ్డుమీద చుట్టూ గుమికూడి ఉన్నారు. వాళ్ళందరినీ తోసుకుని చూసారు హబీబ్ ఫాతిమా !! రక్త మడుగులో ఆసాద్, అతన్ని నాకుతూ బిడ్డతో నూర్జహాన్ గౌరె!?

వణికిపోయాడు. ఆకాశం వైపు చూసాడు. దేవస్థానం కనిపించింది. అల్లా తేరే నాం.. ఈశ్వర్ తేరే నామ్ .. భజన చేస్తున్నారు. అప్రయత్నంగా ఈశ్వర్ ! అల్లా!! ఈశ్వర్ !! అంటూ చేతులు జోడించి దండపెట్టి ఏడుస్తూ కుప్ప కూలిపోయాడు. ఫాతిమా కొడుకుని చూసి విరుచుకు పడిపోయింది.

పూజారులందరూ వాళ్ళని జవురుకొని హాస్పిటల్ వైపు పరుగెత్తారు.

***

**కనుపూరు శ్రీనివాసులు రెడ్డి**

ప్రచురించినవి రెండు నవలలు, రెండు వచన భావ కవితలు. నీ కోసం, నవ్వావా ఒకసారి, గీతాంజలి. తర్జుమా నవలలు మరోహృదయం మరో ఉదయం, చీకటిలో మలి వెలుగు. కథలు 30, 40 ఉండొచ్చు. అన్నీ బహుమతుల గెలుచుకున్నవే. మంచిగా, పది కాలాలపాటు నిలిచిపోయే విధంగా రాయాలని రచయిత అనుకుంటున్నారు.



# మార్పు

## హంసగీతి

ఉదయం ఏడు గంటలైంది .

'ఏమేవ్ ! .. ఇంకో రెండు పెసరెట్లు వేయి.. అంటూ.. అరిచాడు బంగారయ్య .

అప్పటికే మూడు పెసరట్లను అల్లం చెట్నీ, పుట్నాలచెట్నీ నంచుకుంటూ .. అబ్బబ్బ .. ఆహా .. ఎంత రుచిగా ఉన్నాయంటూ లొట్టలేసుకుంటూ తిన్నాడు .

'ఆ వచ్చే .. వచ్చే అంటూ ఆయన భార్య తాయారమ్మ మరో పేట్లో ఇంకో రెండు పెసరట్లు తెచ్చి ముష్టి వాడికి వేసినట్లు ఎత్తి వేస్తూ .

మడిలో ఉన్నా... ఇహ నే వేయలేను . ఇప్పటికే ఐదు తిన్నారు . ఈ రోజు ఉగాది కదా . కాస్త వేప్పువ్వు తెచ్చి పెట్టండి. ఇంకా కాస్త కొత్తిమీర అల్లం కూడా.. అవతల అన్నయ్య గారు, వదిన గారిని భోజనానికి పిలిచారు కదా .. ఉగాది పచ్చడి చేయాలి వంట పూర్తి చేయాలి .. అని.ఖంగారు గా అంది ..

"ఆ.. అవుతుంది లేవే . నీకు ఊరికే ఖంగారెక్కువ.. అన్నట్టు ఇంకాస్త అల్లం చెట్నీ వేద్దూ ..ఆ చేత్తోనో ఇంకొక మారు కాఫీ ఇచ్చావంటే .. తాగేసి .వెళ్ళి. నువ్వు చెప్పినవి తెస్తానే ..పెసరట్లని మళ్ళీ ఓ పట్టు పడుతూ అన్నాడు బంగారయ్య..

ఉసూరుమని నిట్టూర్చి .. వంట్టింట్లోకి వెళ్ళి.. చెట్నీ గిన్నె తీసుకుని వచ్చి చెంచా తో అడుగున ఉన్న చెట్నీని గీకి వేసి గిన్నెక్కడ పెడుతూ .. రెండు రోజుల క్రితం చేశా . వారం పదిరోజులన్నా ఉంటుందని ..హూ . మొత్తం మీరే తినేశారు . మళ్ళీ వళ్ళు నొప్పులో కడుపు ఉబ్బరమో అని నన్ను కూర్చోనివ్వరు నుంచోనివ్వరు . .. రుసరుసలాడుతూ అంది.

ఆ.. ఏం కాదు లేవే అంటూ ఆబాగా.. గిన్నెను తీసి .. పెసరట్టుని గిన్నెలో చెట్నీఅంతా వచ్చేట్టు గా తడుచుకొని తిని ...చెంబుడుమంచినీళ్ళు తాగి...బ్రేవ్ మని త్రేన్చుతూ.. కాఫీ.. అన్నాడు.

తాయారమ్మ ఇచ్చిన నురగలు కక్కే ఫిల్టర్ కాఫిని ఆస్వాదించుకుంటూ తాగుతున్నాడు .

తాయారమ్మ బంగారయ్యలది అన్యోన్యమైన జంట . పెళ్ళిచూపులనాడే అత్తగారు ..మా అబ్బాయి కాస్త భోజన ప్రియుడమ్మా . నువ్వే ఉద్యోగం వెలగబెట్టక్కర్లేదు చక్కగా వాడిక్కావలసింది వండిపెడితే చాలంటే .. ఇంట్లో చేసే వంటే గా అదెంత భాగ్యం పైగా తను రుచిగా వంట చేస్తుందాయే అనుకుని మురిసిపోయింది పాపం . తరువాత

తరువాత తన జీవితం వంటింటికే పరిమితం చేస్తాడని అసలూహించలేదామె. వేవిళ్ళ తో ఉన్న వాడిలా ....ఈ రోజు రవ్వలడ్లు చేయి, ఆవ పెట్టి పులిహోర చేయి, దోసావకాయ వేయి, మెంతి కాయ వేయి, అరిసెలు చేయి, బూరెలు చేయి, గారెలు చేయి... ఇలా నలభై యేళ్ళ వైవాహిక జీవితంలో ఆయన కోరిన వన్నీ వండి పెట్టడమే సరిపోయింది ..!

పెళ్ళైన కొత్తల్లో మూన్నెళ్ళు అత్తగారింట్లో ఉన్నప్పుడు ఆమె వంట చేయకపోయినా అత్తగారికి సహాయం చేసింది . తరువాత బంగారయ్య ఉద్యోగం రీత్యా గుంటూరు లో కాపురం బెట్టడం, ఒక ఆడపిల్ల పుట్టడం ఆ పిల్లకు పెళ్ళి చేయడం రెండు పురుళ్ళు పోయడం, కూతురు అల్లుడు మనవళ్ళు అమెరికా వెళ్ళడం ఈలోగా అత్తా మామ కాలం చేయడం, బంగారయ్య రిటైర్ అవ్వడం అన్నీ జరిగి పోయాయి.

ఎటొచ్చి బంగారయ్యకున్న జిహ్వాచాపల్యం రిటైరయ్యాక మరింత పెరగడంతో ..ఆయనడిగిన రుచులు పాకాలు చేసి చేసి చేతులు నొప్పి పెడుతున్నాయి తాయారమ్మకు . అంతే కాకుండా . ఈ మధ్య ఆమె కలలో కూడా.. గారెలు వండుతున్నట్టు.. ఒక గారె ఎగిరి నూనెతో సహా మోహం మీద పడ్డట్టు.. రవ్వలడ్డు చేస్తుంటే.. చేతిలోంచి జారి గునాగునా నడచివెళ్ళిపోతున్నట్టు, పూర్ణబూరెలు చేస్తుంటే పుసుక్కున నవ్వి నూనెలో చిమిడి నట్లు, నూనెలో కాగుతూ తాళలేక అరిసెలు, అమ్మా అమ్మా అని తనను పిలుస్తున్నట్లు .. బొబ్బట్లు సిగ్గు పడుతున్నట్లు చేగోడీలు చెయ్యపట్టి లాగినట్లు కుడుములు కుదిపినట్లు, బూరెలు బుగ్గ గిల్లనట్లు.. ఇలా వింత వింత కలలు వస్తున్నాయి.. హేవిటో..!

కాఫీ ఉఫూ ఉఫూ అనుకుంటూ తాగి సంచీ తీసుకుని బయలు దేరాడు బంగారయ్య... అన్నట్టు మధ్యాహ్నం భోజనం లోకి ఏం చేస్తున్నావ్ .. అంటూ అడిగాడు . తాయారమ్మ కు భలే కోపం వచ్చింది.. అయినా తమాయించుకొని.. రాత్రి తమరు చెప్పారుగా ఆవపెట్టిన పులిహోర ..బొబ్బట్లు.. గారెలు.. గుత్తి వంకాయ.. మామిడికాయ పప్పు.. అప్పడాలు దప్పళం, మెంతికాయ.. పెరుగు.. ఏడుస్తున్నట్టుగా చెప్పింది.

ఆమె చెప్తుంటే ఆనందంగా వింటూ.. అప్పడాలతో పాటు కాసిని వడియాలు కూడా వేయించు అని వెళ్ళిపోయాడు బంగారయ్య..ఓరి..మీ తిండి యావ తగలెయ్య అని తిట్టుకుంటూ అవి చేయడానికి వంటింట్లోకి వెళ్లి పోయింది తాయారమ్మ.

బంగారయ్య ఉద్యోగం చేసేటప్పుడు సెలవ రోజుల్లో తనకేమీ పని లేకపోయినా ఎప్పుడూ వంటలో ఆమెకి ఏ విధమైన సాయం చేయలేదు..మిగిలిన పనులేవీ చేయలేదు. ఆ వంటలకు కావాల్సిన సరుకులు, కూరగాయలు మాత్రం తెచ్చిస్తాడు.

గంట తర్వాత కొత్తిమీర అల్లం వేప పూత తెచ్చి ఇచ్చాడు. బంగారయ్య. కొంచెం వేప పువ్వు విడిగా తీసి ఇవ్వరు అని అడిగింది తాయారమ్మ.ఊహూ. బజార్ కి వెళ్లి వచ్చాను నాకు ఓపిక లేదు. నువ్వే తీసుకో. నాకు దాహంగా ఉంది. కాసిని మజ్జిగ ఇయ్యి అన్నాడు సోఫాలో కూలబడుతూ. వీసమెత్తు పనిచేయని ఈయన కెందుకు చెప్పాను. హూ అనుకుంటూ గబగబా మజ్జిగ చేసి ఆయనకిచ్చింది.

ఉగాది పచ్చడి చేసి పూజ కానిచ్చుకొని నైవేద్యంగా పెట్టి మిగిలిన వంటకాలు అన్ని చెమటలు కక్కుతూ చేసింది.ఇక ఒక్క గారెలు చేయాలి... నాన పోసిన మినపప్పుని రోట్లో వేసి ఆప సోపాలు పడుతూ రుబ్బడం మొదలుపెట్టింది. గ్రైండర్లో గాని మిక్సీలో గాని వేస్తే గారెలు బాగా రావని రోట్లోనే రుబ్బమంటాడీ భోజన ప్రియుడు. పచ్చళ్ళు కూడా అంతే అన్ని రోటి పచ్చళ్ళు చేయాల్సిందే మిక్సీలో వేస్తే ఒప్పుకోడు. .. అని తిట్టుకుంది మనసులో..

గబగబా మినపప్పును తోస్తూ రుబ్బుతుండగ పొరపాటున వేలు పత్రం కింద పడి బాగా నలిగింది. ఒక్కసారి కెవ్వు న కేక పెట్టింది. ఏమిటే గావు కేక పెట్టావు.. ఏమైంది అంటూ పరుగున వచ్చాడు బంగారయ్య. వేలు నలిగిందని తెలుసుకొని జాగ్రత్తగా ఉండొద్దూ అని ఒక మాట అనేసి వెళ్ళిపోయాడు.

హూ ఏమాత్రం కనికరం లేని వాడు. బకాసురుడు . అల్లం గారెలట అల్లం గారెలు.. రాళ్ళ గారెలు వండి పెట్టాలి... అలా బాధపడుతూనే నలిగిన వేలుతోనే పప్పంతా రుబ్బి గారెలు వేసింది. వంటంతా పూర్తి చేసింది.

ఆమె వంట పూర్తి చేసిన ఒక పావు గంటకి బంగారయ్య స్నేహితుడు గోపాలం అతడు భార్య విమలమ్మ భోజనానికి వచ్చారు.షడ్రసోపేతమైన విందు భోజనాలు చేశాక బంగారయ్య అతని స్నేహితుడు తాంబూలం సేవించి పక్క వీధిలో ఉన్న మరో స్నేహితుణ్ణి కలవడానికి వెళ్ళారు. వంటిల్లు సర్దుతూ తాయారమ్మ విమలమ్మ మాట్లాడుకుంటున్నారు.

రోట్లో చితికిన వేలు సలపడంతో.. అబ్బా.. అంది..” ఏమైంది వదినా ?. చాలా నీరసంగా కనిపిస్తున్నావు. ఒక్కదానినే ఎన్ని పిండివంటలు చేశావు . అసలు . అన్నెందుకు.. ఈ వయసులో అన్ని తిని హరాయించుకోగలమా... అంటూ విమలమ్మ ఆప్యాయంగా అడిగేసరికి.. ఎప్పుడూ లేనిది తాయారమ్మ బాధపడుతూ బంగారయ్య తిండి యావ గురించి, అతడు వీసమెత్తు సహాయం చేయడని తాను వయసు మీద పడుతుండటంతో అన్ని వంటకాలు చేయలేక పోతున్నానని వాపోయింది..!

అంతా విన్న విమలమ్మ.. ఓస్ ఇంతేనా.. నువ్వేమీ బాధపడకు వదినా ..తొందరలోనే మీ బాధ తీరుతుంది. అన్నట్టు వచ్చే ఆదివారం మా పెళ్లి రోజు. మీ దంపతులు మా యింటికి భోజనానికి రావాలి అని చెప్పింది.

విమలమ్మ దంపతులు వెళ్ళిపోయారు. ఆ మర్నాడు ఒళ్ళంతా నొప్పులతో తాయారమ్మకు బాగా జ్వరం వచ్చింది. మూసిన కన్ను తెరవకుండా పడుంది.బంగారయ్య ఆమెను డాక్టర్ దగ్గరకు తీసుకొని వెళ్ళి మందులు ఇప్పించాడు . డాక్టర్ ఆమెకు బాగా రెస్ట్ ఇవ్వమన్నాడు.

బంగారయ్య ఆమెకు మందులు వేసిన గంట తర్వాత జ్వరం చూస్తే నార్మల్ ఉంది కాని నీరసంతో లేవ లేకపోయింది.

అయినా బంగారయ్య..జ్వరం తగ్గింది గా ..లేవే.. లేచి వంట చేయి అనేసరికి ఓపిక లేకపోయినా మూల్గుతూ వంట చేసింది.

తరువాత మూడు రోజులకు కానీ మామూలు మనిషి కాలేకపోయింది.

ఆమెకు టైముకు మందులిచ్చాడు కానీ ఇంటి పని వంట పని లో ఏ మాత్రం సహాయం చేయలేదు బంగారయ్య.

ఆదివారం వచ్చింది. బంగారయ్య దంపతులు విమలమ్మ ఇంటికి వెళ్ళారు.అప్పుడు

గోపాలం రోట్లో పప్పు రుబ్బుతున్నాడు..

అదేంటి.. గోపాలం నువ్వు పప్పు రుబ్బుతున్నావ్ .?? అని ఆశ్చర్యం గా అడిగాడు బంగారయ్య..

మా విమలకు కొంచెం నలతగా ఉంది.. అందుకే కాస్త సాయం చేస్తున్నాను.. అన్నాడు. విమల గదిలో మంచం మీద పడుకొని ఉంది.

గోపాలం ఒక పక్క గారెలు వేస్తూ మరో పక్క కూర కలియబెడుతూ, మిక్సీలో పచ్చడి రుబ్బాడు. మధ్య మధ్యలో ఉప్పెంత వేయాలో, కారం ఎంత వేయాలో విమలమ్మను అడుగుతున్నాడు.. ఈ మధ్యలో కాఫీ చేసి తాయారమ్మ కు బంగారయ్య కు, విమలమ్మకు ఇచ్చాడు.

తాయారమ్మ తాను సాయం చేస్తానంటే..

వద్దు చెల్లెమ్మా.. మీరిద్దరూ మాట్లాడుతూ కూర్చోండి .. నేను చేస్తాలే.. నాకు బంగారయ్య సహాయం చేస్తాడని.. బీరకాయ బజ్జీలు వేయటానికి బీరకాయలు తరగమన్నాడు బంగారయ్య ను..

ఎప్పుడూ వంట పని చేయని బంగారయ్య .. ఇబ్బంది గా చూసి తనకు తిరగడం రాదన్నాడు.. భలే వాడివే .. నాకు మాత్రం వచ్చా ..నే చేయటంలా .. తరగితే మొదట ఓ ముక్క పెద్దది ఇంకో ముక్క చిన్నది వచ్చినా పర్వాలేదు తరిగిన కొద్దీ చక్కగా వస్తాయి.. తరుగు .. నేను పాయసం చేస్తా.. ఈ రెండూ చేస్తే వంటై పోతుందన్నాడు ..

ఇక తరగక తప్పింది కాదు బంగారయ్య కు. మొదట కోపంతో, విసుగు తో వంకరటింకరగా తరిగినా తరువాత ఏదో ఆసక్తి వచ్చి చక్కగా ఒకటే సైజులో తరిగాడు. తరువాత గోపాలం చెబుతుంటే బజ్జీల పిండి కలిపి ఆ పిండిలో ఒకో ముక్కా ముంచి బజ్జీలను వేశాడు . మొదటి వాయ సరిగా వేయలేకపోయినా తరువాత బీరకాయ బజ్జీలను చక్కగా వేశాడు..!

తరువాత అప్పడాలను వడియాలను చక్కగా నూనెలో వేయించాడు.తాను చేసిన బజ్జీలను వేయించిన అప్పడాలను చూసుకొని మురిసిపోయాడు. బజ్జీలు చాలా బాగున్నాయని వాళ్ళు మెచ్చుకుంటూ తింటుంటే ఒక విధమైన ఆనందం తృప్తి కలిగాయాతనికి.

అందరూ భోంచేశారు. తరువాత తాయారమ్మ ను విమలమ్మను హాల్లో కూర్చుని మాట్లాడుకొమ్మని గోపాలం వంటిల్లు సర్దడం మొదలు పెట్టాడు.ఈ సారి గోపాలం అడగకుండానే వంటిల్లు సర్దడంలో సహాయం చేశాడు బంగారయ్య.

అప్పుడు అతనితో ఇలా అన్నాడు.. గోపాలం. 'నేను ఇంట్లో పనులు వంట చేయడం నీకు ఆశ్చర్యం గా ఉందా..నేను రోజూ వంట చేయను. కానీ విమలకు నా చేతనైన సహాయం చేస్తాను. తనకసలు బాగుండకపోతే.. వంట కూడా చేస్తాను.

వయసు మీద పడిన కొద్దీ ఆడవారికి ఓపిక ఉండదు. కాన్పులు వలన ఆడవారు బలహీనమై పోతారు. అంతే కాక తమకు సుస్తి ఉన్నా బాధ భరిస్తూ మూడు పూటలా వండటమే కాకుండా ఇల్లు సర్దడం లాంటి ఎన్నో పనులు చేస్తారు.. రోజూ వాళ్ళే పనులు చేసుకుంటారు... కానీ ఒంట్లో సుస్తి ఉన్న మనిషికి కేవలం మందులు వేస్తే సరిపోదు.రెండు రోజులు రెస్ట్ ఇస్తే, ప్రేమగా పలకరిస్తే వాళ్ళకు ఉపశమనంగా ఉంటుంది..కదా!.. నువ్వే చెప్పు.

అవునని తలాడించాడు. బంగారయ్య..ఏదో ఆలోచిస్తూ. తరువాత ఇంటికి వచ్చేశారు. ఇన్నాళ్లూ తను తన భార్య చేత చాకిరీ చేయించాడు.. తన ఆరోగ్యం ఎలా ఉన్నా తనకిష్టమైన వన్నీ వండించుకు తిన్నాడు..కానీ ఏ విధమైన సహాయం చేయలేదు . ప్రేమగా పలకరించలేదు . పైపెచ్చు ఆమెకు ఒంట్లో బాగుండకపోతే విసుక్కునే వాడు... తాయారమ్మ ఏనాడూ పల్లెత్తు మాటనకుండా అలాగే మూలుగుతూ అన్నీ చేసి పెట్టింది.. అతని మనసులో ఆమెపై ఎనలేని ప్రేమ పొంగింది.

ఆ మర్నాడు నుంచి తాయారమ్మ ఆశ్చర్యపోయే విధంగా బంగారయ్య ఆమెకు ప్రతి రోజూ ఇంటి పనులలో వంటలో తన చేతనైన సాయం చేయడం మొదలు పెట్టాడు. అంతే కాదు భార్య కు సుస్తి చేసినప్పుడు ఆమెను కాలు కింద పెట్టనీకుండా తానే వంటి చేసి అన్నీ ఆమె చేతికి అందిస్తున్నాడు.ఇదివరకులా అవి చేయి ఇవి చేయి అని ఆమెను అడగటం లేదు. ఈ పూట ఏం చేయను అని భార్య అడిగినా .. నీకు వీలైంది చేయి . ఎక్కువ హైరానా పడకని అంటున్నాడు.. అతనిలో వచ్చిన మార్పుకి తాయారమ్మ ఎంతో సంతోషించింది.

ఒకరోజు తాయారమ్మ విమలమ్మకు ఫోను చేసింది. భర్త లో వచ్చిన మార్పు గురించి చెప్పింది. విమలమ్మ పకపకా నవ్వుతూ .. ఎందుకు మారరు . ఆయన మారాలనే మేమా రోజు అలా నాటకం ఆడాము.. .

మీ ఇంటి నుండి వచ్చాక నేను ఆయనకు నీ బాధంతా చెప్పాను.

బంగారయ్య తీరు ఈయనతో చెప్పేసరికి ..ఓహ్.. వాళ్ళు మనింటి కి వస్తారుగా ..నువ్వు వాళ్ళు వచ్చేసరికి వంట్లో బాలేదని పడుకో . అన్ని పనులు నేను చేస్తాను. బంగారయ్యకు తెలిసి వచ్చేట్టు చేస్తానన్నారు. తరువాత నీకు తెలిసిందే ..అంది విమలమ్మ.

అవునా.. అని ఆశ్చర్యపోయి తన భర్తలో వచ్చిన మార్పు కు విమలమ్మ దంపతులకు కృతజ్ఞతలు చెప్పుకుంది తాయారమ్మ.

భార్య మనసెరిగి భర్త, భర్త మనసెరిగి భార్య నడుచుకుంటూ కష్టసుఖాలను పంచుకుంటే ఆ కాపురం కలకాలం పచ్చగా ఉంటుంది..!!

***

కథ రచయిత్రి పేరు **గీత కురుగంటి.** హంసగీతి పేరుతో రచనలు చేస్తున్నారు. మదిలో మెదిలే భావాలను అక్షర కుసుమాలుగా ఆ వాగ్దేవి పాదపద్మాలకు సమర్పిస్తుంటారు. రచనలను అన్ని సాహిత్య ప్రక్రియలలో రాస్తుంటాను.. కవితలు, పద్యాలు, తెలుగు గజల్స్, ఏకవాక్య కవితలు భావగీతికలు, నానోలు,గేయ కవితలు హైకులు, కథలు రెక్కలు, నానీలు తెలుగు దోహాలు ఇలా వివిధ సాహిత్య ప్రక్రియలలో రాస్తారు. గజల్ గులాబీలు (గజల్సే), శివనామార్చన శతకము ( పద్యాలు), ప్రియగీతికలు (పద్యాలు), శ్రీయశస్వినీ శతకము (పద్యాలు), శతాధిక బంధచిత్రకవిత్వము, ఇంకా వందకు పైగా వీరి సంకలనాలు ఉన్నాయి. డా . సినారే పురస్కారం (గజల్), గజల్ ప్రవీణ పురస్కారం అత్యుత్తమ గజల్ అవార్డు అందుకున్నారు.

**9866955756**



# పస్తిని

కె.వి. మేఘనాథ్ రెడ్డి

*'యానాదులు యానాదులెందుబోయిరో..*
*చెట్టుగొగురు పుట్టకొగురు చెదిరిపూడ్సిరో..*
*గసికకర్ర యిరిగిందో.. బతుకు చక్రమాగిందో..*
*చిక్కమే.. చిందుబొందులైయ్యిందో..*

చెప్పెటోళ్లేవురు మా యానాదున్ని చేరదీసేటోళ్లేవురు?' అంటూ గొంతు పెంచి గట్టి గట్టిగా పాటపాడుతూ.. ఆ పాటకు తగ్గట్టు అడుగులేస్తున్నాడు కలుంకూరిగుట్ట పైకెక్కి అబ్బెన్న.

అబ్బెన్న పాట ఆ అడవిలోని దిక్కులు పెక్కటిల్లేలా ప్రతిధ్వనిస్తున్నది.

ఆ ధ్వని నలుదిక్కుల నుండి అబ్బెన్న భార్య ఒల్లెమ్మ చెవిన పడగానే ఆమె మురిసిపోతున్నది.

ఆ అడవికి కలుంకూరిగుట్ట తలమానికమైనది.

కలుంకూరిగుట్ట ఎత్తూ, చుట్టుకొలత చూడలంటే రోజంతా సరిపోతుంది.

కలుంకూరిగుట్టపై వానకు, ఎండకు ఎన్నో జీవరాశులు తలదాచుకుంటాయి.

నీటి దోనలు, గుహలు, చదరపు బండలు ఇలా ఎన్నో ఉన్నాయి గుట్టపై.

ఆవులు, మేకలకు కలుంకూరిగుట్ట ఆవాసం.

అడవి జంతువులకు విడిదిక్షేత్రం.

కాలానికనుగుణంగా ఇక్కడికొచ్చి చేరిపోతుంటాయి.

బలమైన జంతువుల దాడిలో బలహీనమైన జంతువులు ప్రాణాల్ని కోల్పోతుండటం పరిపాటి అయిపోయింది.

అంతెందుకు 'తలదాచుకుందాం' అని వచ్చిన మనుషుల్ని సైతం జంతువులు పొట్టన బెట్టుకున్న సందర్భాలు అనేకం.

కలుంకూరిగుట్ట ఎంత వినోదాన్ని సంరక్షణనూ కల్గిస్తుందో.. అంతే విషాదాల్ని మిగుల్చుతుంది.

ఇలా చెప్పుకుంటూ పోతే కలుంకూరిగుట్ట చిత్రాలు, విచిత్రాలు అన్నీ, ఇన్నికావు.

ఇక అప్పటివరకు నిప్పులు చిమ్ముతున్న సూర్యడిని మేఘాలు మింగేసినట్టుగా కనుమరుగైపోయాడు.

గాలి దిశమార్చుకొని తన ప్రతాపం చూపుతున్నది.

ఎండకు మూలుగుతున్న ఆ కలుంకూరిగుట్టపై చెట్లు ఊపిరొొచ్చినట్టుగా గాలి

నిర్దేశించిన వైపునకు వంగి వంగి లేస్తున్నాయి.

ఆ మార్పులన్నీ తీక్షణంగా పరిశీలించిన అబ్బెన్న పాటని, ఆటను ఆపేసి ఒల్లెమ్మవైపు చూస్తూ "వానొచ్చేటట్లుండాదే! ముందుగలగానే చెప్తే ఇనకపోయినవ్?

పైంగా ఒట్టి మనిసీ గాకపోతివి, కలుంకూరిగుట్టని చూసే తీరళ్లని ఉడుంపట్టు బడితివి, ఇబ్బుడు చూస్తుంటే వానొచ్చేటట్లుండాది. ఇబ్బుడు నేనేం చేద్దు? ఈ అడివి నింకా, ఈ కలుంకూరిగుట్ట నింకా నిన్నిబ్బుటికిబ్బుడు ఎక్కడికని తీసాకపోదును?" ఆవేదనగా చెప్పాడు.

"పెండ్లయినబ్బుటాల్నుంచి ఏపొద్దయిన నిన్ని ఇడ్సిపెట్టి ఉంటినా? ఇబ్బుడెట్ల ఉంటాననుకుంటివి? కష్టమొచ్చిన, నష్టమొచ్చిన, చివరికి ఈ అడివే కొట్టుకొనిపూడ్సినా నేను నీతో గూడానే" అని ఒల్లెమ్మ చెప్తుంటే. వాళ్లకు పక్కనే ఉన్న కుక్క అవునన్నట్టు 'కుయ్.. కుయ్..' అంది. సమయం గడిచేకొద్దీ ఆకాశంలో మేఘాలు నల్లగా మారిపోయి పెద్దపులిలా గర్జిస్తున్నాయి.

అబ్బెన్న మొహం కూడా దిగులు దుప్పటి కప్పుకుంది.

అబ్బెన్నను తదేకంగా చూసిన ఒల్లెమ్మ "యోవ్ మావ ఇదేందిది ఇంతపొద్దుకీ.. పాటలు పాడి ఆటలాడిన నువ్వేనా ఇబ్బుడు చిన్నబిడ్డ బయిం పడినట్టుగా బయిం పడుతున్నావు?.

అయినా ఇబ్బుడేమైనాదనేసి?.

'వాన'ని ఈ పొద్దే మొదిటిగా చూసినెట్టుగా దేనికి ఆ దిగులు? దేనికి ఆ మాదిరి బయపడిపోతుండావు?

అయినా కొండట్లా మనిసివి. నువ్వే చప్పగా అయిపోతే.. బెదురుగొడ్డులాంటి దాన్ని నేనేమైపోవల్ల?" అని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది.

ఒల్లెమ్మ చేతిస్పర్శకు అబ్బెన్న చెలించిపోయాడేమో! ఆకాశం నుండి వాన చినుకులు నేల రాలినట్టుగా కళ్లనుండి కన్నీళ్లు చెంపలనుండి జల్లున జారిపోయాయి.

అబ్బెన్న కన్నీటిని చూసిన ఒల్లెమ్మ "యోవ్.. ఏమయ్యా! ఎందిది? నువు కండ్లల్లో నీళ్లు పెట్టుకునేది ఏంది? ఇన్నెండ్లల్లో ఏపొద్దయినా నీ కండ్లల్లో కన్నీళ్లు చూసి ఉందునా? చెప్పయ్యా చెప్పు, ఏమైనాది చెప్పు?" అని మరింత దగ్గరకు జరిగి కన్నీళ్లు తుడుస్తూ అడిగింది. కన్నీళ్లు పెట్టుకుంటూ మౌనంగా ఉన్నటువంటి అబ్బెన్న ఎట్టకేలకూ నోరు తెరిచాడు.

"నాకి అమ్మ పేమ ఎట్లుంటాదో తెలీదు. నువు నా బతుకులోకి వొచ్చినంక తెలిసినాది అమ్మ పేమ నీ పేమ మాదిరే ఉంటాదని. అట్లాంటి అమ్మని ఇంగోసారి పోగొట్టుంటానేమోనని నా బయిం.

సరింగా ఇట్లాంటి దినమే నేను మాయమ్మని పోగొట్టుకున్నానని మా అయ్య చెప్పేటోడు.

ఇబ్బుడు మా అయ్య చెప్పిన మాటలే నా కండ్లముందర మెదులుతుండాయి.

ఆ పొద్దు మాయమ్మ మాదిరి ఈ పొద్దు 'నువు'గూడా నిండు సూలాలివి.

ఆ పొద్దు మాయమ్మకైన మాదిరి నీకేమైనా అయితాదేమోననే నా దిగులంతా!.

ఇబ్బుటిదాకా ఎఱ్ఱంగా ఎండ కాస్తుండే పొద్దు వుండుకున్నట్లే మొబ్బులు కమ్ముకుంటుండాదంటే నాకి బయింగా వుండాది. అట్ల నిజింగా నీకైమైనా అయినాదంటే నేనునూ బతికేల్దు పాప" అని చెప్పి ఒల్లెమ్మని గట్టిగా కౌగిలించుకున్నాడు అబ్బెన్న.

ఒల్లెమ్మకి ఏమిచెప్పాలో అర్థం కాలేదు.

ఎలా ఓదార్చాలో తెలియలేదు.

తనలోని భయాన్ని ఎలా తరిమికొట్టాలోననే ఉపాయం కోసం ఆలోచించింది.

అసలు విషయాన్ని తెలుసుకుంటే పరిష్కారించవచ్చని మాత్రం గ్రహించి "ఏమయ్యా.. నేనోటి అడగతా చెప్తావా?"

"ఊ.. చెప్తా పాప" అన్నాడు అబ్బెన్న.

"మీ నాయిన ఆ పొద్దు నీకేమి చెప్పినాడు? మీయమ్మకి ఏమైనాది? మీయమ్మ ఎట్ల చచ్చిపోయినాది?" అంటూ ఆరాతీసింది ఒల్లెమ్మ.

అబ్బెన్న బదులివ్వలేదు.

ఒల్లెమ్మ గుండెకు దగ్గరగా తీసుకొని ఓదార్చింది, బుజ్జగించింది.

"నేనేమడిగినా చెప్తా అంటివి గదా? ఇబ్బుడడిగితే గొమ్మునున్నావు?" అంది దించుకోనున్న అతని మొహాన్ని పైకిలేపి కళ్ళలోకి చూస్తూ.

అబ్బెన్న గత జ్ఞాపకాల్ని, తన తండ్రి పెద్దబ్బి, తల్లి పాపమ్మ బతుకుల్ని బొమ్మకట్టించినట్లు చెప్పుకొచ్చాడిలా..!

***

యానాదుల్ని ఆనాదులు అంటారేగానీ బతుకంతా అదవ బతుకే.

ఊరు ఊరంతా ఒకటైతే, ఎక్కడో బయట విసిరిపారేసినట్టుండే యానాది గుడిసెలు ఊరికి బయట గుట్టవాలు, కొండవాలు ప్రదేశంలో నాలుగడుగుల స్థలంలో, మనిషి ఎత్తు పొడవుతో తాటాకు గుడిసెలో జీవనం సాగిస్తూ.. ఊర్లోవాళ్లు కాళ్లతో చెప్పిన పని చేత్తో చేస్తూ.. వారికి ఊడిగం చేస్తూనే బతుకుల్ని ముగిస్తారు.

మరోవైపు పెద్దబ్బికి ఇవన్నీ చిన్నతనం నుండే నచ్చేవికావు. ఇవన్నీ చూస్తూ.. వాళ్లు చెప్పినవి చేస్తూ బ్రతకలేక పాపమ్మను తీసుకొని ఆ మనుషులకు, యానాది గుడిసిలకూ దూరంగా వచ్చి అడవికి సమీపానికి చేరిపోయాడు.

అత్యవసరాలకు దగ్గర ఊర్లకు వెళ్లి అడవిలోని తేనె, పళ్ళు, మందు వేర్లు లాంటివి అమ్ముకొని ఇంటికి కావాల్సిన నూకలు, రాగులు, జొన్నలు తెచ్చుకొని జీవనం సాగించేస్తున్నారు ఇరువురూ..!

అడవికి వేటకు వెళ్తే పాపమ్మ ముందు తనకు తెలిసిన విధ్యలన్ని ప్రదర్శించి ఆమెను మెప్పించేటోడు, కవ్వించేటోడు.

గురిచూసి ఈటెను విసిరినా,

పుట్టలో దాక్కున్న ఉడుము శబ్దం వినికిడి చెవిన పడినా,

ఏ జీవానికి తెలిసిన నైపుణ్యాలను అవి ప్రదర్శించినా వాటి ఆటలు పెద్దబ్బి ముందు సాగేవికాదు.

అవసరమైతే వాటికంటే వేగంగా పరిగెత్తి ఈటెతో గురిచూసి కొట్టేవాడు.

పుట్టలో దాక్కున్నా ఉడుమును సైతం చాకచక్యంగా పట్టుకునేవాడు.

పుట్టతేనేమి, తొర్రతేనేమి, బండతేనేమి, కొనగొమ్మల్లో పెట్టిండే పెద్దతేనేమి పెద్దబ్బి కంట్లో పడితే పాపమ్మ దోసిల్లు నిండి పొంగాల్సిందే తేనె దారలు.

అప్పుడు పాపమ్మ మురిసిపోయేది పెద్దబ్బి పనితనాన్ని చూసి.

అలా హాయిగా సాగిపోతున్న వారి జీవితంలో అనూహ్యమైన మార్పులు జరిగాయి.

పాపమ్మ గర్భవతని తెలిసింది.

పెద్దబ్బి సంబరపడ్డాడు.

ఎప్పటిలాగే ఏ కష్టం లేకుండా కంటికి రెప్పలా చూసుకుంటూ వస్తున్నాడు.

కానీ.. పాపమ్మకి ఆ సందర్భంలో భర్త ఒక్కడే కాదు 'నా వాళ్లు' అనే తోడు, భరోసా అదనంగా అవసరమనిపించింది.

ఆనాడు భర్తతోనే బతుకని కన్నవాళ్లను వదులుకొనొచ్చేసింది.

ఈనాడు తల్లిదండ్రుల సంరక్షణ కావాలనిపిస్తుంది కానీ పాపమ్మ భర్తకు చెప్పిన పాపాన పోలేదు.

అన్ని కొరికల్ని గుండెల్లోనే దాచేసుకొని పైకి ఎప్పటిలాగే నవ్వుతూ ఉంది.

నెలలు నిండిపోతున్నాయి.

ఈరోజో రేపో అన్నట్టు ఉంది.

ఒకవైపు సంతోషం, మరోవైపు కంగారు.

పెద్దబ్బి అడవిలోని జంతువులపై చూపే తెలివి, తెగువ గర్భవతి అయిన పాపమ్మ మీద చూపటానికి చేతకావటం లేదు.

అసలేమి చేయాలో అర్థం కాలేదు పెద్దబ్బికి.

ఎప్పుడూ నోరువిప్పి మనసులో బాధని, కష్టాన్ని చెప్పని పెద్దబ్బి నోరువిప్పి "మనమూ.. మనోళ్లతో గూడా మన యానాది గుడిసెల్లోనే ఉనింటేనే బాగుణ్ణు కదా?. ఊరుగాని ఊరుకి, అడివిగాని అడివికి ఆత్రపడి వొచ్చేసినామా? అని ఇప్పుడనిపిస్తుండాది.

పైంగా నిన్నిట్ల చూస్తావుంటే నాకి కాళ్లు, చెయ్యిలు ఆడలేదు. అసుల్లో ఏమి చెయ్యల్లో గూడా దిక్కుతెల్లేదు పాప" అన్నాడు దగ్గరగా కూర్చొని.

"బయిం దేనికయ్యా? దిక్కులేనోళ్లకి దేముడే దిక్కు. అయినా ఇబ్బుడు నాకేమయినాదని? ఏమైయ్యేల్దులే.. అందురు ఆటోళ్ల మాదిరిగానే నేనూ.. మీయమ్మ నిన్ని కన్లేదా..? మాయమ్మ నన్ని కన్లేదా..? నేనునూ అంతే... చందమామట్లా బిడ్డని నీ చేతుల్లో పెడ్తానయ్యా! ఒగుసారి నువు నవ్వితే చూడల్లని వుండాది" అంది బుజ్జగింపుతో.

పాపమ్మ మాటలకు భయాన్ని దిగమింగి పెద్దబ్బి చిక్కగా నవ్వాడు.

పాపమ్మ కూడా భర్తను చూసి తృప్తిగా నవ్వింది.

అంతలో గాలి, వాన మొదలైంది.

వాటికి తోడు ఉరుములు, మెరుపులు జతకట్టాయి. అంతకంతకూ వాన తీవ్రత మరింత ఎక్కువైపోయింది. అప్పుడే పాపమ్మకు పురిటి నొప్పులూ మొదలైయ్యాయి. పెద్దబ్బిని గట్టిగా ఒడిసిపట్టుకుని "పొట్టలో నొప్పయ్యా" అంది నీరసించిపోయినట్టుగా.

పెద్దబ్బి ఓదార్చే ప్రయత్నం చేస్తున్నాడు.

ఒకవైపు నొప్పులను బరిస్తూనే పెద్దబ్బికి ఏమి చెయ్యాలో చెప్పింది పాపమ్మ.

అంతలో ఉన్నపళంగా గాలి మరింత ఉధృతంగా వీయటంతో గుడిసెపైకప్పులోని తాటాకులు ఒక్కొక్కటిగా జారిపోతున్నాయి.

ఆకాశాన్ని చీల్చుకొని మెరుపు, దానివెంటనే ఆకాశం విరిగి నెలమింద పడ్డట్టు పెల్లుమని ఉరుము రావటంతో పాపమ్మ ఉలిక్కిపడింది.

దాంతో నొప్పులు మరింత తీర్వతరమైయ్యాయి.

భరించలేని నొప్పితో అటూ, ఇటు పొర్లుతూ తల్లడిల్లిపోయింది పాపమ్మ.

పెద్దబ్బికి కాళ్లు చేతులు వణికిపోతున్నాయి.

గుడిసెలోకి వాననీళ్లు దారులు తీస్తున్నాయి.

గుడిసె కొద్దికొద్దిగా నానిపోతుంది.

నొప్పులతో పాపమ్మ పోరాడి పోరాడి చెప్పినట్టే చందమామలాంటి మొగబిడ్డకు జన్మనించి "బిడ్డ భద్రమయ్యా! మన చిన్నబ్బి భద్రం" అని చెప్పి తిరిగిరాని లోకాలకు తరలిపోయింది పాపమ్మ.

***

పుట్టెడు దుఃఖంతోనే పాపమ్మకు జరిపించాల్సిన తంతును జరిపించి చిన్నబ్బినెత్తుకొని తనుపుట్టి పెరిగిన యానాది గుడిసెలు చేరి పాపమ్మ తల్లి లక్ష్మమ్మ చేతులో చిన్నబ్బిని పెట్టి అక్కడి నుండి వెళ్లిపోయాడు.

బతకలేక తిరిగొచ్చాడని లోకులు కాకులై పొడుస్తారనో..! ప్రాణానికి ప్రాణమైన పాపమ్మ లేని బతుకు వద్దనుకున్నాడో తెలియదు. పెద్దబ్బి వెళ్లిపోయాడు అందరికీ దూరంగా..!

అప్పుడెల్లిపోయిన పెద్దబ్బి, చిన్నబ్బి పెద్దవాడై అబ్బెన్నగా మారినాకూడా తిరిగిరాలేదు.

తండ్రి ఎప్పటికైనా తిరిగివస్తాడని ఎదురుచుస్తూనే ఉన్నాడు మరోవైపు అబ్బెన్న.

***

అప్పటివరకు ఆకాశాన్ని కమ్ముకున్న మేఘాలను చీల్చుకుంటూ ఒక మెరుపు ఆ మెరుపు వెనుక పెల్లున ఉరుము రావటంతో గతజ్ఞాపకాల నుండి బయట పడ్డారు అబ్బెన్న, ఒల్లెమ్మ.

కుక్క ఉరుముకి బెదిరి 'కుయ్..' మంటూ వారి కాళ్లమధ్యకు చేరిపోయింది.

పొదల్లోనున్న కుందేళ్లు మరోపొదలోనికి ఠక్కున దాటుకున్నాయి.

జింకల గుంపు ఒక్క ఉదుటున ఎగురుతూ ఇటుపక్క నుండి అటుపక్కకు క్షణాల్లో దాటేశాయి.

ఇలాంటి సమయంలో అడవిపందుల గుంపులు తావుల్ని వెతుక్కోవటానికి ఎక్కువగా తిరుగుతుంటాయి.

వాటిల్లో పిల్లలపందికి వీరు కంటపడితే ప్రాణాలైనా తీసేస్తాయని అబ్బెన్నకు తెలుసు. ఠక్కున కొంచెం ఎత్తైన బండను కనుగొని అక్కడికి ఒల్లెమ్మను చేర్చాడు.

గాలి మరింత పెరిగి తిప్పితిప్పి కొడుతూ ఎదురుదాడి చేస్తున్నట్టుంది.

ఇక వానొస్తే మరింత కష్టమౌతుందని వాళ్లకు తెలుసు.

అలా అని ఇప్పటికిప్పుడు ఇల్లు చేరాలంటే తక్కువలో తక్కువ కలుంకూరిగుట్ట నుండి 7 మైల్లదూరం నడవాలి యానాది గుడిసెలు చేరాలంటే.

అప్పుడున్న పరిస్థితుల్లో నిండు గర్భవతి అంతదూరం వానకు ముందు ఇల్లు చేరగలదా అంటే కష్టమే అవుతుంది.

అలా అని కలుంకూరి గుట్టలోని గుహల్లో తలదాచుకుందాం అనుకుంటే జంతువులు వారిపై దాడి చేసే అవకాశం ఉందని ఏమిచెయ్యాలనే సందిగ్ధంలోపడి అబ్బెన్న తీక్షణంగా ఆలోచిస్తున్నాడు.

ముందుగా ఈ కలుంకూరిగుట్ట నుండి బయటపడి తదుపరి ఏమి చేయాలో ఆలోచించాలనుకున్నాడు తిరిగి అబ్బెన్న.

చిన్నగా కలుంకూరిగుట్ట దిగువున చదరపు ప్రాంతానికి ఒల్లెమ్మను చేర్చి కుదురుగా ఒకచోట కూర్చోబెట్టి కుక్కని ఇక్కడే ఉండన్నట్టుగా సైగచేసి నలబల్చి పొదల్ని వెదుకుతూ వెళ్లి నలబల్చి పొదల్లోకి దూరాడు.

కుక్క ఒల్లెమ్మ కాళ్లకు దగ్గరగా ముడుచుకొని పడుకుంది.

వెదురుపొదల్లా ఏపుగా పెరిగిన నలబల్చి మాండ్లను నాల్గువైపులా వంచి తీలు తీగల్ని పెరక్కొచ్చి వాటికి అంటిపెట్టి నాల్గువైపులా బిర్రుగా కట్టాడు.

బిల్లికొయ్యిల వాసాల్ని నరుక్కొచ్చి వంచికట్టిన నలబల్చి మాండ్లకు అడ్డపల్లుగా బిల్లి వాసాల్ని పేర్చి, చిక్కగా సందులు లేకుండా కట్టుకొచ్చాడు.

పచ్చార కట్లును కొట్టి ఒకవైపు సూది మొనలా చెక్కి భూమిలోకి చేర్చి పైన

అడ్డపల్లుగా వేసిన బిల్లి కొయ్యిలకి అంటిపెట్టి దుసారా తీగుల్తో బిగించి కట్టాడు చుట్టూ.

పొదకు ఎగువనకెళ్లి నెమలి ఊడగ ఆకుల్ని తెచ్చి బందేరు కంపల జతచేర్చి సందుల్లేకుండా అల్లి పైకప్పుగా పేర్చాడు.

కింద గుడిసె చుట్టూ మట్టి ఎగదోసి పకడ్బందీగా గుడిసెను నిర్మించాడు.

పాములు, పురుగులు కానీ.. వానచినుకులూ లోనికి ప్రవేశించేందుకు చోటులేకుండా గుడిసెను నిర్మించాడు.

అప్పటికే చినుకులూ మొదలైయ్యాయి.

ఒల్లెమ్మను వదిలిపెట్టిన వద్దకు చెట్లను, కంపల్ని దాటుకుంటూ పరుగులు తీసాడు.

అప్పటికే ఒల్లెమ్మ నొప్పులు పడుతూ ఉంది.

ఒల్లెమ్మను చేతుల్లోకి బాసుకొని నలబల్చి పొదలోపలున్న గుడిసిలోనికి పరుగున తీసుకెళ్లాడు అబ్బెన్న.

ఒల్లెమ్మ నొప్పులు పడుతుండటంతో కుక్కను గమనించుకోలేదు, కుక్కవెనకింటీ రాలేదనీ గ్రహించలేదు.

ఠక్కున కుక్క గుర్తొచ్చి "పాప వో.. మెయ్.. పాప బైరవి ఏడనే?" అన్నాడు.

ఒల్లెమ్మకు నోట్లో మాట రాలేదు. చేత్తో ఏదో సైగ చేసింది.

అబ్బెన్నకు ఆ సైగలు అర్థం కాలేదు.

కుక్క ఏదో ప్రమాదంలో ఉందని మాత్రం గ్రహించగలిగాడు.

వెళ్ళి వెతుకుదామంటే ఒల్లెమ్మ నొప్పులతో ఉంది.

మరోవైపు వర్షం జోరందుకుంది.

గుడిసెలోకి చుక్క వాన నీళ్లు రాకపోవటంతో తనపనితనాన్ని తనే మెచ్చుకున్నాడు.

పడిన చినుకు పడినట్టు జారిపోయేలా వాటంగా కట్టాడు గుడిసెను.

దాని మూలంగా వాన గురించి భయపడాల్సిన పనిలేదునే ధైర్యం వచ్చేసింది.

ఇప్పుడు భయమంతా ఒల్లెమ్మ పడుతున్న పురిటినొప్పులు, మరోవైపు కుక్క ఎక్కడికి వెళ్లిందో తెలియకపోవటం గురించే.

పురిటినొప్పులను పంటి బిగువున బంధించి ధైర్యాన్ని కూడగలుపుకొని ఒల్లెమ్మ ఆడపిడ్డకు జన్మనించింది. కాసేపటికి ఒల్లెమ్మకూడా తేరుకుంది. అబ్బెన్నకు పట్టరాని సంతోషంతో మాట పెగల్లేదు.

భర్త సంతోషాన్ని, పండంటి ఆడబిడ్డను చూసి ఒల్లెమ్మ మురిసిపోయింది.

అప్పుడే వానకు పూర్తిగా తడిచిపోయి పడుతూ లేస్తూ కుక్క గుడిసె ముందుకొచ్చి 'కుయ్.. కుయ్..'మని అంది.

'భైరవి వొచ్చినాద'ని గుడిసి ముందుకొచ్చి చూస్తే కుక్క వానకు తడిచిపోయి ఉంది.

అంతేకాదు శరీరమంతా గాయాలతో రక్తపు దారలు బొట్టుబొట్టుగా కారిపోతున్నాయి.

ఆ గాయల్ని చూసిన అబ్బెన్న చలించిపోయి కుక్కను దగ్గరగా తీసుకున్నాడు.

పుట్టిన పాపని, ఒల్లెమ్మని, అబ్బెన్నవైపు చూపి నిలిపి కట్టిగా ఒక్కసారి మొరిగి నెలకొరిగిపోయింది కుక్క.

అబ్బెన్న కుక్కను ఊపీ..ఊపి 'భైరవి, భైరవి' అంటూ బరోమని ఏడ్చేశాడు.

అబ్బెన్న గుడిసె వేసేందుకు పొదల్లోకి వచ్చినప్పుడు ఒంటరి అడవి పంది తన పిల్లల గుంపుతో అటుగా వచ్చిందని.

ఒల్లెమ్మ తన పిల్లల్ని ఏమైనా చేస్తుందనే భయంతో.. ఒల్లెమ్మపై పంది దాడిచేయబోయిందని.

పక్కనే ఉన్న కుక్క ఆ పందిపై ఎదురుదాడికి దిగి

చెట్లమధ్యన రెండూ భీకరంగా పోరాడాయని. ఫలితంగా తనను కాపాడి కుక్క ప్రాణాన్ని పణంగా పెట్టిందని అబ్బెన్నకి చెప్పుకొచ్చింది ఒల్లెమ్మ.

అబ్బెన్న జరిగింది విని క్షణకాలం స్తంభించిపోయాడు.

తన భార్యను, బిడ్డను కాపాడి చనిపోయి పడివున్న కుక్కకు చేతులెత్తి నమస్కరించాడు.

తన ప్రాణాన్ని పణంగా పెట్టి మరోప్రాణాన్ని బ్రతికించిన కుక్క ఎప్పటికీ గుర్తుండిపోయెలా వారికి పుట్టిన బిడ్డకు ఆ కుక్క పేరే 'భైరవి' అని పెట్టుకున్నారు.

తన తల్లి దూరమైనట్టు ఒల్లెమ్మ దూరమైపోతుందనే ఆలోచనలు పూర్తిగా తొలిగిపోయాయి అబ్బెన్నకు.

తనలా తనబిడ్డ తల్లిదండ్రుల ప్రేమకు దూరం కాదనే భరోసాతో భార్యా, బిడ్డతో అడవి నుండి యానాది గుడిసెలవైపునకు అడుగులు వేస్తూ.. "మనిబిడ్డని మన మాదిరి బతుకులు గాకుండా నలుగురికి 'పస్తిని' చెప్పేలా పెంచల్ల" అంటూ దర్జాగా మునుముందుకు అడుగులేసాడు అబ్బెన్న.

***

**కె.వి. మేఘనాథ్ రెడ్డి** .. చిత్తూరు జిల్లా, పలమనేరులో జన్మించారు. 2017 లో సాహితీప్రపంచంలోనికి అడుగిడిన మేఘనాథ్ రెడ్డి కవిత్వం, కథ, నవల ప్రక్రియల్లో రచనలు చేశారు. వీరి కథలకు NATA, TELSA వంటి పోటీల్లో బహుమతులు అందుకున్నారు. 2019లో 'కరిగిపోవే కన్నీటి చుక్క', కవితా సంపుటి. 2021లో "అగజాత" పేరుతో నవలలు రచించారు. 2022 'కలుంకూరి గుట్ట' కథా సంపుటాన్ని రచించారు. 2024 లో 'పాయిదరువులు' నవలను రచించారు. 2022లో "కలుంకూరి గుట్ట" కథల పుస్తకానికి ప్రతిష్టాత్మకమైన 1. విమలాశాంతి కథా పురస్కారం - 2022, 2. రజనీశ్రీ కథా పురస్కారం - 2023, గంటా కమలమ్మ కథా పురస్కారం - 2023, మహేశ్వరయ్య కథా పురస్కారం - 2023, కొలకలూరి భాగీరథీ కథా పురస్కారాలు 2024 గెలుపొందింది. 2024లో ప్రచురించిన 'పాయిదరువులు' నవల చిత్తూరు జిల్లాలోని యానాది కుటుంబాల ఆధారంగా రాసిన నవల 2025 డా.వి. చంద్రశేఖరరావు సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు.

sivegari@gmail.com

# ఖట్నా



**పిన్నంశెట్టి కిషన్**

ఆదిత్య కొర్రపాటి.. పేరెన్నికగన్న ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. న్యూయార్క్ లోని బహుళ అంతస్థుల టవర్ పదిహేడో ఫ్లోర్ లోని తన ఆఫీస్ లో కూర్చుని, తను రాయబోయే ఆర్టికల్ పై సమాచార సేకరణ కోసం నెట్ లో వెతుకుతున్నాడు. రిపీటెడ్ గా వస్తున్న ఫోన్ వైబ్రేటింగ్ మోడ్ లో ఉన్నా చికాకు పెడుతుంది.

'ఓ సారి అటెండ్ అవుతే ఈ బాధ ఏదో తీరిపోతుం'దని చేతిలోకి తీసుకుని;

'ఎస్" అన్నాడు, అందరిలా 'హెల్లొ' చెప్పడు.

'నేను, ఎడ్వర్డ్ పోప్ రెండో భార్యను"

'అతనెవరు?" గొంతులోని చిరాకును సాధ్యమైనంత మేరకు అణిచి పెడ్తూ అడిగాడు.

'అతను, హైదరాబాద్ యువరాణి నీలోఫర్ రెండో భర్త"

హైదరాబాదుకు చెందిన తన గురించి, పూర్తి సమాచారం సేకరించి మాట్లాడుతుందని అర్థం అయ్యింది ఆదిత్యకు.

'మీకోసం నేను ఏం చేయగలను?" పలుకులో ముందటి అసహనం ఎగిరిపోయి, మార్దవం చోటుచేసుకుంది.

'నీలోఫర్ కు సంబంధించిన కొన్ని వస్తువులు మీకు అప్పగించాలనుకుంటున్నా. అవి మీ వద్ద భద్రంగా ఉంటాయన్న భరోసా మాత్రమే కాదు, వాటి ప్రాముఖ్యతను గుర్తించగలిగే సమర్థత, ప్రాధాన్యతను ప్రపంచానికి పరిచయం చేయగల ప్రతిభ ఉన్నవారు మీరు"

'మీకు అభ్యంతరం లేకపోతే గంటలో మీ ముందు ఉంటాను"

'సంతోషం, ఎదురుచూస్తుంటాను"

'బై! బై!' లతో ఫోన్ సంభాషణ ముగిసింది.

* * *

ఉత్సుకత ఎంత ఉత్సాహాన్ని ఇస్తుందో ఆదిత్య ప్రతి కదలిక ప్రస్ఫుట పరుస్తుంది. అనుకున్న సమయానికి మిసెస్ పోప్ తో కరచాలనం చేశాడు. సమయపాలన పని పట్ల మనకున్న నిబద్ధతను, నిజాయితీని తెలియజేస్తుంది.

తను అప్పటికే తీసి, టేబుల్ పై పరిచిన ఏడు సూట్ కేసుల చారిత్రక సంపదను చూపించింది.

ఆదిత్య పేరును ఎవరు సూచించారో చెబుతూ తన భర్త మాటల్లోని నీలోఫర్ వ్యక్తిత్వాన్ని ఔన్నత్యాన్ని, తమ అనుబంధాన్ని ముచ్చటించింది.

రచనకు ఉపయోగపడే అంశాలన్నీ ముగిశాయని నిర్ధారించుకున్నాక, సెలవు తీసుకుని తిరిగి ఆఫీస్ చేరుకున్నాడు ఆదిత్య..

* * *

'పూర్తి చేయందే ఇంటి దారి పట్ట'నని ప్రతిజ్ఞ చేసి, నిజాం చారిత్రక సంపదను ముందేసుకు కూర్చున్నాడు.

ఒక్కో సూట్ కేసు తెరిచి చూస్తుంటే.. పందొమ్మిది వందల ముప్పై నాటి హైదరాబాద్ నగర వీధుల పరాగము చుట్టుముట్టి, అనేకానేక రోమాంచిత అనుభూతులు ఏకకాలంలో కలిగాయి.

అందంగా పటం కట్టిన "పుట్టు వెంట్రుకలు"!

ముత్యం తొడిగిన "జడ రిబ్బన్"!

ఏడవ తరగతి "ప్రోగ్రెస్ రిపోర్ట్"!

టర్కిష్ ఫర్మానాలు!

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో తను తీసుకున్న నర్స్ ట్రైనింగ్ సర్టిఫికెట్!

ముంబాయి ఆభరణాల వ్యాపారి మాధవ దాస్ నుండి కొని, సేకరించగా మచ్చుకి మిగిలిన మనోహరమైన చీరలు!

'అభిరుచికి అద్దంపట్టే మీ కోకలు, మా విద్యార్థులకు రిఫరెన్స్ పాఠాలుగా చెప్పుటకు కావా'లని కోరుతూ, న్యూయార్క్ ఫ్యాషన్ ఇన్స్టిట్యూట్ అండ్ టెక్నాలజీ వారు రాసిన ఉత్తరం!

'నిలోఫర్ ఇస్తాంబుల్ లో పుట్టి ఫ్రాన్స్ లో పెరిగినా, భారతీయుల చీరను తనదిగా చేసుకుని ఈస్ట్ వెస్ట్ సంస్కృతులకు వారధిగా నిలిచిన నారీమణి..కదా!'

తనకు కాబోయే మామ హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ గారికి రాసిన ఉత్తరం!

'చిన్న నాటనే కోల్పోయిన తన తండ్రిని మీలో చూసుకుంటా'నని రాస్తే, 'తనను కలవక ముందే ఇద్దరి మధ్యన ఒక బంధం ఏర్పడిం"దంటూ తనని 'పాపా' అని పిలవడానికి ఒప్పుకున్న రాజావారి ప్రత్యుత్తరం.

అలా ఒక్కటొక్కటిగా.. చరిత్ర పుటల్లోంచి పయనిస్తూ గతకాలపు సౌరభాన్ని ఆస్వాదిస్తూవుంటే.. 1932 నాటి డైరీ ఒకటి ఆకర్షించింది! నీలోఫర్ కు తోడుగా వచ్చిన ఫ్రెంచ్ మంత్రసానిది ఆ డైరీ.. మొదటి పేజీలో తన వ్యక్తిగత వివరాలు, తర్వాత పేజీలో నీలోఫర్ సమాచారం ఉంది;

నీలోఫర్ హనీంసుల్తాన్ ఒట్టోమన్ కాలిఫ్స్ కుటుంబంలో జనవరి 4 1916న,

ఇస్తాంబుల్ లో పుట్టింది. ఒట్టోమన్ ఎంపైర్ చివరి యువరాణి. పదహారేళ్ల వయసు, 5.8 అడుగుల ఎత్తు. పాలరాతి రంగు శిల్పానికి ప్రాణం పోసిన రూపు . డిసెంబర్ 1931న, ఏడవ నిజాం రెండో కొడుకు, ప్రిన్స్ మొజామ్ జహ్ ను శాదీ చేసుకుంది.

నీలోఫర్, తోటి కోడలు దుర్రే షేహ్వార్ తో కూడిన ఓషన్ లైనర్ ఓడ నీస్ పట్టణంలో బయలుదేరి, బొంబాయి రేవుకు చేరుకుంది. అక్కడి నుండి నిజాం ప్రైవేట్ ట్రైన్ లో హైదరాబాద్!

అత్తవారింటి ఆచార వ్యవహారాలకు తగ్గట్టుగా నౌకా ప్రయాణం లోనే చీర కట్టుకోవడం నేర్చుకుని, చీరలో హైదరాబాద్ చేరిన వారిరువురుని చూసి నిజాం పరివారము, చూడడానికి వచ్చిన పురజనులు ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. భర్తతో కలిసి బరాత్ గా హిల్ ఫోర్ట్ ప్యాలెస్ చేరుకున్నారు!

ఇలా.. ఉట్టి సమాచారం తప్ప ఉత్సుకత కలిగించే కథనాలు ఏవి కనిపించడం లేదని, పేజీలు మర్లేస్తుంటే ఒకచోట ఆదిత్య కళ్ళు కాకర వొత్తులయి వెలిగాయి;

ఆరేడు సంవత్సరాల ఆట కోయిలి ఆడపిల్ల, చీకటి గుహ లాంటి ఇంట్లోకి భయంభయంగా అడుగుపెట్టే దృశ్యాన్ని ఊహించుకోండి!

నిన్ను నేలపై పడుకోబెట్టి నీ లోదుస్తుల్ని ఎవరో తెలియని వాళ్ళు తొలగించడాన్ని ఊహించండి!

ప్రక్కనున్న పొయ్యి మంట పై ఎర్రగా కాలుతున్న ఓ కత్తి కళ్ళ ముందు కరాళ నృత్యం చేస్తున్నది ఊహించండి!

అదే వేడి కత్తి... వాడిగా నీ మర్మావయపు సున్నితత్వాన్ని కర్కశం గా కోసేస్తున్న ఆ అమానుష దృశ్యాన్ని ఊహించండి!

బాధను తట్టుకోలేక అరుస్తూ నేలపై చేపపిల్లలా కొట్టుకుంటున్న చిట్టి తల్లిని కన్నులముందు కాంచండి! ఒకసారి..

ఊహిస్తేనే ఒళ్ళు గగ్గుర్లు పొడిచే ప్రత్యక్ష నరకాన్ని చవి చూసే చిన్నారుల దయనీయ స్థితి! ఆ ఖతర్నాక్ దుష్క్రియ పేరు..

ఖట్నా!

ఇది జరిగేది ఎక్కడో కారడవుల్లో, ఆదిమానవులు చేస్తున్న అనాగరికపు ఆకృత్యం కాదు. నాగరీకులు నివసించే, ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశంగా కీర్తి పొందిన హైదరాబాద్ నగరం నడిబొడ్డున జరుగుతున్న దాష్టీకం.

అత్యంత సన్నిహిత పరిచారిక ఆస్మా 'రెండు రోజులు సెలవు కావా"లని అడిగితే, కారణం తెలుసుకుని 'జరుపబోయే కార్యానికి వస్తా"నంది నీలోఫర్.

'ఖట్నా మంత్రసాని ద్వారా జరిగే, అత్యంత రహస్యంగా జరిపే ప్రక్రియ. అది నోరు విప్పి మాట్లాడడానికి సైతం భీతిల్లే విషయం. అలాంటి చోటుకు మీరెలా! అందరికీ

తెలిసిపోతుంది" యజమాని రాకడకు భయపడింది.

'బుర్కా లో వస్తాను" అంటూ బయలుదేరబోతుంటే;

తప్పేలా లేదని, 'ఈ నలుపు రంగువి వేసుకుంటే దొరికిపోతారు" అంటూ తన తోటి బోహ్రా దాసి వనితల బుర్కాలు తెచ్చి మా ఇరువురికి ఇచ్చింది. ఇతర ముస్లింలకు భిన్నమని భావిస్తూ.. బోహ్రా జాతి అతివలు అతి ప్రకాశవంతమైన ఆకుపచ్చని రంగు బుర్కా ధరిస్తారు.

వాటిని వేసుకుని, ఫోర్ట్ ప్యాలెస్ రక్షణ వలయాన్ని తప్పించుకుని, బయటకు వచ్చాము. సాధారణ పౌరుల్లా మారిపోయి, వీధుల వెంట తిరగడం, షెర్లాక్ హోమ్స్ గుర్తుకు వచ్చి భలే థ్రిల్లింగ్ అనిపించింది.

ఇంటి దర్వాజా ముందు మేం నిలుచుంటే, లోపలికి వెళ్లి కూతురు హఫీజాకి 'మౌజ్ కా మీఠా తినిపిస్తా"నని, ఇంట్లోంచి చంకన ఎత్తుకొని వచ్చింది ఆస్మా. హుస్సేనీ ఆలం ఇరుకు సందుల్లో ముందు తను నడుస్తుంటే, వెనక అనుసరిస్తూ మేము.

రోడ్డు ప్రక్కనున్న కిరాణా దుకాణంలో పిప్పరమెంట్ కొనిస్తే, చంక దిగి నవ్వుతూ నడుస్తూంది హఫీజా. బోహ్రా మొహల్లా చేరుకున్నాం. 'నేత పని బోహ్రాల ప్రధాన వృత్తి. టకీయకూపీ టోపీలను అల్లుతారు.'

చీకటి మేలి ముసుగు వేసుకున్న భవంతిలోకి ప్రవేశించాము. అక్కడి నుండి ఓ గదిలోకి. మమ్మల్ని చూస్తూనే కిటికీలకు ఉన్న పరదాలు దించి, వెలుతురు కళ్ళు కప్పారు అక్కడి అతివలు.

బొంగురు గొంతు వృద్ధ వనిత, పిల్ల కళ్ళలోకి చూస్తూ 'పడుకో"మంటే, మంత్రించినట్లు నేలపై పడుకుంది హఫీజ.

కూతురు రెండు చేతులను నేలకేసి అదిమి పట్టుకుంది ఆస్మా. మరో అపరిచిత, పిల్ల తొడుక్కున్న చుడీదార్ బొందు విప్పి కిందికి గుంజింది.

'తనకేదో జరిగిపోతుం'దని హఫీజా ఏడుపు లంకించుకుంది.

'ఏడ్వకు, రెప్పపాటులో అయిపోతుంది" అంటూ' బలి పశువును బుజ్జగించ ప్రయత్నిస్తుంది తల్లి.

ఖత్నా క్రతువులో కన్నతల్లే తొలి శత్రువులా తోస్తుంది!.

పొయ్యి మంటలో మండి చల్లారిన కత్తి తీసుకుని ముందుకు వస్తున్న ఆ వృద్ధనారీ చెయ్యి దొరకబుచ్చుకుని 'ఏం చేస్తున్నవ్?" కోపంగా అంది, అప్పటివరకు ప్రేక్షక పాత్ర పోషిస్తున్న యువరాణి నీలోఫర్.

పట్టు విడిపించుకోవాలని తెగ ప్రయత్నిస్తూ 'కొత్తగా అడుగుతున్నావు? నీకు తెలియదా!" అంటూ, పిల్ల తల్లికేసి చూస్తూ 'వీళ్ళెవరూ? ఎందుకు తీసుకువచ్చినవ్?" దబాయింపు గా అడిగింది వృద్ధ మంత్రసాని.

ఎడం చేత్తో బుర్కా తొలగిస్తూ, కుడి చేతిలో నలుగుతున్న చెయ్యి వదిలేసి, చెంపపై

ఒక్కటిచ్చి 'నేను నీలోఫర్ ను" అంది.

నవనాడులు చల్లబడినట్లు నేలవాలి, మోకాళ్ల పై కూర్చుని 'క్షమించు జహాపనా"ని వేడుకుంది.

'మా తెగలో ఆడపిల్లలకు ఖట్నా జరపకపోతే పెళ్లిళ్లు జరుగవు. ఇది మా పురాతన సంప్రదాయం, మగవారి సున్నీ తరీఖ!" మిగతా ఇద్దరు అమ్మాయిని వదిలేసి లేచి నిలబడ్డారు.

'ముసల్మాన్ నే కాదా! నాకు జరగనిది మీకెందుకు? ఖురాన్ అందరికీ ఒక్కటేగా!"

'మాఫ్ కర్నా! హరామ్ కా బోటి ఖాట్నాయి పడేగా" వణికిపోతూనే చెప్పేసింది మంత్రసాని.

'ఈ శరీరం అల్లా సృష్టి కాదా! ఆయన ఇచ్చిందాన్ని నువ్వెలా తీసేస్తావు? తన ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకోవడమే కాదా!"

'తెల్వదు మేంసాహిబా! మా తల్లులు మాకు ఖట్నా చేస్తే, మేం మా పిల్లలకు చేయిస్తున్నాం. కూడదు అంటే కులం నుండి వెలి వేస్తారు" దుఃఖ పోతూ.. ఆ అపరిచిత.

'ఒకమారు తాను పీడిత! మరోమారు తానే పీడకురాలు! స్త్రీ జాతి తమకు తామే అన్యాయం చేసుకుంటున్నామనే స్పృహే లేదు." అప్పటి వరకు మౌనం వహించిన నేను, ఆవేశం ఆవహించి మాట్లాడకుండా ఉండలేక పోయాను.

'హృదయాల్లో కరుడు కట్టిన ఛాందస సంప్రదాయాల్ని వధించడం అంత సులువు కాదు. బదులుగా ఆడప్లిలలని బలి చేయడం తేలిక!" అస్మా.

'పాపాలను ప్రేరేపించే అవాంఛిత అధో మర్మాంగం, స్త్రీ కోర్కెల కూపం.. అది ఉండకూడదట!

తొలగిస్తేనే అది లొంగి ఉంటుందట! మగ దురహంకార భావ వికారం. స్పందనలు, కోరికలు లేని సెక్స్ బొమ్మలా పడి ఉండాలె, స్వేచ్ఛగా వాంఛలను వెలి బుచ్చకూడదనే ముసుగు... కుటిల కుట్ర.

'ఖలీఫా ఒప్పుకోడు!" మంత్రసాని ఓటమికి ముందు వదిలిన చివరి అస్త్రం.

'నేను ఒప్పిస్తా! రాజమహల్ పిలిపించి మాట్లాడుతా! 'కాదు, కూడదు' అంటే, రాజశాసనం వేయిస్తా!" అంటూ నీలోఫర్ దర్వాజా వైపు నడుస్తుంటే, ఊరికి పోయి తలుపులు తెరిచింది అపరిచిత.

కూతురు ఎడం చేయిని తన కుడిచేతి గుప్పిట పట్టుకుని, గుండెల్లో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని నింపుకుని, నిలోఫర్ అడుగు జాడల్ని అనుసరించింది ఆస్మా.

* * *

చిప్పిల్లిన కన్నీళ్లు కందువారిన కాగితాల్ని ఎక్కడ ఖరాబు చేస్తాయోనని కర్చీఫ్ ని సహాయ మడిగి,

డైరీ చదవడం పూర్తి చేశాడు ఆదిత్య.

సిస్టం ముందు కూర్చుని;

'హైదరాబాద్ కోహినూర్!

ఖట్నా దురాచారానికి పసిపిల్లలు బలి కాకూడదని కంకణం కట్టుకున్న ధీర నారి!

పరిచారిక రఫాతున్నీసా బేగం కాన్పు కాలంలో కాలం చేస్తే, నీలోఫర్ ప్రసూతి హాస్పిటల్ నిర్మాణానికి పూనుకున్న కరుణామయి!

హిజాబ్ ధరించని స్వేచ్ఛా ప్రియ!

నిజాం కోడలుగా హైదరాబాద్ను మెట్టినిల్లు చేసుకుని, ఎడ్వర్డ్ పోప్ రెండో భార్యగా అమెరికాలో నివసించి, ఫ్రాన్స్ బాబిగ్ని సిమెట్రీ లో కలలు లేని పంచశయనం ఎంచుకుంది!.' అంటూ మదిలో రూపుదిద్దుకుంటున్న రచనకు అక్షర రూపం ఇస్తూ, లీడ్ ను టైప్ చేయడం షురూ చేసాడు.

***

**పిన్నంశెట్టి కిషన్**

మానవీయ దృక్పథం తో సాహిత్య సృజన చేస్తున్న పిన్నంశెట్టి కిషన్ 8 ఫిబ్రవరి, 1962 న వేములవాడ లో జన్మించారు. తండ్రి: అచల పరిపూర్ణ శ్రీకరానంద పిన్నంశెట్టి చెన్నయ్య. తల్లి: శ్రీమతి మంచె లక్ష్మీభాయ్. ఎం. ఏ., బీఎడ్., చదివి తూనికలుకొలతలు శాఖ అధికారిగా పదవీ విరమణ చేశారు. దాదాపు అరవై కథలు, వందకు పైగా కవితలు, కొన్ని విమర్శనా వ్యాసాలు రాశారు. 'లేంబాళ వాటిక కథలు' కథా సంపుటి, 'నల్ల పద్యం' కవితా సంపుటి ప్రచురించబడింది. లేంబాళ వాటిక కథలకు గూడూరి సీతారాం కథా పురస్కారం2024 మరియు పీచర సునీతా రావు స్మారక సాహిత్య పురస్కారం2025 లభించాయి.

**సెల్: 9700230310**

# సిగ్గు ! సిగ్గు సిగ్గు !!



**సింహ ప్రసాద్**

కురుసభలో గాలి గుబులు గుబులుగా చూస్తోంది.

కౌరవ పాండవులే కాదు, కురువృద్ధులు, గురువులు, మంత్రులు, సామంతులు, సభికులు యావత్తు ఉత్కంఠతో ఊగిపోతూ ఊపిరి బిగబట్టారు.

'ఇప్పుడేం జరుగుతుంది ?' అనే ఉత్కంఠ అందరి రక్తనాళాల్లో అలజడి సృష్టిస్తోంది.

శకుని గడ్డం నిమురుకుంటూ తమరి తదుపరి ఎత్తు ఏమిటని ధర్మరాజు వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

ధర్మరాజు అవమాన భారంతో కృంగిపోతూ దిక్కు తోచక కొట్టుమిట్టాడుతున్నాడు.

జూదంలో రాజ్యసంపద పోయింది. పాండవ సోదరుల వస్త్రాలు, అస్త్రాలు తప్ప ఆభరణాలూ పరాధీనమయ్యాయి. ఐదుగురు అన్నదమ్ములూ తమని తాము పోగొట్టుకున్నారు!

'ఇదంతా శకుని మామ కుట్ర. ఇది మాయా జూదం. ఇది చెల్లదు' ఉక్రోషపడ్డాడు సహదేవుడు.

మందహాసాన్ని సాగదీసి నవ్వాడు శకుని. 'అసలు జూదమే ఒక మాయ చిన్నల్లుడూ!'

''కబుర్లతో కాలయాపన చేయొద్దు. వారి వద్ద విలువైనవి ఏమి ఉన్నా జూదంలో కాయవచ్చని చెప్పు మామా . వెలలేనివి అయినా, ఈ బానిసలకు వ్యర్థమైనవి అయినా మమ్ము చేరి శోభించేవీ, మమ్ము ఆనందపరిచేవీ ఏవి అయినా సరే ఒడ్డవచ్చు!' మీసం మెలి తిప్పుతూ ఉచ్చైస్వరంతో అన్నాడు సుయోధనుడు.

'ఇంకేం మిగిలిందనీ !' నిట్టూర్చాడు భీమసేనుడు.

'తొందరపడకు భీమసేనా . వెలది ఉండగా ఎవరూ వెలవెలబోరు. వెలలేని వారు అసలే కారు! '

శకుని మాటలకు, తేలుకొండె నవ్వుకు సభ ఉలిక్కిపడింది.

'పాంచాలి! లెస్సగా గుర్తు చేసితివి మామా. పడతిని పందెం కాసి రాజ్యాధికారం, పరువు తిరిగి దక్కించుకోవచ్చు! ' చిత్రంగా నవ్వాడు సుయోధనుడు.

''ఇంకే దిక్కూ లేదు..!' హేళనగా అన్నాడు దుశ్శాసనుడు.

నలుగురు అన్నదమ్ములూ కలవరపడుతూ ధర్మరాజు వంక చూశారు. అతడి

మోములో ఎలాంటి భావం ద్యోతకం కాలేదు.

'మీ రాజకీయక్రీడలోకి అంత:పుర స్త్రీని లాగొద్దు!' ఆవేశపడ్డాడు అర్జునుడు.

'అది నిన్నటి మాట. నేడామె బానిసల బానిస!' కసిగా నొక్కి చెప్పాడు కర్ణుడు.

'అహహ, కేవలం సూచన చేస్తున్నానంతే . ధర్మ సూక్ష్మములు తెలిసిన ధర్మ రాజుకి పట్టమహిషి సొంత ఆస్తేనని గుర్తు చేస్తున్నా. ఏమో, ఆమె మీ భాగ్యరేఖ కావచ్చు. కోల్పోయిన సమస్తసంపదనూ తిరిగి చేజిక్కింప చేయవచ్చు!' గడ్డం సవరించుకున్నాడు శకుని.

'అభిమానవతి ద్రౌపదిని జూద వస్తువు చేయొద్దు అన్నా!' ప్రాధేయపడ్డాడు నకులుడు.

''వూ( పిరికి మాట చిన్నల్లుడూ . మీరు మహారాజులు అయితే ఆమె పట్టపు రాణి. మీరు దాసులైతే తను దాసి. ఆమెకా దుర్గతి పట్టకూడదంటే విజ్ఞతతో యోచించి చక్కని ఎత్తు వేయి ధర్మజా! విజయం నిన్నే చూస్తోంది. రెండు చేతులతో ఆహ్వానించు!' పురిగొల్పాడు.

'ఇంకా ఎంతసేపు? త్వరత్వరగా కానీయండి' ఆలస్యం మరి భరించలేకుండా వున్నాడు దుశ్శాసనుడు.

'ఆగండి ..' ధృతరాష్ట్రుడి పక్కనే ఆసీనుడైన విదురుడు వారించాడు గాని ఆసరికే ఆలస్యమైంది. ధర్మరాజు ద్రౌపదిని జూదంలో కాచేశాడు!

దుర్యోధన దుశ్శాసన కర్ణాదులు పరమానందంతో ఊగిపోయారు.

'మామా, మా భోగం వైభోగం, మా గర్వం ఆనందం, మా పగ ప్రతీకారం సమస్తమూ ఇప్పుడు నీ పాచికల్లోనే ఉన్నాయి. మమ్ము ఏ దరికి చేరుస్తావో!' లేని అనుమానం వ్యక్తపరిచాడు దుర్యోధనుడు.

'ధర్మజుడు జూదక్రీడా నేర్పరి. అతని ముందు నా పాచికలు పారతాయో లేదో!' భయం నటించాడు శకుని.

పాండవులు ఓడిపోకూడదని సభలోని కొందరు మనసులోనే ప్రార్థించారు కానీ, పాండవాగ్రజుడు ద్రౌపదినీ కోల్పోయాడు !

దుర్యోధనాదులు విజయోత్సాహంతో పొంగిపోయారు. మీసాలు దువ్వుకున్నారు.

దిగాలు పడిన పాండవులను చూసి కలవరపడ్డాడు విదురుడు 'మీ ఎదుటే మీ సభలోనే మహాపరాధం జరిగిపోయింది మహారాజా!' ధృతరాష్ట్రుడితో డగ్గుత్తికతో చెప్పాడు.

'జూదంలో గెలుపోటములు సర్వసాధారణం. ఒకేసారి ఇద్దరూ గెలవలేరు. ఒకరు గెలవాలంటే రెండో వారు ఓడాల్సిందే!' తాపీగా సెలవిచ్చాడు ధృతరాష్ట్రుడు.

అతని ముఖంలో వింత ఆనందం, తృప్తి తాలూకు వెలుగు కనిపించి మ్రాన్పడిపోయాడు విదురుడు.

'దుశ్శాసనా, మనం ఎదురు చూస్తున్న క్షణాలు మన అరచేతిలోకి వచ్చి పడ్డాయి. ఇంకా చూస్తావేం ? జూలు విదిలించు. మన దాసి ఆ పంచభర్తృకను తీసుకునిరా, కౌరవుల వైభోగం, పాండవుల దౌర్భాగ్యం కనులారా తిలకిస్తుంది !'

దుర్యోధనుడి మాటలకు భీముడు రోషంతో మండుతూ గద అందుకోబోతే కళ్ళతో వారించాడు ధర్మరాజు. కుత కుత ఉడికిపోతూండిపోయాడు.

వికటాట్ట హాసం చేస్తూ దుశ్శాసనుడు అంత:పురంలోకి దూసుకెళ్లాడు. కురులు ఆరబెట్టుకుంటున్న ద్రౌపది చేయి పట్టుకోబోతే ఆమె ఒక్క అడుగు వెనక్కు వేసి నిప్పులు కక్కుతూ చూసింది. ' ఆగు! నా చేయి పట్టుకుంటే నీ ముంజేయి ఖండింపబడుతుంది, జాగ్రత్త!'

అగ్నిగోళాల్లా ఉన్న ఆమె కళ్ళు చూసి అతడి గుండెలు భీతిల్లాయి. క్షణకాలమే. మరుక్షణమే పెద్ద పెట్టున నవ్వి, 'నీ మొగుళ్లే చచ్చిన మత్తేభాలయ్యారు. ఆడదానివి ఇక నువ్వెంతే !' అంటూ ఆమె జుట్టు పట్టుకుని రాజ్యసభలోకి ఈడ్చుకొచ్చాడు.

సభలోని ప్రముఖులు దిగ్భ్రమతో ఆసనాల మీంచి దిగ్గున లేచారు. పిమ్మట యువరాజు సుయోధనుడి వంక చూశారు. అతడు గర్వాతిశయంతో నవ్వుతూ మీసం మెలేస్తున్నాడు. తమ చేష్ట అతడికి ఆగ్రహం తెప్పిస్తుందేమోనని భయమేసింది . ఉత్తర క్షణాన మౌనంగా ఆసీనులయ్యారు .

దుశ్యాసనుడ్ని విదిలించి కొట్టింది ద్రౌపది. భర్తల వంక ఆగ్రహంగా చూసింది. ఆమె వంక చూసే దమ్ము, ధైర్యం లేక తలలు దించుకునే ఉన్నారు. పరిస్థితి ఆకళింపు చేసుకుంది.

'ఇదెక్కడి ఘోరం! మహారాణి, పరిచారికలు తప్ప మరెవరికీ ప్రవేశం లేని కురుసభలోకి ఒక అంతఃపుర స్త్రీని పశుబలంతో ఈడ్చుకొస్తారా! ఇదెక్కడి న్యాయం మహారాజా! ఒక కులస్త్రీకి ఎంతటి దురవస్థ కల్పించారో చూడండి!'

సుయోధనుడు బిగ్గరగా నవ్వాడు. 'ఇప్పుడా కులస్త్రీయే మా ప్రియ పరిచారిక. మా సేవార్థమే సభకు రప్పించాం!'

'మీకు నా మీద అధికారం ఎవరిచ్చారు?'

'ఇవ్వలేదు లాక్కున్నాం. ఇంకా అర్థం కాకపోతే అదిగో ఆ ధర్మజుడినే అడుగు. అతగాడు నిన్ను జూదంలో ఒడ్డాడు. ఓడాడు . ఇది పాచికల నిష్పక్షపాతపు తీర్పు! ఆదేశం!!'

'ఒడ్డడానికి నేనేమీ ప్రాణం లేని వస్తువును, ఆస్తిని కాదే. ప్రత్యేక ఉనికి అస్తిత్వం గల స్త్రీని. పతి అయినంత మాత్రాన అతడికి నా మీద సంపూర్ణాధికారం ఎలా సంక్రమిస్తుంది? భీష్మ ద్రోణ విదురాది మహామహులున్న ఈ సభను సూటిగా ప్రశ్నిస్తున్నాను. నాకు సమాధానం కావాలి!' గర్జించింది ద్రౌపది.

సభ నివ్వెర పోయింది. అయోమయంగా, ఆందోళనగా చూసింది.

''నీ కంఠశోష తప్ప ఎవరూ పెదవి విప్పరు. ధర్మరాజు జూదధర్మానుసారమే రాజ్యాన్ని, సోదరులను, కడకు తననూ ఓడగొట్టుకున్నాడు. ఇక మిగిలిన ఆఖరి ఆశ, అస్త్రం అయిన నిన్నూ ...!' ఆ పై మాటలు చేతి సైగలతో పూర్తి చేశాడు శకుని.

రోషం చిమ్మింది. 'తన్నోడి నన్నోడెనా, నన్నోడి తన్నోడెనా!' నిలదీసింది ద్రౌపది.

తికమక పడ్డాడు. ఆ పైన కంగారుపడ్డాడు . వివరించి చెప్పగల విజ్ఞత, జ్ఞానం అతడికి లేవు !

'ద్రౌపదీ, నువ్వు బానిసల బానిసవి. పాండు పుత్రులతో పాటు నువ్వూ మా దాసాను దాసురాలివే. వితండవాదాలు, కుతర్కాలు వద్దు. రా. మా అంకసీమను అలంకరించు. మమ్మ అలరించు. ఆనందింపజేయి. మా రసికత ఏపాటిదో చవి చూపిస్తాం !' మదోన్మత్తుడై అన్నాడు దుర్యోధనుడు.

''మహారాజా, పట్టపగలు రాజసభలో ఈ నక్కల ఊళలేమిటి! ఆ పిశాచ ప్రేలాపనలేమిటి! దీన్ని మీరెలా సహిస్తున్నారు!' మహారాజు ముందుకెళ్లి మరీ అడిగింది ద్రౌపది. ధృతరాష్ట్రుడే కాదు గాంధారీ చెవిటివారై పోయారు!

'చాలించు నీ వాచాలత్వం! దుశ్శాసనా, ఈ బానిసస్త్రీ పరుష పదజాలం భరింపజాలనిది. ఈమె పొగరు అణచాలి. మా ప్రతీకారాగ్ని చల్లారాలి. ఇప్పుడే ఇక్కడే తిరుగులేని మా అధికారం, ఆదిక్యత నిరూపించబడాలి. ఈ పంచ పాండవులు చూస్తుండగానే నిండు సభలో ఆమె వస్త్రాలు ఒలిచి పరాభవించు. మన శౌర్య పరాక్రమాలు చాటించు!'

దుశ్శాసనుడు రెచ్చిపోయాడు. ద్రౌపది కొంగు పట్టుకుని బలంగా లాగాడు. సగం చీర చిరిగి అతడి చేతిలోకి వచ్చింది. మిగతా భాగాన్ని గట్టిగా పట్టుకుని, కన్నీరు మున్నీరవుతూ, 'మీ మీ కుల, తెగ, జాతి, మత ఆదిపత్యాన్ని, అహంకారాన్ని నిరూపించుకోవడానికి ఆడదాన్ని సమిధను చేయాలా! అలా తప్ప ఇంకోలా వాటిని ప్రకటించుకోలేరా? ఎంత అమానుషం! ఎంత రాక్షసత్వం!' ఆక్రోశించింది.

దుర్యోధనాదులు హేళనగా నవ్వారు. వెక్కిరిస్తూ నవ్వారు. వినోదిస్తూ నవ్వారు.

రగిలిపోయిందామె . 'ఎందరో జ్ఞానులు, జ్ఞానవృద్ధులు ఉన్న ఈ సభలో ఈ ఘోర కలిని ఆపగల వారు ఒక్కరూ లేరా! ఈ కురు సామ్రాజ్యం ఇంత జ్ఞానసంస్కారహీనురాలయిందా!'

ఓ క్షణానంతరం ఒక నిశ్చయానికి వచ్చి స్వరం పెంచింది.

''ధృతరాష్ట్ర మహారాజా ! ఈ దుర్మార్గం మీరు చూడలేరు. నేను చేస్తున్న ఆర్తనాదాలు మీ కర్ణపుటాలను ఛేదిస్తున్నా మీరు ఏమీ పట్టనట్టు శిలలా ఎలా ఉండగలుగుతున్నారు?'

విదురుడు బాధాతప్తుడయ్యాడు. ' వీరెవరూ నిన్ను ఆదుకోలేరు. ఈ ఆపద నుంచి నిన్ను రక్షించగలవాడు శ్రీకృష్ణుడు ఒక్కడే. అతన్ని అర్థించు!'

'ఏం ? నీతులు వల్లించే ధర్మ విదురులకు వాక్కు లేదా! పాలకులకు విచక్షణ బోధించి

ఈ ఘోర అకృత్యాన్ని ఆపలేరా! సభలోని యోధాను యోధులకు మీసాలు రోషాలు లేవా! రక్షణ సిబ్బందికి చేతులు చచ్చు పడ్డాయా! అక్షౌహిణీల సైన్యం మేస్తూ కూర్చోడానికేనా! అపారబలం ఉన్నా ఒక్క మహిళ సిగ్గును ఈ మానవమృగాల బారి నుంచి రక్షించలేరా!'

'అహ అలా అని కాదు. కృష్ణ భగవానుడు నీ సోదరుడు...... ''

'దాని తాత్పర్యం ఇక్కడ నాకు సోదరులు లేరు. సోదర సమానులు లేరు. నన్ను సోదరిగా భావించేవారూ లేరు. ఒక పౌరురాలిగా భావించి అయినా ఆపన్న హస్తం అందించగల రక్షకులు ఒక్కరూ లేరన్న మాట! ఇది రాజసభా ఘోరారణ్యమా!'

'నన్ను అపార్థం చేసుకోకు ద్రౌపదీ. పరిస్థితి అర్థం చేసుకో. కృష్ణుడి కోసం ప్రార్థించు. ఎక్కడ ఎలా ఉన్నా నీకోసం పరుగు పరుగున వస్తాడు. ఈ గండం గట్టెక్కిస్తాడు' అనునయంగా చెప్పాడు విదురుడు.

'ఒక మగవాడు మగువ మానాన్ని భగ్నం చేస్తుంటే, మరో మగవాడే ఆమె అభిమానధనాన్ని కాపాడగలడంటారు. క్షమించండి. నాకోసం ఏ కృష్ణుడూ రానవసరం లేదు. నన్ను చెరబెట్టాలని చూస్తున్న ఈ కామాతురుల నుంచి, ఈ మృగాళ్ల నుంచి నన్ను నేను కాపుకాచుకో గలను !'

చివ్వున తలెత్తాడు ధర్మరాజు 'ద్రౌపదీ, సభా మర్యాద పాటించు!'

'హు. ఈ సభ నాకేం మర్యాద ఇచ్చింది. ఇంకే మర్యాద మిగిల్చింది గనుక! '

'సిగ్గులేని బతుకు !' ఈసడించాడు దుర్యోధనుడు. హేళన చేశాడు కర్ణుడు.

'సూతపుత్రుడివని పరిహసిస్తున్నారంటూ వాపోయిన నువ్వా నవ్వుతున్నావా కర్ణా . ఎప్పుడు ఎలా మసలాలో ఎవరితో ఎలా వ్యవహరించాలో తెలిసిన వారే మాన్యులవుతారు తప్ప, ఊరికే వచ్చి పడిన దాన్ని పందేరాలు చేసినంత మాత్రాన కాదు!'

అతడి మొహం లోని రక్తమంతా అమాంతం ఇంకిపోయింది.

''దుశ్శాసనా! వూ కానియ్! ' సభ దద్దరిల్లేలా అరిచాడు సుయోధనుడు.

దుశ్శాసనుడు విసురుగా ద్రౌపది మీదికి వెళ్లి ఆమె ఒంటిమీద మిగిలి ఉన్న చీరను లాగిపారేసి పెద్ద విజయం సాధించినట్టు బిగ్గరగా నవ్వాడు.

వక్షాన్ని చేతులతో దాచుకుంటూ లోదుస్తులతో మిగిలిపోయింది. భయవిహ్వలయై సభని కలయ చూసింది. ఒక్కరూ ముందుకు రాలేదు. ఒక్క వస్త్రమూ తెచ్చి కప్పలేదు.

ఆమె భ్రమలు తొలగిపోయాయి. తెగింపు వచ్చింది. వక్షం మీది చేతులు తీసేసింది.

ఎన్నో కళ్ళు ఆబగా చూసాయి. ''అవి మాత్రం ఎందుకే' వెకిలిగా నవ్వుతూ ఆమె మీదికి వచ్చాడు దుశ్శాసనుడు.

''మీ సంస్కారం ఎంతగా దిగజారిందో, మీరెందుకు వీటినీ చించేయాలనుకుంటున్నారో నేను ఊహించగలను. సిగ్గుతో చితికి చావాల్సింది మీరు గాని నేను కాదు!' అంటూ లో దుస్తులు పీకి అతడి మీదకు విసిరేసింది.

సభ మధ్యలో నగ్నంగా రూపు దాల్చిన ధిక్కారంలా నిలబడింది ద్రౌపది!

'చూడండి. అంతా కళ్ళు చించుకుని చూడండి. దొంగ చూపులు వదిలి నిర్లజ్జగా ఈ స్త్రీ దేహం ఎలా ఉందో ఆబగా చూడండి. మీ తల్లులకు తోబట్టువులకు భార్యలకు కూతుళ్ళకు లేనివి నాలో అదనంగా ఏమున్నాయో చూడండి. మీ అమ్మ మిమ్మల్ని కన్న మీ జన్మస్థానాన్ని చూడండి. మీకు పాలిచ్చి ఇంతటి వాళ్ళని చేసిన పాలిండ్లను చూడండి. ఇది రాజసభ కాదు, కాముక సభ. కామ క్రీడా వినోద ప్రదేశం......!'

''కుసంస్కారిలా ప్రవర్తించకు ద్రౌపదీ !'' దిగ్గున లేచి అన్నాడు ద్రోణుడు.

'మీ శిష్యుల అరాచకత్వం చూశారుగా. గురి చూసి కొట్టడంతో పాటు కొంచెం సంస్కారమూ నేర్పి ఉంటే వీరిలా కామోన్మాదులయ్యేవారు కాదు. ఇందులో మీ పాపమూ ఉంది ఆచార్యవర్యా !'

శరీరం స్వాధీనం తప్పి వణుకుతుంటే కూలబడ్డాడు.

సభలో కలకలం లేచింది. ' ఘోరం, దారుణం, అయ్యో అయ్యో ఆడకూతురు....!' అంటూ జనం చేస్తున్న వ్యాఖ్యానాలు, విసురుతున్న మాటలు సభను వేడెక్కించి భావోద్వేగాలు రగిలిస్తున్నాయి

ధృతరాష్ట్రుడు భయపడిపోయాడు. 'విదురా, ఏం జరుగుతోంది? భీముడు నా ప్రియ పుత్రుడికి హాని తలపెట్టలేదు కదా!'

'లేదు మహారాజా. పాండవపత్ని వివస్త్రయై నగ్నంగా నిలబడింది..!' కన్నీరు తుడుచుకుంటూ చెప్పాడు.

'అయ్యో అయ్యో! అంతటి ఘోర పాపానికి ఒడిగట్టిందెవరు ?' గాంధారి గాభరా పడింది.

'స్వచ్ఛందంగా వలువలు ఒలుచుకుని తన నిరసన ప్రకటించింది! నాగరిక సమాజపు ముఖం మీద కాండ్రించి ఊసింది !'

ద్రౌపది తీవ్రస్వరం కంగుమంది. 'మహారాణీ, మీ సుపుత్రుడు నా శేష వస్త్రాన్నీ ఒలవబోతుంటే నా స్వహస్తాలతో తీసిచ్చాను. మీరు మహారాణే . కానీ మీరేమీ నిరోధించలేరు. కల్పించుకోలేరు. అసలు మీ పదవే ఓ అలంకారం. కనీస ఖండనలూ చేయలేని దుస్థితి మీది. ఏమైనా అదృష్టవంతులు. మీ కృత్రిమ సంతానపు వికృత క్రీడలు చూడాల్సి రాకుండా ముందుగానే కళ్లకు గంతలు కట్టుకున్నారు!'

'ద్రౌపదీ, ఇంక చాలించు. మహారాణితో అలాగేనా వ్యవహరించేది!' కోప్పడ్డాడు ధృతరాష్ట్రుడు..

'మహారాజుల వారు నగ్నస్త్రీ స్వరూపాన్ని దర్శించలేకపోతున్నాననే దుగ్ధతో ఆగ్రహ

పడుతున్నట్టున్నారు. విదురులైనా కృష్ణ పరమాత్మను ప్రార్థించి కొద్ది సేపు వారి అంధత్వం తొలగింపచేస్తే బాగుండును!'

మరెవరూ నోరెత్త సాహసించలేక పోయారు.

జనంలో ఆవేశ కావేశాల బుస బుసలు వినిపించి దుర్యోధనుడు హుంకరించాడు. అంతా చప్పగా చల్లారిపోయారు.

'ద్రౌపది ఏదో అంటోంది. నాకేం వినబడడం లేదు' గొణిగాడు ధృతరాష్ట్రుడు .

''పాలకులు అంధులు, బధిరులు అయితే, వారి గుండెలు స్పందించడం తెలియని బండరాయిగా మారితే, జనగోడు, జనఘోష కనిపించవు, వినిపించవు, స్పందించవు! జనరోదన అరణ్య రోదనే అవుతుంది!"

''సిగ్గు శరం విడిచి నిర్లజ్జగా పదుగురు ఎదుట ఎలా నిలిచావు ద్రౌపదీ . తక్షణం వస్త్రాలు ధరించు!' గాంధారి హుంకరించింది.

'ఈ ద్రౌపదీ మానభంగం ద్రౌపదికి అవమానం, పరాభవం కాదు. మీకు, మీ సభకు అవమానం . మీ సంస్కృతికి మీ జాతికి మీ రాజ్యానికి ఘోరకళంకం ! ఒక మహిళను పరాభవించడమే, వస్త్రాలు చించి నగ్నంగా నిలబెట్టడమే వీరత్వం శూరత్వం అనుకునే మగవాళ్ళు, అలాంటి జాతి, అలాంటి రాజ్యం ఎల్లకాలం నిలవవు . మట్టి కొట్టుకుపోతాయి . ఆ జాతి నిర్వీర్యమై నశించిపోతుంది. పోవాలి. ఇదే నా శాపం!'

'ఆగాగు ద్రోపదీ . తొందరపడకు. కళ్లెదుట ఘోరం జరుగుతుంటే కళ్ళున్నవారైనా మాకెందుకు చెప్పలేదు? ఏం విదురా!'

'చెప్పరు. రాజును పొగిడి బిరుదులు సత్కారాలు పొందటమే వీరికి తెలుసు. తప్పు చేసిన రాజుని వేలెత్తి చూపగల చేవ, ధైర్యం వీరికి లేవు . ఉన్నా మీకు కనిపించదు. మీరు అంధులు. మీకు వినిపించదు. మీ చెవుల్లో సీసం పోసుకున్నారు. మీ అధికార వారసులకు అధికారం కావాలి గాని జనక్షేమం, జనభద్రత అవసరం లేదు. ఇక మీకూ మీ పాలనకూ ఓ దండం. సంస్కారహీనమైన ఈ సభను బహిష్కరిస్తున్నా !''

ఆమె వెళ్లబోతుంటే భీష్ముడు లేచాడు 'వివస్త్రగా వీధుల్లోకి వెళ్లి కులగౌరవం మంట గలపకు ద్రౌపదీ . ఆవేశం అనర్ధదాయకం......!' అంటూ ఏదో చెప్పబోతోంటే ఆగమని సైగ చేసింది ద్రౌపది

' ఇంత దాకా మౌనంతో రాక్షసకృత్యానికి అర్ధాంగీకారం తెలిపిన తమరు మీ కొంగజపం కొనసాగిస్తేనే మంచిది భీష్మ పితామహా!'

ఆయన నోరు పడిపోయింది. నీరసంగా కూలబడ్డాడు.

ఆమె తన ముందు నుంచి వెళుతుంటే ధర్మరాజు కీచు గొంతుతో, 'ద్రౌపదీ, క్ష ...... ' అన్నాడో లేదో ఆమె చూపుల చురకత్తులు అతని నాలుక తెగ్గోసాయి. ఆ పై అక్షరాలు గొంతులోనే సమాధి అయ్యాయి.

'జనాన్ని వారి కర్మకు వదిలేసి వ్యక్తిగత ప్రతిష్ఠే పరమావధి అయిన వారు, వ్యసన

పరులు, అధికార వ్యామోహులు పాలకులుగా ఉండదగరు. వారు ఓడిపోవడమే ధర్మం!'

అతడి శిరస్సు నేలకు ఒరిగిపోయింది!

'ఈ రాజ్యం కౌరవులదా పాండవులదా అన్నది నాకు అనవసరం. రాజు ఎవరన్నదీ నాకు అవసరం లేదు. ఒక స్త్రీకి రక్షణ కల్పించలేని, భద్రత కల్పించలేని, భరోసా ఇవ్వలేని ఇలాంటి రాజ్యంలో నాకు ఊపిరాడదు. ఒక్క క్షణమూ నేనిక్కడ ఉండలేను!'

ఆమె వడి వడిగా అడుగులేస్తుంటే ఎర్రబడిన ముఖంతో, 'ఆపండి' అరిచాడు దుర్యోధనుడు. ఒక్క భటుడూ నిలుచున్నా చోటునుంచి కదల్లేదు!

'దుర్యోధనా, నేనెవరికీ బానిసని కాదు. ఏ అహంకారి ముందూ తలవంచను . ప్రకృతిని బంధిస్తే నీ భవిత వికృతిగా మారుతుంది జాగ్రత్త! నేనిలాగే రహదారుల వెంట జనంలోకి వెళతాను. మీ రాక్షస క్రీడ, నా నగ్న ఊరేగింపు శతాబ్దాలుగా మహిళల మీద సాగుతున్న హింసకు సాక్షీభూతంగా చరిత్రలో నిలిచిపోతాయి . ఇది జాతి నుదుట చెరగని మచ్చగా, మీ రాక్షసపాలనకు సాక్ష్యంగా ఎప్పటికీ నిలిచే ఉంటుంది. ఇక మీది మానవజాతో రాక్షసదళమో మీరే తేల్చుకోండి!'

ఆత్మాభిమానపు పతాకలా రెపరెపలాడుతూ నిటారుగా నడుస్తూ విసురుగా సభలోంచి.. ద్వారం దాటుకుని.... జనపథంలోకి వెళ్ళిపోయింది ద్రౌపది!

సభలోని ఒక్కరి ఒంట్లోనూ చీమూ నెత్తురూ లేవు! సిగ్గూ లేదు !!

***

**సింహ ప్రసాద్**

మణిపురి ఘటనలు కలచి వేస్తే, ఉన్నత స్థానాల్లోని వారి మౌనం రచయితను ఆవేశ పరిచింది. ఆ ఫలితమే ఈ కథ ! రచయిత సింహప్రసాద్ సాహిత్య ప్రస్థానం 1973 లో ప్రారంభమైంది. ఇంతవరకు 556 కథలు, 76 నవలలు, 9 నాటకాలు రాశారు. వాటిలో 163 కథలకు, 24 నవలలకు, 9 నాటకాలకు, కొన్ని కవితలకు బహుమతులు పొందారు. ఇవేగాక వివాహవేదం, తిరుమల దివ్యక్షేత్రం, శ్రీరాముడి ధర్మపథం గ్రంథాలకు ప్రముఖుల ప్రశంసలు పొందారు. 51 కథలు, 4 నవలలు, వివాహ వేదం ఇతర భాషల్లోకి అనువదింపబడినవి. జీవిత సాఫల్యపురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారంతోపాటు ఎన్నో అవార్డులు రివార్డలు అందుకున్నారు.



# మంచి మనసుకు మంచి రోజులు

**సి.ఎన్.చంద్రశేఖర్**

'శిరీషా! నీతో ఓ విషయం మాట్లాడాలి' కూతురితో అన్నాడు రమేష్.

'చెప్పండి నాన్నా?' తండ్రి కూర్చున్న కుర్చీకి దగ్గరగా మరో కుర్చీ లాక్కొని కూర్చుంటూ అంది శిరీష.

' శ్రీనివాస్ , రేవతి సాయంత్రం మనింటికి వచ్చారు. చంద్రాన్ని నీకిచ్చి పెళ్ళిచెయ్యాలని ఉందని, మన అభిప్రాయం చెప్పమని అడిగారు. ప్రభాకర్ కూడా నాలుగురోజుల క్రితం నాకు ఫోన్ చేసి 'శిరీషకు పెళ్ళిసంబంధాలు చూస్తున్నావా? శిరీషని మా ప్రకాష్కిచ్చి చేస్తే ఎలా ఉంటుందో ఆలోచించు. అఫ్కోర్స్ శిరీషకు ఇష్టమయితేనే!' అన్నాడు. ఇద్దరూ నాకు ఆప్త మిత్రులే. ఎవరికి అవునని చెప్పాలో ,ఎవరికి కాదని చెప్పాలో తెలియడం లేదు. అందుకే నిర్ణయం నీకే వదిలేస్తున్నాను. చంద్రంతో, ప్రకాష్ తో నీకు మంచి స్నేహం కూడా ఉంది. కాబట్టి వారి గురించి నాకంటే నీకే ఎక్కువ తెలుసు. ఇద్దరినీ కాదన్నా ఇబ్బంది లేదు. నీ ఇష్టానికే మా ప్రాధాన్యత' అన్నాడు.

'నాకు ఓ వారం రోజులు సమయం ఇవ్వండి నాన్నా!'

'తప్పకుండా..తొందరేం లేదు'

ఆరోజు రాత్రి మంచంపై పడుకుని ఆలోచించసాగింది శిరీష.

ప్రకాష్ అందగాడు. అతని తండ్రి కోటీశ్వరుడు, బిజినెస్మ్యాన్. ప్రకాష్ వారికి ఒక్కడే సంతానం. ప్రకాష్ బి.కాం.పూర్తిచేశాక సి.ఎ.చేస్తున్నాడు. తండ్రి దగ్గర బిజినెస్ పాఠాలు నేర్చుకుంటున్నాడు. ఎప్పుడూ ఆంగ్లంలోనే సంభాషణ జరుపుతాడు. కార్లలోనే తిరుగుతాడు.

' చంద్రం కూడా ఓ మోస్తరు అందగాడే. బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం చేస్తాడు. అతనికి ఓ తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. జాలిగుండె. సాయంచేసే మనసు, బాధ్యతల్ని పంచుకునే గుణం అతనికున్నాయి. కొంత భావుకత్వం, కాబోయే భార్య విషయంలో కొన్ని ఆశలు, ఆలోచనలు ఉన్నవాడు.

మొదటి మూడురోజులూ ఆమె మనసు ప్రకాష్ వైపే మ్రొగ్గింది. తర్వాత చంద్రం పట్ల ప్రకాష్ప్రవర్తించిన కొన్ని సన్నివేశాలు గుర్తుకొచ్చాయి ఆమెకి.

***

కాలేజీలో చదువుకుంటున్నప్పుడు ఓ సారి సినిమాకు వెళ్ళాలని స్నేహితులు ప్లాన్ చేశారు. శిరీష, చంద్రం, చంద్రం చెల్లెలు రమ , ప్రకాష్ ఒకే ఏరియాలో ఉంటున్నారు కనుక తాము నలుగురూ ప్రకాష్ కారులో థియేటర్ చేరుకోవాలని అనుకున్నారు. చంద్రం రెడీ అయి రాగానే 'అదేమిటి..నీ డ్రెస్ అలా ఉంది. ఇంకో డ్రెస్ వేసుకురా!' అన్నాడు ప్రకాష్.

'నాకున్న డ్రెస్సుల్లో ఇదే బెస్ట్' అన్నాడు చంద్రం నవ్వుతూ.

'నా ప్రక్కన నువ్వు ఇలాంటి డ్రెస్లో కనిపిస్తే నా ప్రిస్టేజ్ ఏం కాను. కమాన్...మా ఇంటికెళదాం. నా డ్రెస్ ఇస్తాను..వేసుకుందువు గానీ!' కారు స్టార్ట్ చేస్తూ అన్నాడు ప్రకాష్.

'నా డ్రెస్ వల్ల నీ గౌరవం పోయేపక్షంలో మీరు కారులో వెళ్ళండి. నేను నా సైకిల్మీద వస్తాను. థియేటర్లో కూడా నేను దూరంగానే కూర్చుంటాను' అన్నాడు చంద్రం. అలా అంటున్నప్పుడు అతని కంట్లో నీరు తిరగడం గమనించింది .

తర్వాత శిరీష కల్పించుకుని ప్రకాష్ని చిన్నగా మందలించి, చంద్రాన్ని ఒప్పించిన తర్వాత సినిమాకెళ్ళారు.

మరొకసారి శిరీష ప్రకాష్ ఇంట్లో కూర్చుని అక్కౌంటింగ్లో తనకున్న సందేహాలను ప్రకాష్ని అడిగి నివృత్తి చేసుకోసాగింది. కొంత సేపటికి చంద్రం వచ్చాడు అక్కడికి. శిరీష, ప్రకాష్ చదివేది బి.కాం. అయితే చంద్రం బి.ఎస్.సి. అతనికి అక్కౌంటింగ్ గురించి తెలియదు. అందుకే అతను కొంత దూరంలో కూర్చుని అక్కడున్న పుస్తకాలను తిరగేయసాగాడు.

అక్కడున్న ఓ సావనీర్లో ప్రకాష్ ఫోటో కనిపించింది అతనికి. ప్రకాష్ తండ్రికి బిజినెస్లో ఏదో అవార్డు వస్తే, ఆయనకు ఆరోగ్యం బాగా లేకుంటే ప్రకాష్ ఢిల్లీ వెళ్ళి అవార్డు అందుకున్న ఫోటో అది.

'అరె! నువ్వు ఢిల్లీ ఎప్పుడెళ్ళావు?' ఆశ్చర్యంతో ప్రకాష్ని అడిగాడు చంద్రం.

'సండే ఫ్లైటులో వెళ్ళి మళ్ళీ సాయంత్రమే ఫ్లైటులో తిరిగి వచ్చేశాను' అంటూ చంద్రంకి దగ్గరున్న లైటును ఆర్పేశాడు ప్రకాష్.

చంద్రం ముఖం అవమానంతో కందిపోయింది. తమని డిస్టర్బ్ చెయ్యవద్దని ప్రకాష్ చెప్పిన పద్ధతి శిరీషకూ నచ్చలేదు. చంద్రాన్ని అలా చూస్తూంటే అతనిపై జాలి కలిగింది ఆమెకు. చంద్రం చివుక్కున లేచి వెళ్ళిపోయాడు. తర్వాత ప్రకాష్ తో చిన్న యుద్ధమే చేసింది శిరీష.

చంద్రం ఆంగ్లంలో సంభాషణ జరపలేదు. శిరీష తండ్రి ఆంగ్ల ఉపన్యాసకులు కాబట్టి ఆమెకు ఆంగ్లంలో మాట్లాడటం అలవాటయింది. ఇక ప్రకాష్ అయితే తెలుగులో మాట్లాడటమే తక్కువ.

ప్రకాష్ ఓరోజు చంద్రంతో ' నువ్వెందుకు ఇంగ్లీష్లో మాట్లాడాలంటే అంత

తడబడతావు. ఇంగ్లీష్ నేర్చుకో చంద్రం. రేపు ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ కెళ్ళినప్పుడు వాళ్ళు ఇంగ్లీషో ప్రశ్నలు అడిగితే బిత్తర చూపులు చూసే పరిస్థితి ఉండదు' అన్నాడు.

చంద్రం దెబ్బతిన్నట్లుగా చూశాడు ఓ క్షణం. తర్వాత అలాగేనన్నట్టు తలూపాడు.

ఓ రోజు శిరీష చంద్రం ఇంటికెళ్ళినప్పుడు అతను ఆంగ్లపేపరు 'హిందూ' చదువుతూ కనిపించాడు. అప్పటివరకూ తెలుగు పేపరు కొంటున్న చంద్రం 'హిందూ'కి ఎందుకు మారాడో ఆమెకి అర్థమైంది. తర్వాత ఓ రోజు రమ 'తన అన్నయ్య అద్దం ముందు నిలబడి ఆంగ్లంలో మాట్లాడుతూ ఉంటాడని' నవ్వుతూ చెప్పింది. క్రమంగా చంద్రం ఆంగ్లంలో పట్టు సాధించడమే కాదు, అనర్గళంగా మాట్లాడసాగాడు కూడా.

ఓసారి శిరీష చదువుతున్న కాలేజికి, మరో కాలేజికి మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతూంది. ప్రకాష్ వీళ్ళ కాలేజి టీమ్ కేప్టన్. బ్యాట్స్మెన్ కొట్టిన ఓ బంతి బౌండరీ లైను వైపు పోతూంటే చంద్రం ఆ బంతిని ఆపడానికి పరుగెత్తాడు. అయితే అతను బంతిని చేరేలోగా ఆ బంతి బౌండరీ లైను దాటేసింది. వెంటనే ప్రకాష్ పెవిలియన్లో ఉన్న మరో ఆటగాణ్ణి పిలిపించి, చంద్రాన్ని బయటికి పంపేశాడు.

నాలుగురోజుల తర్వాత ఓ ఉదయం శిరీష బాల్కనీలో నిలబడి కాఫీ త్రాగుతూంటే దూరంగా సైకిల్పై వెళుతున్న చంద్రం కనిపించాడు. 'ఉదయం ఆరుగంటలకు ఎక్కడికి వెళుతున్నాడబ్బా' అనుకుని ఆశ్చర్యపోయింది . అతను రోజూ కాలేజీ గ్రౌండ్స్కు వెళ్ళి రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడని తర్వాత తెలుసుకుని ఆశ్చర్యపోయింది.

అయితే చంద్రం ప్రకాష్ గురించి తనదగ్గర ఎప్పుడూ నెగటివ్గా చెప్పలేదు. శిరీష ప్రకాష్ నోటి దురుసుతనం గురించి చంద్రంతో చెప్పి, అతను చంద్రాన్ని అవమానించడం తనకు నచ్చలేదని చెప్పింది. అందుకు చంద్రం 'కొన్ని అవమానాలు మనకు మంచే చేస్తాయి. ప్రకాష్ అలా అనడంవల్లే ఈరోజు నేను ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నాను. రోజూ రన్నింగ్ చేయడం వల్ల ఫిజికల్గా ఫిట్గా ఉన్నాను. ఇన్ఫాక్ట్ ఐ మస్ట్ బి థాంక్ఫుల్ టు హిమ్' అన్నాడు నవ్వుతూ.

బ్యాంకులో ఉద్యోగం తెచ్చుకున్నరోజు స్నేహితులిద్దరికీ స్వీట్లు పంచాడు చంద్రం.

'బ్యాంకు జాబ్ ఎందుకు ఎన్నుకున్నావు చంద్రం? రోజూ డబ్బులు లెక్కపెట్టడం తప్ప థ్రిల్ ఏముంది ఆ జాబ్లో?' అన్నాడు ప్రకాష్.

'అలా అంటావేం ప్రకాష్? బ్యాంకు జాబ్ అంటే ఇప్పుడు జనాల్లో ఎంత క్రేజ్ ఉందో తెలుసా? బ్యాంకు ఉద్యోగి అంటే చాలు అమ్మాయిలు వెంటనే పెళ్ళికి ఓకే చెప్పేస్తున్నారు' అంది శిరీష.

'బ్యాంకులో డబ్బులు లెక్కపెట్టే పని ఒక్కటే ఉండదు. డిపాసిట్లు, అడ్వాన్సులు, మార్కెటింగు... ఇంకా ఎన్నో పనులుంటాయి. అయినా ఇవన్నీ సి.ఎ. చదువుతున్న నీకు తెలియంది కాదు. ముఖ్యంగా మా నాన్న బాధ్యతలు పంచుకోవడానికి నాకో ఉద్యోగం కావాలి. అది నేను కోరుకున్న బ్యాంకు ఉద్యోగం కావడం నాకు ఆనందంగా ఉంది'

అన్నాడు చంద్రం.

క్రమంగా చంద్రం బ్యాంకు ఉద్యోగంతో, ప్రకాష్ బిజినెస్ పనులతో బిజీ కావడంతో వాళ్ళు కలసి మాట్లాడుకునే అవకాశాలు తగ్గిపోయాయి. ఇంతలో శిరీషకు ఆమె తండ్రి పెళ్ళి సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు. ఇప్పుడు తన స్నేహితుల ప్రొపోజల్స్ ఆమె ముందు పెట్టి ఒకర్ని ఎంచుకోమన్నాడు.

***

ప్రకాష్ అంటే తనకు హీరో వర్షిప్ ఉంది. అతని డ్రెస్ సెన్స్, సిగరెట్ త్రాగే స్టైల్, కారు డ్రైవింగ్లో ప్రావీణ్యం, చాలా విషయాలపై అవగాహన, ఆంగ్లభాషపై పట్టు తనని ఎంతో ఆకర్షించింది. తనకే కాదు, కాలేజీలో చాలామంది అమ్మాయిల కలల రాజకుమారుడు ప్రకాష్. అయితే అతని అహంకారం, నోటిదురుసుతనం తనకు నచ్చదు. పైగా అతని మూడ్స్ కూడా ఎప్పుడూ ఒకేలా ఉండవు.

చంద్రం మంచితనం, ఆలోచించి మాట్లాడే తత్వం, సేవా తత్పరత తనకిష్టం. ఎవరినీ నొప్పించని అతని చతురోక్తులంటే ఇంకా ఇష్టం. ముఖ్యంగా తనంటే అతనికిష్టమని తను అతని చర్యల ద్వారా గ్రహించింది ' అనుకుంది శిరీష.

బాగా ఆలోచించాక తను చంద్రంతోనే సుఖంగా, ప్రశాంతంగా జీవనం సాగించగలనని శిరీషకు అనిపించింది. మరుసటిరోజు తండ్రితో తన నిర్ణయం చెప్పింది.

'చక్కటి నిర్ణయం తీసుకున్నావమ్మా!' అన్నాడు రమేష్ సంతోషంగా.

'అంటే మీరు చంద్రాన్నే అల్లుడుగా చేసుకోవాలని అనుకున్నారా?' ఆశ్చర్యంగా చూస్తూ అంది శిరీష.

'అవును. అయితే నా ఆలోచన నీ నిర్ణయంపై ప్రభావం చూపకూడదనే నీకు చెప్పలేదు. చంద్రం బంగారం. చిన్నప్పట్నుంచీ చూస్తున్నాకదా! ' అన్నాడు రమేష్.

***

పెళ్ళై చంద్రం ఇంట్లో అడుగుపెట్టాక పుట్టినింటికీ, మెట్టినింటికీ పెద్ద తేడా కనిపించలేదు శిరీషకి. అందుకు కారణం..చంద్రం తల్లితండ్రులు ఆమెని తమ బిడ్డలా చూసుకోవడమే. చంద్రంకి తన తల్లితండ్రులంటే చాలా గౌరవం, తోబుట్టువులంటే ఇష్టం. తనలాగే తన తమ్ముడు,చెల్లెలు బాగా చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని తపించేవాడు. తను పెందరాడే లేచి, వాళ్ళని లేపి చదువుకోమనేవాడు. వారి చదువుల్లో సందేహాలుంటే తీర్చేవాడు. ప్రపంచంలో జరుగుతున్న విషయాల గురించి వారితో చర్చించేవాడు.

చంద్రం నెల నెలా జీతంలో కొంతభాగం తండ్రికి ఇచ్చినా తర్వాత ఇంటికి అవసరమైనవాటిని తనదగ్గరున్న డబ్బుల్తోనే తెచ్చేవాడు. ఇరవై తారీఖుకల్లా చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడాల్సి వచ్చేది. చంద్రం తండ్రి శ్రీనివాస్ ప్రభుత్వ ఉద్యోగే అయినా అవినీతికి ఆమడదూరం ఉంటాడు కాబట్టి వారికి తరచుగా ఆర్థికమైన

ఇబ్బందులు కలిగేవి. అయితే తన తండ్రి నిజాయితీ ఆయనపట్ల తన గౌరవాన్ని మరింత పెంచిందని చంద్రం అనేవాడు.

శిరీష చంద్రంల పెళ్ళైన మరుసటి సంవత్సరం ప్రకాష్ కి పెళ్ళైంది. వధువు సంధ్య అద్భుతమైన అందగత్తె. పెళ్ళి రిసెప్షన్లో ప్రకాష్, సంధ్యలని చూసి 'ఇద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్ ' జంటలా ఉన్నారు' అంది శిరీష చంద్రంతో. చంద్రం అవునన్నట్టు తలూపాడు. సంధ్య కూడా మధ్య తరగతి కుటుంబం నుంచే వచ్చిందని శిరీషకు తెలిసింది.

చంద్రం ఇంట్లో చాలా శుభకార్యాలు జరిపించిన పురోహితులు నారాయణశాస్త్రిగారు ఓరోజు తమ ఇంటికొచ్చి తన కుమార్తెకి పెళ్ళి కుదిరిందని, తెలిసినవాళ్ళనందరినీ తమకు తోచినంత ఆర్థిక సహాయం చేయమని అడుగుతున్నానని చెబితే చంద్రం జేబులోంచి అయిదువందలు ఆయనకు ఇచ్చాడు . 'జీతం వెయ్యిరూపాయల్లో అయిదువందలు ఆయనకు ఇచ్చేస్తే మిగిలిన డబ్బుల్తో ఇల్లు గడిచేదెలా' అని శిరీష తర్వాత ప్రశ్నిస్తే 'బ్యాంకులో ఏదైనా లోను కోసం ప్రయత్నిస్తాను. పెళ్ళికి సహాయం చేయడానికి అవకాశం వస్తే ఇంకేం ఆలోచించకూడదు ' అన్నాడు. అతని మాటలకు శిరీష ఆశ్చర్యపోయింది. చంద్రంలో అంతవరకూ ఆమె చూడని క్రొత్త కోణమిది. కష్టాలు పడ్డవాళ్ళకే ఎదుటివారి కష్టాలు బాగా అర్థమవుతాయని అనిపించింది ఆమెకి.

ఒక్క ఆర్థిక సహాయాలే కాదు, ఎవరికి ఏ అవసరమొచ్చినా చంద్రం తానున్నానంటూ వెళ్ళేవాడు. ఇంట్లో అసలుండేవాడు కాదు. బ్యాంకులో కూడా కల్చరల్ ప్రోగ్రామ్స్ అని, క్రికెట్ మ్యాచ్ అని వెళుతూండేవాడు. చాలావాటికి శిరీషని తీసుకెళ్ళేవాడు. బ్యాంకులో జరిగే ప్రతి ప్రోగ్రామ్లో చంద్రం పాత్ర తప్పకుండా ఉంటుంది. విశేషం ఏమిటంటే చంద్రం క్రికెట్లో 'సేఫ్ హ్యాండ్స్ 'అని, 'బెస్ట్ ఫీల్డర్ ' అని పేరు తెచ్చుకున్నాడు.

ఇంట్లో ఉన్నప్పుడు పుస్తకాలు చదివే సమయం తప్ప మిగిలిన సమయమంతా కుటుంబ సభ్యులతోనే గడిపేవాడు. ఆ ఇంటికి వచ్చిపోయే బంధుమిత్రుల సంఖ్య కూడా ఎక్కువే.

ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత చంద్రం శిరీషకు మరింత అందంగా కనిపించసాగాడు. తృప్తి, సంతోషం, ఆత్మవిశ్వాసం మనిషి అందాన్ని ద్విగుణీకృతం చేస్తుందని ఆమెకి అప్పుడే తెలిసింది.

చంద్రం తండ్రి శ్రీనివాస్ ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాడు. అతనికి భవిష్యత్తు పట్ల పెద్దగా ప్లానింగ్ లేకపోవడంతో రిటైర్మెంట్ డబ్బులు పెద్దగా రాలేదు. పెన్షన్ మాత్రం వచ్చేది. అయినా చంద్రం చొరవతో, తోడ్పాటుతో తన కూతురి పెళ్ళి, రెండో కొడుకు పెళ్ళి చేశాడు. పిల్లలందరూ ఉద్యోగాల్లో, జీవితంలో స్థిరపడటంతో తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు శ్రీనివాస్. భార్య రేవతి అతనితో 'మీరు ఈరోజు నిశ్చింతగా ఈజీ ఛైర్లో

కూర్చుని పుస్తకం చదువుకుంటున్నారంటే అది చంద్రం చలవే. మనం ఈ స్థితికి రావడానికి చంద్రం ఎంతో కష్టపడ్డాడు' అని తరచుగా అనేది.

'నేనూ ఒప్పుకుంటాను. గర్వపడతాను కూడా' అనేవాడు శ్రీనివాస్.

ఓరోజు సంధ్య శిరీషతో 'ప్రకాష్ మద్యానికి బానిసయ్యాడని, సి.ఎ.పూర్తిచేయడానికి ఆసక్తి చూపడం లేదని, తనతో, అతని తండ్రితో తరచూ గొడవ పడుతుంటాడని' చెప్పి బాధపడింది. చంద్రాన్నీ, శిరీషను ప్రకాష్ తో మాట్లాడి అతని ప్రవర్తనని మార్చడానికి ప్రయత్నించమని కోరింది. అయితే ప్రకాష్ ఎవరు చెప్పినా వినే పరిస్థితిలో లేడని అతనితో మాట్లాడాక వారికి అర్థమైంది. చంద్రం మాత్రం ప్రకాష్ ఇంటికి వెళ్ళడం మానలేదు, అతన్ని మార్చడానికి తన ప్రయత్నాలనూ ఆపలేదు.

చంద్రం వారపత్రికలు,మాసపత్రికలు, నవలలు ఇంటికి తెచ్చుకుని చదివేవాడు. ఓ పత్రికలో కార్డు కథలు అనే శీర్షికలో చిన్న కథలు ప్రచురిస్తూంటే అతను ఓ సమకాలీన సమస్యపై కథను కార్డుపై రాసి పంపాడు. ఆ కథ అచ్చయ్యింది. అప్పట్నుంచీ అప్పుడప్పుడూ కథలు రాసి పత్రికలకు పంపేవాడు. పిల్లలు తమ చదువులు తాము చదువుకునే వయసుకు వచ్చాక విరివిగా రాయడం మొదలుపెట్టాడు. అనతికాలంలోనే మంచి రచయితగా పేరు తెచ్చుకున్నాడు.

కాలక్రమంలో చంద్రం పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ఇద్దరు కొడుకులూ చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు, లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారు. బాధ్యతలు తీర్చేసుకున్నాడు కాబట్టి ఇప్పుడు చంద్రానికి ఆర్థిక ఇబ్బందులు లేవు. పైగా అవసరమైన వారికి, తన సహాయం కోరిన వారికి ఆర్థిక సహాయం చేస్తున్నాడు. ప్రకాష్ తండ్రి వయసు మీద పడటంతో వ్యాపార భాద్యతల్ని ప్రకాష్ పై మోపాడు. కానీ ప్రకాష్ సరిగ్గా నడపకపోవడంతో వ్యాపారం దెబ్బతింది. వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ప్రకాష్ ఏకైక కూతురు మమత మాత్రం బాగా చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకుంది.

మమతను చంద్రం కొడుకు గిరికిచ్చి పెళ్ళిచేయమని అడగడానికి చంద్రం ఇంటికి వచ్చారు ప్రకాష్, సంధ్య. ఆలోచించి చెబుతామని చంద్రం చెప్పాడు. తర్వాత తన సుముఖతను శిరీషతో వెల్లడించాడు. శిరీషకు పెద్దగా ఇష్టం లేకపోయినా కొడుకు మమతను చేసుకోవడానికి ఆసక్తి చూపడం, ప్రకాష్ త్రాగుడు మానేయడం వంటి కారణాలవల్ల తన అంగీకారం తెలిపింది.

***

ఢిల్లీలోని ఓ సాహితీ సంస్థ ప్రతిఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డు చంద్రం వ్రాసిన ఓ పుస్తకానికి లభించింది. ఢిల్లీలో జరిగే సాహితీ సభలో అతనికి బహుమతి ప్రదానం చేస్తామని , కుటుంబసమేతంగా రావాలని వారు కోరారు.

'ట్రైన్ టికెట్లు వెంటనే బుక్ చెసేయండి. టికెట్లు అయిపోతే కష్టం. కారులో అంత

దూరం పోలేము కదా' అంది శిరీష చంద్రంతో.

'మనం ఫ్లైటులో వెళ్తున్నాం. ఇప్పుడు మన ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది కదా' అన్నాడు చంద్రం నవ్వుతూ.

ఢిల్లీలో సాహితీ సభ విజయవంతంగా జరిగింది. సభకు వచ్చిన ముఖ్య అతిథులు చంద్రంను పొగడుతూంటే ఆనందంతో ఉప్పొంగిపోయింది శిరీష. మంచి సాహిత్యానికి ఉన్న విలువ ఏమిటో ఆరోజే ఆమెకు అర్థమైంది.

తిరుగు ప్రయాణంలో ఫ్లైట్లో చంద్రం ప్రక్కన కూర్చుని ఏదో ఆలోచిస్తున్న శిరీషకు చంద్రం ప్రకాష్ ను అతని ఢిల్లీ ప్రయాణం గురించి అడిగితే చంద్రం మళ్ళీ ప్రశ్నలేయకుండా లైటు ఆర్పిన సంఘటన గుర్తొచ్చింది.

'చంద్రం తనకు కలిగిన అవమానాల్ని మర్చిపోడు. వాటిని కసిగా మార్చుకుంటాడు. ఆ కసిని తనను అవమానించినవారిపై చూపించడు. తను ఎదగడానికి ఆ కసిని ఉపయోగిస్తాడు. అందుకే అతను ఇన్ని విజయాలు సాధించగలిగాడు. ఓ కొడుకుగా, ఓ అన్నగా, భర్తగా, తండ్రిగా, మిత్రుడుగా, బంధువుగా,ఉద్యోగిగా, రచయితగా...అన్నిచోట్లా విజయం సాధించాడు. అందరి ప్రేమనీ, మన్ననల్నీ పొందాడు.

'మరక మంచిదే' అని ఓ సోపు పౌడర్ అడ్వర్టైజ్మెంట్లో చూపించినట్లు అవమానాలు కూడా చంద్రం లాంటి ఎదగాలనే కసి ఉన్న వ్యక్తులకు మంచినే చేస్తాయి ' అనుకుంది.

గిరి పెళ్ళిలో చంద్రం సూట్ ధరించి శిరీషకు అందంగా, హుందాగా కనిపించాడు. పెళ్ళికి చాలామంది వచ్చారు. బంధువులు, స్నేహితులు, చంద్రం బ్యాంకు మిత్రులు, వారి కుటుంబ సభ్యులు, బ్యాంకు కష్టమర్లు, సాహితీ మిత్రులు, కాలనీ మిత్రులు...అందరినీ నవ్వుతూ ఆహ్వానిస్తూ, ఒక్క క్షణం తీరిక లేకుండా అటూ ఇటూ తిరుగుతున్న చంద్రంని చూస్తే ఎంతో ముచ్చటేసింది శిరీషకి.

అతన్ని చూస్తూంటే గతంలో సినిమాకు వెళ్ళడానికి అతను ధరించిన డ్రెస్ గురించి ప్రకాష్ చేసిన కామెంట్లు గుర్తొచ్చాయి. ఆమె ప్రకాష్ వైపు చూసింది. అతను సాధారణ దుస్తులు ధరించి ఉన్నాడు. ముఖంలో వృద్ధాప్యం కనిపిస్తూంది. అతనిలో ఒకప్పటి ఉత్సాహం కానీ, ఆత్మవిశ్వాసం కానీ కనిపించడం లేదు. 'అహంకారానికి వ్యసనం తోడైతే మనిషి ఎలా పతనమైపోతాడో చెప్పడానికి ప్రకాష్ ఓ ఉదాహరణ' అనుకుంది.

'ఏమిటి ఆలోచిస్తున్నావు?' అని అడిగాడు రమేష్ కూతుర్ని సమీపించి.

'చదువుకునే రోజుల్లో చూచిన చంద్రానికి, ఇప్పటి చంద్రానికి పోలికే లేదు నాన్నా. ఇప్పటి చంద్రాన్ని చూసి నేను గర్వపడుతున్నాను నాన్నా!' అంది శిరీష.'

'దీన్నే పద్ధతి ప్రకారం ఎదగడం అంటారు. వ్యసనాలకు దూరంగా, మనుషులకు దగ్గరగా ఉంటూ, అందరికీ అందుబాటులో ఉంటూ, అందరి మన్ననల్ని పొందుతూ, ఓ ప్రణాళిక ప్రకారం ప్రతి అడుగూ ముందుకేస్తూ, తనకున్న ప్రతిభని సరైన దారిలో

వినియోగిస్తూ, ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ఈరోజు చంద్రం ఇంత ఎత్తుకు ఎదిగాడు. ఈ ఎదుగుదల ఒకరోజులో వచ్చింది కాదు. ఏళ్ళతరబడి సత్ప్రవర్తన, కృషి అనే మార్గంలో ప్రయాణిస్తూ ఈరోజు ఉన్నత స్థానాన్ని చేరాడు. ఇటువంటి ఎదుగుదల శాశ్వతం. నా అల్లుడిని చూసి నేనూ గర్వపడుతున్నానమ్మా' అన్నాడు రమేష్.

***

ఉగాది పండుగకు ప్రకాష్ దంపతులని తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించారు చంద్రం,శిరీష. తమ ఇంటికి వచ్చిన తల్లితండ్రులకు చంద్రం, శిరీష ఇస్తున్న గౌరవం చూసి కదలిపోయింది మమత. ఎవరూ లేనప్పుడు శిరీషతో తన ఆనందం పంచుకుంటూ 'మీలాంటి మంచి వ్యక్తుల కోడలవడం నా అదృష్టం అత్తయ్యా. ముఖ్యంగా మామగారు మాకు చేసిన సహాయాలకు మేము ఏం చేసినా ఆయన ఋణం తీర్చుకోలేం!' అంది మమత.

'ఆయనేం చేశారు మీకు?' ఆశ్చర్యంగా అడిగింది శిరీష.

'కూలిపోతున్న మా కుటుంబాన్ని నిలబెట్టారు మామయ్య. నాన్నకు డీఅడిక్షన్ ట్రీట్మెంట్ ఇప్పించి తాగుడు మానిపించారు. కోర్టులో ఉన్న మా తాతగారి ఆస్తుల్ని మాకు వచ్చేలా చేసి, వాటిని నగదు రూపంలో మార్చి, బ్యాంకులో డిపాజిట్లు చేసి, మాకు నెలనెలా జరుగుబాటు అయ్యేలా చేశారు. ఆ డబ్బులు మాకు రాకుంటే నా చదువు ఆగిపోయి ఉండేది' ' అంది మమత.

మమత మాటలు విని సంతోషపడినా చంద్రం ఈ విషయాలన్నీ తన దగ్గర దాచడం ఆమెని బాధపెట్టింది. ఆ బాధతో ఆమె చంద్రంతో రెండురోజులు సరిగ్గా మాట్లాడలేదు.

ఇక ఉండలేక ఓరోజు చంద్రంతో 'మన ముప్పయి ఏళ్ళ వైవాహిక జీవితంలో మన మధ్య దాపరికేలే లేవని గర్వంగా అనుకునేదాన్ని. నాకు తెలియకుండా మన ఇంట్లో చాలా విషయాలు జరిగాయని ఈమధ్యే తెలిసింది' అంది నిష్ఠూరంగా.

'ఏ విషయం గురించి మాట్లాడుతున్నావు శిరీషా?' అని నవ్వుతూ అడిగాడు చంద్రం.

'ప్రకాష్ కుటుంబానికి నీవు చేసిన సహాయాల గురించి!'

'ఓహ్..ఆ విషయమా? నీకు గుర్తుందా.. ఆరోజు సంధ్య కోరిక మేరకు ప్రకాష్ ను తనప్రవర్తన మార్చుకోమని చెప్పడానికి మనిద్దరం వాళ్ళింటికెళ్ళాం. అక్కడ ప్రకాష్ ఉన్న పరిస్థితి, ఆల్కహాల్ వాసన, అతని నిర్లక్ష్యపు సమాధానాలు నీకు కోపం,అసహ్యం తెప్పించాయి. వెంటనే తిరిగి ఇంటికి వెళ్ళిపోయావు. తర్వాత నేనెప్పుడు ప్రకాష్ ప్రస్తావన తెచ్చినా నువ్వు వినదలచుకోలేదని చెప్పేదానివి.'

ఆమె ఔనన్నట్లు తలూపింది.

'ప్రకాష్ కు కొంత అహంకారం, నోటిదురుసు ఉన్న మాట నిజమే. కానీ వ్యక్తిగా

మంచివాడు. ఎవరికీ హాని చేయని వాడు. సి.ఎ.పూర్తిచేయలేకపోతున్నానని బాధ, వ్యాపారంలో నష్టాలు అతని మనసును మద్యం వైపు మళ్ళించింది. మనతో కలసి చదువుకున్నవాడు, మనతో కలసి తిరిగినవాడు, మనకోసం ఎంతో ఖర్చు చేసినవాడు అలా జీవితాన్ని నాశనం చేసుకుంటూంటే చూస్తూ ఉండలేకపోయాను. ముఖ్యంగా మనం చదువుకునే రోజుల్లో అతను నన్ను అన్న ప్రతి మాటా నాలో పట్టుదలను పెంచింది. ఆ విధంగా నా ఎదుగుదలకు పరోక్షంగా కారణమయ్యాడు. అందుకే సంధ్య సహకారంతో అతన్ని డీఅడిక్షన్ ట్రీట్మెంట్ ఇప్పించాను. ఎప్పుడైతే మద్యం దూరమైందో అతనిలో మనిషి నిద్ర లేచాడు. ఉన్న డబ్బుల్ని జాగ్రత్త చేసుకుని ప్రశాంతంగా జీవిస్తున్నాడు.'

శిరీష ఆశ్చర్యంగా అతన్నే చూస్తూండిపోయింది.

'ఏమిటలా చూస్తున్నావ్?' నవ్వుతూ అడిగాడు చంద్రం.

'ఇన్నాళ్ళూ ఆర్థికంగా, కుటుంబపరంగా, రచయితగా ఎదిగిన చంద్రాన్ని చూస్తూ ఉన్నాను. ఈరోజు వ్యక్తిగా మరింత ఎదిగి ఉన్నత శిఖరాలు అధిరోహించిన చంద్రాన్ని చూస్తున్నాను' అంది అతనివైపు మెచ్చుకోలుగా చూస్తూ.

***

**చిత్తూరు నారాయణరావు చంద్రశేఖర్..** నెల్లూరు లో జన్మించారు. తండ్రి తండ్రులు స్వర్గీయ సి.నారాయణరావు, సి.కామాక్షిబాయి. బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగం తన తండ్రి స్వస్థలమైన చిత్తూరు లో జరిగింది. చిత్తూరు లోని పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాలలో చదువుకుని, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బి.ఎస్.సి. పట్టా పొందాక కొంతకాలం మెడికల్ రెప్రెజెంటేటివ్ గా పనిచేసి తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పని చేసి పదవీ విరమణ పొందారు. చంద్రశేఖర్ ఇప్పటివరకు దాదాపు రెండు వందల కథలు, రెండు నవలలు, అరవై కవితలు రచించారు. ఇవన్నీఈనాడు ఆదివారం, సాక్షి ఫన్డే, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, జాగృతి, నవ్య, విపుల, చతుర, మయూరి, ప్రియదత్త, నది, భావతరంగిణి, కథాకేళి, రమ్యభారతి, ప్రమిద, ఆశ, విశాలాక్షి, సాహితీ కిరణం, హాస్యానందం మొదలగు ప్రముఖ దిన,వార,మాస,త్రైమాస పత్రికల్లో, సహరి, సంచిక, కథామంజరి మొదలగు అంతర్జాల పత్రికల్లో ప్రచురింపబడ్డాయి.ఈయన రచనలు పుస్తక రూపాలుగా వెలువడ్డాయి. అందులో ఎనిమిది కథాసంపుటాలు, రెండు నవలలు, ఒక కవితా సంపుటి ఉన్నాయి.

# మనస్విని



## విజయార్కె

'అగ్నికీలల్లో దగ్ధమవుతోన్న నా చర్మం కాలిన, కమురు వాసనకు మానవత్వపు లేపనాన్ని రాస్తున్నా... ఆత్మ విశ్వాసపు శస్త్రచికిత్స చేస్తున్నా...' మనస్విని డైరీలో ఒక పేజీ

***

ఉద్విగ్నభరిత వాతావరణం
ప్రపంచం అంతా ఎదురుచూస్తోన్న తరుణం
విశ్వ సౌందర్యం మిస్ యూనివర్స్ కు ఆహ్వానం పలికే క్షణం.

***

ప్రపంచమంతా ఎదురుచూస్తోన్న సమయంలో...
ప్రపంచంలోనే కాదు మొత్తం విశ్వంలో అత్యంత అందమైన అమ్మాయి కావాలనేది చాలా మంది అమ్మాయిల కల. ఆ కలను కొందరు మాత్రమే నెరవేర్చుకోగలరు.
ఇప్పుడు అందరి నోటా వినిపించే పేరు.. మ... న... స్వి... ని.
మిస్ వరల్డ్, మిస్ ఇంటర్నేషనల్, మిస్ ఎర్త్ లతో పాటు, ఇలా ఎన్నో అందాల పోటీలు.
ఇప్పుడు మిస్ యూనివర్స్ కు పోటీ పడుతోంది మనస్విని.

మనస్విని పేరుకు తగ్గ వ్యక్తిత్వం, రూపం, మానవత మూర్తీభవించిన మనో సౌందర్యం.
మిస్ యూనివర్స్ ఆమె కల మాత్రమే కాదు, కోట్లాది భారతీయుల ఆకాంక్ష,
భారతదేశంలో ఎన్నో అందాల పోటీల్లో అలవోకగా కిరీటాలు సాధించిన అసామాన్య సౌందర్యం. అంతకు మించి వ్యక్తిత్వం
లాక్ డౌన్ సమయంలో ఆమె చేసిన సాయం, కరోనా బాధితులకు అందించిన కొండంత ధైర్యం ఆమె పేరును మొట్టమొదటిసారిగా ప్రపంచమంతా మార్మోగి పోయేలా చేసింది.
ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన మనస్విని సహజ సౌందర్యం తో, అంతకు మించిన వ్యక్తిత్వంతో ఎదిగింది.

మిస్ యూనివర్స్ లో పాల్గొనక ముందే ఎన్నో జాతీయ అంతర్జాతీయ పత్రికలు మనస్విని ముఖచిత్రాన్ని ప్రచురించాయి.

తెలుగులో ఒక ప్రముఖ దిన పత్రిక లో మహిళలకు సంబంధించిన కాలమ్ నిర్వహిస్తూ ఫ్రీలాన్సర్ గా కూడా పని చేస్తోంది.
ఆత్మవిశ్వాసం, మానవత్వం..ఆమె అందానికి కాస్మొటిక్స్ ను మించిన సౌందర్య

సాధనాలు అని ప్రశంసిస్తూ వుంటారు.
మిస్ యూనివర్స్ గా తను సాధించే విజయం తన దేశానికి గర్వకారణం కావాలని కోరుకుంటుంది.

***

మనస్విని చీరకట్టులో తెలుగుదనాన్ని ఆవిష్కరించింది. అమ్మానాన్న కాళ్ళకు నమస్కరించింది. పూజగదిలో దేవుడిని ప్రార్థించింది.

***

ఇంటర్వ్యూ రౌండ్ లో తన ప్రతిభను చాటింది. ప్రిలిమినరీ రౌండ్‌లో పోటీదారులను అధిగమించింది. సెమీఫైనల్ రౌండ్ లో టాప్ సిక్స్ లో వుంది. ఫైనల్స్ లోకి అడుగుపెట్టింది. టాప్ త్రీ లో నిలిచి, మొదటి రన్నరప్ రెండవ రన్నరప్. ల రేసులో కాకుండా అత్యధిక స్కోర్ తో...అత్యధిక స్కోర్ ఆధారంగా, విజేతగా మిస్ యూనివర్స్ గా ప్రపంచ సౌందర్య యవనిక మీద నిలిచే సమయంలో..జరిగిందా ఘోర దుర్ఘటన.

***

1994లో తొలిసారి విశ్వసుందరి కిరీటాన్ని సాధించిన సుస్మితాసేన్, 2000 ఏడాదిలో విశ్వ సుందరి కిరీటాన్ని దక్కించుకున్న లారా దత్త.ముచ్చటగా మూడోసారి మిస్ యూనివర్స్ కిరీటాన్ని సాధించిన హర్నాజ్ సంధు. తర్వాత మన దేశం సాధించబోయే మరో మిస్ యూనివర్స్ కిరీటం... సౌందర్య కెరటం మనస్విని అన్ని పత్రికలు పతాక శీర్షికల్లో ఆశాభావాన్ని ఆకాంక్షను తెలియజేస్తోన్న సందర్భం.

కొన్ని గంటల్లో మిస్ యూనివర్స్ ఎవరో తేలిపోతుంది. కాదు..మిస్ యూనివర్స్ కిరీటం మనస్విని ని వరిస్తుందని ప్రపంచమంతా భావిస్తోన్న క్షణం.

భారత్ నుంచి నాలుగో మిస్ యూనివర్స్ గా మనస్విని తెలుగమ్మాయిగా కిరీటం సాధిస్తుందని ఆకాంక్షిస్తోన్న క్షణం.

***

లండన్ వేదికగా జరుగుతున్న మిస్ యూనివర్స్ వేదిక లో..తన సూట్ లో ఫైనల్ రౌండ్ కు సిద్ధమవుతోన్న మనస్విని అగ్ని ప్రమాదానికి గురైంది. ఆమె ఉన్న సూట్ షార్ట్ సర్క్యూట్ తో మంటల్లో తగలబడుతోంది.
ఒక్కసారిగా వేదిక లండన్ మహానగరమే కాదు యావత్ ప్రపంచం నివ్వెరపోయింది.
ఆఘమేఘాల మీద మనస్విని హాస్పిటల్ కు తరలించారు.మిస్ యూనివర్స్ పోటీ ఫలితాలు వాయిదా పడింది. తిరిగి మనస్విని కోలుకునేంతవరకు ఈ పోటీ చివరి రౌండ్ ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి తన వ్యక్తిత్వాన్ని చాటుకుంది మిస్ యూనివర్స్ నిర్వాహక బృందం
ప్రపంచ మీడియా హాస్పిటల్ ముందు నిలిచింది.

***

ప్రపంచంలో అత్యధిక అందగత్తెగా, మిస్ యూనివర్స్ గా అందరి ముందు నిలబడవలసిన మనస్విని హాస్పిటల్ లో మరణంతో పోరాడుతోంది.

ప్రపంచమంతా తల్లడిల్లింది. అభిమానులు ప్రార్థనలు చేశారు. ఆమె తిరిగి కోలుకోవాలని ..అంతకు మించి 'మిస్ యూనివర్స్ 'కిరీటాన్ని అందుకోవాలని కోరుకున్నారు. ప్లాస్టిక్ సర్జరీతో తన పూర్వ రూపాన్ని పొందడానికి ప్రపంచమంతా కదిలింది. చిన్నాపెద్దా మహిళలు యువత కదిలింది.

క్రౌడ్ ఫండింగ్ మొదలుపెట్టింది.

మనస్విని మిస్ యూనివర్స్ గా రూపంలో చూడాలనుకున్నారో..ఆ రూపం రావడానికి వైద్యరంగం నడుం బిగించింది. విరాళాలు వెల్లువెత్తుతున్నాయి.

***

మనస్విని హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యింది

మనస్విని ప్రాణాలతో బయట పడింది. కానీ తన రూపం మారిపోయింది. మంటల్లో కాలిన చర్మం ఆమె సౌందర్యాన్ని మసకబారేలా చేసింది.

ఉదయం అద్దంలో తనను తాను చూసుకున్న మనస్విని ఒక్కసారిగా బాధతో కూడిన భయంతో వణికి పోయింది.

కొన్నాళ్ల క్రితం మంచులో తడిసిన గులాబీలా ఉన్న సౌందర్యం మంటల్లో కాలిపోయి... శారీరక సౌందర్యాన్ని కోల్పోయేలా చేసింది.

బాధ నిస్సహాయత ఉక్రోషం..ఏ భావమో ఆమెలోని ఉద్రేకాన్ని తట్టిలేపింది. ఆమె చేయి అద్దాన్ని తాకింది. అద్దం ముక్కలైంది. ఆమె చేయి రక్తసిక్తమైంది.

అద్దం నవ్వింది. 'నువ్వెలా ఉన్నావో నేను నిన్ను అలాగే చూపించాను. అయినా నా మీద నీకు కోపం ఎందుకు..నువ్వు ఇదివరలో ఈ ప్రమాదం జరగక ముందు ' ఎలా ఉన్నావో, ఇప్పుడు నువ్వలా లేవు. మార్పు నీలోనే నాలో కాదు 'అద్దం చెప్పింది ఆమెకు అర్థమయ్యేలా.

ఆ ఇంట్లో ఎక్కడా అద్దాలు కనిపించకుండా చేశారు తల్లిదండ్రులు.

మనస్విని తన ముఖాన్ని అద్దంలో చూసుకోవడానికి ఇష్టపడటం లేదు. ఒక్కసారిగా తన ప్రపంచం తలకిందులైంది.

బయట కూరగాయల బండి వచ్చిన, పాలవాడు కేకేసినా ఇల్లు కదలడం లేదు.

ఆమె జీవితాన్ని, ఆమె ఆలోచనా విధానాన్ని మలుపు తిప్పిన సంఘటన ఒకటి జరిగింది.

మనస్వినిని పరామర్శించడానికి, మానసిక స్థైర్యాన్ని అందించడానికి పత్రికా సంపాదకుడు వచ్చాడు.

మొదటిసారి ఒక ప్రముఖ పత్రిక సంపాదకుడు తనకోసం రావడం సంతోషమే కలిగించినా, కాలిన తన దేహాన్ని, ఈ ముఖాన్ని ఎలా చూపించాలనే సంఘర్షణ.

‘మనస్విని ..కాలింది నీ చర్మమే. మంటల్లో దగ్ధమైంది నీ శరీరాన్ని అంటిపెట్టుకున్న ఒక చర్మపు పొర మాత్రమే..నీ వ్యక్తిత్వం కాలిపోలేదు. నీలోని ఆత్మవిశ్వాసం "మసి 'బారలేదు. నిన్ను నిన్నుగా చూడాలనుకునేవారు, నీ ప్రతిభను గుర్తించాలని అనుకునేవాళ్లు, నీ అక్షరాలు అభిమానించే వాళ్ళు, ఎందరో ఉన్నారు.

అలాంటి వాళ్లకు స్ఫూర్తి గా నిలుస్తావో, భయంతో ప్రపంచానికి గెలుపుకు దూరంగా పారిపోతావో నిర్ణయించుకో... నీ వెంట నేను ఉన్నాను. కోట్లాది ప్రజలు ఉన్నారు’చెప్పాడు ఎడిటర్ .

‘జీవితమనే యుద్ధక్షేత్రం లో దేవదేవుడి రూపంలో చెప్పిన వ్యక్తిత్వ వికాస గీత. అది.’

మనస్విని తన వ్యక్తిత్వాన్ని పలకరించింది..తన ఆలోచనను ప్రశ్నించింది. తనను తానూ ఆవిష్కరించుకుంది. రెండు చేతులు జోడించింది. ఆ క్షణమే ఒక నిర్ణయానికి వచ్చింది.

***

ఎక్కడ తన మొహానికి ముసుగు వేసుకోలేదు.ఎక్కడా స్కార్ఫ్ కూడా ధరించలేదు. తన చర్మం కాలిన ముఖాన్ని జనానికి చూపించడానికి ఇబ్బంది పడలేదు. మొదట్లో భయంగా విచిత్రంగా చూసిన వాళ్ళు, ఇప్పుడు మనస్విని వ్యక్తిత్వాన్ని, ఆమె పత్రికలో రాసిన స్ఫూర్తివంతమైన కథనాలను, ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలు మాత్రమే చూస్తూ ఆమెలోని మనో సౌందర్యాన్ని చూస్తున్నారు.

ప్రపంచమంతా "మిస్ యూనివర్స్ ఆఖరి రౌండ్ ‘లో విజేతగా నిలిచి, ప్రపంచం ముందుకు వచ్చే మిస్ యూనివర్స్ కోసం ఎదురుచూస్తోంది. ఆ మిస్ యూనివర్స్ మనస్విని అని నమ్ముతోంది. మనస్విని అభిమానులు క్రౌడ్ ఫండింగ్ ద్వారా వచ్చిన డబ్బుతో మనస్విని ప్లాస్టిక్ సర్జరీ చేయించి మిస్ యూనివర్స్ వేదిక మీదికి తీసుకురావడానికి ఉవ్విళ్లూరుతోంది.

ప్రతిరోజు మనస్విని ఇంటికి సందర్శకుల తాకిడి ఎక్కువవుతోంది

ఈ సంఘటన ఒక కొత్త చరిత్రకు నాంది పలుకుతుంది. ఆ రోజు రానే వచ్చింది.

***

మనస్వి పత్రిక కార్యాలయానికి వచ్చింది. పత్రిక ఎడిటర్ ముందు నిలబడి వుంది. ‘అమ్మా మనస్విని నీ నిర్ణయం తెలియజేయవలసిన సమయం వచ్చింది. నీ మనసులో మాట ప్రపంచానికి తెలియాలి. "‘ఒక రైటర్ గా నాకు ఒక స్థానం కల్పించారు. ఒక కాలమిస్ట్ గా నా భావాలూ ప్రపంచంతో పంచుకునే అవకాశం కలిగించారు. నా నిర్ణయం ముందు మీకే చెబుతాను. ’మనస్విని చెబుతూనే ఉంది.

మనస్విని చివరి మాటలు విని కదిలిపోయాడు. అతనిలోని తండ్రి మనసుకు ఆ మాటలు అర్థమయ్యాయి.

‘గాడ్ బ్లెస్ యు మై చైల్డ్ ..నీ నిర్ణయం ప్రపంచానికి ఒక కొత్త అర్థాన్ని చెబుతుంది.

పరమార్థాన్ని తెలియజేస్తుంది'మనఃస్ఫూర్తిగా అన్నాడు.

***

మిస్ యూనివర్స్ నిర్వాహకబృందం ఫైనల్ రౌండ్ కు తేదీని వేదికను నిర్ణయించింది.

చివరి ముగ్గురిలో విజేత, మొదటి రన్నరప్, రెండవ రన్నరప్ మాత్రమే తెలియాల్సి వుంది.
మొదటిసారిగా ఊహించిన అగ్నిప్రమాదం వలన తన పోటీకి ఆటంకం ఏర్పడి, తమ ఫలితం తారుమారు కాకూడదని, అందులోనూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానుల ప్రజల కోర్కెలను పరిగణలోకి తీసుకుని ఫలితాలు వాయిదా వేసింది.

మనస్విని తన సంచలనాత్మక నిర్ణయాన్ని తెలియజేసే సమయం ఆసన్నమైంది.

ఆ నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయం అవుతుందని ఎవ్వరూ ఊహించలేదు.

***

'నేను మిస్ యూనివర్స్ పోటీ నుంచి వైదొలుగుతున్నాను. దయచేసి నా వ్యక్తిగత నిర్ణయాన్ని క్షమించి అర్థం చేసుకోండి. అంతే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు, నన్ను అభిమానించి, కాలిన నా చర్మానికి ఊపిరి పోసి, నాలో సరికొత్త కృత్రిమమైన అందాన్ని, ప్లాస్టిక్ సర్జరీ ద్వారా అందించాలని, నా కోసం మంచి మనసుతో ముందుకు వచ్చిన వారికి పాదాభివందనం. కానీ నేను తిరిగి నాకు పూర్వరూపం రావాలని, తిరిగి అందంగా మారాలని అనుకోవడం లేదు'చెప్పింది మనస్విని.

ప్రపంచ మీడియా ముక్తకంఠంతో కారణం అడిగింది.

'అందం మనసు సంబంధించింది. ఆ దేవుడు ప్రసాదించింది. లేదా తల్లిదండ్రుల ద్వారా సంక్రమించింది. ప్రమాద వశాత్తు నాలా ఎందరో ప్రమాదాలకు గురవుతున్నారు.

యాసిడ్ దాడులకు బలవుతున్నారు. వాళ్లందరికీ ఆర్థిక స్తోమత వుందా?ఉంటుందా?' ఒక్క క్షణం ఆగి..కొనసాగించింది..

'అంతే కాదు నేను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుని నా రూపం కొంతవరకైనా పొందడం ద్వారా, అందంగా లేకపోతే సమాజంలో బ్రతకడం వృథా' అనే.. భావన కలిగించినట్టు అవుతుంది.

తమ రూపానికి ముసుగు వేసుకోవడం అలవాటు అవుతుంది.

మొదట్లో కాలిన నా చర్మాన్ని, నా రూపాన్ని చిత్రంగా చూసేవారు. ఎప్పుడైతే నేను నేనుగా ముందుకు కదిలి, నా వృత్తి మీద, నా సంకల్పం మీద దృష్టి మరల్చానో, అప్పుడు నన్ను, నా చర్మాన్ని, నా రూపాన్ని గమనించడం మాని, నా వ్యక్తిత్వాన్ని, నా ప్రతిభను మాత్రమే గుర్తించడం మొదలు పెట్టారు. ప్రమాదంలో చర్మం రంగు ఆకారం మారినంత మాత్రాన కృంగిపోవాలిసిన పనిలేదు. అనివార్యమైతే తప్ప ప్లాస్టిక్ సర్జరీ అవసరం లేదు. నేను లేకున్నా ఎవరో ఒకరు మిస్ యూనివర్స్ అవుతారు. మిస్ యూనివర్స్ లు మారిపోతారు కాలంతో పాటు. కొత్తవాళ్లు వస్తారు. కానీ నాలోని కాన్ఫిడెన్స్ నేను బ్రతికి

ఉన్నంత వరకు నాతోనే ఉంటుంది.

నేను మిస్ కాన్ఫిడెన్స్ గా నా లాంటి బాధితులకు అండగా ఇలాగే ఉండాలని అనుకుంటున్నాను.

నా కోసం మీరు సేకరించిన క్రౌడ్ ఫండింగ్ మీకు అభ్యంతరం లేకపోతే ప్రమాదంలో చర్మం కాలి, అందాన్ని కోల్పోయి డిప్రెషన్ లో ఉన్నవారికి, మనోధైర్యాన్ని ఇవ్వడానికి స్టార్టప్ లు, వీళ్ళలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించే పరిశ్రమలు స్థాపించడానికి వినియోగిస్తాను..'

ఈ మిస్ యూనివర్స్ వేదిక ద్వారా, పోటీ నుంచి తప్పుకున్నా మీ మనసుల్లో నుంచి తప్పుకోని ఈ మనస్విని. విన్నపం.

'అగ్ని ప్రమాదాల్లో, యాసిడ్ దాడుల్లో అందాన్ని కోల్పోయిన మీరు, జీవితాన్ని కోల్పోయినట్టు కాదు. మీ వ్యక్తిత్వాన్ని, ప్రతిభను, గుర్తించేలా స్ఫూర్తిని కొనసాగించండి. కుంగుబాటును వీడి, వెలుగులోకి రండి... సెలవ్.

చేతులు జోడించింది మనస్విని.

***

ప్రపంచమంతా విస్తుపోయినా, మనస్విని మాటల్లోని భావాన్ని, తాను తీసుకున్న నిర్ణయాన్ని, ఆమెలోని స్ఫూర్తిని.. హర్షించింది. ప్రతీరోజు ఎక్కడో ఒకచోట అగ్నిప్రమాదం.ఎక్కడో ఒకచోట యాసిడ్ దాడులు.పుట్టుకతో అనాకారిగా పుట్టిన వాళ్ళు. వీళ్ళందరికీ మనస్విని నిర్ణయం ఒక జీవిత సత్యం.

చర్మం రంగు, చర్మం ద్వారా సంక్రమించే అందం కన్నా, చర్మం పొరల్లో ఉండే మనసు, ఆలోచన ఆశయం సంకల్పం మీలో కొత్త అందాన్ని ఆవిష్కరిస్తుంది..అన్న గొప్ప ఫిలాసఫీ చెప్పింది మనస్విని.

***

కేథరిన్.. మిస్ యూనివర్స్ పోటీలో మనస్విని తో పోటీ పడిన వ్యక్తి.

తన సూట్ లో కూర్చొని వుంది. మనస్విని తప్పుకున్నాక మిస్ యూనివర్స్ అవకాశం ఆమెకు వుంది.

ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. అప్పుడే అక్కడికి వచ్చింది మనస్విని.

మనస్విని పాదాల మీద పడింది కేథరిన్.

'నేను తప్పు చేశాను. ఘోరానికి దిగజారాను. నీ సూట్ లో షార్ట్ సర్క్యూట్ అయ్యేలా చేసింది నేనే... 'ప్రక్షాళన కోరుకుంటోంది కేథరిన్.. కన్ఫెషన్ బాక్స్ ముందు నిలబడినట్టు.. మనస్విని ముందు మోకరిల్లింది.

'నాకు తెలుసు... నువ్వు ఏ ఉద్దేశంతో ఈ ప్రమాదాన్ని సృష్టించినా, ఒక నిజాన్ని, అన్వేషించేలా చేసావు. ఈ చర్మం. ఈ అందాన్ని కప్పి ఉంచే ముసుగు.

దహనమో..ఖననమో... మరణం తర్వాత దేహం కనుమరుగవుతుంది.

శాశ్వతమైన అందం చర్మం పొరల్లో లేదు. ఆలోచనల స్థావరంలో వుంది

కేథరిన్ భుజం తట్టి... 'నువ్వు మారావని నమ్ముతున్నా... అల్ ది బెస్ట్' చెప్పి వెనుతిరిగింది మనస్విని. స్ఫూర్తివంతమైన వెలుగురేఖల విచ్చుఖడ్గమై !

***

మిస్ యూనివర్స్ లో అడిగిన, విజేతను నిర్ణయించిన ఒకే ఒక ప్రశ్న 'అందానికి స్ఫూర్తికి నిర్వచనం ఏమిటి?

కన్నీటి పొరల మధ్య సమాధానం చెప్పింది కేథరిన్ 'మనస్విని.."మిస్ కాన్ఫిడెన్స్ ఫరెవర్'

మనస్విని మిస్ కాన్ఫిడెన్స్.. నడుస్తూ వెళ్తుంటే ప్రపంచం రెడ్ కార్పెట్ పరిచింది.

***

**విజయ్ ఆర్కే**

నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్ట్ గా, రచయితగా ( ప్రొఫెషనల్ రైటర్ గా )అక్షర ప్రయాణం కొనసాగిస్తున్నారు విజయ్ ఆర్కే. వ్యక్తిత్వ వికాస పుస్తకాలు మిమ్మల్ని మీరు అర్థం చేసుకోండి, అసంతృప్తిని జయించండి, ( తెలుగు కన్నడ భాషల్లో ) జీవితాన్ని జయించండి, మీ ఇష్టం తదితర రచనలు చేశారు. 'మేన్ రోబో, క్యూ, ఆమె కనబడుట లేదు. జడ్జ్ మెంట్ పైసా వసూల్, గాడ్ ఫాదర్, శిఖండి,సెక్షన్ 494 , నిర్ణయం, విజేత, భస్మ సింహాసనం ..ముప్పయికిపైగా సైన్స్ ఫిక్షన్ ,థ్రిల్లర్,రాజీనామా,ఫ్యామిలీ డ్రామా నవలలు రాశారు. ఏడువందల పైగా కథలు రాశారు. సెక్షన్ 494, నిర్ణయం, రాజీనామా, నవలలు కన్నడ భాషలోకి అనువదించబడ్డాయి. విద్యార్థుల కోసం, యువత కోసం పీస్ ఆఫ్ మైండ్,సక్సెస్ సక్సెస్ ,విజయం మీదే,ఒత్తిడిని జయించండి,హ్యాపీ లైఫ్ " తదితర రచనలు ముప్పై కి పైగా..వీటిలో కొన్ని ఇంగ్లీష్ లోకి అనువదించబడ్డాయి.

+91 97002 89681



# వేదశృతి

## శ్రీవల్లిభాస్కర్

సుందరంపేట, ఆ గ్రామం అంత సుందరంగా ఏమి ఉండదు, అప్పడప్పుడు ఎర్రబస్సు నేనున్నాను అంటూ గ్రామానికి వస్తుంది, ఆ బస్సు వచ్చిందంటే సగం మంది బస్సు కాడనే ఉంటారు. ఆ గ్రామ ప్రజల జీవనాధారం వ్యవసాయం, గ్రామం పై అందరిది ఒకటే మమకారం పుట్టిన ఊరు, పెంచుతున్న భూతల్లి.

ఎలుకల లొల్లికి ఉలికిపడి కళ్లు తెరిచి సూసిండు, రేతిరి సమయం ఎంతో తెల్వదు, అందాద మూడో, నాలుగు ఐనట్టుంది. ఆకాశం కెల్లి సూసిండు పరమయ్య, ముగ్గారబోసినట్లు ఎన్నెల, తెల్లని మేఘాల మధ్య మెరిసిపోతుండు చంద్రుడు.

నుల్క తెగిన గడెంచె నుండి బొంగు పట్టి లేచిండు, దాచుకున్న చుట్టపీక తీసి పంటితో కొరికి ఊసేసి, నోట్లో పెట్టుకుని ఊరి కేసి చూసిండు. గుట్టమీద జాగాలో గుడిసె ఆడ నుండి చూస్తే ఊరు అంతా కనబడద్ది. రామాలయం, గ్రామదేవత ఆలయం, వెలిగి వెలగని దీపాలు, ప్రశాంత వాతావరణంలో పల్లె నిదరవుతోంది. నిశ్శబ్దం మధ్య కప్పల అరుపులు, కీచురాళ్ళు, చిమ్మటల సంగీతం, దూరం నుంచి కుక్కల రాగాలు.

పక్క పలంగి పై సూసిండు, సీతాలు ఆమె పై కాలేస్కుని పొల్ల. ఆ పక్కే పోరగాడు, ఇద్దరికి ఏమి తెలియని అమాయకపు బాల్యం. బమ్మదేవుడు ఏ తాడుతో పెనవేసినాడో మా బంధం, భుజంపై ఉన్న తుండుగుడ్డ తీసి సప్పుడు కాకుండా ఎన్నెల్లో మెరిసిపోతు, అచ్చేదనంగా పండుకొన్న పెళ్ళాం సీతాలు యదపై వేసిండు.

'ఎంచబోతే మంచమన్నీ కంతలే, మన బతుకుగిట్లనే ఉంటది' సీతాలు మాటలు పరమయ్య చెవిలో బూగ మాదిరి గోదు వెదుతున్నాయి.

పది దినాల్ల ఎండల తాకిడికి వరుణ దేవుడు కరుణించక భూతల్లి నోరు ఎల్లబెట్టింది. రోహిణి కార్తె ఎళ్లినా ఎండ తీవ్రత తగ్గలే, గ్రామ జనం వరుణ దేవుడు కోసం కప్పలకు పెళ్ళిళ్ళు చేసి ఊరంతా ఊరేగింపుగా ఊరేగిస్తే వర్షాలు కురుస్తాయి అని నమ్మకంతో రెండు రోజులుగా ఆ పనిమీదే ఉన్నారు. మంది తరలిరావడతో ఆలయం కిటకిటలాడింది, కప్పల పెళ్ళి అట్టహాసంగా నిర్వహించారు ఊరి జనం నమ్మకమొ, ప్రకృతి కరుణో పొద్దుగూగేటప్పటికి వరుణుడు కరుణించాడు.

తూర్పు దిక్కున అయ్య ఇచ్చిన ఎకరం పొలంకు, ఈ కురిసిన నీళ్ళు ఎంత వరకు ఉపయోగ పడతాయి తెల్వదు.

'పట్నం పోదాం కైకిలి చేసుకోవచ్చు, ఇప్పుడు పైకం కానక ఇబ్బంది పడుతున్నా అక్కడింత ఇక్కడింత జమజేసిన పైకంతో విత్తనాలు కొని, పొలం దున్ని, నాట్లేసిన. మందులు జల్లదానికి డబ్బుల్లేవు, దినం గడిస్తేనే సాలు అన్నట్టుంది బతుకు. మదుం వారమదైనా కావాలి,

మాటకారి మొగుడైనా కావాలి' అంటూ సీతాలు లొల్లి పెట్టినా నెట్టికొస్తున్నాడు పరమయ్య.

**.2.**

'సీతాలైనా జరంత సోంచాయించాలి, ఐనా ఈ కష్టం మా ఊర్లో సానామంది పడుతున్నారు మనకే వచ్చిందా' పరమయ్య ఆలోచన.

'అయ్య ఇచ్చిన పొలం నమ్ముకుని తానొక్కడే ఉన్నపుడు ఏమి అన్పించలే. పెళ్లాం, ఆ ఎనకె పుట్టుకొచ్చిన పసిది మల్ల పుష్కరానికి పోరడు బయటకు వచ్చిండు, గిప్పుడు సరిపెట్టుకున్న సరిపోవుడు లేదు.

'బిడ్డ అక్కడక్కడ ఏరుకొచ్చిన పువ్వులతో బతుకమ్మ పేర్చి, చినిగిన బట్టలతో ఆడుతూ వుంటే, దాని దోస్తులు కొత్తబట్టలేసుకుని ఆడుతున్నారయ్య, నీ కంటికి కనపడదా' ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకుంటూ సీతాలు.

మా అయ్య నాల్గు బర్రెలిచ్చి మేపుకు రా పో, అంటే గోసి గుడ్డ అడ్డెట్టుకుని సాగించిన బతుకు, గ్రామంలో ఇస్కూలు ఉంటే కదా సదువుకోనకి, అందరు నాలాగనే అగ్గి పెట్టెలను చించి పత్తాలాట, గోళీలాట, శిర్రగోనె, దోస్తులతో బావుల్లో ఈత, కాల్వలో చేపలు పట్టడం, కట్టమీద కూసుని బీడీలు ఈ బతుక్కు సీతాలు తోడు.

'పాటిమీద వ్యవసాయం, కూటికైనా రాదు, నీకు, నాకు ఎట్టా లేదు కాని, పసిదానికి సదువులే, గిప్పుడు ఈ పిలగాడికి సదువు సెప్పించవా, పట్నం పోదాం మంచి భవిష్యత్ ఇద్దాం' సీతాలు అంటే నా నోట మాటేలే.

సీతాలును చూసి చిదిమి దీపం పెట్టవచ్చు అన్న మారాజ్ మాటలకు అర్ధం తెల్వక పోయినా, సీతాలు మంచి తెలివైంది, బిడ్డలను బాగు సేయాలని తపన, పట్నం పోతే బతికేదెట్ట, జన్మనిచ్చిన ఊరు వదిలేదెట్ట.

గిదే మాట సావుకారి కాడ అంటే కుతూహలం ఆపుకోలేక పూరా జెప్పరాదె అంటు ఎంతో ఆత్రంగ వింటాడు, 'ఎడ పోతావు పరమయ్య, పట్నం పోతే ఇబ్బంది పడిపోతావు, సాన కష్టం, సిన్నప్పటి నుండి చూస్తున్నకా, ఈడనే ఉండి బిడ్డకు లగ్గ సేయి, పైసలు, గీసలు అప్పెట్టడానికి నేను లేను ఎప్పుడు కావాలంటే అప్పుదురా, ఇక పిల్లగాడు ఎట్టో అట్టా బతికేస్తాడు. సీతాలును తోల్కుని రా, నేను సెపుతాగద' ఎంత సక్కగా సెప్పిండు సావుకారు.

'అంతా తెల్సినోడు లేదు, ఏమి తెల్వనోడు లేదు. ఐనా ఊళ్లో మంది సెప్పేది ఇంటావు, కట్టుకున్న పెళ్లాం మాట బుర్రకెక్కదు, నాను మంచి చెపితే రంది పడతావు. దొర కాడ బాకీ ఇంకా తీరలే, ఈ సావుకారు ఒకడు. ఐనా సావుకారు నాకు సెప్పేది ఏంటి, ఏలే వాని ఎద్దు పోతేనేం, కాచేవాని కన్ను పోతేనేం, నా ముల్లె నిండితే చాలు అనే రకం. అసలు నీతాన బుర్రంద, జరంత సోంచాయించు లేదంటే మన బతుకు ఇట్టనే ఉంటది'

'మంచి వాణ్ణి డబ్బిచ్చైనా కొనుక్కోవాలి, చెడ్డవాణ్ణి డబ్బిచ్చి వదిలించుకోవాలి, ఎప్పుడు పొలం దున్నాల, ఎప్పుడు విత్తులు నాటాలా, పంట ఎప్పుడు కొయ్యాలా ఇవే కదా నీకు తెలుసు, నిరుడు చెప్పా ఇనలే, ఇప్పుడు సెపుతున్నా ఇంటావా, ఇనవా' సీతాలుతో ప్రతి దినం లొల్లే.

***

**.3.**

'సీతాలు, సావుకారమ్మకు పాలు లేవుట, పోరగాడికి తల్లి పాలే కావాల్నట, నిను తోల్కుని

రమ్మాన్నాడు సావుకారు' గుట్ట ఎక్కుతూ పరమయ్య.

'ఆ సావుకారంటే ఓ ఇద్దై పోతావు, ఆ సావుకారమ్మ నాకూ కబురంపినాదిలే, గా పిల్లగానికి పాలు ఇవ్వాలని ఉన్నా, సావుకారిని సూసి ఈయబుద్ధి గాగ మళ్లొస్తానని వచ్చేసా' అంది సీతాలు.

'మనం పది మందికి ఉపయెగపడాలే సీతాలు, జర సూదరాదే, తల్లి పాలే ఇవ్వాలని దవాఖానాలో చెప్పింద్రట.

'ఏటి పిల్లగానికి పాలిస్తే పదిమందికి ఉపయోగపడిపోయినట్టే, దిమాకుండే గామాటన్నావా, నాను మాటాడేది సావుకారి గూర్చి, నా వంకే ఇకిలించుకుంటా సూస్తాడు' సెప్పింది సీతాలు.

'ఐనా మన పిలగానికి సరిపోనాకే గా పిలగానికిచ్చేది, మంచి సేసినా మంది ఏమి పట్టించుకోరు, సేయకపోతే నానా మాటలంటారు నువ్వేం రంది పడమాక '.

ఉదయం, సాయంత్రం సావుకారి పిల్లగాడికి సనుబాలు తాగిపించి వస్తోంది సీతాలు, సావుకారికి కనిపంచకుండా చీర కొంగు పూర కప్పుకుని తలదించుకుని వెళ్లినా, గప్పుడప్పుడు బిడ్డను తోడ్కుని వెళ్లినా, సరిగ్గా టైంకు సావుకారు సీడిలకాడనే కూకుంటాడు పండ్లు ఇకిలించుకుంటు.

అప్పటి గుసలాట యాదికొచ్చి రేతిరి నిద్రే పట్టలే పరమయ్యకు, పెద్దాళ్లతో మనకెందుకే అంటే సీతాలు ఇనలే, ఏతులు సెప్పుకొని బతికే బతుకులు కూడ ఒక బతుకేనా అంటూ, బిడ్డను ఏదో అన్నాడని ఎళ్లి సావుకారితో గరంగరంగ జగడమాడింది.

ఏంది జరిగిందో ఇషయం సెప్పవే అంటే నీకు సెప్పినా ఒక్కటే, బర్రెకు సెప్పినా ఒక్కటే నీకు పౌరుషం లే, గరీబోల్లలా బతకడం నాకు సేత కాదు, ఒక్క దినం కూడ ఈ ఉళ్లో ఉండేది లేదని తెగేసి చెప్పేసింది.

***

అటు ఇటు తిరిగే బళ్లు, బస్సుల హారన్లు, అడుగుతీసి అడుగు వేయాలన్న ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాలి ఏమి తెలియని పట్నం.

'ఏందే గీ పట్నం ఏ దారి ఎటు పోతాదో తెల్వదు, గా మారాజ్ బిడ్డ ఏడున్నదో తెల్వదు, నా వల్ల కాదే' అంటూ పరమయ్య యాష్టోచ్చి చెట్టు నీడ కూసున్నడు.

తనకు బాధ వచ్చినప్పుడల్లా పూజారి బిడ్డ దగ్గర చెప్పుకుంటుంటే, పట్నంరారా, చూసుకుంటానని సెప్పేది. పూజారి కూడ మంచి చెడు సలహాలు ఇచ్చేటోడు, పట్నం పోదాం అని నిర్ణయం సేసాక పూజారి కాడకు పోతే, పత్త రాసిచ్చినాడు, గది చూపించి గా ప్రదేశానికి వచ్చి ఎంత దేవులాడిన ఆమె జాడ తెల్వలే, చెట్టు నీడే ఆవాసం.

పొద్దుగాల నుండి ఏమి ఎంగిలి పడలే, మడిగ కాడికి పోయి ధర చూసి సెక్కర వచ్చినంత పనైంది సీతాలుకు

'అమ్మా దూపయితాంది' అని బిడ్డంటే, ఎదురుగా ఆలయం దగ్గర నల్లా నీరు పట్టి తీసుకునివచ్చింది సీతాలు.

.4.

పిల్లల ఆకలి తీర్చడానికి ఆలయం వద్ద బిచ్చగాళ్లతో పోటీ పడి, పంచుతున్న పులిహోర

పొట్లాలు లాక్కొచ్చింది, గంత కొట్లాడిన రెండే దొరికాయి సీతాలుకు.

ముందు బిడ్డలకు తినిపించి, పండుకున్న పరమయ్యను లేపి పెట్టింది.

'నువ్వు తిన్నావా' అని పరమయ్య అడిగితే

ఆకలికి డొక్కలో నొప్పి వస్తున్నా, తిన్నానని అబద్ధమాడి, నల్లా నీళ్లు నోట్లో పోసుకుంది సీతాలు.

పూజారి బిడ్డ జాడ దొరక పుచ్చుకోవాలి, కాకుంటే ఊరికి పోదాం అంటాడు పెనిమిటి, అక్కడ అంతా మనుష్యుల రూపం లో ఉన్న తోడేల్లే ఒళ్లంతా జలదరింపు, దొర కన్ను నాపైనే ఇంటికి పంపు పని చేస్తుంది అంటాడు, ఐనా బాంచెన్ కాల్మొక్తా బతుకులు ఎన్నాళ్లు, మనసులో గుబులైతాంది సీతాలుకు.

'సీతాలు మబ్బులో మన ఊరు పోదాం, ఈడ బతకడం మన తాన కాదు, పాయిదా లేదు, అంతా ఆగమాగం ఉంది' అన్నాడు పరమయ్య

తన మనసులోని ఆలోచన మనసులోనే ఉండగా పరమయ్య నోట్లోంచి వచ్చేసింది

ఒక్కసారిగా సీతాలు వంటి నిండ చెమటలు, ఊరు ఊసేత్తుతే చమటలే, మల్లా ఊరు పోతే అనుకున్నట్లు బతుకు అట్లనే ఉంటదా, పోరగాడికి సదువు సెప్పేది, పిల్లదానికి మంచి లగ్గం సెసేది లేదా, అన్ని యాది కొచ్చి కళ్లలోంచి నీళ్లు బుగ్గల ఎంట కారుతున్నాయి.

ఏమి పట్టనట్టు బుర్ర దించుకుని తింటూనే ఉన్నాడు పరమయ్య

'సీతాలు...సీతాలు'

ఉలికిపడి, ఎవరా అని ఆ పిలుపు వచ్చిన దిక్కు కేసి చూసింది సీతాలు, గుండెలు ఒక్కసారి ఎగిసి పడినాయి, పోయిన పాణం మల్ల అచ్చినట్టయింది, సీతాలు ఆశ్చర్యానికి అవధులు లేవు, ఎదురుగా పూజారి గారి బిడ్డ, కూసున్న చోటు నుండి జెప్పన లేసి ఉరికింది.

ఆమె పైనే ఆశలు పెట్టుకుని కోటి ఆశలతో పెనిమిటిని ఓమానంగా బుదగరిచ్చి, పట్నం తీస్కొచింది, ఆ ఆశే ఎదురుగా నిలబడితే, ఒక్క షణం ఆగని కన్నీళ్లు కళ్ల వెంబడి బొటబొట వస్తుంటే, అలాగే ఉరుక్కుని వెళ్లి ఆమెకు ఎదురుగా మోకాళ్ల మీద కూసుని చేతులు మోహానికి అడ్డు పెట్టుకుని వెక్కివెక్కి ఏడుస్తు ఉండి పోయింది. దూరంగా ఉన్న పరమయ్య, బిడ్డలు పైలంగ నడుసుకుని ఆళ్ల దగ్గరకు వచ్చిండ్రు.

ప్రేమగా తన రెండు చేతులతో సీతాలును పట్టుకుని పైకి లేపింది ఆమె

'అమ్మా మీరు మమ్మల్ని తాకడమా' చీర చెంగుతో కళ్లు అద్దుకుంటూ దూరం జరిగింది అంత బాధలోను సీతాలు

'అదేంటి సీతాలు అలా అంటావు' అని దగ్గరగా తీసకుని సీతాలు కళ్లు తుడిచింది

'మన పుట్టుకలో భేదాలుండొచ్చు మన మందరం మనుషులమే, ఒకరిని ఒకరు ఆదరించుకొని సాగించే మానవత్వం కావాలి, ఆచారం, కట్టుబాట్లు, మనం ఏర్పరుచుకున్నవి, భగవంతునికి ఆ భేదాలు లేవు కదా' అంది. ఓపాలి తేరపార చూసింది పూజారి బిడ్డను సీతాలు

చేతి నిండుగా గాజులు, నుదుట శారానంత ఎర్రటి మందారం లాంటి బొట్టు, చెవులకు మెరిసేటి బుట్టాలు, గల్లుగల్లుమని సవ్వడి చేసే కాలి మువ్వలు, ఆకుపచ్చని చీరలో అచ్చు అమ్మోరుతల్లిలా కనిపించింది సీతాలుకు.

'ఇందాక గుడి దగ్గర మా బాబు నిన్ను చూసి గుర్తు పట్టి నాకు చెప్పాడు, ఆ ఎదురు గల్లీ

లోనే మా బిల్డింగ్, వెళదాం రండి, ఏం పరమయ్య బాగున్నావా' ఆ మాటలలో ఆత్మీయత తొణికిసలాడింది,

సీతాలు భుజంపై చేతులు వేసి దగ్గరకు తీసుకుని ముందుకు నడిచింది వేదశృతి.

***

**.5.**

'పరమయ్య నీ తాత ఐదెకరాలుకు వారసుడు, అది మీ నాన్న ఎకరం చేసి నీకు ఇచ్చిండు, రేపు నువ్వు నీ పిల్లలకు ఏమిద్దామని' పరమయ్యను, సీతాలును కూర్చోబెట్టి మాట్లాడుతోంది పూజారి గారి అమ్మాయి వేదశృతి.

'నీకు జన్మనిచ్చిన ఊరే కాదనట్లే, రేపు నీ పిల్లల పరిస్థితి ఏంటి, సమాజం తో పాటు వాళ్లు ఎదగాలి ఉన్నచోటే ఉండి పోవడం కాదు పరమయ్య'

'సీతాలు ఆశయం గొప్పది, బిడ్డలకు బంగారు భవిష్యత్తు ఇద్దామని ఆరాటం, ఏదో సాధించాలని తపన, సాధించలేమని చేతులు కట్టుకుని కూర్చుంటే ఎలా, ఆశయంతో మనం పది అడుగులు ముందుకు వేస్తే విజయం వంద అడుగులు మన ముందుకు నడుచుకుని వస్తుంది పరమయ్య'

'బిడ్డా నువ్వు సెప్పేది నా బుర్రకు ఎక్కలే, నువ్వు మా గొప్పగా సెపుతున్నావు, ఐనా నాతాన పట్నంలో బతికేంత పైకం లేదు, సీతాలు అనుకున్నది జరగాల. మాకు ఉపకారం చేయ్యాలంతే,' రెండు చెతులతో దండం పెడుతూ పరమయ్య.

'పరమయ్య, సీతాలు, పిల్లలు నాదగ్గరే ఉంటారు, వాళ్లకు కావలసినవి నాను జూస్కుంట, నువ్వు ఊరికి పోయి, మాసానికో పాలి ఈడకు రా, మా అపార్టుమెంట్ నౌకరీ సీతాలుకు ఇప్పించి కాపలాగా ఉండేందుకు రూము, పైకం ఇప్పిస్తా, నాల్గు ఇండ్లలో బోళ్లు పని చేసుకుంటది, పక్కనే ఇస్కూల్లో ఇద్దరిని నేను సదివిపిస్తా, సరేనా' పరమయ్య కు భరోసా ఇచ్చింది వేదశృతి.

సీతాలు కండ్లలో మెరుపు చూసి, ఏదో తెలియని సంబురం వేసింది పరమయ్యకు

'బిడ్డా, నీతాన నా గుండె వదిలి వెళ్తున్నా, జర పైలం తల్లి, తప్పు మాటాడితే కాల్మొక్త బాంచన్ గరీబోళ్లం జర న్యాయం చేయి తల్లి, మా బిడ్డల బతుకులు సక్కగైతే సీతాలుకి ఆనందం, గంతే చాలు నాకు' అంటూ భుజానికి ఉన్న తువ్వాలుతో కళ్లు తుడుచుకుంటూ పరమయ్య

'ఎందుకంత పెద్ద మాటలు పరమయ్య, మనస్సులో ఏమి లేకుండా జాగ్రత్తగా పోయి రా' అంది వేదశృతి

అపార్టుమెంట్ వాచ్‌మెన్ మానేయడంతో, ఆ డ్యూటీ సీతాలుకు ఇప్పించి, భోజనం తన ఇంట్లో ఏర్పాటు చేసింది వేదశృతి.

పట్నం గూర్చి ఆ ముచ్చటా ఈ ముచ్చటా చెపుతూ, ఊరి విషయాలు అడిగింది వేదశృతి.

'అమ్మా గా దినం ఏం జరిగిందో ఎరుకేనా, నాబిడ్డను గోదలచ్చేయాల్లకు సావుకారి ఇంటికి అంపితే ఏం జరిగిందో ఏమో ఎడస్తూ వచ్చిందిమ్మ బిడ్డ. ఏమైనాదే జర చెప్పవే అని అడిగితే సెప్పలే, కూసింత కూసోపెట్టి ఆరా తీస్తే ఏడ్చుకుంటూ తన గుండెలు సూపుతు నెప్పెడుతున్నాయి అని భోరున ఏడ్పు. సావుకారు పోరడకు తల్లి పాలు కావాలంటే మానవత్వంతో నా పాలు ఇచ్చినాను, గట్లాంది గా షావుకారు దుర్బుద్ధితో నా బిడ్డ లేత

పాలిండ్లు...ఛ, లగెత్తుకెల్లి సావుకారికి ఎడపెడ ఇచ్చేస. షణమైన ఊల్లో ఉండబుద్ధికాక, వచ్చేసా. షావుకారితో తగాద అని మాత్రమే నా పెనిమిటికి తెలుసు, ఈ విషయం తెల్వదు, మాపై పేమ ఉందిగాని, బుర్ర తక్కువ ఇంటి ఇషయాలన్ని తీస్కెల్లి షావుకారికి, దొరకు చెపుతాడు. గిప్పుడు యాది చేసుకుంటుంటే ఆ పిలగానికి పాలు ఇవ్వడం కూడ సావుకారి వేసిన ఏశాలనిపిస్తోంది'

సీతాలు చెప్పిన మాటలకు మనసు చివుక్కుమని అనిపించింది వేదశృతికి

'సీతాలు మీ ఊళ్లోనే కాదు పట్నంలో కూడ తోడేళ్ళు ఉంటాయి జర జాగ్రత్తగా ఉండాలి

కొద్ది నెలల తర్వత వేదశృతి తన ఆలోచనలకు పదును పెట్టింది, ఎంత కాలం సీతాలు ఇలా చాలి చాలని జీతం తో గడుపుతుంది, తన ఆశయాలకు తోడై నిలవాలని, సీతాలు ను పిలిచి.

**.6.**

'ఈ కాలనీలో చాల మంది ఉదయం పోయి, సాయంత్రం ఇంటికి చేరతారు, వండుకోవడానికి సమయం ఉండదు, మరి కొందరికి చేసుకోవడం రాదు. నీకు వంటలు వచ్చు కాబట్టి పిండి వంటలు సర్వపిండి, సకినాలు, మలిదలు, చేగోడీలు, కారం, గరిజాలు తో పాటు పచ్చి పులుసు, పొట్లకాయ పులుసు ప్రారంభించు, కావలసిన సామానులు, డబ్బులు నేను చూస్తాను' అని చెప్పి సీతాలుతో ప్రారంభించింది.

ఏ ముహుర్తంలో వేదశృతి ఆలోచన చేసిందో, కావలసిన ప్రచారం కూడ కల్పించడంతో సీతాలు వంటలకు తక్కువ సమయంలోనే కాలనీలో మంచి పేరు వచ్చింది.

వంటలు అన్ని రుచిగా, సుచిగా తయారు చేయడానికి కావలసిన జాగ్రత్తలు అన్ని ఎప్పటికప్పుడు వేదశృతి పర్యవేక్షణ తో సాగేవి.

వ్యాపారం మెల్లమెల్లగా విస్తరించి కాలనీ లోనే కాక దూరం నుంచి కూడా వచ్చి తీసుకుని వెళ్లడంతో, సీతాలు వంటలకు గిరాకి పెరిగింది.

ఆర్డర్ల మీద ఆర్డర్లు రావడం, క్యాటరింగ్లు బుక్ కావడంతో, సీతాలు వాచ్ఉమెన్ ఉద్యోగానికి ముగింపు పలికి, ఆ అపార్టుమెంట్ లోనే కిరాయికి డబుల్ రూము తీసుకుని వ్యాపారాన్ని విస్తరించింది వేదశృతి.

'సీతాలు ఊరి నుంచి తెలుసున్న ఓ పదిమంది ఆడవారిని పిలిపించు, నువ్వు, నేను కావలసిన సరుకులు, ఆర్డర్లు చూసుకుందాం, నీకు డబ్బులు లెక్క తెలిసింది కాబట్టి ఖర్చులు తీసి, వచ్చిన లాభం అంతా నువ్వే తీసుకుని ఊర్లో బాకీలు తీర్చు...' వేదశృతి చెపుతూ ఉంటే సీతాలు కళ్ల నుండి నీళ్లు వస్తున్నాయి.

సీతాలు కళ్లలో కన్నీరు ఆగలేదు ఒక్కుదుటున వేదశృతి కాళ్ల పై బడి

'మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెల్వదు అమ్మ, ఎక్కడో బతికిన మమ్మల్ని ఆదుకున్నారు, నాకు గిన్ని నేర్పారు, బిడ్డలకు చదువు సెప్పిస్తున్నారు. బాంచన్ కాల్మొక్త అనే మాలాంటి గరీబోళ్లను, ఇంత పెద్దదాన్ని చేసారు,' అంటూ కన్నీటి తో పాదాభిషేకం చేసింది సీతాలు.

* * *

సుందరంపేట గ్రామం పేరుకు తగ్గట్టు సుందరంగా ముస్తాబయ్యింది, అప్పుడప్పుడు వచ్చే ఎర్రబస్సు పది దినాల నుండి టన్చన్గా రోజు వచ్చేస్తోంది

ఈ రోజు సుందరం పేట హడావిడాగా ఉంది, స్వాగత తోరణాలు, రోడ్లు పక్కన

పొడవుగా తెల్లటి ముగ్గు పొడి.

చిన్నా, పెద్ద అందరు చాలా సంబురంగా అటుఇటు తిరిగేస్తున్నారు, ఊళ్లో జాతర వాతావరణం నెలకొంది.

ఎమ్ఎల్ఎ గారు వచ్చారు మరి కొద్ది సేపటిలో మంత్రిగారు వస్తున్నారుట, ఈ సంబురానికి కారణం గ్రామంలో కొత్తగా ఇస్కూలు కట్టారు, ఈ రోజే ప్రారంభోత్సవం

పిల్లలు అందరు తయారు అయి వాళ్ల అమ్మలతో సిద్ధంగా ఉన్నారు, గ్రామస్థులు వ్యవసాయానికి బందు పెట్టారు.

పరమయ్యకు విషయం తెలిసి స్కూలు కాడకు వచ్చి, తోటి వారిని పలకరిస్తూ, వచ్చే కార్లను చూస్తు, తన పిల్లలను కూడ పట్నం నుండి తీసుకుని వచ్చి గీ స్కూలులో సదివిస్తే పోలే అనుకూంటు సుట్ట కాల్చుకుంటు గక్కడే కూసున్నాడు.

తానే గాస్కూలు కట్టించినట్టు దొర కనిపించినాళ్లకు పని సెపుతూ, హడావిడి పడిపోతున్నాడు,

మంది ఒక్కసారిగా లొల్లి చేయడం తెల్లకారు వచ్చి ఆగింది, పిల్లలు, ఆడోళ్ల చేతులలో ఉన్న పువ్వులు అన్ని కారులో వచ్చిన వారిపై ఎగరేసారు.

స్కూలు ప్రారంభోత్సవం చేసే వాళ్లు వచ్చారు, మంత్రిగారు ఏదో పని వలన రాలేదు అని తెలిసి కూసున్నచోట నుండి పరమయ్య లెగిసి ముందుకెళ్లాడు.

.7.

కారు లోంచి దిగిన ఇద్దరాడాళ్లతో ఎమ్ఎల్ఎ గారు స్కులు ముందు నులుచున్నారు, ఆలయ పూజారి మంత్రాలు చదువుతున్నాడు.

'పరమయ్య, ఓరి పరమయ్య ఏడున్నావే'

దొర గట్టిగా అరిచిన అరుపులకు, నోట్లో సుట్టపీక పడేసి, తలకు సుట్టుకున్న తుండుగుడ్డ సంకలో పెట్టుకుని ముందుకెళ్ళాడు తల దించుకుని పరమయ్య

'పరమయ్యా...ఇటు రా' వీణ మీటినట్టు వచ్చిన ఆ మాటలకు తలపైకి ఎత్తి సుసాడు, ఎదురుగా పూజారి బిడ్డ, పక్కనే సూరీడు కిరణాలు పడి మెరిసిపోతూ నెమలిపించం రంగు చీరలో దొరసానిలా సీతాలు.

'మీరు అస్తున్నట్లు సెప్పలేదే' బుర్రగొక్కుంటు పరమయ్య

'పరమయ్య, ఇస్కూలు కట్టించింది నీ సీతాలే, నీకే కాదు ఈ గ్రామంలో ఎవరికి తెలియదు' అంది పరమయ్యతో పాటు ఊరి ప్రజలు అందరికి వినబడేలా వేదశృతి.

గ్రామ జనం ఒకింత ఆశ్చర్యపడి, నమ్మలేక ఎగబడి చూస్తున్నారు సీతాలును

'నాది ఏమిలేదు, అంతా మన మారాజ్ బిడ్డదే' అంది సీతాలు

'గిదిగో, పంతులు బిడ్డను చేయమంటే నీచే చేయించ మంటోంది, పుట్టిన ఊరు, జన్మనిచ్చిన తల్లి అంటుంటావు కదా, నువ్వే రిబ్బను కత్తిరించి ఇస్కూలు ప్రారంభోత్సవం చేయి' పరమయ్య చేతికి కత్తెర ఇచ్చింది సీతాలు.

అందరి చప్పట్లు మధ్య పరమయ్య చేతుల మీద స్కూలు ప్రాంభోత్సవం కాగానే

ముందుకు నడుచుకుంటు వెళ్లి స్కూలు పేరుకి అడ్డుగా కట్టిన తెరను తొలిగించే తాడు పూజారి బిడ్డకు అందించి లాగమని సెప్పింది సీతాలు.

వేదశృతి ఆ తాడు పట్టుకుని లాగగానే 'వేదశృతి శిశు మందిర్ '

పేరు చదివి ఆశ్చర్యంగా సీతాలు కేసి చూసింది వేదశృతి

'మీకు తెలియ వద్దని మూర్తిగారికి సెప్పాను, రాత్రికిరాత్రి పేరు చేయించి ఈడ పెట్టిండు, అందుకే ఎవ్వలికి తెలియదు, నువ్వే కదామ్మ మమ్మల్ని ఇంతోళ్లని చేసింది'

సీతాలు చేతులు పట్టుకుంది వేదశృతి, చప్పట్లతో ఆ ప్రదేశం మార్మోగిపోయింది

పూజారి గారు వాళ్లిద్దరినిగర్వంగా చూస్తూ గట్టిగా ఆలపిస్తున్నారు

'సర్వవిద్యాధి దేవీ యా తస్మైవాణ్యైనమో నమః

జ్ఞానాధి దేవి యాతస్మైసరస్వత్యైనమో నమః'

***

**విజయభాస్కర్ మైలవరపు**

**కలం పేరు :** శ్రీవల్లిభాస్కర్ మైలవరపు. పుట్టింది ఆంధ్రా తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట. చదివింది, పెరిగింది అదిలాబాద్ (ప్రస్తుతం కుమురం భీం) జిల్లా సిర్పూర్ కాగజ్ నగర్. నాన్నగారు చిన్నతనంలోనే చనిపోయిన కారణంగా అన్నయ్యలు వెంకట్రామయ్య, సుబ్రహ్మణ్యం మరియు మూర్తి సిర్పూర్ పేపర్ మిల్లు లో ఉద్యోగం చేయడం తో.. కాగజ్ నగర్ గవర్నమెంట్ స్కూలు, కాలేజీలో చదువు సాగింది. హైదరాబాద్ లో న్యాయవాది వృత్తి చేపట్టి, ప్రవృత్తిగా రచనా వ్యాసంగంతో పాటు సినిమాలకు సంబంధించి కథలు, పాటలు రాస్తున్నారు. సినీ రంగంలో విజయం సాధించాలని కోరిక. 50 వరకు కవితలు వివిధ బహుమతులు పొందాయి. 30 వరకు కథలు వాటిలో అమెరికా తెలుగుజ్యోతి కథల పోటీలో ద్వితీయ బహుమతి, ఉషా కథల పోటీలలో బహుమతులు, ఈనాడు సండే మ్యాగజైన్ లో కథలు ప్రచురితమయ్యాయి.



# పీరియడ్ టైం

## నల్లపాటి సురేంద్ర

ఇంటి నుండి నడక మొదలు పెట్టీ అప్పటికే రెండు గంటలవుతోంది. పద్మ వ్యూహం లాంటి ట్రాఫిక్ దాటుకుంటూ నేను పని చేసే ఆరు అంతస్తుల గల 'స్మైల్ షాపింగ్ మాల్' కి వచ్చే సరికి శరీరమంతా పులిసి పోయినట్టుగా అయింది. విపరీతమైన చెమటలుపట్టి నేను వస్తే సూపర్వైజర్ ఎందుకు లేట్ అయింది? ఇలా నెల కు మూడు నాలుగు రోజులు లేట్ అయితే జీతం కట్ చేస్తా అర్థం అయిందా? అన్నప్పుడు నెలకు మూడు నాలుగు రోజులు లేట్ అవ్వడానికి కారణం 'పీరియడ్స్ టైం' నీకు అర్థంవ అవుతుందా అని చెబితే ఎలా తీసుకొంటారో అని భయం వేసి చెప్పకుండా 'సరే సార్' .. 'సారీ సార్' నెక్స్ట నెల నుండి లేట్ అవ్వకుండా చూసుకుంటా అని చెప్పాను

వెనుకటి రోజుల్లో పీరియడ్ వచ్చినా మహిళను చాప, గ్లాసు, పళ్ళెం ఇచ్చి బయట కూర్చోబెట్టేవారు హీనంగా చూసేవారు. ఏదీ ముట్టుకోవద్దంటూ ఆంక్షలు విధించేవారు ఎందుకంటే అప్పుడు కట్టు బాట్లు అలా ఉండేవి మగవారు ఒకరే సంపాదించే వారు. ఇపుడు పరిస్థితి మారింది. అడది కష్టపడక పోతే రోజులు గడవడం లేదు ఇక్కడ డబ్బు ప్రధాన వస్తువు గా మారినా పీరియడ్స్ విషయం మాత్రం ఏ మారలేదు పాపం చేసినట్లు చూస్తున్నారు కాబట్టి మగవారికి అవగాహన ఉండదు మాకు చెప్పే దైర్యం చాలదు.

పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పి చాలా కష్టంగా ఉంటుంది, కానీ కస్టమర్కి నచ్చిన బట్టలు ఇవ్వడం కోసం కిందకు పైక్కి మెట్లు ఎక్కుతున్నే ఉంటాం. కస్టమర్లకు కు మాత్రమే లిఫ్ట్ మేము ఎక్కకూడదు .

సాధారణంగా మెట్లు ఎక్కడం దిగడం సులువు అనుకుంటారు. కానీ ఒక్కోసారి దిగడమే చాలా కష్టం. బరువంతా మోకాళ్ల మీదనే పడ్తది. ఆ సమయం లో చేతులు కాళ్ళు వణుకుతుంటాయి ఎక్కడ రక్తపు మచ్చలు కనబడతాయో అని శానిటరీ నాప్కిన్స్ వాడిన మా భయం మాకు ఉంటుంది.

మహిళకు పురిటినొప్పి ఒక్కసారే ఉంటుంది, కానీ ఆ పురుడుకి కారణమైన ఈ నొప్పి మాత్రం ప్రతి నెల ఉంటుంది. ఈ విషయం ఏ మగ వాడికి కూడా అర్థంకాదు.

యుద్ధం చేస్తే రక్తము ఎరులై పారుతుంది.

కానీ మేము రక్తంతో యుద్ధం చేయాల్సి వస్తుంది ఆ మూడు రోజులు.

పీరియడ్స్ రావడానికి ముందు రోజు పోయినప్పుడు రెండు రోజులు చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఆ ఇబ్బంది తో పని నుంచి తప్పించుకోవాలని చూసినా పెద్ద కళ్లు

వేసుకుని సూపర్వైజర్ చూస్తాడు వారి ప్రశ్నలు కు జవాబు చెప్పలేము.

ఆ రోజులో లేడీస్ గార్మెంట్స్ మెన్స్ వేర్ వేరు వేరు గా ఉండేది. ఇప్పుడు ఇప్పుడంతా కలిపేసి ఉంటాయి. కలిసి మెలిసి పని చేసుకోవాలి లేడీ బాస్ లు ఉంటే మా పరిస్థితి చెప్పుకునే అవకాశం ఉండేది. ఓ రెండు రోజులు మారు మాట్లాడకుండా మినహాయింపు ఉండేది. కానీ ఇప్పుడు అలా కాదు మగ వారు దగ్గర పనిచేయాలి. నాతో పని చేస్తున్నా కొంతమంది ఆడవాళ్ళు దగ్గర నా నొప్పి గురించి వివరించిన పని నుంచి తప్పించుకోవడానికి 'ఇదో ప్లాన్ ' అని చెబుతుంటే మిగతా వారికి నాలా నొప్పి రాదా? పీరియడ్స్ రావా? అనిపిస్తూ ఉంటుంది. కొంతమంది నొప్పి ఉన్నా పోటీపడి పనిచేస్తారు. సూపర్ వైజార్ దగ్గర మార్కులు కొట్టేయడానికి. ఒక్కొక సారి లేట్ అయినా సపోర్ట్ గా ఉంటారని ఉద్దేశం తో, మరి కొంతమంది నాకు సపోర్ట్ గా ఏ భారం పడకుండా నన్ను చూసుకుంటారు. ఇక తప్పదు అనుకుంటేనే నాకు పని చెబుతారు మరి కొంత మంది. తమకు 'పీరియడ్స్' వచ్చాయని చెప్పుకోవడానికి కూడా చాలా సిగ్గుపడతారు. కొంతమంది నవ్వుతారు మరి కొంతమంది మాట్లాడటానికి మొహమాటం పడతారు ప్రాణం పోసే శక్తున్న మనకి ప్రాణం తీసే నొప్పిని తట్టుకునే శక్తి కూడా ఉంది. అలాంటప్పుడు ఎందుకు జంకు అనేది నాకు అర్థం కాదు. పీరియడ్స్ వచ్చినప్పుడు సమాజంలోనే కాదు. ఇంట్లోనూ కూడా వివక్ష ఉంటుంది. మా ఆయన ఆ మూడు రోజులు చెయ్యి కూడా తాకరు.

లంచ్ టైం లో అందరూ కూర్చుని తింటూ ఉండగా నా పీరియడ్ గురించి చెప్పాను వెంటనే చాలా మంది తినకుండా లేచి వెళ్లి పోవడం తో చెప్పలేనంత కోపం వచ్చింది.

మనం అడవాళ్ళమే కదా మన పీరియడ్స్ గురించి మన నొప్పి గురించి మన బాధ గురించి మనం చెప్పుకోక పోతే ఎవరు చెబుతారు? అందరి ఆడవాళ్ల కి వచ్చేదే కదా అని అనగానే వెళ్లి పోతున్న వారు ఒక సారిగా ఆగి నా వైపు చూసి నిలుచున్నారు. మీ అందరికీ కొన్ని సైన్స్ విషయాలు చెప్పాలి అంటూ కూర్చోబెట్టాను.

'ఆడపిల్లగా పుట్టినప్పటినుంచి అండాశయాలలో పూర్తిగా ఎదగని గుడ్లతో ఉన్న కణాల ఉండలు దాదాపు మూడు నాలుగు లక్షలుంటాయి. వీటిని ఫాలికల్స్ అంటారు. ఈ మాట చెప్పగానే నా వైపు ఆశ్చర్యం గా చూసారు. వాళ్ళు మన గర్భధారణ దశలో ఇందులో మూడు నుండి ఐదు వందలు మాత్రమే పక్వం చెందుతాయి. మిగతావన్నీ ముందే నశించి పోతాయి. పిల్లల్ని కనగలిగేదశ అంటే మన పీరియడ్ టైం మొదలైన పన్నెండు, పదమూడు సంవత్సరాల నుంచి నలభై, యాభై సంవత్సరాల అనగా పీరియడ్ టైం ఆగిపోయి వరుకు మనకు నెల నెల ఇబ్బందులు తప్పవు పీరియడ్ టైం ఆగిపోతే దానిని మెనోపాజ్ అంటాము. మన శరీరంలో తయారయ్యే ఈస్ట్రోజన్ హార్మోనుల మూలంగా నెలకొక్క గుడ్డు చొప్పున పక్వం చెందుతుంది. అండం అండాశయం నుంచి

బయటికి రావటాన్ని 'ఓవ్యులేషన్' అంటారు. అయితే మనం గర్భం తో ఉంటే మాత్రం ఆ తొమ్మిది నెలలు అండం విడుదల కాదు. అది జరగకపోతే మాత్రం అండం గొట్టాల అనగా అండవాహికలలోనే నశించి అప్పటికే గర్భాశయం గోడలనంటుకుని ఇన్ని రోజులుగా పెరిగిన పొర కార్పస్లూటియంతో, మన మూత్రం ద్రవాలతో కలిసి రక్తం రూపం లో బయటికి వచ్చేస్తుంది. దీన్నే మనం నెలసరి అని పీరియడ్స్ అని మన పెద్ద వాళ్ళు చెప్పే కుక్క ముట్టుకుంది అని చాలా చాలా పేర్లు వాడుతాము.

అసలు మగాడు రోడ్డుమీద నిల్చొని దర్జాగా బహిరంగగా సిగరెట్ తాగుతారు. మందు కొట్టి పిచ్చ గా ప్రవర్తిస్తారు. కానీ ఎవరు నోరు మెదపరు. కానీ మనం శానిటరీ న్యాప్కిన్ కోసం షాప్లో అడిగితే వింతగా చూస్తారు. ఎవరు కంట కనపడకుండా నల్లకవరులో పెట్టీ పేపర్ తో చుట్టి ఇస్తారు. ప్రకృతి సహజంగా జరిగే ప్రక్రియ ఇది అయితే మాట్లాడుకోవడానికి సిగ్గెందుకో అర్థంకాదు. భయం ఎందుకో అర్థం కాదు .ఇప్పుడు ఆడవాళ్లు అన్నీ రంగాల్లో రాకెట్ వేగంగా దూసుకెళుతున్నా, పీరియడ్స్ ను మైలగానే చూస్తున్నారు. ఇది మారాలి అమ్మ అవ్వడానికి పడే నొప్పిని చూసిన చేతులెత్తి నమస్కరించే వాళ్ళు పీరియడ్స్ నొప్పి ను మాత్రం హీనంగా చూడటం జరగకూడదు

అది అంటరానితనం కాదు. అమ్మతనం అని చెప్పాలి. నా మాటలకు నాతో పని చేసిన వాళ్ళు ఒక అవగాహనకు వచ్చారు. చప్పట్లు కొట్టారు. మరి కొందరు చాలా విషయాలు తెలిశాయి. మా పిల్లలకు చెప్పాలి. ఇంకా కొంతమంది నా దగ్గరకి వచ్చి మగవాళ్లకి ఇలాంటివి ఏమి తెలియవు. పండగ విశేషం రోజు పీరియడ్ వస్తే తిడతారు. కానీ నువ్వు చెప్పడం వలన మన శరీరం గురించి తెలిసింది అన్నారు.

చాలా సంవత్సరాలు షాపింగ్ మాల్ లో పని చేసే పెద్దావిడ సుమతి నా దగ్గర కి వచ్చి.. 'ఆడపిల్ల పుట్టుకే ఒక పోరాటం.. ఆడపిల్లా పుట్టిందా తండ్రి లోలోన చింతిస్తే బంధువులు బయటికి 'పెద్దయ్యాక రజస్వల ఫంక్షన్ చేయాలి, పెళ్లి చేయాలి, రెండు ఖర్చు లు, ఒక ఆడది గురించి ఒక ఆడది తప్పుగా మాట్లాడుతున్నా కాలం ఇది. నువు చెప్పి నట్లు పురిటి నొప్పి కన్నా నెల నొప్పి ఎక్కువ బాధిస్తుంది. అసలు మన జీవితమే పోరాటం బతుకు పోరాటం నేను ఇప్పుడు మెనోపాజ్ లో ఉన్నాను. ఒకప్పుడు నా ఇబ్బంది ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి లో బ్రతికాను. నరకం అంటే ఏమిటో తెలిసింది. పని చేస్తూ ఒక పూట సెలవు అడిగితే ఏమి అనుకుంటారో.. అని బాధ పడితే పరవాలేదు, కానీ నవ్వితేనే మనకు ఏడుపు వస్తుంది. తొలిసారి నీలో ఎలాంటి బిడియం లేకుండా మాట్లాడటం చూసాను. ఇప్పుడు నాకు కూడా ధైర్యం వచ్చింది. అంటూ చేయి పట్టుకుని సూపర్వైజర్ దగ్గర కు తీసుకువెళ్ళింది.

సూపర్వైజర్ మాట్లాడకుండా కేవలం సైగులు తోనే ఏమిటి అంటూ తలాడించాడు.

నేను ఈ షాపింగ్ మాల్ లో చాలా కాలం నుండి పనిచేస్తున్నాను. అందుకే మీరు

నాకు విలువ ఇస్తారు. నేను విలువ ఇస్తాను. ఆడవాళ్ళు విషయంలో ఎప్పుడు తప్పుగా ప్రవర్తించలేదు. కానీ సెలవు పెట్టినా, షాప్ కి ఆలస్యంగా వచ్చినా, మీరు ఒప్పుకోరు అలా చేయడం మీ వృత్తే కానీ, మా సమస్యలు కూడా ఉంటాయని మీరు గుర్తించలేదు. ప్రతి మహిళ కి ప్రతి నెల పీరియడ్ టైం ఉంటుంది. ఆ టైం లో ఆలస్యం అవ్వడం సహజం . అందుకని నెలకు ఒక సెలవు ఇవ్వండి, వారికి శరీర విశ్రాంతితో పాటు మానసిక విశ్రాంతి దొరుకుతుంది. ఎందుకంటే ఆ సమయం లో వచ్చే నొప్పి తట్టుకోవడం చాలా కష్టం. ఈ నొప్పి భరించలేక అమెరికాలో ఒక పదహారేళ్ళ అమ్మాయి ఎక్కువ మోతాదు లో పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు వేసుకోవడం తో ఆమె చనిపోయింది. ఇలాంటి సంఘటనలు తో చలించిన కేరళలో ఉన్న కొచ్చి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అస్సాం లోని గువహటి విశ్వవిద్యాలయం విద్యార్థినులు సౌకర్యార్థం నెలకు ఒక రోజు పీరియడ్స్ సెలవు ప్రకటించారు.

'ఆ పెద్దావిడ మాటలకు మా సూపర్వైజర్ చలించి అర్థం చేసుకుని అందరినీ పిలిచి నెలకు ఒక రోజు సెలవు ప్రకటిస్తున్నాను' అని చెప్పడంతో అందరిలోను ఆనందం కనిపించింది. ఎంత క్షోభ అనుభవిస్తూనే ఆ ఆనందమే వ్యక్తం చేయిరు, ఆ ఆనందానికి కారణమైన పెద్దావిడ ను నా చేతులోకి తన చేయి తీసుకుని ఆ రోజుల్లో మీరు ఎంత బాధ అనుభవించారో అర్దం అయింది. ఈ రోజుల్లో ఎంత టెక్నాలజీ వచ్చిన ఆ నొప్పి మాత్రం మారలేదు మా కోసం మాట్లాడారు. థాంక్స్ అని చెప్పి షాపింగ్ మాల్ నుండి బయటికి వచ్చాను. ఈ రోజు నాకు విశ్రాంతి అనుకుంటూ.. ఆనందంతో ఇంటికి చేరాను. నా భర్త ఆఫీస్ నుండి ఇంటికి వచ్చి కాలు మీద కాలు వేసుకుని కూర్చున్నాడు. సింక్ లో గిన్నెలు అలానే ఉన్నాయి. చాలా కోపం వచ్చింది. మగవారు ఆడవారు గురించి స్పీచ్ లు ఇస్తారు. గానీ ఇంటి పనులకి సహాయం చేయరు. దేవుడు వరం ఇచ్చినా పూజారి వరం ఇవ్వరు. పని కి విశ్రాంతి ఉండదు అనుకుంటూ... ఉండగా ఆయన నన్ను పట్టుకోకుండా తాకకుండా మెల్లగా నా పక్క కి వచ్చి 'పీరియడ్ టైం అయిపోగానే సెక్స్ టైం' అనగానే నా కోపం నషాళానికి ఎక్కింది. మా బాధ మీకు పట్టదా... 'సెక్స్ టైం సక్సస్ అయితే డెలివరీ టైం స్టార్ట్ అవుతుంది లేదా ఫెయిల్ అయితే పీరియడ్ టైం మామూలే' ఎటు చూసినా మాకు బాధే మీకు సుఖం గానే ఉంటుంది.

ప్రతి నెల నొప్పి, కోపం, చిరాకు, నిస్సహాయత, అసహ్యం, ఓర్చుకోవడం ఎంత కష్టమో తెలుసా అనే సరికి ఆయన 'సారీ.. సారీ' అంటూ నన్ను ఫస్ట్ టైం పీరియడ్ టైం లో హత్తుకున్నాడు.

ఆ ఎమోషన్ లో నేను కూడా ఆయన హత్తుకున్నాను. ఎందుకంటే ఆ టైమ్ లో ప్రేమ చాలా అవసరం అప్పుడు నా కనీళ్ళు కూడా ఆనందించాయి.

***

**నల్లపాటి సురేంద్ర**

కథా రచయితగా, కార్టూనిస్టుగా సాహితీసేవతో పాటు కళాసేవ కూడా చేస్తున్నారు నల్లపాటి సురేంద్ర. వీరు రచించిన కథలు దాదాపు అన్ని దిన, వార పత్రికలలోనూ ప్రచురితమయ్యాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వాసి అయిన సురేంద్ర వృత్తి రీత్యా వ్యాపార రంగంలో ఉన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ (తెలుగు) కోర్సు చేయడంతో పాటు పాఠశాల విద్యాశాఖ నుండి తెలుగు పండిత శిక్షణనూ తీసుకున్నారు. గత దశాబ్ద కాలంగా రచనలు చేస్తున్న సురేంద్ర దాదాపు వంద కథలకు పైగా వ్రాసారు. 300 లకు పైగా కార్టూన్స్ గీశారు. స్త్రీల హక్కుల నేపథ్యంలో వ్రాసిన "ఆమె గళమెత్తింది" కథకు గాను సాహితీ ప్రస్థానం వారి ఉత్తమ కథా పురస్కారం అందుకున్నారు. అలాగే కులమత తారతమ్యాలను విభేదిస్తూ వ్రాసిన "ఆవుల డాక్టర్" కథ "అరసం విశాలాంధ్ర" సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన పోటీలో ప్రత్యేక బహుమతిని కైవసం చేసుకుంది. ఆవు (నమస్తే తెలంగాణ), కాలనాగులు (ప్రజాశక్తి), ప్రేమ పరిమళం (ఆంధ్రభూమి) కథలు మంచి ఆదరణను పొందాయి. వివిధ దినపత్రికల్లో ప్రచురితమయ్యే వివిధ కథలు, కవితలు, వ్యాసాలను సేకరించి, ఆయా సమాచారాన్ని మొత్తం క్రోడీకరించి ఆల్బమ్స్ తయారుచేయడం సురేంద్ర హాబీ. ఇరు రాష్ట్రాల్లో అత్యధిక తెలుగు వ్యాసాలు సేకరించినందుకు గాను సురేంద్ర "తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్"లో కూడా చోటు దక్కించుకున్నారు.

***



# సమ్మెట దెబ్బల చప్పుడు

**రవి తేజ సిరిపురం**

సిటీ బ్రిడ్జి మీద రొద పెడుతూ బైకులు, ఆటోలు, బస్సులు, స్కూల్ వాన్లు, తిరుగుతున్నాయి. బ్రిడ్జి కింద ఒకవైపు సీస కమ్మరోల్ల సమ్మెట దెబ్బల చప్పుడు, ఇంకోవైపు బడిలో పిల్లల అల్లర్లు, గుడిలో పాటలు, వాహనాల రొదతో కలిసి చెవులకు కంపరంగా వినిపిస్తున్నాయి. ఆ చప్పుల్లన్నింటినీ ఒకేసారి మింగేసినట్టు గూడ్స్ రైలు బ్రిడ్జి కిందినుండి వెళ్తుంది. ఆ బ్రిడ్జి రెండు సామాజిక తరగతులను వేరుచేయడానికి గీసిన దారిద్రరేఖలా కనిపిస్తుంది.

అప్పటివరకు ఆ రైల్ కోసమే ఎప్పటినుండో ఎదురుచూస్తున్న చోటుగాడు పట్టాల మీదకి పరిగెత్తి తప్పి జారిపోయిన బొగ్గులను, తెచ్చుకున్న గోనెసంచిలో ఒక్కొకటి నింపుకుంటూ మధ్య మధ్యలో బ్రిడ్జిపైకి చూస్తున్నాడు. కాసేపటికి ఒక స్కూల్ వ్యాను వెళ్తుంటే, చేతిలోని గోనెసంచిని పక్కనపెట్టి నవ్వుకుంటూ చెయ్యి ఊపాడు, ఇద్దరు ముగ్గురు పిల్లలుకూడా అందులోనుండి చెయ్యూపి టాటా చెప్పారు. ఒకవైపు ఆ పిల్లలు బడి బ్యాగేస్కుని వెళ్తుంటే, చోటుగాడు గొనె సంచి భుజానికేస్కుని పట్టాల మీద అప్పటికే రెండు కిలోమీటర్ల వరకు నడిచి బొగ్గు జమ చేసాడు. కానీ సగం సంచి కూడా నిండలేదు. ఇంకో గూడ్స్ ట్రైన్ వచ్చేవరకు పక్కన కూర్చుని చూస్తున్నాడు. చోటుగానికి బాగా చదువుకుని బ్రిడ్జికు మరోవైపు పోవాలనేది చిరకాల ఆశ.

“ఇయ్యాల ఎట్లైనా అవ్వను బల్లె జేయిన్ జేపియ్యిమని అడగాలే” పరధ్యానంలోకి వెళ్ళాడు.

“ఉండనీకి ఇల్లు లేదు. బ్రిడ్జి కిందనే కొంచెం సాటుగట్టుకోని అవ్వా, అయ్యా, నేనూ ఉంటున్నం. అయ్య దాకలి మీద సమ్మెట కొట్టి కొట్టి నడుంనొప్పి లేశి పనికి దూరమయ్యి కొన్ని రోజులకే తాగుడుకు బానిసైండు. రోజంతా మత్తుల వండుకొనే ఉంటడు. లేస్తే నన్ను, అమ్మను గొట్టి ఉన్న పైసలు గుంజుకపోయి తాగుతడు. మల్లచ్చి పంటడు. బతుకు తెరువు కట్టమంతా, కడుపుతోని ఉన్నాగూడా అవ్వనే జేస్తది. నేను గిట్ల బొగ్గు తీస్కనిపోతే, కొలిమి జేషి, మేక తలకాయలు కమిరిచ్చి, ఇంకా కొడవళ్ళు, కత్తులు, పనిముట్లు జేషి అమ్ముకచ్చిన దాన్లో బతుకుతున్నం. నేను గిప్పుడు బొగ్గు తీస్కవోకపోతే పూటకు కంచంల మెతుకులు వడయి. ఇంక రెండు నెల్లయితే తమ్ముడు వుడతడని గూడా జెప్పింది! గిపుడు బడి గురించడిగితే అవ్వ ఏమంటదో? గివ్వారకే రెండు మూడు సార్లడిగితే, మల్ల నోటి నుండి బడి మాట రావద్దని వాత వెట్టింది.”

గూడ్స్ రైలు చప్పుడుతోని తిరిగి ఈలోకంలోకి వచ్చాడు. లేచి మళ్లీ కిలోమీటర్ వరకు నడుచుకుంటూ సంచిలో బొగ్గు నింపాడు. వాడికన్నా మూడింతలు బరువునెత్తుకుని, పట్టాల వెంబడి చీమలాగా నడుస్తున్నాడు.

చోటు ఈరోజు ఎలాగైనా వాళ్లమ్మని ఒప్పించాలనే ఆశతో వెళ్ళాడు. అప్పటికే ఒక్కరిద్దరు మేక తలకాయలు పట్టుకుని ఉన్నారు. వాళ్ల నాన్న తాగడానికి వెళ్లాడు. ఆమె భర్త మీద కోపమంతా చోటు కోసం దాచిపెట్టుకున్నట్టు ఊపిరి బిగపట్టుకుని ఉంది. ఇలా వాళ్ళ నాన్న తాగడానికి పోయిన ప్రతీసారీ చోటుకు కారణంలేని దెబ్బలు తినడం అలవాటే.

"ఎంత సేపు పోతవురా, గిప్పటికే ఇద్దరు గీరాకొల్లు సూశి సూశి పోయిరు." అని కడుపు పట్టుకునే అరిచింది.

'ఇంకా ఇపుడు బడి గురించి చెప్తే...?' జరిగే పరిణామం చోటు ఊహకు కూడా అందలేదు.

చోటు ఏం చెప్పకుండానే, సంచి పక్కనపెట్టి, బొగ్గు తీసి కొలిమిని ఎర్రగా చేసాడు. కొలిమికున్న సైకిల్ రీం చక్రం ఒక్కసారి తిప్పుతుంటే, దానికి తాడుతో జత చేసిన బ్లోయర్ చిన్న చక్రం మూడు సార్లు తిరుగుతూ దానికున్న గొట్టం నుండి గాలి బలంగా పోయి నిప్పురవ్వలు మినుగురుల్లాగా మెరుస్తూ ఎగురుతున్నాయి. కానీ చోటు గాడు వాడి శక్తికి మించి తిరిగి, వయసుకు మించి బరువులు మోసిన వాడి జీవిత చక్రంలో కొంచెం మార్పు కూడా కనిపించట్లేదు. ఇంతలో వాళ్ళ అమ్మ మేక తలకాయను ఇనుప చువ్వకు కుచ్చి, కాళ్ళు మంటలో వేసి తిప్పుకుంటూ కాలుస్తుంది. అవి కాలినాక చోటుగాడు కత్తి పెట్టి వాటిని నున్నగా గీకి పొతం చేసాడు.

వాళ్లిచ్చిన డబ్బులు చోటుకిచ్చి, కమాన్ పట్టి, ఆలుగడ్డలు తీస్కురమ్మని పంపింది. చోటు దగ్గరున్న దుకాణంలో కమాన్ పట్టికి యాభై రూపాయలు ఎక్కువైతాయనీ, దూరమున్నా దుకాణంకు వెళ్లి తీస్కోని వచ్చాడు.

ఇలా వాళ్ళ అమ్మ పంపినపుడల్లా ఎంతో కొంత మిగుల్చుకుని చదువు కోసమని దాచుకోవడం చోటుకి అలవాటు. అలా ఇప్పటి వరకు దాచుకున్న కొన్ని వందల రూపాయలను వాళ్ళ నాన్న చాలాసార్లు లాక్కునివెళ్లి తాగాడు, వద్దని ఆపితే వీపు విమానం మోత మొగించేవాడు.

"నా ఒక్కని బతుకే గిట్లేందుకుందో ఏమో? మా పక్కన ఇదేపని జేశే వాళ్ళ పిలగాండ్లు మంచిగనే ఉంటరు. వాళ్ళింట్లో వాళ్ళ నాన్నలు పని జేస్తరు. అయినాగూడా ఆ పిలగాండ్లు రోడ్ల మీదకోయి పైసలడుక్కుని బీడిలు తాగుతరు. ఇంకొందరు పక్కకున్న సినిమా టాకీస్కుపోయి అడుక్కుని సినిమాలు జూస్తరు. నచ్చినవి కొనుక్కుని తింటరు." అని బ్రిడ్జి పోల్ కు ఒరిగి కూర్చొని ఏవేవో ఆలోచిస్తున్నాడు. మీద కట్టె పిడి పడగానే, ఉలిక్కిపడి చూసాడు. కొలిమి తిప్పుకుంటూ అప్పటికే నాలుగైదు సార్లు పిలిచినా

పలకట్లేదని, వాళ్ళ అమ్మ పిడిని మీదకు విసిరింది.

"శెవుల సీసం గిట్ల వోసుకున్నవారా? కత్తులు జెయ్యాలే... దా!" అని అరిచింది.

చోటుగాడు ఊహ తెలిసినప్పటినుండి వాళ్ళింట్లో తిట్లు, దెబ్బలు తప్ప ప్రేమతో మాట్లడే మాటలు ఒక్కసారి కూడా చూడలేదు, వినలేదు.

చోటు గాడు లేచొచ్చి డాకలి ముందు కూర్చున్నాడు. కమాన్ పట్టిని కొలిమిల పెట్టి, పట్టుకారుతోని అటు ఇటు తిప్పుతూ ఎర్రగా కాలిన తర్వాత డాకలి మీద పెడుతున్నాడు. వాల్లమ్మ ఏడు నెలల కడుపును సైతం లెక్క చేయకుండా సమ్మెట దెబ్బలు వేస్తుంది. తన రక్తాన్ని కొంచెం భర్త తాగే మద్యంలాగా, ఇంకొంచెం రక్తాన్ని కడుపులో బిడ్డలాగా, మరికొంచెం రక్తాన్ని చెమటలాగా బయటకు కక్కుతూ ధారపోస్తుంది. ఆ రక్తపు చెమటలను, కత్తిలా మారుతున్న ఇనుము, ఆకలితో ఉన్న రాక్షసుడిలా ఇంకా ఇంకా కావాలన్నట్టు తాగుతుంది. కొన్ని లక్షల చుక్కల రక్తాన్ని తాగి ఇనుము కత్తిగా రూపాంతరం చెందింది.

అదే కొలిమి వేడిలో గిన్నె పెట్టి నీళ్ళు పోసింది. ఆలుగడ్డలను పొట్టుతోనే కోసి అందులో వేసి, కొంచెం ఉప్పుకారం వేసి కూర చేసింది. ప్రతి రోజు ఎంతోమందికి మాంసం తినిపిచ్చే వాళ్ళ తిండి, మెత్తటి దొడ్డు అన్నంల నీళ్ళ కారం కూర. తిన్న తర్వాత లేచి గోనెసంచి చోటుగాని వైపు విసిరి,

"బొగ్గు ఇయ్యాలనే తీస్కుని దాపో, మల్ల ఇయ్యాల్టి లెక్క గిరాకొల్లు మర్రి వోకుండా"

అలా నేల మీదనే ఒరిగింది.

చోటుగాడు సంచిని పట్టుకుని సూర్యునితో పాటు, రైలు పట్టాలవైపు చీకట్లోకి వెళ్ళసాగాడు.

చీకట్లో సరిగ్గా కనిపించకున్నా, పట్టాల మీద అటుఇటు తిరిగి సగం సంచి నింపాడు.

ఇక వెళ్దామనే వరకు సెక్యూరిటీ గార్డ్ విసిల్ వేసుకుంటూ తరిమాడు. ఆ సంచిని పట్టుకుని నడవడటమే కష్టమైనా, సెక్యూరిటీకి దొరకకూడదనే భయంతో పరిగెత్తుతూ దభేలున కింద పడ్డాడు. లేచి తాకిన దెబ్బలను కూడా లెక్కచేయకుండా జన సంచారం కనపడేవరకు పరిగెత్తాడు.

దారిలో బడినుండి కాకుండా వేరే ఎదో ఇంట్లోనుండి స్కూల్ పిల్లలు బయటకురావడం చూసి ఆగాడు. దగ్గరకువెళ్ళి, అక్కడే ఉన్నా ఓ పిల్లోడ్ని అడగాలా? వద్దా? అన్నట్లే అడిగాడు.

"బడి గక్కడ ఉంటది గదా? గిక్కడెందుకు బుక్కులు వట్టుకుని గింత మందున్నరు"

ఆ పిల్లోడు చోటుగాని మాసిపోయిన బట్టలు, సంచి, వాలకం చూసి ఎదో వాసన వస్తున్నట్టుగా ముక్కు చిట్లించుకుని కొంచెం దూరం జరిగాడు

"ఇది స్కూల్ కాదు ట్యూషన్ అంటరు, మేము స్కూళ్ళ చెప్పిన హోం వర్క్స్ ఇక్కడకచ్చి రాసుకుంటాం. ఇంకేమైనా అర్థంకాకుంటే ఆ సారును అడుగుతాం."

"గిక్కడకు రావాలన్న సుత పైసలు కట్టలన?"

"హ...! కట్టాలి కానీ స్కూల్లో కట్టేంత కాదు...నెలకు ఐదు వందలు"

అని మళ్ళీ ముక్కు మూసుకున్నాడు.

రోజూ చోటు వాళ్ళు ఉండే దగ్గర, ప్లాస్టిక్ కవర్ల చెత్త పడేసేదే వీళ్ళు కదా? అనుకుంటూ చోటుగాడు అక్కడనుండి వెళ్ళాడు.

***

బ్రిడ్జి పైన వెళ్ళే వాహనాల రొద తగ్గినాక పడుకోవడం, తిరిగి రొద మొదలైనాక నిద్ర లేవడమే కానీ., సూర్యునితో, అలరాలతో పనిలేని జీవితాలు వాళ్ళవి. వాహనాల రొదనే అలరంగా, చోటు వాళ్ళమ్మ నిద్ర లేచింది. జుట్టు పైకి కట్టుకుని కొలిమి చేయడానికి బొగ్గు సంచి తీసి కింద కుమ్మరించింది. రోజూ వినిపించే వాహనాల రోద, ఇప్పుడు తన చెవులలోనే మోగినట్టు చిరాకు. అలసిపోయి సేదతీరుతున్న చోటుగాడిని కోపంతో బలంగా కాలుతో ఒక తన్ను తన్నింది.

"బొగ్గు తెమ్మంటే, బండలు ఏరుకచ్చి, దొర లెక్క నిద్ర పోతున్నవారా" అని అరిచినట్టే అంది.

ఆ అరుపుకు రొద కూడా చాలా చిన్నగా వినిపిస్తుంది.

చోటు నడుముకు తాకిన దెబ్బ కన్నా, పొద్దున్న లేవగానే వాళ్ళమ్మను అడుగుదామనుకున్న ట్యూషన్ డబ్బులు అడగలేననే విషయమే గుండెలకు గట్టిగా తాకింది.

"బొగ్గే దెచ్చినమ్మా...! అచ్చేటపుడు సెక్యూరిటోడు గెదిమితే కిందవడి దెబ్బ గూడ తాకింది సూడమ్మ" మాటలు నత్తి పోతూ చెప్పాడు.

"బొగ్గుదేస్తే ఏది రా?"

అనుకుంటూ కుప్ప దగ్గరకెళ్ళి కంకరరాయి తీసి చోటుగాని మీదకు విసిరింది. వాడు పక్కకు తప్పుకోవడంతో వెనకాల ఉన్న రేకు డబ్బా నొక్కు/సొట్ట పోయింది. అదే చోటుకి తాకితే చెరువుకు గండి పడినట్టు రక్తం పోయేదేమో.

"మీ అయ్యా ఉన్నా లేనట్టే, నువ్వు జేసే పనులేమో గిట్ల ఉన్నయ్, ఇప్పుడు మనకు బువ్వ ఎట్లా నువ్వే జెప్పు?"

చెవులు పగిలే రొదలో కూడా అక్కడ కాసేపు నిశబ్దం అలుముకుంది.

ఇంతకముందు చేసుంచిన పనిముట్లను చోటు ముందట పడేసి,

"గివి అమ్ముకురాపో...తిండికి పైసలచ్చేదాక మల్ల నాకు కనవడకు."

***

"సర్వెంట్ వాంటెడ్"

అని బోర్డు రాసున్న ఇరానీ కేఫ్ కి చేరుకున్నాడు చోటు. అది చదవలేకపోయినా అలాంటి బోర్డు పనివాళ్ళు అవసరం ఉంటేనే పెడుతారు అని వాడికి తెలుసు. మెల్లగా తడబడుతూ అడుగులో అడుగు వేస్తూ లోపలకి నడిచాడు.

కప్పులు, సాసర్ల శబ్దాలు, ఇడ్లీ పాత్ర చేసే ఈలలు, కేఫ్ లో కూర్చున్న జనాల గందరగోలమైన మాటలు ఒకదానితో ఒకటి పోటీపడుతూ, ఆ శబ్దం బయట రోడ్డుపైన గోల కన్నా చాల రెట్లు ఎక్కువగా వినిపిస్తుంది.

కౌంటర్లో కూర్చున్న ఓనర్ దగ్గరకి వెళ్లి చూస్తున్నాడు.

ఓనర్ కౌంటర్ దగ్గర వచ్చిన వాళ్ళకు టోకెన్లు ఇచ్చే పనిలోనే ఉండి, చోటును చూసి ఏమిటి అన్నట్టు సైగ చేసాడు.

"పని కావాలన్నా...!" తడారిన గొంతుతోనే అన్నాడు.

"అచ్చా...!" అని లోపల ఉన్న పనివాడిని పిలిచి,

"రేయ్ యే బచ్చే కో కామ్ హోనా బోల్రా, ఏక్ బార్ దేక్"

ఆ పనివాడు చోటుగానికి ఒక తడి స్పాంజి చేతికిచ్చి టేబుల్స్ అన్నీ క్లీన్ చేయమన్నాడు.

తర్వాత కప్పులు సాసర్లన్నీ కడిగించి, ఓనర్ దగ్గరకు తీస్కోని వెళ్లాడు.

ఆ పనులన్నీ చోటుగాడికి రోజు చేసే పనులముందు చాలా చిన్నవిగా అనిపించాయి.

"కామ్ అచ్చాచ్ కర్రా భాయ్" అని చెప్పి లోపలకు వెళ్ళాడు.

"ఠీక్ హై సుభా ఆతే హీ టేబిల్ క్లీన్ కర్నా బాద్ మే జాడు మారన ఫిర్ బాద్ మే కప్ సాసర్ అరేంజ్మెంట్ కర్నా, సామాన్ టేబిల్ పే దేనా, తన్ఖా గ్యారా రుపే దేతే, మర్జీ హైతో కల్ సే నౌ బజే కో ఆనా"

చోటుగానికి ఏమేమి పని చెప్పింది సైగలతోని అర్థమైంది కానీ ఎపుడు రావాలి, జీతం ఎంత అని అర్థం కాక అక్కడనే బిత్తరపోయి చూస్తున్నాడు.

అది గమనించి,

"నువ్వు రేపు పొద్దున్న తొమ్మిదికి వస్తయి, నెల జీతం పదకొండు వంద ఇస్తయి."

అప్పటిదాక అలసిపోయి ఉన్న చోటుగాని కళ్లకి కాంతి వచ్చింది. నెలరోజుల నుండి వాళ్ళమ్మను స్కూల్లో జాయిన్ చేయించమని అడిగి అడిగి అలసిపోయి, ట్యూషన్ కి అయిన పంపమని అడిగాడు. అడిగిన ప్రతిసారి చోటుగాడి మీద పడ్డ ఒక్కొక్క దెబ్బ చప్పుడు, సమ్మెట దెబ్బల చప్పుల్లను కూడా చాల చిన్నగా చేసింది. ఆ దెబ్బల్లో కోపం కన్నా చోటుగాడు బడి అని తిరిగితే, వీళ్ళ జీవనం ఎలా అనే భయమే ఎక్కువ. చివరకి గవర్నమెంట్ స్కూళ్ళ డబ్బులుకట్టే అవసరమే లేదని, కనీసం ప్రభుత్వ గుర్తింపు కార్డ్ ఐనా కావాలని అడిగిండు. కానీ "ఎప్పుడు ఎక్కడ దేశం పోతామో మనకే తెల్వది, మన సంత ఇల్లు జాగా ఎక్కడ లేదని, మనకు ఆ కార్డు ఎవ్వరు తియ్యరు, తీసిన దానిలో మన

ప్రయోజనం కన్నా వాల్లకోచ్చేదే ఎక్కువ" అని మళ్ళీ కొట్టే చెప్పింది. ఇక చేసేది లేక అమ్మ చెప్పిన పనులన్నీ చేసుకుంటూనే, ఏమైనా డబ్బులచ్చే పని కోసం తిరుగుతూ ఉంటే చివరికి దొరికింది.

నెల రోజుల తర్వాత వాళ్ళమ్మ మరొక మగపిల్లాడికి జన్మనిచ్చింది. ఇప్పుడు చోటు బాధ్యత మరింత పెరిగింది. వాళ్ళమ్మ దెబ్బలతో పాటు కేఫ్ ఓనర్ దెబ్బలు మరియు రైల్వే ట్రాక్ మీద పడ్డ దెబ్బలు, వీటన్నింటిని మించిన మానసికమైన దెబ్బలు ఎదుర్కొన్నాకా, పదకొండు వందల రూపాయలు తీసుకున్నాడు. ఆ డబ్బులను వాళ్ళ నాన్న తీసుకోవడం చోటుగాడికి ఇష్టం లేదు. అందుకే ముందుగా పాత బట్టలమ్మే దుకాణం వెళ్లి, రెండు జతల బట్టలు, నోట్ బుక్కులు, పెన్నులు కొనుక్కుని, ట్యూషన్ దగ్గరకి పోయి డబ్బులు కట్టాడు.

రోజూ బొగ్గు తేవడం, కేఫ్ కి వెళ్లి పని చేయడం, అక్కడనుండి ట్యూషన్ కి వెళ్లి దారిలో డంపింగ్ యార్డ్లో ఉన్న పుస్తకాలు వెతికి వాటితో ఇంటికి వెళ్ళడం. ఆలస్యంగా ఇంటికి వెళుతున్న కారణంగా వాళ్ళ అమ్మతో దెబ్బలు తినడం, ఏది ఏమైనా తెచ్చుకున్న బుక్కులను తిరిగేయడం చోటుగాడి దినచర్యగా మారింది.

***

"ఈ మ్యాప్ ఇక్కడికే చూపిస్తుందండీ" కార్లోంచే అటుఇటు దారికోసం చూస్తుంది సింధూ.

"సరే పక్కన ఆగి చూద్దాం" అని కార్ పక్కకి ఆపి విండో కిందకి దించాడు చక్రి.

"ఇక్కడంతా కొలిమి పని చేసేవాళ్లు ఉన్నారు. ఈ చుట్టుపక్కల ఇండ్లేలేవు. ఇంకా ఆర్ఫనేజ్ ఎక్కడ కనబడుతది."

"ఒకసారి దిగి ఎవరినైనా అడిగి చూడండి"

ఇండియాలో రోజు రోజుకి పెరుగుతున్న జనాభా మరియు దాని తీవ్ర పరిణామాలు, వనరుల కొరత, సాంఘిక, ఆర్థిక క్షోభలను దృష్టిలో ఉంచుకుని, దాని నుండి భవిష్యత్ తరాలను కాపాడటానికి మరియు వెనకపడిన, కనీస అవసరాలను కూడా పొందలేని వాళ్ళకు మంచి భవిష్యత్ ఇవ్వాలని తమ వంతుగా పిల్లలను కనకుండా దత్తత తీసుకోవాలని నిర్ణయించుకుని, వాళ్ళ తల్లిదండ్రులను మూడు సంవత్సరాల నుండి ఎన్నో విధాలుగా నచ్చచెప్తూ చివరికి ఒప్పించి, ఈరోజే అనాధ ఆశ్రమంకి వెళ్తున్నారు.

చక్రి దిగబోతుంటే, చోటు బొగ్గు సంచితో వెళ్తూ కనిపించాడు.

"బాబు...! ఇక్కడ అనాధ ఆశ్రమం ఎక్కడో చెప్తారా?"

"గో స్టేట్ అండ్ యు విల్ సి ఏ జంక్షన్..దెన్ టేక్ లెఫ్ట్" ఇంచుమించు ఇంగ్లిష్ ట్యూషన్ సార్ చెప్పినట్టే చెప్పాడు.

చక్రి, సింధు నివ్వరపోయి ఒకరి మోహాలు ఒకరు చూసుకున్నారు. తేరుకుని

ఇద్దరు హుటాలున కిందకి దిగి,

"నువ్వెక్కడ ఉంటావ్ బాబు? ఇంతబాగా ఇంగ్లీష్ మాట్లాడుతున్నావ్" ఒకేసారి ముక్తస్వరంతో అన్నారు.

'బాబు...' పుట్టి ఊహ తెలిసినప్పటి నుండి ఇలా ప్రేమగా ఒకరు పిలవడం చోటుకి ఇదే మొదటిసారి.

"ఐ లీవ్ హియర్ ఓన్లీ" మళ్లీ ఇంగ్లీష్‌లోనే చెప్పి ఊరుకున్నాడు.

"అయితే నీకు ఎవరు లేరా?"

"ఐమ్..." అని చెప్పపోతుంటే,

"చూస్తుంటే తెలియట్లేదా... అమ్మానాన్న ఉంటే ఇలా ఉంటారా..." అని, చోటు వైపు తిరిగి

"మాతో వస్తావా? మంచి బట్టలు కొనిస్తం, స్కూల్ జాయిన్ చేపిస్తం..."

ప్రపంచం స్థంభించిపోయింది. వాహనాల రొద లేదు. సమ్మెట దెబ్బల చప్పుడు లేదు. ఉన్నది ఒక్కటే, చోటుగాని గుండె చప్పుడు. ఆ గుండెకు ప్రేమగా చూపిన సానుభూతికి, చోటు కళ్ళనుండి సంతోషంతో నీరు వచ్చింది. సంతోషంగా ఉన్నాకూడా నీరు వస్తుందన్న విషయం అప్పుడే తెలిసింది. మెల్లిగా ఈ లోకంలోకి వచ్చాడు. చోటుగాని గుండె చప్పుడు, సమ్మెట దెబ్బల చప్పుడుతో జత కలిసి ఆగి ఆగి కొట్టుకుంటుంది. భుజాన వేసుకున్న సంచి బరువు వదిలేసినట్టు తేలికగా అనిపిస్తుంది. శరీరం దూదిపింజలా ఎగురుతుంది. చిన్నప్పటి నుండి అమ్మ కోపం తప్ప ప్రేమ పిలుపులు తెలియని వాడి బాధను కంటిలోనుండి ధారాళంగా వస్తున్న నీరు చెప్తుంది. ఒక్కసారిగా వాడు అనుభవించిన కష్టాలన్నీ కళ్ళ ముందు కనిపించాయి.

"నాకెవరు లేరు.. నేను రోజూ రైల్వే ట్రాక్ మీద తప్పిపోయిన బొగ్గు పెల్లలను జమ చేసి, కొలిమి చేసేటోల్లకమ్మి, చాయ్ షాప్ ల పనికి పోత, తిండి కూడా అక్కడే తింట, సదువుకోవాలని ఉన్నదీ కాని, నాకు గుర్తింపు కార్డ్ లేదని బడిల ఎవరు జాయిన్ చేపించుకోలేదు. అందుకే ట్యూషన్ పొయ్యి ఇవన్ని నేర్చుకున్న..." గొంతులో ఏదో తట్టుకున్న వాడిలా ఎక్కెక్కి చెప్పిండు.

"అయితే మాతోని రావడం నీకు ఇష్టమేనా?"

భ్రమకి, భయానికి, బాధకి, సంతోషానికి స్తంభించిపోయి ఉన్నాడు.

అవునన్నట్టే తల ఊపిండు చోటు.

***

సిటీ బ్రిడ్జి మీద రొద పెడుతూ బైకులు, ఆటోలు, బస్సులు, స్కూల్ వాన్లు, తిరుగుతున్నాయి. బ్రిడ్జి కింద ఒకవైపు సీస కమ్మరోల్ల సమ్మెట దెబ్బల చప్పుడు, ఇంకోవైపు బడిలో పిల్లల అల్లర్లు, గుడిలో పాటలు, వాహనాల రొదతో కలిసి చెవులకు

కంపరంగా వినిపిస్తున్నాయి. ఆ చప్పుల్లన్నింటినీ ఒకేసారి మింగేసినట్టు గూడ్స్ రైలు బ్రిడ్జి కిందినుండి వెళ్తుంది. ఆ బ్రిడ్జి రెండు సామాజిక తరగతులను వేరుచేయడానికి గీసిన దారిద్రరేఖలా కనిపిస్తుంది.

అప్పటివరకు ఆ రైల్ కోసమే ఎప్పటినుండో ఎదురుచూస్తున్న " చోటుగాడి తమ్ముడు" పట్టాల మీదకి పరిగెత్తి తప్పి జారిపోయిన బొగ్గులను, తెచ్చుకున్న గోనెసంచిలో ఒక్కొకటి నింపుకుంటూ మధ్య మధ్యలో బ్రిడ్జిపైకి చూస్తున్నాడు.

***

## రవి తేజ సిరిపురం

కథకుడు, నటుడు, దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞ చాటుతున్నారు రవితేజ సిరిపురం. మంచిర్యాల జిల్లా జైపూర్‌మండలం రామారావుపేట్‌స్వస్థలం. ఇంజినీరింగ్‌చదివినా.. సినిమాల మీద మక్కువతో ఫ్రీలాన్స్‌ఫిల్మ్‌మేకర్‌గా పనిచేస్తున్నారు. ఫ్రీలాన్సర్‌గా రెండు సినిమాలకు కథనాలు అందించారు. అలాగే మెన్షన్ హౌస్ మల్లేష్ చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్ గా, దండోరా అనే చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్ గా పని చేసాడు. సోషల్ మీడియాలో సినిమాశాల అనే కమ్యూనిటీ క్రియేట్ చేసి ఫిలిం మేకింగ్ మెంటరింగ్ కూడా చేస్తున్నాడు. క్రౌడ్‌ఫండింగ్‌ద్వారా 'కలవా..? చెలియా..!' అనే లఘుచిత్రాన్ని నిర్మించారు. దర్శకత్వ బాధ్యతలతోపాటు నటుడిగానూ రాణించారు. ఈ చిత్రానికి ఉత్తమ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే కేటగిరిల్లో జాతీయ, అంతర్జాతీయంగా అవార్డులు అందుకున్నారు. ఆన్‌లైన్‌లో మీరా నాయర్‌మాస్టర్‌క్లాస్, ఐఐటీ మద్రాస్‌నుంచి ఫిలిం అప్రిసియేషన్‌లో సర్టిఫికేషన్‌కోర్సులు చేశారు. ప్రామాద్య అనే డెమో ఫిలిం లో నటించి దర్శకత్వం చేసాడు. మరో డాక్యు డ్రామా.. ప్రీ ప్రొడక్షన్‌పనులు పూర్తయ్యాయి. తాను చెప్పాలనుకున్న అన్ని కథలనూ సినిమాలా చెప్పే ఆర్థిక స్తోమత లేక.. వాటిని కథల రూపంలో చెబుతున్నారు. ఇంతకముందు రాసిన కథ: బతుకును అమ్ముడు సావును కొనుడు 'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ2022'లో రూ.5 వేల బహుమతి పొందింది.



# మైదాకు

ఝాన్సీ లక్ష్మి జాష్టి

రవళి ఓ రవళి అంటూ బయటనుండి ఎవరో పిలుస్తుంటే లాప్టాప్ పక్కన పెట్టి బయటకు వెళ్లి చూసిన రవళి కి పక్కింటి లక్ష్మి చేతిలో ఏదో గిన్నెతో నిలబడి కనిపించింది. 'ఎందుకే అంతలా ఒర్లుతున్నావ్ ? మీటింగ్ మధ్యలో లేచి వచ్చాను ఏందో సంగతి జెప్పు' అంటూ కనుబొమలు ఎగరేసింది రవళి.

'ఇగో పొద్దున్నే మా మామ ఊరినుండి వస్తూ మైదాకు తెచ్చాడు, మీ ముత్తవ్వ కు మైదాకు అంటే పానం గదా గందుకే తెచ్చినా, మంచికిపోతే చెడు ఎదురాడినట్లు నువ్వు నా మీద ఒర్లుతూ నేను ఒర్లుతున్నా అనబడితివి. ఇగో తీసుకో' అంటూ గిన్నె రవళి చేతిలో పెట్టి వెళ్ళిపోయింది లక్ష్మి.

'ఓయబ్బ, ఈ మైదాకు కోసం ఇది ఇంత ఆగమాగం చేసిపోయింది' అనుకుంటూ ఆ గిన్నెను బల్లమీద పెట్టి లోపటికి పోయింది రవళి. అప్పటివరకు నిద్రపోతున్న రవళి ముత్తవ్వ పోలమ్మ ఆ సందడికి లేచొచ్చి గిన్నెలో మైదాకు చూసి మొహమంతా వెలిగిపోతుండగా 'ఓ రవళి, జరంత ఈ మైదాకు పెట్టిపోరాదే' అంటూ మనవరాలిని పిలిచింది. 'నేను పనిలో ఉన్నానే, పోయి మా అవ్వను అడుగు' అంటూ లోపటినుండే సమాధానమిచ్చింది రవళి.

'ఓ యమ్మీ రేణుకా, కూసంత మైదాకు బెట్టిపోవే. నాకు చూపు ఆనక మీ అందరినీ అడగబడితి' అంటూ కోడలు రేణుకని కేకేసింది పోలమ్మ. 'జర అగు అత్తా, అన్నం కచ్చ పెక్క ఉడికింది ( ఉడికీ ఉడకకపోవడం),అది అవగానే వచ్చి పెడతా' అంటూ వంట అర్ర లో నుండే సమాధానమిచ్చింది రేణుక. ఇక రేణుక వచ్చేవరకు ఐదు నిముషాలకోపాలి పిలుస్తానే ఉంది పోలమ్మ. 'అబ్బబ్బ వయసు మీదపడినా ఆత్రం మాత్రం జరంత కూడా తగ్గలే ఈమెకు' అనుకుంటూ వంట పని తొందర చేసుకొని వచ్చి అత్త దగ్గర కూర్చొని ఆమె అరచేతిలో మైదాకు పెట్టడం షురూ చేసింది రేణుక. ఈలోగా తన మీటింగ్ కూడా అవడంతో తన అర్రలోనుండి వరండాలోకి వచ్చి ముత్తవ్వ పక్కనే కూర్చొని మొకం చంద్రబింబం లెక్క వెలిగిపోతున్న ముత్తవ్వను ఇచిత్రంగా జూస్తూ 'ఎందుకే అవ్వా నీకు ఈ మైదాకు అంటే అంత పానం' అని అడిగింది.

రవళి మాటలతో ఏనాడో జరిగిపోయిన సంగతులన్నీ యాదికొచ్చి పోలమ్మ కండ్లు నీళ్లతో నిండిపోగా, 'అయ్యో! అవ్వా ఎందుకే ఏడుస్తున్నవ్? నేనేమైన తప్పుగ

మాట్లాడితినా' అంటూ మొకం చిన్నది చేసుకున్న మనవరాలివైపు జూస్తూ, 'అదేమీ లేదే పొల్లా (పిల్ల) నువ్వు మాట్లాడినదాంట్ల తప్పేమీ లేదు. నా చెల్లె యాదికొచ్చింది గంతే' అంటూ కండ్ల నీళ్లను కోకకు తుడుచుకుంది పోలమ్మ. 'నీకు చెల్లె కూడా ఉన్నదా అత్తా, మాకెవురికీ తెలియదే? నువ్వు గూడ ఎప్పుడు జెప్పలే, ఏ ఊర్ల ఉంటది అత్తా' అంటూ మైదాకు పెట్టడం ఆపిమరీ అడిగింది రేణుక.

కోడలి ప్రశ్నతో మొకం అమాస చంద్రుడోలే మారగా, 'లేదు బిడ్డా నా చెల్లె నా చిన్నతనంలోనే పెద్దల్లో కలిసిపోయే'అంటూ చెప్పలేక చెప్పింది పోలమ్మ. 'గదెట్లనే పెయ్య బాగాలేకపోయెనా?' అంటూ అడిగింది రేణుక. 'పెయ్య బాగాలేకపోవుడు గాదే, ఆ దొరల నోట్లో మన్నువడ ఆళ్ళ దాష్టీకానికి నా చెల్లె బలైపోయినాది' అంటూ పల్లపల్లి ఏడ్సుడు మొదలువెట్టింది పోలమ్మ. అనోసరంగా అత్తను ఏడిపిస్తిమి గదా అని రేణుకకు మొకం దిగాలు పడబట్టే. కానీ రవళికి మాత్రం తన అవ్వ కథ ఏంటో తెలుసుకోవాలని బుద్ధి పుట్టి పోలమ్మకు దగ్గరగా జరిగి, 'ఓ అవ్వ మీ చెల్లె ముచ్చట్లు జర చెప్పరాదే' అంటూ పోలమ్మ చేయి పట్టుకొని లాగింది. చెల్లె మాట చెవుల పడగానే ఏడుపు ఆపి, 'అట్లనే బిడ్డా నా చెల్లె సంగతులన్నీ మళ్ళీ యాదిజేసుకున్నట్లుంటది తప్పకుండ జెప్తా' అంటూ మొదలుబెట్టింది పోలమ్మ.

మా అవ్వ, బాపులకు ఐదుగురు మగ పొల్లలు బుట్టినంక నేను మా చెల్లె పుడితిమి. సోమయ్య కు ఆముడాలోళ్లు (కవల పిల్లలు) పుట్టింద్రు అని ఊరంతా జెప్పుకున్నరంట అప్పట్లో. ఇక జమిలి పువ్వులెక్క ఉన్న మమ్మల్ని జూసి అందరు మురిసిపోవుడే అంట, ఆ సమ్మక్క సారక్కలే నీ ఇంట్ల పుట్టింద్రు అని చుట్టపక్కాలు అందరు మా అవ్వను బాపును పొగడబట్టిరి. ఇక ఆళ్ల మాటలతో నాకు సమ్మక్క అని నా చెల్లె కి సారక్క అని పేర్లు పెడితిరి. మా అన్నలు మా అక్కాచెల్లెళ్లను కాలు కిందబెట్టకుండ చూసుకోబట్టిరి.

ఆ రోజుల్లో దొరలదే రాజ్యం, గాళ్ళకు అడ్డు అదుపు లేకుండె. దేశానికి సొంతంత్రం వచ్చిన మా పల్లెలకు సొంతంత్రం రాకుండె. దొరకు ఎదురు జెప్పనీకి లేదు, ఎవురైనా తెలియక ఎదురుమాటాడితే అగ్గిల చెయ్యి పెట్టినట్లే, ఇక ఆడి బతుకు ఆగం జేసి అట్టుకు జుట్టుకోసినట్లు (చిన్న చిన్న విషయాలకే పంతం చెల్లించుకోవడం) జేసెటోల్లు.

ఇట్ల దొరల యేలుబడిలో మా బతుకులు ఆద్మాన్నంగా ఉండేటివి. అయినా ఈ కష్టాలేవి మాకు తెలియకుండా పెంచబట్టిరి మా అవ్వ బాపూలు. మా బాపూ దొరగారి చేలల్ల పనులు జేస్తుంటే మా అవ్వ ఆళ్ల కోటల పని జేయనీకి బోతుండేది. మా అన్నలకు వయసురాంగానే, వచ్చి పనిల చేరమని దొర దగ్గరనుండి పిలుపు రాబట్టే, ముగ్గురు అన్నలు దొర మాటకు తలొగ్గి పనిల జేరితే మా కడపటి అన్నలిద్దరు మాత్రం మా బాపుకు గూడ జెప్పకుండా అన్నల్లో కలిసిపోతిరి. ఇది దెలిసి దొర అగ్గిమీద గుగ్గిలమయ్యే, మా బాపును కొరడాలతో కొట్టించె. అందుల మా బాపూ తప్పేమీ లేకున్నా

దొరకు ఎదురుచెప్పే ధైర్నం ఎవరికీ లేకపోయే.

ఇట్ల అగచాట్ల బతుకులు బతుకుతుండగానే నాకు, నా చెల్లెకి పదేండ్లు నిండి పదకొండో ఏడులోకి అడుగుబడితిమి. నేను ఇంట్ల పనులు చూసుకుంటుంటే నా చెల్లె మాత్రం రకరకాల పువ్వులు దెచ్చి ఇంటిని అలంకరిస్తా ఉండెడిటిది, ఇక బతకమ్మ పండగ ఒస్తే నా చెల్లి జేసే బతకమ్మ ముందు మిగతావాళ్ళవి ఆనకపోతుండేవి. ఇక మైదాకు అంటే నా చెల్లెకు పానం, పదిరోజులకోపాలి ఆకు తెంపుకొస్తా ఉండేది. మా అవ్వ, దొర ఇంట్ల పని ముగించ్చుకొని వచ్చినంక రోట్లో ఆ మైదాకు మెత్తగా రుబ్బి కాళ్ళకు చేతులకు పెడితే చేతులు ఎర్రగా పండేదాకా నిద్ర కూడా మానుకొని కూర్చొనే ఉండేటిది. తెల్లటి అరచేతిల సూర్యుని లెక్క పండిన మైదాకును చూసి మురిసిపోయేది , దాని నవ్వు జూసి మా అందరి కండ్లల్ల వెలుగొచ్చేది.

ఒక దినం, దొర బిడ్డ పుట్టిన దినమని ఊర్ల అందరికి కొత్తగుడ్డలు పంచుతారని చాటింపు వేయబట్టిరి. అది విని మా చెల్లె, అక్కా అక్కా ఇప్పటివరకు కోట చూడలేదే! ఒకసారి పోదామని అడిగితే, నా చెల్లె కోరిక సీతమ్మోరు మాయలేడిని కోరి కష్టాలు దెచ్చుకున్న లెక్క అని తెలియక నేను మా చెల్లెని తీసుకొని కోటకు బోతిని. మేము బోయేటప్పటికే ఊర్ల మంది మొత్తం అక్కడే జమ అయ్యి ఉంటిరి. దొరసానమ్మ మనసు ఎన్న లెక్క, కానీ దొర మాత్రం రాక్షసుడే. ఇక వాళ్ళ బిడ్డ దొర నోట్లకెల్లి ఊశిపడ్డట్లుండే. ఎప్పుడైతే నా చెల్లె ఆ దొర బిడ్డ ముంగిటకు బోయి చేయి జాచిందో ఆ క్షణమే ఆ దొరబిడ్డ పండ్లు పటపటలాడిస్తూ, ‘చూడు బాపూ ఈ పూటకి గతిలేనిది చెయ్యి నిండా గెట్ల అలంకారం జేసుకొచ్చిందో, నా చెయ్యి కంటే దాని చెయ్యి సక్కగ గొడతాంది.’ అని మొకం ముటముటలండించబట్టె.

ఇక దొర అగ్గిమీద గుగ్గిలమోలే చిటపటలాడతా, ‘ఈ దినం సంధి నా బిడ్డ తక్క ఊర్ల యెవ్వలు మైదాకు బెట్టుకోరాదు. చేతులకు కాళ్ళకు రంగులు బూసుకోరాదు, ఎవడైనా కాదని అట్ల జేస్తే పది రూపాయల జుల్మానా అని కొత్త పన్ను షురూ జేసే. గుడ్డి కొంగలోలె బతుకులు ఎల్లదీసే మా అసంటోళ్లకు ఒక్క రూపాయి కళ్లజూడుడే కష్టమైతే పదిరూపాయలు పన్ను గట్టుడు అంటే ఇక మైదాకు పైసలున్నోళ్లకు దప్ప పేదోళ్లకు అందని నచ్చత్రం లెక్కనే గదా! ఈ తీర్మానం జేసి దొర తన బిడ్డలెక్క జూడగా అప్పటికి కూడా ఆ బిడ్డ మొకం లో సంతోషం కనబడకపోయె. ‘ఏంది బిడ్డా, ఇక ఎవలూ అలంకారం జేసుకోరాదని తీర్మానం జేస్తిని గద. ఇంకేమి గావాలె నీకు?’ అని అడగగా ‘మరి ఇపుడు దీని సంగతి ఏంది?’ అని నా చెల్లె చేతిని జూపించే, వెంటనే దొర ‘ఏమే కమ్లి, జర కొరకంచు దీసుకురాయె’ అని వంట అర్రలో ఉన్న మా అవ్వను పిలిచె.

బయట జరుగుతున్నది దెల్వని మా అవ్వ దొర జెప్పినట్లే యెర్రని కొరకంచు దీసుకొని వచ్చె. ఆ కొరకంచు బిడ్డ చేతికిచ్చిన దొర కానివ్వమని సైగ చేయగా ఆ దొరబిడ్డ నా చెల్లె చేతిమీద ఆ కొరకంచు బెట్టి గట్టిగ ఆనించింది. నా చెల్లె అరిచిన అరుపు

ఈనాటికి నా చెవుల ఇనపడుతుండె. మా అవ్వ, నేను బాంచెను కాల్మొక్త దొర తెలియక చేస్తిమి ఇడిసిపెట్టమని ఎంత పొర్లాడినా మా ఏడుపులు "గట్టుకు కుక్క మొరిగినట్లాయె". ఆ దొర బిడ్డ నా చెల్లె అరచేతి మీద కాళీ లేకుండ వాతలు బెట్టి అపుడు ఇడిసిపెట్టె. ఆ బాధ తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయిన నా చెల్లెని భుజాన వేసుకొని ఇంటికి పరుగులుదీసే మా అవ్వ. ఈలోగా జరిగిన దారుణం దెల్సుకోని పొలంనుండి మా బాపూ, మా ముగ్గురన్నలు ఉరుకురికి వచ్చె.

ఆ దెబ్బకు నా చెల్లె మంచానబడి పది దినాలు మనిషి కాలేకపోయె. పెయ్య మంచిగా అయిన తర్వాత గూడ ఆ చేయి మీద వాతల గుర్తులే జూసుకుంట ఏడ్సుకుంట ఉండేది. ఎప్పుడు లచ్చిమిదేవి మాదిరి నవ్వుతో ఉండే నా చెల్లె మోహంలో నవ్వే కరువైపోయె.

పది దినాలలో బతుకమ్మ పండుగ ఉంది, ఆ బతుకమ్మలు పేరుస్తూ అయినా నా చెల్లె మొకం లో నవ్వు విరబూస్తుందేమో అని మేమందరం ఎదురుచూడబడితిమి. బతుకమ్మ పండగ రానే వచ్చె. మా చెల్లె ను తీసుకొని పువ్వులు కోసం ఊర్లకు పోతే ఒక్క పువ్వు లేకపాయ, ఏందని చుట్టుపక్కలోల్లను అడిగితే దొర బిడ్డ ఈ ఏడు తొలిసారి బతుకమ్మను పేరుస్తుందట. ఊర్లో ఎవరు బతుకమ్మను పేర్చకూడదు అని పువ్వులన్నీ దొర పాలేర్లు కోసకపోయారు. కాదని ఎవరు అయినా బతుకమ్మను పేరిస్తే జుల్మానా వేస్తారు అంట అని చెప్పడంతో ఇక ఇంటికి చేరుకున్నాం. అక్కా 'ఏమి బతుకులే మనవి? మైదాకు పెట్టుకొనేకి లేదు, బతకమ్మ తల్లిని కొల్చుకొనేకి లేదు' అని నా చెల్లె కంటికి మింటికి ఏడ్చబట్టె.

ఆ దినం మా అవ్వ దాని ఏడుపు తగ్గించేటెట్లో తెలియక ఎవరికీ కనపడకుండా నడి రాత్రి దొంగ లెక్క మైదాకు కోసుకొచ్చి రుబ్బి నా చెల్లెకి పెట్టబోతే 'వద్దవ్వా, వద్దు దొంగ లెక్క బెట్టుకొని మళ్ళీ అది మాసిపోయేవరకు దొంగ లెక్క చేతులు దాపుకొని ఉండేది నాకు ఇష్టం లేదు' అని ఏడ్చి ఏడ్చి మన్ను మీదకు తెచ్చుకొని ఆ మనెద తోనే పానం ఇడ్సిపెట్టె. నా చెల్లె పెద్దలలో కల్సిపోయింది అని మేము ఏడ్చుతుంటే దొర పాలేర్లు కొత్వాలు తో కలిసి ఇంటిమీదకొచ్చి 'ఏమే కమలవ్వ, మొన్న మైదాకు కోసుకోస్తివి అంట గంద దొర పన్ను వసూలు చేయమని పంపిండు. దొరకు పన్నుగట్టేవరకు పీనుగను ఎత్తుకెళ్లనీకి కుదరదు' అని గోలచేయమొదలెడితిరి . బిడ్డ పోయి పుట్టెడు దుఃఖం లో ఉన్న మా బాపూ వాళ్ళను "కాళ్ళు కడుపులు బట్టుకొని" బ్రతిమాలినా వాళ్ళ కసాయి గుండెలు కరగపోయే. కొత్వాలు మాటతో పాలేర్లు మమ్మల్ని ఇంట్లనుండి బయటకు తరిమి మా ఇల్లు స్వాధీనం చేసుకొని మా చెల్లె పీనుగను కూడా ఎత్తి బయటకు విసిరేస్తిరి.

నోరు మెదపనీకి లేక ఏడ్చుకుంటూ మొత్తుకుంటూ నా చెల్లె పీనుగను తీసుకొని అడవిలోకి బోతే అప్పటికే జరిగిన ఘోరం తెలుసుకొని మా కాడికి వచ్చేటందుకు

పయనమయ్యిన కడగొట్టు అన్నలు ఇద్దరు మమ్మల్ని చూసి, దగ్గరకు తీసి ఆ అడవిలోనే నా చెల్లెకి జరగాల్సిన కర్మలు జరిపించితిరి.

మాకు జరిగిన అన్యాయం తెలిసిన అన్నలు ఒక నడిరాత్రి కోట మీదకు దాడి చేసి దొరను మట్టుబెట్టి ఆ సంపదంతా దోచుకొచ్చి పేదలకు పంచిపెడితిరి. మమ్మల్ని మళ్ళీ ఆ ఊర్లోకి పొమ్మని చెప్పినా బిడ్డను మింగిన ఆ ఊర్ల మళ్ళీ కాలు బెట్టనీ కి మా బాపూ ఇష్టపడకపోయిండు. పొట్టచేతబట్టుకొని తెలియని ఊరికి బోయి మనుగడ సాగిస్తిమి. మాకు పెట్టిన పేర్లు అచ్చిరాలేదని మా అవ్వ నా పేరును పోలమ్మ అని మార్చింది. ఆ తర్వాత మీ తాతను పెండ్లాడి ఈ ఊరికి వస్తిని. ఈ మైదాకు ను చూసినప్పుడెల్ల నాకు మా చెల్లె యాదికొస్తది, సొంతత్రం లేని బతుకులని  అది ఏడ్చిన ఏడుపు యాదికొస్తది, ఇపుడు పూర్తి సొతంత్రంతో బతుకుతున్నమే అని దానికి జెప్పేటందుకే నేను ఈ మైదాకు అంత ఇష్టంగా బెట్టుకుంటా అలాగే బతుకమ్మను ప్రేమగా పేరుస్తా అంటూ తన గతాన్ని చెప్పటం ముగించింది పోలమ్మ.

వాళ్ళు అప్పట్లో పడ్డ కష్టాలు విని రేణుకకు నోట మాట రాలేదు, 'వాళ్ళ చిన్నతనం లో దొరల అజమాయిషీ ఉండేటిదని మా బాపూ చెప్తే ఇనుడు తప్ప ఇంత ఘోరంగా ఉండేదని మాకు తెలియదత్తా' అని కండ్ల నీరు పెట్టుకుంది. ఇక రవళి అయితే, 'ఎందరో త్యాగాలు జేస్తే ఈ తెలంగాణ వచ్చింది అని తెలంగాణ దినోత్సవం అని సంబురాలు జేస్తుంటే మా పనిలో పడి నేను పట్టించుకోకపోతిని అవ్వా, ఇకపై నా తెలంగాణ చరిత్ర మొత్తం తెలుసుకొని నేను తెలుసుకొన్న విషయాలు నలుగురితో పంచుకొని ఇపుడు మేము అనుభవిస్తున్న స్వేచ్ఛ కోసం ఎందరు ప్రాణాలు ఒదిలారో ఇంకెందరు బానిస బతుకులు బతికారో అందరికీ తెలియజేస్తాను. అపుడే కదా ఈ గడ్డ కోసం ప్రాణాలు వదిలిన అమరవీరులకు మేము గౌరవం ఇచ్చినట్లు' అని ఉద్వేగంగా చెప్తుంటే ముచ్చటగా మనవరాలిని దగ్గరకు తీసుకుంది పోలమ్మ.

***

**ఝాన్సీ లక్ష్మి జొష్టి.** కలం పేరు శ్రీఝా. అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ గా పని చేస్తున్నారు. మరో వైపు రచనలు చేస్తున్నారు. పుట్టి,పెరిగింది. గుంటూరు జిల్లాలోని తిమ్మాపురం అనే పల్లెటూరిలో. ప్రస్తుత హైదరాబాద్ లో ఉంటున్నారు. 2019 నుంచి రాయడం మొదలు మాతృత్వం అనే కథ నెచ్చెలి కథ  కవితల పోటీ 2023 లో సాధారణ ప్రచురణకు ఎంపకైంది. తెలుగు జ్యోతి పత్రిక నిర్వహించిన 2024 సంక్రాంతి పోటీలలో "బంధమా బంధనమా" అనే కవిత సాధారణ ప్రచురణకు ఎన్నిక అయ్యింది. శ్రీ కొసరాజు మోహన్ , మాధురి సంయుక్తంగా నిర్వహించిన కథలపోటీ 2024 లో "మరోకోణం" అనే కథ ప్రోత్సాహక బహుమతి పొందింది.



# యావజ్జీవం హోష్యామి

సుబ్రహ్మణ్య శర్మ

భరించలేనంత వేడి! చెమటతో ఒళ్లంతా తడిసిపోయింది! సీలింగ్ ఫ్యాన్ ఆగిపోయింది! గదిలో చీకటి అలుముకుంది! రాత్రి టీవీలో హవాయి రాష్ట్రంలో ''మావి'' అగ్ని ప్రమాదం అదిసృష్టించిన మారణ హోమం దృశ్యాలు కళ్ళముందు కదలాడాయి! ''బెడ్ లైట్'' దీపం కింద ''సెల్ ఫోన్'' రింగ్ వినపడింది. ఫోన్లో ఆకుపచ్చ బటన్ పైకిజరిపి ''హలో'' అన్నాను. నాన్న ఫోన్! టైం చూశాను! ఒంటిగంట దాటింది! ఈటైంలో ఫోన్ చేయడం అంటే ఏదో ''ఎమర్జెన్సీ''!' నాన్నా ! ఏమిటీ టైములో?'' అన్నాను ఆందోళనగా! 'అమ్మ మీనా! నువ్వు తొందరగా వచ్చేయ్!' ఆయన మాటల్లో ఆందోళన! 'ఏమైంది?' ఆ మాట అన్నప్పుడు నా మాట వణికింది. 'అక్క ఆత్మహత్య ప్రయత్నం చేసింది! సమయానికి చూడబట్టి సరిపోయింది! 'ప్రాజెక్ట్ వర్క్ నడుస్తూ వుంది!' ఇబ్బంది నామాటల్లో ద్యోతకమైంది. 'అక్క ఎప్పుడు ఏ అఘాయిత్యం చేసుకుంటుందో అని భయపడిచస్తున్నాం!' 'మరి ఈశ్వర్ అక్కడ లేడా?' అడిగాను. ఈశ్వర్ మా అక్క భర్త! ఎండీ ఇన్ జనరల్ మెడిసిన్. ''కార్పోరేట్ హాస్పిటల్''లో పనిచేస్తున్నాడు. హోదా ''వైస్ ప్రెసిడెంట్! 'నిన్న రాత్రి వచ్చి చూశాడు. యశోద అతనితో మాట్లాడడానికి నిరాకరించింది! కొత్తగాకడుతున్న ''హాస్పిటల్'' విషయంలో ఏవో మనస్పర్థలు వచ్చినట్టు ఉన్నాయి!' 'అక్క ''మెచ్యూర్ పర్సన్!''. మనస్పర్థలు వచ్చినంత మాత్రాన ఆత్మహత్య చేసుకునే అంతవరకూ వెళ్ళదు!' 'హాస్పిటల్ పేరు విషయంలో ఇద్దరికిపేచీ వచ్చి నట్లుంది! అక్క ''ఈశ్వర్ హాస్పిటల్స్ '' అని పేరు పెట్టాలని సూచించింది. ఈశ్వర్ దానికి ఒప్పుకోలేదు. ఈశ్వర్ తోపాటు యశోద కూడా కలవాలి అని అతని వాదన. ఈవై అని పేరు పెడితే, ఇద్దరిపేర్లు, ఈశ్వర్, యశోద కలిసివస్తాయని, ఆ పేరు పెట్టారని పట్టుబడుతున్నాడు! అక్కకి మొదట్లో అభ్యంతరం లేకపోయినా, తర్వా త ఆ పేరుని తీవ్రంగా వ్యతిరేకించింది. 'ఇదికారణం కాకపోవచ్చు నాన్నా ! ఇంకా ఏదోకారణం ఉండి ఉంటుంది.!' 'స్థలం మనది. బ్యాంక్ రుణానికి నేను ''గ్యారెంటీ'' ఇస్తున్నాను! ఇక వేరే కారణాలు ఏముంటాయి?'. నువ్వు ఏం చేస్తావో తెలియదు. వెంటనే రావాలి! లేకపోతే అక్క మనకిదక్కదు!' ఆ చివరి మాటలు అంటున్నప్పుడు ఆయన గొంతు గద్గదమయింది. 'సరేనాన్న! మా ''టీం లీడర్''తో చెప్పి వెంటనే బయలుదేరుతాను!' ''నైట్ బస్సు'' ఎక్కి తెల్లవారిసరికి ఇంటికిచేరుకున్నాను. టాక్సీ దిగుతూనే అక్క రూమ్ కి వెళ్ళాను. మంచం మీద పడుకుని ఉంది. నీరసంగా కనిపిస్తోంది. అమ్మ కాఫీ పెట్టి తెచ్చింది. 'పిల్ల ముద్దమందారంలా ఉండేది! ఇప్పుడు బాగా నీరసించిపోయింది! ఏమీ మాట్లాడదు! దిగులుగా ఉంటుంది!' అక్క భుజం మీద చేయి వేసిఅన్నాను. 'లే అక్కా! ఏమైందో నాకు చెప్పు!' కళ్ళు మూసుకునే పక్కనున్న నల్ల గాగుల్స్ కళ్ళకు పెట్టుకుంది. పక్కనేఉన్న ప్యా డ్ పైన ఉన్న తెల్ల కాగితం మీద ఇలా రాసింది. 'నేను గుడ్డిదాన్ని ! నా కళ్ళు పోయాయి!' నేను షాకయ్యాను!

అక్కవి చక్కటి ఆరోగ్యమైన కళ్ళు. ఎలా పోతాయి?' దానికి మళ్ళీ ప్యాడ్ మీద ఉన్న కాగితం మీద ఇలా రాసింది. 'నాకు బతకాలని లేదు! ఎక్కువకాలం ఈ నరకాన్ని భరించలేను! తొందరగా పోవాలి! పోయేదానికి ''మాటల'' అవసరంలేదు!' వరస తప్పకుండా రాసింది. 'అక్కా! బోలెడు జీవితం ముందుంది. కళ్ళు పోయాయని నువ్వు అనుకుంటున్నావు. అవి ఒక్కసారిగా పోవు!' దానికి పెద్దఅక్షరాలతో ఇలా రాసింది. 'నా సంగతి నాకు తెలుసు. నేను చూడను! మాట్లాడను!' అని పక్కకు తిరిగిమంచం మీద పడుకుండిపోయింది. గంట తర్వాత ఈశ్వర్ వచ్చాడు. ' హఠాత్తుగా చూపు పోవడం ఏంటి? వయసు ఎక్కువ కాదు! కంటిసంబంధించిన వ్యాధులు కూడా లేవు. అక్క కళ్ళు అందమైనవి. ఆరోగ్యమైనవి. కళ్ళు పోవడంతాత్కా లికమే! కాగితం మీద రాస్తోందికదా! దీనికిసరైన వైద్యం చేయించాలి!' నగరంలో లీడింగ్ కంటి డాక్టర్ ''ఏక్తా'' దగ్గరికి తీసుకు వెళ్లాను. ఆమెకళ్ళు పరీక్షించింది. కంట్లో నీరు వస్తూ ఉంటే, ''ఐ డ్రాప్స్ '' ఇచ్చింది. కొన్ని మెడిసిన్స్ కూడా! అయితే... ఓ రోజు.. 'నాకు కళ్ళు రావు! చూపు అక్కర్లేదు! నా గురించి మీ విలువైన సమయం వృథా చేసుకోకండి! నేను లేకపోయినా ''మీకు ఏమీ కాదు!' అని ఉత్తరం రాసివెళ్లిపోయింది. 'అవునమ్మా జరిగిందిఅదే! అల్లుడుగారు ప్రయత్నం చేస్తూనేఉన్నా రు. అక్క సహకరించట్లేదు!' నాన్న మాటలు తర్వా త అక్కడ నిశ్శబ్దం రవళించింది. ఈశ్వర్ దీర్ఘంగా నిట్టూర్చి అక్కడినుంచి నిష్క్రమించాడు. అక్క ప్రవర్తన నాకు షాకింగ్ అనిపించింది! ఆమెవైపు కన్నా ర్పకుండా చూశాను! కళ్ళు కున్న నల్ల కళ్ళజోడు తీసిపక్కన పెట్టి పరీక్షగా చూశాను. 'పెదవులు పలకడానికిభయపడేనిజాలు ''నయనాలు నగరా'' మ్రోగించి మరీచెప్తాయి! నాకు ఏదో తెలుస్తూ వుంది. ఆమెకనురెప్పల కింద అంతులేని చీకటిమహా సముద్రం! దొరికిన ఏదో పడవలో ఆ సంద్రాన్ని దాటాలని అనుకోవడం లేదు. ''ప్రయాస అనవసరం'' అన్న ''పలాయన వాదం'' ఆమె మాటల్లో కనబడుతోంది. ఆమెమాట్లాడదు! ఏమి జరిగినదితెలియదు! హాస్పిటల్ ''సైట్''కి వెళ్ళాను. కాంట్రాక్టర్ ఆఫీసులో వెయిట్చేశాను. వచ్చిన అతన్ని అడిగాను! 'అక్క ఇక్కడికి రావడం లేదు. ఎందుకో మీకేమైనా తెలుసా?' అతను నా వైపు అర్థం కానట్టు చూశాడు. 'మేడం తరచూ వచ్చే వారు. ప్రతిరోజు ఎంత పని అయింది చూసుకునేవారు. వచ్చే నాలుగైదు వారాలకు కావలసిన సిమెంట్, స్టీల్, ఇటుకలు ముందే''ప్లాన్'' చేసేవారు. పనిలో మా కన్నా చాలా నిక్కచ్చి గా ఉండేవారు! వృథా సహించేవారు కాదు!' కాంట్రాక్టర్ కి ఇంకా ''ఏదో'' తెలుసు. అయినా బయటపడడం లేదు. రెట్టించి అడగగా కొంత చెప్పా డు. ''పేరు''లో ఎదోతకరారు!' అన్నాడు నీళ్ళునములుతూ. అదంతా సరే! ఆవిడ కళ్ళకు ఏమైంది?' అన్నాను విసుగ్గా! 'సిమెంట్ కళ్ళల్లో పడిఉండొచ్చు ! స్టీల్ రాడ్స్ ''కట్'' చేస్తుంటే ఇనుప రజను కంట్లోకిపోయిండొచ్చు! ఓ రోజు కంటి నుంచి నీరు వచ్చింది అన్నారు. నేను చూసాను. కళ్ళు ఎర్రబడ్డాయి. మాకు ఇలాంటివి మామూలే! మెడికల్ షాపులో దొరికే ''డ్రాప్స్ '' వేసుకుంటాం! తగ్గిపోతుంది!' ఈశ్వర్ పనిచేసే ఆఫీస్ కివెళ్లి అడిగాను! 'అక్కది మామూలు సమస్య! ''ఐ డ్రాప్స్ '' వేసుకుంటే తగ్గిపోతుంది! ఎందుకు ఇంత ముదరనిచ్చారు?' ఈశ్వర్ నాకేసి అదోలా చూసిఅన్నా డు. ''ఫేమస్ ఆఫ్తాలమిస్ట్'' ''మిస్ఏక్తా'' క్లినిక్ కితీసుకెళ్లాను.' 'అదిపొద్దున్నే చెప్పారు? ఇంత సీరియస్ అవ్వడానికి కారణం ఏమిటి?' రెట్టించి అడిగాను. నా గొంతులో కనబడినకరుకుతునానికి నేనే ఆశ్చర్యపోయాను. ''విట్రియో రెటినల్' డిసార్డర్! దానికి ఆపరేషన్ అవసరం అవుతుంది!''

అన్నది''ఏక్తా'' కానీ. సర్జరీచేయించుకోకుండా ''యష్'' ఇంటికివెళ్ళి పోయింది! ఆపరేషన్ చేసి ఉంటే కంటిచూపు వచ్చేది. నేను ఎంత చెప్పినా వినలేదు! తనకి ''ఆపరేషన్'' అవసరం లేదని చెప్పింది. నాతో మాట్లాడడానికి కూడా

ఇష్టపడడం లేదు! అంతా ''మిస్టరీగా'' ఉంది! 'అవును అంతా ''మిస్టరీ''గా ఉంది. పైగా ఈ ''సూసైడ్ అట్టెంప్ట్'' కొత్తగా వచ్చింది! నిజం చెప్పండి! మీరిద్దరూ ఎంతో అన్యో న్యంగా ఉండేవాళ్ళు కదా! మీతో మాట్లాడటానికికూడా యశోద ఎందుకు ఇష్టపడడం లేదు? హాస్పిటల్స్ పేరులో ''ఈశ్వర్'' ఒకటే ఉండాలని ఆమె ఎందుకంది? మా అక్క పేరు కలపాలని మీరు ఎందుకు అనుకున్నారు?' ' ఈ హాస్పిటల్ స్థలం మీ నాన్న గారిది. ఆయనేమా బ్యాంక్ లోన్ కి ''గ్యా రెంటీయర్!'' అందుకే యశోద పేరు కూడా ఉండాలని అనుకున్నాను! ఇంటికి తిరిగి వెళ్ళిపోయాను! యశోద మంచం మీద నిస్త్రాణగా పడివుంది! ఏదోజరిగింది. ఆమె మనసు తీవ్రమైన బాధకిలోనైంది. అదేమిటి? అన్నం తిన్న తర్వాత నిద్ర ముంచుకొచ్చింది. ఆందోళనతో రాత్రిబస్సులో నిద్రపట్టలేదు! అక్క గురించి ఆలోచన! తెరలు తెరలుగా, కల్లోల కెరటల్లా!అక్కకి డైరీరాసే అలవాటు ఉంది. ఆమె  ఇప్పుడు మాట్లాడదు! కఠోర శిలలాంటినిర్ణయం ఆమెది! మధ్యాహ్నం భోజనం చేయలేదుట. బలవంతంగా చేస్తే రెండు చెంచాలు తిని మిగిలింది వదిలేసిందిట! అమ్మను చూస్తేనాకు దుఃఖం ఆగలేదు. ''ఎందుకు''? ''ఏమిటి?'' అన్న ప్రశ్నలకు సమాధానం లేదు. జాలి లేని దేవుడు మా కుటుంబం పైపగబద్దాడు. మా ఇంట్లో మేమిద్దరమే పిల్లలం ! అక్కదిప్రేమ వివాహం! డాక్టర్ ఈశ్వర్ తో ఆమె పరిచయం కాలేజ్ డేస్ నుంచి. ఆమె ''డైరీ రాస్తుంది. పరాయి వాళ్ల''డైరీ'' చదవడం సభ్యత కాదు అని తెలుసు. ప్రాణాపాయ సమయాల్లో

కొన్నిటికి మినహాయింపు ఉంటుంది. ఆమెడైరీతెరిచాను. '' ఆ ప్రేమ ఎంతో మధురం అని భ్రమపడ్డా.. అందులో వేదన ఇప్పు డు తెలుసుకున్నా ! నాకు తెలుసు. నేను తీరని ఆశల వెనక నడుస్తున్నా.. మమకారం నిజమనుకున్నా.. అదిఓ మరీచిక! అందులో రగిలే జ్వాలకు ఆహుతి అవుతున్నా.. ప్రియా! నిన్ను కదిలించలేని నా ప్రేమకు నా ''స్వప్నంలోనే'' స్థానం కల్పిస్తున్నా! ''సెగ''తో కాలిపోతున్న నా గుండె మాట వినడం లేదు! నీ జ్ఞాపకాల నీడలను తుడిచి వేయాలి ప్రయత్నం చేస్తున్నా. సాధ్యం కావడంలేదు! నన్ను వలచావని భావన తప్పని తెలిసి ఇప్పుడు నివురైపోతున్నా !' రాత్రి అయింది! 'మీరు వెళ్ళండి! నేను అక్క దగ్గర ఉంటాను!' అని అమ్మనీ నాన్ననీ పంపించేశాను. 'నాకు అంతా తెలుసు!' అన్నాను యశోద దగ్గరగా కూర్చుని. ఆమె ఒకసారిలేచి కూర్చుంది. కళ్ళజోడు తీసిపక్కన పెట్టింది. 'నీకేమి తెలుసు?' చాలా రోజుల తర్వాత నోరు తెరిచి అంది. 'నిన్ను ఈశ్వర్ వదిలించుకోవాలని అనుకుంటున్నాడు! 'ఆమె ముఖంలో ఆశ్చర్యం స్పష్టంగా కనిపించింది. 'నిజం!' నిశ్శబ్దం విస్ఫో టించింది. ఆమె కళ్ళ వెంట ధారలుగా కన్నీళ్లు కారుతున్నాయి. మోసం జరిగింది!' అంది నెమ్మదిగా! బయట సన్నగా వాన ప్రారంభం అయింది. కదిలే వాన! మంచు తెరలు ఇటూ అటూ కదిలి వెడుతున్నట్టుగా! కొంచెంగా చలి మొదలైంది. '' ఆ రోజు''.. ఆమెచెప్పడం మొదలు పెట్టింది.. '' కన్‌స్ట్రక్షన్ నుంచి ''ఐ'' క్లి నిక్ కివెళ్లాను! కళ్ళు ఎర్రబడ్డాయి! అంతకు ముందున్న మంట ఎక్కు వయింది. నీళ్ళు కూడా కారడం మొదలయింది. ఎండ వేడి, ఇనప పూసలు కోసేటప్పుడు వచ్చే కర్ణకఠోరమైన శబ్దాలు. సిమెంట్ కాంక్రీట్ మిక్సర్ చేసేశబ్దం. సిమెంట్ నీళ్లు కలిస్తేవచ్చి వేడివాసన. ఇవన్నీ

రోజూ అనుభవం అవుతున్నాయి. వాటిజమిలి ప్రభావం అనుకున్నాను. సాయంత్రం ఈశ్వర్ కి చెప్పా ను. 'నో. నో. ఇటువంటివి నిర్లక్ష్యం చేయకూడదు. prevention is better than cure!' అని నన్ను ఓ క్లినిక్ కితీసుకు వెళ్ళాడు. 'ఇదిడాక్టర్ ఏక్తా ''ఐ'' క్లినిక్. చాలా ఫేమస్. నాకు పర్సనల్ గా తెలుసు!' అన్నాడు. డాక్టర్ పరీక్ష పూర్తిచేసింది! 'ఇప్పటి ఈ డ్రాప్స్ వేసుకోండి. రేపు ''డీటెయిల్'' గా ''ఫండోస్కో పీ'' టెస్ట్ చేద్దాం!' అ ని పంపించింది. ఆ రాత్రి ఆ ''డ్రాప్స్'' వేసుకున్నా! నిద్రపట్టలేదు. కంటిమంట ఎక్కువైంది! మంట భరిస్తూనే ఆ

రాత్రంతా గడిపేసాను. ''ఏక్తా'' అపాయింట్మెంట్ సాయంత్రం ఐదు గంటలకు. మంట భరించలేక పోయాను. మధ్యాహ్నం 12 గంటలు అయి ఉంటుంది. ఈశ్వర్ కారు పార్కింగ్ లో చూసి ఆశ్చర్య పోయాను. తను ఇక్కడికి ఎందుకు వచ్చాడు? 'నా కంటి'' గురించి అయి ఉంటుంది అనుకున్నా ను. డాక్టర్ ఏక్తగదిలోకి ప్రవేశించి ఆగిపోయాను. హాస్పిటల్ నిర్మానుష్యంగా వుంది. అప్పు డు ...'' అనూహ్య వైరుధ్యా ల సమాగమం'' ఎలా ఉంటుందోనాకు అవగతం అయింది. డాక్టర్గదితలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. లోపల నుంచి ఈశ్వర్ మాట మంద్రంగా వినిపిస్తోంది. 'ఏమి   చేయదలచుకున్నా వు?' 'యశోదకి''ఓరల్ కాంట్రాసెప్టివ్'' (గర్భ నిరోధక) టాబ్లెట్స్ ఇచ్చాను. దాంతోపాటు ''కార్టిజన్ స్టెరాయిడ్స్ '' ఇచ్చా ను. చూపు బాగా ''డేమేజ్'' అవుతుంది! డిసీజ్ ఎక్కు వ అయ్యే ''ఐ డ్రాప్స్'' రాసాను! నేను చేయబోయే ఆపరేషన్ తుది ఘట్టం!' దానితో యశోద గుడ్డిదిఅవుతుంది! ..''ఫెడీల్మ''ని చెంప మీద కొట్టినట్లు అయింది. 'Eswar.. Ektha మధ్యలో Yesoda.. అంటేనేను. ఈశ్వర్ గొంతు వినబడింది. 'మూడు మొదటిఅక్షరాల కలయిక తాత్కా లికం! 'EYE' మధ్యలో ''Y '' కొన్నా ళ్ళకిపోతుంది.' ఈశ్వర్ మాటలు ముద్దగా వస్తున్నా యి. మద్యం తాగడం వల్ల వచ్చి న మత్తు కాదు! ఆనందంలో పరాకాష్టకివచ్చినప్పు డు గొంతులో వచ్చే మార్పు నాకు తెలుసు. మబ్బులు విడిపోయినట్లు అంతా తెలిసింది. ఈశ్వర్, ఏక్తాకాలేజీ నుంచి ప్రేమికులు. తన భవిష్యత్తు కోసం నన్ను వాడుకున్నా రు. చాలా సేపు అక్కడే నిలబడిపోయాను. నాప్రేమ సౌధం బలహీనమైన పునాదిమీద నిర్మితమైనది. ఈ ప్రేమికుల మధ్య పనికిరాని, విలువలేని, నిరర్థక ''జీవిని '' నేను. జీవితం మీద ఆశ మంటల్లో పడిభస్మం అయింది. అందుకే ఈశ్వర్ పని సులువు చేసిపోవాలని అనుకున్నాను.' మర్నాడు.. బాంక్ కివెళ్లి నాన్న ఇచ్చి న ''బాంక్ గారంటీ కాన్సి ల్'' చేయించాను. హాస్పిటల్ పని ఆపేయమని కాంట్రాక్టర్ కినోటిస్ ఇచ్చా ను. అక్క ప్రతిఘటించింది. 'ఈశ్వర్ మోసం చేసాడు. నేను అలా చేయలేను. అతను హాస్పిటల్ కియజమాని కావాలి!' అంది. ఆమె మాటలకినేను తొట్రుపడ్డాను! ఏమిటీపిచ్చి ! 'కళ్ళుఎంతమందినో చూస్తాయి! కానీ మనసు ఒక్కరినేచూస్తుంది!.. ఆ ఒక్కరూ ''ఈశ్వర్'' కాదు!'అన్నాను. 'ఆకాశానికిచిల్లులు పడినట్లు ఇప్పు డీఈ వాన ఏమిటి?' అందిఆమె. 'నీ కళ్ళు తుడుచుకో.. వర్షం ఆగిపోతుంది.ఎడారి  ఇసుకతో కప్పబడ్డనీ కళ్ళు కూడా శుభ్రపడతాయి. నీ కళ్ళు మునపటి నేత్రపద్మాలు అవుతాయి!' 'వద్దే.. ఈశ్వర్ లేకుండా జీవితాన్ని ఊహించుకోలేను. నా మార్గం సుగమంగా వుండదు!' ఎక్కడ వదిలేయవసినవి అక్కడే వదిలెయ్యాలి. మోస్తూ పోతేమనం వాటిని వదలాలనుకున్నా అవి మనల్ని వదలవు! కాసేపు పడుకో! నీ ఊహల

దుర్గమారణ్యంలో కూడా ఒక దోవ దొరుకుతుంది, గూడు కట్టుకున్న చీకటిలాంటిఅరణ్యంలో

కూడా నన్నని వెలుగులాంటి మార్గం నీ ముందు కనిపిస్తుంది!' అన్నా ను. 'లేదు మీనా.. నా మానాన నన్ను చావనీ!' వద్దు. ఓ అల్ప జీవికినీ త్యా గం అర్థం కాదు. ''యావజ్జీవం హోష్యామి, నాతి చరామి" నిన్ను జీవితాంతం పోషిస్తానని, పరస్త్రీతో సంపర్కం పెట్టుకోనని ప్రాణిగ్రహణంలో చేసిన బాసలకు అర్థం వుండదు. 'లేదు అక్కా! ఇప్పుడు నీ గుండెమండుతూ వుంది. గుండెకాగడాలు చేత్తో పట్టుకుని నడు! ముందు చల్లని నది వుంది. ఆ నదిని దాటడానికి ఒక తెడ్డు.. అదే ''నిజం!''.. వెతుకుతూ పోవాలి! వెతకడమేనీ జీవిత లక్ష్యం కావాలి. అంతుచిక్కని కొండల మధ్య మార్గం వుంటుంది. హాస్పిటల్ మళ్ళీ మొదలు పెడదాం. అది'యశోదా హాస్పిటల్' దానికి ''ముందూ, వెనకా'' ఎవరూ వుండరు! ఆమె కిటికీవైపు నడిచింది. కళ్ళు అవే.. చూపు మారింది. వాన

***

## గంటి రమాదేవి

**సుబ్రహ్మణ్య శర్మ**. కలం పేరు గంటి రమాదేవి. సికింద్రాబాద్ లో ఉంటారు. ఎంబీఏ, ఎంకామ్, సీఎంఎ చదివారు. 1964 లో మొదటి రచన ఆంధ్ర ప్రభ వీక్లీ లో రాశారు. వెయ్యి పైగా కథలు. నవలలు, నవలికలు రాశారు. ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, మయూరి, పల్లకి, చతుర, విపుల, కృష్ణా పత్రిక, నవ్య, స్వాతి సపరివార పత్రికల్లో రచనలు ప్రచురితం అయ్యాయి. ఎయిర్ ఇండియాలో పని చేసి, ఇటీవలే రిటైర్ అయ్యారు.

# పర్ణశాల

## పంతంగి శ్రీనివాస రావు



పది సంవత్సరాలు అయింది ఆ ఊరు వచ్చి.

ఊరు చాలా మారిపోయింది.

వీకెండ్ కావటం వలన ఓ రెండు రోజులు గడపవచ్చు అని, బస్టాండ్ దగ్గరలో ఓ లాడ్జి తీసుకున్నాను. నేను వచ్చేముందు మా శ్రీమతి ని వారి పుట్టింటికి పంపాను. నేను ఉద్యోగరీత్యా హైదరాబాద్ కు షిఫ్ట్ అయినాక, ఊరిలో ఉన్న ఇంటిని అమ్మి వేశాను. అమ్మా నాన్నలు బ్రతికి ఉన్నంత వరకు మా దగ్గరే ఉండేవాళ్ళు. ఐదేళ్ల క్రితం ఒక సంవత్సరం తేడాతో వారు గతించారు.

హైదరాబాద్ నగరానికి మా ఊరు సుమారు 300 కిలో మీటర్లు దూరంలో ఉంటుంది. మహారాష్ట్రకు సమీపంలో ఉంటుంది మా ఊరు. కిరాయికి ఇచ్చి వస్తే ఎన్నో సమస్యలు. కిరాయిని డైరెక్ట్ గా బ్యాంక్ అకౌంట్ లో వేసినా, వారు ప్రతి రెండు నెలలకోసారి ఏదో ఒక సమస్య చెప్పేవారు. చాలా చికాకు అనిపించేది. వెళ్ళి చూడలేని పరిస్థితి. జర్నీ ఏడెనిమిది గంటలు పట్టేది. అదీకాక, హైదరాబాద్ లో ఒక ప్లాట్ కొనటం వలన డబ్బు కూడా తక్కువ పడింది. అందుకే, అమ్మి వేయవలసి వచ్చింది.

ఇల్లు అమ్మేటప్పుడు ఎంతో ఎమోషనల్ గా ఫీల్ అయ్యాను. పుట్టి పెరిగిన ఊరు. నా విద్యాభ్యాసం అంతా గడిచిన ఇల్లు. నా ఆటపాటలు, బాల్య స్నేహితులు ఎన్నో మధురానుభూతులు పంచుకున్న ఊరు.

ఇప్పుడు ఈ ఊరు రావటానికి ఒక కారణముంది. ' మాస్టారు ' .. శివరాం మాస్టారు అంటే నాకెంతో గౌరవం. మా ఇంటి వెనకాలే వాళ్ళు ఉండేవారు. నేను హైదరాబాద్ కు షిఫ్ట్ అయినాక ఒక సంవత్సరం మాత్రం ఆయనతో ఫోన్ లో సంభాషించటం జరిగింది. ఆ తర్వాత నా ఫోన్ పోవటం వలన కాంటాక్ట్ నెంబర్స్ చాలా వరకు పోయాయి. అందులో మాస్టారు గారి నెంబర్ కూడా ఒకటి. ఇక అక్కడినుంచి సత్సంబంధాలు లేవు. నా బాల్య దశలో మంచీ, చెడూ అన్నీ మాస్టారు గారే! ప్రతి రోజూ ఆయన ఇంటికి ట్యూషన్ కు వెళ్ళేవాడిని. ఫీజు ఏమీ తీసుకునే వారు కాదు. ఆయన ధర్మపత్ని ని ' అమ్మా ' అని పిలిచే వాడిని. ఆయన కూతురు, కొడుకులు కూడా నాకు బాల్యంలో పరిచయమే, అయితే స్నేహ సంబంధాలు మాత్రం లేవు. ప్రస్తుతానికి వస్తే, ఎందుకనో మాస్టారు గారిని వ్యక్తిగతంగా పలకరించాలని అనిపించింది.

శివరాం మాస్టారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మాథ్స్ టీచర్. స్వతహాగా లెక్కల ఫోబియా ఉన్న నన్ను ఆ ఫోబియా నుంచి బయట పడవేసిన గొప్ప వ్యక్తి. నన్ను

బాగా సాన బట్టారు. మాథ్స్ సబ్జెక్ట్ లో నూటికి తొంబై ఐదు శాతం మార్కులు వచ్చాయంటే నాకే కాదు అమ్మా నాన్నలకు కూడా ఆశ్చర్యం కలిగింది.

ఇంటర్ లో ఎం పి సి తీసుకుని ఇంజనీరింగ్ లో మంచి ర్యాంక్ సాధించానంటే శివరాం మాస్టారు వేసిన పునాది గట్టితనమే కారణం. మేము ఇల్లు వదలి , అమ్మి వేసి వెళ్ళేటప్పుడు మాకంటే ఎక్కువగా బాధ పడిన వ్యక్తి ఆయనే!

" నన్ను వదలి వెళ్తున్నావురా విస్సూ! నేను గుర్తుంటానురా! " ఎంతో ఆపేక్షతో వీడ్కోలు పలికారు ఆయన.

నా పేరు ' విశ్వనాథం '. ఆయన ఎప్పుడూ నన్ను ' విస్సూ ' అని పిలిచేవారు. దూరాభారం కావటమే కాదు, జీవన పోరాటంలో పడి, ఎన్నో సమస్యలను ఎదుర్కొని, అమ్మా నాన్నల ఆరోగ్య సమస్యలు, ఆ తర్వాత వారి మరణం... ఇన్ని కారణాల వలన ఈ ఊరు రాలేక పోయాను కానీ, ఊరును మాత్రం మరచి పోలేదు. మాస్టారు గారినీ మరచిపోలేదు. అమ్మను, జన్మభూమిని, బాల్య స్మృతులను మరచిపోయేంత విశ్వాస ఘాతుకత్వం నాలో లేదు. ఈ ఊరికి రైల్వే సౌకర్యం లేక పోవటం వలన, కూర్చుని ఇన్ని గంటలు ప్రయాణం చేయటం వలన బాగా అలసి పోయాను.

అందుకే బాగా నిద్ర పట్టింది. ఉదయం బయలు దేరిన నాకు మధ్యాహ్నం ఈ ఊరుకు చేరుకోవటం వలన బాగా నిద్ర పట్టింది. దగ్గరలోని ఒక హోటల్ లో భోంచేసి ఓ కునుకు తీశాను. లేచి చూస్తే సాయంత్రం ఆరు అయింది. ఇక ఫ్రెష్ అప్ అయి బయటకు వచ్చాను.

బస్ స్టాండ్ మారింది. ఇది వరకు ఊరిలో ఉండేది. ఇప్పుడు చాలా దూరంలో ఉంది. పూర్వం ఊరిలో ఉన్న మా ఇంటికి వెంకటేశ్వర స్వామి టెంపుల్ చాలా దగ్గర. అది ఒక్కటే లొకేషన్. పది సంవత్సరాల్లో ఈ ఊరు ఇంతగా మారుతుందని ఊహించలేదు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక, జిల్లాల ఏర్పాటులో, మా ఊరు కూడా జిల్లా కేంద్రంగా మారటం వలన కావొచ్చు, చాలా డెవలప్మెంట్ కనిపిస్తోంది. నునుపైన రోడ్లు, పెద్ద పెద్ద భవంతులు, లాడ్జ్ పై భాగం బాల్కనీ నుంచి చూస్తోంటే ఎంతో కోలాహలంగా ఉంది.

అక్కడ ఒక ఆటో ఎక్కి గుడి పేరు చెప్పాను. ఆటో వెళ్తోంది. చాలా దూరం అనిపిస్తోంది ఇప్పుడు. ఆ ఊరికి కలెక్టరేట్, మెడికల్ కాలేజీ వంటివి, ఇంకా ఎన్నో జిల్లా కేంద్రాల్లో ఉండవలసిన వన్నీ ఏర్పడ్డాయి. ఇప్పుడనిపిస్తోంది ఇల్లు అమ్మకుండా ఉంటే బాగుండేదని. నగరంలో స్వంత ఫ్లాటు ఉన్నా, స్థలం ఉన్నా కూడా స్వంత ఊరిలో శాశ్వతంగా ఓ చిన్నపాటి స్వంత గూడు ఉంటే అది స్వర్గసీమనే! ప్చ్... ఇప్పుడు బాధపడి ఏం లాభం.. తప్పనిసరి పరిస్థితుల్లో నిర్ణయం తీసుకున్నాడు ఆనాడు. ఏడాదికో రెండుసార్లు వీలు చూసుకుని వెళ్లి వస్తే బాగుండేది.

ఇక, ఆలోచనలు శివరాం మాస్టారు వేపు తిరిగాయి. మాస్టారు ఎలా

ఉన్నారో? ఏం చేస్తున్నారో! పిల్లల దగ్గర ఉన్నారా? అమ్మగారు ఇంకా ఓపిక తోటి పనులు చేస్తున్నారా?

ఆలోచనల్లో ఉండగానే.. " సార్.. ఇదే వెంకటేశ్వర స్వామి టెంపుల్.. ఎక్కడికి తీసుకు వెళ్ళమంటారు? " ఆటోవాలా పిలుపుతో ఇహంలోకి వచ్చాను.

' వావ్! ఇది నేను తిరిగిన ప్రాంతమేనా! ఇక్కడి నుంచే సైకిల్ త్రొక్కుకుంటూ స్కూల్ కు వెళ్ళాను. సి సి రోడ్స్, రోడ్ నెంబర్స్, వివేకానంద కాలనీ అని పెద్ద బోర్డు.. మనిషి లాగానే ఊరికి కూడా మార్పు సహజమేమో! ' నేను పెరిగిన ఇంటి వేపు వెళ్ళటానికి మనస్సు ఒప్పలేదు. పెద్ద బిల్డింగ్స్, అపార్ట్మెంట్స్, ఎంతో పోష్ గా...

" ఇక్కడే ఓ సైడ్ ఆపు బాబూ.. " ఆటోవాలా కు చెప్పాను.

ఓ ప్రక్కకు ఆపాడు ఆటో..

అలా అలా నడుచుకుంటూ ఒక వీధి టర్నింగ్ లో ఆగాను.

అక్కడ చిన్న కిరాణా షాపు..

అతడిని అడిగాను.

" శివరాం మాస్టారు గారిల్లు..." మధ్యలోనే కట్ చేసి..

" ఇక్కడే సార్.. వెస్ట్ సైడ్ ఐదో ఇల్లు. ముందు గార్డెన్ ఉంటుంది. బయట నేమ్ ప్లేట్ ఉంటుంది." వివరంగా చెప్పాడు కిరాణా షాపు వ్యక్తి.

శివరాం మాస్టారు ఇల్లు కనుక్కోవటం అంత కష్టం కాలేదు.

ముందున్న గేట్ తీసుకుని లోపలకు వెళ్ళాను.

నాప రాళ్ళ బండల దారికి ఇరు వైపులా గార్డెనింగ్. ఆకు కూరలు, కాయ కూరలు. అక్కడో వ్యక్తి పైప్ తో నీళ్ళు చిమ్ముతున్నాడు. లుంగీ, చేతుల బనియన్, తలపాగా.. పరికించి చూస్తే ఆయనే..!

" మీరు.. మీరు.. శివరాం మాస్టారు కదా!" అడిగాను.

ఆయన నా వేపు తేరిపార చూసి..

" అవును బాబూ.. ఇంతకూ.." మధ్యలోనే కట్ చేసి..

" నేను మాస్టారు విశ్వనాథం.. విస్సూ.." చెప్పబోతుండగా..

" ఓ(.. నువ్వా? ఎంతకాలానికి.. " ఆయన కళ్ళల్లో ఆనందం. " చాలా మారిపోయావురా.. ముందు బొజ్జ.." అంటూ..

" పద.. లోపలకు వెళ్దాం.. " అంటూ దారి చూపించాడు.

రెండు గదుల ఇల్లు.. ఎంతో నీటుగా..

ముందు గదిలో ఆ దృశ్యాన్ని చూసి మ్రాన్పడి పోయాను.

ఒక ఫోటోకు కర్పూరపు హారం..

" మాస్టారూ.. " ఆ ఫోటో వేపు చూసి కన్నీళ్ల పర్యంతం అయ్యాను.

ఆయన నా భుజం తట్టి..

" అవును విస్సూ.. కాలం చేసింది. క్యాన్సర్.. ఐదేళ్లయింది. " ఎంతో బరువుగా చెప్పారు.

" ఊ (.. చెప్పు.. ఎలా ఉన్నావు? భార్య, పిల్లలు, అమ్మా, నాన్న.." కుశలం అడగటం మొదలు పెట్టారు.

అన్నీ వివరించాక..

" మాస్టారూ.. మీరు ఒంటరిగా..!" బాధగా అడుగుతున్న నన్ను చూసి నవ్వుతూ..

" ఒంటరి వాడిని కాదురా.. నాకు పెద్ద కుటుంబం ఉంది. " నాకు అర్థం కాలేదు.

" పిల్లలు..!"

" అబ్బాయి అమెరికాలో.. అమ్మాయి ఆస్ట్రేలియాలో.."

" మరి.. అమ్మగారు చనిపోయాక.. మీరు.."

" నాకు అర్థం అయిందిరా.. పెళ్ళయిన పిల్లల వద్ద ఉంటే పరాయి వాళ్ళ వద్ద ఉన్న ఫీలింగ్ ఉంటుంది. వాళ్ళ మనస్తత్వాలు కూడా మారుతుంటాయి. అందుకే నేనిలా.. అయినా హ్యాపీ గానే ఉన్నాను.. ఆమె లేదనే ఒక్క లోటు తప్ప.."

ఆగి.. " ఊ.. ఎక్కడ దిగావ్ " అడిగారు..

చెప్పాను.

" ఏవిటి? అక్కడ ఎందుకు దిగావ్.. బేగి వచ్చేయ్.. నాలుగు రోజులు కలిసి ఉందాము.." ఆప్యాయంగా అన్నారు.

చిరునవ్వు నవ్వుతూ..

" థ్యాంక్ యూ మాస్టారూ.. రేపు ఉదయం వస్తాను.. "

" ఉదయమే వచ్చేయ్.. మనం పది గంటలకు ఒక చోటికి వెళ్దాం.. ఈ మాస్టారు ప్రపంచం చూపిస్తాను.. అన్నట్టు భోంచేసి వెళ్ళు.."

అయోమయంగా చూస్తున్న నాతో..

" నేనే వంట చేసుకుంటాను. రాత్రి రెండు చపాతీలు చేసుకుంటాను. పనిపిల్ల వచ్చి ఇల్లు, వాకిలి శుభ్రం చేస్తుంది.. నాలుగు పాత్రలు ఉంటే కడుగుతుంది. మార్నింగ్, ఈవెనింగ్ వాకింగ్ చేస్తాను. వచ్చి కొద్దిసేపు గార్డెనింగ్.. ఉదయమే యోగా.. ఆధ్యాత్మిక పుస్తక పఠనం.. వారానికో రెండు రోజులు నా వసుధైక కుటుంబం దగ్గరకు.." చెప్పారు.

" అంటే...!"

" నీకు ప్రత్యక్షంగా చూపిస్తాను, రేపు.. సరేనా..."

కొద్ది సేపు నిశ్శబ్దం.

" ఉండరా..చపాతీ చేస్తాను.. తిని వెల్దువు గానీ.."

" వద్దులే మాస్టారూ.. రేపటి నుంచి మీ ఆతిథ్యం స్వీకరిస్తాను.."

కొద్ది సేపు కూర్చుని బయటకు నడిచాను.."

మనస్సు భారంగా ఉన్నా, ఏదో ఆనందం.

***

ఉదయాన్నే లాడ్జ్ ను వేకేట్ చేసి శివరాం మాస్టారు గారింటికి చేరుకున్నాను.

ఆయన నా కోసమే ఎదురు చూస్తున్నట్టు ఉంది.

ఎదురుగా వచ్చి నా చేయి పట్టుకున్నారు ఎంతో ఆప్యాయంగా.

" రా.. విస్సూ.. టిఫిన్ చేద్దాం.. వేడి వేడి ఉప్మా.. ఇప్పుడే చేసాను. నా చేతి రుచి చూడు.. " టేబుల్ మీద సర్ది పిలిచారు.

చాలా బాగా ఉంది ఉప్మా.. అదంటే నాకు విముఖత.. అయినా, ఏదో కొత్త రుచి.

" చాలా బాగా చేశారు మాస్టారూ.." ప్రశంసించాను.

ఆయన కళ్ళల్లో వెలుగు.

ఓ గంట తర్వాత ఒక ఆటో ఆయన ఇంటి ముందు ఆగింది.

ఆటోవాలా చనువుగా లోపలకు వచ్చి..

" మాస్టారూ.. లగేజీ ఎక్కడ.." అడిగాడు.

శివరాం మాస్టారు చూపించారు.

అతను వాటిని తీసుకుని ఆటో వెనుక భాగంలో సర్దాడు.

ఆశ్చర్యంగా చూస్తున్న నా వేపు చూసి..

" సస్పెన్స్.. పద.. " చిరునవ్వుతో దారి తీశారు.

ఆయన వెనుక నేను..

ఆటో నాలుగు కిలో మీటర్లు ప్రయాణించి ఊరి శివారులో నున్న ఒక ప్లేస్ లో ఆగింది.

ఎంతో ' ప్లజెంట్ ' గా ఉంది వాతావరణం.

తల ఎత్తి చూస్తే ' అనురాగ వల్లరి ' అనే పెద్ద బోర్డు.

మేము ఆటో నుంచి కాళ్ళు బయటకు పెట్టగానే..

బిల బిల మంటూ ఆటో కు అల్లంత దూరంలో నిలబడి ఉన్నారు ఓ ఏభై మంది.

అందరూ వయో భారంలో ఉన్నవారే!

అందరి కళ్ళల్లోనూ ఎనలేని ఆనందం. చిరు నవ్వుల దరహాసం.

నా వేపు తిరిగి చెప్పారు శివరాం మాస్టారు.

" ఇదుగోరా విస్సూ..వీరే నా కుటుంబం. నా బంధు మిత్రులు.. నేను రీ ఛార్జ్ కావటానికి కారకులు."

చిన్నగా అర్థం అవుతోంది.

ఆటోవాలా తీసుకు వచ్చిన సామాగ్రిని లోపలకు చేరవేశాడు.

" ఉండు బాబూ.. భోజనం చేశాక కొద్ది సేపు ఉండి వెళ్దాం.." అతనితో చెప్పారు శివరాం మాస్టారు.

అతను చేతులు కట్టుకుని ఎంతో వినయంగా తల ఊపాడు..

శివరాం మాస్టారు అందరు వృద్ధుల వద్దకు వెళ్ళి చేతులు పట్టుకుని పరామర్శించ సాగారు. నన్ను వారికి పరిచయం చేశారు. నాకు ఏదో కొత్త లోకంలో విహరిస్తోన్న భావన.

వెనుక వేపు ఏపుగా పెరిగిన చెట్ల నీడలో, ఒక చప్టా మీద కూర్చున్నాము ఇద్దరం. ఎంతో హాయిగా, చల్లగా ఉంది. ఇటువంటి ప్రదేశంలో రోజూ రెండు గంటలు కూర్చుంటే ఎంతో ఆరోగ్యం.. ఏ రోగము, రొప్పు దరిచేరవు కదా అనిపించింది.

" విస్సూ.. నా భార్య చనిపోయాక నాకు ఈ లోకం అంతా అంధకారంగా అనిపించింది. పిల్లలు కూడా తమ వద్దకు రమ్మన్నారు. అప్పుడే ఈ ఆశ్రమం గురించి విన్నాను. నిర్వాహకులను కలిశాను. వారందరూ అభ్యుదయ భావాలు కలిగిన వారే! అనాథలకు, పిల్లలకు దూరం అయిన వాళ్లకు, పిల్లలు దూరం పెట్టిన వారికి, మధ్య తరగతి, దిగువ తరగతి జీవులకు ఈ ఆశ్రమం కల్పతరువు.

నాలో ఏదో స్పందన. సామాన్య నిత్య కృత్య జీవితం నుంచి బయట పడాలన్న ఆలోచన వచ్చింది. అంతకు ముందే రెండేళ్ల క్రితం రిటైర్ అయి ఉన్న నాకు భగవంతుడు మంచి మార్గం చూపాడని పించింది.

వృద్ధాశ్రమాలు మూడు రకాలు. ధనికుల కోసం నిర్వహించ బడేవి. మధ్య తరగతి వారి కోసం నిర్వహించ బడేవి. నిర్భాగ్యుల కోసం నిర్వహించ బడేవి. ఇది మూడో తరగతి వారి కోసం చెందినది.

మొదటి రెండు రకాలు పేయింగ్ విధానంలో నడిచేవి. వాటి నిర్వహణకు సమస్య ఉండదు. మరి, నిర్భాగ్యుల సంగతి...!?

అసలు సిసలు అభాగ్యులు వీరే కదా.. అందుకే నా రిటైర్మెంట్ బెనిఫిట్స్ నుండి సగం వరకు ఈ ఆశ్రమానికి కేటాయించాను. పిల్లలు సెటిల్ అయ్యారు. వారు నా కోసం ఎదురు చూసే పరిస్థితి లేదు. నాకు బాగానే పెన్షన్ వస్తుంది. నేను నా ఇంటి ముందు కూరగాయల తోట పెంచేది ఇందుకే.. అందులో పండే ఆకు కూరలు, కాయ కూరలు ఈ ఆశ్రమానికి చేరుస్తాను. వచ్చేముందు పండ్లు దండిగా తీసుకు వస్తాను. వీరందరితో నా అనుబంధం మాటలతో చెప్పలేనిది.

మధ్యాహ్నం వీరందరితో కలిసి భోజనం చేస్తాను. ఆటోవాలా పిల్లలకు నేనే ఫీజులు కడ్తాను. అందుకే అతనికి నేనంటే గౌరవం. పిలవగానే వస్తాడు. ఇలా వారానికి ఓ మూడు రోజులైనా ఇక్కడికి వస్తాను. ఎంతో ప్రశాంతతను అనుభవిస్తాను.

వీరందరూ నా తోబుట్టువులు అన్న ఫీలింగ్. భగవంతుడి దయ వలన ఈ ఆశ్రమానికి నిధుల కొరత లేదు. స్వచ్ఛంద విరాళాలు అందించే దాతలకు తక్కువ లేదు. పండుగలకు, పబ్బాలకు వీరితోటే నా కాలక్షేపం. అందరికీ కొత్త దుస్తులు ఇస్తాము.

వారికి పిల్లలు దగ్గర లేరన్న ఆలోచన లేదు. నాకు ఒంటరి వాడిని అన్న తలపూ రాదు.

ఇంటిలో ఉన్నా కూడా వీరి గురించే నా ధ్యాస... శ్వాస. బోరు కొట్టిస్తున్నాను కదూ..!" నా భుజాన్ని తట్టారు ఆయన.

ట్రాన్స్ లోకి వెళ్ళిన నేను వెలుపలికి వచ్చాను.

' మాస్టారు ' గొప్పతనం ముందు, ఆయన ఆలోచనా విధానం ముందు నేనొక ' లిల్లీపుట్ ' ను.

మధ్యాహ్నం సామూహిక భోజనాల సమయంలో అందరం ఎంతో ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ ఉంటే ఎంతో ఆనందం.

భోజనం ప్రారంభంలో ' అన్నం పరబ్రహ్మ స్వరూపం ' అంటూ శివరాం మాస్టారు ఒక శ్లోకం చదివారు.

తిరిగి వచ్చేటప్పుడు చెప్పారాయన. " ఈ వయస్సులో కావలసింది మనశ్శాంతి విస్సూ.. ఆ నిర్భాగ్యులు, తాము నిర్భాగ్యులం అన్న భావన లేకుండా తమ శేష జీవితాలను గడపాలి. వారి కళ్ళల్లో ఆనందం చూస్తోంటే నాకు ఎనలేని సంతృప్తి.

నేను దేశం, త్యాగం వంటి పెద్ద పెద్ద పదాలను పలకలేను. కానీ, నా వంతు సహకారం, నా స్థోమత ప్రకారం నేను అందిస్తాను. నా ఫ్యామిలీకి ఈ మాత్రం సహాయ పడలేనా! "

నా మనస్సులోని భావన ఆయనకు చెప్పలేక పోయినా, నేను కూడా ఒక ధృడ సంకల్పం తీసుకున్నాను.

మరుసటి రోజు సెలవు తీసుకునేటప్పుడు ఎంతో ఆప్యాయంగా చెప్పారు ఆయన.

" ఇక్కడ ఇల్లు లేదు కదా.. ఇక ఈ ఊరితో నాకేం సంబంధం అనే ఫీలింగ్ రానివ్వకు విస్సూ.. ఇది నీ ఇల్లే.. నువ్వెప్పుడయినా రావొచ్చు.."

ఆయన పాదాలకు నమస్కారం చేశాను. ఆయన పాదాల మీద పడిన నా కన్నీటి చుక్కలకు, నన్ను లేపి ఆర్తిగా ఆలింగనం చేసుకున్నారు శివరాం మాస్టారు.

***

**రచయిత పేరు పంతంగి శ్రీనివాస రావు.**

స్వస్థలం సూర్యాపేట. హైదరాబాద్ లో ఉంటున్నారు. విద్యుత్ సంస్థలో పనిచేసి, ప్రస్తుతం పదవీ విరమణతో విశ్రాంతి జీవితం గడుపుతున్నారు.

సుమారు 50 కథలు రాశారు. రెండేళ్ల క్రితం ఇదే పోటీలో ఇదే బహుమతి గెలుచుకున్న కథ " ఊరు పొమ్మంది రమ్మంది". పలు కథలు ఆదివారం అనుబంధం సంచికలతో పాటు, స్వాతి, సాహితీ కిరణం వంటి ప్రముఖ పత్రికలలో కథలు ప్రచురితమయ్యాయి.

**సెల్: 9182203351**



# కన్నీటి కత్తులు

కొండపల్లి నీహారిణి

"ఓ రామనర్సూ! రామనర్సూ! యాడున్నవే .. అన్నాలమైందే రాయే.."

"ఏందే బాపూ ఏందే ? "

"నీ కొడుకు...కొడుకే..." బొందయ్య నోరు పెగలడం లేదు.

"మన మల్లేశ్ మన మల్లేశ్ సచ్చిపోయిండంటనే బిడ్డా!

"వో బిడ్డా..!"కొమురమ్మ అరుస్తూ నెత్తికొట్టుకుంటూ ఏడుస్తూనే ఉంది.

" ఆ.. వాయ్యో ...వామ్మో... ఏమాయె! ఎట్లాయే! సచ్చుడేందే ? నా కొడుకో .. మల్లేశో ..." రామనర్సు పెద్దగా అంటుంటే,

"తాటిమించెలి జారిపడ్డడటనే " ఆమె తల్లి మాట విని తెల్లబోయింది.

"ఎకాయెకిన పానంబోయిందటనే " తండ్రి మాట అశని పాత మయ్యింది.

''అరెరే ఎంత అన్యాయమాయె!గట్లెట్లాయె!'' అనుకుంటూ జనమంతా ఒక్కొక్కరొక్కక్కరే గుమిగూడి అంతా ఏడుస్తున్నారు.

" చూద్దాం పాయె అమ్మో వోమ్మో వోనాయినా..!"పొట్టమీద కొట్టుకుంటూ ఏడుస్తున్న రామనర్సునెవ్వరు పట్టలేక పోతున్నారు.గుంపును చీల్చుకుంటూ గుండె లు బాదుకుంటూ పక్కింటికి పోయింది. కోడలు నీలమ్మ నిండు చూలాలు. ఇద్దరు చంటికూనలు ఏడుస్తూ తల్లిని కర్చుకొనునున్నారు. పెద్దపిల్ల "ఓ డాడీ ! డాడీ!" అని ఏడుస్తూనే ఉన్నది.

*** 

ఆ ఊళ్ళో బొందయ్య అంటే మంచి పేరున్న గౌడ్.ఇద్దరు బిడ్డలు. కొమురమ్మ తన భర్త వెంటబడి వెంటబడి ఆడపిల్లలిద్దరికీ వాళ్ళ చిన్నతనం లోనే లగ్గాలు చేయించింది.పెద్దబిడ్డను పక్కూరికిచ్చి,చిన్నబిడ్డ రామనర్సు ను ఉన్నూళ్ళెనే ఇచ్చి,తమ మంచిచెడ్డలు చూసుకోవాలన్నారు.ముక్కాలు వయసులోనూ కన్నకూతురు కష్టాలను పట్టించుకునే తల్లిదండ్రులు బొందయ్య,కొమురమ్మ.మంచోళ్ళన్నపేరున్న కుటుంబం వియ్యంకులది. అన్నేళ్ళు పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న అల్లుడంటే చాలా గౌరవం.కాస్తంత రాజకీయ పలుకుబడి కూడా సంపాదించుకున్న అల్లుడు ఎంకటయ్యకు పక్షవాతం వచ్చిందీమధ్యననే! అల్లుడు మంచానికి అతుక్కున్నాడన్న బాధనే బొందయ్య ను బాధ్యత నుండి తప్పించుకోనివ్వడంలేదు.

ఉన్నూళ్లో ఏడో తరగతి వరకే బడి చదువులు ఉండేవి. బిడ్డలిద్దరినీ నాలుగో తరగతి,ఐదోతరగతి వరకే చదివించింది రామనర్సు.కొడుకు మల్లేశ్ ను పక్క ఊరు హైస్కూల్ కి పంపేది.ఏడులనే అత్తెసరుమార్కులతో పాసైన మల్లేశ్ ఎనిమిదో తరగతి నుంచే ఎట్లా బడి డుమ్మా కొట్టాలాని చూసేటోడు. ఎట్లాగో అట్లా పదయ్యిందనిపించేసి,తండ్రి దారే పట్టిన మల్లేశ్ తాళ్లెక్కడం లో పనితనం చూపుతుండేవాడు.కొద్దిగా ఒదులుతే చాలు జులాయ్ తిరుగుడు తిరుగుతుండని ఎంకటయ్య తనతో పాటే కొడుకు ను కల్లు దిడ్డెంకి కి తీసుకువెళ్లేవాడు.ఈ భయానికే బ్రాండిషాప్ పెట్టుకునేందుక్కూడా ప్రోత్సహించలేదు.కాని చెడు అలవాట్లకు పోలేదు.

"ఓ కొవురక్క పిల్లగాణ్ణి గింత అదుపులో పెట్టుకోకుంటే ఎట్లా,నీ మనుమడు జూడు గా పోరగాళ్ళతోని గూడి ఎట్ల తిరుగుతున్నడో!" అని కూరగాయలు అమ్మే రాధమ్మ అనగానే, "అబ్బో మహా షానుతియ్! మీకట్లనే ఔపిస్తది. తోటోళ్ళ తో మాట్లాడొద్దా ఏంది" కోపంతోనే గట్టిగ అరిచేసింది అక్కడనే ఉన్న రామనర్సు.

"నా కొడుకుని చూస్తే కండ్లల్ల పెట్టుకుంటున్నర"ని శాలెంకటమ్మతో అనుకుంటూ కల్లుకుండలూ ముంతలూ కడుగుతు

'ఇంగ తొండముదిరి ఊసరవెల్లి కాకముందే,ఆల్సెం చెయ్యకుండ పిల్లగానికి పెండ్లిజేయాలె'అని అనుకున్నది.

ఒకరిని చూస్తే ఒకళ్ళకు అసూయ, ఈర్ష్యా ద్వేషాలు ఎట్లుంటాయో తెలియదా!కుల పట్టింపులు ,కుల కట్టడి విషయాలన్నీ ఊళ్ళలో కుల పెద్దలు చూస్తారు.తాళ్లెన్నున్నయ్ బొత్తలు ఎన్ని ఉన్నాయనే లెక్కలు చూసుకొని తీసుకుంటారు.మొట్టమొదలు కల్లు రావడం మొదలైన తాళ్ళబొత్తలు,తాటిచెట్ల లెక్కల్దీస్తారు.పది తాటిచెట్ల మావులలను ఏర్పాటు చేసి పద్ధతి ఉన్నది.అట్లా ఊళ్లో ఉన్న తాళ్లను లెక్కతో ఇంటికిన్ని అని సరి సమానంగా కుల పెద్దలు పంచితే,వాళ్ళ పాలుకు వచ్చినవే కాకుండా పాలోళ్ళలో ఒకళ్ళు అనారోగ్యంతో ఉండడం వల్ల కొన్ని ఎక్కువ తాళ్ళెక్కుతూ మెల్లమెల్లగా మనుమనికీ నేర్పించిన బొందయ్య కు మల్లేశాన్నిచూస్తే మహా గర్వంగ ఉంటుంది.తోటోళ్ళందరిలో మస్త్రసంగున్నదని మనోనికి పేరు. అందుకే ఈడుమీదున్నప్పుడే లగ్గం చేద్దామని భార్యతో అన్నాడు.

'పైపైకి అంతా మంచిగనే మాట్లాడుతరుగాని,లోపల్లోపట ఓర్వరు. ఎట్నన్నజేసి మా శిన్నవ్వ మన్మరాలిని దెచ్చుకోవాలె' అనీ మనసులో పెద్ద నిర్ణయం తీసుకున్నది.తన బిడ్డ రామనర్సకు చెప్పి అమలయ్యేలా చేసింది కొమురమ్మ.

***

కాలం గిర్రున తిరుగుతూనే ఉంది. పెండ్లిజేసి కొడుకు కోడలు సంసారాన్ని సగబెట్టి బాధ్యత తీర్చుకున్నారు రామనర్సు, ఎంకటయ్య. ఇంటి దగ్గర్లో ఓ ఇల్లు సజావు చేయించి వేరు సంసారం పెట్టించారు. మల్లేశ్, నీల అన్యోన్యంగా ఉండేవాళ్ళు.ఇద్దరు ఆడపిల్లలు

పుట్టారు.

"అబ్బో!కోడలు నీలమ్మ కడుపుతో ఉన్నదని మా రామనర్సు బాగనే అర్సుకుంటున్నదికదా" అనుకొని మహా మురిసిపోయింది కొమురమ్మ.

అంత బాగనే ఉన్నదనుకుంటుంటే ఇంత ఘోరం జరిగింది."చిన్న చిన్న పిల్లలతో నీలమ్మ ఎట్ల బతుకుతదో ఏమో"నని మంచాన ఉన్న ఎంకటయ్య కంటికి మింటికి ధారగా ఏడుస్తునే ఉన్నాడు.

భర్త చనిపోయిండని తెల్సి నీలమ్మ కూలబడిపోయింది. అత్తను చూడగానే ఏడుపు కట్టలు తెంచుకుంది. పిల్లల్నిద్దరినీ హృదయానికి హత్తుకుని విలపిస్తూనే " ఓ నీలా నీ కెక్కడి కష్టమొచ్చెనే బిడ్డా! వోమ్మా...!" అంటూ రామనర్సు దగ్గరికి తీసుకోగానే,

"నా బతుకు అన్యాయమైపోయిందత్తమ్మా ..! ఈ పిల్లలు ఎట్లమ్మో ..." ఏం జేతునమ్మో..." నీలనెవరూ పట్టలేకపోతున్నారు.

మల్లేశ్ చెట్టుమీద నుండి పడగానే పక్క చెట్లమీదున్న కులపోళ్ళు వెంటనే దగ్గరలో ఉన్న దవాఖానాకు ట్రాక్టర్ లో ఎక్కించుకొని తీసుకుపోయారు కానీ ఏం లాభం లేకపోయింది. విషయం తెలిసిన వెంటనే బావలిద్దరూ వచ్చి ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకుని శవాన్ని ఊరికి తీసుకుని వచ్చేసరికి బాగానే పొద్దు పోయింది.

నీలమ్మ తల్లిదండ్రులు కొంత కాలం క్రిందనే చనిపోయారు.అన్న ఒదినెలు అక్క చెల్లెళ్లు,మేనమామలు,చుట్టాలు అందరూ వచ్చారు.ఆ రాత్రి ఏడుపు లతో ఎవరికీ కంటిమీద కునుకులేదు.వీళ్ళ కుటుంబమ్మీద మంచి చూపున్న ప్రతొక్కరు సానుభూతి చూపించారు.తెల్లవారేసరికి పత్రికల లో వార్తలు వచ్చాయి.మల్లేశ్ దహన సంస్కారాలకు ఊరు వాడంతాఒక్కటైంది.

"పిట్టకు పెట్టుడు,పిండం బెట్టుడు,పదొద్దుల్ల యాటను కోసి భోజనాలు పెట్టుడు, తాగుడు బోయించుడు అన్నీ ఏ లోటు లేకుండా జరిపించారు బిడ్డా!" అని వచ్చినోళ్ళంతా అట్లా తలా ఓ మాట అనేసి వెళ్ళారు.

క్రమం తప్పకుండా రోజులు గడుస్తున్నాయి.దుఃఖాలను మింగేసే ఆకలి ఉంటుంది, అవసరాలు ఉంటాయి.కాలం ఎక్కడా ఆగదు.కడుపులో అల్సర్లయ్యి రామనర్సుకు నొప్పి, అవస్థ, పనిచేయలేకపోవడం, మంచాన పడిన పెన్మిటి,కొడుకుబోయిన దుఃఖం, కోడలును చూస్తే బాధ. చెప్పుకోలేని కష్టాలవి.

"కల్లమ్మపో నీలా" అని రామనర్సు అంటుంటే...

"నా మొగుణ్ణి మింగిన తాటిచెట్లను చూస్తే నా కడుపు దేవుతుంటది అత్తమ్మా నేను పోను"అని చెప్పింది.కానీ ఈ ఒంటరి జీవితం,ఈ అవసరాలు నీలమ్మ కు తప్పలేదు, పరిస్థితులకు తలవంచింది.

'నిద్రకు కూడా తీస్కపోనీకి ఎన్కపట్టుపట్టిన తల్లిగారోళ్ళు,ఓ ఫోన్లు గూడా చేయరు.నేను చేసి అడిగితే బాలెన్స్ అయిపోయిందని చెప్తారు. ఎక్కడ వాళ్ళమీదపడ్తనో

ఏమోననుకునే తోడబుట్టినోళ్ళు,మంచానవడ్డ మామ. ఆరోగ్యం దెబ్బతిన్న అత్త, చిన్న చిన్న పిల్లలు. ఆకలైతందమ్మా అనే బిడ్డలు.చంటోనికి పాలియ్యాల్నన్నా తిండి లేకుంటే ఎట్లా వస్తాయి, ఏం పని చేయనీకి పోతానేంది? తప్పదు!' అనుకుని కదనరంగమంటి కల్లు రంగంలో అడుగుపెట్టింది నీలమ్మ.

***

ఆకాశం ఎర్రని రంగు తో కొత్త రూపు సంతరించుకున్నది.పల్లె వాతావరణం చూపేలా వాకిలిపై తెల్లని రేఖలు ముగ్గులై విరబూస్తున్నాయి.నీలమ్మ దర్వాజ గొళ్ళెం పెట్టి , అక్కడే పక్కన ఇంటిముందు చాన్పి చల్లుతున్న రామనర్సు త...

"అత్తమ్మా పిల్లల్ని చూసుకో ఇంకా లేవలేదు. కల్లు కాడికి పోయి వస్తా" అని బయలుదేరింది.

"సరే నువ్వు పో" అన్నది రామనర్సు.

నీలమ్మ నీళ్ళాడి మూణ్ణెళ్ళయింది పూటకెళ్ళుడు కష్టమైపోతున్నది. పెద్ద బిడ్డను ప్రైవేట్ స్కూలుకు పంపేవాళ్లు.ఫీజలు కట్టాలి, కొత్త పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ లు కొనాలి. చిన్నపిల్లను బళ్ళో చేర్చాలనుకున్నది.

మూడు పొద్దుల తిండి కావాలి. ఫోన్ బిల్లు కరెంటు బిల్లు తిండి ఖర్చు లు

ఇల్లెట్లెళ్ళాలి ఏందని చాలా బాధపడింది. కొన్నాళ్ళుగా పొద్దు మాపు తాటిచెట్ల దగ్గరకు పోవడం, కల్లు అమ్మే పని నేర్చుకోవడం మొదలు పెట్టింది.మల్లేశ్ చనిపోయినందుకు గవర్నమెంట్ నుండొచ్చిన డబ్బులు మొత్తం దహనం చేసిన రోజయిన ఖర్చులకే సరిపోలేదు.చావు బొంద దీసినోళ్ళకు,చప్పుళ్ళోళ్ళకు,ముట్టుబట్టలు తీసినోళ్ళకు, చావు స్నానం కాంగనే పాలోళ్ళకు,చుట్టపోళ్ళకూ తినిపించి, తాగించినందుకైనవన్నీ అప్పు చేసి కట్టాల్సొచ్చింది. ఇగ దినవారాల ఖర్చు చెప్పనవసరమేలేదు. ఇవన్నీ దాటి బతకడానికి పని చెయ్యక తప్పలేదు నీలమ్మకు.

తనదైన ఆహార్యం,డ్రెస్ ఉంటుంటుంది ఒక గౌడుకు.తాటిచెట్టు ఎక్కేందుకు వేసుకునే ముస్తాదు నడుముకు తొడుక్కొని,మోకు కట్టుకొని, మొల కత్తి,చురకత్తి, గిసకత్తి చెక్కుకోని,తాళ్ళెక్కేప్పుడు కాళ్ళకేసుకొనే బంధాన్ని భుజానికేసుకోని,తలకు పాగా తో ఉన్న అతణ్ణి చూస్తూ,"యుద్ధ భూమికి ఎళ్తున్న సైనికుని లా ఉన్నావు అన్నా " అని నవ్వుతూ అన్నది నీలమ్మ. సైకిల్ దిగి ఆమెతో బాటు నడుస్తున్న సత్యం,"కానీ నీలక్కా,ఓ సైనికునికీ, ఓ పోలీస్ కూ, ఓ ప్రభుత్వ ఉద్యోగికీ డ్యూటీ లో సచ్చిపోతె ఎంత గౌరవిస్తారు ఏంది!మన బావపోతె ఏమొచ్చినయ్?" అన్నాడు."ఇది గవర్నమెంట్ ఉద్యోగం కాదు కదా అన్న" నీలమ్మ అంటుంటే.. "అసలు గౌండ్లళ్ళ పని అంటే ఏంది?" " ఏమన్నా చిన్నపన్న పనా?"అన్నాడు.

" ఆ బాగా చెప్తవ్ తియ్ అన్నా! ఏం పని ఏంది? మా ఇంటి పక్కన పోరగాడు బగ్గ తాగి తాగి చచ్చిపోయిండు. ఏమంత వయసు? చిన్నోడేనాయె, పెండ్లై రెండేండ్లు కాలే!

పిల్ల గొంతు కోసింద్రు అని ఆమె తల్లి ఒకటే ఏడుపు.గవర్నమెంటే డిపో లు పెట్టే.ఈ కల్లేమో గాని మెల్లమెల్లగా వానికి సారా తాగుడు, గుడుంబా తీసుకొనుడు ఎక్కువై లివర్ అంతా దెబ్బతిన్నదట.ఈ తాగేటోళ్ళను చూస్తేనే అసయ్యం అయింతాంది,అయినా నాకు ఇదే పనిజెయ్యక తప్పకపాయె"అనగానే నీలమ్మ మాటకు అడ్డుపడుతూ,

"అసలు పొద్దునపూట గీకితె వచ్చే నీరా తాగితే హెల్త్ కు మంచిదే.కొబ్బరి నీళ్ళోతె ఎంత బాగుంటయి! మట్టి కుండలో పోసి పెట్టే కల్లుసూత! ఇదంతా చెట్టు నుంచి వచ్చే ద్రావకం కదా చెల్లె!ఒంటికి మంచిదాయె. ఇప్పుడు చేసే ఈ కల్తీ కల్లు,కల్తీ సారా వాటితోటి కదా దెబ్బ తినేది?" అనుకుంటూ

ముచ్చట్లు పెట్టుకుంటూ నడిచారు..ఇద్దరు ఒక్కతోటోళ్ళు అందుకే అన్నా,తమ్మీ,అక్కా చెల్లీ అనే వరుసలు,సంబోధనలు.

***

ఓ ఫైన్ మార్నింగ్ ఒక సాఫిస్టికేటెడ్ జాబ్ చేద్దామంటే బోలెడు దొరుకుతాయి, సమాజానికి అక్కరకువచ్చే లేబర్ పని చేయడానికీ పనులు దొరుకుతాయి, కానీ మధ్యస్థంగా ఉన్న కొన్ని వృత్తులకు అంత సులభం కాదు. కిరాణం, కూరగాయలు వంటి నిత్యావసర వస్తువులు సప్లై చేసే వాళ్ళ బాధలు ఒక రకం. కనీసం నీడ పట్టున ఉండి చేసుకోవచ్చు కానీ గౌండ్లోళ్ళ పని అట్లాంటిది కాదు మూడు పూటలా మూడు రకాల సమయాల్లోఎంతో జాగ్రత్తగా చెట్టెక్కి గీకితే గాని కల్లు చేతికి వస్తుంది. పాలోళ్ళను బతిమిలాడి చెట్లెక్కించుకున్నప్పుడల్లా 'నేనే నేర్చుకుంటే అయిపోయేది, అయినా ఆడోళ్ళకు ఈ అర్హత లేదంటారాయె'అని కూడా అనుకున్న రోజులున్నయ్ నీలమ్మ కు. అందుకే " నువ్వు చెట్లెక్కి కల్లుతియ్ నేను అమ్ముతా, చెరిసగం చేసుకుందాం" అని సత్యం తో ఒప్పందం చేసుకున్నది.'గవర్నమెంట్ ఫ్రీగా ఇచ్చేవెంత?వచ్చేదెంత! కాళ్ళు చేతులు మంచిగున్నయ్,ఎట్లనో అట్ల కష్టపడాలె, పిల్లలను సాకాలె, పెద్ద పెద్ద చదువులు చదివిపిచ్చాలనేటోడు, ఆయిన కోరిక తీర్చాల'నీ అనుకుంటూ కన్నీళ్ళు కొనగోటి తో తీసేసేది. కల్లు కాంపౌండ్ దగ్గరికి వెళ్లి కల్లమ్ముకోవడం నీలమ్మకు అసలే నచ్చలేదు.

కామపు చూపులు,రాక్షసుల్లాంటి మనుషులు అనిపించేది.

అందుకే రోడ్డు పక్కన చెట్టు కింద చిన్న గుడిసె లాగా వేసి, అక్కడ కల్లు అమ్ముతున్నది.'తాజా కల్లు,గుడాలు'అని రాసి,దాని కింద 'నీలమ్మ అడ్డా' చిన్న బోర్డు పెట్టి అమ్మడం ప్రారంభించారు సత్యం, నీలమ్మ."తమ్ముడు తమ్ముడే, దుకాణం దుకాణమే అమ్ముడు అమ్ముడే లెక్క లెక్క నే! అట్లైతెనే కొట్లాటల్రావు సత్తన్నా " అనగానే"ఔను నీలక్కా,నిజమే " అన్నాడు సత్యం.

" అన్నా! జర ఈ లొట్టిని సైకిల్ కెయ్యనానే?,చేతులు నొస్తున్నయే" అన్నది ఇంటికి వెళ్ళేప్పుడు."ఇటుదే శెల్లె" అని హాండిల్ కు వేసేసి ఏవేవో ముచ్చట్లు పెట్టుకుంటూ ఇంటికి పోయేవాళ్ళు.

ప్రతిరోజు ఒంటచేసి పొద్దున్నే పిల్లలకి స్కూల్ బాక్సులు కట్టి తను కూడా డబ్బాలో అన్నం సర్ది పెట్టుకొని,అత్తకు పిల్లల్నొప్పజెప్పి ఉద్యోగినిలా వెళ్ళేది

నీలమ్మ.పగలు ఇంటికి వచ్చి,ఇల్లు సర్దుకొని పిల్లలను చూసుకొని సాయంత్రం మళ్ళీ పోయేది. మల్లేశ్ గుర్తుకు వచ్చినప్పుడల్లా గుండె మెలిపెట్టేస్తున్నా, ఎటువంటి కష్టాలొచ్చాయి ఏందీ అనుకుంటూనే బతుకు సాగిస్తున్నది నీలమ్మ.

మెయిన్ రోడ్డు కాబట్టి కల్లుకు గిరాకీ బాగానే వస్తున్నది.క్రమంగా కార్లు క్యూ కడుతున్నాయి. మొదట్లో నీలమ్మ ఒక్కతే ఉండేది. సత్యం వీలున్నప్పుడల్లా ఆమెను కనిపెట్టేవాడు.అందరూ కాకున్నా ఆడోళ్ళను చూస్తేనే సొల్లు కార్చే కొందరు మొగోళ్ళను చూసినోడుకాబట్టి, నీలమ్మ కోసం భయపడి ,ఆమెకు అనుమానం రాకుండా"అక్క నేను కూడా కల్లు కాంపౌండ్ లో కల్లమ్మనే ఈడనే నీతో పాటే కల్లమ్ముతా, పెట్టుకోమంటవా ?"అని అడిగాడు సత్యం.సరేనన్న నీలకు వెంటనే థాంక్స్ చెప్పాడానాడు.అట్లా రోజులు వెళ్ళదీస్తున్నది.

"ఇవి నీ పైసలు సత్తన్నా" అని వెంట వెంట లెక్కలు చెప్పే నీలమ్మ ధర్మదేవతలా కనిపించేదతనికి..      " ఈ దుర్యోధన దుశ్శాసన దుర్నీతి లోకంలో...." పాట వస్తున్నది టీవీ లో! రాత్రి ఎనిమిది ఎనిమిదిన్నర అయ్యుంటది. పిల్లలు పడుకున్న తర్వాత చిన్న సౌండ్ తో టీవీ పెట్టగానే ఈ పాట కనపడింది. 'అబ్బా ఈ పాట విని ఎన్ని రోజులాయె!'అనుకున్నది.కొద్ది రోజులుగా నీలమ్మ మనసున మనసులేకుండా చేస్తున్న సంఘటన గుర్తుకు వచ్చింది.ఎవరితో చెప్పాలా అని ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఓ నిర్ణయానికి వచ్చింది. దిగ్గున లేచిపోయి అత్తమ్మ పన్నదా లేదాని చూసింది. వాళ్ళింట్లో కూడా టీవీ చప్పుడు వినపడుతున్నది.మెల్లిగా, పిల్లలు లేవకుండా తలుపుగొళ్ళెం పెట్టి,"అత్తమ్మా .. అత్తమ్మా.." అని పిలిచింది నీలమ్మ.

"ఏందే నీలా ..,? ఇంక పండుకోలేదానే? ఏమైంది?"అనుకుంటూ తలుపు తీసి బయటకు వచ్చింది.

"ఒక ముచ్చట చెప్పాలె, జర కూర్చో ఈడ "అని అరుగు మీద కూర్చుని మొదలు పెట్టింది.

"ఇంగో ఇయ్యాల ఏమైందో తెల్సా!చూడ్డానికి పెద్దవాడిలాగే, మర్యాదస్తుడిలాగే ఉన్నాడొకడు, కొద్ది రోజులుగా అప్పుడప్పుడొచ్చి కల్లు తాగి, గ్యారెలు,గుడాలు తిని పోతున్నాడు.అయితే,ఇయాల వాడెట్లనో

ఎటమటంగ మాట్లాడిండు అత్తమ్మా ! ఇన్ని రోజులు గింతసూతం అనుమానం రాలేదు.టైంకు మన సమ్మక్క ఒచ్చిందిగన్క గప్పుప్పున ఎల్లిపోయిండు. నాకు జర భయమైంతాంది ఏం జేయమంటవ్?" అంటున్న కోడలు వైపు ప్రశాంతంగా చూసి,

" ఓ ..నాకు ఇట్లాంటివి ఎన్ని జరిగేది ఏంది?గట్లనే చేస్తరు ఆడోళ్ళను చూస్తే! గిట్ల భయపడితే ఎట్లా? ధైర్నంగ ఎదుర్కోవాలే"అంటుంటే," ఔఆ,? నీకుసుతా అయ్యేదా!

మరేంజేసినవ్? నాకూ జర ఉపాయం జెప్పరాదత్తా " అన్నది నీలమ్మ.

" ఏం లేదు బిడ్డా,కారంపొడి దగ్గర రెడీగుండాలె.. కత్తిచాకు,కొడవలి దగ్గర పెట్టుకోవాలి. నీళ్ల బకెట్లో నీళ్లు పెట్టుకోవాలి, పెద్ద గుదుప అందుకునేటట్టు ఉండాలె, రాళ్లు గూడా అక్కరకొస్తయ్ తయారుండాలె .." అంటుంటే..

"అంతే అంటవా ?" అని ఆశ్చర్యంగా చూస్తున్న నీల తో

"ముందుగాల మొగోళ్ళను నమ్మొద్దు బిడ్డా. నక్కజిత్తులోళ్ళుంటరు, మేక వన్నె పులులు ఉంటరు. మంచిగానే మాట్లాడుతారు గాని మనసులా.. చెడు ఉంటది బిడ్డ. నీయతుండదు.ఇన్నొద్దులు భయపళ్ళేదు ఇప్పుడు..?

అంటుంటే," వీడు గలీజు చూపులు చూడలేదత్తా.. మెల్లెగ, మర్యాదగ అడిగిండు, ఆలోచించుకోని చెప్పన్నడు.. తిడుదామంటే సందియ్యకుండా జప్పున ఎల్లిపోయిండు. జెర రెండుమూడు రోజులు పిల్లలను ముగ్గుర్ని తీసుకోని రా. మిమ్ములను చూస్తే ఇగ అడ్గడు " అని బ్రతిమాలింది.

"సరేనే మీ మావకాడ ఎవర్నన్న కూసోవెట్టి ఒస్తం. కానీ, నువ్వు ఈ ముచ్చట ఎవ్వరికి చెప్పొద్దు. సత్తానికి కూడా..!" అని మెల్లగా అంటూంటే

" సరే అత్తమ్మ అని లేచింది.

"ఇగపో శాన పొద్దుపోయింది పండుకోపో." అని రామనర్సు అనగానే ఇంట్లోకి వెళ్ళింది నీలమ్మ. ఒంటరి ఆడవాళ్ళను చూస్తే చాలు ఎందుకైనా తెగించడానికి ప్రయత్నిస్తుంది ఈ మగ జాతి. 'గుండె దిటవు పెట్టుకోవాలి' అని అర్థం చేసుకున్నది . ఉపాయంగా ఎదుర్కొనుడెట్లానో ఒక్కటే నేర్చుకోవాలి అని నిర్ణయించుకున్నది. కడుపునిండా ఏదో తెలియని ధైర్యం ఆవహించి హాయిగా నిద్రపోయింది ఆరోజు నీలమ్మ.

ఉన్న కొన్ని గుంటల పొలాన్ని కౌలుకు ఇచ్చింది. ఒడ్ల సంగతీ, పాలు సంగతీ, పైసల సంగతీ అత్తమామల సలహాలతో చూసుకుంటున్నది. పిల్లల తిండి తిప్పలు, చదువులు చూసుకుంటున్నది.తండ్రి మాట రాకుండా,ఏ లోటు లేకుండా రోజులు వెళ్ళదీస్తున్నది.

నీలమ్మ పుట్టినరోజు ప్రతి ఏడూ వచ్చినట్టు ఆ ఏడూ వచ్చింది. చాన్నాళ్ళ తర్వాత మంచి చీర కట్టుకున్న నీలమ్మ కడిగిన ముత్యం లా ఉన్నది. కష్టాల కడగండ్లు కంటికింద నల్లమచ్చలు తెచ్చినా, ఈ సంసార సముద్రాన్ని ఈదే పనులవల్ల నెత్తెంటికలు రాలినా, వెండిమెరుపులు అక్కడక్కడా కనిపించినా ముగ్ధత వల్లవచ్చిన నిండుదనం ప్రస్ఫుటిస్తూన్నది.అయితేనేం?ఎట్లుంటేంది?ఎవరైతేంది?ఏమైతేంది?ఆడతనమైతే చాలనుకునే దుర్మార్గులు కూడా ఉంటారు కదా!

ఆ రోజు ఓ యువకుడు "కారుదిగొచ్చి కల్లు కొంటాను.ఎంతా? ఏందీ?" అని గుడెసెలో కూర్చుని సీసాలు నింపుతున్న నీలమ్మ తో అన్నాడు.దేనికెంతో ధర లు చెప్తుంటే " కల్లమ్ముతవా? ఒళ్ళమ్ముతవా?" అంటూ వెకిలి వేషాలు వేస్తు అనగానే, "ఏందిరో

మాటలు జాగ్రత్తగ రానియ్! నేనట్లాంటిదాన్ని కాదు తెల్సా" అని విసురుగ జవాబిచ్చింది.

అక్కడ పరిసరాలలో ఎందుకో ఎవ్వరు లేరు. ఓ విషపు నవ్వు నవ్వుతూ,

"అబ్బా!నాకెరుకేలే, ఆడోళ్ళ నాటకాలు.. చెప్పు చెప్పు ...ఎంత ఇవ్వాలో...?"అంటూ దగ్గరికి రాబోయాడు.

చింత నిప్పుల్లా మెరుస్తున్న చూపుల్ని దూస్తూ, దౌడమించి ఒక్కటేసి, కత్తులు కత్తులుగా కన్నీళ్ళు చిమ్ముతూ... "కడుపుకు అన్నం తింటున్నవా ? అశుద్ధం తింటున్నవా దొంగ మొకమోడా?" " నడువ్ ఈణ్ణుండి చంపి పడేస్త... నీ..."అని బెబ్బులి లా తోసి పడేసి కొడవలి ఎత్తిన నీల యుద్ధ సైనికురాలిలానే కనిపించింది అప్పుడే అక్కడికి వచ్చిన సత్యానికి!

***

**కొండపల్లి నీహారిణి..** కవయిత్రి, రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు, వక్త. ఎం.ఎ. టి.పి.టి చేసి తెలుగు ఉపాధ్యాయినిగా 20 ఏళ్లు ఉద్యోగం చేశారు. పి.హెచ్ . డి( ఉస్మానియా విశ్వవిద్యాలయం) . ‘మయూఖ‘ ద్వైమాసిక సాహిత్య అంతర్జాల పత్రిక కు, ‘తరుణి‘ స్త్రీ ల అంతర్జాల మాస పత్రిక కూ ఎడిటర్. " చిత్ర కళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు జీవిత చరిత్ర" " ఒద్దిరాజు సోదరులు జీవితంసాహిత్యం"అనే గ్రంథాలను, 4 కవితా సంపుటాలు, " 2 కథాసంపుటాలు( "రాచిప్ప", "ఘర్షణ"), 3 సాహిత్య విమర్శ వ్యాస సంపుటాలు వెలువడ్డాయి. 3 జీవిత చరిత్రలు ( తెలుగు అకాడమీ కి) , అమెరికా లో ఆరు నెలలు" యాత్రా చరిత్ర, వంటి 15 పుస్తకాలను ప్రచురించారు. " నా ప్రజా జీవితం పెండ్యాల రాఘవరావు" వంటి 9 సాహిత్య పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ రచయిత్రి, వెంకట సుబ్బు అవార్డ్, ప్రమీల శక్తి పీఠం అవార్డ్ , అపురూప అమృతలత అవార్డ్ , అమెరికాలో TTA ఎక్సిలెన్సీ అవార్డు వంటివెన్నో పురస్కారాలు అందుకున్న డాక్టర్ కొండపల్లి నీహారిణి సాహిత్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు . సమాజం లో బయటకు కనిపించని అన్యాయాల ను వీరి కథలుఎత్తి చూపుతాయి. నీహారిణి పుట్టి పెరిగింది చిన్నపెండ్యాల, అప్పటి వరంగల్ జిల్లా. అమ్మ కౌసల్యాదేవి, నాన్న పెండ్యాల రాఘవరావు, వరంగల్ మొట్టమొదటి ఎంపీ.